వసిష్ఠ రామ సంవాదం

(యోగ వాసిష్ఠమ్)



రెండవ సంపుటం

స్థితి, ఉపశమన ప్రకరణములు

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

(శ్రీవాల్మీకి మహర్షి ప్రణీత యోగవాసిష్ఠము)

రెండవ సంపుటం

స్థితి, ఉపశమన ప్రకరణములు

అనుసృజన:

వై. హెచ్. రామకృష్ణ

రామకృష్ణ మఠం

దోమలగూడ, హైదరాబాదు-500 029

Published by
Adhyaksha
Ramakrishna Math
Domalguda, Hyderabad - 29

I - 1M - 08 -2010
12025

12028 (Set)

Printed at :
RP Printers, Hyderabad.

Bound at
Pridhvi Binders, Hyderabad.

ప్రవేశిక

మొదటి సంపుటంలో వైరాగ్య–ముముక్షు–ఉత్పత్తి ప్రకరణాలను అధ్యయనం చేశాము. ప్రపంచం అనిత్యం, అసుఖం అంటే మనకు అర్థం అవుతుంది. దృశ్య జగత్తు మూడు కాలాలలోనూ లేనే లేదు; ఉన్నదంతా ఒకే పరబ్రహ్మ చైతన్యం అంటే మనకు అంత తొందరగా అర్థమవదు. మనం అనాదిగా ఈ జగత్తు నిజమని భావిస్తూ వివిధ కర్మలనొనరిస్తూ, ఆ కర్మఫలాలను అనుభవిస్తూ వస్తున్నాము. కర్మాచరణం వలన ఏర్పడే సంస్కారాలు, మరల మరల ఆ కర్మల నొనరించే దిశగా మనల్ని ప్రేరేపిస్తుంటాయి. ఈ వాసనలు మనచే శరీరాలను ధరింపచేస్తూనే ఉన్నాయి. వాసనామయ మనోదేహాలే తన నిజస్వరూపం అన్న మిథ్యావగాహనతో సంసార యాత్రలో అనేక మజిలీలు చేస్తున్న జీవుడు ఎప్పటికో గమ్యం చేరుకుంటాడు. అజ్ఞానజనిత దృశ్య ప్రపంచంతో పూర్తిగా తాదాత్మ్యం చెంది ఉన్న జీవుడికి తాను అనుభవిస్తున్న జగత్తు మిథ్య అని వెంటనే బోధించటం వలన ప్రయోజనం ఉండదు. అందుకని వసిష్ఠ గురువరేణ్యులు ప్రపంచానికి జ్ఞానం గరపే నిమిత్తం దశరథాత్మజుడి మూలకంగా చేసిన బోధ ఐన ఈ కావ్యంలో ముందుగా వైరాగ్య భావనను ఉద్దీపింపచేయటానికి ప్రయత్నించారు; రామచంద్రుడికి కలిగిన వైరాగ్యాన్ని ప్రశంసిస్తూ, ఆ భావనే స్వస్వరూపాన్ని గ్రహించటానికి ప్రథమ సోపానం అని తెలియజేశారు. ప్రపంచం అనిత్యం, అశాశ్వతం, అపరిపూర్ణం, దుఃఖమయం కనుక విజ్ఞుడైనవాడు వైరాగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

తరువాతి ప్రకరణమైన ముముక్షు ప్రకరణంలో కేవలం పురుషప్రయత్నం ద్వారానే సాధకుడు జన్మ మృత్యు సంసార చక్రంనుంచి బయటపడగలడని, అంతకు మించి మార్గంలేదని నొక్కి వక్కాణించారు. వివిధ దృష్టాంతాలతో, ఇతఃపూర్వం ఎవరెవరు అలా పురుష ప్రయత్నంతో జగదవిద్యా వల నుంచి తప్పించుకున్నారో వారి జీవితగాథల ద్వారా జిజ్ఞాసువును తీవ్ర ప్రయత్నోన్ముఖుడిగా చేశారు.

ఇక మూడవదైన ఉత్పత్తి ప్రకరణంలో దృశ్య ప్రపంచం యావత్తూ మనోకల్పితమని, మనస్సుకు ఆవలగా జగత్తులేదని నిరూపించటానికి ప్రయత్నించారు. ఈ జగద్భావనను పునః పునః ధ్యానించటం వలన అసత్తు ఐన దృశ్యం, అవిద్య వలన రజ్జువులో సర్పాన్ని దర్శించే తీరున, సత్తుగా కనబడుతుందని బోధించారు.

ఈ రెండవ సంపుటంలో నాల్గవదైన స్థితి ప్రకరణము, ఐదవదైన ఉపశమన ప్రకరణములను అధ్యయనం చేయబోతున్నాం.

స్థితి ప్రకరణంలో అజ్ఞానం, భ్రాంతి గురించి ఎక్కువగా చెప్పకుండా సృష్టి అనేది నిజానికి ఏదీ లేదనీ, అది కేవలం ఒక పదం, ఒక శబ్దం మాత్రమేనని తెలుపుతూ దృశ్యం ఇంద్రధనుస్సు లాగా శూన్యంపై వేసిన చిత్రం అని సాధకుడి మనస్సు నుంచి దృశ్య భావనను ఉన్మూలించటానికి

ప్రయత్నించారు. పగటి కలలాగా, జగదనుభవం కూడా ఒక కలే అని ఇంద్రియగోచర దృశ్య అవాస్తవికతను చాటుతూ, అహంకార జనిత మనస్సుకు సంబంధించిన ఎరుక వలననే ఈ అనుభవం కలుగుతుందని అంతకు మించి ఈ జగత్తుకు ఉనికి లేదని చాటారు.

ఐదవదైన ఉపశమన ప్రకరణంలో మనో మాలిన్యాలైన రజో తమస్సులను తొలగించుకొని, సత్త్వం వృద్ధి చెంది, ద్రష్ట దర్శన దృశ్య భేదం తొలగి కేవాలానంద స్వరూపమైన చిన్మాత్ర చైతన్యాన్ని అనుభూత మొనర్చుకోవచ్చని వసిష్ఠ మహర్షి వచిస్తారు. విచారణ ద్వారా అవిద్యాజనిత దృశ్యానుభూతిని తొలగించుకొని మనోరాహిత్యాన్ని పొందవచ్చునని ఈ ప్రకరణంలో తెలియజేస్తారు. శాస్త్రాధ్యయనం, సత్సాంగత్యం, సద్గురువును ఆశ్రయించటం ద్వారా మోక్షం కరతలామలకం అవుతుందని బోధ. దేహ భావన వలన ఆత్మ మలినమవదు. మనస్సు స్వభావాన్ని అర్థంచేసుకొని కోరికలను, సంకల్పాలను త్యజించినవారు ఉన్నత భూమికలను చేరుకుంటారు.

'ద్వంద్వ భావనను వదిలి ఆత్మోపస్థితులవండి' అని సర్వులను ఉద్దేశించి ఎలుగెత్తి చాటుతుంది ఈ ప్రకరణం.

– ప్రకాశకులు

విషయ సూచిక

❖❖❖

రఘునాథాయ నాథాయా సీతాయాః పతయే నమః

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

IV. స్థితి ప్రకరణం

I. జగత్ స్థితి

1. ఈ జగత్తు ఏర్పడి ఉన్నదెక్కడ?

శ్రీరాముడు: తండ్రీ! ఈ జీవుని యొక్క వాస్తవ స్వరూపము అనంతగుణ గంభీరమగు చిదాకాశమేనని అనుకున్నాముకదా! మరి ఈ జన్మ-కర్మ-బంధ-మోక్ష పరంపరల చమత్కారం అంతా ఏమిటి? ఇవన్నీ ఎందుకు ఏర్పడుతున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి: మహా ప్రభావవంతమైనట్టి చిదాకాశము ఒక సమయంలో రజోగుణముచే కప్పబడిన దవుతోంది. ఆకాశము మేఘావృతము అవుతూ ఉంటుంది చూచావా? ఇది కూడా అట్టిదే. అట్లు రజోగుణముచే కప్పబడినప్పుడు అహంకారము అనబడే పరిమిత త్వమును, లేక ఆచ్ఛాదనను పొందుతోంది. మేఘములు కారణంగా ఆకాశము ఇంత మాత్రమే... అది పరిమిత మైనదే... అని బాలుడు అనుకుంటాడు చూశావా! బాలునితో సమానమైన ఈ జీవుడు నేను పరిమితుడను అను భావన పొందుచున్నాడు. ఆకాశము తన అనంతత్వమును త్యజించ కుండానే పరిమితత్వము పొందినదానివలె అగుపిస్తున్నట్లు, చిదాకాశము కూడా తన యొక్క ప్రకాశ రూపమును, అఖండత్వమును త్యజించకుండానే అహంకార-ప్రాణ-ఇంద్రియాలను అనుభవిస్తూ, తనపై తానే పరిమితత్వమును ఆపాదించుకుంటోంది!

మృగతృష్ణ అసత్తే. కానీ అందులో జలము కనిపిస్తున్నది కదా!

భ్రాంతి (Illusion) రూపముగా గల వాసనచే చిదాకాశము తన చిద్రూపము నుండి భావనా మాత్రంగా విడివడుచున్నది. ఒక వైపు ఈ పతనము ఇట్లు ఉండగా, మరొకవైపు విజ్ఞులైనవారు ఉత్తమ బుద్ధిని సంపాదిస్తున్నారు. ఇట్టి నిర్మల-సునిశిత బుద్ధి యొక్క ప్రభావం చేత ప్రత్యగాత్మ వైపుకు అభిముఖమగు అవగాహన సముపార్జించుచున్నారు. జీవో బ్రహ్మేతి నాపరః (ఈ జీవుడు బ్రహ్మమే కాని, మరింకేమీ కాదు), సర్వం ఖల్విదం బ్రహ్మ (ఇదంతా ఇప్పటికీ, ఎప్పటికీ బ్రహ్మమే అయి ఉన్నది), అహం బ్రహ్మాస్మి (నేను బ్రహ్మమే అయి ఉన్నాను). తత్త్వమసి (నీవు బ్రహ్మమే అయి ఉన్నావు) సోఽహం (నేను ఆ బ్రహ్మమే) ఇత్యాది మహావాక్య రూపమగు వేదాంత శాస్త్ర జ్ఞానముచే, ఈ దృశ్యము అసత్తు అని ఎరుగుచున్నారు. ఇట్టి దృశ్యమును తమయందు రహితం చేసివేస్తున్నారు. తద్వారా సంసార సాగరమును దాటి వేసి నిర్వాణపదమును పొందుచున్నారు.

ఈ విధంగా ఈ జీవులు రెండు వేరువేరు మార్గములలో ప్రవృత్తులగుచున్నారు.

ఏది ఏమైనా, వారంతా చిదాకాశమే స్వరూపముగా కలిగి ఉన్నారు కదా! కనుక మనలోని ప్రతి ఒక్కరియొక్క చిదాకాశత్వమునకు ఏక్షణంలోనూ ఏమాత్రమూ హాని కలుగుట లేదు.

ఓ రామచంద్రా! ఒక విషయం నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నాను. మోక్షమునకు దారి చూపగల అట్టి వేదాంత శాస్త్రమే సత్యము, సుఖప్రదము, అనుసరణీయము కూడా! అందుకు వేరైనట్టి శుష్కమైన తర్కములన్నీ దుఃఖ–భయ–అసత్యమయములే అయి ఉన్నాయి. అట్టివన్నీ అనేక విధములైన వికారములకు కారణమగుచున్నాయి.

తర్కము, ఆత్మానుభవము - కేవలం తర్కశాస్త్రమును ఆశ్రయించదలిచేవారు పరమపురుషార్థ రూపమగు 'ఆత్మలాభము'ను పొందలేకపోవచ్చునని మా అభిప్రాయం. అట్లు కాకుండా, స్వానుభవము జోడిస్తూ, శ్రుతులచే ప్రసిద్ధముగా ప్రకటించబడుచున్న దానిని అనుసరించుచూ, ఉత్తమగతిని పొందుటకు సిద్ధపడేవానికి వినాశనము చేకూరు ప్రసక్తి ఉండదు. "ఇది ఒక గొప్ప సిద్ధాంతము – దీనిని విజయవంతముగా ప్రతిపాదించుట మాత్రమే మా లక్ష్యం. ఇంత మాత్రమే సత్యము – ఇంకేమీ వినము – వినసీయము" అనునది సంకుచితత్వమునకే దారి తీస్తోంది. సత్యము సర్వదా నిర్దుష్టము, అనుభవమాత్రమే అయివున్నది. 'తర్కము' అనునది అనేక సందర్భములలో 'పరిమితదృష్టి' అను జాడ్యముచే బాధింపబడుచూ ఉంటోంది.

❖

ఈ జీవుడు "ఇది నాకు ఉండుగాక... ఇది నేను పొందనుగాక! వీరు నా వారు... వారు తదితరులు... ఈ శరీరమునందే నేను ఉన్నాను... ఈ శరీర శిథిలత్వముచే నేను శిథిలమగు చున్నాను..." అగు రూపముగల లోభ–మోహములచే బాధింపబడుచున్నాడు. అట్టి భావనచే దీనత్వమును ఆశ్రయిస్తున్నాడు. మహావాక్యముల అర్థసారమును తిరస్కరిస్తూ తనను తానే దౌర్భాగ్యమునకు సమర్పించుకొనుచున్నాడు. అట్టివారు రక్షించబడేది ఎట్లా? వారు పొందే పురుషార్థము ఏమున్నది?

శ్రీరాముడు: హే సద్గురూ! అట్టి ఈ జీవుని గతి ఏమిటి? ఇతడు అనేక దుఃఖాదులను భరిస్తూ ముల్లోకములందు ప్రయాసతో సంచరిస్తూ ఉండవలసిందేనా?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామా! నిరుత్సాహపడవలసిన పనేమీలేదయ్యా! ఏ ఉదార చరితుడైతే ఈ ముల్లోకములను 'తృణప్రాయం'గా చూస్తాడో, అట్టి మహాత్మునిచే సమస్త ఆపదలు కూడా – సర్పముచే కుబుసము విడవబడినట్లుగా విడువబడుతాయి. ఎవని అంతఃకరణమునందు సర్వ వేళల సాత్వికత్వం స్ఫురిస్తూ, ఉట్టిపడుతూ ఉంటుందో అట్టివానిని ఇంద్రుడు మొదలైన దేవతలు కూడా, తమకు ఆధారమైన బ్రహ్మాండములను కాపాడుకుంటున్నట్లు పాలించి రక్షించుకుంటూ ఉంటారు.

సన్మార్గము, అసన్మార్గము - ఓ ప్రియ రాఘవా! ఎట్టి ఘోరవిపత్తు నందు కూడా ... అసన్మార్గము నందు ప్రవేశించకుండుటయే ఉత్తమము సుమా! అసన్మార్గము అవలంబించుట చేతనే రాహువు అమృతపానం చేసి కూడా 'కురూపము – మృత్యువు' – ఈ రెండింటినీ మరల మరల పొందుచున్నాడు.

ఓ జనులారా! మీరంతా సద్వస్తువును ప్రతిపాదిస్తున్న శాస్త్రములను అభ్యసించండి. సాధువులగు వారిని సేవించండి. ప్రేమ – సాత్విక – నిరహంకారములను ఆశ్రయించండి. మీకు తప్పక శుభము కలుగుతుంది. తదితర జీవులపట్ల ప్రేమ ఆప్యాయతలు అభ్యాసపూర్వకంగా ప్రకటించే వారియందు జగత్సంహారకారకుడు, ఉగ్రస్వరూపుడు అగు ఆ శివభగవానుడు ఆత్మ వస్తువును ప్రకాశింపజేస్తాడు.

సదాచారం (Good Conduct) - సదాచారవంతులు మాత్రమే ఆత్మ సాక్షాత్కారమును ప్రకాశింపజేసుకో గలుగుచున్నారు. సచ్ఛాస్త్రములను, సాధువులను సేవించువారు మరల ఇంకెన్నటికీ మోహాంధకారమున చిక్కుకోరు. అట్టివారికి అవశములైనవి కూడా వశము అవుతూ ఉంటాయి. సమస్తమైన ఆపదలు తమంతట తామే శమిస్తాయి. 'శమము–దమము' మొదలైన ఉత్తమ గుణములను ఆశ్రయించే సత్పురుషులకు నాశరహితమైనట్టి 'పరమోత్తమశ్రేయస్సు' లభిస్తోంది. శమదమాదులే ఉత్తరోత్తర ప్రయోజనకరములౌతాయని మీరంతా నమ్మకం కలిగి ఉండండి. ఆధ్యాత్మ శాస్త్రములను వినుటయందును, సత్యమునందును మిక్కిలి ప్రీతి కలిగి ఉండండి. ఉత్తమ ఆశయమును, ప్రయత్నమును కలిగియున్నవారే 'మనుష్యులు' అని అనిపించు కుంటారు. ఇక తక్కినవారి గురించి నన్ను అడుగవద్దు. వారు పశుతుల్యులే.

ఎవరి 'ప్రవర్తన' అయితే ఇతర జీవుల హృదయసరోవరములను ఆహ్లాదపరుస్తూ ఉంటుందో అట్టి క్షీరసముద్రము వంటి పవిత్రమూర్తులందు సాక్షాత్తూ శ్రీమన్నారాయణమూర్తియే నివసిస్తూ ఉంటారు. వారు మాత్రమే చూడవలసినది చూడటం, పొందవలసినది పొందటం జరుగుతోంది.

ఓ జనులారా! ఈ ప్రాపంచిక విషయభోగములు మీ నుండి ఆత్మతత్త్వమును దూరంగా ఉంచుచున్నాయి. భవిష్యత్తులో అనేక దుర్భరమైన జన్మపరంపరలకు కారణం అగుచున్నాయి. "విషయముల పట్ల, పేరు ప్రతిష్ఠలు మొదలైనవాటిపట్ల ఆసక్తి యుక్తం కాదు. ఉచితం కాదు. పైగా, దుఃఖప్రదము" – అని మీరు దామ – వ్యాళ – కటుల జీవితల చరిత్రలను చూచి ఈ "స్థితి" ప్రకరణములో గ్రహిస్తారు.

కాబట్టి మీ అధికారమును అనుసరించి శాస్త్రానుకూలంగా ప్రవర్తించండి.

ఆచార్యులచే మీ క్షేమము కోరి నియమించబడిన సదాచారములను జ్ఞానపూర్వకముగా, రాగద్వేషరహితులై శ్రద్ధతో ఆశ్రయించండి. ఏ భూమికయందు ఎంతకాలం 'స్థితి' కలిగి ఉండాలో, ఆ భూమికను అంతకాలం అభ్యసిస్తూ ఉండండి. క్రమంగా మీ అంతఃకరణము నుండి మిథ్యా భోగాల పట్ల భావన పూర్తిగా తొలగించుకోండి. మీ ఉత్తమగుణాలు, మహాశయాలు, యశో మహిమ స్వర్గపర్యంతము వ్యాపించు గాక! మీ సత్ప్రవర్తనచే సత్పురుషులను సంతోషింపజేయండి.

ప్రయత్నము - నాయనలారా! తుచ్ఛములైన ఈ ప్రాపంచిక భోగములు మృత్యువుతో 'అంతము' అయ్యేవే కదా! ఆ తరువాత గతి ఏమిటో చెప్పండి? ఒక ఉపమానం చెపుతాను. పైకి రుచికరంగా కనబడి, అర్ధరాత్రివేళకు భయంకరమైన అజీర్ణమును కలుగజేయగల పదార్థములను

ఎవరైనా "ఆహా బాగున్నాయి... బాగున్నాయి" అని అనుకుంటూ తింటుంటే ఏమౌతుంది? అతి త్వరలో "అయ్యో! నేను ఎందుకు తిన్నాను?" అని పశ్చాత్తాపపడవలసి వస్తుంది కదా! ఈ అహంకార – మమకారములు (I & Mine) మీకు కలుగచేయగల శ్రేయస్సు ఏమున్నది చెప్పండి? ఎవని సుందర గుణములైతే వర్తమానము నందు, భవిష్యత్తు నందు శ్రేయస్సు కలుగజేస్తాయో, అట్టివారు ఈ భూమిని తమ ఉనికిచే ఆనందమయం చేస్తున్నారు. వారే జీవించి ఉన్నట్లు. ఇక తక్కినవారో, మృతప్రాయులే. నాయనలారా! మునులమైన మేము లోకశ్రేయస్సు, ఈ జీవుని శ్రేయస్సు కోరి ఈ సత్ప్రవర్తన – సదాచారము – ఉత్తమప్రయత్నముల గురించిన వాక్యాలు చెప్పు చున్నాము. మీరంతా ఉత్తమమైన శుభప్రయత్నములందే ఉద్యుక్తులు అవండి. తదనుకూలమైన ఉద్యమమునే ఆశ్రయించండి. ఎవరు శాస్త్రానుసారం ఉద్వేగరహితంగా ప్రయత్నశీలుడౌతారో, అట్టివారు మోక్షసిద్ధిని ఎందుకు పొందరు? తప్పక పొందుతారు.

ఏమరుపు - చిరకాలము చేయబడిన ప్రయత్నముచే పరిపాకము పొందిన మనస్సు గల వ్యక్తి యొక్క సిద్ధి, దాని ప్రయోజనములు దృఢతరంగా ఉంటాయి. అందుచేత అవరోధములను, కష్టములను చూచి దిగులు చెందరాదు. పట్టుదలను ద్విగుణీకృతం చేయాలి. ఎట్టి లక్ష్యముల కొరకు పరిశ్రమిస్తున్నామో, అట్టి లక్ష్యములను పరిశుద్ధపరచుకోవాలి. ఓ ప్రియజనులారా! మీరంతా శోకమును, భయమును, క్రోధమును, పారుష్యమును దరిజేరనీయకండి. దైన్య–దుఃఖ ములను ఆశ్రయించి, తద్వారా విలువైన కాలమును వృథా చేసుకోకండి. మూర్ఖత్వము, పరిశీలనా రాహిత్యములను ఆశ్రయించి విషయములను సేవిస్తూ రోజులు గడపటం ఉచితమా? ఫలితంగా ఈ జీవుడు 'సంసారము' అను అంధకూపమున పడి వినాశనమే పొందుచున్నాడు కదా! అనేక పదార్థములందు ఆసక్తుడై ఉంటున్న ఈ జీవుడు 'ఇంద్రియములు' అనే త్రాళ్ళతో బంధించ బడినవాడై, 'నేను చచ్చుచున్నాను' అను అనుభవమును మరల మరల పొందుచున్నాడు. నిష్కారణముగా మృత్యువుకు అనేకసార్లు వశమగుచున్నాడు.

"ఎందుచేత?" అనే ప్రశ్నను మేము పరిశీలించాం.

"అతడు తన యొక్క చిదాకాశ స్వరూపమును ఏమరచుట చేతనే" అని కనుగొన్నాం.

'సంసారము' అను నిబిడాంధకారంలో కొట్టుమిట్టాడుతూ, సరిఅయిన మార్గములలో తన ప్రయత్నములను నియమించకపోవటం మానవుడైన వాడికి ఉచితం కాదు. ఈ శరీరముతో తాదాత్మ్యము 'నా అంతటి వాడు లేడు.....' వంటి మూర్ఖపు కేకలు అధమాధమ గతికే దారి తీస్తున్నాయని గ్రహింపబడుగాక!

'వేదాంతము'ను ప్రబోధించు శాస్త్రములు ఆత్మవస్తువు గురించి అనేక విశేషాలు ప్రతిపాది స్తున్నాయి. స్వస్వరూపమును గుర్తు చేస్తున్నాయి. ఈ జీవుని ఘోరములైన 'మృత్యువు' మొదలైన భయముల నుండి రక్షిస్తున్నాయి. నాశరహితము, నిత్యము అయినట్టి 'నిరతిశయానందము"ను ప్రసాదిస్తున్నాయి.

"ఈ ప్రాపంచిక జీవితము ఎట్టిది?" అనునది ఒకసారి సునిశిత బుద్ధితో పరిశీలించండి. ఇదంతా వేసవికాలంలో ఉష్ణత్వముచే నీరు ఇంకిపోవుచుండగా, మిక్కిలి దుర్గంధయుక్తమై యున్న బురద నీటిలోని కప్ప యొక్క జీవితము వంటిదే" – అని విజ్ఞులు గ్రహిస్తున్నారు. ఇదంతా పరమ తుచ్ఛమై ప్రవర్తిస్తోంది.

అందుచేతనే "హృదయము నుండి భోగాశను ముందుగా పారద్రోలండి" అని మేము హెచ్చరిస్తున్నాం. అనర్థప్రదములైన భోగముల కొరకు మాత్రమే ఉపయోగపడే ద్రవ్యలేశములను ఎంతో కష్టపడి సంపాదిస్తూ జీవించుటలో ఏమీ ఉత్తమత్వమున్నది? కాబట్టి, మీరు ఏదేది చేస్తున్నారో అదంతా "స్వధర్మము" అను అవగాహనచే ప్రక్షాళన చేసి ఉంచండి. ఓ మా స్వరూపమునకు వేరు కానట్టి సహజీవులారా! శ్రేష్ఠ బుద్ధి కలిగివున్న మీరందరూ మేము ప్రేమచే చెప్పుచున్న ఈ వాక్యములు ఆలకించండి. మోక్షప్రదములగు శాస్త్రములను అవలోకించండి. "ఈ కనబడేదంతా పరమాత్మ యొక్క సంప్రదర్శనమే! నీకునీవే ఇదంతా అయి ఆస్వాదిస్తున్నావు! సర్వతత్వాత్మవు-సర్వతత్వ విదూరకుడవు నీవే!"... అని బోధిస్తున్న తత్త్వశాస్త్రాన్ని అవలోకించండి, పఠించండి, ఆస్వాదించండి.

చైతన్యము, జీవుడు ... బింబము, ప్రతిబింబము - ఎట్టి పరిచ్ఛిన్నము లేని చైతన్యమే బింబము. ఆ చైతన్యం అంతఃకరణం నుండి విషయాకారవృత్తులందు ప్రతిబింబించుచున్నది. అట్టి చిదాభాసుడే ఈ జీవుడు. వాస్తవానికి చైతన్యము (లేక) శుద్ధ బ్రహ్మమునకు జన్మ-కర్మ- ఉపాధి-మొదలైన వాటితో ఏమాత్రం సంబంధం లేదు. బింబము – ప్రతిబింబముల సంబంధమే – 'బ్రహ్మము – జీవుడు' లకు ఉన్న సంబంధము. అయితే, అంతఃకరణంలో ప్రతిబింబించే చిదాభాస ప్రతిబింబం, దానికి సంబంధించిన ఉపాధులు కూడా మిథ్యారూపాలే అయివున్నాయి. సర్వదా సర్వత్రా అభిన్నమైయున్న బింబము (లేక శుద్ధ చైతన్యపరమాత్మ) మాత్రమే సత్యమైనది.

ఓ సభికులారా! సర్వజనులారా! ఈ విధంగా తత్త్వవిచారణ చేయండి. ఇది మీకు శాంతిని కలుగజేస్తుంది. "నామ రూపములచే ఎదురుగా ప్రాప్తిస్తున్న జగత్తు, అట్టి జగత్తును నిర్విరామంగా పొందుచున్న అహంకారము – ఈ రెండు కూడా స్వతహాగా ఈ వర్తమాన క్షణంలోనే (ఇప్పటికే) లేవు మరెప్పటికీ ఉండబోవు – అను భావనను ఆశ్రయించి, అభ్యాసం చేయండి. అట్లు భావించుటచే మీరు కోల్పోయేదేమీ ఉండదని మనవి చేస్తున్నాను. అలా కాకుండా " ఈ శరీరమే ఉన్నది... మరింకేమీ లేదు"... అనునట్టి బుద్ధిని ఆశ్రయించారా, ఈ మనస్సు పశుత్వమును పొందగలదు. దౌర్భాగ్యజనకము, అతి దీనము అయిన ధన-గృహ-స్వజనాదులకు సంబంధించిన సంకుచితదృష్టిని వహించి, తద్వారా ఆత్మవిషయంలో (లేక) మీ యొక్క స్వస్వరూపం విషయంలో గాఢనిద్ర వహించి వర్తమానమును వృథాపరచుకుంటే ఎట్లా? దీర్ఘనిద్ర నుండి లేవండి. మూఢత్వమును త్యజించి మోక్షమార్గమునందు జాగరూకులు కండి. ఒక అల్ప తటాకంలో ముసలి ఎద్దు వలె కునుకులు తీయవద్దు. 'బద్ధకము' అను జాడ్యమును ప్రయత్న

పూర్వకంగా జయించండి. ఇప్పటికిప్పుడే జరామరణములను అధిగమించిన స్థితిని ఆక్రమించుటకు సంసిద్ధులు కండి.

ఈ ధన-బంధుజన-వస్తువాహనాదులను చూచి మురిసిపోతున్నారా? లేదు. ఇవన్నీ అనర్థదాయకములుగానే పరిణమిస్తున్నాయి. "ధనాదులు సొంతం చేసుకొనుటచే ఉత్తమోత్తమమైన సంతృప్తి కలుగుతోందా? జీవితలక్ష్యము నెరవేరుతోందా?"... అనే విషయాలు ఇప్పటికే ఎంతో ధనవంతులై ఉన్నవారి మానసిక స్థితి గతులను సత్యదృష్టితో పరిశీలిస్తూ యోచించండి.

భోగములు భవరోగకారకములే అగుచున్నాయి. సంపదలన్నీ విపత్తులనే కలుగజేస్తున్నాయి. వాటిని మీరు ఏ విధంగానూ ఆదరించకున్నారా, అప్పుడు వాటిని మీరు జయించి వేస్తున్నట్లే. అసలు ధనాదులు "మీరు జీవించియుండుట" అను కార్యక్రమమునకు లక్ష్యమై ఉన్నాయా? అందుకొరకే బ్రతుకుచున్నారా? అవి మిమ్ములను నిజంగా రక్షించగలవా? తాను సంపాదించిన ధనాదులను తన మరణానంతరం తన వెంట తీసుకుపోయిన వారినెవ్వరినైనా మీరు చూచారా? బిడ్డలారా! ఇదంతా అవిచారణ చేతనే మిమ్ములను ఈ విధంగా భ్రమింపజేస్తోందని మీకు గుర్తు చేస్తున్నాను.

విచారణ, విశ్లేషణ - కనుక మీరు వెంటనే విచారణపరులు కండి. తదితర జనులకు, ప్రాణులకు అవిరోధముగా వ్యవహరిస్తూ, మీ స్వబుద్ధిని సునిశితం చేసుకునే ప్రయత్నంలో ఉండండి. శాస్త్రములను, శిష్టాచారములను అనుసరించి సత్కర్మలను అనుష్ఠించండి. సత్ఫలములను పొందుటలో సావధానులై ఉండండి.

ఉత్తమ ఆచరణ, పవిత్ర భావన, సునిశిత బుద్ధి - ఈ మూడు విస్తృత పరచుకుంటున్నవారు ధన్యులు. వారు అతి స్వల్పకాలంలో "ఈ ప్రాపంచిక సౌఖ్యములు కేవలం దుఃఖప్రదములే" అని గ్రహించగలుగుచున్నారు. శాస్త్రరూపంలో ప్రకటించబడిన పెద్దల అనుభవజ్ఞానమును వారు అనుద్వేగపూరితంగా గ్రహిస్తున్నారు. సత్యమేమిటో వారికి తెలిసిపోతోంది.

అట్టివారి యశస్సు, ఆయుష్షు, గుణములు మొదలైనవన్నీ లోకములకు సౌభాగ్యప్రదం అవుచున్నాయి. అట్టి సత్ఫలమే మేము శిష్యుల నుండి కోరుకొను ప్రయోజనమని ప్రకటిస్తున్నాను.

❖❖❖

2. అసంభవం ... కాని ప్రత్యక్షం!

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! మనం ఇప్పటివరకు జగత్తు యొక్క ఉత్పత్తి గురించి విచారించాము కదా! ఇక మనం 'స్థితిప్రకరణం'లో ప్రవేశిస్తున్నాము. ఇది వింటే, అభ్యసిస్తూఉంటే - తప్పక స్వయముగా మోక్షము చేకూరగలదు. శ్రద్ధగా విను.

ఒక్కసారి క్రితం ప్రకరణంలోకి తొంగిచూచి, ఆపై ముందుకు పోదాము.

ఇప్పటివరకు అనేక యుక్తులచే, న్యాయ నిర్ణయంచే "నేను-నీవు మొదలైన ప్రత్యయములతో కూడి ఈ దృశ్య జగత్తు ఆకారరహితము, శూన్యము, భ్రాంతి మాత్రము, అసత్‌మయము" అని మనం చెప్పుకున్నాం. ఇది నీవు స్పష్టీకరించుకున్నావనే అనుకుంటున్నాను.

కొందరు మహాజ్ఞానులగు పెద్దలు, విలక్షణమైన ఈ జగత్తును చమత్కారంగా కనబడే ఒక చిత్రపటంతో పోలుస్తూ ఉంటారు. అయితే, ఈ 'జగత్తు' అనే చిత్ర పటమునకు చిత్రకారుడంటూ ఎవరూ లేరు. అనగా, దీనికి 'కర్త' అంటూ ఎవరూ లేరు. హేతువు లేకుండా... కుంచెలు-రంగులు-చిత్ర కారుడు లేకుండా ఈ 'జగత్తు' అనే చిత్రం బ్రహ్మాండంగా భాసిస్తోంది.

శ్రీరాముడు : అదేమిటి స్వామీ! చిత్రకారుడే లేకుండా చిత్రపటం ఉండటమేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును అందుకు స్వప్నమే మనకు దృష్టాంతము. స్వప్నద్రష్టయే తన స్వప్నమును రచించుకొనుచున్నాడు కదా! అట్టి స్వప్నద్రష్ట ఆ స్వప్నంలో విభాగంగా ఉన్నాడా? స్వప్నమునకు ఆవల ఉన్నాడా? స్వప్నం అతని కంటే వేరైనదా? అందులోని వ్యవహారమంతా అతని ఇచ్ఛ యొక్క నిర్ణయమేనా? కాదా? ఏం చెప్పగలం? ఈ జగత్ చిత్రం కూడా - ద్రష్ట రహితం (అనగా దృశ్యమును చూచువాడు దృశ్యములో ఉండలేదు). నిద్రావర్జితం, అనుభవరూపం అగు ఒక సుదీర్ఘమైన స్వప్నంలాగా - 'ఆకాశంలో' ఉదయిస్తోంది. "భవిష్యత్తులో ఎప్పటికో ఏర్పడబోవుచున్నట్లున్న నగరంలోని వీథులలో విహారమునకు ఇప్పుడు వెళ్ళటం" అను అనుభవంలాగా చిత్తము నందే ఆవిర్భావం పొందుతోంది. ఒక చమత్కారమైన దృష్టాంతం చెపుతాను. కొన్ని కోతులు ఒక రోజు కొన్ని గురువిందగింజలను తెచ్చి ఒకచోట పోశాయట. ఎందుకో తెలుసా? అందలి ఎరుపును చూచి "ఇది అగ్నియే. అందుచేత మనం చలికాచుకోవచ్చు" అని భావించి, ఉపశాంతి పొందటానికి! వాటికి ఆ గురువిందగింజలను చూస్తున్నంతసేపు నిజంగానే చలికాచుకుంటున్నట్టి అనుభవం కలుగుతూ ఉన్నదట!

ఆ విధంగానే అసత్తు, అర్థరహితం అయినప్పటికీ, ఈ జగత్తు 'అర్థసాధకం' అగుచున్నది.

జలంలోని ఆవర్తం "జలం కంటే వేరు" అని అనగలమా? ఈ జగత్తు కూడా బ్రహ్మం కంటే భిన్నం కాదు. కాని, భిన్నంగా తోచుట మాత్రం జరుగుతోంది. ఈ కనబడే 'జగచ్చిత్రం' సద్రూప మగు పరమాత్మయే అయి, మరొకవైపుగా ఆకాశంలోని నీలత్వం వలె ఉనికిని పొందుతోంది.

రత్నము మధ్యలో కిరణసమూహముల సమన్వయం ఏదో చమత్కారమైన 'దృశ్యం'లాగా కనబడుతుంది. ఈ దృశ్యము కూడా ద్రష్ట యొక్క హృదయములోనే చమత్కారంగా రూపు దిద్దుకుంటోంది.

మృగతృష్ణలోని జలంలాగా, ఇదంతా అసత్యమై ఉండి కూడా సత్యం వలె అనుభవమౌతుంది.

ఒకడు "తనయొక్క దృఢ-దీర్ఘ-తీవ్ర సంకల్పము (Zone of Visualisation) నందు చూచే భవనములు" వలె... ఇదంతా కూడా విస్తారమై ప్రాప్తిస్తోంది. అయితే ఏం? వాస్తవానికి అసద్రూపమే (actually not existant) అయివున్నది.

ఒక కవిచే కల్పించబడిన కథలోని పాత్రలు, ప్రదేశములు, సంఘటనలు పాఠకునికి "ఆహా! అయ్యోః!" అనురూపంగా ఆశ్చర్య-సంతోష-దుఃఖ-కోపాదులను కలిగిస్తూ ఉంటాయి చూచావా? ఇదంతా కూడా అట్లే కల్పనామాత్ర స్వరూపం కలిగియున్నది.

స్వప్నంలో చూడబడిన పర్వతంలో సారమేమున్నది? లేదు. కానీ, స్వప్నసమయంలో అది దృఢంగానే ప్రాప్తిస్తుంది కదా! ఇదంతా కూడా, అట్లే, భూతాకాశరూపమున వెలుగొందుచున్నది.

మేఘములు ఆకాశమును కప్పివేసి ఆకాశం కనబడకుండా, కేవలం అంతా మేఘమయం గానే ఉంటుంది చూచావా? ఈ జగద్దృశ్యము కూడా ఆత్మ సత్తను కప్పివేసినదై ఉంటోంది.

ఇదంతా అక్షయంగా ప్రాప్తించటానికి కారణం జ్ఞానము యొక్క అభావమే.

స్వప్నములోని సుందరస్త్రీతో ఏర్పడే సమాగమం లాగా ఇక్కడ ఒకరికొకరికి సంబంధ - బాంధవ్యములు, ప్రియ-అప్రియములు, సుఖ-దుఃఖములు ఏర్పడుచున్నాయి. ఇదంతా నిరర్థకమై, వైచిత్రమై, 'జగత్తు' అను పేరుతో ఏర్పడి ఉంటోంది.

మనోరాజ్యము యొక్క 'అనుభూతము' వలె ఇదంతా అసత్యము, అవస్తువు అయి ఉన్నది. చిత్రంలోని కమలమునకు సువాసన ఉంటుందా? ఈ దృశ్య విషయం కూడా అంతే.

అనుభూతం మనోరాజ్య మివాసత్యమవాస్తవమ్ ।
చిత్ర పద్మాకర ఇవ సార సౌంగధ్య వర్జితమ్ ॥

'కల్పనామయంమాత్రమే' అయివుండి కూడా ఇదంతా శూన్యమునందు వికశితమై, అనేక విధములైన వర్ణనలతో ఒప్పుచున్నది.

'ఇది మాత్రమే దీని ఆకృతి" అని చెప్పగలిగేదేదీ ఇక్కడెక్కడా లేదు. కనుక ఇదంతా మిథ్యారూపమే.

ఎందుచేత ఈ జగత్తు ప్రాప్తిస్తోంది?

"పరామర్శ" విచారణ లేనంతవరకు మాత్రమే ఈ జగత్తు ఇట్లు అనేక సత్య సంఘటనలు కలిగియున్న దాని వలె ప్రవర్తిస్తూ పోతుంది. ఎప్పుడైతే 'పరమాత్మ' గురించి సద్విచారణ చేస్తామో... మరుక్షణం, ఇదంతా శుష్కించి, 'స్వస్వరూపానుభవము' నందు లయించిపోతోంది.

అత్యంత అసంభవమైనప్పటికీ, ప్రత్యక్షమై తోచుచుండుటయే ఈ జగత్తు యొక్క చమత్కారం!

❖❖❖

3. జగత్తు - వివిధ నిర్వచనములు

జలములో ఏర్పడిన బుద్బుదముల (Bubbles) యొక్క ఆకారం కల్పితమైనదే కదా! లేకుంటే జలము బుద్బుదములుగా మార్పు చెందుచున్నదా? లేదు. చివరకు ఇదంతా శూన్యమే అయినప్పటికీ దీర్ఘము - ప్రకాశవంతము అయిన శరీరం కలిగి ఉంటోంది.

శ్రీరాముడు : తండ్రీ ఈ జగత్తులో కొంత మనోహరత్వము కూడా మనకు కనబడుతోంది కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : నిజమే. కాని, 'సుదీర్ఘ దృష్టి, తత్త్వ విచారణ' లేకపోవుటచేతనే ఇది స్వల్ప సమయములలో ఈ జీవుని దృష్టికి 'మనోహరంగా' కనిపించటం జరుగుతోంది. 'మనోహరము' అని వర్తమానంలో చెప్పబడుచున్న అనేక విషయముల (వ్యవహారముల) పరిణామం అనేక సందర్భములలో 'కటు' ప్రదం (Soarness), దుఃఖ ప్రదంగానే ఉంటోంది. జనన మరణములతో కూడినదై, జీవులను భ్రమింపజేయుటలో ఈ జగత్తును మించినదేమున్నది? పరిశీలించి, గ్రహించటం జరిగితే మాత్రం, ఈ జగచ్చిత్రంలో 'ఏమీ లేదు" అనియే తెలియవస్తోంది. 'రంగుల మేళనము' అయినట్టి చిత్రపటంలో నిజమైన సూర్యుడు, కొండలు, పక్షులు ఉంటాయా? ఉండవు. కానీ, ఉన్నట్లు ఆ చిత్రపటం చూచే కొందరు ప్రేక్షకులు ఆ అనుభూతిని పొందుచున్నారే!

వివిధ శాస్త్రకారులు ఈ జగత్తును రకరకాలుగా నిర్వచించుచున్నారు.

సాంఖ్యులు - ఇదంతా కేవలం జడాత్మకం.

వేదాంతులు - ఇదంతా అవిద్యారూపమే.

పదార్థవాదులు - ఇదంతా కాలానుగుణంగా పరమాణువుల "కలయిక-విడిపోవుట" అను ప్రక్రియచే ఏర్పడుతోంది. కనుక ఇదంతా రూపరహితం. నామరహితం.

కణాదగౌతములు – దీనికి "ఇది" అనబడు నియతి ఏదీ లేదు. ప్రతిదీ ఎప్పటికప్పుడు మరొక రూపాంతరం చెందుతుంది. కనుక ఈ జగత్తు లేదు. పరమాణువులు మాత్రం ఉన్నాయి.

ఇవన్నీ నిజమే కావచ్చు లేదా కాకపోవచ్చు. ఏది ఏమైనా, ఈ ద్రష్ట యొక్క అంతరంగము మాట ఏమిటి? ఈ చూచు, గ్రహించు, అర్థము చేసుకొను ద్రష్ట ఎవరు? ఈ ద్రష్ట యొక్క వాస్తవ స్వరూపం ఏమిటి? ఎట్టిది?

బాహ్య అభ్యంతర న్యాయం - ఒకడు బాహ్య జగత్తును ఏ అభిప్రాయంతో అవగాహన చేసుకుంటాడో అంతరంగమున తన స్వరూపము గురించి అట్టి అవగాహనయే కలిగి ఉంటాడు. బాహ్య జగత్తు గురించిన న్యాయమే అంతరంగమునకు కూడా వర్తిస్తూ ఉంటుంది. అందుచేత, "నాచే, బాహ్య దృష్టిచే చూడబడుచున్న ఈ తదితర జీవులు భౌతికమాత్ర శరీరులు కాదు".... అను అవగాహనయే క్రమేపీ స్వస్వరూపము గురించిన ఔన్నత్యమును ధృవీకరించగలదు.

"నేను పంచభూతమయుడను. శరీర పరిమితుడను" అను అనుభవం ఈ జీవునకు ప్రత్యక్షంగా ఉండిఉండవచ్చుగాక! కాని, యదార్థానికి ఇతడు భౌతిక ధర్మరహితుడు. (He is never bound by physical barriers) ఆకారము లేనివాడు. వాని రూపము ఒక నిశాచరుని వలె, చీకట్లో కదులుచున్నట్లు భ్రమచే కనిపించే రూపాల వలె ఆవిర్భవిస్తోంది. ఈ రూపాదులు – అవాస్తవములు. ఈ విషయం సమగ్రమైన, సమున్నతమైన అవగాహనచే మాత్రమే అర్థమై, అనుభవమగుచున్నది.

వాస్తవానికి ఈ జీవుడు రూపరహితుడు.

❖❖❖

4. బీజము-అంకురము-బ్రహ్మము-జగత్తు

శ్రీరాముడు : "ఒక విత్తనములో మహావృక్షము యొక్క స్వభావములన్నీ నిద్రాణంగా దాగి వున్నాయి కదా!* అట్లాగే 'మహాప్రళయం' - సమయంలో ఈ జగద్దృశ్యమంతా పరమాత్మయందే ఉండి ఉంటోంది. మరలా సృష్టికాలంలో ఆ పరమాత్మ నుండే ఉత్పన్నమై పరిఢవిల్లుతోంది"... అని మనకు శ్రుతులలోని కొన్ని సూత్ర వాక్యాలు చెప్పుచున్నాయి. అయితే, పరమాత్మ నిరాకారుడని, నిస్సంగుడని, జగద్రహితుడని మీరు ప్రతిపాదించారు. మరి ఈ రెండు అభిప్రాయాలకు, పొంతన ఎట్లా ఏర్పడుతుంది? మహా ప్రళయంలో ఈ జగత్తు 'స్వసత'తో కూడినదై తన కారణము నందు లయించి ఉంటోంది. ఇంతలోనే ఎప్పుడో విజృంభించి బహిర్గతమౌతోంది. మరల ఆ కారణము నందే లయించబోవుచున్నది" - అని కొందరి అభిప్రాయమై యున్నది కదా! అట్లు భావించేవారు మీ దృష్టిలో జ్ఞానులా? అజ్ఞానులా? మా అనుమానాలన్నీ తొలగాలనే ఉద్దేశంతో మిమ్ములను ఇట్లు ప్రశ్నిస్తున్నాను. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటో చెప్పప్రార్థన.

శ్రీవసిష్ఠ మహర్షి : విత్తనంలో 'అంకురించటం' అనే స్వభావం దాగివున్నట్లు, మహాప్రళయ సమయంలో స్వసత్తతో కూడిన పరమాత్మయందు ఈ జగత్తు దాగి వుంటోంది, అనేది నిర్వధికమైన సత్యం కాదని, మరి అది మధ్యేమార్గంలోని అభిప్రాయమేనని మేము అనుకుంటున్నాం. ఎందుచేతనంటావా? ఇది నీవు గ్రహించటానికి నీకొక యుక్తి చెపుతాను. విను.

ఆత్మయందు 'జగత్తు' అనబడేది ఏదైనా అసలు ఉన్నదా?

"ఉత్పత్తికి ముందే కారణము నందు కార్యము ఉండి ఉంటుంది" అని చెప్పువారిని ఒక చిన్న ప్రశ్నవేద్దాం. అట్టి కారణము నందు కార్యము (అనగా, బ్రహ్మము నందు జగత్తు)... ఏ రూపంలో ఉంటోంది?

1. సత్త...? "సత్త" రూపంగా ఉంటోందా? (లేక)

2. సంస్కారం...? నిద్రాణమైయున్న 'సంస్కారం' రూపంలో ఉంటోందా?

దృష్టాంతానికి, విత్తులో భవిష్యత్తులో ప్రకటన కాబోయే మహావృక్షం, ఆకులు, కాయలు లాగా! గాలి, నీరు తగలగానే విత్తు మొలకెత్తునట్లుగానే... ఏదైనా పరిస్థితులచేత ఆత్మయందు జగత్తు ప్రకటితమగుచున్నదా? (లేక)

3. మరి ఇంకొక తత్త్వంగా ? ఆత్మయందు ఆత్మకు వేరైనట్టి మరొక తత్వంగా ఉండి ఉందా?

ఉదా: బీజము నందు, ఆ బీజము కంటే వేరైన అంకురము ఉన్నట్లు.

❖

---

* **సదేవ సోమ్యేఽ దమగ్ర అసీత్ :** ఈ జగత్తు మొట్టమొదట పరమాత్మ యందే ఉన్నది - వేదవాక్యం

ఒక విత్తనం తగిన నేలలోనే, గాలి-నీరు లభిస్తూ ఉన్నప్పుడే మొలకెత్తుచున్నది అట్లా కాకుండా, ఆ విత్తును కఠిన శిలపైననో, లేక, నాటకుండా మరెక్కడో ఉంచితే మొలకెత్తుతుందా? లేదు. మరి, పరమాత్మయందు ఈ జగత్తు ఎట్లా ఉద్భవిస్తోంది? "ఏ సారవంతమైన నేల, నీరు, గాలి" మొదలైన బాహ్యకారణములచే జగత్తు యొక్క ఆవిర్భావం సాధ్యపడుతోంది? ఒకవేళ ఏదో సహకారి కారణములు ఉన్నాయనే అనుకుందాం. ఆ బాహ్య కారణములకు కర్త ఎవరు? పరమాత్మయేనా? మరెవరైనానా?

మరొక ప్రశ్న? ఒక బీజమున ఉండి ఉంటున్న "సత్తా సామాన్యమే" సర్వవస్తువులందు కూడా ఉండి ఉన్నది కదా! మరి ఒక విత్తనమును ఇనుముపై ఉంచినపుడు కూడా మొలవటం జరగాలి కదా? అట్లా మొలుస్తుందా? లేదే! పరమాత్మయందు ఏ అనుకూల స్థలప్రాప్తిచే ఈ జగత్తు ఉద్భవిస్తుంది? ఏ ప్రతికూల స్థలములందు ఇది ఉద్భవించదు?

పరమాత్మ ద్వితీయమా? అద్వితీయమా?

పోనీ... "బీజము వేరు. అంకురసత్త (మొలుచుట అను ధర్మము నిర్వర్తించు తత్త్వము) వేరు. 'బీజము' అను దాని యందు 'అంకురము' అనబడు వేరొక ధర్మము లేక తత్త్వము లేక 'స్వభావ-సత్త' ఉన్నది. ఆ విధంగానే పరమాత్మ వేరు... జగత్తు వేరు. కానీ, ఈ జగత్తు పరమాత్మయందే ఉన్నది..." అని అనవచ్చునా? అప్పుడు బీజము - అంకురముల సంబంధము, మరియూ, ఆత్మ - జగత్తుల సంబంధము ఈ రెండూ కూడా వస్త్రము - కుండలవంటి వేరు వేరు వస్తువుల సంబంధము వంటిదే అవుతుంది. "పరమాత్మ యందు జగత్తు వేరుగా ఉన్నది" అని అనదలచుకుంటే, పరమాత్మకు ద్వితీయమైనది కలదనీ, అది అద్వితీయం కాదనీ... నిర్ణయించవలసివస్తుంది...!

శ్రీరాముడు: అట్లా అనలేము కదా! అట్లా అంటే "పరమాత్మకు వేరైనదేదీ లేదు, అద్వితీయుడు. మరియు పరమాత్మ వస్తురహితము" అను ఉభయ వేదముల అభిప్రాయానికి భంగం వస్తుంది. ఆ తరువాత ఇంకా అనేక సమాధానాలు లేని ప్రశ్నలు కూడా ఉదయిస్తాయి.

శ్రీవసిష్ఠుడు: అవును. నీవు అన్నది వాస్తవమే. "విత్తనము కంటే అంకురము వేరైనది, అట్లే జగత్తు వేరు. పరమాత్మ వేరు"... అందామంటే వాటి ఆద్యంతాల కొరకు, ఆవిర్భావ - తిరోభావాల కొరకు, ఆ రెండింటికీ సంబంధం కలుగజేయుచున్న మరొకదాని కొరకు వెతకాలి. పైగా, నీవు చెప్పినట్లు... 'అద్వితీయం' అను వేదవాక్కు తిరస్కరించబడినట్లే అవుతుంది.

బీజము-అంకురముల న్యాయము; పరమాత్మ-జగత్తుల న్యాయము -

మూడు సిద్ధాంతాలు మన ముందు ఉన్నాయి.

1. ఆత్మ చేత జగత్తు...! ("సామాన్యసత్త"చే అసమాన్యమగు అంకురాదులు కలుగుచున్నట్లు) నిష్క్రియమగు ఆత్మచే జగత్తు నిర్మించబడటం

2. ఆత్మయందు జగత్తు...! (అంకురము "బీజసత్త" రూపమున ఉన్నట్లు) జడజగత్తు అజడమగు పరమాత్మ యందు ఉండటం

3. ఆత్మయే జగత్తు...! (అంకురమే బీజము రూపమున, వృక్షము రూపమున ఉన్నట్లు) పరమాత్మయే జగత్తు రూపమున, అనేకత్వము వహించి ఉండటం.

ఈ మూడింటిలో కొంత లోపం కనబడుతోంది.

"కార్యము 'స్వసత్త' రూపమున తన కారణము నందు ఉండి ఉంటుంది" (The effect that is manifesting here was earlier hiding in its cause) అను బోధ వాస్తవం కాదు. "జగత్తు బ్రహ్మం నందు ఒకప్పుడు ఉండి ఇప్పుడు బయల్వెడలుచున్నది" అనేది సరికాదు. "భగవంతుని యందు ఈ జగత్తు కలదు" అనే బోధ విపరీత భావనయే అని అనక తప్పదు. ఇట్టి బోధ చెప్పేవాడిని, వినే వాడిని కూడా మోహంలో ముంచుతుంది.

చూచావా రామా! మరల చెప్పుచున్నాను. "ప్రళయ సమయంలో ఈ జగత్తు సత్స్వరూపమగు పరమాత్మయందు దాగి ఉన్నది. బీజంలో అంకురంలాగా పరమాత్మలో ఈ జగత్తు ఉన్నది"... అనునదంతా అనుచితమేనని మా అభిప్రాయం. అట్టి ఉపమాన దృష్టాంతముల కూడిన పాఠాలను ఆశ్రయిస్తే, అట్టి బుద్ధి భ్రాంతిరూపమునే పొందుతుంది. ఎందుకంటావేమో? బీజం ఇంద్రియాలకు గోచరిస్తుంది. కంటికి కనబడుతోంది. అట్లాగే దానియందలి అంకురము, ఆకులు, పూలు, పళ్ళు, కాయలు కూడా కళ్ళకు కనబడుచున్నాయి. కాని పరమాత్మ విషయమో?

పరమాత్మ మనస్సుకు ఇంద్రియములకు అతీతుడు కదా! మనస్సు లయించినప్పుడు మాత్రమే 'పరమాత్మ' యొక్క అనుభవం అవుతుంది. అతి సూక్ష్మము, స్వయం ప్రకాశకము, అసంగము అయిన పరమాత్మ స్థూలము, కార్యకారణ జనితము (something that is bound by cause and effect) అయినట్టి ఈ బ్రహ్మాండములకు, ఇందలి పదార్థములకు బీజమెట్లా అవుతాడు?

అసలు - ఆకాశము కంటే సూక్ష్ముడు (more subtle than even space), వాక్కులన్నిటికీ అతీతుడు, నామరూప రహితుడైన పరమాత్మ యందు "జగత్తు" అనబడే బీజమెట్లా సంభవిస్తుంది? పరమాత్మ సదా ఏకరసమై సత్స్వరూపమై ఉంటాడు కదా! అతడు అతి సూక్ష్ముడు. కాబట్టే స్థూల దృష్టిగల అజ్ఞానుల అనుభవమునకు 'అసత్తుల్యుడు - అగమ్యము" అయి ఉంటున్నాడు.

కొందరు ద్రష్టలు తమయొక్క స్థూల దృష్టి చేతనే, "ఈ జగత్తు ఒకప్పుడు ఒక రూపమున పరమాత్మ యందు కలదు" అని దర్శించటం జరుగుతోంది. బుద్ధి సూక్ష్మత్వము చెందగా, తత్ఫలితంగా ఈ జగత్తు యొక్క భ్రమ తొలగిపోతుంది. భ్రమలను ఆశ్రయించుటచేతనే ఏర్పడి ఉండి ఉంటున్న జగత్తు భ్రమ 'రహితస్థితి'లో స్వతహాగా లేనిదే అగుచున్నది.

పరమాత్మ యందు బీజత్వమెచ్చట? బీజమే లేని చోట అంకురం ఎచ్చట?

ఆకాశము కంటే నిర్మలమై, అజ్ఞానుల దృష్టియందు శూన్యమువంటిదై ఉంటున్నట్టి పరమ పదమున జగత్తుగాని, జగత్-పదార్థములు గాని ఎట్లా ఉంటాయి? పరమాత్మ యందు దృశ్య

మానమగు అవయవమే లేదే! ఇక అందులో బ్రహ్మాండము అనబడు వస్తువు ఎక్కడ ఉండ గలదు? ఒకవేళ ఉంటే, అది ఎక్కడి నుండి వచ్చిందో మనకు ఎందుకు లభించుట లేదు? రూపమే లేనట్టి దాని యందు ఏ పదార్థమైనా ఎట్లా వచ్చి చేరుతుంది? ఎక్కడి నుండి వస్తుంది? శూన్యం లోంచి పర్వతాలు వస్తాయా?

ఆకార రహితమగు పరమాత్మ యందు ఏదీ ఉండజాలదు. ఈ 'జీవుడు' అనబడేవాడు కూడా సదా-సర్వదా నిరాకారుడేగాని, సాకారుడు కానేకాదు.

శ్రీరామచంద్రుడు : మహర్షీ! 'బ్రహ్మము-జగత్తు... ఇవి రెండూ భేదరూపమున లేవు. ఏకత్వ రూపముననే ఉన్నాయి' అని అనవచ్చా?

శ్రీవసిష్ఠ మహర్షి : చిత్స్వరూపమగు పరమాత్మకు, జడరూపమగు జగత్తుకు ఏకత్వమెట్లా ఘటిల్లగలదయ్యా? ఒక మఱ్ఱివిత్తు ఒక ఆకారము కలిగి ఉన్నది. 'అందు అంకురము కలదు' అంటే ఒప్పుకోవచ్చు. అంతేకాని, 'నిరాకారమగు పరమాత్మయందు విశాలాకారమగు ఈ జగత్తు ఉన్నది' అనునది అసంగతమే కదా!

'ప్రళయసమయంలో ఈ జగత్తు 'స్వసత్త' రూపమున పరమాత్మయందు ఉన్నది' అను సిద్ధాంతం కొందరిచే ప్రతిపాదించబడుతోంది. అయితే ఇక్కడ రెండు ప్రశ్నలు-

1. ఆ విధంగా లౌకిక ప్రమాణములచే నిశ్చయిస్తున్నామా? లేక
2. శ్రుతి వాక్యములను (ఉదా: సదేవసౌమ్యేౖ దమగ్ర అసీత్) అనుసరించి అట్లా నిర్ణయానికి వస్తున్నామా?

ఈ రెండు విధానములను మనం విమర్శించవచ్చు.

లౌకిక ప్రమాణముల దృష్ట్యా - మనం ఈ దృశ్యమును చూస్తున్నాం. దేని సహాయంతో? 'బుద్ధి మొదలుగాగల ఈ సమస్త ఇంద్రియ శక్తుల సహాయం చేతనే కదా? ఈ బుద్ధి, ఇంద్రియాలచే, వాటిని అనుసరించి అనుభవమయ్యే పదార్థజాలం 'ఇంద్రియాతీతస్థితి'కి సంబంధించనిదే అవుతుంది కదా?

"ఈ పదార్థములు ప్రళయంలో లయించిపోయి, మరల ఆ తరువాత ఉద్భవిస్తున్నాయి." - అని ఇంకొక అభిప్రాయం.

బాగానే ఉన్నది కానీ, అవి బుద్ధి వృత్తులను అనుసరించి ఒకరికి ఒక విధంగా, మరొకరికి మరొక విధంగా (అందంగాను-సామాన్యంగాను, ఇష్టంగాను-అయిష్టంగాను, ముఖ్యంగాను -స్వల్పంగాను....) తోచుచుండవలసిన పనేమున్నది? 'ప్రత్యక్షము-అనుమానము' అనబడు ఆయా బుద్ధి వృత్తులచే దర్శనము వేరు వేరుగా ప్రభావితం ఎందుకు అవుతోంది?

ఈ దృశ్యము ఒకప్పుడు కనిపిస్తుంది. మరొకప్పుడు లేకుండా పోతుంది. ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు లేకుండా పోయేది వాస్తవమెట్లా అవుతుంది? లౌకిక ప్రమాణములందు సమగ్రమైన అవగాహన ఉన్న కుశలురు ఈ విషయం గ్రహిస్తూనే ఉన్నారు.

ఎందుచేతనంటే...

ఏ దృశ్యము జాగ్రత్తులో చూస్తున్నామో, అది స్వప్నసమయంలో ఏర్పడి ఉండుటయే లేదు. స్వప్న సమయంలో మరొక రంగము ఏర్పడి ఉంటోంది.

శ్రుతి వాక్యముల దృష్ట్యా - "ఇది పరమాత్మయందు ఉన్నదై పరిఢవిల్లుతోంది." - అని కదా శ్రుతి యొక్క అభిప్రాయం! (సదేవసౌమ్యేఽ దమగ్ర అసీత్)ను అనుసరించి 'కార్యము - కారణమూలకు రెండు వేరైన సత్తలు లేవనియే తెలియవస్తోంది. మా ఉద్దేశ్యం ప్రకారం ఈ వాక్యం ... ఏకమేవాద్వితీయం బ్రహ్మ - కేవలం అద్వితీయమగు బ్రహ్మము ఒక్కటే ఉన్నది ... అను వాక్యమునకు గల అర్థం అనే లక్ష్యానికి మార్గమధ్యంగా అందించబడిన మధ్యేమార్గవాక్యమే గాని అందుకు వేరైన సిద్ధాంతం మాత్రం కాదు.

కార్య - కారణ సంబంధములు - ఇక్కడ సాంఖ్య సిద్ధాంతములో కనబడే ఒక అభిప్రాయం గురించి చెపుతాను, విను.

కార్యమే (దృశ్యము) సత్యమా? - పై వాక్యములను అనుసరించి కార్యమే సత్యమై అట్టి కార్యసత్యమే కారణత్వముగా రూపొందించుచున్నదా? లేక

కారణమే (ద్రష్టయే) సత్యమా? - "కారణమే సత్యమై, ఆ కారణమే కార్యము నందు ఆరోపించబడుచున్నది" అనాలా? లేక

కార్య - కారణములకు ఆవల ఉన్నట్టి పరమాత్మయే సత్యమా? - పరమాత్మయే సత్యమై, అద్దాని సత్తయే కార్య-కారణములందు ఆరోపించబడుచున్నదా?

ఈ మూడు ప్రశ్నలను సాంఖ్య సిద్ధాంతాలు బాగా తర్కించి విచారించాయి. చివరికి ఇలా నిర్ణయింపబడినది-

కార్యసత్యమే ఒకానొకప్పుడు కారణత్వము పొందుతోంది.

(అనగా బ్రహ్మమే ఒకానొకప్పుడు జగత్తుగా పరిణమిస్తోంది.)

మరల మరొకప్పుడు ఆ కారణత్వమంతా కార్యత్వములోనే లయిస్తోంది.(మరల ఈ జగత్తు మరొకప్పుడు బ్రహ్మమునందే లయిస్తోంది?)

ఇక మా అభిప్రాయం విను - ఆయా 'బోధ'లలో మాకు కొంత భ్రాంతి కనబడుతోంది. "వాచారంభమ్, వికారో నామధేయమ్" అన్నట్లుగా మట్టివలన కలిగిన "కుండ-గోడ'...ఇవన్నీ కేవలం పేరుకు మాత్రమే వేరు వేరుగా ఉన్నాయి. 'మట్టిగోడ' అనునది మట్టికంటే వేరా? మట్టిగోడ అవటం, కుండ అవటం ఎక్కడున్నది? మట్టిలో గోడగా ఏర్పడవలసిన కారణమే ఉండదు కదా! బ్రహ్మమునందు కారణమే మిథ్య. కారణమే మిథ్య అయినప్పుడు కార్యము కూడా మిథ్యయే కదా! బ్రహ్మము నందు జగత్తు ఏర్పడటానికి ఏ సహకారి కారణం లభించుటయే లేదు.

కారణమే అసత్యమైన చోట ఇక కార్యము ఉత్పన్నంకాజాలదు.

"సత్యమగు కారణము - కార్యత్వమును పొందుచుచున్నది ... బ్రహ్మమే జగత్తుగా పరిణమిస్తోంది" ... అనునది ఆత్యంతిక సత్యము కాజాలదు. అందుచేత-

సద్వస్తువగు పరమాత్మ యందు కార్య-కారణములు ఏ క్షణంలో కూడా లేవు. అద్దాని సత్త యందే "కార్య - కారణములు ఆరోపించబడుచున్నాయి. తదనంతరం, జాగ్రత్తుగా భ్రమ యందు వలె దర్శించబడుతోంది."

ఈ అవగాహనయే జీవుని తన సత్యత్వము వైపు నిత్యత్వము వైపు నడిపిస్తుందని మా అభిప్రాయం. ఆరోపణ బుద్ధి కారణంగా ఆత్మయందు ఈ జగత్తు యొక్క కారణము, జగత్తు అనబడే కార్యము అసమగ్రమైన అవగాహన కలవారికి కనబడుచున్నది.

"ఈ జగత్తు పరమాత్మ నుండి ఆవిర్భవిస్తోంది" అనే మాట శిష్యులకు బోధించుట కొరకై గురువులచే కల్పించబడిన ఒక మాధ్యే మార్గ విధానంగానో, లేక అసంపూర్ణమైన అవగాహన చేతనో ఏర్పడుచున్నది. అదంతా మిథ్య మాత్రమే...! అందుచేత "ఈ జగత్తు అనబడు ఒకానొకటి ఏర్పడింది" అనే అసత్యత్వపు భావనయే నీ నుండి తొలగించి వేయి. జగద్భావన త్యజించివేయ బడుగాక! అప్పుడు "ఆదిమధ్యాంత రహితము, సత్స్వరూపము" అగు పరమాత్మయే శేషిస్తోంది.

అదియే నీ యొక్క వాస్తవ స్వరూపం. 'దానికి మించి వేరుగా ఎక్కడా ఏదీ ('జగత్తు' అనే పేరుతో) లేనే లేదు' అని గ్రహించు.

❖❖❖

5. ఈ జగత్తుకు కర్త ఎవరు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ ప్రియ రామచంద్రా! సర్వదా తెలుసుకొనబడవలసిన వస్తువైయున్న ఆత్మను ఎరుగుటలో శ్రేష్ఠుడవు. ఇప్పుడు "ప్రళయ సమయంలో ఈశ్వరుని యందు ఈశ్వరునికంటే వేరైన జగత్తు ఉన్నదనుట దోషయుక్తము" అని నిరూపించబోవుచున్నాను. విను.

❖

సృష్టి ఉంటే జగత్తు ఉంటుంది. మరి జగత్తే లేకపోతే...? సృష్టి ఉండజాలదు కదా! "ఉత్పత్తి" అనే క్రియ, కర్త ఉంటేనే సాధ్యపడుతుంది.

ఈ జగత్తుకు కర్త ఎవరు? - ఒకవేళ "సద్రూపమగు పరబ్రహ్మమే జగత్తుకు కర్త" అని అంటామనుకో... అప్పుడాతను కర్తృత్వ , భోక్తృత్వములు కలవాడౌతాడు. ఈ జగత్తు ఒకప్పుడు ఉండటం, మరొకప్పుడు లేకపోవటం (ఉదా : జాగ్రత్ - సుషుప్తులు) అందరికీ అనుభవమే కదా! జగత్తును సృష్టిస్తున్న కర్తను సృష్టించుచున్న వేరొక 'మహాకర్త' ఉండి ఉండాలి.

(ఈ జగత్తును ఎవరో సృష్టించుచున్నాడని అనుకుంటే, ఆ వ్యక్తిని సృష్టించుచున్నదెవరు? అను ప్రశ్న ఉదయిస్తుంది)

'కాని కూటస్థమగు పరబ్రహ్మమునకు కర్త లేదు' అనునది వేదవచనం. బ్రహ్మము ఉత్పత్తి రహితమైనది. ఉత్పత్తి అనబడు ప్రసక్తియే లేని పరబ్రహ్మమునందు 'జగత్తు యొక్క సత్త' మహాప్రళయ సమయంలో (జగత్తు రహితమైన స్థితియందు) ఎట్లు, ఎచ్చట, దాగి ఉండగలదు? కల్పనారహితమైన చిదాకాశము నందు 'కర్త'ను గురించి కల్పన చేయాలనుకుంటే, ఆ కర్తను సృష్టించునట్టి సహకారి కారణము ఏమిటో కూడా మనం గుర్తించగలగాలి.

బ్రహ్మమే కర్తయా? బ్రహ్మము సర్వదా 'అకర్త' కదా!

అసలు ఏ సహకారి కారణాలు లేకుండా జగత్తు తనంతట తానే బ్రహ్మము నందు ఉత్పత్తి పొందుచున్నదా? నీరు, గాలి, నేల వంటి సహకారి కారణాలు లేకుండా విత్తనం ఎక్కడన్నా మొలకెత్తుతుందా? 'గొడ్రాలి రెండవ కూతురు గడుసుది' అనేది ఎట్లా ఏర్పడగలదు? అట్లు ఎవ్వడూ, ఎక్కడా, ఏదీ గాంచుచుండుట లేదు కదా?

సర్ప రజ్జు భ్రాంతి - కనుక, 'సహకారి కారణము' లేకుండా ఎవరికైనా ఏదైనా కనిపిస్తుంటే, అది "త్రాడులో కనబడే పాము వంటిది" అని అనక తప్పదు.

త్రాడు పాముగా కనిపించుటంలో త్రాడు పాత్ర ఉన్నదా?– ఉన్నది.

త్రాడు స్వయముగా పాముగా అగుచున్నదా?– లేదు.

పాముగా కనబడవలెనను ఇచ్ఛ త్రాడు కలిగియున్నదా? – లేదు.

ద్రష్టయే అట్లు త్రాడునందు పామును ఆరోపించుచున్నాడా? – అవును.

ద్రష్ట "పామును చూచెదనుగాక" అను ఇచ్ఛ కలిగియున్నాడా?–అట్లని అనలేము. కానీ, అతని సంస్కారములే త్రాడును పాముగా చూచుటకు తెరవెనుక నుండి ప్రోత్సాహక కారణాలు అగుచున్నాయని అనవచ్చు. అయినప్పటికీ, త్రాడే లేకుంటే పాము స్ఫురించేదే కాదు కదా! పాము త్రాడునే ఆశ్రయించుకొనియున్నదా? అవును. కానీ, పాము' అనబడునది మొదలే లేదుకదా! ఈ 'పాము' అనునది ఇతఃపూర్వం త్రాడునందే దాగి వున్నదా? లేని పాము త్రాడులో దాగి ఉండట మేమిటి? ఈ పాము త్రాడు కన్నా వేరా? కాదు. ఇదియే 'సర్పరజ్జు భ్రాంతి'.

❖

సృష్ట్యాది యందు ఈ "జగత్తు" లేక "సృష్టి" రూపమున బ్రహ్మమే తనయందు స్థితి పొంది ఉంటోంది. ఆ బ్రహ్మం ఇప్పటికీ (సృష్టి సమయంలో కూడా) ఆకారరహితమై, తన స్వస్వరూపం నందే సర్వదా నెలకొనియే ఉంటోంది. అట్టి బ్రహ్మమునందు మరి "ఇది జనించునది. ఇది జనింపజేయునది" – అను భేదమెక్కడిది చెప్పు? అట్టి భావమునకు చోటే లేదు.

అట్లా కాకుండా, ప్రళయము నందు 'జగత్తు' అనబడుదాని ఉనికిని అంగీకరించామనుకో... అప్పుడు "బ్రహ్మములో ఉన్నట్టి 'జగత్ సత్త', జగత్తుగా పరిణామం చెందటానికి, ఎక్కడి నుండో సహకారి కారణాలు వచ్చి చేరుతున్నాయి" అని అనవలసి ఉంటుంది. (అంటే "బ్రహ్మమునకు వేరుగా వేరొకచోట ఏదో ఉన్నది. అక్కడి నుండి ఈ సహకారి కారణాలు బయలుదేరుచున్నాయి"

అనాలి.) అట్లా అనలేము కదా? బ్రహ్మమునకు బాహ్యమంటూ ఏదీ లేదని 'వేద-ద్రష్టల' యొక్క అనుభవం కదా!

శ్రీరాముడు : మట్టి కుండ కావడానికి కుమ్మరి చక్రం, కుమ్మరివాడు సహకారి కారణాలు. అట్లాగే బంగారు ఆభరణం కావటానికి కొలిమి, వివిధ ఆకారములతో కూడిన లోహపాత్రలు, కంసాలి సహకారి కారణాలు. ఇక్కడి సహకారి కారణాలు బాహ్యము నుండి వస్తున్నాయి. అయితే, బ్రహ్మము నందు జగత్తు ఉద్భవించటానికి కారణమగుచున్న ఆ సహకారి కారణాలు "బ్రహ్మము నుండే వస్తున్నాయి" అని అనవచ్చు కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : అట్లా అయితే ... బ్రహ్మము-జగత్ సత్త - సహకారి కారణాలు ... ఇవన్నీ ఒక్క బ్రహ్మమే అయివున్నాయని నిరూపించబడుచున్నట్లే కదా!

బ్రహ్మమే అయివున్న ఈ జగత్తు బ్రహ్మమే కారణంగా బ్రహ్మమునందే స్ఫురించుచు, మరల బ్రహ్మమునందే లీనమగుచున్నది - అను ప్రవచనమునకు అర్థమగుచున్నది.

శ్రీరాముడు : మీరు చెప్పేది వాస్తవమే స్వామీ! "ప్రళయములో ప్రకృతితో కూడుకొనిన పరమాత్మ యందు సహకారి కారణసహితమైన ఈ జగత్తు తిరోహితమై (having been withdrawn) నిశ్శబ్ద అప్రకటిత రూపమున ఉంటోంది" అని చెప్పబడేదంతా చిన్న పిల్లలు చెప్పుకొనేదే కాని, బుద్ధి మంతులు అట్లు గాంచరని ఇప్పుడు ఒప్పుకుంటున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి: చూచావా? రామా? దీనిని బట్టి తేలేదేమిటి? ఈ జగత్తు సత్యమైన రూప మంటూ ఏదీ కలిగియుండలేదు. కలిగియుండుట లేదు. కలిగియుండబోవుట లేదు. శుద్ధమగు చిదాకాశమే భావనామాత్రంచేత శీఘ్రంగా తనయందు ఈ 'జగత్ అనుభవం' అను రూపమున వికసించుచున్నది. ఎప్పుడైతే ఈ విధంగా విచారణచే జగత్తు యొక్క అభావమే సిద్ధిస్తోందో అప్పుడిదంతా బ్రహ్మమే అవుతుంది కాని, మరింకేమీ కాదు".

❖❖❖

6. స్మరణ-విస్మరణ

ఈ బ్రహ్మము "తనను తాను" స్మరించుచున్నప్పుడు (పూర్ణముగా ఎరుగుచున్నప్పుడు) బ్రహ్మానుభవమే పొందుతోంది. అప్పుడిక జగత్తు యొక్క అనుభవం ఉండుటలేదు. తనను తాను విస్మరించినప్పుడో, ఈ జగత్తులోని అనేకత్వమును ఆశ్రయించి ఉంటోంది. జగత్సంబంధమైన సంస్కారముల ప్రభావం చేత ఇంద్రియములచే పొందబడుచున్నదే 'జగత్తు'గా చెప్పబడుతోంది. తనను తాను అంతటా దర్శించునట్టి అనుభవమే బ్రహ్మానుభవం సుమా!

మట్టికి రూపం లేదు. కాని కుండకు రూపం ఉన్నది. కుండ మట్టి కంటే వేరైనది కాదు. 'రూపము పొందుట' అను చమత్కారం మట్టి యందు సర్వదా ఉండియే ఉన్నది. అదే బ్రహ్మం నందు గల చిచ్ఛక్తి. కుండ పగిలినప్పుడు మట్టి-మట్టియే అగుచున్నది.

శ్రీరాముడు : అంటే, ఈ జీవుడు గాఢ నిద్రాపరవశుడు అయినప్పుడో, లేక మరణించినప్పుడో జగత్తు యొక్క రాహిత్యమును అనుభవించుచున్నాడు కదా. కుండపగిలితే మట్టి అగుచున్నట్లు ఈ జీవుడు దేహము తొలగినప్పుడు పరబ్రహ్మమే అగుచున్నాడా?

శ్రీవసిష్ఠ మహర్షి : లేదు. అది సరి కాదు. ఈ జీవుడు గాఢనిద్రాపరవశుడైనప్పుడో, లేక మరణించినప్పుడో ఈ పదార్థ వ్యవహారము అతని నేత్రములకు గోచరించకపోవచ్చు. అంత మాత్రం చేత జగత్ సంస్కారం చిత్తమునందు 'నివృత్తి' చెందదు సుమా! ఈ చిత్తము మరల తదుపరి శరీరములను తనయందలి 'మననత్వము' అను కారణంచేత పొందుతూ పోతూనే ఉన్నది. సంకల్పవశంచేతనే అదంతా ప్రాప్తించటం జరుగుతోంది. అనగా మరణానంతరం కూడా ఈ జీవుడు పదార్థ పూరితమైన జగత్తును దర్శిస్తూ పోతూనే ఉన్నాడు. ఓ రామా! "ఈ దృశ్యమును పొందుట" అనబడునది శరీరప్రాప్తితోనే ప్రారంభమగుచున్నదని అనుకొంటున్నావా? లేదు. అట్లే శరీరము నశించిన మాత్రం చేత చిత్తము శమించుట లేదు. అసలీ దృశ్యమును ఇట్లు చూస్తున్నది ఎవరు? శరీరమా? చిత్తమా?... చిత్తమే చూస్తూన్నది గాని, శరీరము కాదు సుమా!

'చిత్తం' అంటే ఏమిటి?... "కామ్యకర్మలకు సంబంధించిన వాసనల యొక్క బీజమే చిత్తం".

దృశ్య శమనము అంటే అట్టి బీజము (చిత్తం) శమించుట.

అంతేగాని, 'దృశ్యము శమించుట' అంటే 'పదార్థములు తొలగించుట' – అని కాదు సుమా! పదార్థములు ప్రక్కకు పెట్టినంత మాత్రంచేత 'దృష్టి – భావన' తొలగుతాయని అనలేం. పదార్థములు శమిస్తే ఏమియు శమించనట్లే. చిత్తము శమించటమే నిజమైన శమము. జ్ఞానము లేకపోతే చిత్తము శమించదు. చిత్తం శమించకపోతే దృశ్యం ఉండియే తీరుతుంది. కనుక రామా! "దృశ్యం నాకుండకూడదు" అని భావించి, రాజ్యాదులను త్యజించినంతమాత్రంచేత ఏం లాభం? చిత్తములో సంస్కారవృత్తులు ఉన్నంతవరకు దృశ్యానుభవం యథారీతిగా ఉండనే ఉంటుంది.

"మనస్సులో అజ్ఞానము ఉండి ఉన్నది" అని గుర్తించబడాలి. అట్టి మూల అజ్ఞానం సహితంగా మనస్సును సంపూర్ణంగా అధిగమించివేయాలి.

అదే (లేక, అప్పుడే) మోక్షం. అంటే 'దృశ్య' మనే అనర్థమును సంక్షయింపజేయటమే మోక్షం.

ఒకడు తనలోని అజ్ఞానపూర్వకమైన పదార్థ – సంస్కారములను ఎదుర్కోకుండా, "ఈ జగత్తు ప్రళయంలో ఏమౌతుంది? ప్రళయానంతరం ఎక్కడి నుండి వస్తుంది?" అని వాదోపవాదములు ఎన్ని జన్మల వరకు చేసినా మనకు లభించేదేమీ ఉండదు. ఏది స్వతహాగా లేదో "అది లేదు" అను జ్ఞానమే ముక్తికి సాధనము గాని, "ఉన్నట్లు ఎంత కాలం ఉంటుంది? నిద్రాణంగా మరెంత కాల ముంటుంది?" అని నిరుపయోగంగా కాలం వృథా చేసుకోవద్దని సత్యాన్వేషకులందరికి మా మనవి. "పదార్థములు ఉండవచ్చు, లేకుండవచ్చు. ఈ రెండింటియందు అభేదమే సర్వదా సత్యం. కాబట్టి నా చిత్తం నుండి 'పదార్థములను స్మరించటం' తొలగించి, బ్రహ్మమును స్మరించటంతో నింపివేస్తాను" అని లక్ష్యము కలిగియుండి, ఆ తరువాత ఏది ఎట్లు ఉచితమో అట్లే ఆచరించు.

'అజ్ఞానము' అనబడు జాడ్యమునకు "ఆత్మ సాక్షాత్కారము" అనునదే ఔషధం. ఆత్మ సాక్షాత్కారముచే "చిదాకాశము" అనబడు రూపముగల ప్రబోధం కలుగుతుంది. అనగా, "ఈ జగత్తంతా చిన్మాత్రమగు బ్రహ్మమే అయి ఉన్నది. చిన్మయ రూపము కానిదంటూ లేశం కూడా ఎక్కడా లేదు" – అను జ్ఞానం పరిపక్వత పొందుతుంది. "ఇతని పేరు ఇది, వీరు నా వారు, ఇవి నావి, నేను పుట్టాను, చచ్చాను"... అను భ్రమలు హృదయాంత రంగములలో ఉండజాలవు.

ఒక గోడపై చిత్రించబడిన చిత్రము వాస్తవమా? అందులో కనబడే పులి, మనుష్యులు మొదలైనవి బాలునకు భావావేశం కలిగించవచ్చునేమో! గోడపై చిత్రించబడిన కథా చిత్రంలోని సంఘటనను చూచి దుఃఖించటం అజ్ఞులు వ్యవహారమేకదా! గోడపై చిత్రముతో 'తాదాత్మ్యము' తొలగితే 'గోడ' యొక్క అనుభవము మాత్రమే సిద్ధించునట్లు, ఆత్మజ్ఞానానుభవం సముపార్జించు వారికి ఈ జగత్తు అంతా కూడా "తనయొక్క మరొక స్వరూపం" గానూ, "స్వకీయమైన దర్శన చమత్కారం" గానూ గోచరించటం జరుగుతోంది.

చిత్రకథా న్యాయము -

1. గోడపై చిత్రించబడిన ఒక కథా దృశ్యం.
2. గోడ
3. ఆ గోడనూ, ఆ రంగుల కథా దృశ్యములను చూస్తున్నవాడు

ఈ మూడింటి సంబంధమునే 'చిత్రకథాన్యాయం' అని అంటూ ఉంటాము. ఈ కనబడే పర్వతాలు, భూములు, వర్షాలు, కాలము, జన్మ, మరణములు మొదలైనవన్నీ చిత్రకథా న్యాయమును అనుసరించే ఉన్నాయి. అట్లే కల్ప–మహాకల్పములు, ఈ సృష్టి, వేదావాఙ్మయములో చెప్పబడిన "సృష్ట్యాది (సృష్టి యొక్క ఆరంభము)" మొదలైనవన్నీ కూడా సుమా! అంతే కాదు. ఈ ఆకాశాదుల సృష్టి క్రమము, కోట్ల కొలది బ్రహ్మాండములు, భూత – భవిష్యత్ – వర్తమానములోని సంబంధ బాంధవ్యములు, దేవతలు మనుష్యులు, చతుర్దశ భువనములు, సప్తద్వీపములు ... ఇవన్నీ చిత్రకథాన్యాయమును అనుసరించే ఉన్నాయి. ఇవన్నీ అల్పదృష్టికి వాస్తవముగానూ, ఉపాధి పరంపరల దృష్ట్యా స్వప్నతుల్యంగానూ, ఆత్మ దృష్ట్యా భ్రమగానూ ప్రాప్తిస్తున్నాయి. అనగా ఇవన్నీ "ఈ జీవుడు అనబడు ద్రష్టయొక్క స్వస్వరూపమే" అయివున్న 'సర్వాత్మ' అను గోడపై చిత్రించబడిన చిత్రకథ వంటిది.

ఆత్మకు వీటన్నిటితో సంబంధము లేనేలేదు. ఆత్మ యందు ఇవి లేవు.

శ్రీరాముడు : మరి ఇవన్నీ ఎందుకు కనబడుచున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : నీవు ఆత్మదృష్టిని దృఢీకరించుకోక పోవుటచేతనే 'జగద్దృష్టి' అనునది ఏర్పడి ఉంటోంది. అట్టి జగద్దృష్టికి అవాస్తవమగు ఇవన్నీ దృశ్యమానమౌతున్నాయి.

పైన చెప్పిన దృశ్య వ్యవహారమంతా ఆవరణ రహితమే.

ఒక సత్యమును ప్రకటిస్తున్నాను, విను.

అనంతమగు చిదాకాశమున ఏ చిత్స్వరూపము ఉండి ఉన్నదో అది ఇతఃపూర్వం ఎట్లున్నదో, ఇప్పుడు కూడా అట్లే స్ఫురించుచున్నది.

'కిటికీ' లోంచి సూర్యకిరణాలు గదిలోకి ప్రసరిస్తూ ఉంటే, ఆ కిరణాలలో కనబడే పరిచ్ఛిన్నములైన పరమాణువులన్నిటిలోను ప్రకాశించే సూర్యకాంతి ఒక్కటే కదా! ఈ సర్వ పదార్థములు 'మహాచైతన్యము' యొక్క ప్రభవములే అయివున్నాయి.

అయితే గోడపై చిత్రమునకు, ఈ జగత్తుకు ఒక భేదము ఉన్నది.

గోడపై చిత్రం సాకారమైనది. ఈ సృష్టియో, రూపరహితము.

మనస్సుచే 'క్షుభితం' అగుచున్న చైతన్యము తనయందలి చిత్–చమత్కారమైనట్టి ఈ జగద్రూపమంతా మననము చేయుచు (అనగా, భావన చేయుచు) అనుభవించుచున్నది.

మరొకప్పుడు అది మననమునకు అతీతమైయున్న తన స్వస్వరూపమగు ఆత్మవస్తువుతో 'ఏకీభావము' పొందుచున్నది.

'చిత్రములోని కథ'ను చూచువాడు 'గోడ'ను, 'గోడ'ను చూచువాడు 'చిత్రము' లోని సంఘటనలను చూడరు కదా! చైతన్యమే స్వరూపముగాగల ఈ జీవుడు ఆత్మను ఏమరచి ఉండునప్పుడు జగత్తును గాంచుచున్నాడు. అట్లు జగత్తును గాంచుట ప్రారంభించుటయే 'కల్పారంభం". "జగత్ రాహిత్యం" అను అనుభవమే "కల్పాంతం" లేద జగద్రాహిత్యం.

'దృష్టి' యొక్క దోషం చేత ఒకనికి పెద్ద 'స్ఫటికశిల' యందు ఏవేవో రేఖలు చలనరహితంగా ఉన్నట్లు కనిపిస్తూ ఉంటాయి. ఆత్మయొక్క వాస్తవమైన స్వరూపమునందు ఈ బ్రహ్మాండములు ఉత్పన్నమగుట లేదు. నశించుటలేదు. అవి వచ్చుట లేదు,పోవుట లేదు. నిరాకారమగు 'ఆకాశం' నందు 'నిరాకారమే' అయివున్న 'ఆకాశ విభాగము' ప్రాప్తిస్తూ ఉన్నట్లు నిర్మలమగు ఆత్మ యందు, ఆత్మయే రూపముగా గల ఈ సృష్టులన్నీ స్ఫురించుచున్నాయి.

నీటి యందు ద్రవత్వము, వాయువు నందు చలనము, సముద్రము నందు కెరటములు, గుణవంతుని యందు గుణములు ఉన్నట్లే ఆత్మయందు ఈ జగత్తు ఉంటోంది. శాంతము, ఏకరసము, విజ్ఞానఘనము అయినట్టి బ్రహ్మమే స్వయముతో 'ఉత్పత్తి – నాశనములు" అను వ్యవహారముగా కూడుకొనిన ఈ జగత్తు రూపమున వ్యాప్తమైయున్నది.

శ్రీరాముడు : స్వామీ! ఈ 'జగత్తు' ఆత్మనుండియే ఉద్భవిస్తోందనునది మీరు ఒప్పుకుంటున్నారు కదా? లేక ఇవి ప్రకృతి నుండి ఉత్పన్నమౌతున్నాయా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఆత్మనుండి ఏదైనా ఉత్పన్నం కావటానికి సహకారి కారణమనేది ఏదీ లభించుటయే లేదని మనం చెప్పుకున్నాం కదా! అందుచేత "జగత్తు ఆత్మ నుండి ఉత్పన్నమౌతోంది" "ప్రకృతి నుండి ఆత్మయే రూపముగా గల ఈ జగత్తులు ఉదయిస్తున్నాయి." మొదలైన భావాలన్నీ పిచ్చి పిచ్చి వాక్యాలూ, మధ్యేమార్గ వాక్యాలేగాని, 'పూర్ణార్థవాక్యాలు' కావు.

ఆత్మ నుండి ఏదీ ఉద్భవించుటలేదు. స్వసంకల్పముచే ఆ చైతన్యమే జగద్దృష్టి కలిగియుండి, తన స్వరూపమునే ఇట్లు జగత్తుగా గాంచుచున్నది.

నాయనా! రాఘవా! ఇప్పుడు చెప్పుకున్న ఇన్ని వాక్యముల సారమేమిటో మరొక్కసారి సమీక్షిస్తూ వివరిస్తాను. ఈ సంక్షిప్త వాక్యాలు విను –

1. నిత్యోదిత స్వస్వరూపం - నీవు సర్వదా నిత్యోదయ స్వరూపముగల చైతన్యమువే గాని ఈ జడదేహమువు కాదు. నీవు భావనలుగా పరిణమించుటలేదు. అనగా, సర్వ భావములకు ఆవల స్వస్వరూపమునందే సర్వదా ఉండి ఉన్నావు.

2. సర్వమునకూ ముందుగానే...! సర్వ కల్పనలకు ముందే ఉన్న శుద్ధ స్వరూపమువే నీవు. కల్పనారూపములగు కళంకములేవీ నీ పట్ల ఉండజాలవు. అందుచేత ఇప్పటికిప్పుడే సర్వవేదనలు త్యజించి నిశ్చింతుడవై ఉండు.

3. సదవగాహన, నిస్సంగముల అభ్యాసం - స్వప్నరూపములతో పోల్చతగ్గ ఈ దృశ్యవస్తువులకు సంబంధించిన వికల్పములన్నీ నీనుండే బయల్వె డలుచున్నాయి. కనుక, అట్టి వికల్పములన్నీ "సదవగాహన – నిస్సంగము"ల సహాయంతో తొలగించుకో.

4. స్వస్వరూపంలో జాగరుడవు కావటం - 'అవిద్య' అనబడే సుదీర్ఘమైన గాఢనిద్ర నుండి మేలుకో. నీ యొక్క పరమాకాశ స్వరూపమును గ్రహించి ప్రశాంతుడవు కమ్ము.

5. జ్ఞానమును జ్ఞాన మార్గాలను ఆశ్రయించటం - నిర్భయుడవై ఆత్మజ్ఞానమును ఆశ్రయిస్తూ జాగృతి పొందు.

6. "సర్వమునందు నన్ను, నాయందు సర్వమును గాంచటం" - "బ్రహ్మవిత్" స్వభావుడవై వెలుగొందుము. అన్ని భేదభావములను త్యజించివేయి. సర్వమును నీయందు, నిన్ను సర్వము నందు గాంచుచుండు. అప్పుడు నీ ఉనికి, సంచారం ఈ భూమండలమును "భూషితం' చేగలదు.

❖❖❖

7. స్మృతి

శ్రీరాముడు : ఓ మునీంద్రా! మీరు మమ్ములను ఉత్తమోత్తమమైన భావనవైపుకే నడిపించు చున్నారు. చాలా సంతోషం. ఇప్పుడు నాదొక సందేహం.

మహాకల్పాంతము, సృష్ట్యాది - మహాకల్పాంతము తరువాత, సృష్ట్యాదియందు, ప్రథమ ప్రజాపతి (బ్రహ్మ) 'స్మృతి" లేక "సంస్కారం" రూపముగా కలిగియుండి, జన్మించుచున్నాడని నేను అనుకుంటున్నాను. అట్టి ఆ ప్రజాపతి యొక్క స్మృతి లేక మనస్సే ఈ జాగ్రత్ రూపమున ఉత్పన్నమగుచున్నది కదా? అంతేనంటారా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. నీవు చెప్పినట్లు "మహాప్రళయం" గతించిన తరువాత మరల "సృష్ట్యాది" యందు ప్రథమ ప్రజాపతి 'స్మృతి' రూపముననే ఉత్పన్నమగుచున్నాడు. కనుక

"స్మృతి" యందే ఈ జగత్తు భాసిస్తోంది. అనగా, స్మృతి యందే ఈ జగత్తు యొక్క అనుభవం సంకల్పరూపమున స్థితి కలిగియున్నది.

అయితే, మట్టితో కొన్ని బొమ్మలు తయారయ్యాయనుకో... 'మట్టి ఆకారములుగా మారుచున్నది' అన వచ్చునా? ఆత్మ స్మృతి రూపమును పొందటం ఉంటుందా? ఒక మహా వృక్షమును చూపించి, 'దీని వ్రేళ్ళు ఆకాశంలో ఉన్నాయి. ఆకులు మాత్రం ఇక్కడ చేయికి అందుతున్నాయి' అనటం ఎంత అసమంజసమో – అదీ అంతే.

పరమాత్మ యందు స్మృతి లేదు. 'జన్మ' మొదలైన వికారములు లేవు.

'స్మృతియే జన్మలకు కారణం' అనేది మధ్యేమార్గవాక్యం మాత్రమే. ఈ వాక్యం, 'జీవుడు ఆత్మస్వరూపుడే కనుక జన్మరహితుడు' అను వాక్యాలు రెండూ ఒకేసారి ఒనగూడుచున్నాయి. "నదీ జలం–తటాకజలం–జలం"; "బొమ్మలోనికుండలోని మట్టి – మట్టి" ఒనగూడుచున్నట్లే ఆ రెండూ ఏర్పడుచున్నాయి.

శ్రీరాముడు : స్వామీ! 'ప్రళయం' అంటే ప్రతి రోజు ఈ జీవుడు అనుభవించే 'సుషుప్తి' వంటిదే కదా! మనమందరం రాత్రిపూట గాఢనిద్ర అనుభవిస్తున్నాం. మరల మేల్కొన్నపుడు పూర్వ స్మృతులన్నీ యథాతథంగా ఉండి ఉంటున్నాయి.

అట్లాగే సృష్ట్యాదియందు ప్రజాపతి తనయందు స్మృతి కలిగి ఉంటున్నాడు అని అనవచ్చు కదా! 'మహా ప్రళయము యొక్క ప్రబల మోహము కారణంగా పూర్వకల్పములోని సంస్కారము లచే జనించిన స్మృతి అంతా నశిస్తుంది" అని కొందరు అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు. అట్లా ఎందుకు అనుకోవాలి? గాఢనిద్రలో లాగా మహాప్రళయంలో కూడా జగత్తుకు సంబంధించిన స్మృతులు దాగియే ఉంటాయని అనుకోవచ్చునంటారా?

శ్రీ వసిష్ఠ మహర్షి : "ఈ జన్మకు సంబంధించినవాడను మాత్రమే నేను" అను దృఢమైన అహంకారము కలవాడు – 'జీవుడు'

" ఈ అనేక సర్వఉపాధులను ధరించువాడను నేనే" అను సమష్టి అహంకారము గలవాడు – "ప్రజాపతి (లేక) బ్రహ్మదేవుడు".

ఓ రాఘవా! విను–

పూర్వము జనించియున్న బ్రహ్మలందరు (సమష్టి సృష్టికర్తలందరు) జ్ఞానులే కదా! అందుచేత వారంతా మహాప్రళయ సమయంలో దృశ్యాన్ని త్యజించివేస్తున్నారు. అనగా ముక్తులే అగుచున్నారు. అంటే అవశ్యము నిర్విషయ పరబ్రహ్మ స్వరూపమును పొందుచున్నారు. అప్పుడిక... "పూర్వ కాలమున ఉత్పన్నమైన 'స్మృతి'ని కలిగియుండి మరల కల్పారంభమున ప్రకటితం చేయటం" అనే క్రియకు కర్త ఎవ్వరో చెప్పు?

కర్త ముక్తుడు అయినప్పుడు, ఇక స్మృతి కూడా ముక్తిపొందినదై నిర్మూలనమగుట జరుగుతుంది కదా!

ఒకడు ఒక దీర్ఘ స్వప్నమును గాంచుచూ, మేలుకొన్నాడనుకో... అప్పుడాతని స్వప్నములోని వ్యవహారమును మరొకడు వచ్చి కొనసాగించగలడా? లేదుకదా!

అతఃస్మర్తురభావేన స్మృతిర్వోదేతికిం కథమ్ ।

అవశ్యంహిమహాకల్పే సర్వేమోక్షైకభాగినః ॥ (సర్గ.3; శ్లో. 8)

కర్మయే లేనప్పుడు, స్మృతి ఎట్లా సంభవిస్తుంది? ఏ విధానమును అనుసరించి సంభవిస్తుంది? 'మహాకల్పము' నందు సర్వము మోక్షము పొందుచుండును కదా! సర్వులు మోక్ష భాగులే అవుతారు. 'మోక్షము' పొందటం జరిగిన తరువాత ఇక ఇచ్ఛ – సంస్కారము – స్మృతి అనునవన్నీ నిష్ఫలములే అవుతాయి.

శ్రీరాముడు : మరి మీరు "స్మృతియే కల్పారంభమున ప్రవర్తిస్తోంది" అని అన్నారు కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును, అన్నాను. కల్పారంభ వ్యవహారంలో 'స్మృతి' ప్రవర్తిస్తోందని చెప్పటంలో నా ఉద్దేశమేమిటో చెపుతాను, విను–

'చిదాకాశము' అనబడునది ఒకటి ఉన్నది. అది అనుభూతమా? కాదు. పోనీ అననుభూతమా కాదు. అట్టి చిదాకాశమందలి ఏ 'స్మృతి' అయితే ఈ జగత్తు యొక్క ఉత్పత్తికి హేతువు అగుచున్నదో అయ్యది చిదాకాశము యొక్క కళయే గాని వేరేమీ కాదు. సూర్యుని నుండి సూర్యకిరణములు వేరు కానట్లు 'స్మృతి' అనేది చిదాకాశమునకు వేరైనదేదీ కాదు. శ్రుతులు ఈ ఆశయమునే ప్రకటిస్తున్నాయి. ఈ జగదనుభవం అనబడే "స్మృతి కల్పిత చిత్కళ" అనునది అనంతము కూడా! చిదాకాశమే దాని స్వరూపము.

అంటే అర్థమేమిటి?... స్వయంభువు అగు పరమాత్మయే జగద్రూపమున ఉన్నాడని గ్రహించెదవు గాక! అతడే ఈ జగములను. మరల లోపలికి గొనుచున్నాడు. సూర్యకిరణములు ఒక గోపురంపై ప్రసరించటం, మరల ఆ ప్రసరణ ఉపసంహారం కావటం సహజమే కదా!

అనాదికాలంగా సిద్ధించియున్న బ్రహ్మము యొక్క నిజప్రకాశరూపమే ఈ 'జగత్తు'కు సూక్ష్మదేహం. ఈ బ్రహ్మాండ దేహమునకు ఉపాదాన కారణం పరమాత్మయే. కనుక, "ఈ బ్రహ్మాండము కూడా పరమాత్మయే" అని సిద్ధాంతీకరించబడుతోంది.

ఓ రామా! "దేశము, కాలము, క్రియ, ద్రవ్యము, రాత్రింబవళ్ళు, ఆకాశము, మేఘములు" మొదలైన అనేక విశేషములతో కూడి ఈ సువిశాల జగత్తు అంతా కనిపిస్తోంది కదా! అట్టి ఈ త్రిలోకములతో కూడిన జగత్తుఅంతా ఒక్క పరమాణువునందే భాసించుచున్నది. మరల ఈ త్రిలోకములలోని పరమాణువులందు ఈ త్రిలోకములంత విశాల సృష్టులు అసంఖ్యాకంగా భాసిస్తున్నాయి. మరల ఆ సృష్టులలో అసంఖ్యాకములైన పరమాణువులు – ఈ విధంగా వ్యవస్థ అవ్యవస్థారూపంగా ఒకదానియందు మరొకటి గ్రుచ్చబడి ఉన్నాయి. ఆయా దృష్టులకు అవన్నీ దృశ్యమానమగుచున్నాయి. అయితే రామా! అవన్నీ సత్యమని అనగలమా! కానే కాదు. ఇవన్నీ ద్రష్ట యొక్క చిత్కళాభావనా వైచిత్ర్యములే!

ఈ విధంగా జ్ఞానుల దృష్టి సర్వదా జాగృతమై ఉంటోంది. వారికి ఇదంతా ఒక మొదలుగాని, చివరగాని లేని వ్యవహారంగా, సత్-అసత్‌స్వరూపంగా ప్రాప్తిస్తోంది. అజ్ఞానుల దృష్టి మిథ్యా రూపముగా అనుక్షణం గతించిపోతున్న వ్యవహారంగా అంతులేకుండా ఉండి ఉంటోంది.

జ్ఞానుల దృష్టిలో ఈ ప్రపంచమంతా, నాశరహితము, శాంతము అగు కేవల పరబ్రహ్మమే అయి ఉన్నది. అదే ప్రపంచము అజ్ఞానుల దృష్టికి పదు నాలుగు లోకముల రూపమున ఉంటోంది.

❖

యథేదంభాసురంభాతి జగదండకజృంభితమ్ ।
యథాకోటి సహస్రాణి భాంత్యన్యాన్యపృణావణౌ ॥ (సర్గ. 3; శ్లో. 17)

ఈ బ్రహ్మాండము ఎట్లా భాసిస్తోందో, అదే విధంగా ఒక్క పరమాణువులో ఇటువంటి కోట్ల కొలది బ్రహ్మాండములు భాసించుచున్నాయి. స్తంభములో విగ్రహం, ఆ విగ్రహంలోని కాళ్ళు, చేతులలో మరి కొన్ని చిత్రములు లిఖించబడుచున్నట్లు, జగత్తులోని ప్రతి పరమాణువులో ముల్లోకముల విగ్రహము ఉన్నది.

ఆ ముల్లోకములలోని ప్రతి అణువులోను జగత్తులు ఉన్నాయి. ఈ వ్యవహారము అజ్ఞానము ఉన్నంతవరకు ఇట్లే ఉండి తీరుతుంది.

ఒక పర్వతము ఉన్నదనుకో... అందుగల అసంఖ్యాకములైన పరమాణువులు ఆ పర్వతముకంటే వేరు కాదు కదా! అలాగే, 'బ్రహ్మము' అనే మహాపర్వతములో ఆ బ్రహ్మమునకు వేరు కానట్టి బ్రహ్మాండములు అనబడే పరమాణువులు అసంఖ్యాకంగా ఉన్నాయి.

సూర్యకిరణాలలో కనిపించే సూక్ష్మ పరమాణువులను (త్రసరేణువులను) లెక్కించగలమా? "చిత్" అను సూర్యునిలో త్రిలోకముల రూపమున ప్రకాశించే బ్రహ్మాండ పరంపరలను లెక్కించ గలిగే వారెవ్వరు?

జలంలోను, ధూళిలోను అనేక పరమాణువులు పరిభ్రమించుచున్నట్లు చిదాకాశములో 'ప్రపంచములు' అనబడే అనేక పరమాణువుల పరిభ్రమణం చేస్తున్నాయి.

❖❖❖

8. ఆత్మదృష్టి - సృష్టిదృష్టి

శ్రీరాముడు : స్వామి! ఆ విధంగా చిదాకాశములో ప్రపంచముల రూపమున ప్రకాశించేదంతా ఏమిటి? అది బాహ్యము నుండి వస్తోందా? అంతకుముందే బ్రహ్మమున ఉండి ఉన్నదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! 'శూన్యము, నిరాకారము' అయివున్న ఆ కనబడే 'భౌతిక-ఆకాశము' వైపు చూడు... అది నీలముగా కనబడుతోంది... అయినప్పటికీ ఆ నీలత్వము యథార్థానికి శూన్యరూపమే అయి ఉన్నది కదా! అట్లాగే, సృష్టి రూపంగా మనకు ఇక్కడ అనుభూతమగుచున్నదంతా చిదాకాశమే అయివున్నది.

దీనిని 'బ్రహ్మం' రూపంగా ఎరిగితివా, ఆ దృష్టి 'మోక్ష'మను ఉత్తమ శ్రేయస్సును ప్రసాదిస్తుంది. అట్లా కాకుండా "సృష్టి" అనబడు ద్వైతభావనగా చూచావా, ఇది 'నరకము' మొదలైన అనేక అధోస్థితులను రుచి చూపిస్తుంది.

ఈ రెండు దృష్టులు నీ ఎదురుగానే ఉన్నాయి.

'సృష్టి - దృష్టి' అనుసరిస్తావా? 'ఆత్మ-దృష్టి' లేక 'బ్రాహ్మీదృష్టి' అనుసరిస్తావా? - నీ ఇష్టం.

వాటి పర్యవసానం మాత్రం రెండు వేరైన త్రోవలుగా... ఒకటి సంసారము వైపూ, మరొకటి మోక్షము లేక దుఃఖ రాహిత్యమువైపు... ఉన్నాయి.

ఓ రామచంద్రా! ఇప్పటి వరకు అనేకసార్లు చెప్పిన వాక్యమునే మరొకసారి చెప్పుచున్నాను. ఈ జీవుడు మరింకేదో కాదు. ఇతడు సాక్షాత్, స్వయముగా ప్రత్యగాత్మ స్వరూపుడే. సూర్యకిరణాలన్నీ సూర్యుని ప్రతిభా విశేషాలే అయినట్లు, - ఈ బ్రహ్మాండాంతర్గత జీవులంతా చిదానంద సూర్యుని ప్రజ్ఞాకిరణపుంజాలే!

ప్రపంచము యొక్క ఉనికికి కారణభూతుడైన ఈశ్వరుడు - ఈ జీవుడు ... వీరిద్దరు కూడా పరమార్థ దృష్టితో చూసినప్పుడు పరిపూర్ణము, ఏకరసము అయిన పరబ్రహ్మమే అయి ఉన్నారు.

అందుకు ప్రమాణం వేద వాక్యాలే. (పూర్ణమదః పూర్ణమిదమ్ - ఋగ్వేదము) "ఈ బాహ్య - అభ్యంతరములు (The external & internal zones) రెండూ ఉపాధి భేదం చేత బ్రహ్మము నుండే ఉత్పన్నమౌతున్నాయి" - అని శ్రుతులు ప్రవచిస్తున్నాయి. ఏది ఎందులోంచి వస్తోందో అది అద్దాని రూపమే అయి ఉంటుంది. ఇందులో సందేహించవలసినదేమీ లేదు.

జ్ఞానోదయము - ఈ తెలియబడుచున్న 'వేద్య వస్తు సముదాయము' అంతా, ఈ 'నీవు-నేను -అతడు' మొదలైన వాటితో సహా ... శుద్ధము, చిన్మాత్రము జ్ఞాన స్వరూపము అయిన ఆ స్వస్వరూప బ్రహ్మమే. అనగా, ఈ 'జీవుడు' గా కనబడుచున్న ద్రష్టయే దృశ్యము రూపముగా విస్తరిస్తూ, అద్దానిని ఆస్వాదిస్తున్నాడు.

అనేక కోణముల నుండి ఈ సర్వమును దీర్ఘకాలంగా పరిశీలించిన మాకు ఈ విషయం నిస్సందేహంగా గ్రాహ్యమగుచున్నది. బ్రహ్మము తప్పితే మరింకెక్కడా ఏదీ లేనే లేదు.

❖❖❖

9. మనస్సే ఇదంతా !

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! "ఇంద్రియ సమూహములను జయించుట" అను వంతెన చేతచే ఈ భవసాగరము దాటబడుచున్నది. మరింకే ఇతర కర్మల వలన గాని, వ్యవహారముల వలన గాని అది సాధ్యపడేది కాదు. 'శాస్త్రము-సజ్జన సాంగత్యము-సాధన" ... వీటి సహాయం చేత జీవుడు జితేంద్రియుడు, వివేకవంతుడు కాగలుగుచున్నాడు. జితేంద్రియుడు (ఇంద్రియముల

ప్రభావమును అధిగమించినవాడు) మాత్రమే ఈ దృశ్యం యొక్క అత్యంత అభావమును ఎరుగగలడు. ఇంద్రియ జయమే సంసార భేదనము. ఇంద్రియవశత్వమే సంసారబంధనము.

చూచావా! రామా! ఇదీ, సంసార స్వరూపము. ఈ సంసార సాగరములు ఎట్లా ప్రాప్తిస్తున్నాయో, ఎట్లా నిర్వర్తిస్తున్నాయో ఈ విచారణల సహాయం చేత నీకు నీవే గ్రహించు. నిష్కామభావమును అవధరించు. ఆ పై ఏది ఎట్లు ఉచితమని భావిస్తావో, అట్లే నిర్వర్తించు.

ఇక ఎక్కువగా చెప్పవలసిన పనేమున్నది? ఈ మనస్సే 'కర్మ' అను వృక్షము యొక్క అంకురమని గ్రహించు. ఈ మనస్సును ఉత్తమ అవగాహనతో నియమించితివా, ఇక విహిత - నిషిద్ధ (must do - must not do) కర్మల రూపమగు ఈ జగద్వృక్షము స్వయముగానే భిన్నమైపోతుంది. అంతా ఈ మనస్సే అయివున్నదని మరల మరల ప్రకటింస్తున్నాను. ఈ మనస్సుకు ఇక్కడే, ఇప్పుడే సరి అయిన చికిత్స చేయాలి. మరి ఇంకెప్పుడు ఏమి చేయగలవు చెప్పు?

మనః సర్వమిదం రామ, తస్మిన్ అంతఃచికిత్సి తే ।
చికిత్సితోవై సకలో జగజ్జాలాఽమయో భవేత్ ॥ (సర్గ.4; శ్లో. 5)

ఈ మనస్సుకు ఇక్కడ సరి అయిన చికిత్స చేశావా, ఇది శమించిపోగలదు. అప్పుడు "జగత్సమూహము" అనబడే దృశ్యజాడ్యము మొదలంట్ల తొలగిపోగలదు.

మనస్సే ఈ దేహాకారముగా స్ఫురిస్తూ స్వప్నంలోలాగా 'క్రియాసమర్థం' అగుచున్నది. మనస్సుకంటే వేరుగా ఈ జడదేహం కార్యసమర్థమగుచున్నదెక్కడ? ఈ భౌతిక దేహం మనస్సుకన్న వేరైన లక్ష్యములు కలిగియుంటున్నదా? లేదు.

దృశ్యాత్యంతాసంభవేన ఋతేనాన్యేనహేతునా ।
మనఃపిశాచః ప్రశమం యాతికల్పశతైరపి ॥ (సర్గ.4; శ్లో. 7)

అసలు ఈ 'సంసారము' అనబడే జాడ్యమునకు మూలకారణమేమిటి? విను, చెపుతాను. ఎప్పటి నుంచో తెలియదు గాని, ఈ జీవుణ్ణి "దృశ్యము" అనబడే ఒకానొక పిశాచము పట్టి పీడిస్తోంది. ఎందుకో, అతడు అది గుర్తించుట లేదు.

నా ఈ మాటలు జనులు శ్రద్ధగా ఆలకించెదరు గాక! జ్ఞానముచే ఈ దృశ్యమును పూర్తిగా రహితం చెయ్యాలి. అనగా, మొత్తము దృశ్యమునకు అతీతంగా వెళ్ళాలి. అదియే సర్వ ప్రయత్నముల యొక్క ఉత్తమ ప్రయోజనం.

మరింకే వ్యవహారం ఎంతగా ఆశ్రయించినా సరే, ఈ దృశ్యము శమించేది కాదు సుమా!

మనోరోగమునకు పరమోత్తమమైన ఔషధం - "దృశ్యము యొక్క పూర్ణ రాహిత్యం-లేక సంపూర్ణమైన 'అతీతత్వం' " అయివున్నది. ఇందుకు వేరే మందేమీ లేదు.

ఈ మనస్సే దేహాదులందు ఆత్మభావనమును కలుగజేసి, మోహమును ఉత్పత్తి చేసి అందిస్తోంది. జన్మించేదీ అదే. మరణించేదీ కూడా అది మాత్రమే. ఈ మనస్సు యొక్క ప్రభావం చేతనే

జీవుడు బంధంలో తగుల్కోవటం జరుగుతోంది. ఎవడైతే ఈ మనస్సును ఆత్మజ్ఞానంవైపుగా ఉన్ముఖం చేస్తాడో, అట్టివాడు స్వయంగా విముక్తిని పొందుచున్నాడు. "ఓ దృశ్యమా! నీవు నా మనస్సు యొక్క ప్రదర్శనమే!" అని గానం చేసే వాని మనస్సు దృశ్యంలో తగుల్కొనే ప్రసక్తి ఎక్కడిది?

ఓ జనులారా! మీరంతా చూస్తున్న ఈ జగత్తు మరెక్కడో లేదు సుమా! ఇది మీ చిత్తము లందు ఇట్లు సంకల్పాదుల బలంచే జగత్తుగా ఏర్పడుచున్నది. 'శూన్యం'లో విశాల గంధర్వ నగరంలాగా స్వప్నంలో చమత్కారములైన అనేక వస్తుజాలమువలె ఇదంతా ప్రాప్తిస్తోంది. అవస్తువే అయి వుండి కూడా ఎంతో సత్యముగా తోచుచున్నది. నాయనలారా! మీరంతా వాస్తవానికి సత్య-నిత్య-నిరుపమానంద స్వరూపులే అయివున్నారు. కాని ఏం లాభం? నిష్కారణంగా మనస్సుచే ప్రభావితులై 'అసత్యము'ను అత్యంత సత్యముగాను, నిత్యసత్యమగు 'నిర్మల చైతన్య తత్త్వము'ను లేనట్టిదానిగాను గాంచుచున్నారని మనవి చేస్తున్నాను.

ఒక్కసారి మీ మనస్సులను నిలదీసి ప్రశ్నించండి. నిరోధించండి. ఆత్మవైపు ఉన్ముఖులు కండి. అప్పుడు ఈ జగత్తు సత్యమో, అసత్యమో నన్ను ఏమాత్రం అడగవలసిన పని ఉండదు.

❖

ఒక పూలగుత్తిలోంచి వస్తున్న సుగంధం ఆ పూలగుత్తికి వేరైన దానిలాగా గోచరిస్తూ ఉంటుంది కదా! మనస్సు నందే స్థితించియున్న ఈ జగత్తు కూడా, మనస్సుకు వేరైన దానివలె గోచరిస్తూ ఉండటం జరుగుతోంది. ఎందుచేత? ఆత్మజ్ఞాన లేమి చేతనే సుమా!

"ఒక నువ్వు గింజలో నూనె", "ఒక గుణిలో గుణములు" (చెడ్డవానిలో చెడుతనం, మంచివానిలో మంచితనం, అందగానిలో అందం, ధర్మపరునియందు ధర్మము మొ॥) ఎట్లా అంతర్లీనంగా ఉంటున్నాయో, ఈ చిత్తమునందే 'జగత్తును గాంచుట' అనబడు వాసనలతో కూడిన 'ప్రవృత్తి' ఉండి ఉంటోంది. సూర్యునియందు కిరణములు, తేజమునందు ప్రకాశము, అగ్ని యందు ఉష్ణత్వము ఉన్నట్లే -మనస్సునందు ఈ జగత్తు ఉన్నది. మంచునందు చల్లదనం లేదా? ఆకాశంలో శూన్యత్వం ఇమిడి ఉంటోంది కదా! వాయువు నందు చంచలత్వం అత్యంత సహజమై ఉంటోందే! అట్లాగే ఈ మనస్సునందు దృశ్య భావము ఉండి ఉన్నది.

ఇట్లు మనస్సే "జగదనుభవము" అను "సుఖ-దుఃఖ-ఆశ్చర్య-తిరస్కార-స్వ-పర" ఆదిగా గల చమత్కారములకు కారణమగుచున్నది. కాబట్టి రామచంద్రా!

మనస్సే ఈ సమస్త జగత్తు -

మరొక చమత్కారమైన విషయం :

మనస్సు నశిస్తే ఈ దృశ్య జాతమంతా స్వయంగా నశిస్తుంది.

కాని, ఈ జగత్తు నశించినంతమాత్రంచేత మనస్సు నశించదు.

అందుచేత రామా! ఈ జగత్తు విషయం కొంత సేపు ప్రక్కకు పెట్టు, మనస్సును ఎట్లా లయింపజేయాలో ఆలోచించు.

సర్వ సంకల్పముల రహిత స్థితియగు 'స్వసత్త'ను అన్నివేళల ఆశ్రయించటం అలవరచుకో.

అట్టి నిష్ఠను బలపరచగల కర్మ – జ్ఞానాదులను సముపార్జించు.

❖❖❖

II. భృగు – యమ సంవాదము

1. శుక్రుడు - ఇంద్ర సభాప్రవేశము

శ్రీరాముడు : ఓ మనీంద్రా! సర్వధర్మజ్ఞా! మా మీద అవ్యాజమైన ప్రేమతో మీరు మీ తపోధ్యానాదుల ప్రభావముచే గ్రహిస్తున్నదంతా చెప్పుకొస్తున్నారు. దోషరహిత మనోబలముచే, నిర్మలజ్ఞానంతో దర్శించుచున్న విశేషమంతా మాకు బోధించడం మా పూర్వజన్మల సుకృతమే! మీ వాక్యములు ప్రతిపాదిస్తున్న విచారణ విషయం చేత మమ్ములను మేము ఈ 'దృశ్యము' అనబడుదాని నుండి వేరు చేసుకొని పరిశీలించగలుగుచున్నాము.

మీరు సవివరంగా చెప్పుచున్నప్పటికీ, ఎక్కడో హృదయకుహరంలో ఇంకా ఏవేవో, ఎనెన్నో సందేహాలు దాగి ఉండటం చేత, మరల ఒక సందేహం ప్రకటిస్తున్నాను.

సువిశాలమైన ఆకారం కలిగియున్న ఈ ప్రపంచమంతా మనస్సునందే స్థితి కలిగి ఉన్నదని మీరు చెప్పుచున్నారు కదా! అది ఆ విధంగా ఎలా ఉండగలదు? మనస్సు నందు స్ఫురిస్తూ బాహ్యమున ఎట్లా తారసపడుతోంది? మేము తాకుట; చూచుట మొదలైన అనుభవములచే ఎదురుగా చూస్తున్నాం కదా? స్వామీ! ఏదైనా ఉత్తమ దృష్టాంతం ద్వారా చెప్పితే మరికొంత సుస్పష్టం కాగలదని నా విన్నపము.

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామా! ఇంతకుముందే ప్రవచించియున్న ఉపాఖ్యానాలలో మనం ఈ విషయం చూచాము. ఐందవులు (ఉత్పత్తిప్రకరణం) స్థూల శరీరరహితులైనప్పటికీ తమ యొక్క సమాధిస్థితిలో తమచే ఆశ్రయించిన భావావేశం చేత అనేక జగత్తులను నిర్మించుకుని అనుభవించారు కదా! ఆ జగత్తులన్నీ మనస్సులోంచే వచ్చాయి కదా! లవణ మహారాజు యొక్క మనస్సు (ఉత్పత్తి ప్రకరణం) ఇంద్రజాలముచే వ్యాకులము పొందినదై చండాలత్వానుభవం అత్యంత స్థూలభావంతో పొందింది.

అవన్నీ "మనస్సు నందే ఈ జగత్తు కలదు" అని నిరూపిస్తున్నాయి.

నీవు మరొక దృష్టాంతం వినాలని కోరినప్పుడు నాకు "భృగుమహర్షి" యొక్క పుత్రుడు శుక్రుడు అప్సరసను చూచి సంసారస్థితులను పొందటం, భృగు – యమ సంవాదము గుర్తుకు వస్తున్నాయి.

మహాజ్ఞానియగు శుక్రుడు తన బాల్యంలో బాల్యచాపల్యంగా ఎట్లా సంసారిత్వము పొందాడో, కాలదేవుడు ఏ విధంగా ఈ సంసార వ్యవహారమును, మనస్సు యొక్క స్వభావ – స్వరూపములను భృగువుకు వివరించి చెప్పటం జరిగిందో చెపుతాను, విను.

❖

భృగువు అనే ఒక మహానుభావుడు ఉన్నారు. ఆయన ఋషులలో ఉత్తమోత్తముడని శ్లాఘించ బడుతూ ఉంటాడు. ఆయన ఒకప్పుడు మందరపర్వతముపై గల ఒక శిఖరంపై ఒక ప్రశాంతప్రదేశంలో ధ్యాన నిష్ఠలో ఉన్నారు. ఆయన కుమారుడే శుక్రాచార్యుడు. బాలుడైన ఆ శుక్రుడు తన తండ్రి సేవలో రాత్రింబవళ్ళు గడుపుతూ ఉండేవాడు. ఆ పిల్లవాడు మహా తేజః సంపన్నుడై, పూర్ణచంద్రుని వలె గొప్ప సౌందర్యముతో అక్కడ సంచరిస్తూ ఆ శిఖరమును పావనం చేస్తూ ఉండేవాడు.

ఒక రోజు భృగువు నిర్వికల్పన సమాధి యందు ప్రవేశించాడు. "నిర్విషయ-మౌనము" వహించుటచే అచంచలుడై 'శిల'వలె ఉండియున్నారు. శుక్రుడు తన తండ్రిసేవలో ఉంటూనే ఆ వనంలో అటూ ఇటూ సంచరించేవాడు. కొంతసేపు ప్రకృతిచే నిర్మించబడిన పుష్పశయ్యలపై, మరికొంతసేపు పర్వత-వనములందు ఆహ్లాదంగా పవళించి, చల్లటి గాలులు, పుష్పాసువాసనలు ఆస్వాదిస్తూ ఉండేవాడు.

శ్రీరాముడు : మహర్షీ! శుక్రాచార్యులు 'మహాజ్ఞాని' యని చెప్పబడుతోంది కదా...!

శ్రీ వసిష్ఠ మహర్షి : కాని ఆ బాల్యస్థితిలో అప్పటికి మాత్రం విద్య - అవిద్యల మధ్య స్థితి కలిగి ఉండేవాడు. అనగా, అప్పటికాతడు పూర్ణమగు ఆత్మజ్ఞానమును ఇంకా పొందియుండలేదు. అట్లా అని, కేవలం అవిద్యయందు కూడా తగుల్కొనియుండలేదు. మన ఈ విశ్వామిత్ర మహర్షి శిష్యునిపైగల వాత్సల్యం చేత 'త్రిశంకు-స్వర్గం' నిర్మించి ఇచ్చారు కదా! అట్టి భూ-ఆకాశముల మధ్య ఊగిసలాడే త్రిశంక స్వర్గంలాగానే జ్ఞాన - అజ్ఞానముల మధ్య ఊగిసలాడుతూ ఉండేవాడు.

ఇట్లా అనేక రోజులు గడిచాయి. ఒక రోజు సాయంత్రం అతడు అత్యంత ప్రశాంతమైన చిత్తము కలవాడై, శత్రురాజులందరినీ జయించి, అతఃపురంలో విశ్రాంతి పొందుతున్న ఒక రాజువలె... ఒక ఏకాంత ప్రదేశంలో నడుమువాల్చి ఉన్నాడు. ఆకాశమును చూస్తూ క్షణములు, నిమిషములు గడుపుచున్నాడు.

ఆ సమయంలో ఒక బహుసుందరమైన అప్సరస ఆకాశంలో కనిపించింది.

సుకుమారమైన ఆమె శరీరము, అందమైన కెరటములను గుర్తు చేయు కురులు, ఆ హంసవంటి నడక - ఇవన్నీ ఆమె ఉండియున్న స్థానమును అమృతమయం చేస్తున్నాయి. ఆ అప్సరస ఆకాశంలో ఎటునుంచో వచ్చి ఎచటకో వెళ్ళుచుండటం మన శుక్రుడు చూచాడు.

అంతేఁ! నిశ్చలమైన జలంపై ఒక బరువైన రాయిని విసరితే ఆ జలము యొక్క ఉపరితలం ఏమౌతుంది? ఆవృత్తములు ఏర్పడుచూ, నీరంతా సంక్షుభితం అవుతుంది కదా! ఆ అప్సరసను చూస్తున్న శుక్రుని మనస్సు కూడా ఎంతో క్షుభితం అయింది.

ఆ అప్సరస ఎందుకో వెనుకకు చూచింది. కాకతాళీయంగా ఆమె కళ్ళు శుక్రుని కళ్ళలోకి చూస్తూ నాలుగు ఐదు క్షణాలు 'అలాగే' ఉండిపోయాయి. ఆమె అలా చూస్తూ చూస్తూ మోహ పరవశం చేత చిరునవ్వు నవ్వింది.

ఆమె సౌందర్యమునకు, ప్రేమతో చూచిన చూపులకు అతడు ఎంతో ముగ్ధుడయ్యాడు. కరిగిపోతున్న ఒక మధురస్వప్నంలాగా ఆమె క్రమక్రమంగా దృష్టి పథం నుండి వెళ్ళిపోయింది.

అతడు అప్పటికప్పుడు ఆకాశగమనం ద్వారా ఆమెను అనుసరించాలనే అనుకొన్నాడు. అప్పటికి మాత్రం ఎట్లాగో అతి కష్టం మీద తన వివేకాదుల సహాయం చేత కొంత నిగ్రహించు కున్నాడు. కాని ఏం లాభం? ఆ క్షణం నుండి అతని మనస్సును ఆ అప్సరస సౌందర్యము, ఆమె చిరునవ్వు ఆక్రమించివేశాయి. అప్పటి నుండి అన్ని సమయములందూ ఆ అప్సరస యొక్క సౌందర్యమును, నడకను భావన చేస్తూ ఉండేవాడు. సకల ఇతర వృత్తులను వదలివేసి, కేవలం ఆమెనే మననం చేస్తూ ఉండుటచే అతడు 'అప్సరసామయుడు' అయ్యాడు.

అత్యంత మోహావేశంతో ఒక రోజు ఒకచోట కూర్చుని తన మనోరాజ్యంలో ఆమె యొక్క రాక పోకలను కల్పన చేసుకొని, ఇట్లు చింతన చేయసాగాడు.

❖

శుక్రుడు (హృదయాకాశంలో....) :

ఆహా! ఈ కనబడే అప్సరస సౌందర్యము ఏమని చెప్పాలి? అయ్యో! ఈమె వెళ్ళిపోతోందే? ఓహో! ఆకాశమార్గంగా ఆమె స్వస్థానమైనట్టి ఇంద్రలోకం వెళ్ళుచున్నది కాబోలు. ఆమె వెళ్ళిపోయిన తరువాత "చంద్రుని పోగొట్టుకున్న రాత్రి" లాగా ఈ ప్రకృతి ఎంత నిస్తేజమై పోయింది!... సరే, ఆమె వెళ్ళే మార్గంలోనే నేను కూడా వెళ్తాను. నా మనస్సు యొక్క 'మననశక్తి – ఊహాశక్తి'లను ఉపయోగించి బయలుదేరుచున్నాను....

ఇప్పుడు నేను దేవతల అధివాసమైన అత్యంత మనోహరమగు 'స్వర్గలోకము' చేరాను. ఇదిగో, ఇదే అమరావతి. ఇక్కడ ఎవరెవరో అనేక శిరోభూషణములతో, పట్టువస్త్రములతో ఆహ్లాదంగా కనిపిస్తున్నారేం? వీరంతా ఎవరు? ఓహో! పురాణములలో వర్ణించబడిన 'దేవతలు' అంటే వీరే కాబోలు ... వీరే దేవతా స్త్రీలు కదా...! వీరందరినీ తమ మనోదృష్టిచే వీక్షించి కవులు తమ రచనలలో వర్ణించటం గుర్తుకు వస్తోంది. ఆ మహాకవులను మెచ్చుకోక తప్పదు. వారంతా ఎక్కడో ఉండి ఇక్కడి చమత్కారమంతా కళ్ళకు కట్టినట్లు వర్ణించి చెపుతున్నారే! వారి వర్ణనములు అతిశయోక్తులు (hyperboles) కానేకావు!

ఇక్కడి వారంతా అత్యంత ఘుమఘుమలాడే అద్భుతమైన ఏవో పుష్పములను ధరించియున్నారు. పారిజాత పుష్పమాలలు ఇవే కాబోలు! ఆహా వీరంతా విశ్వరూపుడగు విష్ణువు వంటి ఆకృతి కలవారై సంతోషంగా సంచరించుచున్నారు. ఈ వినబడే సంగీతమే దేవగీతికలు. ఇదే 'మందాకిని' అనే పేరుతో ప్రసిద్ధికెక్కిన ఆకాశగంగ. ఈ మందాకినిలో బ్రహ్మదేవుని వాహన మైన హంస విలాసముగా సంచరిస్తూ ఉంటుందని విన్నాము. ఇంద్రుడు విశ్రాంతి తీసుకునే వనవాటికలు ఈ నది ఒడ్డునే ఉన్నాయి.

ఇవే కాబోలు, యమ–చంద్ర–సూర్య–ఇంద్ర–అగ్ని–జల–వాయు మొదలైన లోకపాలకుల వసతిగృహాలు.

తన దంతములచే క్రూర రాక్షసులను ముక్కలు చేయగల ఐరావతం ఇదిగో.

ఈ వైమానిక దేవతలు ఎంతగా శోభించుచున్నారు...! అప్సరసలు ఉండే ఇంద్రుని ఉపవనాలు ఇవేనా? ఈ పిల్లగాలులు – పారిజాత వృక్షము నుండి వచ్చుటచే కాబోలు – ఎంత ఆహ్లాదం కలుగజేస్తున్నాయి!... ఈ నందనవనం గురించి చెప్పుకోవటానికి మాటలు చాలవు.... ఆహాఁ! దేవతా స్త్రీలు తన్మయత్వంతో నృత్యం చేస్తూ ఉంటే, తదనుగుణంగా వీణ మీటి మధుర స్వరముతో పాడే తుంబురులు వీరే కాబోలు...! అనేక అలంకారములతో విమానములలో సంచరించే ఈ దేవతలు ఎంతటి పుణ్యకార్యములు చేసి ఉంటారో కదా...! 'అందము' అనబడుదానికి ప్రతీకయే ఈ ఇంద్రసభ.

... ఈ విధంగా నేను ఈ స్వర్గంలో ప్రవేశించాను... అదిగో... ఇంద్రుడు సింహాసనం అధిష్ఠించి విరాజిల్లుచున్నాడు... రెండవ బ్రహ్మవలె శోభిల్లుచున్నాడు... ఆయనను సమీపించి ప్రణామం చేస్తాను."

ఈ విధంగా చింతన చేస్తూ శుక్రుడు ఇంద్రునకు ప్రణామం చేశాడు. ఇంద్రుడు సాదరణ పూర్వకంగా ఆహ్వానించి ఉచితమైన ఆసనం చూపాడు. పూలతో, ప్రశంసలతో అతిథి మర్యాదలన్నీ సమర్పించాడు.

ఇంద్రభగవానుడు: ఓ భృగుకుమారా! శుక్రాచార్యా! స్వాగతం. మీ ఆగమన కారణంగా స్వర్గము ధన్యతను పొంది శోభించుచున్నది. మీరిక్కడ మీ ఇష్టమొచ్చినంతకాలం నిరభ్యంతరంగా ఉండవచ్చు.

శుక్రుడు అతిథి మర్యాదలు స్వీకరిస్తూ రెండు గంటలకాలం సభలోనే గడిపాడు. ఆ తరువాత స్వర్గంలో సంచరించే ఉద్దేశంతో అక్కడి నుండి బయలుదేరాడు. అక్కడి వారిలో కొందరైతే అతనిని ఇంద్రుని కుమారుడుగా భావించసాగారు.

❖❖❖

2. భావావేశము - జన్మపరంపరలు

ఆ విధంగా తన యొక్క పుణ్యప్రభావంచేత శుక్రాచార్యుడు స్వర్గమును పొందాడు. ఇప్పుడాతనికి "మరణదుఃఖము" అనునదే లేదు. అయితే అతడు "నేను భృగుమహర్షి కుమారుణ్ణి. నా తండ్రి సేవలో ఉన్నాను" అనే విషయమును దృష్టిపథంలోంచి పూర్తిగా కోల్పోయాడు. క్రమంగా అప్సరస గణమును వీక్షించాడు. వారి మధ్యలో తాను ఇతఃపూర్వం చూచిన అప్సరసను కనుగొన్నాడు. ఆ 'విశ్వాచి' అను పేరుగల అప్సరస కూడా శుక్రుని చూచి పరవశురాలైనది. వారిద్దరు ఒకరిపై మరొకరు ప్రీతిపూర్వకమైన చిత్తము కలిగియుండటం జరిగింది. పరస్పర ప్రేమాధిక్యతచే ఒకరినొకరు సమీపించారు.

వారిరువురు ఉన్న ఆ నందనవనం సంకల్పించినంత మాత్రంచేతనే ఏ పదార్థమునైనా ప్రసాదించగలదు. అప్పటికప్పుడు అక్కడ వారిద్దరూ తమ ఇరువురి కొరకు ఒక గొప్ప ఉద్యాన వనం నిర్మించుకున్నారు. ఆ వనం మధ్యలో ధవళకాంతులు విరజిమ్మే గొప్ప మందిరం వెలిసింది. ఆ అప్సరస శుక్రాచార్యుని చెయ్యి పట్టుకొని, "నాథా! మీ సౌందర్యం నన్ను వివశురాల్ని చేస్తోంది. అబలనైన నేను మిమ్ము శరణువేడుచున్నాను. సత్పురుషులగు మీరు నావంటి దీనురాలిని రక్షించకుండా ఉంటారా? 'ప్రేమదృష్టి' అంటే ఏమిటో ఎరుగని మూఢులు మాత్రమే ప్రేమను తిరస్కరిస్తారు. అనురక్త చిత్తులగు స్త్రీ పురుషుల పరస్పర ప్రేమకంటే ఉత్సాహభరిత వస్తువు ఈ సృష్టిలో ఇంకేమున్నది? మీ కరస్పర్శచే నేను ఇప్పుడు ఎంతో ఉపశాంతిని పొందుచున్నాను. మీరు నా ప్రక్కన ఉంటేనే నేను జీవించగలను. పద్మము తుమ్మెదను ఆదరించినట్లు మీరు నన్ను ఆలింగనం చేసుకోండి. రండి, మనం ఆ భవనంలో ప్రవేశిద్దాం' అంది.

ఆ తరువాత వారిద్దరు ఆ ఉద్యానవనంలో యథేచ్ఛగా సంచరించసాగారు. వారి ఆ సమాగమం, ఆ చిత్తవిలాసములు, చిరకాల కల్పితమైన 'ప్రేమ భావావేశం' చేత చమత్కారంగా పెంపొందసాగాయి. అతి ప్రసన్నత పొందిన వారిద్దరు ఒకరి సాన్నిధ్యం మరొకరు ఆస్వాదిస్తూ చాలా కాలం గడిపారు. వారిద్దరు మందరపర్వతంపై ఎన్నో ఏండ్లు గడిపారు. శ్వేతద్వీపంపై మరికొంత దీర్ఘకాలం గడిచింది. శుక్రుడు గంధర్వనగరములను, ఉద్యానవనములను నిర్మిస్తూ, "ఇతడు కాలస్వరూపునితో సమానుడా" అన్నంత ఠీవిగా ఆ అప్సరసతో సంచరించసాగాడు.

ఆ విధంగా ఎనిమిది చాతుర్యుగములు గడిచిపోయాయి.

అంతా కాలమహిమయే కదా! "వస్తువు-భావన-సుఖము-దుఃఖము" ... ఇవన్నీ కూడా కాలముచే పుట్టి, కాలముచే నశించవలసిందే!

వారిద్దరు కొంతకాలానికి "మేము అధఃపతనం పొందవలసి ఉంటుందేమో?" అను సందేహం పొందసాగారు. పుణ్యము యొక్క క్షయానుసంధానం కారణంగా వారి దివ్యశరీరాలు క్రమక్రమంగా నశించసాగాయి.

క్రమంగా వస్త్రాలు, విమానాలు, భూషణాలు, నందనవనాలు మటుమాయం కాసాగాయి. ఆ ఇద్దరు భూమండలముపైకి వచ్చిపడ్డారు. అప్పుడు వారిద్దరూ యుద్ధంలో నేలకూలిన శూరుల వలె ఉన్నారు. నేలపై పడుటచే వారి దేహాలు ఛిన్నాభిన్నమైనాయి. గూటిని విడచిన పక్షిద్వయంలాగా వారిద్దరు సూక్ష్మ శరీరులై దుఃఖమయ చిత్తముతో సంచరించసాగారు. వారి రెండు లింగశరీరాలు ఆకాశమున గల చంద్రకిరణాలలో ప్రవేశించాయి. ఆ కిరణాలలో నుండి మంచు బిందువులలోకి ప్రవేశించాయి. అక్కడి నుండి ధాన్యరూపమును పొందాయి.

'దశార్ణవము' అను పేరుతో పిలువబడే గ్రామంలో నివశిస్తూ ఉండే ఒక బ్రాహ్మణుడు శుక్రచైతన్యముచే పరిపక్వమైన ధాన్యమును భుజించాడు. అప్పుడు శుక్రాచార్యుడు వీర్య రూపమును పొంది, ఆ బ్రాహ్మణునకు పుత్రుడై జన్మించాడు. అప్పుడాతనికి కొందరు మునులతో

శుశ్రూష సాంగత్యము లభించింది. ఆ మునుల వద్ద నుండి తగినంత ఉత్తమ సంస్కారము పొందినవాడై, కొంతకాలానికి మేరు పర్వతం చేరాడు. ఒక ప్రదేశంలో ఆశ్రమం ఏర్పరచుకొని ఉగ్రమైన తపస్సు ప్రారంభించాడు.

అట్లు చాలా కాలం గడిచిపోయింది. ఆ తరువాత ఏదో సందర్భంలో ఒక మృగమును చూచాడు. తన ప్రియురాలగు అప్సరసయే అట్లు ఏదో శాపవశంచేత మృగముగా జన్మించి సంచరిస్తున్నట్లు గ్రహించాడు. పూర్వ సంస్కారబలం కారణంగా అతనియందు ఆ అప్సరసపట్ల అత్యంత ఆకర్షణ ఏర్పడింది. తన తపస్సులో కొంతభాగం వెచ్చించి ఆ మృగానికి స్త్రీ రూపం కలిగించాడు. ఆ అప్సరసతో సంగమించి, మనుజాకారము గల ఒక పుత్రుని పొందాడు. ఆ పుత్రునిపైగల వాత్సల్యభావంతో అతడు మరికొంత మోహం, మమకారం పొందాడు. ఇంకేమున్నది... జ్ఞానవిషయంలో మరల మొదటికి వచ్చాడు. "ఈ పుత్రుడు నాకు అత్యంత ప్రియమైనవాడు. ఇతడు నా ప్రక్కన లేకపోతే నేను బ్రతుకగలనా? లేదు. నా పుత్రునకు బాగా డబ్బు, గుణములు, దీర్ఘమైన ఆయువు కలుగుగాక!" అను రూపముగల నిరంత చింతనకు బద్ధుడైపోయాడు. పాపం, వేద విహితములైన సత్యము, తపస్సు, దానము మొదలైన సన్మార్గములన్నీ క్షణంలో త్యజించివేశాడు. ధర్మ మార్గముల నుండి పతితుడై పుత్రుని భోగముల గురించి మాత్రమే ఎల్లపుడు చింతించుచు ఉండేవాడు. ధనాదుల సంపాదన, పరిరక్షణలకు సంబంధించిన అనేక కార్యక్రమములలో నిమగ్నమై సంచరించసాగాడు. ఫలితంగా అతని శరీరం కృంగి కృశించ సాగింది. సర్పము గాలిని పీల్చునట్లు, ఒక రోజు మృత్యువు అతనిని మ్రింగనే మ్రింగింది.

మరణదశను చేరే సమయానికి అతని లింగశరీరము ఏవేవో భోగములకు సంబంధించిన ఇచ్ఛలను, భావావేశములను (వృత్తులు) కలిగి ఉండినది. మనోవృత్తుల తీవ్రత కారణంగా అనేక జన్మలు పొందాడు. అటు తరువాత అతడు మద్రదేశపురాజుకు పుత్రుడై జన్మించాడు. కాలక్రమేణా 'రాజు' అయ్యాడు. అనేకమంది శత్రువులతో యుద్ధాలు చేస్తూ చాలాకాలం గడిచి పోయింది. కొంతకాలానికి ముసలివాడయ్యాడు. ఉత్తమ ధర్మమును ఆశ్రయించి, కాలక్రమేణా 'వానప్రస్థాశ్రమము'ను స్వీకరించాడు. వాస్తవానికి అతని యొక్క ఇతఃపూర్వపు "తపస్సు చేయు బుద్ధి" యే అతనిని ఆశ్రమజీవనం వైపు నడిపించింది. రాజ్యమును త్యజించి, రాగాదులు లేనివాడై బుద్ధిమంతుడైనాడు. అతడు పరిజన్మలో సమంగానది ఒడ్డున ఆశ్రమం నిర్మించుకొని తపస్సు చేయ ప్రారంభించాడు.

చూచావా రామా! ఆ విధంగా భృగుమహర్షి కుమారుడైన శుక్రాచార్యుడు అనేక వాసనలతో అనేక స్థితి గతులను అనుభవించాడు. అనేక చిత్రవిచిత్ర జన్మలన్నీ పొందాడు. చివరికి, సమంగా నది ఒడ్డున ఆశ్రమంలో ఆసీనుడై ధ్యానమగ్నుడై యున్నాడు.

ఈ మాయ యొక్క ప్రభావం ఏమని వర్ణించాలి చెప్పు?

❖❖❖

3. భౌతికం - కల్పితం

ఓ రామచంద్రా! వింటున్నావుగా! మన శుక్రాచార్యుడు తండ్రియగు భృగుమహర్షి ఎదుటనే ఉండి, పైవిధంగా చింతన చేయుచుండగా అనేక వేల సంవత్సరములు గడచిపోయాయి. అతని దృష్టి ఎక్కడెక్కడో సంచరిస్తోంది కదా! చాలా కాలమైన తరువాత అతని భౌతిక దేహం 'వాయువు, ధూళి, కీటకములు' మొదలైన వాటిచే శిథిలం కావించబడి నేలకూలింది. కాని, చంచలమగు అతని మనస్సు మాత్రం వనములోని 'లేడి' లాగా అనేక చిత్ర విచిత్ర దశలను పొందుచూ పరిభ్రమిస్తూనే ఉన్నది. అది భోగముల అనుభవమునకు అఱ్ఱులుచాచుచూ, అనేక ఆకర్షణ వికర్షణలు పొందుచూ, అలసిపోయి ఉన్నది. ఒక చక్రములో చిక్కుకున్న పదార్థంలాగా జనన మరణములు, ఊర్ధ్వ అధోలోకములు మోసి మోసి చివరికి ఒకానొక ఉపాధితో సమంగానదీతీరం చేరి తపోనిష్ఠచే విశ్రాంతి పొందుతోంది.

తపస్సు ఉత్తమమైన మనో విశ్రాంతిని ప్రసాదించగలదు కదా!

ఆహాఁ! ఒక లోభి ధనసంపదల కొరకై పరుగులు తీస్తూ ఉంటాడు చూచావా? మన శుక్రుడు కూడా "మనోసంకల్పమార్గం"లో హుటాహుటిగా ప్రయాణాలు చేస్తూ,... తన శుక్రాచర్య ఉపాధిని విస్మరించాడు. తుచ్ఛము, వివిధ వృత్తాంత సంకలితము అయిన సంసారదశలను పొందాడు. అట్లు పొందినదంతా అత్యంత దృఢమైన దృష్టితో అనుభవించాడు.

❖

శుక్రుని భౌతికదేహం భృగువు యొక్క ఆశ్రమంలో సూర్యతాపమునకు ఎంతగానో శుష్కించింది. చర్మం మాత్రం మిగిలిందా... అని అనిపిస్తోంది. ఆ దేహము యొక్క రంధ్రముల నుండి గాలి ప్రసరించుచున్నప్పుడు 'సీ'...త్కారధ్వని వినిపిస్తూ ఉన్నది. 'అభిమానము దుఃఖము" మొదలైనవి కల్పించుకొని అనుభవిస్తూ ఆ శరీరంలో ఉండే జీవుడు ఇప్పుడు ఆ శరీరమునందు దృష్టి కలిగిలేడు కదా! "అభిమానం, దుఃఖం లేకపోవటం ఎంత ఆహ్లాదమైన విషయం..." అనే అర్థం వచ్చే ఈలపాట ఏదో ఆ శరీరం పాడుచున్నదా – అని వినేవారికి అనిపిస్తోంది. ఆ శరీరపు తెల్లటి దంతములు చూస్తే "ఈ దీనమైన మనసు సంసారారణ్యంలో ఎంతటి మూర్ఖురాలై సంచరిస్తోంది!" అని మనస్సును చూచి ఎగతాళి చేస్తున్నట్లున్నది. జనరహిత ప్రదేశంలో ఉండే నూతులను గుర్తుచేస్తున్న ఆ శరీరము యొక్క ముక్కుపుటములు, లోతు కళ్ళు మానవాళిని ఉద్దేశించి, "ఓ జనులారా! స్వభావపరంగానే శూన్యరూపమగు ఈ జగత్తు యొక్క అసద్రూపమును ఇప్పటికైనా, మమ్ములను చూచైనా...గ్రహించండి. వివేకం పొందండి. మూర్ఖులై మోహపరవశులు కాకండి" అని బోధిస్తున్నట్లు అనిపిస్తోంది.

ఆ శుక్రుని దేహం మొట్టమొదట సూర్యకాంతిచే ఎండిపోయింది. ఆ తరువాత వర్షజలముచే తడుపబడింది. వర్షజల బిందువులచే మిలమిలలాడుచున్న ఆ చర్మమాత్ర శరీరం "బంధు

రూపములగు తన యొక్క అనేక పూర్వ శరీరముల సంబంధములను తలచుకుంటూ అవి వస్తున్నందుకు, పోతున్నందుకూ ఆనందోల్లాసముచేతనో, లేక, దుఃఖాతిశయంచేతనో బాష్పములు రాల్చుచున్నదా?" అని అనిపిస్తోంది. ఆ విధంగా వర్షంలో తడుస్తూ శీతల వాయువులచే స్పృశించ బడుచు, ఎండకు ఎండుచూ పడివున్నది. ఆ దగ్గరలోని కొండల మీద నుంచి గాలికి ఎగిరిన ధూళి ఆ శరీరమును కప్పివేస్తూ ఉంది. మరల వర్షజలం ఆ ధూళిని తొలగించివేస్తూ ఉంది. ఫలితంగా చిత్రమైన ధూళి పొరలు ఆ శరీరంపై ఏర్పడ్డాయి. ఆ పొరలు ఒక పాపదూషితుని హృదయంలో పేరుకొని ఉండే అల్ప, తుచ్ఛ ఆశయపరంపరలను గుర్తు చేస్తున్నాయి. మరొకసారి ఎండగాలి వేగంగా ఆ శరీరమును తాకుతుంటే, ఏదో శబ్దం చేస్తూ అది ఎండు కట్టెవలె ఉండేది. ఇంతలోనే శరీర రంధ్రములు ద్వారా ప్రసరించు ఆ గాలిచేయు శబ్దము 'ఓంకార నినాదం చేయుచున్నది కాబోలు' అని భావింపచేస్తోంది. శుష్కించినట్టి వంకర టింకర ప్రేగులను ఆ శరీరము వీణగా మలచుకొని గానం చేస్తూ, ప్రాణులను భయపెట్టుచున్నట్టున్నది. లేదా, ఆ గానంచే వనలక్ష్మిని సంతోషింపచేసే ప్రయత్నంలో ఉన్నట్లున్నది.

❖

భృగుమహర్షి తపస్సు చేస్తున్న ఆ పుణ్యాశ్రమ ప్రదేశం రాగద్వేషరహితం. అతని తపః ప్రభావం ఆ పరిసరమంతా వ్యాపించియున్నది. ఆ కారణం చేత శుక్రుని దేహమును మృగములు గాని, పక్షులుగాని, సూక్ష్మకీటకములుగాని భక్షించుట జరుగనేలేదు. ఈ శరీరము ఇక్కడ ఇట్లు ఉండగానే శుక్రుడు తన మరొక కల్పిత శరీరంతో యమనియమాదులు ఆశ్రయిస్తూ సమంగానదీ తీరంలో ఏకాగ్రతతో తపస్సు చేస్తున్నాడు.

వాయువుచే శుష్కించిన అతని శుక్రదేహం యథాతథంగా శిలపై చిరకాలంగా పొర్లుతూ ఉండిపోయింది.

❖❖❖

4. స్వయంకృతం

ఆ విధంగా శుక్రుని దేహం ఎండకు ఎండుచూ, వానకు తడుస్తూ ఉండగా చాలా కాలం గడచిపోయింది కదా! ఒక రోజు మహాత్ముడగు భృగుమహర్షి పరమాత్మావబోధకమగు నిర్వికల్ప సమాధి నుండి లేచాడు. ఎదురుగా కుమారుని కోసం చూచాడు. అతడు కనిపించలేదు. "ఇది ఏమిటి? వినయముతో, నమ్రతతో సర్వగుణ సంపన్నుడైన నా కుమారుడు ఎప్పుడూ ఇక్కడే ఉండేవాడు కదా! ఇప్పుడు కనబడడేం?" అని కాస్త విచలితుడైనాడు. ఆశ్రమం నుండి బయటకు వచ్చి అటూ ఇటూ చూచాడు. "అభాగ్యమా!" అన్నట్లు, ఒక గండశిలపై కేవలం తన కుమారుని భౌతికదేహం మాత్రం కనిపించింది. ఆ మృతశరీరం మూర్తివంతమైన దారిద్ర్యమువలె శుష్కించి యున్నది. ఆ దేహము యొక్క రంధ్రములందు తిత్తిరిపక్షులు గూళ్ళు కట్టుకొని ఉన్నాయి.

శుష్కించిన ప్రేగులుగల అతని పొట్టభాగం యొక్క ముడతలలో కప్పపిల్లలు విశ్రాంతి తీసుకుంటున్నాయి. కనురెప్పచుట్టు క్రిమి కీటకాదుల తమ పిల్ల పాపలతో కాపురం చేస్తున్నాయి. వీటి నుండి ఇంకా ఇంకెన్నో కీటకములు ఉత్పన్నమై అభివృద్ధి పొందుతున్నాయి. పార్శ్వమువైపు ఎముకల మధ్య పట్టుపురుగులు గూళ్ళు కట్టుకొని, విస్తరింపజేస్తున్నాయి. జలధారలతో ధూళి యుక్తమైన ప్రేగులు శుష్కించిన ఎముకలను మాలగా ధరించియున్నట్లు అనిపిస్తున్నాయి. ఆ ప్రేగులలోని పొరలు జన్మజన్మలుగా జీవుని యందు పేరుకొని యుండే వాసనలను గుర్తుచేస్తున్నాయి. ముఖం తెల్లగా పాలిపోయింది. ముక్కు గోడకు దిగగొట్టబడిన మేకులా ఉంది. కంఠము ఊర్ధ్వముఖము కలిగి, తన ప్రాణములు ఆకాశంలో ఎక్కడ సంచరిస్తున్నాయో వెతుకుచున్నట్లున్నది. చర్మం మాత్రమే శేషించియున్న అతని పొట్ట అజ్ఞానియొక్క హృదయంలాగా శూన్యంగా కనబడుతోంది.

ఆ మృతదేహాన్ని చూచిన భృగుమహర్షి పుత్రశోకం పొందారు. ఒక్క క్షణంలో పూర్వాపరాలన్నీ మరచిపోయి లేచి నిలుచున్నారు. "ఏమిటిది? నా కుమారుడు మరణించి చాలా కాలమయినదా?" అని పెద్ద గొంతుకతో పలికాడు. 'నేను నా బిడ్డను కోల్పోయానా...' అనే భావం అతని హృదయమంతా వ్యాపించింది. మనసంతా వర్ణనాతీతమైన క్షోభకు లోను అయింది. మహాజ్ఞాని అయివుండి కూడా, పూర్వాపరము లను, ముందు వెనుకలను ఒక్కసారి మరచాడు.

ఆహాః! పుత్రవ్యామోహం ఎంతటిది! మహర్షి అంతటివాడిని కూడా కొద్ది క్షణాలు ముంచివేసిందే? ఆయన లేచి నిలబడి ఇట్లు ఎలుగెత్తి పలికాడు.

"ఓయీ! కాలపురుషా! యమధర్మరాజా! నా పుత్రుని ఎక్కడికి, ఎప్పుడు, ఎందుకు తీసుకొని పోయావయ్యా? అతడు నా కుమారుడని నీవు ఎరుగవా? సరే. ఈ భృగువు యొక్క తపోశక్తి ఏమిటో రుచి చూచెదవు గాక..." అని పలుకుచు శపించుటకు ఉద్యుక్తుడయ్యాడు.

❖

రూపరహితుడు, ప్రజలందరిని కాలానుగుణంగా మ్రింగివేయువాడు, కాలమే స్వరూపంగా గలవాడు అయిన కాలుడు ఇది గమనించాడు. అతడు స్వతహాగా రూపము లేనివాడే. అయిన ప్పటికీ, భృగుమహర్షి యొక్క సంతాపమును గమనించి భౌతిక రూపం ధరించాడు. ఖడ్గము, ఉరిత్రాడు ధరించి, శోభాయుక్తుడై కవచకుండలములచే ఒప్పుచూ ఆ కొండపై ప్రత్యక్షమైనాడు. పండ్రెండు నెలలు అతని భుజములుగా రూపము పొందాయి. ఆరు ఋతువులు అతని ముఖముగా మారాయి. దినములు అనే సేనతో అతడు సేవించబడుచు ఉన్నాడు.

అతని జ్వాలామయ దేహం ఆ పర్వతమును శోభింపజేసింది. అతని చేతిలోగల త్రిశూలపు అగ్రభాగము నుండి బయలుదేరిన అగ్ని సమూహాలు దిక్కులన్నింటినీ నింపివేస్తున్నాయి. అతని రాకచే గండశిలలు కంపించిపోయాయి. దిక్కులు పిక్కటిల్లాయి. అతని ఖడ్గము యొక్క ప్రకాశంచే సూర్యబింబమే శ్యామల వర్ణమయినది.

కోపంతో ఊగిసలాడుచున్న భృగువును సర్వసమవర్తి అయిన కాలుడు సమీపించాడు. ప్రళయానంతర ప్రశాంతసాగరమువలె గంభీర స్వరంతో శాంతియుతంగా ఇట్లు పలుకసాగాడు.

కాలుడు : హే భృగుమహర్షీ! మీరు స్వయముగా మహాజ్ఞానులు. ఈ లోకముల యొక్క యథార్థ స్థితి అంతా ఎరిగినవారు. 'పరము-అపరము'లను సంపూర్ణంగా దర్శించి యున్నారు. మీ సమగ్ర అవగాహనా స్వభావము వల్ల, ఒకవేళ ఇతరులు అజ్ఞానం చేత అపరాధం చేసి యున్నప్పటికీ, మీరు విమోహితులు కారు. ఇక ఏ అపరాధము చెయ్యనివారిపై కోపగించటమా? మహత్తరమైన తపస్సు చేస్తూ బ్రహ్మవర్చస్సుచే వెలుగొందువారు మీరు.

ఇక మేమంటారా 'నియతి'ని పాలించువారము మాత్రమే కదా! అందుచేత మీరు మాకు పూజ్యులు. మీకు నమస్కరించుచున్నాను. నా మనవిని శాంతంగా వినండి!

నిర్వికల్ప సమాధినిష్ఠులగు మీరు మీ ఉత్తమ కర్మాచరణముచే మాకు వందనీయులగు చున్నారు. అంతే గాని, ఈ నా సంభాషణ మీ శాపాదులకు భయపడి కాదు. మీరు ఒక్క క్షణం ఆగండి. కోపము, ఆవేశము, ఉద్వేగములను వదలి శాంతమును ఆశ్రయించండి. నేను చెప్పేది కాస్త వినండి.

మీరు మీ బుద్ధిని అల్పత్వమువైపు ప్రసరింపజేయుచున్నారు. అది ఉచితం కాదు. నిష్కారణంగా శపించి తద్వారా మీ తపస్సును వ్యర్థం చేసుకోకండి. ఎందుకంటారా? కాల స్వరూపుడనగు నన్ను ప్రళయకాల భీషణాగ్నులు కూడా దహించలేవు. ఇక మీ శాపం నన్నేం చేయగలదు చెప్పండి? ఇప్పటికే నేను అనేక జగత్తులను భక్షించాను. కోట్లకొలది రుద్రులను మ్రింగివైచాను. అనేక మంది విష్ణువులు నాచే గ్రసించివేయబడ్డారు. నాకు అవశ్యకమైనదేమి? అక్కర్లేనిదేది? ఓ మహాత్మా! మేము భోక్తలం. సర్వజీవుల అసంఖ్యాక ఉపాధులు మాకు భోజనము.

❖

అయితే ఒక్క విషయం. ఇదంతా స్వభావసిద్ధమగు నియతి మాత్రమే అయివున్నది. అంతే గాని, మేము ఇచ్ఛచేతనో, ద్వేషముచేతనో ఏదీ చేయుట లేదు. 'నియతి'కి వేరుగా ఇంకే నిమిత్తం నాచే ఏదీ చేయబడదు.

స్వయమూర్ధ్వంప్రయాత్యగ్నిః స్వయంయాంతిపయాంస్యధః ।
భోక్తారంభోజనంయాతి సృష్టించాప్యంతకః స్వయమ్ ॥ (సర్గ.10; శ్లో. 29)

అగ్ని సహజంగానే ఊర్ధ్వముఖంగా జ్వలిస్తుంది. నీరు పల్లమువైపు ప్రవహిస్తుంది. భోక్త వద్దకు భోజనం వచ్చిచేరుతోంది. నాశనశీలుడగు ఈ కాలుడు కూడా సృష్టి వద్దకు స్వయముగా వచ్చి చేరుకున్నాడు. నేను సమీపించని వస్తువంటూ ఎక్కడా ఏదీ లేదు. దీనికి ఇది అనుశాసనం. ఎవ్వరిని ఏమనగలం?

అయినా, మీకన్నీ తెలుసును కదా! మాయాకళంక రహితమైన దృష్టితో చూస్తే, దేనికి ఎవడు కర్త? ఎవడు భోక్త? మాయా దోషము నశించనట్టి దృష్టి కలవారికి మాత్రమే అనేకమంది కర్తలు,

అనేకమంది భోక్తలు కనిపిస్తున్నారు. మహాత్మా! "కర్తృత్వము, అకర్తృత్వము" ... ఈరెండూ కూడా కల్పితములే కదా! సమ్యక్ దృష్టి లేనివారికి మాత్రమే అవి స్వయంకల్పితమై ప్రాప్తిస్తున్నాయి.

సమ్యక్ దృష్టి గలవాని దృష్టిలో కర్తృత్వమెక్కడ? భోక్తృత్వమెక్కడ? ఆ రెండిటి నీడ కూడా వారికి కనబడుటలేదు.

చెట్లకు పూలు పూస్తున్నాయి, నశిస్తున్నాయి. అట్లాగే, లోకంలో ప్రాణికోట్లు అసంఖ్యాకంగా ఉత్పత్తి వినాశనములు పొందుచున్నాయి. ప్రతి ఒక్క ఉత్పత్తి వినాశనములు మధ్య ఏవేవో సంఘటనలు, అనుభవములు, మార్పు చేర్పులు ప్రదర్శితమగుచున్నాయి. అయితే ఈ జనులు అజ్ఞానం చేత కాల స్వరూపుడనగు నన్ను తప్పు పట్టుచున్నారు కాని, నిజానికి ఈ జీవుల ఆయా స్వయం కర్మవ్యవహారములే తమ వైచిత్ర్యమును ప్రదర్శిస్తున్నాయి. కర్మగతిని అనుసరించి ఆయా ప్రయోజనములు పర్యవసానంగా ప్రాప్తిస్తున్నాయి, సిద్ధిస్తున్నాయి. ప్రతి పర్యవసానము (Eventuality) వెనుక ఆయా శారీరక, మానసిక ప్రయత్నములే అంతర్లీనంగా దాగి ఉన్నాయి.

ఇప్పుడు చెప్పండి మీ కోపం ఉచితమేనా?

ఒకచోట తటాకం ఉన్నది. ఆ తటాకంలోని జలంలో నక్షత్రాదులతో కూడి 'ఆకాశం' ప్రతిబింబిస్తోంది. అట్టి ప్రతిబింబాకాశంలో చంద్రుడు కదులుచూ కనిపిస్తున్నాడు. నీటిలో కనిపిస్తున్న ఆ చంద్రుని చలనం సత్యమంటామా? అసత్యమంటామా? సత్యమనదలచుకుంటే, జలంలో చంద్రుడెక్కడున్నాడు? అసత్యమనదలచుకుంటే, చంద్రుని కదలికలు కనబడుచున్నాయే? "రెండూ కాదు. అది అనిర్వచనీయమనే చెప్పాలి" అని కూడా చెప్పబడుతోంది. భగవంతుడగు ఈ కాలుని సృష్టియందు, పరమార్థస్థితి దృష్ట్యా ఈ కర్తృత్వ, అకర్తృత్వములనబడే రెండూ కూడా సత్యములు కావు. కాని, వ్యవహార దృష్టిని రచిస్తున్నదెవరు? నేనా?... కానే కాదు. ఇదంతా నిర్వహిస్తున్నది మనస్సే. ఈ మనస్సే మిథ్యాభ్రమయందు తగులుకొని భ్రాంతి కారణంగా కర్తృత్వ, అకర్తృత్వములనబడే అనర్థకల్పనలు తనకు తానుగా నిర్మించుకుంటోంది. ఇదంతా కూడా "ఒక చోట ఒక త్రాడు దారికి అడ్డంగా పడి ఉంటే, ఆ త్రాడునందు పామును దర్శించుట వంటిదే"... అని అనక తప్పదు.

కనుక మహర్షీ! నేను దేనికీ కారణం కాదు. ఈ జీవుని యొక్క మనస్సే అన్నివేళలా, అంతటికీ కారణం. పదార్థ దృష్టిని ఆశ్రయిస్తున్న మనస్సు పదార్థత్వమునే పొందుతోంది. మహతత్త్వమును ఆశ్రయిస్తే మహతత్త్వము అనుభవమగుచున్నది. నేను కాలానుగుణంగా, "కార్య – కారణ వ్యవహారము నడిపించుట, ఇచ్ఛ ప్రయత్నములను అనుసరించి ప్రయోజనములను ప్రసాదించుట" మాత్రం చేస్తూ ఉంటాను. మీరు వ్యాకులమైన చిత్తము పొందినవారై, ఎట్టి అపరాధం చెయ్యనట్టి నాపై ఎందుకు కోపగిస్తారు చెప్పండి? అట్లు కోపగించటం ఉచితమే నంటారా? అట్లు చేయటం ఆపదలకు హేతువే అవుతుంది. అందుచేత, మరికొంత ఓపికపట్టి, విషయమంతా సమగ్రదృష్టితో, సత్యదృష్టితో చక్కగా ఇంకొక్కసారి అవలోకించమని ప్రార్థిస్తున్నాను. అంతేగాని, చెప్పునది పరిశీలించకుండా ఆవేశపూరితులు మాత్రం కావద్దు.

నియతి, దృష్టి - పూజ్యుడవగు ఓ మునిసత్తమా! మేము చేస్తున్న ఈ సృష్టి-స్థితి-లయ మొ॥ కార్యములు ప్రతిష్ఠ కొరకో, లేక ఇష్టము అనుసరించో చేస్తున్నామా? లేదు. దురహంకారులమై మేము ఏదీ చేయుటలేదు. ఎట్టి 'అభిమానము' అనునది లేకుండానే, కేవలం నియతిని పాలించుచు, స్వవశముననే ఉండి ఉన్నాము. ఇప్పుడు ఈ భౌతిక – దేహం స్వీకరించటం, మీ వద్దకు ఇట్లు రావటం, ఈ విషయ విచారణ చేయటం... ఇదంతా "తాపసులను సన్మానించుట" అను 'నియతి'ని పాలించటానికే అయివున్నది. అంతేగాని కోప శాపాదులకు భయపడో, లేక కీర్తి మొదలైనవాటి కొరకో మాత్రం కాదు. బుద్ధిమంతులైన వారు జగన్నియామకుడగు ఈశ్వరుని ఇచ్ఛారూపమైనట్టి 'పరమోత్తమ నియతి'ని అనుసరించే వ్యవహరిస్తారు. ఇక అజ్ఞానులగు జనులో, అభిమానగ్రస్థులై మరల మరల తమోగుణములను ఆశ్రయిస్తూ, అట్టి 'నియతి'ని దూషించటానికో, అపరిపక్వ దృష్టిచే దుఃఖాదులు ఆశ్రయించటానికో వృథాప్రయాసపడుచూ ఉంటారు. కాని ఏం లాభం? ఎవరేమి నిరోధించగలరు చెప్పండి!

మహర్షీ! మీరు సర్వజ్ఞులు. ఇప్పుడు జ్ఞానదృష్టితోనే అంతా పరిశీలించండి! మహాత్ములగు వారిచే సర్వవేళల సేవించబడే సుప్రసిద్ధ మార్గమున ఉన్నట్టి మీ అంతటివారు అజ్ఞులవలె ఏల మోహితులగుచున్నారు? కర్మపరిపాకముచే సువ్యక్తమగుచూ కనిపిస్తూ ఉన్న స్థితి గతులను విచారించకుండా మూఢునివలె నన్ను శపించాలని మీకెందుకు అనిపిస్తోందో చెప్పండి.

ద్వితీయ దేహం - మీరు ఎరిగియున్న విషయాలే అయినప్పటికీ, సందర్భం వచ్చింది కాబట్టి చెప్పుచున్నాను.

ఈ ప్రాణి కోట్లలోని ప్రతి ఒక్కరికి రెండు దేహాలు ఉన్నాయి-

1. స్థూలదేహము 2. మనోదేహము

ఈ రెండింటిలో స్థూలదేహము జడమైనది. ఇది స్వల్పకారణంచేత కూడా నశించే స్వభావం కలిగి ఉన్నది. ఇక ఈ మనస్సు ప్రాతిభాసిక స్వభావము కలిగియున్నది. ఒక దర్పణము ఆయా దృశ్యములను తనయందు ప్రతిబింబింపజేయు లక్షణము కలిగియున్నట్లే, ఈ మనస్సు కూడా తన యందలి భావనను అనుసరించి విషయములను కలిగి ఉంటోంది. అట్టి ప్రతిబింబ స్వభావ మాత్ర మగు (merely Reflective by nature) ఈ మనస్సు స్థూలదేహ నాశన మాత్రం చేత నశిస్తుందా?... లేదు. ఈ జీవుడు మోక్షము పొందనంతవరకు మనస్సు నశించకయే ఉంటోంది.

ఇప్పుడు చెప్పండి. మీరు కోపగించటానికి కారణం మీ కుమారుని స్థూలదేహం పొందిన మార్పులకా? లేక మనోదేహము పొందిన స్థితిగతులకా? అతని మనోవ్యాపారము ఆశ్రయించిన ఆయా దుష్ట విషయములకు కారకుడను నేనా చెప్పండి? ఓ సాధు పుంగవా! మంచి చతురత గల సారథికి ఒక రథము ఇస్తే ఆ రథమును అతడు తన రకరకాల విన్యాసములతో నడుపుచుండగా, ఆ రథములోని సారథిని చూడని ఒక అమాయక బాలుడు, 'ఈ రథమే ఇట్లు చమత్కారంగా కుడి ఎడమలకు తిరుగుతోంది" అని అనుకొంటాడు... చూచారా? అట్లాగే ఈ జీవునియందు వాక్కుకు

అగోచరమై, అభిమానముతో కూడినదై ఒక అంతరంగ వ్యాపారము (Inner - Activity) ఉండి ఉన్నది. అట్టి అంతరంగ వ్యాపారమే ఈ మనస్సు. ఒక బాలుడు మట్టితో బొమ్మ తయారు చేసి, ఆయా అలంకారాలు అమర్చి ఇంతలోనే దానిని మట్టి ముద్దగా చేసి మరొక బొమ్మను చేస్తూ ఉంటాడు చూచారా? ఈ మనస్సు కూడా భవిష్యత్ శరీరములను సంకల్పించుచు పూర్వ శరీరములను నశింపజేయుచున్నది.

"ఇష్టము-మననము-క్రియ'ల సమన్వయమే "చిత్తము."

చిత్తమే పురుషుడు, అంతేగాని ఈ స్థూలదేహము పురుషుడు కాదు.

చిత్తం చేత ఏది నిర్వర్తించబడుచున్నదో, అది మాత్రమే "కార్యం" అని అనిపించుకుంటోంది. ఈ చిత్తము అవిచారణ కారణంగా అసద్వస్తువులను గూర్చిన సంకల్పముచే బంధించబడుతోంది.

అట్లు సంకల్పించకుండా, 'మౌనం' వహించి యుండుటయే (సంకల్పరాహిత్యమే) 'ముక్తి' యొక్క స్వరూపం.

ఈ జీవునిపట్ల - "ఇది నా దేహము. ఈ దేహమే నేను. ఇందులో ఈ అవయవములు ఇక్కడ ఉన్నాయి. నేను ఈ అవయములచే పరిమితుడను"... ఇలా వికారవంతములైన అనేక కల్పనలను చేస్తూ పోతున్నది ఎవరు? నేనా?... కానేకాదు. ఈ మనస్సే సుమా! మనస్సే ఒక 'జీవ శరీరము' నుండి మరొక 'జీవశరీరము'ను పొందుచున్నది. మనస్సుచే ఏ వస్తువు సంకల్పించ బడితే, దానికి అనుకూలంగా బుద్ధి (Discriminative faculty) ఉదయించుచున్నది. అదే మార్గంలో "నేను చేయుచున్నాను" అను రూపముగల అహంకారము కూడా ఏర్పడుచున్నది. ఇట్లు మనస్సే వివిధ రూపములను ధరించుట జరుగుతోంది.

"నేను అఖండుడను" - అంతరంగమున ఏర్పరచుకొనియున్న "దేహమునకు సంబంధించిన వాసనలు" కారణంగా ఈ చిత్తము తన ఇచ్ఛానుసారం అవిద్యాపూర్వకంగా "నేను-నా శరీరం-నీవు-నీ శరీరం-నా వారు-నాకు సంబంధించిన శరీరములు - పరాయివారు, శత్రువులు... వారి వారి శరీరములు" ఈ రీతిగా ఏదేదో స్వప్న సదృశ దృశంగా ఆస్వాదిస్తూపోతోంది. ఇట్లు వేరు వేరైన పార్థివ శరీరములను గాంచుచున్నది చిత్తము (లేక) మనస్సే. ఈ మనస్సే మరొకప్పుడు సత్యవస్తు సాక్షాత్కారంచే అసత్యమగు ఈ దేహభావమును త్యజించి పరమశాంతిని పొందుతోంది. మనస్సు యొక్క ఈ దేహాదులను గురించిన కల్పన" - ఆత్మసాక్షాత్కార ప్రాప్తి పొందనప్పటి సమయంలో మాత్రమే అనుభవమవుతోంది.

ఆత్మసాక్షాత్కారం, ప్రాప్తించిందా.... ఇక "నేను దేహమును, మానవుడను, జీవుడను..." అను రూపము గల తుచ్ఛ మననము ఉండదు.

"నేను ఈ దేహములో స్ఫురించే ప్రజ్ఞాతత్త్వమునే గాని, దేహమాత్రమును కాదు. బాహ్యమున (by perceiving things and matters) అంతరంగమున (మననము, బుద్ధి మొదలైన వాటి రూపమున) కూడా ప్రసరించియున్నది నేనే. ఈ పంచభూతములకు అతీతమైన రూపము కలవాడనగు నన్ను ఒక దేహము పరిమితము చేయగలదా?... లేదు.

ఈ శరీరము పరిమితమైనది కావచ్చు.... నేను అపరిమితుడను.

ఈ శరీరం ఖండమైనది కావచ్చు.... నేను అఖండుడను.

సర్వ దేహములందు ఒకే రీతిగా ప్రజ్జ్వలించుచు తాను ఏ క్షణమందును "మరొకటి" కాకుండానే ఉండి ఉంటున్నట్టి 'ఆత్మవస్తువు'ను నేను. ఆత్మయే నా నిజస్వరూపం. నిత్యాత్మ స్వరూపడనగు నాకీ బంధమేమి? మోక్షమేమి? ఇవన్నీ ఎప్పుడూ లేవు!" ... ఇట్టి మననము స్వీకరించబడినప్పుడు అతడు మననరహితమగు 'స్వసత్త'గానే శేషించుచున్నాడు.

❖❖❖

5. స్వీయ - మనోరథ మార్గం

కాలుడు: హే మహర్షీ! ఇప్పుడు మీకుమారుడగు శుక్రుని మనోవినోద సంచారం గురించి వినండి.

మీరు నిర్వికల్ప సమాధి యందు ఉండగా మీ కుమారుడు శుక్రాచార్యుడు మనస్సునందే 'స్వమనోరథ' మార్గంలో అత్యంతదూరం పయనించియున్నాడు. ఈ స్థూల దేహమును ఇక్కడే వదలి, మనోదేహముతో, ఒక గూడు విడచిన పక్షిలాగా దేవతా నివాసమగు స్వర్గమునకు చేరాడు. అక్కడ 'విశ్వాచి' అనే పేరుగల అప్సరసతో కొంతకాలం గడిపాడు. ఆ సమయంలో అతడు విశ్వాచి తో కూడుకొని పర్వతములందు, పూలతలమధ్య ఉద్యానవనములందు, లోకపాలుర నగరము లందు విహరించాడు. చాలా కాలం గడిపోయింది. వాసనలతో కూడుకొనిన తీవ్ర సంకల్పముల ప్రభావంచే, "ఇప్పటికే నా పుణ్యమంతా క్షయించిపోయింది" అను రూపంగల భావనాపటిమ అతని యందు రూపుదిద్దుకొన్నది. పండిన పండు చెట్టు నుండి నేల రాలే విధంగా అతడు కూడా 'అప్సరస'తో సహా ఛిన్నాభిన్నములయిన చేతులు కాళ్ళు కలవాడై భూమిపై పడ్డాడు.

ఆ విధంగా దేవశరీరమును ఆ దేవలోకంలోనే త్యజించి, 'భూతాకాశము' ను పొంది భూమిపై జన్మించాడు. మొట్టమొదట దశార్ణవదేశంలో బ్రాహ్మణుడుగాను, ఆ తరువాత కోసల దేశానికి రాజుగాను, అటుపై ఒక మహారణ్యంలో బోయవాడుగాను, ఆపై, గంగా నదీతటంలో హంసగాను జన్మించాడు. సూర్యవంశంలో జన్మించి పుండ్రదేశానికి రాజు అయ్యాడు. తదనంతరం శాల్వదేశంలో మంత్రోపాసకుడగు 'ఉపదేష్ఠ'గా జన్మించాడు. అట్టి మంత్రములను ఆశ్రయించుట చేత ఏర్పడిన ఔన్నత్యముచే ఆ తరువాతి జన్మలో విద్యాధరుడైనాడు.

ఆ తరువాత 'మద్ర'దేశమునకు రాజై పుట్టాడు; వానప్రస్థాశ్రమం స్వీకరించాడు. ఆ తరువాత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి 'వసుదేవుడు' అనే పేరుతో సమంగానదీ తీరంలోగల ఒక ప్రదేశం జేరాడు.

❖

ఇప్పుడు నేను చెప్పినవే కాకుండా నీ పుత్రుడు వాసనావశంచేత అనేక భయదాయకమైన జన్మలలో పరిభ్రమించాడు. ఒకసారి కైకటదేశంలో కిరాతకుడుగాను, తరువాత "సౌవీర" దేశానికి

అధిపతిగాను జన్మించాడు. ఆ రాజజన్మలో అనేక పాపకార్యములు చేసియుండటం చేత త్రిగర్త దేశంలో ఒక గాడిదగాను, కిరాతదేశంలో ఒక లతగా కూడా పుట్టాడు. 'జలగల' అనే పేరుగల మరొక దేశంలో మృగమై జన్మించాడు. ఇంకా, ఒక తాడిచెట్టులో పసిరిక పాముగాను, తామల పాకులతోటలో ఒక ఉడుతగాను జన్మలు పొందాడు.

ఒకసారి మీ కుమారుడు మంత్రవేత్తలలో మహాశ్రేష్ఠుడై జన్మించాడు. 'విద్యాధరనగరం'ను పొందింపజేయగల విద్యను మననం చేసి, తద్ద్వారా విద్యాధరుడు అయ్యాడు. అక్కడ ఒక ఉత్తమ మైన విద్యాధరుడుగా ప్రకాశించుచుండగా, కొంతకాలానికి కల్పాంతమునందు ద్వాదశాదిత్యులు లోకములను తపింపజేయుచుండగా, ఆ ప్రళయాగ్నిలో అతడు భస్మీభూతుడైనాడు. అప్పట్లో మన శుక్రుని యొక్క వాసన గూడు విడచిన పక్షిలాగా 'జగద్రచన' అనునదే లేనట్టి శూన్యమగు విశాలాకాశంలో పరిభ్రమిస్తూ ఉండేది. కొంతకాలానికి ఆ "బ్రాహ్మీరాత్రి" గడచిపోయింది. విచిత్రకార్యారంభంతో జగత్ నిర్మాణం ప్రారంభమైంది. అప్పుడు మీ కొడుకు సూక్ష్మవాసనలచే ప్రేరితుడైనాడు. మరల ఏవేవో జన్మలు పొందాడు. ఇప్పుడిక...,

భూమిపై ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు. వేదములు మొదలైనవి బాగా అర్థ సమన్వితముగా అధ్యయనం చేసి బుద్ధిమంతులలో ఉత్తముడుగా ప్రసిద్ధి పొందాడు. 'వాసు దేవుడు' అను పేరుతో పిలువబడుచూ, అతడు బంధుమిత్రులను త్యజించి పూర్వ సంస్కారముల ప్రోద్బలం చేత సమంగా నదీతీరం చేరాడు. ఒక ఆశ్రమం నిర్మించుకొని ఏమీ తెలియనట్లే, హాయిగా తపస్సు చేసుకుంటున్నాడు.

చూచారా మునీంద్రా! మీ ప్రియపుత్రుడు శుక్రాచార్యుడు అనేక రకములైన విషయ వాసనలచే ప్రేరితుడై భిన్న లోకాలలో, పర్వత స్థలాలలో, వనాలలో భిన్న ఉపాధులు పొందాడు. అతి భీకరములైన అరణ్యములలో వృక్షము-లత మొదలైన జన్మలు అనుభవించాడు. ఇప్పటికి ప్రశాంతుడై సమంగానది ఒడ్డున తపస్సు చేసుకుంటున్నాడు. జటాధారియై రుద్రాక్షమాలను ధరించి, సర్వ ఇంద్రియములకు సంబంధించి భ్రమలన్నీ త్యజించి వేసి స్థిరచిత్తముతో ధ్యానం చేస్తున్నాడు. అయితే, అతడు ఈ శుక్రాచార్య ఉపాధికి సంబంధించిన 'తండ్రి'యగు మిమ్ములను ఏమాత్రం స్మరించటం లేదు. ఇప్పుడు, మీరు ఆ జీవుని దృష్టిపథం లోనే లేరు.

❖❖❖

6. సంసార ప్రవృత్తి చమత్కారం

సర్వలోకములకు ఈశ్వరుడు, సమదృష్టి కలవాడు అయినట్టి కాలభగవానుడు అట్లు పలికి మౌనం వహించాడు. అప్పుడు భృగు మునీంద్రుడు తన జ్ఞాననేత్రంతో పుత్రుని వ్యవహారమంతా పరిశీలన చేయసాగాడు. విశుద్ధమైన తన "బుద్ధి" అను దర్పణమునందు తన యొక్క ధ్యాన ప్రభావం చేత, యోగమహిమ చేత ప్రతిబింబించినట్టి తన పుత్రుని సమాచారమంతా

కొద్దిక్షణములలో ప్రత్యక్షంగా చూచాడు. శరీరదృష్టిని వీడి, సూక్ష్మశరీరంతో సమంగా నదీతీరం వెళ్ళి పుత్రుని స్వయంగా చూచి, తిరిగి కాలుని సమ్ముఖంలోగల స్వశరీరంలో ప్రవేశించారు. క్షణంలో పుత్ర వ్యామోహం అతనిని వీడిపోయింది. అత్యంత ఆశ్చర్యంతో చిరునవ్వు నవ్వుచూ, ఉత్తమ దృష్టితో కూడుకున్నవాడై వీతరాగుడగు కాలునితో ఇట్లు పలుకసాగాడు.

భృగుమహర్షి : భూత-భవిష్యత్-వర్తమానములకు ప్రభువగు ఓ మహాత్మా! కాలదేవా! మేము మలినచిత్తులం, బాలురవంటివారం. చూచారా! ఒక్క క్షణంలో అజ్ఞానం నన్ను ఆవరించివేసింది కదా! మీవంటి మహాత్ముల దృష్టి త్రికాలములందలి వృత్తాంతమంతా స్పష్టముగా గాంచుచూ, మౌనము, సమగ్రము అయిన అవగాహన కలిగి ఉంటోంది. ఇక మేమో, తపో ధ్యానాదుల వలన కలిగిన శక్తిచే అంతా గ్రహించగలం. కాని ఏం లాభం? అన్ని వైపులా దృష్టి సారించలేక పోతున్నాం. కించిత్‌కే (కొంచెమునకే) మా దృష్టి చాంచల్యమును పొందుతోంది. ఈ జగత్ స్థితి అంతా మిథ్యారూపమే అయినప్పటికీ ఇదంతా అనేక విధాలైన వికారములతో కూడి "నిజమేనా!" అన్నట్లుగా ప్రాప్తిస్తోంది. మా యందు ఒక్కొక్క సమయంలో అనేక భ్రమలను ఉత్పత్తి చేస్తోంది.

ఓ కాలస్వరూపా! మీ అంతరంగమున ఏమున్నదో మీకే తెలుస్తుంది గాని, మరింకెవ్వరికీ తెలియదు. ఇక మా విషయానికి వస్తే, ఈ మనస్సు అనేక వృత్తిరూపములను పొందుతూ, మాయ చేత విమోహితం అగుచున్నది. నా కుమారుడు శుక్రాచార్యుడు ఈ కల్పాంతము వరకు జీవించ వలసియున్నది. ఈ విషయం నాకు తెలుసు. కాని అతడు మరణించటం గమనించగానే నేను విచలితుడనై భ్రమను పొందాను. "జీవితం పరిసమాప్తి కాకపోయినప్పటికీ ఈ కాలుడు నా కుమారుని తన వెంట తీసుకొనిపోయాడే?" అను అల్పబుద్ధి ఎందుకో నాకు కలిగింది. అనేక మంది గురువులచే బోధించబడి, స్వవిచారణాదుల ప్రభావంచే ఈ ప్రపంచము యొక్క స్థితి గతులను ఎరిగియే ఉన్నప్పటికీ, కించిత్ 'ప్రమత్తత' కారణంగా మేము ఈ సంపద, ఆపదలు కలుగజేసే హర్ష, శోకములకు వశీభూతమై పోతున్నాం.

మీకు తెలియనిదేమున్నది? 'అయుక్తం ఆచరించువాని వల్ల కోపం, 'యుక్తం' ఆచరించు వాని పట్ల ప్రసన్నత్వము కలిగియుండుట" అయినట్టి ఒక స్వభావం, లేక, నియతి లోకంలో ఉండి ఉన్నది కదా!

"ఇది చెయ్యాలి. ఇది చేయకూడదు" అను ఇష్ట - అయిష్ట - నిర్దేశ్య - అనిర్దేశ్యముల పట్ల సత్యత్వబుద్ధి ... ఉన్నంతవరకూ 'స్వభావం' అనబడేది దృఢంగా ఉండియే తీరుతుంది.

హే జగద్గురూ! హేయమగు అట్టి భ్రమను ఇప్పుడు త్యజించి వేయుచున్నాను. మీ అభిప్రాయములన్నీ పరిశీలించిన తరువాత నా కోపం పటాపంచలైంది. ఏది ఏమైనా, భగవత్ స్వరూపులగు మీ పట్ల దురుసుగా ప్రవర్తించటం తప్పే. మీరు చెప్పినదంతా విన్న తరువాత నేను సూక్ష్మదేహంతో నా కుమారుని సమంగానది ఒడ్డున చూచివచ్చాను.

మహాత్మా! ఈ లోకమున సమస్త ప్రాణులకు మనస్సే రెండు శరీరములను ఉత్పన్నము చేయుచున్నది. వాస్తవానికి ఈ మనస్సునందే జగత్తు అంతా ఉత్పన్నమగుచున్నది.

కాలుడు : మహర్షీ! మీరు చెప్పినది అక్షరాలా నిజం. మనస్సే జీవునకు ముఖ్యదేహం కాని, ఈ భౌతికమైన రక్త-మాంస నిర్మిత శరీరం ముఖ్యమైన విభాగం కాదు. కుమ్మరివాడు తనలోని ఆలోచనలకు ఒక రూపమును ఇచ్చి అనేక ఆకారములలో కుండలను, మూతలను తయారు చేస్తున్నాడు కదా! ఈ మనస్సు కూడా అట్లే తన సంకల్పముచే ఈ భౌతిక దేహములను నిర్మించుకొనుచున్నది.

అజ్ఞానవశంచేత బాలుడు 'భూతము' అనబడుదానిని కల్పించుకొని, మరల పెద్దల తోడు పొందినప్పుడు ఆ భూతము అను భావనను, భయాదులను నిర్మూలించుకుంటూ ఏడ్చుచూ ఉంటాడు చూచారా?

తనకంటూ ఎట్టి ఆకారమూ లేకపోయినప్పటికీ, ఈ మనస్సు తనయొక్క "సంకల్పించుట" అను వ్యవహారదక్షతచే ఈ భౌతిక దేహములను, లోకములను సంబంధ బాంధవ్యములను, ప్రియాప్రియములను, ఆశ్చర్య-సామాన్యములను నిర్మించుకుంటోంది. మరల ఇంతలోనే నశింప జేయుచున్నది. ఎంత చమత్కారమైన క్రీడ ఇది!

ముందుగా అనుకోకపోయినప్పటికీ, స్వప్నంలో అనేక దృశ్యాలు ప్రాప్తిస్తున్నాయి చూచారా? మిథ్యాజ్ఞానము కలిగియున్నపుడు ఏవేవో అభిప్రాయాలు ఆక్రమించివేయుటచే అసత్యములు సత్యములవలె భ్రమింపజేస్తూ ఉన్నట్లు,! 'సంభ్రమం'లో ఉన్నవాడు ఎదుటివాడు చెప్పే విశ్లేషణను వినిపించుకోనట్లు, ఈ మనస్సు తనయందు "మిథ్యారచన చేయుట" అను ఒక విచిత్రమైన స్వభావము కలిగి ఉంటోంది. అట్టి స్వభావమే సత్యమును మరుగుపరుస్తోంది.

ఓ మునీంద్రా! ఈ జీవుడు "మనస్సు", "భౌతికదేహము" అను రెండు వేరువేరైన విషయ ములు కలిగి ఉంటున్నాడు. ఈ రెండు తత్త్వములు ఉండి ఉంటున్నాయనే విషయం లౌకిక పరిశీలనా మాత్రం చేత (అనగా, గొప్ప వేద-వేదాంత జ్ఞానం లేకుండా కూడా) గమనించవచ్చు. ఈ విషయం స్థూలదృష్టికి కూడా సుస్పష్టంగా తెలుస్తూనే ఉన్నది. అయితే అట్టి స్థూలదృష్టిని ప్రక్కకు పెట్టి సూక్ష్మ దృష్టితో కనుక చూస్తే "స్ఫురణరూపమగు మనస్సు మాత్రమే కలదు" అనే విషయం స్పష్టమగుచున్నది. ఏ సమయంలోనైనా సరే, సత్, అసత్‌ల రెండింటికీ విలక్షణమై మహా విశాలమైనట్టి ఈ మనస్సే ఆవిర్భావం చెందుతోంది. అటూ ఇటూ సంచరిస్తూ మరొకప్పటికి తన లోనికి తానే తిరోగమిస్తుంది. ఈ ముల్లోకములు మనస్సు యొక్క రచనా చమత్కారమే. చాలా దూరం ప్రసరించియున్న కొమ్మలు, ఆకులు మొదలైనవన్నీ మట్టి వృక్షముయొక్క అవయవములే కదా! ఈ పలువిధాలుగా కనిపించుచున్న భేదవ్యవహారసరళి అంతా చిత్తం యొక్క అవయవాలే. మనస్సు తనయందు భేదవాసనల ప్రభావంచేతనే ఈ పదార్థముల సమూహమునంతా ఈ విధాలుగా గాంచుచున్నది.

దూదియే వస్త్రము అగుచున్నది. వస్త్రములో దూదికి వేరైనదంటూ ఏమున్నది?

తరంగమునందు నీటికి వేరుగా ఇక ఉన్నదేది?

మట్టి – మట్టి కుండ వేఱు వేఱా? కాదు. అయితే అనేక కుండలను చూస్తూ, చిన్న, పెద్ద కుండలు దర్శించటం మట్టిదృష్టిని వదలి ఆకారదృష్టిని ఆశ్రయించుట చేతనే కదా!

ఈ మనస్సు కూడా సరిఅయిన అవగాహన పొందనంతకాలం భిన్నత్వమునే దర్శిస్తోంది. “ఆహాఁ! నేను దుర్బలుడను, దుఃఖిని, అజ్ఞానిని” అని భావించుచున్నది. తన వికల్పముల వలన ఉదయించి భావనలచే నియమించబడి, ఈ మనస్సు జీవత్వమును పొందుతోంది.

భృగుమహర్షి : అవును. ఈ మనస్సు యొక్క భావనలకు, స్వయంకల్పితమైన రుగ్మతలకు అంతూ పొంతూ లేకుండా పోతోంది.

కాలుడు : అయితే మహర్షీ! ఈ మనస్సుకు ప్రాప్తించేదంతా ‘స్ఫురణ’ లేక ‘భావన’ మాత్రమే కదా!

భావించుట చేత మాత్రమే (లేక, ఊహించుట చేత మాత్రమే) స్ఫురించేది సత్యమెట్లా అవుతుంది? “ఈ మనస్సును త్యజించుట లేక జయించుట ఎట్లా?” అను ప్రశ్నకు ఉపాయం ఏమిటో చెపుతాను. “నేనీ రూపమునే కాదు. మనస్సు యొక్క స్ఫురణ కూడా నేను కాను. సర్వ స్ఫురణలకు ఆవలఉన్న నిత్యోదిత చైతన్యతత్వమే నేను” అనునట్టి నిరంతర ఉత్తమభావనచే ఈ తుచ్ఛ మనస్సు జయించివేయబడగలదు. అల్పత్వమును ఆశ్రయించు మనోవిభాగము త్యజించ బడగా, అప్పుడు శేషించు మనన శీలత్వమునకు నియామకమైన ‘మహామనస్సు’ సనాతనము, శాంతము, అఖండము అని మేము గ్రహించుచున్నాము.

ఈ మనస్సు గురించి దృష్టాంతపూర్వకంగా మరికొన్ని విశేషాలు చెపుతాను. వినండి.

సముద్రము, తరంగాలు - ఒక సుప్రసిద్ధమైన మహాసముద్రం ఉన్నది. అది అసంఖ్యాకమైన తరంగములతో శోభాయమానమైయున్నది. ఆ తరంగాలు లేస్తున్నాయి. శమిస్తున్నాయి. అయితే ఏం? ఆ సముద్రం ఎచ్చట నుండి వచ్చుటలేదు. ఎచ్చటికీ పోవుటలేదు.

ఆ మహాసముద్రం అన్నివైపులా ఒకే జలం కలిగియున్నది. సమము, శుద్ధరూపము, స్వచ్ఛము, స్వాదుజలమయము కూడా అయివున్నది.

కల్పాంతము వరకు ఆ సముద్రం అట్లే ఉండి ఉంటోంది. ఆ సముద్రం అక్కడ ఉండి ఉండటానికి ఎవ్వరూ కారణం కాదు. అది “స్వమహిమ” యొక్క అతిశయం చేతనే అచ్చట ప్రతిష్ఠితమైయున్నది.

అట్టి మహాసముద్రంలో అనేక తరంగాలు ఉన్నాయి. అందులో కొన్ని చిన్న తరంగాలు.

ఆ చిన్న తరంగాలు, తమయొక్క స్వభావవశంచేత “నేను చిన్న తరంగమును హ్రస్వమును ఎత్తు పల్లములే నా స్వరూపం,” అను భావనచే నిజరూపమును ఏమరచుచున్నాయి.

మరికొన్ని అతి దీర్ఘమైన తరంగాలు. అవి తమ స్వభావాన్ని అనుసరించి “మేము చాలా పొడవైన తరంగాలము” అని వికల్పన చేస్తున్నాయి.

కొన్ని కెరటాలు “అదిగో, ఇక నా వినాశనం దగ్గరపడినట్లే” అని తలంచుచు పతన భయం

వల్ల పతనమునే భావించుచు అట్టి భావనచే తీరప్రదేశంవైపు పోవుచున్నాయి. స్వల్ప కాలమైన తరువాత మరల ఆవిర్భవించి "అవును ఇప్పుడు మేము భోగములు పొందుటకు అనుకూలమైన స్థానములను, స్థితిగతులను పొందుచున్నాము" అని అభిమానించుచున్నాయి.

ఈ వ్యవహారమంతా దైవవశం చేత మహావిశాలమై, దేదీప్యమానమై శోభించటం జరుగుతోంది.

కెరటములతో పోల్చదగిన అనేక ఉపాధులందు కనిపించే అహంభావమే ఈ జగత్తు యొక్క రూపం. అట్టి అహంభావ మహాసముద్రంలోని ఒక కెరటం చంద్ర బింబమున ఉపాధి రూపంలో ఉండి "ఇప్పుడు నేను శీతలముగా ఉన్నాను" అని అభిమానిస్తోంది. మరొక అహంకార కెరటం దావాగ్ని యందు ప్రకాశవంతమగు దేహము కలిగి, ప్రతిబింబముతో కూడినదై, "నేను దహించ బడుచున్నాను" అని తలచుచు భయమును పొందుచున్నది. మరల ఎప్పుడో మౌనము వహించి ఉంటోంది.

ఒక జలకెరటం ఒకచోట తనలో చంద్రుని, నక్షత్రములను ప్రతిబింబింపజేస్తోంది. మరో కెరటం మరొకచోట పర్వతాలను, వృక్షాలను, వాటి ఫలాలను తనలో ప్రతిబింబింపచేస్తోంది.

❖

ఈ అహంకారము ఒక ఉపాధియందు ప్రవేశించి, ఒక సమయంలో "నేను ఇప్పుడు రాజు నయ్యాను. కనుక కృతార్థుడను" అని సంతోషము పొందుతోంది. గాలి వీచగా తరంగం విధ్వంస మగుచున్నట్లు, ఆ భ్రమవంతమైనట్టి ఉపాధి, తదితర సంబంధిత విషయములు విధ్వంసమగు చుండగా, ఆ జీవుడు "అయ్యో! నేను ఖండ ఖండములయ్యానే!" అని అరచుచు రోదించుచున్నాడు.

ఓ మహర్షీ! ఈ కెరటములలో ఎంతటి తతంగమంతా జరిగిపోతోంది! ఎక్కడో లేస్తున్నాయి. ఒకదానితో మరొకటి కలిసి ప్రయాణిస్తున్నాయి. ఒకదానితో మరొకటి ఢీకొంటూ ఛిన్నాభిన్నమై పోతున్నాయి. అయితే యథార్థానికి ఈ తరంగములన్నీ జలముకంటే వేరు కాదు కదా! 'తరంగములు' అనబడునవి జలమునకు వేరుగా బాహ్యము నుండి ప్రాప్తించుటలేదే! అందుచేత, ఈ తరంగములు జలసమూహరూపమైనట్టి మహాసముద్రము కంటే వేరైనవని అనటం ఎట్లా?

అందుకే, "తరంగములకు 'సత్' మయమైన, (లేక) 'అసత్' మయమైన ముఖ్యరూపమే లేదు" అని అంటూ ఉంటారు.

కాని, "సముద్రంలో తరంగములనునవి లేవు. జలమే ఉన్నది" అని అనవచ్చునా? మరి తరంగములు లేస్తున్నాయి. కనబడుచున్నాయి కదా!

భృగుమహర్షి : హే కాలస్వరూపా! మీరు మహత్తరమైన విషయమునే విశదీకరిస్తున్నారు. "జ్ఞానదృష్టి" యొక్క సువ్యక్తతకొరకు అడుగుచున్నాను. ఇంతకీ జలంలో తరంగాలు ఉన్నాయి అని అంటారా? లేవని అంటారా?

లేక 'బ్రహ్మము-జీవులు' దృష్ట్యా చెప్పాలంటే, బ్రహ్మమునందు కనబడే ఈ 'నీవు-నేను -అతడు" అను రూపములుగా తోచే ఖండితాహంకారలు వేరువేరుగా ఉన్నాయా? లేవా?

కాలుడు : బ్రహ్మర్షీ! మీకు సర్వము విదితమై యుండి కూడా అడుగుచున్నారు. అయినప్పటికీ, పునశ్చరణ యొక్క బలం కొరకు చెప్పుచున్నాను.

సముద్రమును "తరంగముల దృష్టి"తో కూడుకుని చూస్తున్నామనుకోండి... అవి ఉండనిదెప్పుడు? లేక జలదృష్టితో చూస్తే తరంగములన్నీ జలమయమే కదా!

"ఈ జగత్తు ఇందలినానాత్వము కూడా అట్టిదే..." అని గ్రహించండి. అయితే ఈ జీవులు వారివారి "స్వభావము-స్థితి-సంకల్పము"ల కారణంగా పరిచ్ఛిన్నములగు ఈ భేద వికల్పములు అన్నీ స్వయంకల్పితానుసారమే గాంచుచున్నారు.

❖

మరల విషయసారమును సమీక్షిస్తున్నాను. వినండి-

ఈ తరంగములు ఉత్పన్నమౌతున్నాయి. నశిస్తున్నాయి. మరొకప్పుడు నశించకుండా దీర్ఘ కాలం ఉండి ఉంటున్నాయి. ఇట్లు మరల మరల ఉత్పన్నమగుచు, నశించుచుండే ఈ తరంగాల పరస్పర సమ్మేళనము కంటే సముద్రము వేరు కాదు. సముద్రము కంటే తరంగములు వేరు కాదు.

ఈ జీవులు కూడా 'పరమాత్మ' కంటే వేరుగా లేరు. పరమాత్మ వీరికంటే వేరు కాదు.

అయితే, జ్ఞానులగు జీవులు... "నేను పరమాత్మనే. వేర్వేరు జీవాత్మలవలె కనిపించే ఈ విశాలదృశ్య జగత్తంతా నాయొక్క చిత్కళయే. కాని వాస్తవానికి నాయందు ఇవేమీ లేవు - అని సర్వదా గమనిస్తూనే ఉంటున్నారు. "జలములో తరంగమున్నది అని అనటం అసమంజసము కదా! తరంగమనునది జలమువలె ఒక పదార్థమే కాదు"... అని గ్రహించుచున్నారు. అట్టి సమగ్ర - సర్వసమత్వ- ఏకీభావన గల జీవుణ్ణి "మోక్ష స్వరూపుడు" అని అంటున్నాం.

దానికి వేరైన భావన కల వానిని "జీవుడు" అంటున్నాం.

వేరైన భావన: "నేను ఈ శరీరమును, తదితర శరీరములు నాకంటే వేరుగా బాహ్యమున ఉంటున్నాయి. వారి చిత్తములు వేరు. నా చిత్తము వేరు. అందుచేత వారు వేరు. నేను వేరు. ఇవి నావి. ఈ కొద్ది మంది నా వారు. వీరు తదితరులు" అను మననము చేయు జీవుడు 'బద్ధ స్వరూపుడు' అని చెప్పబడుతోంది. బద్ధ స్వరూప మననముచే అనేక దుఃఖములు అనుభవిస్తున్న ఈ జీవునకు అతని అఖండ స్వరూపము గుర్తుచేసి ప్రశాంతపరచటానికే ఆత్మవిషయమై శాస్త్రములు విచారణ ప్రతిపాదించటం జరుగుతోంది.

ఎందుకంటే, వాస్తవమగు ఆత్మకు బంధ - మోక్షములు ఉంటాయా? ఉండనే ఉండవు.

❖

తరంగములన్నీ అన్ని సమయములందూ ఏకైక రూపమగు జలమయమే అయి

వుంటున్నట్లు, ఈ చిత్ర విచిత్రక్రియలతో కూడి చంచలమైయున్న ఈ జగత్ శక్తులన్నీ బ్రహ్మము కంటే భిన్నముగా కనిపించుచున్నను, అభిన్నములే సుమా!

బ్రహ్మము... తరంగములలోని జలం వలె.. వ్యాపకమై, నిత్యమై, శుద్ధమై, నిరామయమై, చిన్మాత్ర స్వరూపమై, అనాదియై, అనంతమై, సర్వశక్తిమంతమై ఉన్నది. సర్వశక్తిమంతుడగు ఆ పరమాత్మ తన స్వస్వరూపము నుండి చ్యుతి పొందకుండానే ఈ వివిధ రూపములన్నీ పొందుచున్నాడు.

జలము నందు జలమే తరంగరూపముగా అవతరిస్తున్నట్లు, బ్రహ్మము నందు బ్రహ్మమే నానావిధ రూపములుగా విస్తరిస్తోంది.

త్రాడు నందు పాము కనబడుచున్నట్లు, ఆ బ్రహ్మము నందే ఈ స్త్రీ-పురుష-లింగరహిత రూపములన్నీ వివర్తభావము పొందుచున్నాయి.

❖❖❖

7. ఈ జగత్తు బ్రహ్మమే

భృగు మహర్షి : కాలదేవా! బ్రహ్మము నందు ఈ 'జగత్తు' అను వివర్తవ్యవహారం ఎట్లా, ఎప్పుడు, ఎందుకు ఏర్పడుచున్నదని మీ అభిప్రాయం?

కాలుడు : ఓ భృగుమహర్షీ! మీ ప్రశ్నకు సమాధానం వినండి-

'జగత్తు' అనునట్టి కల్పన ఏదీ ఎప్పుడూ ఉండియే ఉండలేదు. ఇప్పుడు కూడా లేదు. ఇకముందు కూడా ఉండబోదు. ఎందుకంటారా? ఈ "జగత్తు-బ్రహ్మము" అనబడు రెండింటిలో కొంచెం కూడా భేదం లేనేలేదు. తరంగమునకు, జలమునకు భేదమేమిటి చెప్పండి.

ఆ బ్రహ్మము నిశ్చయముగా పూర్ణమై, సర్వమైయున్నది. "ఈ జగత్తు కూడా కేవలం బ్రహ్మము మాత్రమే." అను "భావన అనుక్షణం చేయబడుచున్నదనుకోండి... అప్పుడు, అలాంటి ప్రయత్నంతో తదితరములైన ఆడంబరములన్నీ త్యజించబడటమే సర్వదోషములకు ఉపశమనం.

ఆ ఆత్మసత్తయే 'నియతి' రూపము కూడా అయి ఉన్నది. సమస్త పదార్థముల యొక్క అధిష్ఠానము కూడా అదియే. అది అనేక రూపములుగా ఉన్నప్పటికీ, ఏకరూపమై ఉన్నది. అసంఖ్యాకములుగా విరుద్ధ రూపము కలదైవున్నప్పటికీ, సర్వత్రా ఒకే ఆకారము కలిగియున్నది.

అట్టి ఆత్మ తనయందు తానే వేరైన భావనను ఆశ్రయించి మనస్సు. అనే ఉపకరణం ద్వారా ఈ పటాటోపమంతా పొందుచున్నది. అట్టి భావనా స్వరూపమే ఈ చిత్తము. అట్లు, 'ప్రతిబింబత్వము' లేక 'చిదాభాసత్వము' పొందిన తరువాత ఈ చిత్తము ఆయా ఉపాధులందు వ్యాపకమైయున్న అహంకారమును చూస్తూ "ఈ అహంకారములే ఆత్మ యొక్క స్వరూప, స్వభావములు" అని భ్రమ పొందుచున్నది. అనగా ఈ జగత్తు యొక్క దర్శనమంతా సాంసారిక

దృష్టిచేత ఏర్పడిన చిత్తభ్రమ మాత్రమే అని అనక తప్పదు. అయితే ఈ అహంకారము–అహంకారమునకు ఆవల, అహంకారముకంటే వేరైన–సన్మాత్రము (Absolute Self-Existence) ను లేని దానిలాగా గాంచుచున్నది. అనగా ఈ చిత్తము ఉన్న దానిని లేనిదిగా, లేని దానిని ఉండినట్లుగా గాంచుచున్నది.

❖

మనం ఇంతవరకు చెప్పుకున్న జల–తరంగముల దృష్టాంతం సహాయంతో ఆత్మ–జగత్తుల చమత్కారం గురించి మరికొంత వివరిస్తాను–

ఒకద్రష్ట వేరువేరుగా దర్శిస్తున్న నామ, రూపాలన్నీ చిత్తం యొక్క వేరువేరు సందర్శనాలే!

ఈ చిత్తము వేరు వేరైన తరంగములను మాత్రమే గాంచుచున్నది.

అన్ని తరంగములలోనూ ఒకే రీతిగా ఉండియున్న జలమును గాంచుట లేదు.

ఈ విధంగా ఈ చిత్తము "ఆధ్యాత్మికము కానట్టి జడము", "ఆధ్యాత్మికము అయినట్టి చైతన్యము"ల విభేదమును గ్రహించుచున్నది.

అయితే చిత్తం యొక్క ఈ 'భేదవాసనా రూపమగు శక్తి' ఆత్మయొక్క నిజరూపముననే చమత్కారంగా ఉండి ఉంటోందని చెప్పక తప్పదు. "దేని నుండైతే ఎట్టి బాహ్యాకారణము లేకుండానే ఒకటి వివర్తిస్తోందో, అది ఆ మూలవస్తువుకంటే వేరైనది కాదు" అనునది సిద్ధాంతమై ఉన్నది.

చిత్తము చేతనే "ఇది జడం – ఇది చైతన్యం" అను భేదకల్పన అంతా చేయబడుతోంది కదా! అయితే... ఈ చిత్తము యొక్క విన్యాసమాత్రం చేత ఆత్మయొక్క ఏకరూపత్వమునకు ఏర్పడే హాని ఏమీ ఉండదు. అనేక తరంగముల యొక్క గతి భేదం ఉండి ఉన్నప్పటికీ, పరిపూర్ణమై ఉన్న సముద్రజలం శోభిస్తూనే ఉన్నది కదా! సముద్రజలం తనయందు తానే ఈ తరంగములు మొదలైన భేదం పొందుతోంది. అట్లాగే... "పరబ్రహ్మమే విశాల జగదాకారముగా వికాసమును పొందుచున్నది." అనునదే సిద్ధిస్తోంది. ఆత్మయే ఆత్మచే ఆత్మయందు నానా ప్రకారములగు వికారములను స్వయముగా గ్రహించుచున్నది. మరల తనకు తానే త్యజించుచున్నది. శాస్త్ర కారులు ఆ రెండింటికీ "బంధము–మోక్షము" అను పేర్లు పెట్టారు.

అవిచిత్రం నుండి విచిత్రం - హే మహర్షీ! ఒకే విషయము అనేక కోణములలో వినటం జరిగితే ఉత్తమ భావన దృఢపడుతుంది కదా! అందుచేత మరల చెప్పుచున్నాను... వినండి–

చిత్ర విచిత్రములైన తరంగములు జలముకంటే వేరు కానట్లు, సర్వలోకములకు ఈశుడైనట్టి ఆ పరమాత్మకంటే "నీవు–నేను–జగత్తు" అనబడు ఈ మొత్తం జగత్‌కల్పన వేరు కాదు. ఒకే బీజంలో కాండము, శాఖలు, ఫలములు, పుష్పములు, ఆకులు వగైరా ఉన్నాయి కదా! ఆ పరమాత్మ యందే ఎల్లప్పుడు ఈ "సృష్టి–స్థితి–లయ" పరిణామ శక్తులన్నీ అంతర్లీనంగా దాగి ఉన్నాయి.

భృగువు : అసంగుడు, నిష్క్రియుడు అని చెప్పబడుచూ సర్వస్వభావములకు అతీతుడైన ఆ శుద్ధ-పరబ్రహ్మ భగవానుని యందు ఈ వికారాలన్నీ ఉండి ఉన్నాయా?

కాలుడు : అక్షరాలా... ఉండవు. "దేవేశుడు, సర్వమునందు సాక్షిస్వభావుడై అంతర్లీనంగా ఉండి ఉన్నవాడు"... అయినట్టి ఆ పరమాత్మయందు ఎట్టి వికారములకు చోటే లేదు. తీవ్రజ్వరంతో బాధపడేవానికి విచిత్ర వర్ణములు కనిపిస్తూ ఉంటాయి చూచారా! అట్లాగే దేవేశుడగు ఆ పరమాత్మ యందు ద్రష్టత్వ విశేషంచేత "సత్-అసత్" మయమగు ఈ 'నేను - నీవు' మొ॥ వాటితో కూడిన జగత్ చమత్కార వ్యవహారమంతా దృగ్గోచరమగుచున్నది. ఒక నల్లని మేఘము నుండి సప్త రంగులతో కూడిన విచిత్రమైన ఇంద్రధనుస్సు ఉద్భవించుచున్నది. అట్లాగే, ఏకరసము మంగళ స్వరూపము, అవిచిత్రము అగు పరమాత్మ నుండి విచిత్రమైనట్టి ఈ 'జగత్‌స్థితి' ఉదయించటం అనుభవమౌతోంది.

సాలెపురుగు నుండి దారం బయల్వెడలి, సాలెగూడుగా అయి, సాలె పురుగును చుట్టి ఉంటోంది కదా! స్వప్నంలో ఆ 'స్వప్నద్రష్ట' యొక్క చైతన్యముకంటే వేరుగా ఉన్నట్లు తోచే వస్తు జాలం కనబడుచున్నది. చేతనమగు పరమాత్మ నుండి "జడభావనను ఆశ్రయించుట" అను రూపము గల జడత్వము ఉత్పన్నమగుచున్నది.

పట్టుపురుగు తన బంధము కొరకు తనకుతానే దారపుగూడును విస్తరింపజేసుకుంటోంది.

ఆత్మ కూడా స్వీయబంధముకొరకే తన యొక్క చిత్త శక్తిని విస్తరింపచేసుకుంటోంది. చిత్త శక్తియే వాసనావైచిత్ర్యము కూడా.

భృగుమహర్షి : ఈ వాసనా బంధమంతా నిష్కల్మష స్వరూపమగు ఆత్మకు ఎక్కడి నుండి ప్రాప్తిస్తోంది?

కాలుడు : ఓ మహర్షీ! ఈ వాసనా బంధమంతా ఆత్మకు బాహ్యము నుండి మరెవ్వరూ కలిగించుట లేదు సుమా! ఆత్మయే స్వయముగా తన ఇచ్ఛానుసారంగా తనయొక్క 'స్వరూపవిస్తృతి (The extending of its own form) ను భావించుచున్నది. పట్టుపురుగులాగా తన కొరకు తానే కఠినమైన బంధమును నిర్మించుకొనుచున్నది.

ఈ ఆత్మయే మరొక సమయంలో తన ఇచ్ఛచే ఆత్మసాక్షాత్కారం పొందుతోంది. స్వస్వరూపం యొక్క ప్రభావం చేత - ఒక ఏనుగు కట్టుత్రాడు త్రెంచుకొనునట్లు - ఈ ఆత్మ తనకుతానే సంసార బంధము నుండి తొలగి, మోక్షమును పొందుచున్నది. అనగా, బాహ్యమననము త్యజించి, స్వస్థతతో కూడిన "స్వయమాత్మానుభవము" (A sense of experience that 'I' am the all pervading Self) ను సంతరించుకొంటోంది.

ఈ ఆత్మ దేని గురించి ఎట్లు భావించటం జరుగుతుందో, అది నిరంతరం అట్లే అగుచున్నది. చూచారా? ఆత్మ సర్వదా మహద్వస్తువే. సందేహం లేదు. అయితే ఏం? అది తనయొక్క 'చిత్తశక్తి' చే ఏది ఎట్లా భావిస్తే, అట్లే శీఘ్రంగా తద్రూపమగుచున్నది. ఈ చిత్తశక్తి అనంత-అఖండ

స్వరూపమగు ఆత్మాకాశమునే కప్పివేస్తోందే! గొప్ప వర్షాకాలమేఘం అనంతాకాశమును కప్పివేసి ఉంచి... ఇక ఆపై ... ఆకాశమంతా తన రూపమే అయిపోయినట్లు చూపుతుంది చూచారా? చిరకాల భావనచే దృఢీభూతమైయున్న ఈ వాసన అనునది క్షణంలో ఆత్మను తనవంటివాని లాగానే చూపుతున్నది. తనయందు ఏయే భావనలు ఉత్పన్నమగుచున్నాయో, ఆయా రూపము గానే ఆత్మ శీఘ్రముగా ప్రకటించుకొనుచున్నది.

❖

ఆత్మకు బంధముగాని, మోక్షముగాని లేవు, ఇక మనస్సంటారా,... దీనికి స్వకీయమైన అస్థిత్వమే లేదు.

ఆత్మయొక్క మననశీలత్వమే మనస్సు. అదియే చిత్తము కూడా!

ఈ మనస్సు అనబడేది అవాస్తవమైనది. దీనికి స్వయమైన 'సత్త' అంటూ ఏదీ లేదు. స్వయంకృతమైన ఉనికియే లేనట్టి మనస్సుకు బంధమేమిటి? "స్వప్నంలో ఒక పంజరమున్నది. ఆ పంజరంలో ఒక రామచిలుక ఉంది. దానికి బంధ విముక్తి ఎప్పుడు?" అనే ప్రశ్నకు అర్థమేమున్నది? స్వప్నమే ఒక ఊహ. అందులో పంజరము, చిలుక మొదలైన పదార్థజాలమంతా కూడా ఊహయే. ఎప్పుడైతే ఈ 'ఊహ' ఉపసంహరించబడుతుందో,... మరుక్షణం ఆ ఊహ లేక స్వప్నంలోని విశేషములన్నీ లేనివే అగుచున్నాయి.

ఆత్మకు, మనస్సుకు కూడా బంధ మోక్షములు ఉండజాలవు.

మరి ఈ ప్రపంచంలోకి బంధ-మోక్షముల దృష్టి ఎక్కడి నుండి వచ్చింది? ఈ బంధ-మోక్షములు మనం ఆపాదిస్తున్నది ఎవరికి?..... ఈ విషయాలు తరచి తరచి చూచినపుడు "అవిచారణ చేతనే ఈ బంధ-మోక్ష వ్యవహార మంతా ఎదురుగా తాండవిస్తూ ప్రాప్తిస్తోంది" అని చెప్పబడుతోంది.

'బంధ-మోక్షములు' అనబడేవి యథార్థానికి లేవు. కాని, ఆత్మయే బంధ-మోక్ష రూపమై వికారయుక్తంగా భాసించుచున్నది. ఆహాఁ! చిత్రం చూచారా? నిత్యము, పూర్ణము అయిన ఆత్మయొక్క స్వరూపమును, అత్యంత అనిత్యమైనట్టి 'భోక్త-భోగ్యము-భోగము' మొదలైన వాసనల అధ్యాస కప్పివేయుచున్నదే! చిత్తము సంకల్పములను ఆశ్రయించుట ప్రారంభించిన మరుక్షణం, పట్టు పురుగువలె, ఆత్మ ఈ చిత్తము ద్వారా ఆ బంధమునందు తగుల్కొనుచున్నది. పరస్పర మిళితములు, అత్యంత వికల్పయుక్తములు అయిన కోట్లకొలది మనఃశక్తులు ఈ పరమాత్మ నుండి ఆవిర్భవిస్తున్నాయి. అటూ – ఇటూ సంచారం చేస్తున్నాయి.

సముద్రంలో నుండే తరంగములు ఉద్భవించి, ఆ సముద్రము వలన సముద్రమునందే స్థితిపొందియున్నాయి. ఆ సముద్రమునే సంక్షుభితమయంగా చేసి చూపిస్తున్నాయి కదా!

చంద్రుని కిరణాలు చంద్రుని నుండి బయలుదేరి మనకు ప్రాప్తిస్తున్నాయి. అయితే చంద్ర కిరణాలు చంద్రుని కంటే వేరా?

ఈ మనశ్శక్తులు కూడా పరమాత్మకు భిన్నమైనవి కాకపోయినప్పటికీ, భిన్నముగా ఉన్నట్లు అపరిపక్వ దృష్టిచేత అనిపిస్తోంది.

ఆత్మయందు చిత్తజల తరంగాలు - "ఆత్మ" అను మహాసముద్రము 'చిత్తము' అనే జలమును కలిగి యున్నది. 'చిన్మాత్రము' అను తరంగములతో కూడినదై మహావిశాలంగా ఉండియున్నది. అట్టి స్పందనామయమగు ఆత్మమహాసముద్రంలో "బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు" అనబడేవి కూడా కొన్ని పెద్ద కెరటాలు. ఇక మరికొన్ని చిన్నకెరటాలు మనుజరూపంలోను, దేవతల రూపములోను, నాగ-యక్ష మొదలైన అనంతసంఖ్యలో అనేక రూపాలుగా ప్రాప్తిని పొందుచు న్నాయి. ఈ తరంగములన్నీ కూడా "స్వభావము" చేతనే కల్పించబడి, స్ఫురించు చున్నాయి. వీటిలో కొన్ని "యముడు, మహేంద్రుడు, కుబేరుడు" మొదలైన రూపాలతో "అష్టదిక్పాలకులు" గా వ్యవహరించబడుచున్నాయి. కొన్ని పరస్పరం వధించుకుంటున్నాయి. మరికొన్ని ఉపకారం చేసుకుంటున్నాయి. కొన్ని హాస్యం ప్రదర్శిస్తున్నాయి. మరికొన్ని అత్యంత తీవ్రము, చపలము అయిన 'ఇచ్ఛ'తో కూడుకొని ఉన్నాయి.

కొన్ని ఉత్తమ తరంగాలు గర్జిస్తూ పైకి ఎగురుచున్నాయి.(ఊర్ధ్వలోకాలకు పయనిస్తున్నాయి).

మరికొన్ని క్రిందకు వెళ్ళుచున్నాయి.(అధోలోకములకు తిరోగమిస్తున్నాయి).

ఆ తరంగములోని 'బ్రహ్మ' 'ఇంద్రుడు' మొదలైనకొన్ని కొంచెము దీర్ఘకాలము ఒక స్థిరమైన ఆకారం పొంది ఉంటున్నాయి. ఈ 'మనుష్యులు' అనబడు తరంగాలు అత్యంత అస్థిరమైన అతి స్వల్పకాలం స్ఫురించి ఉంటున్నాయి. అతి శీఘ్రంగా నశించుచున్నాయి. ఆత్మమహాసముద్రంలో క్రిమి - కీటక - పతంగ - సర్ప - మశక - జంతు జాతులన్నీ చిన్న కెరటముల, జలబిందువుల రూపంలో ప్రకటితమౌతున్నాయి. మరికొన్ని పర్వతములందు గుహలందు, కారుచీకటులందు పుట్టి, అక్కడే సంచరిస్తూ, అక్కడే నశిస్తున్నాయి.

❖

ఈ మానవులలో కూడా ఒక్కొక్కరు ఒకొక్కక్క విధంగా ఉంటున్నారు. ఒకని జీవితం అతి దీర్ఘంగానూ, మరొకని జీవితం అల్పకాలముగానూ ఉంటోంది. ఒకని దేహం విశాలంగాను, సుందరంగాను; మరొకని దేహం అతితుచ్ఛంగాను ఉంటున్నాయి. ఈ సంసార స్వప్న కార్యక్రమం నందు ఒకరికి ఒక్కొక్కరు చిరకాలం వరకు స్థిరంగా ఉంటున్నట్లు కల్పించబడుచున్నారు. కొందరు దృఢవికల్పములచే ఎంతగానో మోహితులై, "ఈ కనబడే జగత్తు అత్యంత స్థిరమైనది కదా" అని భావించుచున్నారు. అతి తుచ్ఛ భావములుగల కొందరు "నేను పుట్టాను, పెరుగుచున్నాను. ఇంతటితోనే నేను పరిమితుడను. ఈ శరీరమునకు హాని జరిగితే నా పని అయిపోయినట్లే, అయ్యో! ఈ శరీరంతోపాటు నేను కూడా కృశించుచున్నాను. అతి దుఃఖితుడనగు నాకు గతి లేదు. నేను ఎంతటి మూఢుడను!" అని తలపోయుచున్నారు. ఫలితం? 'దీనత్వము' అను దోషమునకు వశీభూతులై, దుఃఖాదుల ప్రకంపనములు నిరంతరం పొందుచున్నారు.

ఆత్మ మహాసముద్రంలో జడ చిత్త తరంగరూపమున ఉన్న మరికొందరు "నేను ఒక జడమగు రాయిని". అను జడ భావము కలిగి ఉంటున్నారు. ఇంకొందరు, "మేము సర్వుల సానుకూల్యము కొరకు ఇవన్నీ ఇట్లు ప్రసాదిస్తూ ఉంటాము" అని దృఢంగా భావించినవారై దేవభావమును పొంది ఉంటున్నారు. తరంగములు ఆకారములు మార్చుకుంటున్నట్లు కొందరు జంతు ఉపాధి నుండి మానవ ఉపాధికి, మానవ ఉపాధుల నుండి ఆయా జంతువుల ఉపాధులకు చిత్తానుసారంగా తరలి వెళ్ళుచున్నారు. ఇంకొందరు 'సుషుప్తి-ప్రళయముల'లో లాగా అవ్యక్తమగు, వాసనా రూపమైనట్టి 'మహాంధకారము' పొందుచున్నారు.

హే మహాత్మా! భృగుమహర్షీ! మీకు కనబడుచున్న ఈ జీవులు, ఈ నీ కుమారుడు, అతని ఇప్పటి జన్మ పరంపరలు, నీవు-నేను ... ఇవన్నీ కూడా 'బ్రహ్మము' అను మహాసముద్రము నుండి ఆవిర్భవించిన తరంగములవంటివి. అట్టి ఈ తరంగములకు "స్ఫురణరూపమగు మనస్సు" అనే పేరు విజ్ఞులు పెట్టారు.

ఇవన్నీ చంచల ఉపాధులతో కూడిన చైతన్యము యొక్క భేదములే.

చైతన్యము దృష్ట్యా వీటన్నియందు భేదం లేదు.

వీటిలో కొన్ని ఈ జగత్తులో అనేక కల్పముల వరకు, స్థిరత్వమును పొంది ఉంటున్నాయి. మరికొన్ని జ్ఞానామృతం చేత "శుద్ధము, పరమపదము" అగు మోక్ష ప్రాప్తిని పొందుచున్నాయి.

ఏది ఏమైతేనేం? ఆత్మయొక్క చిత్కళా చమత్కారమే ఇదంతా.

❖❖❖

8. సంసారోత్పత్తి - విస్తారము

భృగుమహర్షి : ఓ కాలదేవా! ఈ ముల్లోకముల 'సృష్టి'లో చిత్ర విచిత్ర జీవరాసులన్నీ ప్రభవిస్తున్నాయి కదా! వీటన్నిటిలో ఉత్తమమైన, 'కృతార్థులు' అని చెప్పతగినవారు ఎవరు? ఈ జీవజాతులన్నీ ఎక్కడి నుండి ఎందుకు ఆవిర్భవిస్తున్నాయి?

కాలుడు : సముద్రములోని తరంగాలలాగా, వసంత ఋతువులోని లతలలాగా ప్రభవిస్తున్న ఈ అనేక చిత్ర విచిత్రములైన జీవజాతులన్నీ పరమాత్మ నుండే ఆవిర్భవిస్తున్నాయి. అయితే వీరందరిలో కూడా ఎవరైతే మనస్సు యొక్క మోహమును జయించివేసి, ఇహ-పరములను సుస్పష్టముగా ఎరిగి ఉంటారో, వారు మాత్రమే కృతార్థులు. అట్టి కృతార్థులు యక్షులలోను, గంధర్వులలోను, మనుష్యులలోను, జంతువులలోను కూడా ఉండియే ఉన్నారు. 'జీవన్ముక్తులు' అని చెప్పబడే అట్టి జీవులు తమ యొక్క రాక-పోకలచే ఈ ధరాతలమును పునీతం చేస్తూ ఉంటారు. వారు విహరించుచుండగా అట్టి ప్రభావంచేత వర్తమాన-భవిష్యత్తులలో అనేకమంది తదితర సంసారజీవులు కూడా సముద్ధరించబడుతూ ఉంటారు.

ఇక ఈ సాంసారిక భావములకు తమని తాము పరిమితం చేసుకున్నవారి గతి ఏమిటంటావా! వారంతా "కట్టె, గోడ"ల వలె మూఢులై అనేకసార్లు స్థావరత్వమును, జంగమత్వమును పొందుచూనే ఉంటారు. అందుకే… "ఓ సర్వజనులారా! ఈ మానవ ఉపాధి అత్యంత ఉత్కృష్టమైనది, దుర్లభమైనది. ఎందుకంటే ఇక్కడ జ్ఞాన విజ్ఞానములు ఆశ్రయించటానికి కావలసిన సాధన సంపత్తి లభిస్తున్నది. అందుచేత ఈ అవకాశమును వృథాపరచుకోకండి"… అని గురువుల స్థానంలో విధులను నిర్వర్తిసున్నట్టి మహనీయులు ఈ ప్రపంచజనులకు మరల మరల గుర్తు చేస్తున్నారు. ఘోషిస్తున్నారు.

శాస్త్రములచే వచించబడుచున్న తపస్సు, ధ్యానము మొదలైన సర్వప్రయత్నముల అంతిమ గమ్యమేమిటి? మోహమును నశింపజేసుకొనుటయే సుమా! మోహము పూర్తిగా నశించితే… అట్టి తత్వజ్ఞానులకు శాస్త్ర విచారణ మొదలైనవి క్రొత్తగా ప్రసాదించేవి ఏమి ఉంటాయి? ఈ సాధనములు, ఈ విధి నియమములు,… ఈ చర్చలు ఇవన్నీ అజ్ఞానము వీడని వారి కొరకు మాత్రమే జ్ఞానులచే ప్రతిపాదించబడుచున్నాయి. ఈ లోకంలో కొందరు 'ఆత్మజ్ఞానము' పట్ల జాగరూకులై, ప్రయత్నశీలురై ఉంటున్నారు. వారి కొరకే, జ్ఞానులగు మహాత్ములచే శాస్త్రములు రచించబడ్డాయి. అయితే ప్రయత్నము, శ్రద్ధ, ఆసక్తి, ఉత్తమ ఆశయము కలవారి పట్ల మాత్రమే శాస్త్రములు ప్రయోజనవంతమౌతున్నాయి. జ్ఞానులు ఈ విధంగా ప్రయత్నశీలురగు అజ్ఞానులకు తమ సహాయం అందజేస్తున్నారు. పూర్ణ జ్ఞానులు (అవతారపురుషులు) ఈ శరీరధారణను అంగీకరించుటలో ఉద్దేశము, ప్రయోజనము అదే అయి ఉంటోంది.

❖

'హే భృగుమహర్షీ! ఇక్కడ మీరు ఒక చమత్కారం గమనిస్తున్నారా? తమకు ఎదురుగా శాస్త్రములు ఉండి ఉన్నప్పటికీ, అందలి 'ఉత్తమ విచారణ' యందు కొందరి బుద్ధి ఏమాత్రం ప్రవేశించుటలేదు. "ఈ శాస్త్రములు మీవి. అవి మావి" అని మాత్రం అనుకుంటూ సాంసారిక దృష్టులనే అవలంబిస్తున్నారు. ఫలితంగా అట్టివారియందు అభేదదృష్టిగానీ, ఆత్మను గురించిన అవగాహన గానీ ఏ మాత్రం ఏర్పడుట లేదు. పాపదృష్టి నశించనంతకాలం అంతఃకరణము దోష భరితమై ఉంటుంది. పాపములు నశించినప్పుడే అంతఃకరణము శుద్ధమగుచున్నది. పరిశుభ్రమైన దర్పణంలో ప్రతిబింబము స్పష్టముగా కనబడుచున్నట్లు, సజ్జనుల యొక్క నిర్మల బుద్ధియందు మాత్రమే శాస్త్రసారము, ఉత్తమ అవగాహన ప్రవృత్తమౌతున్నాయి.

ఆకాశంలో సూర్యుడు ఉదయించగానే అంధకారమంతా మటుమాయమౌతుంది చూచారా?

సచ్ఛాస్త్రముల యొక్క విచారణచే మనస్సునందలి మోహమంతా నశించిపోగలదు.

అనేకమంది జీవుల మనస్సులలో అజ్ఞానము గూడుకట్టుకుని కాపురం చేస్తోంది. వారు నిష్కారణంగా అవిచారణ, అజ్ఞానములను స్వీకరించి తద్వారా దుర్భర స్థితిగతులను ఆశ్రయించిన వారు అగుచున్నారు. కాల నియామకుడనగు నేను వారి వారి ఆశయము, ప్రయత్నములను

అనుసరించి ఆయా ఉత్తరోత్తర స్థితులను, ఉపాధులను కలుగజేస్తున్నాను. ఇందు నన్ను దూషించి ఏం ప్రయోజనం? మనస్సులో మోహం నశించకపోతే, అట్టి జీవుడు అల్పవస్తువులకై ప్రయత్నాలు చేస్తాడు. ఫలితంగా అల్పవిషయాలే మరల-మరల పొందుతూ ఉంటాడు. హృదయమును అజ్ఞానము కప్పివేస్తున్నంతకాలం "మోక్షసిద్ధి" అనే ఊసు ఉండజాలదు. దీనికి మరొకరిని ఎట్లా దూషిస్తారు చెప్పండి? ఆకాశమును మంచు కప్పివేసినప్పుడు ఆ ఆకాశము యొక్క రూపమే వేరు విధంగా కనబడటం జరుగుతుంది. అట్లాగే, మోహం అంతఃకరణమును కప్పివేసి విజృంభిస్తోంది.

❖

అంతటికీ కారణం మనస్సే. ఈ మనస్సే భౌతికదేహంతో గొప్పస్నేహం చేస్తూ, ఆత్మయొక్క ఉనికి ఏమరుస్తోంది. "నేనీ మాంసమయ దేహమును" అనునట్టి దృఢభావనను మననం చేస్తోంది. ఫలితంగా అనేక సుఖదుఃఖములను అనుక్షణం పొందుతోంది. సుఖదుఃఖాలు కల్పించుకునేదీ, ఆ కల్పనను అనుభవించేదీ ఈ మనస్సే. అంతేకాని, సుఖ-దుఃఖములు అనుభవించేది జడరూపమగు ఈ మాంసమయ దేహం మాత్రం కాదు.

మనస్సుచే ఏది చేయబడితే అది "నిర్వర్తించబడినది" అను శబ్దమునకు తగి ఉంటుంది. మనస్సుచేత నీ పుత్రుడు ఏది చెయ్యాలని భావన చేశాడో, భావనాపటిమచే అవన్నీ అట్లే శీఘ్రంగా పొందాడు. పొందుచున్నాడు. అతని ఒక భౌతిక దేహం ఇక్కడే మీ ఎదురుగా ఉన్నప్పటికీ అతడు మాత్రం తన మనస్సుచే అనేక యోనులందు ఆగమన-నిష్క్రమణములు (రాక-పోకలు) నిర్వహించాడు. ఆహాఁ! ఏమి విచిత్రం! వాసనాయుక్తమగు మనస్సు అనుసంధానమాత్రం చేత క్షణంలో చేసేది ఆ బ్రహ్మదేవుడు దీర్ఘకాలంగా ప్రయత్నించి కూడా ఆ జీవుని పట్ల నిర్వర్తించ గలడా? లేదు.

ఈ సృష్టి - లోకము, జనన-మరణాదుల గూర్చిన ఇచ్ఛ... ఇవన్నీ కూడా మనస్సు యొక్క స్ఫురణచేతనే కలుగుచున్నాయి. హే బ్రహ్మజ్ఞా! ఈ మనస్సు కొంచెము చలనము కలిగి ఉన్నప్పటికీ, అట్టి చలనము మహాదుఃఖ ప్రదమగుచున్నదనే విషయం కాలస్వరూపుడనగు నేను సాక్షీభూతుడనై గాంచుచున్నాను.

ఇక ఈ మనస్సు యొక్క విశేషాలు గొప్ప గొప్ప శబ్దజాలంతో రచించి చెప్పవలసిన పనేమున్నది? కనుక లేవండి. మనం మీ పుత్రుడున్న చోటికి వెళ్దాం. అంతా మీరే స్వయముగా గమనించగలరు.

భృగుమహర్షి : నా ప్రియపుత్రుడు శుక్రుడు అనేక ప్రదేశములలో సంచరించి, అలసిపోయి సమంగానదీ తీరం చేరాడు కదా!

కాలుడు : అవును. మీ పిల్లవాడు మనోశరీరంలో స్వర్గంలో అనేక భోగాలు అనుభవించాడు. అక్కడి నుండి, చంద్ర కిరణ సంబంధముచే ఓషధులలో ప్రవేశించాడు. ఓషధుల ద్వారా గర్భమున

ప్రవేశించాడు. అనేక జన్మలైన తరువాత ఒక 'తాపసి' అయినాడు. ఏమీ తెలియని అమాయకునివలె ఇప్పుడు సమంగా నదీ తీరంలో మౌనంగా తపస్సు చేస్తున్నాడు.

అనేకసార్లు 'ప్రాణవాయువు' అను చేతన శక్తి నుండి వినిర్ముక్తమైనాడు.

చంద్రుని సంపర్కముచే మంచుద్వారా ధాన్యాదులందు ప్రవేశించాడు. పురుషుని వీర్య రూపమును పొంది అనేక ఉపాధులను పొందాడు.

ఈ భగవత్ విరచితమైన 'నియతి'ని గాని, ఈ విచిత్ర మాయావ్యవహారములనుగాని ఆత్మజ్ఞానులగు మహాత్ములు మాత్రమే తాము తగుల్కొనకుండా, తేలియాడగలుగుచున్నారు.

❖

"ఔను! ఈ దైవ విరచితమగు జన్మ-కర్మల వ్యవస్థ ఎంత విచిత్రమైనది!" అని అనుకుంటూ భృగు మహర్షి తన ఆసనము నుండి లేచి, కాలదేవుని అనుసరించి వెళ్ళసాగాడు.

ఆనాటి సభ చాలించబడింది.

❖❖❖

(ఎనిమిదవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

తొమ్మిదవ రోజు

9. గడిచిన జన్మల స్మరణ

వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఇక మనం తొమ్మిదవ రోజు విచారణలో ప్రవేశిస్తున్నాం. నిన్నటి రోజు కాలుడు భృగుమహర్షికి చెప్పిన తత్త్వబోధ విన్నావు కదా! వినినదానిలోని విషయసారాన్ని చక్కగా విజ్ఞాన దృష్టితో మరల మరల పరిశీలిస్తూ ఉండాలి సుమా! ఇప్పుడు మనం ఆ తరువాతి విశేషాలను పరిశీలించబోతున్నాం. సావధానచిత్తుడవై విను.

❖

ఆ కాలదేవుడు, భృగువు... ఇద్దరూ ఆశ్రమ ప్రదేశం నుంచి బయలుదేరారు. "దేవత - అప్సరస-సిద్ధ-కిన్నర-జన ప్రదేశములను దాటుకుంటూ సమంగా నదీ తీరం చేరారు. అక్కడ గల ఒక ప్రదేశంలోని ఒక వృక్షం క్రింద శుక్రుని చూచారు. అయితే అతడు మరొక శరీరమును ధరించి ఉన్నాడు కదా! అందుచేత ఇతఃపూర్వపు స్థితికంటే విలక్షణమైన రూపం, భావము కలిగి యున్నాడు. అతని ఇంద్రియములన్నీ ప్రశాంతస్థితిని పొందియున్నాయి. మనస్సు సమాధిని అవధరించియుండుటచే తన చంచలత్వమంతా వీడియున్నది. పాపం, ఎంతో కాలంగా అనేక ఉపాధులలో ప్రవేశించటం - ప్రవర్తించటం - నివర్తించటం చేత కాబోలు, బాగా అలసిపోయి, ఇప్పటికి శాంతి కొరకై విశ్రాంతిని ఆశ్రయించుచున్నట్లున్నాడు. తాను చిరకాలం అనుభవించి ఇప్పటికి త్యజించివేసిన 'సంసారసాగరము' యొక్క గతిని గురించి విచారించుటచేత కాబోలు... అతడు మౌనంగా తీవ్రవైరాగ్యం ఆశ్రయించి యున్నాడు. అందుకు ఫలితంగా అనంతమగు ఈ జగత్తు యొక్క వ్యవహారమంతా గ్రహించాడు. కదలకుండా బిగించబడిన చక్రం ఎట్లాగైతే నిశ్చలంగా కనబడుతోందో... ఆ విధంగా అతడు నిశ్చలత్వం పొందియున్నాడు. 'ఏకాంతము'ను 'నిర్విషయత్వము'ను బైట, లోపల కూడా పొంది ఉంటున్నాడు. చిత్తము నశించి, భ్రమరహితుడై, ప్రశాంతంగా ఉండి ఉన్నాడు. చిత్తవృత్తులన్నీ అత్యంత సహజభావంతో నిరశించివేశాడు. 'నిర్వికల్ప సమాధి' యందు ప్రవేశించాడు. అట్టి అనిర్వచనీయ నిశ్శబ్దస్థితియందు నిర్మలబుద్ధితో కూడుకున్నవాడై, ఈ జగత్తు యొక్క గతిని అంతా చూస్తూ నవ్వుకుంటున్నట్లుగా ఉన్నాడు. సర్వ లోక వృత్తాంతమంతా సుస్పష్టంగా గ్రహించిన వాడయ్యాడు. అతనియందు ఇక కర్తృత్వముగాని, భోక్తృత్వముగాని ఏమాత్రం శేషించిలేదు. సమస్త కల్పనా వ్యవహారములను 'ఆత్మాస్మి' అనబడు దానియందు లయం చేసివేసి, ఉత్తమమైన బ్రహ్మపదమును ఆశ్రయించి ఉన్నాడు.

వ్యాపకమగు ఆత్మయందు విశ్రమించుచున్నవాడై, విశ్రాంతిని పొందుచున్నాడు.

ఒక నిర్మలమైన దర్పణంలో ఎదురుగా ఉండే దృశ్యం ప్రతిబింబిస్తుంది. అయితే, ఆ ప్రతిబింబిస్తున్న వస్తువులు అటూ ఇటూ కదులుచున్నంత మాత్రం చేత ఆ అద్దం కదులుతుందా?

లేదు కదా! ప్రతిబింబం గ్రహిస్తున్నపటికీ, ఆ దర్పణము యొక్క 'సుస్థిరత' అనే శోభకు వచ్చే లోటేమున్నది? ఇంద్రియాలకు తారసపడే విశేషలన్నీ కూడా అతని నిశ్చల మనస్సులో ఆ విధంగా ప్రతిబింబిస్తున్నాయి.

ఇప్పుడతనికి హేయమైనదంటూ (త్యజించవలసినదంటూ) ఏదీ లేదు. ఉపాదేయమైన దంటూ కూడా (స్వీకరించవలసినది, కోర తగినది) ఏమాత్రం ఏదీ లేదు. సంకల్ప-వికల్పములన్నీ వదలి, జ్ఞానయుక్తుడై, ధీరుడైయున్నాడు.

భగవానుడగు కాలుడు భృగుమహర్షిని కళ్లతోనే ఆప్యాయంగా సంబోధిస్తూ మరొక జన్మయొక్క అనుభవము నందు తన్మయుడైయున్న శుక్రాచార్యుని చూపాడు.

❖

కాలుడు : ఓ భృగుమహర్షీ! 'వాసుదేవుడు' అనబడే ఈ మీ కుమారుణ్ణి చూచారా? ఇప్పటికి ప్రశాంతుడైనాడు. నిర్వికల్పసమాధిని పొందియున్నాడు. బ్రహ్మ ఋషిసత్తములైన మిమ్ములను సంతోషింపజేయుటయే మావంటి నియతి స్వభావులకు కర్తృత్వమైన విషయం కదా! అందుచేత ఇతనిని సమాధి నుండి మేల్కొలుపుటకు ప్రయత్నం చేస్తాను.

ఇట్లు పలికి, కాలుడు శుక్రాచార్యుని సమీపించాడు. "ఓయీ! ప్రియ శుక్రాచార్య! లెమ్ము" అని గంభీరస్వరంతో పలికాడు. ఆ శబ్దం వినగానే శుక్రుడు సమాధి నుండి మేల్కొన్నాడు. నెమ్మదిగా కనులు తెరిచాడు. సూర్యచంద్రులవలె ప్రకాశించుచున్న కాలభగవానుని, భృగువుని చూచాడు. తటాలున ఆసనము నుండి లేచి, "అయ్యలారా! శివ-కేశవులవలె దర్శనమును ప్రసాదించిన మీ ఇద్దరికి సాష్టాంగదండప్రమాణం చేస్తున్నాను" అని వినమ్రతతో పలికాడు. వారికి స్వాగత సత్కారాలు ముగిసిన తరువాత ఆ ముగ్గురు ఒక శిలపై సుఖాసీనులయ్యారు.

శుక్రాచార్యుడు : మహాత్ములారా! మీ ఇరువురిని చూచిన తరువాత నాకు అనిర్వచనీయమైన శాంతి లభిస్తోంది. ఇప్పుడు నేను పొందుచున్న ప్రశాంతతో కూడిన ఆనందమును మాటలలో వర్ణించలేకపోతున్నాను. ఏ మోహమైతే శాస్త్రజ్ఞానముచే గాని, తపస్సుచేగాని, ఆయా విద్యా సముపార్జనలచే గాని నశించదో అట్టి మాయామయత్వమంతా మీ ఇద్దరిని దర్శించినంత మాత్రంచేత తొలగిపోతుంది. నిర్మలమైన అమృతం వర్షించినప్పుడు కూడా మీవంటి మహాత్ముల దృష్టిప్రసరణ వలె సుఖము కలుగుతుందా?... లేదు. తమ పాదపద్మముల దర్శనంచే నన్ను పావనం చేస్తున్న అతి తేజో సంపన్నులగు మీరిద్దరు ఎవరు? నాపై కరుణతో తెలియజేయండి.

భృగువు : నాయనా! ఇప్పుడు నీవు జ్ఞానివేగాని అజ్ఞానివి కావు. అందుచేత నిన్ను నీవే స్ఫురణకు తెచ్చుకొనుటకు ప్రయత్నించు. నీ ఉత్తమ తపస్సు యొక్క ప్రభావంచేత అంతా నీకే విదితం కాగలదు.

అట్లు బోధింపబడినవాడై, శుక్రుడు ధ్యానినిష్ఠుడైనాడు. దివ్య దృష్టిచే రెండు గంటల వరకు తన వివిధ జన్మల దశలను స్మరించాడు. ఆశ్చర్యముతో కొంచెము హాస్యయుక్తమగు ముఖము

కలవాడయ్యాడు. ప్రసన్నచిత్తము వీడకుండానే తనలో విషయమంతా తర్కించుకున్నాడు. అటు తరువాత ఇట్లు పలుకసాగాడు.

❖

శుక్రాచార్యుడు : ఆహాఁ! పరమాత్మ యొక్క మాయాశక్తి నియతి ఎంతటి ప్రబలమైనది! దాని యొక్క ఆరంభము ఎక్కడో, ఎప్పుడో, ఎవ్వరైనా ఊహించగలరా? చెప్పగలరా? ఆ మాయాశక్తియే కర్మవ్యవస్థకు కూడా కారణభూతమగుచున్నది. అద్దానికి వశమై ఈ విశాలమగు 'జగత్తు' అను చక్రం పరిభ్రమించుచున్నది. ప్రళయకాల సమయంలో "అగ్ని – వాయు– జల" సమ్మేళనం గొప్ప దుఃఖ మోహాలను జీవులకు తెచ్చిపెడతాయి చూచారా? అలాగే, నేను అనేక జన్మల అవసాన సమయాలలో "మరణము–మోహము–మూర్ఛ" యొక్క సమ్మేళనము పొందాను. 'రాజు' గా జన్మించిన సందర్భాలలో ధనోపార్జన, వందిమాగధుల పొగడ్తలు, శత్రుదేశ ప్రజల వినాశనానికై ఎత్తుగడలు వేయటం వంటి ఏవేవో తుచ్ఛమైన భ్రమలన్నీ పొందాను. దేవతారూపము ధరించినప్పుడు సుమేరు పర్వత ప్రాంతంలో సంచరించుచు, అక్కడగల నదులలోని జలం పానం చేశాను. పర్వత శిఖరముపైగల మనోహర ప్రదేశములలో విహరించాను.

అయ్యలారా! ఏమని చెప్పమంటారు? నేను చూడని వస్తువు లేదు. చేయని క్రియ లేదు. ఆయా ఇష్ట అయిష్ట దశలందు ఒకే వస్తువును, వ్యక్తిని, అనుభవమును ప్రేమించటం, ద్వేషించటం కూడా చేశాను. అనేక జంతు – పక్షి జన్మలలో ఆహార – నివాస – మైథునముల కొరకు ఎంతగానో గావుకేకలు వేశాను. అమ్మయ్యా! ఇప్పటికి 'పరమాత్మ స్వరూప జ్ఞానము' పొందాను. ఎరుగ వలసినది ఎరిగాను. అట్టి పరమాత్మ స్వరూపమునే మననం చేస్తూ కాలం వెళ్ళబుచ్చుచున్నాను.

ఏది చూచిన తరువాతైతే ఇక చూడవలసినదంటూ ఏదీ శేషించదో... అట్టి ఆత్మ వస్తువును నాయందు, సర్వులయందు, సర్వమునందు ఒకే తీరుగా గాంచుచున్నాను.

ఈ సంసార వాసనావశంచేత ఎంతో కాలంగా సుదీర్ఘమైన భ్రమ విభ్రమ వృత్తాంతములను పొందాను. ఇప్పటికి విశ్రాంతి లభించింది. నా భ్రమంతా పూర్తిగా నశించుచున్నది. నాయందు భ్రమ శేషించి ఉన్నంతకాలం నేను ఇంద్రపదవి పొందినా లేక విష్ణుపదవి పొందినా ఈ నా మనస్సుకు విశ్రాంతి లభించదని గ్రహించాను.

ఎద్దానితో అయితే నాకు ఏమాత్రం సంబంధం లేదో, అట్టి అవాస్తవమైన వాటి యందు భ్రమ–విభ్రమములను ఆశ్రయించాను. స్వసత్తను మరచి... సత్యస్వరూపుడనగు నేను... అట్లు ఏవేవో భ్రమలలో సంచరించటమేమిటి? ఎంతటి విచిత్రము? ఎంత అర్థరహితము?

ఆ విధంగా నేను ఎందుకు అంత దీర్ఘకాలం పరిభ్రమించానో నాకే అర్థమగుటలేదు. అందుకే కాబోలు, "మాయ అనిర్వచనీయమైనది" అని పెద్దలు అంటూ ఉంటారు.

తండ్రీ! ఇక లేవండి. మందరపర్వతంపై శుష్కించియున్న 'శుక్రుడు' అను పేరుతో పిలువ బడుచున్న ఉపాధిని మనమిప్పుడు సమీపిద్దాం. ఇక ఇప్పుడు ఈ ప్రపంచమునందు నాకు

పొందతగినట్టిదిగాని, త్యజించవలసినది గాని ఎక్కడా ఏదీ కనబడటం లేదు. కేవలం ఆ పరమాత్మ యొక్క మాయాశక్తి రచనను, అందలి చమత్కారమును ఒక లీలావ్యవహారముగా గాంచుచూ, సాక్షీభూతుడనై ఉండుటయే నేను చేయదగినది. ఇక భావనలోగాని, సంచారములో గాని, వేరే సమయంలోగాని ఎక్కడా ఏదీ పొందవలసినది లేదు. ఆత్మ సామీప్యతను పొందిన తరువాత, ఇంకేముంటున్నది? ఉండదు. కానీ, ఏం లాభం? చంకనున్న బిడ్డను మరచి దూరంగా ఎక్కడో ఏదో ఏడుపు వినిపిస్తుంటే, "అయ్యో! అక్కడ నా బిడ్డ ఏ బాధ చేత అట్లు రోదిస్తున్నాడో?" అని పరుగులు తీసే వెర్రి తల్లిలాగా అయినది నా సంచారమంతా!

ఓ భగవత్స్వరూపులారా! ఇతరులను సముద్ధరించుటలో మీరిద్దరు బహుప్రావీణ్యులు. అందుకే నా మనస్సులోని మాట బైట పెట్టుచున్నాను. ఇప్పుడు నాకు ఒకే ఒక్క పని ఎదురుగా ఉన్నది..... పరమాత్మ గురించి దృఢనిశ్చయం కలిగి ఉండటం.

జీవన్ముక్తులగు మీవంటి మహనీయులచే సర్వదా సేవించబడుచున్న 'ఆత్మపదము'ను అనుసరించి, తద్వారా ఈ జన్మ-కర్మలను పవిత్రం చేసుకోవటం ఎప్పటికైనా ఉపాయం కదా! అట్టి శుభదాయకమగు ప్రయత్నమే సర్వకళంకములకు ఏకైక ఔషధం. పూజ్యులైనట్టి మీ యొక్క అభిప్రాయమును అనుసరించి నాకు ఇప్పటి నుండి 'శుక్రాచార్య ఉపాధి' యందే జీవనవృత్తి సంభవించు గాక! వాస్తవానికి నాకిప్పుడు ఆ దేహమందుగాని లేక ఈ దేహమందుగాని ఎట్టి అభినివేశము ఏర్పడుటలేదు. ఎట్టి ఆసక్తి-పట్టుదలలు నేను పొందుటలేదు. కేవలం ప్రారబ్ధకర్మను అనుసరించి, నాపట్ల శేషించియున్న సాంసారిక వ్యవహారమును నిర్వర్తించుటకే ఈ ఇతఃపూర్వపు ఉపాధిని ఆశ్రయిస్తున్నాను.

బాల్యంలో ఆటబొమ్మలు, ఇసుకతో నిర్మించబడిన పిచ్చుక గూళ్ళు గొప్ప గొప్ప విషయాలుగా కనిపించవచ్చు. కాని ప్రౌఢ వయస్సులో... అట్టి వాటిపట్ల ఆసక్తి ఉంటుందా? ఉండదు కదా!

ఇప్పుడు నాకు 'అప్సరస' మొదలైన పదార్థములపట్ల ఆసక్తిగాని, రాగద్వేషములుగాని లేవు. వెలుతురు ప్రసరించేచోట చీకటికి స్థానమెక్కడిది? తత్త్వజ్ఞానదృష్టితో అభ్యసించబడేచోట ఇక 'సంసార వస్తువుల పట్ల ప్రియత్వము పెరుగుట' అనునది స్వయంగా నిరోధించబడుతుంది కదా!

అప్పుడా ముగ్గురు తత్త్వజ్ఞులు తమయొక్క "భావన-ఏకాగ్రత"ల ప్రభావంచేత సూక్ష్మ రూపమును దాల్చారు. ఆ క్షణంలో వారు ప్రాణవాయు సంచార మాత్రంచే ఏర్పడు క్రియా రూపముతో భాసించారు. ఈ జగత్తు యొక్క చిత్ర విచిత్ర గతుల గురించి సంభాషించుకుంటూ సమంగానదీ తీర ప్రదేశం నుంచి బయలుదేరారు. సిద్ధ మార్గం గుండా మందర పర్వతంపై భృగు మహర్షి ఆశ్రమం చేరారు. ఆ ప్రదేశంలో గల ఒక శిలపై శుక్రుడు తన శరీరం ఉండటం గమనించాడు. ఆ దేహము ఎంతో శుష్కించి, తడిసిన ఆకులతో కప్పబడి ఉన్నది.

❖

శుక్రాచార్యుడు : నాకు అత్యంత ప్రియులైన తండ్రీ! అనేక సుఖభోగములచే ఒకప్పుడు నేను ఎంతో ప్రేమగా చూచుకున్నది... ఈ రక్త-మాంస-బొమికల సముదాయమునే కదా? ఈ శరీరము ఒక సమయంలో స్నేహభావముగల 'దాది'చే కర్పూర-చందనములతో చాలా కాలం లాలించ బడింది. ఇక్కడ గల కొన్ని ప్రదేశాలలో పూతీగలతోను, పూలతోను ఊయలలు తయారుచేసుకొని, ఆ ఊయలలో పవళించి పిల్లగాలులు ఆస్వాదిస్తూ ఉండేది. వివిధ స్త్రీ-పురుషులచే వివిధ రీతులుగా చూడబడిన ఈ శరీరం ఇప్పుడు పాము లేళ్ళచే ఛిద్రం గావించబడి, నేలపై మూగగా, మౌనంగా నిద్రిస్తోంది. అనేక సుగంధములను ఆస్వాదించి, అనుభవించిన దీనికి ఎట్టి గతి పట్టింది? ఆ శోభలన్నీ ఏమైనాయి? ఇప్పుడు ఇది శుష్కించి మృతప్రాయమై మిగిలి ఉన్నదే! ఒకప్పుడు దేవకాంత పట్ల 'భోగేచ్ఛ'ను కలిగించిన ఈ శరీరం ఇప్పుడు శవావతారం ధరించి, పడి ఉన్నది! ఇప్పటి ఈ దేహము యొక్క నోరు ఒక బిలంలాగా ఉన్నది. సూర్యతాపంచే చర్మం కరడు కట్టి ఉన్నది. ఈ ఎండిన దేహం చూచి వనములోని మృగములు కూడా భయపడి దూరంగా నిలబడి చూస్తున్నాయి గమనించారా? వివేకము కలిగియున్న జీవుని దేహము, వాక్యము ఒక వర్చస్సు కలిగి ఉంటాయి చూచారా! అలాగే ఈ నా పొట్టభాగము సూర్యకిరణములు పడుచు న్నప్పుడు మిలమిల మెరుస్తోంది. శుష్కించిన నా భౌతిక దేహం ధరించియున్న ఈ గండశిల కూడా తుచ్ఛమైన కురూపత్వమునే ప్రదర్శిస్తున్నట్లుగా ఉన్నది. ఎండిన దేహము కలిగియున్న ఈ పర్వత శిఖరం మూగగా మౌనంగా మానవాళిని సంబోధిస్తూ ఏదో ప్రకటన చేస్తున్నట్లున్నది. ఈ దేహం పెద్ద గొంతుకతో "ఓ జనులారా! మీమీ తుచ్ఛ భౌతిక శరీరములు చూచుకుంటూ, 'ఆహాఁ! మేమెంత అందంగా ఉన్నామో!' అని భ్రమిస్తూ మురిసి పోతున్నారా? నన్ను చూడండి. మీ మీ శరీరములన్నీ కూడా నావంటివే కదా! స్వల్పకాలంలో ఎండి దుర్భరమైన అవతారం పొంద బోతున్నాయి"... అని గుర్తు చేస్తున్నట్లున్నది. శరీరము కలిగియున్నందుకు ఉత్తమ వివేకమునకై ప్రయత్నించకుండా కంచరగాడిదలవలె కాలయాపన చేస్తున్నందుకు ఈ జీవునిపై జాలితో తాను క్రుంగుచున్నట్లున్నది.

ఓ నా పాంచభౌతిక శరీరమా! నేను నీయందు కొంతకాలంగా ఉండకపోవుటచే నీవు "శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు" లేనిదానివయ్యావు. నీయందు ఎట్టి లోభము లేకపోవుటచే నిశ్చింతగా నిర్వికల్పసమాధిని అవలంబించి తీవ్రతపస్సు చేస్తున్నట్లుగా కనబడుచున్నావు. మహాత్ములారా! 'చిత్తము' అనే పిశాచం నుండి ముక్తి పొందియుండుటచే ఈ దేహం నిశ్చయంగా సుఖంగా కాలయాపన చేస్తోంది. "అయ్యో! దైవవశాత్తు ఎప్పుడు ఏ విపత్తులు వచ్చి పడ బోతున్నాయో?" అని ఈ జీవుడు సర్వదా అనుభవిస్తూ ఉండే తెలియరాని భయం ఈ దేహానికి లేదు. 'చిత్తము' అనే బేతాళుడు శమించుటచే ఇది 'ఆనందకళ'ను అనుభవిస్తోంది. ఇట్టి ఆనందకళ విశ్వవ్యాపకమైన సామ్రాజ్యం ఏలే చక్రవర్తికి మాత్రం చేకూరబోతోందా? లేనేలేదు. ఈ దేహము యొక్క సంశయాలన్నీ నశించాయి. ఓ మహాజ్ఞానులగు సద్గురువులారా! ఈ దేహమును చూస్తున్నారు కదా! ఇది ఎట్టి కౌతుకము లేకుండా, సర్వ కల్పనాజాలములను రహితం చేసుకొని, ఈ వనమందు ఎంత ప్రశాంతంగా చక్కగా పవళించి ఉన్నదో కదా!

చిత్త చాంచల్యము - అనేక కామ క్రోధ మోహములచే చాపల్యము పొంది అత్యంత సంక్షుభితమై ఉన్న 'చిత్తము' అనే కోతి 'శరీరము' అనే వృక్షంలో విచ్చలవిడిగా సంచరిస్తోంది. ఇక ఈ జీవుడికి శాంతి ఎక్కడిది? అట్టి చిత్తము ఇతనిని అనంతసంఖ్యలో స్థావర-జంగమ యోనులలో పడవేస్తోంది కదా! అయితే ఈ శుక్రాచార్యదేహం మాత్రం చిత్తము చేసే పిచ్చిపనుల నుండి తప్పించుకొని ఇక్కడ విశ్రమిస్తోంది. దూరంగా జరుగుచున్న సింహము-ఏనుగుల గుంపుల యొూ దీనిని భయపెట్టుట లేదు. యువతుల చర్మసౌందర్యం గాని, ధన దాహాదులు గాని, స్వలాభాదులు గాని, స్వాధిక్యతలు గాని ఈ దేహం మననం చేయటం లేదు. అందుచేతనే దుఃఖ రహితంగాను, బ్రహ్మానందము నందు మునిగి తేలుచున్నట్లుగానూ నాకు కనిపిస్తోంది. సమస్త ఆశలకు, హృదయ పరివేదనలకు, జ్వరములకు హేతువు కేవలం అజ్ఞానమే కదా! అట్టి అజ్ఞానాంధకారం పటాపంచలు కావాలంటే 'మనోరహితత్త్వము' అనే చేతి దీపం చక్కగా వెలుగుతూ ఉండాలి. సర్వ సాధనల యొక్క పవిత్ర లక్ష్యం మనోరాహిత్యమేనని జ్ఞానులు అంటూ ఉంటారు. అట్టి అమనస్కం తప్ప, ఈ జీవులకు నిజమైన శ్రేయస్సు కలుగజేసేది ఈ జగత్తులో ఇంకేమున్నది? "గొప్ప తపస్సుల యొక్క అంతిమ ఫలితమా?" అన్నట్లుగా ఈ దేహం గొప్ప అమనస్కం అనుభవిస్తోంది.

అయ్యలారా! మనోరాహిత్యము సంపాదించినట్టి గొప్ప బుద్ధిమంతులు సుఖము యొక్క పరాకాష్ఠను దర్శించుచూ ఉంటారు. సౌభాగ్యవశంచేత కాబోలు... ఈ దేహము ఏ దుఃఖమూ, సంతోషమూ లేకుండా మనస్సును వదిలించుకొని శాంతంగా ఉన్నది.

❖❖❖

10. జ్ఞానులు - దేహములు

శ్రీరాముడు : మహాత్మా! వసిష్ఠ మహర్షీ! ఇక్కడ నాకు ఒక సందేహం వస్తోంది. ఆ శుక్రాచార్యుడు అంతకుముందే ఎన్నో దేహములను మరల మరల అనుభవించివుంటాడు కదా! మరి ఆయనకి ఈ భృగుమహర్షి కుమారుని దేహం మీద అంతటి స్నేహభావం ఎందుకు ఉన్నది? అతడు చెప్పే మాటలుబట్టి, ఆ దేహమును అతడు కొంత అవిచారణ పూర్వకంగా... మమకారయుక్తంగా చూస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. అతడు దేహం కొరకు ఎందుకు విలపిస్తున్నాడు? అతడు జ్ఞాని కదా! జ్ఞానులు కూడా దేహాదులకు సంబంధించిన సుఖ-దుఃఖాలు అనుభవిస్తారా?

శ్రీ వసిష్ఠ మహర్షి : చాలా ఉత్తమమైన ప్రశ్న వేశావు. నీ ప్రశ్నకు సమాధానమును చాలా కోణముల నుండి పరిశీలించవలసి ఉంటుంది.

ఈ శుక్రాచార్యుని చైతన్యము ఇతఃపూర్వపు కల్పమునందే తన యొక్క స్వయం ప్రయత్నముల బలంచేత ఒక మహర్షియొక్క కుమారుడు అవటానికి, ఆశ్రమజీవనం, యోగదీక్ష మొదలైనవి పొందటానికి అర్హత సంపాదించుకొన్నది. ఈ జీవుల సమాగమాలన్నీ సంస్కారములు -ఋణములు-యోగ్యతలను అనుసరించి ఉంటూ ఉంటాయి. ఇతఃపూర్వపు కల్పము ముగిసి

నప్పుడు, అనగా అప్పటి ప్రళయము నందు ఈ శుక్రునకు సంబంధించిన దేహాకార కల్పన సంస్కార రూపమున శేషించియున్నది. అట్టి సంస్కారశేషము ఈ కల్పము యొక్క ఆరంభము నందు ప్రథమ శరీర భావము (The beginning identity of'SELF' with the 'BODY)చే భూతకోటితో సమత్వము పొందింది. అట్టి "దేహాకార - భావరూప చైతన్యము" ప్రాణక్రియా విశేషమును ఆశ్రయించింది. ఆ క్రియా విశేష ప్రభావంచేత 'సంస్కార శేషము', ఆ సంస్కార శేషం అన్నమును గ్రహించునట్టి అపాన వాయువునందు ప్రవేశించింది. అపానవాయు ప్రవాహం ద్వారా భావత్వముగా ఘనీభవించింది. 'హృదయము' అనబడుదానియందు ప్రవేశించి, క్రమంగా వీర్య దశను పొంది, తల్లి గర్భంలో శుక్రాచార్యుని దేహంగా రూపుదిద్దుకున్నది. అతనికి తండ్రియగు భృగువుచే బ్రాహ్మణోచితమగు ఉపనయనము, ధ్యాననిష్ఠ మొదలగు సంస్కారములు నిర్వర్తించ బడ్డాయి. ఆ దేహమే అక్కడ ఇప్పుడు శుష్కించి పడియున్నది.

ఈ కల్పము యొక్క మొట్ట మొదటయే (లేక ప్రథమ కల్పము నందే) మాయచే స్వయముగా 'చిత్స్ఫురణ' నుండి ఈ 'శుక్ర శరీర సంభావన' కలిగింది కదా! అందుచేత అతనికి శుక్రదేహము నందు అధికమైన ప్రీతి-స్నేహం కలిగి ఉండటం, దాని కొరకు అతడు విలపించడం జరుగుతోంది.

మరొక విషయం. ఈ జీవుడు కొన్నిటిపట్ల ఇచ్ఛ-భావనలను కలిగియుండటం, మరికొన్నిటి పట్ల విముఖత-తాత్సారం కలిగియుండటం చేస్తూ ఉంటాడు. చిత్ స్వభావమగు ఈ జీవుడు స్వీయకల్పనాచాతుర్యమును అనుసరించే కొన్నిటిపట్ల రాగదృష్టి ఏర్పడి ఉంటోంది. అట్టి జీవుల యొక్క ఇష్టాయిష్టములను అనుసరించే బ్రహ్మదేవుడు ఈ సృష్టిరచన అంతా సాగిస్తున్నాడు. సమంగానదీ తీరంలో ఒక ముని కుమారుడుగా తపస్సు చేస్తున్న శుక్రుని చిత్-చైతన్యము మాత్రం "నాకు ఏ దేహము పట్ల రాగాదులతో పనిలేదు. నేను ఇచ్ఛా-క్రోధ రహితుడను. నిర్లిప్తుడను" అని భావిస్తూ ఉన్నది. అయితే ఆ చైతన్యము యొక్క అంతరాంతరాలలో, "నేను భృగుమహర్షి యొక్క కుమారుడను. నా తండ్రి నిర్వికల్ప సమాధియందుండగా, నేను ఆయనను సేవించుచున్నాను" అను రూపముగల భావన శేషించియే యున్నది. అందుకే శుక్రాచార్యదేహమును అతనికి గుర్తు చేసినప్పుడు, అద్దానిని అతడు చూచి కొంత విలపించటం జరుగుతోంది. దేహముపై దృష్టి కలిగి యుండటమనేది దేహియొక్క స్వభావం అయివున్నది. ఒకడు జ్ఞాని కావచ్చు. అజ్ఞాని కావచ్చు. ఈ దేహము ఉన్నంతవరకు సదా అతని లోకవ్యవహారం ఈ రూపంలోనే ఉంటూ ఉంటుంది.

వాస్తవానికి, సమంగా నదీతీరంలో ఉన్నట్టి తపస్వి దేహము... శుక్రాచార్య దేహము... ఈ రెండింటి యొక్క భేదము కేవలం 'ఆసక్తి - అనాసక్తి'ల భేదం మాత్రమే.

జ్ఞానులు, అజ్ఞానులు: వారి వారి లోకవ్యవహారములు -

శ్రీ వసిష్ఠ మహర్షి : నాయనా! రామచంద్రా! ఈ జగత్తు యొక్క గతిని ఎరిగిన 'జ్ఞానులు', పశుధర్మము మాత్రమే కలిగి వర్తించుచుండే 'అజ్ఞానులు'... ఈ ఇద్దరూ కూడా ప్రవృత్తి విషయంలో లోకవ్యవహారములలో సమానంగానే ఉంటూ ఉంటారు. జ్ఞాని కూడా అజ్ఞానిలాగానే

ప్రవృత్తి-నివృత్తి ధర్మం కలిగి ఉంటాడు. ఇక వారిద్దరిలో భేదమేమిటంటావా?... జ్ఞానియందు వాసనలు సన్నగిల్లి ఉంటాయి. వాసనయొక్క ఉనికి-లేములే బంధ మోక్షములకు కారణ మౌతోంది. అంతేగాని, శరీర ప్రాప్తాప్రాప్తములను బట్టి బంధమోక్షములు ఉండవు.

"ఆసక్తి" అనునది ఏమాత్రం లేనట్టి గొప్ప బుద్ధి-ధీరత్వముగల మహాత్ములు కూడా ఈ దేహం ఉన్నంతవరకు తదితరులవలెనే దుఃఖ - సమయములందు దుఃఖమును, సుఖ సమయము లందు సుఖమును పొందుచున్నట్లు కనిపిస్తూ ఉంటారు. జలంలో కనిపించే సూర్య ప్రతిబింబము జలకదలికలను అనుసరించి తానే కదులుచున్నట్లు అనిపిస్తూ ఉంటుంది. కాని ఆకాశంలోని వాస్తవ సూర్యుడు ఈ జలతరంగాలతో సంబంధమే లేకుండా, కదలికలు పొందకుండా ఉండియే ఉంటున్నాడు కదా! జలము యొక్క క్షుభితత్వము (Perturbance) ప్రతిబింబ సూర్యుని కదలుచున్నట్లు చూపుచుండవచ్చు. కాని, ఆ విచలత్వము ఆకాశ సూర్యుని స్పర్శించగలదా? లేదు. అదేవిధంగా జ్ఞాని కూడా బాహ్యవృత్తిచే లోక వ్యవహారములందు పాల్గొనుచూ ఉంటాడు. తదితరులవలెనే ఆయా స్పందనలు కలిగియే ఉండవచ్చు.... అయితే, అంతరంగమున మాత్రం, "నేను నిత్యుడను. సర్వమునకు సాక్షిస్వరూపుడను. సర్వదా అచలుడను. ఈ శరీరాదులు, భావాదులు నన్ను బంధించలేవు. స్పృశించలేవు" అను ఎరుక కలిగి ఉంటాడు.

యథార్థ సూర్యుడు స్వస్థుడుగా ఉంటున్నప్పటికీ, జలంలో ప్రతిబింబించే సూర్యుడు అస్తవ్యస్థుడుగా, చంచలుడుగా కనిపిస్తాడు కదా!

జ్ఞాని వాస్తవానికి లోకవ్యవహారములన్నీ విమర్శ-అవగాహన సహాయంతో ఎప్పుడో త్యజించి వేసి ఉంటాడు. అయినప్పటికీ, బాహ్యమునకు మాత్రం తదితరులవలెనే ప్రపంచ వ్యవహారములందు నిమగ్నుడై ఉంటున్నట్లు ఇతరుల దృష్టికి కనిపిస్తాడు.

ఒకడు జ్ఞానేంద్రియముల దృష్ట్యా ఎట్టి ఆసక్తి ఏ మాత్రం కలిగియుండకుండా, కేవలం కర్మేంద్రియములచే ఆయా ప్రవాహపతితమైన కార్యములు నిర్వర్తిస్తున్నాడనుకో... అప్పుడు ఆసక్తి రహితుడగు అట్టివానిని "ముక్తుడు" అని అంటున్నాం. అట్లా కాకుండా, ఒకరి జ్ఞానేంద్రియములు ఆసక్తితో నిండి ఉంటాయనుకో... అప్పుడు కర్మేంద్రియములు కర్మలయందు పాల్గొనక పోయినప్పటికీ, అతడు 'బద్ధుడు' అనియే చెప్పబడుచున్నాడు. జ్ఞాన దృష్టితో ఈ విభాగం గ్రహించటం చాలా అవసరం. ప్రకాశం కలిగించటానికి కారణం అగ్నియే కదా! అట్లాగే ఈ ప్రపంచంలో 'సుఖ-దుఃఖ-బంధ-మోక్షములు' కలుగజేయటానికి కారణం జ్ఞానేంద్రియములే కాని, కర్మేంద్రియములు కానేకావు... అని కూడా గ్రహించు.

అందుచేత రామా! నీవు బాహ్యమునకు "ఎప్పుడు ఎక్కడ ఏది ఎట్లా" ఉచితమో అది అట్లే నిర్వర్తిస్తూ ఉండు. కర్మలను త్యజించటం కంటే, నీకు నియమించబడిన ఆయా కర్మలను నిర్వర్తించటమే ఉచితం. ఎందుకంటే తదితరుల వ్యవహారసరళి నీ ప్రయత్నములపై కార్యక్రమములపై ఆధారపడి ఉంటూ ఉంటుంది కదా! ఇక, అంతరంగమున మాత్రం వ్యవహార

రహితుడవై ఉండు. అనగా కూటస్థమగు ఆత్మయందు, "నేను ఈ శరీర-మనో-బుద్ధి -అహంకారాలను కాదు. వీటన్నిటికి పరమై ఉంటున్న జ్ఞాన-చైతన్య స్వరూపమగు ఆత్మయే నేను. అన్నిటా, అంతా అయి ఉంటున్నది నేనే. అట్టి ఆత్మ స్వరూపము అవధరించి ఉంటూనే ఈ శరీరమున ప్రవర్తనశీలత్వము ప్రకటిస్తూ ఉంటున్నాను." అను అవగాహనతో దృఢభావన కలిగి ఉండు. సర్వ వైషమ్యములు, సర్వకోరికలు, త్యజించివేసి నిశ్చింతుడవై ఉండు. అభిలాష-ఆసక్తి-ప్రియాప్రియ సంకల్ప పరంపరలు... వీటన్నిటినీ విడనాడివేసి, ఆత్మచే ఆత్మయందే స్థితి కలిగి ఉండు. ఇక ఆపై వర్తమాన కర్తవ్యములగు ఆయా కర్మలను ఎట్టి ఫలాసక్తి లేకుండా నిర్వర్తిస్తూ ఉండు. దేహం ఉన్నంతవరకూ ఏవేవి కర్తవ్యములో అట్టి కర్మలు నిర్వర్తించటం నిశ్చయంగా దేహ స్వభావమే అయి ఉన్నది. దేహమున్నంతవరకు దేహస్వభావమును ఎవరు త్యజించగలరు చెప్పు? అట్లు 'త్యజించాలి' అనే పట్టుదలను, "త్యజించలేకపోయానే" అనే నైరాశ్యాన్ని కూడా అధిగమించివేయి.

ఆధి వ్యాధి - ఓ రాఘవా! ఈ 'సంసారము' అనే సాగరంలో 'ఆధి-వ్యాధి' (మానసిక- శారీరక రుగ్మతలు) అనే విశాల కెరటాలు ఇష్టం వచ్చినట్లు సంచరిస్తున్నాయి. అయితే వివేకులైన వారు ఈ సంసార మార్గంలో పడుటలేదు. ఈ మార్గము మమత్వము అనే అంధకార కూపము లోనికి తీసుకునిపోయి "దుఃఖము-నిరుత్సాహము-భ్రమ" అనే ఉప్పునీటిలో ముంచి తేల్చగలదని వారు అల్లంత దూరం నుంచే గమనిస్తున్నారు. నీవు కూడా వివేకివై ఉండు. అంతేగాని "నేను-మేము-నాది-మాది" అనే జాడ్యాన్ని ఆశ్రయించకు. 'యథార్థదృష్టి'తో గమనిస్తే నీవు ఈ దేహాదుల ధర్మమునందు లేవు. ఇవేవీ కూడా నీవు కావు. ఇవి నీకు సంబంధించినవి కావు. సదా, సర్వదా, సర్వత్రా వెలుగొందుచున్నట్టి నిత్య-శుద్ధ-బుద్ధ స్వభావముగల ఆత్మయే నీవు. కాబట్టి "అంతర్వృత్తి" యొక్క ప్రభచే అట్టి ఆత్మయొక్క విలక్షణత్వమునందే సుస్థిరుడవై ఉండు.

నిర్మలము, శుద్ధము, సర్వాత్మకము, సర్వకర్త అయినట్టి బ్రహ్మమే నీవు సుమా!

ఇదే అర్థమును "తత్త్వము" (తత్+త్వమ్) అను మహాపదముచే వేదోపనిషత్తులు ప్రపంచమునకు చాటి చెప్పుచున్నాయి.

"సర్వ ప్రశాంతుడను, జన్మ-మృత్యు రహితుడను, విశ్వస్వరూపుడను అగు పరమాత్మను నేనే అయి ఉన్నాను" అను భావన అలవర్చుకోవటం అభ్యాసం చేత తప్పక సుసాధ్యమే.

సర్వ అభిలాషలను విస్తరింపజేసేది, అవిద్యాదోషరహితమూ అయినట్టి నిర్మలమగు "ఆత్మపథము"ను అవధరించు. 'మమత్వము' (నాకు చెందినవి, నాకు సంబంధించినవి) అను ఘోరాంధకారమును "జ్ఞానదృష్టి" అనే దీపపు వెలుగు సహాయం చేత పారద్రోలి వేయి.

చిత్తమును నశింపజేయుటయందు సమర్థుడవై ఉండు. చిత్తము జయించబడిందా, మరు క్షణం అనంతబుద్ధియుక్తము, పరమార్థస్వరూపము అగు బ్రహ్మము నీకంటే వేరైనది కాదని నీవే గ్రహించగలవు.

ఇక ఆపై 'జీవుడు' అనబడే అప్రతిష్ఠ నీయందు ఆపాదించబడజాలదు. ఎందుకంటే, 'అజ్ఞానము' తప్ప, జీవుడు అనబడేవాడు వేరుగా ఎక్కడా లేదు.

ఎప్పుడైతే నిన్ను నీవు సర్వాత్మకమగు నిష్కళంక పరబ్రహ్మముగా దర్శించుచూ ఉంటావో, అప్పుడు అట్టి జ్ఞానయోగమును ప్రదర్శించుచున్న నీకు ఋషులమగు మేము కూడా నమస్కరిస్తూ ఉంటాము.

అట్టి పరబ్రహ్మస్వరూపుడవగు నీవు ఈ జగత్తుకు వందనీయుడవగుచున్నావు.

❖❖❖

11. శుక్రుని పునరుజ్జీవనము

ఓ రామచంద్రా! ఇక మనం ప్రస్తుత కథావ్యవహారానికి వద్దాం.

ఆ విధంగా శుక్రాచార్యుడు తన ఇతఃపూర్వపు దేహమును చూచి కొంత వేదన పొందాడు కదా! ఆ ప్రక్కనే ఉన్న కాలభగవానుడు శుక్రుని విలాపమంతా విన్నాడు. అతనికి శుక్రుని వాక్యము లలో కొంత అయోగ్యత కనిపించింది. సుజ్ఞానయుతులగువారు, ఆశ్రితులయందలి అజ్ఞానము తొలగించుటయే కర్తవ్యముగా కలిగియుంటారు కదా! అందుచేత ఆ కాలుడు మేఘ–గంభీర స్వరముతో ఇట్లు పలుకసాగాడు.

కాలుడు : ఓ శుక్రుడా! తెలుసుకొనవలసినదంతా తెలుసుకొనినవాడా, ఈ శరీరమును చూచి ఇట్లు పరవశుడగుచున్నావేమిటి? అజ్ఞానముచే జనించుచున్న సర్వవేదనలను నిశ్చింతగా త్యజించివేయి. ఒక రాజు ఒక నగరం త్యజించి మరొక నగరం ప్రవేశిస్తాడు చూచావా? ఆ రీతిగా, నీవు ఈ తాపసుని శరీరం త్యజించు. భృగువు కుమారునిగా ప్రసిద్ధికెక్కిన ఈ శుక్రదేహమున ప్రవేశించు. నాయనా! ఈ సృష్టినంతటినీ పరిపాలించున్నట్టి 'నియతి'ని అనుసరించి నీవు ముందుముందు అనేక కార్యక్రమములు నిర్వర్తించవలసియున్నది.

'ప్రారబ్ధము' యొక్క ఉద్బోధను అనుసరించి ఈ శరీరముతో కూడి, ముందుగా గొప్ప తపస్సు ఆచరిస్తావు. ఆ తరువాత దైత్యులకు కులగురుత్వము నిర్వర్తిస్తావు.

మహాకల్పాంతమువరకు రాక్షసులకు గురువుగా స్వధర్మము నిర్వర్తిస్తూ ఉంటావు. ఆ తరువాత 'దేహత్వము' అనబడుదానిని త్యజించివేసి విదేహముక్తుడవు అవుతావు. ఈ శరీరమును ఆ సమయంలో స్వయముగా ఎండిన పూలమాలను త్యజించినట్లు, త్యజించివేయగలవు. ప్రారబ్ధ కర్మ యొక్క ఫలితమైన ఈ దేహముతో బలి, హిరణ్యకశిపుడు మొదలైన గొప్ప రాక్షసరాజులకు గురుత్వము వహించి తద్వారా లోకములకు పూజనీయుడవు అవుతావు.

ఓ భృగు–శుక్రాచార్యులారా! మీ ఇద్దరికి శుభమగు గాక! ఇప్పుడు నేను నా అభిమతమై యున్నట్టి ఆత్మస్థానమునకు పోవుచున్నాను. అట్టి స్వయం నివృత్తి స్వరూపమగు 'ఆత్మస్థితి'యే పరమ ప్రేమ స్వరూపము కదా!

భృగుమహర్షి : పరమేశ్వరా! కాలదేవా! ఈ రోజు మాకు సుదినం. సుహృద్భావ ప్రసంగముచే మీరు అనేక విషయములు విశదపరచారు. మీకు మేమిద్దరం కృతజ్ఞులం. చిత్తముచే

పరిమితత్వము పొందుచున్న మేము మాయచే ప్రభావితులమై, సంసారదృష్టి కలిగియుండటం, మిమ్ములను దూషించబోవటం చేసినందుకు క్షమించ ప్రార్థిస్తున్నాను.

కాలుడు : చివరగా ఒక ముఖ్యమైన విషయం చెప్పుచున్నాను. వినండి–

పరమాత్మయందు "ఇది అభిమతము", "ఇది అభిమతము కాదు" అను రూపము గల ఒక వికల్పము ఏర్పడుచున్నది. అప్పుడు అభిమతమగుచున్నదానిని గ్రహించటం, అభిమతం కాని దానిని త్యజించటం ఆ పరమాత్మయే స్వయముగా నిర్వర్తిస్తున్నాడు. అట్టి నిర్వహణయే చిత్తము యొక్క రూపము సుమా! అట్టి ప్రియము అనబడు చిత్తత్వమును ఆత్మయందు లయింపజేసి అఖండభావన యందు నిశ్చలత్వము వహించి ఉండువారు ధన్యులు. అందుచేత గురువులు ఆ చిత్త చికిత్సను దృష్టిలో పెట్టుకొని బోధిస్తూ ఉంటారు. మీరు కూడా లోకశుభం కొరకు గురువులై ప్రకాశించెదరు గాక! మీకు సర్వదా శుభమగుగాక!

కాలదేవుడు ఇట్లు పలుకుచుండగా వారిరువురు కాలదేవునితో ఏర్పడిన స్నేహాధిక్యతచేత కంటతడిపెట్టారు. భూమ్యాకాశములు రక్తవర్ణంలో తప్తమై ఉంటూ ఉండగానే సూర్యుడు తన కిరణజాలములతో సహా అస్తమిస్తాడు చూచావా? సముద్రంలో పెద్ద కెరటం లేచి, చూస్తూ ఉండగానే జలంలో లయించుతుంది చూచావా! అదేవిధంగా ఆ కాలభగవానుడు అంతర్ధాన మైనాడు. అప్పుడు శుక్రుడు కించిత్ ఆశ్చర్యపడుతూ, కాలదేవునికి చేతులతోను, హృదయము తోను, కళ్ళతోను నమస్కారం పూర్తి చేసి శుక్రదేహము ఉన్నవైపు తలత్రిప్పాడు. ఆవశ్యం ఆచరించ వలసియున్న భావికర్మలగతిని, 'ఈశ్వరేచ్ఛ' యొక్క అనివార్యత్వమును గమనించి కొన్ని క్షణాలు 'యోచన' గడిపాడు. తాను తపోధ్యానాదులచే సంపాదించియున్న యోగబలం చేత 'వేదన' అను దానిని పూర్తిగా త్యజించి, చిరునవ్వుతో చుట్టూ కలియజూచాడు. తండ్రియొక్క అనుజ్ఞను ఆశీర్వాదమును స్వీకరించి ఒక చోట స్థిరాసనం స్వీకరించాడు.

'వాసుదేవుడు' అనే పేరుతో పిలువబడే 'సమంగానదీతీర–తాపసి'కి సంబంధించిన మననము అధిగమించాడు. మెల్లగా కనులు మూసుకొని యోగ – సమాధులను అవధరించాడు.

వాసుదేవ శరీరం చైతన్యముచే త్యజించబడుటచే నీలవర్ణము పొందింది. క్షణాలలో నిర్జీవమై నేలకూలింది. వనంలో వసంత ఋతువు ప్రవేశించునట్లు శుక్రుని చైతన్యసత్త శుక్రదేహములో ప్రవేశించింది.

తన పుత్రుడు శుక్ర–దేహంలో జీవుడు ప్రవేశించగానే మహామునియగు భృగువు తన కమండలములోని జలమును మంత్రసహితంగా ఆ శరీరముపై సంప్రోక్షం చేశాడు. మరుక్షణం ఆ దేహం వికాసం పొందనారంభించింది. వెంట్రుకలు, గోళ్ళు క్రమంగా చైతన్యవంతం కాసాగాయి. ప్రాణవాయువు శరీరమంతా ప్రవహించసాగింది. జల–వాయుసంయోగంచే సముద్రం పొంగినట్లు శుక్రాచార్యుడు లేచి నిలబడ్డాడు. ఉల్లాసము పొందినవాడై నామ–గోత్ర –కీర్తన పూర్వకంగా పరమపవిత్రుడగు తన జనకునికి సాష్టాంగ నమస్కారము చేశాడు.

ఇతఃపూర్వంలాగానే 'సౌందర్యం' 'అలంకారము'లతో శోభిస్తున్న తన కుమారుని శరీరమును భృగువు ప్రేమగా చూచి, స్నేహపూర్వకంగా ఆలింగనం చేసుకున్నాడు. మరల ఒక్కసారి పుత్రుని చూచి జ్ఞానయోగ దృష్టిచే, తన అంతరంగంలో, "ఆహాఁ! ఇదే కదా, 'నాకు చెందిన దేహము' అను భావనచే భ్రమలో పడ్డాను!" అనుకున్నాడు. తత్త్వదృష్టిచే ఈ భావన ఉచితం కాదని అతనికి తెలిసియుండుటచే అతని పెదవులు చిరునవ్వు వీడలేదు.

శ్రీరాముడు : "ఇతడు నా పుత్రుడు" అను స్నేహపూర్వకభావం భృగుని చిత్తము కొంచెము ఆక్రమించుకునే ఉన్నదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును మరి. శరీరం ఉన్నంత వరకు ప్రారబ్ధవేగము చేత ఆ శరీరం పట్ల మమత్వము ఉదయిస్తూనే ఉంటుంది. ఇది దేహధర్మమే అయి వున్నది. అయితే, జ్ఞానులు అన్ని పరిస్థితులలోనూ సమగ్రమైన అవగాహనను ఏమాత్రం వదలరు. అందుచేత 'మమత్వము' అను దాని యందు తాదాత్మ్యము చెందరు. అనగా, 'నేను ఆత్మయే స్వరూపముగా కలవాడను. ఇదంతా ఆత్మ యొక్క విన్యాసమే...!" అను రూపంలో ఉండే ఆత్మతోటి అనుసంధానము కోల్పోరు. ఇక అజ్ఞానులలో, ఈ సంబంధములే సత్యములని, సర్వస్వమని భావించి వీటితో స్నేహ-ద్వేష భావములను మరల మరల పొందుచూ ఉంటారు. ఫలితం? ఆత్మస్థితికి అత్యంత దూరంలో విన్యాసాలు చేస్తూ, కుంటికులాసాలు ఉంటారు.

ఇప్పుడు ఆ తండ్రీ - కొడుకులిద్దరు ఒకరి వలన మరొకరు శోభను పొందారు. చిరకాలపు వియోగం చేత దంపతులు ఒకరిపట్ల మరొకరు అత్యంత స్నేహబద్ధులై ఉంటారు చూచావా! అట్లా వారి సమాగమము అత్యంత ప్రీతి గొల్పుచుండేది. వారు ఒకరి కోసం మరొకరు ఎంతగానో తపించి ఉన్నారు కదా! అందుచేత కొద్దిసేపు ఆనందప్రవాహంలో జడీభూతులైనారు. అక్కడి నుండి లేచారు. అక్కడి వాసుదేవ శరీరమును భస్మీభూతం చేశారు. మంత్రపూర్వకంగా 'విధి'ని నిర్వర్తించారు. సజ్జనులు వారికి నిర్ణయించబడిన సదాచారములను త్యజించరు సుమా!

ఆ తరువాత వారిద్దరు ఆ మందరపర్వతంపై ప్రశాంతంగా తపస్సు చేసుకుంటూ, ఆకాశంలో సూర్య చంద్రుల వలె ప్రకాశించారు. ఎరుగవలసిన బ్రహ్మవస్తువును "అనుభవము, అనుభూతి" రూపంగా గ్రహించారు. జీవన్ముక్తులు, జగద్గురువులు అయినట్టి ఆ ఇద్దరు మహాత్ములూ అక్కడ చాలా కాలం విహరిస్తూ ఉండేవారు. దేశ-కాలములచే అందించబడే హర్ష-విషాదములు వారిని తాకలేకపోయేవి. ఆత్మ-స్వరూపమున స్థితి పొందినవారికి హర్ష విషాదములు, శుభాశుభములు, కలిమిలేములు స్వల్పవిషయములుగానే కనబడతాయి కదా!

కొంతకాలానికి శుక్రాచార్యునికి అసురగురుత్వము, గ్రహాధికారము లభించాయి. భృగువు తనకు యోగ్యమైనట్టి నిరామయమగు 'ప్రజాపతిదినము' నందు సుస్థిరుడై ఉన్నారు.

❖

చూచావా రామా! ఆ శుక్రాచార్యుడు మొట్టమొదట పరమపదమగు పరమాత్మ యందు సుస్థిరుడై ఉండేవాడు. ప్రశాంతంగా తండ్రి సేవలో కాలం గడుపుతూ ఉండేవాడు. ఆ తరువాత తన "స్మృతి పథము" నందు ఆరూఢమైయున్న అప్సరస కొరకై మనోరాజ్య విభ్రమము పొందాడు. దశదిశల పరిభ్రమించాడు. మరల కాలభగవానుని యొక్క భృగుమహర్షి యొక్క, కటాక్షముచే స్వస్థమగు 'ఆత్మ స్థితి'ని పొంది ప్రకాశించాడు.

❖❖❖❖

III. భృగు - యమ సంవాదము - తదనంతర చర్చ

1. చిత్తము - ప్రాప్తాప్రాప్తములు

శ్రీరాముడు : మునీంద్రా! భృగుని కుమారుడైన ఆ శుక్రునికి తన యొక్క మనోరథ ప్రతిభ (force of his own wish) చేతనే స్వర్గలోక సంచారం, దేవకన్యతో సాంగత్యం మొదలైనవి ప్రాప్తించాయి కదా! ఈ విషయంలో నాదొక సందేహం. ఈ జీవులలో ఎందరో ఏవేవో మనోరథములు కలిగి ఉంటున్నారు కదా! మరి, అనేకుల యొక్క "నేను ఇది పొందుతాను. ఇవి చేస్తాను" అను ప్రతిభ సఫలం ఎందుకు అగుటలేదు?" "నేనిప్పుడు స్వర్గము చేరి సర్వ సుఖములు అనుభవించెదను గాక" అని సంకల్పించగానే ఎవ్వరికైనా అట్లే ప్రాప్తించాలి కదా? ప్రాప్తించుటలేదేం?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఏదైనా ప్రాప్తించాలంటే భావనయొక్క పరిశుద్ధత, ఏకాగ్రత అవసరం. శుక్రాచార్యుడు తాను పొందాలని కోరుకొన్నది తన మనోరాజ్యంలో సఫలమై పొందటానికి కారణం ఇతఃపూర్వపు కల్పమునందలి అతని ప్రయత్నాదుల ఔన్నత్యమే. పూర్వ కల్పమునందలి అతని అంతిమ జన్మయందు గొప్ప ఉపాసనాదులచే ఏకాగ్రతను, లక్ష్యశుద్ధిని, సాధించటంలో ప్రావీణ్యతను అలవరచుకుని ఉన్నాడు. ఉత్తమ సంస్కారములు, ఆత్మతో తాదాత్మ్యము కొరకై ఆశయము పొంది ఉన్నాడు. అందుకు ఫలితంగానే 'బ్రహ్మఋషి'కి పుత్రుడై కళంకరహితమైన జన్మను పొందాడు. ఈ కల్పము యొక్క ప్రారంభంలో సత్యాత్మ యొక్క భావనను పొందుటకు అర్హమైన "మానవ-మునికుమార-విద్య-సమృద్ధి"లతో కూడిన జన్మను సంపాదించాడు.

శ్రీరాముడు : తండ్రీ! 'సత్యాత్మ భావన' అనగా ఏమిటో... మరికొంత వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : సర్వకోర్కెలు నశించినప్పుడు అట్టి స్థితిలో శేషించే చిత్తము యొక్క స్థితియే 'సత్యాత్మభావన' అను పేరుతో చెప్పబడుతోంది. దానినే "నిర్మల చిత్స్వరూపము" అని కూడా పిలుస్తూ ఉంటారు. ఎప్పుడైతే ఈ చిత్తము నిర్మలము, సత్యాత్మ స్వరూపము అవుతుందో - అట్టి చిత్తము ఎల్లా భావన చేస్తుందో అది ఆ విధంగానే శీఘ్రంగా అవుతూ ఉంటుంది.

శుక్రుని చిత్తములో ఒక చమత్కారమైన విభ్రమము ఏర్పడినట్లు మనం కథలో చెప్పుకున్నాం కదా! ఏ విధంగా స్వయంగానే అతని చిత్తమునందు విభ్రమము ఉత్పన్నమైనదో, అదే విధంగా ప్రతి జీవునియందు చిత్త విభ్రమము ఉత్పన్నమౌతోంది. 'ఆత్మస్వరూపభావన' నుండి చ్యుతి పొంది బాహ్యదృష్టిని ఆశ్రయించి చైతన్య సత్తయే శాస్త్రకారులచే 'జీవుడు' అనే పేరుతో పిలువబడుతోంది. ఒక విత్తనమే - అంకురము, కాండము, ఆకులు, కాయలు, కొమ్మలు - మొదలైన రూపములుగా అగుచున్నది. అలాగే, సమస్త ప్రాణుల యొక్క "స్వయం కల్పిత భ్రాంతి"యే ఈ ద్వైతవిభాగమును ఏర్పరచుచున్నది. అది స్వస్వరూపవిస్తారం అయి, ఇట్లు, తనను తానే ప్రకటించుకొనుచున్నది.

ఈ ఎదురుగా ఉండి, 'ప్రపంచము' అని చెప్పబడుచున్న దృశ్యవ్యవహారమంతా ప్రతి జీవుని చిత్తము నందు మిథ్యారూపముగా ఉదయిస్తోంది. మిథ్యారూపముగా ఉనికిని కొనసాగిస్తూ... ఎప్పుడో మిథ్యారూపముగానే లయం పొందుచున్నది.

కాని, యథార్థానికి ఈ జగత్తు ఉత్పన్నమగుట లేదు, నశించుటలేదు. మాయచే ఉన్మత్త స్త్రీలాగా ఈ జగత్తు రూపంగా తనయొక్క ప్రభావమును ప్రకటించుచున్నది.

నాస్తమేతినచోదేతి జగత్కించన కస్యచిత్ ।
భ్రాంతి మాత్రమిదం మాయా ముగ్ధేవ పరిజృంభతే ॥ (సర్గ 17, శ్లో. 8.)

ఇప్పుడు మన అనుభవములలో వేరువేరు విధములుగా ఈ జగత్తు ప్రత్యక్షమై ఉంటోంది. అనగా, ఒక ముని అయినట్టి నాకు ఒక రీతిగా, ఒక రాజు అయినట్టి నీకు మరొక రీతిగా స్వయంకృతమైన కార్యక్రమాలను అనుసరించి ప్రాప్తిస్తోంది కదా!

అట్లాగే తక్కిన జీవులకు కూడా మిథ్యారూపములైన వేరు వేరు జగత్తులు ప్రత్యక్షముగా కనిపించుచున్నాయి. వేరు వేరు విషయములు వేరు వేరుగా "ఇది దుఃఖకరము, ఇది సుఖకరము, ఇది అవశ్యము, ఇది అసంగతము, ఇది సవ్యము, ఇది అపసవ్యము".... అని నిర్వచించబడి దర్శించబడుచున్నాయి. అయితే ఒకనికి కనబడే 'జగద్భ్రమ' యొక్క రీతి మరొకరికి కనిపించుట లేదు. ఎవరి భ్రమ, సుఖ-దుఃఖములు, భావాభావములు - వారివే అగుచున్నాయి. ఒకడు తన స్వప్నంలోనో, సంకల్పనగరంలోనో చూచుచున్న వ్యవహారం ప్రక్కనేవున్న మరొకనికి కనిపిస్తోందా? లేదు కదా! అదే విధంగా ఒక జీవుని యొక్క భ్రమతో కూడిన "జగద్దర్శనము" మరొక జీవునికి అట్లుగాక వేరొక విధంగా ఉంటోంది. "సంకల్పము" అనబడే బహువిస్తీర్ణమైన ప్రదేశంలో 'జగద్రూపములు' అనే అసంఖ్యాకములైన నగర సమూహములు ఏర్పడుచున్నాయి. "ఇవన్నీ మిథ్యయే" అనే అవగాహన ఒక్క జ్ఞానదృష్టి కలవానికి మాత్రమే నిర్దుష్టముగా ఏర్పడుచున్నది. మాయచే ఆశ్రయించబడిన జీవుడు "ఇదంతా వాస్తవమే" అను రూపం గల భ్రాంతిని పొందుచూ, అనుభవించుచున్నాడు. ఒక్క మానవులే కాదు. దేవత-రాక్షస జీవులు, పిశాచ-యక్ష జీవులు కూడా ఈ విధంగానే ఉంటున్నారు.

అంతే కాదు. మనమందరం కూడా శుక్రుని లాగానే సంకల్పమాత్ర శరీరులమే! 'మిథ్య' అయిన దానిని సత్యముగా తలచుచు ఇట్లు ఉత్పన్నమైనాము.

ఈ వ్యష్టియే కాదు. వ్యష్టి (Individual) కి పరమైనట్టి సమష్టి సృష్టి అహంకారియగు హిరణ్యగర్భ రూపుడు' కూడా 'ఈ జగత్ సృష్టి పరంపరలు' ఈ విధంగానే మిథ్యారూపంగా పొందటం జరుగుతోంది. ఈ అనేక ఉపాధి - వస్తు జాలముల నిర్మాణము వెనుక ఏర్పడి ఉన్న ఇచ్ఛాశక్తియే హిరణ్యగర్భుని ప్రదర్శన.

వాస్తవానికి ఈ వ్యష్టి-సమష్టి జీవులిరువురు ఆత్మస్వరూపులే అయివున్నారు. 'అవస్తువు' అయినట్టి ఆత్మ యందు "జగత్తు-శరీరము" మొదలైన వస్తుత్వమంతా ఎట్లా ఉంటుంది? ఎట్లా

ప్రవేశిస్తుంది? ఎక్కడినుండి ప్రవేశిస్తుంది? లేదు. కనుక శరీరాదుల రూపంలో స్ఫురించేదంతా మిథ్యయే అయివున్నది.

ప్రతి చిత్తము నందు మిథ్యారూపమగు జగత్తు ఉంటూనే ఉన్నది. "ఆత్మచే ఆత్మయందు ప్రథమ సంకల్పము" ఏర్పడుచున్నది. అట్టి ప్రథమ సంకల్పం 'ఆత్మయందు ఈశ్వరత్వము' అని శాస్త్రాలచే (వేదాలచే) చెప్పబడుతోంది. సంకల్పము చేతనే ఈ జగత్తు వ్యవస్థితి పొందియున్నది. తత్త్వజ్ఞానము పొందుటచే ఈ జగద్రూపస్థితి ఏ విధంగా ఏర్పడినదో తప్పక గ్రహించబడగలదు. ఉత్తమ ప్రయత్నము, అవగాహనలను ఆశ్రయించుచున్నవారు, "అనాదియగు అజ్ఞానమునందు స్థితిపొంది యున్న ఈ చిత్తమే అనేక విధములుగా కార్యయుక్తమగుచున్నది" అని జ్ఞానులు ఎఱుగు చున్నారు. అట్లు ఏర్పడు 'ఎఱుక' యొక్క ప్రభావంచే ఈ చిత్తము తనంతట తానే నశించుచున్నది.

❖❖❖

2. సత్యవస్తు విచారణ

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నీటి కదలికలను అనుసరించి నీటిలో ప్రతిబింబిస్తున్న సూర్య బింబము పైకి-క్రిందికి కదులుచున్నట్లు అనిపిస్తూ ఉంటుంది. నీటిలోని సూర్యుని చూడటం మానేసి, ఆకాశంలోని సూర్యుని చూచామనుకో... అప్పుడు నిశ్చల స్వభావుడగు సూర్యుడు కనబడతాడు. కదులుచున్న మేఘాలతో కలిపి చంద్రబింబమును చూస్తూ ఉంటే, చంద్రబింబం మేఘకదలికలను అనుసరిస్తూ ఉన్నట్లుంటుంది. మేఘాలు మన 'దృష్టి'ని ఆకర్షించకపోతే అప్పుడు నిశ్చల చంద్రుడు అగుపిస్తాడు. అదేవిధంగా 'ప్రతిభాస' (reflective) అనబడు ద్వితీయ విశేషముతో కూడిన అవగాహనాదులు ఉన్నపుడు మాత్రమే 'జగత్తు' అనబడేది అనుభవమవటం జరుగుతోంది. సత్య వస్తువగు బ్రహ్మము సాక్షాత్కరించిన తరువాత ఇక 'జగత్తు' అనేది ఉండదు. ఒక ఏనుగు కట్టుకంబమునకు కట్టివేయబడుతూ ఉంటుంది కదా! అట్లాగే 'చిత్తము' అనబడే ఏనుగుకు ఈ జగత్తే కట్టుకంబము సుమా!

చిత్తము యొక్క ఉనికియే జగత్తు. జగత్తు యొక్క ఉనికియే చిత్తము.

చిత్తమును అనుసరించే జగత్తు ఉంటుంది. చిత్తము లేని చోట జగత్తు కూడా లేదు.

చిత్తము - జగత్తులలో ఒకటి నశిస్తే, రెండవది కూడా తనంతట తానే నశించుచున్నదని గ్రహించు. అయితే అట్టి ఈ "జగత్తు యొక్క లేదా, చిత్తము యొక్క"... నాశనము 'సత్యవస్తువును గురించిన విచారణ" చేత మాత్రమే సాధ్యం.

చిత్సత్తైవ జగత్సత్తా జగత్సత్తైవ చిత్తకమ్
ఏకాభావాద్ద్వయోర్నాశః స చ సత్యవిచారణాత్ (సర్గ 17 శ్లో.19)

మట్టిచే దోషయుక్తంగా ఉన్న మణిని శుభ్రమైన నీటిలో కడిగినప్పుడు ప్రకాశవంతంగా స్వచ్ఛంగా కనబడుతుంది కదా! ఈ చిత్తములోని దోషములు రహితం చేయబడినప్పుడు, అట్టి శుద్ధ చిత్తమే పరమాత్మ యొక్క స్వరూపము! లేక అదియే పరమాత్మ! అదియే సత్యస్వరూపము!

శుద్ధ చిత్తం, విశేషములు - శుద్ధ చిత్తం తన యందు దేనిని ప్రతిభాసింప చేసుకుంటుందో, అది 'సత్యమే' అయి ప్రాప్తిస్తుంది. అనగా, శుద్ధచిత్తము దేనిని స్వయముగా ఎట్లా సంకల్పించటం జరుగుతుందో, అది అట్లే సత్యమైన అనుభవంగా రూపము పొందుతోంది. శుద్ధ చిత్తము యొక్క ఏకాగ్రత స్వల్ప సమయంలో సఫలం అవుతుంది.

"చిత్తము శుద్ధ పరచుట" అనునది ఒక్కటే ఈ జన్మల – కర్మల యొక్క ఉత్తమోత్తమమైన ఆశయము. ఇక తదితరములన్నీ తత్సంబంధమైన – తదుచితమైన ఆశయములు మాత్రమే.

అయితే, ఈ చిత్తం శుద్ధం కావాలంటే ఏమి చేయాలి? చిరకాలంగా ఏకాగ్రత అభ్యసించుటే అందుకు మార్గం. నీరు నిశ్చలంగా ఉన్నప్పుడే ఆకాశములోని ఆయా విశేషములు తటాకంలో స్పష్టంగా ప్రతిబింబిస్తాయి కదా! అదే విధంగా, ఈ చిత్తము వివిధ సంకల్పములచే కలుషితం అవకపోతే, అద్దానియందు అత్యంత సులభంగా అద్వైత రూపముతో కూడిన ఆత్మ జ్ఞానము, ఆత్మ విజ్ఞానము ప్రతిభాసిస్తాయి.

చిరమేక దృఢాభ్యాసా చ్ఛుద్ధిర్భవతి చేతసః ।
అనాక్రాన్తస్య సంకల్పైః ప్రతిభోదేత చేతసః ॥ (సర్గ 17, శ్లో. 21)

మలిన వస్త్రమునకు రంగు వేస్తే నిలుస్తుందా? లేదు కదా! అదే విధంగా అనేక జగద్విషయములకు సంబంధించిన భావావేశ వృత్తులు తనయందు చంచలశీలంగా కలిగియున్న చిత్తములో అద్వైతతత్త్వ ప్రతిపాదికమగు ఆత్మజ్ఞానము నిలకడ పొందకుండానే పోతుంది.

ఈ సాంసారిక జీవుడు "ఇప్పుడు నేను స్వర్గం పొందాలి, విష్ణు లోకం పొందాలి", మొదలైన భావనలు చేస్తున్నప్పటికీ అతడు శుక్రాచార్యునివలె వాటిని సత్యమై పొందలేకపోతున్నాడు. దానికి కారణం, అతడు తదితరములైన (వేరైన) అనేక సంకల్పములు కూడా కలిగి ఉండటమే. అందుచేత ఈ జీవుని యందు ఏకాగ్రత కొరవడుతోంది. అసంఖ్యాకములైన అనేక సంకల్పములు ఒక్కసారే చిత్తములో కాపురం ఉండి ఉండటం చేత అతనికి "నేను స్వర్గము చేరెదను" అనే సంకల్పం వాస్తవత్వం పొందకముందే మరొక సంకల్పమేదో వచ్చి మొదటి సంకల్పమును త్రోసివేస్తోంది. శుక్రాచార్యుని చిత్తమునందు "అనేక విశేషములు" లేక "అనేక జగత్తులు" అను రూపముగల వేరు వేరు సంకల్పములు లేవు. ఏకైక సంకల్ప నిష్ఠుడై "నేను ఇప్పుడు స్వర్గము చేరుచున్నాను... ఇంద్ర సభలో ప్రవేశించాను... ఇంద్ర భగవానునితో సంభాషించుచున్నాను..." ఇట్లు భావన చేశాడు. ఏకాగ్రత యొక్క ప్రభావంచేత అవన్నీ సత్యంగానే పొందాడు. అందుచేతనే అతడు స్వర్గము చేరుట, దేవతా స్త్రీతో విహారము చేయుట... ఇవన్నీ వాస్తవత్వము పొందాయి.

ఈ ప్రపంచంలో ఎవరైనా ఏదైనా విశేషము కలిగియున్నారంటే, అట్టి విశేషము వెనుక ఏకాగ్రతయే దాగి ఉండి ఉంటుంది సుమా!


శ్రీరాముడు : హే మహర్షీ! మీరు చెప్పినదానిని బట్టి ఆ శుక్రుడు తన యొక్క కల్పనా జగత్తులో ప్రవేశించి, అందులో ఇంద్రుడు, దేవతాస్త్రీ, ఆయా ఉపాధులు మొదలైనవి పొందాడని నేను

గ్రహిస్తున్నాను. అయితే, నా సందేహమేమంటే, ఆ శుక్రుని చిత్తములోని కల్పనాత్మకమైన జగత్తులో ఈ సూర్యుడు, చంద్రుడు – ఉదయాస్తమయములు మొదలైన కాలక్రమమంతా ఎట్లా ఏర్పడింది? అతని చిత్తమునందు ప్రతిభాస అనునది ఏర్పడేటప్పుడు ఈ ఉదయాస్తమయములు మొదలైనవి గ్రహించబడవు కదా! అతనికి అనేక విశేషములతో కూడిన జగత్తులు ఎట్లా లభించాయి? ఆ జగత్తులకు కర్తలు ఎవరు? అవన్నీ అట్లా ఎందుకు కల్పించబడ్డాయి? అతనికి కనిపించినదంతా మన ఈ జగత్తు వంటిదేనా?

❖❖❖

3. సంస్కారములు - అనుభవములు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామా! శుక్రుడుగాని, నీవు గాని, నేను గాని, మరింకెవరైనా గాని, పురుగు మొదలైన జీవులుగాని... మనమంతా “ఉత్పత్తి, వినాశనము”లతో కూడిన ఈ దృశ్యజగత్తును ఎట్లా చూస్తున్నాం? ఈ ప్రశ్నకు సమాధానం చెపుతాను విను. అది విన్న తరువాత, నీ ప్రశ్నకు సులభంగా సమాధానం వస్తుంది.... ఈ చిత్తం ఏ విధంగా రూపు దిద్దుకుంటోంది?



1. జ్ఞానేంద్రియశక్తులు - తల్లితండ్రుల నుండి ఈ జీవుని కొరకై సంక్రమిస్తున్నట్టి ఈ కంటికి కనబడుచున్న ‘భౌతికదేహం’ నందు “చూచుట–వినుట–ఆఘ్రాణించుట–రుచి–స్పర్శ”... అనబడే ‘జ్ఞానేంద్రియశక్తులు’ క్రియాశీలకమౌతున్నాయి. ఇవియే ప్రకృతి సంబంధమైన ఉపకరణములు. అట్టి జ్ఞానేంద్రియములతో, ఈ జీవుడు ఆయా విషయములను సమీపిస్తున్నప్పుడు అనుభవములు ఏర్పడుచున్నాయి. అట్టివి కొన్ని ఇష్టమైనవి, మరికొన్ని అయిష్టమైనవి ఇంకొన్ని మిశ్రమమైనవి అగుచున్నాయి. అవి చిత్తము నిర్మించబడు విధమునకు దోహదపడుచున్నాయి.

2. శ్రేష్ఠులైనట్టి తదితరుల ప్రేరణ - శ్రేష్ఠులగు ఇతరుల అభిప్రాయములు, అనుభవములు, చింతనలు, పాఠములు, బోధలు, వారి వారి ప్రవర్తన మొ॥నవి ఈ చిత్తము యొక్క రూపమును ప్రభావితం చేస్తూ ఉంటాయి.

3. శాస్త్రపాఠములు - గ్రంథాలు, శాస్త్రములు ప్రతిపాదిస్తున్నది పఠిస్తూ ఉన్నప్పుడు, అందలి విశేషములను గ్రహిస్తూ ఉన్నప్పుడు.... అట్టి జీవునియొక్క దృష్టి-అవగాహన-భావన పరిణతి చెందుతూ ఉంటాయి. అవి చిత్తం యొక్క రూపురేఖలలోని మార్పుకు కారణమవుతూ ఉంటాయి.

4. స్వకీయమైన విశ్లేషణ అవగాహన - ఈ జీవుని స్వకీయమైన విచారణ, పరిశీలన, అవగాహన, పరిశోధన ఈ చిత్తము యొక్క తదనంతర స్థితి-గతులను నిర్ణయిస్తూ ఉంటాయి.

❖

ఈ నాలుగు విధములైన ప్రయత్నములచేతనే మనమంతా కూడా మన చిత్త సంస్కారాలను సముపార్జిస్తున్నాం. అట్టి మన చిత్తములను అనుసరించి ఈ జగత్తును చూస్తున్నాం. అనుభవిస్తున్నాం, భావిస్తున్నాం. అట్లే శుక్రుని విషయం కూడా. ఒకని చిత్తము అతని యొక్క కర్మ - ఎరుకలను అనుసరించి ఎప్పటికప్పుడు క్రొత్త రూపములను సంతరించుకొంటోంది. ఇక ఆపై అతని యొక్క లౌకిక - పారలౌకిక జగత్తులన్నీ సంస్కార రూపంలో అతని చిత్తము నందే స్థితి పొంది ఉంటున్నాయి.

ఎవరైనా సరే, జీవించియున్నప్పుడు గాని, మరణించినప్పుడు గాని, స్వప్నము నందు గాని, సంకల్పనగరము నందు గాని... తన చిత్తమునందు సంస్కార రూపమున ఉన్నదే అనుభవముగా పొందుచున్నారు. ఎవ్వడూ కూడా, తన చిత్తములో లేనిదేదీ ఏ క్షణంలోనూ ఏమాత్రమూ పొందడు. చిత్తమే అనుభవం.

బీజము - దృష్టాంతానికి ఒక బీజాన్ని తీసుకుందాం. గాలి, సూర్యరశ్మి, నేల వంటి సహకారి కారణములు లభించినప్పుడు, ఆ బీజమే 'కాలము-క్రియ'ల క్రమమును అనుసరించి ఒక "మహావృక్షం"గా పరిణమిస్తోంది. మహావృక్షం యొక్క సంస్కారమంతా ఆ బీజంలో దాగియే ఉంది కదా!

జీవుడు - అదే విధంగా, చైతన్యమే తన వాస్తవస్వరూపమైనట్టి ఈ జీవుని యందు "అవిద్య" అనే సంస్కారం ఉన్నది. అట్టి 'అవిద్య' జీవునియందు బీజమువలె ఉంటోంది. ఇక "తల్లిదండ్రుల చేత ప్రసాదించబడిన ఈ పాంచభౌతిక శరీరం, 'శాస్త్ర-పితృ-బోధలు'... ఇవన్నీ ఒనగూడుచున్నప్పుడు ఇవి సహకారి కారణములౌతున్నాయి. "ఈ జగత్తును ఇట్లు దర్శించుట" అనునదే సంసారమహావృక్షముగా పరిణమిస్తోంది. ఓ రాఘవా! ఈ జీవుడు ఇట్లు జగత్తుగా చూస్తున్నదంతా వాస్తవానికి తన చిత్తమునందే, చిత్తము యొక్క మహిమ చేతనేనని గ్రహించు. ఈ జీవుడు ఎట్టి వాసనకు బద్ధుడో, అట్టి వాసనను అనుసరించి తనయందు సర్వమును గాంచుచున్నాడు.

శ్రీరాముడు : "నా చిత్తమే ఇట్లు విస్తరించి ఈ జగత్తు యొక్క దర్శనము (perception of this world) గా పరిణమిస్తోంది"... అనే అభిప్రాయం చమత్కారమైన విషయమే.

శ్రీ వసిష్ఠమహర్షి : అవును ఇందుకు దృష్టాంతము మనం పొందుచున్న స్వప్నములే. ఒకనికి తన స్వప్నంలో కనబడే శరీరములు భవనములు మొదలైనవన్నీ స్వయం కల్పితములే కదా! మనస్సు యొక్క భావనయే అట్లు పరిణమిస్తోంది. అలాగే, ఈ జగద్దర్శనము కూడా ఒక దీర్ఘమైన స్వప్నము

వంటిది మాత్రమే. మనస్సు యొక్క భావనా పరంపరలే జగద్రూపంగా పరిణమించినవై ఉంటున్నాయి.

శ్రీరాముడు : ఈ 'జగత్తు ఎవరికి వారికే వారియొక్క స్వప్నము వంటిది అయినప్పుడు, "ఇది ఈ వస్తువు... ఇది సరియైనది... ఇది సుందరము" **...** వంటి అనేక అనుభవములు అనేకులకు ఒకే తీరుగా ప్రాప్తిస్తున్నాయి కదా! ఇది గోడ అనే విషయం నేనూ, మరొకరు కూడా అనుభవిస్తున్నాం. అదే స్వప్నదృశ్యం విషయానికి వస్తే నేను పొందే స్వప్నము (కల) నా ప్రక్కనే ఉన్నవాడు పొందుట లేదు. అందుచేత "ఇది స్వప్నము వంటిది" అనటం ఎంతవరకూ ఉచితం...?

శ్రీ వసిష్ఠ మహర్షి : "అనేకులకు ఒకే తీరుగా కనబడుచున్నది కదా?"... అనునది నీ సందేహమా? సరే, దృష్టాంతము సహాయంతో వివరిస్తాను విను. ఒక చోట కొందరు సైనికులు ఉన్నారు. వారంతా పగలు యుద్ధంలో పాల్గొన్నారు. రాత్రి అయినది. వారంతా నిదురిస్తున్నారు. వారందరు తెల్లవారి తాము యుద్ధము చేయవలసియున్న శత్రు సైన్యము గురించి కలలు కంటున్నారు. ఇప్పుడు చెప్పు.... వారంతా, తమ స్వప్నములో చూచినది ఒకే శత్రుసైన్యం కదా!

వారు ఒక్కొక్కరుగా తలుస్తున్నది ఒకే శత్రుసైన్యం గురించి ఐనప్పటికీ, వారంతా వారి వారి ధైర్య - స్థైర్యములను, భావన, రాజభక్తి, బంధువులకు సంబంధించిన మమకారములు మొదలైన ఆయా విషయాలను అనుసరించి అనేక రీతులుగా ఆయా స్వప్న సంఘటనలు పొందుచున్నారు. ఈ జగత్తు విషయం కూడా అంతే. అవిద్యచేత ప్రతి జీవుడు కూడా "ద్వైతవిభాగం" అను రూపం గల తన స్వప్నంలో ఈ 'జగత్తు' అనబడు దృశ్యమును గాంచుచున్నాడు. ఈ దృశ్యమానం అయ్యేదంతా వాస్తవానికి ఒక్కొక్క జీవునికి, అతని వాసనలను అనుసరించి ఒక్కొక్క రకంగా సంప్రాప్తిస్తోంది. కాని అతడు "నాకిదంతా ఎట్లా కనబడుతుందో అందరికీ అట్లే కనబడుతోంది" అని మాత్రం భావన చేస్తున్నాడు. "నాకు ఏదేది కనబడుటలేదో, మిగతావారికీ అట్లాగే కనబడుట లేదు" అను భ్రమ ఏర్పడటం జరుగుతోంది. ఒకవేళ అందరికీ ఒకే తీరుగా కనబడటం జరుగు తుంటే, అప్పుడు ఇన్ని భావావేశాలు - అభిప్రాయభేదాలు, ఇన్ని రకాల దృష్టులు, అవగాహనలు ఎందుకు ఉంటున్నాయి చెప్పు? జనులలో ఏర్పడే స్పర్థలకు కారణం వేఱు-వేఱు దృష్టులే కదా!

అందుచేత, మనం ఈ "ద్రష్ట-దృశ్యత్వము" అను వ్యవహారమంతా సునిశితంగా పరిశీలించటం జరిగితే మనకు ఇట్లు తెలియవస్తోంది.... "ప్రతిజీవుడు తన చిత్తము నందే ఆ చిత్త సంస్కారములను అనుసరించి, ఒక స్వప్న వ్యవహారంలాగా ఈ జగత్తును తన రీతిలో గాంచుచున్నాడు."

అదియే 'జగత్తు' అనబడు పేరుతో విరాజిల్లుతోంది సుమా! కనుక, "జగత్తు ఎక్కడి నుండి బయల్వెడలుతోంది?" అనునది సముచితమైన సమాధానమే!

❖❖❖

4. పరస్పరం

శ్రీరాముడు : మహాత్మా! ఈ 'జగత్తు' అనబడునది ఎవరికి వారికే తమ యొక్క స్వప్నం వలె భావనానుసారం ఏర్పడుట, ప్రాప్తించుట జరగుతోంది కదా! ఈ జగత్తులు ఆయా జీవులు పరస్పరం కలిసియే ఉంటున్నాయా? విడివిడిగా ఉంటున్నాయా? ఈ విషయం నాకు వివరించి చెప్పండి. "నా చిత్తము నందు నేను చూచు జగత్తు – మీ చిత్తమునందు మీరు చూచుచున్న జగత్తు" వేరువేరా? అట్లా అయితే ఒకరి భావాలతో, అనుభవములతో మరొకరికి సమన్వయం ఎట్లా ఏర్పడుతోంది?

శిష్యులను సముద్ధరించాలనే ఉద్దేశంతో గురువులు "దీనిని ఇట్లా ఆచరించండి" అనే రూపం గల 'ప్రవృత్తి'ని సూచించే శాస్త్ర విషయాలు రచిస్తున్నారు కదా! అట్టి శాస్త్ర విషయాలు శిష్యులపై ప్రభావం చూపుతున్నాయి. మరి ఎందుకు చూపుచున్నాయి? మీరు చెప్పుచున్నట్లు " ఈ జగత్తు – దర్శించే ద్రష్ట యొక్క స్వప్నము మాత్రమే"... అనునదే వాస్తవమైతే, మరి ఒక గురువు యొక్క "స్వప్న విషయమాత్రములే" అయినట్టి అతని శాస్త్రావలోకనం, శాస్త్ర ప్రవచనం అతని శిష్యుని (స్వప్నజగత్తు అనదగ్గ) జాగ్రత్‌లో ఎట్లా ప్రవేశించి, ప్రభావితమౌతున్నాయి? జగత్తు స్వచిత్త మందలి ప్రకటనమే అయినప్పుడు గురువు చెప్పటమేమిటి? శిష్యుడు విని ఉద్ధరించబడట మేమిటి? మీరు చెప్పే "స్వప్న దర్శనం" అను సిద్ధాంతం ప్రకారం గురువు–శిష్యుల సమ్మేళనం గాని, 'మోక్షం' అనే స్థితి గాని సిద్ధించవు కదా! ఎందుకంటే, "ఒకరి మనస్సు ఇంకొకరి మనస్సుతో కలియటం" అనేది జరుగదు కదా?

నా స్వప్నం – మీ స్వప్నం ఒకదాని కెదురుగా మరొకటి తారసపడుతున్నాయా? లేదే?

శ్రీ వసిష్ఠ మహర్షి : మనస్సు రెండు విధాలుగా ఉంటోంది– 1) 'శుద్ధ మనస్సు' ; 2)దృశ్య వ్యవ హారాలతో ఇష్ట అయిష్టాలనే సాంసారిక సంబంధం ఏర్పరచుకొని ప్రవర్తిస్తున్న 'మలిన మనస్సు'.

మలిన మనస్సు శుద్ధ మనస్సుతో కలియటం అశక్యమే.

శుద్ధ చిత్తములు పరస్పరం కలుస్తాయి. అట్లాగే, ఒకే విధమైన సాంసారిక దోషము, ఆర్తి పరామర్శగల దోష మనస్సులు పరస్పరం కలుస్తున్నాయి.

ఒకే విధమైన చిత్త సంస్కారదోషము కలిగినవారి యొక్క 'స్వప్నభావన' కాకతాళీయంగా మరికొన్ని మనస్సులందు కూడా ఉండి ఉంటోంది. అనేక మనస్సులు ఒకేవిధమైన 'దోషదృష్టి'తో ఈ జగత్తును చూస్తున్నాయి (లేక) పొందుచున్నాయి. అంటే కొన్ని విషయాలు అనేక మనస్సులకు ఒకే విధంగా అనుభవమౌతున్నాయి. తత్ఫలితంగా "ఈ జగత్తు బాహ్యమున కలదు" అను భావన చైతన్యం నందు రూఢిపడి ఉంటోంది. ఇదియే మాయ యొక్క చమత్కారం. అవాస్తవాన్ని వాస్తవం వలె చూపించుటయే ఇందులోని గమ్మత్తు.

ఏకరూపము గల జలములే కలుస్తున్నాయి.

ఒక శుద్ధ చిత్తమునకు ఏది కనబడుతోందో మరొక సమానమైన శుద్ధ చిత్తమునకు అదే దర్శనమగుచున్నది. ఒక విధమైన దోషముగల చిత్తము దేనిని ఎట్లు గాంచుచున్నదో, అదే విధమైన దోషము ఉన్నట్టి మరొక చిత్తము దానిని అట్లే గాంచుట జరుగుతోంది.

అయితే ఈ జీవులు ఇదంతా ఇలా చూడటం వాటి వాటి వాసనాప్రభావంచేతనే సుమా! వాసనలు క్షయిస్తే, ఈ భూతప్రపంచమునకు అందజాలని 'ఏకరూపతత్వజ్ఞానం' కలుగుతోంది.

విషయ వాసనలు ఉన్నంతవరకు జగత్తు కనబడుతోంది. వాసనలతో కూడుకొని చూడబడుచున్నదంతా స్వప్నతుల్యమే. ఎందుకంటే, వాసనలు మార్పు చెందినప్పుడు, ఇదే జగత్తు వేరొక రీతిగా అనుభవమౌతోంది కదా!

భ్రమాత్మకమైన దృష్టి ఉన్నంత వరకే "అతని అనుభవం, నా అనుభవం" వంటి కల్పిత భావాలన్నీ ఉంటున్నాయి. వాసనలు తొలగినప్పుడు ఈ "నేను–నీవు–జగత్తు" అనేవన్నీ 'స్వస్వరూప జ్ఞానాగ్ని' యందు భస్మీభూతమైపోతున్నాయి. సర్వవిషయాలకు అతీతత్వం నిర్మల మనస్సునకు మాత్రమే సాధ్యమగుచున్నది. అట్టి శుద్ధ చిత్త స్థితియే "చిన్మాత్ర పరిశేషత్వము" (The ultimate essence of absolute self) అను పేరుతో కూడా పిలువబడుతోంది.

అప్పుడీ జీవుడు 'పరమ కైవల్యపదము' అయినట్టి మోక్షమును పొందుచున్నాడు. అనేకంలో అంతర్లీనంగా సర్వదా ఏర్పడియున్నట్టి 'ఏకము – అద్వితీయము'ను దర్శించుచున్నాడు.

❖❖❖

5. జీవుడు - ఖండత్వము, అఖండత్వము

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ జీవులందరూ కూడా తమ తమ కల్పిత ప్రపంచములందు "స్థూల–సూక్ష్మ–కారణ" శరీరాలతో సంబంధం కలిగి ఉంటున్నారు. వాటితో తాదాత్మ్యం పొందుచున్నారు. ఫలితం? ఆయా జగత్తులన్నీ అనేక భిన్నత్వములతో వారికి ప్రాప్తిస్తున్నాయి. అట్టి భిన్నత్వమంతా 'శబ్ద–స్పర్శ–రూప–రస–గంధములు'... అను తన్మాత్రల యొక్క 'ప్రతిభాస' (Reflection) చేతనే సంభవిస్తోంది. ఈ ప్రతి దేహములోని ఆత్మ వాస్తవానికి సర్వదా స్వయంప్రకాశ స్వరూపము (self luminious), చిదేకరసము (Indivisible consciousness) అయి వున్నది. అట్టి 'నిర్వివాదాంశము – అఖండము' అగు ఆత్మయే ఆయా విధములుగా, భిన్నములుగా కల్పించబడుచున్నది. అయితే ఈ కల్పనా వ్యవహారమంతా వాస్తవము కాదు.

❖

ఒకే చైతన్యము సర్వవ్యాప్తమైయున్నది. సర్వప్రాణులు గాఢనిద్ర నుంచి మేల్కొనగానే ఈ ద్వైత వ్యవహార ప్రవృత్తి పొందుచున్నారు. అయితే, స్వప్నమునందు, జాగ్రతునందు కూడా ఆయా వస్తు జాలమునందు ఏర్పడుచున్న ప్రవృత్తి – నివృత్తులన్నీ... ఏకరసమైన చైతన్యము యొక్క "సర్వ వ్యాప్తి" చేతనే సిద్ధించుచున్నది. "ఏకైక చైతన్యజ్యోతి" వలననే, ప్రవృత్తియందు వ్యవహరిస్తున్నట్టి ఈ జీవులంతా... "ఇది కుండ, ఇది వస్త్రము" అనునట్టి అనుభవములన్నీ పొందగలుగుచున్నారు.

ప్రవృత్తిర్వా నివృత్తిర్వా తన్మాత్రావృత్త పూర్వకమ్ ।
సర్వస్య జీవజాతస్య సుషుప్త త్వాదనన్తరమ్ ॥ (సర్గ 18 శ్లో.2)

1. సాక్షిచైతన్యము యొక్క 'సంకుచిత, పరిమిత' భావన - 'సాక్షి చైతన్యము' ఈ ఉపాధితో తాదాత్మ్యము చెందటం జరుగుతోంది. అనగా 'నేను ఈ పాంచభౌతిక దేహమాత్రుడనే' అనే ఖండభావన కలిగి ఉంటోంది. ఇంద్రియములందు ప్రజ్ఞను ప్రవేశింపజేసుకొని, తత్ఫలితమైన ఆయా అనుభవములందు అధ్యాస (Avocation) కలిగి ఉంటోంది".

2. ద్వితీయమైనదంటూ లేనట్టి ఏకైక బ్రహ్మము - "సర్వజీవులందు ఏకైక బ్రహ్మమే ప్రసరించి సర్వదా ఉండి ఉంటోంది. చూచేవాడు, చూడబడేవాడూ బ్రహ్మమే".

ఈ రెండు కారణముల సమన్వయంచేత ఒకరు మరొకరిచే కల్పించబడిన దృష్టులను-సృష్టులను అటువంటి దృష్టితో చూచుచున్నారు. "ఏకత్వము - అల్పదృష్టి" ఈ రెండు ఒకేసారి ఉండియే ఉంటున్నాయి. చిన్మాత్రము... ఏకత్వము... ఈ రెండింటి యొక్క ప్రభావం చేత చిత్రవిచిత్రములైన (సృష్టికి సంబంధించిన) సంకల్ప రచనలు పరస్పరం మిళితం అగుచూ, అనుభవమౌతున్నాయి. ఘనీభూతమై ప్రవర్తిస్తున్నాయి.

మరికొన్ని జగత్తుల కల్పనలు పరస్పరం మిళితం కాకుండానే వేరువేరుగా ఉండి, అట్లే వేరువేరుగా లయం పొందుచున్నాయి. ఇక ఇంకొన్ని జగత్తులు పరస్పరం తారసపడినప్పుడు నాశనం పొందుచున్నాయి. అనగా ఒకడు ఒక జగత్తును పొందుట ద్వారా రెండవ జగత్తును త్యజించివేస్తున్నాడు. అట్లాగే ఒకని ఈ రోజు స్వప్నదృశ్యం - రేపటి స్వప్న దృశ్యం ఒకదానితో మరొకటి కలియటం లేదు కదా! కానీ, స్వప్నద్రష్టమాత్రం? ఒక్కడేకదా!

అయితే ఈ జగత్తులన్నీ కలియటం- లయించటం- విడిపోవడం... ఇదంతా జరుగుచున్నది ఎందులో? ఇవన్నీ జనిస్తున్నదీ, ఉంటున్నదీ, లయిస్తున్నది బ్రహ్మము నందే సుమా! బ్రహ్మం ఏకం, సద్రూపం (One and True) అయివున్నది. ఈ జగద్రూపములన్నీ బ్రహ్మము యొక్క ప్రభావం చేతనే ఒక దానితో మరొకటి కలుస్తున్నాయి. వ్యవహార యోగ్యత్వమును సంతరించుకుంటున్నాయి.

శ్రీరాముడు : ఈ 'జీవుడు' అనబడువాడెవ్వడు? అతనికి అనుభవములు, పరిమితులు ఏర్పరచు చున్నది ఎవరు?

శ్రీ వసిష్ఠ మహర్షి : చైతన్యము లేక బ్రహ్మము స్వరూపముగా కలిగియున్న ఈ జీవుడు తన యొక్క స్వయంకల్పితము... స్వయంభావన ద్వారానే ఈ పరిమితత్వమంతా పొందుచున్నాడు. ఈ లోకంలో ఏ జీవుని తన భోగానికి అనుకూలమైనట్టి ఏ కర్మలు ఎచట వేడుకచే ఆకర్షిస్తున్నాయో, అతడు అద్దానిని పరిమితదృష్టిచే అందుకు అనుకూలంగా మాత్రమే దర్శిస్తున్నాడు. ఇంతకు మించి అధికంగా అతడు చూచుట లేదు.

శ్రీరాముడు : అతడు తన భోగానుకూలమైన భావనను అనుసరించే ఈ జగత్తులోని వస్తువులకు, సంఘటనలకు ఆయా అర్థములు ఇస్తూ, తదనుకూలంగానే అనుభవాన్ని పొందుచున్నాడంటారా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. అందుకు ఫలితంగా అతడు పరిమితమైన దృష్టి – దృక్పథములను ఆశ్రయిస్తూ, తనకు తాను పరిమితత్వాన్ని ఆపాదించుకుంటున్నాడు.

శ్రీరాముడు : మహాత్మా! ఈ సర్వజీవులు బ్రహ్మమే అయి వున్నారు కదా! ఈ వేరు వేరు భావనలు, అభిప్రాయాదులు మొదలైనవి ఎట్లా, ఎందుకు, ఎప్పటి నుండి ఏర్పడి ఉంటున్నాయి? వీటి నన్నింటినీ ఎట్లా అవగాహన చేసుకోవాలి?

శ్రీ వసిష్ఠ మహర్షి : "బ్రహ్మము–జీవులు"... అనే తతంగమంతా "జలము–తరంగములు"గా అభివర్ణించబడ్డాయి. అంతా జలమే అయినప్పటికీ, ఒక కెరటము యొక్క ఆకారము, సంభ్రమము మరొక కెరటమునకు ... ఏర్పడుచున్నదా? లేదు కదా! ఒక చిత్తము మరొక చిత్తము యొక్క మనో రాజ్యాన్ని కూడా అట్లే పొందుటలేదు. బంగారమంతా ఒక్కటే అయినా, వేరు వేరు ఆభరణాలు వేరు వేరుగా కనబడుట, ఉపయోగపడుట జరుగుతోంది. ఒక చిత్తము ఒక విధంగా, మరొక చిత్తము మరొక విధంగా ఈ జగత్తును దర్శించుచున్నది. ఒక చిత్తమునకు ఏర్పడుచున్న భోగానుభవం మరొక చిత్తమునకు ఏర్పడుట లేదు. కనుకనే, ఇది మనో – జీవభేదములకు కారణమగుచున్నది. ఒక కెరటము యొక్క ఆకారము, వేగము మరొక కెరటముతో పోల్చినప్పుడు "ఇవి రెండూ వేరు వేరు అని అనిపిస్తుంది కదా! అదే రీతిగా 'ఈ జీవులు వేరు' అని తోచుచున్నది. ఇదంతా అజ్ఞాన దృష్టిచేతనే ఏర్పడటం జరుగుతోందని నీవు గ్రహించు. కెరటములన్నింటిలోను ఉన్నది జలమే అయివున్నట్లు... జీవులన్నింటిలో ఉన్నది చైతన్యస్వరూపమగు బ్రహ్మమే. ఆ అద్వితీయ – నిర్మల – నిర్లిప్త – నిత్యోదిత – అఖండ చైతన్యమే జాగృతమై ఈ సర్వఉపాధులందునూ వెలయుచున్నది. వేరు–వేరు గదులలో వెలుగుచున్నట్టి దీపశిఖలు వేరువేరు విశేషములను వస్తుసముదాయమును వెలిగిస్తున్నప్పటికీ, అగ్ని ఒక్కటేకదా!

❖❖❖

6. శరీరము - జీవుడు - దృశ్యము - బ్రహ్మము

శ్రీరాముడు : మహర్షీ! ఈ వేరు వేరు శరీరములన్నీ కనబడుతున్నాయి కదా! ఈ శరీరములను, ఈ జీవజాతులను, వీటిలోని భిన్నత్వములను, ఏకత్వములను, వ్యష్టి – సమష్టులను ఎలా అవగాహన చేసుకోవాలి?

శ్రీ వసిష్ఠ మహర్షి : భిన్న మనోరాజ్యరూపములగు సృష్టుల గూర్చిన కర్మవాసనలు... జలములోని తరంగముల వలె.. బ్రహ్మమునందు ఏర్పడుచున్నాయి. ఈ వేరు వేరు కర్మవాసనలు ఒక్కొక్కప్పుడు కొంత సమత్వమును కలిగి ఉంటున్నాయి. ఒకే సమయంలో ఫలోన్ముఖములవటం, ఒక దానితో మరొకటి సంబంధం కలిగి ఉండటం కూడా జరుగుతోంది. అట్టి సమయంలో "ఇది వ్యష్టి (Unit) – ఇది సమష్టి (Collective)", "ఇది వ్యష్టిస్థూలదేహం – ఇది సమష్టి పాంచభౌతిక సృష్టి"... అను రూపము గల సత్త ఎరుగబడుచూ, అనుభవించబడుతోంది. "నేను – నాది – మావి – మేము –

మనము – మనది – నీవు – నీది – వారు – వారిది "... అనునదంతా వాసనలచేత ఏర్పడి అఖండము, అప్రమేయము అగు వాస్తవమును కప్పి ఉంచుతున్నాయి.

అట్టి సమష్టి – వ్యష్టి స్థూలసత్త అధిగమించబడినదనుకో... లేక

"అమనఃస్థితి – అమనస్కస్థితి" దృఢాభ్యాసముచే పొందబడినదనుకో... అప్పుడు...

ఈ దేహం యొక్క అభావం అత్యంత స్వాభావికంగానే సిద్ధిస్తుంది. అనగా, "నేను దేహాన్ని కాదు. ఇందలి అనుభవముల 'కర్త–భోక్త' అయివున్న ప్రజ్ఞాతత్వమే నేను. దేహముల రాక–పోకలకు వేరుగా చైతన్యమూర్తిత్వంతో వెలుగొందుచున్నాను. ఆ ప్రజ్ఞాతత్వమే 'నీవు, అతడు' కూడా–" అను అనిర్వచనీయమైన ఒక ఉత్తమ అవగాహన సిద్ధిస్తోంది.

❖

శుద్ధ బంగారం తన యొక్క సువర్ణత్వమును విస్మరించి ఆభరణత్వమును తనపై ఆపాదించు కుంటున్నట్లు, శుద్ధ ప్రజ్ఞాస్వరూపుడగు జీవుడు తనపట్ల శరీరత్వాన్ని, ఖండత్వంను ఆపాదించు కుంటున్నాడు. అనగా, చిద్రూపము (The absolute form of wisdom) ఒక సమయంలో "నేను నిత్య, నిర్వివాదాంశ అఖండ సత్యమును" అను రూపమున ఉండే తన స్వాభావిక ఆత్మ స్థితిని ఏమరుస్తోంది. "ఈకాళ్ళు, చేతులు, తదితరములైన ఆకారములు గల దేహమే నేను. దీనితో పుట్టుచున్నాను. దీనితోనే వృద్ధి పొందుచున్నాను – శిథిలమగుచున్నాను" అని అత్యంత దృఢంగా భావన చేయుచున్నది.

❖

ఇక ఈ జీవులు యొక్క "తదితర జీవుల ఉపాధులు" అనే అనుభవం ఎట్టిది? విను–

యోగులు 'హఠ యోగాభ్యాసం' చేత తమ యొక్క శుద్ధ ప్రాణవాయువును మరొకరి భౌతిక శరీరంలో ప్రవేశింపజేసి ఆ వేరైన దేహ–ప్రాణములను తమ వశం చేసుకొని ఆ వేరైన శరీరం లోంచి శబ్ద స్పర్శ రూప రస గంధాలను అనుభవించటం గురించి విన్నావు కదా! మంత్రశాస్త్రము లోని పరకాయ ప్రవేశము ఇట్టిదే. అదే విధంగా ఒక శుద్ధ మనస్సు కూడా మరొక సృష్టికి ఆశ్రయ భూతమైన మనోరాజ్యమును ఎరుగుచున్నది. అయితే ఇక్కడ ఒక విషయం గమనించాలి...

సర్వేషాం జీవ రాశీనా మాత్మా వస్థా త్రయం శ్రితః

జాగ్రత్స్వప్న సుషుప్త్యాఖ్య మత్ర దేహోన కారణమ్ (సర్గ 18, శ్లో. 12)

ఈ జీవులందరి యొక్క 'జాగ్రత్–స్వప్న–సుషుప్తి" అవస్థలన్నిటికీ ఆశ్రయం 'ఆత్మ'యే అయివున్నది. అంతేగాని, ఈ అవస్థలన్నిటికీ ఆశ్రయం దేహం కాదు సుమా! కాని, ఈ 'జాగ్రత్‌కల్పన' అనునది దేహము లేనిచో సిద్ధించుటలేదు.

జీవాత్మ ఉంటేనే దేహం. దేహం ఉంటేనే జీవాత్మ.

ఈ విధంగా జీవాత్మకు, దేహమునకు 'అన్యోన్యాశ్రయ దోషం' సంభవిస్తోంది. అనగా జీవాత్మయే అవస్థలు.

జీవాత్మ అంటే జాగ్రత్-స్వప్న-సుషుప్తి అవస్థలు.

తరంగము కంటే జలము వేరు కానట్లు ఈ దేహము జీవాత్మకంటే భిన్నమైనది కాజాలదు. జీవాత్మ బ్రహ్మమునకు భిన్నం కాదు.

❖

శ్రీరాముడు : తండ్రీ! తత్త్వజ్ఞాని ఇదంతా ఎట్లా దర్శిస్తున్నాడు?

శ్రీ వసిష్ఠ మహర్షి : అతడు సుషుప్తికి ఆవల ఉన్నట్టి నిత్యనిర్లిప్త మౌనస్థితిని సర్వదా అన్ని స్థితులందు, అన్ని వేళలందు గాంచుచున్నాడు. అట్టి స్థితికే "తురీయము" అనే శాస్త్రీయనామం ఇవ్వబడింది. అతడు "అవస్థాత్రయం"లో కేవల సాక్షిత్వాన్ని తన స్వరూపంగా వహించి ఉంటున్నాడు. తన యొక్క జ్ఞానముచే చైతన్యకరమగు ఆత్మభావమును పొందుచున్నాడు. "నేను జీవుడను" అను భావన నుండి సంపూర్ణముగా నివృత్తి పొందుచున్నాడు. ఇక అజ్ఞానియో, స్వకల్పనచే దేహము లందు, అట్టిదేహమునకు తారసపడే కల్పనా రూప ప్రపంచమునందు ప్రవృత్తుడగుచున్నాడు.

ద్వయోరేక స్వరూపైవ స్వసౌహార్ద నిదర్శనాత్ ।
అజ్ఞః సుషుప్తోఽసంబద్ధో జీవః కశ్చిత్స సర్గ భాక్ ॥ (సర్గ 18, శ్లో 15)

"సుషుప్తస్థితి" అనునది మౌనం, శాంతం, ఆనందం కలిగి ఉంటోంది. మోక్షస్థితి కూడా అట్టిదే. కాని, మోక్షము నందు నిరతిశయానందము ప్రాప్తించుచున్నది. సుషుప్తస్థితి అనేది జ్ఞానికి, అజ్ఞానికి కూడా సమానమే. అయితే జ్ఞానము పొందనట్టి సుషుప్తి సహితుడైన అజ్ఞాని ఆ సుషుప్తి గతించిన తరువాత స్వప్న, జాగ్రత్తు లందు సంసారమును అనుభవిస్తున్నాడు.

ఇక జ్ఞానియో... "ఈ సంసారానుభవమంతా మొదలే అసత్యమైనది" అను ఎరుక కలిగి ఉంటున్నాడు. ఇదంతా ఒక స్వప్నంలాగా అసత్తుల్యమేనని అతనికి సుస్పష్టంగా తెలిసిపోతోంది. "నేను సర్వదా అఖండమగు స్వస్వరూప స్థితిలో ఉండి ఉంటున్నాను" అని అతడు గ్రహిస్తున్నాడు.

జ్ఞాని స్వస్వరూపస్థితి భావనను త్యజించుటలేదు... అజ్ఞాని దృశ్యవ్యవహారంతో ఏకత్వం పొందుతూ స్వస్వరూపస్థితిని ఏమరచుచున్నాడు.

ఈ జ్ఞాని - అజ్ఞానుల భేదం ఇంతవరకే. ఇక మిగతా విషయలన్నీ యథాతథమే.

❖

చిద్వస్తువు (Consciousness) సర్వవ్యాపియు, సర్వరూపము అయి ఉన్నది. ఆ కారణం చేతనే ఒక జీవుడు మరొకని సృష్టిలోకి ప్రవేశించగలుగుతున్నాడు. ఒక్కొక్క సృష్టియందు విభిన్నము లైనట్టి అనేక సృష్టులు ఉండగలుచున్నాయి. అనేక సృష్టులలోని ఒక్కొక్కదానిలో ఇంకెన్నో అవాంతర సృష్టి రచనలు... అరటి పువ్వులోని దళములవలె... ఏర్పడి ఉంటున్నాయి. విశాలరూపమగు బ్రహ్మము స్వభావసిద్ధంగానే ఈ సృష్టులన్నిటి యొక్క బాహ్య అభ్యంతరము లందు వ్యాపించి యున్నది. ఈ వివిధ సృష్టులలో ప్రవేశించి ఉన్నప్పటికీ, బ్రహ్మమునందు మాత్రం ఏ క్షణమందు

ఎట్టి భేదము ఏర్పడుట లేదు. అద్దాని నిర్మలత్వము, విశుద్ధత్వము, అప్రమేయత్వము సర్వదా నిరాటంకముగానే ఏర్పడి ఉంటున్నాయి.

ఒక బీజము 'జలము – సూర్యరశ్మి – నేలసారము" మొదలైన వాటితో సమన్వయము పొందినప్పుడు గొప్ప వృక్షమగుచున్నది. మరల ఫలాదుల ద్వారా పూర్వకాలపు బీజభావమును పొందుచున్నది. బ్రహ్మము కూడా కామ్యకర్మాదుల యొక్క సంబంధంచే 'మనస్సు' అను రూపము పొందుతోంది. ఫలితంగా ఈ "పుట్టుట–చచ్చుట" అను కల్పనను తనపట్ల తానే కల్పించుకుని, అనుభవించుచున్నది. మరల ఏదో సమయంలో ఆధికారమైనట్టి దేహము (Body which can be very useful instrument in attaining highest knowledge) పొందుతోంది. 'జ్ఞానార్తి' కారణంగా 'వినుట – మననం చేయుట – గ్రహించుట' అను రూపము గల జ్ఞాన సంస్కారములను ఆశ్రయిస్తోంది. అట్టి ప్రయత్నముల ఉత్కృష్ట ప్రయోజనంగా ఇతఃపూర్వమే సర్వదా సిద్ధించియే ఉన్నట్టి 'బ్రహ్మస్వరూపము' మరల పొందుచున్నది.

❖❖❖

7. బ్రహ్మము - జగత్తు రూపంగా ప్రాప్తించటం

శ్రీ రాముడు : మహర్షీ! బ్రహ్మమే కారణముగా కలిగినట్టి ఈ జీవుడే జగత్తు రూపముగా విజృంభించుచున్నాడు కదా! అయితే అట్లు బ్రహ్మము ఖండత్వముతో కూడిన 'నేను జీవుడను' అను భావావేశం ఎందుకు ఎప్పుడు ఎట్లా పొందుచున్నది? బ్రహ్మము 'నేను బ్రహ్మమునే... నిత్యమునే... సత్యమునే..." అను స్వస్వభావమును కోల్పోయి ఈ జన్మపరంపరలన్నింటినీ ఎందుకు తెచ్చిపెట్టుకుంటోంది? అందుకు మూలకారణమేదైనా ఒకటి ఉన్నదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : బ్రహ్మం ఈ 'జీవుడు' అను భావన ఎందుకు పొందుతోంది? అనే ప్రశ్నకు "స్వయముగా ఆశ్రయించుట' అని కాక ఇంకే సమాధానం చెప్పలేం. 'మూలము అనుదానికి మూలమే లేదు' అని మాత్రం పరిశీలనచే తప్పక తెలియ వచ్చుచున్నది. అందుచేత సర్వమునకు మూలమై, సర్వమునకు కారణమైన 'ఆత్మ' ఎట్లు కారణరహితమో, మాయ అనబడే ఈ స్వస్వరూపం నుండి ఏర్పడిన 'చ్యుతి' కూడా కారణ వర్జితమే. "ఒకడు వినోదం కొరకై నాటకం దర్శిస్తున్నాడు"... అనే విశేషంలో, "వినోదం ఎందుకు జనించింది?" అంటే ఏం చెప్పగలం?

మూలమగు బ్రహ్మమునకు మూలమే లేదు.

శ్రీరాముడు : బ్రహ్మమే జగత్తు యొక్క ఉనికికి కారణము, స్థానము కూడా! అందుచేత 'జీవుడు అగుట – జగత్తులను గాంచుట – జ్ఞాన సముపార్జనచే పూర్ణత్వమును తిరిగి అధిరోహించుట" ఇదంతా బ్రహ్మము యొక్క స్వభావమే అయి ఉన్నదని మనం అనుకోవచ్చా?

శ్రీ వసిష్ఠ మహర్షి : బ్రహ్మము నందు కార్యకారణములు, జన్మకర్మలు ఎట్లా ఆపాదిస్తాం?" బ్రహ్మము నందు ఏకారణత్వమునూ సిద్ధింపజేయలేం. అందుచేత 'బ్రహ్మం యొక్క స్వభావం ఇది'

అనునదంతా కొంత సాపేక్షకతను (comparison) దృష్టిలో పెట్టుకుని, గురుశిష్య బోధ కొరకు మాత్రమే కల్పించబడుతోంది. ఎందుకంటావా? శిష్యునియొక్క "స్థితి, గతి"లను బట్టి కదా, గురువు బోధను రచించేది! బ్రహ్మము ఎల్లప్పుడూ కూడా...

1. **నిర్విశేషము -** అందు శేషించినదంటూ ఏదీ ఇక ఉండదు. సర్వము అధిగమించబడగా శేషించేదే బ్రహ్మము.

2. **నిరాకారము -** దానికి ఎట్టి ఆకార, విశేషములు ఆపాదించలేం.

3. **నిర్వికారము -** అద్దానియందు "జీవుడు–నీవు–నేను" మొదలైన వికారములు లేవు.

తరంగమునకో, ఆవర్తమునకో ఆకారము ఉండవచ్చు గాని, జలమునకు ఆకారమెక్కడిది?

అందుచేత "బ్రహ్మం నందు ఈ 'కారణం'చే ఈ 'కార్యం' రూపమగు జగత్తు యొక్క ఉత్పత్తి జరుగుతోంది...." అను అసాధారణ ధర్మరూపంతో కూడిన 'ధర్మము'ను నిర్వచించలేం. ప్రతిపాదించలేం.

బ్రహ్మము నిర్వికారము, అద్వితీయము, అసంగము కదా! అందుచేత యదార్థానికి అది అకారణమే అయివున్నది. అందుచేత "ఈ ప్రపంచమంతా బ్రహ్మమే" అని ప్రతిపాదించినంత మాత్రంచేత "బ్రహ్మము నందు కారణము – నిమిత్తము... సంభవిస్తున్నాయి"... అను ఆరోపణ సరి కాదు. అట్లు "కారణ–నిమిత్తాదులు బ్రహ్మమునందు సంభవించుట" అనేది బ్రహ్మము యొక్క స్వభావమునకే విరుద్ధం.

కాబట్టి ఆ కారణము, వివర్త రూపము అయినట్టి ఈ జగత్తు మిథ్యయే! అకారణమే అయివున్నది సుమా!

శ్రీరాముడు : మరిక సారరహితము, జడము, దుఃఖమయము అయిన ఈ జగత్తు గురించి విచారించి ఏం లాభం?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. అందుచేతనే మనం సారభూతమగు బ్రహ్మము గురించే విచారించటం ఉచితం.

"బ్రహ్మము నందు ఖండత్వరూపమగు 'నేను జీవుడను' అను భావన ఎందుకు ఏర్పడుతోంది?" అనే ప్రశ్నను ఇప్పుడు పరిశీలిస్తున్నాం కదా! ఒకనికి ఒక వ్యాధి వచ్చింది. ఎంతో బాధను అనుభవిస్తూ, అతడు ఒక వైద్యుని సమీపించాడు. "ఇతనికే ఈ వ్యాధి ఎందుకొచ్చింది? ప్రక్కవానికి రాలేదేం? ఎప్పుడు ఏమేమి ఎంతెంత తిన్నాడు? ఎందుకు తిన్నాడు"... అని ఆ వైద్యుడు తాత్సారం చేస్తూ ఉంటాడా? చికిత్స వెంటనే ప్రారంభించకపోతే ఆ రోగి వ్యాధి అనుభవిస్తూనే ఉంటాడు కదా! ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటి? సరి అయిన ఔషధం రోగికి ఇవ్వటం... తద్వారా రోగనివారణ, ఉపశమనం కలగటం... ఇవి కదా ముఖ్యం! అదే విధంగా శాస్త్రములు, గురువులు కూడా "బ్రహ్మతత్వమునందు ఈ జగద్భావన ఎప్పుడు వచ్చింది? ఎక్కడ వచ్చింది? ఎట్లా వచ్చింది? ఎందుకు వచ్చింది..." అను తర్జన – భర్జనలకన్నా కూడా..." ఈ

జీవుడు బ్రహ్మమే స్వరూపముగా కలిగియున్నాడు, కాని భ్రమ చేత జగద్భావమును తీవ్రముగా పొంది దుఃఖాదుల అనుభవపరంపరలు పొందుచున్నాడు. బ్రహ్మమే స్వరూపముగాగల ఈ జీవుని యందు 'నేను జనన-మరణ రహితుడను' అను ఎరుక ఏర్పరచుట ఎట్లు? ఇతడు తనను బ్రహ్మముగా గ్రహించుట ఎట్లు?"... అను విషయమునే తరచు పరిశీలించి, ఉపనిషత్తుల వంటి ఉత్కృష్ట శాస్త్రముల ద్వారా ఆయా ఉపాయాదులను ప్రతిపాదించటం జరుగుతోంది. అందుచేత, బ్రహ్మమే సదా విచారించబడు గాక!

విత్తనం మహావృక్షమవటం, బ్రహ్మము జీవుడుగా అవటం -

1. బీజము దేశకాలాదుల సహాయంచే మహావృక్షమగుచున్నది.

2. బ్రహ్మము దేశకాలాదులను అంగీకరించి జీవుడుగా భాసిస్తోంది.

ఈ రెండింటినీ ఉపమాన, ఉపమేయాలుగా ఉదహరించేటప్పుడు, ఒక భేదం గమనించాలి. బీజం తన ఆకారాన్ని కోల్పోయి ఆయా 'ఆకులు, కొమ్మలు' మొదలైన రూపములన్నీ పొందుతోంది కదా! కానీ, బ్రహ్మం తన స్వరూపాన్ని త్యజించకుండానే ఈ "జగత్ దృశ్యము"... అను రూపంగా ప్రకటితమౌతుంది. అయితే, బీజమే 'అంకురము" అగుచున్నట్లు బ్రహ్మమే ఈ "ద్రష్ట-దర్శనం -దృశ్యం" అను వ్యవహారంగా రూపుదిద్దుకుంటోంది. కాబట్టి బీజాంకురన్యాయము "బ్రహ్మము-జీవుడు-దృశ్యము"లకు తగియే ఉంటోంది.

శ్రీరాముడు : బీజములో ఉన్నదంతా ఆకారసహితమైయున్నది. కాని బ్రహ్మమో, 'ఆకారము' అనబడే వికారమే కలిగియుండలేదు కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును, అందుచేత "బ్రహ్మము బీజము వంటిదే" అనే ఉత్ప్రేక్ష సమగ్రం కాదని మనం అనుకున్నాం. బ్రహ్మముతోటి పోల్చతగినదంటూ ఎక్కడా ఏదీ లేనే లేదు.

బీజస్యాకృతి మత్సర్వం తేనానాకృతిమత్సదమ్ ।
నీయుజ్యతే సమాకర్తుం తస్మాన్నాస్త్యుపమాశివే ॥ (సర్గ 18, శ్లో. 25)

బ్రహ్మము తనకు సమానము తానే అగుచున్నది. అది మరింకే వస్తువువంటిది కాదు.

సూక్ష్మదృష్టితో చూచినప్పుడు "ఈ జగత్తు ఉత్పన్నమైనది కాదు" అని తెలియవస్తోంది. అట్లాగే "ఇది ఉత్పన్నము కానేలేదు" అని కూడా అనలేము. అయితే భావన ఏర్పడిన తరువాతనే జగత్తు ఉనికిని సంతరించుకుంటోంది. దృశ్యము అనబడేది అనిర్వచనీయమై, జీవునిచే (లేక) బ్రహ్మముచే స్వయంకల్పితమై ఏర్పడుచున్నదని గ్రహించు.

కల్పన ఉంటే... జగత్తు కూడా ఉంటోంది. కల్పన లేనప్పుడో... జగత్తు కూడా సర్వదా "లేనిదే" అగుచున్నది.

దృశ్యమ్ పశ్యన్, శ్వమాత్మానం న ద్రష్టా సంప్రపశ్యతి।
ప్రపంచాక్రాంత సంవిత్తే, కస్య ఉదేతి నిజాస్థితిః? ॥ (సర్గ 18, శ్లో. 27)

ఒక ద్రష్ట ఈ దృశ్యమును చూడటం జరుగుచున్నప్పుడు తన యొక్క ఆత్మ స్వరూపమును గాంచుటలేదు. ఎందుకంటే, ఆ సమయంలో అతని జ్ఞానము ప్రాపంచిక విషయ వాసనలచే ఆక్రమించబడటం జరుగుతోంది. అందుచేత స్వస్వరూపమునందు 'స్థితి, నిష్టలు" ఏర్పడుట లేదు. ఫలితం ఏమిటి? ఏదైతే ఏ క్షణంలో కూడా కాకయే ఉన్నాడో, దేనికైతే ఏ మాత్రం సంబంధించకయే ఉన్నాడో... అట్టి దాని యందు (దృశ్య వ్యవహారము నందు) అతనికి నిమగ్న పూర్వకమైన అనుభవం కలుగుతోంది. ఇక నిజస్థితిలో ఉండగలిగేది ఎట్లు? ఎన్నటికి?

❖

ఒక ప్రశ్న. ఒకడు మృగతృష్ణను చూస్తున్నప్పుడు జలము యొక్క భ్రాంతిని పొందుచున్నాడు కదా! ఆ క్షణాలలో, "ఈ విశాల ప్రదేశంలో అకస్మాత్తుగా ఈ సమయంలో జలం ఎక్కడి నుండి వస్తుంది? సూర్యరశ్మి – గాలివీచికలు – క్రీనీడలు – ఈ మూడిటి సమన్వయమే ఇట్లు జల తరంగముల వలె నాకు కనబడుతోంది"... అనే సత్యజ్ఞానం ఏ మూలకో వెళ్తోంది.

ఎండమావులు గురించి "క్రీనీడే కదా..." అనే పరిజ్ఞానం ఉండి ఉన్నప్పుడు, "ఇది జలం" అనే దృష్టి ఏమౌతోంది? వికర్షితమైపోతోంది కదా! భ్రమలో ఉన్నప్పుడు "ఇది మృగతృష్ణ మాత్రమే. ఇక్కడ తటాకము ఉండజాలదు"... అనే విషయం జ్ఞాపకానికి రావటం లేదు.

ఒకటి రెండవ దానిని కనబడకుండా చేస్తోంది కదా!

మాయాదృష్టిచే "ఆత్మ", సత్యదృష్టిచే జగత్తు... "లేనివే" అగుచున్నాయి.

ద్రష్ట యొక్క కళ్ళే (దృష్టిత్వమే) ఆకాశము వలె విశాలమైన స్వరూపము కలిగినవై ఉంటున్నాయి. సర్వత్రా వ్యాపించినదై సర్వమును ప్రకాశింపజేయుచున్నాయి. ఈ చూపు సర్వ పదార్థములను గాంచగలుగుచున్నది. అయితే ఇన్ని విషయములను చూచుచు, గుర్తించుచున్నట్టి ఆ చూపు తనను తాను మాత్రం దర్శించలేకపోతోంది. ఏమి చమత్కారం? మాయాభ్రమ ఎంతటి ప్రబలమైనదో కదా! చూచేవాని యొక్క చూపుకు ఆ చూచేవాడు కనిపించటంలేదు. కానీ, చూడబడేదంతా కనిపిస్తున్నది చూచే వానిలోనే!

తన యందు తాను ఎట్టి భ్రమను కలిగి యుండనట్టి జీవుణ్ణి మనం "ముక్తపురుషుడు" అని పిలుస్తున్నాం. అట్టి ముక్తపురుషుడు దృశ్యరూపమైనట్టి ఈ ద్వైతమును కాకుండా, సర్వేసర్వత్రా ఆత్మనే గాంచుచున్నాడు. దృశ్యమును స్వస్వరూపాత్మ విశేషంగా సందర్శిస్తున్నాడు. కాని తన యందు మాయను పొందుచున్న ద్రష్టకో, ఈ జగత్తు బాహ్యమున ఇంద్రియ విషయమాత్రమై ఘనీభూతమై ప్రాప్తిస్తోంది.

ఆకాశము వలె సర్వవ్యాపకమైనట్టి ఈ ద్రష్ట తన యొక్క పరమార్థ స్వరూపమును గాని, తన వంటిదే అయి వున్న ఇతరుల పరమార్థ స్వరూపమును గాని గాంచుట లేదు. బ్రహ్మం ఆకాశం వలె అన్నివైపుల, సర్వత్రా వ్యాపించి ఉన్నప్పటికీ ఈ జీవులు ఎంతో ప్రయత్నం చేసిన తరువాత కూడా అట్టి బ్రహ్మమును దర్శించలేకపోతున్నారు. ఎందుచేత? ఈ దృశ్యమును దృశ్యరూపముగా చూచునంతవరకు బ్రహ్మ స్వరూపప్రాప్తి అత్యంత దూరముగా ఉన్నదే అగుచున్నది.

ఇందుకు ఒక లౌకికమైన దృష్టాంతము చెపుతాను, విను. ఒకచోట, 'కుండ' మొదలైన కొన్ని పదార్థాలు ఉన్నాయి... ఒక వ్యక్తి చూపు అటు పడింది. కంటిపాపలో వస్తువులు ప్రతిబింబించి నంత మాత్రం చేత ఆ వ్యక్తి వాటిని చూడగలడా? లేదు. ఆ కనుల వెనుక ద్రష్ట ఉన్నాడు. ద్రష్ట వృత్తిని పొందితేనే దృశ్యము పొందబడుతోంది. అయితే, ఆ ద్రష్ట ఆయా వృత్తులను పొందినంత మాత్రంచేత విచ్ఛిన్నుడు అయ్యేవాడు కాదు. అతడు వాస్తవానికి సాక్షితత్వమై, దృష్టిని కూడా వెలిగించుచున్నవాడై ఉంటున్నాడు. అట్టి ద్రష్ట దృశ్య విషయస్వరూపము పొందినప్పుడు మాత్రమే "కుండ" మొదలైనవి తనయందు ప్రకాశింపజేస్తున్నాడు. ఆ ద్రష్ట విషయరూపత్వమే పొందుట లేదనుకో... అప్పుడేమౌతుంది...? ఆ పదార్థముల అనుభవం ద్రష్టకు సాక్షాత్కారం కాదు. అప్పుడు "ఈ పదార్థము ఇది, ఇట్టిది"... అను అనుభవమే ఉండదు. ఈ దృశ్యము, బ్రహ్మము – ఈ రెండిటి యొక్క అనుభవప్రాప్తి ఇట్టివే!

జీవుని యందు 'వృత్తి' మరల మరల విషయరూపత్వము పొందుతోంది. అట్టి ఆ వృత్తిని విషయత్వము నుండి వేరు చేసి సూక్ష్మమైన బుద్ధి సహాయంతో "కేవల పరమాత్మ స్వరూపము" నందు లయింపజేయాలి. ఇది కష్టతరమైన విషయమైనప్పటికీ అభ్యాసముచే ఈ ప్రపంచములో అన్నీ సులభం అవుతాయి కదా! "ఈ జగత్తులో తారసపడుచున్న 'నేను – నీవు – అది – ఇది'... మొదలైనవన్నీ స్వస్వరూపమే అయివున్న ఆత్మకంటే వేరైనవి కావు..." అని నిరంతర నిశ్చయము కలిగియుండటమనేది క్రమక్రమంగా చేసే అభ్యాసంచేత తప్పక సాధ్యమే. ఎందుకంటే, సత్యము అదియే కదా! సత్యమేవ జయతే!

శ్రీరాముడు : అనేక లౌకిక వ్యవహారములు నిర్వర్తించుటలో నిమగ్నమై యున్న మాకు అట్టి అభ్యాసం సాధ్యమేనంటారా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ప్రవాహపతితములగు ఆయా కార్యములను ఆసక్తిరహితంగా (without attachment) నిర్వర్తిస్తూ ఉండే వారికి అట్టి ఆత్మ దృష్టి సులభమే అవుతుంది. ఓ సర్వ సభికులారా! సర్వజనులారా! మీరంతా అట్టి మహత్తరమగు ఆత్మదృష్టి కలిగియుండుటకే ప్రయత్నం చేయండి. "అఖండము, నిత్యము అగు ఆత్మయే నేను" అను భావన కలిగి యుండుటలో ఏమి కష్టమున్నది? అట్టి భావనను మననపూర్వకంగా ధరించి, ఆపై లౌకిక జగత్తులో ఏది ఎట్లు ఉచితమో, అట్లే నిర్వర్తించండి. దీని వలన మీకు శుభమే జరుగుతుంది. అన్ని వేసటలు తొలగిపోతాయి.

❖

ఓ రామచంద్రా! ఈ దృశ్యమైతే కనిపిస్తోంది. కాని ద్రష్ట కనిపిస్తున్నాడా? లేదు కదా! ఈ భౌతిక శరీరము ద్రష్టచే వెలిగించబడుచున్నది మాత్రమే కాని, స్వయముగా ద్రష్ట కాదు.

దృశ్యంచ దృశ్యతే తేన, ద్రష్టా? రామ! నపశ్యతే ।
ద్రష్టైవ సంభవతి ఏకో! నతు దృశ్యమ్ ఇహ అస్తిహి ॥

యథార్థానికి 'ద్రష్ట' మాత్రమే ఉన్నాడు. దృశ్యము ఏ మాత్రము లేనే లేదు. ద్రష్ట ఈ దృశ్యములో దేనిని ఎట్లు సంభావన చేస్తాడో, అది ఆ రూపముగానే సంప్రాప్తిస్తూ ఉంటోంది.

స్వయముగా "సర్వస్వరూపుడు" అయి ఉండుటచే 'ద్రష్ట'యే దృశ్యరూపముగా ప్రసరించి ఉంటున్నాడు.

శ్రీరాముడు : ఈ దృశ్యములో కనబడుచున్న ద్రష్టలు ఇందలి ఏ కారణంగా ఏర్పడుచున్నారు?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ దృశ్యమంతా స్వస్వరూపానుభూతమే సుమా! అట్టి ఆ దృశ్యంలో ఏదో క్రియలచే ద్రష్ట ఏర్పడటం అనేది అత్యంత అసంగతం.

దృశ్యము స్వతహాగా, నీ కంటే వేరుగా లేనే లేదు. ఇక 'ద్రష్టత్వము' నీ కంటే వేరుగా ఎక్కడుంటుంది.

కాబట్టి దృశ్యము ఎట్లు అవాస్తవమో, ద్రష్టత్వము కూడా అట్లే అవాస్తవము. ఈ దృశ్య – ద్రష్టత్వములకు ఆవల రెండింటికీ అతీతమై నీ యొక్క స్వస్వరూపము నిశ్చలమై ఉన్నది. ఆ స్వస్వరూపమే అఖండమై, అద్వితీయమై, సర్వత్రా వ్యాపించినదైయున్నది. అయితే, పదార్థదృష్టిని (perception of matter), తద్వారా ద్రష్టత్వము (the stance of perceiver) ను విడనాడక పోవుట చేతనే ఈ జీవునకు నిత్యసత్యమగు ఆత్మతత్త్వము అనుభవమగుటలేదు. ద్రష్టత్వము, దృశ్యములను అధిగమించిన అవగాహన పెంపొందించుకొనువారికి "దృశ్యము నా స్వరూపమే" అను భావన సులభమే అగుచున్నది.

❖❖❖

8. చిత్తము - జగత్తులు

శ్రీరాముడు : అయితే మునీంద్రా! 'సర్వశక్తిమంతుడగు రాజు' లాగా ఈ ఆత్మయే దృశ్యమును సంపాదించి, అట్టి దృశ్యమునకు తనకుతానై ద్రష్టత్వము వహించుచున్నదని అనవచ్చునా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. అంతాకూడా ఆత్మచే తనకొరకు తానే నిర్మించుకొనుచున్నదే అని అనక తప్పదు. ఆత్మ తన యొక్క ఇతరములైన అపేక్షలన్నీ లేకుండా కేవలం ఒక పదార్థమును (విషయమును) ఆశ్రయించినప్పుడు ఆ పదార్థమునే అనుభవించుచు, అట్టి రూపముగానే ఉదయించుచున్నది.

ప్రకృతిలోని 'మాధుర్యము' అను రసము యొక్క ఉల్లాసమే పటికబెల్లం రూపమును పొందుతోంది. అదే మాధుర్యము తనయొక్క రసరూపత్వము త్యజించకుండానే "ఫలములు–పుష్పములు–లతలు" మొదలైనవాటియందు అంతర్లీనమై ఉంటోంది. అదే విధంగా...

"చిత్" (Awareness) అను ఉల్లాసము రూపముగాగల ఈ జీవుడు ఈ 'దేహములు' మొదలైన రూపమును పొందుచున్నాడు. ఈ ద్రష్ట తనయొక్క చిత్స్వరూపమును త్యజించకుండానే, "ద్రష్ట–దర్శనము"లుగా అగుచున్నాడు. తనయందు 'జాగ్రత్తు' అను స్వప్నమును గాంచుచున్నాడు.

"ఈ 'ఉప్పు ఖండములు' ఇతఃపూర్వం ఎక్కడ ఉండి ఉన్నాయి?" అను ప్రశ్నకు సమాధానం "ఇవి 'లవణము' – అను రసము రూపమున జలమునందే ఉండి ఉండేవి" అని చెప్పాలి కదా! అదే విధంగా ఆత్మయందే అహంకారము మొదలైనవి ఉండి ఉన్నాయి.

అనేక మట్టిగడ్డలు ఒకచోట ఉన్నాయనుకో... ఆ మట్టి గోడలన్నిటిలో ఉన్నది ఒకమట్టియే కదా! ఒకే చిద్వస్తువు అనేక ఆకారములుగాను, రూపములుగాను ఉదయిస్తోంది. "చిత్ రస–ఉల్లాసము"చే అనేక దృశ్యములుగా దృశ్యమానమగుచున్నదంతా పూర్ణప్రదమగు స్వస్వరూపమే!

అటువంటివే..... ఈ జగత్ ఖండములు కూడా!

'చైతన్యము' తన యొక్క సంకల్పముల ప్రభావంచేత నిర్మించబడుచున్న దృశ్యములను తానే స్వయంగా గాంచుచు, అనుభవించుచున్నది. జీవశక్తి ఈ దృశ్య ప్రపంచమును ఈ విధంగా పొందుతోంది. అనగా ఆత్మ తన యొక్క విస్తృత స్వరూపమును ఈ రూపముగా భావన చేయు చున్నది... అని విజ్ఞులు అవగాహన చేసుకుంటున్నారు.

ఇక సమానమైన ఆకారములు కలిగినట్టి వాసనలు ఉదయించటం చేత కొన్ని జగత్ ఖండములు పరస్పరం కలియటం జరుగుతోంది. అట్లు వివిధ జగత్తులు ఒకదానితో ఒకటి ప్రవర్తిస్తూ మరల ఎప్పుడో నశించుచున్నాయి. మరికొన్ని జగత్ ఖండములు ఒకదానితో మరొకటి కలియటమే లేదు.

ఓ రామచంద్రా! నీవు 'పరమ సూక్ష్మదృష్టి'తో, 'జ్ఞానముతో కూడిన చిత్తముతో' ఇదంతా గమనించాలి. ఈ వేలాది ప్రపంచములను చూస్తున్నావా? చిత్తమునందు, ఆకాశము నందు, శిలల యందు, అగ్నిజ్వాల లందు, వాయువు నందు, అరణ్యము లందు, సముద్ర గర్భము లందు, ప్రతి పరమాణువు నందు వేలకొలది 'జగత్ సమూహములు" పొందబడుచున్నాయి.

ప్రతి నువ్వు గింజలోనూ నూనె ఉండి ఉన్నది కదా...! ఆరీతిగా, ప్రతి చిత్తమునందు లక్షల కొలది జగత్తులు ఉన్నాయి. ఈ చిత్తమునకు (అనగా ఈ చిత్తములోని జగత్తులకు) సిద్ధి కలిగినప్పుడు ఈ చిత్తమే 'చైతన్యముగా' అగుచున్నది.

అనుబంధములు, భేదభావనలు - శుద్ధము, సర్వవ్యాపకము అయిన "చైతన్యము" యొక్క అంతరము నందు పరస్పర సమ్మేళనము సిద్ధిస్తోంది. అట్టి సమ్మేళనమే ఈ జీవుల యొక్క అనుబంధములు – భేదభావములు కూడా. అట్టి అనుబంధత్వము కారణంచేత ఒక భ్రమలాగా బ్రహ్మ మొదలగు సృష్టిదేవతలచే కల్పించబడిన ఈ భౌతిక జగత్తు జీవులందు ప్రతిబింబిస్తోంది.

ఈ ప్రపంచము ఒక దీర్ఘ స్వప్నము వంటిది. కొందరు జీవులు ఒక స్వప్నము నుండి మరొక స్వప్నమును పొందుచున్నారు. ఇట్టి స్వప్న పరంపరల యొక్క పరిభ్రమణమే దృశ్యముగా అనుభవ మవుతోంది. వాసనల దార్ఢ్యము (density) చే అది దృఢరూపమును పొందుతోంది. చైతన్యము తన యొక్క వాసనలని అనుసరించి దేనిని ఎట్లు భావిస్తే అది అట్లే అనుభవరూపం పొందుతోంది. ఆ విధంగా చైతన్యము స్వప్న సదృశంగా అనుభవిస్తున్నదంతా అనుభవసమయంలో సత్యముగానే ఉంటోంది. ఒక బీజమునందు వృక్షతత్వమంతా దాగి ఉంటున్నట్లు, వాసనతో నిండియున్న చిదణువునందు సూక్ష్మ– రూపమున ఈ జగత్తులన్నీ ఉంటున్నాయి.

చిత్ పరమాణువులు, జగత్ పరమాణువులు – "చిత్" అంటే 'ఎరుక' కదా! ఈ అనేక మంది జీవులు అనేక చిత్ పరమాణువులు. అట్టి ఈ చిత్ పరమాణువుల భావనా వైచిత్ర్యమే జగత్పరమాణువు లందు ప్రవేశిస్తున్నాయి. ఈ "జగత్తు – చిద్వస్తువు"... ల పరస్పర ప్రవేశము, పరస్పర సమావేశము ఎంతటి ఆశ్చర్యకరమైనది!

ఒక విధంగా ఇక్కడ చిదాకాశమే చిదాకాశమునందు జగత్తుగా ప్రదర్శనమవటం. అనగా, వాస్తవానికి లీనమవటం జరుగుతోంది.

ఈ చిదాకాశమునే భ్రమరూపమగు జగత్తుగా అందరు చూడటం జరుగుతోంది.

కాబట్టి రామా! నీవు "ద్వైతము – ఏకత్వము"... అను రెండు భ్రమలు త్యజించివేయి. ఈ జీవులు 'చిత్' అను అంశమును స్వభావముగా కలిగియున్నారు. అట్టి వీరు, 'చిదంశములే' అయినట్టి దేశ–కాల–క్రియా రూపములైన అణువులను ఏదో అన్యమైన బాహ్య వ్యవహారము వలె గాంచుచున్నారు.

వాస్తవానికి ద్రష్టకు అన్యమైనదంటూ ఎక్కడా ఏదీ సంభవించదు. ద్రష్టయే దృశ్యరూపమున విస్తరిల్లుచూ...., ఆస్వాదిస్తున్నాడు.

బ్రహ్మదేవుని నుండి ఒక కీటకము వరకు ఈ సర్వప్రాణుల జీవన విధానము, భావన చేయు రీతి... అంతాకూడా వారి వారి అంతఃకరణోపాధి (మనస్సు – బుద్ధి – చిత్తము – అహంకారము) చేతనే ప్రాప్తిస్తోంది. అయితే, 'జాగృత్'లోని సర్వవ్యవహారములు గాఢ నిద్రా సమయంలో మరుగునపడి ఉంటున్నట్లు, సంసార వ్యాపకము ఆశ్రయించు సమయంలో ఆత్మదృష్టి మరుగున పడుతోంది. ప్రళయకాలంలో జీవునిలో ఇదంతా 'అప్రకటితం'గా, సృష్టికాలంలో స్వప్నానుభవం లాగా 'ప్రకటితం'గాను, అగుచున్నది. అనగా, ఈ జగత్ వ్యవహారదృష్టి అంతఃకరణంలో ఉండి ఉంటోంది. భావించబడునదంతా అధిగమించి, భావించువాని తత్వమేమిటో పరిశీలించామా... బ్రహ్మ మొదలుకొని పురుగువరకు ఇక్కడ గల ప్రతి జీవుని స్వరూపము (దృశ్యరహిత ద్రష్టగా) నిత్యము, అఖండము, అప్రమేయము అయివున్నాయి.

ద్వైత భ్రాంతి, వ్యష్టి - ఓ రాఘవా! ఈ జగత్తు ఒక అనిర్వచనీయమైన 'స్ఫురణ'గా ప్రాప్తిస్తోంది. యథార్థమైన దృష్టిని పెంపొందించుకున్న మహనీయులకు ఇక్కడ 'అర్థవంతమైనది, సారవంతమైనది' – అనునది ఏదీ లభించకున్నది. తీవ్రమైన జ్వరములో బాధింపబడు మానవుడు పరిసరములన్నీ తిరిగిపోతున్నట్లు భావిస్తూ ఉంటాడు. అట్లాగే ఈ 'జీవుడు' అని చెప్పబడుచున్న 'చిత్' స్వరూపుడు తనకుతానే ద్వైతమైన రూపాదులను అనుభవిస్తున్నాడు. స్వస్వరూపమగు ఆత్మనే అతడు అట్లు వివిధ రీతులుగా (అనేక జగత్ దృశ్యపరంపరల రూపంగా) పొందుచున్నాడు.

చైతన్యమే స్వరూపముగాగల ఈ చిత్ అణువు (జీవుడు) తనయొక్క 'అంతఃకరణము' (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము... అను ఉపాధి)చే ఈ ఇంద్రియములలో ప్రవేశిస్తోంది. వీటి ద్వారా ఇంద్రియజ్ఞానము వెడల గ్రక్కుతోంది. స్వయముగా విశాలమగు దృశ్య–దేహరూపమున స్ఫురించుచున్నది.

ఈ దృశ్యమునకు 'బీజభూతము' అని చెప్పదగ్గ చైతన్యము సర్వవ్యాపకము, నాశరహితము సుమా! ఒక చోట అనేక కుండలున్నాయి. అవి ఆయా సమయాలలో కుమ్మరిచేత నిర్మించ బడుతున్నాయి. కుండలన్నిటిలో ఉన్నది మట్టే కదా! వేరు వేరు సమయములలో తయారు చేయ బడిన వేరు వేరు కుండలు వేరువేరైన మట్టివలె కనిపిస్తాయి. వేరువేరు కుండలలో ఒక కుండ, వంటి ఈ వ్యష్టి జీవుడు స్థూలదేహంలో ప్రవేశించి ఇంద్రియముల ద్వారా తదితర స్థూల దేహములను గాంచుచున్నాడు. అతడు "నేను దేహమును" అను దృష్టి త్యజించినప్పుడు, తన యందు మరియు ఇతర కుండలలో (దేహములలో) కూడా ఘటాకాశము వలె అతి సూక్ష్మమైనట్టి 'ఆత్మాకాశము'ను గాంచగలడు.

"నేను నాశరహితమగు ఆత్మను" అని గ్రహించినప్పుడు అట్టి మహాత్ముడు సర్వుల యందలి నాశరహితత్వమును, అభేదత్వమును గాంచగలుగుచున్నాడు. తన యందు సర్వమును, సర్వము నందు తనను సర్వదా సందర్శించగలడు.

సమష్టి బ్రహ్మాండాత్మకుడు - "నేను ఈ సమష్టి – తత్త్వమును' అను సమష్టి అహంకారమును ఆశ్రయించి యున్న మరొక జీవుడు తనయందే అనేక దోషములతో కూడిన ఈ జగత్తును గాంచుచున్నాడు. తాను చూస్తున్న సమష్టి వ్యవహారంలో దీర్ఘకాలంగా అభేదం పొంది, మునిగి తేలుతున్నాడు. అందులోనే "ఉత్పన్న – వినాశములు" అను స్వప్నం పొందుచున్నాడు. అట్టి స్వప్న రూపమగు జగత్తునందు అనేక రూపములైన "స్వప్నములలో స్వప్నములు" వంటివి ఒక పరంపరగా పొందుచున్నాడు. ఊహానిర్మితమైన పర్వతశిఖరం నుండి ఊహానిర్మితమైన జలపాతం వెంట ఊహానిర్మితమైన శరీరములను దొర్లించుచు, బీభత్సమంతా అనుభవిస్తున్నాడు. (సమష్టి సృష్ట్యహంకారి – బ్రహ్మదేవుడు).

విద్య, అవిద్య - ఓ రామచంద్రా! అసంఖ్యాకములైన ఉపాధులతో కూడిన ఈ విస్తారమైన ప్రపంచమును గమనిస్తున్నావా? ఇవన్నీ స్వకీయమైన కల్పనాచమత్కారము చేతనే స్ఫురిస్తున్నాయి.

ఈ దేహాలు... చూడు. వీటిలో కొన్ని దేహములు పరస్పరంగా అనేక భ్రమ విభ్రమములు కలిగి ఉంటున్నాయి. మరికొన్ని దేహములు సర్వభ్రమలు త్యజించివేసి ఆత్మయందు స్థితి కలిగి ఉంటున్నాయి. కొన్ని "వ్యాప్తమై, దృశ్యమానమగుచున్న ఈ ప్రపంచం అసత్తు, స్వప్నతుల్యం అయి వున్నది కదా?" అను ఎరుక కలిగియుండి, ఇక ఆపై, తదితర జీవుల వలెనే ఆయా దృశ్య వ్యవహారాలలో క్రీడామాత్రంగా పాల్గొనుచున్నాయి. అట్టి జీవులను 'సుజ్ఞానులు' అని అంటున్నాం.

శ్రీరాముడు : తండ్రీ! ఈ దృశ్యములలో విడివిడిగా వేరు వేరు సంస్కారములతో కూడి కనిపిస్తున్న ఈ జీవులంతా సత్యముగా ఉన్నారా? లేరా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ దృశ్యమంతటా ప్రసరించివున్నది ఆత్మయే. ఆత్మయే సర్వముయొక్క అధిష్ఠానము అయివుండుటచేత ఇందులో ప్రతిజీవుడు "సత్యమే" అయివున్నాడు.

అంతేకాదు...

ఎచట సర్వవ్యాప్తియగు ఆత్మ కలదో, అచట సమస్తం వివర్తరూపమున ఉదయిస్తూనే ఉన్నది.

జీవము, ఆ జీవము యొక్క ప్రతిభాస, ఆ ప్రతిభాసలో మరల జీవము... ఇట్లు, ఆత్మయే స్వస్వరూపముగా గల ప్రతి జీవియందు ఏర్పడి ఉంటోంది. జీవుడు... ఆ జీవునిలో మరొక జీవుడు... అందలి ప్రతిజీవునిలో మరికొంతమంది జీవులు... ఈ విధంగా అరటి మట్టలవలె ఒక జీవునిలో అసంఖ్యాకములగు జీవరూపములు ఉంటూనే ఉంటున్నాయి.

'ప్రపంచం' అనుదానితో కూడినవాడైనట్టి ఈ జీవునియందలి 'జీవసత్త'కు కారణం ఏమిటి?

అవిద్యతో కూడుకున్నట్టి చైతన్యమే సుమా!

శ్రీరాముడు : అయితే, మహర్షీ! అతి దీర్ఘకాలంగా జన్మ కర్మల మధ్య చిక్కిన ఈ జీవునియందు పొరలుపొరలుగా ఏర్పడియున్న అల్పత్వము తొలిగేది ఎట్లు? ఎన్నటికి? ఇతనిలో ఆత్మకు సంబంధించిన అనుభవం ఏర్పడేది ఏ విధంగా?

దృశ్యబుద్ధిపరావృత్తౌ సమమే తదన న్తరమ్ ।
హేమ్నీవకటకాదిత్వం పరిజ్ఞాతవినశ్యతి ॥ (సర్గ 18, శ్లో 63)

శ్రీ వసిష్ఠ మహర్షి : జీవునియొక్క ఈ బుద్ధి దృశ్యపదార్థములవైపు అభిముఖమై ఉండి ఉంటోంది. ఇప్పుడీబుద్ధి, దృశ్యపదార్థముల నుండి వెనుకకు మరల్చబడి, ప్రత్యగాత్మవైపు అభిముఖం అయితే చాలు. ఆభరణత్వమునకు అతీతమైన దృష్టితో చూచువారికి దానియందు బంగారమే ప్రత్యక్షమై తీరుతుంది కదా! ఈ జీవుడు తనయందలి పదార్థత్వమును అధిగమించివేస్తే, అప్పుడు ప్రత్యగాత్మత్వముతో ప్రకాశించగలడు. అనగా తనయందలి 'ఆత్మలక్షణములు' అయివున్నట్టి అఖండత్వము అప్రమేయత్వము, అశరీరత్వము, అద్వితీయత్వము, అకాలత్వము లను అతడు గ్రహించటం జరుగుతోంది.

అయితే ఆభరణములకు క్రొత్తగా ఏమైనా ప్రయత్నములచే సువర్ణత్వము వచ్చిపడుతోందా?

శ్రీరాముడు : లేదు. ఆభరణములు (గాజులు, గొలుసు) మొదటే సువర్ణము, క్రొత్తగా సువర్ణత్వము రావలసిన పనిలేదు.

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. అదే విధంగా, "నేను స్వయముగా ప్రత్యగాత్మస్వరూపమునే..." అను భావన సుస్థిరమగుచుండగా, ఈ బాహ్య అభ్యంతర ప్రపంచమంతా అట్టి జీవుని దృష్టిలో స్వయముగా రహితమై పోతోంది. నేను స్వతఃగా సదా ప్రత్యగాత్మ స్వరూపుడనే".... అని నిర్మల హృదయుడు గమనించుచూనే ఉన్నాడు.

విచారోయస్యనోదేతి కోఽహంకిమిదమిత్యలమ్ ।
తస్యాన్తర్నవిముక్తోసౌ దీర్ఘోజీవజ్వరభ్రమః ॥ (సర్గ 18, శ్లో 64)

ఎవనియందైతే, "నెనెవరిని? ఈ ప్రపంచమేమిటి?" అను విచారణ కలుగుతుందో, అట్టి వానికి మాత్రమే, "ప్రత్యగాత్మ అనేది నాయందలి నిత్యసత్యమే" అని తెలియవస్తోంది. అట్టి

దర్శనము పొందినందుకు ప్రయోజనంగా గొప్ప రోగరూపంగా ప్రాప్తిస్తున్న 'సంసారము' అనబడే ఈ దీర్ఘకాల విభ్రమమంతా తొలగిపోతుంది.

అట్లా కాకుండా... ఎవని దృష్టిలో అయితే, "ఇది జగత్తు, ఇది నీవు. ఇది నేను. ఇది నాది. ఇది పొందవలసియున్నది..." అనుబుద్ధి తొలగదో, అట్టివాడు బంధము కలిగియే ఉంటున్నాడు.

శ్రీరాముడు : ఈ జీవుడు తనయందలి పూర్ణత్వమును అనుభవపూర్వకంగా గ్రహించాలంటే తత్వవిచారణ ఒక్కటే శరణ్యమని నేను అనుకుంటున్నాను.

విచారఃసఫలస్తస్య విజ్ఞేయోయస్యసన్మతేః ।
దినానుదినమాయాతి తానవం భోగగృధ్నుతా ॥ (సర్గ 18, శ్లో 65)

శ్రీ వసిష్ఠమహర్షి : అవును నిజమే. అయితే సద్బుద్ధి గలిగినట్టి ఏ మనుజుడైతే ఒకవైపు విశ్లేషణ – అవగాహనలను సంస్కరించుకుంటూనే, మరొకవైపు తనయందలి భోగలాలసత్వమును క్షణక్షణం క్షీణింపజేసుకుంటూ ఉంటాడో... అట్టి వానిచే చేయబడుచున్న విచారణ మాత్రమే సఫలమగుచున్నదని గ్రహించు.

మంచి ఔషధం సేవిస్తే ఆరోగ్యం పొందుతాము కదా! "ఇంద్రియములను జయించుట" అనునది అభ్యసిస్తే వివేకము అనునది ఫలవంతమౌతూ ఉంటుంది.

అట్లా కాకుండా, కొందరి విషయంలో ఒక విచిత్రం జరుగుతోంది. వారిలో వివేకము కేవలం వచనామాత్రంగానే (కబుర్లవరకే) ఉంటోంది. ఆ వివేకం వారి మనస్సునందు ఏర్పడుట లేదు. వారి అవగాహనలలో, కర్మలలో ప్రతిబింబించుటలేదు. చిత్రపటంలోని అగ్నితో నీళ్ళు కాచుకోగలమా? మనస్సునందు వివేకమును ప్రస్ఫుటం చేసుకోలేనివాడు, మాటలు చెప్పగలిగి నప్పటికీ, అవివేకిగానే శేషించుచున్నాడు. అయితే 'వివేకము' అనేది స్వగతమైన అవగాహనకు సంబంధించినదేగాని, బాహ్యగతమైన రూప–నామ–క్రియాదులకు సంబంధించినది కాదు.

"కోరికలు సన్నగిల్లుట" అను మార్గములో ప్రయాణం చేస్తూ ముందుకు పోతున్న మానవునికి మాత్రమే వివేకము వికసించుట జరుగుతోంది.

వాయువు యొక్క సత్త (The existence of air) ఎన్ని మాటలు వింటే ఎరుగగలం? ఆ వాయువు మనను స్పర్శించినప్పుడు క్షణంలో ఎరుగుతాం కదా! అన్నిటికన్నా ముఖ్యం అనుభవం.

ఒక చిత్రపటంలోని అగ్ని నిజమైనా అగ్నా? అందలి అమృతం నిజమైన అమృతమా? అందలి స్త్రీ నిజమైన స్త్రీయా? కాదు కదా! అట్లాగే "వాచావివేకము ఏర్పడినంతమాత్రంచేత నిజమైన వివేకం పొందినట్లు కాకపోవచ్చు" అని శ్రోతలకు జాగరూకత చెప్పుచున్నాను. "వాచా మాత్ర వివేకం (Not true discrimination), 'పరిమిత దృష్టి' ఉన్నచోట అవివేకమే అవుతుంది. అనుభవమే వివేకమునకు తార్కాణం.

❖

వసంతకాలం ప్రవేశించిన వనంలో కొన్ని విశేషాలు ఏర్పడుతాయి కదా! అట్లాగే వివేకము ఉదయిస్తున్నట్టి జీవునియందు కొన్ని విశేషాలు మనకు కనబడుతూ ఉంటాయి. వివేకము యొక్క ఆగమనముచే మొట్టమొదట రాగము సన్నగిల్లుతుంది. ఆ తరువాత వైరము సమూలముగా నశించిపోతుంది. అప్పుడు జ్ఞానము వికసిస్తూ ఉండగా, " ఇష్ట వస్తువు లభించుగాక! అయిష్ట వస్తువు తొలగు గాక"... అను ఆవేశ కావేశాలు కూడా క్రమంగా సన్నగిల్లుతూ ఉంటాయి.

కాబట్టి ఓ సభికులారా! సర్వజనులారా! అనుభవముతో కూడిన వివేకముగల మానవుడు ధన్యుడు. అతడు పరమపావనుడు. మీరంతా మీయొక్క అవివేకమును తొలగించుకోవటానికనే నియుక్తులు అవండి. ఈ ఉత్తమ మానవజన్మ పొందినందుకు గాను 'సార్ధకత'కు ప్రయత్నించండి.

ఉత్తిష్ఠ! ఉత్తిష్ఠ!

❖❖❖

9. శుద్ధ చైతన్యము - ప్రాపంచిక క్లేశములు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఒక వృక్షమునకు ప్రారంభస్థితి బీజమే అయివున్నది కదా! ఈ జీవునకు బీజము "బ్రహ్మము" అయి వున్నది. అట్టి బ్రహ్మము ఆకాశము వలె సర్వత్రా వెలయుచున్నది. ఈ జీవునిపట్ల మనకు కనిపించే జగత్తులో అనేక జగత్తులు అంతర్లీనమై ఉన్నాయి. అరటి మట్టలవలె, భూమిపైగల పెద్ద సంఖ్యలో ఉన్న కీటకములవలె ఈ జీవుని యందు అనేకమంది జీవులు ఉన్నారు. వేసవిలో చమటలో నుండి ఆయా క్రిమిజాలమంతా ఉత్పన్నమౌతుంది చూచావా? శుద్ధ చైతన్యము బాహ్య అభ్యంతరము లందు అనేక దృశ్య రూపములను ధరించుచు అనుభవించుచున్నది. అది ఎక్కడ దేనిని ఆశ్రయిస్తుందో అక్కడ అద్దానిగా అవశ్యము పరిణమిస్తూనే ఉంటుంది.

ఈ జీవులు అనేక విధములైన ఆరాటములతో ఏమేమి ప్రయత్నములు చేస్తున్నారో, అవన్నీ 'స్వాత్మసిద్ధి' చేత మాత్రమే చివరికి పరిసమాప్తి పొందుచున్నాయి సుమా! అయితే వారు మధ్య మధ్యలో ఏ ఉపాసనాక్రమముచే ఏఏ విధంగా ప్రయత్నిస్తారో ఆయా విధంగా అట్లే ఆయా పరిణామాలు ప్రాప్తిస్తూ వస్తున్నాయి.

దేవతలను పూజించేవారు దేవతలనే పొందుతారు. యక్షులను ఆరాధించేవారు యక్షులనే చేరుచున్నారు. హిరణ్యగర్భుడగు బ్రహ్మను ఆరాధించేవారు బ్రహ్మనే పొందుచున్నారు.

అఖండము, నిత్యము, సర్వము అగు బ్రహ్మమును ఆరాధించేవారు బ్రహ్మానుభవమునే పొందుచున్నారు. కాబట్టి రామా! ఏది ఉత్తమమైనదో అదియే నీచేత ఆరాధించబడుగాక!

❖

మన శుక్రుడు మొట్టమొదట 'అప్సరస రూపము" అను దృశ్యమును చూచాడు. అట్లు చూస్తున్నప్పుడు, "మలిన చిత్తస్వభావము"చే బద్ధుడు అయినాడు. మరొక సమయంలో "నేను

దుష్ట సాంసారిక స్వభావమును ఆశ్రయించానేమిటి?" అనే 'మెళుకువ'ను ఆశ్రయించాడు. మరల తపస్సును, ధ్యానమును నిర్వర్తించుటచే జ్ఞానమును సముపార్జించాడు. చిత్తము శుద్ధము అయింది. అట్టి చిత్తనిర్మలత్వము యొక్క ప్రభావముచే "ముక్తి"ని సంపాదించాడు.

వాస్తవానికి ఈ జీవుడు శుద్ధ చైతన్యస్వరూపుడే.

శుద్ధ తత్వానుభవమునందు ఉండి ఉండియే.... ఈ శుద్ధచైతన్యము ఒకప్పుడు కాకతాళీయంగా ప్రాపంచిక వ్యసన క్లేశములను స్వయముగా ఆశ్రయిస్తోంది. అయితే, ఒకడు ఆదమరచినంత మాత్రం చేత తననుతాను కోల్పోవుచున్నాడా? లేనే లేదు. అట్లాగే ఏ జీవుడూ కూడా ఎప్పుడూ కంటె 'ఆత్మత్వము'ను ఏ మాత్రం కోల్పోవుటయే లేదు.


❖❖❖

10. జాగ్రత్ - స్వప్న - సుషుప్తి - తురీయములు

శ్రీరాముడు : హే మహర్షీ! మీరు జాగ్రత్ - స్వప్న - సుషుప్తులను గురించి కొన్ని విశేషాలు మాకు చెప్పారు. వీటికి ఒకదానితో మరొకదానికి గల సంబంధమేమిటో మరికొంత వివరించండి.

ఈ జాగ్రత్తు సత్యమువలె వ్యవహారహేతువై, కార్య - కారణములతో కూడినదై ఇట్లు ఎందుకు ప్రాప్తిస్తోంది?.... స్వప్నము భ్రమగాను అసత్యముగాను ఎందుకు ఉండి ఉంటోంది?... జాగ్రత్తు స్థిరంగాను, స్వప్నం అస్థిరంగాను ఎందుకు ఏర్పడి ఉంటోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి : ప్రతిజీవుని యొక్క శుద్ధ చిత్ స్వరూపమునకు ఆకారముగాని, వికారములు గాని లేవు. అది భావముకంటే మునుముందే ఉండుటచే భావాతీతమైనది. అది గుణములకు వేరై ఉండుటచే త్రిగుణరహితమైనది. అనిర్వచనీయమై ఉండి కూడా, "ఉండుట - గ్రహించుట - ఆనందించుట" అను మూడు ప్రకటనలు కలిగి ఉంటోంది. (సత్-చిత్-ఆనందం)



ఓ రాఘువా! జాగ్రత్తు స్థిరప్రత్యయయుక్తమైనది – స్వప్నము అస్థిరమైనది... అనే అభిప్రాయం నీవు వెలిబుచ్చుచున్నావు కదా! అయితే స్వప్నము కూడా ఆ స్వప్నము అనుభవించ బడుచున్నట్టి సమయంలో "ఇది వాస్తవమే" అనే అభిప్రాయము కలుగజేస్తూనే ఉన్నది. అట్టి అభిప్రాయం కలిగించకపోతే 'స్వప్నము' అనే అనుభవమే ఉండేది కాదు. అంటే స్వప్నము కూడా ఆ స్వప్న సమయములో జాగ్రత్తు లక్షణములు కలిగి ఉంటున్నట్లే కదా!

అదే విధంగా ఈ 'జాగ్రత్తు' కూడా అనేక అస్థిరములైన విశేషములు కలిగి ఉండటం చేత ఇదంతా స్వప్నతుల్యమే అగుచున్నది. ఇక "అనుభవ విశేషం" (The process of experiencing) విషయానికి వస్తే.... "ఇది స్థిరము – ఇది అస్థిరము" అను భావన ప్రాప్తించటం తప్పించి, జాగ్రత్ స్వప్నములకు భేదమేమున్నది చెప్పు? ఆ రెండింటిలోని 'అనుభవం' అనునది మాత్రం సమమే అయి ఉన్నది. ఆ రెండూ కూడా ద్రష్ట యొక్క అనుభవములే కదా!

స్వప్నం కూడా స్వప్నకాలంలో కొంత స్థిరత్వమును జీవునకు పొందింపజేస్తూనే ఉన్నది. అందుచేత స్వప్నానుభవం జాగ్రత్ అనుభవమునకు సమానమైనదే.

అట్లాగే ఒకడు తనయొక్క బాల్యపు అనుభవములను, సంబంధములను, భావనలను గుర్తు తెచ్చుకుంటున్నప్పుడు అవన్నీ స్వప్నములాగానే హృదయాకాశంలో చూడబడుచూ ఉంటాయి. అసలు ఈ జాగ్రత్ – స్వప్నములను "అనుభవములు – అనుభవజ్ఞుడు... దృష్ట్యా చూచినప్పుడు ఏ అనుభవం ఎంతసేపు స్థిరంగా ఉంటోందో చెప్పు?

"స్వప్నము కూడా జాగ్రత్తువలెనే అనుభవం కాగలదు?"– అని చెప్పటానికి అనేక దృష్టాంతాలు ఉన్నాయి. "హరిశ్చంద్రుడు" అను రాజుకు ఒక్క రాత్రి యందలి స్వప్నంలో 12 సంవత్సరాల సుదీర్ఘమైన అనుభవం ప్రాప్తించింది. "అసత్యము పలుకకుండుట"... అను అతని జాగ్రత్ సంస్కారం స్వప్నంలో కూడా ప్రతిభాసించింది. ఏ బుద్ధియొక్క "స్థైర్యాంశము" (That which tends to be constant) చే మనం ఈ జాగ్రత్తును చూస్తూ "ఇదంతా సుస్థిరమైనదే"... అని భావన చేయటం జరుగుతోందో, అదే బుద్ధియొక్క స్థైర్యాంశము కారణంగా స్వప్నములో కూడా స్వప్న సమయంలో అట్టి భావనయే మనం కలిగి ఉంటున్నాం. "స్వప్నము కూడా జాగ్రత్తువలెనే అన్ని విధములా అనుభవమునకు రాగలదు" అనే విషయం మనం ఉత్పత్తి ప్రకరణం లోని లవణోపాఖ్యానంలో గమనించాము కదా!

స్వప్నంలో కూడా జాగ్రత్తువలె 'జ్ఞానాంశ' స్థిరమైనదే. అయితే 'స్వప్నబుద్ధి' కలిగి ఉన్నప్పుడు మాత్రమే స్వప్న వ్యవహారం ప్రాప్తించటం జరుగుతోంది.

ఏది ఎంతవరకు స్థిరంగా తోస్తూ ఉంటూఉంటోందో అది అంతవరకు 'జాగ్రత్తు'తో సమానమే కదా!

జాగ్రత్తు - ఇక్కడ (జగత్తులో) కనిపిస్తున్న అనేక విశేషాలన్నీ "క్షణభంగురమే" అయి ఉండుటచే ఈ జాగ్రత్తు కూడా స్వప్నము వంటిదే.

దేనిచేతనైతే ఈ శరీరము ఉజ్జీవించబడుతోందో, అట్టి శరీరాంతర్గత తత్త్వమునే, "తేజము, వీర్యము, జీవము, చైతన్యము" మొదలైన పేర్లతో పిలుస్తున్నారు. ఈ 'జీవించుట' అను కార్య క్రమమునకు హేతువు ఆ చైతన్యమే. ఈ శరీరం మనోవాక్కర్మలచే (by, thought, speech of action) వ్యవహారములు నిర్వర్తిసున్నప్పుడు... ప్రాణవాయువులచే ప్రేరితమైన జీవచైతన్యం హృదయం నుండి బయటకు వెడలుచున్నది. బాహ్య ప్రదేశాలలో సంచరిస్తోంది. జీవ చైతన్యం దేహాంతరంలో ఉన్న నాడులో సంచరిస్తున్నప్పుడు, శరీరమంతటా 'జ్ఞానం' లేక 'సంవిత్తు' ఉదయిస్తోంది.

ఆ జీవచైతన్యమే 'దృశ్యము' వైపు ప్రసరించుచున్నప్పుడు "జగత్తును పొందుచున్నాను" అను భావన పొందుచున్నది. ఇట్టి అనుభవమునే 'చిత్తము' అని అంటున్నాం. అనగా జీవచైతన్యమే దృశ్యమునకు సంబంధించిన 'జగత్ భ్రమ'ను తన యందు అంతు లేకుండా దర్శించుచున్నది. అట్టి జగత్భ్రమ అటు జాగ్రత్తులోను, ఇటు స్వప్నంలోను కూడా ఉదయిస్తుంది. విహారం సల్పుతోంది.

జాగ్రత్–స్వప్న దృశ్యాలు రెండూ చిత్తము యొక్క అంతర్గత–అంతరాంతర విశేషాలే!

శ్రీరాముడు : అయితే ఈ జగద్దర్శన వ్యవహారమంతా చిత్తము యొక్క అంతర్గతములో ఏర్పడి ఉంటున్న చమత్కారమేనంటారా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. ఎట్లా అంటావా? ఈ జీవచైతన్యమే 'నేత్రములు' మొదలైన 'ఇంద్రియ ఛిద్రములు' గుండా బాహ్య ప్రదేశములకు వ్యాప్తి చెందుచున్నది కదా! అట్లు వ్యాప్తి చెందుచు, వాయువీచికవలె తాను ప్రసరించిన చోటును ఆక్రమించుచు పలువిధ వికారములచే పూర్ణమగు రూపమును తనయందే తాను గాంచుచున్నది.

జీవచైతన్యము స్వతహాగా స్థిరత్వమును పొంది ఉంటున్నప్పుడు, స్వీయ లక్షణమైన స్థిరత్వమును బాహ్యమున దర్శిస్తోంది. అదేరీతిగా స్వతహాగా అస్థిరత్వము పొందుచున్నప్పుడు, అదే అస్థిరత్వమును అట్లే అంతరమున కూడా దర్శిస్తోంది.

ఈ జీవుని యొక్క 'ఇది స్థిరముగానే ఉన్నది' అను భావన అతని "స్వసత్త" యొక్క స్థిరత్వము నకు సంబంధించినదే కాని, మరింక దేనికో సంబంధించినది కాదు. బాహ్యమున ఏదీ స్థిరత్వం కలిగియుండుటలేదు. అట్లే అంతరమున కూడా!

నీ భావనను అనుసరించే సర్వము నీయందు ప్రవర్తించుచున్నది. చిత్తమును అనుసరించే జగత్తు దృశ్యమానమగుచున్నది. స్వసంకల్పములను అనుసరించే, ఈ కనబడే నిత్యానిత్య అనుభవములు ఏర్పడటం, ఉండటం జరుగుతోంది.

దేనిని ఎట్లు పొందుచున్నావో, అదంతా అట్లు నీ చిత్తము నందే ప్రాప్తించుచున్నది.

స్వప్నం కూడా చిత్తము యొక్క 'జాగ్రత్తుకు వేరైనచోట' నిర్వర్తిస్తున్న స్వీయరచనా చమత్కృతియే!

సుషుప్తి - మరొక సమయంలో ఈ శరీరం మనస్సు – వాక్కు – కర్మలచే ఏ మాత్రం క్షోభ చెందకుండా ఉంటోంది. అనగా మనస్సు-వాక్కు-కర్మలు మౌనం లేక నిశ్శబ్ధం వహించి ఉంటాయి. అప్పుడిక జీవచైతన్యము శాంతముగాను, స్వస్థతగాను ఉంటోంది. 'సమత్వము' చెందినట్టి ప్రాణవాయువుతో కూడి, అక్షుభితమై ఉంటోంది? గాలి వీచికలు లేనిచోట దీపం సంచలన రహితంగా ఉంటుంది చూచావా? "సుషుప్తి" అనబడు స్థితిని "నిశ్చలమగుచోట వెలిగే దీపం"తో పోల్చవచ్చు. ఈ సమయంలో అవయవములందలి నాడులయందు దృశ్య విషయ సంబంధమైన జీవప్రసారం ఉండదు. అనగా నేత్రములు మొదలైన ఇంద్రియముల ద్వారా బహిః ప్రసరణ (outward flowing) ఉండదు.

నువ్వులందు నూనె ఉన్నట్లు మంచునందు శీతలము ఉంటున్నట్లు, నెయ్యిలో తైలత్వము ఉంటున్నట్లు సుషుప్తిలోని జీవునియందు మనస్సు అంతర్గతమై మరుగునపడి ఉంటోంది. అట్టి సమయంలో, ఇంద్రియ విషయములేవీ ధ్యానింపబడుటలేదు. కనుక జీవ చైతన్యము బ్రహ్మాత్మ యందు సౌమ్యము వహించి ఉంటోంది. ఒకానొక "సౌమ్యప్రాణ సహిత స్థితి" అనుభవమౌతోంది. స్వప్న – జాగ్రత్తులకంటే వేరే ప్రత్యేకత గల మౌన స్థితిని పొంది ఉంటోంది.

అట్టి సుషుప్తదశలో జ్ఞాన అజ్ఞానములకు భేదం ఉండదు. కానీ 'ఎరుక' అనునది ఉండియే ఉంటుంది. ఆ ఎరుక సుషుప్తి సమయంలో 'మౌనము' అను అనుభవము పొందుచున్నది.

తురీయము - ఇది జాగ్రత్-స్వప్న-సుషుప్తులకంటే విలక్షణమైనది. అయితే, అట్టి మూడు సమయములందు అది ప్రకాశించుచూనే ఉన్నది. ప్రజ్వరిల్లుతూ ఉంటున్నది. ఇది వేరైనట్టి ఒక అవస్థ కానేకాదు. మూడు అవస్థలయందు కూడా నిశ్చలముగా, మార్పు-చేర్పులు పొందక ఉన్నట్టి నిత్యసాక్షిత్వమే "తురీయము".

శ్రీరాముడు : మహర్షీ! ఈ తురీయావస్థ ఎప్పుడు ఎట్లు ఎట్టి వారిచే పొందబడుతోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఒకడు అనేక ప్రయత్నముల ప్రయోజనంగా మరియు శాస్త్రసారమును ఎఱుగుటచే చైతన్యము యొక్క నిత్యసమత్వమును గ్రహించుచున్నాడు. తత్ప్రయోజనంగా, సమస్త దృశ్య వ్యవహారములనుండి 'ఉపరతి'ని పొందుచున్నాడు. ఈ రెండింటినీ సునిశితపరచుచున్నట్టి స్వప్రయత్నముల చేతనే బ్రహ్మ సాక్షాత్కారము ప్రాప్తించుచున్నది.

ఏకాగ్రత, విచారణ యోగి "సర్వ సమత్వము' అనెడి దృఢమైన 'బోధ'ను కలిగి ఉంటున్నాడు. అతడు జాగ్రత్తు నందు ఉండవచ్చు... లేదా... స్వప్నావస్థయో లేక సుషుప్తావస్థయో ఆశ్రయించవచ్చు. వ్యవహారశీలుడై ఈ సంసారిక, లౌకిక కార్యక్రమములందు నిమగ్నుడై ఉండవచ్చు. లేదా, సర్వ కార్యక్రమములను త్యజించి ఏకాంత నిష్ఠుడై ఉండవచ్చు. ఏది ఏమైనప్పటికీ అతని "నిశ్చల-సర్వసమ-నిత్యోదిత" స్థితికి ఏమాత్రం లోటు ఉండటం లేదు. "ఈ నేను-నీవు-అతడు-జగత్తు అను వ్యవహారమంతా... సర్వపరిశేష్యము, స్వస్వరూపము అయినట్టి ... ఆత్మకంటే వేరే ఏమీ కాదు"... అని గ్రహించియే, అతడు ఈ సర్వమును దర్శించుచున్నాడు.

అట్టి స్థితినే మనం 'తురీయావస్థ' అంటున్నాం. వాస్తవానికి తురీయస్థితి అనిర్వచనీయమైనది. మాటలకు అందనిది. అయితే, అనుభవముచే గ్రహించబడేదే! జాగ్రత్-స్వప్న-సుషుప్తులకు కేవల సాక్షియై, అతీతమై,.... ఆ మూడు విశేషములను తన యందు కలిగియుండి ఉన్నట్టిది.

సుషుప్తి నుండి స్వప్న జాగ్రత్తులకు పునఃప్రయాణం - సుషుప్తి యందు జీవచైతన్యము సౌమ్యత్వమును పొందుచూ, ప్రాణములతో సంచలనరహితమైన ఏకత్వము పొందుతోంది కదా! అట్టి జీవచైతన్యము కొంత సమయమైన తరువాత మరల ప్రాణములచే సంచాలితమగుచున్నది. అప్పుడు అనుభవమునకు సంబంధించిన స్పందన పొందనారంభిస్తోంది. క్రమంగా ఇంద్రియ దృశ్య విశేషముల గురించిన చాంచల్యముచే చలనము పొందుతోంది. అప్పుడు భోగము పొందుటకు అనుకూలమైనట్టి ఇతఃపూర్వపు సంస్కారముల 'ఉద్బోధ' రూపుదిద్దుకుంటోంది. అట్టి ఉద్బోధయే 'చిత్తము' రూపమున ఉదయించుచున్నది.

సుషుప్తి నుండి స్వప్నములోనికి పునరాగమనం - స్వప్నస్థితి యొక్క పునఃప్రవేశ సమయంలో జీవచైతన్యము భావాభావముల రూపమున కల్పనా జగత్తును భ్రమగా పొందుతోంది. అట్టి భ్రమల యొక్క ఫలితంగా తన అంతఃకరణము నందే దృశ్యమును శీఘ్రంగా అవలోకించటం, తాను అద్దాని యందు పాల్గొన్నట్టి అనుభవం పొందటం జరుగుతోంది.

ఎప్పుడైతే జీవచైతన్యము ప్రాణవాయువుచే కొంచెము సంక్షుభితం అవుతుందో, అప్పుడు 'భావనచేయుట' అను స్థితిని పొందుచున్నది. ఇక ఎక్కువగా సంక్షుభితం అవటం జరిగితే అప్పుడు విపరీత భావనలను ఆ స్వప్న జగత్తునందే పొందటం జరుగుతోంది.

నాడులు 'శ్లేష్మజలము'చే పూర్ణమై ఉండునప్పుడు, ఆ సమయంలో నిద్రావస్థలో ఉండే జీవుడు తన అంతఃకరణలోనే అనుభవములు, సంఘటనలు, సంభ్రమములు పొందుచున్నాడు. అదంతా "బాహ్యమున ఏర్పడే ఏవేవో సంఘటనలే" అనుకుని అతడు దర్శిస్తూ ఉంటాడు. స్వప్న సమయంలో నాడులు రక్తముచే పూర్ణమై ఉంటాయి. ధాతుమయమైన ప్రదేశమును, కల్పితమైన కాలమును జీవుడు తనయందు భావనాపూర్వకంగా జాగ్రత్తుతో సమానంగానే గాంచుచు, "ఇదంతా బాహ్యమునందే ఏర్పడుతోంది"... అని మాత్రం అనుకుంటూనే పొందుచున్నాడు.

స్వప్నానుభవం కూడా జాగ్రదనుభవం వంటిదే! - ఈ జీవుడు స్వప్నములో కూడా "నేత్రాదుల ద్వారా జాగ్రత్తులో బాహ్యము నందలి వస్తు జాలమును అవలోకించుట... అను అనుభవముతో సమానమైన వ్యవహారత్వమునే పొందుచున్నాడు. వాస్తవానికి అతడు భౌతికమైన నేత్రములను ఉపయోగించటమే లేదు. నేత్ర రహిత సందర్శనం కొనసాగుతోంది.

శ్రీరాముడు : స్వప్నంలో సంఘటనలు రచించుచున్నది స్వప్నద్రష్టయేనా? మరింకెవ్వరన్నానా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ జీవుడు అనుభవములు అనునది స్వరూపముగా కలవాడే అయివున్నాడు కదా! ఇతడు తనయందు ఏ వాసనలు కలిగివుంటే స్వప్నములో ఆ వాసనలకు సంబంధించిన సంఘటనలనే గాంచుచున్నాడు. అయితే, ఆ స్వప్నము పొందుచున్న సమయంలో జీవచైతన్యము

ఈ నేత్రములు మొదలైన ఇంద్రియములలోకి ప్రసరించకుండానే ఆలోచనా సంక్షుబ్ధమును (Disturbance by coming across series of thoughts) మాత్రం పొందుచున్నది. అది తన అంతః కరణమునందే తన వాసనలను అనుసరించి ఆయా పదార్థములకు సంఘటనలకు సంబంధించిన అనుభవం కల్పించుకొనుచున్నది.

అందుచేత, ఈ జీవునియందు స్వప్నము బాహ్యము నుండి మరెవ్వరో కల్పించుటలేదు.

అనాక్రాన్తేన్ద్రియచ్ఛిద్రో యతః క్షుబ్ధో౾న్తరేవసః ।
సంవిదానుభవత్యాశు సస్వప్న ఇతి కథ్యతే ॥ (సర్గ 19, శ్లో. 33)

స్వప్నం (నిర్వచనం) = జీవచైతన్యము యొక్క మందబుద్ధి వాసనలతో కూడినప్పటి భావ తరంగములు. అంటే భౌతికమైన ఇంద్రియములు నిద్రాణమై ఉండగా, మనస్సుచే లేక ఊహ యందు ఇంద్రియానుభవములు గాంచటం.

బుద్ధి మందముగా ఉండటం, వాసనలు విజృంభించుట, ఆర్తి... ఈ మూడు అటు స్వప్నమునకు, ఇటు జాగ్రత్తుకు కూడా కారణమగుచున్నాయని గ్రహించు.

జాగ్రత్తులోకి పునఃప్రవేశం -

సమాక్రాన్తేద్రియచ్ఛిద్రో యః క్షుబ్ధోవాయునాయదా ।
పరిపశ్యతి తజ్జాగ్రదిత్యాహుర్మునిసత్తమాః ॥ (సర్గ 19, శ్లో. 34)

జీవుడు ప్రాణవాయువుచే విక్షుబ్ధమై బాహ్యశబ్దాది విషయములను కాంచుటను మునులు జాగ్రత్తని వచిస్తున్నారు. అంటే ప్రాణవాయువు నాడులందు ఇంద్రియములందు ప్రసరించు చుండగా, 'బాహ్య వస్తువుల విషయములు' సంస్పర్శను వాసనలతో కూడి భావనలతో జోడించి అనుభవమును పొందటం.

అయితే, జ్ఞానవంతుడు, ధీమంతుడు అయిన వాడెవ్వడూ అసత్యమగు ఈ జగత్తు నందు ఎన్నడూ సత్యత్వ బుద్ధి కలిగియుండడు సుమా!

ఈ స్వప్నతుల్యమగు వ్యవహారములందు "ఇవన్నీ సత్యమే" అని భావన చేసేవాని దృష్టియే స్వయంగా.... ఆధ్యాత్మిక –ఆధిభౌతిక –ఆధిదైవిక... తాపాలు పొందటానికి కారణమగుచున్నది.

ఈ 'జాగ్రత్తు' విషయమై సత్యత్వబుద్ధిని ఆశ్రయించే సంసారజీవుల స్థితి ఎన్నెన్ని దోషములకు చోటు ఇస్తోందో చెప్పటం ఎవరితరం? ఈ 'దృశ్య లేక సంసార' వ్యవహారంలో కనిపిస్తున్న ఈ విశేషములు సత్యము, నిత్యము"... అను తాదాత్మ్యమే మృతమనీ....ఇందలి అసత్యమును అనిత్యమును ఎఱిగి, తాదాత్మ్యము చెందకుండుటే అమృతత్వమనీ కవులు చెప్పుచున్నారు.

అందుచేత అట్టి సంసార సత్యత్వదృష్టిని జయించుటను "మృత్యువును జయించుట" అని గ్రహించు.

❖❖❖

11. మనస్సు యొక్క రూపము

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! ఇప్పుడు నీకు 'జాగ్రత్-స్వప్నము-సుషుప్తు'ల స్వరూపమేమిటో కొన్ని విశేషాలు చెప్పాను కదా! ఇదంతా ఆత్మవిషయం ప్రకటించటానికి వీలుగా చెప్పాను. అంతకు మించి వాటిచే వేరే ప్రయోజనం లేదు.

ఒక ఇనుపగుండు అగ్నితో సంబంధం పెట్టుకున్నదనుకో... అప్పుడేమౌతుంది? అగ్ని యొక్క రూపమునే పొందుతుంది కదా! అదేవిధంగా ఈ చిత్తము దృఢనిశ్చయముతో ఏ పదార్థములను ఎంతగా భావిస్తుందో అంతవరకు అద్దానిరూపమునే చెందుచున్నది. "భావము-అభావము", "గ్రహించుట-త్యజించుట"... మొదలైన దృష్టులన్నీ చైతన్యం నందే కల్పించబడుచున్నాయి. ఇక్కడ ఏవేవి కనిపిస్తున్నాయో అవన్నీ 'కల్పన'యే రూపముగా కలిగి ఉన్నాయి కాబట్టి అవి సత్యములు ఎట్లా అవుతాయి చెప్పు?

శ్రీరాముడు : కాని, అనుభవమవటం జరుగుతోంది కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. ఈ జీవుడు "కల్పన" (Projections of the Mind) ను ఆశ్రయించినంత కాలం ఈ దృశ్యవ్యవహారం సంప్రాప్తమై ఎదురుగా ఉండియే ఉంటోంది కూడా! ఏమరువ వీలులేదు. అందుచేత మనోచాపల్యముచే కలుగుచుండిన ఈ భావ అభావాలను, గ్రహణ త్యాగాలను "అనిర్వచనీయం" అని విజ్ఞులు అభివర్ణిస్తున్నారు. అవి మనస్సు యొక్క నిర్వచనాలను అనుసరించి ఉంటాయి. ఈ జగత్తును మనస్సే ఈ కనబడే విధంగా నిర్దేశించటంచేత ఇట్లు అనుభవమౌతోందయ్యా!

ఏది ఆత్మ కంటే తదితరమై తారసపడుతోందో అదంతా ఆ ద్రష్ట యొక్క మనస్సే! స్వప్నసదృశమే! "వ్యష్టి" రూపమున భ్రాంతి ఏర్పడటానికి కర్త ఈ మనస్సే! అనగా, మనస్సే "నేను ఒక వ్యష్టిని" అని మననం చేయుటచే వ్యష్టి ఏర్పడుతోంది. అట్లే సమష్టి రూపమున 'జగత్ స్థితి'కి కారణమగుచున్నది కూడా మనస్సే సుమా! విశ్వమునకు కారణభూతమగు మనస్సే సర్వ కళంకములకు మూలము.

ఓ రామా! మనస్సే పురుషుడు. కాబట్టి ఎట్లాగైనా సరే, ఈ మనస్సును శుభమార్గమున నియోగించాలి. సర్వజనులారా! ఈ మనస్సును, దీని స్వభావమును చక్కగా గ్రహించండి. దీనిని శుభమార్గమునందే ప్రయత్నపూర్వకంగా నియోగించటం ఉచితం. సర్వదా శ్రేయస్కరం కూడా.

శుక్రాచార్యుని అనుభవం ఏమిటో గమనించారు కదా! ఈ భౌతిక దేహమే పురుషుడై ఉంటే అత్యంత బుద్ధిమంతుడైన శుక్రుడు అనేక వికారములతో కూడిన పెక్కు జన్మల గూర్చిన భ్రమ ఎలా పొందాడు? కనుక, పురుషకారము అనేది సర్వదా మనస్సుకు సంబంధించినదే కాని శరీరము నిర్వర్తించేది కాదు. ఆ 'గోడ' ఎట్లాగైతే కేవలం జడమాత్రమై స్వయం నిర్ణయాధికారము లేకయే ఉంటోందో, ఈ శరీరమునకు కూడా స్వయం నిర్ణయాధికారం లేదు. మనస్సు దేనిని మననం

చేస్తుందో అట్లే సర్వము ప్రాప్తిస్తోంది. అందుచేత ప్రయత్న పూర్వకంగా స్వల్పవిషయములన్నీ త్యజించబడుగాక! ఈ మనస్సు ఉత్తమోత్తమమైన దానియందే నియోగించబడుగాక!

శ్రీరాముడు : ఈ మనస్సును నియోగించుటకై, ఈ జగత్తు నందు అన్నిటికన్నా ఉత్తమోత్తమమైనదేది?


శ్రీ వసిష్ఠ మహర్షి : అన్నిటికన్నా ఉత్తమోత్తమమైనది. మహత్తరమైనది "స్వస్వరూపమే".


శ్రీ రాముడు : అట్టి స్వస్వరూపమును మనస్సుతో ధ్యానించుటకు ఎప్పుడు ఎక్కడ ఎట్లు ఉపక్రమించాలి?

శ్రీ వసిష్ఠ మహర్షి : స్వస్వరూపమును ధ్యానించుటలో, భావించుటలో మరొక ప్రదేశమునకు వెళ్ళవలసిన పనేమున్నది? సర్వజనులారా! ఆత్మ వస్తువు సర్వదా ఉపాధిరహితం. భ్రమ రహితం, అప్రమేయం, నిత్యం అయివున్నది. అట్టి ఆత్మవస్తువునే సర్వదా ధ్యానించండి. అట్టి ప్రయత్నంలో శ్రమ ఏదీ ఉండదు సుమా! "నేను సర్వదా అఖండము, జన్మరహితము అయిన ఆత్మనే"... అని భావించుటలో కష్టమేముంటుంది? మరికొంత కాలం తరువాతనో, లేక ఏదో కార్యక్రమము ముగించిన తరువాతనో ఆత్మ సంబంధించిన 'ఉపాసన' ఆరంభించాలనుకోవటం అజ్ఞాన పూర్వకమైన అభిప్రాయమని మేము గమనిస్తున్నాం.

ఇప్పుడే, ఇక్కడే, ఏది ఎట్లు ఉంటోందో అదంతా అట్లు ఉండగానే "స్వస్వరూపమును ధ్యానించుట, భావించుట" తప్పక చేయవచ్చని అందరికీ మనవి చేస్తున్నాను. జీవుడు ఏ రూపాన్ని ధ్యానిస్తే అతడు అట్టి రూపముగానే పరిణమిస్తున్నాడు. లేక, పొందుచున్నాడు. ఆత్మ యొక్క అప్రమేయత్వంను, నిర్వికల్పత్వంను ధ్యానించు జీవి ఆత్మత్వమునే అనుభవంగా పొందుచున్నాడు.

శ్రీరాముడు : స్వామి! మా పై కరుణతో "ఆత్మను భావించుట" అనగా ఏమిటో మరికొంత విశేషయుక్తంగా చెప్పండి.





శ్రీ వసిష్ఠ మహర్షి : "సంకల్పములను రచించుట, లేక నిర్వర్తించుట" అను స్వభావముగల ఈ జీవుడు సంకల్పములు ప్రారంభం కాకముందే, ఉండి ఉన్నాడు. అట్టి సంకల్పములకు 'ఆదిస్థితి' యందు అతడు అనిర్వచనీయుడై, వాక్కు మొదలైన వాటికి అందనివాడై, శుద్ధతత్త్వస్వరూపుడై ఉండి ఉన్నాడు కదా! ఆ శుద్ధతత్త్వమే.. 'ఆత్మ' అను శబ్దముచే ఉద్దేశ్యించబడుతోంది. అట్టి ఆత్మ సంకల్పించు సమయము నందు కూడా... ఉండి ఉన్నది. అట్టి శుద్ధతత్త్వమే స్వస్వరూపము.

స్వస్వరూపభావనచే ఏర్పడు నిశ్చలత్వం, అసంగత్వములే ఆత్మ సాక్షాత్కారముగా చెప్ప బడుతోంది. అట్టి ఆత్మానుభవమునకు సర్వులు అర్హులే. ఓ జనులారా! మీరంతా బలవంతులై అందుకు అర్హత సముపార్జించు కోవాలి. అంతేగాని, "ఈ నా వర్తమానం అందుకు అడ్డు కదా!" అని భావించి ప్రవాహపతితులు కావద్దని హెచ్చరిస్తున్నాను.

❖

అభిపతతి మనః స్థితః శరీరం నతువపురాచరితం మనః ప్రయాతి।
అభిపతతి తవాత్ర తేనసత్యం సుభగమనః ప్రజహాత్వసత్యమన్యత్ ॥ (సర్గ 20, శ్లో. 9)

ఈ మనస్సు ఎక్కడుంటే అక్కడికి 'శరీరము' ఆవశ్యము పోగలదు. కాని, శరీరము ఎక్కడుంటే అక్కడికి మనస్సు పోవలెనను నియమము లేదు. మరింక ఈ శరీరము గురించి భ్రమపొందవలసిన పనేమున్నది?

ఈ శరీరము ఎక్కడ ఉండవలసివస్తోందో అక్కడే ఉండనివ్వండి. మనస్సును మాత్రం స్వస్వరూపము నందు సుస్థిరం చేయండి. ఓ రామచంద్రా! నిత్యసత్యమైయున్నట్టి 'ఆత్మవస్తు ప్రాప్తి' యందు మాత్రమే నీ మనస్సు నియోగించబడుగాక! అందుచేత 'అసత్యములే' అయినట్టి ఈ దేహ, ఇంద్రియాలను, తదితర భేదపూర్వకమైన భ్రమలను నీవు త్యజించివేయి. ఈ దేహ, ఇంద్రియాల పట్ల గూడుకట్టుకొని ఉన్న విశ్వాసం నుండే సర్వసంసార భ్రమలు, బంధములు మరింతగా ఏర్పడు చున్నాయిని గ్రహించు.

చైతన్యతత్త్వమైయున్న నీ శుద్ధ స్వరూపమునకు జడపదార్థములైనట్టి ఈ శరీరాదులను ఆపాదించి భ్రమ చెందవద్దు. "ఈ శరీరమే నేను. ఆ శరీరము మరొకరు" అను భావనలోని అనర్థమేమిటో ముందు గ్రహించు.

స్వస్వరూపతేజోమయుడవై ప్రకాశించుచూ సర్వలోకములకు శుభప్రదుడవయ్యెదవుగాక!

❖❖❖

12. విజ్ఞానవాదము

శ్రీరాముడు : ఓ మునీంద్రా! ధర్మజ్ఞా! సముద్రంలో బడబాగ్నిలాగా, నా హృదయంలో ఇప్పుడు ఒక గొప్ప సందేహం పుట్టి కల్లోలం కలిగిస్తోంది. అదేమిటో చెపుతాను. వినండి.

"బ్రహ్మం దేశ-కాలాదులచే పరిచ్ఛిన్నమయ్యేది కాదు. అది సర్వదా వ్యాపకమై, నిరామయమై ఉంది"... అని మనం అనుకున్నాం కదా! అట్టి "నిష్కళంక - నిర్వస్తువు" అగు

బ్రహ్మం నందు విషయాకారముచే కలుషితమైనట్టి ఈ 'మనస్సు' అనబడేది ఎట్లా, ఏ కారణం చేత, ఏ రూపమున, ఎప్పటి నుండి స్థితిపొంది ఉంటోంది? ఆత్మజ్ఞులు శాస్త్రములు.. "బ్రహ్మము నందు అవిద్యా రూపమైన కళంకము ఏ కాలమందును లేదు"... అని చెప్పుచుండటం జరుగుతోంది. మరి ఈ మనస్సు ఎట్లు, ఏ కారణంగా ఉదయిస్తోంది?..., ఈ విషయం ముందు చెప్పండి. అటుపై 'ఈ మనసును నిరోధించుటెట్లా? అనే ప్రశ్నను మరల పరిశీలించవచ్చు. ఈ ప్రశ్నపై కొంత సంవాదము జరిగింది కానీ, ఇంకా కొంత వినాలని నా అభిలాష.

శ్రీ వసిష్ఠ మహర్షి : చాలా చక్కగా, మంచి ప్రశ్నకే వచ్చావు. ఇప్పుడు నీ బుద్ధి మోక్షమును పొందుటకు సంపూర్ణమగు అర్హత పొందుచున్నదని నేను భావిస్తున్నాను. పూర్వాపరవిచారణ యందు తత్పరమైయున్న నీ బుద్ధియొక్క ప్రభావంచేత శంకరాదులు పొందిన ఉత్తమస్థితిని నీవు తప్పక పొందగలవు.

అయితే మనం ఇప్పుడు "స్థితి ప్రకరణం"లో ఉన్నాం కదా! వర్తమాన విషయవిచారణ దృష్ట్యా నీ ప్రశ్నకు ఇది తగిన సమయం కాదు. నిర్వాణ ప్రకరణంలో ప్రవేశించినప్పుడు మనం "ఆత్మకు మలినత్వం ఎట్లా వచ్చినది?" అనే ప్రశ్నను కొన్ని కోణముల నుండి పరిశీలిస్తాం. ప్రస్తుతం "ఆత్మ స్వతహాగా శుద్ధమైనది" అనే విషయం అనేక దృక్పథముల నుండి నిరూపిస్తున్నాం. "మనస్సు ఎట్లా ఉదయిస్తోంది" అనుదానిగురించి, "శుద్ధాత్మానుభవం' గురించి మనం నిర్వాణ ప్రకరణంలో పరిశీలిస్తున్నప్పుడు ఈ నీ ప్రశ్న అడుగు. "శుద్ధమైన ఆత్మకు దోషమెట్లా ప్రాప్తించింది?" అనే విషయం నిర్వాణ ప్రకరణంలో సవివరంగా, విస్తారంగా చర్చించబోతున్నాం. ఇప్పటికి మాత్రం "మనస్సును శుద్ధిపరచటమెట్లా?" అనేవిషయం ముఖ్యంగా పరిశీలిస్తున్నాం.

❖

మనం ఏ సిద్ధాంతం గురించి వర్తమానంలో విచారిస్తున్నామో అద్దానిని గురించి ఇప్పటికి చర్చించటం (అవగాహనా సౌలభ్యం దృష్ట్యా) ఉచితం కదా!

❖

ఇప్పుడు మనం "ఉత్తమమైన అవగాహన కలిగియున్న మనస్సు" గురించి విచారిద్దాం. ఈ ప్రాణ సమూహమంతా "జన్మ-కర్మలు" అనే జాలములో చిక్కి ఆయా పాట్లు పొందుచున్నది. ఏ కారణంగా? మనస్సు కారణంగా కదా!

మనస్సే ... ప్రకృతి, కర్మ కూడా!

మనస్సు - అజ్ఞాని అవిచారణ కారణంగా "స్వతహాగా అసత్యమే" అయినట్టి అనేక భ్రమలతో కూడిన అనుభవములను పొందుచున్నాడు. అజ్ఞానముతో ఉపసహితమైన చైతన్యమును 'ప్రకృతి' అంటున్నాం. మనన ధర్మము చేత 'ప్రకృతి' అనునది ఏర్పడుచున్నది. కాబట్టి మనస్సు అంటే కూడా అదే సుమా! ఆ స్థితియందు "ప్రియత్వము - ఉద్వేగము"లతో కూడిన కర్మేంద్రియ వ్యాపారములు నిర్వర్తించబడుచూ ఉంటాయి. కాబట్టి దీనినే "కర్మ" అని కూడా నిర్ణయిస్తుంటారు.

ఈ "మనస్సు–కర్మలు–జీవుడు–భగవంతుడు" అను విషయములకు భిన్న మత వాదులు చిత్ర విచిత్రములైన శాస్త్రదృష్టులను, అనేక నామరూపములను కల్పన చేసి తమ అనుయాయుల ముందు ఉంచుచున్నారు. వాటి గురించి క్లుప్తంగా కొన్ని విషయాలు చెపుతాను. అవన్నీ నీ ప్రశ్నకు తగిన సమాధాన సమన్వితమైన యోచనను అందిస్తాయి అనేది నా ఉద్దేశం.

"వాసనల నుండి అవగాహనలు" - 'సుగంధం' గల ప్రదేశంలో వర్తించిన వాయువు తాను సుగంధరూపమునే పొందుతుంది కదా! మననశక్తిచే చంచలమై ఉంటున్న ఈ మనస్సు, యే వాసనతో గూడి, ఎట్టి భావమును గ్రహిస్తుందో తాను అట్టి రూపమునే పొందుతూ ఉంటుంది. ఈ కారణం చేత కొందరు తమ వాసనలచే కల్పితములైన ఆయా సిద్ధాంతములను ఆయా యుక్తుల సహాయంతో నిర్ణయిస్తున్నారు.

అట్టి 'అవగాహన' వారు 'అత్యంత వాస్తవమైనది' గానే గాంచటం జరుగుచున్నది.

పదార్థములను భావన చేయు స్వభావము గల ఈ మనస్సు అట్టి పదార్థములతోటి తన్మయ మగుచున్నది. ఆ పదార్థ రూపమునే చెందుతోంది. మనస్సునకు వశమై వర్తించు ఆ శరీరము కూడా అదే రూపమును, అనుభవమును పొందుచున్నది.

జ్ఞానేంద్రియములు ఆయా విషయములందు ప్రవర్తించునప్పుడు ఈ కర్మేంద్రియములు కూడా ఆ విషయములందు ప్రవర్తిస్తున్నాయి. గాలిలో ధూళి ఏర్పడుచున్నట్లు, ఆత్మయందు ఈ కర్మ వ్యవహారమంతా సిద్ధిస్తోంది. కర్మేంద్రియములు నియమించబడుచుండగా, క్రియాశక్తి వ్యక్తమగుచున్నది.

కాబట్టి మనస్సు యొక్క బీజము "కర్మయే"! మరి, కర్మ యొక్క బీజమో? మనస్సే! 'పుష్పము – పరిమళము' ఒకదానితో మరొకటి అభేదమైనట్లు ఈ కర్మ – మనస్సులు వేరు వేరు కాదు.

దృఢమైన భావనావశం చేతనే మనస్సు 'మననము' అనుదానిని స్వీకరిస్తోంది. అట్టి భావన యొక్క ప్రభావం చేత 'స్పందము' లేక 'కర్మ' అనబడు శాఖ ఉత్పన్నమవుతుంది. ఈ మనస్సే క్రియను, ఆ క్రియయొక్క ఫలములను ఆదరభావంతో సిద్ధింపజేయుచున్నది. ఆ తరువాత "ఆయా కర్మల ఫలములను పొందుచున్నాను" అను అనుభవమును స్వీకరిస్తూ వెనువెంటనే బంధమున తగుల్కొనుచున్నది.

అహమ్ త్వమ్ తత్ - ఇప్పుడు విజ్ఞానవాదము ననసురించి 'అహమ్–త్వమ్–తత్'లను విశదీకరిస్తాను–

ఈ మనస్సు ఏ భావనను స్వీకరిస్తుందో, ఆ భావనయే నిశ్చయమై పరిణమిస్తోంది. దేనినైతే, "ఇది శ్రేయోదాయకము – ఇది కాదు – ఇప్పుడు నేను అల్పత్వములో ఉన్నాను – ఇట్లు వీరు చెప్పి నట్లు మాత్రమే ఆచరించాలి – అప్పుడు సముద్ధరించబడగలను"... అను రూపము గల భావోద్వేగము ఈ జీవుడు కలిగి ఉంటాడో... అది ఆ జీవునకు ఆ రీతిగానే సంప్రాప్తిస్తోంది.

వాసనాదార్ఢ్యముచే 'అహమ్-త్వమ్-తత్' శబ్దములకు వివిధ భావనలతో కూడిన భిన్నమైన మతనిశ్చయములు జనులచే స్వీకరించబడుచున్నాయి. ఆ నిశ్చయములను అనుసరించే వారు తమ తమ ధర్మార్థ కామమోక్షముల కొరకు ఆయా వేరు వేరు ప్రయత్నముల చేస్తూ ఉంటున్నారు. ఆ శబ్దముల కొన్ని నిర్వచనములను (కొన్ని శాస్త్రముల ప్రవచనములను) విను-

కపిల సిద్ధాంతం -

1) అహం = ఇది స్వతహాగా అనేక దోషములు కలిగి ఉంటోంది. అట్టి 'అహం(నేను) లోని దోషాలను శుశ్రూష, తపస్సు, ధ్యానం మొదలైన ప్రయత్నములచే తొలగించుకోవాలి.

2) త్వమ్ (నీవు) = ఈ 'నీవు' అను రూపంలో ప్రాప్తించేదంతా అత్యంత నిర్మలము, అసంగము అయి ఉన్నది.

3) తత్ (అది) = అహం, త్వమ్‌ల కంటే విలక్షణమైనది. అది కోపగించుట, ప్రేమించుట, వరాదులను ఇచ్చుట మొదలైన త్రిగుణములకు సంబంధించిన వ్యవహారములను నిర్వర్తిస్తూ ఉంటుంది. సత్కర్మలను సన్మానించటం, దుష్కర్మలను శిక్షించటం నిర్వర్తిస్తూ ఉంటుంది.

సగుణ బ్రహ్మవాదులు - వీరు భగవంతునకు గుణములు ఆపాదిస్తూ మరల మరల అట్టి నిశ్చయమునే ధ్రువీకరించటం జరుగుతోంది. అట్టివారు సగుణ బ్రహ్మమును ప్రవచిస్తున్నారు. తదనుకూలంగానే, శాస్త్రములు రచించబడటం, ప్రవచించబడటం జరుగుతోంది.

అనగా, ఈ జగత్తుకు ఏది ఉపాదాన కారణమో అట్టి 'తత్' (భగవంతుడు) కూడా సుఖ దుఃఖ జడాత్మకమగు జగత్తు వలె గుణాత్మకమని వారిచే ప్రతిపాదించబడుతోంది.

పరిణామవాదులు - మరికొన్ని సిద్ధాంతముల ప్రకారం... ఈ జీవుడు చేసే ఆయా సాధనల యొక్క అంతిమ ప్రయోజనంగా ఈ 'అహమ్'... త్వమ్‌లోనూ, త్వమ్ వెళ్ళి 'తత్'లోనూ విలీనమై పోతోంది. చివరికి 'తత్'యే ఆద్యంతములలో శేషించి ఉంటోంది.

ఇట్లా ఇంకా ఎన్నో సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి.

❖

ఇక్కడ మనం ఒక ముఖ్యమైన విషయం గమనించాలి. భిన్న సిద్ధాంతములు ప్రతిపాదించే వారిలో కొందరు, "మేము చెప్పేదే ఉపాయం. ఇది తప్ప మరింకే విధంగాను ఎవ్వరికీ మోక్షము లభించదు"- అనే నిశ్చయమును చెప్పుచున్నారు. అయితే ఆ గురువులు వారి శిష్యులందు కొంత ఏకాగ్రత, ధారణ అలవడుటకు అట్లు "ఇట్లే అనుసరించండి" అని చెప్పటం జరుగుతోంది. వారి శిష్య ప్రశిష్యుల అవగాహనలో కొంత అల్పమైన విజ్ఞాన దృష్టి ఏర్పడటం కూడా జరుగు తోంది. అప్పుడు ఒక అభిమతమును ఆశ్రయించువారు "స్వసంకల్పితమైన నియమములు" అనే భ్రమచే ఇతర ఉపాయములను విచారణలను, అవగాహనలను దూరం నుండే నిరసించటం, విభేదించటం జరుగుతోంది.

వేరు వేరు గురువులు వేరు రీతులలో విధివిధానములు, నియమములు నిర్ణయిస్తూ, జీవిత పరమార్థములు – జ్ఞానవిజ్ఞాన విశేషములు ప్రవచిస్తున్నారు. అయితే, వారి శిష్య, ప్రశిష్యులలో కొందరు పరమార్థం ఏమిటో మరచి కేవలం విధి, విధానాలను మాత్రం అవిచారణ పూర్వకంగా ఆశ్రయిస్తూ తదితర గురువులను, ఇతర గురువులు చెప్పు జ్ఞాన, విజ్ఞాన విశేషములను మొదలే ద్వేషించటం, చేస్తున్నారు. తద్వారా కలహించుకోవటం, హింసించుకోవటం చూస్తున్నాం.

ఇదంతా బాలురు, మూర్ఖులు, రాగద్వేషపూరితులు, జాత్యహంకారులు అగు వారి వలననే అట్లు ప్రాప్తిస్తోంది. గురువులు తమ తపోధ్యానాలచే గ్రహించినది లోకక్షేమం కోరి ప్రవచిస్తుంటే, అందలి జ్ఞానసారాన్ని మానవాళి అంతా గ్రహించవచ్చు. స్వవివేకముచే పరిశీలించవచ్చు.

ఏ ఉత్తమ భావనను అంతరంగమున ఆశయపూర్వకంగా స్వీకరించి, అందుకు గాను ప్రయత్నశీలురమౌతామో అదియే ప్రయత్నముల తీవ్రతను అనుసరించి, ఆ రూపమైన ప్రయోజనమే ప్రాప్తిస్తూ ఉంటుంది.

అందుచేత భావ ఔన్నత్యము చేతనే మనస్సు కుదుట పడగలదు. ఎప్పుడు ఒకని "సర్వము ఆత్మవిన్యాసమే" అను ఆశయమునకు సానుకూలమై ఉంటుందో, అది అతనికి మరింత శోభాయ మానమని మా అభిప్రాయం.

ఇంకా కొన్ని సిద్ధాంతాలు -

వేదాంతవాదులు - వీరు శ్రుతులను (వేదములును) ప్రమాణంగా తీసుకొని 'అధ్యారోపవాద న్యాయమును' అనుసరించి "ఈ జగత్తంతా బ్రహ్మమే. బ్రహ్మమునకు వేరుగా ఎక్కడా ఏదీ లేదు"... అనే నిశ్చయమును దృఢపరచుకోవలసినదిగా ప్రవచిస్తున్నారు. "అట్టి దృఢ నిశ్చయము చేతను, శమదమాదులను నిరంతరం ఆశ్రయించుట చేతను సర్వోత్తమమగు 'ముక్తి' లభించ గలదు" అని చెప్పుచున్నారు. అందుకు విరుద్ధమగు మరి దేనిచేత కూడా ముక్తి లభించదని ప్రకటన చేస్తున్నారు. తదనుకూలంగా శాస్త్రములు ప్రవచించుచున్నారు.

అయితే వారిలో కొందరు "మేము నిర్ణయించుకున్న విధి నియమములు" మాత్రమే వాస్తవము, తదితర విషయము లేవీ "మోక్షసాధకములు కావు" అనునది వాదన పూర్వకంగా ప్రకటిస్తున్నారు. కనుకనే, ఇంతలోనే అభేద దృష్టి నుండి చ్యుతి పొందటం జరుగుతోంది.

విజ్ఞానవాదులు - "స్వబుద్ధి చేతను, శమ, దమములచేతను మాత్రమే ముక్తి లభించగలదు. మరింకే ఉపాయం లేదు"... అని ప్రతిపాదించుచు, ఈ బుద్ధి సునిశితమగుటకు గాను కొన్ని నియమ, నిష్ఠలు చెప్పుచున్నారు. ఈ సిద్ధాంతమునే గ్రంథాదుల ద్వారా ప్రకటించుచున్నారు.

అర్హతాదులు - వీరూ విజ్ఞానవాదమే ప్రకటిస్తున్నారు. అయితే, స్వాభిమతమును అనుసరించి చిత్ర విచిత్రములైన దిగంబరత్వము, భిక్షాటనము మొదలైన ఆచారములను కల్పించి, తదనుగుణంగా గ్రంథములను నిర్మించి ప్రచారం చేస్తున్నారు.

ఇంకను మరికొన్ని సిద్ధాంతముల ప్రకారం "ఈ జీవుడు బాహ్యదృష్టిచే జీవత్వము, స్వస్వరూపముచే శివత్వము వహించియున్నాడు. సర్వజీవులు ఆ శివత్వము నుండి ప్రకటిత మగుచున్న కిరణముల వంటి వారే!"... అను 'తత్త్వమ్' భావనను ప్రకటిస్తున్నాయి.

చూచావా! ఇక్కడ మనం దృష్టాంతము కొరకు రెండు మూడు సిద్ధాంతములను సంగ్రహంగా చెప్పుకున్నాం. వాస్తవానికి అనేక విచిత్రములైన సిద్ధాంతములు, (భగవంతుని గురించిన) అవగాహనలు భగవదన్వేషకులచే ఆశ్రయించబడుతున్నాయి. మరికొందరు అన్వేషకులు తమ యొక్క అవగాహనను, స్వవివేకమును, పరిశీలనను ప్రక్కకుపెట్టి, ఇక కేవలం తదితర సిద్ధాంతములను ఖండించుట యందు, తిరస్కరించుట యందు మాత్రమే నిమగ్నమైయున్నారు.

ఓ రాఘవా! ఏ నిమిత్తం లేకుండానే శాంతజలమునందు అనేక బుద్బుదములు ఉత్పన్న మౌతాయి కదా! అట్లే అకారణంగా అనేక నిశ్చయములను ప్రకటించు వేరు వేరు శాస్త్రరీతులు, వాటిని ఉద్బోధించు గురువులు ఈ ప్రపంచంలో ఏర్పడటం జరిగింది. మరింకెన్నో శాస్త్రరీతులు ఏర్పడబోవుచున్నాయి.

మణులన్నిటికీ సముద్రమే నిలయం కదా! వివిధ శాస్త్రరీతులన్నిటికీ మనస్సే 'ఉనికిపట్టు'.

"మా గురువు చెప్పినదే వినాలి. మరింకెవ్వరు ఏమి చెప్పినా ఎవ్వరూ వినకండి"... అని నిర్దేశించువారు, ఇతర వాదములను, అభిప్రాయములను ద్వేషించువారు కలహించుకొను వారు 'సత్' వస్తువును పొందేదెట్లా?

ఇక్కడ ఒక రహస్యం చెపుతాను విను. వేప చేదు కాదు. చెఱకు తీపి కాదు. అట్లే చంద్రుడు శీతలము కాదు. అగ్ని ఉష్ణము కాదు. ఎవడు ఏ అనుభవమును చిరకాలంగా "ఇది మధురం... ఇది అప్రియం, ఇది సుందరం, ఇది ద్వేషింపతగినది, ఇది స్వీకరించాలి, ఇది తిరస్కరించాలి" అని భావనచేస్తాడో అది అతనికి అట్లే ప్రాప్తించటం జరుగుతూ ఉంటుంది. ఆ వస్తువా, ఇక ఆ రీతిగానే అనుభవమౌతుంది. ఈ కారణంచేతనే చంద్ర-సూర్య-అగ్ని మండలములలో నివసిస్తున్న దేవతలు, యక్షులు మొదలైన జీవులకు 'శీతలము-ఉష్ణము' మొదలైన బాధలు కలగటమే లేదు. ఈ శాస్త్రరీతులు వాటి పట్ల ఏర్పడు రాగద్వేషాదులు అట్టివేనని జనులు గ్రహించెదరు గాక!

❖

ఓ సర్వజనులారా! 'జీవితము' అనునది అత్యంత విలువైనది. అట్టి ఈ అవకాశమును ఏవేవో వాదోపవాదములతో వృథాపరచుకోరాదని మా ఉద్దేశం. సర్వజనుల శ్రేయోభిలాషులమైన మేము మా అభిప్రాయమేమిటో కూడా ప్రకటించుచున్నాము. వినండి-

ఈ మానవుడు స్వతహాగా ఆనందమయస్వరూపుడే. అయితే, అతని స్వస్వరూపమునకు సంబంధించి సమగ్రము, ఉత్తమము అయిన 'అవగాహన' మరుగునపడి ఉంటోంది. అతని ఎరుక ఆయా రాగద్వేషాదులచే కప్పబడి, మేఘావృతమైన ఆకాశమువలె ఉంటోంది. అందుచేత జనులు నిరతిశయ బ్రహ్మానందము కొరకే యత్నించెదరు గాక! మనస్సును బ్రహ్మమయం చేయండి. తద్వారా బ్రహ్మమే ప్రాప్తిస్తోంది.

"నేను సర్వదా అఖండము, నిత్యము, నిర్మలము అయిన బ్రహ్మమునే అయి ఉన్నాను. 'నీవు – అది – జగత్తు'... ఇదంతా బ్రహ్మమే. అట్టి చైతన్య బ్రహ్మమే అందరియందు, అంతట ఏకస్థమై వెలయుచున్నది" అను భావనను ఈ మనస్సు ఆశ్రయించుగాక! అట్లు ఆశ్రయించటమే "మనస్సు బ్రహ్మమయమగుట"... అయి ఉన్నది.

ఒక బాలుడు బాటలో నడుస్తూ ఏవేవో పదార్థాలు చూచి "ఇవి నాకు ప్రియమైనవి... అందుచేత ఇవి నాకు కావాలి..." అని ప్రీతి గొనుటచే అవి అవశ్యం పొందవలసినవిగా కనబడతాయి కదా! అట్లే ఈ మనస్సు కూడా అనుక్షణం అనేక పదార్థముల పట్ల ఆకర్షణ – వికర్షణలను పొందుతోంది. ఫలితం? ఈ జీవునికి అనేక దుఃఖ పరంపరలు వచ్చిపడుచున్నాయి. అంతులే కుండా అసంఖ్యాకమైన 'జన్మలు' ప్రాప్తిస్తున్నాయి. ఎప్పుడైతే మనస్సు బ్రహ్మమయం అవుతుందో, ఇక తుచ్ఛములైన "దృశ్యముయొక్క ప్రాప్తిచే జనించు సుఖ దుఃఖములు" అట్టి జీవుని ఏమాత్రం క్షోభింపజేయలేవు.

అపవిత్రమసద్రూపం మోహనంభయకారణమ్ ।
దృశ్యమాభాసమాభోగి బంధమాభావయానఘ ॥ (సర్గ 21, శ్లో 36)
మాయైషాసాహ్యావిద్యైషా భావనైషాభయావహా ।
సంవిదస్తన్మయత్వం యత్తత్కర్మేతి విదుర్బుధాః ॥ (సర్గ 21, శ్లో 37)

ఓ రాఘవా! ఈ 'దృశ్యము' యొక్క స్వభావమేమిటో సునిశితంగా పరిశీలిస్తున్నావా? ఇదంతా అపవిత్రము, అజ్ఞానదాయకము, అసద్రూపము, భయహేతువు, బంధదాయకము అయి, ఈ జీవునికి ప్రాప్తిస్తోంది. ఎందుచేత?... ఈ జీవుడు విజ్ఞానముతో కూడిన విచారణను అలవరచుకోకపోవటం చేతనే సుమా! అందుచేత, ఈ దృశ్యమును నీవు భావనయే చేయకపోతే, అది ఇంకేమి చేయగలదు చెప్పు? "అసలు ద్రష్ట దృశ్యమయమగుట... అనునదే బంధమునకు హేతువు అయినట్టి కర్మ" అని బుద్ధిమంతులు చెప్పుచూ ఉంటారు. అదియే మాయ, అదియే అవిద్య కూడా! భయప్రదమగు భావనకూడా అదియే.

'మనస్సు' అంటే 'దృశ్యము' అనే అర్థం సుమా!

మనస్సే మోహ, అజ్ఞానములకు హేతువైయున్నది. అనేక ఆసక్తులు, ద్వంద్వములు ఈ మనస్సులో నిరంతరం పరిభ్రమిస్తున్నాయి. అట్టి బురదతో నిండియున్న ఈ మనస్సును శుద్ధం చేయాలి. సంసారపు మత్తు అంటే ఏమిటి? ఏ దృశ్యతన్మయత్వమైతే స్వభావ సిద్ధంగానే ఉదయించి అనుభవమౌతోందో... అద్దానినే 'సంసారం' అని అంటున్నాం. దృశ్యరూపత్వమే అవిద్య మరియు అజ్ఞానం కూడా! మేఘములచే కప్పబడినప్పుడు సూర్యుడు కనిపించడు కదా! ఈ దృశ్యముచే ఆవరించబడిన ఈ జీవులు కూడా పరమశ్రేయమగు స్వస్వరూపమును దర్శించలేకున్నారు.

ఈ 'అవిద్య' ఎట్లా ఉత్పన్నమౌతోంది?.... ఇది సంకల్పమాత్రం చేతనే ఉత్పన్నమగుచున్నది. ఒక బాలుడు ఆకాశంలో మేఘముల ఆకృతులను చూచి "అది చెట్టు. ఆ ప్రక్కన తటాకం, అక్కడ

ఒక మృగం,"... ఈ విధంగా ఆలాపన చేస్తాడు చూచావా? అట్లాగే ఈ దృశ్యం కూడా స్వయం కృతంగా జీవునకు ప్రాప్తిస్తోంది.

శ్రీరాముడు : ఈ 'అవిద్య' లేక 'దృశ్యభావన' శమించేది ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : సంకల్పముల కారణంగా ఏర్పడి ఉంటున్న అవిద్య... 'నిస్సంకల్పము' (సంకల్పించకుండటం) అని మౌనరూపయత్నముచే శమించగలదు. సంకల్పరాహిత్యముచే భావన నశిస్తుంది. అప్పుడు భావాతీతమగు స్వస్వరూపము యొక్క అనుభవం సుస్థిరమౌతుంది.

పదార్థముల పట్ల, విషయముల పట్ల అసంగమే అందుకు మార్గం.

1) 'సమాధి' (Complete cessation of thought) యొక్క దార్ఢ్యముచే, 2) శ్రవణ, మనన రూపమగు తత్త్వవిచారణచే – పదార్థముల పట్ల అకృత్రిమమైన అసంగము ఏర్పడుతోంది. "సత్య దృష్టి" చేకూరి, 'అసత్యదృష్టి' సన్నగిల్లుచుండగా 'కల్పనా రాహిత్యము' స్వయముగా ఏర్పడుతోంది.

అట్టి నిర్వికల్పమునందు... స్వచ్ఛ స్వభావయుక్తము, పరమార్థము సత్యస్వరూపము అయినట్టి 'ఆత్మభావన' సంప్రాప్తించుచున్నది. ఇక్కడ మనం 'భావన' అని అంటున్నప్పటికీ, అది భావరహితమైన స్థితియే.

అట్టి విషయరహిత పరమాత్మయందు వ్యక్తిత్వముగాని, అవ్యక్తిత్వముగాని ఉండవు. విషయ జనితములైన సుఖ దుఃఖాలు ఉండవు. అట్టి 'పరమాత్మస్థితి' జీవునిచే తన హృదయంలోనే పొంద బడుచున్నది. కేవల శుద్ధ స్వభావరూపమైన హృదయమునందు మాత్రమే ఆత్మతత్త్వము ప్రత్యక్ష మగుచున్నది. ఆత్మవస్తువు స్వయంగా అంతరంగమున అనుభవైకవేద్యమే సుమా!

❖❖❖

13. ఆత్మబోధ ఎట్టి వారికి?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ జీవుడు నిష్కారణంగా ఈ దేహ, ఇంద్రియములందు "ఇవియే నేను" అనబడు అహంభావము కలిగియుంటున్నాడు. అత్యంత అనర్థహేతువైనట్టి "అహమ్ దేహమస్మి" అను భావన చేతనే ఆత్మభావన పొందబడకపోవటం జరుగుతోంది. ఎవనికైతే ఈ 'దేహ ఇంద్రి యముల'తో ఆత్మయొక్క "అభేదభావన" ఉండదో.... ఎవ్వని యందు సర్వవాసనలు తొలగి పోతాయో... అట్టి పుణ్యచరితునకు మాత్రమే పూర్ణమగు ఆత్మభావన ప్రాప్తిస్తోంది.

ఒకడు చీకటిలో ఒక త్రాడును చూచి, "ఒకవేళ ఇది త్రాడు కాదేమో? పామేమో?" అనే సందేహమును ఆశ్రయించుటచేత క్రమంగా అతనికి ఆ త్రాడుయందు పామే కదలాడుచున్నట్లు కనబడుతుంది. బంధరహితమగు చిదాకాశమే స్వరూపముగాగల ఈ జీవుడు కల్పిత వస్తువును అన్యవిధంగా కల్పన చేస్తూ స్వాత్మయందు బంధము కల్పించుకొనుచున్నాడు. "ఈ సంఘటనలతో, వ్యక్తులతో నాకు సంబంధమున్నది. అందుచేత ఇవి నాకు సుఖ దుఃఖకరములు"... అని భావన చేస్తే అది అట్లే అగుచున్నది. "చిదాకాశమే స్వరూపముగా గల నాకు ఈ భావనలతో, అట్టి

భావనల ప్రయోజనంగా ప్రాప్తిస్తున్న ఈ 'జగత్తు'తో సంబంధమెక్కడిది?" అను భావస్థితిని ఆశ్రయిస్తేనో.. తదనుకూలంగానే అంతా ప్రాప్తిస్తోంది.

ఒకే ఆకాశము పగలు ఒకవిధంగా, రాత్రి మరొక విధంగాను కనబడుతోంది కదా! అలాగే ఆత్మకూడా భిన్న రూపములను ధరిస్తోంది.

❖

ఈ జీవుడు అనేక సంసార దుఃఖ పరంపరలలో పడి కొట్టుమిట్టాడటం నిర్వివాదాంశమే కదా! అయితే, తననుతానే అతడు గమనించుటలేదు.

యదతుచ్ఛమనాయాసమ్ అనుపాధి గత భ్రమమ్ ।
తత్తత్కల్పన యాతీతం తత్సుభాయైవ కల్ప్యతే ॥ (సర్గ. 21, శ్లో.48)

మహత్తరమై, స్వభావసిద్ధమై, ఉపాధిరహితమై, భ్రమవర్జితమై సర్వకల్పనలకు అతీతమైనట్టి ఆత్మను ఎరుగుటచేత మాత్రమే అతడు దుఃఖరహితుడు కాగలడు. ఒకడు శూన్యమగు ఒక 'గుహ'లో ప్రవేశించి "ఇక్కడ సింహము ఉండవచ్చునేమో?" అనే భయమును పొందుతాడు. అయితే, ఆ గుహను చక్కగా పరిశీలించిన తరువాతో, లేక అట్లు పరిశీలించిన వారి వివరణలను విన్న తరువాతో "ఇక్కడ సింహము మొదలైనవేవీ లేవు. ఖాళీ స్థలం మాత్రమే ఉన్నది" అని గ్రహిస్తాడు. అదేవిధంగా ఈ జీవుడు "నేను ఈ దేహమునందు బద్ధుడనై ఉన్నాను కదా" అనే భయమును పొందుచున్నాడు. సాధువాక్యముల శ్రవణం, మననం ఆశ్రయించుచుండగా, ఆత్మను బాగా ఎరుగుట చేతనే సంసారబంధము తొలగిపోతుంది.

ఒక బాలుడు పెద్ద మఱ్ఱిచెట్టు యొక్క కాండమును చూస్తూ దట్టమైన చీకటి కారణంగా "అమ్మబాబోయ్! అదిగో...! అది దయ్యమే" అని తలుస్తూ ఉంటాడు. అట్లే ఈ జీవునకు కూడా "ఈ నా దేహము – ఈ జగత్తు – ఈ సంబంధ బాంధవ్యములు – నాకు సంబంధించిన వారు – నా వారు కాని వారు"... మొదలైన అనేక భ్రమలు కలుగుచున్నాయి. ఆ భ్రమలన్నీ క్షణక్షణం ఒక రూపం పోగొట్టుకొని మరొక రూపం పొందుతూ పోతున్నాయి. ఓ రామా! ఇదంతా 'కల్పన'ను అనుసరించే ఏర్పడి ఉంటున్నది. కల్పనావశంచేత జీవునకు ఈ విభవ దారిద్ర్యములు, దానికి అనుకూలమైన శుభాశుభములు క్షణంలో ప్రాప్తిస్తున్నాయి. మరల అవన్నీ క్షణంలో నశిస్తున్నాయి. భావనానుసారమే పదార్థములు కూడా ఆయా ప్రయోజనములు కలుగజేస్తున్నాయి. జ్ఞానులైన మహనీయులు ఇదంతా గమనించి, 'ఈ సర్వపదార్థములు భావనానుసారమే ఉంటున్నాయి' అను ఎరుకను గ్రహించి ఈ ప్రపంచంలో సంచరిస్తున్నారు. ఇవన్నీ కూడా జీవుల వారి దృష్టిని అనుసరించే భిన్నములుగా గోచరిస్తున్నాయి.

ఈ చిత్తము దృఢభావనచే దేనిని ఎంతకాలము ఏ విధంగా భావిస్తుందో, అది అంతకాలం అట్లే ప్రాప్తిస్తూ ఉంటుంది. ఏది సత్యం? ఏది మిథ్య ?

ఈ ప్రపంచమున సత్యము కానట్టి, మిథ్య కానట్టి వస్తువంటూ ఏదీ లేదు.

నతదస్తియత్సత్వం, నతదస్తి నయన్మృషా ।
యద్యథాయేన నిర్ణీతం, తత్తథాతేన లక్ష్యతే ॥

ఎవడు ఏ ప్రకారంగా దేనిని నిర్ణయిస్తాడో అతనికి ఆ పదార్థములు అట్లే అనుభూత ములౌతూ ఉంటాయి. ఒకడు తన 'మనస్సు'చే ఆ ఎదురుగా కనబడుచున్న ఆకాశంలో ఒక 'స్త్రీ' యొక్క కల్పనను దృఢంగా చేశాడనుకో... అతడు కామాతురుడై ఆకాశంలో ఉన్న వనంలో సంచరిస్తున్న ఆ కల్పిత సుందరస్త్రీ వెంట పరుగెత్తగలడు.

అద్వైతానంద పారమార్థిక రూపం - కనుక ఓ రామచంద్రా! ఒక 'సుషుప్తి' యందు ఉన్న వాడు ఏ విధంగా సర్వపదార్థరహితుడై ఉంటాడో, అదే విధంగా నీవు నీ సంకల్పము లందు ఉండి యున్నట్టి సర్వపదార్థములను త్యజించివేయి. సర్వవేళలందు నీ యొక్క "పారమార్థిక అద్వైతానంద రూపము" నందే స్థితి కలిగియుండుము.

ఒక ఎత్తైన ప్రదేశంలో ఒక 'మణి'ని ఉంచామనుకో... ఆ మణియందు ఎదురుగ ఉన్న కొండ ప్రతిబింబిస్తుంటే ఆ మణికి ప్రాప్తించే లాభమేమైనా ఉన్నదా? లేక, అట్లు ప్రతిబింబించక పోతే మణికి వచ్చే నష్టమేమి? ప్రతిబింబించినప్పుడు, ప్రతిబింబించనప్పుడు కూడా ఆ మణి ఒకే తీరుగా ఉంటుంది కదా! నీవు కూడా మనస్సు నుండి 'ఇచ్ఛ' అనుదానిని తొలగించివేయి. నీవు ఇచ్ఛా రహితుడవై ఉండగానే, ఈ జగత్ వ్యవహారములు నీయందు ప్రతిబింబించుగాక! నీకొచ్చే హాని ఏమి? మణి ఒక జడమైన వస్తువు కాబట్టి ఎదురుగా ఉన్న వస్తువులు తనయందు ప్రతిబింబించుట నిరోధించజాలదు. మరి నీవో? నిత్యము నిర్మలము అగు చైతన్యమే స్వరూపముగా కలిగియున్నావు కదా! అందుచేత ఇచ్ఛారహితంగా, అనాసక్తి పూర్వకంగా తప్పక ఉండగలవు. కొంచెము అభ్యాసానికి సిద్ధపడితే చాలు.

వాస్తవానికి 'ఇచ్ఛా సహితంగాను, ఆసక్తిపూర్వకంగాను ఉండుట' అను దానియందు శ్రమ ఏమి ఉన్నది. కనుకనే మోక్షరూపము = సర్వశ్రమలను త్యజించివేయుట అని చెప్పబడుతుంది.

ఓ రఘునందనా! "నాయందు ఏ జగత్తైతే ప్రతిబింబించుచున్నదో అదంతా మిథ్యయే"... అని నిశ్చయించుకొనుము. అట్లు నీయందు ప్రతిబింబిస్తున్న వస్తువుల, విషయముల రూపమును నీవు తాదాత్మ్యముచే పొందకుండెదవు గాక! లేదా...

ఈజగత్తు పరమాత్మకంటే అభిన్నమైనదే కదా! కనుక నాకు జగత్తుగా కనబడేదంతా పరమార్థమున బ్రహ్మమే" అను నిశ్చయమును కలిగియుండు. "అనంతము, అనాది"యగు ఆత్మ యొక్క స్వరూపమును ఆత్మసహాయం చేతనే సునిశ్చితం చేసుకొనగలం.

ఇక నీ చిత్తమునందు ప్రతిబింబించు అన్య జగత్పదార్థములు, తదితర దేహాత్మదృష్టి గల ప్రాపంచిక జీవుల అర్థవాద పలుకులు... నిన్ను రాగయుక్తం చేయకుండా జాగరూకుడవై ఉండు. ఆత్మదృష్టిని సర్వదా అలవరచుకో.

ఒక చోట కొన్ని చిత్ర విచిత్రములైన రంగులుగల పదార్థములు ఉన్నాయి. అవన్నీ ఒక శుద్ధమైన స్ఫటికంలో ప్రతిబింబిస్తున్నాయి. అయినప్పటికీ ఆ స్ఫటికంలో ఆ రంగులు ఉండి ఉన్నాయని అనలేం కదా! అదేవిధంగా, ఈ ద్వైతపదార్థాలకు సంబంధించిన రాగం మొదలైన ఎట్టి దోషాలు లేనట్టి శుద్ధ స్వరూపుడవే నీవు సుమా! అట్టి నీ యొక్క శుద్ధ స్వరూపం నందు ప్రారబ్ధ కర్మ భోగాలకు ఉచితమైనట్టి జగత్ వ్యవహారేచ్ఛ ప్రవేశిస్తే, ప్రవేశించనీ... అందుకు నీకు అభినివేశం పొందవలసిన పనేమున్నది? అయితే నీవు మాత్రం దానితో 'తాదాత్మ్యం' చెందనే వద్దు.

నీ శుద్ధ స్వస్వరూపతత్త్వములో మార్పు చేర్పులు ఏర్పరచగలిగినదంటూ ఈ సృష్టిలో ఏదీ లేదు. అట్లే ప్రతి జీవి విషయంలో కూడా!...

❖❖❖

14. సాక్షి చైతన్యము - జగద్వ్యవహారము

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! సమాధిని అభ్యసించుచు, "ఈ బాహ్యాభ్యంతర జగత్తుల గురించి ఏర్పడి ఉంటున్న మననమంతా మిథ్యా వ్యవహారమే" అని ఎరుగుము. అట్లు ఎరుగుటచేత క్రమంగా నీవు జగద్భ్రమలను, మిథ్యామననమును త్యజించివేయగలుగుతావు. అప్పుడు నీ బుద్ధి విశుద్ధరూపముగా పరిణమించుతుంది.

ఈ కనిపించే ప్రతి ఒక్క జీవుడు చైతన్యము యొక్క ప్రకటనయే అయి ఉన్నాడు కదా! చైతన్యము కాకుండా ఇక ఏదేది అనిపిస్తోందో అదంతా 'భ్రమయే' అయివున్నది. ఎప్పుడైతే చైతన్యము తప్ప వేరైన ద్రష్టల వ్యవహారమంతా త్యజించబడుచున్నదో, అట్టి విచారవంతుడగు జీవుని స్వభావం స్వయంగా నిర్మలమగుచున్నది సుమా! కనుక నీవు 'అజ్ఞాన భూమికా భేద రూపము' అయినట్టి ఈ దృశ్యంను త్యజించివేసి జ్ఞానభూమికలందు ప్రవేశించాలి. 'సాక్షి చైతన్యం' నందే అనుభవమగుచున్న దృశ్యమును, ద్రష్టను కూడా వేరు వేరు చేసివేయుము. సర్వదా సాక్షి చైతన్యమే నీవు అగు. నీవై ఉండు, నీ యందలి సాక్షిచైతన్యముచే పిపీలికాది బ్రహ్మపర్యంతం (చీమ నుండి బ్రహ్మదేవుని వరకు) కూడా సాక్షిచైతన్యంగా గాంచుచుండుటచే 'ఆత్మదృష్టి' దృఢపడగలదు.

బాహ్యమునకు ప్రపంచానుకూలంగానే వర్తించు. ఏదైతే శాస్త్ర నిర్ణయములచే మరియు స్వబుద్ధిచే చేయబడటం స్వధర్మమైయున్నదో అది నిర్వర్తిస్తూ ఉండు. అజ్ఞాన దృష్టియందు ఉన్నట్టి తదితరుల సానుకూల్యతలను పరిగణిస్తూ కర్మలు చేయి. అయితే, "సర్వుల యందలి సత్యము సాక్షీ తత్త్వమే అయివున్నది"... అను భావనను అంతర్లీనంగా సుస్థిరపరచుకో.

ఇక "నీవు–నేను–నీ వారు–నా వారు–నీవి–నావి–కాలము–దూరము–స్థలము–ప్రియము–అప్రియము"... ఇవన్నీ ప్రతిబింబమాత్రంగా... అజ్ఞాన దృష్టియొక్క అనుభవములుగా గుర్తించి, వీటిని వేరుపరచివేయి. ఈ ప్రతిబింబమాత్ర ఆయా విషయములలో తాదాత్మ్యము చెందవద్దు.

'సాక్షితత్త్వము' నందే నిశ్చలుడవై సర్వదా ఉండుము. అప్పుడు ఆత్మ నిర్మలం కాగలదు.

శ్రీరాముడు : హే మహర్షీ! ఆత్మ నిర్మలత్వము పొందటానికి మరి కొన్ని ఉపాయాలు చెప్పమని ప్రార్థిస్తున్నాను.

శ్రీ వసిష్ఠమహర్షి : ఈ జీవుని యొక్క ఆత్మ నిర్మలానుభవము కొరకు శాస్త్రములచే, గురువులచే ప్రతిపాదించబడిన కొన్ని ఉపాయములు, లేక మార్గములను ఇక్కడ చెపుతాను విను.

1. అజాగరూకత నుండి జాగరూకత వైపు -

జాగర్తవ్యే పరేతత్త్వే జాగరూకస్యజీవతః ।
సుప్తస్య ఘన సంమోహమయే సంసారవర్త్మని ॥ (సర్గ 21, శ్లో. 3)

ఆత్మతత్వ విషయమునందు సర్వదా జాగరూకుడవై ఉండాలి. అంతేకాని, మహామోహమయ మగు ఈ సంసారమార్గంలో నిదురిస్తూ ఉండరాదు. ఆత్మరూపము విషయమై జాగరూకులై ఉండుట, ఏమరుపును జయించుటలను 'యోగము' అని అంటున్నాము. "సర్వము ఆత్మయే... ఆత్మ కానిది, ఆత్మకు చెందనిది అంటూ ఎక్కడా ఏదీ ఉండజాలదు..." అను పూర్ణార్థము గ్రహిస్తూ తద్వారా నిర్మలత్వము, శుద్ధత్వమును పెంపొందించుకో..

2. అనురక్తి నుండి, విరక్తి వైపు - స్వల్ప సుఖము నుండి బ్రహ్మదేవుని సుఖపర్యంతము విరక్తి కలిగి ఉండు. సర్వదృశ్య పదార్థములపట్ల, విషయముల పట్ల 'అనురక్తి' సన్నగిల్లుచుండగా "ఒకానొక పరిపుష్ఠితో కూడిన అతీతత్వము-క్రమముక్తి" పరిఢవిల్లుతూ ఉంటుంది.

3. ఇచ్ఛా ద్వేష త్యాజ్యం - భోగకాలమునందు అనుభవమునకు వచ్చుచున్న ఆయా రసవంతమగు పదార్థములు, విషయములు, నామ రూపములు పైకి రమణీయంగా ఉంటున్నాయి. కాని, క్రమేణా తుచ్ఛమై పరిఢవించబోతున్నాయి. "ఇవన్నీ ఉంటే ఉండనీ... లేక తొలగనీ... ఇవి నావి కావు. నేను వీటిలో లేను... ఇవి నాలో లేవు. యాదృచ్ఛికంగా ఇవి ఏర్పడి, మరొకప్పటికి విడిపోతున్నాయి" అని జ్ఞానదృష్టికలవారు గ్రహిస్తున్నారు. ఇచ్ఛా ద్వేషరహితమైన "అవగాహన - అనుభవము - దృష్టి"లను ఆశ్రయించువారి ఆత్మ వినిర్మలమౌతోంది.

4. విషయములతో అసంగము - విషయములతో ఏర్పడు సంగమే విషయభావన. అట్టి భావనయే ఈ దృశ్య జగత్తు యొక్క ప్రాప్తి అయి ఉన్నది. 'విషయ భావన' అనే మంచు కరిగి పోయిందా, ఇక ఈ జీవుని ఆత్మ సునిర్మలం కాకేమౌతుంది?

సంగము - సంగము జీవుని మలినపరచుచున్నది. సంగము నుండే తక్కిన మనోరోగముల నబడు 'కామ-క్రోధ-లోభ-మోహములు' బయల్వెడలుచున్నాయి.

ఆకాశమున సూర్యరశ్మి ప్రసరించగానే మంచు కాస్తా కరిగిపోతుంది కదా! అజ్ఞానాకాశము నందు "ఆత్మతో ఏకత్వము" అనే సూర్యుడు ఉదయించాడా, అట్టి విజ్ఞాన సూర్యుని కిరణ ప్రభావంచే విషయములతో ఏర్పడు సంగము... అనే చీకటి తప్పక తొలగిపోతుంది. అది 'సుజ్ఞానాకాశం' గా ప్రకాశిస్తోంది.

5. తృష్ణారాహిత్యము - తృష్ణయే లేకుంటే ఈ జీవునికి, ఆత్మభగవానునికి అంతరమే లేదు. 'తృష్ణ' అనే తటాకంలో అసంఖ్యాకములైన "మనోరథములు" అనే తరంగములు వృద్ధి చెందు చున్నాయి. ఆ తటాకంలో 'మూఢత్వము' అనే ఏనుగు ప్రవేశించి అల్లకల్లోలం సృష్టిస్తోంది. 'తృష్ణ యొక్క మరొక రూపమే మనో చాంచల్యము. తృష్ణను త్యజించుటచే, మనోచాంచల్యము జయించబడగా, అప్పుడు మనస్సు స్వయముగా శాంతించుచున్నది. అప్పుడు మాత్రమే ఆత్మ లక్షణమైనట్టి 'నిర్మలత్వము' ప్రకాశించుచున్నది.

6. వాసనాజాలమును త్రెంచివేయటం - అనేక ఇతఃపూర్వపు ఆసక్తి, క్రియా విశేషములచే ఈ జీవుడు తన యొక్క వాసనాజాలము (maze of tendencies) ను నిర్మించుకొని అందులో చిక్కిన పక్షిలాగా కొట్టుకొంటున్నాడు. పెద్ద ఎండుకట్టెల ప్రోగును ఒక అగ్నికణిక సహాయంతో భస్మం చేసి వేయవచ్చు కదా! ఒక నావ గలవాడు గొప్ప లోతైన నదీ ప్రవాహమును దాటివేయగలుగుతాడు కదా! అట్లాగే "వైరాగ్యము"... అనే ఆయుధమును దగ్గర ఉంచుకొన్నవానిని ఈ సాంసారిక వాసనాజలం ఏ మాత్రం బాధించలేకపోతుంది.

"సంసారము" అనబడే వాసనాజాలము ప్రజ్ఞతో కూడిన వైరాగ్యముచే త్రెంచి వేయబడుగాక!

విషయగ్రంథి విచ్ఛిన్నమొనర్చబడగా, ఆత్మ యొక్క నిర్మలత్వము, అఖండత్వము, అప్రమేయత్వము అనుక్షణికమై అనుభూతమగుచున్నది.

7. మనస్సు ఉపశమనము - చిల్లగింజలు వేస్తే నీరు నిర్మలం అవుతుంది కదా! ఈ మనస్సు నందు 'ఆత్మజ్ఞానం' అనే చిల్లగింజను ప్రవేశింపచేయాలి. 1) శాస్త్రాదులను పరిశీలనాత్మకమైన దృష్టితో విచారించటం చేత, 2) గురువులు బోధించే విషయాలను అవగాహన పూర్వకంగా గ్రహించుటచేత, 3) స్వయముగా చేయు ఆత్మానాత్మ పరిశీలన చేత 'జ్ఞానం' మనస్సులోకి ప్రవేశిస్తోంది. ప్రకాశమానం అవుతోంది.

ఈ 'మనస్సు'ను కామవర్జితం (Desirelessness) చెయ్యాలి. దీనిని విషయ గుణ అనుసంధాన రహితం చెయ్యాలి. సంసార పదార్థములైనట్టి "పుత్ర-కళత్ర-గృహ-ప్రతిష్ఠాదు" లను దూరము నుంచే త్యజించి వేస్తూ "ఈ సర్వము ఆత్మయే" అను అంతరంగమందలి బోధను సుస్థిరపరచుకోవాలి. భోగ,- లాభముల అభినివేశము నుండి దృష్టిని మరల్చాలి.

అప్పుడు ఈ 'మనస్సు' అనే పంజరములోంచి 'అజ్ఞానము' అనే పక్షి ఎగిరిపోతుంది.

8. సందేహ ప్రవృత్తిని జయించివేయటం -

శాన్తే సందేహ దౌరాత్మ్యే గతకౌతక విభ్రమమ్ ।
పరిపూర్ణాన్తరం చేతః పూర్ణేందురివరాజతే ॥ (సర్గ 22, శ్లో. 10)

నాయనా! రామా! సందేహించుట అను దుష్ట సంస్కారమే "సంసారనివృత్తి" అను ఉత్తమ స్థితిని తాత్సారం చేయిస్తోంది. ఇట్టి "సందేహించుట" అను దోషము శమించుగాక! ఈ చిత్తమును

'భ్రమ–కౌతుక' రహితం చేశామా, ఇక అంతరమున, ఇది పరిపూర్ణమైన పూర్ణచంద్రుని వలె శోభించగలదు.

విచారణను ఆశ్రయించనివాడు, శ్రద్ధలేనివాడు, అనుమానాలతో కాలయాపన చేసేవాడు వినాశనము వైపే పయనిస్తున్నాడు. సంశయాత్మునకు ఇహంలోను, పరంలోను సుఖంలేదు.

9. భేదదృష్టిని శమింపజేయటం - వాయువు శమిస్తే సముద్రము ప్రశాంతమగుచున్నది కదా! "ఇది వేరు, అది వేరు, నేను, నాది, వీరు ఇట్టి వారు, వారు అట్టి వారు"... అను భేదదృష్టులు దోషరహితమగు 'సమమ్ బ్రహ్మమ్' దృష్టిచే శమించగలదు. ఉత్తమదృష్టిని అభ్యసించుటే అందుకు ఉపాయం. "ఎవరిలోనైతే నేను ఏవేవో దోషములను చూస్తున్నానో, వారంతా నావలెనే ఆత్మయే స్వరూపముగా కలిగియున్నారు" అని మరలమరల మనస్సుకు గుర్తుచేయాలి. ఎట్లాగైనా సరే, ఏ ఉపాయం చేతనైనా సరే, "సమదృష్టి"ని సుస్థిరం చేసుకోవాలి. సమదృష్టి... అల్పత్వము నుండి ఔన్నత్యము వైపు మార్గం చూపుతుంది. ఉత్తమ సౌందర్య పూర్వకమైన అవగాహనను అట్టివాడు పుణికి పుచ్చుకుంటాడు.

సమత్వము మృగ్యమగుటచేతనే వాసనలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా అంతఃకరణం అజ్ఞానాంధకారమయమగు జడత్వముచే నిండిపోయి ఉంటోంది. అట్టి మనస్సు జర్జరితమగుచు ఎక్కడెక్కడో దూరదూర ప్రదేశాలలో సంచరిస్తూ, ఏవేవో భావావేశకాలను పుణికిపుచ్చుకుంటూ,... ఆయాసమంతా తెచ్చిపెట్టుకుంటోంది.

"చీకటి – సూర్యోదయము" లాగా "భేదదృష్టి – జ్ఞానము" ఏర్పడుచున్నాయి. జ్ఞానదృష్టి వికసిస్తూ ఉంటే, భేదదృష్టి స్వయముగా అంతరించుటకు సంసిద్ధపడుతూ ఉంటుంది.

10. అభ్యాసము - ఓ రామా! శాస్త్రములు వల్లెవేస్తూ కూడా కొందరు 'ఆత్మదృష్టి' వైపుగా దృష్టి సారించలేకపోతున్నారు. సాంసారిక ద్రష్టత్వమునే సర్వదా ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా దుఃఖాలు తొలగకపోగా, ఇంకా అధికమగుచున్నాయి. ఇట్లు ఎందుకు జరుగుతోంది? ఈ మనస్సును ఇంద్రియములను సరియైన అభ్యాసము నందు నియమించకపోవుట చేతనే సుమా! జ్ఞానంచే అభ్యాసమును పరిశుద్ధపరచాలి, ఉత్తేజపరచాలి. లేకుంటే జ్ఞానము సముపార్జించి ఏం ప్రయోజనం?

ఉత్తమ అభ్యాసములను ఆశ్రయించే జీవునియందు మాత్రమే హృదయసరోవరంలో వివేకము అనే కమలం వికసిస్తోంది. అట్టి 'వివేకకమలం' చైతన్య భాస్కరుని చూచి పులకిస్తోంది.

వివేకి అయినవాడు ఉత్తమ లక్ష్యముల నుండి ఏ పరిస్థితుల యందు చ్యుతి పొందడు. అతడు తన అభ్యాసములను దీపమువలె కాపాడుకుంటాడు. అభ్యాసమే సత్వగుణమును పెంపొందింపజేస్తుంది. చంద్రకిరణములు ఈ జగత్తును ఆహ్లాదపరుస్తున్నట్లు, సత్వగుణము ఈ బుద్ధిని సువిశాలం చేసి, ఉత్తమ అవగాహనను ప్రసరింపజేసి ఆహ్లాదపరచగలదు.

మా ఉద్దేశంలో అభ్యాసం అనగా, "గురుసేవ, ప్రేమ, దయ, దాక్షిణ్యము, శ్రవణము, మననము, నిధిధ్యాస"... మొదలైనవాటిని ఆశ్రయించటం అయి ఉన్నది.

ఓ రామచంద్రా! ఇక పెద్దగా, వివరంగా చెప్పేదేమున్నది? వాయువు, భూమి, జలము, అగ్ని లేనట్టి ఆకాశకోశము ఏ విధంగా ఉంటుంది? ఎంతో నిర్మలంగాను, విశాలంగాను, ఉదయ అస్తమయములు లేనిదిగాను ఉంటుంది కదా! అదే విధంగా జ్ఞేయుడు (ఎరుగవలసినది ఎరిగిన వాడు) అయినట్టి ధీమంతుడు నిర్మలాకాశస్వరూపుడై, "నాకు ఉదయాస్తమయములు లేవు" అను ఎరుక కలిగి ఉంటున్నాడు. "ఖండము–అఖండము, జీవుడు–బ్రహ్మము, పరిచ్ఛిన్నము–అపరిచ్ఛిన్నము"... ఈ బేధములన్నీ అజ్ఞానము ఉన్నచోట మాత్రమే ఉంటున్నాయి.

'తత్వవిచారము'చే 'ఆత్మస్వరూప సాక్షాత్కారం' పొందినవానికి బ్రహ్మ–విష్ణు–మహేశ్వర పదవులు కూడా స్వల్పమైనవిగానే కనిపిస్తున్నాయి. ఎందుకంటావా? 'సృష్టించుట' మొదలైన అధికారము లందు కూడా క్లేశము ఉండి ఉన్నది సుమా!

❖❖❖

15. జ్ఞానుల - అజ్ఞానుల అనుభవాలు

ఎవని చిత్తమైతే, ఈ ఆకారాదులతో కూడి ఉండినప్పటికీ, "అహంకారరహితం" అయి ఉంటుందో అట్టివానికి ఈ సంసారకల్పన ప్రాప్తించుటలేదు.

'మృగతృష్ణ' యందు ఒక మూఢమృగమునకు జలము ఉన్నట్లు కనిపిస్తుంది. జ్ఞానికి జలం కనిపిస్తుందా? లేదు. అతడు కెరటముల పరంపరలు చూస్తూ కూడా, ఇదంతా భ్రమయే, క్రీనీడ మాత్రమే కనుక ఇక్కడ జలం "ఉండజాలదు" అని గ్రహిస్తున్నాడు.

తరంగవదిమే లోకాః ప్రయాన్త్యాయాన్తిచేతసః ।
క్రోడీకుర్వన్తిచాజ్ఞంతే నజ్ఞం మరణజన్మనీ ॥ (సర్గ 22, శ్లో. 18)

వాసనావశం చేతనే ఈ జీవులందురూ తరంగముల వలె ఉత్పన్నమగుచున్నారు. నశించు చున్నారు. ఈ జనన మరణములు, సుఖదుఃఖములు, సమృద్ధి–అసమృద్ధిలు మొదలైనవన్నీ అజ్ఞానిని తమ వశం చేసుకుంటున్నాయి. జ్ఞానినో, ఏమీ చేయలేకపోతున్నాయి. అనేక ఆవిర్భావ–తిరోభావము (రాక పోక) లతో కూడిన ఈ ప్రపంచమంతా అజ్ఞాని కొరకే, అజ్ఞానము చేతనే, అజ్ఞాన విషయంగానే - ఉదయిస్తోంది, లయిస్తోంది.

జ్ఞానికి ఈ 'జగత్తు' అనునదే ఉండి ఉండుట లేదు. మొదలే ఉదయించనట్టి దానికి నాశనమేమిటి? "ఊహలో కల్పించబడిన ఒక అరణ్యంలో ప్రవేశించి మృగములను అతి లాఘవంగా వేటాడటం" అను కార్యక్రమంలాగా, తత్వజ్ఞాని లీలా మాత్రంగా ఈ జగత్తు నందు సంచరిస్తున్నాడు. రమిస్తున్నాడు. ఇక అజ్ఞాని అంటావా, అతడు తనయొక్క స్వయంకల్పిత కౌతుకము" చే ఈ జగత్తు నందు "ఇదంతా వాస్తవమే" అనే బుద్ధిని పొందుచున్నాడు. అట్లు 'వాస్తవము' గా భావించబడుదానిచే బంధింపబడుచున్నాడు.

❖

ఒకచోట ఒక 'కుండ' ఉన్నది. అది ఉన్నా, లేక పగిలినా ఆ 'స్థలము' (Space that is occupied by the pot) కు వచ్చే లాభం గాని, నష్టం గాని ఏమైనా ఉన్నదా? ఘటమునకు ఉత్పత్తి వినాశనం ఉండవచ్చు గాక. కానీ, ఘటాకాశమునకు ఉత్పన్నమేమిటి? నాశనమేమిటి? అట్లాగే ఈ శరీరము భూషించబడు గాక, లేక దూషించబడు గాక! ఆత్మకు ఎట్టి వికారములు ఉండవు. ఆత్మజ్ఞుడు ఈ ఉత్పత్తి నాశనము లేవీ తనయందు కలిగియుండుటలేదు. "నేను ఈ శరీరమునే!" అను అల్పజ్ఞతను ఆశ్రయించువాడు మాత్రమే,... ఈ జన్మ మృత్యువులను అనుభవించుచున్నాడు సుమా! సాయంకాల సమయంలో సూర్యకిరణములు ప్రసరించుటచే విశాల భూమి యందు మృగతృష్ణ ఎటకో మటుమాయమైపోతోంది కదా! ఉత్తమ వివేకము ఉదయించగానే మిథ్యా భూత మగు ఈ దృశ్యము, వాసనలు, సంకల్పవ్యవహారములు... ఇవన్నీ తమంతటతామే నశిస్తాయి.

ఓ జనులారా! "నేనెవరు? ఈ ప్రపంచము ఎట్లు ఉత్పన్నమైనది...?" అనే విషయాలు విచారణ చేయనంత వరకు 'కారుచీకటి' వంటి మిథ్యారూపం అయివున్న ఈ "జగదాడంబరము"... అంతా ఇట్లు ప్రాప్తిస్తూనే ఉంటుంది.

ఈ దృశ్యప్రపంచము మిథ్యాభ్రమ సమూహములచేతనే ఆవిర్భవిస్తోంది. అనేక ఆపదలకు స్థానభూతమై ఉంటోంది. ఎవడైతే 'ఆత్మభావన'చే ఈ దృశ్య వ్యవహారమును నిస్సారమైనదానిగా చూస్తాడో, అతడే దీని నిజ స్వరూపమును గాంచుచున్నవాడు అవుతాడు. సత్యదృష్టికి ఇదంతా లేనిది గానే తెలియవచ్చుచున్నది. కాబట్టి "ఈ దేశ కాలాదుల వశంచేత ఉత్పన్నమయ్యే 'ఆధ్యాత్మిక - ఆధిభౌతిక - అధిదైవిక.' తాపత్రయములు, అట్లే, ఈ సమస్త దుఃఖములు శరీరమునకు సంబంధించినవి మాత్రమే. అంతేకాని ఇవన్నీ పూర్ణానంద స్వరూపుడు, ఆత్మస్వరూపుడు అగు నాకు సంబంధించినవి కావు"... అను నిశ్చయమును మీరంతా కలిగి ఉండండి. ఈ విధంగా భ్రమ రహితమైన నిశ్చయము కలవాడు మాత్రమే సత్యమును గాంచగలుగుచున్నాడు.

ఈ ప్రపంచము అంతులేనట్టి 'దిక్కులు-కాలములు' మొదలైన వాటితోను, అనేక పరిచ్ఛిన్నములతోను, 'ఉత్పత్తి - చలనము' ఆదిగా అనేక క్రియా వ్యవహారములతోను కూడి ఉన్నది. అట్టి ఈ ప్రపంచమునందు 'అంతటా నేనే వ్యాపించి ఉన్నాను'... అను అనుభవము కలవాడే నిజమైన జ్ఞాని.

వాలాగ్ర లక్షభాగాత్తు కోటిశః పరికల్పితాత్ ।
అహంసూక్ష్మఇతవ్యాపీ యంపశ్యతసపశ్యతి ॥ (సర్గ 22, శ్లో. 26)

"సర్వవ్యాపకుడనై, సర్వదా ఉన్నట్టి నేను ఒక రోమము యొక్క అగ్రభాగమందలి ఒక కోటి వంతు భాగము యొక్క ఒక లక్షవ భాగము కంటే కూడా ఇంకనూ ఎంతో ఎంతో సూక్ష్మమైన వాడను"... అని ఎరుగబడే సత్యమును చూచుచున్నాడు.

ఆత్మజ్ఞుడు - ఆత్మజ్ఞుడు ఈ జీవాత్మను అసదతీతుడుగాను, భిన్నమైన దానివలె కనిపిస్తున్న ఈ జగత్తును "చైతన్యజ్యోతిమాత్రము" గాను ఎరుగుచున్నాడు.

జగత్తును పరమాత్మకు అభిన్నంగా గాంచువాడే ఆత్మజ్ఞుడు. సర్వశక్తిమంతుడు, అసరేతుడు, అద్వితీయుడు అగు చిదాత్మ సమస్తమునందు ఉన్నట్లు చూచు దృష్టే వాస్తవ దృష్టి.

“ఆధి–వ్యాధి–భయాదులచే ఉద్విగ్నమగుచు, జనన–మరణయుక్తమై యున్న ఈ దేహము నేను కాదు”... అని ఏ బుద్ధిమంతుడు ఎరిగి ఉంటాడో, అతడే యథార్థజ్ఞానము కలవాడు.

“నా యొక్క మహిమయే పైన, క్రింద, ప్రక్కలందు అంతటా వ్యాపించియున్నది. నాకిక రెండవవాడే లేడు” అని తెలుసుకొనువాడే సమ్యక్‌జ్ఞాని.

“దారంలో మణులు గ్రుచ్చబడినట్లు, నాయందే ఈ ప్రపంచమంతా గ్రుచ్చబడి ఉన్నది. ఈ అంతఃకరణము అనుదానికి కూడా కర్తను నేనే... అంతే గాని అంతఃకరణము ‘నేను’ కాదు.. అను అనుభవము కలవాడే పరమార్థమును ఎరిగినవాడు.

“అహంకారముగాని, దృశ్యముగాని కించిత్ కూడా ఏ క్షణంలోనూ లేనేలేవు. ఇదంతా కూడా నిరామయమగు బ్రహ్మమే అయి ఉన్నది. ఇక సర్వరూపములకు అతీతుడనగు నేను భూత–భవిష్యత్–వర్తమాన కాలములందు వ్యక్తావ్యక్తముల మధ్య స్థితి కలిగి యున్నాను. సముద్రమునకు తరంగములు ఎట్లాగో, అదే విధంగా ఈ త్రిలోకములు నా యొక్క అవయవములే అయి ఉన్నాయి”... అని నిజాంతఃకరణము నందు అనుభూత మొనర్చుకొన్నవాడే సమ్యక్‌దర్శి అని, పూర్ణజ్ఞాని అని చెప్పబడుచున్నాడు.

❖

చైతన్యము యొక్క సమక్షమే లేకపోతే ఈ త్రిలోకముల వ్యవహారమంతా మృతప్రాయమే అయి ఉండేది. ఇవన్నీ చైతన్యసత్తాస్ఫూర్తి చేతనే ఉనికిని పొంది, పరిపాలించబడుచున్నాయి. ఆత్మ తత్వము దృష్ట్యా తదితరములైనవన్నీ ఏక్షణము నందూ లేనే లేవు. ఈ విషయం ఉత్తమ విచారణ సహాయంతో సత్యస్వరూపుడగు జ్ఞాని ఎరుగుచునే ఉన్నాడు సుమా! మహాత్ముల యొక్క ‘దృష్టి’ ఈ సాంసారిక దేహాదుల నుండి మొదలే మరల్చబడి ఉంటోంది. వారి అవగాహనలో ఈ ‘నీవు–నేను’ అనునవన్నీ ఆత్మపరమే అయి చెన్నొందుచున్నాయి. అట్టి ఉత్తమ నేత్రములు కలవారే ‘సంసార తాడనము’ను నిరోధించగలుగుచున్నారు. సత్యమును చూడగలుగుచున్నారు.

‘చైతన్యము’ సర్వదా విషయములకు సంబంధించనది. అది ‘స్వసత్తా ప్రకాశమున’ జగత్ సమూహము లందు అంతటా వ్యాపించి ఉన్నది. ఆద్యంత రహితము, భైరవము అగు శరీరము గల చైతన్యమును (లేక ఆత్మను) సర్వులయందు, సర్వదా, సర్వముగా గాంచువాడే యదార్థ తత్వవేత్త. “ఈ సుఖ దుఃఖములు, ఈ శాస్త్ర – గురు – దేవతలందు ఏర్పడుచున్న శ్రద్ధ, వివేకమును నిదురలేపి ఆత్మతత్వమేమిటో పరిచయం చేసే శ్రవణ – మనన క్రమములు ... ఇవన్నీ కూడా నిర్వచించేది, ప్రవచించేది, పరిరక్షించేది దేనిని? నా యొక్క వాస్తవ స్వరూపము గురించే! ఇవన్నీ నేనే అయి ఉన్నాను”... అను అనుభవమునందు సుస్థిరుడై ఉండువాడే యథార్థ తత్త్వదర్శి.

ఇంకా ఆ సుజ్ఞాని యొక్క అవగాహనను వర్ణించి చెపుతాను... విను.

"ఈ జగత్తంతా నిరతిశయానందముచే పరిపూర్ణమైయున్నది. బ్రహ్మానందము అనుదాని యొక్క స్వల్ప విభాగముచే పరితప్తమైయున్నది. అట్టి ఆ సువిస్తార జగత్తు నందు ఒక అత్యంత స్వల్పమైన ప్రదేశంలో ఆ 'ఐహిక–పారలౌకిక' వస్తుజాలమంతా ఉండి ఉన్నది. అందుచేత, ఇవి ఎంత స్వల్పమైనవి! ఈ భోగ్యవస్తు సముదాయం ఉంటే ఎంత, లేకుంటే ఎంత? ఇందు దుఃఖ భూయిష్టమై, త్యజించదగినది ఏది? సుఖవంతమై గ్రహించదగినది ఏది?"

అప్పుడు అట్టి వివేకము యొక్క ప్రభావంచే 'భ్రాంతి' తొలగిపోయి, ఆనందము ఉదయిస్తోంది.

"ఈ జగత్తును 'ఇది' అని నిర్వచించలేము. ఎవడు దేనిని ఎట్లు భావిస్తే అది అతనికి అట్లే ప్రాప్తిస్తుంది. ఇది అగమ్యమైనది. ఇట్టి దృశ్యజగత్తులో సుఖమెక్కడ? శాంతమెక్కడ? ఎందుకంటే ఇందులో సుఖశాంతులు వెతకటం నేతి బీరకాయలో నెయ్యి కొరకు వెతకటం వంటిది. నాయందు విక్షేపము ఏర్పడినప్పుడు ఈ జగత్తులో విషయాలన్నీ విక్షేప పూరితంగా ప్రాప్తిస్తున్నాయి. నేను విక్షేపరహితుడనై ఉంటే ఇది కూడా విక్షేపరహితంగానే ఉంటుంది. అందుచేత ఇదంతా స్వయంగా విక్షేపరహితంగాను, నా యొక్క ప్రకంపనముచే విక్షేప సహితంగాను ఉంటోంది"... అని తార్కిక జ్ఞానము, సమ్యక్ భావన కలిగియున్నప్పుడు, ఇక ఈ జగత్తులోని "ఇది త్యజించాలి, ఇది పొందాలి" అను రూపముగల త్యాజ్య గ్రాహ్యకల్పన అంతా నశించక ఏం చేస్తుంది చెప్పు? అట్లు ఎవరి దృష్టిలో జగత్ చంచలత్వం నశిస్తుందో, అట్టివాడే ఉత్తమ పురుషుడు.

ఏ మహాత్ముడైతే 'ఆకాశము' వలె ఏకాత్మ స్వరూపుడై ఉంటాడో, పదార్థములందు పూర్ణ భావనగా వ్యాపించి ఉంటూ కూడా, ఆయా పదార్థములను పొందకయే ఉంటాడో, (వాటి యందు అనుక్తుడు కాకయే ఉంటాడో).... అట్టి వాడు 'నిరతిశయానందము'నకు అర్హుడు అగుచున్నాడు. అతడే మహేశ్వర స్వరూపుడు.

ఓ రామచంద్రా! అట్టి మహాపురుషులు ఉన్నారు. వారు ఈ భూమిపై నిశ్చింతగా సంచరించు చున్నారు. వారు ఈ జాగ్రత్ –స్వప్న –సుషుప్తులనబడే మూడు అవస్థల నుండి విముక్తులై, తమను తాము ఈ మూడింటికి వేరైన తత్త్వముగా గాంచుచున్నారు. మృత్యువునకు కూడా ప్రేమాస్పదులై, మృత్యువును కూడా ఒక దినచర్యవంటిదిగా గాంచుచున్నారు. సౌమ్యులై సర్వత్రా సమబుద్ధి కలవారై 'తురీయావస్థ' అనబడే ఉత్తమ పదమునందు ఉపస్థితులై ఉంటున్నారు.

అట్టి మహాత్ములు తారసపడినప్పుడు నావంటి మునులు కూడా శిరస్సు వంచి నమస్కరించుచున్నారు. మేము అట్టివారికి సాష్టాంగదండ ప్రణామములు సమర్పిస్తున్నాం.

ఓ రాఘవా! ఈ బ్రహ్మాండములందు అంతటా ఒకే బ్రహ్మము వ్యాపించియున్నది. నిస్సంశయముగా నీవు ఇట్టి దృఢనిశ్చయము కలిగియుండుము. అనేక విచిత్రములు, రమణీయములు అయిన పదార్థములతో కూడిన ఈ జగత్తు యొక్క సృష్టి – స్థితి – లయములందు అపరిచ్ఛిన్నమగు 'బ్రహ్మావృత్తి'నే సర్వదా కలిగియుండుము.

సాక్షాత్ శివ స్వరూపుడవై, జ్ఞానవంతుడవై, జీవన్ముక్తుడవగుము. అప్పుడు అట్టి ఆత్మారాముడవగు నీకే నేను నమస్కారం చేస్తున్నాను.

❖❖❖

16. శరీరము - నగరము - శరీరి - రాజు

శ్రీరాముడు : ఓ మునీంద్రా ! ముక్తుడు ఈ శరీరమును, తదితర దృశ్యవిశేషములను ఎట్లు ఏ దృష్టిచే చూస్తూ ఉంటాడో చాలా విశేషాలు చెప్పారు. ముముక్షువులకు మార్గదర్శకమగు అతని దృక్పథము – అవగాహన – పరివర్తనల గురించి ఇంకనూ మరికొంత తెలియజేయండి. ముక్తి పొందిన జీవుడు శరీరమును కలిగి ఉంటాడా? లేక త్యజించివేస్తున్నాడా?

శ్రీ వసిష్ఠ మహర్షి : బ్రహ్మమునే ఆశ్రయించి ఉంటున్న జీవుని మనం 'జీవన్ముక్తుడు' అని పిలుస్తున్నాం. అట్టి వాడు ప్రారబ్ధము (వర్తమానము కొరకు ప్రాప్తించే సంచితకర్మ వ్యవహారము) క్షయం అయ్యేవరకు వ్యవహారములను అనుసరిస్తూనే ఉంటున్నాడు. ఈ శరీరమును పాలించుచూ కూడా, దీని పుణ్యపాపములచే అంటకయే ఉంటున్నాడు. నీవు ఎప్పుడైనా కుండలు తయారుచేసే చక్రమును చూచావా? ఆ చక్రము కుండ తయారయిన తరువాత కూడా మరికొంతసేపు పరిభ్రమిస్తూ ఉంటుంది కదా! అట్లే జీవన్ముక్తుడగు పురుషుడు 'శరీరత్వము'(I am this body) ను వదలి 'శరీరిత్వము'ను (I am the one who utilises this body) స్వీకరించినప్పటికీ, ఈ శరీరములను ధరించియే ప్రవర్తిస్తున్నాడు. అయితే జీవన్ముక్తునకు 'శరీరము కలిగియుండుట' అనేది బంధము అగుట లేదు సుమా! ఇది భోగమోక్షములను కలుగజేయటానికే ఉపయోగ పడుతుంది. ఈ శరీరము అతనికి సుఖము కొరకే ప్రవర్తిస్తోంది. అంతేకాని దుఃఖము కొరకు కాదు. మరొక విధంగా చూస్తే, అతనికి దేహమువలన సుఖమూలేదు. లేకపోవుటచే కష్టమూ లేదు.

జ్ఞానదృష్టిని అలవరచుకొనుచున్న యోగి దుఃఖాదులచే ఏమాత్రం స్పృశించబడుటలేదు.

ఈ దేహము గురించి విజ్ఞులు చెప్పు కొన్ని వివేషములను చెపుతాను... విను.

❖

ఈ 'దేహము' అనే నగరం అనేక గుణ విశేషములు కలదై ఎంతో రమణీయంగా ఒప్పుచున్నది. అంతులేని విలాపములతో సంచరిస్తోంది. 'ఆత్మదర్శనము' చే మాత్రమే దీని సత్యాసత్యములు గ్రహించబడుచున్నాయి.

నేత్రములే దీని కిటికీలు. ఇంద్రియములే ఇందలి దీపములు. 'చేతులు' అనే విస్తృతమైన మార్గం ద్వారా ఆయా పదార్థముల ప్రాప్తిని పొందుతోంది. రోమములు' అనే లతలతో, 'తొడలు' అనే స్థంభములతో ఒప్పుచున్నది. ఎముకల సంధులే దీని హద్దులు. కపాలము ఈ దేహనగరంలోని విశాలప్రదేశం. వక్షస్థలము ఇందలి తటాకం వంటిది. భుజములే క్రీడాప్రదేశములు. చెవులు – నోరు ఈ నగరములోని ద్వారములు. కంఠమే ఇందలి బిలము.

'నవరంధ్రంలు' అనే నవద్వారంల నుండి ప్రాణవాయువులు ప్రవేశించటం, నిష్క్రమించటం అనుక్షణం జరుగుతోంది. ముఖంలో నివసిస్తున్న 'నాలుక' పలువిధములైన భోజనం ఆరగిస్తోంది.

ఈ శరీరము అనే నగరం యొక్క అధోమార్గం గుండా 'మలము-మూత్రము' అనే బురద దూరంగా తొలగించబడుతోంది. 'చిత్తము' అనే ప్రదేశంలో 'అనేక చింతలు' అనే జనులు సంచరిస్తున్నారు. ఇంద్రియాలు అనే పశువులు విచ్చలవిడిగా ఈ నగరాన్ని దుర్గంధమయం చేస్తున్నాయి.

ముఖము నుండి వెలువడుచున్న చిరునవ్వులే ఇందలి పూలతోటలోని పూలు. తత్త్వజ్ఞులగు వారు తమ 'దేహము, మనస్సు'ల గురించి సుస్పష్టముగా ఎరుగుచున్నారు. అందుచేత వారి పట్ల ఈ శరీరం శుభప్రదంగానే పరిణమిస్తోంది. ఇది వారికి మోక్షరూపమైనట్టి హితమును, శుభమును, సుఖమును కలుగజేస్తోంది.

కాని అజ్ఞానికి మాత్రం ఈ శరీరం అనేక దుఃఖాల-అశుభాల నిలయంగా ప్రాప్తిస్తోంది.

❖

ఈ శరీరము నశిస్తున్నప్పుడు జ్ఞాని అత్యంత స్వల్పమైన విషయముగా దర్శించుచున్నాడు. అతని దృష్టిలో ఈ శరీరనాశన మాత్రంచే సత్యవస్తువు ఏదీ పోవుట లేదు. లేక ఇది నిలచి ఉంటుందా, అదీ మంచిదే! జ్ఞాని దీనిని ఉపయోగించి భోగ మోక్షములను అనాయాసంగా పొందుచున్నాడు.

ఈ శరీరము జీవునకు ఒక రథము వంటిది. దీనిని ధరించిన జీవుడు ఈ ప్రపంచంలో చమత్కారంగా కొంచెం సేపు సంచరించి ఎప్పుడో దీనిని త్యజించివేస్తున్నాడు. అట్టి కొద్ది కాలంలోనే "శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు"... అనే విషయములను, "స్వజనులు-పరులు -బంధువులు-మిత్రులు-అసంబంధులు-శత్రువులు"...మొదలైన పరస్పర వ్యతిరిక్తమైన సంబంధ బాంధవ్యములను పొందుచున్నాడు. అయితే అతడు జ్ఞానలక్ష్యమును, దృష్టిని కలిగియుంటేనో, ఈ శరీరము నుండి అతనికి 'మోక్షము' అనబడు 'ఉత్తమమైన సుస్థిరమైన అవగాహనతో కూడిన మనస్సుకు పరమైన..." స్థితి లభిస్తోంది. కనుక జ్ఞానికి ఈ శరీరరథము లాభదాయకమే.

❖

ఈ శరీరనగరం 'సుఖ-దుఃఖములు' అనే క్రియలను స్వయముగా ధరిస్తోంది.

జ్ఞానికి ఉత్తమ విషయములను నేర్చుకొనుటకు, చేకూర్చుకొనుటకు ఈ శరీరం ఉపయోగిస్తోంది. ఈ శరీరంచే నిర్వర్తించబడు శాస్త్రయుక్తమైన క్రియల ద్వారా తనలో దుష్ట స్వభావాలకు అతడు చికిత్స పొందుచున్నాడు. అందుచేత 'ప్రశాంతము అనబడు నిర్లిప్త అంతరంగస్థితి, సమగ్రమగు అవగాహన"... లను లక్ష్యములను కలిగియుండి, ఈ శరీరంను ఒక ఉపకరణంగా, చేతి కఱ్ఱ వలె ఉపయోగించుకుంటున్నాడు.

ఇంద్రుడు అమరావతిలో సుఖంగా ఉన్నట్లు దుఃఖరహితుడు స్వస్థ చిత్తుడు అగు జ్ఞాని ఈ శరీరనగరమును పాలిస్తూ ఇందులో సుఖంగా ఉంటున్నాడు.

అతని మనస్సు "నేను పుట్టాను. చచ్చుచున్నాను... ఇవన్నీ నావి... ఇవి నాకు ఉండాలి... నేను వారికంటే ప్రత్యేకత కలిగినవాడిని..." అను లోభపూరితమైన ఆవేశమును పొందుటలేదు. వివేకయుక్తమైన బుద్ధి పొందుచు, 'మోహము, అధర్మము'.. అను దుశ్చర్యలను దూరమునుండే త్యజిస్తున్నాడు. అజ్ఞానయుక్తములైన లోభ కోప మాత్సర్యాదులు అతనిపై దండెత్తలేకపోతున్నాయి. అవి అతని జ్ఞానతీక్షణతకు వెరచి బిక్కుబిక్కుమంటూ బలహీనులగు శత్రురాజువలె దూరంగా ఉండిపోతున్నాయి. సర్వ సంసార దుఃఖములకు మూలము 'ఆసక్తి'యే కదా! అట్టి ఆసక్తిని అతడు జయించివేసి ఉంటున్నాడు. కామభోగములు, సర్వ సుఖ దుఃఖవిలాపరూపమగు 'తృష్ణ'లను గుర్తించి అతడు వాటియందు తగుల్కొనుట లేదు. సర్వవేళలందు బాహ్య – అభ్యంతరములందు పరమాత్మనే దర్శించుచు "ఆధ్మాత్మిక – ఆదిభౌతికములు" అనే రెండు నదుల సంగమములందు* ప్రశాంతంగా స్నానమాచరిస్తున్నాడు. ఈ ఇంద్రియములపట్ల, పైకి రమణీయంగా కనబడే విషయములపట్ల అతడు సర్వవేళల పరాన్ముఖుడై ఉంటున్నాడు. అందుచేత, అవి అతనిని నిరోధించటం గాని, కట్టడి చేయటం గాని చేయలేకపోతున్నాయి. ఏది ఎట్లా జరుగుచున్నప్పటికీ అతడు మాత్రం 'ధ్యానము' అనే అంతఃపురమునందు నిత్యము సుఖపూర్వకంగా వసిస్తూ ఉంటాడు.

ఆత్మ తత్వము ఎరిగినవానికి ఈ శరీరము సుఖప్రదమే అగుచున్నది. ఎందుకంటావా?

1. భోగమోక్షములను ప్రసాదిస్తోంది కనుక 2. ఈ శరీరం ఉంటే దృశ్యం ఉంటోంది. అయితే ఈ శరీరం పోతేనో? ఏదీ కొంచెం కూడా నశించుట లేదు.

ఒక కుండ ఉన్నప్పుడుగాని లేక పగిలిననప్పుడుగాని ఘటాకాశము గాని, మహాకాశము గాని ఏమైనా ఖండించబడుచున్నాయా?... లేదే! ఈ శరీరము నశిస్తే ఇందు ప్రవేశించి అనుభవములను పొందుచున్న ఆత్మ వస్తువుకు పొందునది గాని, కోల్పోవునది గాని ఏమీ ఉండదు. జ్ఞాని ఈ దేహము కలిగియున్నప్పుడే దీని విషయమంతా గ్రహిస్తున్నాడు. వాయువు ప్రసరిస్తూ ఉండగా ఒక గోడ తారసపడితే ఆ గోడను తాకుతుంది. అక్కడ గోడలేకుంటే? తన ప్రసరణను ఇంకా కొనసాగిస్తుంది. అంతే గాని "అయ్యో! ఇక్కడ గోడ పడిపోయింది కదా..." అని తలచి వాయువు కూడా నశిస్తుందా? లేదే! అదే విధంగా శరీరం నేల కూలినా ఇందలి జీవాత్మ ఏమీ కోల్పోదు. శరీరం ఏర్పడుచున్నప్పుడు క్రొత్తగా ఏదీ పొందదు.

❖

జ్ఞాని యొక్క ఆత్మ తాను అంతటా వ్యాపించి ఉన్నప్పటికీ, ఈ శరీరమునకూడా ఉండి ప్రారబ్ధ భోగము (Fruits of actions done in the past lives) లను అనుభవిస్తూ ఉంటోంది. అంతకంతకు మును ముందే తనయందు సాక్షాత్కరించినట్టి పూర్ణానందమయమగు 'ఆత్మస్వరూపము' అను పురుషార్థమును పొందియే ఆయా సంఘటనలయందు మౌనంగా పాల్గొనుచూ ఉన్నది. అనుభవమునకు అతీతమైన ప్రజ్ఞను అవధరించి సర్వమునకు సాక్షియగుచున్నది.

---

* రెండు నదుల సంగమము = ఆత్మ, శరీరముల సంబంధములను విజ్ఞాన దృష్టితో ఎరిగి ఉండుటయే "సంగమమందు స్నానం" గా ఇక్కడ చెప్పబడింది.

శ్రీరాముడు : అంటే అతడు అన్నియు నిర్వర్తిస్తూ ఏమీ నిర్వర్తించనివాడే అగుచున్నాడా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. జ్ఞాని ఆయా అర్థక్రియాదులపట్ల ఉన్ముఖుడై ప్రారబ్ధ కర్మానుసారంగా ప్రాప్తిస్తున్న కర్తృత్వమును, కర్మత్వమును నెరవేర్చుచున్నాడు. ఈ విధంగా వ్యవహారదృష్టితో చూస్తే అతడు అంతా చేస్తూనే ఉంటాడు. అయితే, యథార్థానికి ఏమీ చెయ్యనివాడే అగుచున్నాడు. "నేను సర్వత్రా సర్వదా వ్యాపించియే ఉన్నాను" అను ఎరుకను కలిగి ఉంటూనే లీలామాత్రంగా ఈ దృశ్య కార్యక్రమాలను వినోదపూర్వకంగా పొందుచున్నాడు. 'త్యాజ్యం'అనే విమానం అధిరోహిస్తున్నాడు. చమత్కారంగా, అతి సుందరంగా, పరమశాంతియుతంగా ఈ జగత్తునందు సంచారము సలుపుచున్నాడు. 'మైత్రి' అనే ప్రియురాలితో కూడుకొనినవాడై ఉంటున్నాడు. అతనికి ఇటు అటు 'సత్యత్వము', 'ఏకత్వము' అనబడే ఇద్దరు ప్రియాతిప్రియమైన మిత్రులు వెంటనంటి ఉంటున్నారు. ఆకాశంలో ఆ సూర్యుని చూడు... అతడు వనములోని లతలను నిర్లిప్తంగా చూస్తూ "తన కిరణజాలమును ప్రసరింపజేయుట' అను ధర్మమును నిర్వర్తిస్తున్నాడు కదా! జ్ఞాని కూడా అతి దూరస్థుడై నశ్వరము, దుఃఖగ్రస్తము అగు ఈ లోకములన్నీ చూస్తున్నాడు. సర్వదిక్కులను తన యొక్క "సత్-చిత్"ల ప్రసరణముచే పూర్ణమొనర్చుచున్నాడు. సమస్త సంపదలతో కూడిన పూర్ణచంద్రునివలె అఖండ శోభాయుక్తుడై ప్రకాశిస్తూ ఉన్నాడు. శంకరభగవానుడు కాలకూట విషం మ్రింగితే, ఆ విషం ఆయన కంఠమునకు ఆభరణమే అయి, ఆయనకు 'నీలకంఠుడు' అను ప్రశంసను తెచ్చిపెట్టింది కదా! జ్ఞానిచే సేవించబడు కార్యక్రమములు, భోగసముదాయములు కూడా దుఃఖమును గాక సుఖమునే కలుగజేస్తున్నాయి.

"ఇతడు నిజమైన యముడు కాదు... కేవలం వేషం వేసినవాడు".. అని తెలిసిన తరువాత ఆ వ్యక్తితో సంభాషణ వినోదమునే కలుగజేస్తుంది కాని విషాదమును కాదుకదా! అట్లాగే, "ఈ భోగములన్నీ మిథ్యారూపములే" అని తెలిసిపోయిన తరువాత ఇవి అట్టి జీవునికి దోషరహితమైన సంతోషమును చేకూర్చగలుగుతాయి.

నటులు సామూహిక నృత్యం చేస్తూ దూరంగా పోతూ ఉంటే ప్రేక్షకులు చమత్కార దృష్టితో చూస్తూ ఉంటారు కదా! జ్ఞాని కూడా ఈ స్త్రీ ధన రాజ్య పూజ్యాది వ్యవహారములన్నీ ఒక నాటకములోని సంఘటనలను చూస్తున్నట్లు, తనకు ఏమాత్రం సంబంధమే లేనట్లు అవగాహన కలిగి ఉంటాడు. బహుదూరం పోవలసిన బాటసారి మార్గమధ్యంలో తారసపడే గ్రామ సమూహములను నిర్లిప్తంగా చూస్తూ ఉంటాడు కదా! జ్ఞాని కూడా ఈ సర్వలోక వ్యవహారములను ఆసక్తిరహితంగా ఉద్వేగాదులు లేనివాడై చూస్తున్నాడు.

ఎక్కడో కొండయొక్క ఎత్తైన శిఖరమును, అక్కడి వృక్షముల వృద్ధి క్షయములను జనులు రాగరహిత దృష్టితో చూస్తూ ఉంటారు. అట్లాగే మమత్వము లేనట్టి జ్ఞాని యొక్క దృష్టి కూడా సర్వ కార్యములందు, విషయములందు సంఘటనలయందు రాగరహితమై ఒప్పుతూ ఉంటుంది.

❖

జ్ఞాని ప్రారబ్ధకర్మానుసారంగా ఈ ఇంద్రియములకు ప్రాప్తించే విషయములను అనుభవించ వలసివస్తే... అప్పుడు వాటిపట్ల ఏ విధమైన స్వీకార, తిరస్కార రూపమైన పట్టుదలా వహించడు. అట్లాగే, "ఇవి నేను పొందలేకపోయానే....? ఏమైనా సరే, ఇవి నేను పొందవలసిందే!" అను యత్నపూర్వక 'గ్రాహ్యాభావన' ఆశ్రయించడు. "ఏదో పొందాలి"... అని చెప్పనలవి కాని తపన, ఆతృత అతనియందు ఉండదు. సదా పరిపూర్ణరూపుడై, పరిపూర్ణకాముడై దర్శనమిస్తూ ఉంటాడు. నెమలిపింఛంతో కొండను కొడితే కొండకేమైనా అవుతుందా? ఇక్కడ వచ్చి – పోయే మహర్దశలు, దుర్దశలు జ్ఞానిని ఏమాత్రం చలింపజేయజాలవు.

ఈ స్థూలశరీరము – సూక్ష్మశరీరములకు మూల కారణమైన అజ్ఞానము అతనియందు నశించిపోతుంది.

సంశాన్త సర్వసందేహో గలితాఖిల కౌతుకః ।
సంక్షీణ కల్పనాదేహో జ్ఞః సమ్రాడ్ ఇవ రాజతే ॥ (సర్గ 23, శ్లో. 49)

అతడిక సంశయరహితుడై ఉంటాడు. ఈ సర్వభోగములందు అతనికి మిథ్యాత్వమే దర్శన మిస్తూ ఉంటుంది. అందుచేత సర్వకౌతుకములను వర్జించినవాడై ఉంటాడు. 'నాయందు ఈ స్థూల సూక్ష్మ దేహముల కల్పనకు చోటే లేదు... జనన మరణాదులు లేవు" అను బోధను ఆశ్రయించి ఉంటున్నాడు. రాజసూయ యజ్ఞఫలం పొందిన చక్రవర్తివలె శోభిస్తూ ఉంటాడు.

అయితే ఇక్కడ 'చక్రవర్తి' అనే దృష్టాంతమును జ్ఞానియొక్క "అవగాహన – పరిమోత్కృష్ట భావన"లను వివరించటానికి మాత్రమే వాడాను. యథార్థానికి, "అపారము పూర్ణము" అయివున్న మహాసముద్రంలాగా జ్ఞాని పూర్ణ స్వరూపమగు తన ఆత్మచే ఆత్మయందే శోభించుచున్నాడు.

జనులు ఒక పిచ్చివాడిని, అతని చేష్టలను చూచి నవ్వుకుంటూ ఉంటారు కదా! అనేక భోగేచ్ఛలచే క్షణక్షణం వ్యాకులచిత్తులగుచు, స్వస్వరూప సమాచారము విషయమై అసావధానత్వం వహించువారిని చూచి జ్ఞాని నవ్వుకుంటూ ఉంటాడు.

ఎవరో త్యజించి, దూరంగా విసరిన వస్తువులను ఆశ్రయించి భద్రముగా దాచుకునే వ్యక్తిని చూచి అందరం పరిహసిస్తూ ఉంటాం కదా! తుచ్ఛమైన ఆసక్తులను కలిగియుండే అజ్ఞానుల ఇంద్రియ ప్రవృత్తులను, మూర్ఖపు కౌతుకాలను చూచి జ్ఞాన దృష్టి గల యోగులు నవ్వుకోవటంలో ఆశ్చర్యమేమున్నది?

❖❖❖

17. మనోనిగ్రహం - ఇంద్రియ నిగ్రహం

ఓ రామచంద్రా! మనం ఒక ఏనుగును అంకుశంతో నిగ్రహిస్తాం. ఈ 'మనస్సు' అనే మదపుటేనుగు "ఆత్మసుఖము" అను దానిని త్యజించి 'ఇంద్రియవిషయములు' అనే దుష్టమార్గంలో ఎటకో పరుగులు తీస్తోంది. అట్టి ఈ మనస్సును ఏం చేయాలి? నిరోధించాలి. ఎట్లా? అందుకు చిన్న చిన్న విజ్ఞాపనలు సరిపోవు. విచారణ – సుజ్ఞానములను నిరంతరం ఆశ్రయించాలి.

ఈ మనస్సు అతి చంచలమైనది కదా! అందుచేత, ఇది భోగముల వైపుగా రాగ లోభపూరిత వృత్తులను పొందుతూ ఉంటోంది. అట్టి వృత్తి రూపము పొందకుండా నీవు నీ మనస్సు విషయంలో జాగరూకుడవై ఉండాలి సుమా! విషాన్ని వెడలగ్రక్కుచున్న ఒక లతనో లేక పామునో ఎట్లా దూరంగా ఉంచుతావో, అట్లాగే భోగములపట్ల ఏర్పడుచున్న వృత్తులు నిన్ను సమీపించ కుండా చూచుకోవాలి. అట్టి దుష్ట దుర్బల వృత్తులను మొదలే నిరోధిస్తూ ఉండటం మంచిది.

ఎప్పుడైతే మనస్సు చిరకాలం నిగ్రహించబడి, వృత్తులను పొందక ఉంటుందో, అప్పుడు అట్టి మనస్సులో మా బోధ కొంచెం ప్రవేశించినా చాలు, అమోఘమైన ప్రయోజనం పొందుతోంది. ఎవరి మనస్సైతే ఎల్లప్పుడూ ఆయా భోగ, రాగవృత్తులను ఆశ్రయిస్తోందో, అట్టి వారి ముందు మేము ఎంత విస్తారమైన, సవివరమైన బోధను ప్రతిపాదించినా, అదంతా చెవిటివాని ముందు శంఖము ఊదినట్లే అవుతోంది.

మహాసముద్రం తనయందు భూమినంతా నింపివేయగలగినంత జలం ఉన్నప్పటికీ, నదుల నుండి వచ్చే జలమును స్వీకరిస్తూ ఉంటుంది కదా! నిగ్రహించబడిన మనస్సుగలవారు అనేక రూపములుగా అనేక ప్రదేశముల నుండి వారి వద్దకు చేరుకున్న జ్ఞాన విషయములన్నీ సులభంగా స్వీకరించగలగుచున్నారు. అట్లు స్వీకరించి, వాటిని తమ ఉత్తమ బుద్ధిచే విచారించి మరింత సమున్నతులు కాగలుగుచున్నారు. మనస్సు నిలకడలేనిచోటికి వచ్చి చేరే జ్ఞాన సమాచారం నిష్ప్రయోజనమే అవుతోంది.

నిగ్రహించబడిన మనస్సు అత్యంత సులభంగా తృప్తిని, ఆనందమును, సంతోషమును పొందగలుగుతోంది.

ఓ రాఘవా! ఉత్తమమైన ఆత్మజ్ఞానము ఈ జీవుని యందు వికసించకుండా నిరోధిస్తున్నది ఏది? ఇంద్రియములతో ఏర్పడుచున్న తాదాత్మ్యమే సుమా! ఇంద్రియానుభవముల పట్ల స్వయముగా కల్పించుకొనిన మోహమే ఈ జీవుని అనేక యోనులందు త్రిప్పుచున్నది. లేనిది ఉన్నట్లుగా, ఉన్నది లేనట్లుగా భ్రమలను పొందింపచేస్తోంది. ఇక ఈ జీవుడు ఒక ఉపాధి నుండి ఇంకొకదానికి పరుగులు తీస్తూనే ఉన్నాడు.

అందుచేత చేతిని చేతితో నలిపి, దంతములను దంతములతో కొరికి, అవయవములను అవయవములతో ఆక్రమించి... ఎట్లాగైనా సరే, సర్వప్రయత్నములతో ఈ ఇంద్రియములను మాత్రం జయించాలి.

చమత్కారమైన విషయమేమంటే, ఈ ప్రపంచంలో కొందరు అనేక విషయములందు పండితులై ఉండి కూడా, అనేక విజయోత్సాహములతో ప్రపంచమును ఆశ్చర్యపరుస్తూ కూడా, చివరికి ఈ 'ఇంద్రియములు' అనే శత్రువులకు క్షణంలో దాసానుదాసులగుచున్నారే!

ఈ ఇంద్రియములే మొట్టమొదటగా జయించబడవలసిన శత్రువులు.

ఏతావతి ధరణీతలే సుభగాస్తే సాధుచేతనాః పురుషాః ।
పురుషకలాసు చ గణ్యా నజితాయే చేతసా స్వేన ॥ (సర్గ 23, శ్లో. 60)

ఈ భూమి మొత్తం మీద ఇంద్రియములను జయించినవారే భాగ్యవంతులు. అట్టి వారు మాత్రమే సావధానముతో కూడిన చిత్తమును సంపాదించగలుగుచున్నారు. అట్టి 'చిత్తము' యొక్క ప్రభావముచే అతి కుశలముగా ఈ సంసారమును జయించి వేసి, స్వస్థచిత్తులగుచున్నారు.

❖

ఓ సర్వజనులారా! "మా దృష్టిలో వీరు మంచివారు కాదు... వారు గొప్పవారు కాదు... ఈ వ్యక్తిలో ఇట్టి దోషాలు ఉన్నాయి..." మొదలైన పరుల దోషములను ఎంచు ప్రవృత్తులను కాస్త కట్టిపెట్టండి. "వారు మా శత్రువులు... వీరిని మా కండబలంతో, బుద్ధిబలంతో నిర్జించ గలం...ఇకపై వీళ్ళ వీళ్ళ సంగతి చూడాలి! ఇక చూస్తాం...." అని మననం చేస్తూ మీరు పరుగులు తీస్తున్నది ఎటు వైపు? మీ హృదయ కుహరంలోనే "దుష్టసంకల్పములు, విషయ వాసనలు" అనే రెండు కాలకూట విషసర్పాలు సంచరిస్తూ ఈ జన్మ కర్మలను విషపూరితం చేస్తున్నాయి. ఇంటిలోనే శత్రువులను పెట్టుకొని ఎక్కడో ఉన్న ఎవరో శత్రువుల గురించి ఎందుకో వేగిరపాటు? ఎవని హృదయంలో అయితే 'దుష్టమనస్సు' అనే సర్పం వినాశనం పొందుతుందో, అట్టి వాడు స్వస్వరూప సాక్షాత్కారమును అతి సులభంగా పొందుచున్నాడు. నిర్మలాంతఃకరణుడు అగుచున్నాడు.

అందుచేత మీరంతా "ఈ ఇంద్రియముల వేగమును నిరోధించటం ఎట్లా? ఈ మనస్సును ఏ సన్మార్గపు ఆచరణచే పరిశుద్ధ పరచుకోవాలి?" అనే విషయాలు మరలమరల పరిశీలించండి. శాస్త్రాదులు అందుకు ఉపకరించాలనే ఉద్దేశంతోనే మీ ముందు ప్రతిపాదించబడుచున్నాయని గ్రహించండి.

❖❖❖

18. ఉపేక్ష పనికి రాదు

శ్రీ వసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఈ ఇంద్రియములను చూస్తున్నావా! ఇవి 'తృష్ణ'చే నిండియున్నవై, మహానరకప్రదములు అగుచున్నాయి.

ఈ 'ఇంద్రియములు' అనే శత్రువులను జయించాలంటే ఓర్పు-నేర్పు-శ్రద్ధ- ఈ మూడూ అవసరం.

కృతఘ్నుడు తాను ఎవరి యొక్క సహాయం పొందాడో వారినే బాధిస్తాడు కదా! ఈ ఇంద్రియాలు కూడా తమకు ఆశ్రయమైనట్టి దేహమునే శిథిలపరచుటకు, నశింపజేయుటకు సిగ్గు లేకుండా సిద్ధపడుచున్నాయి. పాపధనం కూడబెట్టడంలో 'మహాదిట్ట' అయి ఉంటున్నాయి.

ఇంటి ప్రక్కనే బలవంతుడైన శత్రువు ఉంటే ఎవరికి శాంతి ఉంటుంది? ఈ ఇంద్రియములు జీవుని ప్రశాంతతకు ముప్పు తెచ్చిపెడుతున్నాయి. అయ్యో! ఈ ఇంద్రియములు జీవుని ఎంతగా క్షోభపెడుతున్నాయో చెప్పలేం. ఇవి విషయములను ఆపేక్షించుచు 'పొందవలసినవి, చేయ వలసినవి' అనే రెక్కలు కలిగి 'దేహం' అనే గూటిలో ప్రవేశించి మరల మరల విజృంభిస్తున్నాయే!

'వివేకము' అనే వలపన్ని ఈ ఇంద్రియ పక్షులను పట్టి వశం చేసుకోవాలి. అట్టివాడు మాత్రమే అచ్ఛేద్యమగు శాంతస్వరూపుడు అగుచున్నాడు. వివేకులు సమగ్రమగు 'అవగాహన' అనే నిలకడ కలవారై పైపైకి మాత్రమే రమణీయంగా ఉండే ఈ ఇంద్రియ విషయము లందు ఏ మాత్రం ప్రీతిని గాని, కౌతుకమును గాని పొందకుండా ఉంటున్నారు. ఇంద్రియములను ఓడించి వేసి, తమ చిత్తమును స్వాధీనము చేసుకున్నవారై 'మట్టి' మొదలైన పంచభూత సమ్మేళనముచే నిర్మించబడిన ఈ స్వశరీరమును ఒక ఉపకరణమాత్రమైనదిగా చూస్తున్నారు. అందుకు ఫలితంగా ఆ వివేకులు పరమసుఖమునే పొందుచున్నారు. అట్టి సుఖమును గొప్ప సామ్రాజ్యమును ఏలుతున్న చక్రవర్తులు కూడా పొందలేకపోతున్నారు.

ఎవడైతే ఈ ఇంద్రియములను తన భృత్యులుగా చేసుకుంటాడో (తాను వాటికి భృత్యుడు కాడో...) 'దుష్ట మనస్సు' అనే శత్రువును జయించివేస్తాడో... అట్టి వాని పరిశుద్ధమగు బుద్ధి 'వసంతకాలంలోని లతలు' వలె వృద్ధి చెందుతోంది. మేము చేయు బోధలు అతని పట్ల రసమయమై అతి పవిత్రతను సంతరించుకుంటున్నాయి.

శ్రీరాముడు : స్వామీ! ఈ భోగవాసనలు నశించేది ఎట్లా?

శ్రీ వసిష్ఠమహర్షి : ఎవరినైనా ఉద్ధరించగలిగేది వారి యొక్క 'అభ్యాసము' మరియు వారి 'వైరాగ్యపూరితమైన విచారణ' అని గ్రహించు.

సర్వప్రయత్నములచే ఈ చిత్తము యొక్క గర్వమును నశింపజేయాలి.

ఇంద్రియ శత్రువులను జయించటానికి అభ్యాసము, దైవీగుణములను ఆశ్రయించుట ఉపాయమైయున్నది. ఉత్తమ అభ్యాసం ఆశ్రయించేవారు తమ భోగవాసనలను స్వయంగా నశింప జేసుకోగలగుచున్నారు. ఇందులో సందేహము లేదు. అభ్యాసమును ఆశ్రయించకుండా, "మేము ఉద్ధరించబడటం ఎలా?" అని ఖాళీచేతులతో గురువును ఎంతగా ప్రశ్నిస్తే ఏం ప్రయోజనం?

❖

ఓ రామచంద్రా! 'ఏకం' అయినట్టి "బ్రహ్మతత్త్వం"ను అభ్యసించుట చేత మనస్సు క్రమంగా జయింపబడగలదు. మనస్సు జయింపబడనంత కాలం 'అజ్ఞానం' అనే గాఢాంధకారం ఉండనే ఉంటుంది. ఆ చీకటి ఉన్నంతసేపు వాసనలు జుట్టు విరగబోసుకున్న పిశాచాలలా విజృంభిస్తూనే ఉంటాయి.

"నేను స్వల్పుడను... శరీరమాత్రుడను... చావుపుట్టుకల మధ్య మాత్రమే ఉన్నవాడను"... అను స్వల్పత్వమును నీవు త్యజించు. మనస్సునందు ఆత్మకు సంబంధించిన సమాచారము చేతను, వివేకపూరితమైన పరిశీలనాదులచేతను నింపివేయి. వివేకవంతుడవై ఉండు. అవివేకివి కావద్దు. "నా గతి ఇంతే... నే బాగుపడటమేమిటి?... నేను ఉద్ధరింపబడజాలను... ఎందుకంటే నేను అల్పుడను కదా"... ఇట్టి అవివేకమును, ఆ అవివేకమునకు సహకరించు వాక్యక్రమములను, భావనలను దూరంగా నెట్టివేయి.

వివేకి యొక్క మనస్సు. తాను గ్రహించిన లక్ష్యం వైపుగా కార్యక్రమాలుగా నిర్వర్తించడానికి సిద్ధంగా ఉంటుంది. కాబట్టి అది అతనికి గొప్ప సేవకుడు.

అది అతనిని సత్కార్యములవైపు ప్రేరణ కలిగిస్తుంది. కనుక మంచి మిత్రుడు.

'ఇంద్రియములు' అనే శత్రువులపై దాడిచేసి అణచివేస్తుంది. కనుక గొప్ప సామంత రాజు.

ప్రేమభావము కలిగి ఉంటుంది. అందుచేత అత్యంత ప్రియురాలగు స్త్రీ.

పాలించి, ఆ జీవుని అనేక దుఃఖములు, ప్రమాదాల నుండి రక్షిస్తూంటుంది. కాబట్టి తండ్రి.

ఈ విధంగా వివేకి విషయంలో అతని మనస్సు అతనికి క్షేమమునే కలుగజేస్తోంది.

❖

'ఈ మనస్సు అనుల్లంఘ్యనీయమైన శాసనము కలిగి ఉంటోంది. అయితే దాని యొక్క వాస్తవరూపము చైతన్యము. అది చైతన్యము కంటే వేరైనది కాదు. 'స్నేహము – వివేకము – ఉత్తమ బుద్ధి'లచే దానిని వశం చేసుకోవాలి..." అని మనకు శాస్త్రములు బోధిస్తున్నాయి. చైతన్యము యొక్క స్వయంకల్పనయే ఈ మనస్సుకు మూలము. సాధన–ఉపాసనలు కొనసాగుచుండగా, ఈ మనస్సు తన యొక్క మనోరూపమును త్యజించి "చైతన్య మాత్రము"గా శేషించుచున్నది. తత్త్వజ్ఞానసిద్ధిని ప్రసాదించి, మరుక్షణం తాను అదృశ్యమగుచున్నది.

శాస్త్రదృష్టిచే ఈ జీవితము అనే గని పరిశీలించబడగా, సౌభాగ్యవశంచేత, "మనస్సు యొక్క స్వభావమునకు సంబంధించిన సమాచారము" అనే మణి ఈ జీవునికి లభిస్తోంది. అట్టి ఈ మనస్సు 'ఆచార్యుల పాఠములు – సహపాఠకులతో కూడి చేయబడిన విచారణ' అను వాటి సహాయం చేత స్వానుభవ పర్యంతము (upto one's own absolute sense of experience) విచారించబడగా 'నిధిధ్యాస' అనే ఉత్తమ కార్యక్రమం ప్రాప్తిస్తోంది. అప్పుడు ఈ మనస్సు జ్ఞానంచే సుప్రబోధం అగుచు సప్తభూమికలను అనుశ్రుతం చేసుకుంటోంది. అప్పుడు మిక్కిలి ప్రశాంతతో శోభించుచు లోక కళ్యాణకారకమే అవుతోంది.

సరిదిద్దబడుచున్న మనస్సు - ఈ మనస్సును మనం సరిదిద్దుకున్నామా, ఇక ఇది 'సాధన చతుష్టయం' మొదలుకొని తత్త్వసాక్షాత్కారము వరకు ఉత్తమ కర్మలను మనచేత నిర్వర్తింపజేస్తుంది. 'జన్మలు' అనే అత్యంత ప్రాచీనమైన వృక్షాన్ని మొదలంట ఖండింపజేస్తూ, నిరతిశయానందమును ప్రసాదించుచున్నది. ఇది తనకు తానే సమర్పించుకొని ఈ జీవునకు 'ఆత్మభావన' అనే ఒక గొప్ప ప్రయోజనమును ప్రసాదించుచున్నది.

కనుక ఓ సర్వజనులారా! మహత్తరమై ఈ మనస్సును చక్కగా నియోగించండి. అప్పుడు 'ఆత్మోద్ధరణ' ప్రసాదించుటలో ఇంతకు మించిన శ్రేయోదాయకమైన దంటూ ఇంకేదీ ఉండదు. బురదతో నిండిన కాళ్ళతో ఎవరైనా ఇంటిలోకి ప్రవేశిస్తారా? మీ మనస్సులను 'వివేకం' అనే జలంతో పరిశుద్ధపరచుకోకుండా ఈ దృశ్యం నుండి ఆంతరంగంలోకి ప్రవేశిస్తే, దుఃఖాదులే తారసపడతాయి సుమా!

మనస్సే బంధము.... మనస్సే మోక్షము - ఓ రామచంద్రా! వివేకరహితులగువారు, మూర్ఖులు మాత్రమే అనేక ఉత్పాతములతో కూడి ఉన్న ఈ సంసారభూములందు సంచరిస్తూ సుదీర్ఘమైన ప్రయాణాలు చేయటానికి ఉద్యుక్తులౌతున్నారు. నీవు మాత్రం వివేకయుక్తుడవు అయి, ఈ సంసారమునందు చిక్కకుండేందుకే యోచించు. భయంకరమైన వ్యాధి వచ్చి పడుతుంటే, దానికి చికిత్స గురించి యోచించకుండా ఎవరైనా ఉంటారా? ఓ రామా! అనేక అనర్థములు

సంసార మాయాముదితామ్ అనర్థశతసంకులామ్ ।
మా మహామోహమిహికామ్ ఇమాం త్వమవధీరయ ॥ (సర్గ 24, శ్లో. 17)

తనయందు ఉంచుకొని, నీ ముందు కపటంగా వ్యక్తమగుచున్న ఈ సాంసారికమాయను ఉపేక్షించవద్దు.

"దామ-వ్యాళ-కటన్యాయము" అనే మూర్ఖత్వం పొందవద్దు.

"భీమ-భాస-దృఢన్యాయము" ను స్వీకరించి వివేకివి కమ్ము.

అప్పుడు 'దుఃఖరాహిత్యము' అనునది నీ చేతిలోని విషయమే అవుతుంది. 'ఈ దృశ్య భూతమగు శరీరమే నేను' అను రూపముగల మిథ్యానిశ్చయమును పూర్తిగా త్యజించు. ఈ మిథ్యా వస్తువులన్నింటికీ భిన్నమైనట్టి 'సత్యము' అగు ఆత్మవస్తువు ఆశ్రయించు. నీవు రావచ్చు... పోవచ్చు... తినవచ్చు... తిరుగవచ్చు... అయితే సర్వదా అమనస్కుడవై ఉండు. ఎట్టి బంధమున తగుల్కొనవద్దు.

అప్పుడు నీవు ముక్తుడవే అవుతావు.

❖❖❖

IV. దామ - వ్యాళ - కటన్యాయం

1. శంబరాసుర సృష్టి

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! "ఈ ప్రపంచమునందు విహరిస్తున్న అనేకమంది జనులకు శాంతిని ప్రసాదించేది ఎట్లా?"... అను లోకపిత భావమును నీవు కలిగియున్నావు. శమదమములు నీయందు ఉన్నాయి. మోక్షము లక్ష్యముగా కలిగియున్న మహాశయుడవు. అట్టి నీకు దామ-వ్యాళ-కటన్యాయము ఉచితము కాదు సుమా! కనుక భీమ భాస దృఢ న్యాయము నందు సుస్థితుడవై, శోకరహితుడవై ఉండాలి. అదియే ఉచితం.

శ్రీరాముడు : హే మహర్షీ! ఈ సంసారమును విస్తరింపజేసుకుంటూ అనేక దుఃఖములను ఆహ్వానించుకుంటున్న మమ్ములను మీ వాక్యములు సముద్ధరిస్తున్నాయి.

"దామ-వ్యాళ-కట న్యాయము" అనుసరించవద్దని మీరు మరల మరల హెచ్చరిస్తున్నారు కదా! మీరు చెప్పిన రెండు న్యాయములు ఏమిటో వివరించండి. 'భీమ భాస దృఢ న్యాయం' మమ్ములను ఎట్లా శోకరహితులుగా చేస్తుంది? రెండు న్యాయముల గురించి సవిస్తరంగా చెప్పటం చేత మేము ప్రబోధితులం కాగలం. సక్రమమైన మార్గమును ఎన్నుకుంటాం.

శ్రీ వసిష్ఠ మహర్షి : సరే ముందుగా "దామ వ్యాళ కట న్యాయం" అనే పదప్రయోగం వెనుక గల ఇతిహాసం చెపుతాను. విను.

దామ వ్యాళ కటులు - ఒకప్పుడు పాతాళలోకమును 'శంబరాసురుడు' అను పేరుగల దైత్యరాజు పాలిస్తూ ఉండేవాడు. మాయను కల్పించుటలో అతనితో సమానమైన మాంత్రికుడు మరొకడు లేడు. తన మాయచే ఆకాశమునందు నగరములను, సుందరమైన ఉద్యానవనములను నిర్మించి, తన జాతి వారికి ఇస్తూ ఉండేవాడు. కృత్రిమంగా సూర్యచంద్రులను నిర్మించి, తద్వారా ఋతువులను నియమించి స్వజనులకు ఆహ్లాదం కలిగిస్తూ ఉండేవాడు. అతని పాలనలో దానవకులం అనేక ఐశ్వర్యములతో తులతూగుతూ ఉండేది.

అతని అంతఃపురంలో అప్సరసలను మించిన అందంగల స్త్రీలు మధురంగా గానములు చేస్తూ ఉండేవారు. అతని క్రీడావనంలో సృష్టిలో మరెక్కడా లభ్యంకాని చిత్రవిచిత్రములైన వృక్షములు, పూతీగలు ఉండేవి. అతడు "కర్తని" అనే యంత్రము కలిగి ఉండి, ఇంద్రుడిని కూడా అత్యంత భయపెట్టుతూ ఉండేవాడు. క్రీడ కొరకు రచించిన మట్టి శివుని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేసి ఆ శివుని సహాయంతో చక్రధరుడగు విష్ణుభగవానుని కూడా ఓడిస్తూ ఉండేవాడు. ఒక సమయంలో అతడు ఆకాశమునందు తన లోకవాసుల కొరకు నూరు చంద్రులను సృష్టించి పరవశింపచేశాడు.

మాయతో ఐరావతం సృష్టించుకున్నాడు. అది ఇంద్రలోక ఐరావతం కంటే వేలరెట్ల తేజస్సుతో వెలుగొందేది. సమస్త సంపదలచే, సర్వైశ్వర్యాలతో, ఎవ్వరినైనా సరే జయింప గలిగిన వాడై విరాజిల్లుతూ ఉండేవాడు. కఠినమైన శాసనములతో సామంత రాజులను పాలిస్తూ ఉండే వాడు. భయంకర ఆకృతిగల శంబరాసురునికి దేవతలను కూడా నిర్జించివేయగల గొప్ప సైన్యం ఉండేది.

అయితే ఆ రాక్షసుడు ఎటైన వెళ్ళి ఉండటం జరిగినప్పుడో, లేక అతడు ఆదమరచి దీర్ఘకాలంగా నిదురిస్తున్నప్పుడో ఆ ఏమరపాటు సమయమును ఉపయోగించుకొని దేవతలు తమ మాయాప్రయోగంతో అనేకమంది శంబరుని అనుచరులను దునుమాడుతూ ఉండేవారు.

శంబరుడు దేవతల కపటయుద్ధ ప్రయోగాన్ని గమనించాడు. అతడు గొప్ప మాయావి కదా! “ఇప్పుడేం చేయాలి?”... అని బహుతీవ్రంగా యోచించి ఒక ఉపాయం పన్నాడు. సముద్రము తరంగమును ఉత్పన్నం చేస్తుంది చూచావా? అట్లా అతడు చపలబుద్ధి గలవారు, వీరులు అయిన కొందరు రాక్షస సైనికులను సృష్టించాడు. వారిపై అజమాయిషీకి ముగ్గురు సేనాపతులను సృష్టించాడు. కాని దేవతలు మంచి సమయం చూచి, శంబరాసురుడు ఏమరుపాటుగా ఉన్న సమయంలో ఆ సేనాపతులను సైన్యమును కూడా సంహరించారు.

ఈ మాటు శంబరునకు చాలా కోపం వచ్చింది. “ఈ దేవతలను అంత తేలికగా వదలి పెట్టకూడదు. వీరిని, వీరు నివసించే స్వర్గమును సర్వనాశనం చేయవలసిందే” – అని నిశ్చయించు కున్నాడు. తన బలగంతో అమరావతిపై దండెత్తటానికి బయలుదేరాడు. ఈ వార్త ఎట్లాగో దేవతల చెవుల వరకు వెళ్ళింది. శంబరాసురుడు అమరావతి ప్రవేశించకముందే దేవతలు స్వర్గమును వదలి ఎక్కడో దూరప్రదేశానికి పారిపోయి తలదాచుకున్నారు. స్వర్గలక్ష్మి క్షుద్రదేవతా సమూహం చేత ఆక్రమించబడి రోదన చేయసాగింది. అక్కడి అప్సరసలు కన్నీరు కార్చారు. శంబరుడు స్వర్గం లోని సుందరమైన వస్తువులన్నీ తన వెంట ఎత్తుకుపోతూ అమరావతిని శూన్య ప్రదేశంగా మార్చాడు. పట్టణమంతా తన సైనికులచే తగులబెట్టించాడు. భీకరంగా నినాదాలు చేసుకుంటూ స్వస్థానం అయినట్టి పాతాళలోకం చేరాడు.

ఈ విధంగా దేవ–దానవుల మధ్య వైరం అధికం కాసాగింది. దేవతలు స్వర్గమును వీడి ఎక్కడెక్కడో రహస్య ప్రదేశాలలో దాగుకొనవలసివచ్చింది. ఆ తరువాత దేవతలంతా ఒక రహస్య ప్రదేశంలో సమావేశమై గొప్ప వ్యూహమును రచించి, ప్రయత్నపరులు అయ్యారు.

అప్పుడు శంబరాసురుడు “మొండి–క్రోధ–ధృముడు” అనే ముగ్గురు సేనాపతులను సృష్టించాడు. శంబరుడు తపస్సుకు వెళ్ళిన సమయం చూచి, మొండి–క్రోధ–ధృముడు అను పేర్లు గల ముగ్గురు సేనాపతులను దేవతలు హతమార్చివేశారు. శంబరుడు వచ్చేసరికి అక్కడ కనబడ కుండా, అదృశ్యమైపోయారు. అప్పుడు శంబరాసురునికి భలే కోపం వచ్చింది...!

శంబరాసురుడు: ఓ కీటకామాత్ర జీవులగు దేవతలారా! నేను ఏమరుపాటుగా ఉండటం చూచి నా సేనాపతులను సంహరిస్తారా? నేను వచ్చేసరికి పిరికివాళ్ళై పారిపోయి, నాకు తెలియని చోట

దాగారు కదూ? సరే! ఈ మాటు నా మహత్తరమగు మాయా శక్తిచే గొప్ప సేనాపతులను ముగ్గురిని సృష్టిస్తాను.

ఇట్లు పలికి, అప్పటికప్పుడే రాక్షసజన సృష్టికి సంబంధించిన మంత్రం ఉచ్చరించ నారంభించాడు. తత్ సంబంధించిన తంత్రం నిర్వర్తిస్తూ ఇట్లు పలికాడు.

శంబరాసురుడు : నాచే సృష్టించబడుచున్న ముగ్గురు సేనాపతులారా! మీరు గొప్ప తెలివి తేటలు గలవారు, గొప్ప యుద్ధ విశారదులు అగుదురు గాక! రూపరహితుడగు కాలుడు మూర్తిమంతుడైతే ఎంత భయంకరంగా ఉంటాడో, మీరు అంత బీభత్స స్వరూపులై ఉండెదరు గాక! అతి బలశాలురు, మాయా శక్తి సంపన్నులు అయి ఉండెదరు గాక! ఒక్కొక్కరు ఒక పర్వతం వలె గొప్ప శరీరములు కలిగి ఉంటారు. మీ స్వభావములను అనుసరించి మీకు ఈ పేర్లు పెడుతున్నాను–

1. దాముడు = ఎంతటి శత్రువులనైనా సరే, అణచివేయగలిగినవాడు.
2. వ్యాళుడు = సర్పమువలె ఆక్రమించువాడు.
3. కటుడు: శత్రువుల సర్వశస్త్రాస్త్రముల నుండి స్వసైన్యమును రక్షింపగలిగినవాడు.

❖

ఆ ముగ్గురికి ఇతఃపూర్వపు జన్మలు గాని, కర్మలు గాని లేవు. ఇదే వారి యొక్క మొదటి జన్మ. అందుచేత వారి యందు 'రాగము–ద్వేషము–అహంకారము–మమకారము' – అనేవి లేనే లేవు. వారు 'చేతనము' అను ధర్మము మాత్రము కలిగి ఉండేవారు. భయం గాని, అభిమానం గాని లేవు. "మరణిస్తామేమో! పారిపోదాం" అను వికల్పము వారియందు లేనేలేదు. "చిన్మాత్రము యొక్క సన్నిధానం మాత్రంచేత దేహము ప్రవర్తించుట" అను రాగ – కౌతుక రహితమైన ప్రతిస్పందన మాత్రం వాళ్ళు కలిగియున్నారు. చూచావా రామా! 'కర్మజీవుడే' అయివున్నట్టి ఆ శంబరాసురుడు తన కౌశల్యం చేత 'సంకల్పవృత్తి'ని హస్తలాఘవంగా ఉపయోగించాడు. అంతర్యామియగు శుద్ధ చైతన్యమును 'భావన'చే ఆరాధించుటచే ఆ దామ – వ్యాళ–కటులు ఉత్పన్నమైనారు.

శ్రీరాముడు : అతనిచే వాళ్ళు ఎలా కల్పించబడ్డారు. అది అతనికి ఎలా సాధ్యం?

శ్రీ వసిష్ఠ మహర్షి : వివరంగా చెప్పాలంటే, అతడు తపస్సుచే సాధించియున్న ఏకాగ్రత చేతనే సుసాధ్యమగుచున్నది. అతడు దృఢమైన చిత్తంతో ఈ విధంగా 'సంకల్పం' చేయటం జరిగింది.

"అంతర్యామి, చైతన్యస్వరూపడను అగు నేను చైతన్యమే స్వరూపముగా కలిగియున్న విలక్షణ మైన రూప, స్వభావాలు గల ముగ్గురు రాక్షసయోధులను సంకల్పిస్తున్నాను. అట్లు నాచే సృష్టించ బడుచున్న ఈ ముగ్గురు గొప్ప లక్షణములు, శక్తి యుక్తులు కలిగియుండెదరు గాక! సాక్షి చైతన్యం చేత ఉత్తేజితులై రాక్షస విజయం, దేవతల అపజయం అనే లక్ష్యం కలిగి ప్రవర్తించెదరు గాక!"

ఇట్టి ఆ రాక్షసుని సంకల్పశక్తియే ఆ ముగ్గురు సేనాపతుల జన్మలకు కారణమైనది.

ఆ దామవ్యాళకటులకు "మేము భోగములు పొందాలి" అనే ఆశయాలు లేవు. ఉత్పన్నమైన ఆ ముగ్గురు కాకతాళీయన్యాయంచేత రాక్షస సేనాపతులుగా తమకు ప్రాప్తించిన ఆయా క్రియలను

అంధపారంపర్యముగా అనుసరించసాగారు. గాఢనిద్ర పట్టేముందు బాలుడు ప్రక్కలో పడుకొని అసంకల్పితంగానే తన అంగములు కదలుస్తూ ఉంటాడు. చూచావా! వారు ముగ్గురు అట్లే వాసనారహితులై, ఆత్మాభిమానవర్జితులై ఆయాచేష్టలను ప్రకటిస్తూ ఉండేవారు.

దేవతలతో యుద్ధం - ఇంతలోనే దేవతలతో యుద్ధం చేయవలసివచ్చింది. ఆ ముగ్గురు యుద్ధభూమిలో ఉండగా " ఈ శత్రువులను మేమే చంపాం... మేము బలవంతులం... ఇది మా వలననే ఇట్లు జరుగుతోంది"... అను భావనయే పొందేవారు కాదు. వాళ్ళకి యుద్ధం చేయటమే తెలుసు. అంతేగాని, "అరే, ఈ శత్రువులు ఇంత అకస్మాత్తుగా మా పై వచ్చిపడ్డారే! ఇప్పుడు ఏమి గతి? మేము చస్తామేమో?"... అనే శంక వారిలో లేదు. అందుచేత యుద్ధభూమి నుండి ఎప్పుడు ఎందుకు పారిపోవాలో వారికి తెలియదు. జీవనము-మరణము, గెలుపు-ఓటమి, సంగ్రామం-విశ్రాంతి, ప్రతిష్ఠ-అప్రతిష్ఠ అనువాటి భేదమునకు సంబంధించిన మననము వారిలో ఏర్పడ లేదు. తమ పిడికిలి దెబ్బతో పెద్దకొండనైనా పిప్పిచేయగలమని వాళ్ళ నమ్మిక. పిరికితనమనునదే లేకుండా శత్రువులను ఎదుర్కొని నేలకూల్చారు. దేవతలు వారి ధాటికి ఆగలేకపోయారు. వెనుకకు తిరిగి పారిపోవటం ప్రారంభించారు. అది తెలిసి, శంబరాసురుడు పెద్దగా నవ్వుతూ "ఆహాఁ! నాచే రచించబడిన ఈ ముగ్గురు అసురుల రక్షణలో దానవజాతి కీర్తి ఇనుమడిస్తోంది కదా...!" అని గర్వం పొందాడు. "ఓ సేనానాయకులారా! నికృష్టజీవులు, మోసగాళ్ళు అయిన ఆ దేవతలను వదలకండి. వారిని అందినవారిని అందినట్లే మట్టుపెట్టండి" అని ఉసిగొలిపాడు.

దామ వ్యాళ కటులతో కూడిన దానవసైన్యం దేవతల వెంటబడింది. అప్పుడు దేవతల - రాక్షసుల సంగ్రామం ఆకాశంలోను భూమి మీదా ప్రళయంలాగా దుస్సహంగా జరిగింది. పర్వతాలు చూర్ణం కాసాగాయి. పరస్పరం ప్రయోగించిన శస్త్రాస్త్రముల ధాటికి దిక్కులు పిక్కటి ల్లాయి. 'ఘుర-ఝుర-భర' శబ్దములచే ఆకాశం నిండిపోయింది. మాయారచితమైనట్టి అగ్నివృష్టి, మేఘవృష్టి, పర్వతవృష్టి యుద్ధభూమిలో ప్రయోగించబడ్డాయి. మహాయోధులగు అనేకమంది ఆ యుద్ధంలో మరణించటం జరిగింది. కాని ఏం లాభం? అగ్నికి ఆజ్యం తోడైనట్లు, నేల కూలిన రాక్షస సైనికులు శుక్రాచార్యుని 'సంజీవని మహావిద్య'చే ఉజ్జీవితులయ్యారు. ఇంకేముంది? 'సిద్ధులు-సాధ్యులు' మొదలైనవారితో కూడిన సురగణం అసుర భయానికి చెల్లాచెదరైపోయింది.

❖❖❖

2. మమకారావిష్కరణ

ఆ విధంగా పారిపోయిన దేవతలంతా దానవుల దృష్టిలోంచి తప్పించుకొని ఎక్కడో ఒక రహస్య ప్రదేశంలో సమావేశమయ్యారు.

ఇంద్రుడు : ఓ దేవతలారా! మనం ఎంతటి ఘోరసంగ్రామమం చూచాము! మనలో అనేక మంది వీరులు మట్టికరిచారు. దాముడు మన పలాయనం చూచి సింహనాదాలు చేశాడు. వ్యాళుడు తన

కబంధహస్తాలతో దేవతాస్థానములను ధ్వంసం చేస్తున్నాడు. ఇక కటుడి భయంకరమైన యుద్ధ విన్యాసం వర్ణనాతీతం. వీరికి ఇంతటి శక్తియుక్తులు ఎట్లా వచ్చాయి? మనం వీరి ముందు నిలువ లేకపోతున్నామే! ఇక మన గతి ఏమిటి?

❖

దామ – వ్యాళ – కటులు విజయోత్సాహంతో సింహనాదాలు చేస్తూ దేవతల కొరకై ఎంత గానో వెతికి వేసారి 'పిరికిపందలు! ఎక్కడికి పారిపోయారో?' అని తలచారు. వారి జాడ కనుగొన లేకపోయారు. విజయోత్సాహంతో తమ ప్రభువు శంబరాసురుని వద్దరు వెళ్ళి తమ విజయ పరంపరలను విన్నవించుకున్నారు. పాతాళమంతటా ఆనందోత్సాహాలు మిన్నుముట్టాయి.

❖

రహస్య స్థావరంలో సమావేశమైన దేవతలు మిక్కిలి, ఖిన్నులయ్యారు. 'శంబరుని నిరోధించుటకు ఉపాయం ఏమిటి?" అని ఎంతో యోచించారు. ఉపాయమేదీ తట్టలేదు. "దిక్కు లేని వారికా భగవంతుడే కదా, గతి! అందుచేత మన పితామహుడగు బ్రహ్మదేవుని ప్రార్థిద్దాం" అని నిర్ణయించుకొని వారంతా భక్తితో పితామహునికి ప్రణామం చేశారు. క్షణంలో వారందరి మధ్యలో బ్రహ్మదేవుడు ప్రత్యక్షమైనాడు. అప్పుడా దేవతలు బ్రహ్మదేవునితో దామ–వ్యాళ–కటుల ఉత్పత్తి క్రమం గురించి, వాళ్ళు చేస్తున్న అనర్థముల గురించి పూసగ్రుచ్చినట్లు విన్నవించుకున్నారు. భగవంతుడగు బ్రహ్మదేవుడు సావధానంగా అంతా విన్నాడు. కొంచెము సేపు మౌనం వహించాడు. చిరునవ్వుతో దేవతా సైన్యమునకు ధైర్యం చెప్పుచూ ఇట్లు పలికాడు.

బ్రహ్మదేవుడు : ఓ దేవతలారా! కొంతకాలం తరువాత సర్వాత్మకుడగు విష్ణుదేవుని చేతులలో ఈ శంబరాసురుడు హతం కాగలడు. అంతవరకు మీరు వేచి ఉండక తప్పదు. అయితే ఈ లోగా ఈ దామ వ్యాళ కటులను నిరోధించటం ఎంతైనా అవసరం. అందుకు ఒకే ఒక మార్గం నాకు కనబడుతోంది. వారికి తమ దేహము పట్ల అభిమానము కలిగేటట్లు చేయాలి.

ఇప్పుడు మీరు వారితో యుద్ధం చేయటానికి రంగంలో ప్రవేశించండి. యుద్ధం చేస్తూ పారి పోతూ ఉండండి. ఆ విధంగా పదే పదే చేయండి. వారు అనేకసార్లు 'గెలుచుట' అను అభ్యాసానికి వశమవుతారు. క్రమంగా దురభిమానానికి, లోభానికి లోనవుతారు. ఒక అద్దంలో ముఖం ప్రతిబింబిస్తున్నట్లు వారి అంతఃకరణములో అహంకారం ప్రతిబింబించగలదు. ఎందుకంటే...

ఇప్పుడు మాత్రం వారియందు 'వాసన' అనునది కించిత్ కూడా లేదు.

"సుఖము, గౌరవము, ఆశ" అనునవి ఇప్పుడు వారియందు ఏర్పడుట లేదు. అందుచేత మీ బలపరాక్రమములు వారి ముందు కొరగాకుండా పోతున్నాయి. అహంకారము, మమకారము అనేవి లేని వారిని జయింప గలిగినది ఈ లోకంలో ఏదీ లేదు. వారిలో అహంకారము యొక్క ఛాయ ప్రవేశించిందా,.. ఇక వారిని మీరు సులభంగా జయించి వేయగలరు. నేలపైనగల గింజలను తినటానికి వెళ్ళిన పక్షులు వలయొక్క దారమునకు చిక్కుకుంటాయి చూచారా! ఈ

జీవులు 'వాసన' అను సూత్రపుతాడునందు చిక్కుకుంటున్నారు. 'ఆశలు' అను పాశములందు తగుల్కొని, క్షణంలో వశీభూతులగుచున్నారు. ఎవరియందైతే వాసనలు సంపూర్ణంగా నశించుచున్నాయో... ఇక వారిని నిరోధించగలిగేదేది? దేనిపట్లా కూడా అనురక్తి లేనివారిని కార్య విముఖులుగా చెయ్యలేము. సుఖముచే 'ప్రసన్నము' పొందక, దుఃఖముచే కృశించక ఉండేవారిని జయించుట దుస్సాధ్యమైన విషయమే. 'వాసన' అనే త్రాడుచే కట్టబడిన జీవుడు... అతడు మహానుభావుడైనా, శక్తిమంతుడైనా, అనేక విషయములు తెలిసినవాడు అయినా... చివరికి అతడు ఒక బాలునిచే కూడా జయింపవేయబడగలడు.

కాబట్టి బిడ్డలారా! "ఈ దేహేంద్రియాలే నేను. ఈ జనులు, ధనం... ఇవన్నీ నావి" మొదలైన కల్పనలు చేయువాడే సమస్త ఆపదలకు పాత్రుడు అగుచున్నాడు. ఈ దామ – వ్యాళ – కటులలో అట్టి కల్పనలు లేవు.

సర్వజ్ఞుడు, సర్వవ్యాపియు అయినట్టి ఆత్మతత్త్వమును గ్రహించకుండా "నేను పరిమితము – పరిచ్ఛిన్నము అయినట్టి ఈ దేహాదులకు, దేహముచే ఏర్పడుచున్న సంబంధములకు చెందిన వాడనే కదా! ఈ తదితరులు కూడా అట్టివారే" అని తలచువాడు మోహమును పొందుచున్నాడు. మూర్ఖత్వమును ఆశ్రయించు వాడగుచున్నాడు.

దేహాత్మ బుద్ధి కలిగి వర్తించువాడు 'జననము మరణము–బాల్యము–వార్ధక్యము' అనునవన్నీ తన స్వరూపముపై ఆపాదించుకుంటున్నాడు. అనంతము, అప్రమేయము అగు ఆత్మను "శరీర మాత్రం"గా కల్పన చేసేవాడు తనయొక్క ఆత్మను తానే అల్పమైనదిగా చూస్తున్నాడు.

ఓ దేవతలారా! ఈ మూడు లోకములలో కూడా 'ఆత్మ' కంటే వేరైన వస్తువేమున్నది? లేదు. కనుక 'ఆసక్తి' అను బంధాన్ని పొందుట అనుచితమే అవుతుంది. "అసలు ఈ సర్వదుఃఖాలకు మూలకారణమేమిటి?" అను ప్రశ్నను జ్ఞానదృష్టితో తర్కించినపుడు, అసద్వస్తువునందు సత్యత్వ బుద్ధి కలిగియుండి, అసత్ విషయములపై నమ్మకంతో వ్యవహరించుటయే" అని విజ్ఞులు గ్రహిస్తున్నారు.

ఈ దామ – వ్యాళ – కటులకు ప్రపంచము యొక్క స్థితి పట్ల "ఇది సత్యమే" అను బుద్ధి ఏ మాత్రం లేదు. అందుచేత వారిని మీ మామూలు బలపరాక్రమములతో జయించుట దుర్లభమే.

దేవతలు : పితామహా! మరి మా గతి ఏమిటి?

శ్రీ బ్రహ్మదేవుడు : మీరంతా ఒక పని చేయండి... మీరు ఓడిపోయినట్లుగా వారిముందు మరల మరల నటించండి. వారికి జయ – అపజయముల పట్ల, శరీర – మమత – అహంకారముల పట్ల అభిమానం, అభిజాత్యం ఏర్పడేటట్లు చేస్తూ పోండి.

ఇంద్రుడు : హే మహామతీ! అమరావతిని కోల్పోయి మేమంతా దీనులమయ్యాం. ఈ దీనత్వం తొలగేది ఎట్లా?

శ్రీ బ్రహ్మదేవుడు : సకల దుఃఖములకు కారణం దేహాత్మ బుద్ధియే. "ఈ నా దేహమునకు ఏమైనా అయినదా, అంతే... ఇక నా పని అయిపోయినట్లే"... అనునదే దేహాత్మబుద్ధి, మరియు దేహాభిమానం. అట్టి "అసత్య" మగు వాసన ఎవని అంతఃకరణమునందు ఉంటుందో, అతడు ఆ జనన-మరణ రూపమగు దీనత్వమునకు లోనగుచున్నాడని గ్రహించండి. అట్టి వాడు 'నేను జయించబడుచున్నాను" అను భావోద్రేకం పొందుచున్నాడు. "ఈ దేహమునకు విలక్షణమైన అప్రమేయమగు ఆత్మనే నేను" అను భావన ఒక దోమకు ఉన్నా సరే, ఆ దోమ సుమేరు పర్వతంవలె అచలంగా, అచంచలంగా ఉండగలదనుటలో ఏమాత్రం సందేహం లేదు.

ఏ వాసన ఎచట ఉంటుందో అది అచట స్థూలత్వం పొందుతూ ఉంటుంది.

'ధర్మి' ఉన్న చోటే ధర్మము, 'భావించువాడు' ఉన్నచోటే భావన ఏర్పడుచున్నాయి.

అందుచేత ఎవరెవరికి ఏదేది సంభవిస్తున్నా అదంతా భావన, వాసన, ధర్మము అను మూడింటినీ అనుసరించే ఉంటున్నాయి. నాయనా ఇంద్రా! కనుక, నీ దీనత్వమునకు కారణమేమో నీవే సూక్ష్మబుద్ధితో గ్రహించు.

ఇంద్రదేవా! ఈ దామ వ్యాళ కటులకు సంబంధించిన వర్తమాన విషయానికి వద్దాం. ఎట్లాగైనా సరే, వీరి యొక్క అంతఃకరణములలో "ఈ జయాపజయములన్నీ మావి. ఈ ప్రసిద్ధమై కనబడుచున్న దేహాదులే మేము" అను వాసన కలిగేటట్లు చేయాలి.

ఓ బిడ్డలారా! ఈ జీవుని యొక్క సమస్త విపత్తులు, సమస్త భావాభావదశలు 'తృష్ణ' అనే కంటకవృక్షము నుండి బయలుదేరుచున్నాయి. వాసనాతంతువులచే బద్ధులైన వారికి మాత్రమే "మేము దీనికి సొంతదారులము" అనే విపరీత జ్ఞానం ఉదయిస్తోంది.

వాసనలు వృద్ధి చెందుచున్న కొలదీ దుఃఖములు ప్రాప్తిస్తూనే ఉంటాయి.

వాసనలు సన్నగిల్లితే అది పరమసుఖమును ప్రసాదిస్తూ ఉంటుంది.

ధీరోఽప్యతి బహుజ్ఞోఽపి కులజోఽపి మహానపి ।
తృష్ణయా బధ్యతే జన్తుః సింహః శృంఖల యాయథా ॥ (సర్గ 27, శ్లో. 32)

ఒకడు గొప్ప ధీరుడు కావచ్చు... అనేక శాస్త్ర విషయాలు తెలుసుకొని ఉండవచ్చు, అనర్గళముగా అనేక శాస్త్రవాక్కులు ఉటంకిస్తూ ఉపన్యసించవచ్చు. గొప్ప కులములో జన్మించి ఉండవచ్చు, మహామహుడు కావచ్చు.... కాని ఏం లాభం? అతడు తృష్ణ, వాసనలకు వశమైనాడా – అల్పత్వము ఉండియే తీరుతోంది. "దేహం"అనే వృక్షంపైగల "హృదయకమలం" అనే గూటిలో ఈ "జీవుడు" అనే పక్షి ప్రవేశించి కిలకిలారవాలు చేస్తూ ప్రశాంతంగా ఉండగా, 'తృష్ణ' అనే వల క్రింద "ఇంద్రియ విషయాలు" అనే ధాన్యపు గింజలను చల్లి 'మాయ' అనే బోయవాడు చాటుగా నక్కి ఎదురుచూస్తున్నాడు. ఈ జీవులు అమాయకంగా ఆ వలపై వ్రాలుచున్నారు. ఇంకేముంది? మాయ అనే వేటగాడు మెడవంచి ఈ జీవులలో అనేకమందిని "దుఃఖ పరంపరలు" అనే బుట్టలో

కుక్కి ఉంచుచున్నాడు. ఒక పక్షి దారముచే బంధింపబడి వివశ అయినప్పుడు ఒక అజ్ఞానబాలుడు కూడా దానిని పట్టి అటు ఇటు ఈడవగలడు కదా! 'తృష్ణ' అనే త్రాడుచే బంధింపబడిన ఈ జీవుడు స్వల్ప సంఘటనలచే, చిన్న చిన్న మాటలచే కూడా ఎంతగానో వేసట చెందుచున్నాడే!

ఈ దామ - వ్యాళ - కటులలో అట్టి తృష్ణను తట్టి నిదురలేపారో, ఇక వారిని మీరు తప్పక జయించగలరు.

ఇప్పుడు ఈ శస్త్రాస్త్రములను ఉపయోగించి ఆ దామ-వ్యాళ -కటులపై ఎంతగా యుద్ధం చేయటానికి ఉపక్రమించినా, అదంతా వ్యర్థమే అవుతుంది. కాబట్టి ఏవైనా ఉపాయాలతో వీరి యందు వాసనావృత్తిని, అభిమానమును అధికం చేయండి. ఎందుకంటే మీ ఈ శత్రువులకు వర్తమానంలో 'స్త్రీ-ధన-ప్రియవస్తు-ప్రఖ్యాతి' వంటి శుక్రనీతి విశేషముల పట్ల ఆకాంక్ష లేదు. కేవలం యుద్ధము యొక్క అభ్యాసవశం చేత ప్రమత్తులై సంకల్పంచే. వారిని అహంకారమయ మగు వాసనలను ఆశ్రయించేటట్లు చేసి, తద్వారా వారి జయించడానికి ప్రయత్నించండి. ఎందుకంటే వాసనాబీజమే లేకుంటే, తదితరములైన ఉపాయాలు వారిపై ఫలించవు. పనిచేయవు.

ఇంద్రుడు : 'అహంకారవాసన' అంటే మీ ఉద్దేశమేమిటి?

బ్రహ్మదేవుడు : "ఆహాఁ! మేము ఎంతటి పరాక్రమము గలవారము! ఎంత తెలివిగలవారము! ఇతరుల కంటే మేమే గొప్పవారం! ఇంతటి గొప్పవారమయినట్టి మా కీర్తి - ప్రతిష్ఠలు ఇంకా ఎంతో ప్రకాశించుగాక! ఈ శరీరము, ఈ తదితరులు మా పట్ల చేయు స్తోత్రములు ఇట్లే మాకు ఉండు గాక!.... అనే మమకారం వారిలో వృద్ధి కావాలి. 'నాది' అనునది లేనిచోట అహంకారమే ఉండ జాలదని నిశ్శంకగా చెప్పవచ్చు. ఎప్పుడైతే, "మేము గొప్పవారము కదా!" అనే అభిమానం వృద్ధి చెందుతుందో, అప్పుడు మరుక్షణం "ఇట్టి గౌరవమన్ననలు మేము కోల్పోతామేమో!" అనే అధైర్యము, నిస్సత్తువ వెంటనంటి ఉంటాయి. అప్పుడు మీరు వారిని ఇతఃపూర్వపు రాక్షస సైనికులవలెనే నిర్జించివేయగలుగుతారు. వారు ముగ్గురు వాసనలను ఆశ్రయించిన మరుక్షణం వారి పరాజయమునకు, పతనమునకు నాంది పలికినట్లే.

అందుచేతనే సుజ్ఞానులగు ఉత్తములు వాసనలను త్యజించు ప్రయత్నంలో శాస్త్రాదులను ఆశ్రయిస్తున్నారు. విధి - విధానాదులను నిర్వర్తిస్తున్నారు.

కాబట్టి, దేవతలారా! అభ్యాసవశంచేత ఆ ముగ్గురు వాసనాసహితులైయ్యేంత వరకు యుక్తి పూర్వకంగా యుద్ధం చేయండి. "ఓడి పోవడం - పొగడటం"... అను ఉపాయాలతో సంసారదోష వ్యవహారనియుక్తులు అయ్యేట్లు చేయండి. వాసనాబద్ధులైన తరువాత వారే మీకు వశులు అవుతారు. వాసనలచే బద్ధులు అయినవారెవ్వరూ అజేయులై ఉండగలరా? లేనేలేదు. పరిస్థితులు - అతిత్వరలో వాసనాబద్ధులకు - అపజయము రుచి చూపటానికి సంసిద్ధమౌతూనే ఉంటాయి.

స్వవాసనా బలంచేతనే క్షణిక, విపరీతార్థ రూపమగు ఈ జగత్తు ఇంతటి ప్రభావము, దీర్ఘానుభవత్వమును పొందుతోంది సుమా!

ఈ జగత్తు వాసనారూపమే అయివున్నది! ఓ బిడ్డలారా! దేవతలారా! సర్వజనులారా! మీరంతా మీ వాసనలకు వర్తమానమునందే సరిఅయిన చికిత్సను ఆశ్రయించండి... అని హెచ్చరిస్తున్నాను. వాసనా బీజములను తొలగించుకొని, నిత్యవిజయులు కండి.

ఇట్లు పలికి భగవంతుడగు బ్రహ్మదేవుడు అంతర్ధానమయ్యాడు. దేవతలు ఆ చోటు వదలి తమ తమ స్థానములకు చేరారు.

❖❖❖

3. పునః యుద్ధం

బ్రహ్మదేవుని వాక్యములు మరల మరల పునశ్చరణ చేసుకుంటూ, దేవతలు తమ తమ రహస్య స్థానములలో కొంతకాలం విశ్రాంతి తీసుకున్నారు. ఒక శుభముహూర్తంలో యుద్ధ సన్నిద్ధులై దుందుభులు మ్రోగించారు. మరల దేవ–దానవ యుద్ధం ప్రారంభం అయింది.

మిక్కిలి భయంకరమైన ఆ యుద్ధం "ఆత్మ చైతన్యమున జగత్తురూపంలో వికారము ఇట్టి సంఘర్షణగానే ప్రారంభమవుతోంది కాబోలు" అన్నట్లుగా దుస్తరమై సాగింది. కొంతసేపు దేవతలు తమ మాయను ప్రయోగిస్తూ యుద్ధం చేస్తూ వచ్చారు. ఇంతలోనే పలాయనం చిత్తగించసాగారు. మరొకప్పుడు దానవులతో సంధి చేసుకుంటున్నారు.

ధైర్యంగా యుద్ధం చేయటం. అంతర్ధానం కావటం. శరణాగతి కోరటం.

ఈ విధంగా అనేక యుద్ధాలు జరిగాయి. మొదటి యుద్ధం 30 సంవత్సరములు జరిగింది. రెండవది ఐదు సంవత్సరములు, మూడవది పంద్రెండు రోజులు.

ఇంతలో ఆ దామ – వ్యాళ – కటులు, తదితర సైనికులు ఇట్లు యోచించసాగారు.

"ఆహాఁ! ఈ లోకప్రసిద్ధులైన దేవతా వీరులు కూడా మమ్ము "శరణు–శరణు" అంటూ వేడుకొనుచున్నారే! మంచిది. అవునులే... మా ముందు ఎవ్వరైనా సరే, ఎంతటివారు? వీరంతా ఎంత స్వల్పమైన వారు! మేము మహాపరాక్రమవంతులం. మాకు ఏవేవో వస్తువులను దానం చేస్తూ మా నుండి 'క్షమ'ను అర్థిస్తున్నారు కదా!"

❖

ఈ రీతిగా ఏదో మాత్సర్యముతో కూడిన అహంకారం అంతరంగమున ఎక్కడి నుండో బయలుదేరింది. అట్టి అహంకారము యొక్క దృఢాభ్యాసంచేత వారు క్రమంగా వాసనాగ్రస్థులయ్యారు. అనేక యుక్తులచే దేవతలు చేసిన ప్రయత్నములు వారిలో దంభమును, దర్పమును, అభిమానమును పెంపొందించసాగాయి.

అహంకారం నందు వారికి ఆత్మబుద్ధి ('నేను అహంకారమును' అను భావన) కలిగింది... "మేము గొప్పవారము." "ఈ గొప్పతనము మాకు ఎప్పటికీ ఉండుగాక!" "ఇదంతా అనుభవించుటకు మేము జీవించి ఉండలేకపోతే ఎట్లా...?" "మేము జీవించినంత కాలం ధనప్రాప్తి కలుగుగాక! ఈ దేవతలను ఇట్లాగే ఓడించుచు, వీరివద్ద అనేక వస్తుజాలములను

దానముగా పొందెదము గాక!" అని తలచసాగారు. క్రమంగా ఏదో తెలియరాని లోభము, అభిజాత్యము పునాదిగాగల దైన్యము, దీనత్వము వారియందు చోటు చేసుకున్నాయి.

మొట్టమొదట 'ఇది అవస్య ప్రవృత్తి' – 'ఇది నిషిద్ధ ప్రవృత్తి' (ఇది ఇట్లు ఉండుగాక – అది అట్లు ఉండకూడదు... అను ప్రవృత్తి)కి సంబంధించి కించిత్ వాసన ఏర్పడింది. "మా దేహము రోగరహితము, భోగసమర్థము అయితేనే కదా మేము కలకాలం లోక ప్రసిద్ధులమై ఉండగలిగేది!" అను మోహముతో గూడిన వాసనచే వారు గ్రస్థులయ్యారు. 'ఆశ' అను పాశమున బంధింపబడి క్రమంగా ఒళ్ళు దాచుకోవటం అలవాటు చేసుకోసాగారు.

ఒకప్పుడు అహంకారరహితులై భాసించిన ఆ దామ–వ్యాళ–కటులు ఇప్పుడు త్రాడును చూచి 'పాము' అని భ్రమించేవారి వలె, 'చావు వద్దు, బ్రతకాలి' అను రూపముగల ఒకానొక రాగమును, తత్సంబంధమైన అనేక కల్పనలను పెంపొందించుకున్నారు.

క్రొత్తక్రొత్త ఆశలు, తృష్ణలు చిగుర్చాయి. "ఆపాదమస్తకము మా ఈ దేహము సుస్థిరంగా ఉండేది ఎట్లా?" అనే నూతన వేదన వారిలో ప్రారంభమైంది. మా శరీరాలు బాగా ఉండాలి... ఈ ధనాదులన్నీ మా సుఖము కొరకే కదా..." అని అనుకుంటూ, అనుకుంటూ క్రమక్రమంగా బద్ధచిత్తులు అయినారు. వారి మునుపటి ధైర్యం కాస్తా కొంచంకొంచంగా క్షయించసాగింది. వాసనాసహితులవటం చేత శరీరబలం తగ్గటం ఆరంభించింది. ఇంతకు ముందు ఉండి ఉన్న పరాక్రమం, శత్రువులను సంహరించాలనే దీక్ష లోపించాయి. 'సమర్థత' సన్నగిల్లింది. 'దీక్ష' కొనసాగేచోట మాత్రమే 'దక్షత' కొనసాగుతుంది కదా!

అహంకారముతో కూడినయున్నట్టి వారికి, అప్పుడు, భయంకర సంసారము'ను ప్రాప్తింప జేసే స్త్రీ–అన్న–పాన–భోగములందు రాగము కౌతుకము లోభము హెచ్చింది. ఇక ముగ్గురిలో ప్రతి ఒక్కరు "వీడు ఎంతగా శ్రమిస్తాడు? కొంచెమే కదా! మరి నేను ఎందుకు శ్రమించాలి?" అను లోభమునకు సంబంధించిన సాపేక్షతను పొందసాగారు. మహోత్సాహమంతా నశించి "ఒకవేళ ఈ యుద్ధంలో చస్తామేమో?" అని మరల మరల అనుమానించసాగారు. కేవలం దేహరక్షణ మాత్రమే వాంఛించుచూ, మరణము పట్ల భయభీతులై ఉన్నారు. అప్పటి నుండి, ఇంధనము క్షీణించినప్పటి అగ్నివలె వారి బలం సన్నగిల్లింది. శత్రువులగు దేవతల ముందర నిలువలేక పోయారు. శరీరమునందు అక్కడక్కడ గాయాలు అవటం చూచి బెంబేలెత్తిపోయారు. వారు కూడా సామాన్య సైనికులవలెనే ప్రవర్తించేవారు.

కొంతకాలానికి దేవతల విజృంభణను తట్టుకోలేక దైత్యులంతా భయంతో ఆకాశము నుండి క్రిందకు పడ్డారు. అనేకమంది దానవుల శరీరాలు విచ్ఛిన్నం కాసాగాయి.

❖

ఇట్లు సైన్యమంతా నేలకూలటం, నశించటం, శంబరాసురుని దృష్టికి వచ్చింది. ప్రళయాగ్నివలె మండిపడుతూ 'ఆ దామ–వ్యాళ–కటులు ఎక్కడ...?" అని ఘీంకరించాడు. అయితే ఆ ముగ్గురు శంబరుని ఎదుటపడటానికి భయపడ్డారు. పాతాళంలోని 'నరకము'ను

పాలించు కొందరు సామంతులను వారు శరణువేడారు. అక్కడ! శరణాగతులై, అభయం పొంది, అక్కడి రాజకన్యలను వివాహం ఆడి రోజులు గడపసాగారు. అనేక దుష్టవాసనలను గ్రహించి దీర్ఘకాలం గడిపారు. "ఈమె నా ప్రియురాలు – ఇది నా ప్రభుత్వము"... అని తలచుచు, దృఢ బంధమున తగుల్కొనినవారై రోజులు గడపసాగారు.

నరకలోకమునకు అధిపతి యమధర్మరాజు. ఒకానొకరోజు ఆయన ఏవో మహానరక కార్యముల గురించి విచారించటానికి నిజేచ్ఛను అనుసరించి ఆ ప్రదేశానికి వచ్చాడు. అతడు నరక లోక చక్రవర్తి అని తెలియక సామాన్య సైనికుడని తలచి ఆ ముగ్గురు వినమ్రులు అవక పోగా... తిరస్కారభావంతో దూషించటం, ఎగతాళి చేయటం, గేలిచేయటం జరిగింది. అప్పుడా యముడు వారిని కనుసైగమాత్రంతో "మహారౌరవం" మొదలగు నరక భూములలో పడత్రోయించాడు.

అక్కడి రేరవ-వాయువులచే వారు దగ్ధం కావించబడ్డారు. ఈ జీవుడు శరీరము త్యజించినా అతని వాసనలు అతనిని విడువవుకదా! అంతరంగమునందలి క్రూరవాసనల ప్రభావం చేత ఒక కిరాతరాజు సేవకులుగా జన్మించారు. ఆ జన్మలోవారు "వధించుట-బంధించుట" అను హింసా పూరిత క్రియలు నిర్వర్తిస్తూ ఉండేవారు. ఆ తరువాత జన్మలో వాళ్ళు కాకులు అయ్యారు. అక్కడి నుండి గ్రద్ధలై పుట్టారు. ఆ తరువాత చిలక, కుక్క, మేక, కీటకము మొదలైన అనేక జన్మలెత్తారు. ప్రస్తుతం వారు కాశ్మీరదేవాలయంలో గల ఒక చిన్న చెరువులో చేపలరూపంలో నివసించు చున్నారు. బురదలో చిక్కి దీర్ఘకాలంగా ఉంటూ వారు మరణించుటలేదు. జీవించుటలేదు.

చూచావా? వారు అనేక జన్మపరంపరలను మరల మరల అనుభవించారు. వారి భవిష్యత్తులోకి తొంగిచూచినప్పుడు వారు ఇంకా ఏవేవో అనుభవించబోవుచున్నారని తెలుస్తోంది. సముద్రంలో తరంగాలవలె వాళ్ళు ఉత్పన్నమగుచున్నారు, నశించుచున్నారు. ఆ విధంగా సంసార తరంగమున చిక్కుకుని, వాసనాతంతువులచే ప్రేరితులు అగుచు ఆ ముగ్గురు ఏ మాత్రం శాంతిని పొందలేకపోవుచున్నారు. అందుచేత, రామా! "నీవు దామ – వ్యాళ – కట న్యాయం ఆశ్రయించ వద్దు" అని హెచ్చరించటం జరిగింది. వాసనల యొక్క దారుణమైన అనర్థమును అందరు గ్రహించటానికే ఈ దృష్టాంతమంతా నీకు చెప్పాను.

❖❖❖

4. 'అహమ్' కారము దేనికి సంబంధించినది?

శ్రీరాముడు : ఆహాఁ! అవివేకం చేత, అనంతమైన సంసార దుఃఖములను అనుభవించటానికే ఈ చిత్తము పరవళ్ళు త్రొక్కుతూ, 'నేను – నాది' అను ఆపదను గ్రహిస్తోంది కదా! ఆ దామ – వ్యాళ – కటుల గతి ఎంత చిత్రంగా పరిణమించింది! 'దేవతలు' అంతటి వారిని కూడా భయపెట్ట గలిగినట్టి శంబరాసురుని సైన్యమునకు సేనాధిపతులై ఉండటం ఎక్కడ?... బురద నీటిలో చిక్కి సూర్యతాపమునకు తపించే చేపల జన్మ ఎక్కడ...? అహంకార రహితమగు 'చైతన్య సత్వము'

యొక్క ఉత్తమ మహిమాతిశయము ఎచ్చట...? ఒక అడవిలోని ఆటవిక రాజుకు సేవచేస్తూ స్వల్పకార్యములను నిర్వర్తించు సేవకజనులవట మెచ్చుట? ఇచ్ఛ, వాంఛ, ఉద్వేగంలోని 'యుద్ధం చేయుట' అను ధర్మమును పాలించుట ఎక్కడ...? మిథ్యావాసనల ఆవేశముచే పరిగ్రహింపబడి దుష్టమగు అనేక సంకుచిత వ్యాపకములందు చిక్కుకొనుట ఎంతటి ఘోరమైన విషయం!

శ్రీ వసిష్ఠ మహర్షి : నిజమే! అనేక, శాఖోపశాఖలుగా విస్తరించియున్న ఈ 'సంసారవిషలత' అనేది 'అహంకారము' అను అంకురము నుండే విస్తరించి వ్యాపించుచున్నది. కనుక రామా! ఈ అహంకారమును హృదయము నుండి తుడిచివేయాలి.

అసలు ఈ అహంకారమును మిథ్యయే అయివున్నది. ఎందుకంటావా?

'యిదం' అను ప్రత్యయముచే శాస్త్రములు సూచిస్తున్నట్టి ఈ కనబడే 'దృశ్యము' జడమే కదా! దీనికి స్వయంప్రతిపత్తి ఎక్కడున్నది? ఇది 'అహంకారము' అను పదార్థమునకు సూచకం కాజాలదు కదా! కాబట్టి 'అహంకారము' దృశ్యమునకు సంబంధించినది... దృశ్యముచే ఏర్పాటు చేయబడుచున్నది.... అని అనటానికి వీలులేదు.

'చైతన్యము' ఇది సర్వమునకు సాక్షిరూపము అయివున్నది కదా! సర్వసాక్షిమాత్రము నందు అహంకారము ఘటిల్లుటకు అవకాశమెక్కడిది? కాబట్టి 'అహంకారము' అనబడేది అటు దృక్ (The perceiver) కు, సంబంధించినది కాదు.

కనుక 'అహంకారం' అనబడేది దృక్ (ఆత్మ) దృశ్యములకు (Object) కూడా సంబంధించినది కాదు. ఆరెండింటికీ భిన్నమే అయివున్నది. ఆ రెండు తప్పితే ఇక్కడ మరింకేమీ వాస్తవానికి లేదు. అందుకే... "అహంకారము అనేది ఉండటానికి స్థానమే లేదు..." అను నిశ్చయమును జ్ఞానులు ప్రవచిస్తున్నారు. అందుచేత, "అహంకారము అనబడేదేది ఎక్కడా లేదు... అను జ్ఞేయమును ఆశ్రయించి, సుఖస్వరూపడవు కమ్ము. లేనివస్తువగు అహంకారమును తొలగించుట ఏమిటి? అందుచేత, "నేను ఇంకా అహంకారమును తొలగించుకోవలసియున్నది" అనునది భ్రమచేతనే "అసంగతము – అనవసరము" అగు శ్రమగా ప్రాప్తించుచున్నదని గ్రహించు.

'పరమార్థము' (The highest essence of Self) యొక్క రూపము వాస్తవానికి ఆనంద మయము, త్రివిధ తాపరహితము అయివున్నది. అయినప్పటికీ, అహంకారము అనబడు భ్రమ యొక్క కల్పనచే ఆచ్ఛాదితమగుటచే 'లేదేమో' అను చమత్కారము కలిగించి, అదృశ్యరూపముగా కనబడుచున్నది. అనగా, ఈ జీవుని దృష్టికి .... "దోషరహితము, సర్వత్రా సర్వము నందు ప్రసరించియున్నది"... అగు స్వస్వరూపము దృశ్యమానమగుటలేదు. ఇంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం ఇంకేముంటుంది చెప్పు? జన్మరహితము, నామరూపరహితము అగు తనను తానే అతడు గ్రహించుటలేదు. గురువులమగు మేము వచ్చి "ఓయీ! జీవుడా! నీ రూపము ఇట్టిది" అని గుర్తు చేయవలసివచ్చుచున్నది. అయినా ఇతడు వినీ–వినకుండా పచార్లు చేస్తున్నాడు.

❖

ఆ ముగ్గురు దానవసేనానాయకులు 'అహంకారం' అనే పిశాచంచే పీడింపబడిన వారగుచున్నారు. కదా! వాస్తవానికి వారు దర్పణములోని ప్రతిబింబిత వస్తువులలాగా అసద్రూపులే అయివున్నారు. అయితే మాయ యొక్క మహత్యముచే సత్తాను పొందారు. ఏవేవో ఉపాధులలో ప్రవేశించారు. ఇప్పుడు చేపల ఉపాధులు పొంది ఒక మురికి గుంటలో తచ్చాడుతూ ఆకలికి అలమటిస్తున్నారు. వారి యాతనలు వర్ణనాతీతం.

శ్రీ రాముడు : మహాత్మా! ఆ ముగ్గురు దామ-వ్యాళ-కటులు శంబరాసురుని మనోకల్పనా రూపులే కదా! అసద్వస్తునకు 'ఉనికి'గాని, సద్వస్తువుకు 'లేమి' గాని సంభవించవు కదా!* మరి అసద్రూపులగు ఆ దామ - వ్యాళ - కటుల ఉనికి ఎట్లా ఏర్పడింది? ఎట్లా జన్మపరంపరాదులకు దారి తీసిందో నేను గ్రహించలేకున్నాను. ఇందలి చమత్కారమేమైయున్నదో వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నీవు చెప్పింది నిజమే. అసద్వస్తువుకు ఉనికి ఎక్కడా సంభవించదు. కాని అల్పము, అసత్యము అయినది ఒకానొక బృహత్ వస్తువుగా కనబడటం జరుగుతోంది.

ఇక అసలైన బృహత్ వస్తువు అత్యంత సూక్ష్మమై, దృష్టికి లభించనిదై ఉంటోంది. 'లేనిది' ఉన్నదానివలె, 'ఉన్నది' లేనిదానివలె అగుపడుచున్నాయి!

అసలు ఎప్పుడైనా ఎక్కడైనా ఏ అసద్వస్తువు సద్వస్తువుగా అగుచున్నదో చెప్పు? సద్వస్తువు సద్వస్తువుగానే ఉంటోంది. అసద్వస్తువు అసత్తే.

ఎటొచ్చీ వాటిని విడదీయుదృష్టిని అనుసరించి చీకటి - వెలుగులవలె జ్ఞాన - అజ్ఞానములు ఏర్పడుచున్నాయి.

శ్రీరాముడు : హే మహర్షీ! మరల నా సంశయమును చెపుతాను వినండి. మీరు, నేను, తదితర సభ్యులు ఇక్కడ ఉండి, ఈ సభలో ఒకానొక విషయం గురించి సంభాషించుకుంటున్నాం కదా! మనందరియొక్క 'సత్త' (Existence)ప్రత్యక్షముగా సిద్ధించుచున్నది.

ఇక ఆ దామ - వ్యాళ - కటులనే ముగ్గురు దానవసేనానాయకులు మాయచే కల్పించబడిన వారే కదా! కనుక వారు స్వప్నములో కనిపించే జనులవలె అసద్రూపులే మరి! అట్టి అసద్రూపులు అహంకారములను, జన్మపరంపరలను, స్వకీయమైన ఇచ్ఛను పొందటమేమిటో వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : మాయామయులగు ఆ ముగ్గురు దానవ సేనానాయకులు 'అసద్రూపులు' అనే మాట నేను ఒప్పుకుంటాను. అయితే ఇక్కడ ఒక చమత్కారం ఉన్నది. ఒకడు మృగతృష్ణలో "ఇది జలమే కదా" అను అనుభూతి పొందుచున్నాడనుకో... అతనికి అక్కడ జలము ఉన్నట్లే కనిపిస్తోంది కదా! ఆ రీతిగానే వాళ్ళు అసద్రూపులు అయినప్పటికీ సత్యంవలె భాసించుచున్నారు.

---

* **నాఽసతో విద్యతేభావో నాఽభావో విద్యతేసతః ।**

'సత్త'కు 'ఉండకపోవడం' అనేది లేదు. 'అసత్తు'కు ఉనికి లేదు. మాయ = యామా = ఏదైతే లేకయే ఉన్నదో ...

అదే విధంగా సురులు, అసురులు, దానవులు – వీరంతా మిథ్యా రూపముగానే భాసిస్తున్నారు. వారంతాయే కాదు, నీవు, నేను, తదితర సభ్యులు... మనమంతా కూడా ఈ జీవరూపము దృష్ట్యా మిథ్యారూపముగానే విజృంభిస్తున్నాము, పోవుచున్నాము, వచ్చుచున్నాము. 'నేను రాముడను' అను వ్యష్టిత్వమునకు సంబంధించిన భావన, 'నేను వసిష్ఠుడను' అనబడు శరీరభావన కూడా మిథ్యారూపములే అయివున్నాయి.

శ్రీరాముడు : ఈ "నేను – మీరు – తదితరులైన ఇక్కడి సభికులు"... అవన్నీ వివిధ రీతులుగా అనుభూతములై ప్రాప్తిస్తున్నాయి కదా! మరి ' ఇవి లేవు' అనునది ఎట్లు సమంజసము?

శ్రీ వసిష్ఠ మహర్షి : "స్వప్నమునందలి స్వమరణము" అను దృష్టాంతమును మరల ఇక్కడ ఉపయోగించి చెప్పుచున్నాను, విను. ఒకడు అప్పుడే నిదురలేచి ప్రక్కవానితో, "మిత్రమా! నాకు ఇప్పుడు ఒక దీర్ఘమైన కలవచ్చిందోయ్! అందులో నేను చనిపోయాను. ఒక నలుగురు వ్యక్తులు నన్ను మోసుకుపోతున్నారు...." అంటూ ఉన్నాడు. వెంటనే ఆ ప్రక్కవాడు "అట్లాగా! బాగున్నది. అయితే, స్నేహితుడా, ఆ స్వప్నం ఎవరికి? అదంతా ఎవరి కల్పన?" అని ప్రశ్నించాడు. అప్పుడు మొదటివాడు, "భలేవాడివేనయ్యా! అది నా స్వప్నమే... అందుచేత నా కల్పనయే" అన్నాడు. ఇక రెండవాడు, "నీ యొక్క కల్పనలో, నీవే చనిపోతే ఇక స్వప్నం ఎవరికి? స్వప్నమే ఉండజాలనప్పుడు ఆ నలుగురు మనుష్యులు ఎవరు?" అని విశ్లేషణము చేయ ప్రారంభించాడట!

అట్లాగే, ఈ కనబడే అనేకమంది జీవులు, అనేక శరీరములు అను రూపమున ఉండి ఉంటున్నదంతా మిథ్య, అసద్రూపము అయి ఉన్నాయి.

స్వప్నమునకు సంబంధించినదే మరొక దృష్టాంతము చెపుతాను. విను. ఒకడు తన కలలో ఎప్పుడో చనిపోయిన తన బంధువును చూచాడనుకో... ఆ బంధువును 'చూచుట' అను అనుభూతి అతనికి సత్యముగానే ప్రాప్తిస్తోంది కదా! అయినాకూడా అతడు చూచినది అసద్రూపమునే కదా! అట్లాగే, 'అతడు మరణించాడు' అను జ్ఞానము కూడా అసద్రూపమే అయివున్నదని ప్రజ్ఞా వంతులగు జ్ఞానులు గ్రహించుచున్నారు. ఎందుకంటావా? ఈ కనబడే జగత్తు ఇందలి సంబంధ – బాంధవ్యములచే ఏర్పడు ప్రియాప్రియములు 'మిత్ర అమిత్రములు ఇవన్నీ స్వప్నమాత్రము, మాయామాత్రమే అయివున్నాయి.

"ఈ జగత్తు సత్యమే" అను దృఢనిశ్చయంగల జీవుడు మాత్రం ఇందులోని నిత్యానిత్యముల చమత్కారమును గ్రహించలేకపోతున్నాడు. కళ్లు మూసుకున్న వారు ఎదురుగా ఉన్నదేదీ చూడనట్లు, పరమ మూఢత్వం వహించినవాడు "మార్పు చెందుచున్నది; మార్పుచెందనిది" అను రెండింటినీ విడదీయలేకపోతున్నాడు.

'పరమార్థ విచారణ' అనే అభ్యాసం లేకపోతే ఈ జగత్తుకు సంబంధించిన... "ఇదంతా వాస్తవమే"... అను అనుభవం అంత తేలికగా తొలగదు. తత్త్వవిచారణ లేనివాడెవ్వడూ వాస్తవ మేమిటో గ్రహించలేకపోతున్నాడు. అట్లు నిత్యానిత్యవివేకము పొందుటచే లభించు ప్రయోజన

మేమిటో గుర్తించలేకపోతున్నాడు. అందుచేతనే..."బ్రహ్మము సత్యము, జగత్తు మిథ్యయే" అనేది ప్రతిపాదించ బడుచున్నప్పుడు అజ్ఞాని అపహాస్యంగానే గాంచుచున్నాడు.

ఒకడు మత్తుగా కల్లు తాగి ఉన్నాడు. మరొకడు ఎట్టి మత్తుపానీయం సేవించలేదు. ఈ ఇద్దరి యొక్క ప్రపంచ దర్శనంలో మేళవం లభిస్తోందా? లేదు. అంధకారం – ప్రకాశాలకు, ఛాయ – ఎండతాపములకు ఐక్యత సిద్ధించదు కదా! అట్లాగే జ్ఞాని – అజ్ఞాని ఒకే ప్రదేశమున ఉన్నప్పటికీ, వారి దృష్టి ఏమాత్రం ఏకత్వము పొందుటలేదు. ఒక శవమును చూచి, "ఓ శవమా! కాసేపు అటూ ఇటూ నడువవచ్చును కదా!" అంటే నడుస్తుందా? పిలిస్తే పలుకుతుందా? లేదు. అజ్ఞాని ముందు ఆత్మ – అనాత్మ విశ్లేషణ అనేకసార్లు "చెవిటివాని ముందు శంఖానాదమే" అగుచున్నది. అతడు సత్యమగు సాక్షి స్వరూపమునందు నిలకడ పొందలేకపోవుచున్నాడు. మనస్సు, బుద్ధి మొదలైన వాటి రూపములో బాహ్యాభ్యంతరములందు ద్వైత ప్రపంచము యొక్క అనుభూతినే అవిచారణపరుడగు జీవుడు పొందుచున్నాడు. ఎంత బోధించినప్పటికీ అతడు తన అంతరంగంలో ద్వైత ప్రపంచాన్ని నిషేధించలేక పోవుచున్నాడు.

"ఈ జగత్తంతా బ్రహ్మమే" అనే కథనం అజ్ఞానిపట్ల ఏమాత్రం యోగ్యం అగుట లేదు. ఒకడు తపస్సు, బ్రహ్మవిద్య యొక్క అభ్యాసం, ఉదార గుణములు... మొదలైనవి ఆశ్రయించక పోతే సంసారదృష్టి ఉండనే ఉంటుంది. "జగత్తుసత్యమే"... అనునది అనుభూతమొనర్చుకొనువాని ముందు బ్రహ్మం గురించిన వాక్యాలు ఎట్లా వికసిస్తాయి చెప్పు? కనుక, కొంచమైనను జ్ఞానం గల వానికి మాత్రమే "ఈ జగత్తు మిథ్య, ఇదంతా బ్రహ్మమే అయివుంది" అనే కథనం శోభిస్తోంది.

అదే విధంగా ఒక పూర్ణజ్ఞానికి అనేక చర్చలతో కూడినట్టి ఈ విధమైన బోధ అసంగతమే అవుతోంది. "అహంకారమే అసత్యమైనది" అని ఎరిగిన తరువాత అట్టివానికి ఇక దృష్టాంతములతో కూడిన 'బోధ' ఎందుకు? అందుచేత, మార్గమధ్యంలోని ముముక్షువు యొక్క ఉపయోగము కొరకే ఈ సంవాదములు, ఈ శాస్త్రప్రవచనములు ఉద్దేశించబడి ఉంటోంది.

శ్రీరాముడు : జ్ఞాని ఈ దృశ్యమును చూస్తున్నప్పుడు దీనినంతటినీ అతడు ఎట్లా, ఏవిధంగా, ఏరూపంగా అవగాహన చేసుకుంటున్నాడు?

శ్రీ వసిష్ఠ మహర్షి : జ్ఞాని యొక్క అనుభవంలో ఈ సర్వము ద్రష్టయగు తనతో సహా... బ్రహ్మమే అయి ఉంటున్నది. ఇక అతని స్వానుభవము నందు "ఇది పరిహసింపతగ్గది, పరిత్యజించ తగ్గది.... అనునది ఏదీ ఉండుటలేదు సర్వము బ్రహ్మము నందు స్వభావసిద్ధముగానే ఏర్పడి ఉంటున్నప్పటికీ, తరంగములన్నీ జలమే అయినట్లు ఇక్కడ బ్రహ్మముకంటే వేరుగా ఎక్కడా ఏదీ ఉండదని ఎరుక కలిగి ఉంటున్నాడు. అతడు ఏదీ గ్రహించదు. త్యజించదు.

"పరమాత్మ కంటే వేరుగా నేను ఏమియు కాను. 'బంగారము'నకు 'ఉంగరత్వము' అనేది ఒక ప్రతీతి (Something popular but not true) మాత్రమే! సాక్షిస్వరూపుడనగు నా యందు అహంకారము యొక్క ఉనికి కూడా మిథ్యే"... అని జ్ఞాని సుస్పష్టముగా గ్రహిస్తున్నాడు. జల

తరంగమును చూస్తూ, "ఇది సువర్ణమై ఉండవచ్చు" అని ఎవడైనా భావిస్తాడా? అట్లే జ్ఞానికి ఈ జగత్తుపట్ల సత్యత్వబుద్ధి కలుగుటలేదు. అజ్ఞానికో... పరమార్థవస్తువగు బ్రహ్మము నందు 'అట్టిది ఏదీ లేదేమో' అను అభావము సంభవిస్తోంది. ఫలితమేమిటి? అజ్ఞాని 'మిథ్యయే' అగు అహంకారముతో తనను తాను.. మేఘములు ఆకాశమును కప్పుతున్నట్లుగా... కప్పివేసు కుంటున్నాడు. మిథ్యాహంకారమయుడు అగుచున్నాడు. జ్ఞానియో, 'సత్య-నిత్య-ఏకాత్మమయుడు' అగుచున్నాడు. వీరిద్దరి స్వభావం మరొక రీతిగా మరొకరెవరూ చేయలేరు.

❖

ఏ వస్తువు ఎద్దానియొక్క 'మయమై' ఉంటుందో అది ఆ రూపమునే చెందుతుంది గాని, మరొక రూపము కాదు.

ఇంతకీ 'రాముడు' అనగా ఎవరు? వసిష్ఠుడు అనగా ఎవరు? 'నేను ఈ శరీరమును' అనేది పిచ్చిమాట అని అనవలసిందే. అందుచేత, మనం ఈ శరీరములచే ఒకరికి మరొకరం ప్రత్యక్షంగా ఉన్నప్పటికీ ఒకరి వాస్తవమగు ఆత్మరూపం మరొకరి భౌతికమైన కళ్ళకు కనిపించేది కాదు. బాహ్యమునకు కనుపించే ఈ మన రూపాలు తత్త్వదృష్టికి సత్యమయినవి కావు. 'యుక్తి'ని అనుసరించి చూచినపుడు ప్రజ్ఞయే స్వరూపముగాగల మనము శరీరముగా మారినామా? లేదు. శరీరము మనకు ఉపకరణము మాత్రమే! మనము శరీరిగా శరీరమునకు వేరై ఉన్నాము. శాస్త్ర కారులు, జ్ఞానులు ఈ విషయం ధృవీకరించుచూ, "నాయనా! నీవు జన్మరహితుడవు... అఖండుడవు.. నిత్యుడవు... శాశ్వతుడవు..." అని ఎలుగెత్తి ప్రకటిస్తున్నారు.

❖

చిదాకాశము ఒక్కటే..."నిరంజనము (దోషరహితము), జ్ఞానస్వరూపము వేదాంత శాస్త్ర దృష్టిచే సత్యము"... అయి ఉన్నది. అది సర్వవ్యాపకము. మేము దానిని అనేక విచారణల ద్వారా పరిశీలించిన తరువాత "అది ఉత్పత్తి, వినాశరహితమగు సద్వస్తువు, సర్వజీవులయొక్క వాస్తవ రూపము"... అని గ్రహిస్తున్నాం.

ఈ జగత్తంతా శాంతము, శూన్యత్వ రహితము అగు ఆ సద్వస్తువుచేతనే పూర్ణమైయున్నది.

అట్టి ఆ చిదాకాశమునందే... అసత్యము, విరుద్ధరూపము అయినట్టి... ఈ సృష్టి అంతా భాసించుచున్నది. కంటి దోషముచే బాధపడుచున్న వానికి సహజంగానే ఆకాశంలో వెంట్రుకల వంటి ఆకారములు కనిపిస్తూ ఉంటాయి కదా! అజ్ఞానదృష్టి కలిగియున్నపుడు ఈ 'సృష్టి' అనేది పరమాత్మ యందు అనుభవమగుచున్నది. సత్యాత్మ ఏ భావపరంపరలు పొందుతుందో... అట్టి భావనను అనుసరించే 'అనుభవము' ఉంటోంది. అనుభవం ఎట్లా ఉంటే చిదాకాశము కూడా అట్లే శీఘ్రముగా సారూప్యమగుచున్నది. సత్యాత్మ యొక్క దృష్టి బలంచేతనే ఏదైనా ఎట్లైనా ఏర్పడు తుంది. "ఇదంతా అసత్యము' అనునది కూడా సత్యాత్మ దృష్టిచే క్షణములో ఏర్పడగలదు.

శ్రీరాముడు : స్వామీ! ఇందులో ఏది సత్యం? ఏది అసత్యం?

శ్రీ వసిష్ఠ మహర్షి :

న సత్యమస్తి నాసత్యమితి తస్మాజగత్త్రయే ।
యద్యథా వేత్తి చిద్రూపం తత్తథోదేత్య సంశయమ్ ॥ (సర్గ 31, శ్లో 36)

ఈ మూడు లోకములలో "సత్యమైనది' గాని 'అసత్యమైనది' గాని ఏదీ లేదు. అయితే చిద్రూపము లేక సత్యాత్మ దేనిని ఎట్లు ఏ దృష్టిచే గాంచునో, అది అట్లే ఉదయించుచున్నది.

❖

ఆ దాముడు-కటుడు-వ్యాళుడు అనువారు ఎట్లా వ్యక్తమయ్యారో, ఈ జీవము-శరీరముల దృష్ట్యా జీవులందరూ అట్లే వ్యక్తం అయ్యారు. కేవలం వారి గురించే వికల్పములు ఎందుకు? ఈ కనబడే మన ప్రదర్శన కూడా అట్టిదే. కనుక ఇందు సత్యాసత్యములేమి ఉంటాయి? "నిరాకారము, సర్వవ్యాపకము, అనంతము" అగు చిదాకాశమున చైతన్యము ఏ రూపమున ఉదయిస్తుందో ఆ రూపముగానే అక్కడ ప్రకాశిస్తూ ఉంటుంది. చైతన్యమే ఎచ్చట దాముడు మొ॥వారి రూపమున స్వయముగా స్ఫురించిందో, అచట అట్లే, నాయొక్క – నీ యొక్క రూపమున స్ఫురించటం, రూపానుభవం పొందటం, సుసంపన్నం కావటం జరుగుతోంది.

ఎడారిలో మనం చూస్తున్నది కిరణములనే అయినప్పటికీ, "ఇది (మృగతృష్ణా) జలం" అంటున్నాం కదా! నిరాకారమగు చిదాకాశము తనయొక్క 'స్వప్న ప్రతిభాస'కు 'జగత్తు' అనే పేరు పెట్టిపిలుస్తోంది. చిదాకాశము బాహ్యపదార్థములను పొందుచూ 'పరిగ్రహణము' అను వృత్తిని కలిగియుండగా అప్పుడు ఫలిస్తున్నదానినే 'దృశ్యము' అనే పేరుతో పిలుస్తున్నాం. అదే చిదాకాశం తన స్వయం ప్రతిపత్తిని భావించుచు, 'బాహ్యపదార్థరాహిత్యము'ను, 'సర్వ విషయాతీతము'ను గాంచుచున్నప్పుడో,... అప్పటి ప్రయోజనమును 'మోక్షము' అని అంటున్నాం.

'ఇది దృశ్యము – ఇది మోక్షము' అను సంజ్ఞలు నిర్వచిస్తోంది, ప్రసాదిస్తున్నది కూడా ఎవ్వరో తెలుసా? అద్వితీయ చైతన్యమే. యథార్థానికి చిదాకాశము ఏ సమయమందును ప్రబుద్ధమగుట లేదు... అప్రబుద్ధమగుటలేదు. చిదాకాశము ఒకప్పుడు ఎట్లా ఉండి ఉండేదో... ఇప్పుడూ అట్లే ఉన్నది. ఇక ఎప్పటికీ అట్లే ఉంటున్నది.

ఈ దృశ్యమంతా చిదాకాశమే అయి, సృష్టి వైభవమంతా మోక్షరూపమే అయి ఉండగా, ఇక పర్యాయ శబ్దములవంటి జగత్ – బ్రహ్మములకు భేదమెక్కడ చెప్పు?

❖

ఆత్మయే ఒకప్పుడు అవిద్యతో కూడుకుని ఉంటున్నది. అప్పుడు అప్పటి తన పరమార్థ స్వరూపమునే జగత్తుగా ఎరుగుచున్నది. ఆకాశములో వెంట్రుకాకారములు లేకుండానే, తిమిర రోగము ఉన్న కళ్ళు గలవానికి ఏవేవో వెంట్రుకాకారములు కనబడటం జరుగుచున్నది కదా!

పరమార్థమున ఈ దృశ్యప్రపంచం గాని, శరీరాదులు గాని లేవు.

చిదాకాశమే ఆయారూపములుగా స్థితి కలిగియున్నది.

1. ఆధ్యారోపదృష్టి (ఇది ఉన్నది అను దృష్టి)చే - ఈ సర్వము యొక్క వాస్తవరూపము బ్రహ్మమే! చిదాకాశమునందు అంతయు సర్వదా సంభవమే! కనుక "ఈ సర్వము ఉండియే ఉన్నది" అని చెప్పబడుచున్నది.

2. ఆరోపదృష్టి (ఇది లేదు అను దృష్టి) చే - ఈ "నేను-నీవు-జగత్పదార్థములు' మొదలైన వాటికి బ్రహ్మము కానట్టి ఉనికియే ఉండి ఉండుటలేదు. 'జగత్తు-బ్రహ్మము'... అనబడు రెండింటి యందు కూడా శాంతము, భేదరహితము అగు ఒకే పూర్ణరూపము ఉండి యున్నది. కనుక 'నేను-నీవు' అనునవన్నీ అవాస్తవమై, అవాస్తవిక దృష్టికి మాత్రమే తారసపడుతున్నాయి.

కాబట్టి రామా! నీవు సర్వశోక భయములను త్యజించివేయుము. సర్వదా పరిపూర్ణ స్వరూపుడవై ఉండు. నీయొక్క పరిపూర్ణ చైతన్యతత్త్వం ఒక స్ఫటికశిల యొక్క మధ్యభాగంలాగా చిద్ఘనము, ప్రశాంతము, అత్యంత స్వచ్ఛము అయి ఉన్నది. కలలో నదులు-పర్వతాలు జనులు ప్రతిబింబిస్తున్నప్పుడు, అట్లు ప్రతిబింబితములై కనబడే వేరు వేరు వస్తువులలో "ఒక గోడ - మేకు - మనిషి" లకు గల భేదమేమున్నది.

"ఇది ఉన్నది - ఇది లేదు" అనే భేదదృష్టి చైతన్యమునందు లేనేలేదు. నీకు ఎక్కడైనా వేరు వేరైన ప్రతీతి కనిపిస్తే "చైతన్యము ఇట్లు వేరు వేరు ప్రతీతులచే ఇచ్చట ఇట్లు ప్రకాశించుచున్నది" అని గ్రహించి, అటుపై, సర్వదా నిశ్చింతుడవై ఏది ఎట్లు ఉచితమో అట్లే నిర్వర్తించుము.

❖❖❖

5. సదాచారము - ప్రయోజనము

శ్రీరాముడు : ఒక బాలుడు అటు చీకట్లోకి చూచి, "ఇక్కడ ఏదో భూతపిశాచాలు ఉన్నాయి" అని తలచి, భయముతో పిశాచుల పరిభ్రమణమును అనుభవించటం జరుగుతుంది చూడండి! ఆరీతిగా, అజ్ఞుల దృష్టికి మాత్రమే "దాముడు - కటుడు - వ్యాళుడు - నేను - నీవు"... ఇవన్నీ తోచుచున్నాయన్నమాట! ఇవన్నీ స్వసత్తాస్వరూపమే అయివున్నాయి కదా! ఇదంతా ఎంత చమత్కారంగా ఉన్నది! సరే, మునీంద్రా! "యథార్థానికి మిథ్యాస్వరూపములే"... అయినట్టి ఆ ముగ్గురి దుఃఖములు ఎప్పటికి శమిస్తాయి? బురదగుంటలో చేపల రూపంలో ఆ ముగ్గురికి ముందుముందు ఏమి కానున్నది?

శ్రీ వసిష్ఠ మహర్షి : 'ఓహో! ఆ దామ-కట-వ్యాళుల భవిష్యత్తు కథ ఏమిటో చెప్పమంటావా? అయితే విను. ఆ ముగ్గురి కుటుంబమునకు చెందినట్టి కొందరు యముని వద్ద కింకరులై ఉన్నారు. వారు దామ - కట - వ్యాళుల ముక్తి కొరకు యముని ప్రార్థన చేస్తారు. అప్పుడాముగ్గురు తగిన సమయంలో తమ చరిత్రలను ఇతరుల నుండి వినటం జరుగుతుంది. వారి సర్వసందేహములు అప్పటికి తొలగుతాయి. ఫలితంగా ముక్తులు కాగలరు.

శ్రీరాముడు : మీరు చెప్పే విశేషాలు మరికొంత వివరంగా వినాలని ఉన్నది. వారు తమ తమ వృత్తాంతములను ఎప్పుడు, ఎక్కడ, ఎవరివద్ద వినటం జరుగుతుంది? వారు మరల ఎట్లా దుఃఖ

రహితులు కాగలుగుతారు. మీరు భూత-భవిష్యత్-వర్తమానములు ఎరిగినవారు కదా! ఆ ముగ్గురి గురించి భవిష్యత్తులో కానున్నదేమిటో చెప్పండి! ప్రస్తుతం వారు చేపల ఉపాధులు కలిగియున్నారు కదా! ముందుముందు ఏమి కాబోవుచున్నది?

శ్రీ వసిష్ఠ మహర్షి : సరే. ఆ వివరాలు చెపుతాను. విను-

వారు ప్రస్తుతం కాశ్మీరదేశంలో గల బురదతో కూడిన ఒక చిన్న తటాకంలో చేపలుగా జీవిస్తున్నారు. అదే ప్రదేశంలో అనేకసార్లు అట్లే చేపలుగా జన్మలు ఎత్తుతారు. ఒక సమయంలో మండు వేసవిలో కొన్ని దున్నపోతులు ఆ తటాకంలోకి ప్రవేశిస్తాయి. ఆ తటాకమును ధ్వంసం చేస్తాయి. దున్నపోతుల తాడనమునకు ఆ ముగ్గురి ఉపాధులు వినాశనమౌతాయి. పద్మ సరోవరంలో వారు మూడు సారస పక్షులై జన్మిస్తారు. ఆ మూడు పక్షులు అనేక చోట్ల భోగములను అనుభవిస్తూ సంచరిస్తూ ఉంటాయి.

ఆ ఉపాధులలో వారికి కొంత ప్రశాంతత దొరుకుతుంది. క్రమంగా వివేచన చేస్తూ శుద్ధత్వమును పొందుతారు. ఒకడు వివేక దృష్టిచే ఈ సర్వమును గాంచుచున్నాడనుకో... అప్పుడు త్రిగుణములు (సత్వగుణము, రజోగుణం, తమోగుణం) భిన్నభిన్నంగా తెలియవస్తాయి కదా!

అట్లే వారు ముగ్గురియందు వేరువేరు కారణాలచే వివేక బుద్ధి ఉదయిస్తుంది.

వ్యాళుడు - కాశ్మీర దేశంలో 'అధిష్ఠానము' అను పేరుగల ఒక నగరం ఉన్నది. ఆ అధిష్ఠాన నగరం మధ్యప్రదేశంలో 'ప్రద్యుమ్న' అనే పేరుతో పిలువబడే ఒక శిఖరం ఉన్నది. ఆ కొండ శిఖరంపైగల ఒక ఇంటిలోని గోడపగులులో వ్యాళుడు పిచ్చుక అయి నివసిస్తాడు. ఒక గూడు కట్టుకుని అర్థరహితమైన శబ్దాలు చేస్తూ ఉంటాడు.

దాముడు - ఆ అధిష్ఠాన నగరమును 'యశస్కరదేవుడు' అనే పేరుగల రాజు పరిపాలిస్తూ ఉండగలడు. ఆ రాజు యొక్క అంతఃపురములో అనేక స్తంభాలు ఉండి ఉన్నాయి. వాటిలోని ఒక స్తంబము యొక్క వెనుక భాగంలోగల ఒక రంధ్రంలో ఒక దోమ అయి 'ఝుయ్'మని శబ్దం చేస్తూ దాముడు కాలం గడుపుతూ ఉంటాడు.

కటుడు - ఆ అధిష్ఠాన రాజ్యపు మహామంత్రి పేరు నరసింహుడు. అతడు బంధ-మోక్షములు రెండు గ్రహించియున్నవాడు. ఆ మంత్రియొక్క గృహంలోని పంజరంలో చిలక అయి 'సారిక' అనే పేరుతో పిలువబడుతూ ఉంటాడు.

ఆ నృసింహమంత్రి తాను కొన్ని శ్లోకములుగా రచించియున్న దామ-వ్యాళ-కటుల చరిత్ర పఠిస్తూ ఉంటాడు. సారిక అనే పేరుతో చిలక రూపమున ఉన్న కటుడు నృసింహమంత్రి యొక్క ఆ గానమును అనేకసార్లు వింటాడు. సర్వమును అవగాహన చేసుకుంటాడు. విజ్ఞానదృష్టిని పొందుతాడు. అంతరంగమున ఏర్పడు బుద్ధి పరిపక్వత యొక్క ప్రభావం చేత శంబరాసురునిచే కల్పించబడినట్టి తన జీవరూపమును త్యజించటం జరుగుతుంది. 'సంసారము' అను దానిని సమూలంగా నశింపజేసే ఉత్తమోత్తమమగు 'మోక్షము'ను పొందుతాడు. అట్లే రాజమందిరములో

ఉన్న దోమ(దాముడు), 'ప్రద్యుమ్న' అను కొండపై ఉన్న పిచ్చుక (వ్యాళుడు) ఆయా జనులు దామ–వ్యాళ–కటోపాఖ్యానం గానం చేస్తున్నప్పుడు, తమ పూర్వ చరిత్రను విని పరమోత్తమమగు నిర్వాణపదమును పొందుతారు.

❖

ఓ రామా! ఈ విధంగా దామ – వ్యాళ – కటుల యొక్క వృత్తాంతమంతా విన్నావు కదా! దీనిని బట్టి నీవు గ్రహిస్తున్నదేమిటి?... "నామ రూపములతో కూడిన ఈ ప్రపంచమంతా శూన్య రూపము, మాయామాత్రము అయివున్నది'... అనునది గమనించు. ఒక్కొక్క బాటసారి మృగతృష్ణను చూచి "అవి జలములోని తరంగములే... కనుక అక్కడ పుష్కలంగా జలం ఉన్నది..." అను భావమును పొందుతూ ఉంటాడు కదా! అజ్ఞానము చేతనే ఈ జీవులు అనేకమైన భ్రమలను పొందుచున్నారు. అజ్ఞానము ఈ జీవుని 'అత్యున్నత స్థితి' నుండి 'అధఃపాతాళము'నకు క్రుంగునట్లు చేస్తోంది. అతడు అల్పత్వములో పడద్రోయబడుచున్నాడనునది గమనించబడుగాక!

అజ్ఞానులగు మూఢులు దామ–వ్యాళ–కటులవలె పతనము పొందుచున్నారు.

శ్రీరాముడు : అవును మహర్షీ! లేకపోతే, తమ కనుసైగలచే పర్వతములైనను నుగ్గునుగ్గు చేయగలవారి పరాక్రమములెక్కడ? రాజస్తంభముపైన వ్రాలే ఒక దోమ బ్రతుకు ఎక్కడ? సూర్య చంద్రులను కూడా నిరోధించగల మేధస్సు ఎక్కడ? ఒక ఇంటి చూరులో మ్రగ్గి ఉండే పిచ్చుక ఎక్కడ? చూడగానే దేవతలు భయపడి పరుగెత్తే బలపరాక్రమములెక్కడ? ఒక పంజరంలో ఇరుక్కున్న చిలుక ఎక్కడ?

❖❖❖

6. శ్రద్ధ - ప్రయత్నములు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ ప్రియజనులారా! శాస్త్రాదులచే, మహాత్ములచే ప్రవచించబడుచున్న ఉత్తమ సాధనలను ఆశ్రయించండి. ఏదైనా నియమపూర్వకంగా నిర్వహించబడినప్పుడే తప్పక సఫలం అవటం జరుగుతుంది. ఈ లౌకికములైన "ధనసంపాదన" మొదలైన ప్రాపంచిక సాధన విషయములలో గాని, పారలౌకిక విషయాలైనట్టి "శుభలక్ష్యములతో గూడిన ప్రయత్నములు, మోక్షమార్గ సేవనము"... మొదలైన విషయములందు గాని సర్వత్రాగాని తదనుకూలమైన ప్రయత్నమే ఫలప్రదమగుచున్నది.

అందుచేత రామా! మోక్షఫలము కొరకై శుభప్రయత్నములను మాత్రం నీవు ఏ క్షణమందును విడువనే వద్దు.

"శుభప్రయత్నమే ఉత్తమ ప్రయోజనములను ప్రసాదిస్తుంది" అని అనటానికి అనేక పౌరాణికమైన (పురాణములలో చెప్పబడిన) దృష్టాంతాలు ఉన్నాయి. 'శిలాదుడు' అనే ముని ఉన్నాడు. ఆయనకు ఎంతకాలానికీ సంతానం కలుగకపోవడం చేత, ఆయన శివుని కటాక్షము

కొరకు గొప్ప తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై గొప్ప భక్తి గల ఒక కుమారుని ప్రసాదించాడు. పేరు నందికేశ్వరుడు. కాని ఆ నందికేశ్వరుడు అల్పమైన ఆయుష్షు కలవాడు. అప్పుడు సద్గురువుల ఆజ్ఞను అనుసరించి నందికేశ్వరుడు ఒక సరోవరంలో శివలింగమును ప్రతిక్షేపించి ఏకాగ్రతతో, భక్తితో అర్చించాడు. శివుని అనుగ్రహానికి పాత్రుడై, మృత్యువును కూడా జయించాడు చూచావా! ఆ నందికేశ్వరుడు తన యొక్క శుభప్రయత్నములచేతనే పరమ శివుని కరచరణాలను ఆశ్రయించి, మృత్యువును జయించి, తన తల్లిదండ్రులకు అంతులేని ఆనందాన్ని కలిగించాడు. (లింగపురాణమ్)

బలి మొదలైన దానవులు గొప్ప స్వప్రయత్నముచేతనే సర్వైశ్వర్యసంపన్నులగు దేవతలను మర్దించగలిగారు. (వామన పురాణం). మరుత్తరాజు మొదలైన మహాత్ములంతా స్వప్రయత్నము చేతనే ఆయా ఔన్నత్యములను సాధించారు. 'సంవర్తుడు' అనే మహర్షి తన యొక్క శుభ ప్రయత్నముల ప్రభావం చేత బ్రహ్మదేవునిగా ప్రభవించి, మరో సురాసురులను సృష్టింగలిగాడు.

ఓ రాఘవా మరింకెవరెవరివో దృష్టాంతాలు మనకు దేనికి...? ఈ సభలో మనందరి కనుల ముందు కోటి సూర్యుల తేజముతో వెలుగొందుచున్న ఈ విశ్వామిత్ర మహర్షిని చూచావా? ఇతడు జన్మతః ఒక మామూలు రాజు. ఆ తరువాత ఆ రాజ్యమును తృణప్రాయంగా త్యజించి మహా ప్రయత్నశీలుడై గొప్ప తపస్సును ఆచరించాడు. మహా కష్ట సాధ్యమైనట్టి "బ్రాహ్మణత్వము'ను కూడా సముపార్జించాడు. రాజర్షి అయి, నాతో కలహించి, మరింత ప్రయత్న శీలుడై ఇప్పుడు బ్రహ్మర్షిగా వెలుగొందుచున్నారు.

అట్లాగే, 'ఉపమన్యుడు' గురించి విన్నావు కదా? అతడు ఒకప్పుడు అత్యంత మంద భాగ్య స్థితిని పొందియున్నాడు. నిరుపేద అయి పిండి కలిపిన నీరు కూడా లభించక, ఏదో దొరికింది తిని ఆకలి తీర్చుకునేవాడు. అట్టి ఉపమన్యుడు తన యొక్క శుభప్రయత్నములచే క్షీరసముద్రమునే పొందగలిగాడు.

'శ్వేతుడు' అను మరొకడు తన యొక్క 'భక్తి' ప్రభావంచేత ముల్లోకములను సంహరించు స్వభావముగల యముని సంతసింపజేసి మృత్యువును జయించగలిగాడు.

'సావిత్రి' అనే పేరుగల రాజకన్య 'మంగళగౌరీవ్రతము' మొదలగు తన శుభప్రయత్నముల ప్రభావం చేత గొప్ప వాక్చతురతను ప్రదర్శించి తన భర్త సత్యవంతుని ప్రాణములను యమ ధర్మరాజు హస్తములనుండి తిరిగి పొందగలిగింది.

సశాస్త్రీయంగా నిర్వర్తించబడిన శుభప్రయత్నముల ఫలములు సుస్పష్టములు, అమోఘాలు అయి ఉన్నాయి. కాబట్టి రామా! నీవు సర్వోత్తమమగు మోక్షము గురించే సర్వదా ప్రయత్నశీలుడవై ఉండటం ఉచితం సుమా!

❖

నాయనా! రామా! ఈ జీవుడు అనుక్షణం "జననము-మరణము, సుఖము-దుఃఖము"... మొదలైన అనేక అసంఖ్యాకములగు భ్రాంతులన్నీ పొందుచున్నాడు. అట్టి భ్రాంతులన్నీ

సమూలంగా పెకలించబడాలంటే, అందుకు ఒక్క ఆత్మజ్ఞానము మాత్రమే దివ్యమైన ఔషధం. అట్టి ఆత్మజ్ఞానం కొరకు అన్వేషణా పూరితమైన ప్రయత్నము నిరంతరం జరుగుచూ ఉండాలి.

అసలు, ఈ 'బుద్ధి' చేయుచున్నదేమిటో గమనిస్తున్నావా? ఇది సమగ్రత్వము, పూర్ణత్వము, ప్రశాంతత్వము ప్రసాదించగలిగినట్టి ఆత్మ సమాచారమును ఉపేక్షిస్తోంది. 'క్షుధ, అసంతృప్తి, తృష్ణ, కామం' మొదలైన ఆపదలను పరిగ్రహించే స్వభావాన్ని ప్రయత్న పూర్వకంగా ఆశ్రయిస్తోంది. ఎంతో ప్రయాసపడి, చివరికి రోగకారకము కాగల పదార్థములన్నీ సంపాదించి దాచిపెట్టు కుంటోంది. ఇట్టి ప్రమాదభరితమగు సందర్భంలో విజ్ఞుడైన వాడు చూస్తూ ఊరుకుంటాడా? లేదు.

శ్రీరాముడు : అట్టి ఈ దుష్టబుద్ధిని నిరోధించటం, నియమించటం ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ విషయములలో గల దోషమేమిటో పరిశీలించగల ఉత్తమ దృష్టి కొరకై ప్రయత్నం, అన్వేషణ సాగించాలి. శుభప్రయత్నములు మరల మరల పట్టుదలతో ఆశ్రయించాలి. "ఆఁ! ఈ శుభప్రయత్నములు శ్రమతో కూడుకొనియున్నట్టి వ్యవహారం కదా! ఇప్పుడెట్లా సాధ్యం? ఈ వస్తుజనితమైన ఆనందములను కోల్పోయి మేము ఏం సాధిస్తాం? ముందు ముందు ఇంతకు మించినదేదో పొందుతామని నమ్మకమేమిటి?"... అనునట్టి అల్పదృష్టితో కూడుకొని, ప్రయత్న మాంద్యమును ఆశ్రయించేవారిని ఎవరు కాపాడగలరు? ఈ జీవుడు ఏవేవో జడభావనలకు ఆశ్రయమిస్తూ ఆత్మ విషయమై తాత్సారం చేస్తున్నాడు. నాయనలారా! "వైరాగ్యమును అభ్యసించుట" అను శ్రమకు మీరు సిద్ధంగా లేకపోతే... బాధారహితము, మహత్తరము అగు 'సచ్చిదానందము' యొక్క లేశము కూడా ఎట్లా లభిస్తుంది చెప్పండి? శ్రమించకుండా ఈ జగత్తులో ఎవరు ఏది పొందగలరు?

శమము, పరబ్రహ్మము - 'బ్రహ్మము' అనగా ఏమిటి? అది ఎప్పుడో ఎక్కడో ఎట్లో తారసపడే విషయమా? కానే కాదు. ఇంద్రియనిగ్రహముచే పరిపూర్ణమైన చిదాత్మ స్వరూపమగు బ్రహ్మమే పరబ్రహ్మము సుమా! అట్టి ఇంద్రియ నిగ్రహమునే 'శమము' (Withdrawal from sensory avocations) అనే పేరుతో పిలుస్తున్నాం. ఈ 'సంసారం' అనే అనర్థము దీని మూలకారణ సహితంగా నివర్తింపబడాలంటే "శమం" ను ఆశ్రయించాలి. గొప్ప అనర్థముల నుండి కాపాడ గలదు కాబట్టి "శమమే పరమ పురుషార్థం. సర్వ ఉత్తమ ప్రయత్నముల ప్రయోజనం శమం"అని మహనీయులు చెప్పుచున్నారు. 'శమము', 'బ్రహ్మము' అనబడు రెండూ ఒక్కటే సుమా! ఇందులో శమము అనునది శంకరునిగా (శం+కరుడు=బ్రహ్మానందమును కలుగజేయు వాడు) ఎరుగు. ఓ రామా! అభిమానమును త్యజించినవాడవై, నిత్యము శమమునే ఆశ్రయిస్తూ ఉండు. శాశ్వతమగు మోక్షప్రాప్తికి యోగ్యమైన ఉత్తమ జన్మ కర్మల గురించే ఈ జీవుడు ప్రయత్నశీలుడు కావాలి.

సత్పురుషుల సేవ - 'నేను సర్వాత్మ స్వరూపుడను' అను ధ్యాననిష్ఠతో కూడిన ఎరుకను సుస్థిరీ కరించుకున్నట్టి మహనీయులు ఈ భూమిపై అక్కడక్కడ ఉన్నారు. అట్టి సజ్జనులను సేవించాలి. "సత్పురుషులను సేవించుట" అను అభ్యాసము గలవారు ఈ సంసార సాగరమును అవలీలగా దాటివేయుచున్నారు.

న తపాంసి న తీర్థాని నశాస్త్రాణి జయన్తి చ ।
సంసార సాగరోత్తారే సజ్జనాసేవనం వినా ॥ (సర్గ 33, శ్లో. 14)

సత్పురుష సేవనము లేనిచో తప, తీర్థ, శాస్త్రాదులేవియు సంసారసాగరమును దాటింప శక్యములుగావు.

ఎవని యందైతే లోభ-మోహ-క్రోధములు రోజు-రోజుకూ తగ్గుతూ ఉంటాయో, ఎవడు తనకు విధించిన కార్యములందు శాస్త్రానుకూలంగా వర్తిస్తూ, అకర్తృత్వము వహిస్తూ ఉంటాడో, అతడే సజ్జనుడు.

❖❖❖

7. దృశ్యము యొక్క అత్యంత - అభావము

సజ్జన సాంగత్యము చేయుచూ రాగా, ఆత్మవేత్తలగు వారి సంపర్గముచే, ఈ జీవునకు ఈ దృశ్యము యొక్క అభావము లభిస్తుంది. దృశ్యముకంటే అతీతమై దృశ్యము చేరజాలనట్టి స్వస్థితి అనుభవమౌతుంది. అట్టి వానియందు పరమాత్మయే శేషిస్తుంది. అతనికి ఇక ఏ అన్యభావమూ, దేని పట్ల కూడా కలుగదు. అతడు పరమాత్మయందే ఏకమై, లీనమై ఉంటాడు.

యథార్థానికి ఈ దృశ్యము ఏ సమయమునందును ఉత్పన్నము కానేలేదు. ఇక ముందు కూడా ఇది ఉండబోవుట లేదు. మరి వర్తమానంలో మాత్రం ఇది 'ఉన్నది' ఎట్లా అవుతుంది? అందుచేత బ్రహ్మమును ఎరిగినప్పుడు ఏదీ, దేనిచేత కూడా బాధింపబడుట లేదు. "బ్రహ్మమును ఎరిగినవాడు జగత్తును త్యజిస్తాడు..." అను వాక్యమును సునిశిత బుద్ధితో "అతడు ఈ సర్వము బ్రహ్మముగానే దర్శిస్తాడు..." అని అర్థం చేసుకోవాలి. ఇక బ్రహ్మాభావమును కలిగియుండుటచేత నష్టమేమున్నది? "నేను బ్రహ్మమునే" అను అవగాహనను "భవిష్యత్తులో సాధించవలసిన విషయం"గా దర్శించవలసిన పనేమున్నది?

ఈ జగత్తు ఉత్పత్తియే అయి ఉండలేదు... అను సత్యమును ఉత్పత్తి ప్రకరణంలో అనేక యుక్తుల సహాయంతో నిరూపించాము కదా! ఇప్పుడు కూడా అదే ప్రతిపాదిస్తున్నాను.

శ్రీరాముడు : హే మహర్షీ! ఈ త్రిలోక సంబంధమైన 'చిదాకాశము' గురించి సుస్పష్టమొనర్చమని వేడుకొనుచున్నాను. 'చిదాకాశము' అనుదానిపట్ల విజ్ఞుల అనుభవం, దృష్టి ఎట్లా ఉంటోందో మరి కొంత చెప్పండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ త్రిలోక సంబంధమగు చిదాకాశము శాంతము, నిర్మలము పరమార్థ రూపము అయివున్నది. అఖండమగు నా యొక్క నీ యొక్క సర్వులయొక్క వాస్తవతత్త్వమే కదా! ఇక "నేను శాంతుడను-నిర్మలుడను-పరమార్థరూపమును, అఖండుడను-వాస్తవతత్త్వమును"... అను భావనను అభ్యసించటానికి వెనుతీయవలసిన పనేమున్నది? "నా యొక్క స్వస్వరూపము ఈ త్రిలోకములకు సంబంధించక, సంబంధించీ కూడా ఉంటున్న చిదాకాశమే" అని నిరభ్యంతరంగా గ్రహించబడవచ్చును. విజ్ఞులు అట్టి అనుభవమునే సర్వదా, సర్వత్రా పొందుచున్నారు.

శ్రీరాముడు : అయితే మునీంద్రా! ఈ ఆకాశము మొదలైన దృశ్యపదార్థములు, అవి అనుభవ మగుచున్న ఈ ఇంద్రియాలు... ఇవన్నీ మాయాజనితము అయి ఉన్నాయంటారా? ఇవన్నీ ఎక్కడి నుండి ఏ విధంగా జనించాయి? సత్తు నుండా? అసత్తు నుండా? లేక మాయ నుండా?

శ్రీ వసిష్ఠ మహర్షి : సత్తు అగు ఆత్మ వికారరహితము. అందుచేత ఆత్మ నుండి 'ఆకాశము' మొదలైనవి ఉద్భవించటం అసంగతమైన విషయం.

'అసత్తు అనునది స్వయముగా లేనిదే కదా! లేనిదానిలో నుంచి ఆకాశము, భూమి మొదలైనవి ఎట్లా ఉద్భవిస్తాయి?.... అందుచేత రెండు పక్షములు యుక్తములు కావు.

ఇక ఇవి 'మాయ' నుండి కలిగాయని అనుకుంటే... మాయ అనగా 'మిథ్య' అనియే కదా! మిథ్య నుండి మిథ్య అయినవే సంభవించగలవు. ఇట్లు ఈ ఆకాశాదుల ఉత్పత్తియే సంభవించుట కుదురునది కాదు.

కాబట్టి, "కల్పితం, చంచలం అగు జీవాత్మ యొక్క సంకల్ప దర్పణము నందు ప్రతిబింబించే చైతన్యమే ఇదంతా" అని అనక తప్పదు.... ప్రతిబింబిత చైతన్యమే ఈ జగత్తును కల్పించుచున్నది. చైతన్యము దేనిని ఎట్లు కల్పన చేయుచున్నదో అట్లు ఆ కల్పననే 'జగత్తు' రూపముగా అనుభవించుచున్నది.

ఈ ముల్లోకముల కల్పన అంతా కూడా "చైతన్యము" అను సూర్యుని కిరణముల సమూహమే అయివున్నది. కిరణములకు, సూర్యునికి భేదమేమున్నది? లేదు కదా!

❖❖❖

8. అహంకారము యొక్క రూపము

ఈ సర్వవికల్పములు మిథ్యయే కాబట్టి "ఈ ముల్లోకములందలి అనుభవం నిర్వికల్పమగు పరబ్రహ్మస్వరూపమే"... అని చెప్పబడుతోంది. చైతన్యము స్వతహాగా "నిర్వికల్పమే" అయినప్పటికీ సవికల్పత్వమును చమత్కారముగా కలిగి ఉంటోంది. అట్టి సవికల్పమగు చైతన్యవృత్తి యొక్క "కనులు తెరచుట, మూయుట" అను బాహ్యచమత్కృతులే ఈ 'జగత్తు' అను అనుభవము యొక్క ఉత్పత్తి – వినాశనములు అయి ఉన్నాయి సుమా!

పరమార్థమగు చిదాకాశమున "అపరిజ్ఞాతమగు అహంకారము" అనే మాలిన్యము, లేక అవిద్య ఒక "గారడి సంఘటన" వలె ఉండి ఉంటోంది.

పరిజ్ఞాతమగు అహంకారము (సర్వము గ్రహించి, సత్యదృష్టిని అంతర్లీనంగా దర్శించు జీవుడు) స్వయముగా చిదాకాశమే అయివున్నది. కాబట్టి అహంకారమును పరిజ్ఞాతం (జ్ఞాన మయం) చేస్తే ఈ దృశ్యసత్త బ్రహ్మముగానే గ్రహించబడుతోంది.

అపరిజ్ఞాతం చేస్తున్నప్పుడో, బ్రహ్మసత్తకంటే వేరే ఉన్నదానివలె భ్రమను కలిగించుచున్నది.

ఇట్టి సంసారవ్యాధికి (అహంకారమును బ్రహ్మము కంటే వేరైన దానివలె పొందుట అను వ్యాధికి) ఔషధం ఒక్కటే. అది, ఈ అహంకారము యొక్క యథార్థస్వరూపం ఎరుగుటయే.

హృదియావదహంభావో వారిదః ప్రవిజృంభతే ।
తానద్వికాసమాయాలి తృష్ణాకుటజమఞ్జరీ ॥ (శ్లో. 30, సర్గ 33)

దీనిని యథార్థ స్వరూపమేమిటో తెలుసుకున్నామా... ఇంకేమున్నది? ఇది ఏ విధంగానూ ఉండజాలదని తెలిసిపోతుంది. జలము జలములో కలిసిపోతున్నట్లు, పరిజ్ఞాతము అయినట్టి అహంకారం చిదాకాశముతో ఏకత్వము పొందుతోంది.

అహంకారం, దృశ్యము - ఓ రామచంద్రా! "అహంకారం అనగా ఏమిటి?" అనే విషయం మేము ఎంతగానో పరిశీలించాము. నేను-నీవు-అతడు-ఇతడు మొదలైన వాటితో కూడుకున్న ఈ దృశ్య వ్యవహారమంతా పరిశీలించి చూస్తే, "ఈ దృశ్యము స్వతహాగా లేదు. కానీ, 'భావన'ను లేక, 'ద్రష్ట'ను ఆశ్రయించుకొని అట్టి భావనానుసారంగా ఉన్నట్లు మాత్రం ప్రాప్తి స్తోంది" అని సిద్ధాంతీకరించాం. ఇక్కడ సర్వేసర్వత్రా చిదాకాశమే ఉన్నది కాని, 'దృశ్యము' అనబడేదేదీ ఎక్కడా లేదు. 'అహంకారము' అనబడేదేదీ చిదాకాశము నుండి వేరైనదిగా లేదు. వివేకులు, అభయస్వరూపులు అగు జ్ఞానుల దృష్టిలో అహంకారమే 'లేనిది' అగుచున్నప్పుడు, ఇక అది ఒకరిని బాధించుట ఏమి? పిశాచమే ఉండజాలదని గ్రహించిన తరువాత, అట్టి పిశాచం యొక్క చర్యలకు ఉవ్విళ్ళూరు వారెవరు? భయపడువారెవరు? అయితే అల్పజ్ఞులగు బాలురకు "పిశాచం లేదు" అని ఎన్నిమార్లు చెప్పినా వారిలో కొందరికి పిశాచబుద్ధి తొలగకయేపోవచ్చు కదా! ఎంతగా బోధించినప్పటికీ ఆత్మ యందు ఇంకను నిలకడ ఏర్పడని జీవునకు 'అహంకారము లేదు' అనునది అవగతమగుటలేదు. ఇంకను సంశయబుద్ధి శేషించుచునే ఉంటోంది.

ఎంత వరకైతే ఈ చైతన్యము 'అహంకారము' చే కప్పబడి ఉంటోందో అంతవరకు స్వయం స్వరూపమగు అద్వితీయ ఆత్మతత్త్వము అనుభవమున ప్రకాశించదు. ఎప్పుడైతే ఈ జీవునికి అహంకారము యొక్క అసలు రూపం అవగతమౌతుందో, అట్టి అహంకారము యొక్క విజ్ఞాన దృష్టికి ఇక ఈ 'స్వర్గము-నరకము-మోక్షము' మొదలైన కల్పనలు ఉంటాయా? ఉండవు.

అహంకార మేఘం, హృదయాకాశం - అహంకార మేఘం హృదయాకాశంలో సంచరించుచున్నంత సేపు "ఇంకా ఏదో పొందవలసి ఉన్నది..." అను రూపముగల తృష్ణ అనే కొండమల్లె వృద్ధి చెందుతూనే ఉంటుంది. చైతన్య సూర్యుని అహంకార మేఘం కప్పి ఉంచుట చేత, ఇక అజ్ఞాన అంధకారమే వ్యాపిస్తూ ఉంటుంది. సుజ్ఞానము యొక్క ప్రకాశము మరుగునపడి ఉంటుంది. ఫలితమేమిటి?" రోదన – ద్వేషం – నిర్దాక్షిణ్యం – నిస్పృహ – అభినివేశం – మదమాత్సర్యాలు"... ఇవన్నీ తాండవిస్తూ ఉండటం. చీకటి ఉన్నచోటే గబ్బిలములు మొదలైనవి కాపురములు చేస్తూ ఉంటాయి కదా! బాలుడు తన భ్రమచే "పిశాచము" అనబడు, అసలు లేనట్టి, ఒకానొక దానిని కల్పించుకొని, పొందుతూ దుఃఖాలు అనుభవిస్తూ ఉంటాడు. "నన్ను ఆ భూతం నుండి కాపాడండి. నాకు 'తోడు' ఉండండి" అంటూ తదితరులను అర్థిస్తాడు. అట్లాగే, ఈ అహంకారము అనబడునది

స్వతహాగా అసత్తే అయినప్పటికీ, కల్పించబడి మరీ పొందబడుతోంది. అట్టి కల్పన దుఃఖం కొరకే ఏర్పడుచున్నది. ఎందుకంటే, అహంకారము యొక్క కల్పనచే సుఖించువారు ఎవ్వరూ ఉండరు.

అహంకారము, సంసార భ్రమలు! - చీకట్లో పడివున్న ఒక వంకర టింకర త్రాడును చూచి "అమ్మబాబోయ్! ఇది పామే!" అను బుద్ధి ఏర్పడుతోంది చూచావా? అభిమానం చేత కలుషితమైన అంతఃకరణము నందు ఈ "అహంకారం" అనబడేది కల్పించబడుతోంది. ఇక అట్టి అహంకారం సర్వసంసార భ్రమలు కలుగజేస్తోంది.

"ఈ దేహమే నేను; ఈ ఇంద్రియములు నావి, నేను ఈ దేహపరిమితుడను, ఈ దేహము ముగించబడితే, అది నా ముగింపే అగుచున్నది..." ఇటువంటి మనోమోహముల కంటే వేరుగా అనర్థములు ఈ ప్రపంచంలో ఇతఃపూర్వం లేవు. ఇక ముందు ఉండబోవు. "ఈ ప్రపంచంలో జీవునికి అనేక రూపములైన దుఃఖములన్నీ ఎక్కడి నుండి ప్రాప్తిస్తున్నాయి?" అనే విషయమును మేము ఎంతగానో పరిశీలించాం. "ఇదంతా అహంకార చక్రం యొక్క విజృంభణం, పరిణామం అయివున్నది"... అని ప్రకటిస్తున్నాం. 'అహంకారము' అనే విషవృక్షమును 'శుద్ధమైన మనస్సు' అనే గొప్ప యంత్రము సహాయంతో కూకటి వ్రేళ్ళతో సహా పెకలించివేయాలి. అప్పుడు 'ఆత్మ' అనే సుక్షేత్రంలో సంసారనాశకరమగు 'జ్ఞానబీజము' అంకురిస్తుంది. అది మహావృక్షమై... "నేను అఖండుడను, నిత్యుడను" అను ఎరుక రూపంలో ఉండే మహాఫలమును ప్రసాదిస్తుంది.

నాది, నేను - 'అహంకారము' అనే వృక్షమునకు "నాది నేను" అనునవే రెండు శాఖలు. అట్టి నేను, నాది అనునవి ఇంద్రియవిషయముల పట్ల 'ప్రియ, అప్రియములు' అను వాటిని మూలంగా కలిగి ఉంటున్నాయి. అవియే వాసనలు. ఈ వాసనలు జీవుని యందు తత్వవిచారణను సన్నగిల్ల చేస్తున్నాయి. అత్యంత శ్రమతో కూడుకొనిన అనేక జన్మపరంపరలను ఈ జీవుడు పొందేట్లు చేస్తున్నాయి. జలంలో తరంగాల వలె ఈ జన్మ కర్మలు అతి చంచలములై, చివరికి అతి తుచ్ఛముగా పరిణమిస్తున్నాయి.

❖

కాబట్టి రామచంద్రా! నీవు యథార్థానికి ఆత్మయే స్వరూపముగా కలిగి ఉన్నావు. అట్టి నీకు అహంభావమేమిటి? అది నిన్ను సంకోచింపజేయటమో, బంధించటమో ఏమిటి? నీవు అహం భావ రహితుడవే సుమా! అట్లే ప్రతిజీవుని విషయం కూడా. అయినప్పటికీ అహంభావము ఆత్మను కప్పివేయుచున్నది. ఫలితంగా ఈ జీవుడు స్వయంగా ఈ సంసారచక్ర పరిభ్రమణమును తనకు ఆపాదించుకొనుచు, దుఃఖములతో కూడిన అనుభవములన్నీ పొందుచున్నాడు. "ఆత్మ స్వరూపుడ నగు నాకు ఏ సమయమందునూ జన్మ కర్మలు లేవు" అను ఎరుకను ఏమరచుచున్నాడు.

'జన్మ' అనే అరణ్యంలో 'అహంకారం' అనే అంధకారం వ్యాపించి ఉన్నంతవరకు 'దుఃఖము' అనే మదించిన పిశాచము విజృంభిస్తూనే ఉంటుంది. ఈ అహంకారపిశాచము మామూలు 'పిండి-పిడక' మంత్రములచే వదిలేది కాదని అందరిని హెచ్చరిస్తున్నాను.

❖❖❖

9. అహంకారము - నివారణోపాయం

శ్రీరాముడు : మహాత్మా! ఈ అహంకారం వృద్ధి పొందకుండా ఉండే ఉపాయమేమిటి? ఈ సంసారము భయమును కలుగజేస్తోంది. ఇట్టి భయనివృత్తి కొరకు వివిధ జనులను దృష్టిలో పెట్టుకొని కొన్ని ఉపాయాలను సవివరంగా చెప్పవలసినదని ప్రార్థిస్తున్నాను.

శ్రీ వసిష్ఠ మహర్షి : సర్వజనుల పట్ల నీకు గల అవ్యాజమైన ప్రేమను మేము గమనిస్తున్నాము. అందుచేతనే, ఈ జీవుని యొక్క భయము, దుఃఖముల నివృత్తికొరకే ఈ ఆత్మ శాస్త్రమును మా యొక్క అనుభవసారంగా ప్రతిపాదిస్తున్నాం. ఈ సందర్భములో నీ ప్రశ్న అత్యంత సముచితం. అందుచేత నీ ప్రశ్నకు సమయోచితమైన కొన్ని విశేషాలు ఇక్కడ సమాధానంగా చెప్తూతాను. విను–

ఆత్మధ్యానం - ఆత్మ ఒక నిర్మలమైన అద్దము వంటిది. చిన్మాత్రమే స్వరూపముగా కలిగియున్నది. అట్టి శుద్ధ చిన్మాత్రమగు ఆత్మయొక్క స్వభావమును నిరంతరం ధ్యానిస్తూ ఉండాలి. అప్పుడు అహంకారం వృద్ధి పొందకుండా ఉండగలదు.

విరాగం - "దృశ్యరూపంగా ప్రాప్తిస్తున్న ఈ ఇంద్రజాల సదృశ్యమైనదంతా మిథ్యయే కదా! వీటి పట్ల నాకు రాగమెందుకు? ద్వేషమెందుకు?"

ఇట్టి 'మననము' లేక 'చింతన' నిరంతరం ఒనర్చుట చేత అహంకారం వృద్ధి కాకుండా ఉంటుంది. ఎవనియందైతే "ఈ దృశ్యం వాస్తవం" అను అనుభవం గాని, "నాది... నాకే ఉండాలి" అనునట్టి వేదనగాని ఉండదో, ఎవడైతే సర్వస్థితి గతులందు ప్రశాంతచిత్తుడై వ్యవహరిస్తాడో... అట్టి వాని యందు అహంకారము తప్పక రూపుమాయగలదు.

దృశ్య వ్యవహారం నుండి స్వస్వరూపాన్ని వేరు చేసి ఉంచటం -

ద్రష్ట	–	దర్శనము	–	దృశ్యము
Perceiver	-	Perception	-	Object
నేను	–	చిత్తు	–	జగత్తు
Knower	-	Knowing	-	The known

పై త్రిపుటి సర్వదా ఎదరుగా ఏర్పడి ఉంటున్నది కదా! అయితే, ఒకని యందు ప్రజ్ఞ, ప్రయత్నముల ప్రభావం చేత, "ఇది గ్రహించాలి. ఇది త్యజించాలి" అను త్యాజ్య గ్రాహ్య దృష్టులు నశించుచున్నాయి. అప్పుడు అట్టివాని యందు "సమత్వము" అనబడు మధుర స్వభావం ప్రవృద్ధమౌతోంది. అహంకారము స్వయముగానే క్షీణించుచున్నది. "నాఽహం, ఇదంతా నేను కాదు. నేను దేనికీ కర్తను కాదు. నా వాస్తవతత్త్వము దేనికీ కర్తగానీ, భోక్తగాని అయ్యేది కాదు..." అను భావనచేతనే అహంకారము నిర్జించబడుతోంది.

ఎచ్చటైతే అంతఃకరణము నందు భేదదృష్టి లేక భేదభావన సన్నగిల్లుతూ వస్తుందో, అక్కడ అహంకారము తన తావును కోల్పోతూ ఉంటుంది.

శ్రీరాముడు : తండ్రీ! ఇతఃపూర్వం మీరు సమాధానం ఇచ్చి ఉన్నప్పటికీ, మరల అట్టి ప్రశ్ననే అడుగుచున్నాను. ప్రశ్న ఒక్కటే అయినప్పటికీ, మీరు అనేక కోణముల నుండి సమాధానం ఇస్తున్నారు. కనుక మాకు మీ వాక్యములు అత్యంత ప్రయోజనకరంగానే ఉంటున్నాయి.

అసలీ అహంకారము యొక్క స్వరూపమేమిటి? ఈ 'అహంకారము' అనబడునది ఈ జగత్తునందు, స్వప్నమునందు, మనోరథములందు ఏ రూపము కలిగి ఉంటోంది?

1) దేహమునకు సంబంధించిన అహంకారము.

2) దేహమునకు విలక్షణమైన 'బుద్ధి' యందు ఏర్పడి ఉంటున్న అహంకారము.

ఈ రెండు అహంకారముల గురించి వివరించండి.

వివిధ రూపములైన ఈ అహంకారములు త్యజించబడేది ఎట్లా? అట్లు త్యజించుటచే కలుగు ప్రయోజనమేమిటి? ఈ అహంకారములను ఎన్ని తీరులుగా విభజించవచ్చు? ఈ విషయాలు ప్రవచించమని ప్రార్థిస్తున్నాను.

❖❖❖

10. త్రివిధ అహంకారములు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ లోకంలో మూడు రకములైన అహంకారాలు ఉన్నాయి– 1) "ఈ సర్వము నేనే" 2) "ఇందులోని ఏదీ నేను కాదు" 3) " ఈ దేహమే నేను".

1. అహమేవ ఇదమ్ సర్వమ్... ఈ సర్వము "నేనే" -

అహం సర్వమిదం విశ్వం పరమాత్మాహమచ్యుతః ।
నాన్యదస్తీతి పరమా విజ్ఞేయా సా హ్యహంకృతః ।
మోక్షాయైషా న బన్ధాయ జీవన్ముక్తస్య విద్యతే ॥ (సర్గ 33, శ్లో. 50)

"ఈ జగత్తంతా నిండియున్నట్టి కార్యరూపుము, కారణరూపము, నాశరహితము అగు ఆ పరమాత్మను నేనే. నాకు అన్యముగా 'జగత్తు' అనబడునది వేరే ఎక్కడా లేదు. నేను భావించుట చేతనే జగత్తు ఉంటోంది. భావనను, భావాతీతుడను కూడా నేనే. నాచే ఎదురుగా చూడబడుచున్న వారంతా నా యొక్క "సత్–చిత్" కిరణపుంజములే...!"

ఈ అహంకారము సర్వోత్తమమైనది. ఇది మోక్షమునే కలుగజేస్తోంది. ఇట్టి భావన బంధము అవదు. ఇట్టి అహంకారము జీవన్ముక్తులయందు పరిపూర్ణత సంతరించుకుని ఉంటుంది.

2. కేవల పరిశుద్ధ సాక్షిస్వరూపమహమ్ - ఈ సర్వమునకు విలక్షణమైనట్టి పరిశుద్ధమగు 'కేవలసాక్షీ' స్వరూపమును నేను.

"ఈ జగత్తులో కనబడే సర్వ దృశ్యవస్తువులకంటే కూడా విలక్షణమైనవాడను. సర్వమునకు సాక్షితత్వమును, శుద్ధుడను. అప్రమేయమును అయివున్నాను. కనుక ఇందు నేను ఏదీ కాదు...!

ఈ కనబడేది, తారసపడేది – అంతా స్వప్నసదృశ్యకము కాగా, నేను మాత్రము సత్యమును, నిత్యమును...!". స్వప్నద్రష్ట స్వప్నముకంటే వేరేకదా! ఈ జగత్తు నాకు అట్టిదే!

ఇది కూడా శుభాహంకారమే అవుతుంది. జీవన్ముక్తులచే ఆశ్రయించబడుచూ, మోక్ష భావనయందు సుస్థీకరింపజేస్తుంది. అయితే "సప్తమ భూమిక" యందు ప్రవేశించినట్టివానికి పై రెండు అహంకారములూ కూడా కేవలం "క్రిందిమెట్లు"గానే తెలియవస్తూ ఉంటాయి.

3. ఇదమ్ దేహ-మే వాహమ్ - ఈ కళ్లకు కనబడే పాంచభౌతిక దేహము మాత్రమే నేను, "ఈ చేతులు, కాళ్లతో కూడుకున్న దేహమే నా స్వరూపము – ఈ దేహమును అనుసరించి మాత్రమే నేను ఉండటం జరుగుతోంది. దేహమునకు వేరుగాగాని, అతీతముగాగాని నేను లేను...!"

ఇట్టి లౌకికమైన నిశ్చయము తుచ్ఛమైనది. నీచమైనది కూడా. ఇది ప్రబల శత్రువు కాబట్టి సర్వదా త్యజింపతగినదే!

'నేను ఈ దేహమును' అను రూపముగల అహంకారము అనేక రకములుగా విపత్కరమైనది. బలవత్తరమైన శత్రువు వంటిది కూడా! ఈ "దేహమేవాఽహమ్" భావరూపమగు అహంకారము ఆత్మయందు స్వభావంగానే అనాది కాలం నుండి సంసక్తమై యున్నది. హస్తము నందు 'హస్తలాఘవము' దాగియ్యున్నట్లు ఆత్మయందు "జగత్తు యొక్క కల్పన చేయుట, పొందుట" అను చమత్కారం నిక్షిప్తమై ఉంటోంది. అయితే అది అపసవ్యము, అవాస్తవము అవటం చేత, "నేను శరీరమును" అను భావన పొందుచున్న ఈ జీవుడు ఎక్కడా ఒకచోట నిలువలేక పోవుచున్నాడు.

❖

అయ్యో! అనేక దుర్వాసనలందు సర్వదా ప్రవృత్తమగుచున్నట్టి 'బుద్ధి'గల ఈ జీవుడు నిరంతరము అనేక విపత్తులలో కూలుచున్నాడే! మహాత్ములగువారు పరిశుద్ధము, అఖండము, అప్రమేయము అగు 'అహమ్'ను ఆశ్రయించి, అటుపై ఈ జగత్తులో సంచారం చేస్తున్నారు.

"ఈ సర్వము నేనే అయినప్పటికీ, నేను ఈ దృశ్యమునకు సంబంధించినట్టి ఏదీ కాను"... అను రెండువైపుల పదునుగల కత్తితో 'నేను దేహమాత్రుడను – దేహపరిమితుడను" అను భావ రూపమున ఉంటున్న 'లౌకికాహంకార దోషమును' ఆ సుజ్ఞానులు విచ్ఛిన్నం చేసివేయగలుగు చున్నారు. "దేహమేవాహమ్" అను దానిని "సర్వాత్మాఽహమ్" అనుదానిలో లయం చేస్తూ ఈ దేహ భావము నుండి నిస్సంశయపూర్వకంగా విముక్తిని పొందుచున్నారు.

"నేను దేహమును" – అను భావనచే మూడవ అహంకారము దృఢపడుచున్నది. అదియే బంధమగుచున్నది. "సర్వులలో సమానంగా ఉండి ఉన్న ఆత్మ చక్రవర్తిని నేనే" అను అహంకారం చేత తుచ్ఛత్వము జయించబడాలి. 'నేను దేహమును కాను"... అను నిశ్చయముచే మొదటి రెండు మహాహంకారాలు సుసాధ్యమౌతాయి.

ఆ తరువాత క్రమంగా మొదటి రెండు అహంకారములకు సంబంధించిన శ్రమను కూడా మహాత్ములు త్యజించివేస్తున్నారు.

'మౌనము-ప్రశాంతము-నిర్మలము' అగు స్వస్వరూపము మాత్రం శుద్ధమై శేషించుచున్నది.

ఏ విధంగా అయితే లౌకికంగా కనిపిస్తున్న "దేహమే నేను" అనే భావన స్థిరపడిందో, తదితర అహంకారములు కూడా అట్టి ఏదో ఒక లేక, కొన్ని మార్గముల ద్వారా అలవరచుకోవాలి.

ఏదైనా, అభ్యాసము చేతనే సుస్థిరత పొందుచున్నది. దుష్టమగు దేహాహంకారమును తలచుకొంటే చాలు... దుఃఖములన్నీ వచ్చిపడుచున్నాయి.

దామ-వ్యాళ-కటులకు కలిగిన దుర్దశలను గమనించావు కదా!

దేహాహంకారమును త్యజించినవాడు తనకు తానే హితము చేసుకుంటున్నాడు.

శ్రీరాముడు : లౌకికమైన 'దేహాహంకారము'ను పరిత్యజించిన మానవుడు ఎట్లా వర్తిస్తున్నాడు? అతడు తనకు తానే ఎట్లా హితం చేసుకుంటున్నాడు? మరి కొంత వివరించండి.

శ్రీ వసిష్ఠమహర్షి : 'ఈ సర్వము నేనే అయి వున్నాను... నేను మరొకటేదీ ఏ క్షణంలోనూ అగుట లేదు" అను భావములను స్వీకరించుటయే దేహాహంకారవ్యాధికి ఔషధమైయున్నది. "శ్రద్ధ-అభ్యాసము-గురుసేవ'లచే తమ తమ ప్రయత్నములను తీవ్రతరం చేస్తున్నవారికి అది సుసాధ్యమే అవుతుంది. అట్టి ఉత్తమ భావన వృద్ధిపొందుచుండగా, అది ఆ జీవుని పరబ్రహ్మ ప్రాప్తికి సంసిద్ధునిగా చేయుచున్నది.

మొదటి రెండు అహంకారములు ఉత్తమదృష్టితో ఆశ్రయించటమనేది ఇప్పుడే ఇక్కడ నిర్వర్తించవచ్చు సుమా! అయితే... సర్వ అహంకారముల రాహిత్యముచేతనే సర్వోత్తమమగు బ్రహ్మపదము అధిరోహించబడుతోంది.

❖

ఓ సర్వజనులారా! మీరు పరబ్రహ్మము గురించిన బోధకు తగిన వారు కావాలంటే ముందుగా 'నేనీ పాంచభౌతిక దేహమును' అను భావరూపమగు దుష్ట ఆశ్రయమును త్యజించాలి. "నేను ఈ దేహపరిమితుడను' అనునది ఒక పరిమితమైన, సంకుచితమైన, అపరిపక్వ మైన, అసమగ్రమైన అవగాహన – అని, దానిని అధిగమించుటే సుఖము, శ్రేయస్కరము, ఉత్తమము అని మేము సర్వులకు గుర్తు చేస్తున్నాం. ఒకడు ఈ ప్రపంచమున వ్యవహరిస్తూ ఉండ వచ్చు. లేదా ఇదంతా త్యజించి ఒకచోట ఒంటరితనమును ఆశ్రయించి కాలము గడుపుతూ ఉండ వచ్చు. ఏది ఏమైనా అతడు స్థూలముగా ప్రాప్తిస్తున్న ఈ లౌకిక దేహాహంకారమును తత్త్వవిచారణ సహాయంచే జయించాడా... ఇక అతనికి 'పతనము' అనబడు ఊసు కూడా ఉండదు. అట్టి అహంకారము శమించుచుండగా పూర్ణతృప్తుడగుచున్న మానవుడు ఈ భోగములన్నిటినీ నిర్లిప్తంగా (వాటితో అనురాగ విరాగాది భావనలు చేయకుండానే) చూస్తూ ఉంటాడు. భోగములు

రుచించకపోవుటచే ఇక 'మోక్షము' అను శ్రేయస్సు వచ్చి ఎదురుగా నిలచి ఉంటుంది. మనస్సులోని అంధకారమువంటి ఈ 'అహంకారము' తొలగిన తరువాత ఇక పూర్ణానందమగు మోక్షస్థితికి వేరే ప్రతిబంధకాలు ఏమి ఉంటాయి?

అహంకార అనుసంధాన వర్జనాదేవ రాఘవ ।
పౌరుషేణ ప్రయత్నాశ్చ తీర్యతే భవసాగరః ॥ (సర్గ 33, శో&. 70.)

అహంకారము వర్జించుటచేతను, ధైర్యమును అవలంబించి శాస్త్రశ్రవణము మొదలైన పురుష ప్రయత్నమును ఆశ్రయించుట చేతను ఈ సంసారము తప్పక దాటివేయబడగలదు.

కనుక, మొట్టమొదట... "ఈ జగత్తంతా నేనే. కాబట్టి అంతయు నా స్వరూపమే".... అను నిశ్చయము కలిగి యుండుము. ఆ తరువాత... "దేహాదులు నేను కాదు. ఒక దేహము కలిగి ఉన్నప్పుడు ఆ దేహమునకు మాత్రమే సంబంధించిన ధన-పుత్ర-మిత్రాది వ్యవహారములు కూడా నావి కావు... నాకు అనేక దేహములు ఏర్పడవచ్చు గాక... నేను ఏ ఒక్క దేహమును కాదు" అని భావించుటచే ప్రతిబంధకములన్నీ తొలగిపోతాయి.

అప్పుడు అట్టి ఉత్తముడు "పరిశుద్ధాత్మ"ను పొందు త్రోవలో ఉంటాడు. క్రమంగా సప్తమ భూమిక యందు స్థితి కలిగి ఉంటాడు. ఇక అతడు స్వయంగా అపరిచ్ఛిన్నమగు పరిపూర్ణాత్మ స్వరూపుడై "విదేహకైవల్యప్రాప్తి"ని కూడా పొందుచున్నాడు.

❖❖❖

11. భీమ - భాస - దృఢ న్యాయం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఇక మనం ఆ శంబరాసురుని కథకు వద్దాం. దామ వ్యాళ కటులు ఆ విధంగా నశించారు కదా! వారితోపాటే గొప్ప దైత్య సైన్యమంతా నశించింది. కొన్ని సంవత్సరములు అట్లాగే గడిచాయి. ఒక రోజు శంబరాసురుడు ఒక చోట సుఖాసీనుడై ఇట్లు యోచించసాగాడు.

"ఈ దామవ్యాళకటులను నా మాయాశక్తిని ఉపయోగించి సృష్టించాను. కాని, ఏం లాభం? వారు తమ మూర్ఖత్వముచే మిథ్యయగు అల్పాహంకారమును, దురహంకారమును ఆశ్రయించారే! ఆ మిథ్యా కల్పనయే వారి వినాశనమునకు దారి తీసింది. ఇప్పుడు నేను ఏం చేయాలి? ఈ దేవతాధములను నేను లేని సమయంలో నిరోధించుట ఎట్లా? సరే, ఇంత కన్నా విలక్షణమైన ముగ్గురు సైన్యాధిపతులను ఈ మాటు సృష్టిస్తాను.

...వారు గొప్ప వివేకవంతులై ఉంటారు గాక! ... మిథ్యా విషయములైన అభిమానము, స్వోత్కర్ష (self praise), సన్మానాదులపట్ల కోరిక, గౌరవ మర్యాదల పట్ల లోభం వారికి ఏ మాత్రం ఉంచకుండు గాక! ...వారిలో తత్త్వజ్ఞానం వెల్లివిరియుటచే మిథ్యాభావరహితులై ఉంటారు!"...

ఈ విధమైన విశేషణములకూడిన భావతరంగం సృజియించాడు.

సముద్రంలో బుద్బుదములు ఏర్పడుతూ ఉంటాయి చూచావా? ఆ రీతిగా, అతని యొక్క బుద్ధి, మాయాకౌశలము... రెండూ ఏకమై భీముడు, భాసుడు, దృఢుడు అనే ముగ్గురు రాక్షసులను సృష్టించాయి. ఆ ముగ్గురు సర్వజ్ఞులు. తెలుసుకొనవలసిన పరబ్రహ్మము గురించి ఎరిగి ఉన్నారు. దేని పట్లా కూడా వారికి రాగము గాని, ద్వేషములుగాని లేవు. ప్రాప్తించిన కార్యమును నిర్వర్తించాలనే శుభ బుద్ధి మాత్రం వారియందు ఉన్నది. పవిత్రమైన, పాపరహితమైన అంతఃకరణముతో ఈ జగత్తు నంతా తృణప్రాయంగా చూస్తూ ఉండేవారు.

వారు దేవతలతో అనేక సంవత్సరములు పోరాడారు.

❖

ఆ ముగ్గురు ఏ మాత్రం అహంకారమును పొందుటలేదు. "నాది ఇది"... మొదలైన భావనలతో కూడిన వాసనలు వారి అంతఃకరణమున ఉదయించి మరుక్షణం... "ఈ ప్రపంచం మిటి? మా స్వరూపమేమిటి?" – అను విచారణను ఆశ్రయించేవారు. అట్టి విచారణచే అసత్తుల్యమైన "నేను," – "నాది" అను భావనలను వెడలగొట్టేవారు. దేవతల స్వోత్కర్షకారక వాక్యాలు, వస్తుజాల సంబంధమైన ప్రలోభాలు ఆ భీమ–భాస–దృఢులను సమీపించలేకపోయాయి.

"ఈ దేహము అసత్యమే కదా!... మరి ఈ దేవతలు? ... వీరు అసత్యరూపులే...! మేము ఎవరము? ఈ జగత్తు యొక్క స్థితి ఏమిటి? ఇదంతా స్వప్నసదృశమే కదా! ఇందులో నిత్యమైన దేది? మార్పు చెందబోతున్నదేది? ఈ జీవుల సంబంధములు ఎట్టివి...?"

ఇట్టి విచారణ చేస్తూ ఉండేవారు. ఇక వారి హృదయంలో ఏమాత్రం భయాదులు ఉత్పన్నమయ్యేవి కావు.

ఈ శరీరము మిథ్యయే. కనుక ఇది లేనిదే. శుద్ధ చైతన్యము మాత్రమే సత్యము. అదియే ఆత్మ యొక్క స్థితి. మేముగాని, ఈ దేవతలుగాని, తదితరులుగాని యథార్థానికి లేము. ఇదంతా ఆత్మమయం! ....అని సుదృఢంగా నిశ్చయించుకొని, అప్పుడు యుద్ధానికి బయలుదేరేవారు.

శ్రీరాముడు : ఆ భీమ భాస దృఢులు అవగాహన చమత్కారంగా ఉంది. వారి తత్పరత, బుద్ధి ఎట్టిది?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవును. వారు అహంకార వర్జితులు.

శ్రీరాముడు : అనగా...?

శ్రీ వసిష్ఠ మహర్షి : వారికి "మేము ముసలితనమును, మృత్యువును పొందుతామేమో? ఈ దేహం, దేహ సంబంధాల గతి ఏమిటి?... అను వేసట లేదు. జడమగు దేహానికి, చైతన్యమే స్వరూపంగా గల తమకు... గల వాస్తవ అవాస్తవ సంబంధములేమిటో వారు గ్రహించి యున్నారు. భూత భవిష్యత్తుల గురించిన సర్వ ఆశ, ఆర్తులను ప్రక్కకునెట్టి, కేవలం ఎప్పటికప్పుడు ప్రాప్తించే వర్తమానము నందు చేయవలసియున్నట్టి కార్యముల గురించి మాత్రం శక్తిని, బుద్ధిని, యుక్తిని

వినియోగించేవారు. మహాధీరతతో వర్తమానమును మాత్రం అనుసరించి వర్తించుచుండేవారు. నిత్యమూ ఆసక్తిరహితమైన బుద్ధి కలిగి ఉండేవారు. "మేము వీరిని వధిస్తున్నాము..." అనే అభిమానము గాని, అహంకారము గాని వారియందు లేదు. అందుచేత వారు వధింపని వారే అగుచున్నారు. 'వాసనలు' అనే జాలములో వారు చిక్కుకొనుటలేదు. 'సర్వదా నేను కృతకృత్యుడనే... అకర్తనే"... అను ఎరుక కలిగి ఉంటున్నారు. "ఇది ప్రభువుకు సంబంధించిన కార్యము కనుక నిర్ణయానిర్ణయములు మాకు సంబంధించినవి కావు. నియమము యొక్క పాలన కొరకై మేము ఇది తప్పక నిర్వర్తించవలసియున్నది. కనుక అట్లే ఆచరించెదము గాక"... అను అప్రమేయత్వముతో కూడిన భావనమాత్రం కలిగి ఉంటున్నారు. వీతరాగులై, ద్వేషరహితులై, నిరంతరం సమదృష్టి కలిగియుండి, 'యుద్ధము' అను కార్యక్రమములో తత్పరులై యున్నారు.

వారు దేవతా సైన్యమును అతి సులభంగా హరించివేశారు. భోక్త భోగ్యవస్తువును అనుభవించినట్లు వారు యుద్ధమును ప్రదర్శించారు. అప్పుడు దేవతా సైన్యం నిస్సహాయులై పరుగెత్తి క్షీరసాగరంలో శయనించియున్న శ్రీ మన్నారాయణుని శరణువేడారు. విష్ణువు వారికి శరణాగతి ప్రసాదించి, "బిడ్డలారా! ఆ భీమ-భాస-దృఢులు జయింపబడలేరు. అయితే మీరు వెళ్ళి శ్వేత ద్వీపంలో ప్రవేశించి సుఖంగా ఉంటూ ఉండండి. మరి కొంతకాలము అయిన తరువాత ఆ శంబారాసురుని విషయం నేను చూచుకుంటాను" అని చెప్పి వారిని పంపించివేశాడు. తగిన సమయంలో విష్ణుభగవానుడు శంబరాసురునిపై దండెత్తి తన చక్రాయుధంతో అతనిని సైన్య సమేతంగా మట్టుపెట్టాడు. సృష్టిలో నిర్వర్తిస్తున్న సానుకూల్యమగు పాత్రను దృష్టిలో పెట్టుకొని దేవతలను కాపాడాడు. నారాయణునిచే హతులైన శంబరాసురుడు విష్ణులోకం చేరాడు.

అప్పుడు జరిగిన ఘోర సంగ్రామంలో, ఆ భగవానుడు భీమ-భాస-దృఢులకు విదేహ కైవల్యం ప్రసాదించాడు. ఆ ముగ్గురు రాక్షసులు వాసనారహితులు కదా! అందుచేత వారికి "పునర్జన్మలు" అనే గతి లభించనేలేదు. శాంతమనస్కులై, కేవలం స్వస్వరూపమగు ఆత్మయందు పరిఢవిల్లారు.

❖❖❖

12. వాసనారాహిత్యము

తస్మాద్వాసనయా బద్ధం ముక్తం నిర్వాసనం మనః ।
రామ నిర్వాసనీభావ మాహరస్వ వివేకతః (సర్గ 34 శ్లో. 27)

చూచావా, రామచంద్రా! వాసనాసహితమగు మనస్సు "బద్ధము" అగుచున్నది. వాసనా రహితమగు మనస్సో,... ముక్తినే పొందుచున్నది. కనుక నీవు అవశ్యం 'వాసనారాహిత్యము'ను సంపాదించుకో.

సత్యవస్తువును బాగుగా విచారించుటచే వాసనలను నివర్తించగలవు.

చమురు హరించిన తరువాత దీపం ప్రశమనం పొందుతుంది కదా! వాసనలు నశించాయా, ఇక, చిత్తమే ఉండదు. చిత్తములేని చోట సుఖం ఎక్కడ? దుఃఖం ఎక్కడ? ఆశ ఎక్కడ? మోహం ఎక్కడ?

సమ్యక్ దర్శనం, అవాస్తవ దర్శనం - ఇప్పుడిక్కడ దృశ్యకల్పన చేస్తున్నది ఎవరు?... పరిపూర్ణ మగు 'ఆత్మ' దృశ్యకల్పన చేస్తోందా?.... ఈ మాట కొంచెము కూడా సత్యము కాదు.

తాను పరిపూర్ణమై యుండి, దోషరహితమగు శుద్ధ చైతన్యం అయివుండి ఆయా కల్పనాదులు చేయుటచే వచ్చే ప్రయోజనమేమున్నది?

లేక మనస్సు చేస్తోందా? మనస్సు జడమైనదే కదా! దానిచే పనిచేయించాలంటే అందుకు మరొకటేదో ఉండి ఉండాలి. దానికి స్వతంత్రం ఎక్కడ ఉన్నది? లేదు.

కాబట్టి "దృశ్యాకారమగు భావన భ్రమచేతను, స్వస్వరూపము యొక్క విస్మరణ చేతను ఏర్పడుచున్నది"... అను సిద్ధాంతీకరింపబడుచున్నది. ఒకడు దీపపు కాంతికి ఎదురుగా నిలుచున్నాడనుకో.. కాంతి ప్రసరణమునకు తానే అడ్డుగా ఉండుటచే 'నీడ' అనునది ఏర్పడుతోంది కదా! స్వస్వరూపము యొక్క విస్మరణము చేతనే దృశ్యము ఘనీభూతమై ప్రాప్తించుచున్నది.

అందుచేత – "నేను భావాతీతుడను" అను గ్రాహ్యమును కలిగియుండుము.

చిన్మాత్ర స్వరూపమగు పరమాత్మయే అంతటా గాంచుచుండుము. అప్పుడు... ఆ పరమాత్మ స్వరూపమే సర్వత్రా ఉన్నది. ఆ పరమాత్మ యొక్క కళయే నాయందు కూడా సర్వదా జ్వాజ్వాల్య మానంగా వెలుగుచున్నది"... అని గ్రహిస్తావు. అప్పుడు 'సమ్యక్ దర్శనము' ప్రాప్తిస్తుంది. అదియే ముక్తి. అసమ్యక్ దర్శనమే బంధము.

వస్తుశూన్యమైన చిత్తము - ఈ జగత్తంతా ఆత్మయే అయి ఉండగా, ఇక ఎవడు ఎచట దేనిని భావిస్తాడు చెప్పు? అందుచేత సత్యవస్తువు విచారించు. అప్పుడు 'చిత్తము–వాసన'... అనబడు రెండూ కూడా వాటి శబ్దార్థములతో సహా విలీనమైపోతాయి. వాటి విలీనమే 'పరమపదము' అయి ఉన్నది. కనుక, త్రిపుటి,* అద్దాని భావనాసంస్కారము కూడా భ్రమపూర్వకమైన 'అవస్థ' నుండే ఏర్పడుచున్నాయని గ్రహించు.

వాసనతో కూడిన చిత్తమే ఈ జగత్తునందు స్థితి కలిగియుండి, సంచారం చేస్తోంది. లేదా, వాసనాగ్రస్థమగు చిత్తమునందు మాత్రమే ఈ జగత్తు అనబడునది ఉండిఉంటోంది. అట్టి చిత్తము మాత్రమే బద్ధమగుచున్నది. చిత్తము వాసనారహితమయినప్పుడు 'ఇతడు జీవన్ముక్తుడు" అని అంటున్నాం.

చిత్తమే కుండ–గుడ్డ–నీవు–నేను మొదలైన సర్వ జగత్ పదార్థరూపాలుగా స్థితి పొందివుంది. ఒక బాలుడు చీకటిలో ఏదో ఆకారము చూచి... "ఇది దయ్యము కాదు కదా? అవును..

---

* త్రిపుటి = చూచువాడు – చూడబడునది – చూచుట
ద్రష్ట – దృశ్యము – దర్శనము

అనుమానం లేదు... ఇది దయ్యమే!" అని భయమును పొందటం వంటిదే ఈ జగత్తును పొందుట కూడా! "ఓయీ, బాలుడా, అది దయ్యం కాదు. ఈ రోజు ఉదయం నీవు ఆడుకుంటున్నప్పుడు చూచిన స్తంభము మాత్రమే అది. ఇక వెత చెందవలసిన పనేమున్నది?"... అని అతని తండ్రి బోధించినప్పుడు ఆ బాలుని యందు బేతాళభావము శమించిపోతోంది కదా! సద్గురువులగు పూర్ణాత్మజ్ఞానులు, "బిడ్డలారా! ఈ జగత్తు, ఇందలి సంఘటనలు, పదార్థములు ఇవన్నీ వాస్తవం కావు. సత్యస్వరూపులగు మిమ్ములను బంధింపగలిగేది ఇక్కడ ఏమి ఉన్నది? ఏదీ లేదు" అని ప్రకటిస్తున్నారు. అనేక దృష్టాంతముల సహాయంచే బోధిస్తున్నారు. అప్పుడీ జీవులలో కొందరు శ్రద్ధ, ఆసక్తులతో విని, మననము చేసి, పరీక్షించి సత్యమేమిటో అవగతం చేసుకుంటున్నారు. ఈ జగత్తును పదార్థరహిత దృష్టితో చూస్తున్నారు. అనగా, తమ చిత్తమును వస్తు శూన్యం చేస్తున్నారు. శేషించిన పదమపదమగు ఆత్మయందు నిశ్చలమై ఉంటున్నారు.

"దామ వ్యాళ కట న్యాయం"..... "భీమ భాస దృఢ న్యాయము" -

దేహాత్మభావముగా పరిణమించిన ఈ చిత్తమునకు ఇప్పుడే ఇక్కడే సరి అయిన చికిత్స చేయాలి. భీమ-భాస-దృఢులవలె దానిని ఆత్మాకారముగా పరిణమింపజేయాలి. ఆపై నీవు నిశ్చలుడవై, ఎట్టి వికారములు పొందక, చేయవలసి వచ్చుచున్న దానిని నిస్సంగబుద్ధితో, కర్తృత్వాభిమానరహితుడవై చేస్తూ ఉండు. నిర్లిప్తుడవై "ఇచ్చట కనిపిస్తున్న దేహములు సత్యము కాదు... ఈ దృశ్యము కూడా సత్యము కాదు... సర్వదా సర్వత్రా సర్వము నందు సర్వులయందు ఆత్మమాత్రమే సత్యము" అని భావించి నిశ్చింతుడవగుము. ఒకప్పుడు నా తండ్రి బ్రహ్మదేవుడు ఈ ఉభయన్యాయముల గురించి హెచ్చరిక చేసియున్నారు. అదంతా ఇప్పుడు నీ ముందు ఉంచాను.

"మీరంతా భీమ-భాస-దృఢ న్యాయమే అనుసరించండి" అని ప్రియ శిష్యుడవగు నిన్ను నిమిత్తంగా చేసుకుని... అమృతానందమే వాస్తవ స్వరూపముగా గల సర్వజనులకు... ప్రతిపాది స్తున్నాను. ఓ ప్రియజనులారా! మీరంతా మహాబుద్ధిమంతులు కావాలి సుమా! సర్వత్రా అసంసక్త బుద్ధి కలిగి వర్తించుటచే "దృఢశోభ" అనే ఐశ్వర్యం లభించగలదు. ఈ సంసారం సుఖ దుఃఖాలచే పరిపూర్ణమై, అనేక జన్మ-కర్మలను నిర్మించి జీవునికి ప్రసాదిస్తోంది. త్రివిధమైన తాపములు అనుభవింపజేస్తోంది.

ఇది సమూలంగా విచ్ఛిన్నం కావాలంటే 'నేను ఆత్మ స్వరూపుడను' అను అవిచ్ఛిన్నమగు సమరసభావన ఒక్కటే ఉపాయం.

❖❖❖

V. దామవ్యాళకటోపాఖ్యానం : విషయ విచారణ

(మనస్సు)

1. మనస్సు - ఉపశమనము

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! ఈ మనస్సును గమనిస్తున్నావా? ఇది అత్యంత ఉత్సాహంగా ఉరకలు వేస్తూ విషయములవైపుకే పరుగులు తీయుచున్నది. ఈ సంసారము జీవుని పట్ల విజృంభించటానికి కారణం మనస్సే సుమా! ఫలితమేమిటి? ఈ జీవుడు సమస్త దుఃఖములను, ఆపదలను నిరంతరం పొందుచున్నాడు.

ఇందుకు ఉపాయం మనోనిగ్రహమే అయివున్నది. ఇప్పుడు జ్ఞానము యొక్క సర్వస్వమును ఒక వాక్యంలో చెపుతాను... ఇది విని ధారణను ఆశ్రయించెదవు గాక!

"భోగేచ్ఛా మాత్రకోబంధః। తత్త్యాగో మోక్ష ఉచ్యతే"

విషయభోగములందు ఇచ్ఛ ఏర్పడి ఉండుటయే బంధము. అట్టి ఇచ్ఛను పరిత్యజించుటయే మోక్షము.

అనేక పాఠములచే పని ఏమున్నది? ఈ ఒక్క విషయం ఆచరించు, చాలు. అది ఏమంటే... "ఈ ప్రపంచమున ఏ వస్తువు ప్రీతివంతముగా తోచుచూ ఉంటుందో, అట్టి విషయమును లేక వస్తువును విషమువలె, అగ్ని వలె చూడటం."

మరల మరల విచారణ చేస్తే " ఈ విషయ భోగములు ప్రమాదమునకే, అనగా, దుఃఖము అను అంతిమ ప్రయోజనమునకే దారి తీస్తాయి" అనే విషయం తెలిసిరాగలదు. అందుచేత ముందుగానే అట్టి నిశ్చయమును కలిగియుండుము. భోగవాసనలు త్యజించివేయి. భోగవాసనా త్యాగపూర్వకంగా విషయములు సేవిస్తే, అప్పుడు అవి సుఖప్రదములే అవుతాయి.

ముళ్ళ తీగవిత్తు నుండి ముళ్ళ తీగపొద పుట్టుచున్నది కదా! వాసనాగ్రస్థమగు బుద్ధి నుండి 'రాగము' మొదలైన అనేక దోషములు ఉత్పన్నం అవుతున్నాయి.

ఎవరి బుద్ధి అయితే అట్టి వాసనాజాలంతో తగులుకోకుండా, రాగ, ద్వేష రహితంగా, అచంచలంగా ఉంటున్నదో, అట్టి బుద్ధి మాత్రమే పరమశాంతిని పొందుతోంది. శాంతి మొదలైన శుభగుణసమన్వితము, దుఃఖ ఉద్రేక రహితము, శుభప్రదము అగు బుద్ధి జ్ఞానము వైపు, సమాధివైపు పయనించుచున్నది. ఫలితంగా 'మోక్షము' అనే ఫలమును ఉత్పన్నం చేస్తోంది.

❖

ఓ రామా! ఈ సర్వము 'భావము' నందే ఉదయించటం జరుగుతోంది సుమా! కనుక ఉత్తమ భావనానుసంధానం చేతనే మనస్సు ప్రశాంతత పొందుచున్నది. ఉత్తమ భావములు ఉన్న చోట 'అజ్ఞానం' అనే దట్టమైన మేఘము క్రమంగా నశించగలదు. సౌజన్యము శుక్లపక్ష చంద్రుని వలె వృద్ధి చెందగలదు. వివేకము సూర్యతేజమువలె ప్రకాశించగలదు. అట్టివాడు ఆత్మవస్తువును పొందుతాడు. ఆత్మ లాభముచే హృదయము నందు ధైర్యము, ప్రశాంతత, పరమానందము వృద్ధి పొందుచున్నాయి. ఆ జీవుడు కృతార్థుడగుచున్నాడు.

ఇట్టి మార్గంలో అత్యంత శోభను కలుగజేయగలిగేది సత్సాంగత్యము. వివేకము వృద్ధి అగుచుండగా ఏకాగ్రత అనుదాని నుండి 'సచ్చిదానందము' అనే శ్రేష్ఠరసము ప్రవహిస్తూ ఉంటుంది. ఆత్మను గురించిన అవగాహన ధృడపడుచుండగా, ఇక అట్టి వాని మనస్సు నిర్ద్వంద్వం, నిష్కామం, ఉపద్రవరహితం అగుచున్నది. క్రమంగా తన చపలత్వమును త్యజిస్తోంది. శోక మోహ భయ వర్జితము అవుతోంది. సంశయరహితమగుచున్నది.

ఇచ్ఛా దోషరాహిత్యము - ఓ రాఘవా! "నేను విషయాలను, వైచిత్ర్యములను దర్శించాలి... పొందాలి"... అను ఇచ్ఛను ఈ మనస్సు ఎల్లప్పుడూ కలిగి ఉంటోంది. "నేను ఏదో పొందాలి..." అను భావోద్వేగమును నీ మనస్సు నుండి తొలగించివేయి. అప్పుడు ఈ మోహ కల్పనాజాలమంతా దానంతట అదే తొలగిపోతుంది. ఈ మనస్సు నిర్లిప్తము, ఆశావర్జితముగా చేయాలి. 'ప్రవృత్తి' అనుదాని పట్ల ప్రమేయరాహిత్యము, సంసర్గరాహిత్యము అలవాటు చేయాలి. మానసిక చింతలను "పూర్ణాత్మాఽహమ్" భావనచే క్రమక్రమంగా జయించివేయాలి. ఈ మనస్సు శోకరహితమై, స్వచ్ఛమై విషయములపట్ల ఆసక్తులను వదలినదై ప్రకాశించునుగాక!

ఎప్పుడైతే ఈ 'మనస్సు' అనునది పలువిధాలైన మనోరథములతో, తృష్ణతో, సంశయాలతో నిండి ఉండటం జరుగుతుందో, ఇక ఆ జీవుని "నేను ఈ దేహమునకు సంబంధించినవాడను" అను రూపమున ఉండే "స్థూలదేహభావము" అనే దయ్యము పట్టుకుంటుంది.

ఈ మనస్సు నుండి స్థూలత్వమును పారద్రోలగలిగావా... ఇక అది ఈశ్వర స్వరూపము అగుచున్నది. అప్పుడు "ప్రత్యగాత్మత్వము" అనబడు జీవన్ముక్తిని సాధించిపెట్టగలదు. అందుచేత ఈ మనస్సును స్వసామర్థ్యము – నిగ్రహము నందు నియమించు. అప్పుడది తనకు ఏ మార్గము దుఃఖభరితమో, ఏ మార్గము అనుసరణీయమో, ఏది 'స్వస్వరూపానందము'ను ప్రసాదించగలదో గ్రహిస్తుంది. క్రమంగా "సాధ్యాసాధ్యములు, స్వపరములు" మొదలగు వికల్పములను త్యజించు చున్నది. అంటే ఆ తరువాత కల్పితమైనట్టి తన రూపాన్ని కూడా తృణప్రాయంగా త్యజించివేస్తుంది.

ఈ మనస్సు నశించేది ఎట్లా? అసలు, మనోనాశనము–అనగా ఏమి?

మనసోఽభ్యుదయో నాశో మనోనాశోమహోదయః ।
జ్ఞ మనోనాశమభ్యేతి మనోఽజ్ఞస్య వివర్ధతీ ॥ (సర్గ 35, శ్లో 18)

మనస్సు విషయాదులందు ప్రవర్తించకుండా ఉన్నదా, వినాశనము పొందుచున్నట్లే. మనో

నాశనమే (మనస్సు యొక్క దృశ్య విషయ రాహిత్యమే) ఆత్మలాభము యొక్క ఉదయము సుమా!

బ్రహ్మజ్ఞాని యొక్క మనస్సు క్రమంగా, పూర్తిగా వినాశనము పొందుచున్నది. (లేక, దృశ్య విషయములన్నిటినీ ఆత్మచమత్కారంగా దర్శిస్తోంది).

అజ్ఞాని యొక్క మనస్సో, సర్వదా వృద్ధియే చెందుతోంది. నాయనా! రామా! ఈ జగచ్చక్రమంతా మనోమాత్రమే అయివున్నది. ఈ పర్వతములు – ఆకాశం – దేవతలు – శత్రువులు – మిత్రులు – ఇదంతా మనస్సే అయివున్నది.

వికల్పములచే దృష్టి–అవగాహన మలినము కాగా, అప్పుడు ఆ చిద్వస్తువుకు సంభవిస్తున్న స్వస్వరూపమునకు సంబంధించిన విస్మరణమే మనస్సు.

ఈ జీవుని సంసారములోకి నెట్టివేయుచున్నట్టి మనస్సే వాసన. వాసనావశం చేత మనస్సులోకి విషయములు ప్రవేశిస్తున్నాయి. అప్పుడు ఆ సమయంలో చిద్వస్తువు పరిచ్ఛిన్నము వలె తోచుచున్నది. వ్యవహారయోగ్యత – సంసర్గము వికల్పములచే మాలిన్యము పొందుచున్నది. అట్టి దోషముతో కూడుకున్న భావన పొందుచున్న బ్రహ్మమే ఈ జీవుడు. ఈ జీవుడు విషయము లందు పడి, వాటిని చిరకాలము అభ్యసించుటచే అభిమానము పొందుచున్నాడు. అజ్ఞత్వము (లేక) స్వస్వరూపవిస్మరణను పొందుచున్నాడు. వికల్పములచే మోహితుడై, సారభూతమగు ఆత్మ సుఖమును పోగొట్టుకొని నిస్సారభూతుడగుచున్నాడు. అప్పుడాతని బాహ్యావిషయాను సంధాన రూపమైనట్టి వ్యతిరిక్త చింతనలే మనస్సు రూపమున కల్పన గావించబడుచున్నాయి.

ఆత్మ యొక్క రూపమేమిటి? - శుద్ధమగు ఆత్మ జీవ రూపము కాదు. ఈ శరీర రూపము కూడా కాదు. రక్తమాంసాది రూపము కానే కాదు.

ఈ శరీరాదులన్నీ పరిచ్ఛిన్నములై, జడములై ఉన్నాయి కదా! ఆత్మ సర్వదా ఆకాశము వలె నిర్లిప్తమై, అనిర్వచనీయమై ఉంటోంది. అరటి బోదెను ఛేదించిన అక్కడ దళములు గాక ఇంకేమి ఉంటాయి? ఈ దేహమును విచ్ఛిత్తి చేసినప్పుడు కూడా ఇందు 'రక్తము–మాంసము–బొమికలు" తప్పితే వేరే ఏమీ లభించవు. అట్లాగే, వాస్తవానికి... ఈ భౌతిక దేహము 'జీవుడు' కాదు.

మనస్సే జీవుడు...! -

మనో జీవో నరం విద్ధి తదేవాకారమాగతమ్ ।
ఆత్మనాత్మానమాదత్తే స్వవికల్పాత్మకల్పితమ్ ॥ (శో 25, సర్గ 35)

మనస్సే ఆకారం పొందుతోంది. అదే వికల్పములన్నింటినీ పొందుతోంది. అదే మరొకప్పుడు మరల తన యొక్క ఆత్మను తానే గ్రహిస్తోంది. ఆత్మార్పణ యజ్ఞకార్యం నిర్వర్తిస్తోంది.

❖

పట్టుపురుగు తన జాలమును తానే నిర్మించుకుంటూ ఉంటుంది చూచావా? స్వవాసనావశం చేత ఈ జీవుడు తన వికల్పములచే స్వీయబంధము కొరకై జాలమును నిర్మించు

కుంటున్నాడు. భ్రమమయమగు ఈ మనస్సు ఒక దేహమును త్యజించిన తరువాత మరల వేరైన దేశకాలములందు వేరైన దేహమును ధరించుచున్నది. మనస్సు ఏఏ వాసనలు కలిగి ఉంటుందో... వాటిని అనుసరించే, తదనురూపంగానే శరీరములు ఉత్పన్నములగుచున్నాయి. ఒకడు నిదురిస్తున్నాడనుకో... అతడు తన చిత్తములో ఏమేమి కలిగి ఉంటాడో దానిని అనుసరించే స్వప్నమును పొందటం జరుగుతుంది కదా! ఏ విత్తునాటితే, అట్టి చెట్టే వస్తుంది. ముందుముందు వచ్చే దేహములు కూడా అట్లే ప్రాప్తిస్తున్నాయి. ఈ వర్తమాన శరీరము కూడా అట్టిదే.

ఉత్తమ వాసనలు గల చిత్తము ఉత్తరోత్తర మహత్తరరూపమునే పొందబోవుచున్నది. నీచ వాసనలు గల చిత్తము ముందు ముందు నీచ జన్మల యొక్క అనుభవమును పొందబోవుచున్నది.

అందుచేత జీవుడు ఎప్పటికప్పుడు తన సంకల్పాలను, ఆసక్తులను పరిశుద్ధపరచుకుంటూ ఉండాలి. తన మనస్సు యొక్క దోషములేమిటో గమనించుకుంటూ ఉండాలి. శరీరము యొక్క ఆరోగ్యం ఎంతగా అవసరమో, అంతకన్నా ఎక్కువగా ముందుగా ఈ మనస్సుకు సరిఅయిన చికిత్స చేసుకోవాలి. అయ్యో! సృష్టిలో ప్రవేశించియున్న అనేకమంది జీవులు తమ మనస్సుకొరకై చికిత్సను ఆశ్రయించుటలేదు. పైగా ప్రలోభాదులకే ఆశ్రయం ఇస్తున్నారు!

అతి స్వల్పవిషయములైనట్టి స్త్రీ-ధనం-ఇంద్రియానుభవాలు, పేరు ప్రతిష్ఠలు మొదలైన స్వల్పకాల పరిమిత వ్యవహారములకే ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఆత్మ జ్ఞాన విషయంలో అజాగరూకులై ఉంటున్నారు.

"నేను దేనికి సంబంధించినవాడను? దేనికి సంబంధించని వాడను? ఏది అయి ఉన్నాను? ఏది కాకయే ఉన్నాను?..." అని వారు సద్విమర్శ చేయరేం? పిశాచముల గురించి వాసన గల వాడు రాత్రి స్వప్నంలో పిశాచములను చూస్తాడు కదా! క్షుద్రవాసనాయుక్తమగు ఈ చిత్తము నీచత్వమునే పొందుచున్నది. ఒక సరోవరంలోని అతి కాలుష్యముగల జలంలో దుర్వాసనలు ఉండకుండా ఉంటాయా? అతి నిర్మలమగు జలంలో అరుచి ఉంటుందా? మనస్సు మిక్కిలి మలిన మైతే... అది చేసే పనులు వాటి ప్రయోజనాలు దోషపూరితంగానూ, దుఃఖకరంగానూ ఉంటాయి. మనస్సు నైష్కర్మ్యముచే, వాసనారాహిత్యముచే, సమగ్రమగు సమరసభావనచే నిర్మలంగా ఉన్నదనుకో... అప్పుడు దాని కార్యములు, ప్రయోజనములు శుభకరంగానే ఉంటాయి.

శ్రీరాముడు: తండ్రీ! ఈ జీవుడు దోషమును గ్రహించి కూడా పూర్వ సంస్కార బలంచేత వాసన, దుఃఖాదులు బలవత్తరముగా పొందటం జరుగుతోంది. మరటువంటప్పుడు అతని గతి ఏమిటి? మీరు చెప్పిన ఔన్నత్యము సుస్థిరీకరించుకోవటం ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి: చంద్రుడు క్షయిస్తున్నా "నేను మరల పూర్ణుడను కాగలను" అనే ఆశ త్యజించడు కదా! నిర్మల చిత్తుడైనవాడు దారిద్ర్యము మొదలైనవాటిచే పీడింపబడుచున్నప్పటికీ శాంతి, మనః సమాధానరూపకమగు ఉత్తమగతిని విడచిపెట్టడు.

బంధమెవరికి? ముక్తి ఎవరికి?

యథార్థానికి ఇక్కడ బంధముగాని, మోక్షముగాని, లేవు. బంధ, అబంధములయొక్క భావము లేదు. ఇంద్రజాలంలో జరుగుతుంది చూచావా? అట్లాగే మాయయే మిథ్యారూపమున ఉదయించి, లయించుచున్నది.

సర్వైవ బ్రహ్మసత్తేయ మిత్యేషా పరమార్థతా
పరిస్ఫురతి నిఃసారః సంసారోఽ యమసన్మయః (శ్లో 37, సర్గ 35)

"అంతయు బ్రహ్మము"... అనునదే పరమార్థ సత్యము. ఇక ఈ జగత్తంటావా, ఇది నిస్సారము, అసన్మయము అయి స్ఫురిస్తుంది.

"నేను అంతము (లేక) నాశనము కలవాడను, అల్పుడను" అనే దుష్టభావముచే కలుగు చున్న వికల్పములను ఈ జీవుడు త్యజించాలి. అట్టి స్వల్పత్వము తొలగిపోవాలంటే ఆత్మ భావించ బడాలి. "నేను అనంతుడను. శాశ్వతుడను, అఖండుడను, సర్వకల్పనలు నావే.. అంతే కానీ అవి నేను కాదు" అను రూపముగల నిశ్చయముచే స్వల్పత్వము తనంతటతానే నశించుచున్నది.

ఓయి! జీవుడా! సర్వవ్యాపకము, నిర్మలము, ఆత్మ స్వరూపము అయి ఉన్న నీవు "నేను దేహ మాత్రుడను" అని అనుకొనుటచేతనే అన్ని దుఃఖములు వచ్చి పడుచున్నాయి. ఈ ప్రపంచమంతా స్వవికల్పకల్పితము మాత్రమే సుమా! నీ స్వరూపమునకు నీవే స్వల్పత్వము ఆపాదించుటచే, అట్టి భావనయే సర్వవిధ బంధముగా పరిణమించుచున్నదని గ్రహించు.

వాస్తవానికి "నీవు-నేను-జగత్తు"... మొదలైనదంతా కూడా బంధ మోక్ష రహితము, ద్వైత అద్వైతా వర్జితము అగు బ్రహ్మసత్తయే అయివున్నది. ఇది ఏమాత్రం సందేహింప అవసరం లేని పరమార్థసత్యము. అయితే ఈ జీవుడు ఆ పరమార్థసత్యమును దర్శించుటలేదు. కొందరు ధీరులు, నిర్మలహృదయులు మాత్రం ఈ దృశ్య రూపంతో కూడిన తమ యొక్క మనోబుద్ధి అహంకారాలను పరిశుద్ధం చేసుకుంటున్నారు. ఆయా ప్రయత్నములచే ఆసక్తిరహితులు, అమనస్కులు అగుచున్నారు. అట్టివారు ఈ అధికారదేహముతోనే బ్రహ్మమును దర్శించగలుగు చున్నారు.

తెల్లటి గుడ్డ ఏ రంగునైనా సహజంగా, చక్కగా స్వీకరించగలుగుతుంది కదా!

సమత్వము, సమాధి అభ్యసించుచూరాగా, అప్పుడు 'ధర్మవృద్ధి' అనే నిర్మలజలంలో పరిశుభ్రం కావించబడిన మనస్సు బ్రహ్మసంబంధమగు దృష్టిని అతిశీఘ్రంగా గ్రహించుచున్నది.

ఆత్మను భావించుచూ బుద్ధిని అధిగమించాలి - "అంతా ఆత్మయే అయివున్నది"... అను సర్వాత్మకమగు భావనచే "ఇది త్యజించాలి... అది గ్రహించాలి..." అను పట్టుదలతో కూడిన బుద్ధి శమిస్తోంది. ఆపై నీవు ఈ బంధ మోక్షముల దృష్టి కూడా పూర్తిగా పరిత్యజించవచ్చు. అట్టి స్థితిలో ఒక స్వచ్ఛమైన స్ఫటికములో ప్రతిబింబించే దృశ్యములాగా, నీయందు ఈ జగత్తు ప్రతిభాసమాత్రంగా (Merely like a refraction) అనుభమవుతూ ఉంటుంది. శాస్త్రశ్రవణాదులచే, వైరాగ్యపూర్వకమగు అభ్యాసముచే శుద్ధమొనర్చబడిన బుద్ధిగలవాడు ఈ శరీరమును, శరీరముతో

ఏర్పడుచున్న సంబంధ బాంధవ్యములను, ఈ జగత్తును ఆ విధంగా ప్రతిభాసమాత్రంగా దర్శించగలుగున్నాడు.

చమత్కారం ఏమిటంటే... ఈ మనస్సు పదార్థములతో తదాత్మ్యము పొంది ఏకరూపము పొందుచున్నప్పుడు అట్టి సమయంలో ఆత్మతో సారూప్యము (Oneness) పొందలేకపోతోంది.

శ్రీరాముడు: మీరు చెప్పునది వాస్తవమే. మరి మేము ఎప్పటికైనా ఆత్మతో ఏకరూపత్వము పొందగలమంటారా? మేము ఈ సాంసారిక దృష్టులను వదిలించుకునేది ఎట్లా చెప్పండి? స్ఫటికంలో దృశ్యంవలె, ఈ దృశ్యమును స్వస్వరూపాంతర్గతంగా సందర్శించేది ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి: నాయనా! రామా! ఆధ్యాత్మ క్షేత్రంలో నిరాశ నిస్పృహలకు స్థానం లేదు. "అసత్యదృష్టిని నేను ప్రయత్నబలంచే తప్పక జయించగలను"... అను ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలి. ఈ మనస్సు బాహ్యాభ్యంతర దృష్టులన్నింటినీ జయించి, ఆత్మయందు లీనమైనదా... ఇక సర్వోత్కృష్టమగు బ్రహ్మపదమును పొందినట్లే సుమా! అట్లు పొందినవారు అనేకులు ఉన్నారు. కొంచెం వివేకముతో ప్రయత్నం చేస్తూ ఉంటే అది ప్రతి ఒక్కరికి తప్పక సుసాధ్యమే.

❖❖❖

2. మనస్సు యొక్క రూప విశ్లేషణము

శ్రీ వసిష్ఠ మహర్షి: ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఈ దృశ్యమంతా మిథ్యయే అయివున్నది. అట్టి దృశ్య మయమవటమే మనస్సు యొక్క రూపం. అంతేగాని, మనస్సుకు వేరుగా రూపమంటూ ఏదీ లేదు.

తర్క శాస్త్రమును అనుసరించి... ఏదైనా మొట్టమొదట చిట్టచివరా 'అసత్తే' అయి ఉంటుందనుకో... అది మధ్యలోకూడా అసత్తే. ఈ సిద్ధాంతము ననుసరించి మనస్సు ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు లేకుండా పోవుచున్నది. కనుక, మనస్సు అసద్రూపమే అయివున్నది. మనస్సును అసద్రూపంగా ఎరుగనివానికి తనయందే దుఃఖములన్నీ ప్రాప్తిస్తూ ఉంటాయి సుమా!

మనస్సు ఒకప్పుడు ఉండటం, మరొకప్పుడు లేకపోవటం.... అనుదాని దృష్టాంతం! నిద్రా సమయంలో, పరమోత్కృష్ట మోక్షస్థితిలో ఈ జీవుడు మనోరాహిత్యమును పొందుచున్నాడు కదా! కనుక మనస్సు ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు ఉండనిదే అగుచున్నది.

అసద్రూపం - స్వతహాగా అవాస్తవమై, భ్రమ ఉన్నప్పుడు ప్రాప్తించేదేదైతే ఉన్నదో, అది "అసద్రూపము" అను శబ్దముచే చెప్పబడుతోంది.

❖

"ఈ జగత్తంతా ఆత్మస్వరూపమే" అనే ఎరుక (లేక) భావన కలిగియుండకపోతే ఈ దృశ్యము దుఃఖప్రదమే అవుతుంది.

"అంతయు ఆత్మయే"... అను జ్ఞానముచే భోగ మోక్షములు రెండూ పొందబడగలవు.


"జలము వేరు... ఈ తరంగములు వేరు" అనునట్టి వాసనతో కూడిన బుద్ధితో అజ్ఞానము "జలతరంగములు రెండూ కూడా ఒక్కటే"... అనునట్టి ఏకత్వబుద్ధియే జ్ఞానము. ఒక నీటి బొట్టు – నీరు వేరువేరు ఎట్లా అవుతాయి? నీరు...నీటి బొట్లలో, నీటిబొట్టు...నీటిలో ఉండియే ఉన్నాయి.

శ్రీ రాముడు: మరి ఈ హేయము (త్యజించవలసినది) ఏమిటి? ఉపాదేయము (స్వీకరించవలసినది) ఏమిటి? ఈ నానాత్వమంతా ఎట్లా ఏర్పడుచున్నది.

శ్రీ వసిస్ఠమహర్షి: స్వగతమైన అవగాహన దృష్టిదోషముచే ప్రాప్తిస్తున్న ఈ నానాత్వమంతా స్వతహాగా అసద్రూపమే. అనగా స్వయముగా లేదు. కాని ఉన్నట్లు కనబడుచున్నది. జననమరణ రూపమున గల దుఃఖమంతా భావనను అనుసరించే ప్రాప్తిస్తున్నాయి. ఈ హేయ ఉపాధేయములు అభావించబడినాయనుకో... అప్పుడు శేషించునది ఏమిటి?.... అనంతరూపమగు ఆత్మయే.

'మనస్సు' అనబడునది సంకల్పములచే కల్పించబడినది మాత్రమే. కాబట్టి అసత్తుగాక మరింకేమి? 'అసత్తు' అయిన వస్తువు నశించుటచే ఎవరికి ఏమి నష్టం చెప్పు? స్వప్నంలో కనబడుచున్న పదిమంది మరణిస్తే ఎవరు దేనిని కోల్పోవుచున్నారు?

నీకు ఇప్పుడే పరిచయం అయిన ఒకడు ఉన్నాడనుకో... అతడు నిన్ను, నీవు అతనిని ఉదాసీనంగా, రాగద్వేషరహితంగా చూచుకుంటూ ఉంటారు కదా! అట్లాగే పదార్థ రూపం ఎరిగిన వాడు ఈ పాంచభౌతిక దేహమును అట్టి దేహంతో కల్పించబడుచున్న సంబంధ బాంధవ్యములను అత్యంత ఉదాసీనంగా చూస్తూ ఉంటాడు. ఇక అది ఎరుగనివాడో ఎదురుగా ఉన్నదానిని సత్యము గాను, నిత్యము గాను, ప్రియమైనదాని గాను... మొదలైన ఆయా కల్పనలతో చూస్తూ, తాదాత్మ్యం చెందుచున్నాడు.



శ్రీరాముడు: స్వామీ! నా యొక్క (ఈ జీవుని యొక్క) వాస్తవస్వరూపం అవగతమగుటకు దృష్టాంతపూర్వకమైన విశేషములు చెప్పండి.

శ్రీ వసిష్ఠ మహర్షి:

తదనేది శివం జ్ఞానం యన్మధ్యం ద్రష్టృదృశ్యయోః

తస్మిన్సత్యే మనః శాన్తం పాంసుర్వాయుక్షయే యథా॥ (సర్గ 35, శ్లో 55)

"దృష్ట...దృశ్యము"ల మధ్యగల 'దృక్' రూపమే నీ స్వరూపము అయివున్నది... అని గ్రహించు. ఆ దృక్‌రూపము అనాది, అనంతమగు శివస్వరూపము. అదియే నిరతిశయానంద

కరమగు ఆత్మయొక్క జ్ఞాన స్వరూపం కూడా. వాయువు శమిస్తే ధూళి కూడా శమించినట్లు, ప్రయత్నశీలుడు అగుచున్న వాని యొక్క మనస్సు అధిష్ఠానమగు ఆత్మయందే శమించుచున్నది.

మనస్సు శమించుటచే శరీరాలు కూడా శాంతించుచున్నాయి. అప్పుడు అవిద్యావరణం (లేక) సంసారం అనే మంచు కురియదు. వాసనలు శమించగానే స్వస్వరూపమునందు మనస్సు యొక్క నిలకడ ప్రాప్తిస్తోంది.

అజ్ఞానమే హృదయమునందు 'భయము' అనే మకిలిని పుట్టిస్తోంది. అజ్ఞానము తొలగితే తృష్ణ కూడా తొలగుచున్నది. రాగం మొదలైనవన్నీ సన్నగిల్లుచున్నాయి. ఇంద్రియభావన వెనుకకు మరలుతోంది. మోహం త్యజించబడగా నీవు జాజ్వల్యమానుడవై వెలుగుతూ ఉంటావు. అప్పుడు, దేహమునకు సంబంధించిన క్షుద్రభావముల ఊసుకూడా ఉండదు. సంకల్పములు ఉండవు. నీ యందే నీకు 'ఆత్మస్వరూపము' అను ఆకాశము ప్రత్యక్షముగా స్ఫురించగలదు. "అట్టి మహోదయ సంపన్నుడవగు నీ యొక్క స్వచ్ఛ ప్రకాశమును వర్ణించుటకు వాక్యములు చాలవు".

తృష్ణ త్యజించినట్టివాని హృదయము విమోహమై, వివేకయుక్తమై, పాశ వర్జితమై, తమోగుణ రజోగుణ రహితమై శోభిస్తోంది. చిత్తము పూర్ణవిమలత్వము పొందుతోంది. "ఆత్మజ్ఞానము" అను ఫలమును పొందినట్టి ఆ వివేకి తన సంచారమనే ఈ పృథ్విని పవిత్రం చేస్తున్నాడు. అహంకార రహితమగు అట్టి వానికి ఈ బ్రహ్మాండమంతా ఆత్మప్రకాశయుక్తంగాను, స్వచ్ఛ శీతల ఛాయా సహితంగాను కనబడుతోంది. కనుక నీ యొక్క బుద్ధి విస్తరిల్లుటకొరకు, మనోనిర్మలత్వము కొరకు "కర్మలు నిర్వర్తించుట" అను యజ్ఞమును నిర్వర్తించు.

ఓ రామా! మలినము, చంచలము అయిన 'అహంకారము'ను హృదయము నుండి పార ద్రోలివేయి. మరుక్షణం అపరిచ్ఛిన్నుడు, సర్వవ్యాపకుడు, సర్వేశుడు, వాసనారహితుడు, శాంత చిత్తుడు అగు ఆ ఆత్మదేవుడు నీ హృదయమున స్వయముగా ప్రభువై విరాజిల్లుతాడు.

'తత్త్వవిచారణ'చే 'ఆత్మ' అను జ్యోతి ప్రాప్తించగా, సమస్తదోషములు తొలగిపోతాయి. అట్టి ఆత్మ స్వరూపడగు జీవుడు ఈ జననమరణములలో, ఐహిక పారలౌకిక స్థితులలో ఉద్వేగరహితుడై ఉంటున్నాడు. అతడు స్వదేహనగరంలో తాపత్రయరహితుడై విలాసంగా విహరిస్తున్నాడు.

❖❖❖

3. 'చిత్' ఆదిత్యుడు - స్వరూప స్వభావములు

శ్రీరాముడు: మహాత్మా! విశ్వమునకు అతీతమైనట్టి ఆ చిదాత్మయందు ఈ ప్రపంచమంతా ఎట్లు స్థితిని పొందియున్నది? నా జ్ఞానాభివృద్ధి కొరకై, ఈ విషయములో, "జ్ఞానుల అవగాహన" ఏమిటో విశదపరచండి.

శ్రీ వసిష్ఠ మహర్షి: ప్రశాంతముగా ఉన్న సముద్రజలంలోనే, తరువాత, తరువాత.... ఉత్పన్నం కాబోయే తరంగాలు, వాటివాటి ఆకారాదులు అభేదపూర్వకంగా ఉన్నాయి కదా! అదే విధంగా ఈ సృష్టి కూడా ఇట్టి సృష్టికి పూర్వము చిదాత్మయందే ఉండి ఉన్నది.

ఆకాశము అంతటా వ్యాపించి ఉన్నప్పటికీ, తన యొక్క 'సూక్ష్మత్వము' కారణంగా అది కంటికి కనబడకయే ఉంటోంది. అతి సూక్ష్మమగు ఆత్మ కూడా 'సర్వవ్యాపి' అయినప్పటికీ మనస్సుకు అగోచరంగా ఉంటోంది.

నిర్మానుష్యమైన ఒక ప్రదేశంలో ఒక స్ఫటికశిల ఉన్నదనుకో... ఆ శిలయందు ఎదురుగా దూరంగా ఉన్నట్టి దృశ్యము ప్రతిబింబిస్తోంది... అందులో ప్రతిబింబించేదంతా సత్తుగాని అసత్తు గాని (ఉన్నది లేక లేనిది) కాకుండానే అనిర్వచనీయమైయున్నది కదా! ఆ స్ఫటికంలో దృశ్యం లాగానే ఆత్మయందు ఈ సృష్టి ఉన్నది.

ఆకాశమునందు ఆ మేఘములను చూడు... మేఘములు ఉన్నదెక్కడ? ఆకాశమునందే కదా! అట్లు మేఘములకు ఆకాశమే ఆధారభూతమైనప్పటికీ, ఆకాశము మేఘములచే స్పృశించ బడుతోందా? లేదు. ఆ పరాచైతన్యం తనయందున్న ఈ సృష్టులన్నిటికీ ఆధారభూతమై ఉంటోంది. కాని ఈ సృష్టులచే అది ఏమాత్రం స్పృశించబడుటలేదు.

చంద్రుడు, నక్షత్రాలు మొదలైనవి తటాకజలంలో ప్రతిబింబరూపంగా అగుపిస్తూంటాయి కదా! ఈ శరీరమునందు ఉన్నట్టి ఆత్మ ప్రతిబింబరూపమున ఈ రీతిగా వ్యక్తమగుచూ ఉంటుంది.

చిదాత్మ సర్వసంజ్ఞలకు, సంకల్పములకు సంబంధించినది. నాశరహితమైనది. "జీవించుట, విషయాలు" మొదలైన సంజ్ఞలన్నీ చిదాత్మయందే కల్పించబడుచున్నాయి. వేదాలు, ఉపనిషత్తులు, వేదజ్ఞులు ఈ ఆత్మ గురించి చెప్పేటప్పుడు – అది ఆకాశముకంటే అత్యంత స్వచ్ఛమైనది.. నిష్కళంకమైనది... కళాసహితము, కళారహితము కూడా"... అని చెప్పుచున్నారు. అయినా కూడా, వారు ఆత్మను జగత్తుకు అభిన్నమైనదానిగా వర్ణించటం జరుగుతోంది.

❖

సముద్రంలో తరంగాలను చూడు. వేరు వేరు తరంగాలు వేరువేరుగా గోచరిస్తూ ఉంటాయి. కాని అవన్నీ జలమే కదా! జలము కంటే అధికంగా తరంగములలో ఇంకేమున్నది? 'చైతన్యము అనే మహాసముద్రంలో 'నీది, నాది' అను రూపమున అనేకత్వము స్ఫురించవచ్చు గాక! అయిన ప్పటికీ చైతన్యమునకు భిన్నంగా ఈ ప్రపంచమున ఏదీ ప్రకాశించుటలేదు. ఏదీ లేదు కూడా...! ఈ చైతన్యము ఏదైనా విషయమును అనుభవించుచున్నప్పుడు, అది వాస్తవానికి తన యందే, తన రూపమునే అట్లు అనుభవించుట జరుగుచున్నది.

చైతన్యము సర్వదా ఆత్మ స్వరూపముననే స్థితి కలిగి ఉంటున్నది. అజ్ఞులు మాత్రమే "ఈ జగత్తు ఆత్మకంటే వేరు" అను అభిప్రాయమును కలిగి ఉంటున్నారు.

జ్ఞానుల దృష్టికి... మిథ్యా స్వభావముగల ప్రపంచము ద్రష్టయొక్క కల్పనయే అయి వున్నది. "కల్పన" అనునది ఆ కల్పనచేయువాని చమత్కార వ్యవహారమే అయినట్లు, ఈజగత్తు ఆత్మకు అభిన్నమై, ఆత్మయొక్క చమత్కార వ్యవహారమై వెలయుచున్నది.

- చైతన్యము సర్వదా కేవల ప్రకాశస్వరూపమైనది.
- చైతన్యము స్వభావానుసారమే సూర్య, చంద్రులను ప్రకాశింపజేస్తోంది. స్వభావంగానే ఈ జీవుల జన్మ మరణాది కర్మలకు కారణమై ఒప్పుచున్నది.
- ఇది ఎప్పుడూ నశించదు. ఉత్పన్నమవదు.
- లేవదు. కూర్చోదు. వచ్చుట లేదు. పోవుటలేదు.
- దానికి 'ఈ స్థానము, ఆ స్థానము' అనునది ఉండదు.
- అది సర్వత్రా వ్యాపించి, ఏకరూపమై యున్నది.

❖

నిత్యనిర్మలమగు చైతన్యము (లేక ఆత్మ, లేక బ్రహ్మము) సర్వదా తన స్వరూపముననే వ్యవస్థితమైయున్నది...! ఉదాహరణకు జీవుడు ఎట్టి భావాదులను పొందుచున్నప్పటికీ తనను తాను త్యజిస్తున్నాడా? లేదు కదా! ఈ చైతన్యము తన సత్యస్వరూపము దృష్ట్యా మార్పు చేర్పులు లేకయే ఉంటోంది. కాని, ఒకడు త్రాడునందు పామును చూస్తున్నట్లు ఈ ప్రపంచరూపమున వివర్తభాగము మాత్రం పొందుచున్నది. అగ్ని 'తేజస్సు' రూపమున జలం 'ప్రవాహం' రూపమున స్ఫురిస్తోంది చూచావా? అట్లే, చైతన్యము సృష్టి విలాసరూపమున స్ఫురిస్తోంది.

చిదాత్మ 'సృష్టి రచన' అను స్వభావముతో కూడుకొనినదై ఉంటోంది. అదే సమయంలో, సర్వవ్యాపి కూడా అయి ఉంటోంది. స్వప్నద్రష్ట 'స్వప్నమును రచించుట' అను చమత్కారమును కలిగియుండి, స్వప్నంలో "సర్వవ్యాపి" అయి ఉన్నాడు కదా! ఇదికూడా అట్లే!

యథార్థానికి చిదాత్మ ప్రకాశమయమే... కాని వ్యవహారదృష్ట్యా అప్రకాశమయంగా తోచుచున్నది. అది నిత్య నిర్మలము, సంశయరహితమూ అయినప్పటికీ.. దృశ్యములో తారసపడే కార్య కారణముల దృష్ట్యా సంశయసహితము అగుచున్నది. అవిద్యాకారణం చేత అవిద్య యందు కృత్రిమ రూపముగా ప్రతిబింబించుచున్నది. అట్లు ప్రతిబింబించుచున్నప్పుడు తన యొక్క అనంత రూపమును ఏమరచుచున్నది. అంత మాత్రమే గాని, అది తన అనంతత్వమును ఏ మాత్రం కోల్పోవుట లేదు. 'అహంభావము' అను స్వల్పత్వమును మననరూపముగా పరిగ్రహించి, క్రమంగా 'జీవత్వప్రాప్తి'ని పొందుచున్నది. పదార్థముల పట్ల అనేకత్వము దృఢపడగా ఈ ప్రపంచ కల్పన మంతా అనుభవించుచున్నది. 'ఇది కలదు, ఇది లేదు, ఇది కావలెను, ఇది తొలగవలెను, ఇది ఇట్లు ఉండవలెను, అది అట్లా ఎందుకుండాలి...." అనునట్టి ఇష్ట, అనిష్టములను, స్వీకార - తిరస్కారమును పొందుచున్నది. దీనినే 'దేహాత్మభావము' అని అంటున్నాం. ఈ చిదాత్మ అనేకాలైన విహితకర్మలు, నిషిద్ధకర్మలు అనేక శారీరక మానసిక క్రియలు మొదలైనవాటి ద్వారా ఈ ప్రపంచ మంతటినీ తన యొక్క 'భోగ్యవస్తువు'గా పొందుచున్నది. కాని, చిదాత్మ ఏదీ ఒనర్చుట లేదు.

ఆహాఁ! చైతన్యము యొక్క మహిమ చూచావా? అదియే తనయందు స్వయముగా 'జగత్తు' అను అంకురరూపముగా ఉన్నతిని పొందుచూ కూడా, స్వస్వరూపస్థితి త్యజించకయే ఉంటోంది.

అదియే ఈ రూపవంతములైన పదార్థములు ఏర్పడి ఉండటానికి వీలుగా రూపరహితము, అమూర్తివంతము అగు ఆకాశము యొక్క కల్పనను అంగీకరిస్తోంది.

అది 'ఇచ్ఛ' భావనలు పొందకపోతే ఈ 'జగత్తు' అనబడేదే వృద్ధి పొంది ఉండేది కాదు. జగత్తు అనే అంకురమును చైతన్యమే తనయొక్క ప్రకాశముచే, స్పందనచే పెంచి పరిపోషించు చున్నది. చైతన్యమే వాస్తవస్వరూపముగా గల ఓ రామా! చైతన్యమే సర్వదా సర్వమునకు కారణమని గ్రహించు.

❖

ఈ 'జగత్తు' అనుదానిని పృథ్వీధర్మం చేతను, అగ్నిధర్మం చేతను, వాయుధర్మం చేతను, జల ధర్మం చేతను పరిపోషించుచున్నది చైతన్య రూపమగు చిదాత్మయే. "కాలము యొక్క కల్పన, సూర్యకిరణతత్వము, ధాన్యముల ఉత్పత్తి"... ఇవన్నీ కూడా చైతన్యము యొక్క ప్రభావమే. అదే పుష్పాలలో 'గంధం' గాను, మట్టిలో రసరూపంగాను, వృక్షంలో ఫలత్వం గాను ప్రవర్తిస్తోంది.

ఈ జగత్తులో సర్వవస్తువుల రూపమున చైతన్యము సుప్రకటితమగుచున్నది.

వసంతకాలంలో పుష్పములందలి పుప్పొడి, గ్రీష్మకాలమునందలి సూర్యతేజోవిభవము, వర్షాకాలంలో నీలమేఘ ప్రదర్శనము, శరదృతువులో ఫలదీకరణము, హేమంతంలో మంచు, శిశిర ఋతువులో శీతలవాయువులు... అంతా కూడా చైతన్యము యొక్క విభవములే సుమా!

ఓ రామచంద్రా! కాలం ఎప్పుడైనా "దినం-సంవత్సరం-యుగం" అను రూపమున గల తన యొక్క నియతిని త్యజిస్తోందా? లేదు కదా! నదులలో తరంగముల రూపమున జలం నిరంతరం ప్రవహిస్తూనే ఉన్నది కదా! అదే విధంగా సృష్టి సమూహములన్నీ గమనశీలము కలిగి ఉంటున్నాయి. ఈ "బ్రహ్మాండముల ఆవిర్భావం – తిరోభావం" అనే నియతి ఇట్లే వర్తించుచున్నది. అనంత సంఖ్యలో జీవరాసులు వచ్చి, ఉండి, పోవుచున్న ఈ పృథివి ఇట్లే నియతిని అనుసరించి 'ప్రళయము' వరకు స్థితి కలిగి ఉంటోంది. పదునాలుగు భువనములందూ పదునాలుగు జీవ జాతులు, అనేకములైన ఆచార విచారములు, వివిధ వేష భాషలు ఉంటున్నాయి... వ్యష్టి జీవుల దృష్ట్యా అనుక్షణం ఉత్పత్తి విలయములు ఏర్పడుచూనే ఉన్నాయి.

ఇదంతా చైతన్యము యొక్క విలాసమే. అయితే తత్త్వజ్ఞానికి ఈ జనన మరణ ప్రవాహమంతా లేనిదిగానే కానవచ్చుచున్నది.

❖

ఇక్కడ దీనులగు అనేకమంది జనులు పూర్వజన్మలకు సంబంధించిన సంకల్ప వాసనాదు లచే వివిధములైన మనోరథములను చేపట్టుచున్నారు. అంతేగాని, వారు స్వస్వరూపమును విచారించుటలేదు. స్వస్వరూపము పట్ల దట్టముగా ఏర్పడిన అజ్ఞానవశంచేత మోహముతో కూడి ఏర్పడిన 'ఉన్మత్తత' కలవారై ఈ లోకమున జన్మిస్తున్నారు, మరణిస్తున్నారు. మరల పర లోకములకు వెళ్లుచున్నారు. ఇంతలో 'స్థావరము' మొదలైన మహానిద్రాపరవశములగు స్థితులను

పొందుచున్నారు. భోగముల పట్ల గల అభిలాష కారణంగా ఐహిక పారలౌకికములైన శ్రమతో కూడిన అనేక ధర్మ అధర్మములను స్వీకరిస్తున్నారు. ఏవేవో పురుషార్థములు వారిని స్పృశిస్తున్నాయి పోతున్నాయి. ఈ జనన మరణాల ద్వారా అవిశ్రాంతంగా సంసారంలో పరిభ్రమిస్తున్నారు.

❖❖❖

4. విముక్తి

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామా! ఈ విధంగా స్థిరాకృతిగా కనిపిస్తున్న ఈ బ్రహ్మాండ సమూహములన్నీ బ్రహ్మమునందే మరల మరల ఉద్భవించి, లయిస్తున్నాయి. పరస్పర కారణ భావము (ఒకదానికి మరొకటి కారణం అయినట్లు భావము పొందుట) కలిగి ఉంటున్న ఈ జగత్తులన్నీ తమ అధిష్ఠానమైనట్టి చైతన్యమునందే ప్రకటితమగుచున్నాయి. పూర్ణభావన యొక్క ప్రభావంచే లయించుచున్నాయి.

లోతైన తటాకంలో అడుగున ప్రవహిస్తున్న జలము యొక్క చలనము బాహ్యమునకు కనబడదు కదా! "సత్–అసత్" రూపమున చైతన్యమే అన్నివైపులా, అంతటా ప్రకాశించు చున్నప్పటికీ, అది వ్యక్తము కాకుండానే ఉంటోంది. 'ఎండవేడిమి' కారణంగా మృగతృష్ణ ఏర్పడుతోంది. అందులో జలము ఉన్నట్లు దాహముతో ఉన్న మృగములకు తోచుచూ ఉంటోంది. అట్లే చిదాత్మయందు ఈ సృష్టులన్నీ గోచరిస్తున్నాయి. చిత్సారము అయినట్టి చిదాత్మయే 'ఇచ్ఛ–భ్రమ'ల వశంచేత తనను తాను అన్యవిధంగాను, అచిత్తుగాను గాంచుచున్నది.

జగత్తు ఉన్నదా? లేదా? - ఈ జగత్తు సత్తు కాదు. అసత్తు కూడా కాదు. ఇది చైతన్యము నందు స్థితి కలిగియుండలేదు. చైతన్యమునకు వేరుగా ఈ జగత్తు లేదు. ఒక దృష్టాంతము చెపుతాను. బంగారపు ఆభరణము ఉన్నది... అందులో ఆభరణము బంగారము కంటే వేరుగా ఉన్నదా? ఆభరణమంతా నిండియున్నది బంగారమే కదా! మరి "ఇది గొలుసు – ఇది ఉంగరము" అను వేరు వేరు ఆకారములు, నామరూపముల మాట ఏమిటి? ఉంగరము – గొలుసు ఒక్కటేనా? వేరువేరా? 1."రెండింటిలోను ఉన్నది బంగారమే కనుక రెండూ ఒక్కటే"; 2. "వేరు వేరు నామములు, ఉపయోగములు ఉన్నాయి కనుక రెండూ వేరువేరు"... అను రెండు అభిప్రాయముల వేరు వేరు దృష్టులచే అంగీకారమే అవుతాయి. బంగారమునందు ఆభరణములు అనునది భిన్న, అభిన్నముగా ఉంటున్నట్లే, బ్రహ్మమునందు 'నేను, నీవు' మొదలైన వ్యవహారమంతా మాయా దృష్టికి ప్రదర్శితం అవుతోంది. అందుచేత ఈ జగత్స్వరూపమంతా అనిర్వచనీయమై ఒప్పుచున్నది.

దేనిచే నీవు శబ్ద–స్పర్శ–రూప–రస–గంధములను ఎరుగుచున్నావో అట్టి ఆత్మయే సర్వత్రా వ్యాపించియున్నది.

సర్వవ్యాప్తి, నిర్మలము అగు ఆత్మయందు ఏకత్వమేమిటి? అనేకత్వమేమిటి? రెండూ లేవు. ఉన్నట్లు ఉంటే, 'అది అవిద్యచేతనే' అని గ్రహించబడుగాక! యథార్థానికి ఆ పరమాత్మయందు

'మరొక కల్పన' అంటూ ఏదీ లేదు. ఇక ఈ పదార్థముల పట్ల ఏర్పడుచున్న భావాభావములు, శుభాశుభములు విషయమేమిటంటావా?... ఇవన్నీ వాసనావశంచేతనే కల్పించబడుచున్నాయి.

తత్త్వ దృష్టిచే సర్వము ఆత్మయే. కనుక ఆత్మయందే అంతా కల్పించబడుతోంది. అట్టి కల్పనయే జగదనుభవంగా ఆత్మచే పొందబడుతోంది.

ఆత్మకు అన్యమైనదేది? - ఓ సర్వజనులారా! ఆత్మకంటే వేరుగా ఎక్కడైనా, ఎప్పుడైనా ఏదైనా పదార్థము ఉంటే, దానియందు కోర్కె ఉండటం సహజమే అవుతుంది. తనకు అన్యముగా ఏ పదార్థం సంభవించుటకే వీలులేనప్పుడు ఆత్మదేనిని ఇచ్ఛగిస్తుంది? దేనిని ద్వేషిస్తుంది? ఆత్మకు ఇచ్ఛా ద్వేషములు కృత్రిమము, అజ్ఞాతకల్పితము మాత్రమే గాని, సహజం మాత్రం కాదు. సర్వం 'తానే' అయి ఉండగా అది దేనిని స్మరిస్తుంది? దేనిని విస్మరిస్తుంది? దేనిని నిర్మిస్తుంది? దేనిని త్యజిస్తుంది? ఏ భవిష్యత్తు ఫలం కొరకు ప్రవృత్తమౌతుంది? కనుక "ఈ సృష్టి మొదలైనదంతా ఆత్మ యందు అవిద్యచేతనే కల్పించబడుచున్నది" అని గ్రహించండి. "ఇష్టము, అనిష్టము"... మొదలైన వికల్పములన్నీ ఆత్మను స్పృశించవు. 'ఇచ్ఛ' యొక్క అవాస్తవికత గ్రహించబడగా, కర్త-క్రియ -కర్మముల ఏకత్వము సంభవించుచున్నది. అప్పుడు "ఆత్మ ఏమీ చేయునది కాదు"... అని గ్రహించబడుచున్నది.

ఆత్మ దేనికీ ఆధారము కాదు. అది దేనిపైనా ఆధారపడి ఉండదు. కనుక "దానికి ఆధారం గాని ఆధేయము గాని లేవు" అని ప్రకటించబడుచున్నది. దానికి ఆశ్రయమంటూ ఏదీ లేదు. ద్వితీయ కల్పనయే ఆత్మయందు అసంభవం కనుక, అది దేనికీ ఆశ్రయం కూడా కాదు. ఇచ్ఛా రహితమగు ఆత్మయందు సకర్మత్వం (A sense of being a DOER) గాని, నైష్కర్మ్యత్వం (A sense of being a NON-DOER) గాని లేవు. ఆత్మకు భిన్నముగా సాఫల్యము ఒనగూర్చు కల్పనయే మరొకటి లేదు. అట్టి కల్పనను చూస్తున్న ఇంకెవరో మరొకరు లేరు. కనుక నీవు సమస్త సంతాప జ్వరముల నుండి విముక్తుడవు కమ్ము. విముక్తుడవై, ఆపై ఏది ఎట్లు చేయవలయునో ఇప్పటి వలెనే యథాతథముగా నిర్వర్తిస్తూ ఉండు. ద్వంద్వాతీతుడవై కర్తృత్వములోని అకర్తృత్వమును దర్శించు.

ఓ రామచంద్రా! "ఇది నేను చేయుచున్నాను" అను కర్తృత్వాభిమానముచే నీవు పొందునదేమిటో చెప్పు? ఈ దృశ్యమంతా భౌతిక పదార్థమయము కాకుండా మరింకేదీ ఎక్కడా లేదు కదా! కాబట్టి కర్తృత్వాభిమానమంతా త్యజించి నిశ్చింతుడవై ఉండవచ్చు సుమా! స్వస్వరూపమగు వాస్తవతత్త్వానకు అకర్తృత్వమే సహజమగుచున్నది. కాని కర్తృత్వాభిమానం కాదు.

అందుచేత, సర్వమునకు 'అకర్త'వు అగుము. వాయువుచే చలింపబడని సముద్రంలాగా, మేఘరహితమగు ఆకాశంలాగా, కడుపునిండుగా ఆహారం తిని సరోవర జలం త్రాగి తిరిగివస్తున్న సింహంలాగా స్వస్థుడవు, నిర్మలుడవు, గంభీరస్వభావుడగు, మౌనశీలుడవు అయివుండుము. హృదయమును పదార్థరహితం చేయి. "ఇది నేను చేశానే...? ఇది చేయలేకపోయానే...?" అను తలపులన్నీ ఆత్మత్వము నందు లయింపజేసి వేయుము.

ఆత్మయే అయివున్న నీవు... ఆత్మ స్వభావుడవై.. ఆత్మలో నిలకడ కలిగియుండుటలో కష్టమేమున్నది?

శ్రీరాముడు: మహర్షీ! ఏ సాధనములచే అపరిచ్ఛిన్నమగు సుఖము, పూర్ణకామత్వము సిద్ధిస్తాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి: అందుకు సాధనం, మార్గం, లక్ష్యం కూడా "ఆత్మయందు సుస్థిరుడవగుట"... అయి ఉన్నది. అట్టి స్వస్వరూపమునందలి "సుస్థిరము"లోని సుఖప్రాప్తి... ఇక అనేక ప్రయత్నములచేత గాని, అనేక లోకములలో పరిభ్రమించుటచేత గాని ఈ జీవునకు లభించేది కాదు. అందుకు మార్గం ఇప్పటికిప్పుడు స్వస్వరూపము గురించి విచారణ చేయటమే.

కనుక నీ స్వస్వరూపమును స్వబుద్ధితో విచారించుము. బాహ్య పదార్థములవైపు పరుగులు తీయు నీ దృష్టిని నిరోధించి, ఆత్మవైపు మళ్ళించు. "అంతయు ఆత్మయే కదా!" అను పరిగ్రహణము కలిగియుండుము.

యథార్థానికి నీవు సర్వప్రపంచ మిత్రుడవు. పరమార్థదృష్టిచే సర్వదా పూర్ణుడవే అయి ఉన్నావు. సుఖస్వరూపమగు చిదాత్మవే నీవు. అంతే గాని తుచ్ఛమగు ఈ శరీరమనోబుద్ధులు నీవు కావు.

ఓ సర్వజనులారా! మీలోని ప్రతి ఒక్కరియొక్క వాస్తవ స్వరూపము అట్టిదే సుమా!

❖❖❖

5. అనాసక్తబుద్ధి

శ్రీరాముడు: హే మహాత్మా! జ్ఞానులకు కూడా కర్తృత్వములు, స్వీకరించవలసినవి, త్యజించ వలసినవి మొదలైనవి ఉంటాయంటారా?


శ్రీ వసిష్ఠ మహర్షి: ఏదో ఒక కర్మ నిర్వర్తించనివారంటూ ఎక్కడైనా ఉంటారా? ఉండరు. జ్ఞానులు లౌకికమైన కర్మ చేయవచ్చు లేక చేయకుండవచ్చు. ఏది ఏమైనా "ఇది నేను చూస్తున్నాను... లేక... ఇది నేను త్యజించుచున్నాను.... చేయుటలేదు" అను కర్తృత్వాభిమానం ఏ మాత్రం ఉండదు. వారిలో కొందరు సుఖభోగఫలములను పొందవలసి ఉండవచ్చు..., లేక సాధన భూతములగు ఆయా కర్మలందు నియమితులై ఉండవచ్చు..., లేదా, సమాధి యొక్క వేరు వేరు భూమికలలోని ఒకదాని యందు ఉండి ఉండవచ్చు. ఏది ఏమైనా "దీనికి నేను కర్తను... ఇది నాకు సంబంధించినది"... అను ఉద్వేగం ఏమాత్రం వారియందు ఉండదు. వ్యవహారరీత్యా ప్రవర్తించినప్పటికీ వారు ప్రకటించు కర్తృత్వము వ్యవహార సానుకూల్యమునకు సంబంధించినదే గాని, అభిమానమునకు సంబంధించినది కాదు. కాని అజ్ఞానుల వ్యవహారం మాత్రం అందుకు వేరుగా ఉంటుంది.

శ్రీరాముడు: జ్ఞానులకు కర్తృత్వమే ఉండదని అంటున్నాం కదా. కానీ వారు కూడా తదితరులవలెనే కర్మలు నిర్వర్తిస్తూనే ఉంటారు కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి: జ్ఞానులలో గోచరించే అకర్తృత్వము గురించి అజ్ఞానులలో ఉంటున్న కర్మబంధము గురించి కొన్ని విశేషాలు తెలియజేస్తాను. విను.

ఏ క్రియ అయితే ఈ జీవుని అంతకరణంలో "నేను చేయుచున్నాను... దీని కర్త (లేక) కర్మ నాకు సంబంధించినవే" అను మనోవృత్తి 'నిశ్చయము'తో కూడినదై జీవునియందు ఉంటుందో, అట్టి కర్మకు మాత్రమే అతడు కర్తృత్వము పొంది ఉంటున్నాడు. అనగా "నేను దీనికి కారణమగు చున్నాను"... అను రూపముగల ఉపాదేయబుద్ధి ఉంటేనే కర్మ ఉన్నట్లు. దీనినే 'వాసన' అని కూడా అంటున్నాం.

ఈ మనుజుడు వాసనలను అనుసరించే ఆయా క్రియలను ఒనర్చుచున్నాడు. క్రియలను అనుసరించే 'ఫలభోగానుభవం' సంభవమగుచున్నది.



క్రియలను అనుసరించే అందు ఇచ్ఛ తోడగుచుండగా ఫలభోక్తృత్వము (నేను ఈ కర్మఫలమును అనుభవించెదను గాక... అను భావన) ఏర్పడుచున్నది.

వాసనలను అనుసరించే మనుజుడు క్రియలను ఒనర్చుచున్నాడు.

వాసనల ప్రభావం - ఒకడు ఈ స్థూల ఇంద్రియములచే కర్మలు చేయవచ్చు... చేయకపోవచ్చు. అతడు ఎట్టి వాసనలు కలిగి ఉంటాడో... అట్టి వాసనలను అనుసరించే అతని మనస్సు స్వర్గ–నరకములందు సుఖ – దుఃఖములను అనుభవించటం జరుగుతోంది.

ఒకడు కర్మలు చేసినా, చేయకపోయినా... అతడు 'ఆసక్తి' కలిగి ఉంటే మాత్రం అతనికి కర్తృత్వము కలుగుచూనే ఉంటుంది.

తత్వజ్ఞానికో...? - తత్వజ్ఞానికి వాసనలు ఉండుటలేదు. కనుక కర్మలపట్ల ఆసక్తి ఉండుటలేదు. ఆసక్తి లేనిచోట కర్తృత్వము కూడా ఉండదు.

ఆసక్తి, వాసనలు, కర్తృత్వము, ఈ మూడూ అవినాభావ సంబంధం కలిగి ఉంటున్నాయి.

తత్వజ్ఞాని కర్మలు చేస్తున్నప్పటికీ... ఫలానుసంధానం చేయడు. ఆసక్తిని హృదయంలో ప్రవేశింపనీయకుండా, కేవలం శరీరచేష్టామాత్రంగా ఆయా కర్మలు గావించుచున్నాడు. ఏవైనా ఫలములు ప్రాప్తిస్తున్నప్పుడు "ఇవి నాకు సుఖకరములు... లేక దుఃఖకరములు"... అను

కల్పనను అతడు ఆశ్రయించుటలేదు. 'అంతయు ఆత్మయే కదా...." అను ఎరుకను అతడు కలిగి ఉంటున్నాడు. కర్మలు ఆచరిస్తూ కూడా అతడు వాటియందు నిమగ్నచిత్తుడు అగుటలేదు.

మనోయత్కరోతి... తత్కృతంభవతి, యున్న కరోతి...
తన్నకృతంభవతి అతో మనయేవకర్తృ... న దేహః ॥

ఓ రామచంద్రా! మరల చెప్పుచున్నాను. ఈ జగత్తులో ఎవడైనా మనస్సుతో చేసినది మాత్రమే 'చేయబడినది' అగుచున్నది. మనస్సుతో చేయబడనిది... "చేయబడనిది" గానే ఉంటోంది.

కాబట్టి మనస్సే సర్వకర్మల యొక్క 'కర్త'. అంతేగాని, ఈ దేహము దేనికీ కర్త కాదు.

చిత్తాదేవాయం సంసార ఆగతశ్చిత్తమయ ఏవ ।
చిత్తమాత్రం చిత్త ఏవ స్థిత ఇతీ విజ్ఞాతమ్ ॥ (సర్గ 38, శ్లో 8)

ఈ ప్రపంచమంతా మనస్సునందే ఆవిర్భవిస్తోంది. మనోమయం, మనోమాత్రం ఈ ప్రపంచమంతా. మనస్సునందే స్థితి కలిగి ఉంటోంది. కనుక ఈ కనబడేదంతా నీయొక్క చిత్తమే కాని మరింకేమీ కాదు. ఈ విషయం మనం ఇంతకుముందు నిర్ధారించుకున్నాం కదా!

❖

సర్వవిషయములు, సర్వవిషయ వృత్తులు శమించాయనుకో... లేక, సర్వవృత్తులు సద్వాసనలతో ('సత్' కు సంబంధించిన భావనలతో) నిండియున్నాయనుకో... అప్పుడు అనుభవ మగుచూ ఉండేది ఏది? సర్వవిధ వృత్తులకు స్థానభూతమైయున్న జీవచైతన్యమే కదా! 'ఎండలు' తీవ్రంగా ఉన్నప్పుడు మృగతృష్ణ యొక్క భ్రమ ఏర్పడుతోంది. మేఘాలు వచ్చి, వర్షించాయనుకో... ఇక మృగతృష్ణా జలమెక్కడ? ఆ జలము పట్ల ఆసక్తి ఏమి ఉంటుంది?

ఆత్మ జ్ఞానము పొందిన మనస్సు పరమశాంతినే పొందుతోంది.

శ్రీరాముడు: అప్పటి వారి మనస్సు యొక్క రూపం ఏమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి: ప్రచండ సూర్యతేజస్సులో మంచుగడ్డ కరిగిపోవుచుండగా, ఆ మంచుగడ్డ యొక్క దృశ్యాకారం ఏమౌతుంది? హరించుకుపోతుంది కదా! మనస్సు కూడా 'తురీయస్థితి" యొక్క ప్రాప్తిచే బ్రహ్మరూపమే అగుచున్నది.

మూర్ఖుని మనస్సు - మూర్ఖమగు దున్నపోతు బురదలో ప్రవేశించి, అందులో ఇరుక్కుంటుంది. మూర్ఖుడగు అజ్ఞానియొక్క మనస్సు కూడా స్వల్ప అశాశ్వత విషయములందు తగుల్కొంటోంది. విషయ భోగభూములనే అవలోకించుచున్నది గాని, తత్స్వరూపమగు ఆత్మను గాంచుటనే లేదు. జ్ఞానియొక్క మనస్సో... వాసనామయమగు క్రియలందు తగుల్కొనుటలేదు.

ఏది మనస్సుచే పొందబడిందో... అది మాత్రమే పొందబడినట్లు - ఒకడు మనస్సుతో పొందినదే 'పొందబడినది' అగుచున్నది. మనస్సుచే స్వీకరించబడనప్పుడు, అతడు అద్దానిని పొందనట్లే

అగుచున్నది. శరీరముచే పొంది, మనస్సుచే పొందబడనప్పుడు "అది ఆ జీవుడు పొందుట లేదు"... అని సిద్ధాంతీకరించబడుచున్నది.

ఇందుకు ఒక దృష్టాంతము చెపుతాను, విను.

ఒకడు - ఒక సుఖప్రదమైన 'శయ్య'పై చక్కగా నిదురించుచున్నాడు. ఒక గోతిలో పడిపోతు న్నట్లు స్వప్నము పొందుచున్నాడు. అతడు "నేను గోతిలో పడిపోతున్నాను... నన్ను రక్షించండి" అని కేకలు వేస్తున్నాడు. ముచ్చెమటలు పోస్తున్నాయి. పెదవులు వణుకుచున్నాయి. చూచావా, రామా! అతడు సుఖంగా పరుపుపై ప్రశాంతమైన ముద్రలో భౌతికంగా ఉండి ఉన్నప్పటికీ, అతని మనస్సు మాత్రం బీభత్సములగు అనుభవములను పొందుతోంది. కనుక, అతడు గోతిలో పడుచున్నవాడే అగుచున్నాడు.

మరొకని విషయానికి వద్దాం - అతడు పరమశాంతచిత్తుడు. "ఆత్మాఽహమ్" అను ఎరుక గలవాడు. అనేక స్వప్రయత్నముల ఔన్నత్యముచే, జ్ఞానవిషయమై సద్గురువుల వద్ద వినియున్న విశేషముల ప్రభావంచేత పూర్ణమగు 'శాంతి' అను శమస్థితిని పొందియున్నాడు... ఒకరోజు అతడు ఒక పెద్ద గుంటలోకి జారిపడుచున్నాడు. అయినప్పటికీ "నేను అఖండము, శరీరాదులకు అతీతము అగు ఆత్మనే కదా! నాకు శరీరముల రాకపోకలు బాహ్యస్థమైన వ్యవహారమే. కనుక నేను ఏ మార్పు చేర్పులు లేనట్టి నిత్యోదితమగు పరబ్రహ్మమును"... అను దృఢ భావనను ఆశ్రయించి ఉన్నాడు...

అతడు 'నేను సుస్థిరుడనే' అను భావనయే పొందుచున్నాడు. అందుచేత శరీరం యొక్క పతనం ఆతడు పొందకయే ఉన్నాడు. చూచావా! అతడి మనస్సు పతనంతో ఏకత్వం పొంద కుండుటచేత అతనికి అనుభవము లేకయే ఉంటోంది. దీనిని బట్టి మనకు తెలియున దేమిటి?

మొదటివాడు గోతిలో పడనప్పటికీ, పడుచున్నట్లు అనుభవాన్ని మాత్రం పొందుచున్నాడు కనుక, కర్తృత్వము, భోకృత్వము తెచ్చిపెట్టుకొని అనుభవిస్తున్నాడు. రెండవవాడు పడుచున్నప్పటికీ అకర్తయే అగుచున్నాడు. ఈ చిత్తము ఏ విధంగా ఉంటే, పురుషుడు అట్లాగే ఉంటాడు సుమా!

❖

ప్రియ, అప్రియములు ... సుఖ దుఃఖములు - ఓ రాఘవా! నీవు కర్మలు చేస్తూ ఉండవచ్చు... లేక, చేయకుండా ఉండవచ్చు గాక! నీ చిత్తం మాత్రం ఆ కర్మలలో ప్రియం, అప్రియం, కర్తృత్వం, భోక్తృత్వముల రూపమున మగ్నంకాకుండా చూచుకో! ఎందుచేతనంటావా? ఈ జగత్తులో ఆత్మతత్వం ఒక్కటి తప్ప మరింకేపదార్థము సత్యము కాదు. మరి ఈ చిత్తము ఎందులోనైనా ఆసక్తిగొనవలసిన పనేమున్నది? తద్వారా లభించేదేమున్నది? ఈ జగత్తు, దీనియందు అంతర్గతమై యున్న సర్వ పదార్థములు... ఇవన్నీ కూడా శుద్ధ చైతన్యము యొక్క 'అభాస' (illusion) మాత్రమే సుమా!

జ్ఞేయమగు ఆత్మను అనుభవపూర్వకంగా ఎరుగని వానికే "సుఖదుఃఖములు' అనే భ్రమలు ఉంటాయి. ఆత్మకంటే వేరుగా ఆధార, ఆధేయములు లేవు సుమా! "నా స్వరూపము ఈ కర్త, భోక్త

మొదలైన సర్వ పదార్థములకంటే కూడా అత్యంత సూక్ష్మమైనది. ఆకాశమువలె సర్వవ్యాపక మైనది"... అని జ్ఞాని ఎరుగుచున్నాడు. అట్టి నిశ్చయమును సడలించగలిగినదేదీ ఈ జగత్తు నందు అతడు గాంచుట లేదు. క్రమంగా 'ఈ జగత్తంతా నా స్వరూపమే' అనే భావనను కూడా పొందుచున్నాడు. ఇట్టి నిశ్చయ భావములు సుదృఢపడగా "సర్వ భూతములను ప్రకాశింప జేయునట్టి సర్వవ్యాపమగు ఆత్మయే నేను" అను అనుభవం ఉత్పన్నమౌతోంది. "నేను సుఖ దుఃఖాలకు స్థానభూతుడను గాను"... అను దుఃఖరహిత స్థితి అతి సహజంగా అవలంబించ బడుతోంది. ఇక అతడు ప్రారబ్ధకర్మలను అనుసరించి లీలామాత్రంగా సర్వ వ్యవహారములందు పాల్గొనుచున్నాడు. వర్తించుచున్నాడు. వాటిచే కలుగు ప్రత్యేకత ఏదీ అతనికుండదు. తన ఆత్మ యందే ఈ సర్వమును, ఈ సర్వమునందు తన ఆత్మనే దర్శించేవానికి ఇక ప్రియ–అప్రియము లేమి? సుఖ–దుఃఖములేమి?

జ్ఞాని యొక్క మనస్సు - జ్ఞానియొక్క మనస్సు ఆపదలు ప్రాప్తిస్తున్న సమయంలో కూడా ఈ ప్రపంచమును శోభాయమానం చేస్తూ ఉన్నది. మనస్సు కంటే వేరుగా సుఖదుఃఖములు ఎక్కడ ఉన్నాయి? వాసనారహితమగు చిత్తము కలిగియుండుటచే జ్ఞాని సర్వదా 'అకర్త'గానే తనను తాను దర్శించుచున్నాడు. అనుభవములు అతని పట్ల అప్రభావితముగానే ఉంటున్నాయి. ఈ కాళ్ళూ చేతుల కదలికల వ్యవహారమంతా అతనియందు ప్రవేశించకయే, బాహ్యముననే ఉంటోంది.

సర్వకర్మలకు, సర్వచేష్టలకు, సర్వభావములకు, సర్వలోకములకు, సర్వగతులకు బీజము ఈ మనస్సే. అట్టి మనస్సు అనే బీజం త్యజించబడితే, కర్మలు కూడా స్వయముగా లయించగలవు.

మనస్సు ఆత్మజ్ఞానముచే మ్రింగివేయబడినప్పుడు మాత్రమే దుఃఖములు తొలగగలవు. పుణ్యపాపములు కూడా అప్పుడు విలయం పొందుతాయి. "ఆత్మకంటే వేరైనదంటూ ఎక్కడా లేదు" అని గ్రహించియున్న జ్ఞాని... ఈ శారీరక–వాచక–మానసిక కర్మలచే ఆక్రమించ బడినప్పటికీ... వాటికి తాను మాత్రం వశీభూతుడు కాడు.

లీలా వినోదం - ఒక బాలుడు ఒక చోట కూర్చుని ఉండి తన మనస్సు నందు ఒక గొప్ప నగరమును,ఆ నగరములోని వీథులను, ఆ వీథులలోని ఆట వస్తువుల ప్రదర్శనమును ఊహా మాత్రంగా పొందుచూ ఉంటాడు. ఇంతలో అమ్మ పిలుపు విని అక్కడి నుండి లేస్తూ ఆ సంకల్ప మహానగరమును క్షణంలో త్యజించివేస్తాడు. "మనోనగరంగా పొందబడినదంతా వాస్తవంగా లేదు" అను ఎరుకచేతనే కదా, అతనియందు దానిని త్యజించు సమయంలో ఎట్టి క్షోభ యేర్పడుట లేదు! నగరము, నగర వినాశనము కూడా అతడు ఊహామాత్రంగానే పొందుచున్నాడు. అట్లాగే ఆత్మ కూడా కర్మలు చేస్తున్నపటికీ పరమార్థదృష్టిలో ఏమియూ చేయకయే ఉంటోంది. లీలా మాత్రంగా ఒక సమయంలో దుఃఖములను అనుభవించుచు, మరొకప్పుడు "ఇదేదీ నాకు దుఃఖం కాజాలదు"... అని గమనించుచున్నది.

ఆత్మ దేనిని దుఃఖమని తనకు తానే నిర్వచించుకుంటోందో... అది దుఃఖకరమే అగుచున్నది.

'ఇవేవీ నాకు దుఃఖకరములు కావు" అని అది భావించుకొనుప్పుడో, (లేక నిర్వచించునప్పుడో) దానికి దుఃఖము కలుగజేయగలిగేది ఈ జగత్తులో ఏదీ లేదు.

అయితే ఒకడు వస్త్రములు ధరించుచున్నంత మాత్రంచేత అతడు వస్త్రములు అగుచున్నాడా? దుఃఖములు పొందుట జరిగినను, ఆత్మ దుఃఖ రూపముగా పరిణమించుటలేదు సుమా!

హేయ - ఉపాదేయములు (త్యజించటం - స్వీకరించటం) - వ్యవహారయోగ్యములుగా అగుచున్న ఈ ఎదురుగా ఉండే సర్వపదార్థముల యందు వాస్తవానికి హేయత్వము గాని, ఉపాధేయత్వము గాని లేవు (Nothing is repulsive or attractive by itself). అట్టి చమత్కారమంతా చోటు చేసుకుని ఉంటున్నది బుద్ధిలోనే.

హేయత్వము - త్యజింపవలసియున్నది.

ఉపాదేయత్వము - స్వీకరింపవలసియున్నది.

"నేను త్యజించాలి" అనుకున్న వస్తువు "స్వతహాగా దుఃఖకారకము" – అని అనటానికి వీలు లేదు. ఎందుకంటే, అది ఒకప్పుడు స్వీకరించబడినదే కదా!

ఏదైనా సరే, స్వీకరించుటచేతనే దుఃఖము సంభవిస్తోంది. స్వీకరించని వానికి ఆ విషయముతో సంబంధమే ఉండదు. ఇక దుఃఖమేముంటుంది?

ఎప్పటికైనాసరే, ఉపాదేయరాహిత్యము చేతనే (లేక 'గ్రహించుట' అనునది నిరోధించ బడుటచేతనే) దుఃఖము జయించవేయబడుతోంది. అయినా, ఆత్మకంటే వేరుగా ఏదీ లేనప్పుడు స్వీకరించబడేది (ఉపాదేయము) మాత్రం ఎందుకు దుఃఖింపజేయాలి? కనుక 'అవిజ్ఞాన పూర్వకమైన దృష్టిచేతనే దుఃఖాదులు వచ్చిపడుచున్నాయి... అంతేగాని హేయ – ఉపాధేయములు (త్యాజ్య గ్రాహ్యములు) స్వయముగా దుఃఖకరములు కావు"... అని గ్రహించు.

❖

ఆత్మ అకర్త, అభోక్త అయి ఉన్నదని మనం అనుకున్నాం. అవిద్య కారణంగానే అద్దాని యందు కర్తృత్వ – భోక్తృత్వములు ఆరోపించబడుచున్నాయి. అట్టి అధ్యారోపమే అనుభవమునకు కూడా కారణమగుచున్నది. అకర్తా భావనచే క్రమంగా ఆత్మ యొక్క వాస్తవ స్వభావం అనుభూతమౌతోంది.

శ్రీరాముడు: ఈ కర్మలు త్యజించటం, అకర్తగా అవటం సాధ్యమేనా?

శ్రీ వసిష్ఠమహర్షి: నిజమే, శరీరధారి కర్మలను ఎట్లా త్యజించటం? శరీర నిర్వహణకు అవశ్యకర్మలు ఉండనే ఉంటాయి. అయితే 'సమ్యక్ దర్శనము' అనే బలంచేత 'కర్మలు చేయువాడను" అను భావన అధిగమించబడుతోంది. కర్మలు త్యజించుట అంటే తనను తాను సర్వకర్మలకు అతీతమైన 'ఆత్మ'గా ఎరుగుటయే. ఓ రామా! నీవు మొట్టమొదటగా సత్యవస్తువు గురించి విచారించు. అట్లు విచారించినప్పుడు "శుద్ధమగు ఆత్మయందు కర్తృత్వ భోక్తృత్వములు లేవు"... అని నీవే గ్రహిస్తావు.

ఇంద్రియ దృష్టి - కొందరు ఇంద్రియార్థములగు విషయము లందు (శబ్ద స్పర్శ రూప రస గంధము లందు) రాగ ద్వేషాదులు కలిగి ఉంటున్నారు. వాటి కొరకై పుణ్యపాపములు ఆచరించు చున్నారు. అదృష్టములు (దృష్టము కానిది) అగు పుణ్యపాపములచే వివశులై ఆత్మోన్నత్యమును గ్రహించలేక పోవుచున్నారు. అట్టి "వివశత్వబుద్ధి" గలవారి దృష్టియందు మాత్రమే ఈ కర్తృత్వ భోక్తృత్వముల ప్రతీతి అంతా సంభవించుచున్నది. ఆత్మజ్ఞానులలో అట్టి వివశత్వబుద్ధికి చోటు లభించుటయే లేదు.

ఎవరి చిత్తమైతే సంసారమునందు సక్తము కాకుండా, ఆత్మవిచారణయందు మాత్రమే మగ్నమై ఉంటుందో, అట్టి తత్త్వవేత్తలకు మోక్షము అనుదాని ప్రస్తావన యొక్క అవసరమే ఉండదు. "ఇది బంధము, ఇది మోక్షము" అను ప్రహసనమంతా సంసారము నందు ఆసక్తిగల అజ్ఞానుల కొరకు, అజ్ఞానము తొలగించుకోవటానికి సాధనంగా మాత్రమే అయి వున్నది. జ్ఞానియందు శుద్ధాత్మతత్త్వము అత్యంత సహజంగా, కేవలంగా ప్రకాశిస్తూ ఉంటుంది. వాస్తవానికి అజ్ఞాని యందు కూడా అట్లే ప్రకాశిస్తోంది.

జ్ఞాని సర్వదా ఏమియు చేయనివాడై ఉంటున్నాడు. అజ్ఞాని ఇంద్రియ వ్యవహారములను ఆత్మకు ప్రతిపాదించి "నేను చేయువాడను" అను భావమునకు లోనగుచున్నాడు.

ద్రష్టకు అభిన్నమైన ఆత్మతత్త్వము తన యొక్క సర్వస్వరూపత్వమును తనకు తానే "ప్రకటించుకొనుట, ప్రకటించుకోకపోవుట" రెండూ నిర్వహిస్తోంది.

❖

న బంధోఽస్తి న మోక్షోఽస్తి నాబంధోఽస్తి న బంధనమ్ ।

అప్రబోధాదిదం దుఃఖం ప్రబోధాత్ప్రవిలీయతే ॥ (శ్లో. 22, సర్గ 38)

యథార్థానికి బంధముగాని మోక్షముగాని లేవు. బంధమును కల్పించగల కారణమూ లేదు. మరి దుఃఖము ఎందు కలుగుతోంది? అజ్ఞానము, అవిచారణల కారణంగానే సుమా!

అట్లు కలుగుచున్న దుఃఖం జ్ఞానంచే నశించగలదు. బంధ-మోక్షాలు మిథ్యారూపంగానే కల్పించబడుచున్నాయి. కాబట్టి రామా! సర్వమును సర్వదా త్యజించగలిగినవాడవై ఉండుము. ధీరుడవగుము. అహంకారం పారద్రోలివేయి. అనాసక్తబుద్ధిచే సర్వసాక్షిత్వం అవధరించియుండు!

❖❖❖

6. మోక్షసన్న్యాసం

శ్రీరాముడు: ఓ మహాత్మా! మీరు చెప్పుచున్నదానిని బట్టి "బంధ-మోక్షములు అనబడేవి అసంభవం. కేవలం పరబ్రహ్మము మాత్రమే సత్యము" అని అర్థమగుచున్నది. అయితే గోడ లేకుండానే ఎక్కడైనా లిఖించబడిన చిత్రం ఉంటుందా? ఈ సృష్టి అంతా ఏర్పడుతున్నది ఎక్కడ? బంధమే లేనప్పుడు మాకు కలుగుచున్న దుఃఖాదుల సంగతి ఏమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి: బ్రహ్మమే ఈ 'సర్వజగత్తు' రూపమున వివర్తభావము పొందుచున్నది. అది సర్వశక్తిమంతమైనది. కార్యశక్తులన్నీ బ్రహ్మము యొక్క సంకల్పం చేత బ్రహ్మమునందే ఏర్పడి ఉంటున్నాయి. అద్దాని ఊహాశక్తి మాత్రం చేత జగత్ ప్రవృత్తి అంతా ఏర్పడి భాసించుచున్నది. దానియందు ఉనికి, అసత్తు, ఉనికిరహితం. ద్విత్వఏకత్వములు, ఏకత్వ-అనేకత్వములు, ఆది అంతములు... ఇట్టి వివిధ కల్పనలన్నీ స్వయంకల్పితానుసారమే రూపమును దిద్దుకుంటున్నాయి. శక్తిహీనమైన దానియందు ఇవన్నీ ఏర్పడగలవా...? లేదు. అయితే ఈ ఉనికి మొదలైనవన్నీ కూడా ఆత్మ కంటే అన్యమైనవి కావు. సముద్రజలంలో తరంగములు, బుడగలు, సుడులు, ఆవృత్తములు మొదలైనవన్నీ ఏర్పడుచున్నాయి కదా! అట్లు వ్యక్తమగుచున్నవన్నీ జలముకంటే వేరైనవా? కావే!

చిదాత్మ మొట్టమొదట చిత్తముతో కూడిన జీవరూపమును చెందుచున్నది. అప్పుడు వాసనామయ... మనోమయశక్తులన్నీ తనయందే ప్రకాశమొనర్చుచున్నది. ఆ శక్తులన్నిటినీ అనేక రీతులలో ప్రకటితం చేస్తోంది. ఆ ప్రకటనలే నామరూపములతో కూడిన ఆ సృష్టియొక్క అనుభవమైయున్నది. ఉపభోగం (Diversed experiencing)చే వాటినన్నిటినీ (ఈ అనేకంగా కనిపిస్తున్న సృష్టిశక్తులన్నిటినీ) ధరిస్తూ మరల ఎప్పటికో తిరోభావముచే సర్వం త్యజించి వేయుచున్నది.

బ్రహ్మము నుండే...! -

లోకాః పరాద్ ఉపయాన్తి తస్మిం స్థిత్వా విశన్తి అలమ్ ।
తన్మయా ఏవ సతతం తరంగా ఇవ సాగరే ॥ (శ్లో 7, సర్గ 39)

ఈ జీవులందరి వివిధ దృష్టుల ఉత్పత్తి బ్రహ్మము నుండే ఏర్పడుచున్నది. బయలుదేరుచున్నది. అట్లాగే సమస్త పదార్థముల ఉత్పత్తి కూడా నిరంతరం బ్రహ్మమునుండే కలుగుచున్నాయి. ఆ పరమాత్మ నుండే సమస్తము ఉద్భవిస్తోంది. పరమాత్మయందే ప్రవర్తిస్తోంది మరల పరమాత్మ యందే లయమగుచున్నది. సముద్రములో ఉత్పత్తి అగుచున్న తరంగములు మరల ఎప్పటికైనా సముద్రమందే లయమగుచున్నాయి కదా!

ఈ సర్వము నిరంతరము ఆ పరమాత్మయందే తన్మయమై ఒప్పుచున్నాయి. మట్టిచే తయారు చేయబడిన అనేక బొమ్మలు మట్టిచేతనే తన్మయమై ఉంటున్నాయి కదా!

❖❖❖

7. నిత్యము నందు అనిత్యం

శ్రీరాముడు: హే మహాత్మా! మీ వాక్యములు గ్రహించుట మాకు కొంచెము కష్టమైనదిగా ఇక్కడ అనిపిస్తుంది. ఎందుకంటారా?.... అగ్నిలో శీతలత్వం (చల్లదనం) ఉంటుందా, ఉండదు. జలంలో దహనశక్తి ఎక్కడన్నా సంభవిస్తుందా? సంభవించదే!

చైతన్యములో జడత్వం ఉంటుందా? ఎట్లా ఉంటుంది?

అదృశ్యమగు బ్రహ్మమునందు దృశ్యము ఉండుట ఏమిటి? నిత్యమగు పరమాత్మయందు ఈ అనిత్యత్వమంతా ఏర్పడటం సమంజసమెట్లా అవుతుంది? కనుక, మీరు చెప్పిన వాక్యము, "సమస్త పదార్థముల యొక్క ఉత్పత్తి -స్థితి-లయములు బ్రహ్మము నందే చోటు చేసుకుని ఉంటున్నాయి..." అను దానికి తాత్పర్యమేమిటో నేను గ్రహించలేకపోతున్నాను.

ఇంద్రియములకు, మనస్సుకు కూడా వేరై, అతీతమై ఉంటున్న బ్రహ్మమెక్కడ?... క్షణ భంగురమగు ఈ పదార్థజాలమెచట? ఇది బ్రహ్మము నందు ఏర్పడుట ఏమిటి?

సరే, మీరు చెప్పినట్లు ఈ జగత్తు యొక్క నామరూపములు కాసేపు బ్రహ్మము నందే ఉత్పన్నమైనాయని అనుకొందాం. అట్లా అయితే ఈ జగత్తులో తారసపడుచున్న ప్రతి ఒక్క పదార్థము బ్రహ్మము యొక్క లక్షణము కలిగి ఉండాలి! ఈ పదార్థములన్నీ సత్-చిత్ ఆనంద మయము, శాశ్వతము, అఖండము అయి ఉండాలి కదా! దీపంలోంచి పుట్టినది దీపము వలెనే ఉంటోంది. మనుజుని నుండి మనుజుడు, గోధుమల నుండి గోధుమలు కలుగుచున్నాయికదా!

ఇదంతా బ్రహ్మము నుండి పుట్టుచున్నప్పుడు, బ్రహ్మమువలెనే ఉండాలి. కాని ఇక్కడి పరిస్థితి ఏమిటి? ఇక్కడి పదార్థములన్నీ నాశసహితమై, పరిమితమై, దుఃఖజనకమై ఎందుకు ఉంటున్నాయి? ఈ జగత్తు నిర్వికారమగు బ్రహ్మం నుండి కలిగితే, ఇవన్నీ నిర్వికారంగానే ఉండాలి.

"లేదు... ఈ జగత్తు ఆత్మకంటే భిన్నంగా వికారవంతమై యున్నది. కాని ఇది బ్రహ్మమునుండే పుట్టింది"... అని అంటారా? అనగా, బ్రహ్మము 'జగద్భావము' కలిగి ఉండాలి కదా? మరి అది 'భావాతీతము త్రిగుణరహితము' అని ఎందుకు చెప్పబడినట్లు?

మీరు చెప్పినట్లు "ఈ జీవులు... వారి వింత దృష్టులు... ఈ పదార్థజాలము"... ఇవన్నీ బ్రహ్మం నుండే, లేక పరమాత్మనుండే ఉత్పన్నమైనాయని అనుకుందాం... అప్పుడు "పరమేశ్వరుడు వస్తుదృష్టిని జీవులలో కలిగిస్తూ ఉంటాడు"... అను కళంకం ఆపాదించబడినట్లే కదా!

ఇంత విచారణ విన్న తరువాత నా ప్రశ్నలలో ఏదైనా లోపము ఉంటే నన్ను క్షమించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓహో! చాలా మంచి ప్రశ్ననే వేశావు. నీ సందేహములన్నిటికీ మేము ఇస్తున్న సమాధానం విను-

జలమునకు ఆకారమున్నదా? లేదు. కాని మనకు సముద్రములోని తరంగమునకు ఆకారము కనిపించుచున్నది కదా! ఆ ఆకారము వాస్తవమైనదేనా? కాదు.

అట్లే ఈ సమస్తము బ్రహ్మమునందు స్ఫురించుచున్నది. సముద్రజలంలో తరంగరూపమున కనిపిస్తున్నప్పుడు, 'తరంగము' అను రూపంగా అక్కడ ఎట్టి ఘనత్వము లేదు కదా! బ్రహ్మమునందు జగత్తుకు సంబంధించిన మాలిన్యము లేశమాత్రం కూడా లేదు.

అగ్నియందు ఉష్ణత్వము తప్ప మరింకేమి ఉంటుంది?

ఈ ప్రపంచమునందు బ్రహ్మముకంటే భిన్నమైన, ఏ కల్పనా ఎక్కడా లేదు.

శ్రీరాముడు: మహర్షీ! బ్రహ్మము దుఃఖరహితము, నిర్ద్వందము కూడా! మరి దాని నుండి కలిగిన ఈ జగత్తు దుఃఖమయముగా, ద్వంద్వసహితంగా ఎందుకు ఉన్నది? తండ్రీ! మీ వాక్యార్థము లేమిటో నాకు ఇప్పటికీ బోధపడుటలేదు. మీ ఉద్దేశమేమిటో నేను గ్రహించలేకపోవుచున్నాను.

భగవంతుడు వసిష్ఠ మహర్షి రామునియొక్క ఈ ప్రశ్నను మౌనంగా విన్నారు. ప్రశాంత మైన చిత్తముతో ఆతని రెండు ప్రశ్నల పూర్వాపరములను పరిశీలిస్తూనే తనయందు ఇట్లు యోచించసాగారు.

శ్రీ వసిష్ఠ మహర్షి: (తన అంతరంగంలో) "ఈ రామచంద్రుని బుద్ధి ఇంకను పూర్ణ ప్రకాశము పొందినట్లు లేదే? కొంచెము నైర్మల్యము ఇంకను మిగిలియే ఉన్నట్లున్నది. ఇప్పుడు ఇతని బుద్ధిని ఆత్మవస్తువునందు సూటిగా ప్రవేశింపజేయాలి. అప్పుడు ఇతనిలో ఇంకా ఏర్పడి ఉంటున్న సంశయములకు చికిత్స జరుగగలదు. ఎవరి బుద్ధి అయితే పరిపక్వత కలిగియుండదో అట్టి వాడు... "ఈ జగత్తు బ్రహ్మమే'... అను వాక్యమునకు అర్థమును గ్రహించలేదు.

ఎవరైతే పరిపక్వమైన బుద్ధితో జగద్భావము త్యజిస్తాడో, చిదేకరసమగు ఆత్మతత్త్వమును మాత్రమే దర్శించగల సమర్థత కలిగి ఉంటాడో... అట్టివాడు మాత్రమే "జ్ఞాతజ్ఞేయుడు'.* అట్టి ధీమంతుడు మాత్రమే "సర్వం బ్రహ్మమే" అను మోక్షప్రవచనము యొక్క పరాకాష్ఠకు తగినవాడ గుచున్నాడు. అట్టి మహాత్ములు ఆ పదార్థాదులందు దోషబుద్ధి పొందుటలేదు. వారు సర్వపరిమిత దృష్టులు అధిగమించి ఉంటున్నారు. అందుచేత ఇందలి సర్వాత్మకత్వము వారికి తప్పక అవగతమ గుచున్నది.

ఈ జగత్పదార్థముల ఉనికి, వినాశనములకు, అప్రమేయమగు ఆ ఆత్మతత్త్వమునకు.... ఈ రెండింటికీ కూడా ఆత్మజ్ఞానికి విరోధమేమీ కనిపించుటలేదు. అందుచేత ఈ రామచంద్రునికి నేను ఈ జగత్తులో కనబడే వస్తువులయొక్క దృశ్యము యొక్క వాస్తవతత్త్వమేమిటో బోధిస్తాను. అప్పుడు గాని ఇతనికి ఉత్తమ విశ్రాంతి లభించదు.

దృశ్య ప్రపంచమును ప్రాప్తింపజేయగల 'భోగదృష్టి' కలిగి ఉన్నంతకాలం ఈ జీవుడు దృశ్యంలోని ఏవేవో విషయములను భావిస్తూనే ఉంటాడు గాని, మహావాక్యముల యొక్క అర్థమును గ్రహించగలుగుతాడా? లేదు. పైగా, అనుక్షణం తత్త్వజ్ఞానము నుండి 'చ్యుతి' పొందుతూనే ఉంటాడు.

బుద్ధి పరిపక్వత పొందనప్పుడు "నాయనా! నీతోనూ, నాతోసహా ఈ సర్వము బ్రహ్మమే"... అని చెప్పితే మాత్రం ఏం లాభం? విషయభోగేచ్ఛ ఉన్నంతవరకు బ్రహ్మమును ప్రతిపాదించు వాక్యములు చిలుకపలుకులవలెనే ఉంటూ ఉంటాయి. భోగేచ్ఛ నశించిందా, అప్పుడు క్రమంగా అజ్ఞానం తొలగటం, "ఈ సర్వము ఆత్మ స్వరూపుడనగు నా మహిమయే" అను ఎరుక ఏర్పడటం ఒక్కసారే జరుగుతూ ఉంటాయి.

---

* జ్ఞాతజ్ఞేయుడు = ఏదైతే తెలుసుకొనవలసియున్నదో అది తెలుసుకొనినవాడు.

అందుచేత 'అప్రబుద్ధుడు', అర్ధప్రబుద్ధుడు అయిన శిష్యునకు మొట్టమొదట శమము, దమము (Discipline of one's own internal and external Avocations) అభ్యసించేటట్లు చేయాలి. అప్పుడు అతని దృష్టి, అవగాహన, ఆర్తి, పరిలక్ష్యములు... ఇవన్నీ పరిశుద్ధత పొందుతాయి. అటుపై 'తత్ త్వమ్' 'జీవోబ్రహ్మేతినాపరః" మొదలైన ఆత్మతత్త్వప్రతిపాదకమగు వాక్యాలు సోదాహరణ పూర్వకంగా విశ్లేషించి చెప్పాలి. అర్ధప్రబుద్ధుడగు శిష్యునికి 'ఈ జగత్తు లేదు... అందుచేత దీనిని నీ హృదయమునందు రహితం చేయి... అందుకుగాను ఉత్తమ ఆచరణ పరుడవు. స్వధర్మపరుడవు కావాలి"... అని చెప్పుచూపోతే, అతనిని తికమకపరచినట్లే అవుతుంది. అపరిపక్వ దృష్టిగల శిష్యుడు గురువు చెప్పినదానికి పెడార్థం ఇచ్చి, చివరకు మహాజాలంలో చిక్కుకునే ప్రమాదం ఉంటుంది. శిష్యులలో కొందరు ప్రబుద్ధులై ఉంటారు. ఉత్తమమైన అర్థమును అనుద్వేగపూర్వకంగా గ్రహించి ఆకళింపు చేసుకునే సామర్థ్యము కలిగి ఉంటారు. 'భోగేచ్ఛ – లోభ మోహములు'... మొదలైన దుష్ప్రవృత్తిని త్యజించి ఉంటారు. అతడి ముందు ప్రతిపాదించబడిన 'పరమసత్యము' గురించిన సమాధానం పవిత్రత పొందుతోంది. "నాయనా! ఈ నేను–నీవు–ఈ జగత్తు, ఇందలి జన్మ కర్మలు ఇదంతా బ్రహ్మము కంటే వేరైనవి కాదు. దీనంతటికి బ్రహ్మమే మూలము. ఇకముందు కూడా పరమేశ్వర తత్త్వమునకు వేరుగా ఏదీ ఎక్కడా ఉండజాలదు"... అని అర్హుడగు శిష్యునికి మాత్రమే బోధించటం సాధ్యపడుతుంది. అనింద్యమైన అవగాహన గల శిష్యుడు అది వింటున్నప్పుడు "నేను ఇది కాదు.. నేను ఇది"... అను సత్యమునకు సంబంధించిన అనుభవమును పొందుతాడు. మిక్కిలి మూఢబుద్ధిగల శిష్యుని సరిగ్గా పరీక్షించకుండానే "జగత్తు మిథ్య... సర్వము కల్పనయే.. బంధ మోక్షములు లేవు"... అని చెప్పటం చేత అల్పమేధస్సుగల శిష్యుడు అప్రతిష్ఠాకరమగు మార్గమును ఎంచుకొనుటకు, కొంచెం అవకాశం ఉండవచ్చు. "నీ ఇష్టం వచ్చినట్లు సంచరించవచ్చు" అని బోధసారమైనట్లు అనుకోవటానికి అది దోహదం చేయవచ్చు. ఎందుకంటే అట్టి శిష్యుడు తన ఉత్తమ అభ్యాసం నుండి విరమించు అవకాశం ఉన్నది.

సరే, ఉత్తముడగు ఈ నా శిష్యుడు రామచంద్రునికి అజ్ఞానాంధకారం నశింపజేసే పరమోత్కృష్ట సత్యము బోధిస్తాను.

❖

ఇట్లు యోచించి శ్రీ వసిష్ఠ మహర్షి రామచంద్రుని సంబోధించటం మరల కొనసాగించారు.

❖❖❖

8. ఆత్మయొక్క ఔన్నత్యం

శ్రీ వసిష్ఠ మహర్షి: ఈ జగత్తు దోషభూయిష్ఠమైనది. ... ఈ జగత్తే బ్రహ్మము.

ఈ విధంగా సిద్ధాంతాలు వేరు వేరు కోణాల నుండి ప్రవచించబడుచున్నాయి కదా! ఇదంతా కూడా, గురువు శిష్యునికి, భగవంతుని నిర్వచనము బోధించేటప్పుడు ప్రతిపాదించబడుచున్నది. ఈ అనేక విశేషములతో కూడిన రెండు రకములైన సిద్ధాంతములను విమర్శిస్తూ పోగా... ఈ జగత్తు వాస్తవానికి ఏది అయివున్నదో... శిష్యుడు దోషరహితమైన 'స్వబుద్ధి'తో గ్రహించ గలుగుతాడు. లోకంలో గురు-శిష్యవ్యవహారమంతా ఇట్లే ఒనగూడుతోంది.

బ్రహ్మము... "సర్వశక్తిమంతము, సర్వవ్యాపకము, సర్వవస్తువులందు ప్రత్యక్షము"... అయి ఉన్నది. నీవు ఐంద్రజాలికులను చూచే ఉంటావు. వారు మాయచే అనేక క్రియల ద్వారా ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు చూపిస్తూ ఉంటారు. ఆత్మ వాస్తవానికి మాయారహితము అయిఉన్నది. కానీ, మాయామయముగా అగుచున్నది. గొప్ప ఐంద్రజాలికుని వలె మట్టిని కుండగా, ప్రత్తిని వస్త్రముగా చేసి చూపుతున్నది. ఆకాశమునందు పూలతోటను, కొండపై జలాశయమును కల్పించగల ఈ ఆత్మయొక్క అపూర్వశక్తిని నిర్వచించి నిర్ధేశించేదెవ్వరు?

కల్పనావిశేషం చేత తాను ఉన్నచోటే భవిష్యత్ ఆకాశంలోని నగర నిర్మాణం చేస్తోంది. ఆకాశంలో నీలత్వం తొలగించి అక్కడ పృథ్వీతలమును నిర్మిస్తోంది. భూతలములో ఆకాశమును స్థాపిస్తోంది.

❖

ఎట్టిటి పద్మరాగమణిలో ప్రతిబింబించే ఆకాశం ఎఱుపురంగుతోనే ప్రకాశిస్తూ ఉంటుంది కదా! అట్లే ఈ జగత్తులో "ఉత్పన్నం అయినది, ... ఉత్పన్నం కానున్నది" అంతా కూడా స్వతహాగా అసత్తే అయి ఉన్నది. బ్రహ్మము యొక్క సత్తచేతనే ఈ జగత్తు సత్తువలె అనుభూత మగుచున్నది.

ఈశ్వరుడు (లేక, ఈశ్వరస్వరూపుడగు జీవుడు) స్వతహాగా అవ్యక్తరూపుడే అయినప్పటికీ విచిత్ర రూపమున తనను తాను ప్రదర్శించుచున్నాడు. ఎట్లా అంటావా?... స్వప్నంలో వస్తుజాలం అనుభవమవడం మనం చూస్తున్నాము కదా! స్వప్నద్రష్ట స్వయంకల్పితము, ఊహాజనితము అగు వస్తువులను, మనుష్యులను కల్పన చేసుకొని "ఇదంతా వాస్తవమే" అని తలచి, ఆ స్వప్నంలో సుఖ దుఃఖాదులన్నీ అనుభవిస్తున్నాడు.

అసలు ఈ జీవుడెవడు? "నేను...ఇది...శరీరము" మొదలైనవన్నీ తెలుసుకుంటున్నట్టి అవ్యక్తమగు ప్రజ్ఞారూపమే ఇతడు కదా! అయినప్పటికీ, ఇతడు కాళ్ళు - చేతులు - కన్నులు మొదలైనవాటితో కనబడుచున్నాడు.

ఇదే రీతిగా సర్వాత్మకమగు ఆత్మవస్తువు సర్వకాలములందు, సర్వత్రా, సర్వరూపమున సంభవత్వము పొందుతోంది. ఒకే ఆత్మ వస్తువు ఇంతకు ముందు జన్మించిన సర్పుల రూపమున,

ఇప్పుడు నీవు, నేను, ఈ సభికులు, తదితరులు రూపమున, ఇకముందు ఇట్లే అనేక భవిష్యత్ జీవుల రూపమున ప్రకటితమగుచున్నది.

ఇక హర్షామర్షములకు తావెక్కడిది? ఎవరికి?.... సమత్వమును అధిరోహించిన జ్ఞాని ఎన్నటికీ విస్మయమునుగాని, గర్వముగాని, సమ్మోహమును గాని, హర్ష–శోక–వికారములను గాని పొందదు. ధీరుడైనవాడు సర్వదా సమరూపమును ఆశ్రయించి ఉంటున్నాడు.

❖

అనంత దేశ, కాల యుక్తమగు ఆత్మయందు విచిత్రమగు దృశ్యరచనాశక్తి కనిపిస్తోంది. ఆత్మయే యత్నపూర్వకంగా అనేక ఫలితములతో, ప్రయోజనములతో కూడిన రచన యొక్క కల్పన సాగిస్తోంది. సముద్రము తనయందలి తరంగములను తిరస్కరిస్తోందా...? లేదు కదా! ఆత్మ కూడా తన ఈ అద్భుతమైన సృష్టి రచనను తిరస్కరించుటలేదు.

ఆత్మయందు ఈ జగశ్శక్తులు ఎట్లా ఉండి ఉంటున్నాయి?...పాలలో నేయిలాగా...మట్టిలో భవిష్యత్‌లో ఏర్పడగల కుండలాగా...దారమునందు వస్త్రములాగా...ఒక చిన్న మఱ్ఱివిత్తనంలో మహావృక్షంలాగా... ఆత్మయందు సర్వశక్తులు వ్యక్తావ్యక్తంగా స్థితి కలిగి ఉంటూ, ఒకప్పుడు వ్యవహారవంతము అగుచున్నాయి. వ్యక్తమగుచున్నాయి.

నీరు ఒకప్పుడు నిశ్చలంగా ఉంటోంది. ఎప్పుడో ఆ నీటిలో తరంగాలు ఏర్పడుచున్నాయి. మరొకప్పుడు అదే నీరు తిరిగి నిశ్చలత్వం పొందుతోంది. అయితే అనేక ఆకారాలతో కనిపిస్తున్న తరంగాలు జలం కంటే వేరైనది ఎప్పుడు? ఎప్పుడూ లేదు. అట్లాగే, బ్రహ్మం కంటే ఈ 'నేను–నీవు –ఆకాశం–పృథివి–కాలం–దూరం'... మొదలైన వాటితో కూడిన ఈ జగత్ రచన వేరైనది కానేకాదు.

"నాత్ర కశ్చిత్ కర్తా, నభోక్తా, నవినాశమేతి"

ఈ ప్రపంచమునకు కర్త గాని, భోక్త గాని ఎవ్వడూ లేదు. ఎవ్వడూ ఏమాత్రం వినాశనము పొందుటయే లేదు. కేవలం సాక్షిస్వరూపము, నిరామయము, సమరూపము, నిత్యము, సంక్షోభ రహితము అయినట్టి 'ఆత్మతత్వము' నందే ఈ విధంగా అంతా సిద్ధించుచున్నది.

దీపం ఉంటే చాలు, ప్రకాశం ఉంటుంది. సూర్యుడు ఉంటే చాలు, పగలు ఏర్పడుతోంది. పుష్పం ఉంటే చాలు, సుగంధం ఉంటోంది. అధిష్ఠానమగు చైతన్యము ఉండుటచేతనే ఈ జగత్తు స్వయంగా ఉత్పన్నమగుచున్నది.

వాయువు నందు స్పందన ఉన్నది. అయితే ఆ స్పందనకు వాయువు కంటే వేరైన ఉనికి ఉన్నదా? లేదు. అట్లాగే నీకు ఎదురుగా కనబడుచున్న "ఈ జగత్తు బ్రహ్మము యొక్క అభాస మాత్రమే"... అని గ్రహించు. అనగా, బ్రహ్మమే స్వకీయకల్పనచే ఇంద్రియాత్మకమైన తాదాత్మ్యం యొక్క ప్రయోజనంగా ఇట్లు, జగత్తు లేక దృశ్యముగా ప్రాప్తిస్తున్నది. ఇంద్రియ మాత్ర భావన యందు ఆరూఢుమైవున్నవాడు ఇక్కడ అనేక వస్తు సమూహములను జన సమూహములను

గాంచుచున్నాడు. "ప్రియము–అప్రియము"లతో కూడిన భావనయే "సత్యం–అసత్యం"ల మధ్య సుఖ దుఃఖానుభవాలుగా ప్రకటితం అగుచున్నది. ఇక్కడ కనబడుచున్నదంతా సత్తు కాదు. అసత్తు కూడా కాదు.

❖

ఇక్కడ ఒక విషయం ముఖ్యంగా గ్రహించు. ఈ అనేక జగద్భావనలు వాయువీచికల వలె వచ్చి పోతూ ఉండవచ్చు గాక! అయితే, ఆత్మయొక్క సన్నిధాన ప్రభావంచేతనే ఈ జగద్దోషములు కూడా ఉనికిని కలిగి ఉంటున్నాయి. ఏది ఏమైనా, ఆత్మను ఇవేవీ స్పృశించుట లేదు. భగవానుడగు ఆ పరమాత్మ ఎల్లప్పుడూ సర్వమునకు వేరుగా, సర్వమునకు సాక్షీభూతుడై పరమాత్మస్థితి యందే శాశ్వతతత్త్వమై ఉండి ఉంటున్నాడు. అతనికి ఏ కర్తవ్యాకర్తవ్యములు లేవు. "నా స్వరూపము అట్టి సాక్షీభూతమగు పరమాత్మతత్త్వము కాదు. మరింకేదో అయివున్నది"... అని భావించుట చేతనే సర్వ రకములైన దోషములు వచ్చి పడుచున్నాయి.

లయమైన దానిని సృష్టించేది, సృష్టించినదానిని లయం చేసేది ఆ పరమాత్మయే. ఆ పరమాత్మ యందు ఈ జగత్‌శక్తి ఒకప్పుడు పరిపూర్ణముగా, మరొకప్పుడు అల్పముగా వ్యక్తం అగుచూ ఉంటోంది. ఇంకొకప్పుడు అసలు వ్యక్తమే అగుటలేదు.

శ్రీరాముడు: హే మహర్షీ! ఇక్కడ నశించుచున్నదేది? స్థితి కలిగి వుంటున్నదేది? ఈ వస్తుజాల మంతా ఆత్మనుండే ఉత్పన్నము అగుచున్నదా? లేక, మరెక్కడి నుంచోనా?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఆత్మస్వరూపము కాని వస్తువే నశిస్తుంది... ఆత్మస్వరూపము అయినది ఎట్లా నశిస్తుంది?... ఆత్మ స్వరూపమైనది మాత్రమే స్థితి కలిగి ఉంటుంది... ఆత్మ స్వరూపము కానిది స్థితి ఎట్లా కలిగి ఉంటుంది?

జీవుడు స్వకీయమైన అజ్ఞానముచే (బుద్ధి యొక్క అకుశలత్వం కారణంగా) ఆ తత్వమును అనేక వస్తుజాలము వలె దర్శించుచున్నాడు. ఈ వస్తుజాలమంతా ఆత్మ యొక్క స్వరూపమే అయి ఉండగా, ఇక "ఆత్మ నుండి ఇవి ఎట్లా ఉత్పన్నమైనాయి?" – అనే ప్రశ్నయే ఉదయించదుకదా!

ఓ రామా! "సమ్యక్ జ్ఞానము" అనే శక్తిని ముందుగా సంపాదించు. అప్పుడు "బ్రహ్మము నుండే ఈ సర్వము ఉత్పన్నమౌతున్నాయి" అని గ్రహిస్తావు. సూర్యకిరణములు అనేకమైనప్పటికీ, అవి సూర్యుని నుండి వేరు కాదు కదా! ఒక కిరణము ఒక వస్తువుపై, మరొక కిరణము కొండపై, వేరొక కిరణము జంతువుపై, ఇంకొక కిరణము గోడపై... ఇట్లు వేరు వేరు కిరణములు వేరు వేరు చోట్ల ప్రసరిస్తూ ఉండవచ్చు గాక! సర్వకిరణములకు సూర్యుడే ఉత్పత్తి స్థానమైనట్లు, ఈ 'సర్వము, సర్వులు' బ్రహ్మమునే ఉత్పత్తి స్థానంగా కలిగి ఉంటున్నారు.

పరామర్థ సత్యమగు "చిత్స్వరూపబలం – ఎరుక యొక్క అభినివేశము (The dynamics of knowing)" చేతనే ఈ జగత్తు దృశ్యమానమౌతోంది.

అవిద్య, పదార్థములు... ఈ రెండూ ఒకే క్షణంలో బ్రహ్మమునందు ఉదయిస్తున్నాయి. అట్లు ఉదయించి ఆ రెండూ కూడా వేలాది శాఖలతో విచిత్రములైన శుభ, అశుభ ఫలములచే ఒప్పుచున్నాయి.

చూచావా రాఘవా! సంసారం అనేక ఆశలతో, భయంకర దుఃఖకరాలైన ప్రయోజనాలతో, భోగ, వృద్ధ అవస్థలతో కూడి ఉంటోంది. ఫలితంగా ఇది ఆత్మకు బంధస్థానమగుచున్నది.

ఈ సంసార వృక్షమును 'వివేకము' అనే ఖడ్గముతో ఖండించివేయాలి. "సంసారముగా అనుభవమయ్యేదంతా స్వస్వరూప విన్యాస చమత్కారమే!".... అను అవగాహనచే సందర్శిం చటమే ఇప్పుడు ఉపాయం. ఎందుకంటే, ఉన్న సత్యం అదే కాబట్టి!

తాళ్ళు తెంచుకున్న గజరాజు ఏంచేస్తాడు? హాయిగా సువిశాలమగు వనం వైపు పరుగులు తీస్తాడు కదా! నీవు కూడా ఈ సంసారము నుండి 'వివేకము' యొక్క సహాయం చేత విడువడుము. ప్రశాంతముగా, గంభీరముగా సర్వము గ్రహించినవాడవై నిశ్చింతుడవగుము.

❖❖❖

9. ఇదంతా కూడా బ్రహ్మమే

శ్రీరాముడు: మునీంద్రా! "బ్రహ్మపదమే" ఈ సర్వజీవుల యొక్క వాస్తవ స్థితి కదా! అసలు "జీవత్వము", "విచిత్రజీవుల ఉత్పత్తి" అనునవి బ్రహ్మపదమునందు ఎట్లు, ఏ ప్రకారంగా, ఎన్ని విధములుగా ఎందుకు సంభవిస్తోందో సవిస్తరంగా చెప్పండి.

శ్రీ వసిష్ఠ మహర్షి: బ్రహ్మము నుండి ఈ చిత్ర విచిత్రములైన జీవజాతులన్నీ... ఎట్లు ఉత్పన్నమౌతున్నాయో, స్థితి కలిగి ఉంటున్నాయో, నశిస్తున్నాయో, ముక్తిని పొందుచున్నాయో సంక్షిప్తంగా చెపుతాను... విను–

బ్రహ్మం స్వతహాగా విషయరహితమైనది. అయ్యది సర్వశక్తి స్వరూపం, నిర్మలం కూడా! అట్టి బ్రహ్మం నందు జలంలో ఆవర్తం వలె 'చిత్‌శక్తి' రూపం పొందుతోంది. ఆవర్తంచే ఏర్పడిన ఆకారాదులు జలం కంటే వేరు కానట్లు, ఈ 'చిత్‌శక్తి' బ్రహ్మం కంటే వేరు కాదు. బ్రహ్మమునకు చెందినదే అయివున్నది.

అట్టి 'చిత్‌శక్తి' తన యొక్క 'సంకల్పించుట' అను స్వభావముచే మొట్టమొదట కించిత్ స్ఫురణను ఆశ్రయించి బ్రహ్మమొదలగు ప్రారంభ సృష్టికర్తల దేహరూపమును పొందుచున్నది. అనగా, స్వల్పముగా విషయాకారము పొందుచున్నది. అట్టి 'సంకల్పముల సమూహము' యొక్క బలముచే చైతన్యము ఘనత్వము చెందుచున్నది. అట్టి ఘనత్వముచే..."జీవము – మనస్సు" అను ఉపాధిరూపములుగా భావన చెందుచున్నది.

ఈ విధంగా బ్రహ్మము మనస్సు యొక్క సంకల్పమాత్రం చేత తన యొక్క బ్రహ్మస్వరూప మగు "దృక్' రూపమును త్యజించి 'ద్రష్ట" అను కర్తృత్వముతో కూడిన స్థితిని ఆశ్రయిస్తోంది.


"నేను ద్రష్టను"... "ఇది దృశ్యం"... "ఇది నాకు చెందినది"... వంటి భావాలు బ్రహ్మం పొందుతోంది. అయితే అది సంకల్పములు పొందుతూ ఉన్నప్పటికీ అంతమాత్రం చేత సంకల్పము లకు ఆవల ఉన్న తన స్వరూపమగు ఆత్మను పోగొట్టుకొనుచున్నదా? లేనేలేదు. అది తనను తాను ఏ క్షణమందు త్యజించుటలేదు. కాని త్యజించినదానివలె, "అసత్తే".... అయినట్టి ఈ జగత్తును విస్తరింపజేస్తోంది.

చిత్స్వరూపము అంతటా ప్రకాశిస్తూనే ఉన్నది. కాని బాహ్యదృష్టి కలిగియున్నప్పుడు శూన్యం వలె అగుచున్నది. యథార్థానికి కనబడే దృశ్యమంతా చిన్మయ రూపమే సుమా! కాని సాంసారిక దృష్టి గలవారికి మాత్రం ఇది భూతాకాశ మాత్రంగా (పంచ భూతాల సమ్మేళనం మాత్రమేగా) కనబడుతోంది.

చైతన్యము దేనిని ఎట్లు సంకల్పిస్తే అట్లే పరిణమించటం, ప్రాప్తించటం జరుగుతోంది. అది బ్రహ్మదేవుని స్వభావ - స్వరూపములను సంకల్పించిందనుకో... అప్పుడు అది తనను బ్రహ్మ దేవుని రూపముగానే గాంచుచున్నది. అనగా, "ఈ త్రిలోకముల రూపమున అనేక జీవరాసులతో కూడి ప్రకాశించుచున్నది నేనే... నా యొక్క స్వరూపమే" అను భావన ఎక్కడ ఆశ్రయిస్తుందో, అది అట్టి అనుభవమునే అక్కడ పొందుచున్నది. అట్టి భావనకు ఉపక్రమించిన జీవునే 'హిరణ్యగర్భుడు' అను పేరుతో కూడా చెప్పుకుంటున్నాం. ఆ హిరణ్యగర్భుడే తదితర పదిమంది ప్రజాపతులతో కూడిన ఈ జగత్కల్పన కంతటికీ కారణమగుచున్నాడు.

చతుర్దశ విధానస్త భూతజాత నఘుంఘుమా ।
సృష్టిరేవమియం రామ చిత్తనిర్మితమాగతా ॥ (సర్గ 40, శ్లో 9)

పదునాలుగు లోకములందలి అనంతప్రాణికోట్ల రూపమున ఉన్న ఈ 'సృష్టి' అంతా చిత్తము నుండే ఏర్పడుతుంది. అందుచేత "చిత్తమే సృష్టి. చిత్తమునకు వేరుగా సృష్టిలేదు"... అని చెప్పబడుతోంది.



స్వతఃగా చూస్తే మాత్రం, ఈ సృష్టి ఆకాశమువలె శూన్యమైనది. ఇదంతా సంకల్పములోని నగరము వంటిది. కేవలము భ్రాంతి చేత మాత్రమే ఏర్పడి ఉంటోంది.

శ్రీరాముడు: బ్రహ్మము, జగత్తు వేరువేరైన లక్షణములు కలిగి ఉంటున్నాయి కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి: బ్రహ్మము మహాశక్తియుతము. సర్వ లక్షణ విలక్షణము. బ్రహ్మములోనే ఈ బ్రహ్మాండాలున్నాయి. ఈ బ్రహ్మాండములో కొన్ని జీవరాసులు కేవలం అజ్ఞానము నందు ఉండి ఉంటున్నాయి. మరికొన్ని జ్ఞానయుక్తమై ఉంటున్నాయి. ఇంకొన్ని విఘ్నములు కారణంగా మధ్యమధ్యలో 'చ్యుతి' పొందుచున్నాయి.

ప్రపంచముతోటి సంబంధం ఉన్న జీవులలో కొందరు మాత్రమే ఉత్తమ వైరాగ్యము ఆశ్రయించి ఉండుటచే, వారు తదితరులకు ఉపదేశించటానికి అర్హులై ఉంటున్నారు. విషయ వాసనలచే జీవులలో అనేకులు ఎన్నో మానసిక వ్యాధులకు గురౌతున్నారు. ఫలితంగా దుఃఖం, పిరికితనం, భయం, ఉద్వేగం మొదలైనవాటిని పదే పదే స్వల్ప కారణాల వలన కూడా పొందుచున్నారు. క్షణంలో రాగ–ద్వేష–భయ–మోహాదులచే వ్యాకులపడుచున్నారు. ఈ జీవుల లోని రాజసిక–తామసిక–సాత్విక జాతులు గురించి ముందు ముందు సవివరంగా చెప్పుకోబోవు చున్నాము. ఇప్పటికి మాత్రం... నాశరహితము, సర్వవ్యాపితము, నిరామయము, చిదాభాస స్వరూపము, భ్రమరహితము, అనాది అనంతము... అయి ఉన్న బ్రహ్మము గురించే వివరిస్తాను.

నిశ్చల సముద్రంలో తరంగముల చంచలత్వం కానవస్తోంది కదా! అట్లాగే స్పంద రహితమగు ఆ పరమాత్మ యందు క్రియావిశేషము ప్రస్ఫుటమౌతోంది. ఆ క్రియావిశేషమే ఈ విధంగా జీవభావముగా ఘనత్వం పొందుతోంది. అట్టి క్రియావిశేషము యొక్క ప్రయోజనమే 'జగత్తు' అనబడు అనుభవం.

శ్రీరాముడు: మహాత్మా! అనంతమగు 'ఆత్మతత్త్వం' నందు 'ప్రదేశం' అనునది ఎట్లు ఏర్పడుతోంది? అందు "క్రియావిశేషము' ఉత్పన్నమవటమేమిటి? అవి ఎట్లు సంభవిస్తున్నాయి? ఆత్మయందు అసలు ఈ వికారములు ఎట్లు ఏర్పడుచున్నాయి? అద్వితీయమగు ఆత్మ యందు స్పంద ఎట్లా కలుగుతోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఈ "జీవుడు – బ్రహ్మం – మనస్సు – బుద్ధి – అహంకారం – దృశ్యం మొదలై నవన్నీ పరమాత్మచేతనే, లేక, పరమాత్మయందే ఏర్పడుచున్నాయని గ్రహించు. అయితే ఈ వాక్ రచనలన్నీ శాస్త్రవ్యవహారం కొరకే కల్పించబడుచున్నాయి. వాస్తవానికి ఇవేవీ ఎక్కడా లేవు. అనగా పరమార్థమున ఇవి ఆత్మకు వేరుగా ఉండుటలేదు. ఈ వికారములు, ఈ అవయవత్వము, ఈ దిక్కు, కాలముల సత్త, ఈ ప్రదేశభేదముల అనుభవం... ఇవన్నీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నపటికీ, ఇవి పరమాత్మ యందు ఏ మాత్రం సంభవించునవి కావు.

ఆ చిత్ ప్రకాశానికి, లేక, పరమాత్మకు వేరుగా ఎక్కడా ఏదీ లేదు. అందులో అన్యమైన ఎట్టి కల్పన లేదు, ఉండబోదు, ఉండజాలదు కూడా! ఇక శబ్ద, అర్థక్రమాలు ఎచట? కార్య, కారణత్వ మెచట? వ్యవహారదృష్ట్యా ఉత్పన్నమయ్యే వాక్యరచనకు ఆత్మయందు నిజమైన స్థానం లేనేలేదు.

అయితే, ఈ ప్రపంచమున ఏ ఏ కల్పనలు, శబ్దార్థములు, వాక్యసమూహములు ఉన్నాయో, అవన్నీ పరమాత్మ నుండే ఉత్పన్నమౌతున్నాయి. మట్టి బొమ్మలన్నీ మట్టియే అయినట్లు అవన్నీ

ఆత్మమయం, సద్వస్తురూపం అయి వున్నాయి. ఓ సూక్ష్మగ్రాహీ! రామచంద్రా! అగ్ని నుండి ఉత్పన్న మయ్యేవన్నీ అగ్నికాక మరింకేమౌతాయి చెప్పు? నిప్పురవ్వలన్నీ నిప్పే కదా! పరమాత్మ నుండి ఉత్పన్నమయ్యేవన్నీ పరమాత్మ స్వరూపమే అవుతాయి. ఇక ఈ 'జనించునది, జనింపజేయునది'... అను 'భేదకల్పన' అంతా మిథ్యయే అయివున్నది. ఈ జగత్తు యొక్క స్థితి అంతా మాయచేతనే సంభవిస్తోంది. ఇక పదార్థముల ఉత్పత్తి, వినాశనములు..." అనునదంతా ఒక కల్పన నుండి వేరొక కల్పనను ఉద్భవింపజేయుట మాత్రమే అయి ఉంటున్నది.

❖

నీటి యందు కదలికలాగా ఆత్మయందు క్రియాశక్తి యొక్క ఆధిక్యతచేతనే "జనించునది – జనింపజేయునది'... అను రూపముగల వేరు వేరు విషయాలు (జగత్తు–పరమాత్మ అనునవి) దర్శించబడుచున్నాయి.

ఒక పెద్ద రాయి నుండి ఖండింపబడిన మరొక చిన్న రాయి ఆ పెద్దరాయికంటే వేరైనది కాదు కదా! పెద్దరాయిలో, చిన్నరాయిలో పదార్థమొక్కటే. కానీ, ఆకారాదుల దృష్ట్యా వేరుగా కనబడుచున్నవి. అట్లే ఆత్మయందు కనబడే వేరు జీవులనబడే చమత్కారములన్నీ ఆత్మ ప్రసరణమే అయి వున్నది. "ఇది వేరు, అది వేరు. ఇతడు వేరు, అతడు వేరు.. నేను వేరు, నీవు వేరు" అనునట్టి ఈ శబ్దార్థవ్యవహార క్రమమంతా నామ మాత్రమే అయివున్నది. "వేరైనది–వేరుకానిది" అనేదంతా పరమాత్మ యందు లేదు.

ఎందుకంటావా? 'పరిచ్ఛేదము' అనేది ఉంటే కదా, భిన్నత్వము సంభవించేది! బ్రహ్మము నుండి ఉత్పన్నమైన 'మనస్సు' యొక్క శక్తి ద్వారా స్వభావపూర్వకంగానే ఈ నామ రూప కల్పన అంతా ప్రవృత్తమగుచున్నది. అంతే కాదు, మనస్సు యొక్క దృఢభావనచేతనే జగద్వ్యవహార మంతా సంభవిస్తోంది.

శ్రీరాముడు: అయితే "పరమాత్మ నుండి ఈ జగత్తు ఏర్పడుచున్నది" – అను వాక్యం అసమగ్రమైన అర్థమేనని అంటారా?

శ్రీ వసిష్ఠ మహర్షి: "ఒక అగ్ని శిఖ నుండి ఇంకొక అగ్ని శిఖ ఉత్పన్నమగుచున్నది"... అనునదంతా 'వాక్కు' యొక్క వైచిత్ర్యమేగాని, యథార్థం కాదు. ఎందుకంటే, ఆ రెండు అగ్నిశిఖలు ఒకే అగ్ని యొక్క రూపములే. పరమాత్మయందు 'జనింపజేయునది – జనించునది' ఎట్లా సంభవిస్తాయి చెప్పు? సర్వదా ఏకమై ఉంటున్న పరమాత్మ ఎట్లు, దేనిని, ఎందుకొరకు ఉత్పన్నం చేస్తున్నాడు?

ఒక మాట ఉన్నప్పుడు, దానికి విరుద్ధమైనది, భిన్నమైనది, రెండవది అయిన మరొకమాట ఉండటం ఆ మాట (లేక వాక్యము) యొక్క స్వభావం.

అయితే బ్రహ్మమునందు వచనాదులే ఉండవు కదా! ఇక ఈ శబ్ద అర్థ కల్పముల రూప మంటావా... ఇదంతా సముద్రములోని తరంగములకు ఒకదానికి మరొకదానికి ఉన్న భేదము వంటిదే. చిన్న పెద్ద తరంగములన్నీ జలమయమే కదా! తరంగదృష్టిని ఆశ్రయించి తద్వారా సముద్రమును, సముద్ర జలమును నిర్వచించగలమా? లేదు.

ఈ సర్వజగత్తు బ్రహ్మమే అయి వున్నది. ఇది మేము గాంచుచున్న శాస్త్రముల సారం. 'ప్రత్యగాత్మ' కూడా బ్రహ్మమే అయివున్నది. 'మనస్సు-బుద్ధి' అనునవి కూడా బ్రహ్మమే. ఈశ్వరుడు అనుదాని శబ్ద-అర్థములు బ్రహ్మమే. సర్వ వస్తువులందలి సారము బ్రహ్మమే.

బ్రహ్మసర్వమిదం విశ్వం విశ్వాతీతం చ తత్పదమ్।
వస్తుతస్తు జగన్నాస్తి సర్వం బ్రహ్మైవ కేవలమ్ ॥ (సర్గ 40, శ్లో 30)

ఈ విశ్వమంతా బ్రహ్మము యొక్క స్వరూపమే. అయితే బ్రహ్మం ఈ విశ్వమునకు పరమైనది కూడా. ఈ జగత్తు వాస్తవానికి లేనేలేదు. అంతయు కేవల బ్రహ్మస్వరూపమే అయివున్నది.

❖

కొద్ది క్షణముల మౌనం తరువాత -

శ్రీరాముడు: మరి ఈ విలక్షణములతో కూడిన వస్తుతత్వము మాటేమిటి? వివిధ జీవులు వివిధములైన లక్ష్యములను, ఆర్తులను కలిగి ఉంటున్నారే?

శ్రీ వసిష్ఠ మహర్షి: తరంగములు, సుడులు, బుడగలు, ఆవర్తములు - అంతా జలమే అయినట్లు... ఉంగరము, వడ్డాణం, గాజులు, గొలుసు - అంతా బంగారమే అయినట్లు... నీవు-నేను-అది-ఇది-లోకములు-పదార్థములు .... సర్వము బ్రహ్మమే. ఈ జగత్తు సంకల్పము ఉన్నచోట అనేకముగా, శుద్ధస్వరూపము ఆశ్రయించబడినప్పుడు బ్రహ్మముగా ద్యోతకమగుచున్నది.

ఓ రాఘవా! అటు ఆకాశం వైపు చూడు. తూర్పు వైపు ఆకాశం, పడమర వైపు ఆకాశం ఒక్కటా? వేరు వేరా? "ఈ ఆకాశ విభాగము వేరు... ఆ ఆకాశ విభాగము వేరు" - అనునది ఆకాశమునకు ఉంటుందా? విశాలమగు పరమాత్మయందు కూడా ఈ విభాగకల్పన లేనేలేదు. ఇక ఇది తూర్పు ఆకాశం, ఇది పడమర ఆకాశం అనునదంతా వికల్పోక్తితో కూడిన వాక్కు మాత్రమే. "నీవు-నేను-వాడు-వీడు-జన్మలు-మృత్యువు-దేవతలు-రాక్షసులు-మానవులు".... ఇవి కూడా అట్టివే. ఇవన్నీ సాపేక్షదృష్టి (Relative perception) ని ఆశ్రయించి మాత్రమే ఉంటున్నాయి. వీటి యందు అర్థవిచారణ చేసినప్పుడు 'సత్యము'నకు లభించునదేదీ ఉండుటలేదు.

ఒకచోట ఉన్నవానికి మాత్రమే "దిక్కులు, కాలము"... అను సాపేక్షతో కూడిన అనుభవం ఏర్పడి ఉంటోంది. ఆత్మయో, సర్వత్రా వ్యవస్థితమై ఉండగా, "ఆత్మయే సర్వదా నేనై ఉన్నాను" అను ఉత్తమార్థం గ్రహించినవానికి ఈ సాపేక్షత (Relativity) ఎక్కడ ఉంటుంది? ఉండదు.

శ్రీరాముడు: హే మహాత్మా! ఈ మనస్సు బ్రహ్మము నుండే ఉత్పన్నమగుచున్నది కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి: "బ్రహ్మము నుండి మనస్సు ఉత్పత్తి అగుచున్నది"... అనబడు వికల్పోక్తి అసత్యమైనదే సుమా! ఉదాహరణగా ఒక ప్రశ్న అడుగుతాను.

నీవు, నీ మనోరథములు వేరువేరా? నీ నుండి నీ భావనలు వేరైనవిగా చెప్పగలమా? వాటికి నీకన్నా వేరైన అస్థిత్వమున్నదా? 'గుణి' కంటే గుణములు వేరుగా ఎక్కడైనా ఉంటాయా?

లేదు.... లేనప్పుడు "ఆ గుణములు, భావములు, మనోరథములు నీ నుండి ఉత్పన్న మగుచున్నాయి"... అని అనటం ఎట్లా? "అదిగో రెండవ చంద్రుడు" – అని ఒక పిల్లవాడు అంటు న్నాడనుకో... ఆ రెండవ చంద్రుడు ఆతనికి ఆకాశంలో కనిపించటానికి కారణమేమిటి? ఆ చూచు వాని దృష్టిదోషమే కదా! సత్యమునకు సంబంధించిన జ్ఞానము అల్పమగుచున్నప్పుడే బ్రహ్మము నందు ఈ వికల్పములన్నీ అగుపిస్తూ ఉంటున్నాయి. "ఈ వికల్పమంతా 'మనో చాపల్యము' చేతనే ఉత్పన్నమగుచున్నది" అనుటలో సందేహమే లేదు. ఆత్మ యొక్క సాన్నిధ్యము చేతనే మనస్సు స్థితి – స్పందనలు పొందగలుగుతోంది. అయినప్పటికీ, "ఆత్మ ఇట్లు మనస్సుగా పరిణమిస్తోంది"... అని అనవీలులేదు. ఎందుకంటావా? ఏ క్షణ మందు కూడా ఆత్మ తన శుద్ధత్వం, నిర్మలత్వం, సాక్షిత్వం, అఖండత్వములను త్యజింపకయే ఉంటోంది. అజ్ఞానదృష్టికి మాత్రం – స్వయంకృతమైన సంకల్పములు ఘనీభూతమగుచున్నాయి. ఆ కారణంగా ఆత్మయే, 'ఇది జీవము, ఇది జగత్తు' అనునట్లుగా తోచుచున్నది.

సర్వస్వరూపము, సర్వవ్యాపియగు ఆ "అనంత బ్రహ్మపదము" నుండి మరింకేదీ ఎన్నడైనా సంభవించటానికే వీలులేదు. దాని నుండి ఆవిర్భవిస్తున్నట్లు తోచుచున్నదంతా బ్రహ్మమే అయి వుంది. బ్రహ్మతత్త్వము లేనిచోట ఏదీ అగుపించదు, ఉత్పన్నము కాదు. బ్రహ్మము వలననే బ్రహ్మమునకు ఇదంతా తెలియవచ్చుట జరుగుతోంది.

ఒకే వ్యక్తిని చూస్తున్న మరి కొందరు "ఇతడు నా తండ్రి... నా కుమారుడు... నా అల్లుడు... నా మనుమడు... నా మిత్రుడు..." ఇట్లా అనేక రీతులుగా అతనితో తమకు గల స్థితి, సంబంధా లను బట్టి భావిస్తున్నారు కదా! అందరూ చూస్తున్నది ఆ ఒకడినే కదా! అట్లాగే, ఒకే బ్రహ్మము అనేక నామరూపములతో ద్రష్టయొక్క స్థితిగతులను అనుసరించి కనబడుచున్నది. "ఇదంతా బ్రహ్మమే (సర్వంఖిల్విదమ్ బ్రహ్మ)" అనునది వేదవాక్యసారమే అయివున్నది. ఈ విషయమునే మనం ఈ గ్రంథంలో అనేక కోణముల నుండి సుస్థీకరణ పూర్వకంగా నిరూపిస్తున్నాం.

"పరమార్థతత్త్వము" అయి వున్న ఆ పరబ్రహ్మము నందు 'అవిద్యాదులు' అనబడే సంసార దోషం ఈషన్మాత్రం కూడా లేదు.

శ్రీరాముడు: స్వామి! మరి జీవునికి కనిపిస్తున్న ఈ విషయ వ్యవహారముల మాట ఏమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఇవన్నీ జీవునకు అసమగ్రదృష్టి, అజ్ఞానములచే దోషముల చేతనే అనుభవ మగుచున్నాయి. కనుక, అజ్ఞానం నశించిందా... ఇక ఆపై ఈ కనబడే సర్వమందలి "శుద్ధ పరమాత్మ బ్రహ్మతత్త్వము"... నీవు దర్శించగలవు సుమా! ఒక పాత్ర బాగా మాలిన్యముతో కప్ప బడి ఉన్నదనుకో... ఆ మాలిన్యమును శుభ్రం చేసి తొలగిస్తే పాత్ర యొక్క వాస్తవమైన మెరుపు గోచరిస్తుంది కదా! అట్లే, అజ్ఞానము నశించగానే బ్రహ్మపదము ప్రత్యక్షము కాగలదు.

దీపం వెలిగించటంచేత గదిలోని చీకటి తొలగితే, అప్పుడు గదిలోగల వస్తువులన్నీ చక్కగా కనబడతాయి కదా!

ముందుగా అజ్ఞానముచే కలుషితమైయున్న ఈ దృష్టిని పరిశుద్ధపరచుకోవాలి. అప్పుడు ఈ విశాలదృశ్య జగత్తు సర్వ వికల్పములతో సహా దృష్టి నుండి ఉపశమించగలదు. నిర్మలమైన అద్దంలో ప్రతిబింబము ఎంతో స్పష్టంగా చూడగలం. సత్యస్వరూపమగు బ్రహ్మము నిర్మలమైన బుద్ధి యందు నిశ్చయత్వము, స్థిరత్వము పొందగలుగుచున్నది. అప్పుడు ఆ ద్రష్ట తన యొక్క పరిశుద్ధ స్వస్వరూపమునే సర్వేసర్వత్రా, సర్వదా, సర్వముగా గాంచుచున్నాడు.

ఇదే జ్ఞానానుభవం యొక్క పరాకాష్ఠ.

❖❖❖

10. అవిద్య - ఆత్మజ్ఞానానుభవం

శ్రీరాముడు: అహో మహర్షీ! మీ వాక్యములు అత్యంత శీతలములు, నిర్మలములు, ప్రకాశ యుక్తములై, మాపై అమృతవర్షం కురిపిస్తున్నాయి. ఎన్ని సుకృతముల ఫలితంగానో "మీ ఈ ప్రవచనమును వినగలుగుట, పొందుట" అను వరం మీ నుండి పొందుచున్నాం!

హే ప్రభో! మీ వాక్యములు మహాప్రభావములు కలిగి ఉంటున్నాయి. మహోత్కృష్టమగు సత్యమునే ప్రతిపాదిస్తున్నాయని మేము గ్రహిస్తున్నాం. అయితే మా యందు అనేక జన్మలుగా పేరుకొని యున్న అజ్ఞాన దోషము చేత కాబోలు... గంభీరార్థం సంతరించుకొని యున్న మీ వాక్యములు వినుచుండగా క్షణకాలం జ్ఞానప్రకాశం బయల్వెడలుతోంది. ఇంతలోనే మరొక క్షణంలో ఎక్కడి నుండో అజ్ఞానం వచ్చిపడుతోంది. ఈ విధంగా జ్ఞాన – అజ్ఞానముల మధ్య కొట్టు మిట్టాడుచున్నాం. ఆకాశంలో మేఘముల రాకపోకలచే ఎండ – నీడలు ఏర్పడుచున్నట్లు మేము క్షణకాల జ్ఞానం, మరల ఏదో అనిర్వచనీయ అసమగ్రత్వం పొందుచున్నాం.

ఓ దేవా! ఆ పరమాత్మ అనంతము, అప్రమేయము, పరిపూర్ణము, సదా ప్రకాశవంతము, ఏక రసము, నిత్యోదితము పరమార్థస్వరూపము కదా..! అట్టి పరమాత్మయందు జన్మ కర్మలతో కూడిన ఈ వికారకల్పనంతా ఎందుకు సంభవిస్తోంది? "ఈ సృష్టి బ్రహ్మము నందు లేదు.. ఇది అయోగ్యమైయున్నది... ఈ సృష్టిబ్రహ్మమే"... మొదలైన విరోధవాక్యముల ఉద్దేశమేమిటి? ఈ విషయాలపట్ల ఆత్మ ఉన్ముఖమగుట ఏమిటి? ఈ మోహాదులు ఎక్కడి నుండి వచ్చి పడుచున్నాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామా! నేను చెప్పు సత్యార్థము ఒక్కటే. దీనిలో అయోగ్యత గాని, పూర్వాపర విరోధముగాని లేవు. వేదములచే ప్రపంచమునకు చాటబడిన మహావాక్యమలనే (అహం బ్రహ్మోస్మి, జీవోబ్రహ్మేతి నాపరః మొదలైనవి) ఇక్కడ అర్థయుక్తంగా మనం చెప్పుకుంటున్నాం. అంతే. అయితే నీవు బోధ యొక్క మధ్యలో "తితిక్ష–ప్రసన్నత–ఉత్తమ అవగాహన" ఈ మూడిటిని విడువవద్దు. ఈ మన సంభాషణ అనేక కోణముల నుండి పరిశీలిస్తూ ఉండగా నీ యందు పూర్వార్థరూ 'జ్ఞానదృష్టి' తప్పక ఉదయించగలదు. పూర్ణార్థప్రబోధము పొందగలవు. స్వస్థ చిత్తుడవు కాగలవు. అప్పుడు ఇతఃపూర్వం వింటూ వస్తున్న వ్యవహార వాక్యముల కంటే ఉత్తమమైన సత్యపదోన్నతిని నీ అంతరంగమునందే దర్శిస్తావు.

❖

పూజ్యులు, ఆత్మద్రష్టలు, సద్గురువరేణ్యులు అగు మహనీయులు తాము గ్రహించిన "వాక్ అతీత... అనుభవమాత్ర"... సత్యమును సర్వజనులను ఉద్ధరించే నిమిత్తం వేదాంత సిద్ధాంతముల రూపంలో ప్రతిపాదిస్తున్నారు. అట్టి ప్రయత్నములో కొంత శబ్దార్థయుక్తమగు వాక్యరచన అవసర మగుచున్నది.

ఉత్తమార్థము దృష్ట్యా చూస్తే, ఆ శబ్దములు (Jargons) కొంత భ్రమ సమన్వితములైన మాట వాస్తవమే కాని, ముల్లును ముల్లుతోనే తొలగిస్తున్నట్లు "మాయ" యొక్క దుర్వ్యసనమును మాయతో కూడిన శబ్ధార్థములచేతనే తొలగించటం జరుగుతోంది. "జీవుడు – బ్రహ్మము – ఆత్మ – పరమాత్మ – మనస్సు – బుద్ధి – జగత్తు – అహంకారము"... అను శబ్దములు అట్టివే. అయితే ఈ పదజాలము సత్యార్థజ్ఞానమునకు (బోధకు) తప్పక హేతువు అగుచున్నది. కాబట్టి "ఉపదేశ్య వస్తువగు ఆత్మజ్ఞానము బోధించటానికే ఇదంతా ఇట్లు రచించబడుచున్నది" అని గ్రహించు. "వాగ్జాలము సద్గురువులు" ఈ రెండిటి సమన్వయమును వివేకముతో గ్రహించాలి.

"వివేకదృష్టి – మహత్తర ఆశయము – అసలు ఉద్దేశం గ్రహించటం"... ఈ మూడూ ఏ సమయంలోనూ ఏమరచరాదు. మిథ్యా భ్రమలందు పడకూడదు సుమా! మన ఈ సంభాషణ శ్రద్ధగా వింటూ ఉండగా, వాచ్య – వాచక శబ్ధార్థమును నీవే గ్రహిస్తావు.

❖

అజ్ఞానుల కొరకు 'బ్రహ్మము'ను ఉపదేశించటానికి లేక "సత్యశాస్త్రార్థబోధ" నిమిత్తం జ్ఞానులచే వాక్ప్రపంచమంతా కల్పించబడినది. అయితే ఎవ్వరైతే ఇప్పటికే పరమార్థస్థితియందు ఉంటారో, అట్టివారి అనుభవమే ఉపదేశ్యవస్తువు అగుచున్నది. కనుక ఇక ఆపై ఈ వాక్ప్రపంచంతో పనేమున్నది?

ఆత్మ వాస్తవానికి పరమశుద్ధమైనది. అందు విషయోన్ముఖత్వం గాని, కర్మగాని, మోహాదులు గాని, రాగద్వేషములు గాని లేనే లేవు. అట్టి పరమార్థమగు ఆత్మయందే ఈ జగత్తు అంతా స్థితి కలిగియున్నది. ఆత్మయొక్క భావనా ప్రభవమే ఈ సర్వం యొక్క ఉనికి స్థానం అయి ఉన్నది. ఇదే విషయం అనేక యుక్తులతో అనేక కోణముల నుండి ఈ గ్రంధము నిరూపించి, వివరించి చెప్పుచున్నది.

శ్రీరాముడు: స్వామి! మరి ఈ జీవులలో అనేకమంది యొక్క అనుభవం అందుకు వ్యతిరిక్తంగా ఉంటోంది. "ఆత్మయే స్వరూపముగా గల నేను సర్వదా పరిశుద్ధుడను... విషయరహితుడను"... అను అనుభవం చాటున పడిపోతోంది. "నేను అల్పుడను, దీనుడను, పరిమితుడను, బాధితుడను, స్వల్పుడను".... అను భావనయే అధికమైన ప్రచారం కలిగి ఉంటోంది. కారణమేమిటి?

శ్రీ వసిష్ఠమహర్షి: నిజమే, ఈ జీవుడు తగినంత సాధనను ఆశ్రయించకపోవుటచేతనే, ఎన్ని రోజులు గడచిపోతున్నప్పటికీ ఆత్మయొక్క శుద్ధత్వము గాంచలేకపోవుచున్నాడు. "మూల అజ్ఞాన రూపము" (Causal Ignorance) అయినట్టి తమస్సు, అప్రయత్నశీలత్వము... ఈ రెండు పరస్పరం సహకరించుకుంటూ మోహమును అనేక శాఖోపశాఖలుగా విస్తరింపజేస్తున్నాయి.

వాక్ప్రపంచం లేకపోతే అట్టి "మూల అజ్ఞానము" గుర్తించబడజాలదు, తొలగించ బడజాలదు.

అవిద్యయైవోత్తమయా స్వాత్మనాశోద్యమేచ్ఛయా ।
విద్యా సా ప్రార్థ్యతే రామ సర్వదోషాపహారిణీ ॥ (సర్గ 41, శ్లో 13)

అనేక జన్మలలోని 'సుకృతము' ఫలిస్తూ ఉండగా అంతఃకరణం శుద్ధత్వము పొందుచున్నది. అనేక జన్మలుగా స్వీకరించడిన ఉపదేశములకు సంబంధించిన వాక్ప్రపంచం జీవుని జ్ఞాన మార్గంలో ప్రవేశింపజేసి ఆత్మయొక్క సామీప్యత ప్రసాదిస్తోంది. "ఉపదేశక్రమము, వాక్ప్రపంచము"... అను అవిద్య ద్వారా సర్వదోషనివారిణియగు విద్య ప్రకాశించుచున్నది.

అస్త్రము అస్త్రముచేతనే జయింపబడుతుంది కదా! పాత్రకు మాలిన్యము అంటినప్పుడు, మాలిన్యముతోనే ఆ పాత్రను తోమి, ఆపై నీటితో కడిగి రెండు మాలిన్యములను తొలగించి వేస్తున్నాం. విషము విషముతోనే శమిస్తుంది. శత్రువును శత్రువే నశింపజేస్తున్నాడు. అట్లే అవిద్య చేతనే అవిద్య నశిస్తోంది. "శాస్త్రపదజాలం" అను మాయసహాయంతో "దృశ్యం" అను మాయను ఎదుర్కొనుచుండగా, సర్వము అవగతం అవుతూ వస్తోంది. అట్టి స్థితిలో ఉభయమాయలు తమంతట తామే తొలగుచున్నాయి. అనగా శాస్త్రరచనారూపమైన మాయ స్వవినాశనము నందే ఆనందము పొందుచున్నది. మాయ యొక్క స్వభావం అత్యంత దుర్లభమైనదే... కాని, అది క్షణంలో మటుమాయ మగుచున్నది.

మాయ, విచారణ (Illussion & Enquiry) – మాయయొక్క స్వరూపము, స్వభావము అనిర్వచనీయములు. అది వివేకమును ఆచ్ఛాదించి ఉంటోంది. అనేక జగత్తులను ఉత్పత్తి చేస్తోంది. మాయ వాస్తవానికి లేనిదే కదా! అయినా కూడా ఈ దృశ్యము యొక్క ప్రాప్తికి, ఖండితమైన భావనాపరంపరలకు కారణము మాయయొక్క రూపమే.

ఈ మాయయొక్క రూపమేమిటి? ఇది ఎంతకాలంగా కలుగుతోంది? ఈ రెండు ప్రశ్నలు సమాధానరహితంగానే ఉంటున్నాయి. కాని, ఈ మాయ ఎట్లు తొలగించబడగలదో శాస్త్రములు, గురువులు మనకు విశదపరచుచున్నారు. ఆహాఁ! మాయయొక్క కార్యమే అయినట్టి ఈ దృశ్య జగత్తు ఏ విధంగా ప్రత్యక్షమై తాండవిస్తోందో చూస్తూనే ఉన్నావు కదా! ఎంత ఆశ్చర్యం!

"అవలోకించకపోవటచేతనే... (లేక, విచారించకపోవటం చేతనే) ఈ మాయ స్ఫురించు చున్నది"... అని విజ్ఞులు ప్రవచించుచున్నారు. అవలోకించి చూచామా... తప్పక క్షణంలో నశించిపోతోంది. అపరిజ్ఞాత రూపముననే (because of not verifying the reality / fact) అది స్ఫురించటం, విజృంభించటం జరుగుతోంది. ఈ విచిత్ర సంసార బంధమును కలుగజేస్తున్నట్టి మాయ ఎంతటి ఆశ్చర్యకరం? 'అసత్యమే' అయినప్పటికీ ఇది సత్యమువలెనే భాసిస్తున్నదే! ఇది ఎంతటి మిథ్యా వ్యవహారంగా రచించబడుచున్నదో... ఏమని చెప్పగలం! "అభిన్నము, పరమ పదము" అగు పరమాత్మ యందు ఈ మాయ సుదీర్ఘమైన ఒక స్రవంతిగా ఏర్పడి ఉంటోంది.

క్షరము, విశాలము అయిన ఈ భేదమంతా నిరంతరం విస్తరింపజేస్తోంది. అందుచేత "ఈ మాయ క్షర అక్షర స్వరూపమగు పురుషునికంటే అతీతుడైన పురుషోత్తముని ఆశ్రయించి ఉన్నది"... అని చెప్పబడుతోంది.

❖

ఓ ప్రియ రామా! నీవు మాత్రం "పరమార్థ స్థితియందు ఈ మాయకు స్థానమే లేదు".... అను నిశ్చయమునే సర్వదా కలిగియుండుము. నీవు జ్ఞానివి కావాలంటే నీ యొక్క అవగాహన – భావనలను 1) సత్యనిష్ఠుల వాక్యములు 2) వేదవేదాంత పాఠాల సారం 3) స్వకీయమైన తర్కం 4) స్వానుభవం... ఈ నాలుగిటిచేత ఉద్దీప్తం చేసుకుంటూ ఉండాలి.

ఎప్పుడైతే జ్ఞేయమగు మాయను తెలుసుకుంటావో, అప్పుడు నా ఈ వాక్యములోని అంతర్లీనమైయున్న మహత్తర ఆశయమును చక్కగా దర్శించగలవు.

ఇప్పటికీ మాత్రం నీవు పూర్ణంగా ప్రబుద్ధడవు కావలసియున్నది కదా! అందుచేత, నా వాక్యములపై విశ్వాసముంచు. గురు, శాస్త్ర వాక్యానుసారం విశ్వాసముతో "అవిద్య లేదు"... అను కొండంత బలము కలిగి యుండు. అట్టి నిశ్చయముతో సునిశితమైన బుద్ధి కలవాడవై, పరిశీలనాత్మకము, వివేచనాపూర్వకము అయిన దృష్టితో నా ఈ వాక్యాలు వింటూ వింటూ ఉండు. క్రమంగా అంతా నీకే విశదం కాగలదు.

"ఇప్పుడు మాకు ఈ దృశ్యము ప్రాప్తిస్తోంది. కాని ఈయన 'లేదు' అని సిద్ధాంతీకరించు చున్నారు. మరి విశ్వసించటం ఎట్లా?"... అని భావించి ఈ మన ప్రస్తుతం విచారణ వినుట విరమించావా... ఇక నీవు నీ సందేహ ప్రపంచమునందే జన్మలు, అనుభవములు, అజ్ఞాన భూమికలు పొందుతూనే ఉంటావు.

ఓ సర్వజనులారా! ఈ జీవుడు అనేక జన్మలుగా 'అవగాహనారాహిత్యము' తో కూడిన బుద్ధితో ఈ దృశ్యవ్యవహారంలోకి మరల మరల ప్రవేశిస్తున్నాడు. అట్టి అనేక సాంసారిక దుఃఖా లను పొందుచున్నట్టి ఈ మాయబద్ధ జీవుని దృష్టిలో పెట్టుకుని మా అనేక సంవత్సరముల పరిశ్రమను, శాస్త్రజ్ఞానమును, అనుభవమును రంగరించి ఈ యోగ వాసిష్ఠరామాయణ శాస్త్రమును ప్రతిపాదించుచున్నాము.

ఇప్పటి జీవుని స్థితిగతులు ఏమిటి? బ్రహ్మజ్ఞులచే ప్రవచించబడిన శాస్త్రములలోని అంతర్గత సారము ఎట్టిది?.... ఇవన్నీ గ్రహించిన తరువాతే ఈ విచారణను మీ ముందు ఉంచుటకు యత్నిస్తున్నాం. ఈ సంసార జీవునకు దుఃఖవిముక్తి కలగాలంటే జ్ఞానమొక్కటే సరి అయిన ఔషధం. అట్టి జ్ఞానం భక్తి, విచారణ, సత్ప్రవర్తన మొదలైన వాటిచే మాత్రమే దృఢపడుతోంది. ఈ మాచే చెప్పబడుచున్న వాక్యములు ఓర్పుతో, ఋషులపై విశ్వాసంతో, నిర్మల మైన బుద్ధితో, సూక్ష్మగ్రాహ్యపూర్వకమైన అవగాహనతో విచక్షణాసహితంగా వినండి. దీని ప్రయోజనమేమిటో క్రమంగా మీరే గ్రహించటం జరుగగలదు.

❖

యదిదం దృశ్యతాం యాతం మానసం మననం మహత్।
అసన్మాత్రమిదం యస్మాన్మనోమాత్ర విజృంభితమ్॥ (సర్గ 41, శ్లో 22)

ఈ కనబడే విశాల దృశ్యమంతా మనఃసంబంధమైనది మాత్రమే. అనగా, ఇదంతా మనస్సు యొక్క మననముచే విశాలరూపమున ఉదయించుచున్నది. మనో విలాసమాత్రమే అగుటచే ఇదంతా అసద్రూపమే అయి వున్నది. ఎవరి అంతఃకరణమునందైతే " ఈ జగత్తంతా మాయామయము... మిథ్య"... అను నిశ్చయం కలుగుతుందో, అట్టివాడు మాత్రమే మోక్ష భావమునకు అర్హుడగుచున్నాడు.

దృష్టియొక్క చంచలత్వమే సర్వ అనర్థములకు మూలము. "బాహ్యార్థభావన... ఇంద్రియ లోలత్వము.. భ్రమపూర్వకమైన సంబంధముపట్ల నమ్మిక"... అనువాటి వలననే జీవుడు ఈ సంసార బంధములందు మరల మరల చిక్కుకుంటున్నాడు. అయితే కొందరు మహనీయులు ఈ భూత వర్తమాన భవిష్యత్తు జగద్విషయములపట్ల వివేకపూర్వకమైన అవగాహనను ముందుగా సంపాదించుకుంటున్నారు. తద్వారా ఈ దృశ్యమును అనాసక్తబుద్ధిచే, "ఎప్పుడో, ఎక్కడో, ఎవరి పట్లనో జరిగిన ఏదో సంఘటన" వలె చూడటాన్ని అభ్యసిస్తున్నారు. ఈ దృశ్యము సద్రూపము కావచ్చు. లేక అసద్రూపము కావచ్చు... దృశ్యమంతటి పట్లా 'అనాసక్త బుద్ధి' కలిగియుండేవానిని ఇందలి సుఖదుఃఖములు, తదితర సంఘటనలు ఏమి చేయగలవు చెప్పు?

కిం అహమ్ దేహమస్మి? - నేను ఈ దేహ మాత్రుడనా?... ఎవడైతే 'ఈ దేహాదులే నేను" అను భావనచే ఈ దేహేంద్రియాదులను చూస్తూ ఉంటాడో.... అతడు తన యొక్క "శుద్ధ – ఏక – అఖండ".... భావనను గాంచలేకపోవుచున్నాడు. అందుచేతనే అతడు 'అవిద్యావంతుడు' అగుచున్నాడు. ఫలితంగా దుఃఖములన్నీ వచ్చిపడుచున్నాయి. పరమ పదమగు ఆత్మయందు "నేను జీవుడను, దేహిని, మనుజుడను, స్త్రీని, అధికారిని, రాజును"... మొదలైన వికారములు ఉండగలవా? ఉండలేవు. ఒక స్ఫటికంలో ఎదురుగా ఉన్న దృశ్యం ప్రతిబింబిస్తోందనుకో... "ఈ స్ఫటికంలో వృక్షములు, జంతువులు, తదితరరూపములు ఉన్నాయి. అవి కదులుచున్నాయి... ప్రవర్తిస్తున్నాయి" అని అనగలమా? లేదు కదా! కాని అవన్నీ ప్రతిబింబ మాత్రంగా స్ఫటికంలో కనిపిస్తున్నాయి. చిద్రూపమునందు ఈ నామరూపముల వ్యవహారమంతా స్ఫటికంలో ప్రతిబింబించే దృశ్యం వంటిది మాత్రమే.

ఓ రామా! వాస్తవమేమిటో చెప్పుచున్నాను, విను. ఈ నామ రూపములతో కూడిన దృశ్య జగత్తునందు నీవు లేవు. నీయందు అవి కూడా లేవు. ఏదైతే దోషభూయిష్టమైన దృశ్యరూపమున ఎదురుగా కనబడుతోందో అదంతా 'ఆత్మకు' వేరైనది కాదు.

శాస్త్రములు మాయ యొక్క సహాయం తీసుకొని మాయను తొలగించటానికి సహకరిస్తు న్నాయి. అవి మాయకు సంబంధించిన కార్యక్రమములతో కూడుకొని, ఉన్నప్పటికీ, ఆత్మజ్ఞానము సముపార్జించుటలో తప్పక సహకరిస్తున్నాయి.

అవిద్యాప్రవాహంలో కొట్టుకుపోతున్న ఈ జీవుడు శాస్త్రములచే ప్రసాదింపబడుచున్న ఆత్మజ్ఞానం లేకపోతే స్వాత్మానుభవం పొందజాలకున్నాడు.

ఆత్మజ్ఞానానుభవం శాస్త్రార్థములు గ్రహించుటచే తప్పక లభించగలదు. ఆత్మజ్ఞానం లేకపోతే 'సంసారము' లేక 'అవిద్య'ను ఎవ్వరూ దాటలేరు. ఆత్మలాభమే అక్షయమైన పదము.

❖

శ్రీరాముడు: మహాత్మా! తదితర విషయములన్నిటికన్నా కూడా "ఈ అవిద్య ఎక్కడి నుండి వచ్చి పడింది?"... అనే ప్రశ్న నన్ను ఆశ్చర్యచకితునిగా, సమాధానరహితునిగా చేస్తోంది.

శ్రీ వసిష్ఠ మహర్షి: "ఈ అవిద్య ఎక్కడి నుండి వచ్చింది".... అనే ప్రశ్న ప్రక్కకు పెట్టు. ఎందుకంటే మాయ అనిర్వచనీయం. "ఈ రోగము సంభవించటానికి ఏ ఏ కారణములు ఉండి ఉండవచ్చు?" అను ప్రశ్నను సుదీర్ఘంగా తర్కించటంకన్నా కూడా, "ఇప్పుడు ఈ రోగం తొలిగేది ఎట్లా?" అనునది ఉచితమైన ప్రశ్న అని విజ్ఞుల ఉద్దేశం. అసత్యమైన ఒక భావనను మనం అసత్యమైనదానిగా గుర్తించటమే అన్నిటికన్నా ముఖ్యం కదా! అవిద్య వలననే హృదయ మాలిన్యమంతా వచ్చిపడుతోంది. అది హృదయస్థానమంతా ఆక్రమించి ఉంటోంది. అట్లు హృదయంలోనే తిష్ట వేసుకొని యున్న ఈ సాంసారికదృష్టిని తొలగించుకొనుట ఎట్లో జనులు శ్రద్ధతో పరిశీలించెదరుగాక!

ఇప్పటికి "అవిద్య ఎందుచేత ఉంటోంది?" అనే ప్రసంగం వదలి "ఇది తొలగేదెట్లా" అను విషయం గురించే ప్రయత్నించవలసినదిగా శాస్త్రకారులు కూడా ప్రబోధిస్తున్నారు. "తాడు యందు పాము యొక్క 'స్ఫురణ' ఏర్పడటం ఎంతకాలంగా, ఎందుచేత, ఎట్లా ఏర్పడింది?" అనునది వీక్షించుచు కాలయాపన చేసే బదులు, "ఇది త్రాడు... నిష్కారణంగా ఇది పాము యొక్క భ్రమ కలిగిస్తోంది... కనుక త్రాడును త్రాడుగా మాత్రమే గ్రహించుట ఎట్లు?" అనునది సముచితమైన ప్రయత్నం.

కాబట్టి రామా! " ఈ అవిద్యను నేను ఎట్లా నశింపజేస్తాను?"... అనే విషయం పరిశీలించు. యోచించు. ప్రయత్నించు. అవిద్య నశించునప్పుడే యథార్థతత్వమంతా నీకు బోధపడగలదు. అవిద్య నశించిందా... ఇక "ఇదెక్కడి నుండి వచ్చింది? ఏ రూపమున ఉన్నది? ఎట్లువంటి ప్రవర్తన కలిగి ఉంటోంది?"... అనే విషయాలు వాటంతట అవే విశదమౌతాయి.

"శాస్త్ర పరిశీలన, ఉత్తమ ఆచరణ"... ఇప్పటికి ఈ రెండూ అవసరం సుమా! ఇంద్రియాల పట్ల ఏర్పడుచున్న వ్యామోహాన్ని ఆ రెండింటితో నిరోధించు. దృశ్యం పట్ల ఏర్పడుచున్న ఆకర్షణను 'అసంగము' అను ఆయుధముతో ఎదుర్కో! అప్పుడు అంతా క్రమంగా నీకే తెలిసిపోతుంది.

❖

పరమోత్కృష్టములగు సత్యము, భ్రమల దృష్ట్యా చూచినప్పుడు ఈ "అవిద్య" అనునది "లేనిదే" అని తెలియవస్తోంది. జ్ఞానము యొక్క అభావమే అవిద్య. లేక, చక్కటి పరిశీలనాత్మక బుద్ధిని వినియోగించనప్పుడే అవిద్య ప్రభవిస్తోంది. అట్లు ప్రభవించి, ఆపై అది ఈ జీవుని తన ఇచ్ఛ వచ్చినట్లు శాసిస్తోంది.

అయినా రామా! నాదొక ప్రశ్న. "ఇది అసత్య వస్తువు... ఇందు నేను పదే పదే భ్రాంతిని పొందుచున్నాను. అట్టి భ్రాంతియే నన్ను సత్యమైనదాని నుండి దూరంగా ఉంచుతోంది..." అని ఒకడు గ్రహించాడనుకో.... అప్పుడు అసత్యవస్తువులందలి భ్రాంతిత్వము, సత్యవస్తువు నందలి వాస్తవత్వములను అనుభవానికి తెచ్చుకోవటం ఎట్లా చెప్పు?

శ్రీరాముడు: నిత్యానిత్యములను క్షుణ్ణముగా పరిశీలించుటచేతనే.

శ్రీ వసిష్ఠ మహర్షి: అవును కదా! ఈ అవిద్య ఉత్పన్నమై, అనేక దోషములు కలిగియున్నదై, విశాలమైన ఆకృతిని ప్రదర్శించుచున్నది. ఈ జీవుని క్షణంలో అజ్ఞానాంధకారంలోకి త్రోసి వేస్తుంది. అట్టి 'అవిద్య' ను నిరోధించటానికి ప్రయత్నించకుండా వర్తమానమును వ్యర్థ కాలయాపనతో వెళ్ళబుచ్చు మానవులకు ఏం చెప్పాలి? ఎట్లా చెప్పాలి?

అందుచేత రామా! నీవు ఈ అవిద్యను బలవంతంగా, ధీరత్వంతో నశింపజేయాలి సుమా! అప్పుడు సత్యమును నీవే ఎరుగగలవు. ఒకడు గొప్ప శూరుడో ధీమంతుడో అయితే అయి ఉండ వచ్చు గాక... కాని అతడు అవిద్యకు లోబడినాడా, ఇక అతనిని కాపాడగలిగిన వారు ఎవరు?

అందుచేతనే మరల మరల హెచ్చరిస్తున్నాను. రోగరూపములో దాపురిస్తున్న అవిద్యను నశింపజేయటానికై నీవు యత్నశీలుడవు కావాల్సిందే! అట్లు చేసితివా, ఇక నీవు ఈ సంసారదుః ఖములన్నీ క్రమంగా తప్పక జయిస్తావు. అవిద్యయే సర్వ ఆపదలకు మూలం. అనర్థములన్నిటికీ అవిద్యయే తల్లి. అవిచారణ, అవిశ్లేషణ, అశ్రద్ధలచే జ్ఞానవిజ్ఞానములు కప్పబడియుండుటవలన ఏర్పడే అల్పమైన అవగాహనలే ఈ అవిద్య యొక్క రూపము, విన్యాసము కూడా.

ఇంకా, ఆ అవిద్య ఏమేమి చేస్తోందో చెప్పమంటావా? అది భయమును, విషాదమును దుష్టమానసిక చింతలను, విపత్తులను, ఇతరులపట్ల క్రూరము, నింద్యము అగు ప్రవర్తనలను తెచ్చిపెడుతోంది.

హృదయములో ఏర్పడగల మాయామోహములన్నిటికీ అది అంకురము వంటిదే. అట్టి 'కుదృష్టి' రూపమగు అవిద్య 'హృదయం' అనే స్వగృహంలోకి ప్రవేశించి ఇష్టం వచ్చినట్లు తిరుగాడుతుంటే, వివేకి అయిన మానవుడు చూస్తూ ఊరుకుంటాడా? లేదు... ఊరుకోకూడదు. "నేను ఈ సంసార సముద్రమును దాటుటకు ఉపాయాలేమిటి?"... అనునదే చింతిస్తూ ఉండాలి.

❖❖❖

11. క్షేత్రము - క్షేత్రజ్ఞుడు

శ్రీరాముడు: హే మహర్షీ! ఈ "అవిద్య" అనే జాడ్యము అనేక అనర్థములను కలుగజేస్తూ పోతోంది కదా! ఎట్లు మేము దానిని మొదలంట తొలగించుకోగలుగుతాం చెప్పండి?

శ్రీ వసిష్ఠ మహర్షి: నిజమే, ఒక క్రూరుడు బలవంతుడూ అయిన శత్రువుగా ఈ అవిద్య వచ్చి ముంగిట వ్రాలియున్నది. అయితే ఈ అవిద్య విచారణ చేసినంత మాత్రంచేత తప్పక

తొలగిపోగలదు. అతి విస్తృతంగా ప్రసరించి ఉంటున్న అవిద్యారోగమునకు ఔషధరూపంగా కొన్ని విషయాలు ఇక్కడ ప్రస్తావిస్తాను... విను–

బ్రహ్మము స్వతహాగా అమృతస్వరూపము, సర్వవ్యాపి, నిరామయము, అనాది, అనంతము, భ్రమరహితము అయివున్నది. అట్టి బ్రహ్మమునందు "నేను శరీరము ధరించి ఉండువాడను".. అను స్పందన లేక చలనాత్మకమైన క్రియా విశేషము ఏర్పడుతోంది. సముద్రంలో జలం ఉన్నది కదా! ఆ జలము తరంగరూపమును పొంది సముద్రమునందే ఒకచోటి నుండి మరొకచోటికి పోవుచున్నది. అట్లే ఉపాధులతో కూడుకొని యున్న బ్రహ్మము కూడా బ్రహ్మమునకు బాహ్యము కానట్టి ఒక ప్రదేశము నుండి మరొక ప్రదేశమునకు పోవుచున్నట్లగుచున్నది. చంచలత్వమంతా తనయందు తానే పొందుచున్నది.

సముద్రంలోని జలంపైకి స్పందనసహితంగానూ, లోపల స్పందనరహితంగా ఉంటోంది కదా! సర్వశక్తిమంతమగు బ్రహ్మము తనకు వేరే కానట్టి ఒకానొక చోట క్రియాశీలత్వము పొంది ఉంటోంది. అంతర్గతంగానో, సర్వదా యథాతథంగానే ఉంటోంది.

ఆకాశంలోని వాయువును చూడు. అది తనయందు తానే చలనము పొందుచున్నది కదా! దాని చలనమునకు మరొకటేదీ కారణమగుట లేదు. అదేవిధంగా స్వతహాగా కూటస్థ స్వరూపమైన ఆత్మ తనయందు తానే బాహ్యాధ్యాసను పొందుచున్నది. దీపం ఎల్లప్పుడూ పైకే ప్రసరిస్తుంది కదా! ఆత్మ కూడా స్వశక్తిచే స్వస్వరూపమునందే ఈ "జగత్తు–జీవులు" అను రూపమున ప్రకాశించుచున్నది. విశాలమైన తటాకంలో ఒక ప్రదేశమందు మాత్రమే సుడిగుండములు కనిపిస్తూ ఉంటాయి. అట్టి సుడులు ఏర్పడుచోటనే జలం అతివేగంగా వృత్తాకారంగా ప్రవృత్తమౌతూ ఉంటుంది. సర్వతత్వ స్వరూపము, మహాశక్తివంతము అగు ఆత్మ కూడా తన స్వరూపము నందు కల్పించబడిన ఒకానొక ప్రదేశంలో క్రియాశక్తివిలాసయుక్తమై ఒప్పుచున్నది. జలమధ్యంలో అగ్నిశిఖలు (బడబాగ్ని) కనబడునట్లు చిద్రూప మహాసముద్రంలో ఇంద్రియ ప్రకాశమంతా స్ఫురిస్తోంది.

❖

నిర్మల చిత్ శక్తి- చిద్రూపము స్వతహాగా నిర్మల స్వరూపము. అది ఇంద్రియములకు అతీతమైనది. కాని ఈ ఇంద్రియాలను వెలిగిస్తున్నది, పొందుచున్నది, ఉపయోగిస్తున్నది కూడా అదియే సుమా!

కించిత్ క్షుభితరూపా సా చిచ్ఛక్తిశ్చిన్మహార్ణవే ।
తన్మయీచిత్స్ఫురత్యచ్ఛా తత్రైవోర్మిరివార్ణవే ॥ (సర్గ 42, శ్లో 11)

అట్టి నిర్మల చిద్రూప మహాసముద్రంలో 'జగత్‌భావన' అనబడు స్వల్పవిక్షోభము ఏర్పడుతోంది. అప్పుడు అది సముద్రమందు తరంగంవలె, ఆ స్పందనతో తన్మయమగుచున్నది. ఫలితమే ఇంద్రియ సంబంధమగు చిత్–శక్తి యొక్క ప్రకటన. అయితే ఇంద్రియ సంబంధమగు చిత్‌శక్తి, ఆత్మచిత్–శక్తికంటే వేరైనది కాదు. కాని, వేరైన దానివలె కనిపిస్తోంది. కాల్చబడి, అగ్నిప్రకాశము వెదజల్లుచున్న ఒక ఇనుపతీగను అతి వేగంగా గాలిలో ఒక ఆకారంగా త్రిప్పుచున్నామనుకో...

అప్పుడు ఆ స్థానంలో ఒక స్థిరమైన ఆకారం గోచరిస్తుంది. అట్లే చిత్-శక్తి ఉపాధి పారవశ్యంచేత "దృశ్యము వాస్తవము, స్థిరము" అను అనుభవం పొందుతోంది. ఆ చిత్-శక్తియే తనయొక్క సర్వశక్తిత్వ కారణం చేత 'కాలము' అను రూపమున కూడా స్ఫురించుతోంది. అనగా, స్వయముగా తన కాలశక్తిని ప్రదర్శించుచున్నది. దేశము, కాలము ఆ చిత్‌శక్తి నుండి బహిర్గతములగు నిప్పురవ్వలవంటివే.

భావన ఎట్లా ఉంటే ఈ జగత్తు కూడా అట్లే - ఆ చిత్ శక్తి తనయొక్క స్వస్వభావమును ఒక సమయంలో ఎరుగుచున్నది. అప్పుడు ఆద్యంతరహితమైనట్టి పరమాత్మ పదమున స్థితి పొంది ఉంటోంది. అయినా కూడా, మరొకప్పుడు విచారణను వదలియుంటున్న కారణంగా భ్రాంతి వశంచేత కల్పితరూపమే తన స్వభావముగా ఎంచుచు, "నేను పరిచ్ఛిన్నుడను"... అను భావన తన యందు దృఢపరచుకొనుచున్నది. ఆ పరమసత్త "నేను పరిచ్ఛిన్నమైనట్టి విషయమును" అను నిశ్చయమును ఆశ్రయించిన మరుక్షణం ఇక ప్రాణేంద్రియములను, నామరూపములను తన రూపములైనట్లు గాంచుచున్నది. అందుచేత "చిద్వస్తువునందు ఈ సర్వము కల్పించబడుచున్నది. అట్లు కల్పించబడుచున్న సర్వపదార్థములు చైతన్యమాత్రమే అయివున్నాయి" అని గ్రహించు. "సద్రూపమగు ఆత్మకంటే వేరైనది" అని స్ఫురించుచున్నదంతా అవస్తువేగాని, సత్యము కాదు. గాజులు, ఉంగరము మొదలగు పేర్లతో చెప్పబడుచున్న ఆభరణమునకు, బంగారమునకు గల బేధమేమున్నది చెప్పు? ఆభరణమంతా బంగారమే అయి వున్నది కదా!

చిదంశమగు ఆత్మ "భావన" చేయుచున్న సమయంలో ఈ జగత్తు యొక్క ఉనికి ఏర్పడటం జరుగుతోంది. అయితే, ఈ జగత్తు, చైతన్యము... 1) ఒక్కటే 2) వేరు వేరు... అను రెండింటి కన్నా కూడా విలక్షణమైన ఒక అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయి.

దీపములు, అగ్ని : జగత్పదార్థములు, చైతన్యము - ఒక దీపంతో అనేక దీపములు వెలిగించ బడ్డాయనుకో... అప్పుడు వేరు వేరు దీపపు వత్తులను దృష్టిలో పెట్టుకుంటే ప్రతి ఒక్క దీపము తదితర దీపములకంటే వేరైనదే కదా! కాని దీపాగ్ని దృష్ట్యా చూస్తేనో? వేరు వేరు దేశ కాలములలో ఉన్న దీపములన్నిటిలోని దీపాగ్ని ఒక్కటే అయివున్నదికదా! అట్లే దేశ-కాల-ఉపాధుల దృష్ట్యా అనేక చైతన్యములు ఉన్నాయి. అనేక స్వరూప స్వభావములు ఉన్నాయి. కాని భూతభవిష్యత్తు వర్తమానములందలి సర్వ ఉపాధులలోని చైతన్యమంతా ఒక్కటే అయివున్నది. అయితే, దేశము, కాలము మొదలైన స్పందనశక్తితో కూడుకొని యున్న చైతన్యము "సంకల్పము" వైపునకు పరుగులు తీస్తూ, మలిన రూపమును పొందుచున్నది.

ఈ దేశ కాలాదులన్నీ ఉండి ఉన్నది ఆ చిద్రూపము నందే.

❖

క్షేత్రజ్ఞుడు - ఈ సర్వ ఉపాధులను ఆశ్రయించి ఉంటూ సర్వ అనుభవములకు స్థానభూతమైనదేదో, అదే 'క్షేత్రజ్ఞుడు'. ఈ శరీరము యొక్క బాహ్యాభ్యంతరములను తెలుసుకొనుచూ, తన పూర్ణరూపమును ఎరుగువాడు కనుక "క్షేత్రజ్ఞుడు" అని అంటున్నాం. రైతు యొక్క పొలము రైతు కంటే వేరుగా ఊరికి

బయటగా ఉంటుంది కదా! క్షేత్రజ్ఞుడు ఈ శరీరాదులకు, విలక్షణమైయున్నాడు. సర్వదీపములలోను ఒకే అగ్నివలె నాలోను, నీలోను ఇంద్రునిలోను, త్రిమూర్తులలోను క్షేత్రజ్ఞుని దృష్ట్యా భేదమేమీ లేదు. అతడే శరీరి అంటే కూడా. క్షేత్రజ్ఞుడే జీవుడు.


క్షేత్రము - ఈ శరీరమే క్షేత్రము. ఈ క్షేత్రమునకు బాహ్యంగా ఇంద్రియార్థములు, దృశ్యము మొదలైనవి ఉన్నాయి అంతరమున మనస్సు బుద్ధి మొదలైనవన్నీ ఉన్నాయి. అట్టి బాహ్య, అంతరములన్నీ ఆ క్షేత్రజ్ఞుడి చేతనే ప్రవర్తింపబడుచున్నాయి.

జ్ఞానము = క్షేత్రజ్ఞునితో 'ఏకత్వము' లేక 'తాదాత్మ్యము'. 'నేను క్షేత్రజ్ఞుడను' అను దృఢమైన అనుభవముతో కూడిన ఎరుక.

అజ్ఞానము = క్షేత్రము (శరీరము) తోటి ఏకత్వము పొందుట. "నేను ఈ శరీరమును" అను భావన కలిగి ఉండుట.

'క్షేత్రజ్ఞుడు' వాసనల గురించి కల్పనలను ఒనర్చుచూ, 'అహంకారము' అను రూపమును పొందుచున్నాడు. ఆ అహంకారమే పదార్థాదులను నిశ్చయించుటచేతను, తదితర కల్పనలకు హేతువు అగుట చేతను "బుద్ధి" అని చెప్పబడుతోంది. చైతన్యము కంటే జీవుడు వేరు కాదు. జీవుని కంటే అహంకారము వేరు కాదు. అహంకారము కంటే బుద్ధి వేరు కాదు... అని గ్రహించబడు గాక! సంకల్పములచే కలుషితమై నప్పుడు బుద్ధియే మననం చేయు స్వభావంచే, మనోరూపాన్ని పొందుచున్నది. ఘన వికల్పాలను ఆశ్రయించుటచే ఈ మనస్సు ఇంద్రియాల రూపాన్ని పొందు చున్నది. ఈ దేహం ప్రపంచంన ఉత్పన్నమౌతోంది. జీవధారణ చేస్తోంది. ప్రత్యక్షమై తెలియ వస్తోంది. తదితరమైన దృశ్యమంతా అనుభవంగా దేహధారుడగు జీవునిచే పొందబడుతోంది.

❖



అహంకారము ⟶ నిశ్చయమునకు సంబంధించిన కల్పన ⟶ బుద్ధి

బుద్ధి ⟶ ఇంద్రియ విషయములను మననము చేయు స్వభావము (భావనాపరంపర) ⟶ మనస్సు

మనస్సు ⟶ తీవ్రమైన వికల్పనలు ఘనీభూతమైన శబ్ద స్పర్శాది భావనలు ⟶ ఇంద్రియాలు

ఇంద్రియాలు ⟶ కాళ్ళు చేతులు మొ॥ అవయవాలతో సంబంధము ⟶ దేహము

దేహము ⟶ దృశ్యం తెలియవచ్చుట ⟶ దృశ్య జగత్తు

ఇలా జీవుడు 'సంకల్పములు' అనే పాశములచే బంధింపబడుచున్నాడు. 'దుఃఖమయాలే' అయిన బాహ్యాభ్యంతరములందలి పదార్థజాలములందు తనకు తానే చిక్కుకొనుచున్నాడు.

అయితే ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి. ఈ క్షేత్రజ్ఞుడు లేక జీవాత్మ అవిద్యా పరిణామవశం చేతనే 'శరీరము, దృశ్యము' మొదలైన విలక్షణత్వమంతా పొందుచున్నాడు. వాస్తవానికి అతని చిత్స్వభావము పరిణామరహితమైనది.

రేగు కాయ పక్వమై రేగు పండుగా పరిణమించినంత మాత్రం చేత, అద్దాని సజాతిత్వము మార్పుపొందుట లేదు కదా!

❖

ఈ విధంగా చైతన్యము జీవరూపమును, జీవుడు అహంకారరూపమును, అహంకారము బుద్ధి రూపమును, బుద్ధి సంకల్పపరంపరలచే కలుషితమై మనోరూపమును పొందుచున్నాయి. అప్పుడు ఈ మనస్సు సఫలవిఫల (satisfied-unsatisfied) మనోరథాలతో కూడుకుని ఉంటోంది. "ఈమె నా స్త్రీ, వీరు నా పుత్రులు,. వీరు నా వారు, వారు తదితరులు"... మొదలైన శరీరాకార వృత్తులను స్వీకరించుచు, తన యందు ఆ వృత్తుల దృష్టిని పొందుతోంది. పరిచ్ఛిన్నములు, తుచ్ఛములు అయిన అనేక విషయములందు ఆసక్తి పొంది ఉంటోంది.

సముద్రము వైపు నదులు వెళ్లుచూ ఉంటాయి. మదించిన ఎద్దు ఉన్నవైపుగా ఆవు పరుగులు తీస్తూ ఉంటుంది. చిత్తమునందలి 'ఇచ్ఛ' అను దోషమే ఈ జీవుణ్ణి విషయములవైపు పరుగులు తీయించుటకు కారణము అగుచున్నది. ఈ చిత్తము తన యందలి ఘనాహంకారముచే చమత్కారముగా ప్రవృద్ధమగుచున్నది. పట్టుపురుగులాగా తన కోర్కెలచే తానే 'బంధితురాలు' అగుచున్నది. చేపలు ఎఱ కోసం స్వయముగా గాలమునకు చిక్కుకుని మృత్యువాతపడతాయి చూచావా? ఈ మనస్సు కూడా "స్వసంకల్ప అనుసంధానము"చే స్వయముగా బంధమునందు తగుల్కొనుచున్నది. ఆహాఁ! ఇది ఎంతటి హాస్యాస్పదం! ఎంతటి విచారకరమైన విషయం!

"నేను బద్ధుడను"... ??? చైతన్యము తన పారమార్థిక శుద్ధరూపమును క్రమముగా త్యజించుచు "నేను బద్ధుడను" అని భావించుచున్నది. "ఆశ, సంబంధము"... ఈ రెండే అద్దానిని బద్ధునిగా చేస్తున్నాయి.

శ్రీరాముడు: జన్మ–జరా–మరణముల రూపమును మరల మరల సంతరించుకుంటున్న ఈ 'అవిద్య' అనే జగజ్జాలం ఎక్కడ నుండి ఉత్పన్నమౌతోంది?

శ్రీ వసిష్ఠ మహర్షి: అది ఆ జీవుని యొక్క అంతఃకరణమునందే ఉత్పన్నమౌతోంది. ఈ మనస్సే తన యొక్క సంకల్పముచే శబ్దము, స్పర్శ మొదలైన విషయములకు రచయిత. విషయములే మనస్సుకు 'అగ్నిజ్వాల' అగుచున్నది.

అవిద్యాయుక్తమైన మనస్సు "బోనులో బంధింపబడిన సింహం"లాగా మిక్కిలి అవ్యవస్థ పొందుతోంది. క్రమంగా ఈ మనస్సు అనేక విహిత, నిషిద్ధ కార్యములకు కర్తృత్వము వహించు

చున్నది. తన ఇచ్ఛా మాత్రంచేత కల్పించబడిన బహువిధములైన కర్మలందు, జన్మలందు ఇరుకు కొనుచున్నది. ఇంకేముంది? సకల దుర్దశలను ఒకటి తరువాత మరొకటిగా పొందుతూనే ఉన్నది.

మనస్సు... మనో నిగ్రహం - ఈ మనస్సు ఒకప్పుడు మనన శక్తిచే మనోరూపమును, మరొకప్పుడు నిర్ణయాత్మక శక్తిచే బుద్ధిరూపమును సంతరించుకుంటోంది. అదియే ఇంకొకప్పుడు జ్ఞానరూపమును, క్రియారూపమును, అహంకారరూపమును, శరీరరూపమును పొందుచున్నది. ఒకే నటుడు వేరు నాటకములలో వేరు పాత్రలలో నటిస్తున్నాడు కదా! అట్లాగే మనస్సు ఒకచోట 'మాయ' అను రూపము వహించి ఈ జీవుని భావములను సంకుచితపరుస్తోంది. ఒకచోట మూర్ఛరూపమున, మరొకచోట త్యాగరూపమున స్థితి కలిగి ఉంటోంది. ఒక సమయంలో 'చిత్తము' రూపమున, 'అవిద్య' రూపమున ఇచ్ఛ రూపమున... ఈ విధంగా ఆ మనస్సు ఎత్తుతున్న అవతారములకు అంతు ఎక్కడ? ఈ ప్రపంచమంతా సంచరిస్తున్నది మనస్సే. అదియే పలువైపులా బంధించబడి, తృష్ణ, శోకములచే పరిపూర్ణమై, రాగద్వేషములకు విశాలస్థానమై ఒప్పుచున్నది.

ఈ మనస్సు యొక్క గతి గురించి ఇంకేం చెప్పమంటావు? ఇది జరామరణమూర్ఛలకు సంబంధించిన అనేక భవభావనలచేత మరల మరల క్షోభను పొందుతోంది. ఇష్టానిష్టములైన విషయములచే తరుమబడుతోంది. తదితరులపట్ల ఏర్పడు దుష్టమైన అభిప్రాయాదులచే దూషిత మగుచున్నది. దాని ఆకృతి ఇచ్ఛయే. సంక్షోభమే దాని ప్రతాపము. ఈ అనేక రకములైన కర్మలన్నీ చిగురిస్తున్నది మనస్సు నుండే. అది అనేక అనర్థములను కల్పన చేసుకుంటూ తన యొక్క ఉత్పత్తి స్థానము, నిలయస్థానము అగు పరమాత్మ పదమునే విస్మరించి వేస్తోంది. నాలుగు వైపుల నుండి బంధింపబడుచు, అనేక దుఃఖములను అనుభవిస్తోంది.

❖

"ఎందుచేత"... అనునది మనకు ఇక్కడ ముఖ్యమైన ప్రశ్న. దీనికి మా సమాధానం విను. "ఆత్మకంటే భిన్నమైన దాని వలె ప్రాప్తిస్తున్న దృశ్యరూపము గూర్చిన యథార్థ జ్ఞానం సముపార్జిం చకపోవుట చేతనే. తన భారముచే తనకు తానే భయోత్పాతములు, జరామరణభావములు పొందుచున్న ఈ దుష్ట మనస్సు సంసారారణ్యంలో సంచరిస్తూ ఉండటానికి కారణం, విచారణ చేయక పోవటమే అయి వున్నది".

సంసారము అనబడునది ఎక్కడో లేదు. ఈ మనస్సు ఆశాపాశములను తన చుట్టూ నిర్మించుకొని, పురుషార్థహీనమై ఉంటోంది చూచావా...? అదియే సంసారము యొక్క స్వరూపము. అది చింతల చేత, క్రోధము చేత, కామము చేత అత్యంత బంధనము పొందుతోంది. ఆత్మ స్వరూపమును పొందలేకపోతోంది.

అట్టి దుర్భరమైన మనస్సును పొందిన ఈ మానవుడు చూస్తూ ఊరుకోవటం ఉచితమా? కానే కాదు. అద్దానికి వర్తమానంలోనే ఉత్తమ పురుషప్రయత్నం, అధ్యయనము, విచారణ మొదలైన ఔషధములను అందించాలి. అదియే జీవుని కర్తవ్యం.

❖

చూచావా రామచంద్రా! జింకల గుంపును వీడిన జింకలాగా ఈ మనస్సు ఎంతో దుఃఖా క్రాంతమగుచున్నది. ఇది, పాపం, విషజ్వాలలచే దహించబడుతోంది. "ఈ జన్మ మృత్యువులు సత్యమైనవే" అని అనుకొని 'తెగిన కమలం' లాగా ఎంతో బాధపడుతోంది. ఇతఃపూర్వపు అనేక దేహముల పట్ల గల అభిమానముచే ఎంతగానో వియోగము అనుభవించి... అనుభవించి అలసి పోయివున్నది. ఇప్పటి ఈ దేహపతనమును ఒక 'పీడకల' వలె దర్శిస్తోంది. "అయ్యో! ఈ నా ప్రియమైన దేహము కొద్దిరోజులలో అకస్మాత్తుగా నేలకూలనున్నది కదా! ఇక నా గతి ఏమిటి?" అని వాపోవుచు ఖిన్నురాలై ఉన్నది. "ఓయీ! జీవుడా! నీ యొక్క ఉత్తమ ప్రయత్నముచే నన్ను సముద్ధరించవచ్చును కదా?" అని ఈ మనస్సు అభ్యర్థన చేస్తోంది. ఓ రామా! ఇట్లు అనేక దుఃఖ ములు పొంది యుండుటచే తన 'ధృతి-ఉత్సాహము'లను కోల్పోయి సంచరించుచున్న ఈ మనస్సును నీవు, ఎట్లైనా సరే, కాపాడి జ్ఞానమయం చేయాలి. సముద్రంలో కూలిపోయి విలవిల లాడుచున్న పక్షిలాగా, బురదలో ఇరుక్కుని ఉన్న దున్నపోతులాగా ఈ మనస్సు 'జగజ్జాలము' అనే శూన్యనగరంలో పడికొట్టుకొంటోంది.

ఓ జనులారా! బంధ హేతువులు, బంధసాధనాలు అయిన ఈ దేహం, గృహం, స్వజనం మొదలైనవాటి యందు అత్యంత ప్రీతిని కలిగియుండి తేనెలో ఇరుక్కున్న గండుచీమలాగా బాధ పడుచున్న ఈ మీ మనస్సును మీరే ఉద్ధరించాలి సుమా! లేకుంటే ఎవరు ఉద్ధరిస్తారు చెప్పండి!

ఓ సర్వజనులారా! మీకు తత్త్వజ్ఞానములందు, తత్సాధనములందు తగినంత ఆదరణ ఉండటం ఎంతైనా అవసరం. "ఆత్మజ్ఞానవిషయమై అనాదరణ" అనే సముద్రంలో మీ మనస్సులు కొట్టుకుపోవుచున్నాయే! విషయములందు నిమగ్నమగుటచే అది కుంచించుకుపోతోందే! చైతన్య రూపులగు మీరు ఈ మనస్సు యొక్క రోదనను వినండి. విని ఆదుకోండి. 'అవిచారణ'చే ఇంకా ఇంకా దానిని బాధించకండి. అప్రయత్నశీలురై ఉండకండి.

'విషయములు' అనే బురదలో ఇరుక్కున్న..."మనస్సు" అనే ముసలి దున్నపోతును... 'ఉత్తమ కర్మలు' అనే త్రాళ్ళ సహాయంచే... 'అనాసక్తి' అనే ప్రయత్నముచే... 'విచారణ' అనే శక్తిచే బయటకు లాగండి! "శుద్ధజ్ఞానము" అనే నీటితో కడగండి! "సాత్త్విక-స్వస్థతలు" అనే వస్త్రముచే పరిశుభ్రం చేయండి! "మోక్షము" అనే ఉత్తమ స్థలంలో విశ్రాంతి పొందనివ్వండి.

నాయనలారా! అల్ప జలము, అధికమైన బురద గల ఒక దుర్వాసనపూరితమైన తటాకం ఉన్నది. ఆ తటాకమే కామము, రాగములతో కూడిన ఆపేక్ష. అందులో ఛిన్నాభిన్నములైన అంగములతో కూడిన ఈ మనస్సు చిక్కుకున్నది. శుభ, అశుభ క్రియలతో బహుమలినమై ఆ మనస్సు సంచరిస్తోంది.

అట్టి ఆ మనస్సుకు "అకర్తృత్వం' నేర్పాలి. ఎవడైతే జరామరణములవంటి అనేక విపత్తులతో కూడిన దృశ్యజగత్తు నుండి తన మనస్సును కాపాడుకొనుటకు యత్నించడో... ఆతడు'నరుడు' అనిపించుకోడు; నరుని రూపంలోగల మూఢమృగమే అతడు.

❖❖❖

12. వివిధ జీవోత్పత్తులు

శ్రీరాముడు: దేవా! ఈ అనేకులగు జీవులయొక్క ఉత్పత్తి స్వభావమేమిటో.. బహువిచిత్రంగాను, భయమును గొలిపేటట్లుగాను ఉన్నదే! ఆహా! ఏమి భ్రమాత్మకమైన వ్యవహారం!

శ్రీ వసిష్ఠ మహర్షి: అవును, నిజమే. ఈ అసంఖ్యాకములగు కల్పితాకారముగల జీవులు ఉపాధిచేత మాత్రమే 'వేరువేరు' రూపములుగా విభాగములుగా తోచుచున్నారు. వీరంతా ఈ విధంగా సంసార వాసనా ప్రవాహంలో తగుల్కొని చేతలను, మాటలు ప్రదర్శిస్తున్నారు. అయితే, జల కణములన్నీ సెలయేరు నుండే ఉత్పన్నములగుచున్నట్లు, వీరంతా బ్రహ్మము నుండే ఉత్పన్నమై ఉన్నారు... ఇప్పుడు ఉత్పన్నమగుచున్నారు... ఇకముందు కూడా ఇట్లే ఉత్పన్నం కాబోవుచున్నారు. ఇట్టి జగత్తు గురించి నీవు భ్రమించవలసిన పనేమున్నదో చెప్పు?

శ్రీరాముడు: ఆత్మస్వరూపులే అయి ఉండి కూడా వీరంతా ఇట్లు ఎందుకు, ఎవరి కారణంగా వివశత్వం పొందుచున్నారు?

శ్రీ వసిష్ఠ మహర్షి: వీరంతా స్వవాసనావశం చేతనే వివశత్వం పొందటం జరుగుతోంది. వీరి అంతఃకరణములు సుఖ-దుఃఖములగు అనేకమైన విచిత్ర దశలందు 'నిబద్ధం' అగుచున్నాయి.

అట్టి ఈ జీవులు వివిధ భూప్రదేశములందు, జలములందు, స్థలములందు, కాలము లందు... నీటిలో బుద్బుదములు వలె.... ఉత్పన్నమగుచున్నారు... నశిస్తున్నారు. అట్టివారిలో కొందరు ఈ వర్తమాన కల్పమునందే అసంఖ్యాకంగా అనేక జన్మలు పొందినవారు ఉన్నారు.

మరికొందరు ఈ కల్పంలో కొద్ది జన్మలు మాత్రమే ఎత్తియున్నారు. ఇంకొందరు రెండు, మూడు జన్మలు మాత్రమే ఎత్తారు. కొందరు కొందరైతే, ఇంకా ఈ కల్పమునందు జన్మించియే ఉండలేదు. క్రిందటి 'కల్పము'లోని ఒక జన్మ నుండి ఇంకా తేరుకొనలేదు.

మరికొందరు జీవన్ముక్తులకు ఇదే ఆఖరి జన్మ అగుచున్నది. కొందరికి ఈ జన్మపరంపరల పరిసమాప్తి అగుటచేత, వారు 'కైవల్యప్రాప్తి' పొందియున్నారు.

కొందరు వేలకొలది జన్మల వరకు మరల మరల ఉద్భవిస్తూ, ఒకే 'దేహజాతి' యందు స్థితి పొందియున్నారు. ఇంకా కొందరు రెండు, మూడు దేహజాతులందు మాత్రమే మరల మరల జన్మలు పొందుచున్నారు.

కొందరు భిన్న భిన్న దేహములను 'ఒక క్రమము' అంటూ ఏదీ లేకుండా లెక్కింపలేనంతగా పొందుచున్నారు. కొందరు జీవులు నరకము నందు దీర్ఘకాలంగా గొప్ప యాతనలు పొందుచున్నారు. కొందరు అల్పసుఖము కొరకు ఎంతో ప్రయాసలు పడుతూ మనోవ్యసన రూపముతో సంచరిస్తున్నారు.

మరికొందరు దైవస్వరూపులై, మిక్కిలి ప్రసన్నులై ఉన్నారు. కొంతమంది జీవులు 'కిన్నర-గంధర్వ-విద్యాధరుల' వంటి మనోహరమైన రూపమును పొందియున్నారు.

కొందరు సత్యలోకనివాసులై దివ్యశరీరములతో, ఆత్మజ్ఞాన శబ్దార్థములతో విరాజిల్లు చున్నారు. కొంతమంది "సూర్య, ఇంద్ర, వరుణ, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు"గా ఉన్నారు.

కొందరు కూష్మాండ (దేవతలలో ఒక తెగ), బేతాళ, యక్ష, రాక్షస, పిశాచాదుల రూపమున ఉండి ఉన్నారు. మరికొందరు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర రూపమున స్థితి పొందియున్నారు.

ఇందులో కొందరు తుచ్ఛ విషయములపట్ల ఆసక్తి పూరితులై స్వభావరీత్యా చంఢాల, కిరాత జన్మలు పొందుచూ, ఒకప్పుడు దుఃఖమును, మరొకప్పుడు క్రూరత్వమును ప్రదర్శించుచున్నారు.

కొందరు పక్షి రూపమును పొందియున్నారు. అట్లే తృణము, ఓషధుల, ఫలముల, ఆకుల రూపమున కూడా కొందరు జీవులు ఉంటున్నారు.

ఇట్లా ఎంతైనా వర్ణించవచ్చు సుమా! కొందరు సంసారవైభవమును పొందుచున్నారు. "నేను రాజును కావాలి... మంత్రిని కావాలి... సంఘనాయకుడను కావాలి... ఫలానా చోట ఇళ్ళు కట్టి, వాటికి యజమానిని కావాలి... అందరూ నా అధికారం అంగీకరించాలి..." ఈ విధంగా ఉంటున్నాయి, వారి వారి సాంసారిక భావనలు!

కొందరు నారబట్టలు కట్టుకుని మునులవలె మౌనము వహించి అంతా చూస్తూ కూడా, ఏమీ పట్టనట్లు ఉంటున్నారు.

కొందరు రాగముతో మమకారముతో వేటివేటినో ప్రోగు చేసి దాచుకుంటున్నారు.

కొందరు సర్పము, కొండచిలువ, క్రిమి, కీటకములు, పురుగులు మొదలైన ఉపాధులను ఆశ్రయించి స్వల్పము, తుచ్ఛము అగు పదార్థములను మహత్తరమైన వాటివలె దర్శిస్తున్నారు.

కొందరు సింహము, మేక, ఎద్దు మొదలైన మృగరూపములు ధరించి ఆహారము పొందుట, నిద్ర, మైథునము అను రెండు మూడు కార్యక్రమములందే నిమగ్నమై ఉంటున్నారు. కొందరు ఆపదలకు వశము అగుచున్నారు. మరికొందరు సంపదలను పొందుచున్నారు.

కొందరు స్వర్గపురములలో, నరకములో, నక్షత్రమండలంలో వృక్షము యొక్క ఛిద్రంలో, వాయువులో, ఆకాశంలో స్థానములు పొంది ఉంటున్నారు.

కొందరు సూర్యకిరణములలోని రసమును గ్రహించుటకు అధికారం పొంది ఉంటున్నారు. మరి కొందరు చంద్ర కిరణములలోని ఓషధత్వము యొక్క పరిపక్వత కొరకై తమ తమ ఉపాధులను నియోగించుచున్నారు.

అన్యజనుల పట్ల శ్రేయోభిలాష కలిగియున్నట్టి కొందరు, తత్సంబంధమైన ప్రయత్నము లందే మనోవాక్కులను నియమించి సంచారం సలుపుచున్నారు. మరికొందరు చిరకాలంగా జీవన్ముక్తత్వము అనుభవించి ఇక విదేహముక్తిని సమీపించు అభిలాషతో ఉంటున్నారు.

మరి కొందరు "మాకు ముక్తి కంటే తదితర జనుల సుఖశాంతులందే మక్కువ" అను భావన కలిగియుండి, తదనుకూలంగా ఏవేవో కార్యక్రమములు ఏర్పరచుకొని వర్తిస్తున్నారు. సద్గురువులు అవతారములను ధారణచేస్తూ శిష్యులను సువిజ్ఞానులుగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ఉంటున్నారు.

భోగ లంపటంలో పడిన మరికొందరు "విదేహముక్తి" "ఆత్మ సమాచారం" మొదలైన వాటిని పరమద్వేషభావంతో పరికిస్తున్నారు.

కొందరు తీవ్రవేగంతో ప్రవహించే నదులయొక్క అధిష్ఠాన దేవతారూపులై ఉంటున్నారు. కొందరు ఉత్తమ స్త్రీ రూపమున, పురుషరూపమున, నపుంసకరూపమున ఉంటున్నారు.

కొందరు ప్రబుద్ధమైన 'మతి'ని కలిగి ఉంటున్నారు. మరికొందరు మిక్కిలి జడమైన అంతః కరణము కలిగి ఉంటున్నారు.

కొందరు తదితరజనులకు జ్ఞానం ఉపదేశించే 'నిష్ఠ' కలిగి ఉంటున్నారు. ఇక కొందరు మరెవ్వరితోనూ సంభాషించటానికి ఇష్టపడక, సమాధినే ఆశ్రయించి దీర్ఘకాలం గడిపివేస్తున్నారు.

ఇదంతా ఏమిటంటావా? ఈ జనులు తమ తమ వాసనలకు వివశులై, అవిద్యాబుద్ధులై అనేక భావావేశములను ఆశ్రయించి, ఇదంతా ఇట్లు పొందుచున్నారు. ఇదంతా ఆయా భావ దశలందు స్థితి పొందియుండుటే అయివున్నది. ఇంకా...

విహరన్తి జగత్కేచిన్నిపతన్త్యుత్పతన్తి చ ।
కన్దుకా ఇవ హస్తేన మృత్యునాఽవిరతం హతాః ॥ (సర్గ 43, శ్లో 25)

ఇంకొందరు ఈ భూమిపై ఉన్నారు. కొందరు నరకంలో పడుచున్నారు. ఇంకొందరు స్వర్గమునకు ఎగురుచున్నారు. విసరబడుచున్న బంతిలాగా కొందరు ఒక శరీరము నుండి మరొక శరీరమునకు వెళ్ళుచున్నారు.

ఆశాపాశశతాబద్ధా వాసనాభావ ధారిణః ।
కాయాత్కాయముపాయాన్తి వృక్షాద్వృక్షమివాండజాః ॥ (సర్గ 43, శ్లో 26)

పక్షి ఒక చెట్టు నుండి లేచి మరొక చెట్టుపై వ్రాలుచున్నట్లు ఈ జీవులలో అనేకులు అనేక ఆశాపాశములకు బద్ధులై అనేక భవిష్యత్ దేహములను ధరించుటకు ఇప్పటికిప్పటి నుండే సిద్ధము అగుచున్నారు.

❖

ఈ జీవుడు అత్యుత్తమమగు తన ఆత్మను దర్శించనంతవరకు ఇట్లే అనేక ఉపాధి పరంపరలను అనుభవిస్తూనే ఉంటాడు. అసంఖ్యాకములగు విషయములకు, సంకల్పములకు బద్ధులై 'మాయ' లేక 'అవిద్య' ను ఆశ్రయిస్తూ, ఈ విస్తారమైన విశ్వంలో సంచారం చేస్తూ ఉంటారు. జలంలో కెరటంలాగా, ఆవృత్తములులాగా ఇట్లే తిరుగాడుతూ ఉంటారు.

ఓ రాఘవా! ఈ జనులలో కొందరు అసద్వస్తువును త్యజించి సత్యజ్ఞానమును పొంది ఉంటున్నారు. జ్ఞాన భూమికాక్రమమున ఆత్మపదమునందు స్థిరత్వము బడయుచున్నారు. అట్టి జీవులు మరల ఈ ప్రపంచమున జన్మించుట లేదు.

ఇక మరికొందరు జీవుల విషయానికి వద్దాం. వారు వివేకమును పొంది కూడా, విషయ లంపటులై ఉంటున్నారు. అందుచేత వేలకొలది జన్మలు అనుభవించి ప్రశ్నార్థకంగా మరల మరల సంసార సంకటమున పడుచున్నారు.

ఉత్తమ సంస్కారములను ఆశ్రయించుచున్న ఇంకొందరు ఉత్తమ ప్రదేశములందు, ఉత్తమ కాలములందు జన్మలు పొందుచున్నారు. సత్సమాగమమును పొందుచున్నారు. అట్టి వారు "దేవత –గంధర్వ –ఋషి" మొదలైన విభవమంతా పొందుచున్నారు. వారిలో కొందరు గర్వితులై, సాంసారిక దృష్టిని మరల ఆశ్రయించుటచే తమ మార్గముల నుండి మరల వెనుకకు మరలు చున్నారు. కొంత వెనుకకు, మరల ముందుకు చనుచున్నారు. వారిలో కొందరైతే పక్షి, మృగము మొదలైన స్థితిగతులను కూడా కొని తెచ్చుకుంటున్నారు. తుచ్ఛమగు విషయములపట్ల గల ఆశచే మరల జంతువుల యోనులను పొంది నరకమునకు పోవుచున్నారు.

కొందరు మహాబుద్ధిశాలురు బ్రహ్మదేవుని మనస్సు నుండి ఉత్పన్నమగుచున్నారు. (బ్రహ్మ మానస పుత్రులగు నారదుడు, వసిష్ఠుడు, సనత్కుమారుడు మొ॥ అందుకు ఉదాహరణ). అట్టి మొదటి జన్మ యందే "బ్రహ్మము" అను మోక్షపదమున ప్రకాశించుచున్నారు. మరికొందరు తమ ఉత్పత్తి స్థానమున బ్రహ్మాండమునందో, లేక వేరొక బ్రహ్మాండమునందో... బ్రహ్మదేవునిగానో, విష్ణువు గానో, మహేశ్వరుడు గానో అగుచున్నారు. కొందరు ఉత్తమ జన్మల నుండి చ్యుతి పొంది, ధర్మవ్యతిరేకులవటం చేత స్వల్ప వ్యవధిలో పశు, పక్షి, మృగ, సర్ప ఉపాధులను పొందుచున్నారు.

❖

ఓ రామా! ఈ ఉత్పత్తి క్రమమంతా ఈ బ్రహ్మాండములో ఏ విధంగా ఉన్నదో, తక్కిన బ్రహ్మాండములలో కూడా అట్లే ఉన్నది. అవన్నీ కూడా ఇట్లే విస్తారంగాను, సువిశాలంగాను ఉండి ఉంటున్నాయి. ఇతఃపూర్వం అసంఖ్యాకంగా బ్రహ్మాండములు నిర్మించబడ్డాయి. వాటిలో కొన్ని నశించిపోయాయి. కొన్ని ఇంకా ఉన్నాయి. ఇక ముందు కూడా ఇట్లే అనేక బ్రహ్మాండములు రచించబడబోతున్నాయి. ఇవి కాక, ఏవో కొన్ని కారణాల వలన కొన్ని సందర్భములలో ఆయా జీవుల నిమిత్తం అనేక చిత్ర విచిత్రమైన అవాంతర జగత్తులు ఆవిర్భవించుతున్నాయి. ఇంతలోనే విలయం పొందుచున్నాయి. వాటిలో కొందరు గంధర్వత్వము, కొందరు యక్షత్వము, కొందరు దేవత్వము, కొందరు దైత్యత్వము పొందుచున్నారు.

ఈ బ్రహ్మాండములో మనుష్యులు, వారి వారికి యోగ్యములైన వ్యవహారములు నిర్వర్తిస్తూ సంచరిస్తున్నారు కదా! అట్లే తక్కిన బ్రహ్మాండములలో కూడా ఉన్నారు. ఒక్కొక్క సృష్టి ఒక్కొక్క విలక్షణముతో కూడి ఉంటోంది. ఈ జీవసృష్టులన్నీ వారి వారి స్వభావమును అనుసరించి నదిలో తరంగాలవలె పరివర్తనం చెందుచున్నాయి.

ఉత్పత్తి, వినాశనము అను రెండు చుక్కల మధ్య ఈ సృష్టులన్నీ అనుక్షణం పరివర్తనం చెందుతూనే ఉన్నాయి. ఇందులోని జీవులు తమ తమ గుణములకు అధీనులై అనిర్వచనీయులై, అనిర్దేశ్యులై ఉంటున్నారు. స్వయంసంబంధమైన ఎరుక అంతఃకరణములు కలిగి ఉండి ఉత్పత్తి వినాశనముల మధ్య అనేక భావాభావములను ప్రకటించుచున్నారు.

❖

అయితే రామా! వీరంతా ఉత్పన్నమగుచున్నది పరమపదమగు బ్రహ్మమునుండే సుమా! బ్రహ్మము నందే వీరు ప్రత్యక్షముగా వ్యవహరించుచున్నారు. స్వస్వరూపమగు పరబ్రహ్మత్వమును ఏఒక్కరూ ఏక్షణమందూ ఏమాత్రం త్యజించుటయే లేదు.

ప్రకాశము దీపములోనుంచే వస్తోంది. కిరణాలన్నీ సూర్యుడి నుండే వస్తున్నాయి. కాల్చబడిన ఇనుము నుండే అగ్ని కణాలు వెదజల్లబడుచున్నాయి. పువ్వు నుండే వాసన వస్తోంది. వర్షము నుండే జల బిందువుల బయల్వెడలుచున్నాయి. సముద్రం నుండే తరంగాలు వస్తున్నాయి.

అదే విధంగా ఈ జీవరాశి అంతా కాలానుగతంగా బ్రహ్మము నుండే ఉత్పన్నమౌతున్నది. అనేక దేహపరంపరలు ధరించి భోగానుభవం పొందుచున్నది. ఆ తరువాత మరొక సమయంలో (ప్రళయకాలంలో) బ్రహ్మము నందే స్వయముగా విలీనమగుచున్నది.

అవిరతమియమాతతా తథోచ్చై ర్భవత వినశ్యతి వర్ధతే ముధైవ ।
త్రిభువన రచనాది మోహమాయా పరమపదే లహరీవ వారిరాశౌ ॥ (సర్గ 43, శ్లో 45)

ఈ మాయ 'త్రిలోకములు' అను రచనారూపమున భ్రాంతిగా ప్రాప్తిస్తోంది కదా...! ఇదంతా ఇట్లు 'మిథ్య' రూపమున విస్తరిస్తున్నది ఎక్కడ? ఎక్కడో కాదు... ఆత్మయందే.

సముద్రంలోని జలంలో తరంగాలు అనేకం లేచి, కొంత సంచారం చేసిన తరువాత మరల సముద్రజలంలోనే లయిస్తున్నాయి కదా! ఇది కూడా అట్టిదే.

అయితే రాఘవా! నీవు సర్వదా ఆత్మస్వరూపుడవే అయి ఉన్నావు. "మిథ్యావ్యవహారం మాత్రమే' అయివున్న ఈ 'సృష్టి–స్థితి–లయ'లు శుద్ధ చైతన్య స్వరూపుడవగు నీయందు లేవు. నీవు వాటి యందు లేవు. కనుక నిశ్చింతుడవై 'శాంతి' వహించి ఉండుము.

❖❖❖

13. పునఃశరీర ప్రాప్తులు - పుర్యష్టకము

(సంసారావతరణము)

శ్రీరాముడు: మునీంద్రా! ప్రళయకాలంలో ఈ జీవుడు ఆత్మయందు లయించుచున్నాడని మీరు చెప్పుచున్నారు కదా! మరి అట్లా అయితే, అతడు మరల 'అస్థి పంజరం' రూపంలో గల ఈ భౌతిక దేహమును ఎట్లా ఎందుకు ఎప్పుడు ధరించుచున్నాడు?

శ్రీ వసిష్ఠమహర్షి: మనం ఈ విషయం ఇతఃపూర్వమే విచారించాం. మరి నీవు ఇంకా గ్రహించుట లేదేమిటి? పూర్వాపరములను అత్యంత సునిశితంగా విచారించగల నీ బుద్ధి ఇప్పుడు ఏమి చేయుచున్నది?

ఓ రామయ్యా! ఈ దేహములతో సహా... స్థావరజంగమాత్మకమైన ఈ జగత్తు అంతా కూడా... 'అసత్తే' అయి వున్నదయ్యా. ఇదంతా స్వప్నంలో లాగా అభాసమాత్రంగా ఉదయిస్తోంది.

దీర్ఘకాలంగా స్థిరంగా ఉన్నట్లు కనిపిస్తున్న ఈ లోకములు, ఈ బ్రహ్మాండములు మొదలైనవన్నీ ఒక దీర్ఘ స్వప్నంలోలాగా మిథ్యారూపముగానే కనపడుచున్నాయి. ఈ జగత్తులో అనుభవమగుచున్న ఆకృతి అంతా... "ఒకతనికి తన కంటి దోషం చేత ఆకాశంలో రెండవ చంద్రుడు కనిపించడం" వంటిది మాత్రమే.

అజ్ఞానికి ఈ దృశ్యం, ఈ ప్రపంచం వస్తుమయంగానూ, ప్రాప్త-అప్రాప్తములతోనూ, రకరకాల పరిస్థితులతో నిండినదిగా కనిపిస్తోంది. సాంసారిక వాసనలు నశించినట్టి జ్ఞానికో...? అతడు ఈ సంసారస్వప్నమును చూస్తున్నప్పటికీ, పరమార్థదృష్టిచే ఏమాత్రం మార్పు చేర్పులూ చూడకయే ఉంటున్నాడు. అందుకని, అతనికి ఇంకొక విధంగా కనిపిస్తోంది.

ఈ సంసారము అజ్ఞానాత్మయందే ఆయా జీవుల స్వభావమును అనుసరించి పరికల్పించ బడి, దర్శింపబడుచూ... మోక్షపర్యంతము ఇట్లే ఉంటోంది. జలంలో ఆవర్తం పొందు స్వభావం ఉన్నట్లు, బీజము నందు అంకురించు స్వభావం దాగి ఉన్నట్లు జీవుని యందు చంచలమైన ఈ 'శరీరములు పొందుట' అను స్వభావం ఉండి ఉంటోంది.

కల్పనయే... వాస్తవరూపముగాగల ఈ దేహము, దేహభావము మనస్సునందే ఉండి ఉన్నది. మనసు అనేక రూపములు కలిగియున్నది. 'వాసనారూపము'చే దాని యందు అనేక దేహములు దాగి ఉన్నాయి. అట్టి అనేక దేహములలో 'కర్మపరిపాకము'చే ఏ శరీరము అభివ్యక్త మవుతుందో... ఆ శరీరపు 'ప్రతిభాస'యే ఈ జీవునకు కాలక్రమంగా సంభవిస్తోంది. అంతేగాని అన్నిటి యొక్క ప్రతిభాస ఒక్కసారే జరుగదు. మట్టియే కుండయొక్క ఆకారముగా అగుచున్నట్లు కర్మలు, భావనలు... ఇవే శరీరముల రూపమున ప్రదర్శితం అగుచున్నాయి.

ఈ సమష్టి దేహముల కర్తయే బ్రహ్మదేవుడు. బ్రహ్మదేవత్వము కూడా ఈ జీవుని స్వభావము యొక్క ప్రవాహానుగుణమైన ఒక సంప్రాప్తియేనని గ్రహించు. ఎందుకంటే అది కూడా అతని వాస్తవతత్త్వమైయుండలేదు. అయితే సర్వక్రియా సమర్థుడు, సమష్టి సృష్టిభావకుడూ అగు బ్రహ్మదేవునియొక్క సంకల్పమాత్రముచే ఈ అపారదృష్టి అంతా స్థితి పొంది ఉంటోంది. ఆయన తన సంకల్పనా సామర్థ్యముచే వస్తు ధర్మచమత్కారమంతా రచిస్తున్నారుకదా!

శ్రీరాముడు: మహాత్మా! మొట్టమొదట జీవచైతన్యము ఉండి ఉన్నది... అది మనోరూపమును పొందుతోంది. ఆ తరువాత అది సమష్టి సృష్టి స్వరూపుడగు 'హిరణ్యగర్భుడు' అను 'స్థితి' లేక 'పదము' పొందుచున్నది కదా! అసలు శుద్ధ చైతన్యమునకు హిరణ్యగర్భుని రూపము పొందవలసిన అగత్యమేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి: అట్టి పరిణతి యొక్క క్రమమేమిటో వివరిస్తాను. శ్రద్ధగా విను–

ఆత్మతత్త్వమునకు వాస్తవానికి దేశకాలపరిచ్ఛిన్నత్వమనేదే లేదు. అయితే అది స్వశక్తిచే లీలామాత్రంగా 'భావనచేయటం' అను వ్యవహారమును ఎందుకో పొందుతోంది. ప్రశాంత జలంలో తరంగమునకు సంబంధించిన స్పందన వలె ఆ భావనయే ఈ పరిచ్ఛిన్న దేహ అనుభవమునకు, కలుషితమైన దేశకాలముల అనుభవమునకు ప్రారంభస్థానం.

వాసనావేశమే మనస్సు యొక్క రూపం. భావనయే వాసనలకు బీజం. అట్టి మనస్సు కల్పన – అకల్పనలతో చంచలమై ఉంటోంది. 'జీవుడు' అనగా మనస్సే అయి ఉన్నది. పుష్పము నందు గంధం వలే బ్రహ్మము నందు 'మనఃశ్శక్తి' అంతర్లీనమైయున్నది. అట్టి మననశక్తి యొక్క ఆవిర్భావమే 'సృష్ట్యాది".

పుర్యష్టకము - ఈ దేహమే పుర్యష్టకము అంటున్నాం. ఒక పురమునకు ఎనిమిది దిక్కులు ఉన్నట్లు, ఈ దేహమునందు ఎనిమిది తత్త్వములు నిర్వచించబడుచున్నాయి.

1. **జ్ఞానేంద్రియ పంచకము :** చెవులు – చర్మము – కళ్ళు – నాలుక – ముక్కు (+) వాటి కార్యక్రమములగు... శబ్దము – స్పర్శ – రూపము – రసము – గంధములు.
2. **కర్మేంద్రియ పంచకము:** వాక్కు – కాళ్ళు – చేతులు – పాయువు – ఉపస్థ.
3. **వాయు పంచకము :** ప్రాణవాయువు – అపానవాయువు – వ్యానవాయువు – ఉదానవాయువు – సమానవాయువు.
4. **భూత పంచకము :** భూమి – వాయువు – అగ్ని – జలము – ఆకాశము.
5. **అంతఃకరణ చతుష్టయం :** మనస్సు – బుద్ధి – చిత్తము – అహంకారము.
6. **అవిద్య :** "ఆత్మదృష్టి" లేక "ఆత్మ స్వభావము" నుండి విక్షేపము. బాహ్యాపాదార్థికదృష్టి యొక్క ఆశ్రయము.
7. **కామము :** "మరింకేదో కావాలి"... అను కోరుకొను ప్రవృత్తి.
8. **కర్మము :** క్రియావ్యాసంగము.

ఈ "పుర్యష్టకము" సర్వప్రాణుల హృదయమునందు ఒక తుమ్మెదనుబోలి ఉంటున్నది.

❖

ఆత్మయందలి మనఃశక్తి యొక్క అత్యంత ప్రారంభస్థితియే సృష్ట్యాది. అట్టి సృష్ట్యాది యందు ఇట్లు భావనాక్రమము జరుగుచున్నది:

1. శబ్ద తన్మాత్ర - సర్వశబ్దములకు బీజభూతము శబ్దతన్మాత్ర. ఇట్టి శబ్దతన్మాత్రము, ఆ శబ్దము యొక్క అనుభవమునకు స్థానమగు శ్రోత్రింద్రియము (చెవులు)ను భావన చేయుచున్నది. ఆత్మ అట్టి శబ్దస్థానమగు నిర్మలాకాశమును పొందుచున్నది.

2. స్పర్శ తన్మాత్ర - తరువాత క్రమంగా 'స్పందన'ను అనుసరించి మనస్సు ఘనత్వం పొందుతోంది. అప్పుడు ఆ మనస్సు స్పర్శకు బీజభూతమైన 'స్పర్శతన్మాత్ర' వైపుకు ఉన్ముఖ మగుచున్నది. అనగా 'స్పర్శ' వైపు చలించు వాయువు యొక్క భావనను ఆత్మయే ఆశ్రయిస్తోంది. అట్టి స్పర్శ పొందు స్థానము లేక ఆకాశమే చర్మము.

3. రూపతన్మాత్ర - శబ్ధ, స్పర్శ తత్త్వములైన ఆకాశ–వాయువు సంఘాతముచే 'రూపము' యొక్క భావన ఏర్పడుతోంది. అదియే 'కన్ను' స్థానమునకు కారణమై 'చూచుట' అను ప్రక్రియగా కార్యసిద్ధి పొందుతోంది.

4. రస తన్మాత్ర - ఇట్లు శబ్ద, స్పర్శ, రూపముల పరిణామంచేత మనస్సు మరికొంత ఘనత్వం పొందుతోంది. అప్పుడామనస్సు క్షణంలో నిర్మలప్రకాశం యొక్క భావన పొందుతోంది. ఆకాశ–వాయు–అగ్ని గుణాలచే వృద్ధి చెందిన మనస్సు రసమునకు బీజమైనట్టి "రసతన్మాత్ర"ను పొందుతోంది. రసేంద్రియమును భావించి వెంటనే రసతన్మాత్ర దశను ఆ మనస్సు పొందుతోంది.

5. గంధ తన్మాత్ర - అట్లే ఆ రసతన్మాత్ర గంధయుక్తమగు స్థూలరూపమును పొంది గంధతన్మాత్రగా ప్రకటించుకొనుచున్నది.

ఆ తరువాత ఆత్మయే స్వయం నిర్మితమైన మనస్సు సహాయంచేత ఈ దేహము నుండి దృశ్యజగత్తును వీక్షిస్తోంది. పంచభూతములు తమతమ సూక్ష్మదశలను త్యజించుచు, ఆకృతిని కలిగినవిగా అగుచున్నాయి. అనగా స్థూలత్వమును పొందుచున్నాయి. అనుభవము యొక్క స్థూల స్వరూపమే ఈ మనోబుద్ధుల సంచయమైయున్నది.

తీవ్రమైన వాసనలతో కూడిన మనస్సు, పుర్యష్టకముతో ప్రకటితమగుచున్న ఈ దేహమును భావనచేయుచున్నది. "నా యొక్క స్వరూపము పుర్యష్టకముతో కూడిన ఈ దేహమే కదా..." అని భావించుచు, తదనుకూలంగానే ఆయా క్రియావ్యవహారమునకు ఉద్యుక్తురాలగుచున్నది.

కర్మపరిపాకముచే మనస్సు స్థూలత్వం పొందుతోంది. అప్పుడు బాహ్యమున, అంతరమున 'స్థూల, సూక్ష్మ' దేహములతో ప్రకాశించుచున్నది.

పుర్యష్టక రూపమైన భావనాతత్వమునే 'లింగదేహము' అని అంటున్నాం. అట్టి ఆ లింగదేహము అనేక విచిత్రములైన రచనలతో కూడిన ఈ స్థూలదేహమును స్వభావసిద్ధంగానే స్వీకరించుచున్నది.

❖

ఈ మనస్సు తన యొక్క వాసనల వలన పొందిన దేహమును ఆకాశమున వ్యాప్తమై ఉన్నదానివలె గాంచుచున్నది. "ఇది నా దేహము". "ఇది విశాలమై వ్యాపించి యున్నది." "నేను ఈ శరీరంలో ప్రసరించియున్నాను." "ఊర్ధ్వభాగంలో శిరస్సుగాను, అధోభాగంలో పాదములు గాను, ఇటు అటు చేతులుగాను, మధ్యభాగంలో పొట్టగాను రూపం కలిగి ఉన్నాను" అని ఈ జీవుడు భావిస్తున్నాడు. "జ్వాలాసమూహం" వంటి ఆకృతి గల ఈ జీవుడు వ్రేళ్ళు మొదలైన అవయవములతో ప్రకటితమగుచున్న ఈ దేహమును ఎందుకు గ్రహించుచున్నాడు? తనయందలి 'మనోరథము' అనుదానికి వశమగుటచేతనే. మననశీలమగు ఈ మనస్సు స్వవాసనావశం అగుచూ కల్పితమగు శరీరము కలిగి వర్తిస్తోంది.

❖

మనుజునకు ఈ దేహము కాలము యొక్క 'గతి', లేక, పరిపాకము చేత ప్రత్యక్షరూపమున ఉదయిస్తోంది కదా! అదే విధంగా ఈ మనస్సు కూడా "స్వశరీరవృద్ధి" పొందుతోంది. అనగా విస్తారత్వమును ఆశ్రయించుచున్నది. అట్టి విస్తారత్వ ప్రభావంచేత "నేనే ఈ సర్వమునందు

విస్తరించి విరాజిల్లుతున్నాను. నా సంకల్పమే ఇదంతా. ఇక్కడ నాది కానిది, నేను కానిది లేదు" అను భావనాదార్ఢ్యంచే ఈ జీవుడే బ్రహ్మదేవుని పదమును పొందుచున్నాడు.

సర్వలోక పితామహుడు, బ్రహ్మదేవుడు మొదలైన పేర్లతో పిలువబడుచున్న ఆ సమష్టిజీవుడు బుద్ధి-సత్వము-బలము-విజ్ఞానము-ఐశ్వర్యములను ధరించినవాడై విరాజిల్లుచున్నాడు.

(సమష్టి తత్వాహంకారి = A 'will' that is operating the cosmic aspect of creation.

వ్యష్టి తత్వాహంకారి = A will that is operating the individual.)

నిర్మల మనస్సుతో కూడిన ఈ సమష్టి తత్త్వస్వరూపుడు కూడా చిదాకాశము నుండి సంభవించినవాడే...! అట్టి 'సత్త'చే, అతడు ఈ అజ్ఞానరూపములను, ఈ పంచీకృత వ్యవహారములను సృష్టించుచున్నాడు. తన మనస్సు యొక్క నిర్మలత్వముచే అతడు సత్యసంకల్పుడై ఉంటున్నాడు. అతడు దేనిని ఎట్లు సంకల్పిస్తాడో, అది అట్లే పంచీకృత సమన్వితమై ప్రభవిస్తోంది.

ఈ ఆకాశము - భూమి మొదలైన పంచీకృతములు, ఆయా అనుభవములు కూడా.. ఆత్మయందే స్థితి కలిగినవి అయివున్నాయి. ఇవన్నీ అతడు లీలా మాత్రంగా సృష్టిస్తున్నాడు. రచిస్తున్నాడు. అతడు ఒకప్పుడు ఆద్యంత రహితమైన విశాలాకాశమును సృష్టిస్తున్నాడు. మరొకప్పుడు నిర్మల జలమును ఉత్పన్నం చేస్తున్నాడు. ఇంకొకప్పుడు ప్రళయాగ్ని జ్వాలలచే ప్రకాశమయమగు మండలమును రచించుచున్నాడు.

అట్లే భూమి, వృక్షములు, దేహములు కూడా అతని సంకల్పానుసారమే రూపము పొందుచున్నాయి. ఆ ప్రభువు జన్మ పొందిన క్షణం నుండి లోకములను సృష్టించుచు పోతున్నాడు. అతడు విష్ణువు (సృష్టించిన దాని యొక్క ఉనికి - స్థితులకు సంబంధించిన ప్రజ్ఞ) మొదలైన అనేక రూపములను ధరించి తాను సృష్టించినది తానే 'పాలన' చేస్తూ ఉంటాడు. అతని దేహం కూడా బ్రహ్మపదము నుండే సంకల్పబలంచేత ఉత్పన్నమగుచున్నది.

❖

ఇట్లు 'మనస్సు' అనేది బ్రహ్మము నుండే ఉత్పన్నమౌతోంది. ఒక సమయంలో అజాన ఆవృతమైనట్టి ఆ మనస్సు విష్ణుభగవానుని కుక్షియందు ఉంటోంది. అప్పుడు పూర్వ సంస్కారములన్నీ మరచి, ఆదమరచి సుషుప్తి దశను పొంది ఉంటోంది. నిద్రలేచిన తరువాత అప్పుడు ప్రకాశమయమగు తన దేహమును అవలోకించుచున్నది.

దేహము - ఈ కనబడే దేహం పంచభూతముల (భూమి, జలం, వాయువు, అగ్ని, ఆకాశం) యొక్క శుద్ధ విభాగములచే రచించబడుచున్నది. కోట్ల కొలది రోమములచే వ్యాప్తమై ఉంటోంది. నవద్వారములు కలిగినదై, చర్మముచే సుందరముగా అలంకరించబడి ఉంటోంది.

ఆ భగవానుడగు బ్రహ్మదేవుడు తన ఇచ్ఛానుసారమే ఈ శరీరములను, తృష్ణలను, జీవులను, చిత్తములను తన చిత్త - శరీరమునందు కలిగి ఉంటున్నాడు.

❖

ఇట్లు సమష్టి – సంకల్పుని ఇచ్ఛాలీలయే ఈ సర్వము అయి ఉంటోంది. నిర్మల దృష్టి గల అతడే “ఆకాశమును రచించెదనుగాక” అని చింతించినపుడు ఆకాశము ఏర్పడి ఉంటోంది.

బ్రహ్మదేవుడను పేరుగల అతడే భూత–భవిష్యత్తు–వర్తమానములన్నీ ఎరుగుచున్నాడు. ఇప్పటికే అతడు ఎన్నో సృష్టి సమూహములను దర్శించాడు. “నాయందు అస్థిత్వము కలిగియున్న ఈఈ జీవుల ధర్మాధర్మములు ఇట్టివి” అని క్రమముగా అతడు స్మరించుచున్నాడు.

అట్లే వేదములను, జీవోత్పత్తిని, తదితరములను చిత్ర విచిత్రములగు సంకల్పములచే రచించుచున్నాడు. ఈ ప్రాణులకు స్వర్గమోక్షములు, ధర్మకామములు సిద్ధించటానికి అనేక విధము లైన ఆచారములను, శాస్త్రములను రచించింది ఆయనే.

ఆ సమష్టి సంకల్పుని లేక హిరణ్యగర్భుని లేక బ్రహ్మదేవుని స్వరూపము, స్వభావము కూడా మనస్సే. దృశ్యమానమైయున్న ఈ ‘సృష్టిశోభ’ అంతా మనస్సు నుండే స్థితి పొందియున్నది. హిరణ్యగర్భుని పదము పొందిన మనస్సే వివిధ రచనలచేత, క్రియావిలాసములచేత, శోభాయ మంతములగు ఈ జగత్తులను కల్పన చేయున్నది.

❖❖❖

14. జగత్తులు - దేశకాలములు

శ్రీరామచంద్రుడు: ఈ జగత్తు దేశకాలములు... ఎప్పుడు ఏర్పడి, ఎప్పుడు అంతమౌతున్నాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి: “ఈ జగత్తు ద్రష్ట సిద్ధించుకొన్నదే. అంతేగాని, నిర్మితమైనది కాదు”... అని విజ్ఞులచే గ్రహించబడుచున్నది. అనగా ఇదంతా మనోవిలాసము, ప్రతిభాసమాత్రము అయి వున్నది. ప్రతిభాసకంటే వేరుగా ఇక్కడెక్కడా ఏదీ లేనే లేదు.

‘దేశ కాలములు’ - దేశకాలనబడేవి ఈ బ్రహ్మాండం, ఒక్కదానిలోనే వ్యాప్తమై ఉన్నాయి... అని అనుకోకూడదు సుమా! కోట్లకొలది బ్రహ్మాండాలు వర్తమానంలో ఉన్నాయి. ఒక్కొక్క బ్రహ్మాండము ఒక్కొక్క రీతిగా స్థితిగతులు కలిగిఉన్నది. కోట్లకొలది బ్రహ్మాండాలు భూతకాలంలో లయించిపోయాయి. కోట్లకొలది బ్రహ్మాండాలు భవిష్యత్తులో ఉద్భవించబోవుచున్నాయి. ప్రతి జీవుని హృదయము నందు అద్దంలో ప్రతిబింబిస్తున్న వస్తువుల వలె కోట్ల కొలది బ్రహ్మాండాలు ప్రతిభాసమాత్రంగా స్ఫురించుచున్నాయి. ఇంతలోనే అదృశ్యమగుచున్నాయి.

వెయ్యి మాటలెందుకు? ఒక్కసారి పైకి చూడు. అనంతపరిమాణంగల ఆకాశం కనబడు చున్నది కదా! ఇదంతా కలిసికూడా ‘దేశకాలములు’ అనబడుదానిలో ఒక్క స్వల్ప భాగమును కూడా పూరించలేకపోతున్నాయని గ్రహించు.

జగత్తు - స్వప్నద్రష్ట తన స్వప్నంలో చూచే నగరంవలె ఈ జగత్తు సంకల్పమాత్రమే అయివున్నది. “గోడ గాని, తెరగాని లేకుండానే రంగులచే లిఖించబడిన గొప్ప కళాఖండం కనబడు తోంది...” అను వాక్యములోని విచిత్రార్థంలాగా ఈ ‘అసత్తే’ అయిన జగత్తు ద్రష్టకు ప్రాప్తిస్తోంది.

అయితే ఏ దేశ– కాలములలో ఈ జగత్తు ప్రతిభాసమౌతోందో, అదంతా చైతన్యమే అట్లు దర్శింప బడుచున్నదని సూక్ష్మబుద్ధితో గ్రహించు. "ఈ కనబడే సర్వమునకు అధిష్ఠానము అయినట్టి, ద్రష్టస్వరూపమునకు ద్వితీయము కానట్టి"... ఆ చైతన్యమే అంతా కూడా!

వాస్తవానికి ఈ జగత్తు శూన్యాకాశమాత్రమే. ఇదంతా నిర్మితమైన దానివలె కనిపిస్తున్నది. కానీ, అంతా కూడా అకృతమే. అనగా ఇది ఎవ్వరిచేతనూ నిర్మించబడలేదు. ఆకాశంలోని మేఘ నిర్మిత ఉద్యానవన దృశ్యం వంటిదే ఈ జగత్తు. యాదృచ్ఛికంగా ఏర్పడే సంయోగ వియోగము లచే ఆయా ఆకార వికారములు ఏర్పడుచున్నాయి. ఆపై ఇక తదితరమైనదంతా ద్రష్ట యొక్క భావనచే చోటు చేసుకుంటోంది.

ఈ దేహాదులు, ఈ త్రిలోకములు... ఇవన్నీ కూడా మనస్సు చేతనే కల్పించబడ్డాయి. 'చూచుట' అనే క్రియలో నేత్రముల కర్తృత్వము ఎట్టిదో, ఆ రీతిగా, ఇదంతా మనస్సు యొక్క కేవలం 'ఊహాదృశ్యము'తో సమానమైనది గాని, సత్యము కాదు.

పదార్థయుక్తమగు ఈ జగత్తు భ్రమచేతనే గాంచబడుచున్నది. ఎందుకంటావా? "సత్తు"నకు వేరుగా ఈ పదార్థములు ఎక్కడ ఉన్నాయి?

పట్టుపురుగు తన కొరకు గూటిని నిర్మించుకొనుచున్నట్లు, ఈ మనస్సు కూడా తన నివాసము కొరకు శరీరమును కల్పించుకొనుచున్నది. సత్యదృష్టితో పరిశీలనాత్మకంగా చూస్తే ఈ మనస్సు అర్థశూన్యము, సంకల్పమాత్రమే సుమా! అయితే ఏం...? మనస్సు రచించలేనిది లేదు. ఇది ప్రాప్తించజేసుకోలేని దుష్కరవస్తువంటూ ఎక్కడా ఏదీ ఉండజాలదు. ఆశ్రయించికూడా, అది పొందజాలనట్టి శక్తులు ఆ ఫాలాక్షుని వద్ద కూడా లేవు. సర్వశక్తులు మనస్సులోనే ఉన్నాయి. ఈ సత్–అసత్ స్వరూపములగు సమస్తపదార్థములు సర్వశక్తిమంతమగు మనస్సు చేతనే సదా స్థితివంతములు అగుచున్నాయి. ఈ శరీరము కూడా మనోభావమును అనుసరించే ప్రాప్తిస్తోంది. ఈ మనస్సుకు ఏ మనఃకల్పన, వర్ణనలకూ ఏమాత్రం అందనంతటి శక్తి ఉండి ఉన్నది.

దీర్ఘస్వప్నము - "ఈ దేవతలు, అసురులు, మనుష్యులు, జంతువులు – వీరంతా ఎవరు?" అను ప్రశ్న వచ్చినపుడు "వీరంతా మనస్సు యొక్క సంకల్ప శక్తిచేతనే రచించబడుచున్నారు." అను సమాధానము లభించుచున్నది. మనస్సు యొక్క సంకల్పరూప సంచలనమే నశించిం దనుకో... అప్పుడు నూనె క్షీణించుచున్న దీపంలాగా ఈ అనేక విధములైన సృష్టి దర్శనమంతా శమించి పోతోంది. కాబట్టి రామా! ఈ జగత్తు అంతటినీ ఒక దీర్ఘ స్వప్నమును చూస్తున్నట్లే, గమనిస్తూ ఉండు. "ఆకాశము" అను శబ్దమునకు గల అర్థమువలెనే ఇదంతా కల్పనా మాత్రంగా మనోవిలాసమాత్రంగా ఎరుగుము.

న జాయతే న మ్రియతే ఇహకించిత్కదాచన ।
పరమార్థేన సుమతే మిథ్యాసర్వం తు విద్యతే ॥ (సర్గ 45, శ్లో 14)

అల్ప అర్థములను త్యజించి పరమార్థమును ఆశ్రయించినప్పుడు "ఈ జగత్తునందు ఏదీ ఉత్పన్నమగుటలేదు, నశించలేదు"... అనియే గ్రహించబడుతోంది. వాస్తవానికి ఇదంతా మిథ్యయే అయివున్నది. ఎందుకంటావా? ఆత్మ ఏ కాలమందు గాని వృద్ధి క్షయములు పొందుతోందా? అప్రమేయమగు ఆత్మ మనో-బుద్ధి-చిత్త అహంకారాలుగా పరిణమించటం జరుగుతుందా? ఆత్మ స్వతహాగా వస్తురహితమైయుండగా అందు సూక్ష్మ శరీరాదులు ఎట్లా ఏర్పడతాయి చెప్పు? అఖండమగు ఆత్మ వస్తువునందు 'జీవుడు' తదితరులు వంటి ఖండత్వమంతా ఎట్లా సంభవించ గలదు? సంభవించదు.

అసలు ఒక మాట చెప్పు? నీవు సర్వదా ఈ దేహమునకు విలక్షణమైనయున్న అపరిచ్ఛిన్న మగు అనంతాత్మను వీక్షించాలి. అట్టి అపరిచ్ఛిన్న అనంతాత్మను వీక్షించకుండా ఈ అహంకార రూపమగు పరిచ్ఛిన్నమును పొందవలసిన అవసరమేముంది? అందుకు ప్రయోజనంగా ఎంతగానో విమోహితుడవే అగుచున్నావు కదా! అట్లు ఎందుకు అల్పత్వము ఆశ్రయించాలి? ఎడారిలో తరంగములకు సంబంధించిన భావన, దాహము - ఈ రెండూ కలసి మృగములకు మృగతృష్ణలో నీరు కనబడేటట్లు చేస్తాయి. అట్లే ఈ బ్రహ్మ మొదలైన సృష్టికర్తలు, తదితరములు మిథ్యగానే గోచరిస్తున్నాయి. పదార్థదృష్టిచే ఆకాశం ఏదీ కాకున్నప్పటికీ ఏదో లేత నీలిరంగు పదార్థం అయివున్నట్లు కనిపిస్తుంది. ఈ జగత్తులోని సర్వవస్తువులు 'మిథ్యారూపమే' అయి వుండి, 'ఘనమగు అజ్ఞానము' చేతనే ఆవృతమై ఉంటున్నాయి. నౌకలో ప్రయాణం చేస్తున్న యాత్రికునకి ఒడ్డున ఉన్న చెట్లు కదలుచున్నట్లు కనిపిస్తూ ఉంటుంది కదా! అందుచేతనే, "ఈ సమస్తం మనః కల్పితము మాత్రమే. ఇదంతా 'ఉంది, లేదు' అను రెండింటి కంటే విలక్షణమై, అనిర్వచనీయమై ఉన్నది"... అని శాస్త్రకారులు మనకు మరల మరల గుర్తు చేస్తున్నారు.

"ప్రపంచరహితమగు ఆత్మ" యొక్క భావన - ఓ రాఘవా! ఇదంతా బ్రహ్మమే అయి ఉన్నది కదా! ఇక దీని యందు 'భిన్నత్వము'నకు సంబంధించిన ప్రసంగం ఎందుకు చెప్పు? అనేక తరంగములలో జలము యొక్క అధిష్ఠానముచే అభేదమే సిద్ధిస్తుంది కదా! "ఇది పర్వతము -స్థాణువు. ఇది నగరము-సంచలనయుక్తము"... ఇటువంటి ఆడంబరమంతా అసద్రూపము, స్వప్నతుల్యమే అయినప్పటికీ, మనస్సు యొక్క భావనాబలంచేత "ఇదంతా స్వరూపమే" (ఏర్పడి ఉన్నదే) అను విధంగా పరిలక్షితమై ప్రాప్తిస్తోంది. తత్త్వవిచారణ లేనివానికి ఈ జగత్తంతా కామ వాసనాసహితము, తృష్ణారూపము, స్వర్గనరకములవంటి అనేక విషయములతో కూడినదిగా కనబడుతోంది. అతనికి ఇందులో అనేక జన్మపరంపరలు మరల మరల ప్రాప్తిస్తున్నాయి.

అందుచేత రామా! నీవు ప్రపంచరహితమగు ఆత్మవస్తువునే సర్వదా భావిస్తూ ఉండాలి. ఆత్మనే చూడాలి.

స్వప్నతుల్య జగత్తు -

యథా స్వప్నో మహారంభో భ్రాంతిరేవ నవస్తుతః।
దీర్ఘ స్వప్నం తథైవేదం విద్ధి చిత్తోపపాదితమ్ ॥ (సర్గ 45, శ్లో 20)

స్వప్నంలోని పదార్థజాతమంతా భ్రాంతి మాత్రమే గాని వాస్తవం కాదు కదా! చిత్తముచే నిర్మించబడిన ఈ దృశ్యానుభవం అట్టిదే. ఈ సంసారము అనేక భోగములకు ఆటపట్టై, విశాలం గాను, రమణీయముగాను తోచుచున్నది. కొందరికి అత్యంత దుఃఖభరితంగానూ, మరికొందరికి మోదభరితంగానూ అనుభవమౌతోంది. కాని సత్యదృష్టిచే పరిశీలిస్తే... ఇదంతా తుచ్ఛము, క్షణ భంగురము అని తెలిసిపోతోంది. ఆహాఁ! ఇదంతా ఎన్నో ఆశలకు నిలయమై ఈ జీవుని భ్రమింప జేయటానికి అనుక్షణం సిద్ధపడుచున్నది కదా...! అందుచేత రామా! ఈ దృశ్యం నిన్ను ఆక్రమించ కుండా నీవు నిరోధించాలి. అందుకు గాను ముందుగా అంతరంగమునందు దీనిని త్యజించి ఉండు. అట్లు గాక 'ఇది అసత్తు' అని తెలిసికూడా దీనియందు అనురాగమో లేక ఆశ నిరాశలో కలిగియుండే వారికి ఇక నేను ఏం చెప్పగలను?" "మృగతృష్ణలో నీరు ఉండదు" అని తెలిసి కూడా "పోనీలే... అయినా చూద్దాం, ఈ తరంగాలు చూచి ఆనందిద్దాం"... అని మృగతృష్ణ వైపుకు పరుగులు తీయుటలో అర్థమేమున్నది?

కనుక నీవు దేనిపట్లా ఆసక్తిగాని, అనురాగముగాని కలిగిఉండవలసిన పనేమీ లేదు. సంకల్పముల స్వరూపము, మనోరథమయము అయినట్టి ఈ 'మాయావైభవము' వెంట పరుగులు తీస్తున్న మూఢుని తిప్పలు వర్ణనాతీతం. అతడు అనంతకాలంగా దుఃఖమునే పొందుచున్నాడు.

❖

'ఆత్మ' అనబడు మహత్తరమైన వస్తువు స్వస్వరూపమునకు అద్వితీయమై ఏర్పడి ఉండనే ఉన్నది. అట్టి ఆత్మ వస్తువు సర్వదా వేంచేసి ఉండగా, అసత్తే అయినట్టి ఈ దృశ్యప్రపంచముచే ఆకర్షణ-వికర్షణలు పొందుతూ పరుగులు తీయవలసిన పనేమున్నదో చెప్పు? ఆత్మవస్తువును వదలి మరింకేదో పొందాలని తాపత్రయపడుతూ వచ్చుచున్నవాడు పరమ పురుషార్థమును పొందలేకయే పోతున్నాడు. అనేక నీచమార్గములలో అనేకసార్లు ప్రయాణించి శ్రమచే దారిగానక దుఃఖితుడగుచున్నాడు. 'త్రాడు'ను చూచి 'పాము' అని అనుకొని భయపడునట్లు, ఈ జగత్తు వ్యామోహమాత్రమే అయివున్నది. భావనావైచిత్ర్యము గొలిపేదిగా తోచుచున్నది. చంచలమగు తటాకజలంలో చంద్రప్రతిబింబం "చూచారా! చంద్రబింబము ఎంతగా నీళ్ళలో ఇరికిపోయి, వంకరటింకరగా ఉన్నదో?"... అని కలవరించేది బాలుడే గాని విచక్షణాజ్ఞాని కాదు. మిథ్యా భూతములగు అసత్ పదార్థములచే అజ్ఞాని మోసగించబడవచ్చుగాక! తత్త్వజ్ఞాని దేనిస్థానము ఏమిటో, ఎట్టిదో గ్రహించియే ఇందు క్రీడా మాత్రంగా సంచారం సలుపుచున్నాడు.

ఓ సర్వజనులారా! "శబ్దము-స్పర్శ-రూపము" మొదలైన గుణ సంఘాతమునకు చోటు అగుచున్న ఈ దేహమును చూచుకొని, "ఈ దేహమే నేను"...అను అహంభావమును ఆశ్రయించి, ఈ దృశ్యమునందు "సుఖం" అను స్థానం కొరకు వెతకుచుండెడివాడు జ్ఞానుల దృష్టిలో 'మూర్ఖుడు' అని అనిపించుకుంటున్నాడని మీ అందరికీ గుర్తు చేస్తున్నాను. ఎవడైనా ఊహచే కల్పించబడిన అగ్నిచే చలికాచుకోగలడా? లేదు. మనస్సు యొక్క మననశక్తిచే ఒకడు తన ఊహలోనే గొప్ప

నగరం, ఆ నగరంలో విశాలమైన వీథులు, ఆ వీథులలో ఒక ముఖ్యమైన ప్రదేశంలో తన మూడంతస్తుల మేడ, ఆ మేడలో అనేక గదులు, పరిచారికలను చూడగలడు కదా! అదే రీతిగా విశాలము, జడము, పంచభూతాత్మికము అగు ఈ దేహాదులు ఎదురుగా అనుభవమగు చున్నాయి. ఈ జగత్తు చిత్తము యొక్క ఇచ్ఛచేతనే ఉదయించుచున్నది. ఇచ్ఛ లేనప్పుడు అదృశ్యమై పోవుచున్నది. సంకల్పంలోచూడబడు ఒక ప్రియవస్తువులాగా ఈ నిర్మల దృశ్యమంతా మిథ్యా రూపముననే దృశ్యమానమగుచున్నది.

ఓ రామచంద్రా! ఈ జగత్తు నశించినంత మాత్రం చేత ఇక్కడ నశించేదంటూ ఏదీ లేదు. లేక ఇది వృద్ధి పొందినప్పటికీ అధికమయ్యేదేదీ లేదు. హృదయంలో మనస్సుచే నిర్మించ బడి ఏది నశిస్తోంది? ఏది వృద్ధి చెందుతోంది? స్వప్నంలో కనబడిన ఒక చెట్టు ఖండింపబడితే నశించేదేమి ఉంటుంది? చిన్నపిల్లలు తమ ఆటలలో అనేక కల్పనలు చేసుకుంటూ ఉంటారు చూచావా? ఆటలలో పిల్లలు పొందే కేరింత భేదముల వంటివే అజ్ఞానజీవుల సాంసారిక అనుభవాలు.

ఈ జగత్తు నిరంతరం మనస్సుచే కల్పించబడుచున్నది. ఇంద్రజాలంలో కనిపించే వస్తువులు నశించినా ఏదీ నశించనట్లు, ఇంద్రజాల తుల్యమగు ఈ జగత్తు యొక్క ఆవిర్భావ తిరోభావాలచే ఏవరికి ఏమి హాని ఉంటుంది చెప్పు? ఏదైతే యథార్థానికి లేదో, అట్టిది ప్రకటితమైతే ఏమున్నది? కాకపోతే ఏమున్నది?

కనుక ఇప్పుడు చెప్పు...! ఈ ప్రపంచమున "హర్షము-శోకము"లకు తావు ఎచట?

అసదేవ యదత్యన్తం తస్మాత్కిం నామ నశ్యతి ।
నాశాభావే హి దుఃఖస్య కః ప్రసంగో మహామతే ॥ (సర్గ 45, శ్లో 39)

ఎల్లప్పుడు అసత్తైనట్టి దానికి నాశనమేమిటి? 'నాశనము' అనేదే లేకపోతే ఇక అసలు దేని గురించైనా ఎందుకు దుఃఖించాలి? సర్వదా సద్వస్తువై ఉన్న దానికి నాశనమే లేదు కదా! అవినాశియగు సద్వస్తువే నీవై ఉండగా, ఇక నీవు దుఃఖించేది దేని కొరకు? ఈ జగత్తంతా బ్రహ్మమే అయివుండగా, ఇక సుఖ దుఃఖములు కలుగవలసిన పనేమున్నది?

విజ్ఞానదృష్టి - ఇప్పుడు విజ్ఞులయొక్క అవగాహనను క్రోఢీకరించి చెపుతాను, విను-

'అసత్తే' అయి ఉన్నదానికి హాని వృద్ధులు ఆపాదించి హర్షశోకములు పొందటం బాలురు క్రీడలలో గెలుపు-ఓటముల, ఉత్సాహ-నిరుత్సాహాల అనుభవం పొందటం వంటిది మాత్రమే. అసత్యము, నిరంతర జనన మరణ స్థానము అయివున్న ఈ దృశ్యజగత్తులో విజ్ఞులైనవారికి అభిలషించవలసినదేదీ ఉండజాలదు. లేదా "ఇదంతా బ్రహ్మమే కదా!" అను అవగాహన పొందుటచే వారు దేనినీ త్యజించవలయునను సంఘర్షణ కూడా పొందకయే ఉంటున్నారు.

"ఇది గ్రహించాలి... ఇది త్యజించాలి" అనుటకు తగినదేదీ వారికి ఇక్కడ లభించుటలేదు. "ఈ నామరూపాత్మకమగు విశ్వము అసత్తు. ఇద్దాని అధిష్ఠానమగు బ్రహ్మము సత్తు" అని గ్రహించిన ప్రాజ్ఞుడు ఇదంతా చూస్తూ కూడా ఎట్టి సుఖ దుఃఖములకు లోను అగుటలేదు. ఒక్క

అజ్ఞానియే ఈ జగత్తునందు "ఇది వాస్తవమే" అను బుద్ధికలిగియుండుటచే, ఇందలి పదార్థముల వినాశనములను చూచి అంతులేకుండా దుఃఖములను పొందుచున్నాడు.

❖

సునిశితమైన బుద్ధితో ఈ చెప్పే విషయం గురించి యోచించు! ఏ వస్తువైతే మొదటగాని, చివరగాని ఉండుటలేదో, అది ఈ వర్తమానమునందు కూడా 'లేనిదే' అగుచున్నది.

అసత్తును ఇష్టపడేవానికి సర్వత్రా అసత్తే కనిపిస్తుంది. సత్తు మరుగునపడి ఉంటోంది. జలంలో ప్రతిబింబించే ఆకాశమును, నక్షత్రములను, చంద్రమండలమును చూచి, "ఈ ఆకాశము, చంద్రుడు మొదలైనవన్నీ జలంలోనే ఉండి ఉన్నాయి"... అని తలచి, వాటిని పట్టుకొనుటకు గజ ఈతగాళ్ళను పిలిపిస్తారా.... ఎవరైనా...? ఒక్క అమాయక బాలుడు తప్ప! ప్రాజ్ఞులకు జలంలో ఏది ఉన్నదో ఏది లేదో తెలుసు. విజ్ఞులు ఆత్మయందు ఉన్నదానిని, లేనిదానిని వేరు చేయగలుగుచున్నారు.

ఈ ప్రాపంచిక వస్తువులు, 'అర్థశూన్యం'. ఇవి సుఖము అను అభాస మాత్రం కలిగి వున్నాయి. అట్టి వస్తువులచే సంతుష్టిపొందుచూ, ఆయుస్సును గడిపివేయు మానవుడు చివరకు దుఃఖములనే పొందుచున్నాడుగాని, సుఖములను కాదు.

కనుక, రామా! నీవు సత్యమును మాయను విడదీసి ఉంచాలి. విడదీసి దర్శించాలి. విడదీసి ఆస్వాదించాలి. సుస్థిరపదమునే నిరంతరం ఆశ్రయించి ఉండు.

అజ్ఞానదృష్టిచే ప్రాప్తించుదానికి కలత చెందవలదు. దానియందు అనురాగముగాని, నైరాశ్యముగాని కలిగియుండవద్దు.

అజ్ఞానరహితంగా స్వస్వరూపాధిక్యత వహించియుండు. "ఇదంతా సత్యమగు బ్రహ్మమే" అని ఎరిగిన తరువాత, మౌనమును ప్రశాంతతను వీడకుండెదవు గాక!

❖❖❖

దామ వ్యాళ కటోపాఖ్యానం - విషయ విచారణ సమాప్తం

(తొమ్మిదవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

పదవ రోజు

VI. దాశూరోపాఖ్యానము

(ప్రారంభ విచారణ)

1. జీవన్ముక్తుడు - స్థితి, గుణములు, గతులు

శ్రీ వసిష్ఠ మహర్షి: ఈ పదవ రోజు విచారణ ప్రారంభంలో, దాశూరోపాఖ్యానంలో ప్రవేశించే ముందు ఈ 'స్థితిప్రకరణము'లో ఇప్పటివరకు మనం చర్చించిన విషయము ఒక్కసారి ఇంకొక కోణం నుంచి సమీక్షిద్దాం.

❖

ఓ రామచంద్రా! పైకి ఎంతో రమణీయంగాను, అత్యంత వాస్తవంగాను కనిపించే ఈ 'నాకు చెందినవి' అని చెప్పబడు "ధనము, వస్తుజాలము, పుత్రులు, స్వజనులు" మొదలైనవన్నీ 'సంకల్ప నగరము'* నందలి పదార్థములవంటివి. ఊహలు వచ్చిపోతున్నట్లే అవి కూడా వచ్చిపోతూ ఉంటున్నాయి. క్షణకాలంలో కనిపించే ఇంద్రజాలంలాగా, 'మృగతృష్ణ'లోని తరంగములలోని విభేదవ్యవహారంలాగా ఈ ధన-పుత్ర-స్వజన-గృహ-వస్తుజాలాదులపట్ల సంబంధములన్నీ ఏర్పడుచున్నాయి. అట్టి స్వప్న సదృశ విషయాలు ఉంటే ఏముంది? లేకుంటే ఏముంది? స్వప్నం లోని సంఘటనలను బాలురు మాత్రమే మననం చేసుకుంటూ దుఃఖము పొందుతారేమో గాని, విజ్ఞులు మాత్రం కాదు. "మాయామోహం" చేత ఏవేవో చమత్కార విషయాలు అతిశయించుటచే ఎవరు సుఖించగలరు చెప్పు? 'విషయభోగముల పట్ల, 'నాది' అను రూపం గల మమకారాదుల పట్ల - అనురాగము కలిగి ఉండుట'... అనునది చివరకు మూఢత్వము వైపుకే దారితీస్తోంది.

ఈ భోగములను, వీటి పర్యవసానములను గమనిస్తున్నప్పుడు జ్ఞానికి వైరాగ్యమే కలుగు చున్నది. అజ్ఞానిని అవన్నీ క్షణంలో వశం చేసుకొని, అతిత్వరలో దుఃఖితునిగా చేసివేస్తున్నాయి.

ఓ జనులారా! ధనాదులు మొదలైనవి నశించుచున్న సమయంలో సుఖదుఃఖాలను పొంద వలసిన పనిలేదని గుర్తుచేస్తున్నాను. ఇవన్నీ ఈ రోజు కాకపోయినా, ఏదో ఒక రోజు 'నాశనం' అను స్థితిని తప్పక పొందబోవుచున్నాయి. భ్రమ కలిగియున్న వారికి అవి నరక హేతువులే అగు చున్నాయి. కాబట్టే సాధుపుంగవులగు మహాత్ములు వాటిపట్ల సర్వదా విరక్తి కలిగి వర్తిస్తున్నారు.

---

* **సంకల్ప నగరము :** ఒకడు తన ఊహయందు ఒక నగరమును కల్పించి, అందు వస్తుజాలమును, జనులను తన సంచారమును ఊహిస్తూ అనుభవమును పొందుట.

కనుక మీరంతా 'తత్త్వజ్ఞులు' కావాలి. అందుకు ప్రయత్నమును ఆశ్రయించి ఉండండి. ఈ ప్రపంచంలో ఏ పదార్థములు వినష్టములగుచున్నాయో, వాటిపట్ల 'ఉపేక్ష' కలిగి ఉండండి. అంతేగాని 'అపేక్ష' కాదు.

కామము - ప్రాప్తించినవాటిని మాత్రం సేవిస్తూ ఉండండి. జ్ఞానులు స్వభావసిద్ధంగానే "అప్రాప్తములైన వాటిపట్ల ఇచ్ఛలేకుండుట – ప్రాప్తించిన వాటిపట్ల అనురాగ – విద్వేషములు కలిగి యుండకుండుట"... అనునది సాధన చేస్తూ ఉంటారు. అప్రాప్తములపట్ల ఏర్పడుచున్న ఇచ్ఛయే 'కామము' – అదే గొప్ప శత్రువు. అది ఈ ప్రపంచమున జీవులను తన ఇచ్ఛ వచ్చినట్లు భ్రమింపజేస్తోంది. ప్రచ్ఛన్నరూపమున "నిర్దయగా వధించే శత్రువు" వలె తారసపడుతోంది. మీరంతా ఈ 'కామము' విషయంలో అత్యంత జాగరూకులై ఉండాలి సుమా!

జ్ఞానవంతులు కావాలి. అజ్ఞానమునకు చోటు ఇవ్వకూడదు.

ఈ జనులలో కొందరు "ప్రపంచరహితమగు బ్రహ్మము" గూర్చి సమాచారం కలిగి ఉంటున్నప్పటికీ, పాపం, అప్రమత్తులై ఉండకపోవటం చేత ఈ 'సంసారాడంబరము' యొక్క వంచనను గుర్తెరుగుటలేదు. అట్టి ప్రమత్తతచే వారు దుర్భర భావనలను, దీనదశలను, వినాశనమును పొందుచున్నారు. అందుచేత ముందుగా ముముక్షువు అయినవాడు ఈ దృశ్య ప్రపంచములోని సంఘటనల పట్ల, పదార్థముల పట్ల 'ప్రీతి'ని నివర్తింపజేసుకోవాలి. అందుకు యుక్తి ఏదైనా ఫరవాలేదు. "పరమార్థతత్వము'తో కూడియున్న నిర్మలబుద్ధి"ని సంపాదించుకున్న వాడు మాత్రమే ఇక్కడ మోహసముద్రంలో క్రుంగకుండా తనను తాను రక్షించుకుంటున్నాడు. ఎవడైతే "ఈ జగత్తంతా అసత్యము" అని ఎరిగినవాడై సమస్త పదార్థముల నుండి "ఉపరతి" (withdrawal) పొందుతాడో, అట్టి వివేకిని మిథ్యయే అయివున్న ఈ అవిద్య ఏమీ చెయ్యదు, చెయ్యలేదు కూడా. "ఈ సమస్తమైన జగత్తూ, చివరికి నేను కూడా ఒకే పరబ్రహ్మమును స్వరూపముగా కలిగియున్నాము"... అని నిశ్చయించుకొనువాని బుద్ధి, ఇక ఇచ్ఛ–అనిచ్ఛలను స్వయంగానూ, స్వభావసిద్ధంగానూ, అప్రయత్నంగానూ త్యజించి వేస్తోంది. అట్టి బుద్ధిని సంపాదించుకున్నవాడు ఈ సంసార సముద్రమున మునుగడు.

❖

ఓ రాఘవా! 'వ్యక్తము–అవ్యక్తము'ల రెండింటి మధ్య వ్యాపించియున్న శుద్ధ బ్రహ్మ పదమును ముందుగా ఎరుగుము. అట్టి ప్రత్యగాత్మస్వరూపమునే సర్వదా ఆశ్రయించి ఉండు. ఇక ఈ బాహ్య– అభ్యంతర జగత్తులంటావా... వీటిని గ్రహించవద్దు, త్యజించవద్దు. శుద్ధ పరబ్రహ్మ స్వరూపమే నీవు... నేను... ఈ జగత్తు కూడా. అట్లయి ఉండగా, ఈ 'గ్రహించుట–త్యజించుట' అను వేదనలతో పని ఏమున్నది?

పూర్ణవిరక్తి, సంతుష్టి, అభిమానరాహిత్యము కలిగియుండుము. 'ఆకాశము' వలె దేని యందునూ 'ఆసక్తి' లేకయే ఉండు. అటుపై ఈ ప్రపంచంలో యథాతథంగా వ్యవహరిస్తూ ఉండు.

'ఇచ్ఛ, అనిచ్ఛ' ఈ రెండూ కూడా లేనట్టి తత్త్వజ్ఞాని వ్యవహారములు సలుపుచూ ఉన్నప్పటికీ, అతని బుద్ధి ఏ మాత్రం 'లిప్తము' అవటం లేదు. కమలము నీళ్ళలో ఉన్నప్పటికీ ఆ నీరు కమలమును అంటుతోందా? పడవ నీళ్ళలో ఉన్నా కూడా, నీటిని పడవలోకి రానిస్తున్నామా? లేదు కదా!

ఆసక్తి రహితమైన నీ మనస్సు ఇంద్రియసహితముగా "దర్శించుట-వినుట-స్పృశించుట" మొదలైన క్రియలందు పాల్గొనుచున్నదా? అయితే కానీ. నీవు మాత్రం ఎల్లప్పుడూ ఆత్మనిష్ఠుడవై ఉండు. అంతరంగమున, ఇచ్ఛారహితుడవై వెలుగొందుచుండుము. "ఇది నాది"... అను భావన ఏర్పడుచున్నప్పుడు "ఇది అసత్తే కదా" అను అవగాహనతో ఈ సర్వమును దర్శిస్తూ ఉండు. ఒకవేళ ఏ సమయందైనా 'శబ్దము-స్పర్శ' మొదలైన ఇంద్రియార్థములపట్ల అభిముఖం కావలసిన అవసరం ఏర్పడినదనుకో... వాటియందు నీ మనస్సు తగుల్కొనకూడదు. నీవు వాటియందు నిమగ్నుడవు కాకుండెదవు గాక!

ఇచ్ఛ-అభిమానము-భావావేశము మొదలైనవి లేకుండా ఉండటమే వాస్తవమైన అభ్యాసం. ఇంద్రియవ్యాపారములను నిర్వర్తిస్తూ ఉండు... లేదా చేయకయే ఉండు. ఏది ఏమైనా..."ఇదంతా జీవుని స్వకీయ కల్పనయే. అట్టి కల్పనకు కర్త – భోక్త అగుచున్న ఈ జీవుడు సర్వదా నిష్క్రియుడు, శుద్ధుడు అగు పరబ్రహ్మమే అయివున్నాడు" అను దృష్టిని సుస్థిరపరచుకోవాలి! ఎప్పుడైతే 'ఇంద్రియార్థములు' అయినట్టి ఈ శబ్ద – స్పర్శ-రూప – రస – గంధములు నీకు రుచికరములు కాకయే ఉంటాయో, అప్పుడు నీవిక జ్ఞాన – విజ్ఞానసంపన్నుడవై ఈ సంసార సముద్రమును దాటి వేస్తున్నట్లే అవుతుంది. అట్టి స్థితిలో నీవు ఈ జగత్తులో తదితరులవలె సంచరిస్తున్నా..., లేక సర్వం త్యజించి సమాధినిష్ఠుడవైయున్నా... ఫరవాలేదు. అట్టి అవగాహన పొందిన తరువాత ఇక ఆపై నీవు నీవుగా కోరుకొనకపోయినప్పటికీ, 'ముక్తి' అనునది అనాయాసంగా నిన్ను సమీపించగలదు.

కాబట్టి రామా! "సర్వోత్తమ పదప్రాప్తి" కొరకు జ్ఞానవైరాగ్యములను ఆశ్రయించు. ఉత్తమ ప్రజ్ఞచే వాసనాసమూహముల నుండి నీ చిత్తమును వేరు చేయి.

ఒక నదిని దాటాలంటే 'నావ' కావాలి కదా! అట్లాగే 'ప్రజ్ఞ' అనే నౌకను ఎక్కి 'వాసనలు' అను జలముతో నిండియున్న ఈ సంసారసాగరమును దాటివేయవచ్చు. అట్లు ప్రజ్ఞను ఆశ్రయించనివారు సంసారసాగరంలో మునిగిపోతున్నారు.

ముందుగా నీ బుద్ధిని వివేక-వైరాగ్యయుక్తం చేయి. తీక్ష్ణవంతం చేయి. పరమ ధైర్యోపేతము, ఉత్సాహవంతము అయిన బుద్ధితో ఆత్మతత్త్వమును విచారించు. ఆ తరువాత 'స్వాత్మపదము' నందు ప్రవేశించు. జ్ఞానముచే 'పరివర్ధితము' అయిన చిత్తము కలవాడవగుము. బుద్ధిమంతులు, తత్వవేత్తలు అగు మహాత్ములు ఎట్లు విహరిస్తున్నారో అట్టి అవగాహనతో కూడుకొని నీవు కూడా విహరించాలి గాని, ఒక మూర్ఖునివలె కాదు సుమా! నిత్యతృప్తులు, మహాధీశాలురు, జీవన్ముక్తులు ఎట్లు పలుకుచున్నారో, ఏ ఉద్దేశము కలిగి ఉంటున్నారో, ఏ అర్థములను గ్రహిస్తున్నారో నీవు పరిశీలించు, గమనించు.

అంతేగాని, స్వ-పర వంచకులగు (Those who are deceptive towards themselves as well as towards others) అల్పదృష్టిగలవారి ఆచరణ నీకు తగదు.

❖

ఈ ప్రపంచంలో 'జగత్తు-బ్రహ్మము'ల యథార్థమేమిటో ఎరిగినట్టి మహాత్ములు ఉన్నారు. వారు విద్య, తపస్సు మొదలైన ఉత్కర్షలతో కూడిన ప్రభవములను గాని, అభిమానముగాని, కుల-శీలాదులతో కూడిన కీర్తి ప్రతిష్ఠలను గాని వాంఛించరు, ఇచ్ఛగించరు, త్యజించరు. ప్రాప్తాలైన వాటిని మాత్రం అనుసరిస్తూ ఉంటారు. "ఇవన్నీ మిథ్యారూపాలే"... అని సుస్పష్టంగా ఎరిగియే ఉంటున్నారు. మిథ్యారూపమైనవి పరమపురుషార్థమును ఎక్కడైనా తెచ్చి పెట్టగలవా?... లేదు. అట్టి మహాత్ములు సర్వము నశించినప్పుడు కూడా ఖిన్నులు కాకయే ఉంటున్నారు. ఇంద్రుని ఉద్యానవనమునకు కూడా వారిని ఆకర్షించగల శక్తి లేదు. సూర్యభగవానునివలె వారు శాస్త్ర ప్రసిద్ధమై ఉన్నట్టి తమ నియతిని త్యజింపకయే ఉంటున్నారు. అనగా తమకు విధించినది అంగీక రిస్తూ నిర్వరిస్తున్నారు. "విజ్ఞానము' అను మంచి సారథిని నియమిం చుకున్నవారై స్వస్థచిత్తులై, దేహము అను రథమును అధిరోహించి లీలామాత్రంగా ప్రపంచమంతటా విహరిస్తునారు.

ఓ రామచంద్రా! అట్టి మహత్తర విజ్ఞానము నీకు ఇప్పటికే ప్రాప్తించియున్నది సుమా! కనుక చక్కటి నిశ్చయముతో బుద్ధిబలముచే 'జ్ఞానము'నందు సుస్థితుడవై యుండుము. ప్రత్యక్షమగు 'ఆత్మదృష్టి'ని అవలంబించియుండుము. అభిమాన మాత్సర్యములు లేనివాడవై ఈ భూమిపై విహరించు. అదియే సర్వోత్తమమగు 'సిద్ధి' అని చెప్పబడుతోంది. స్వస్థచిత్తుడవై సర్వక్రియలకు అతీతుడవగుము. "విషయకౌతుకముచే వీక్షించాలి" అను కోరిక లేనివాడవై ఉండు. అంతఃకరణం నందు పరమశాంతిని పొందినవాడవై, లోకానుకూలంగా, శాస్త్రానుకూలంగా వ్యవహరించు.

❖

ఈ వాక్యములు శ్రీరాముని అంతఃకరణమును నిర్మలతచే శోభిరపజేశాయి. అతని హృదయము అతి మధురమగు 'జ్ఞానము' అను అమృతముచే నిండిపోయింది. అతడు పూర్ణ చంద్రునివలె శాంతమును పొందాడు.

❖❖❖

2. బ్రహ్మాండముల చమత్కారం

శ్రీరాముడు: మహాత్మా! సర్వధర్మజ్ఞా! వేదవేదాంగముల సారమైనట్టి తమయొక్క నిర్మల వచనములచే ప్రభావితుడనగుచున్న నేను ఇప్పుడు పూర్ణరూపమున స్వస్థుడనైయున్నాను. అనేక ఉపమానములు - యుక్తుల సహాయంతో మీరు మా హృదయములందు పరమార్థ యుక్తమగు 'ఆత్మతత్త్వము'ను ప్రకాశింపజేస్తున్నారు. తమ శ్రేష్ఠవాక్యములు ఎంతగా విన్నప్పటికీ నాకు తనివి తీరటం లేదు.

మీరు ఇతఃపూర్వము రాజస–సాత్విక–తామసిక జీవజాతుల ప్రసంగంలో "బ్రహ్మాండముల ఉత్పత్తి" గురించి కొన్ని విశేషాలు చెప్పారు. వేద, పురాణములను ప్రమాణంగా తీసుకొని మీరు చెప్పిన విషయాలు కాక, మరికొన్ని విషయాలు మరికొంత సుస్పష్టత కొరకై చెప్పండి.

ఈ బ్రహ్మాండాలన్నీ ఎవరు ఎవరి కొరకు ఏ ఉద్దేశంతో నిర్మిస్తున్నారు? వీటిపై సర్వ అధికారాలు కలిగి ఉంటున్నది ఎవరు? ఇవన్నీ ఉన్నదెక్కడ? ఎందులో? ఈ బ్రహ్మాండాలకు ఆవల ఉన్నది ఏమిటి? ఈ కాలగతి అంతా నడుపుచున్నది, ఈ సర్వక్రియలను శాసిస్తున్నది ఎవరు? ఇదంతా ఎప్పటికి వినాశనము కానున్నది? ఇక్కడి సృష్టి, ప్రళయములకు మూలకారణమేమిటి? అసలు ఈ జగత్తులో సత్యమైనదేది? అసత్యమైనదేది?

ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని ఈ బ్రహ్మాండముల రచనా చమత్కృతి గురించి సంక్షిప్తంగా చెప్పవలసినదిగా ప్రార్థిస్తున్నాను.

శ్రీ వసిష్ఠమహర్షి: అనేక బ్రహ్మాండములు ఉద్భవించాయి... గతించాయి. నేటికి అనేక లక్షల మంది బ్రహ్మలు, వేలకొలది నారాయణులు, శంకరులు గతించారు. ఇప్పుడీ బ్రహ్మాండమునందు అనేక విధములైన ఆచార–విచారాదులు కలిగిన దేవ–రాక్షసాదులు విహరిస్తున్నారు. అట్లే ప్రతి ఒక్క బ్రహ్మాండములో అనేక రీతులుగా వ్యవహారసరళి జరుగుచున్నది. ఒకే కాలమునందు మరియు వివిధకాలము లందు ఏర్పడుచున్నట్టి అనేక బ్రహ్మాండములలో అనేక జీవులు జన్మించారు. బ్రహ్మ మొదలగు సమష్టి సృష్టికర్తలచే నిర్మించబడిన బ్రహ్మాండములలో ఈ జీవుల ఉత్పత్తి ఒక విచిత్రమైన ఇంద్రజాలములవలె ఒప్పుచున్నది.

ఈ సృష్టులన్నీ ఒకప్పుడు మహేశ్వరునిచే నిర్మించబడుచున్నాయి. మరొకప్పుడు బ్రహ్మదేవుడే వీటిని రచించుకుంటూ పోతున్నాడు. వేరొకప్పుడు మునుల చేతను, విష్ణువు చేతను ఇవన్నీ రచించబడుచున్నాయి.

కొన్ని బ్రహ్మాండములలో బ్రహ్మదేవుడు కమలమునుండి ఉద్భవిస్తున్నారు. మరొకప్పుడు జలములోంచి బయల్వెడలుచున్నారు. అట్లాగే అండము నుండి, ఆకాశము నుండి కూడా కొన్ని బ్రహ్మాండములు ఉద్భవించటం జరుగుతోంది. ఒక బ్రహ్మాండములో మహేశ్వరుడు, మరొక దానిలో సూర్యుడు, ఇంకొక దానిలో ఇంద్రుడు అట్లే విష్ణువు మరియు తదితరులు ఆ బ్రహ్మాండము లోని తదితర దేవతలపై ఆధిపత్యం వహించి ఉండటం జరుగుతోంది.

❖

ఒక 'సృష్టి' యందు ఈ భూమి అంతా మొట్టమొదటగా వృక్షములచే వ్యాప్తమై ఉంటోంది. మరొకప్పుడు మనుష్యులచేత, పర్వతములచేత ఆక్రమించబడుతోంది. ఒక భూమండలము మట్టిమయం, మరొకటి శిలామయం, ఇంకొకటి రాగిమయం, అట్లే స్వర్ణమయంగాను ఉంటున్నాయి. ఓ రామా! అంతదాకా దేనికి...? మన ఈ బ్రహ్మాండమే తీసుకో... ఇందులో ఎన్నో ఆశ్చర్యకరమైన జగత్తులు ఉన్నాయి. అట్లే తదితర బ్రహ్మాండముల విషయం కూడా. కొన్ని జగత్తులలో ఒక్క సూర్యుని ప్రకాశము మాత్రమే కలదు, మరింకేదీ ఏ మాత్రం లేదు. కొన్నిటిలో

అసలు 'ప్రకాశము' అనునదే లేదు. ఆహాఁ! బ్రహ్మమే రూపముగా గల ఈ మహాకాశంలో సముద్రజలంలోని తరంగాలలాగా ఎన్ని బ్రహ్మాండములు ఉత్పన్నమౌతున్నాయి! ఎన్ని లయిస్తు న్నాయి! సముద్రంలోని కెరటాలకు అంతు ఎక్కడ? ఎడారిలో ఎన్ని మృగతృష్ణలు ఉన్నాయో లెక్కించి చెప్పేదెవరు? తంగేడు చెట్టుకు కాచే పూలు ఎన్నని, ఎన్నిసార్లని చెప్పమంటావు? పరమాత్మయందు ఈ ప్రపంచముల శోభ అనంతసంఖ్యలో ప్రకటితమౌతున్నాయి. ఇంకా... సూర్యకిరణములలోని త్రసరేణువులను (ధూళిరేణువులను) లెక్కపెట్టవచ్చునేమో! పరబ్రహ్మమున గల ఈ చంచల జగత్ సమూహములను మాత్రం ఎవరు లెక్కబెట్టగలరు? వర్షాకాలంలో అనంత సంఖ్యలో దోమలు, రెక్కపురుగులు పుట్టి, సంచరించి, నశిస్తాయి చూచావా? నిరంతరం ఉత్పన్నం అవుతూ, నశించుచున్నట్టి ఈ సృష్టి సమూహములు ఎప్పటినుండి కొనసాగుచున్నాయో చెప్పటం ఎవరి తరం? అయితే, "ఈ అనంత జగత్ – ప్రవాహరూప వ్యవహారమంతా అనాది, ఈ సర్వము పరబ్రహ్మమే"... అని గ్రహించు. శాస్త్రాదులచే మనకు అందజేయబడుచున్న వివరణ అదే. ఆద్యంతరహితమైన ఈ సృష్టి నిరంతరం తరంగమువలె స్ఫురిస్తూనే ఉన్నది.

ఈ సృష్టికి ముందు పూర్వసృష్టి ఉన్నది... ఆ పూర్వసృష్టికన్నా ముందు ఇంకొక సృష్టి ఉన్నది... ఆ ఇంకొక సృష్టికన్నా ముందు వేరొక సృష్టి ఉన్నది... ఆ వేరొక సృష్టి కంటే ముందు మరొకటి ఉండనే ఉన్నది...

ఇట్లు ఈ వ్యవహారమునకు అంతులేదు, ఉండబోదు, నదిలో తరంగాల లాగానే ఈ సుర–అసుర–మనుష్యాది ప్రాణికోట్ల వివిధజాతులన్నీ పుడుతున్నాయి, నశిస్తున్నాయి. బ్రహ్మదేవుని యొక్క ఈ బ్రహ్మాండం వంటివే, ఒక సంవత్సరములోని క్షణములవలె, వేలాది బ్రహ్మాండాలు పుట్టి ఇతఃపూర్వమే కాలగర్భంలో కలిసిపోయాయి. ఈ బ్రహ్మాండాలన్నీ స్థితి కలిగియున్నది ఎక్కడ?

అన్యాః సంప్రతి విద్యన్తే వర్తమానశరీరకాః
ప్రాన్తే బ్రహ్మపురస్యాస్య వితతే బ్రహ్మణఃపదే. (శ్లో 22, సర్గ 47)

ఓ రామచంద్రా! సర్వుల అంతరంగమున అతి సూక్ష్మంగా 'బ్రహ్మపదము' అనునది వ్యాపించియున్నది. అట్టి ఆత్మపదము లేక బ్రహ్మమునందే ఇవన్నీ స్థితి పొందియున్నాయి. అట్టి హృదయాంతరంగమే... "హృదయపుండరీకము, బ్రహ్మపురము, బ్రహ్మపట్టణము'... అని కూడా శాస్త్రకారులు పిలుస్తున్నారు.

అనగా, 'హృదయమే బ్రహ్మాండముల స్థితి స్థానము' అని గ్రహిస్తున్నావు కదా! ఇవన్నీ బ్రహ్మపురంలో దృశ్యమానమై ఉంటున్న శోభలే సుమా! ఆకాశమందు శబ్దం పుట్టి, నశించు చున్నట్లు, ఈ బ్రహ్మాండములు కూడా ఉత్పన్నమై, స్థితిపొంది, నశించి పోవటం జరుగుతోంది.

మట్టిలోనే 'కుండ' అనునది ఉన్నది కదా...! విత్తు యొక్క అంకురమునందే చిగురు దాగి ఉన్నది కదా...! అదే విధంగా బ్రహ్మమునందే భూత–వర్తమాన–భవిష్యత్ కాల సృష్టి పరంపర లన్నీ ఉన్నాయి.

❖

అయితే ఒక చమత్కారం. విశాలాకారయుక్తాలైన ఈ సృష్టి పరంపరలు, ఈ త్రిలోకాలు... ఇవన్నీ తత్త్వజ్ఞానం పొందనంతవరకు మాత్రమే బ్రహ్మమునందు ఇట్లు దృశ్యమానమౌతూ ఉంటున్నాయి. అసలు 'బ్రహ్మాండము' అనగా ఏమిటి?

'అజ్ఞులచే, బ్రహ్మమునందు 'అధ్యాస' చేయబడి, దర్శించబడుచున్నది. అనిర్వచనీయము, మిథ్యా రూపము అయినదే ఈ బ్రహ్మాండ వ్యవహారము"... అని చెప్పబడుతోంది. అజ్ఞానము శేషించి ఉన్నంతవరకు ఆ అజ్ఞానమును అనుసరించియే ఈ జగత్తులన్నీ పెంచబడుతూ, పోషింప బడుచూ త్యజించబడుచున్నాయి. తత్త్వజ్ఞానుల దృష్టిలో ఇవి ఏ కాలమందునూ లేనే లేవు. 'ఊహ'లో కనిపించే మహాసౌధాలకు స్థితి ఎక్కడ? అంతు ఎక్కడ?

❖❖❖

3. జ్ఞాని ఇదంతా ఎట్లా చూస్తున్నాడు?

ఆహాఁ! ఏమి విచిత్రం! తరంగాలు లాగానే క్షణభంగురమైన ఆకృతి గల ఈ సృష్టి సమూహాలు చిత్ర-విచిత్రములైన రూపములతో, ప్రాణుల విచిత్రమైన చేష్టలతో కూడి ఉన్నాయి కదా! అయితే జ్ఞాని వీటన్నిటినీ మరొక విశిష్టమైన దృష్టితో చూస్తున్నాడు. ఆతని అవగాహనను అనుసరించి ఇవన్నీ పరమాత్మ కంటే వేరైనవి కావు. పరమాత్మయే ఇదంతా!

'పరమాత్మ నుండే ఈ సృష్టి పరంపరలు ప్రాదుర్భవిస్తున్నాయి"... అనే వాక్యం అజ్ఞానులచే తమ అసంపూర్ణ అవగాహన కారణంగా మాత్రమే ఏర్పడుతోంది. ఎందుకంటే ఇక్కడ ద్వితీయ మైనది ఏదైనా ఉంటే కదా, ఒకదాని నుండి మరొకటి ఉద్భవించటం!

జలముకంటే వర్షధారలు వేరా? ఆలోచించే వానికంటే 'ఆలోచన' వేరైనదా? మేఘములు జలముకంటే వేరైనవా? భావించేవానికంటే భావన వేరా? వృక్షము కంటే దాని కొమ్మలు, ఆకులు, పుష్పములు, కాండము మొదలైనవన్నీ వేరు అని అనటం ఎట్లా?

యథార్థానికి జ్ఞానికిగాని, అజ్ఞానికి గాని... ఈ సృష్టి బ్రహ్మము కంటే వేరుగా ఇంకెక్కడా, మరింకే విధంగానూ లభించేది కాదు.

అవ్యాకృత ఆకాశము నుండే ఈ స్థూలభూత నిర్మితములైన "శరీరము" మొదలైనవి, మరియు సూక్ష్మభూత నిర్మితములైన 'ఇంద్రియములు' మొదలైనవి, తక్కిన సమస్త పదార్థములు ఉత్పన్నములౌతున్నాయి. ఇవన్నీ కూడా సూక్ష్మతత్త్వములతో (శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం – తన్మాత్రలు) అవినాభావ సంబంధం కలిగినవై ఉంటున్నాయి. ఆ అవినాభావ సంబంధమే సృష్టి.

❖

ఇక్కడ సృష్టికి సంబంధించి చెప్పబడిన కొన్ని శాస్త్ర, పురాణ ప్రవచనములు ఉదహరిస్తాను. విను. అన్నిటికన్నా ముందుగా ఒక సమయంలో ఆకాశము స్థూలభావం పొందుతోంది. అందు లోంచి 'సమష్టిసృష్టి' అను స్వభావము గల 'బ్రహ్మదేవుడు' అను తత్త్వము ఉదయిస్తోంది. "అనేక

పదార్థాలతో కూడిన ఈ సృష్టి అను స్వరూపం కలవాడను నేనే” అను అహంభావమే బ్రహ్మదేవుని యొక్క నిజస్వరూపం. అతడే ‘ప్రజాపతి’ అని, ‘ఆకాశజుడు’ అని కూడా పిలువబడుచున్నాడు.

ఒకప్పుడు వాయువునందు ఏర్పడుచున్న స్థూలభావముచే సమష్టి సృష్టి అహంకారియగు ప్రజాపతి ఆవిర్భవించుచున్నాడు. అందుచేత, అతడు ‘వాయుజుడు’ అని చెప్పబడుచున్నాడు. అట్లాగే అగ్ని నుండి స్థూలభావం పొందుటచే ఆ ప్రజాపతిని ‘తేజసుడు’ అని, పృథివి నుండి స్థూలభావం పొదు ప్రజాపతికి ‘పార్థిపుడు’ అని, జలము నుండి స్థూలభావము పొందిన ప్రజాపతికి ‘వారిజుడు’ అని పౌరాణికంగా చెప్పబడుచున్నారు. ఈ ఆకాశము – వాయువు – జలము – అగ్ని – పృథివి అనబడు ఐదు భూతములు రెండేసిగా విభజించబడి, మరల వాటిలో ఒకొక్కటి నాలుగు విభాగములుగా చేయబడింది. అట్లు విభక్తములైన ఒక్కొక్క భాగము (5×2×4=40 లో ఒక్కొక్కటి) అర్ధభాగం నాలుగు భాగములందు చేర్చబడగా అప్పటి మిగతా అర్ధభాగము నుండి బ్రహ్మదేవుడు ఉత్పన్నమగుచున్నాడు అతడే సమష్టి – సృష్టి ఇచ్ఛాస్వరూపుడు (The form of universal will). అతడే భవిష్యత్తు కాలంలోని జగత్క్రియలన్నీ ఒనర్చుచున్నాడు.

నారాయణుడు - ఇతడు స్వయంభువు. ఇతని జన్మకు మరింకేదీ కారణం కాదు. వాస్తవానికి జన్మరహితుడగు ఈతడు జలంలో ప్రథమ తరంగంలాగా ఆవిర్భవిస్తున్నాడు. స్వకీయ మాయచే ఇతడే సర్వ తదితర వ్యవహారములకు కారణము. కాబట్టి, ఇతడు ‘ఆదికారణుడు’గా వేద వేదాంగాలచే స్తుతింపబడుచున్నాడు. ఈ జీవుని యొక్క ఆది స్వరూపమే అతడని గ్రహించు. అతడి హృదయమే “ఆకాశజుడు, వాయుజుడు, తైజసుడు, వారిజుడు, పార్థివుడు”... అను ప్రజాపతులకు జన్మస్థానమైయున్నది. నారాయణుని ముఖము నుండో, పాదముల నుండో, వెనుక భాగం నుండో, పృష్ఠముల నుండో, నేత్రముల నుండో, హస్తాదుల నుండో...ఇట్లా ఏదో ఒక భాగము నుండి ఈ నామ–రూప–శబ్దాదులన్నీ ఉదయిస్తున్నాయి.

ఆ నాయణుడు అనబడు ఆది పురుషుని యొక్క నాభిప్రదేశం నుండి ఒక కమలము ఉత్పన్నమగుచున్నది. ఆ కమలము నుండి బ్రహ్మదేవుడు ఉద్భవిస్తున్నాడు. అందుచేత అతడు ‘పద్మజుడు’ అను పేరుతో శ్లాఘించబడుచున్నాడు.

❖

శ్రీరాముడు: స్వామీ “జీవుని యొక్క శుద్ధ స్వరూపమే” అయి ఉన్నట్టి ఆ నారాయణుని యొక్క నాభికమలము నుండి ‘సమష్టి సృష్టి’... అను స్వరూపంగల బ్రహ్మదేవుడు ఆవిర్భవిస్తున్నాడు కదా! అట్లు ఆవిర్భవించేది ఎవరు? నారాయణుడేనా? లేక మరింకొకరా?

శ్రీ వసిష్ఠ మహర్షి: (పకాలున నవ్వుతూ...) ఓ రాఘవా! “నారాయణుడు బ్రహ్మదేవునిగా పరిణతి చెందుచున్నాడు”... అని తలచకూడదు సుమా! ఎందుచేతనంటావా? ఒక్క ప్రథమ తత్వమగు స్వస్వరూపము తప్ప తక్కినదంతా స్వప్నభ్రాంతి వంటిదే. ఇది మిథ్యారచనాచక్రము, మనోకల్పిత రాజ్యములవలె ‘మాయ’యే అయివున్నది.

నారాయణుడు= జీవుని సర్వసంకల్పములకు ముందే ఉన్నట్టి శుద్ధ స్వస్వరూపము.

బ్రహ్మదేవుడు = అనేక ఉపాధులను సంకల్పిస్తున్నట్టి ఆ నారాయణుని (లేక ఈ జీవుని) సమష్టి సృష్టి సంకల్పము.

వాస్తవానికి పరమాత్మ దేనితోనూ ఎట్టి సంగమమూ ఏ సమయమందునూ లేనివాడు. అతడు అద్వితీయుడు (ఈ జీవుని శుద్ధస్వరూపమునకు అతడు వేరుగా మరెక్కడా లేదు). మరి, అట్టి ఆ శుద్ధతత్వము (నారాయణుడు) నందు ఆశ్చర్యజనకమూ, ద్వితీయమూ అయినట్టి ఈ సృష్టి జనించుట ఏమిటి? లేదు. 'మాయ' యొక్క కార్యము మాత్రమే కనుక 'పురుషుని నాభికమలము నుండి పురుషుడు ఉద్భవించెను" అను వ్యవహారమంతా బాలుని మనోరాజ్యము వంటిదే. ఈ విషయము గ్రహించి, ఆపై నాచే చెప్పబడు సృష్టి విశేషాలు విను-

మరొకప్పుడు నిర్మలాకాశంలో మనస్సు యొక్క శక్తిచే ఏదో విభాగము (ఉదా: బంగారు రంగులు విరజిమ్ము వనములు మొ॥) సంకల్పించబడగా, అందులోంచి సృష్టికర్తయగు బ్రహ్మ దేవుడు ఆవిర్భవిస్తున్నాడు. ఇంకొకప్పుడు మహాపురుషులగువారు జలమునందు వీర్యము ఉంచగా ఆ వీర్యము నుండి భూమి అను పద్మమో లేక విశాలమగు బ్రహ్మాండమో బహిర్గతమౌతున్నది. అట్టి 'భూపద్మము' నుండి బ్రహ్మదేవుడు ఆవిర్భవించినప్పుడు 'పద్మజుడు' అని చెప్పబడుచున్నాడు.

ఒకప్పుడు పూర్వకల్పములోని ఒక భక్తుడు ఈ కల్పంలో 'బ్రహ్మ' అగుచున్నాడు. మరొక సారి పూర్వకల్పములోని వరుణుడు గాని, వాయువుగాని ఈ కల్పంలో సృష్టికర్తయగు 'బ్రహ్మ' గా అగుచున్నారు.

❖

ఇదంతా అట్లు ఉండనిమ్ము, మరొకకోణం నుంచి అసలు ప్రశ్నకు వస్తే, అనగా, పరమార్థంగా చూస్తే, బ్రహ్మము నందు "బ్రహ్మలు" ఎక్కడ? బ్రహ్మము బ్రహ్మముగానే ఉంటోంది గాని మరింకేదీ ఎన్నడూ బ్రహ్మమునందు ఉత్పన్నమగుటలేదు.

ఈ విధంగా శాస్త్రకారులచే వివిధ రీతులుగా బ్రహ్మదేవుని విచిత్రమైన ఉత్పత్తుల గురించి చెప్పబడినది వర్ణించి చెప్పాను. అంతా విన్నావు కదా! అయితే వారల ఉత్పత్తి యందు 'నియమము" అనునదేదీ లేనేలేదు. బ్రహ్మదేవుని సృష్టిలాగానే తదితరమగు సర్వము యొక్క సృష్టి కూడా 'నియమము' అనునది లేకుండానే ఏర్పడుతోంది.

మనోవిలాసమాత్రము - అంతా విన్న తరువాత ముఖ్యంగా ఒక్క విషయం గ్రహించు :

మనోవిజృంభణమిదం యాశ్చ జాతయశ్చేత్థమాగతాః ।
సంబోధనాయ భవతః సృష్టిక్రమ ఉదాహృతః ॥ (శ్లో 48, సర్గ 47)

ఈ "ప్రపంచము" అనబడేది మనస్సు యొక్క విలాసము మాత్రమే. ఇదియే ఇక్కడ ముఖ్యమైన సిద్ధాంతము. ఈ విషయం నీవు చక్కగా గ్రహించటానికే వివిధ సృష్టుల క్రమమంతా చెప్పాను. ఈ సాత్విక, రాజసిక, తామసిక జీవజాతులు కూడా మనోవిలాస మాత్రం చేతనే

సంభవిస్తున్నాయని గ్రహించు. ఎంతవరకైతే ఈ మనస్సు సమూలంగా నశించకుండా ఉంటోందో, అంతవరకు ఈ సృష్టి-వినాశనములు, సుఖ-దుఃఖములు, జ్ఞాన-అజ్ఞానములు, బంధ-మోక్షాలు సంభవిస్తూనే ఉంటాయి. ఈ సృష్టికర్తలు, భూత-భవిష్యత్-వర్తమాన కాలాలలో ప్రియ-అప్రియ వస్తువులు, వాటి పట్ల స్నేహ-శత్రుభావనలు మరల మరల ఉత్పన్నవటం, శమించటం జరుగుతూనే ఉంటుంది.

మనస్సే అన్నిటికీ మూలం. దీపం వెలగటం ప్రారంభించి, అస్థిరమగు ఆకారము కలిగి యుండి మరల ఎప్పుడో శమిస్తుంది చూచావా? అట్లే బ్రహ్మదేవుడు మొదలగు చతుర్ముఖ ఆకారములు ఏర్పడటం, శమించటం... ఇదంతా కాలము యొక్క ప్రవాహగతిత స్వభావమే కాని మరింకేమీ కాదు.

దీపం స్వల్ప కాలంలోనే లయిస్తోంది. ఇక బ్రహ్మదేవుడో... ద్విపదార్ధంతమున అంతర్ధాన మగుచున్నాడు. అనగా "ద్వైతప్రకృతి" లయించగా ఆతడు కూడా శమించుచున్నాడు. ఈ ఇద్దరి భేదం కాలహరణమే గాని మరింకేమీ కాదు.

కాలన్యాయము - "కృత-త్రేత-ద్వాపర-కలి" యుగాలు మరలమరల సంభవిస్తున్నాయి. అట్లాగే చక్రభ్రమణంలాగా ఈ జగత్తులు వస్తున్నాయి... పోతున్నాయి... రోజులు యుగములు కల్పములు... మన్వంతరములు - వీటి పరంపరలు ఒకదాని వెనుక మరొకటిగా మరల మరల ఏర్పడుచున్నాయి. రోజులు దొర్లుచున్నట్లే కార్యసమూహమంతా మరల మరల సంభవిస్తోంది. ఈ జగత్తంతా పరిచ్ఛిన్నములగు అనేక పదార్థములతో కూడి ఉంటోంది. జీవులు 'ఆయువు' అను గాలివాలుకు మరల మరల ఈ జగత్తులోకి వచ్చిపోవుచున్నారు.

బాగుగా కాల్చబడగా కణకణలాడే 'ఇనుపముద్ద'లో స్వభావ సిద్ధంగానే అగ్నికణములు ఉండి ఉంటాయి కదా! చిదాకాశమున ఈ సమస్త పదార్థములు స్వభావంగానే స్థితి కలిగియున్నాయి. ఒక వృక్షములో "ఫలములు కాయుట, పూలు పూయుట" అను స్వభావం రసరూపమున అవ్యక్తంగా ఉండి, ఆయా ఋతువుల సమయంలో ప్రకటితమౌతూ ఉంటున్నట్లే ఈ జగత్తంతా పరమాత్మయందు స్వతహాగా ఉండి ఉంటోంది.

❖❖❖

4. ఈ ప్రపంచము ఎక్కడి నుండి వచ్చింది?

చిత్స్పన్ద ఏవ సర్వాత్మా సర్వదై వేదృశాకృతిః ।

యదస్మాజ్జాయతే సర్గో ద్వీన్దుత్వమివ లోచనాత్ ॥ (శ్లో 58, సర్గ 47)

సర్వాత్మకమగు చైతన్యం నుండి ఏదేది వివర్తమగుచున్నదో (బయల్వెడలుచున్నదో) అదంతా చిద్రూపమే అవుతుంది కాని, మరింకేమీ కాదు. "పరమాత్మ నుండి సృష్టులు ఏర్పడుచున్నాయి"... అనునదంతా "కంటిదోషముచే వినీలాకాశంలో రెండవ చంద్రుని చూడటం" వంటిది మాత్రమే.

ఈ సృష్టి అంతా చైతన్యము నుండే ఆవిర్భవిస్తోంది. అట్టి చైతన్యమునందే అది 'స్థితి' కలిగి ఉంటోంది. చంద్రకిరణములు చంద్రునికంటే వేరుగా కనిపించినంత మాత్రంచేత "చంద్రుడు వేరు, చంద్రకిరణములు వేరు" అని అనగలమా? లేదు. ఈ కనబడే సృష్టి కూడా చైతన్యము కంటే వేరైనది కాదు. అయితే సర్వశక్తిమంతుడగు పరమాత్మ స్వభావం 'అసంగము, అద్వితీయము అయి ఉన్నది కదా! అట్టి పరమాత్మ యందు కనబడుచున్న ఈ ప్రపంచము వాస్తవము కాదు. స్వకీయ భ్రమచే ద్రష్టయే ఇదంతా ఇట్లు దర్శించుచున్నాడు.

అందుచేత, "ఈ ప్రపంచము ఎక్కడి నుండి వచ్చినది?"... అను ప్రశ్న ముఖ్యం కాదు. "ఇట్లు భేద దృష్టిచే బ్రహ్మమునకు బదులుగా ద్వితముతో కూడిన జగదనుభవమునకు మాత్రమే నేను ఎందుకు పరిమితుడనగుచున్నాను?" అనునది ముఖ్యమైన ప్రశ్న.

"జగత్తు" అనబడేది చిత్స్వభావమునకు భిన్నమైనది కానేకాదు. అనేక జన్మల దురభ్యాసము యొక్క ప్రభావముచేతనే ఈ జీవుడు దోషసహితమగు "జగత్తు వేరు, నేను వేరు, బ్రహ్మము వేరు" అను దృష్టితో గాంచటం జరుగుతోంది.

సర్వశక్తిమంతుడగు పరమాత్మ తనయందుతానే ఇట్లు మాయాసమేతుడై "జగత్ద్రష్ట" అను కర్తృత్వమునకు స్వయముగా ఒడిగట్టుచున్నాడు. అతడు అట్లు గాంచటం బహుచమత్కారమైన విషయమే. అది చిద్విలాసము, అనిర్వచనీయము అని చెప్పబడుతోంది. అయితే ఈ జగత్తు, ఇందలి చిత్రవిచిత్రములైన వస్తుజాలానుభవం – ఇవన్నీ కూడా ప్రళయము అనబడు స్థితికి ఈవల మాత్రమే ఉంటాయి. ఆవల ఉండవు. ఏ జీవుని దృష్టిలో ప్రపంచభావమంతా లయించి పోతున్నదో అతనికి 'ప్రపంచము' అనునదే లేని విషయమగుచున్నది.

ఎవ్వరి దృష్టిలో ఈ జగత్తు లేదో, అతనికి బంధమెక్కడిది? బంధం లేనిచోట, ఇక 'మోక్షము' యొక్క ప్రసక్తి కూడా ఉండదు కదా!

❖

ఓ మహామతీ! రామచంద్రా! జ్ఞాని యొక్క దృష్టిలో ఈ జగత్తంతా బ్రహ్మమే అయి ఉన్నది. ఏ విధంగా చూచినా సరే 'ప్రపంచం లేనిదే' అని సుస్పష్టపడుతూనే ఉన్నది. అయితే అజ్ఞాని యొక్క దృష్టికి మాత్రం ఈ ప్రపంచం 'ప్రవాహము' రూపములో నిరంతరం ఉండియే ఉంటోంది. 'మిథ్యయే' అయినప్పటికీ ఈ సాంసారికమాయ నిత్యమైనదానివలె అజ్ఞానులకు అనుభూత మౌతోంది. ఇక్కడ ఆత్మయే దృష్టితోకూడినదై ఉంటోంది. 'దృష్టి' ఉన్నంతకాలం మాయ ఉంటోంది. జగత్తు ఉంటోంది. కనుక ఒక రకంగా ఇదంతా నిత్యమైనదే కదా! నిత్యమైన దానికి సృష్టి ఏమిటి? స్థితి ఏమిటి? లయమేమిటి?

జగత్తు యొక్క ఉత్పత్తి-వినాశనముల గురించి కొన్ని అభిప్రాయాలు :

1. మీమాంసకుల యొక్క అభిప్రాయం (పునరుత్పత్తి వాదం) - 'ఈ జగత్తు ఉదయిస్తోంది. కొంతకాలం తరువాత నశిస్తోంది. మరల పుడుతోంది. కనుక ఇదంతా ఉత్పత్తి – వినాశనము –

పునరుత్పత్తి కలిగి ఉంటోంది. ప్రవాహంలో ముందుకుపోతున్న జలం స్థానంలో వెనుకటి నీరు క్షణంలో ప్రవేశిస్తోంది."

ఆ విధంగా తరంగతత్వంగా శాశ్వతంగా కనబడుచున్నట్లు ఈ ప్రపంచం కూడా, ఒక విషయం తొలగిన క్షణమే మరొక విషయం 'దృష్టి' యందు ప్రవేశించుచుండుటచే, 'ఉత్పత్తి – వినాశన సహితం' అనునదీ వాస్తవమే. దృశ్యము యొక్క ఉనికి' దృష్ట్యా చూస్తేనేమో, 'జగత్తు' ఏదో రూపమున ద్రష్టపట్ల ఉండనే ఉంటూ, 'నిత్యము' అనునది కూడా వాస్తవమే అగుచున్నది.

2. క్షణికవాదుల అభిప్రాయం (క్షణికం) - "ఈ జగత్తు అనుక్షణం నశించిపోతోంది. క్షణక్షణం మార్పుచెందని వస్తువంటూ ఇక్కడ ఏదీ లేదు. నశ్వరములై, క్షణంలో విధ్వంసమొందే 'విద్యుత్' వంటి పదార్థములే ఇవన్నీ."– ఇట్లు తమ తదితర ప్రవచనములు నిర్వాహణార్థం అనేక వాదోపవాదములతో ప్రతిపాదించబడు క్షణిక సిద్ధాంతం కూడా ఉచితమే.

ప్రవహించు నీటిలో జలబిందువులు క్షణకాల మాత్రమే 'ద్రష్ట' కు ఎదురుగా ఉంటాయి కదా! ఒకానొక జలబిందువేమో క్షణికం. జలతరంగం అనుక్షణికం. అట్లాగే ఒకానొకదృశ్యంగా క్షణికమే అయినప్పటికీ దృశ్యపరంపరగా అనుక్షణికమే!

3. సాంఖ్యులు మొదలైన వారి అభిప్రాయం ("స్థిరవాదం") - "ఇక్కడ చంద్రుడు – సూర్యుడు – కొండలు మొదలగునవి స్థిరంగానే ఉంటున్నాయి కదా! కాబట్టి ఇదంతా స్థిరమే. ఈ జీవుడు సుస్థిరస్వరూపుడే గాని, ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు ఉండనివాడు కాదు."

'స్వసత్త' దృష్ట్యా చూచామనుకో, ఇక్కడ ఎవరైనా ఏదైనా మార్పుగాని, చేర్పుగాని పొందుచున్నారా? లేదే! ఒకడు బాల్యంలో ఏ 'సత్త' అయి ఉన్నాడో, ఇక, నలుబది ఏండ్ల తరువాత, ఏబది ఏండ్ల తరువాత కూడా అదే 'సత్త' అయి ఉంటున్నాడు కదా! కనుక 'స్థిరవాదము' కూడా మరొక కోణము నుండి ఉచితమే అగుచున్నది.

'స్వసత్త' స్థిరమే అయినట్లు, అద్దాని దృశ్యసందర్శనా చమత్కారమూ స్థిరమే!

❖

స్థిరము, కల్పితము - ఇక మరొక విశ్లేషణ విను.

యథార్థానికి పరమాత్మ ఏకము, అనంతము, అనిర్వచనీయము అయి ఉన్నది. అట్టి సమున్నతమగు పరమాత్మయందు సంకల్పితమగు వస్తు జాలమంతా ఎట్లా ఉంటుంది చెప్పు? ఎక్కడ ఉంటుంది? కనుక బ్రహ్మం నందు పదార్థజాలము ఉండజాలదు. అట్టి శుద్ధ పరబ్రహ్మమే నీ యొక్క నా యొక్క ఈ సర్వుల యొక్క వాస్తవ స్వరూపమైయున్నది.

ఇక ఈ దృశ్యవ్యవహారమంటావా... ఈ సమస్తము మరల మరల సంభవిస్తూనే ఉంటుంది. ఈ జనన–మరణములు, సుఖ–దుఃఖములు, కరణ–కర్మములు, ఇవన్నీ ఆత్మ దృష్ట్యా లేవు. కాని శరీరము–మనస్సుల దృష్ట్యా ఇవి ఉంటూనే ఉంటున్నాయి. మరల మరల కలుగుచున్నాయి. ఆకాశంలో సూర్యుడు మరల మరల ఉదయిస్తున్నట్లే ఈ జీవుని హృదయంలో ఆశలు మరల

మరల చిగురిస్తున్నాయి. ఈ ఆకాశం, పర్వతములు, సముద్రములు, తదితర సృష్టి... ఇవన్నీ గతిస్తూ మరల మరల ఉత్పన్నమౌతూనే ఉన్నాయి. అదే రీతిగా దేవతలు, దైత్యులు, ఇంద్రుడు, వరుణ–వాయువులు మొదలైనవారంతా మరల మరల ఉత్పన్నమౌతూనే ఉన్నారు. లోకములు, లోకాంతరములు, సంగముమోక్షము మొదలగు క్రియలు మరల మరల సంభవిస్తూనే ఉన్నాయి. ఈ పృథివి కూడా అనేకసార్లు నశిస్తూ మరల ఉత్పన్నమగుచున్నది. సూర్య చంద్రులు మరల మరల ఉద్భవిస్తున్నారు. కొందరు జీవులు స్వర్గము నుండి తమ యొక్క పుణ్యం క్షయమగుటచే మరల భూమిపై పడుచున్నారు. భూమిపై నివసించే కొందరు జీవులు పుణ్యఫలంగా స్వర్గాదులు చేరుచున్నారు. ఈ సృష్టి వ్యవహారమంతా మరల మరల వస్తోంది, పోతోంది. అనేకమంది ఇంద్రుల అధికారం పూర్తి అగుటచే క్రొత్త వారు ఎందరో వచ్చి ఇంద్రసింహాసనం అధిష్ఠిస్తున్నారు. అనేకసార్లు కృతయుగపు స్థితిగతులు కలియుగంచే కలుషితం చేయబడుచున్నాయి. అనేక కల్పములు దొర్లిపోతున్నాయి.

❖❖❖

5. ప్రాప్తించేదంతా ఇతఃపూర్వపు అభ్యాసానుగతమే!

ఎవనికి ఏ ఇతఃపూర్వపు అభ్యాసం ఏర్పడి ఉన్నదో ఆ అభ్యాసము ననుసరించే అతని సంకల్పములు ఉంటున్నాయి. సంకల్పములను అనుసరించే అనుభవములు పదే పదే ఏర్పడు చున్నాయి. ఒక సమయంలో ఇదంతా రసవిహీనంగాను, అత్యంత భారంగాను, త్యజించుటకు అర్హమైనదిగాను ఉంటోంది. మరొకప్పుడు ఇదే జగత్తు అనేక ఆశలతో, సుందరమైన విషయము లతో ఉన్నట్లు దర్శించబడుతోంది. విషయపరంపరారూపమగు ఈ మనస్సు ఒకానొకప్పుడు శిథిలమైన ఆకృతిని ధరించి తన యొక్క జన్మస్థానమగు సాక్షితత్వమునందు విలీనమగుచున్నది. మరల మనస్సే జగత్ సమూహములను విస్తరింపజేస్తోంది.

ప్రళయం అయిన తరువాత మరల సృష్టి ప్రారంభం అవుతోంది. అప్పుడు మరల సమస్త పదార్థములు ఉత్పన్నమౌతున్నాయి. మరల ఈ జగత్తు చక్రము వలె పరిభ్రమించటం ప్రారంబి స్తోంది. దీర్ఘభ్రమరూపమైనట్టి ఈ'మహామాయ' యొక్క ఆడంబరంలో 'ఇది ఇట్లు నిర్ణయించ వచ్చును...' అనదగిన సత్యవస్తువుగాని, అసత్యవస్తువుగాని ఏది ఎక్కడ ఉన్నది? కల్పనచే రచింప బడినట్టి ఆకారం కలిగిన ఈ సంసార చక్రం భ్రమ వంటిదే సుమా! యథార్థానికి ఇదంతా 'లేనిదే' అగుచున్నది.

ఓ రాఘవా! ఈ జగత్తంతా అజ్ఞానము చేతనే అవిర్భూతమగుచున్నది. నేత్రదోషం చేత ఆకాశంలో ఎందరో చంద్రులు కనిపిస్తున్నట్లు ఈ జగత్తు ఇందలి సంఘటనలు, జనులు అనేక రీతులుగా ద్రష్టకు ప్రాప్తిస్తున్నారు.

అనేక వికల్పములచే ఈ జగత్తు నిరంతరం వ్యాప్తమైయున్నది.

అవిద్యామానమగు కర్తృత్వముచే నిర్మించబడిన ఇదంతా అధిష్ఠానమగు బ్రహ్మము కంటే వేరే కాదు. కాబట్టి నీవు 'జగత్తు' రూపంగా చూస్తే ఇదంతా అసత్యమే.

ఓ రామచంద్రా! అసలు 'ఈ జగత్తు సత్యము' అనే మూఢబుద్ధి నీకు ఎందుకు కలిగిందో చెప్పు? శ్మశాన సదృశమై, రుద్రునిచే ఏదో ఒకప్పటికి సర్వము మ్రింగబడబోవుచున్నదే కదా! అట్టి ఈ జగద్విన్యాసము చూచి భ్రమ పొందవలసిన పనేమీ లేదు.

❖❖❖

VII. దాశూర కథనం

1. దాశూరుడు - చిత్త సువిశాలత్వం

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! ఈ జనులలో కొందరు అనేక క్రియావ్యవహారములలో తలమునకలై ఉంటున్నారు. భోగైశ్వర్యములచే వారి బుద్ధి నశించి ఉంటోంది. ఫలితమేమిటి? వారు తమను తామే వంచన చేసుకొంటున్నారు. అంతేకాదు ఇతరులను కూడా 'వంచనదృష్టి'తోనే గాంచుచున్నారు. మరి, అట్టి వారు సత్యవస్తువగు పరమాత్మను దర్శించుట ఎట్లో చెప్పు? వారికి ప్రశాంతత - ఆనందములు అనుక్షణం సుదూరమే అగుచున్నాయే!

యే తు పారంగతాబుద్ధేరింద్రియైర్న వశీకృతాః ।
త ఏనాం జాగతీం మాయాం పశ్యన్తి కరబిల్వవత్ ॥ (శ్లో 2, సర్గ 48)

ఎవరైతే ఈ బుద్ధిని కూడా అతిక్రమించివేస్తున్నారో, ఈ ఇంద్రియములకు వశీభూతులు కాకుండా ఉంటున్నారో... అట్టి మహాత్ములు ఈ జగన్మాయను అరచేతిలోని పండువలె స్పష్టంగా గాంచుచున్నారు. ఎవరు శ్రద్ధగా, సమగ్రంగా, మహాపరాక్రమవంతులై విచారణను ఆశ్రయించి ఉంటున్నారో, అట్టి వారు ఈ జగన్మాయను, బాగుగా ఎరుగగలుగుచున్నారు. పాము కుబుసాన్ని వదలి వేస్తున్నట్లు, వారు ఈ సర్వమును సర్వదా త్యజించియే ఉంటున్నారు. వారికి ఈ జగత్తు పట్ల ఏమాత్రం ఆసక్తి లేదు. ప్రాపంచిక క్షేత్రంలో వ్యవహరిస్తున్నప్పటికీ వారు ఏమాత్రం బంధమున తగుల్కొనరు. అగ్ని చేత దగ్ధమైన బీజము మరల మొలకెత్తుతుందా? వారి యొక్క 'మనస్సు-బుద్ధి -చిత్తము-అహంకారములు' (అంతరంగ చతుష్టయం) అంతా జ్ఞానముచే దగ్ధమై ఉంటున్నాయి.

ఇక అజ్ఞాని ఏం చేస్తున్నాడు?... శారీరక, మానసిక వ్యధలతో పూర్ణమై, నేడో రేపో నశించ బోయే ఈ దేహం కోసం మాత్రమే అతడు ప్రయత్నాలు సలుపుచున్నాడు. అంతేగాని, ఆత్మోద్ధరణ కొరకు ప్రయత్నమే చేయడాయె? అతడది గ్రహించి ఆత్మోద్ధరణ కొరకై యత్నించు గాక!

ఈ సంసార చక్రము విషయముల పట్ల ప్రీతిగొనియున్న వారిని సంతోషింపజేయటానికే కల్పింపబడుచున్నది. "దాశూర కథనం' లోలాగా వాస్తవానికి ఇదంతా శూన్యమే.

శ్రీరాముడు: స్వామీ! "ఇదంతా దాశూర కథనంలాగా" అని శలవిచ్చారు కదా! అనగా? దాశూరుని కథనమంటే ఏమిటో దయచేసి వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి: సరే, నీ కిప్పుడు 'దాశూరోఖ్యాయిక' సవివరంగా చెపుతాను. విను-

మగధ దేశంలోని ఒక ఏకాంత పర్వత ప్రదేశంలో 'శరలోముడు' అనే పేరుగల ఒక మహాత్ముడున్నాడు. ఆయన తన భార్యపుత్రులతో ఒక ఆశ్రమంలో ఉంటూ నిరంతరం తపో ధ్యానాదులను నిర్వర్తిస్తూ ఉండేవారు.

అతని ఏకైక కుమారుడు దాశూరుడు. ఆ కుటుంబంలోనివారు వాళ్ళంతా ఎంతోకాలం అన్యోన్యంగా కలిసి ఉన్నారు. పక్షులు గూటిని వదలి వెళ్ళునట్లు శరలోముడు, ఆతని భార్య కాలక్రమంగా తమ శరీరాలను త్యజించి ఎటో వెళ్ళారు. ఇక దాశూరుడు తల్లిదండ్రుల వియోగం చేత పరమదుఃఖక్రాంతుడై, దిక్కుతోచక ఆ పర్వతముపై గల వనము లందు, గుహ లందు పిచ్చిపిచ్చిగా సంచరించసాగాడు. చాలా రోజులు ఆ విధంగా గడచిపోయాయి. అదృశ్య శరీరులగు అక్కడి వనదేవతలు ఆ యువకుని దీన చిత్తమును గమనించారు. "ఏమిటబ్బా! ఈ పిల్లవాడు దుఃఖిస్తూ ఎన్నో రోజులుగా పిచ్చివాడై తిరుగుచూనే ఉన్నాడు!...' అనుకుని, జాలి పడసాగారు. తమ మధ్య రాత్రిబగళ్ళు నిస్తేజంగా, వెఱ్ఱిచూపులతో వగరుస్తూ తిరుగుచున్న ఆ బాలుని మనస్సు మార్చాలని అనుకున్నారు. పరుల దుఃఖం తమదిగా భావించే వారికి సర్వేశ్వరుడు సర్వదా అభ్యున్నతిని ప్రసాదిస్తూ ఉంటాడు కదా!

ఒక ఉత్తమ క్షణంలో వనదేవతలు ఆ కుర్రవానితో అదృశ్య శరీరులై యిట్లు సంబోధించారు.

వనదేవతలు: ఓ మహా ప్రాజ్ఞుడవగు మునికుమారా! దాశూరా! ఇదేమిటయ్యా? అజ్ఞానివలె నీవు ఎందుకు దుఃఖిస్తున్నావో చెప్పు? ఈ ప్రపంచము యొక్క చంచలస్వభావమేమిటో నీవు ఇంకా గుర్తించలేదా ఏమిటి? ఇక్కడికి అనేకమంది జీవులు వచ్చి జన్మలు పొంది, కొంతకాలము అటు ఇటూ సంచరించి, మరల ఎటో వెళ్ళిపోవుచున్నారు. ఇది అనుదినం, అనుక్షణం జరుగుతున్న తతంగమే కదా! ఇక్కడి ప్రతిపదార్థం 'నశించుట' అను స్వభావంతోనే పుట్టుచున్నది. ఇక్కడ జరుగు చున్న వ్యవహారమంతా సూక్ష్మదృష్టితో, వివేకదృష్టితో పరిశీలించాలి గాని, మూర్ఖదృష్టితో కాదే!

ముందుగా నీ యొక్క వ్యవహారబుద్ధిని పరిశుద్ధపరచుకో. ఆ తరువాత ఆయా బాహ్య సంఘటనల గురించి నిర్ణయాలు తీసుకోవచ్చు. ఇక్కడ మహాప్రసిద్ధులగు 'బ్రహ్మ' మొదలైన లోక పాలకులే వినాశనమొందుచున్నారే? ఏదైతే పుట్టుచున్నదో అది ఒకనాటికి నశించక తప్పదు'... అనుటలో నీకైమనా సందేహం ఉన్నదా? అక్కరలేదు. నీ తండ్రి మరణ విషయమై నీవు వ్యర్థంగా ఎందుకు శోకిస్తున్నావో చెప్పు? అసలు, జన్మిస్తున్నదెవరు? మరణిస్తున్నదెవరు? ఈ శరీరములు, తత్సంబంధములు స్వప్నతుల్యం కాక మరింకేమిటి? సూర్యుని లాగా ఉదయించిన ప్రతీది అస్తమించవలసినదే! అయితే,

... విజ్ఞులు ఈ ప్రాప్తించిన ఆయుఃకాలమును ఎట్లు సద్వినియోగపరచుకొనుచున్నారు? ... అజ్ఞానులు దీనిని "పిల్లవాని చేతిలోని సూది" వలె ఎట్లు అపవిత్ర పరచుకొని వేసట చెందుచున్నారు? ఈ విషయాలు, గమనించు. మొట్టమొదట నీ దృష్టిని పరిశుద్ధపరచుకో...! 'వివేక దృష్టి, ఉత్తమాశయా'లతో కూడిన సత్ప్రయత్నములతో దైవప్రసాదితమైన ఈ ఆయుష్షుని సద్వినియోగపరచుకో.

❖

దాశూరుడు ఆ వనదేవతల స్నేహవాక్యములు విని ఊరట చెందాడు. ఇకప్పుడు లేచి, పితృ మరణానంతరం నిర్వర్తించవలసిన క్రియలన్నిటినీ పూర్తి చేశాడు. ఆ తరువాత బ్రాహ్మణ ధర్మమగు

తపస్సు చేయటం ప్రారంభించాడు. వేదములను అధ్యయనం చెయ్యటం, వాటి యొక్క అర్థ విచారణ చేయటం, నిష్ఠతో అందలి ఉత్తమ ప్రవచనములను సదవగాహనతో ఆకళింపు చేసు కోవటం – మొదలైన ప్రయత్నములచే అతనియందు క్రమక్రమంగా పవిత్రమగు 'శ్రోత్రియత్వం' సిద్ధించింది.

అయితే అతడు ఇంకను జ్ఞేయమగు బ్రహ్మమును విశ్రాంతి, అనుభవముల పూర్వకంగా ఎరిగియుండకపోవటచే అతని చిత్తము 'శుద్ధ – అశుద్ధ' వికల్పములను కలిగి ఉండేది. పరమ పవిత్రమగు 'విశ్రాంతి' అతనికి అల్లంత దూరంగానే ఉండేది. ఈ దృశ్యము స్వతహాగా 'శుద్ధమే' అయినప్పటికీ అతనికి మాత్రం 'అశుద్ధము' గా తోచుచూ ఉండేది.

ఉత్తముడు తన ఉత్తమ ప్రయత్నముల నుండి విరమిస్తాడా? లేదు. ఆ దాశూరుడు కూడా స్వసంకల్పముచే ఒక చెట్టుపైన ఒక మూల చేరాడు. ఒక పక్షిలాగా ఆసీనుడై మరల తపస్సు చేయటం ప్రారంభించాడు. కొంతకాలం గడచింది. ఆ తపస్సు కూడా అతనికి 'పరిశుద్ధధర్మము'* అను పవిత్ర స్థితిని ప్రసాదించనే లేదు.

అయితే అతడు ఎంతగానో మనస్సును 'తపస్సు' నందు నియమిస్తున్నప్పటికీ ప్రాపంచికమైన విషయాలు, సంఘటనలు, వ్యక్తులు అతని బుద్ధిని ఆక్రమించియే ఉండటం జరుగుతోంది.

"ఇప్పుడు నేను ఏం చేయాలి? నా మనస్సు నందు ఆక్రమించియున్న ఈ దృశ్యముతో ఏర్పడిన సంబంధము... అనే దోషం సన్నగిల్లేదెట్లా? సరే. సర్వత్యాగము చేతనే పవిత్రత్వము సముపార్జించబడగలదని వేదవాక్యసారం కదా! అందుచేత ఈ నా శరీరమునే అగ్నికి తర్పణం చేస్తాను. అప్పుడు అగ్నిదేవుడు కనికరించి నా మనస్సు యొక్క క్షోభను, దోషమును తొలగించ వచ్చు. ఈ భూపదార్థములపై నాయందు ఏర్పడుచున్న 'ఆకర్షణ'కు అగ్నిదేవుడే వైద్యుడై నన్ను రక్షించగలడు"... అని యోచించాడు. చెట్టు నుండి క్రిందకు దిగి ఒకచోట అగ్నిని ప్రజ్వలింప జేసాడు. తన భుజముల నుండి మాంసమును కోసి హోమం చేయటం ప్రారంభించాడు.

అప్పుడు అగ్నిదేవుడు 'ఇదేమిటి? ఈ బాలకుడు ఇంతకు తెగించాడేమి? సరే, దేవతల కంఠప్రదేశమైనట్టి అగ్నిరూపమగు నాయందు పడుచున్న ఈతని శరీర ఖండములు భస్మము కాకుండు గాక! ఇతడు మునపటి వలె పూర్ణశరీరుడై యుండుగాక!" అని సంకల్పించాడు. బృహస్పతి ముందు సూర్యభగవానుడు ప్రత్యక్షమయినట్లు అగ్నిదేవుడు ఆ దాశూరుని ముందు కల్పిత శరీరములో ప్రత్యక్షమైనారు.

అగ్నిదేవుడు : ఓ సాధూ! దాశూరా! నీ త్యాగనిరతికి, పట్టుదలకు మెచ్చుకుంటున్నానయ్యా! ఏమి కోరి ఇంతటి సాహసం చేస్తున్నావో చెప్పు, నీకు అభిమతమైన వరం కోరుకో.

---

* ఏదేది మనం చేయవలసివస్తోందో అవన్నీ భగవదర్పిత బుద్ధితో 'ఇది ధర్మమైయున్నది' అను భావనతో రాగ–కౌతుక రహితంగా నిర్వర్తించుటయే "పరిశుద్ధ ధర్మభావన' అగుచున్నది.

దాశూరుడు: తండ్రీ! పరమపవిత్ర స్వరూపులగు తమ యొక్క కనికరము చేతనే లోకములు మనగలుగుచున్నాయి. మావంటి అల్పజీవులకు దేవతల కటాక్షవీక్షణలను ప్రసాదింపజేసే మహనీయులు మీరు. మీ పాదములు అంటి మ్రొక్కుచున్నాను. సాష్టాంగదండ ప్రణామం చేస్తున్నాను. స్వీకరించండి.

మహానుభావా! ప్రాణులతోను, అనేక పదార్థములతోను నిండియున్న ఈ 'పృథివి' నన్ను ఆకర్షితుణ్ణి చేస్తోంది. నా బుద్ధి క్షణకాలంలో కలుషితమౌతోంది. అట్టి ఈ ఎదురుగా కనబడుచున్నట్టి పృథివిని త్యజించివేయగలుగు బుద్ధిని, శక్తిని వరంగా ప్రసాదించండి. ఈ సర్వము త్యజించి వృక్షము పైననే స్థితి పొందగలిగేటట్లు అనుగ్రహించండి.

అగ్నిదేవుడు: (చిరునవ్వుతో) పుత్రకా! సరే, అట్లే అగు గాక! నీ మనోరథము సిద్ధించు గాక! అందుకుగాను, నీ వర్తమాన తపస్సుయజ్ఞం మొదలైన ప్రయత్నాలను కొనసాగించు. నియమిత కాలంలో నీ మనస్సు పరిశుద్ధమౌతుంది.

ఇట్లు ఆశీర్వదించి అంతర్ధానమైనాడు. అప్పుడు దాశూరుడు ఒకచోట అశీనుడై 'నేను పృథివిని త్యజించిన వాడనయ్యాను. ఇందలి ఏ పదార్థము నాకు సంబంధించి లేదు. నేను ఇందలి ఏ పదార్థమునకు సంబంధించినవాడను కాను...'' అని మననం చేయసాగాడు. అయినా కూడా తృప్తి లభించలేదు.

అప్పుడు ఎత్తైన ఒక కదంబవృక్షమును ఎన్నుకున్నాడు. ఆ వృక్షము ఆకాశమును అంటుచు, ఫలయుక్తమై తన కొమ్మలచే 'ఛాయ'చే అనేక ప్రాణులకు ఆహ్లాదం కలుగజేస్తూ ఉండేది. భూమిపై అపవిత్రమైన బుద్ధిగల అతడు మఱ్ఱిచెట్టుపై విష్ణుభగవానుని వలె ఏకాగ్ర చిత్తంతో ఆ కదంబ వృక్షపు కొమ్మపై ఆత్మశుద్ధి కొరకు మరల తపస్సు చేయటానికి ఆసీనుడైనాడు. మరల ఒక్క క్షణం తన చుట్టు పట్ల పరికించి చూచాడు. ఆ క్షణంలో అతని దృష్టి మరల చంచలత్వం పొందింది. కౌతుకంతో చుట్టూ పరికిస్తున్న అతని దృష్టికి అక్కడ నదులు, పర్వతములు, నిర్మలాకాశం, నీలి మేఘములు, పల్లవములు, పుష్పసమూహములు, పక్షుల కలకలారావములు, సెలయేళ్ళ శబ్దములు, అరణ్యము, స్వర్గము, భూమి మొదలైన వాటితో కూడిన వ్యవహారమంతా దిక్కులన్నీ నిండి కనిపించాయి. వాటిచే ఆతని బుద్ధి దృష్టి ఆకర్షించబడటం కొనసాగనారంభించింది.

ఒక్క క్షణం అదంతా పరికించి చూస్తూ 'ఆహాఁ! మాయ ఎంత చమత్కారమైనది! నా దృష్టి పరిశుద్ధమవనంతవరకు ఏ మూల వెళ్ళి కూర్చుంటే ఏం ప్రయోజనం? ఈ విషయమే వనదేవతలు నాకు గుర్తు చేశారు కదా...!'' అని ఆలోచించి కొంత ప్రశాంత చిత్తముతో నవ్వుకొన్నాడు. ఆ దిక్కుల నుండి తన దృష్టిని వెనుకకు మరల్చి మరల ఘోరతపస్సు ప్రారంభించాడు.

కాని ఏం లాభం? కేవలం కర్మకాండ యందు మాత్రమే తత్పరుడయ్యాడు. పరమార్థజ్ఞాని కాలేకపోయాడు. 'స్వర్గమును పొందుట' వంటి స్వల్ప ఫలములకు మాత్రమే అర్హుడు కాగలిగాడు.

మానసిక యజ్ఞం - అప్పుడు దాశూరుడు ఇట్లు యోచించాడు– "ఎంత కాలం తపస్సు చేస్తే ఏం ప్రయోజనం? బాహ్య కార్యక్రమముల వలన ఉత్తమ ప్రయోజనమేదీ నాకు కనిపించుట

లేదు. ఇంకేమి ఉపాయం? అన్నిటికీ కారణం మనస్సే కదా! కనుక ఇక నుండి మానసిక యజ్ఞం ప్రారంభిస్తాను" అని అనుకున్నాడు. మనస్సుతోనే అగ్ని యొక్క ఉపాసన ప్రారంభించాడు. 'అశ్వమేధయాగం' వరకు గల అనేక యజ్ఞక్రియలన్నిటినీ క్రమంగా ఆచరించాడు. ఆ వృక్షపు కొమ్మ మీదనే ఆసీనుడై పది సంవత్సరాల కాలం దేవతా ప్రీత్యర్థం ఒక దాని తరువాత మరొకటిగా అనేక మానసిక యజ్ఞములను నిర్వర్తించాడు. అప్పటికి అతని చిత్తము క్రమంగా రాగద్వేషరహితం కాసాగింది. సువిశాలత్వం పొందింది. ప్రతిబంధకములన్నీ క్షయిం చాయి. సంస్కారములు పవిత్రత పొందాయి. చిత్తము నిర్మలం కాగా, అతనికి జ్ఞానోదయమ యింది. జ్ఞానముచే అజ్ఞానావరణమంతా ఛిన్నమైపోయింది. వాసనామలమంతా నశించింది.

❖❖❖

2. వనదేవత - పుత్రాభిలాష

ప్రశాంతచిత్తుడగు ఆ దాశూరుడు ఆ కదంబ వృక్షపు కొమ్మపై మౌనం వహించియున్నాడు. ఒక రోజు ఒక వనదేవత గొప్ప సౌందర్యముతో కూడిన శరీరము ధరించి అతని ఎదురుగా నిలచినది. మనోహరమగు వచనములతో తన అభ్యర్థనను ఇట్లు తెలిపింది.

వనదేవత: పరిశుద్ధుడవు, మోక్షస్వరూపడవు అగు ఓ మునికుమారా! మీకు జయమగుగాక!

దాశూరుడు: ఓ కమలాక్షీ! నీ యొక్క శోభాతిశయం చేత మన్మథుని కూడా విచలితుని చేయ గలిగినట్లు ఉన్నావు. అంతటి సౌందర్యరాశివగు నీ వెవరవు? ఈ లతపై కూర్చుని నా ఎదుట ఎందుకు సాక్షాత్కరించావు?

వనదేవత: హే మునీ! "ప్రాప్తించనిదంటూ ఏదైనా ఉంటే, అదంతా మహాత్ములను సమీపించి అర్థించితే చాలు, తప్పక ప్రాప్తిస్తుంది"... అని పెద్దలు అంటూ ఉంటారు. ముందుగా నేనెవరో చెపుతాను, వినండి. అనేక కదంబవృక్షములతోను, అందమైన పూతీగలతోను శోభిస్తున్న ఈ వనంలోని వనదేవతను నేను. లతల సమూహమే నా నివాసస్థానం. ఈ మధ్య కొద్దిరోజుల క్రితం జరిగిన ఒక సంఘటన కారణంగా ఈ రోజు మీ ముందుకు వచ్చి యాచిస్తున్నాను.

శ్రీ దాశూరుడు: ఏమా సంఘటన? నీ అభిలాష ఏమిటి?

వనదేవత: మొన్నటి చైత్రశుక్ల త్రయోదశినాడు దేవలోకంలోని నందనవనంలో ఒక ఉత్సవం జరిగింది. ఆ ఉత్సవంలో పాల్గొనటానికి అనేక ప్రదేశముల నుండి వనదేవతలు వచ్చి సమావేశ మయ్యారు. ముల్లోకములందలి వనదేవతలను పరామర్శించుచు, వేడుకలలో పాల్గొనుటకు గాను నేను కూడా వెళ్ళాను. ఆ 'కామోత్సవం'లో అనేకమంది వనదేవతలు తమ పుత్రులను కూడా వెంటబెట్టుకొని అటూ ఇటూ తిరగటం చూచాను. వారు తమ బిడ్డలను ముద్దు ముద్దు మాటలతో లాలించటం నాకెంతో ముచ్చట గొలిపింది. నేను పుత్రహీనను. అందుచేత నా మనస్సు ఎంతగా క్షోభించిందో మాటలతో చెప్పలేను. వాళ్ళు తమ పుత్రుల అల్లరి చిలిపి మాటలను వింటూ కళ్ళలో

ఆనందం ప్రకటించటం చూచాను. "ఏనాటికైనా నేను అట్లు పుత్రులను పొందగలనా?' అను ఆలోచన నన్ను వేధించసాగింది. "ఏమి చేయాలి?" అని తీవ్రంగా యోచిస్తూ ఉండగా, మీరు గుర్తుకు వచ్చారు. "ఆ ముని సమస్త పురుషార్థములకు కల్పవృక్షము వంటివారు... ఇక నీకేం లోటు... పోయి అభ్యర్థించు"... అని తోటి వనదేవతలు నన్ను ఉత్సాహపరిచారు. ఇక నేను పుత్రహీననని దుఃఖించవలసిన పనేమున్నది?

ఓ మహాత్మా! నాకు ఒక కుమారుని ప్రసాదించండి. ఒకవేళ మీరు నా విన్నపమును తిరస్కరిస్తారా? అందుకు నేను తగిన నిర్ణయమే చేసుకుని వచ్చాను. ఇప్పటికిప్పుడు ఇక్కడ 'అగ్ని' ని సృష్టించి అందులో ఈ నా దేహమును ఆహుతి చేయుటకు సిద్ధంగా ఉన్నాను. ఎందుకంటే, "నాకు ఇతర దేవతల వలె పుత్రులు లేరే?" అనే దుఃఖం భరించలేను. ఇంతకన్నా మరణించటమే ఉచితమని నేను నిశ్చయించుకున్నాను.

ఆ ముని ప్రశాంతంగా అంతా విన్నారు. మహాత్ముల హృదయం నవనీతంలా సుతిమెత్తగా ఉంటుంది కదా! ఆయన జాలి పొంది ఇట్లు పలికారు.

శ్రీ దాశూరుడు: ఓ వనదేవతా! పుత్రుని కొరకై నీవు స్వశరీర త్యాగానికి కూడా సిద్ధపడ్డావు కదా! సంతోషం. ఇదిగో, ఈ పుష్పమును స్వీకరించు. నెల రోజులలో నీకు ఒక చక్కటి కుమారుడు కలుగుతాడు. నీ త్యాగనిరతికి తార్కాణంగా అతడు మహాసౌందర్యవంతుడు జగత్పూజ్యుడు అయి ఉంటాడు. మహాజ్ఞాన సంపన్నుడగు అతనిని పొందినందుకు నీ జన్మసార్థకమౌతుంది.

వనదేవత ఆ మాటలు విని ఎంతో సంతోషించింది. ఆ ఋషి పాదాలు స్పృషించి నిజస్థానమునకు మరలింది. క్రమంగా మాసాలు, ఋతువులు, సంవత్సరములు గడచిపోసాగాయి. ఒక నాడు ఆ వనదేవత పండ్రెండేళ్ళ వయసుగల కుమారుని వెంటబెట్టుకుని ఆ మునిని సమీపించింది.

వనదేవత: హే మహాత్మా! ఈ పిల్లవాడే మన కుమారుడు. నేను ఇతనిని సర్వవిద్యాసంపన్నునిగా తీర్చిదిద్దాను.

దాశూరుడు: చాలా సంతోషం. విద్యలన్నీ చక్కగా నేర్చినాడు కదా?

వనదేవత: నేర్చాడు. కాని 'ఆత్మజ్ఞానం' మాత్రం ఇతడింకా పొందనేలేదు. ఏది గ్రహించిన తరువాత ఇక జీవుడు ఈ సంసారచక్రంలో తగుల్కొనడో... అట్టి దివ్యము, నిత్యోదిత అమృతానందమయము అగు 'ఆత్మస్వరూపానుభవం' ఇతనికి బోధించ వలసియున్నది. 'ఇతడు జ్ఞాని అవుతాడు' అను మీ ఒకప్పటి ఆశీర్వాదవాక్యం సిద్ధింపజేయ ప్రార్థన. ఇతనికి మీరే దయతో జ్ఞానోపదేశం చెయ్యండి. మీ అంశయే అయిన ఇతడు జ్ఞాని కావటం మీకు కూడా సంతోషకరమైన విషయమే కదా!

దాశూరుడు: అట్లాగే అగుగాక! ఇతడు ఇక్కడే ఉంటాడు. ఇక నీవు యథాస్థానికి వెళ్ళవచ్చు. నీకు శుభమగుగాక!

❖

తన తండ్రి, గురువు అగు ఆ మహామునిని సేవించుకుంటూ ఆ బాలుడు రోజులు గడుప సాగాడు. అనేక క్లేశములను భరిస్తూ తండ్రి వద్ద అనేక జ్ఞాన విషయాలు వినేవాడు. అనేక యుక్తులను ఉపయోగించి దాశూరుడు ఆత్మవస్తుతత్త్వాన్ని విశదపరుస్తూ ఉండేవాడు. 'ప్రత్యగాత్మ యందు నిరంతరస్థితి కలిగియుండుటకు ఉపాయములేమిటి...' అను విషయము అనేక కథల, యుక్తుల సహాయంతో కూలంకషంగా చర్చిస్తూ ఉండేవాడు.

కల్పితములైన అనేక దృష్టాంతములు... లోకప్రసిద్ధమైన ఇతిహాసములు... పూజ్యులగు మహనీయుల ప్రవచనాలు, అభిప్రాయాలు... వేద-వేదాంతాలలోని ఆయా సిద్ధాంతములు.., వ్యాఖ్యానాలు... అనేక అర్థములను సూచించు కథలు... స్వానుభవాలు, అవగాహనలు... ఈ విధంగా అనేక చమత్కృతులను క్రోడీకరించి ఉత్తమవచనముల ద్వారా ఆత్మగురించిన సమాచారం ప్రసాదించసాగారు.

ఒకరోజు నేను అయోధ్య నుండి కైలాసములోని మందాకినీ నదిలో స్నానం చేయటానికి బయలుదేరాను. అదృశ్యరూపంలో ఆకాశమార్గంలో పయనిస్తున్నాను. సప్త ఋషి మండలము లోని 'స్వర్గలోకాకాశం' దాటి, వెళ్ళుచున్నాను. కాకతాళీయంగా ఆ దాశూరుడు, అతని కుమారుడు ఉన్న భూగోళంలో ప్రవేశించాను. రాత్రి అగుటచే కొంచము విశ్రమించాలని ఆ వృక్షమధ్య భాగంలో ప్రవేశించాను. ప్రశాంతమౌన చిత్తుడనగు నాకు వారిద్దరి సంభాషణ వినిపించింది. ఆ సంభాషణను నీకు వివరించి చెపుతాను, విను.

❖❖❖

3. ఖోత్థుడు - మూడు శరీరాలు

దాశూరుడు: ఓ కుమారా...! ఇట్టిదే అయినట్టి మరొక విశ్వం ఉన్నది. అక్కడ ఒక ప్రదేశంలో ఒక ఆశ్చర్యజనకమైన సంఘటన జరిగింది. అది చెపుతాను, విను...

ఆ విశ్వంలో ఒక భూపాలుడు ఉన్నాడు. అతని పేరు ఖోత్థుడు* అతడు ముల్లోకాలలోను సుప్రసిద్ధుడు. గొప్ప శ్రీమంతుడు. జగత్తులన్నీ జయించగలిగినంతటి సామర్థ్యం కలవాడు. అతడు మహాజ్ఞాని కూడా. కాబట్టి అతని ఆజ్ఞలు బ్రహ్మ, ఇంద్రుడు మొదలగువారికి కూడా శిరోధార్య మగుచున్నాయి. అతడు మహాసాహసి అని, గొప్ప పరాక్రమవంతుడని అందరూ అనుకుంటూ ఉంటారు. ఈ ముల్లోకాలలో ఎవరికీ అతనిని వశం చేసుకోవటం అంత తేలికైన పని కాదు. అయితే అతనిలోనే అసంఖ్యాకంగా 'ప్రవృత్తులు' ఉన్నాయి. అవన్నీ సుఖప్రదాలై ఉంటున్నాయి.

ఎవరైనా తమ పిడికిలితో ఆకాశమును జయించగలరా? ఉత్తమ పరాక్రమశీలుడగు అతనిని తమ శస్త్రాస్త్రబలంచే ఎవ్వరూ జయించలేరు. దివ్యమగు అతని లీలలు మహాగంభీరముగా

---

*ఖః = ఆకాశము ; ఖోత్థుడు = అవ్యాకృతాకాశం నుండి జనించినవాడు.

ఉంటున్నాయి. అతడు తనకు తానే "స్వప్నము - మనోరథము' లకు సంబంధించిన స్వీయరచనలు చేస్తూ ఉన్నాడు. "అతని ఊహా కల్పిత రచనా చమత్కృతులు ఆ ఇంద్ర-విష్ణు-శంకరులు కూడా ఊహించలేరా"...? - అన్నట్లు ఉంటున్నాయి.

అతడు సర్వవేళల మూడు శరీరములు కలిగి ఉంటున్నాడు. అందులో ఒక్కటి ఉత్తమమైనది, ఒకటి మధ్యమము, ఒకటి అధమమైనది. ఆ శరీరములు సర్వవ్యవహారములు నిర్వర్తించగల సామర్థ్యము కలిగి ఉన్నవి. వింటున్నావా కుమారా?

దాశూరుని పుత్రుడు: తండ్రీ! వింటున్నాను. ఇంతకీ అతడు ఉన్నది ఎక్కడ? ఈ జగత్తు లోనా? లేక, బైట ఇంకెక్కడన్నానా?

శ్రీ దాశూరుడు : విశాలమగు 'అవ్యాకృతాకాశం'లోనే అతడు త్రిశరీరధారి అయి ఉద్భవించాడు. అతడు ఉన్నది, అతని సంచనలము అవ్యాకృతాకాశంలోనే. అయితే ఏం? అతడు తుచ్ఛ విషయము లందు ఆసక్తి కలిగి ఉంటున్నాడు. ఏవేవో విధి-నిషేధములను ఆశ్రయించి అనేక స్థితిగతులను దర్శించుచున్నాడు.

అతడు 'అవ్యాకృతాకాశం'లోనే "బ్రహ్మాండము" అనే నగరం స్వయంగా మనోకల్పితంగా నిర్మించాడు. ఆ బ్రహ్మాండనగరం 14 భువనములచేత, 3 లోకముల రూపంగా, 3 వేదములతో కూడినదై శోభిస్తోంది. అందులో చంద్రసూర్యులు తరగని దీపాలవలె వెలుగుచున్నారు. ఆ బ్రహ్మాండంలో అనేక రకరకాలైన శాస్త్రీయ-అశాస్త్రీయ ప్రవర్తనామార్గాలు ఉండి ఉన్నాయి. అవన్నీ ఊర్ధ్వ-అధోగతి రూపములతో విలసిల్లి ఉంటున్నాయి. అతి విశాలమైనట్టి ఆ బ్రహ్మాండనగరంలో అనేకమంది దేవతలను, మనుష్యులను, తదితర జీవులను అతడు సృష్టించాడు. వారంతా జంగమాత్మకమై (జన్మించు స్వభావం గల) స్వరూపం కలిగి ఉన్నారు. విషయముల పట్ల ధ్యాస కలిగియుండుటచే వారు విమూఢులు, ఆత్మాకాశపరిచ్ఛేదకులు అయి ఉన్నారు. వారిలో కొందరు ఊర్ధ్వ భాగమున నియమించబడ్డారు. కొందరు మధ్యభాగమున, మరికొందరు అధోభాగమున నియోగించబడ్డారు.

అందులో కొందరు చాలా శీఘ్రంగా నశించిపోతున్నారు. ఇక మరికొందరో, చాలా కాలానికి గాని నాశనం పొందుటలేదు. ఆ జీవులంతా నల్లటికేశములతో, నవ ద్వారములతో, ప్రాణ-అపాన వాయు చలనములతో, పంచ జ్ఞానేంద్రియములతో, రక్త-మాంస-బొమికలతో నిర్మించబడే ఈ భౌతిక ఉపాధులతో కనిపిస్తున్నారు.

❖

మహాత్ముడగు ఆ రాజు తన యొక్క మహత్తర మాయాశక్తిచే 'యక్షసమూహము'ను కూడా రచించాడు. ఆ యక్షులు ఆత్మాకాశమున 'ఆఛాదన' రూపంలో ఉన్నారు. వారు 'ఆత్మజ్ఞాన ప్రకాశము' పట్ల నిత్యము భయభీతులై ఉంటున్నారు. అట్టి ఆత్మాఛాదకులు కార్యప్రవృత్తులగు చున్నారు. వారు కార్య ప్రవృత్తులైనందుకు ప్రయోజనంగా అనేక విధములైన క్రీడా విషయములు ఉత్పన్నమగుచున్నాయి.

తానే బ్రహ్మాండనగరమునకు 'సృష్టికర్త' అయినప్పటికీ ఆ రాజు సంకల్పములచే నడిపించ బడి అనేక స్థూల-సూక్ష్మ-కారణ శరీరములందు యక్షులతో కూడి విహరిస్తున్నాడు. ఒక శరీరంలో ప్రవేశించి కొంచెము సేపు విహరించి, ఇంతలోనే ఆ శరీరమును విడచి వేస్తున్నాడు. అక్కడి నుండి బయలుదేరి మరల ఇంకొక దేహమును ఆశ్రయిస్తున్నాడు.

అతని చిత్తము ఎంతో చంచలమైనది. అది ఒక్కొక్కప్పుడు 'భవిష్యత్తు నగరము'ను తన యందు సృష్టించుకొని అందులో ప్రవేశించి, అక్కడ అటూ-ఇటూ పచార్లు చేస్తూ ఉంటోంది. అతని చిత్తము జాగ్రత్తు, సుషుప్తులను త్యజించి స్వవిరచితమైన స్వప్నలోకంలో ప్రవేశించుచు విహారం చేయుచుండెడిది. ఇంతలోనే అతని ఆ చపల చిత్తము ఇంకొక సమయంలో క్షణంలో సర్వ జాగ్రత్-స్వప్న సంకల్పములన్నీ త్యజించి వేసి సర్వభావనలు విలయించునట్టి సుషుప్తిలో ప్రవేశించాలనే కోర్కె పొందేది.

అప్పుడు ఆ ఖోత్థునిచిత్తంలో కర్మ బీజములు సంస్కార రూపంలో ఉండేవి. అవన్నీ 'మూఢత్వము' అను అవిద్యయందు దాగి ఉండేవి. ఇంతలోనే, మరల అతనిపట్ల చిత్తము ఉత్పన్నమైనదై, సుషుప్తి నుండి లేచి కూర్చుని క్రమంగా మరల జాగ్రత్-స్వప్న దశలను పొందుతూ ఉండేది. ఆ సమయంలో మరల అనేక విస్థార కార్యక్రమములను నిర్వర్తిస్తూ ఉండేది.

ఆ ఖోత్థుని ఓడించగలిగిన వారెవ్వరూ లేరు. అయితే ఏం? అతని చిత్తము ఒక్కొక్కసారి తన చేతులలో తానే ఓడిపోతూ ఉండేది. 'అయ్యో! నేనొక అజ్ఞానిని. నాకేమీ తెలియదు. భృత్యుడను. పరమ దుఃఖితుడను' అను భావనలు స్వీకరించి అతడు ఎంతగానో దుఃఖిస్తూ, వాపోతూ ఉంటాడు. మరొకప్పుడు ఇతఃపూర్వం అనుభూతమైన సుఖములను స్మరిస్తూ 'ఇప్పుడవన్నీ నాకు లేవే?' అను దీనత్వము సంతరించుకొంటాడు. 'ఇతడే ప్రపంచంలోని దుఃఖాలన్నీ కాపురం ఉండే వృక్ష రాజమా...!' అన్నట్లు కనబడతాడు. నవరసాలు పోషించే నటునిలాగా ఆ వ్యవహారమంతా ఆ ఖోత్థుని చిత్తము వేస్తున్న వేషములే.

❖

మహాత్ముడగు ఆ ఖోత్థుడు తక్కువవాడేమీ కాదు. తలచుకుంటే, వాయువు సముద్రమును కదలించుచున్నట్లు, అతడు దేనినైనా జయించివేయగలడు. అందుచేత కొన్ని సమయములలో అతడు జాగ్రత్-స్వప్న-సుషుప్తులలోని శత్రువులందరినీ ఆక్రమించివేస్తున్నాడు. ఆ సమయంలో ఈ జాగ్రత్-స్వప్న-సుషుప్తులు అతనికి సంపదలుగానూ, సామంత రాజ్యములుగానూ ప్రకాశి స్తున్నాయి గాని భారంగా కాదు. దుఃఖపూరితంగా కాదు. అంతయు జయించి, అంతయు గ్రహించి అతడు ఒక సమయంలో అత్యంత ప్రసన్నుడై సుఖిస్తూ ఉంటున్నాడు.

అతడు అంతరంగమందలి జ్యోతి చేతనే ప్రకాశితుడగుచున్నాడు. అయినప్పటికీ వ్యవహార దృష్టిలో అనేక మౌఢ్యతలచే పరివేష్టింపబడుచున్నాడు. ఎందుకో అనంత సంఖ్యలో అతనిని అనేక వేదనలు సమీపిస్తున్నాయి.

❖❖❖

4. సంసార సాగరము - వికల్ప వ్యవహారము

దాశూరుని కుమారుడు: హే తండ్రీ! పవిత్రాంతఃకరణమూర్తీ ! మీరు పరోక్షంగా, ఏదో సత్యమును ప్రతిపాదిస్తున్నట్లు నా కనిపిస్తోంది. ఖోత్థుడు అనే పేరుతో మీరు చెప్పుచున్న ఆ రాజు ఎవరు? యథార్థానికి మీరు ఏమి చెప్పదలచారు? భవిష్యత్ నగర నిర్మాణం అనే పదప్రయోగానికి అర్థమేమిటి? ఈ వర్తమానకాలంలో కూడా అతడు ఉన్నాడా? ఉంటే ఎక్కడున్నాడు? అతని బ్రహ్మాండము ఎటువైపు ఉన్నది?

'వర్తమాన-భవిష్యత్ నగరములు'... అని మీరు అనటం కొంత పరస్పర విరుద్ధంగాను, వ్యామోహజనితంగాను ఉన్నదని నాకనిపిస్తోంది.

దాశూరుడు: కుమారా! ఆ విషయాలన్నీ యథార్థరూపంగా చెపుతాను. శ్రద్ధగా వింటే, ఈ సంసారము యొక్క తత్త్వమేమిటో నీవే గ్రహిస్తావు. ఈ ప్రపంచము అసత్యమని, 'పరమార్థ సత్త'చే పరిశీలిస్తే ఈ జగత్తు లేనేలేదనీ తెలియజేయటానికే నిగూడార్థ రూపంలో ఉన్న ఖోత్థుడి గురించి విశేషములు వర్ణించి చెప్పాను. ఇక అసలు విషయం విను-

❖

ఖోత్థుడు: అవ్యాకృతాకాశము (A space where there tends to be no matter) నుండి ఉత్పన్నమైన సంకల్పాత్మకమగు మనస్సే ఆ పేరుతో మనం చెప్పుకున్నాం. అతడు (అనగా మనస్సు) స్వసంకల్పములచే జనించిన వాసనల చేతనే రూపము పొందుచున్నాడు. వాసనలే మనస్సు, వాసనారాహిత్యమే మనోరాహిత్యం.

తత్స్వరూపమిదం సర్వం జగదాభోగి విద్యతే ।
జాయతే తత్ర జాతే తు తస్మిన్నష్టే వినశ్యతి ॥ (సర్గ 53, శ్లో 7)

ఈ కనబడే విశాల జగత్తు అంతా సంకల్పమయమగు మనస్సేగాని, మరింకేమీ కాదు. మనస్సు యొక్క స్వరూపమే సంసారము - జగత్తు - ఈ శరీరాదులు కూడా. మనస్సు ఉత్పన్నమైనప్పుడే జగత్తు ఉత్పన్నమౌతోంది. మనస్సు నశిస్తే జగత్తు కూడా నశిస్తోంది.

వృక్షమునకు శాఖలు ఉంటాయి కదా! పర్వతమునకు శిఖరములు ఉంటాయి!... అలాగే 'బ్రహ్మ-విష్ణువు-రుద్రుడు-ఇంద్రుడు' మొదలైనవారంతా మనస్సు యొక్క అవయవములే అయి ఉన్నారు.

వాస్తవానికి బ్రహ్మము సర్వకాలసర్వావస్థలయందు జగత్ సత్తరహితమే అయి ఉన్నది. అనగా బ్రహ్మము (అవ్యాకృత, ఆకాశము)నందు జగత్తులు, పదార్థములు, అహమ్, త్వమ్ సుఖ-దుఃఖ సంఘటనలు మొదలైనవేవీ లేవు. అత్యుత్తమమైన దృష్టిచే మనస్సు అనబడేది కూడా లేదు. అయితే, అట్టి బ్రహ్మము నందు 'చైతన్యప్రతిభాస' చేత 'సమష్టి సృష్టి' అను ఒకానొక స్వభావము ఉదయిస్తోంది. అది నీటియందు కెరటములు ఉదయించుట వంటిది. నేను 'సమష్టి

సృష్టికి కర్తను' అనే తత్త్వమే సమష్టిజీవుడు, విరించి, బ్రహ్మదేవుడు, హిరణ్యగర్భుడు... ఇత్యాది పేర్లతో చెప్పబడుతోంది.

ఇట్లు సంకల్పమయమగు మనస్సు ఈ త్రిలోకములను రచించుచున్నది. ఈ సూర్య చంద్రులు, 14 లోకములు, సుందరపర్వతములు, సముద్రములు, అందలి తరంగములు, భూమి, ఆకాశం మొదలైనవన్నీ సంకల్పము చేతనే రచించబడి విరాజిల్లుచున్నాయి. ఊర్ధ్వ-అధో లోకాలు, పుణ్య-పాపములు ఇవన్నీ ఉంటున్నది 'మనస్సు' అనే నగరంలోనే. ఈ దేవమనుజ-కిరాతక -పిపిలీకాది జీవులన్నీ పచార్లు చేస్తున్నది మనస్సు అనే మైదానంలోనే.

సంకల్పాత్మకమగు 'మనస్సు' అనే రాజు యొక్క క్రీడ కొరకే ఈ 'జగత్తు' అను రూపంగల నగరంలో 'అహంకారము - దేహము - దేహమును రక్షించు శక్తులు '... ఇవన్నీ నిర్మించబడు చున్నాయి. అహంకారము చేత అనేక దేహములు నిర్మించబడగా, అందులో కొందరు ఊర్ధ్వమున దేవతలుగాను, మరికొందరు మధ్యగా మానవులుగాను, ఇంకొందరు పాతాళమున నాగులు మొదలైనవారు గాను నెలకొలుపబడుచున్నారు. వారంతా చెవులు-కళ్ళు-ముక్కు మొదలైన నవద్వారములతో, మాంసం-అస్థులు తదితర సరంజామాతో, వేరు వేరు ప్రాణవాయు సంచనలములతో సుఖ-దుఃఖసహితులై ఉంటున్నారు. పంచేంద్రియదేహులగు వీరందరు సంకల్పముచే నిర్మించబడిన నగరంలో నివసించేవారే సుమా! మనస్సే యక్షుని ప్రదర్శన వలె ఇట్లు అనేక రూపములను ధరిస్తోంది.

❖

ధాన్యం కొట్టులో పిల్లి దాగి ఉన్నట్లు, కొలిమి తిత్తిలో పాముపిల్ల దాగినట్లు, ముత్యపు చిప్పలో ముత్యము ఉంటున్నట్లు ఈ శరీరములలో అహంకారము దాగి ఉంటోంది. దీపం క్షణంలో విజృంభించి క్షణంలో నశించునట్లు ఈ అహంకారం కూడా ఆయా ఉపాధులలో క్షణ కాలం విజృంభిస్తోంది. క్షణంలో ఆ ఉపాధులను త్యజిస్తోంది.

సముద్రములో తరంగాలు ఏర్పడుచున్నట్లు మనస్సులో అనేక సంకల్పాలు ఏర్పడు చున్నాయి. ఈ సంకల్పమయాత్మకమగు మనస్సు నిజసంకల్పిత వస్తువులను గాంచటం, అట్లు గాంచినవి భవిష్యత్తులో పొందటం జరుగుతోంది. అది సంకల్పించనిదేదీ పొందదు. ఆయా బాహ్య వస్తుజాలముతోను, తదితర ఉపాధులతోను సంబంధము వహించి, 'ఇవి నాకు చెందినవి... వీటిని నేను పొందుటచే మాత్రమే సంతోషించగలను... ఇవి నేను ఎప్పటికీ కలిగి ఉండాలి.... వీరు నా వారు... వీరు పరాయి వారు...' అను రీతిగా అది స్వప్నత్వము పొందుచున్నది. 'భవిష్యత్‌లో పొందవలసినవి... త్యజించవలసినవి'... అను రూపము గల ఉద్వేగము ఈ మనస్సు ఊహ-అపోహలను పొందుటచేతనే, మనం కథలో 'భవిష్యత్ నూతన నగరమును పొందుచున్నాడు' అని చెప్పుకున్నాం. ఈ మనస్సు ఇట్లు మొదట మాయాచక్రంలో తగుల్కొనుచున్నది. ఇక ఆపై జాగ్రత్ - స్వప్నములు పొందుచున్నది. ఎప్పుడో ఒకప్పుడు మౌన

సుఖమును అపేక్షించి, సుషుప్తి యందు ప్రవేశిస్తోంది. అనగా ఈ మనస్సు 'అసంకల్పస్థితి' వహించి భావరాహిత్యము అవధరిస్తోంది. కాని అది జడమగు స్థితే గాని మనోరాహిత్యస్థితి కాదు కదా! ఎందుకంటే జాగ్రత్-స్వప్నములలోని సంస్కారములు సుషుప్తి దశలో అప్రకటితంగా, అవ్యక్తంగా ఉండనే ఉంటున్నాయి. జాగ్రత్‌లో వ్యక్తం కావటానికి సంబంధించిన తహతహ అంతర్లీనంగా ఉండే ఉంటోంది.

ఒకదానివెనుక ఒకటిగా అనేక ఉపాధులందు తిరుగాడుచున్న ఈ మనస్సు ఒక సమయంలో సుఖవిశ్రాంతి కొరకు సమాధిని అపేక్షిస్తోంది. అట్లు సమాధిని ఆశ్రయిస్తూ, ఈ జన్మ పరంపరా వ్యవహారమును త్యజిస్తోంది. అప్పుడు మనస్సు యొక్క పరిభ్రమణమునకు ఆట విడుపు కలుగుచున్నది.

❖❖❖

5. సంకల్పరాహిత్యం-ఆత్మాశ్రయం

దాశూరుడు: ప్రియకుమారా! బాలుడు క్షణంలో సంకల్పించి భ్రమాత్మకమైన పిశాచాదులను ఎదురుగా చూస్తూ కెవ్వున ఏడుస్తాడు చూచావా? ఈ మనస్సు కూడా స్వకల్పనామాత్రం చేత అనంతంగా దుఃఖములను ఏర్పాటు చేసుకుంటోంది. సంకల్పమయాత్మకమగు 'మనస్సు' అనే రాజు ఈ 'విశాల ప్రపంచం' రూపంగా తన దుఃఖమును విస్తరింప జేసుకుంటున్నాడు. సూర్యుడు ఉదయించగానే చీకట్లు తొలగుతాయి కదా! ఎప్పుడైతే ఈ మనస్సు 'ఖండితమగుసత్త' యొక్క అభావన ఆశ్రయిస్తుందో, అప్పుడు అది క్రమంగా తన 'జగత్తు రూపవిస్తరణ'ను కూడా నశింప జేసుకొంటుంది, లేక ఉపసంహరించుకుంటుంది.

ప్రాపంచిక సుఖ విశేషాలు ఎట్లాంటివి? మనస్సు యొక్క కోతి చేష్ట మాత్రమే!

కోతి చేష్ట - ఈ మనస్సు యొక్క పరితాపములకు అంతు ఎక్కడ? ఇందుకు పెద్దలు ఒక దృష్టాంతం చెపుతూ ఉంటారు. ఒక వడ్రంగి పెద్ద దుంగను అంపముతో మధ్యకు చీలుస్తూ ఉన్నాడు. ఇంతలో భోజనమునకు సమయం అయింది. అందుచేత రెండుగా విభాగించబడుచున్న దూలం మధ్యలో ఒక పుల్లను ఇరికించి భోజనానికి వెళ్ళాడు. ఇంతలో ఒక కోతి అక్కడికి వచ్చింది. స్వకీయమైన చపలచిత్తంతో, ఆకతాయితనంగా నిరర్థకమైన కుప్పిగంతులు, పరుగులు, లాగడం, పీకడం చేస్తూ, చేస్తూ ఆ దుంగ మధ్య తన కాలుపెట్టి పుల్లను పెరకనారంభించింది. ఇంకేముంది? కొద్ది క్షణాలలో పుల్ల జారిపోయింది. ఆ కోతి యొక్క కాలు దుంగ యొక్క చీలికలో ఇరుకుకొన్నది. ఇక ఆ కోతి బాధచే పెద్దగా కేకలు వేయనారంభించింది.... ఈ మనస్సు యొక్క చర్యలు కూడా అట్టివే. ఇది తన చపలచిత్తముచే స్వకల్పనలయందు చిక్కుకుని మహాపరితాపం పొందుతోంది.

కుక్క, బొమిక (ఇంకొక దృష్టాంతం) - ఒక కుక్కకు ఒక బొమిక ఎక్కడో దొరికింది. ఆకలితో నకనకలాడుచున్న ఆ కుక్కకు ఆ బొమికను చూడగానే రుచికరమైన మాంసము లభించి నట్లు

భావన ఏర్పడింది. ఆవురావురమంటూ బొమికను నమలసాగింది. పాపం, ఆ నములుచున్న వేగానికి పంటి నుండి రక్తం కారసాగింది. అప్పుడు ఆ కుక్క ఇట్లా అనుకుంటోంది... "ఈ బొమిక నిస్సారమైనదని మూర్ఖులు అనుకుంటున్నారు. నాకు ఇందులోంచి రక్తం లభిస్తోంది. నేను తెలివి గలదానను కాబట్టి ఇందులోంచి రక్తం పొందుచున్నాను కదా...!" ఇక ఆ రక్తమును చప్పరించ సాగింది. ఈ మనస్సు యొక్క సుఖవేదన కూడా అట్లే ఉంటోంది.

గాడిద, తేనెతుట్టె (ఇంకొక దృష్టాంతం) - ఒక గాడిద నిస్సత్తువగా నడుస్తోంది. ఒక చోట నేలపై పడ్డ తేనెతుట్ట కనబడింది. అందులో తేనె చుక్క కూడా లేదు. అయినా ఆ గాడిద నిస్సార మగు తుట్టెను నములుతూనే ఉన్నది. దానికి మిగులుచున్నది పంటిబాధ మాత్రమే. ఆ తుట్టెను వదిలితే తేనె లభించలేదని దుఃఖం. నములుతూ ఉంటే, కళ్ళవెంట నీరు కారేంత శ్రమ.

అట్లాగే ఈ మనస్సు కూడా విషయభోగములందు తగుల్కొని ఉంటోంది. ఈ మనస్సు యొక్క చేష్టలు గురించి ఏమని చెప్పాలి? క్షణంలో ఆసక్తి. మరుక్షణం విరక్తి. బాలుని చేతలు లాగా క్షణక్షణం ఏవేవో వికారములను పొందుతోంది. విషయాలు లేకపోతే లేనందుకు దుఃఖం విషయాలు ఉంటే, విషయాల వలన దుఃఖం.

దాశూరుని కుమారుడు: తండ్రీ! మీరు చెప్పుచున్నది అక్షరాలా నిజం. 'ఖోత్థుదు' అను శబ్దార్థంతో మీరు వర్ణించి చెబుతూన్న ఈ మనస్సు నన్ను క్షోభింపజేస్తోంది. నేనిప్పుడు ఏం చేయాలి?

దాశూరుడు: ఈ మనస్సు ఏ ఏ విషయములలో, వస్తువులలో తగుల్కొనుచున్నదో సుతీక్ష్ణమైన దృష్టితో పరిశీలించు- ఇది దేనిని 'ప్రియము' అని భావిస్తోంది?... దేనిని ద్వేషిస్తోంది?... వేటి వల్ల కామం, క్రోధం, మాత్సర్యం కలిగి ఉంటోంది?... దేనిని మమకార దృష్టితో చూస్తోంది?... కాస్త గమనించు, క్రోడీకరించి, పర్యవేక్షించు.

ఇప్పుడు, సంకల్పాత్మకమగు ఈ మనస్సును అట్టి బాహ్యా విషయముల నుండి వెనుకకు మరల్చు. అనగా, క్రమంగా వాటి గురించి సంకల్పించటం సన్నగిల్లాలి. అందుకు సమాధిని, మౌనమును అవలంబించు. 'ఆత్మజ్ఞానం' అనే తరుణోపాయంచే ఈ మననం చేయు స్వభావమును యుక్తియుక్తంగా నిర్మూలించు. బ్రహ్మము యొక్క స్వభావమును ఆశ్రయించు. నీచే ఆత్మ విశ్రాంతి స్వీకరించబడుగాక!

అందుకుగాను మన ఈ వర్తమాన చర్చవంటి ప్రయత్నములు తప్పక ఉపకరించగలవు.

దాశూరుని కుమారుడు: పితృదేవా! మీరు జీవుని యొక్క మూడు శరీరముల గురించి ప్రస్తావనకు తెచ్చారు. ఆ మూడు శరీరముల యొక్క విశేషములేమిటో వివరించండి.

దాశూరుడు: 'సంకల్పించుట' అనునదే తన యొక్క రూపముగా గల ఈ మనస్సుకు మూడు స్వభావములు ఉన్నాయి. ఆ మూడు స్వభావములు ఉత్తమ-మధ్యమ-అధమ రూపములు కలిగి యున్నవై, ఈ జగత్ స్థితికి కారణమగుచున్నాయి. ఈ మూడు శరీరములే 'సత్వ-రజ-తమో గుణములు' గా సంజ్ఞాపూర్వకంగా చెప్పబడ్డాయి.

మనస్సు యొక్క తమోరూపం - ఈ ప్రకృతికి సంబంధించిన స్వాభావిక క్రియలచే నిత్యం అజాగ్రత్త, సోమరితనం, నిద్ర, బద్ధకం, ఆలస్యం వంటి సంకల్పాలు ఉదయిస్తూ ఉంటున్నాయి. అట్టి సంకల్పముల కారణంగా ఈ జీవుడు ఎంతో దీనత్వం పొందుచున్నాడు. ఫలితంగా 'క్రిములు, కీటకములు, స్థావరములు' మొదలైన యోనులు ప్రాప్తించటం జరుగుతోంది.

మనస్సు యొక్క రజోరూపం - ఈ స్వభావంచేత రాగము, తృష్ణ, కర్మలతో వస్తువుతో సంగము, లోభము, ఆలోచనల నుండి క్రియల నుండి విరమించలేకపోవటం వంటి సంకల్ప స్థితులు కలుగుతూ ఉంటాయి. రజోగుణ రూపమైన సంకల్పములచే ఈ జీవుడు 'మానవజన్మ' కు యోగ్యమైన వ్యవహారములు ఆచరించటం జరుగుతోంది. అయితే, కార్యసాధకమగు మానవ ఉపాధి పొందిన తరువాత ఉత్తమ కార్యక్రమంతో సమున్నతి కొరకై సమయాన్ని, అవకాశాలను సద్వినియోగపరచుకొనే బదులుగా, ఈ మానవ ఉపాధి ధరించియున్న సమయమంతా ఈ జీవులలో కొందరు ఈ లోకంలో 'పుత్రులు-ధనం-గృహాలు' మొదలైనవి పొందుటకు మాత్రమే యత్నిస్తున్నారు. వాటి యందు సంతోషమును వెతకటం చేస్తున్నారు. ఈ విధంగా అజాగ్రత్తపరులు అథమ స్థితులవైపు ఆకర్షితులగుచున్నారు.

మనస్సు యొక్క సత్వరూపం - ఈ స్వభావం చేత మనస్సు 'జ్ఞానం-శాశ్వతసుఖం -అప్రమేయత్వము' వంటి సంకల్పములను ఆశ్రయిస్తోంది. ఆ జీవుడు సత్వరూప సంకల్పములచే 'ధర్మము-జ్ఞానము' మొదలైన వాటి యందు ప్రియమును పొందుచున్నాడు. ఆ మనస్సు అట్టి ధర్మ-జ్ఞానములను ఆశ్రయిస్తూ క్రమంగా అచిరకాలంలో 'కేవలీభావము'ను ఆశ్రయిస్తున్నది. శాస్త్రములచే వర్ణించి చెప్పబడుచున్న 'స్వారాజ్యస్థితి'ని పొందుచున్నది. సత్వగుణానుకరణం కారణంగా ఈ దృశ్యమునకు సంబంధించిన సర్వ ప్రతిబంధకములను క్రమంగా త్యజిస్తోంది. 'దృశ్యపారతంత్ర్యము' (దృశ్యానికి వశం అగుట) అనుదాని నుండి స్వాతంత్ర్యం పొందుచున్నది.

'బ్రహ్మపదము' లేక 'మోక్షము'... అనగా సర్వసంకల్పముల రహితత్వమని గ్రహించు.

సర్వాదృష్టీః పరిత్యజ్య నియమ్య మనసా మనః ।
సబాహ్యాభ్యన్తరార్థస్య సంకల్పస్య క్షయం కురు ॥ (సర్గ 53, శ్లో 38)

కాబట్టి కుమారా! బాహ్యదృష్టులన్నీ త్యజించు. మనస్సు నందు ఈ బాహ్య - అభ్యంతరములలోని సర్వపదార్థముల గురించిన సంకల్పములను రహితం చేయి.

మనస్సు చేతనే మనస్సును నిగ్రహించాలి. సంకల్పరాహిత్యమే బంధవిముక్తి.

ఒకడు వేలకొలది సంవత్సరముల తపస్సు చేయవచ్చు గాక! లేక, ఈ దేహమును నేలపై ఘర్షింపజేస్తూ చూర్ణం చేయవచ్చు..., అగ్నిలోనో, బడబాగ్నిలోనో ప్రవేశించవచ్చు..., భయంకర మైన గుంటలలోనో, కత్తుల సమూహంపైననో దూకి ఈ శరీరమును ఖండఖండములుగా చేసుకొనవచ్చు...! ఏ త్రిమూర్తులనో, లేక కరుణా సముద్రులగు దుర్వాస-దత్తాత్రేయ-బుద్ధుడు మొదలైనవారిని 'ఉపదేష్ట'లుగా కలిగియుండవచ్చు...! స్వర్గ-మర్త్య-పాతాళ-భూలోకములలోని

ఏవైనా ప్రత్యేకతలు గల ప్రదేశాలలో వసించవచ్చు గాక...! కాని ఏం ప్రయోజనం? ఏం లాభం? జరుగునదేమిటి? చివరికి 'సంకల్పానాశనం' ఆశ్రయించి, తద్వారా మాత్రమే సంకల్పములను జయించగలడు గానీ, వేరే త్రోవ లేదు. సంకల్పరాహిత్యం చేతనే మోక్షం లభించగలదని మాత్రం గ్రహించు. 'పరిశుద్ధ స్థితి' అయినట్టి మోక్షము లేక 'బంధవిముక్తి'కి సంకల్పరాహిత్యమే ఆత్యంతిక మైన ఉపాయం.

తదితరములైన అనేక చోట్లకు పోవుచున్న మనస్సును వెనుకకు మరల్చి ఆత్మభగవానుని కరచరణముల వద్దకు చేర్చాలి. ఆ తరువాత ఆత్మవస్తువుకు వేరైన సంకల్పపరంపరలు త్యజించాలి. సర్వము ఆత్మస్వరూపంగా సందర్శించాలి.

"ఇక్కడ ఆత్మకు వేరైనదేదీ లేనేలేదు" అను అఖండానుభవము దృఢీకరణమగుగాక!

అందుచేత చిరంజీవీ! నీకు నీవే సంకల్పనాశనమునకై ప్రయత్నించు. నీ సంకల్పములు నీస్వస్వరూప-స్వస్వభావమునందు విలయించుచుండగా, అప్పటి సంకల్పించు సంస్కారమునకు ఆవల ఉన్నట్టి నీయొక్క అనిర్వచనీయస్థితి-బాధారహితమైనదీ, పరమపవిత్రమైనదీ, సుఖమయ మైనదీ అని నీవే గ్రహించగలవు. అయితే అట్టి సంకల్పానాశనము అప్రయత్నశీలునికి ఎలా లభిస్తుంది చెప్పు? అందుచేత సంకల్పముల అతీతత్వము కొరకై అందుకు 'శ్రవణ-మనన -నిధిధ్యాస' రూపములతో కూడిన ఉత్తమ ప్రయత్నములను నీవు ఆశ్రయించాల్సిందే.

❖

ఓ పాపరహితుడా! కుమారా! నీచే అనుక్షణికంగా 'సంకల్పములు' అను సూత్రపు దారానికి ఈ సమస్త పదార్థములు గ్రుచ్చబడి ఉన్నాయి. అట్టి సంకల్పదారం త్రెంచబడిందా... క్షణ భంగురమగు ఈ ప్రాపంచిక పదార్థములన్నీ నీ సమక్షమునుండి మటుమాయం అవుతాయి.

సత్-అసత్ మయమైనట్టి వికల్పములన్నీ నీయొక్క సంకల్పమునుండే ఉత్పన్నమౌతున్నాయి గాని, మరింకెక్కడినుండీ కాదు. అన్నిటికీ కారణం 'నీవు సంకల్పించుట'యే! సర్వమునకు కారణమైయున్న సంకల్పము ద్వారా 'ఇది సత్తా? అసత్తా?' అనే చర్చలు ఆశ్రయించినంత మాత్రం చేత ఉత్తమ ప్రయోజనం లభించుటలేదని విజ్ఞుల యొక్క అనుభవం. వికల్పములగు ఈ పదార్థములు... సత్యవస్తువు... సర్వసంకల్పములకు అతీతము, పరిశుద్ధము... పరమార్థము... అయిఉన్న బ్రహ్మమును స్పృశించగలవా? లేదు.

అందుచేత, "నీ సర్వ సంకల్పములు లయించగా అప్పుడు "నీ సమక్షంలో శేషించునదే బ్రహ్మము' అని గ్రహించు. నీవు ఇక బ్రహ్మవేత్త మాత్రుడవు కాదు. బ్రహ్మమే అవుతావు. కార్య రూపమున ఉన్న ఈ దృశ్యవ్యవహారమంతా కూడా కారణరూపమగు 'స్వసంగము, (one's own attachment) లేక 'స్వసంకల్పములు'. (one's own perceptions...) అను వాటియందే ప్రవర్తించు చున్నది సుమా! స్వసంకల్పరాహిత్యము చేతనే ఈ 'జగత్తు లేకుండా పోవుట' జరుగగలదు. సంకల్పరహిత శుద్ధ స్వస్వరూపమే పరబ్రహ్మము.

❖

పుత్రా! నీకు మరల గుర్తు చేస్తున్నాను. నీ మనస్సు దేనిని ఏ విధంగా స్థితిపూర్వకంగా (As a form of) చింతిస్తుందో అది అట్లే పరిణమించటం, ప్రాప్తించటం జరుగుతోంది. అందుచేత నీవు సర్వవేళల సంకల్పములకు ఆవల ప్రశాంతుడవై ఉండుటను అభ్యాసం చేయి. "నేను సంకల్పించుట – అను ప్రక్రియ కంటే ముందే శుద్ధుడనై ఉన్నాను... కనుక వాస్తవానికి సంకల్పరహితుడనే" అను ఎఱుకను గ్రహించి ఉండు. అటుపై ప్రాప్తించిన వ్యవహారములను ఆచరిస్తూ ఉండు. సంకల్పాలు త్యజించుచుండుటచే క్రమంగా అభ్యాసవశంచేత చిదాత్మ ఈ విషయముల నుండి (శబ్ద–స్పర్శ–రూప–రస–గంధాదుల నుండి) స్వయముగా వెనుకకు మరల గలదు.

ఆహాఁ! చమత్కారం గమనించావా! కేవలం సత్యస్వరూపము, బ్రహ్మమయము అగు ఆత్మ అసత్యమగు 'మాయ'కు వశమై ఈ దేవ–మనుష్య–జంతు ఆదిగా గల భిన్న యోనులలో జన్మిస్తోంది. వ్యర్థంగా ఈ జగత్తు రూపంలో గల దుఃఖములన్నీ అనుభవిస్తోంది. ఇదంతా శుద్ధమగు ఆత్మకు యోగ్యమైనదేనా? ...కానే కాదు. అనేక యోనులలో, ఉపాధులలో ప్రవేశిస్తూ మృతి చెందుతూ... ఈ విధంగా దుఃఖములన్నీ అనుభవిస్తూ ఉండటం వలన ఏం ప్రయోజనం చెప్పు? అందుచేతనే బుద్ధిమంతులగు వారు అన్నిటిని ప్రక్కకు పెట్టి దుఃఖరహితమగు ఆత్మనే ఆశ్రయిస్తున్నారు. ఇక బుద్ధిహీనుల వ్యవహార మంటావా... అది మనకు అనుసరణీయం కాదు కాబట్టి అప్రస్తుతమే అవుతుంది. దాని వలన కలిగే ఉత్తమ ప్రయోజనం ఏమున్నది? బుద్ధిహీనత్వం అనేక దుఃఖములకే దారితీస్తోందని గుర్తు చేస్తున్నాను. అందుచేత నీవు తత్త్వజ్ఞానం కొరకే ప్రయత్నించు. ఈ వికల్పజాలమంతా బలత్కారంగా దూరీకరింపజేయి.

నిరతిశయానంద ప్రాప్తి కొరకు అద్వితీయమగు మోక్షపదము కొరకు యత్నించు. అట్లా కాకుండా, స్వల్ప లక్ష్యాలతో దృశ్యవ్యవహారం నందు బద్ధుడవు అయితివా... నిబిడాంధకార రూపములగు అనేక దుఃఖపరంపరలు నీ కొరకు వేచి ఉంటాయి. ఇప్పుడు నీ ఎదురుగా రెండు మార్గములు ఉన్నాయి– 1) సంకల్పించుట అను స్వభావము ఆశ్రయించి ఉండుట 2) సంకల్ప రాహిత్యమును అభ్యసించుట. ఈ రెండింటినీ క్షుణ్ణంగా అర్థం చేసుకో. సమన్వయం చేయి. ఆపై నీ ప్రయత్నములను తదనుకూలంగా తీర్చిదిద్దుకో.

❖❖❖

6. సంకల్ప విచికిత్స

దాశూర పుత్రుడు: తండ్రీ! ఈ సంకల్పము అనేది ఏ విధంగా ఉంటోంది? అసలు అది ఎట్లా ఉత్పన్నమౌతోంది? ఎట్లా వృద్ధి చెందుతోంది? ఎట్లా నశిస్తోంది? ఎలా, ఎక్కడి నుండి, ఎప్పటి నుండి, ఎవరి ప్రోద్బలంచేత ఎవరి కొరకు బయల్వెడలుతోంది?

దాశూరుడు: అనంతము – సత్తాసామాన్యము – ఆత్మస్వరూపము అగు చైతన్యము నిర్వచించబడ లేనట్టి కారణంగా ఒకానొకప్పుడు విషయములవైపు ఉన్ముఖమగుచున్నది. అట్లు విషయములవైపు

ఉన్ముఖం అగుటయే సంకల్పము యొక్క అంకురము. ఆ అంకురం అల్పమాత్రమే అయినప్పటికీ, అది సత్తను పొందినదై చిదాకాశము యొక్క నలువైపుల వ్యాపించుచున్నది. ఆ సంకల్పాంకురము తన అధిష్ఠానమగు 'చిత్ స్వరూపము' నే మరుగుపరచుచున్నది. అటుపై జడమగు ప్రపంచాకారం పొందుటకు గాను క్రమంగా ఘనత్వం పొందుతోంది. అట్లు ప్రాప్తిస్తున్న విషయ రూప జగత్తును 'ఇదంతా నాకంటే వేరుగా బాహ్యమున ఏర్పడి ఉన్నది'.. అను భావన చేస్తోంది. ఒక బీజము 'మొలుచుట' అను క్రమమును పొందుచున్నది చూచావా? అట్లాగే, ఆ చిత్ శక్తి సంకల్పత్వము పొందుతోంది. అటుపై ఒక సంకల్పము నుండి మరొక సంకల్పము ఉదయిస్తోంది. ఇక ఆపై ఈ సుదీర్ఘమైన సంకల్ప వ్యవహారమంతా విస్తరిస్తోంది. సంకల్పముల వెంట నిష్కారణంగా దుఃఖ పరంపరలు వచ్చి పడుచున్నాయి. అయితే సముద్రములో ఎన్ని తరంగాలు ఉదయిస్తే ఏమున్నది? అవన్నీ జలమే అయి ఉన్నాయి కదా! ఈ జగత్తంతా సంకల్పమాత్రమే. సంకల్పము తప్ప వేరుగా ఈ ప్రపంచంలో దుఃఖ-సుఖములంటూ ఎవరికీ ఏవీ లేవు.

ఈ మనస్సు కాకతాళీయన్యాయం చేత వివర్తభావము ఆశ్రయిస్తోంది. ఇది మిథ్యా రూపముననే ఉత్పన్నమౌతోంది. మృగతృష్ణవలె, రెండవ చంద్రుని భ్రాంతివలె ఇది అసత్యమైనదే! కాని దీని వృద్ధిని మాత్రం మనం చూస్తున్నాం. ప్రకృతి శాస్త్రంలో 'మాతులుంగము' అను పేరుగల చెట్టు గురించి చెబుతారు. ఆ చెట్టు పళ్ళు తిన్నవారికి అంతఃకరణంలో తెల్లటి పదార్థముల పట్ల భ్రాంతిపూర్వకమైన ప్రీతి ఏర్పడుతుంది. ఫలితంగా తెల్లటి పదార్థములు అత్యంత రుచికరమైనవిగా అనుభవమౌతుంది. ఆ ప్రీతి అసత్యమే అయినప్పటికీ తెల్లటి పదార్థములు తింటున్నప్పుడు అతనికి ప్రశస్తమైన రుచి మాత్రం అనుభవమౌతుంది. అదే విధంగా, మత్తు పదార్థములు సేవించువారికి చుట్టూ ఉన్న వస్తువులన్నీ గాలిలో తేలియాడుచున్నట్లు అనుభవమౌతాయి. ఈ వస్తువులు ఎగిరి పడటం అవాస్తమే అయినప్పటికీ అతనికి సత్యముగానే అగుచున్నది. ఈ జీవునియందు 'సంకల్పించుట' అను ప్రవృత్తి ఉద్భవించి, ఈ పదార్థములతోటి... వ్యక్తులతోటి సంబంధము వాస్తవమైన అనుభవముగా అతనికి ప్రాప్తించుచున్నది. కానీ అవన్నీ ఈ జీవుని యొక్క ఇష్ట-అయిష్టములను ఆశ్రయించే ఉంటున్నాయి.

దాశూరుని కుమారుడు: పితృదేవా! ఈ జన్మ-కర్మలకు, ఈ సంబంధాదుల భ్రమలకు కారణం అంతరమైనదా? బాహ్యమైనదా? నేను-తదితరులు ఎట్లా ఉత్పన్నమగుచున్నాము?

దాశూరుడు: నీవు మిథ్యారూపముననే ఉత్పన్నమైనావు. అట్లే నేను కూడా. 'ఈ శరీరము-దృశ్యము తదితర సంబంధ బాంధవ్యములు'... దృష్ట్యా చూచినప్పుడు మనమందరం మిథ్యారూపులమే. ఇక నిత్య-సత్య-శుద్ధమగు మన స్వస్వరూపము దృష్ట్యా మనం సర్వదా సత్స్వరూపులమే. మన యొక్క 'సత్' స్వరూపమున ఏ క్షణమందు ఎట్టి మిథ్యాత్వము లేనేలేదు. నేను బోధిస్తున్న ఈ మన ఆధ్యాత్మ శాస్త్రాన్ని తెలుసుకున్నావా - ఇక మిథ్యాత్వము నీ దృష్టి నుండి పూర్తిగా తొలగిపోగలదు.

ఈ దుఃఖజాలమంతా నీకు ఎందుకు ప్రాప్తిస్తోంది...? చెప్పమంటావా! 'వేద-వేదాంతాలచే సుస్పష్టపరచబడుచున్నట్టి పూర్ణాత్మ అనగా... నేనే! అట్టి ఆత్మకు గాని, ఆత్మయే స్వరూపముగా గల

నాకు గాని, 'నేను' 'నాది' అనునదంతా ఉండజాలదు. తదితర పదార్థములగు వస్తువులు – సుఖము–దుఃఖము–జన్మలు–మొదలైనవన్నీ మిథ్యారూపమే అయి ఉన్నాయి...' అనునట్టి ఎరుకకు సంబంధించిన విశ్వాసం ఏర్పడకపోవుట చేతనే.

ఇదే 'ఆత్మ విశ్వాసం' సుమా! అట్టి ఆత్మ విశ్వాసము దృఢపడిన తరువాత ఇక అజ్ఞానమునకు కారణం ఏం ఉంటుంది? 'నేను ఆత్మను... శరీరమును కాను'... అను విశ్వాసం లేకపోవటచేతనే ఈతడు అజ్ఞానమునకు చోటిచ్చుచున్నాడు. క్షణంలో స్వల్పవిషయాలు కూడా అతనిని విచలితుణ్ణి చేస్తున్నాయి. ఎక్కడ విచారణ చేసిన తరువాత ఇక దుఃఖము ఉండదో, అక్కడ విచారణ చేయటం మానివేసి ఈ జీవుడు దుఃఖితుడై చతికిలపడుచున్నాడు.

కుమారా! వాస్తవానికి ఈ జన్మాదులతో గాని, ఈ దృశ్యములోని ఆయా పదార్థములతో గాని నీకు ఏ సమయమందు కూడా సంబంధం లేదు. అయినప్పటికీ భ్రాంతిచే నీకు నీవే అట్టి సంబంధమును కల్పించుకొనుచున్నావు. కాస్త యథార్థ దృష్టితో చూచి, ఈ ఆత్మకు జన్మలు ఎక్కడ ఉన్నాయో చెప్పు? శరీరము కంటే ముందు కూడా నీవు ఉన్నావు. అనగా, ఈ శరీరముతో నీవు పుట్టుట లేదు – ఇతఃపూర్వమే ఉన్నావు. శరీరము నేలకూలిన తరువాత కూడా నీవు ఉంటున్నావు. అనగా శరీరపతనంతో బాటు నీవు రహితం అగుటలేదు. ఈ శరీరము ఉన్నప్పుడో, నీ ఉనికి గురించి వేరే చెప్పేదేమున్నది? మనో–బుద్ధి–అహంకారములతో కూడిన సూక్ష్మశరీరముతో ఈ శరీరమును ఉపయోగించుకుంటూ సంచారము సలుపుచూ ఉండనే ఉన్నావు కదా! సూక్ష్మశరీరం యొక్క చావు పుట్టుకలను ఎవరైనా గాంచుచున్నారా? లేదే. లేనప్పుడు 'నేను చచ్చాను... ఆతడు చచ్చాడు'... అనునదంతా భ్రమ కాక మరేమిటి?

వాస్తవానికి నీవు ఒక్కడివే సత్యము. సూక్ష్మశరీరము కూడా అసత్యము మాత్రమే. జలమే సర్వదా సత్యము. జలము కంటే వేరైనది – జలము కానిది– అగు 'తరంగములు' అనబడేది ఎక్కడైనా లభిస్తుందా? అందుచేత, 'నేను జ్ఞానం పొందియున్న – పొందియుండని సమయాలలో కూడా శుద్ధ చైతన్యస్వరూపుడనే అయి ఉంటున్నాను'... అని గ్రహించు. దోషపూరితమైన సంకల్పములకు వశీభూతుడవగుటచేతనే ఇట్లు మూఢుడివి, సంసారివి అగుచున్నావు.

పుత్రా! ఇప్పుడు చెప్పేది విను. ఇతఃపూర్వం అనుభూతములైన సుఖ–దుఃఖాది పదార్థముల గురించి 'సంస్మరించుట–సంకల్పించుట–సమాశ్రయించుట'లను క్రమంగా సన్నగిల్లచేయి. ఎట్లా? కేవలం అఖండము, నిర్మలము, నిత్యము అగు ఆత్మను భావన చేయుట చేతనే. అట్టి భావనామాత్రంచేత 'ఆత్మసిద్ధి' అనే ఐశ్వర్యం పొంది ఈ జీవుడు భవ్యజీవుడు కాగలడు. "నేను జన్మ మృత్యు రహితుడను... శుద్ధుడను... శాశ్వతమగు అమృతస్వరూపుడను"... అని భావన చేయుటలో ఏమి కష్టమున్నదో నాకు చెప్పు? మరి జనులు 'మోక్షము దుర్లభము' అని ఎందుకు అంటున్నారో నేను గ్రహించలేకపోవుచున్నాను. 'మోక్షమనేది చాలా కష్టమైన విషయం' అని బాలురు మాత్రమే అంటున్నారు.

'ఎందుకని అట్లు అనిపిస్తోంది?'... అనేది మేము పరిశీలించాం. కారణం...? 'వారి స్వస్వరూపమునందు వారికి తగినంత విశ్వాసం ఏర్పడకపోవుట చేతనే'... అని అనక తప్పదు.

స్వస్వరూపము పట్ల అట్టి విశ్వాసము కలిగించి, తదితర పదార్థముల పట్ల, విషయముల పట్ల అనాసక్తి-దుఃఖరాహిత్యం కలుగజేయటానికే ఈ వేద-వేదాంత క్రియా-జ్ఞాన వ్యవహారాలన్నీ ఉన్నాయి. "దృశ్యఅనాసక్తి-ఆత్మవస్తువును ఎఱుగుటలో ఆసక్తి" కలిగించునంతవరకే ఈ విధి నియమాదుల పాత్ర. ఎప్పుడైతే స్వస్వరూపమగు ఆత్మయందు పూర్ణవిశ్వాసము సుస్థిరమౌతుందో, అట్టి అప్పటి ఉత్తమస్థితి 'మోక్షస్థితి' కంటే వేరైనదేదీ కాదు సుమా!

అభావించటం - ఎప్పుడైతే నీవు సంకల్పనాశనము కొరకు యత్నిస్తావో, ఇకప్పుడు ఈ జనన-మరణాది భయమును పొందవు. 'భావన' చేయకున్నంత మాత్రంచేత సంకల్ప ప్రవాహం క్రమంగా క్షీణించగలదు.

ఒక పువ్వు యొక్క దళములు మర్ధించాలంటే కొంత శ్రముంటుందేమో, చేతులు మర్దించాలి. 'భావించక పోవుట' యందు క్రియకు సంబంధించిన శ్రమయే ఉండదు కదా! ఇక ఇందులో కష్టమేమి ఉంటుంది? కల్పనావినాశనము... అను మోక్షస్థితి కష్టమైనదనుట భావ్యం కాదు. చేతుల మర్దన అనే శ్రమ కూడా ఉండనట్టిది మోక్షభావన.

కేవలం భావనా విస్మరణ మాత్రం చేత అరక్షణంలో సంకల్పవినాశనం సిద్ధిస్తుంది. అయితే, ఎటొచ్చీ అట్టి 'సంకల్పరాహిత్యస్థితి' లో సుస్థిరుడవై ఉంటే చాలు. భావాతీతమైనదే తత్‌పదం.

నిరంతరం ఆత్మ యొక్క పూర్ణానందరూపమును చింతనచేస్తూ ఉండు. ఆత్మయందే స్థితి కలిగియుండు. అప్పుడు అసాధ్యమగు వస్తువు కూడా సిద్ధించగలదు. ఇందులో సందేహం లేదు. ఆత్మ దేనిచేతను హరింపబడుటగాని, నశింపజేయబడుట గాని, సంభవింపజాలదు. అందుచేత ఉత్తమ సంకల్పంచే అధమ సంకల్పాన్ని త్యజించివేయి. "ఈ కనబడే ఈతడు మమాత్మ స్వరూపుడే కదా!" అను భావనతో వ్యవహరిస్తూ ఉండు. 'నేను పూర్ణమగు ఆత్మనే' అనేదే ఆ ఉత్తమ సంకల్పం.

మనస్సుతో మనస్సును విచ్ఛిన్నం చేయి. స్వాత్మయందు సుస్థిరుడవై ఉండు. 'నిస్సంకల్ప మాత్రము, సులభసాధ్యము'... అయినట్టి ఈ మాత్రం ప్రశాంతబుద్ధిచే గ్రహించటంలో, ఆచరించటంలో ఏమి కష్టమున్నదో చెప్పు?

❖

'అట్లా ఎట్లా? మోక్షము అంత సులభమా? అంత తేలికగా నాకు లభించుటయా? లేదు... అది మాకు ఎన్ని జన్మలకో గాని లభించదు...' అని నీవు సంకల్పించటం జరిగితే, ఇక ఆ తరువాత ఆ తదనంతర ప్రాప్తి కూడా అట్లే అయి ఉంటున్నది.

'నేను ఇప్పటికే పూర్ణుడను, మోక్షస్వరూపుడను, ఈ మనో-బుద్ధి-చిత్త-అహంకారాదులకు సంబంధించనట్టి శుద్ధస్వరూపడను'... అని భావన చేశావనుకో.. నీ అనుభవం తదనుకూలంగానే ఉంటోంది. భావన యొక్క అనుసంధాన తీవ్రతను అనుసరించి అది అట్లే సత్యమై నీవు ఈ క్షణమందే మోక్షస్వరూపుడవు, పూర్ణుడవు కాగలవు.

సంకల్పము మొత్తముగా శమించిందా... ఈ జగత్తంతా శమించగలదు. ఓ మహామతీ! సంకల్పము యొక్క అభావమాత్రం చేత సంసారదుఃఖమంతా సమూలంగా తొలగిపోతుంది.

సంకల్పో హి మనోజీవచ్చిత్తం బుద్ధిః సవాసనా ।
నామ్నైవాన్యత్వమేతేషాం నార్థేనార్థవిదాంవర ॥ (సర్గ 54, శ్లో 20)

సంకల్పమే మనస్సు. అదియే "జీవుడు, చిత్తము, వాసనాసహితమగు బుద్ధి" కూడా. ఈ మనస్సు-బుద్ధి-అహంకారము-చిత్తము మొదలైన వాటియందలి భేదమంతా నామమాత్రమే గాని వాస్తవం కాదు. సంకల్పమునకు అన్యముగా ప్రపంచమున ఏదీ కించిత్ కూడా లేదు.

అట్టి సంకల్పము అనబడుదానిని నీ హృదయంలోనే, "నీ చేతిలో ఓడిపోయిన నీ సామంత రాజు" వలె స్వవశం చేసుకోవాలి. అట్లు చేయకుండా ఊరకే ఎందుకు పరితపిస్తున్నావో నాకు అర్థం కావటం లేదు.

❖❖❖

7. ఆరోపితం

దాశూరుడు: ఈ జగత్తు "ఆకాశము" వలె శూన్యమైనది మాత్రమే.

దాశూరపుత్రుడు: ఈ జగత్తు శూన్యమైనప్పుడు ద్రష్ట కూడా శూన్యుడే అవుతాడా? "జగత్తు లేదు" అనుకుంటే, జగద్వ్యవహారములే కుదరవు కదా? అప్పుడు అట్టి అవగాహనగల జీవులతో నిండిన జగత్తు జడమే అయిపోతుందేమో?

దాశూరుడు: విశాలమైన ఎడారిలో ఒకడు 'మృగతృష్ణ'ను చూచాడనుకో... విశ్లేషణచే "మృగ తృష్ణలో జలము ఉండదు" అని గ్రహించబడినప్పుడు ఆ ఎడారి పొందే నష్టమేమిటో చెప్పు? ఈ జగత్తు, జీవుడు మొదలైనవన్నీ నీ పట్ల తొలగిపోయినప్పటికీ "దృక్" రూపుడవగు నీకు, (లేక ఆత్మకు) ఏ మాత్రం లోటు ఉండదు. అది ఏ మాత్రం శూన్యత్వం పొందదు. యథారీతిగా పూర్ణమయ్యే ఉంటుంది.

మృగతృష్ణతో సమానమైన ఈ జగత్తు 'అసత్' స్వరూపములగు వికల్పముల చేతనే ఆవిర్భూతమగుచున్నది. ఈ "జగత్తు" అనునది ఆరోపిత వ్యవహారం మాత్రమే. ఆరోపించబడింది తొలగిస్తే పోయేదేమున్నది?

మిథ్యాభూతమగు సంకల్పమే స్వయంగా మిథ్యాభూతమగు ఈ మొత్తం జగత్ వ్యవహారాన్ని ప్రకటితమొనర్చుచున్నది. అట్టి సంకల్ప వ్యవహారం నిరోధించబడగా, నీవు సంకల్ప రహితుడవ గుచున్నావు. నీ దృష్టిలో 'లేనివే' అని తెలియవచ్చిన పదార్థములచే నీవు బాధింప బడవు. జగత్తు పట్ల "ఇది సత్యమైనదే" అనే బుద్ధి తొలగుచుండగా, ఇక నీయందు వాసనలు సంభవించవు.

భావనాక్షయమే వాసనాక్షయం కూడా. సర్వభావనలూ తొలగినప్పటికీ, ఇక తొలగింప జాలనిదేదో... అదే నీవు. వాసనాక్షయమే మోక్షస్థితి యొక్క సంప్రాప్తము.

కాబట్టి నాయనా! దృఢమైన అభ్యాసముచే 'ఈ దృశ్యము లేదు... ఈ జగత్తంతా అసత్యము' ... అని గ్రహించు! ఎప్పుడైతే నీవు 'దృశ్యరాహిత్యం' అవధరిస్తావో, ఈ దేహాదులందు ఆత్మ భావము లేకుండా ఉంటావో – అప్పుడు నీవు ఈ సుఖ–దుఃఖములలో తగుల్కొనే ప్రసక్తే ఉండదు. 'ఈ దేహం, ఈ బంధువులు, ఈ మిత్రులు, ఈ వస్తుసముదాయము మిథ్యారూపములే కదా..." అని నిశ్చయించుటచే వానియందు నీకు ఆసక్తి–అభినివేశములు జనించవు. ఆసక్తి నశించిందా, ఇక 'హర్షం–దుఃఖం', 'జననం–మరణం' మొదలైనవన్నీ నీపట్ల అసంభవములే అవుతాయి. కాబట్టి సుఖ దుఃఖాది విభ్రమమలు నీకెప్పుడైనా ప్రాప్తిస్తుంటే 'ఇదంతా అసత్తుయే" అను నిశ్చయమును కలిగియే ఉండు. ఆపై ఎట్లు ఉచితమో అట్లే వ్యవహరించు.

విషయ విస్మరణం - ఈ మనస్సే చిద్వస్తువు యొక్క ప్రతిబింబమువంటి 'జీవుడు' అను రూపమును ధరిస్తోంది. ఈ జగత్తు రూపమైనట్టి భూత–భవిష్యత్తు–వర్తమాన జగత్తునంతటినీ మనస్సే నిర్మించుకుంటూపోతోంది. అదే సర్వమును ఉద్భవింపజేస్తోంది. పరివర్తింపజేస్తోంది. నశింపజేస్తోంది. అది ఒక సమయంలో విషయములతో సంబంధమును పొందినదై వాసనలచే ఆచ్ఛాదితమగుచున్నది.

అయితే ఒక ప్రశ్న. ఇంతటి వ్యవహారమును నిర్వర్తిస్తున్న ఈ మనస్సు స్వయంశక్తి కలిగి యున్నదా? లేదు. అది వాస్తవానికి జడమైనది. అది అధిష్ఠానమగు 'శుద్ధ చైతన్యం' యొక్క సంబంధం చేతనే స్ఫురణ శక్తియుతమై యున్నది. అట్టి శుద్ధ చైతన్యమే నీ వాస్తవ స్వరూపం గాని, ఈ శరీర మనస్సులు నీవు కావు. అయితే మలినము–చంచలము అగు 'ఇచ్ఛ'చే ప్రేరేపించబడుట చేతనే మనస్సు ఈ 'జగత్తు రచన' అను వ్యవస్థను నిర్వర్తించుచున్నది. 'హృదయం' అనే వనంలో 'కోతి' వంటి ఈ జీవుని మనస్సు స్వ–ఇచ్ఛానుసారంగా, స్వయంకల్పిత కార్యక్రమానుసారంగా ఈ జగత్తులో లీలలు నిర్వరిస్తోంది.

ఈ జీవుడు (లేక మనస్సు) ఒకప్పుడు విశాలాకారయుతుడగుచున్నాడు. మరొకప్పుడు అత్యంత సంకుచితరూపం పొందుచున్నాడు.

ఒకప్పుడు జాగ్రత్–స్వప్న సంసక్తతచే "నేను పరాధీనుడను" అను భావం పొందుచున్నాడు. మరొకప్పుడు "నేను సర్వమునకు అసంబంధితుడను" అను రీతిగా భావనను ఆశ్రయిస్తున్నాడు. సంబంధమే లేని చోట, యిక బంధమంటూ ఎక్కడిది?

ఈ 'సంకల్పములు' అను తరంగాలు ఎప్పటి నుండి పుడుచున్నాయో దేశకాలముల దృష్ట్యా గ్రహింప శక్యము కాకయే ఉన్నాయి. అయితే, "సంకల్పములు విషయముల పట్ల ఏర్పడు 'ధ్యాస' చేతనే ఉద్భోధితమై, వృద్ధి చెందుచున్నాయి"... అని మాత్రం తప్పక చెప్పవచ్చు. దేశ–కాలములు సలకల్పార్గతములే! 'విషయవిస్మరణం' అను ఒక వజ్రాయుధంచేత మాత్రమే ఈ సంకల్ప వ్యవహారమంతా సమూలంగా నశించగలదు.

❖❖❖

8. ఉన్నది ఎల్లప్పుడూ ఉంటోంది - లేనిది ఏనాడు లేదు.

ఈ జీవునియందలి సంకల్పించు స్వభావం అల్పవిషయం చేత కూడా ప్రజ్జ్వరిల్లుతోంది. క్షణభంగురములు, జడత్వమును ఆశ్రయించి ఉన్నట్టివి, అప్రకటితరూపములు అయినట్టి సంకల్పములే ఈ జగత్తులో విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నాయి.

ఓ ప్రియకుమారా! ఈ ప్రపంచంలో ఏదైతే అసత్యమైయున్నదో, అదంతా శీఘ్రంగా నివారించబడుటయే ఉచితం కదా!

అసత్ వస్తువు సత్ అవుతుందా? ఎన్నటికీ కాదు. ఇందులో సందేహం లేదు.

'సత్' అను వివేచనను 'సంకల్పాలు' అను వాటికి అన్వయించి చూద్దాం. ఒకవేళ 'సంకల్పం' అనునది సత్స్వరూపమే అయి ఉంటే ఇక దానిని నిగ్రహించటం ఎవరి తరం చెప్పు? అది స్వతహాగా అట్లే ఉండగలదు. అది "సత్‌స్వరూపము" కాదు కాబట్టే, కొందరు మహనీయులు దివ్య మగు ఆత్మజ్ఞానంచే సంకల్పరహితులై, స్వసత్తచే స్వయంప్రకాశంగా వెలుగొందుచున్నారు.

'సంకల్పము' అనునది అసత్తే కనుక దానిని దమింపజేయడం తప్పక సుసాధ్యమే. ఈ 'ప్రపంచము' రూపములో నీకు సంప్రాప్తించుచున్న మాలిన్యము సత్యమే అయితే ఇక దానిని తొలగించుట ఎట్లు? బొగ్గుకు ఉన్న నలుపును ఎంత శుభ్రపరచినా తొలగించగలమా? దాని నలుపును తొలగించుటకు యత్నించువాడు మూర్ఖుడే అవుతాడు కదా!

ఈ జగత్తు, ఇందు జీవునకు స్ఫురించుచున్న సంకల్ప వ్యవహారంతో సహా సత్యం కానే కాదు.

❖❖❖

9. ప్రయత్నించినవాడే గ్రహిస్తున్నాడు.

ప్రియపుత్రకా! ఈ ప్రపంచము యొక్క స్థితి అనిర్వచనీయము. ఇది అనాదికాలంగా సిద్ధించి ఉంటోంది. 'జ్ఞానము' అనే పరమార్థం చేత ఇది తప్పక సంపూర్ణముగా తొలగగలదు. జ్ఞాని మాత్రమే అతి విస్తారమగు ఈ సంసారమాలిన్యమును విఛ్ఛిన్నం చేయగలుగుతున్నాడు. ధాన్యము యొక్క పొట్టు ఎట్లా పోతుంది? దంచుట చేతనే కదా! రాగిపై చిలుము తొలగుతుందా? 'తోముట' అను క్రియచే తప్పక తొలగుతుంది కదా! ఈ సంసారమాలిన్యము కూడా 'జ్ఞాన భూమికల అభ్యాసం' అనే ప్రయత్నముచే తప్పక తొలగుతుంది. పురుష ప్రయత్నము తప్పక ఫలదాయకమవుతుంది. ఇందులో సందేహం లేదు. అందుచేత అభ్యాసక్రమముచే నీవు 'శుద్ధము-అఖండము-నిష్కళంకము-నిత్యము' అగు నీయొక్క స్వస్వరూపాత్మను గాంచగలవు. అట్లు గాంచుట జరుగుచుండగా సర్వవ్యధలు, వేదనలు, ఖేదభావనలు వాటంతట అవే తొలగుతాయి. ఓ బిడ్డా! నీవు సరి అయిన ఉపాయములను ఆశ్రయించకపోవుట చేతనే మిథ్యా వికల్పయుక్తమగు ఈ సంసారమంతా ఇంతవరకు జయించబడక పోవటం జరుగుతోంది. అట్లే

తదితరులగు సర్వజీవుల విషయం కూడా, 'అసంకల్పము' అను యత్నముచే ఇది శీఘ్రముగా విలయమొందుచున్నది. ఈ విషయంలో ఎవ్వరికీ సందేహాలు అక్కర్లేదు.

అసద్వస్తువు ఎక్కడైనా చిరకాలం స్థిరంగా ఉంటోందా?... లేదు. చీకట్లో ఉన్నవాడు దీపం వెలిగించుకుంటే ఇక ఆ చీకటి ఎక్కడ ఉంటుంది? అది ఎక్కడికి పోతోందని చెప్పాలి? దృఢమైన దృష్టితో చూస్తే ఆకాశంలో ఇద్దరు చంద్రులు ఇక కనిపిస్తారా? ఈ సంసారము కూడా తత్త్వ విచారముచే మిథ్యాత్వము పొందుతోంది. ఓ ప్రియకుమారా! సర్వదా ఒక్క విషయం గుర్తుంచుకో. నీవు ఈ సంసారమునకు చెందినవాడవు కావు. అట్లాగే ఈ సంసారము కూడా నీకు చెందినది కాదు. కనుక నిశ్చింతగా ఈ సంసార భ్రాంతిని విడిచిపెట్టు. "ఈ సంసారము మిథ్యయే" అని తెలిసిన తరువాత కూడా ఇక నీకీ చింతనలు ఎందుకు చెప్పు? కనుక సర్వ విషాదపూరిత చింతలు క్రమక్రమంగానో, ఒక్కసారిగానో త్యజించివేయి.

"నేనొక జీవుడను. అనేక విభవములతో కూడిన ఈ భోగవిలాసాలు యుక్తమే. ఇందులో కొన్ని వస్తువులు, వ్యవహారములు పొందుటచే నేను ఆనందించగలను. కొన్నిటిని నేను వదల్చుకో వలసియున్నది." – ఇవన్నీ సాంసారిక వీచికలేనని గ్రహించు.

నీ రూపమున, మరియు ఈ దృశ్యము రూపమున ప్రకటితమగుచున్నదేది? సర్వ విధములా ప్రకాశించుచున్నది ఆత్మయే కదా! సర్వము ఆత్మయే అయి ఉండగా నీకు దిగుళ్ళు, రంధులు ఎందుకు కలగాలి? వాటి ప్రమేయమును నీవు ఎందుకు ఆశ్రయించాలి?... అందుచేత సర్వదా నిశ్చింతుడవై ఉండు.

❖

శ్రీ వసిష్ఠ మహర్షి: వింటున్నావా రామచంద్రా! వారి సంభాషణ అట్లు ముగిసింది. ఆపై నేను వారి ముందు భౌతిక రూపుడనై ప్రదర్శించుకున్నాను. వారిద్దరు వినమ్రతతో నన్ను ఆహ్వానించి, పూజించారు. దాశూరుడు చెప్పిన ఆప్తవాక్యములను అభినందించాను. అందలి సారవిశేషాలను పునఃసమీక్షిస్తూ ప్రసంగించాను. సంసారము నుండి ఈ జీవుని తరింపజేయగల అనేక గాథలు వినిపించాను. మేం ముగ్గురం ఆత్మవిషయమై అనేక దృక్పథముల నుండి అనేక విషయాలు చెప్పుకున్నాం.

ఆ రాత్రి ఉల్లాసంగా గడచిపోయింది. ఆ మరునాడు ఆ తండ్రీకొడుకులు నన్ను భక్తి పూర్వకంగా సాగనంపారు. నేను నా కార్యక్రమము ననుసరించి ఆకాశంలో ప్రవేశించి మునులు వేచియున్నచోటికి పయనించాను.

ఇప్పుడీ 'దాశూరాఖ్యాక' విన్నావు కదా! దీనిని అనుసరించి "ఈ జగత్తు ప్రతిబింబము వలె అసత్యమైనది" అని గ్రహించు. ఈ సంభాషణను అనుసరించి ప్రజలలో "ఇది దాశూరాఖ్యాయిక వంటిది" అనునది ప్రచారంలోకి వచ్చింది.

❖❖❖

10. దాశూరాఖ్యాయిక: విజ్ఞాన సారాంశము

ఈ 'నేను–నీవు' అనునదంతా ఆత్మయే. కనుక 'అధిష్ఠాన చైతన్యం' దృష్ట్యా చూచినప్పుడు ఇవి వాస్తవమే. ఆరోపితం దృష్ట్యా ఇవి అవాస్తములేనని కూడా గ్రహించు.

"నేను–నాది" ఇత్యాది అధ్యాసలను త్యజించివేయి. దాశూరమహాముని తన కుమారునికి చెప్పిన సిద్ధాంతాలలోని అంతర్లీనగానాన్ని గమనించు. ఉదారచిత్తుడవు, ఆత్మనిష్ఠుడవు అగుము. వికల్పాత్మకమగు 'మనస్సు'కు హేతువు అగుచున్న అజ్ఞాన మాలిన్యమును 'నేను ఆత్మ తేజమునే" అను ప్రస్తావనచే కడిగివేయి.

ఆత్మతత్త్వమును అవలోకించుచూ ఉన్నావా… ఇక నీవు అతి శీఘ్రముగా మోక్షపదమును పొందగలవు. ఈ పదునాలుగు లోకములలో పూజ్యుడవు కాగలవు.

ఇట్టి పరిశుద్ధ "స్వస్వరూపాత్మదర్శనము"చే మావంటి ఋషులకు కూడా నీవు నమస్కరింపతగిన వాడవగుచున్నావు.

❖❖❖

VIII. కచోపాఖ్యానము - ఉపోద్ఘాత చర్చ

1. ఈ సృష్టికి కర్త ఎవరు?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! జడాత్మకమగు ఈ ప్రపంచం 'లేదు' అనే నిశ్చయం కలిగి ఉండటమే ఉచితం. ఈ 'నేను-నాది' మొదలైన భేద అధ్యాసల పట్ల విశ్వాసం త్యజించివేయి. వివేకులకు ఎక్కడైనా లేనిదానియందు విశ్వాసముంటుందా? అవివేకులకు మాత్రమే అసత్యమైన దాని యందు ఉద్వేగము, రాగము, సంరంభము ఉంటాయి.

నీవు వివేకివి కావాలి. అంతేగాని అవివేకమును ఆశ్రయించి దుఃఖించటమేమిటి చెప్పు? ఈ 'దేహాలు' మొదలైన వాటితో కూడియున్న దృశ్యజగత్తు ఆత్మ కంటే వేరుగా సత్తను పొందివుందా?.. లేదు కదా! ...అందుచేత నీవు అపేక్షా రహితుడవు అవ్వాలి. అసంగం, ఉదాసీనం, చిద్రూపం అయినట్టి 'స్వాత్మ' యందే సుస్థిరుడవై ఉండు. అజ్ఞాని 'అధ్యాస' అను స్వభావం కలిగి ఉంటున్నాడు. ఫలితమేమిటి? ఆత్మకంటే వేరుగా ఈ దేహాదులందు ఆత్మతత్త్వమును ఆపాదించుకొంటున్నాడు. పరితపిస్తున్నాడు."నేను ఈ దేహమునే, నేను చచ్చుచున్నాను, పుట్టుచున్నాను' అని అనుకుంటు న్నాడు. ఈ శరీరము-దృశ్యము మొదలైనవాటిపట్ల సత్యత్వబుద్ధి సమంజసము కాదు సుమా!

ఈ జగత్తే సదసత్తు (Truely as well as falsely exists) అని, దీనికి ఒక నియతి అంటూ ఏదీ లేదని నీవు ఎరుగుదువు కదా! మరి దేహము మొదలుగా అనేక పదార్థములతో కూడుకొని ప్రాప్తిస్తున్న ఇక్కడి సంబంధ-బాంధవ్యములపై మాత్రం విశ్వాసం ఎందుకు? ఈ జగత్తే "లేదు"... అని నిశ్చయించిన తరువాత ఇక సంబంధమేమిటి? బంధమేమిటి? ఎవరికి? ఎక్కడ? కేవలం ఆత్మ ఒక్కటే సర్వదా సిద్ధించి ఉన్నది, ఉంటున్నది. అది సర్వదా, నిర్మలము, వ్యాపకము, అనంతము, సర్వప్రమాణములు అందుకోలేనిది అయి ఉన్నది.

శ్రీరాముడు: బాగున్నది స్వామీ! అయితే, ఒక సందేహం. మీ ఉద్దేశము ననుసరించి ఈ జగత్తుకు కర్త ఎవరు? కారకులు, ప్రేరకులు ఎవరైనా ఉన్నారా? ఉంటే వారు ఎక్కడ ఉన్నారు? ఎక్కడ నుండి దీనినంతటినీ నడుపుచున్నారు?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఈ జగత్తు విషయంలో ఇప్పటికే అనేక విశేషాలు చెప్పుకున్నాం. నీ ప్రశ్నకు సమాధానంగా ఈ జగత్తు విషయంలో మా అభిప్రాయములు మరికొన్ని విశేషాలు చెప్పుచున్నాను విను-

ఓ రామచంద్రా! ఈ జగత్తు ఎవ్వరిచేతనూ నిర్మించబడి ఉండలేదు. అనగా దీనికి 'కర్త' అంటూ ఎవ్వరూ లేరు. అట్లే "ఈ విధమైన క్రమము"... అంటూ ఏదీ లేదు. "కర్త ఇట్టి విధానము

నకు బద్ధుడు”-అనునది చెప్పుటకు వీలుగా కూడా లేదు. విజ్ఞుల అవగాహనను అనుసరించి ఏర్పడియున్న భిన్నాభిప్రాయములు ఇక్కడ ఉదహరిస్తారు.

1. దృశ్యముచే ద్రష్ట ఏర్పడుచున్నాడు! (దృశ్యము కర్త - ద్రష్ట అకర్త) - “దృశ్యమును బట్టే ద్రష్టయొక్క అనుభవం ఉంటోంది. కనుక ‘అనుభవము’ అనబడుదానికి జగత్తే కర్త. ఆ అనుభవం ఏర్పడు ప్రదేశమే ద్రష్ట యొక్క బాహ్యము. కనుక దృశ్యమును అనుసరించి ద్రష్ట ఉంటున్నాడు.”

2. ద్రష్టచే దృశ్యము కల్పించబడుచున్నది! (దృశ్యము అకర్త-ద్రష్ట కర్త) - ద్రష్ట యొక్క భావనయే దృశ్యానుభవం కనుక జగత్తు అకర్త. ద్రష్టయే కర్త. ద్రష్ట యొక్క అంతరంగమే అనుభవములకు స్థానం. ఆత్మసన్నిధానం చేతనే జగత్తు భాసిస్తోంది కనుక, ద్రష్టను అనుసరించే దృశ్యము ఉంటోంది.

❖

ఈ ‘జగత్తు’ అనే జాలం కర్తృసహితం కావచ్చు గాక! లేక కర్తృరహితం కావచ్చు గాక! మరింకేదన్నా కానీ! నీవు మాత్రం ‘ద్రష్ట-దృశ్యము పరస్పరం అభేదమైనవే” అను అధ్యాస కలిగి ఉండు. పరస్పర ‘భేదధ్యాస’ చేతనే ఈ దేహములపట్ల “ఈ దేహమే నేను” అను దేహాత్మభావన సంభవించటం జరుగుతోంది. అట్టి భావనను జీవుడు మొదటగా త్యజించాలి.

కనుక రామా! నీ బుద్ధిని సునిశితం చేసుకో. పరిచ్ఛిన్నములగు ఈ దేహాదులందు స్థితి కలిగి ఉండవద్దు. అట్లు స్థితి పొందకుండానే యథారీతిగా వర్తిస్తూ ఉండు.

‘ఈ జగత్తుకు కర్త ఆత్మయే’... అని అనవచ్చా? ఈ ప్రశ్నకు మా సమాధానం విను.

ఆత్మ సర్వదా సర్వేంద్రియ రహితమైనట్టిది. అది ఏ క్షణమందు ఎట్టి మార్పు చేర్పులు పొందుటయే లేదు. కనుక ‘అది జడమువంటిది’ అని కూడా చెప్పబడుతోంది. ఆత్మ తన స్వసత్త మాత్రంచేత ఈ జగత్తు ఉనికిని పొందుతోంది. అందుచేత అజ్ఞాన దృష్టికి “ఆత్మ ఈ జగత్తుకు కర్త” అయినట్లు కనిపిస్తోంది.

‘కాకతాళీయ న్యాయం’చే ‘ఈ జగత్తుకు కర్త అనువాడే లేదు” అని మేము ఎంచుచున్నాం.

కాకతాళీయ న్యాయం అనగా - ఒకచోట ఒక ఎత్తైన తాటి చెట్టు ఉన్నది. అప్పుడే వసంత కాలం ప్రవేశించుటచే ఆ చెట్టుకు తాటిపళ్ళు చక్కగా మ్రగ్గి, ఘుమఘుమలాడుతూ వ్రేలాడు చున్నాయి. ఒక కాకి ఎక్కడి నుండో ఎందుకో వచ్చి ఆ చెట్టు యొక్క తాటిపళ్ళ గుత్తిపై వ్రాలింది. అప్పుడు, ఆ గుత్తిలోని ఒక పండు బాగా మగ్గి ఉండి, గుత్తి నుండి విడివడి నేలపై పడింది. అప్పుడే నీడలో సేదతీర్చుకుందామని ఒక నక్క ఆ చెట్టు క్రిందకు వచ్చి నిలిచింది. నీడను, గాలి వీచికలను పొందుతూ ఉన్న ఆ నక్కపై తాటిపండు జారిపడింది. ఫలితంగా, ఆ నక్కకు గాయం అయింది.

ఇప్పుడు చెప్పు. ఆ నక్కకు గాయము అగుటకు కారణమేమిటి? తాటిచెట్టా? కాకియా? వసంతకాలమా? తాటిపండా? నక్క చెట్టు క్రిందకు వచ్చుట చేతనా? చెట్టు నీడకు కారణమైన సూర్యుడా? గాలియొక్క వేగముతో కూడిన వీచికలా?

ఎవ్వరు ఏదైనా అనవచ్చు. కాని "కాకతాళీయ న్యాయముచే ఉత్పన్నమైనదానికి కర్త లేదు" అనునది ఈ దృష్టాంతము యొక్క పాఠం.

ఈ జగత్తు ఏదై ఉన్నది – అనే విషయానికి వస్తే, ' ఈ జగత్తు అనిర్వచనీయం' అని అనేక మంది ఆత్మజ్ఞానులగు వారిచే చెప్పబడుతోంది. "ఈ జగత్తు ఇందలి పదార్థ వ్యవహారములు గురించి అజ్ఞులే మరల మరల వితర్కించటం, విచారించటం చేస్తున్నారు. వివేకులు అట్లు చేయరు." అనునదే మా అభిప్రాయం కూడా. ఎందుకంటే తర్కవితర్కములు ఒక పరిధిని, పరిమితత్వమును కలిగియుండి, అనంతమగు ఆత్మతత్వమును నిర్వచించలేకపోతున్నాయి. ఇట్లు ఆత్మ అనుభవైకవేద్యము మాత్రమే అగుచున్నది.

❖

ఈ జగత్తు 'భావనారూపము' అని కొందరంటున్నారు. "ఇది క్షణక్షణం నశించుచూ, శూన్యమే అయి ఉన్నది" అని మరికొందరు చెప్పుచున్నారు. "ఇది ప్రవాహరూపమున కనిపిస్తూ మరల మరల ఉత్పన్నమగుచున్నది"... అని ఇంకొందరి అభిప్రాయం.

ఏది ఏమైనా చమత్కారమేమంటే దీనిని నీవు ఏ ఏ సంకల్పముల ధారణ చేత మరల మరల దర్శిస్తావో, ఆ ధారణలను అనుసరించే ప్రయోజన సిద్ధిని పొందుచున్నది.

శ్రీరాముడు: "ఇది నిత్య సత్తా స్వభావం కలది" అని చెప్పవచ్చుని? అందామా? అంటే, ఇది ఎప్పటికీ ఏర్పడి ఉండియే ఉంటుందని" అని అనవచ్చునా?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఇక్కడ ప్రతిదీ ఒకప్పుడు ఒక విధంగా మరొకప్పుడు మరొకవిధంగా ఉంటోంది. ఇక్కడ పరిణామం చెందనిదేది చెప్పు? అందుచేత ఇక్కడ ఇప్పుడు కనబడుచున్నదంతా 'అసత్' స్వభావయుతమని చెప్పబడుతోంది. అంటే, అది ఇప్పటికే స్వతహాగా 'ఉనికి' ని కలిగి ఉండలేదు.

పోనీ... 'ఇది క్షణిక సత్త శీలమైనది' అందామా? ఈ శరీరములోని సంకల్పించువాడు, లేక దర్శించువాడు ఉన్నాడు చూచావ్! అతడు ఆయా పదార్థముల, భావముల మార్పుచే స్పృశించ బడకయే ఉంటున్నాడు. భావనను అనుసరించే జగత్తు ఉంటోంది.

ఆత్మ వాస్తవానికి సర్వ ఇంద్రియములకు అతీతము, ఆధిభౌతిక–ఆధిదైవిక–ఆధ్యాత్మిక తాపములచే తాకబడనిది. అది ఈ జగత్కార్యమును నిరంతరం చేయుచున్నప్పటికీ అది ఏమాత్రం ఖేదముగాని, మోదము గాని పొందదు.

❖

ఒక గదిలో దీపం ఉన్నది. ఆ దీపపు వెలుగు సహాయంచేత ఆ గదిలో "వంట చేయుట–సంభాషించుట–చదువుట" మొదలగు కార్యక్రమాలన్నీ జరిగిపోతున్నాయి. దీపపు వెలుగు లేకుంటే అవన్నీ ఆ విధంగా జరుగజాలవు. కాని దీపపు వెలుగే అవన్నీ చేయిస్తోందని అనలేము. దీపపు వెలుగు దేనికీ కారణం కాదు.

ఇక్కడ మనకు రెండు వాక్యాలు సిద్ధిస్తున్నాయి–

1. ఆత్మయొక్క 'సమక్షం' చేతనే జగత్తు ఉంటోంది - ఆత్మ యొక్క సన్నిధానం మాత్రం చేత ఈ జగత్తు వ్యవహార ప్రకటనలు కలిగి ఉండగలుగుతోంది. కనుక జగత్తుకు కారణం ఆత్మయే.

2. ఆత్మ సర్వదా నిర్వికారం, నిర్విశేషం - ఆత్మ స్వతహాగా నిరవయవము, పదార్థరహితము కదా! కనుక ఆత్మ జగత్తుకు కారణమగుట లేదు.

అందుచేతనే... "ఈ జగత్తు సత్–అసత్ రూపము, అనిర్వచనీయము అయి ఉన్నది"... అని చెప్పబడటం జరిగింది. ఆత్మ కాకుండా వేరుగా ఈ జగత్తు యొక్క ఉనికికి మరింకేదీ కారణ మగుట లేదు. నిరంతరం ఈ దృశ్యము భావనానుసారం ఇట్టి స్థితే కలిగి ఉంటోంది. ఇది మిథ్యా రూపమున ఇంద్రజాలంలో లాగా ఆవిర్భవించినట్లు దృశ్యమానమై ఉంటోంది. దృశ్యానికి అతీత మగు ఆత్మత్వము వహించువారికి, ఈ దృశ్యము ఎదురుగా ఉండి కూడా 'లేనిదే' అగుచున్నది.

❖❖❖

2. నిరపేక్ష-నిస్సంగము

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! ఈ జనుల వ్యవహారముల సంరంభము గమనిస్తున్నావా?

అవర్యన్తస్య కాలస్య కశ్చిదంశః శరచ్ఛతమ్ ।
తావన్మాత్రమహాశ్చర్యః కిమర్థం సోఽనుధావతి ॥ (సర్గ 56, శ్లో 13)

ఈ శరీరంతో కూడినప్పటి జీవితం అనంత దేశకాలముల దృష్ట్యా అత్యంత పరిమితమైనది కదా! ఇది అనంత కాలప్రవాహంలో ఎంతటి స్వల్పాంశమైనది! ఈ స్వల్పకాలం, సదవకాశంలా లభించిన ఈ మానవ ఉపాధి ఏర్పడియున్న సమయమంతా కూడా అతడు దేహాత్మ బుద్ధినే ఆశ్రయి స్తున్నాడే! సర్వేంద్రియములకు అతీతమైయున్న ఆత్మవైపు అభిముఖుడవటమే లేదే! ఎంత ఆశ్చర్యం!

ఈ జగత్తుకు స్వకీయమైన కర్తృత్వమే లేదు. అట్టి ఈ జగత్తునందలి ఈ దేహములతో సహా సమస్త పదార్థములు 'ఇవి స్థిరములు'... అనిపించటం మూర్ఖత్వమే అవుతుంది. ఇక్కడి స్వల్ప వస్తువులను ఆపేక్షించుచు, దూరదృష్టి లేకుండా దినములు గడపటం ఉచితమెట్లాగా?

ఓయీ జీవుడా! ఎక్కడైనా 'అసంగము' అగు చైతన్యమునకు, జడమగు పదార్థములకు సంబంధం ఉంటుందా చెప్పు? నీవు శుద్ధమగు చైతన్యమువే గానీ, జడమగు శరీరములు కావు, ఇంద్రియాలు కావు. ఇంద్రియానుభవాలు కావు. అట్టి ఆత్మస్వరూపుడవగు నీకు ఈ శరీరాదులతో సంయోగం ఏర్పడటమేమిటి?

కనుక; "నేను శరీరరూపుడను గాను. నా యందు శరీరాదులు లేవు. నేను ఈ శరీరపరిమితుడను కాను. శరీరం కంటే ముందే ఉన్నట్టి నేను శరీరానికి మాత్రమే పరిమితుడనై ఉండేదెట్లా?"...అని ఎందుకు భావించరాదు? అట్లు భావించినపుడే నీవు ఇంద్రియాతీతమగు

స్వస్వరూపమును గాంచగలుగుతావు. అట్లా కాకుండా, ఇంద్రియానుభవ మాత్రమైనట్టి ఈ దృశ్యములోని పదార్థములు, ఇవి కలుగజేయగల సుఖదుఃఖములు... వీటన్నిటిపై నమ్మకం కలిగి ఉంటే "అసంబంధితము - దివ్యము - పరిశుద్ధము - నిత్యోదితము"... అగు నీ వాస్తవ స్వరూపమును నీవు ఎట్లు గాంచగలవో మాకు అర్థమగుటలేదు. ఈ శరీరాదులు, తదితర దృశ్య పదార్థములు స్థిరములయినా, కాకున్నా నీవు వీటి పట్ల 'అపేక్ష' పొందవలసిన పనేముంది?

నీవు ఒక జడవస్తువు కాదే! సంకల్పములను కూడా రచించగల చైతన్యమూర్తివి కదా!

బుద్బుదము వలె చంచలములైన ఈ దేహములు నశించిపోయేవే కనుక, వాటి యందు ఆసక్తి దుఃఖములనే కలుగజేస్తున్నాయి.

1) "ఉత్పత్తి-వినాశనము" అను రెండిటితో కూడుకొన్న ఈ దృశ్యజగత్తునందు "ఇవియే నేను, లేక ఇవి నావి" అను దోషముతో భావావేశము పొందటం;

2) ఆత్మను జగత్ స్వభావయుక్తంగా చూడటం... (లేక, ఆత్మయే వాస్తవ స్వరూపంగా గల సహజీవుని భౌతిక పరిమిత దృష్టితో చూడటం)...

... ఈ రెండూ కూడా బంధము కలిగించుటకే కారణమగుచున్నాయని సర్వజనులకు గుర్తు చేస్తున్నాను. స్థిర-అస్థిర స్వభావయుక్తములైనట్టి ఆత్మ-జగత్తులకు "కొండ-నురుగు"ల వంటి సంబంధము మాత్రమే కలదు.

సమస్తమునకు కర్తయగు ఆత్మ అకర్తయే అయి ఉన్నది. అది ఏమీ చేయుట లేదు. నాటక రంగంలోని దీపంలాగ అన్నిటినీ ప్రకాశింపజేస్తూ కూడా ఉదాసీనంగా ఉంటోంది. సూర్యుడు ఉదయించిన తరువాత, ఇక ప్రాణులు నిదురలేచి, తమ దినచర్యలు ప్రారంభించు చున్నారు కదా! కాని దినచర్యలకూ సూర్యునికి సంబంధం ఏమి ఉన్నది? ఉదయం నుండి సాయంకాలం దాకా జరిగిపోతున్న ఆయా రోజువారీ కార్యక్రమముల దృష్ట్యా సూర్యుడు సర్వదా అకర్తయే కదా! ఆత్మ కూడా ఏమీ ఒనర్చుట లేదు. అది అన్నిటికీ కారణమగుచూ కూడా, సర్వదా 'స్వయంప్రతిభ' యందు ప్రతిష్ఠితమై ఉండి ఉంటోంది. అది చలింపకయే ఉంటూ సర్వమును చలింపజేస్తోంది.

❖❖❖

3. భ్రమచేతనే జగదుత్పత్తి

నదీతీరం స్వభావయుక్తంగానే ఇసుకతో ఉంటుంది కదా! ఈ జగత్తు కూడా స్వభావంగానే జీవుని పట్ల ప్రకటితమగుచున్నది. ఎటు పల్లం ఉంటే నీరు అటు ప్రవహించటం సహజం. అట్లాగే జడ-చేతనముల సంయోగమాత్రం చేత ఈ జగత్తు ఆకస్మికంగా ఉత్పన్నమైనది అగుచున్నది. అంతేగాని, దీనికి కర్త అంటూ ఎవరూ లేరు.

ఆత్మయొక్క సన్నిధానం చేతనే దీనికి ఉనికి ప్రాప్తిస్తోంది. లేదా సర్వప్రమాణములకు అతీత మగు శుద్ధచిత్తము దృష్ట్యా ఇది లేదని కూడా గ్రహించబడగలదు.

ఓ రామచంద్రా! ఏది ఏమైనప్పటికీ ఈ 'దేహము' మొదలైన పదార్థములందు "ఇదియే ఆత్మ" అని తలచటం ఎవ్వరికీ ఏమాత్రం తగదు. వేగంగా గాలిలో వృత్తాకారంగా త్రిప్పునప్పుడు ఏర్పడు వృత్తముపై లేక, స్వప్నములోని కొండ, మనిషి మొదలైన వాటిపై అపేక్ష కలిగి ఉన్నామనుకో, చీకట్లో ఏదో ఆకారం చూచి "అది దయ్యము యొక్క కదలికలే" అని తలచామనుకో... అవన్నీ అర్థంలేని పనులే కదా! ఆకస్మికంగా ఎక్కడో దూరదేశంలో కొద్దిక్షణములు నీ ప్రక్కన నిలబడి, అటుపై ఎటో వెళ్ళిపోవుచున్న నూతన వ్యక్తితో నీకు స్నేహం ఎట్లా కుదురుతుంది? భ్రమచే ఉత్పన్నమైన ఈ జగత్తు విశ్వాసపాత్రం కాదు. ...అట్లే ఈ శరీర విషయం కూడా.

శ్రీ రాముడు: స్వామీ! ఈ జగత్తు యొక్క అభావన జీవమాత్రులమగు మాకు సాధ్యమే నంటారా?

శ్రీ వసిష్ఠ మహర్షి: "చంద్రునిలో ఉష్ణత్వము, సూర్యునిలోని శీతలత్వము, మృగతృష్ణలో జలత్వము వాస్తవము కావు" అను భావన ఎంత సహజమో, ఈ జగత్తునందు భావనారహితుడై ఉండటం కూడా అట్లే సహజం. భావనలు కలిగియుండుటయే 'శ్రమ' కాని, కలిగి యుండకుండుట శ్రమ కాదు. కనుక భావనారహితుడవై ఉండటం అభ్యాసపరుడవగు నీకు తప్పక సుసాధ్యమే!

ఇక ఈ జగత్తులోని పదార్థజాలమంటావా?... దీనిని 'ఊహ'లోని కట్టడములవలె, స్వప్నములోని జనసమూహమువలె, ఇంద్రజాలములోని సంఘటనలవలె ఉద్వేగరహితుడవై, అంతయు తెలిసియే ఉన్నవాడై ప్రశాంతచిత్తముతో వీక్షిస్తూ ఉండు. అంతేగాని భావనామయమగు ఈ ప్రాపంచిక విషయములందు విశ్వాసము కలిగియుండవద్దు. ఏదైతే నీయొక్క 'పరమార్థ స్వస్వరూపము' అయి ఉన్నదో... అద్దానినే సర్వదా భావించుచు, ఈ జగత్తునందు లీలామాత్రంగా విహరిస్తూ ఉండు.

❖❖❖

4. సన్నిధాన మాత్రం (Mere presence)

సమస్త పదార్థముల అభ్యంతరమయిన ఆత్మవస్తువే నిత్యసత్యమై యున్నది. సర్వ కర్తృత్వ-అకర్తృత్వ భావనలను, సర్వ ఇచ్ఛలను తొలగించుకో! అప్పుడు శేషించు పారమార్థిక రూపమును గ్రహించు. అటుపై యథారీతిగా ఈ జగత్తులో విహరించు. ఉదాసీనుడవై, ఇచ్ఛారహితుడవై, వ్యధారహితుడవై వ్యవహరించు.

ఇదం సన్నిధిమాత్రేణ నియతిః పరిజృంభతే ।
దీపసన్నిమాత్రేణ నిరిచ్ఛైవ ప్రకాశతే ॥ (సర్గ 56, శ్లో 27)

"ఆత్మచైతన్యమే" అయి ఉన్న నీ యొక్క 'సన్నిధానం' మాత్రం చేత నియతి ఈ జగద్వ్యవహార రూపంలో ప్రవర్తిస్తోంది. దీపము యొక్క ప్రభావము చేత ప్రకాశము దశదిశల విస్తరిస్తోంది! ఆకాశంలో మేఘమును చూచినంత మాత్రం చేత కొండమల్లెపూవు వర్షధారల భావనచే స్వయంగా వికసిస్తోంది. ఆత్మసన్నిధానమాత్రం చేతనే ముల్లోకములు ఉత్పన్నమౌతున్నాయి.

సర్వేచ్ఛారహితే భానౌ యథా వ్యోమని తిష్ఠతి ।
జాయతే వ్యవహారశ్చ సతిదేవేతథాక్రియా ॥

అదిగో, సూర్యభగవానుని చూడు. అతడు ఏ 'ఇచ్ఛ' లేకుండానే ఆకాశంలో ప్రకాశిస్తున్నంత మాత్రం చేత ఈ జగత్తులో పూలు-చెట్లు-జీవులు అనేక ప్రయోజనములు పొందుతూ జీవిస్తున్నారు కదా! పరమాత్మ నిష్క్రియుడై ఉండి ఉండగా, అతని సత్తామాత్రం చేత ఈ జగత్తు, ఇందలి వ్యవహారములు సంభవిస్తున్నాయి.

ఓ రామా! నీవు పరమాత్మయే స్వరూపముగా కలిగి ఉన్నావు. ఈ శరీరాదులు, పదార్థముల నీవు కావు. రత్నం ప్రకాశిస్తూ ఇచ్ఛారహితంగా తన కిరణపుంజములను తదితర వస్తువులవైపు ప్రసరింపజేస్తోంది. అయితే, "నేను ఈ వస్తువులను మాత్రమే ప్రకాశింపజేస్తాను... ఈ ప్రక్క వస్తువులపై కిరణములు పంపను"... అని అనుకుంటోందా? లేదు, నిర్లిప్తుడు, నిత్యుడు అగు పరమాత్మ యొక్క సత్తచేతనే జగత్సమూహములు ఉత్పన్నమౌతున్నాయి.

ఆత్మయందు కర్తృత్వ, అకర్తృత్వములు రెండూ ఉన్నాయి. ఇది ఇచ్ఛారహితం కాబట్టి "అకర్తయే". ఆత్మ సన్నిధానంలో మాత్రమే ఇదంతా జరుగుతోంది కాబట్టి "కర్తయే" కూడా!

❖❖❖

5. ఆత్మ అన్నివేళల అకర్తయే

ఇంద్రియములకు విషయము గానందువలన సత్యస్వరూపమగు పరమాత్మ దేనికీ కూడా కర్తగాని, భోక్తగాని కానేరదు. అయితే, ఇంద్రియములందు అంతర్గతంగా 'సత్త' కలిగియున్నదేది? అదియే కదా! అందుచేతనే "కర్త-భోక్త కూడా ఆ పరమాత్మయే"... అని శాస్త్రకారులు కొన్నిచోట్ల నిర్ద్వంద్వంగా నిర్ణయించి చెప్పుచున్నారు. ఇది దృష్టిలో పెట్టుకొని సాధనకొరకు రెండు మార్గాలు ఏర్పడి ఉంటున్నాయి.

1. మహాకర్త - "సర్వమునకు కర్త ఆత్మయే. అట్టి ఆత్మయే నేను"

2. మహాఅకర్త - "ఆత్మకు ఏ క్షణమందును కర్తృత్వ-భోక్తృత్వములు లేవు. అట్టి పరిశుద్ధ స్వరూపమగు ఆత్మచైతన్యమునే నేను."

ఈ రెండిటిలో నీకు ఏది శ్రేయమని, అనుకూలమని బాగున్నదనీ అనిపిస్తే అట్టి భావనను దృఢంగా ఆశ్రయించు. "సమస్త పదార్థములందు వ్యాపించి ఉన్నట్టి చిత్స్వరూపుడనగు నేను సర్వదా అకర్తనే"... అను భావన కలిగి, ప్రాప్తించిన కార్యములను నిర్వర్తిస్తూ ఉండు. అప్పుడిక కర్మలు చేస్తున్నప్పటికీ నిర్మలుడవై, కర్మలచే దోషము పొందక ఉంటావు. "శుద్ధ స్వరూపుడనగు నేను ఏమియు ఒనర్చుటలేదు" అనే నిశ్చయము కలవాని చిత్తము ప్రవృత్తిరహితం అవుతుంది. ప్రవృత్తి రాహిత్యము కారణంగా చిత్తము వైరాగ్యం పొందుతుంది. భోగముల పట్ల అపేక్ష లేనప్పుడు అట్టి జీవుడు అకర్మపరుడే అవుతాడు.

"నేనెప్పుడూ అకర్తనే కదా..." అను దృఢభావనచే పరమ అమృతమువంటి సర్వసమత్వమే శేషించగలదు. లేక "అంతయు నేనే ఒనర్చుచున్నాను" అను మహాకర్తృత్వాభిమానమునందు స్థితి పొంది ఉంటావా...! అది కూడా మంచిదే.

శ్రీరాముడు: ఈ లోకంలో జ్ఞానులగు ఉత్తముల భావన మరియు అవగాహన ఏ రూపంలో ఉంటున్నాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి: "శుద్ధ స్వరూపుడనగు నేను ఈ జగద్భ్రమను పొందవలసిన పనేమున్నది? నాకంటే వేరైనదేదీ ఎక్కడా సంభవించటమే లేదు కదా! ఇక నాకు రాగమేమిటి? ద్వేషము దేని మీద?" అను భావనయందు వారు ఉంటున్నారు. ఇక "ఈ సర్వమునకు కారకుడు ఎవరు?"... అను ప్రశ్నకు వచ్చినప్పుడు, "తదితర జనులచే దగ్ధం కావించబడిన నా పూర్వశరీరములకు, ఈ జనులచే లాలించబడుచున్న ఈ వర్తమాన శరీరమునకు కూడా నేను మునుముందుగానే ఉన్నాను. సంకల్పములకు ముందే ఉండియుండి, సర్వసంకల్పములను అంగీకరించువాడను, ఆశ్రయించువాడను నేనే!"... అని గ్రహిస్తున్నాడు. అప్పుడు సర్వదుఃఖములు శమించుచున్నాయి. "నా ఈ సుఖదుఃఖముల విస్తారమునకు హేతువగుచున్న ఈ జగత్తు యొక్క ఉత్పత్తి - వినాశనములకు కర్తను నేనే" అని నిశ్చయించుకొనుటచే అతడి సుఖ-దుఃఖములు శమించుచున్నాయి. "నా ఈ సుఖదుఃఖముల విస్తారమునకు హేతువగుచున్న ఈ జగత్తు యొక్క ఉత్పత్తి - వినాశములకు కర్తను నేను" అని నిశ్చయించుకొనుటచే అతడు సుఖ-దుఃఖములను రహితం చేసుకోగలుగుచున్నాడు.

భావనయొక్క ఆరంభమే జగత్తు యొక్క ఉత్పత్తి. భావనను అధిగమించినప్పుడు జగత్తు రహితమగుచున్నది.

❖❖❖

6. ఆత్మ సమష్టిరూప కర్తృత్వము

వసిష్ఠ మహర్షి:

అయం కర్తేతి మత్వాన్తః కః ఖేదోల్లాసయోః క్రమః ।
ఖేదోల్లాసవిలాసేషు స్వాత్మకర్తృతయైతయా ॥ (శ్లో 41, సర్గ 56)

స్వయమేవ లయం యాతే సమతైవావశిష్యతే ।
సమతా సర్వభూతేషు యాసౌ సత్యావరాస్థితిః ॥ (శ్లో 42, సర్గ 57)

ఓ రామచంద్రా! నీవు ఎల్లప్పుడూ సమష్టి రూప కర్తృత్వము స్వీకరించుట చేతనే పవిత్రుడవు కాగలవు. అట్టి కర్తృత్వముచే సుఖదుఃఖములు స్వయముగా విలీనమైపోతాయి. ఆపై సమత్వమే శేషిస్తుంది. సర్వభూతములపట్ల సమభావమే సర్వోత్తమ స్థితి అయి ఉన్నది.

అట్టి సమత్వము నందు స్థితి పొందువాడు ఇక మరల ఎన్నటికీ జన్మలు పొందడు. అనగా అతని యందు "నేను జన్మించాను, మరణించుచున్నాను" వంటి భావాలు ఉండవు. 'పుడుతున్నాను – పెరుగుచున్నాను – చచ్చుచున్నాను'... అను భావాలన్నీ శరీరముతో తాదాత్మ్యం పొందువారికి మాత్రమే ఉంటోందని గుర్తు చేస్తున్నాను.

కాబట్టి రామచంద్రా! క్రమంగా కర్తృత్వ–అకర్తృత్వములన్నిటినీ త్యజించివేయి. మనస్సును కూడా నశింపజేయి. ఇకప్పుడు ఏ శుద్ధతత్వముంటుందో అద్దాని యందు సుస్థిరుడవుకమ్ము.

అహంకారం, దేహం, ఇంద్రియాలు నేను కాదు. వీటి వేటికీ నేను సంబంధించిన వాడను కాను. వాటి క్రియలు నాకు సంబంధించినవి కావు. అందుచేత నేను సర్వదా నిష్క్రియుడనే"... అని గ్రహిస్తూ "ఆత్మ" కు ఆపాదించబడుచున్న కర్తృత్వములను నిషేధించు.

❖

శ్రీరాముడు: మహర్షీ! ఈ దృశ్యపదార్థము త్యజించబడగా అప్పుడిక ఆత్మలాభము స్వయముగానే చేకూరుతుంది కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి: ఇక్కడ ఒక విషయం గమనించవలసి ఉన్నది. ఈ దృశ్యవస్తువులను నిరసించిన మాత్రం చేత సరిపోదు. అదే తరుణంలో ఆత్మను భావనచేస్తూ ఉండాలి. అప్పుడే తృప్తికరమగు పూర్ణత్వము లభిస్తుంది.

"తత్వమసి" భావన చేయుటం - 'త్వమ్'(you)ను "ఇది లేదు, ఆత్మ మాత్రమే ఉన్నది" అను నిషేధంతో బాటుగా..., 'తత్' అను శబ్దమును లక్ష్యమై ఉన్నట్టి 'ఆత్మ' భావించబడుతూ ఉండాలి.

ఆత్మను భావించటమంటే ఏమిటి? - "నేను ఆత్మనే అయి ఉన్నాను... కనుక స్వతహాగానే నిత్యుడను, పూర్ణుడను, అఖండుడను, శుద్ధుడను" ...అను భావనను క్రమంగా ఆశ్రయించుటయే ఆత్మను భావన చేయటం సుమా! అంతేకాదు. ఎదురుగా కనిపించే ప్రతిజీవిని చూస్తూ ఉండగానే, "నీవు పరమాత్మ స్వరూపుడవే–తత్వమసి" ...అను భావనను అనుక్షణికంగా అభ్యసిస్తూ రావటం.

ఆకాశం మేఘాలచే కప్పబడినప్పటికీ, స్వతహాగా శుద్ధమైనదైనట్లుగానే... ఈ సంకల్పాలు ఏర్పడినంత మాత్రంచేత అతడు అశుద్ధుడగుట లేదు. 'నేను–నీవు–జగత్తు అనునదంతా ఆత్మయే. ఇట్లు ఈ జగత్తుగా ప్రాప్తిస్తున్నదంతా నేనే' అనునట్టి సర్వాత్మకభావము కలిగి ఉండాలి.

దేహాత్మబుద్ధి, దేహభావా-స్పృశ్యం - "నేను ఈ శరీరమును... శరీరపరిమితుడను... శరీరముతో ప్రారంభమగుచున్నాను... శరీరం నశించుటచే నేను నశించుచున్నాను"... అను ఈ జీవుని యొక్క బుద్ధియే దేహాత్మ బుద్ధి. ఈ దేహాత్మబుద్ధియే సర్వనరకముల స్వరూపమైయున్నది.

✺ నిత్యుడు = ఎల్లప్పుడూ ఉండేవాడు; పూర్ణుడు = ఇక క్రొత్తగా పొందవలసినదేదీ లేనివాడు.
అఖండుడు = వేరువేరు జీవులుగా విభాగించబడనివాడు; శుద్ధుడు = స్వతహాగానే దోషరహితుడు.

అందుచేత, ఏ ప్రయత్నంచేసి అయినా సరే, “నేను ఈ పాంచభౌతికదేహమును”... అను భావనను త్యజించివేయాలి. ఉత్తముడు, పవిత్రుడు అగు ఒక గృహస్థుడు ఏవో తళుకు బెళుకులను చూచి, ఆ మాత్రానికి ఒక పరాయిస్త్రీతో సాన్నిహిత్యం కోరుకుంటాడా? లేదు కదా! అట్లు కోరుకోక పోవుటయే అతనికి సహజమైన విషయం. అట్లాగే, సర్వనాశనం చేకూరనీ; మృత్యువు వాటిల్లనీ... ఈ దేహాత్మ బుద్ధిని ఎన్నడూ, ఎట్టి పరిస్థితులలోనూ స్పృశించరాదు. దేహాత్మభావనయే (లేక) దేహాత్మదృష్టియే విశుద్ధాత్మను కప్పిపెట్టి ఉంచుచున్నదని గ్రహించు.

ఉదేతి పరమాదృష్టిర్జ్యోత్స్నేవ విగతాంబుదా ।
యయాభ్యుదితయా రామ తీర్యతే భవసాగరః ॥ (శ్లో 48, సర్గ 56)

దేహాత్మబుద్ధిని త్యజించివేసిన మరుక్షణం మేఘరహితమగు చంద్రుని చంద్రికవలె సర్వోత్తమ మగు ఆత్మదృష్టి ఉదయిస్తోంది. అప్పుడే జీవుడు సంసారసాగరము నుండి తరించగలుగుచున్నాడు.

ఆత్మయందు స్థితి - ఓ రఘురామా! ఇప్పుడే, ఇక్కడే రెండు విషయాలు సుస్పష్టంగా, నిర్దుష్టంగా, ఎట్టి అనుమానాలకు తావివ్వకుండా ఎరుగుము.

1) ఈ దేహాదులు నేను కాదు; .2) జడము భావానుసరణము అగు దృశ్యము నేను కాదు. తద్వారా, పరిచ్ఛిన్నములగు సుఖదుఃఖములను ఆశ్రయించనివాడవు అవుతావు. అదే సమయంలో ఇట్లు నిర్ణయం చేసుకొని ఉండు:

1) ఈ దృశ్యముకంటే విలక్షణమై, లోకసిద్ధమై, స్వస్వరూపమునకు వేరు కానట్టిదయిన “శుద్ధచైతన్యము” నే నేను. నేనైన వస్తువంటూ ఈ దృశ్యజగత్తులో ఎక్కడా లేదు.

2) ఈ బ్రహ్మాండమంతా నేనే. దృశ్యముగా కనిపిస్తున్న సమస్తమునకు కర్తను నేనే.

ఇట్లు తిరస్కరించవలసిన ‘దేహాత్మభావన’ను తిరస్కరిస్తూ అభ్యసించాలి. స్వీకరించవలసిన ‘అహమాత్మా’ భావనను స్వీకరిస్తూ అభ్యసించాలి. ఈ రెండింటినీ మేళవించుకుంటూ ఈ భూమిపై సంచరించు. లేదా, ఈ జగత్‌వ్యాహ్యాళి త్యజించి ఒక ప్రదేశంలో సమాధి నిష్ఠుడవై యుండు. అది నీ ఇష్టం. ఎందుకంటే, ఉత్తమ భావన అవధరించిన తరువాత ఆ రెండిటియందు భేదముండదు.

ఉత్తమ నిశ్చయము కలవాడవై బ్రహ్మపదమున సర్వదా స్థితి కలిగియుండుము. ఉత్తమ సాధువులగు బ్రహ్మవేత్తలు ఆ విధంగా ‘ఆత్మస్థితి’ని ఆశ్రయించి, ఆపై తమ సంచారముచే ఈ ముల్లోకములను పావనం చేస్తున్నారు. అట్టివారు వందనీయులు అగుచున్నారు.

❖❖❖

7. పూర్ణాశయస్స్వరూపము

శ్రీరాముడు: మహాత్మా! ఉత్తమ యుక్తులచే మీరు చెప్పుచున్నదంతా సత్యమైనదని, అత్యుత్తమోత్తమ మైనదనీ అనటంలో ఏ మాత్రం సందేహం లేదు. మీరు చెప్పినట్లు “పరమాత్మ కర్త అయినప్పటికీ అకర్త, భోక్త అయినప్పటికీ అభోక్త”... అయి ఉన్నాడు. అతడు సర్వేశ్వరుడు, సర్వవ్యాపి, చిన్మాత్రమే స్వరూపముగా కలవాడు కూడా.

అతడే నిర్మలపదము! సర్వలక్షణముల సారము కూడా అతడే! ఈ భూమి మీద చతుర్విధ ప్రాణులు నివసించుచున్నట్లే ఆ దేవదేవుడు సర్వభూతముల అంతరంగమున నెలకొనియున్న వాడై సమస్తము అగుచున్నాడు. నాయందు, మీయందు, సర్వులయందు ఉన్నది అతడే. అతడు నాకంటే వేరుగా లేడు. లేదా, నేను ఆయనకంటే వేరుగా లేను. కనుక, నేనే సర్వదా అన్నిజీవరాసులందును సమముగా ఉండియున్నాను.

హే మహాత్మా! మీ వాక్యామృత ప్రభావం చేత నా హృదయమందు ఇప్పుడు బ్రహ్మము ప్రకాశించుచున్నది. తమ వచనములచే నేను దుఃఖరహితుడనయ్యాను. దేవదేవుడగు ఆ పరమాత్మ ఇచ్ఛారహితుడు. ఉదాసీనుడు కదా! ఆయన దేనికైనా కర్తగాని, భోక్తగాని ఎట్లా అవుతాడు? కాడు. కాని తనయొక్క సత్తామాత్రం చేత సర్వలోకాలకు అస్థిత్వము ప్రసాదిస్తున్నాడు. అతని సంకల్పమే ఈ సృష్టి. కనుక, దీనికి కారకుడు, కర్త, భోక్త కూడా అతడే. ఇక ఈ దృశ్యమో, ఇచ్ఛారహితుడు, ఉదాసీనుడు అగు పరమాత్మ యొక్క చమత్కారమే!

❖

హే మహర్షీ! గురువర్యా! నాకు ఎందుకో ఇంకా ఒక్క గొప్ప సందేహం తొలగుటయే లేదు. అత్యంత వినమ్రుడనై ఆ సంశయమును మీ ముందు ఉంచుచున్నాను.

1. ఈ జగత్తు సత్–అసత్ రూపమైనది.

2. సమిష్టిరూపమగు జగత్తే నేను. అంతేగానీ, ఒక వ్యష్టిరూపమాత్రుడను కాను.

ఈ రెండూ మనకు నిర్వివాదాంశమే. ఇక ఈ ప్రపంచం విషయానికి వస్తే ఇది 'సమదృష్టిచే ఏకం – వ్యష్టిదృష్టిచే అనేకం'... అయి ఉన్నది. ఇటువంటి 'వ్యష్టి–సమష్టి'... అనబడు 'అనియతం, కల్పనామయం' అగు సృష్టి పరమాత్మయందు ఎట్లా ఉన్నది? ఎందుచేత ఉన్నది? ఎవరి కొరకు ఉన్నది?

పరమాత్మ అద్వితీయము, స్వయంప్రకాశకము, మోహాంధకారరహితము, నిర్మలము కదా! సూర్యుని యందు అంధకారం ఎట్లా ఉంటుంది?... పరిశుద్ధతత్వమగు పరమాత్మ యందు ఈ జగత్తు ఉండుట ఏమిటి? ఏ రూపంగా ఉంటోంది?

"మాయతో కూడిన బ్రహ్మము నందు మొట్టమొదట అవ్యక్తరూపమున ఈ జగత్తు ఉండి ఉన్నది. ఆ తరువాత వ్యక్తరూపమున కనపడుచున్నది"... అని అంటారా? అట్లా అయితే 'అద్వితీయం'గా నిర్వచించబడుచున్న పరమాత్మయందు అప్రకటన స్థితిమయంగా ఈ జగత్తు ఏ రూపంలో ఎట్లు దాగి ఉన్నది?

ఈ విషయం ఎంత ఆలోచించినా నాకు అర్థమగుటలేదు. దయచేసి వివరించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రాఘవా! నీ ప్రశ్నకు సరి అయిన సమాధానం ముందు ముందు నిర్వాణ ప్రకరణంలో విశ్లేషణ పూర్వకంగా వివరించబడబోవుచున్నది. నిర్వాణ ప్రకరణ సమాచారం వినుచున్నప్పుడు ఈ జగత్తు యొక్క యథార్థ రూపమేమిటో నీవే తప్పక గ్రహిస్తావు. అప్పుడు

"మోక్షోపదేశం" మనకు విషయము అవుతుంది. అఖండాకారమగు ఆత్మ గురించిన విశేషములన్నీ గ్రహిస్తే గాని, మోక్షము గురించిన సిద్ధాంతాలు శిష్యుని ముందు ఉంచటానికి కుదరదు. అతడు సిద్ధాంతాలు స్వీకరించాలంటే మనస్సులోని సంకుచితత్త్వమునకు సంబంధించిన అనేక పరిమిత దృష్టులు తొలగాలి. ప్రస్తుతం మనం పరిమిత దృష్టులను తొలగించగల విశేషాలన్నీ చెప్పుకుంటూ వస్తున్నాం.

వయసులో ఉన్నవాడు మాత్రమే స్త్రీల విరహమయ గీతములను విని అర్థం చేసుకో గలడు గాని, ఒక ఆరేళ్ళ బాలుడు ఏం అర్థం చేసుకోగలడు? అందుచేత, మరికొంత అవగాహన తరువాత గాని నేను నీకా విషయం ప్రతిపాదించి చెప్పకూడదు. "ఉత్తమ ఆత్మ సాక్షాత్కార జ్ఞానము"నకు సంబంధించిన నిర్దుష్టప్రవచనాలు అల్పబోధనగలవారికి ముందు గానే చెప్ప కూడదు"... అను నియమమును గురువులం మేము పాటిస్తూ ఉంటాం. ఎందుకంటే అపరిపక్వ దృష్టి, సమాచారము గలవారి పట్ల మా సిద్ధాంత ప్రవచనాలు వ్యర్థం కావటమో, లేక విపరీతార్థములకు దారి తీయటమో జరుగవచ్చు కదా!

సరైన ఋతుకాలంలో ఫల-పుష్పాలు శోభిస్తున్నట్లు, సరైన కాలంలో సరైన బోధ చేయుటమే ఉచితం. శుభ్రమైన వస్త్రమునకు రంగు వేస్తే ఆ రంగు చక్కగా హత్తుకుంటుంది. వివేకము, వైరాగ్యము... ఉత్తమ వస్తువుపట్ల లక్ష్యశుద్ధి, విచారణ ఉన్నవారి విషయంలోనే 'ఆత్మజ్ఞానము' యొక్క పరాకాష్ఠ వాక్యాలు సఫలీకృతం అవుతాయి.

❖

అయినా కొంచెము చూచాయగా ఆయాచోట్ల నీ ప్రశ్నకు సమాధానం చెప్పుచూనే వస్తున్నాను. ఉదాహరణకు "భార్గవోపాఖ్యానం'లో కొంతవరకు 'బ్రహ్మమునందు ఈ జగత్తు ప్రకటన, అప్రకటన సమయములందు ఎట్లు ఉన్నది... అన్నది వివరించాను. అయితే సర్వ సంశయములు తొలగునంతటి విస్తారంగా చెప్పియుండలేదు. అందుచేతనే కాబోలు, ఈ విషయమై తగినంత స్పష్టంగా నీవు ఎరుగలేదు.

ఇక్కడ మరొక ముఖ్యమైన విషయం. నీవు నీ ఆత్మ యొక్క పరిశుద్ధత్వమును, అప్రమేయత్వమును, తదితర లక్షణములను గ్రహించిన తరువాత నీయందు అఖండాత్మబోధ స్వయంగా కలుగుతుంది. ఆ తరువాత నేను చెప్పకపోయినా కూడా నీ ప్రశ్నకు సమాధానం నీవే ఎఱుగగలిగి ఉంటావు. ఇందు సంశయమేమీ లేదు.

ఒకటి అజ్ఞాన విషయం గాని, లేక సుజ్ఞాన విషయం గాని... ఆ విషయమును ఎరుగు చున్నది ఎవరు? ఆత్మయే కదా! అందుచేత జ్ఞానస్థితి యందు ఆత్మబోధచే ఆత్మయే సుప్రసన్నమై ఆత్మ గురించి ఎరుగుచున్నది.

❖

నీకు ఇంతవరకు 'కర్తృత్వం-అకర్తృత్వం' ల గురించి 'భోక్తృత్వం-అభోక్తృత్వం' ల గురించి కూడా చెప్పియున్నాను కదా! నీ ప్రశ్నకు సమాధానం ఆ చర్చలోనే కొంత చూచాయగా అయినా

గ్రహించవలసియున్నది. అయినప్పటికీ ఎందుకో నీవు అఖండాత్మస్వరూపాన్ని ఎరుగకయే ఉన్నావు. ఎందుచేత?... దీనిని బట్టి ఇంకా దృశ్యవాసన శమించవలసి ఉన్నదనియే తెలుస్తోంది.

ఒక్క విషయం మనం గుర్తు పెట్టుకోవాలి. వాసనలచే ఆక్రమించబడువాడే 'బద్ధుడు'. వాసనాక్షయమే 'మోక్షము'. "నేను మరొకటి పొందవలసి యున్నది..." అని భావన చేయటయే వాసన యొక్క వృత్తిరూపం. అందుచేత నీవు "మోక్షేచ్ఛ"ను కూడా విడిచిపెట్టు. బంధం ఉన్నప్పుడే 'మోక్షము' అనే ప్రసక్తి ఉంటుంది. "నాకు బంధము లేదు" అని ఎవరు గ్రహిస్తారో వారికి ఇక 'మోక్షము' యొక్క ప్రసక్తి ఎక్కడిది?

❖

అందుకుగాను మొట్టమొదటగా ఈ దృశ్య విషయములచే పరిపూర్ణమైనట్టి రాజసిక తామసిక వాసనలను క్రమక్రమంగా వదలుకొంటూ రావాలి. ఆ సమయంలోనే 'మైత్రి' మొదలైన శుభవాసనలు గ్రహించు. శుభవాసనలు ప్రయత్నపూర్వకంగా ఆశ్రయిస్తూనే, కాలక్రమంగా వాసనారాహిత్యము వైపు దృష్టి సారించు. అంతఃకరణంలో ఏ విధమైన 'ఇచ్ఛ' లేనివాడవై క్రమ క్రమంగా 'సమ్యక్‌జ్ఞానయుక్తము' అయినట్టి స్థితిని అభ్యసించుచూ రమ్ము. దృశ్యవాసనా స్థానంలో "చిన్మాత్రము" అనే వాసనచే పూరించు. "అంతఃశాంతము"తో కూడిన పరిపూర్ణభావముచే "నేను ఈ దేహమంతా ఆత్మరూపుడనై నిండి ఉన్నాను... అదేరీతిగా, ఎవరెవరితో సంభాషించుచున్నానో, అట్టి ఈ సర్వజీవులందు నేనే మమాత్మ స్వరూపముచే పరిపూర్ణుడనై ఉన్నాను"... అను మాధుర్యమును ఆస్వాదిస్తూ ఉండు. 'మనస్సు-బుద్ధి' ల సంచలనరూపమగు వాసనల పట్ల ఉపేక్ష, మౌనములను అభ్యాసం చేస్తూ ఉండు. క్రమంగా మనోబుద్ధులు పరిత్యజించబడగా అప్పుడు శేషించు ఆత్మ స్వరూపం నందు సుస్థిర సమాధానం కలిగియుండు. ఆ తరువాత ఏ అహంకారం చేత... "నేను వాసనలు పరిత్యజిస్తున్నాను" అను నిమగ్నం కలిగియున్నావో... అట్టి ఆ అహం కారాన్ని కూడా పరిత్యజించు. ఎందుకంటే అది కూడా ద్వైత కల్పన నుండే ఏర్పడుతుంది కదా!

❖❖❖

8. తాత్సారం చేయవద్దు

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ మహామతీ! రామచంద్రా! ఓ సర్వశ్రోతలారా! తాత్సారం మాత్రం చేయవద్దు. ఈ మానవజన్మ అత్యంత ఉత్కృష్టమైనదని, ఇది అత్యంత దుర్లభంగా మాత్రమే లభిస్తుందని శాస్త్రములు ఘోషిస్తున్నాయి. ఈ అవకాశమును తగురీతి ఉపయోగించుకోవటమే ఉచితం.

జీవుని యొక్క ఈ అంతరంగంలో ఒక నిబిడాంధకారము చోటు చేసుకుని ఉంటోంది. అందులో "ప్రాణస్పందన - కాలకల్పన - వాసనలు - విషయములు, వాటికి ద్వారము వంటి అహంకారము" మొదలైన దుష్టపిశాచాలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వాటిని నిరోధించాలి, నాశనం చేయాలి. అందుకుగాను "అఖండబ్రహ్మాకారము" అయిన బుద్ధిని పొందాలి.

ఎప్పుడైతే నీవు.. 'విశ్వమునకు అతీతము, కేవల చిన్మయము"... అయినట్టి నీ యొక్క పారమార్థిక స్వరూపమునందు సుస్థిరుడవై ఉంటావో, మరుక్షణం నీయొక్క 'అద్వితీయ బ్రహ్మానంద స్వరూపము' చే ఈ వర్తమాన భవిష్యత్తు లోకములను సర్వదా పావనమే చేయగలవు. అట్టి ముక్త స్వరూపుడవగు నీకు ఈ లోకములు అత్యంత సహజంగానే నీరాజనం పట్టగలవు.

❖❖❖

9. 'ముక్తుడు' అంటే?

శ్రీ వసిష్ఠ మహర్షి: వాసనలన్నీ హృదయము నుండి పారద్రోలి, ఎవడైతే సర్వస్థితులందు చింతారహితుడై ఉంటాడో, అతడే ముక్తుడు. అతడే 'పరమేశ్వరుడు' అని కూడా చెప్పబడుచున్నాడు. సమస్త ఆశలు అంతఃకరణం నుండి పారద్రోలబడగా, అట్టి 'శుద్ధాతఃకరణం'తో కూడిన మనుజుడే విముక్తుడు. అట్టివాడు సర్వలౌకిక వ్యవహారములు త్యజించి 'సమాధి'ని అభ్యసించు చుండు గాక! లేక ఈ ప్రపంచమున వ్యవహరించుచుండు గాక! అతని ముక్తిత్వమునకు వచ్చే లోటేమీ లేదు.

నైష్కర్మ్యేణ న తస్యార్థో, న తస్యార్థో ఽస్తి కర్మభిః ।
న సమాధాన జప్యాభ్యాం, యస్య నిర్వాసనం మనః ॥

ఈ చిత్తము వాసనారహితమైన తరువాత ఆపై ఇక నైష్యర్మ్యములచేగాని, సమాధిచేగాని, జపముచేగాని క్రొత్తగా సంపాదించవలసినదేదీ ఉండదు.

ఓ లోకకళ్యాణస్వరూపా! రామచంద్రా! మేము సమస్త శాస్త్రములను అతి నిపుణతతో విచారించాం... చాలాకాలం ఒకరితో మరొకరం ఆధ్మాత్యశాస్త్రం గురించి పదే పదే సంభాషించుకున్నాం... ఇట్లా ఎన్నోసార్లు శాస్త్రసారములను, పూజ్యుల ప్రవచనములను, స్వానుభవములను బాగుగా వితర్కించి, ఈ ఉత్తమ నిర్ణయానికి వచ్చాం - "వాసనాత్యాగం అవలంబించి ఆత్మస్థితి యందు సుస్థిరులం కావటం... అను పదము కంటే ఉత్తమమైన పదము మరెక్కడా ఏదీ లేదు."

అనేకసార్లు మేము దశదిశలా సంచరిస్తూ అనేకుల తరగతుల వ్యక్తులతో సంభాషించాం. యథార్థ వస్తువగు బ్రహ్మంను ఎరిగినవారు కొందరు మాత్రమే తారసపడుచున్నారు.వారు వాసనా రహితులై ప్రశాంతతతో-సంతోషంతో పరిసరాలను ఆనందపరుస్తూ సంచరిస్తున్నారు. వాసనా రాహిత్యమే ముక్తి.

❖❖❖

10. ఇక్కడ అభిలషింపతగినదేది?

శ్రీ వసిష్ఠ మహర్షి: అసలు ఈ ప్రపంచమునందు 'ఇష్టము- అయిష్టము' అయిన దానికంటే వేరుగా ఏమున్నది? ఇష్ట-అనిష్టముల కొరకే ఈ సర్వజీవులు యత్నించుచున్నారు. చిత్రమేమిటంటే ఈ ఇష్టానిష్టములకంటే భిన్నమైనట్టి 'ఆత్మతత్త్వము' కొరకు అనేకులు యత్నించుటయే లేదు.

ఈ లౌకిక-వైదిక క్రియలు కూడా అనాత్మభూతమగు దేహాదుల కొరకే చేస్తున్నారు కాని, ఆత్మ కొరకై అనేకమంది యోచించుటయే లేదు.

పాతాలే బ్రహ్మలోకే చ స్వర్గే చ వసుధాతలే ।
వ్యోమ్ని కతిపయా ఏవ దృశ్యన్తే దృష్టదృష్టయః ॥ (శ్లో 32, సర్గ 57)

చిదేకరసమగు బ్రహ్మమును సాక్షాత్కరించుకొనిన మహాత్ములు... ఈ బ్రహ్మ-స్వర్గ-భూ-పాతాళలోకములలో... ఎక్కడో గాని తారసపపడుట లేదు.

ఈ జనులలో అనేకులు "ఇది త్యజించాలి... ఇది గ్రహించాలి"... అను వ్యసనముతో కూడుకొనిన త్యాజ్య గ్రాహ్య బుద్ధినే కలిగి ఉంటున్నారే? త్యాజ్య-గ్రాహ్య బుద్ధి శమించినట్టి జ్ఞానులగు మహాత్ముల సంఖ్య అల్పంగానే ఉంటోందే! ఒకడు చక్రవర్తి అయి, ఈ భూమండల మంతా ఏలవచ్చు గాక! లేదా ఇంద్రపదము పొంది 'వృష్టి'కి అధికారి అయి, మేఘములందు ప్రవేశించ వచ్చు గాక! లేక వరుణపదమును పొంది జలమును ఆక్రమించి ఉండవచ్చు గాక! కాదా, యోగసిద్ధులన్నీ పొంది హాయిగా అటూ ఇటూ విహరిస్తూ ఉండవచ్చు గాక...! అయితే మాత్రం ఏం? ఆ జీవునికి శాంతి కరువే అగుచున్నది. ఆత్మప్రాప్తిచే తప్ప మరింక దేనిచేతా కూడా ఈ జీవుడు విశ్రాంతి పొందజాలడు. ఆత్మానుభవం ఇంద్రియధ్యాసను నిశ్శబ్దపరచినవారికే లభిస్తోంది. ఇంద్రియములు అనే శత్రువులను జయించినవారే శూరులు. వారే మహాధీమంతులు.

ఓ జనులారా! ఈ జనన-మరణ రూప జ్వరమును ఉపశమింపజేయ దలచుకున్నారా? అయితే మీరు ఆత్మజ్ఞానులగు మహాత్ములను సమీపించండి. సేవించండి. ఆత్మ సమాచారం సేకరించండి. తరించండి. అంతే గాని ఈ పదార్థముల పట్ల ఏర్పడు ఇష్టాయిష్టములను నెమఱు వేస్తూ చతికిలపడి కూర్చుని ఉండవద్దు. నాయనలారా! ఈ పాతాళ-భూ-స్వర్గ లోకములన్నిటి లోనూ ఉన్నది పంచభూతములే కదా! ఇందలి పదార్థములన్నీ పంచభూతముల సమ్మేళనం మాత్రమే. ఇంక ఆరవ వస్తువు ఏది ఉన్నది? మరి బుద్ధిమంతుడు, ధీరుడు అయినవానికి ఎక్కడకు వెళ్ళినా క్రొత్తగా పొందేదేముంటుంది?

అభిలషింప తగినదంటూ ఇక్కడెక్కడా ఏదీ లేదు. ఏది ఎట్లో - అది అట్లే జరుగుచుండగా, ఇక త్యజించవలసినది మాత్రం ఎక్కడ ఏమున్నది?

ఆత్మజ్ఞానమే మహాశయముగా గలిగినట్టి మహనీయులు ఇక్కడ ఊరకే కాలం వ్యర్థ పరచుకోరు. వారు వేదములందు ప్రవచించబడిన 'బ్రహ్మము' యొక్క స్వభావాదులు ఏమిటో గ్రహిస్తున్నారు. క్రమక్రమంగా బ్రహ్మముతో 'అభేదము' సాక్షాత్కరించుకుంటున్నారు. అందుచేత వారికి ఈ ప్రపంచమంతా గోష్పాదజలం (ఆవు కాలిగిట్ట నేలను తాకుతుంటే ఏర్పడిన స్వల్ప గుంటలోని జలం) వలె అత్యంత సులభంగా తోచుచున్నది. ఎవరైతే బ్రహ్మజ్ఞులచే, శాస్త్రములచే చెప్పబడుచున్న యుక్తులను దూరంగా విడనాడి, విషయానుకూలంగా మాత్రమే వర్తిస్తున్నారో, అట్టివారికి ఈ సంసారము ప్రళయకాల మహాసముద్రము వలె అతి విస్తారంగా కనపడుచున్నది.

విశాలచిత్తులై కొందరు సర్వభేదాభేదభావములను ప్రక్కకు నెట్టి ఆత్మానందమునే అనుభవిస్తూ ఉంటున్నారు. అట్టివారికి ఈ బ్రహ్మాండమంతా చేతికందించినా సరే, ఇందులో ప్రత్యేకత ఏదీ వారికి కనిపించుటలేదు. నూతనమైన ప్రయోజనములేవీ వారికి ఉండుటలేదు. "భావనానుసారంగానే అనుభవం ఉంటోంది... ఇక ఈ వస్తుజాలంలో ఏర్పడే క్రొత్తతన మేమున్నది?"... అని వారు మనలను ప్రశ్నిస్తున్నారు. మరి, మూఢులో... ఇట్టి ఈ అల్ప జగత్తులో రాజ్యము మొదలైన సుఖముల కొరకై లక్షలాది జనుల వినాశనమునకు హేతుభూతములగు "యుద్ధము, మోసము" మొదలైన క్రియలందు ప్రీతిగొని ఉంటున్నారు. మానవజన్మ యొక్క అర్థ, తాత్పర్యాలు ఇవా? కాదు. తత్త్వజ్ఞాని సహజంగానే 'దయాళువు' అగుచున్నాడు. దురహంకారం, దురాశ మొదలైనవి అతనికి తుచ్ఛములుగా, అతి నింద్యములుగా తోచుచున్నాయి.

జ్ఞానుల దృష్టిలో ఈ దృశ్యము లోపల మహత్తర పదార్థమంటూ ఏదీ లేదు. అత్యంత ఉత్కృష్టమైనదిగా భావించబడే బ్రహ్మదేవుని పదమే తీసుకో... అది కూడా మహాకల్పాంతమున నశించబోతోంది, కనుక అల్పమైనదే కదా! "సమస్త ప్రాణులు విలయం కావటానికి, ఉత్పత్తి కావటానికి హేతుభూతమగుచున్న బ్రహ్మపదము కూడా మానసిక వ్యథతో కూడుకొనినదే" అని చెప్పబడుతోంది. అట్టి పదవి అజ్ఞానుల దృష్టిలో గొప్పది కావచ్చునేమో గాని, జ్ఞానుల దృష్టిలో కాదు. జ్ఞానుల దృష్టిలో, "నిత్య-శుద్ధ-ముక్త- అఖండము, అతిసులభము అగు స్వస్వరూపమున సుస్థిరులై ఉండటం" అనేదే అన్నిటికీ మించియున్న పదము. అందుచేత జ్ఞానికి బ్రహ్మదేవుని పదమునందు కూడా 'ఆకాంక్ష' ఉండదు.

తత్వవేత్తల దృష్టిలో ఈ సృష్ట్యాదులచే ఏమీ ఉత్పన్నము కాకయే ఉంటోంది. కనుక, ఈ ముల్లోకములు సంప్రాప్తిస్తే మాత్రం ఆత్మకు క్రొత్తగా వచ్చి చేరేది ఏమి ఉంటుంది? కోల్పోయేదేమి ఉంటుంది? ఇదిగో... ఈ భూభాగం చూచావా? ఇది ఒక వైపు పర్వతములతోను, మరొక వైపు జలముతోను నిండి ఉన్నది కదా! మధ్యలో ఉన్న ఈ భూభాగములోని 'రాజ్యము' అను ఒక స్వల్పస్థలము క్రొత్తగా చేరి జ్ఞానిని పూర్ణునిగా చేస్తుందా? సర్వము ఎరిగిన తరువాత రాజ్యములు ఎంతటివి? భూభాగములు ఎంతటివి? అసలు ఈ శరీరము ఎంతటిది? శుద్ధము, నిత్యము అగు చైతన్యమునకు, అజ్ఞానజనితములైన "నా రాజ్యం - నా భూభాగం - నా వారు"... అనువాటికి సంబంధమెక్కడ? అందుచేత ఆత్మజ్ఞానికి ఈ పాతాళ-భూ-స్వర్గ విభాగములలో ఎక్కడా కూడా అవశ్యం కర్తవ్యమైనదీ - అవశ్యం పొందవలసినదీ ఏదీ లేనేలేదు. సర్వదా సర్వత్రా ఏకత్వమే అతనికి కనబడుచున్నది. అతడు తనకుతానే ఆకాశం వలె విశాలమైన రూపం కలిగి ఉంటున్నాడు. ఎల్లప్పుడు స్వస్థచిత్తుడై ఉంటున్నాడు. దేహసమూహములచే, అనేక పరస్పర వ్యతిరిక్త విషయాలచే నిండియున్న ఈ త్రిలోకములు అతనికి మృగతృష్ణా జలంలాగా, నిర్మలాకాశంలాగా శూన్య రూపంగా ఉంటున్నాయి. అతనికి వీటియందు శాంతము, రమణీయతలు మాత్రమే గోచరిస్తు న్నాయి. అతడు వాటికన్నిటికీ అతీతుడై, ఆపై వాటిని చూస్తున్నాడు. 'ఈ జగత్తులోని పదార్థ జాల మంతా తుచ్ఛము, స్వల్పకాలికము'... అని గ్రహించి అతడు వర్తించుచున్నాడు. సూర్యుని దృష్టి ఏ

పదార్థమునందూ 'సంకుచితము-పరిమితము' అవదు కదా! జ్ఞాని దృష్టి ఏ మాత్రం ఆకర్షణ వికర్షణలు పొందుట లేదు.

'బ్రహ్మం' అనే నిర్మల సముద్రంలో ఈ 'దృశ్యవ్యవస్థ' అంతా నురుగు-బుడగలు-కెరటాలు వంటిది మాత్రమే. బ్రహ్మము ఆకాశంలోని సూర్యుడై యుండగా, ఈ జగత్తు 'మృగతృష్ణ'లోని జలము వంటిది.

ఆత్మతత్త్వమహాంభోధివీచయః సర్గరాజయః ।
అనుత్తమపదాంభోద వృష్టయః శాస్త్రదృష్టయః ॥ (శ్లో 47, సర్గ 57)

ఈ కనబడే సృష్టులన్నీ ఆత్మమహాసముద్రంలోని తరంగాల వంటివి. ఇక్కడ కనబడే వివిధ శాస్త్రసారములు సర్వోత్తమమగు 'పరబ్రహ్మం' అను మేఘం నుండి వర్షించు వర్షధారుల వంటివే.

❖

ఇక్కడ ఏవేవి కనబడుచున్నాయో, అవన్నీ కూడా 'ఆత్మ' చేతనే ప్రకాశితములగుచున్నాయి. చమత్కారం చూచావా? ఆత్మయే వాస్తవస్వరూపంగా కలిగియుండి కూడా ఈ జీవులలో అనేకులు పరిచ్ఛిన్న దేహభావమును కలిగి ఉంటున్నారు. హింసాస్వభావయుతులై, 'కామభోగాలు' అనే గడ్డి పరకలను సేవిస్తూన్నారు. జ్ఞానసముపార్జనకు అర్హమైన ఉపాధులు సంపాదించుకొని కూడా మృగతుల్యంగా రాత్రి-పగలు గడుపుచున్నారు. ఇది ఉత్తమమా? సార్థకమనిపించుకుంటుందా?

శ్రీరాముడు: స్వామీ! ఈ దేహములన్నిటియొక్క ప్రయోజనమేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి: ఈ దేవ-మనుష్య తదితర అస్థి-మాంససహిత దేహములన్నీ అజ్ఞానమును ఆశ్రయించిన అభాగ్యజీవుల వ్యాహ్యాళి కొరకే నిర్మించబడుచున్నాయి. ఈ అనేక జీవుల అస్థిపంజరాలన్నీ అల్పజ్ఞాన జీవులను బంధించటానికి అమర్చబడిన ఎలుకల బోను వంటివే. బంధనము కొరకే సంసారారణ్యంలో ఇవి ఏర్పడి ఉంటున్నాయి. చర్మముచే కప్పబడిన తోలు బొమ్మలవంటి ఈ రక్తమాంస దేహములను భోగభూములందు ఏర్పరచి ఉంచినది అజ్ఞాన బాలురవంటి జీవుల వినోదార్థమే సుమా!

ఇక్కడి విషయాలు బహుదుఃఖపూరితమే అగుచున్నాయి. అయితే మందమైన వాయు వీచికలు పర్వతాన్ని కదల్చగలవా? సర్వత్యాగియగు వివేకిని ఈ సంసారాడంబరమంతా తాకనైనా తాకలేదు. ఇక్కడి విషయాలు, విశేషాలు అతనిని ఏ మాత్రం కదల్చలేవు.

జ్ఞాని సర్వదా సర్వోత్తమమగు బ్రహ్మపదమునందే స్థితి కలిగి ఉంటున్నాడు. అతడు దీని నంతా క్రీడామాత్రంగా సందర్శిస్తూ, సరదాగా ఆస్వాదిస్తున్నాడు. తత్త్వజ్ఞానము యొక్క చిత్ప్రకాశం చేతనే 'బ్రహ్మ' మొదలగు లోకపాలకులు ఈ జగత్తునంతటినీ ప్రకాశింప జేయుచున్నారు. చిత్ప్రకాశము యొక్క ప్రభావంచేతనే ఈ నేత్రములు మొ॥ ఇంద్రియములు, ఈ బుద్ధీ, ఈ బాహ్యప్రదేశములు ఇవన్నీ కూడా ప్రవర్తించగలుగుచున్నాయి. లోకపాలకులగు బ్రహ్మ మొదలైన వారు ఒకవైపు దేహరహితమగు ఆత్మను వివేచించి చూస్తున్నారు. మరొకవైపు దేహాత్మభావముచే ఈ దేహాదులను రక్షించు ధర్మమును నిర్వర్తిస్తున్నారు.

జ్ఞాని ఈ దేహములు పొందినందుకు ప్రయోజనంగా తనయందలి భోగవాసనలను సంక్షయింప జేసుకోవటానికి ప్రయత్నములు చేస్తున్నాడు. విశాలమైన హృదయం, శుద్ధము పవిత్రము అయినట్టి అంతఃకరణములను పొందుచూ, ఈ సర్వపదార్థములందు ఆసక్తిని త్యజించి వేస్తున్నాడు.

పరమశివుడు పార్వతీదేవి నృత్యమునే అభిలషిస్తాడు గాని, కోతుల నృత్యమును కాదు కదా! పవిత్రాతఃకరణుడికి దేనిపట్లా అభిలాష ఉండదు. ఇక్కడి నృత్య గీతాదులన్నీ అతనికి చిలుక పలుకుల వలె అర్థరహితమై ఉంటాయి. ఒక రత్నము తన యందు ప్రతిబింబించే వాటిపట్ల 'వీటిని నేను సర్వదా కలిగి ఉండాలి" అని భావన చేస్తుందా? తనయందు ప్రతిబింబిత వస్తువుల పొందుటచే తనకు లాభమేమున్నది? నష్టమేమున్నది? అనురక్తి ఏమున్నది? విరక్తి ఏమున్నది? జ్ఞాని ఈ జగత్పదార్థములను, సంఘటనలను అపరిచిత గ్రామంలోని అపరిచితుల ఇంట్లో జరిగే పెళ్ళి సందడిలాగా దూరంగా తాను ఉండి చూస్తూ ఉంటాడు.

అజ్ఞాని దృష్టిలో ఇక్కడ ఒక గడ్డిపరక నుండి బ్రహ్మలోకము వరకు ఈ పదార్థములన్నీ సుస్థిరంగాను, దుర్భేద్యంగాను ఉన్నాయి. జ్ఞానికో... ఇవి, నీటియందు ప్రతిబింబించే 'ఆకాశము–చంద్రుడు–నక్షత్రములు" లాగా... అస్థిరములు, అసత్యములు, అతి చంచలములు అయి ఉన్నాయి. ఎందుకంటే, అతడు తత్త్వదృష్టిచే ఇదంతా మిథ్యారూపంగా దర్శించుచున్నాడు.

ఇక్కడి అల్ప తుచ్ఛ విషయసుఖములు, తదితర వ్యవహారములు అతనికి ప్రీతిని కలిగించుట లేదు. బంధము కలిగించుట లేదు. స్వీకార తిరస్కార భావాలకు అతీతంగా వీటిని అతడు మౌనస్వరూపుడై చూస్తున్నాడు.

అతడు దేనినీ కలిగియుండుట లేదు, త్యజించుట లేదు. అతడు అంగీకరించడు, తిరస్కరించడు. తదితర అజ్ఞానులతో తాను కూడా ఉంటున్నప్పటికీ వారి అవగాహనలు, ఆర్తులు, ఆశలు మొదలైనవి అతనికి అలవోకతో కూడిన చిరునవ్వు మాత్రమే పుట్టిస్తున్నాయి.

❖

ఓ రామచంద్రా! ఈ విషయమై ఒకప్పుడు బృహస్పతి కుమారుడగు కచుడు చెప్పిన ఒక పవిత్రమైన వృత్తాంతమును వినిపిస్తాను.

❖❖❖

IX. కచుని గానం

1. కచుని స్వవిచారణ

శ్రీ వసిష్ఠ మహర్షి: దేవతల గురువు బృహస్పతి. ఆయనకు ఒక కుమారుడు ఉన్నాడు. అతని పేరే కచుడు. ఆ కచుడు 'బ్రహ్మవిద్య'ను ఒకప్పుడు 'మననము' చేత, నిధిధ్యాసచేత బాగా అభ్యసించి ఉన్నాడు. అట్టి అభ్యాసం యొక్క పరిపాకం చేత ఆత్మయందు విశ్రాంతి పొందాడు. 'సమ్యక్‌జ్ఞానం' (Equality towards everything everywhere, all times) అనే అమృతం పానం చేశాడు. ఇక అతని బుద్ధిలో... పంచభూతములచే తయారు చేయబడిన – అతి నికృష్టము... అగు ఈ దృశ్యము నందు ఏమాత్రం అనురాగముగాని, విరాగముగాని లేకుండా పోయింది. ఉదాసీనుడయ్యాడు. ఆత్మ కంటే వేరుగా పొందవలసినదేదీ అతనికి కనిపించుటలేదు. అప్పుడు ఆతడు ఈ విధంగా ఆత్మతత్వాన్ని గానం చేయనారంభించాడు.

❖

కిం కరోమి క్వ గచ్ఛామి కిం గృహ్ణామి త్యజామికిం ।
ఆత్మనా పూరితం విశ్వం మహాకల్పాంబునా యథా ॥ (శ్లో 5, సర్గ 58)

శ్రీ కచుడు: ఆహాఁ! ఇప్పుడు నేనేమి చేయాలి? ఎక్కడికి వెళ్ళాలి? దేనిని గ్రహించాలి? మహా ప్రళయంలో ఈ బ్రహ్మాండమంతా జలంతో నిండిపోవుచున్నట్లు, ఈ విశ్వమంతా ఆత్మచే పరిపూర్ణమై ఒప్పుచున్నది కదా!

సమస్తము ఆత్మమయమేనని నేను తెలుసుకున్నాను. తత్త్వజ్ఞానోదయం కానంతవరకే దుఃఖములు నన్ను సమీపించాయి. జ్ఞానం ఉదయించిందా, దుఃఖములు... ఆ దుఃఖములను అనుభవించే జీవులు... ఆ జీవులకు ఇష్టమగుచున్న సుఖము... అంతా కూడా కేవలం 'శూన్యము మాత్రమే' అని తోచుచున్నది. "సమస్తము ఆత్మమయమే"... అని గ్రహించుచుండగా ఇక కోల్పోయేది ఏముంది? పొందేదేముంది? ఆత్మచేతనే సర్వదుఃఖరహితుడనగుచున్నాను. ఆత్మకు వేరైన వస్తువు ఎక్కడా ఏదీ లేదు కాబట్టి, ఇక నాకు దేనివలనకూడా ఏ ప్రత్యేకమైన ప్రాప్తి ఉండదు.

స్వర్గమా? మర్త్యలోకమా? పాతాళలోకమా? అవన్నీ కూడా ఆత్మతోనే నిండి ఉన్నాయి. ఇక వాటిలో భేదమెక్కడ? ఆత్మయే అయిఉండుటచే, – భేదమెక్కడ? ఈ శరీరము యొక్క బైట, లోపల, సర్వ దిక్కులందు, పైన, క్రింద... అంతటా సర్వత్రా ఆత్మయే వ్యాపించియున్నది. ఆత్మ లేనిది, ఆత్మ కానిది అయిన చోటు ఏది? ఏదీ లేనే లేదు.

❖

'కుండ' యొక్క ఆకారము ఉన్నదెందులో? మట్టిలోనే కదా! ఈ జగత్తు అంతా సర్వదా అట్లే ఆత్మయందే ఉన్నది. మట్టి, "అయ్యో! నేను కుండనయ్యానే?" అని వేదన చెందుతుందా? లేదు కదా! మట్టి సర్వదా మట్టియేకదా!

సర్వత్రైవస్థితోహ్యాత్మా సర్వమాత్మమయంస్థితమ్ ।
సర్వమేవేదమాత్మైవ మాత్మన్యేవభవామ్యహమ్ ॥ (శ్లో 8, సర్గ 58)

అనగా ఈ జగత్తుకు అధిష్ఠానం ఆత్మయే. ఇక వివర్తభావంగా చూస్తే... ఆత్మయే ఈ జగత్తు రూపమున ప్రకాశిస్తోంది. తత్త్వదృష్టిచే ఇదంతా ఆత్మయే అయి ఉన్నది. ఈ విధంగా నేను ఎల్లవేళల పరమాత్మ స్వరూపమగు ఆత్మయందే నెలకొనియున్నాను. కాబట్టి పరిశుద్ధమగు పరమాత్మయే నేను. బ్రహ్మము-బ్రహ్మదేవుడు అనబడేదంతా నేనే.

"పరమాత్మకంటే వేరుగా 'జీవుడు' అనబడేవాడు ఒకడు ఉన్నాడు" అని అంటే... అది మిథ్యతో కూడిన ప్రతిపాదన మాత్రమే. పరమాత్మకంటే అన్యంగా ఖండరూపమున నేను లేను. అందుచేత నేను ఈ చేతన-అచేతన రూపములందు అంతటా కూడా ఆత్మస్వరూపుడనై వ్యాపించి ఉంటున్నాను.

"సన్మయము" (Absolute Existence) అయినట్టి ఆత్మయే ఆకాశమండలమును కూడా పూర్ణం చేసివేస్తూ సర్వత్రా వెలయుచున్నది. నిర్మలము, నిత్యోదితము, అఖండము అయినట్టి ఆత్మయే స్వరూపముగా గల నేను ఆ విశేషణములన్నింటికీ సర్వదా, సర్వస్థితులలోనూ తగియే ఉన్నాను కదా...!

కనుక మంచిది! ఇప్పుడు... "నేను పరిపూర్ణుడనై ఆనందస్వరూపుడనై, సుఖమయుడనై ఏకమగు ఆత్మ మహాసముద్రమునందు అంతటా సర్వదా సుస్థితుడనైయున్నాను"... అని నాచే గ్రహించబడుచున్నది.

❖

ఈ విధంగా ఆ కచుడు గానం చేస్తూ ఉన్నాడు. ఇట్టి భావనకు 'సంజ్ఞ' అయినట్టి 'ఓం' కారమును ఉచ్చరించ ఆరంభించాడు. ఓంకారము యొక్క 'అర్థమాత్రము" నందు సమస్తము లయం చేసివేశాడు. ఇప్పుడు అతడు అభ్యంతరమగు 'కారణము' నందులేడు. బాహ్యము అయినట్టి 'కార్యము' నందు కూడా స్థితి కలిగియుండలేదు. కేవలం పరమాత్మ స్వరూపము మాత్రం భావన చేస్తున్నాడు. సమస్త కల్పనాకళంకములు రహితం చేసుకున్నాడు. శుద్ధుడయ్యాడు. 'ప్రాణగతి'ని కూడా హృదయమునందు విలయం చేశాడు. మేఘరహితమగు నిర్మలాకాశంలాగా "నిర్మలాంతఃకరుణుడు"... అయ్యాడు.

❖❖❖

2. ఆత్మాశ్రయం

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! "సర్వము ఆత్మయే" అను దర్శనము పొందిన తరువాత, అట్టి జీవుని యొక్క అవగాహనను నీకు తెలియజేయటానికే ఈ కచుని సమాలోచనను వర్ణించి చెప్పాను. భోగములను నమ్మి ఉండరాదు. ఆత్మనే ఆశ్రయించి ఉండటం ఉచితం.

ఈ ప్రపంచములో కనబడుచున్నవన్నీ సమీక్షిస్తే ఇవి... "అన్నము-పానము-స్త్రీ సంగమము' ... ఇంత మాత్రమే కదా! ఇంతకు మించి ఇక్కడి ఆయా పదార్థములలో ఏమి పురుషార్థం ఉన్నది? వివేకి అయినవాడు ఈ విషయాన్ని శ్రుతి-స్మృతుల సహాయంతో, సద్గురువులు చెప్పుచున్న ఉపదేశములచేత, స్వానుభవంచేత నిశ్చయించుకుంటున్నాడు. ఇక ఆతడు భోగములను ఏమాత్రం ఆశించుట లేదు.

ఓ జనులారా! మీరు పశు, పక్ష్యాదులలాగా మూఢులై, "నీచము, నశించే స్వభావము కలిగినవి"... అయినట్టి విషయభోగముల పట్ల విశ్వాసం కలిగి ఉండటం ఉచితమా? అయ్యో! గాడిదల వలె నివసిస్తూ ఉత్తమమగు ఈ మానవజన్మను వృథాపరచుకోవటం మంచిదా? "రక్తమాంసములు మాత్రమే" అయిన ఈ తుచ్ఛ శరీరాదులపై మీకు అహంకార మమకారములు (నేను, నాది-అను భావములు) ఎందుకు ఏర్పడుచున్నాయి? వీటిలో 'కేశములు, బొమికలు' తప్ప ఇంకేమీ ఉత్తమ విషయాలు లభిస్తున్నాయి చెప్పండి? ఆహారనిద్రామైథునాలకే పరిమితులు కాదలచుకొన్నవారు జంతు ఉపాధులను మించి ఏం గొప్ప ప్రయోజనం పొందుచున్నారు?

ఈ భూమి అంతా మట్టిమయమే...! వృక్షములన్నీ కొయ్యతోనే నిండి ఉన్నాయి...! "పైన ఆకాశం క్రింద భూమి" గల ఈ ప్రపంచంలో సుఖప్రదమగు అపూర్వ వస్తువు ఏమి ఉన్నది? ఈ ఇంద్రియములను గమనిస్తే, ఇవి ఎప్పటికప్పుడు అల్పమైన విషయాలు పొందటానికే ఆరాట పడుచున్నాయి. అవి ఎంత చూచినా, వినినా, పొందినా వివేకము పొందటానికి ఏమాత్రం సమాయత్తమగుటయే లేదు.

నాయనా! రామా! ఈ 'సంసారారణ్యం'లో సంచరించే జనులయొక్క వ్యవహారములన్నీ విచారించబడనంతసేపు మాత్రమే రమణీయంగా ఉంటున్నాయి. కాని అవన్నీ చివరకు మోహ హేతువులుగానే పరిణమిస్తున్నాయి. పాపం, ఈ మానవుడు సుఖమును గూర్చిన అనేక ఆశలు కలిగి ఉంటున్నాడు. వేటి వేటి కొరకై 'ముందు ముందు సుఖించగలను' అని అనుకుంటూ ప్రయాసతో ప్రయత్నములు చేస్తున్నాడో, అవన్నీ దుఃఖప్రదములే అవుతున్నాయి. ఇక్కడ గల పాప భావములకు పాప విషయకాలుష్యమునకు, వియోగ విషాదాదులకు అంతు ఉండుట లేదు కదా!

ఈ పంచేంద్రియములు, ఈ మనస్సు ప్రతి క్షణం ఏవేవో వస్తువులను పొందటం, కోల్పోవటం చేస్తున్నాయి. ఈ విషయసంపదలను చూచుకొని మురిసినంతసేపు పట్టదు. మన ఈ గొప్ప గొప్ప శరీరములు ఏ క్షణమైనా పతనం కావటానికి సిద్ధపడియే ఉంటున్నాయి.

ఎంతటి చిత్రమైన విషయం! ఈ జీవుడు, రక్తం, మాంసం, చర్మముల సంఘాతములచే ఏర్పడుచున్న బొమ్మవంటి స్త్రీ దేహమును చూచి "ఆహాఁ! ఈమె నా ప్రియురాలు... ఈమె ఎంత అందంగా ఉన్నది...!" అని తలచుచు మురిసిపోవుచున్నాడు. అట్టి మాంస బొమికల అమరికను ఆలింగనం చేసుకొని 'ఇంతకుమించి ఇంకేమి కావాలి?' అని తలచి విజ్ఞాన, వివేకముల మార్గము నుండి వైదొలగుచున్నాడే...! ఓ రామా! ఇదంతా అజ్ఞానికి సంతోషప్రదమైతే అగుగాక! జ్ఞానికి ఇదంతా అత్యంత చోద్యం, అస్థిరం, అసత్యము కూడా. సరైన అవగాహన లేకుంటే ఇది దుఃఖ ప్రదమే. ఈ విషయభోగములను అల్లంత దూరంలోనే చూచిన వివేకి వాటిలోని విషత్వమును గమనిస్తున్నాడు. విషయములు పొందినంత మాత్రంచేత 'భోగతృష్ణ' క్షీణించగలదా? లేదు.

తాంపరిత్యజ్యభోగాస్థాం స్వామైకత్వగతింభజ ।
అనాత్మమయభావేన చిత్తంస్థితిముపాగతమ్ ॥ (శ్లో. 11, సర్గ 59)

ఇట్టి భోగములందు విశ్వాసము త్యజించుటయే మంచిది. నీవు కేవలం ఆత్మనే ఆశ్రయించు. శరణువేడు, భావించు. అంతే గాని భోగవాసనలను అధికం చేసుకుంటూ అనాత్మ స్వరూపమగు దేహాదులు గురించి భావనను చేయనేవద్దు. అట్టి నీచభావనలయందు నీ చిత్తము స్థితి పొందిందా... మరుక్షణము నుండి అసన్మయమగు ఈ జగజ్జాలమంతా వచ్చి ఎదురుగా నిలచి ఉంటోంది.

❖❖❖

3. బ్రహ్మము : బ్రహ్మదేవుడు - చైతన్యము : సృష్టి

శ్రీ రాముడు: మహర్షీ! బ్రహ్మము నుండి "బ్రహ్మదేవుడు" అను సమష్టిజీవుడు ఎట్లు ప్రకటితమగుచున్నాడో వివరించండి. అతని యొక్క మనస్సుచే ఈ జగత్తు ఎట్లా ఉత్పత్తి చేయబడుతోందో కూడా చెప్పండి.

శ్రీ వసిష్ఠ మహర్షి: బ్రహ్మము నుండి మొట్టమొదట 'సంకల్పించుట" అను విశేషముతో కూడుకొన్న మనస్సు రూపంలో ఒక భావకెరటం ఉత్పన్నమగుచున్నది. 'ఎఱుగుట' అను తత్వము నుండి బయల్వెడలిన ఆ ప్రథమక్రియాచైతన్యమే ప్రథమ జీవుడు. ఆతడే హిరణ్యగర్భుడు, బ్రహ్మదేవుడు కూడా. అట్టి "సంకల్పాత్మక మనోరూపము, కల్పితము అయిన ఆకృతి గల చైతన్య ప్రవంతి" యే భావిసృష్టికి సంబంధించిన యత్నము ఒనర్చుచున్నది.

అతని అట్టి సంకల్పమే మహాప్రకాశయుక్తమైన తేజమును రచించుచున్నది. ఆ సంకల్ప పరంపరావ్యవహారం తన తేజస్సుచే దిక్కులన్నీ వ్యాపించుచున్నది. అపరిచ్ఛిన్నమై, ఆవరణ రహితమై ఒప్పుచున్నది.

అట్టి బ్రహ్మదేవుడు చతుర్ముఖుడై వెలుగొందుచున్నాడు. ఈ మనో–బుద్ధి–చిత్త–అహంకారములే అతని చతుర్ముఖములు. అట్టి చతుర్ముఖముల ప్రసరణచే (తన మనో తేజముచే)

"స్వసదృశమే" (Not different from his own self) అయినట్టి ఈ కనబడే దృశ్యజగత్తును నిర్మించుచున్నాడు. అనగా... మనస్సే హిరణ్యగర్భుడు. ఆ మనస్సుచే గాంచబడేదే దృశ్యజగత్తు.

నేను, నీవు తదితరులు కూడా మనస్సునందే మనస్సుచే మనస్సు కొరకు ఈ జగత్తును ఇట్లు పొందుచున్నాం. అట్లు "స్వకల్పనాసామర్థ్యము" చే సృష్టించబడ్డ తేజోమండలము నందలి తేజము నుండి సూర్యమండలం ఉద్భవించింది. ఆ సూర్యమండలం అగ్నిజ్వాలల వంటి తన కిరణములచే ఆకాశమును నింపివేస్తోంది.

అట్లు సూర్యుడు నిర్మించబడిన తరువాత శేషించిన కళారూపమును తొమ్మిది విధాలుగా విభజించబడ్డాయి. అట్లు తొమ్మిదిమంది ప్రజాపతులు ఏర్పడ్డారు. వారు బ్రహ్మదేవుని సంకల్పంచే సమస్త సిద్ధులు పొందినవారై స్వసంకల్పములను అనుసరించారు. తదనుసారంగా తమ ఎదుట మాయా పదార్థములను చూడసాగారు. "మరీచి" మొదలైన ఈ ప్రజాపతులచేతనే దేవతలు, దానవులు మొదలైన వివిధములైన జీవరాశులు ఏర్పడినాయి. వారింకా అనేక స్వభావములతో, తత్త్వములతో, శక్తులతో కూడిన జనులను, వస్తువులను సృష్టించారు. కాలక్రమంగా పుత్రులు, పౌత్రులు మొదలైన పరంపరచే ఈ సృష్టి అంతా పరివర్ధమానమగుచున్నది.

ఆ తరువాత సమష్టి సృష్టి అహంకారియగు బ్రహ్మదేవుడు వేదసంస్మరణం చేయుట ద్వారా ఈ జగతియందు 'నియతి' ని కల్పించుచున్నాడు.

ఇక్కడ నీవు గ్రహించవలసినదేమిటి? మనస్సే ఆ విధంగా విశాలమగు బ్రహ్మదేవుని రూపం ధరిస్తోంది. అట్లు ధరించి "భూతసంతతిచే పరివ్యాప్తమైయున్న ఈ సంకల్పమయ సృష్టి"ని విస్తరింపజేస్తోంది, ఇక ఈ సృష్టి 'సముద్రం-పర్వతాలు-వృక్షాలు-దిక్కులు' మొదలైన అనేక పదార్థములచే పూర్ణమై ఉంటోంది. అన్ని దిక్కులను ఆక్రమించిన ఉదరభాగం కలిగి ఉంటోంది.

❖

క్రమంగా ఈ 'సృష్టి' అనబడు జగద్దృశ్యము అనేక శారీరక సుఖదుఃఖములతోను, మానసిక వ్యధలతోను, జరా, జన్మమరణములతోను కూడినదై ఉంటోంది. అందుచేతనే "ఈ దృశ్యమును త్యజించినవారై ఉండండి" అని ఆత్మతత్త్వము ప్రవచించే శాస్త్రములు మనకు చెప్పు చున్నాయి. "మనస్సుచే కల్పించబడినది మాత్రమే"... అయినట్టి ఈ సృష్టి వ్యవహారమంతా రాగ ద్వేష మయమగు దృష్టిచే గాంచబడిందా... ఇదంతా 'ఉద్విగ్నత'కు కారణమగుచున్నది. అట్టి మనో కల్పన యందు సాత్త్విక రాజసిక తామసాలనే త్రిగుణాలు నిండుగా ఆక్రమించుకొని ఉంటున్నాయి.

ఇప్పుడు ఒక ముఖ్యమైన విషయం ప్రతిపాదిస్తున్నాను. హిరణ్యగర్భుడు అదిగా ప్రారంభ మైన ఈ మనోమయ సృష్టి అంతా ఆత్మదృష్ట్యా 'లేనిదే' అగుచున్నది. అందుచేత 'స్వస్వరూపాత్మ' యొక్క ఆత్యంతికానుభవము కొరకై ఆ మనోమయసృష్టి మొదలంటా త్యజించబడాల్సిందే.

❖

బ్రహ్మదేవుని నుండీ ఈ మనస్సు ఆవిర్భవిస్తోంది కదా! ఈ మనస్సు ఇతఃపూర్వపు కల్పంలో ఏ వస్తువును ఎట్లు దృశ్యమానంగా పొందిందో, ఈ కల్పమునందు నేటి వరకు అట్లే పొందుచున్నది.

ఈ మనస్సు, దీని యొక్క 'సమష్టిత్వము' దృష్ట్యా సర్వభూతములందు ఉన్నది. వ్యష్టి దృష్ట్యా ఇది కొన్ని భూతములందు మాత్రమే మననము కలిగియుంటోంది.

ఈ ప్రపంచమును సంకల్పించుచు, తదనుసారంగా తనకు తానే వీక్షించుచున్నది ఈ మనస్సే కదా! ఇక్కడ లభిస్తున్న 'జగన్మోహము' అంతా మనస్సుచే అకస్మాత్తుగా కల్పించబడి స్థిరత్వం పొందుతోంది.

అంతా సంకల్పబలమే - సంకల్పబలం చేతనే జగత్క్రియలన్నీ ఉత్పన్నములౌతున్నాయి. సంకల్పబలం చేతనే దేవతలు నియతికి వశులై వెలువడుచున్నారు. సంకల్పముచే జనించిన సృష్టిలో దేవ దానవాది చక్రవర్తులు తమ తమ స్వభావములైనట్టి సాత్విక-రాజసిక-తామసిక వృత్తులను ప్రకటిస్తూ ప్రేరేపణ పొందుచున్నారు. ఇక్కడి జన్మ-జరా-బంధ-మరణాదులన్నీ సంకల్పమాత్రములే.

❖❖❖

4. సృష్టి - ఉపసంహారం

ఒక్కొక్కప్పుడు సాత్విక-రాజసిక-తామసిక వృత్తులచే ఈ సృష్టి మరల మరల బాగుగా పీడించబడుచున్నది. అప్పుడు మనోమయజనితుడు అగు బ్రహ్మదేవుడు పద్మాసనము వైచుకుని ఉండి, ఇట్లు సంకల్పిస్తున్నాడు...

"ఆహాఁ! ఈ పాతాళము, భూమి, ఆకాశము, దిక్కులు, స్వర్గమార్గములు, రుద్రులు, ఉపేంద్రుడు, మహేంద్రుడు, పర్వతములు, సాగరములు మొదలైన ఆయా పదార్థములతో కూడిన వ్యష్టి జగత్తంతా మనస్సు యొక్క స్పందనచేతనే ఏర్పరచబడుచున్నాయి కదా!

మనస్సు యొక్క క్రియాశీలత్వమే ఇదంతా. మనస్సు నా నుండే ప్రభవిస్తోంది. కనుక, ఈ వ్యవహారమయ సృష్టి అంతా నా నుండే ఉద్భవించుచున్నది. ఇదంతా నా సంకల్పమే. దీనిని నలువైపులా వెదజల్లింది నేనే. అట్టి ఈ సంకల్పములను ఇప్పుడు విరమించెదనుగాక!" -ఇట్లు నిశ్చయం చేసుకుంటున్నాడు. శాంతుడగుచున్నాడు. 'కల్పనలు' అను అనర్థసంకటముల నుండి విరతి (withdrawl) చెందుచున్నాడు.

అట్టి సమయంలో అనాదిగా సర్వదా సిద్ధించియే ఉన్న బ్రహ్మమును మనస్సుచే స్మరించ ప్రారంభించుచున్నాడు. అంతే... ఇకపై స్మరణ మాత్రం చేతనే అతడు పరమాత్మను పొందుచు న్నాడు. వ్యవహారములలో పాల్గొనుచున్న ఒక వ్యక్తి ఎంతో అలసిపోవుటచే, ఆ వ్యవహారములు ముగిసిన తరువాత ఒంటరిగా ఉన్నప్పుడు సుఖవిశ్రాంతిని పొందుచున్నాడు చూచావా? ఆ బ్రహ్మ

దేవుడు కూడా అట్టి విశ్రాంతినే ఆశ్రయించుచున్నాడు. 'ఆత్మ' యొక్క ఆకారముగానే ప్రకాశించుచున్న 'బ్రహ్మపదము' నందు విలీనచిత్తుడు అగుచున్నాడు. అహంకార మమకారాలు త్యజించి పరబ్రహ్మమున శాంతిని పొందుచున్నాడు. అలలు లేని సముద్రంలాగా ఆత్మయందు సుస్థితుడగుచున్నాడు. "మౌనము అవధరించినవాడు, భావాతీతుడు"... అగుచున్నాడు.

అట్టి ఉపసంహరణ సమయంలోని తతంగం ఏమిటో వర్ణించి చెపుతాను, విను–

సముద్రము అలలు నుండి విడివడునట్లు, బ్రహ్మదేవుడు జగత్ నిర్మాణానికి మూల కారకమగు విషయముల ధ్యానము (సృష్టి పట్ల అధ్యాస) నుండి విడివడుచున్నాడు. ఇట్లు తలచుచున్నాడు–

విచారయతిసంసారం సుఖదుఃఖసమన్వితమ్ ।
ఆశాపాశశతైర్బద్ధం రాగద్వేషభయాతురమ్ ॥ (శ్లో 41, సర్గ 59)

"ఆహాఁ! ఈ సంసారమంతా దుఃఖసమన్వితమే కదా! ఇదంతా జీవునికి ఆశాపాశ రూపములు గానే ప్రాప్తిస్తోంది. ఇది రాగ ద్వేష భయములతో నిండి ఉంటోంది. నా పుత్రులగు ఈ జీవులు అజ్ఞానముచే దృశ్యమునకు బద్ధులైపోతున్నారు. పదే పదే జనన–మరణ దుఃఖాలను పొందుచున్నారు. వీరంతా ఉద్ధరించబడేది ఎట్లా?"

క్రమంగా దయార్ద్ర చిత్తుడగుచున్నాడు. జీవరాశుల సుఖం కొరకు మోక్షాన్ని ప్రసాదించ గల "ఆధ్యాత్మశాస్త్రము" ను రచించుచున్నాడు. వేద వేదాంత సంగ్రహములను, పురాణములను రచింపజేయుచున్నాడు. అట్టి 'ప్రక్రియ' యందు నేను, వ్యాసుడు, వాల్మీకి మొదలైనవారమంతా నియమించబడ్డవారమే సుమా!

అట్లు ఆ బ్రహ్మదేవుడు 'సృష్టి' అను ఈ పరిశ్రమ నుండి వెలువడి తన పూర్వపదమును (past glory) పొందుచున్నాడు. బ్రహ్మముతో ఐక్యము, అభేదములే అతని పూర్వపదము. అట్టి పూర్వపదాన్ని అవలంబించి, గాలులు వీచనట్టి సమయంలో సముద్రుని వలె... పరమ ప్రశాంతుడగుచున్నాడు. ఈ రీతిగా స్వస్వరూపమున వెలయుచున్నాడు. అనగా, అతడు ఈ జగత్తును కల్పిస్తున్నాడు. వీక్షిస్తున్నాడు. శాస్త్ర రచనలచే నియమాదులు కల్పించుకొని మరల ఆత్మస్థుడగుచున్నాడు.

శ్రీరాముడు: ఇట్లు 'సృష్టి' లేక 'దృశ్యము' యొక్క కల్పన ఉనికి – ఉపశమనములకు కారణమగుచున్న మనోరూపుడగు బ్రహ్మయొక్క ఉనికి ఎచ్చట?

శ్రీ వసిష్ఠ మహర్షి: వాస్తవానికి బ్రహ్మదేవుడు చిత్స్వరూపుడే. అతడు సంకల్పరహితుడే. సంకల్పించుటకు మునుముందే ఉండి ఉన్నాడు. అయినప్పటికీ తనయొక్క 'ఇచ్ఛ' చే లోకములను అనుగ్రహించుట కొరకు లోకవ్యవహార పారాయణుడగుచున్నాడు.

వాస్తవానికి అతనికి ఆర్జన లేదు. అనాదరణ కూడా లేదు. శరీరగ్రహణము లేదు... నానాత్వము లేదు. అతనికి చేతనము–స్థితి–వినాశనములు కూడా లేవు.

అతనికి అన్ని భావములు, చిత్తవృత్తులు కూడా సమానమే. సర్వదా పరిపూర్ణస్వరూపుడై 'మహాసముద్రము' వలె వెలయుచున్నాడు. కాని, ఒక్కొక్కప్పుడు తన అప్రమేయత్వము పట్ల నిదురించి, జగత్తుపట్ల జాగరిల్లుచున్నాడు. ఆ సమష్టి సంకల్పస్వరూపుడు అగు బ్రహ్మదేవుడు బ్రహ్మము కంటే వేరైనవాడు కాదు.

ఇదంతా ఇట్లా ఉండగా 'బ్రహ్మముతో ఏకము' అను అత్యంత సాత్విక స్థితి ఒకటి ఉన్నది. అది నిష్కల్మష హృదయులు, పదార్థరాహిత్యం పొందినవారు మాత్రమే దర్శిస్తున్నారు. వారు "మనస్సే బ్రహ్మము" అను అనుభవమునకు అర్హులగుచున్నారు.

❖❖❖

5. "సృష్టి-జీవుడు" - పరిణామ చమత్కారం

సృష్టి ఏర్పడి ఉన్నట్టి చైతన్యమునే 'జీవుడు' అంటున్నాం. అయితే, ఈ జీవత్వము ఏర్పడక ముందే ఆత్మయొక్క ఔన్నత్యము స్థితి కలిగియే ఉన్నది. ఈ సృష్టికి పరముగా చిదాకాశము ఉన్నది. మనస్సునందు రూపములు ఏర్పడి, గాంచబడతాయి చూచావా! ఆ విధంగానే చిదాకాశము నందు ఈ సృష్టి ఏర్పడుచున్నది. నిర్మల ప్రశాంతజలంలో ఆవృత్తములు ఏర్పడుచున్నప్పుడు, ఆవృత్తములు జలం కంటే వేరుకాదా కదా! అట్లాగే, జగత్తు – దృశ్యములకు సంబంధించిన చిత్తవృత్తులు "చిదాకాశము కంటే వేరు" అని అనటానికే వీలులేదు.

అట్టి సృష్టిలోని ప్రథమరూపములే 'ప్రజాపతులు' అని చెప్పబడుచున్నారు. ఆ ప్రజాపతుల సంకల్పములను అనుసరించే 'నియతి' మొదలైనవి ఏర్పడుచున్నాయి.

చిదాకాశము - ➞ సృష్టి సంస్కారములు : ➞ ప్రజాపతులు – ఓషధులు– చంద్రకళ –కల్పన– సంకల్పములు: దేవతలు – కర్మలయందు ఆసక్తి–మానవులు : తదితర జీవోపాధులు.

ప్రజాపతులు - వీరు ప్రథమ సృష్టిలోని వారు. వీరియందు బ్రహ్మజ్ఞానము స్వతఃసిద్ధమై ఉంటోంది. అయితే "మేము తదితర జీవుల సమున్నతి కొరకు ఉపాసన మొదలైనవాటిని కల్పించాలి"... అనే సంస్కారం కలిగి ఉంటున్నారు.

దేవతలు - ప్రజాపతులు ఏర్పడిన తరువాత అదే కల్పన దేవతల రూపమున ఉదయిస్తోంది. వీరు సుసంస్కారము స్వభావముగా కలిగి ఉంటున్నారు. వీరు ఉపదేశ మాత్రం చేతనే బ్రహ్మజ్ఞానం పొందుచున్నారు.

మనుష్యులు - వీరికి పురుష ప్రయత్నం చేత మాత్రమే బ్రహ్మజ్ఞానం లభిస్తోంది. సాధు సంగము, శాస్త్రాభ్యాసము, ఇంద్రియ జయము మొదలైన ఉపాయములను అభ్యసిస్తేనే బంధమును త్యజించగలుగుచున్నారు. "ఉత్తమఫలము' అయినట్టి 'బ్రహ్మజ్ఞానము' సుస్థిరమయ్యే వరకు వారు శ్రవణమననములను ఆశ్రయించవలసి వస్తోంది.

❖

ఈ విధంగా ఈ సృష్టి 'సృష్టము లేక సంకల్పితము" అయినట్టి అనేక ఉపాసనలతోను, 'యజ్ఞము' మొదలైన ఉచితకర్మలతోను, "ద్వేషము, రాగము, ప్రేమ, పరిమితదృష్టి"... మొదలైన నిషిద్ధ మిశ్రమ కర్మలతోను ప్రకాశిస్తోంది. ఇందులో ప్రవేశించుచున్న జీవుల వాస్తవ స్వరూపము శుద్ధతత్త్వమగు ఆత్మయే అయినప్పటికీ, వారు 'పొందుట-కోల్పోవుట' మొదలైన క్రీడాకౌతుకం అవలంబించి ఉంటున్నారు. గర్విస్తున్నారు... హింసిస్తున్నారు... దుఃఖిస్తున్నారు.... ఒకరితో మరొకరు కీచులాడుకుంటున్నారు. వారిలో వారు వాదులాడుకుంటున్నారు. ఈ విధంగా ఉచిత, అనుచిత ప్రారబ్ధకర్మల వేగముతో సృష్టిలోని ఆయా వ్యవహారమంతా వర్ధిల్లుతోంది. అనేక జీవుల, జీవజాతుల క్రోధ-లోభ వ్యవహారములతో ప్రవర్తించు ఈ సృష్టులు "బ్రహ్మదేవుని సంకల్పము" యొక్క బలంచేతనే 'సత్తు' ను పొందుచున్నాయి.

ఈ త్రివిధ సృష్టులు ఇట్లు ఉండగానే ఈ జీవుడు సర్వదా బ్రహ్మమేనని గ్రహించి ఉండు.

❖❖❖

6. సృష్టికి మూలం ఇచ్ఛయే!

శ్రీరాముడు: తండ్రీ వసిష్ఠ మహర్షీ! అనంతసంఖ్యలో దీపితమౌతున్న ఈ జీవగణమంతా ఎక్కడి నుండి, ఎందుకు ఎట్లా వచ్చి సృష్టిలో ప్రవేశిస్తున్నాయి?

శ్రీవసిష్ఠమహర్షి: భగవంతుడగు బ్రహ్మదేవుడు ఒక సమయంలో "ఆత్మసమాధి (ఆత్మను మాత్రమే దర్శించుచుండుట) - మౌనము" అను రూపంలో ఉండే తన స్వస్వభావమును విడిచి, లేచి, ఈ సృష్టి పరంపరావ్యవస్థను ఏర్పరచుచున్నాడు. అతని ఇచ్ఛయే ఇదంతా. అందుచేత "సృష్టికి మూలం ఇచ్ఛ" అని చెప్పబడుతోంది.

అట్లు ఏర్పరచబడిన ఈ సృష్టి లేక జగత్తులో అనేకమంది మృతతుల్యులగు జీవులు లేచి పడుచున్నారు. వారు 'జీవనతృష్ణ' అనే గాలికి కొట్టుకువచ్చి ఇందు పాల్గొనుచున్నారు. దృష్టిభేదము ననుసరించే ఇదంతా ఏర్పడి ఉంటోంది.

ఈ భూతజాలమంతా (లేక, ఇక్కడి జీవులన్నీ) బ్రహ్మమునుండే లేచుచున్నాయి... జగద్దృశ్యమును అంగీకరించి సంసారపంజరములో ప్రవేశిస్తున్నాయి. 'ఏదో పొందాలి, చూడాలి, కావాలి' మొదలగు రూపంగల 'తృష్ణ' యే జగద్వ్యహారములంతటికీ మూలకారణమై ఉంటోంది.

ఈ పంచభూతమయ శరీరాదులన్నీ ఆకాశం నుండి ధూళికణాల వలె బయల్వెడలు చున్నాయి. ఇక్కడి పంచభౌతిక నిర్మితములన్నీ ఆకాశంలోంచి బయలుదేరి, మరల ఆకాశంలోనే లయమౌతున్నాయి. 'ఆకాశమే ఈశ్వరుని ప్రథమపుత్రుడు' అని అందుకే శాస్త్రకారులు చెప్పారు.

❖

జలం నుండే తరంగాలు లేస్తున్నాయి కదా! ఈ జీవగణములన్నీ అనాది యగు 'బ్రహ్మపదము' నుండే ఉత్పన్నం అగుచున్నాయి. బ్రహ్మము చేతనే బ్రహ్మము నందు కల్పనాదృష్టిచే

పొందబడుచున్నాయి. పొగ మేఘాలలో ప్రవేశించుచున్నట్లు ఈ జీవగణం ఆకాశంలో జేరుచున్నాయి.

అంతా సంకల్పమాత్రమే - జీవులు పరబ్రహ్మమునందే ఆకాశ వాయువులతో కూడి సంచారం కొనసాగిస్తున్నారు. ఈ జీవులు, ఈ ఆకాశ వాయువులు పరబ్రహ్మము నుండి సంకల్పప్రభావం చేతనే ఏర్పడుచున్నాయి.

తేజస్సు (అగ్ని) – జలము – పృథివి – ఇవన్నీ సృష్టించబడిన తరువాత జీవులు ప్రాణవాయువులచే ఆక్రమించబడుచున్నారు. అన్నిటికీ మూలం సంకల్పమే. మనో–బుద్ధి–చిత్త–అహంకారముల సమన్వయమే లింగదేహము.

పరమాత్మ మహాసముద్రంలో లింగదేహ తరంగాలు అనంతంగా ఏర్పడుచున్నాయి. "ప్రాణవాయువులు–భూతతన్మాత్రలు–అన్నము–జలము" అవన్నీ కలసి పంచవిధ వాయువులుగా మారుచున్నాయి. ఆ పంచవిధ వాయువులు స్థూలదేహంలో ప్రవేశిస్తున్నాయి. అట్లు ప్రవేశించి 'తేజస్సు' యొక్క భావం పొందుచున్నాయి. అట్లు తేజస్సు భావన పొందిన జీవులు ప్రాణ రూపమును దాల్చి ఈ జగత్తునందు ఉత్పన్నులగుచున్నారు. అయితే ఎందుకో వారి జ్ఞానం అపరిపక్వంగా, అస్ఫుటంగా ఉంటోంది.

❖❖❖

7. జీవోత్పత్తి - జీవపతనము

శక్తి స్వరూపాలు, భావనామాత్రులు, సూక్ష్మశరీరరూపులు అగు జీవాభిమానులు సృష్టి యందు ఏర్పడి ఉంటున్నారు. వారు భావనోద్రేకానుసారం 'ధూమమార్గం' లో ప్రవేశిస్తున్నారు. పూర్ణచంద్రోదయం అయ్యేవరకు క్షీరసముద్రమునకు కూడా ఆశ్రయమైనట్టి ఆకాశ కోటరంలో ఉంటున్నారు.

పూర్ణచంద్రుడు ఉదయించగానే 'ఆకాశకోటరం' లేక లింగశరీరయుతమగు సృష్టి స్వభావంలో ప్రవేశించుచున్నారు. తరువాత, వారు చంద్రకిరణములలో ప్రవేశిస్తున్నారు. అప్పుడు చంద్రకిరణముల సహాయంచే పుష్టిని సంపాదించుకొని, ఆ కిరణముల ద్వారా రస పూర్ణమైన ఫలములను ఆశ్రయిస్తున్నారు. అట్లు చంద్రకిరణముల నుండి వేరువడి, బిడ్డ తల్లి పాలిండ్లను ఆశ్రయించినట్లు ఫలములలో ప్రవేశించి మాతృగర్భంలో కొద్ది సమయం ఉండి ఉంటున్నారు.

ఆ ఫలములు సూర్యకిరణముల వలన పక్వం పొందుచున్నాయి. వాటిని ప్రజాపతులు, జనులు భుజించటం జరుగుతోంది. అప్పుడు ఆ ఫలాలలోని జీవులు 'వీర్యము' యొక్క రూపాన్ని గ్రహించుచున్నారు. వీర్యరూపము నందు మూర్ఛితులై ఉండి ఉంటున్నారు. ఆ తరువాత వారు యోనులందు ప్రవేశించి మాతృగర్భంలో ఉంటున్నారు.

శ్రీరాముడు: ఆ స్థితిలో వాసనలు ఉంటాయా? ఉంటే ఎక్కడ ఉంటాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి: జీవులు ఆకాశంలో ఉన్నప్పుడు, గర్భంలో ఉన్నప్పుడు, గాఢనిదురలో ఉన్నప్పుడు కూడా వారి వాసనలు అణిగి, లీనమై ఉంటున్నాయి. మట్టియందు కుండ, కొయ్య యందు అగ్ని మూగగా ఉన్నట్లు వాసనలు కూడా గర్భస్థశిశువునందు అణిగి ఉంటున్నాయి. ఆ తరువాత ఆయా ఉపాధులను పొంది యోగమార్గంలోనో, భోగమార్గంలోనో పయనిస్తున్నారు.

ఈ యోగులందరినీ ముఖ్యంగా రెండు విధాలుగా విభజిస్తూ ఉంటారు. అవి-

1. జీవన్ముక్తుడు; 2. మిశ్రమగుణి

జీవన్ముక్తుడు - ఈతడు పూర్వజన్మలో పరమ వైరాగ్య జీవితము గడిపినట్టినాడు. అనగా భోగముల కొరకు కాకుండా, భక్తి-జ్ఞానముల కొరకు, నిర్మల హృదయం కొరకు కర్మలను ఒనర్చినవాడు. భోగాసక్తి రహితమవటం చేత, అట్టివాడు దైవాంశసంభూతుడై, సాత్వికవృత్తిని స్వీకరించి జీవన్ముక్తుడై వ్యవహరించుచున్నాడు.

మిశ్రమగుణి - ఈతడు దేవయోనిని పొంది కూడా, జన్మమరణ పరంపరలను త్రెంచుకొనుటలేదు. భోగాసక్తుడై ఉంటున్నాడు.

యోగుల మరొక విధమైన విభాగం విను-

ప్రథమ ప్రజాపతి - ఈతడు ఆత్మనుండి ప్రప్రథమముగా ఏర్పడియున్నాడు. ఈతని నుండే తదితర సృష్టి ఏర్పడి ఉంటోంది. ఈ ప్రప్రథమ ప్రజాపతితత్వమునకు సంబంధించినవానికి మరల జన్మించటం అనేదే ఉండదు.

రాజస సాత్వికులు - వీరు కేవల సాత్వికులయ్యేంతవరకూ పదే పదే జన్మిస్తూనే ఉన్నారు.

కేవల సాత్వికులు - వీరు సర్వదా ఆత్మతత్త్వము విచారించి ఉంటున్నారు. అట్టివారు అతి స్వల్పసంఖ్యలో ఉంటారు. అందుచేత దుర్లభులు. వీరు జ్ఞానానందమయ స్వరూపులై ఉంటున్నారు.

ఈ జీవులలో మరికొందరు క్రమక్రమంగా సాత్వికత వదలి తామసులగుచున్నారు. వారు తామసులై, మూఢులై స్థావరస్థితుల వరకు రాలుచున్నారు. వారి గురించి మనం తరువాత తరువాత చెప్పుకుందాం. వారంతా "నేను ఎవరు? ఈ దృశ్యమేమిటి?" అనే ప్రశ్నకే రాకుండా కేవలం దృశ్యముతో సంబంధములను కల్పించుకొని అనేక స్థితిగతులందు దొర్లుచున్నారు. అనేక సుఖదుఃఖములను పొందుతూ ఈ జన్మ కర్మల చక్రములో పరిభ్రమిస్తున్నారు.

❖

జన్మలు పొందుతూ కూడా 'సంసారభావము' ను ఈషన్మాత్రంగా కూడా పొందని జీవులు కూడా ఉన్నారు. వారు నరులలోను ఉన్నారు. సురులలో ఉన్నారు... జంతువులలోను ఉన్నారు.

శ్రీరాముడు: హే మహర్షీ! తాము కేవలసాత్వికులా?

శ్రీ వసిష్ఠ మహర్షి: నేను ఉత్తమ ఆత్మ విచారణపరుడను మాత్రమే. కేవల సాత్వికుడను కాదు. ఎందుకంటే, కేవలసాత్వికునియందు సమాధినుండి విఘ్నము కలుగజేయ గలిగేదేదీ ఉండదు.

అతనికి ప్రారబ్ధము అనేదే ఉండదు. కాని నా విషయమంలో ఈ "రాజస పౌరోహిత్యము" అనే విఘ్నము, లేక ప్రారబ్ధము ఉండనే ఉన్నది. అందుచేత నేను ఇంకొంచెం రాజససాత్వికుడనే గాని పరిపూర్ణమగు కేవల సాత్వికుడను గాదు.

❖❖❖

8. తత్‌పదము

శ్రీరాముడు: మరి నా విషయము స్వామీ?

శ్రీ వసిష్ఠ మహర్షి: నీవు నా వలే శమ దమాది గుణాలు పొందియున్నావు. కాని ఇంకా ఆత్మపదమునందు విశ్రాంతి లభించలేదు. సంసారభ్రాంతి ఇంకా స్వల్పంగా తొలగవలసి ఉంది. అందుచేత 'తత్' పదం గురించి మరికొంత తీవ్రంగా విచారణ, పరిశీలన అవసరం. అయితే, మన ఈ విచారణాసమయములోనే పూర్ణభావమును పొందగల విభవమును కలిగియే ఉన్నావు.

"బాగుగా విచారణచేయాలి" అను పురుషకారము ఆశ్రయించువారు లక్ష్యము ఎందుకు జేరరు? అట్టి ఆత్మతో ఏకత్వము, ఆత్మ లక్షణములన్నీ పొందటం"... అను రూపము గల 'తత్' పదమే పరమోత్తమమైనది. అట్టి ఉత్తమోత్తమ పదము పొందటానికి ప్రతిజీవునకు హక్కు ఉన్నది.

అందుచే ఓ సర్వజనులారా! మీరంతా ఉత్తమవిచారణదాయకమగు గురువులను, శాస్త్రములను ఆశ్రయించండి. నిష్కామభావముతో సాత్వికకర్మలు ఆచరించండి. నిష్కామత్వమే మోక్షము అని చెప్పబడుతోంది. ఆత్మను మీరు సర్వదా కలిగియే ఉన్నారు. "నేను సర్వదా మోక్షరూపుడనే"... అను రూపముగల "బ్రహ్మోఽహమ్" భావనను పొందియే ఉండండి. అట్టి అవగాహన సముపార్జించుటకు ఈ మానవజన్మ ఉత్తమమైన అవకాశం. ఈ అవకాశమును వృథాపరచుకోకండి.

అట్టి పూర్ణానుభవం పొందిన, పొందుచున్న మహనీయులు మన మధ్యలోనే కొందరు తప్పక ఉన్నారు. వారి కొరకై వెతకండి. "మీరంతా 'పూర్ణత్వము' యొక్క అనుభవము వెతుక్కుంటూ ఈ ఈ యోనులందు ప్రవేశిస్తున్నారు"... అని గుర్తుచేస్తున్నాను. అట్టి అనుభవం పదార్థములను, విషయములను పొందినంత మాత్రం చేత ప్రాప్తించగలదా? లేదు. అందుచేత పుల్లలను ప్రోగు చేయు పిట్టలవలె ధన-జన-యౌవనాలను మాత్రం చూస్తూ, ఉత్తమలక్ష్యమును ఏమఱువకండి. నిదురలేచి మీ ఆత్మయొక్క ఔన్నత్యమును గ్రహించండి.

❖❖❖

X. స్థితి ప్రకరణము - విషయ సమీక్ష

శ్రీ వసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! మనం ఈ ప్రకరణంలో చర్చించుకొన్నట్టి అన్ని విషయముల సారమును క్రోడీకరించి సంక్షిప్తంగా ఇప్పుడు కొన్ని విశేషాలు చెపుతాను. అటు తరువాత మనం ఈ పదవ రోజు చర్చను ముగించబోతున్నాం.

❖

మహాగుణులగు కొందరు ఈ భూమిపై జన్మిస్తున్నారు. వారు తత్త్వవిచారణాసమర్థమగు రాజసిక సాత్త్విక వృత్తులతో ఆనందమయంగా సంచరిస్తూ ఈ భూమిని పావనం చేస్తున్నారు. ఆకాశంలో పూర్ణచంద్రునిలాగా నలువైపులా ఆహ్లాదమును ప్రసరింపజేస్తున్నారు. గాలి వేగానికి దుమారం లేచినంత మాత్రంచేత ఆకాశము కలుషితం అవుతుందా? వారి మనస్సులు కూడా దుఃఖములందు పడుటలేదు. బంగారముతో తయారుచేయబడిన పద్మము చీకటిపడినప్పటికీ వాడదు కదా! వారు గొప్ప ఆపదలలో కూడా మ్లానమనస్కులు అగుటలేదు. యాదృచ్ఛికంగా లభించిన నీటితో అడవిలోని వృక్షములు సంతోషించుచున్నట్లు, ఆ మహనీయులు లభించనిదేదీ కోరుకోరు. వృక్షములు ఇతరులకు నీడను, ఫలములను ఇవ్వటమే స్వభావంగా కలిగి ఉంటాయి గాని, "వీరు నాకు నీరు కూడా పోయలేదే? మరి నీడను ఎందుకివ్వాలి?" అని అనుకుంటున్నాయా? లేదే! వారు కూడా ఈ సంసార జనులకు ఆహ్లాదమును, ఆనందమును, జ్ఞానదృష్టిని ప్రసాదిస్తూంటారు. అది వారి స్వభావమే కాని, మరేదో ఉద్దేశించి వారు అట్లు చేయుటలేదు. నిర్మలమైనట్టి వారి బుద్ధి 'మోక్షము' అను ఒకే ఒక్క ఉపయోగము కొరకై 'శాంతి' మొదలైన అమృత గుణము లందు నిమగ్నమై పుష్టిని పొందుతూ ఉంటుంది.

చంద్రుడు ఎప్పుడైనా తన శీతలత్వమును వదలి ఉంటున్నాడా? లేదు. ఆ మహనీయుల సౌమ్యమైన బుద్ధి అపత్కాలంలో కూడా అంతరంగంలో సమగ్రమైన సమాధానం కలిగే ఉంటుంది. అంతే గాని, "దైన్యం-క్రోధం-ద్వేషం-అసూయ" మొదలైన దుర్వ్యసనాలకు లోను కాదు.

వారి ప్రకృతి 'మైత్రి' మొదలైన కళ్యాణగుణములతో గూడి ఒప్పుతూ ఉంటుంది. ఆత్మను ఎఱిగినట్టి సాధుపురుషులు సౌమ్యభావులై, సమరసులై సుందరగుణములతో సర్వదా ఒప్పుతూ ఉంటారు. అట్టి ఆపదలకు అతీతమగు ఆత్మస్థితిని పొందుటయే కర్తవ్యముగా భావించబడు గాక!

ఓ ప్రియజనులారా! దుఃఖములను వీడండి. ఈ జీవితముల పట్ల, జన్మల పట్ల, దృశ్యాల పట్ల... "ఇవి ఏమి అయియున్నాయి? నేనెవరు? నాకు వీటికి ఉన్న సంబంధమెట్టిది? ఏది భావన? ఏది భావించునది?"... మొదలైన విషయములలో ఉత్తమ విచారణ పెంపొందించుకోండి. 'ఆత్మతత్త్వము' యొక్క ఔన్నత్యం గ్రహించిన ఉత్తములు, దాన్ని సముపార్జించటానికే జ్ఞాన

విజ్ఞానాలను అభ్యసిస్తున్నారు. తమ యొక్క "సత్వగుణాధిక్యత"చే రజోగుణమును క్షయింప జేసుకొంటూ, ఆత్మసాన్నిధ్యమును పొందుచున్నారు. ఆత్మానందము, ఆత్మసామీప్యము ఎట్టిదో గ్రహించి ఉంటున్నారు. సచ్ఛాస్త్రముల, పెద్దల ప్రవచనముల, స్వవిచారణల సమృద్ధిచే వారు "ఈ ప్రపంచంలో పొందబడుచున్నవి, గాంచబడుచున్నవి...ఇవన్నీ అనిత్యము" అని గ్రహించి 'నేను చిత్తశుద్ధిని పొందేది ఎట్లా?' అను ఏకైక లక్ష్యముతో కర్మిష్టులగుచున్నారు. ఈ ఐహిక, ఆముష్మిక క్రియలన్నిటినీ ఆపదలుగా భావించి అల్లంతదూరంలోనే ఉంచుచున్నారు. అంతే గాని, వారు అజ్ఞాన ప్రవాహమున పడుట లేదు. వాటి పట్ల ఇచ్ఛ-ద్వేషములు గాని, గ్రాహ్య-త్యాజ్య బుద్ధి గాని వారికి ఉండుట లేదు.

విచారణ చేస్తూ ఉండాలి - నాయనలారా! మీరు అసమ్యక్ దర్శనం (perception of inequality) ను తగ్గించుకుంటూ రావాలి సుమా! "నెనెవడను? ఈ సంసారాడంబరమంతా ఎట్లా ఉత్పన్నమగుచున్నది?"... అను జ్ఞానబోధకమగు విచారణ చేస్తూ ఉండాలి. తెలివిగల వాడెవడైనా అత్యంత యత్నంతో సాధువులను సమీపిస్తూ, వారితో చేయు సంభాషణ సహాయంతో వివేకమును పెంచుకుని, అప్పుడు ఈ జన్మ కర్మాది సాంసారిక విషయాల పట్ల సదవగాహనను ఆశ్రయిస్తాడు. పైన చెప్పినట్లు విచారణ చేస్తూనే ఉంటాడు. అంతేగాని, తన జీవితమును వృథా చేసుకోడు.

మీరు కర్మసూత్రములచే బంధింపబడి చతికిలపడి ఉండకండి. అనర్థములైన వ్యవహారము లనే రోజురోజుకూ పునశ్చరణ చేస్తూ రోజులు వెళ్ళబుచ్చకండి. ఈసంసారంలో ఇక్కడ అక్కడ కొన్ని ప్రియమైన వస్తువులు కనబడుచున్నమాట నిజమే. అయితే అవన్నీ ఒకనాటికి నశించబోవు చున్నాయి కదా? వాటిచే ఎందుకు మోసగించబడాలి?

ఈ భూమిపైకి ఎంత మంది రాలేదు? ఎంతమంది పోలేదు? ఇక్కడ వినూత్నమైన వస్తువు అంటూ ఏమి ఉన్నది? కనుక సర్వ పటోటాపాలు వదలివేయండి. చాతక పక్షి మేఘ జలాల కొరకే 'అన్వేషణ-నిరీక్షణ'లను పాటిస్తుంది గాని, మురికిగుంటలలోని నీరు కొరకు కాదు. మీరు కూడా ఉత్తమ జ్ఞానమును, అట్టి సంజ్ఞలను ప్రసాదించు సాధువులను ఆశ్రయించండి.

ఈ అంతర్గతమైన అహంకారం గురించి... బహిర్గతములైన 'శరీరములు' మొదలైనవాటి గురించి... ఈ బంధుమిత్ర సమాగమముల గురించి... కొంచెం సత్యదృష్టితో యోచన చేయండి. "వీటిని పెంపొందించుటకు ప్రయత్నించుటచే, ఇవి మమ్ములను సంసార సాగరం నుండి తరింప జేయగలవా?" అని ప్రశ్నించుకోండి. మరల మరల మీకు మీరే యోచించుకోండి.

గడచినదాని గురించి వగచటం అనవసరం. ఇక తాత్సారం చేయవద్దు. ఇప్పుడిక సంసార తారకమగు ఆత్మవిచారణ చేపట్టండి. విచారణచే సత్యము మీ మీ హృదయము లందే సుప్రకటితం కాగలదు. స్వశరీరములోని సాక్షిని దర్శించండి.

అస్థిరములైన ఈ శరీర-అహంకారముల పరిమితదృష్టిని పరిత్యజించండి. ముత్యాల హారంలో అంతర్లీనంగా ఉన్న తీగవలె ఉన్నట్టి సాక్షిస్వరూపమగు ఆత్మను వీక్షించండి. సర్వవ్యాప్తం,

నిత్యము, సర్వమును భావించునది అయినట్టి ఆ పరమవస్తువునందే ఇదంతా ప్రకటితమగు చున్నట్లుగా గ్రహించండి. ఈ సువిశాలమైన భూప్రదేశమునందు, ఆ ఆకాశంలోనూ, సూర్యుని యందూ, భూరంధ్రములలోనూ, నివసించే ఒక చిన్నపురుగులోనూ, ఆ పురుగులోని ఒక అణువులోను... అన్నిటా చిత్స్వరూపమే వెలయుచున్నది.

ఒక ఉపమానం. ఒకచోట అనేక కుండలు ఉన్నాయనుకో... ఆ అన్ని కుండలలోని ఆకాశము ఒక్కటే కదా! వివిధ శరీరములలోని 'చిత్తు'కు భేదమేమీలేదు.

'కారం-తీపి-చేదు" మొదలైన రుచులు వేరువేరైనప్పటికీ, ఆ రుచిని గ్రహిస్తున్న తత్త్వము ఒక్కటే అయున్నది కదా! అంతేకాని కారము రుచికి ఒక తత్త్వము, తీపిరుచికి మరొకతత్త్వము ఏర్పడి ఉండుటలేదే! అనేక చోట్ల ప్రకాశించుచున్నప్పటికీ చిద్వస్తువు ఒక్కటే. అనేక గ్రామాలలో ప్రసరించు సూర్యరశ్మి ఒకే సూర్యతత్వం. అంతేగాని "ఆయా కిరణములు వేరు వేరు వస్తువులపై ప్రసరించుచున్నాయి కాబట్టి అవన్నీ వేరు వేరు"... అనటం ఉచితం కాదు కదా!

ఉన్నది సర్వదా ఒక్కటే! ఒకే వస్తువు సర్వదా వెలయుచుండగా "ఈతడు పుట్టినాడు... చచ్చినాడు..." అనునదంతా అసంగతమే అవుతుంది. ఉత్పన్నమైయ్యేది, నశించేది సత్యవస్తువు ఎట్లా అవుతుంది?

ఓ రాఘవా! దేనినైతే "ఇది జగత్తు" అని నీవు గాంచుచున్నావో అదంతా కూడా 'చిత్' యొక్క ప్రతిబింబము మాత్రమే. ఈ జగత్తు సత్తు కాదు. అసత్తు కూడా కాదు. ఇది ఆ రెండింటికీ విలక్షణమైనది.

ఇతడి చిత్తం అశుద్ధమై(దోషపూరితమై), విషయాల పట్ల ప్రేలాపన కలిగి ఉన్నదైనప్పుడు - అట్టి సమయంలో ఈ జగత్తు సత్తుగానే అతనికి తోచుచున్నది.

ఏ మహాత్ముడు మోహనివృత్తుడై ఉంటున్నాడో అతనికి ఇది 'అసత్తే' అని తెలియవస్తోంది. అందుచేతనే 'ఈ దృశ్యం అనిర్వచనీయం. అధ్యాసరూపమునైతే మోహకారణమే అగుచున్నది"... అని చెప్పబడుతోంది.

ఈ జగత్తే మిథ్య అయి ఉన్నది. ఇక మోహమేమిటి? ఆ మోహమునకు ఒక కారణం ఉండుట ఏమిటి? మిథ్య అయినదానికి కార్య-కారణములు కూడా మిథ్యయే కదా!

కాబట్టి రామా! నీవు 'జన్మ-స్థితి-మరణము'ల గురించి దుఃఖించవలసిన అవసరమే లేదు. ఆకాశం వలె సర్వత్రా సముడవై నిర్మలభావమునందు వెలసియుండుము. సత్యమై, నిత్యమై, ఆనందమయమైన నీ స్వస్వరూపమునే అవధరించి ఉండుము. "నేను జీవుడను... స్వల్పుడను... పుట్టుచున్నాను... చచ్చుచున్నాను..." మొదలైన బలహీనమైన భావములను త్యజించివేయి.

"నేను అఖండము, నిర్వికారము అగు ఆత్మ వస్తువునే అయి ఉన్నాను..." అని భావించు చుండగానే ఇప్పుడే ఇక్కడే మోక్షస్వరూపుడవు కాగలవు. అంతేగాని, మోక్షం ఎప్పుడో ఎక్కడో పొందవలసినది అయి ఉండలేదు.

ఉత్తమ గుణ సముపార్జన -

శ్రీ వసిష్ఠ మహర్షి: భవిష్యత్తును నిర్ణయించేది వర్తమాన ప్రయత్నములే!

నాయనా! రామా! నీవు లభించిన అవకాశములను వృథాపరచుకోకుండా ఉత్తమ గుణములను సముపార్జిస్తూ ఉండాలి. ఎప్పటికప్పుడు నీచ ప్రవృత్తులను త్యజించుట యందు, ఉత్తమ కర్మలను ఆశ్రయించుటయందు జాగరూకుడవై ఉంటూ ఉండాలి.

బాహ్యాభ్యంతరము లందు "సహించుట" అను శక్తిని కలిగి ఉండాలి. ధీరుడవు, విచారణ పరుడవు అయి ఉండు. సూక్ష్మమైన బుద్ధిని సంపాదించుకో. సర్వవిఘ్నములకన్నా, సర్వ ప్రతిబంధకముల కన్నా కూడా బలవంతుడవగుచూ ఉండాలి.

సద్గురువులను ఆశ్రయించి, వారితో శాస్త్రవిచారణ చేయి. విషయములకు సంబంధించిన తృష్ణను నీ మనస్సు నుండి ఎప్పటికప్పుడు తొలగించివేస్తూ ఉండు. ఆత్మవేత్తలు కనబడినప్పుడు వారిని ఆశ్రయించు, శరణువేడు. వారు విజ్ఞానదాయకమగు ఉత్తమ విషయాలు బోధిస్తారు.

మనోనాశనము సాధించు. అప్పుడు సమాధి స్వయముగా లభించగలదు. శాస్త్రములచే చెప్పబడుచున్న అర్థములను వివేకముతో అభ్యసించుచు, ఎవడైతే 'సుసంగి' అగుచున్నాడో... అట్టి శుద్ధపురుషుడు ఆత్మస్వరూపమును ఎఱుగుటకు అర్హుడగుచున్నాడు.

❖

ఓ రాఘవా! నీవు ధీరుడవు. పవిత్ర ఆచరణము గలవాడవు. ఉత్తమ గుణములు నిన్ను ఆశ్రయించుకుని ఉన్నాయి. "సృష్టి" అనబడే మనోమలం నీ నుండి దూరంగా తొలగుతోంది. అట్టి నిర్మల స్వరూపుడవగు నీవు దుఃఖ రహితమగు ఆత్మ యందు వెలయుచుండుటకు అడ్డేమి ఉంటుంది?

శరత్కాలంలోని మేఘరహిత ఆకాశంలాగా 'జగత్తును' తనయందు రహితం చేసుకొను ఆత్మజ్ఞుడు స్వచ్ఛత-నిర్మలత-ప్రశాంతత్వము-అఖండత్వము స్వయంగా పొందుచున్నాడు. అట్టి వానికి ఇక సంసార భయమెక్కడ? ఓ ఉత్తమ జ్ఞానీ! (వైరాగ్య ప్రకరణంలో) నీవు ప్రకటించిన విశ్లేషణా చాతుర్యం మమ్ము ముగ్ధులను చేసింది. మనం ఈ పదిరోజులుగా చేస్తున్న సంభాషణ ప్రభావంచేత నీ మనస్సు బాహ్యవస్తుచింతన క్రమక్రమంగా త్యజిస్తున్నట్లు నేను గమనిస్తున్నాను. మహాశక్తివంతమగుచున్న నీ బుద్ధి పరమాత్మతో ఏకీభావం పొందుతోంది. అందుచేత మా ఉద్దేశములో నీవు ముక్తుడవే అయి ఉన్నావు. ఈ విషయంలో సందేహమే లేదు.

ఓ సభికులారా! రాగద్వేషములంటూ ఏ మాత్రం లేని వాడైన ఈ రాముడు తదితరులకు ఆదర్శప్రాయుడే అగుచున్నాడు.

బహిః లోకోచితాచారా విహరిష్యన్తి యే జనాః ।

భవార్ణవం తరిష్యన్తి ధీమన్తః పోతకాన్వితాః ॥

'జ్ఞానము' అనే నౌకను పొందినట్టి బుద్ధిమంతులు బాహ్యలోకము కొరకు ఉచితంగా

వ్యవహరిస్తూ ఉంటూనే ఈ సంసార సాగరమును ఇట్టే దాటివేస్తున్నారు. నేను ప్రతిపాదిస్తున్న అనేక సత్యవాక్యాలు అవిచారణపరులకు ఉదాసీనంగానే కనిపిస్తున్నాయేమో గాని, బుద్ధిమంతులు, సుజనులు, సమదర్శులు, ఉత్తమదృష్టి సంపన్నులు తమ జ్ఞానదృష్టిని మరింత బలోపేతం, పరిపుష్టం చేసుకుంటున్నారు.

ఓ రామా! నీవు సర్వదా జ్ఞానివే అయి ఉండాలి. ఈ శరీరం ఉన్నంతవరకూ విషయముల పట్ల ఏమాత్రం ఆసక్తిలేనివాడవై, ద్వేషములను, వాసనలను వీడి, లౌకికమైన ఆచారములను ఆచరిస్తూ వ్యవహరిస్తూ ఉండు.

ఉత్తమజ్ఞానులు, సాత్వికగుణసంపన్నులు అగు జీవులు ఈ ప్రపంచములోకి వచ్చి "పరిశుద్ధత్వం–పరమశాంతిత్వం" సముపార్జిస్తున్నారు. లోకకళ్యాణ కారకులగుచున్నారు. ఉత్తమ కర్మల యందు ఆచరణపరులై పరమశాంతిని పొందుచున్నారు.

ఇక, మరికొందరు జీవుల విషయం చూస్తే... వారు ఎద్దులాగా, నక్కలాగా పరవంచకులై ఉంటున్నారు. శిశువుల వలె మూఢులే అయ్యి, వారు మానవజన్మ అను ఉత్తమ అవకాశాన్ని వృథా చేసుకుంటున్నారు. అట్టి వారిని చూస్తున్నప్పుడు లోకకళ్యాణమే ప్రవృత్తిగా కలిగిన మా వంటి మునులకు జాలియే వేస్తోంది. అట్టివారిని గురించి విచారిస్తే మాత్రం ఏం ప్రయోజనం?

కర్మసిద్ధాంతము - "నీవు మనస్సును ఎప్పటికప్పుడు పరిశుద్ధం చేసుకొనుట"... అను మహత్తరమైన ఆశయం కలిగి ఉండు. అట్టి మనోనిర్మలత కొరకు సర్వాత్మకుడగు ఆ పరమేశ్వరుని 'స్వధర్మము' అను పుష్పములతో పూజించుము. అట్టి అవగాహన కలిగియున్నప్పుడు నీవు లోక కళ్యాణ కారకుడవే అవుతావు. ఈ ప్రపంచమును కొంచెము పరిశీలినగా చూస్తూ ఉంటే నీకు ఇందులో సాత్త్వికులైన ఉత్తమ పురుషులు* తప్పకుండా తారసపడతారు. వారియందలి ఉత్తమ గుణములను గమనించు. ఆ గుణములను నీవు కూడా అలవరచుకో. అట్లు, ఉత్తమ ఆదర్శాలను స్వీకరించేవాడు, శాంతి, శమము మొదలైన ఉత్తమ లక్ష్యములను కలిగి ఉండేవాడు, శాస్త్రము, స్వధర్మములకు అనుచితంగా నిష్కామబుద్ధితో కర్మలను నిర్వర్తించేవాడు... అట్టి వాడు క్రమంగా 'జ్ఞానోపయోగము' అయినట్టి శుద్ధశరీరమును పొందుచున్నాడు.

ఈ జన్మయందు నీవు అనుసరించు గుణములే ముందు ముందు ఆయా ఉత్తరోతర కర్మ జ్ఞాన స్థితులందు నిన్ను నియమిస్తున్నాయి... అనునదే కర్మ యొక్క సిద్ధాంతము. కాబట్టి, కర్మ బద్ధుడగు జీవుడు ఇతఃపూర్వపు కర్మలచే నియమించబడినవాడై ప్రవర్తించుచున్న మాట నిజమే. కాని వర్తమాన పురుషకారముచే పూర్వజన్మ సంస్కారములు తప్పక జయించివేయబడగలవు.

(ఇతఃపూర్వపు కర్మ సంస్కారాలు + వర్తమాన ప్రయత్నాలు) = (ఈ జీవుని వర్తమాన భవిష్యత్తులు)

---

* పురుషుడు అంటే పురుషకారము ప్రదర్శించువారు, ప్రయత్నశీలురు. అంతేగాని, 'మగవారు' అని అర్థం చేసుకోరాదు.

"అయ్యో! నేను ఈ ఈ తప్పులు చేసియున్నాను కదా? నా గతి ఏమగును? ఇంతే, ఇక నేను బాగుపడను... ఎవ్వరో మహానుభావులే సరికాగలరు.... నేను సరి అయ్యే ప్రసక్తి ఎప్పటి విషయమో గాని, ఇప్పటి విషయం కాదు..." ఈ విధంగా స్వల్పమగు భావములకు తావిచ్చి వర్తమాన కర్తృగతిని బలహీనపరచుకోవద్దు.

ఇప్పుడు చేయవలసినట్టి శారీరక మానసిక ప్రయత్నములు నీ చేతిలోనే నీ నిర్ణయమును అనుసరించే ఉంటున్నాయి. మరిక తాత్సారం దేనికి చెప్పు?

కొందరు తమ భూత భవిష్యత్తులపై... అపరిపూర్ణమైన, బలహీనతలతో కూడిన... అభిప్రాయాలను కల్పించుకొని సాలెపురుగు వలె అందులోనే చిక్కుకొని ఉంటున్నారు. తమ నరకములను తామే నిర్మించుకొని పరితపించుచున్నారు. అయిన దాని గురించి వగచటం ఆపు. భూతకాలం అట్లుండనీ. "ఇప్పుడు నేను ఏది చేయాలి?.... ఏది చేయకూడదు"... అను విషయమునకు రమ్ము. ఉత్తములగు సాధుపురుషులను, శాస్త్రములను ఆశ్రయించు. వర్తమాన కార్యక్రమమును పూర్ణమైన సదవగాహనతో నిర్ణయించుకో. ఆలోచన-శ్రద్ధ-అవగాహనలను ఉత్తేజపరుచుకో. ప్రశాంతముగా, గంభీరంగా, సాలోచనగా 'ఆత్మప్రాప్తి' కొరకు ప్రయత్నములను చేయుచుండుము.

❖

శత్రురాజులు తమ బలపరాక్రమములతో బాధించుచున్నప్పుడు, అప్పుడు వారు పౌరుష బలముచేతనే జయించబడుచున్నారు కదా! ఈ బుద్ధి అనే రాజ్యం 'తామస-రాజస' గుణములు... అనే శత్రురాజులచే వేధింపబడుచున్నది. అట్టి ఈ 'బుద్ధి సామ్రాజ్యము' ను రక్షించుకోవాలి. లేదా, రాక్షస-పిశాచాది యోనులలో ఈ బుద్ధి ప్రవేశించే ప్రమాదం ముంచుకురాగలదు. బురదలో ఇరుకుకున్న దున్నపోతును బయటకు తెచ్చునట్లు ఈ బుద్ధిని ఉద్ధరించే ప్రయత్నాలు సర్వదా చేస్తూ ఉండాలి.

చిత్తము, పురుషకారము - సాధుపుంగవులు తమ 'వివేకము' యొక్క ఫలితంగానే సాత్వికగుణ సంపన్నులగుచున్నారు. స్వచ్ఛమైన మణిని ఏ ద్రావణంలో ముంచితే ఆ రంగునే కలగి ఉంటుంది కదా! ఈ 'చిత్తము' అనే మణి కూడా అంతే. దీనిని ఎందులో నియమిస్తామో అది అద్దానియందే తన్మయమై ఉంటూ ఉంటుంది.

చిత్తమునుండే 'పురుషకారము' కూడా ఉత్పన్నమగుచున్నది. ముముక్షువులంతా తమ యొక్క పౌరుషబలముచేతనే అమూల్యమైన గుణములను ఆర్జిస్తున్నారు. అంతేగాని ఎవ్వరి గుణములను మరెవరూ ప్రసాదించుట ఇక్కడ ఉండదు. అట్టి పౌరుషబలము చేతనే వారు శుభజన్మలను పొందుచున్నారు. 'గుణి' అయినవాడు తన పురుషకారముచే పొందలేనిది... ఈ స్వర్గ, మర్త్య పాతాళములలో ఎక్కడా ఏదీ లేదు. బ్రహ్మచర్యము, వీర్యము, వైరాగ్యము, ఇవి

ఉన్నప్పుడే ఒకడు ఉత్తమ వస్తువును సాధిస్తాడు. ఈ ఆధ్యాత్మక్షేత్రంలో కూడా అది అట్లే అగుచున్నది. "అఖండ, అద్వితీయ, స్వస్వరూపాత్మ సంస్థానము"... విషయం కూడా అట్టిదే.

గుణి (గుణములు కలిగియున్నవాడు) - ఓ రఘురామా! ఇప్పుడు నీకు ఉపదేశించిన, ఉపదేశించబోవుచున్న ఆత్మతత్త్వము అత్యంత దుఃఖనివృత్తికరము సుమా! ఇది జీవునికి నిరతిశయ మైన శాంతిని ప్రసాదించగలదు. సకల జనులకు హితం చేకూరుస్తుంది. అందుకని ఇది శ్రద్ధగా వినాలి. అశ్రద్ధ బద్ధకములచే తిరస్కరించకూడదు. సకల జనులలో విశుద్ధములగు సత్వ గుణములు వృద్ధికావాలనునదే మా ఆశయం.

"బుద్ధి బలముచే ఆత్మభావనయందు ఈ జీవుడు సుస్థిరుడు అగుట" అనునదే ఈ ప్రయత్నము ఉద్దేశించుచున్న అంతిమ ప్రయోజనం. ఆత్మభావన సుస్థిరమగుచుండగా ఇక మనస్సు తన చంచలత్వమును వదలి శాంతిని పొందగలదు. అట్టి ఆత్మావలోకనము ఎవ్వరికైనా ఎప్పుడైనా ఎక్కడైనా సాధ్యమే.

కాబట్టి ఓ సభికులారా! మీరంతా ప్రయత్నశీలురై ఉండవలసినదిగా మీ శ్రేయోభిలాషుల మగు మేము మరల మరల హెచ్చరించుచున్నాము. మీలో ప్రతి ఒక్కరికీ 'ముక్తస్వరూపులు' కాగల అవకాశము, అధికారము తప్పక ఉన్నది.

ఓ రామచంద్రా! నీవు మహామహిమాన్వితుడవు. శాంత్యాది మహత్తర గుణాలు నీ యందు ప్రస్ఫుటమౌతున్నాయి. పరమసాత్వికుడవుగా నిన్ను మేము గుర్తిస్తున్నాము. తదుచితంగానే ప్రవాహపతితములగు కార్యములను నిర్వర్తించెదవు గాక. నిన్ను నిమిత్తం చేసుకొని ప్రతి మానవునకు నేను ఈ విషయం గుర్తు చేస్తున్నాను.

నాయనలారా! 'సంసారాసక్తి' అనే మోహమునకు మీ హృదయంలో చోటివ్వకండి. స్వతహా గానే మోక్షస్వరూపులగు మీరు మీ మీ ముక్తస్వరూపమును ఏమఱువకండి. స్వస్వరూపము గురించి ఎఱుకయే జన్మ ఎత్తినందుకు ఉత్తమ ప్రయోజనమైయున్నది.

❖

సభలోని వాతావరణం అలౌకిక ప్రశాంత గంభీరతలతో నిండిపోయింది. సభికులంతా వసిష్ఠమహర్షి చెప్పు ఒక్కొక్క వాక్యములోని ఔన్నత్యమును గమనించుచు "ఆహాఁ! ఈ ఋషులు మాపై ఎంతటి అవ్యాజమైన ప్రేమ కలిగియున్నారు!" అను భావన పొందారు. రామచంద్రునితో సహా అనేకమంది వదనములలో వికాసము ప్రస్ఫుటమైనది. ఆ సభలోని రాజులు, పండితులు, తదితరులు దీర్ఘాలోచనామగ్నులై కనబడ్డారు.

సభలోని అనేకుల 'మనస్సు' అనే చపల వానరం భోగపదార్థములకు సంబంధించిన మననమును త్యజించి, మౌనభావంతో ఆత్మవస్తువు వైపు సాలోచన కొనసాగించసాగింది.

దశరథుడు మొదలైన రాజులు ప్రశాంతచిత్తులై ఉన్నారు.

ఆధ్యాత్మిక శిక్షణాబలంచే లక్ష్మణుడు మొదలైన వారి హృదయాలు 'బ్రహ్మస్వరూపం' అనే లక్ష్యమును సుస్థిరీకరించుకున్నాయి.

మునుల హృదయాలు వికసించి, 'ముఖములు' అనే పద్మములు 'ప్రశాంతత' అను సువాసన వెదజల్లాయి.

సూర్యభగవానుడు అస్తమాద్రిని సమీపిస్తున్నాడు. సభ ముగిసింది. సభికులు క్రమంగా తమ సాయం సంధ్యాది కార్యక్రమాల కొరకు గృహోన్ముఖులయ్యారు.

❖❖❖

(పదవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

స్థితి ప్రకరణం సమాప్తం

బ్రహ్మార్పణమస్తు – లోక కళ్యాణమస్తు

ఓం తత్‌సత్

రఘునాథాయ నాథాయా సీతాయాః పతయే నమః

శ్రీ వసిష్ఠ - రామ సంవాదము

V. ఉపశమన ప్రకరణం

ఉపశమన ప్రకరణము

I. ప్రకరణ పరిచయం

1. పదవ రోజు రాత్రి.......... పునశ్చరణ

పదవ రోజు రాత్రి వాతావరణం ప్రశాంతంగా ఆహ్లాదకరంగా ఉన్నది. అయోధ్యానగరమంతా సౌమ్యము, సుందరము, రమణీయము అగు ప్రకృతిచే అలంకారయుక్తమై ఉన్నది. ఒక్క రామచంద్రుడు తప్ప తక్కినవారంతా ఆ రాత్రి క్షణంలాగా నిదురలో గడిపివేశారు. రాముడు మాత్రం ఆ రాత్రంతా వసిష్ఠమునీంద్రులచే ఉపదేశించబడిన వాక్యములను చింతన చేయసాగాడు.

శ్రీరాముడు (తనలో) : ఆహా! ఏమి ఈ సంసార సంభ్రమణం! ఈ మనుజులంతా ఎవ్వరు? ఈ విచిత్ర ప్రాణిసమూహమంతా వస్తున్నది ఎక్కడినుండి? వీరంతా ఎటు పోతున్నారు? అసలీ మనస్సు యొక్క స్వరూపమేమిటి? ఇది శమించేది ఎట్లా? ఈ చమత్కారమైన మాయావ్యవహారమంతా ఎవరు, ఎవరి కొరకు, ఎక్కడ, ఎందుకు, కల్పిస్తున్నారు? ఈ మాయకు ఇంతటి నైపుణ్యము ఎక్కడి నుండి వస్తోంది? ఇది అసలు నివారించబడగలదా? జీవునికి ఈ గుణదోషములన్నీ ఎక్కడి నుండి వచ్చిపడుతున్నాయి?

....ఆకాశం కంటే కూడా అతిసూక్ష్మము, అతి విశాలము... అయినట్టి ఆత్మ ఈ విధంగా, జీవుడుగా ఎందుకు పరిణమిస్తోంది...?

ఈ సంకుచితత్వము ఎంతగా ఘనీభవించి ఉన్నది! ఈ పది రోజులుగా వసిష్ఠ మునీంద్రులు ఆత్మ గురించి, మనోనాశనం గురించి, ఇంద్రియజయం గురించి అనేక విశేషాలు వివిధ కోణముల నుండి చెప్పియున్నారు. అయినాకూడా వెలుగునీడలవలె జ్ఞాన, అజ్ఞానములు ఏర్పడుచూనే ఉన్నాయే? నా వివేకము ఇంకనూ పూర్ణముగా వికసించదేమి?

అవును. ఆత్మయే స్వయముగా ఈ "జీవుడు – చిత్తము – మనస్సు" మొదలైన రూపములలో ఈ అసన్మయమైనట్టి సంసారమును విస్తరింపజేస్తోంది. ఈ అహంకారము మొదలైనవన్నీ 'మనస్సు' అనే త్రాడుచే చుట్టబడి ఉంటున్నాయి. అట్టి మనస్సు సంక్షయించిందా.... అప్పుడు 'నేను జీవుడను' అను స్వల్పాభిప్రాయం కూడా తొలగిపోతుంది. దుఃఖోపశమనం సిద్ధిస్తుంది. మరి అహంకారమును, మనస్సును, "నాది– మాది– నేను– మేము" అను మోహమును రూపుమాపాలంటే ఉపాయాలేమిటి? హంస నీటిని విడచి, పాలను పీల్చునట్లు, విషయ భోగములతో కూడిన అల్పధ్యాసల నుండి ఆత్మను వేరుచేయటం ఎట్లా?

భోగములన్నీ త్యంజించివేద్దామా? .... "నాకీ రాజ్యము వద్దు, పదార్థములతోటి తదితర సర్వజనులతోటి అసలు ఎట్టి సంబంధమూ వద్దు" అను నిర్ణయమునకు వద్దామా? మంచిదే.... కానీ, వాటిని నేను వదలినా, అవి నన్ను వదులుతాయా? వాటిని దూరంగా త్యజించితే ఈ శరీర ధారణం సాధ్యమేనా? కాదేమో? త్యజించకపోతే విపత్తులు వచ్చిపడుతూనే ఉంటాయే? అరెరే! .... భలే సంకటం వచ్చిందే!

ఆత్మ అనునది సర్వదా సిద్ధించియే ఉన్నది. స్వతహాగా అన్నివేళల సిద్ధించి ఉన్న దానిని పొందటమేమిటి? కోల్పోవటమేమిటి? ఇక ఆత్మకు ఏ అఖండత్వము, అప్రమేయత్వము, నిత్యత్వము మొదలైనవన్నీ వర్ణించబడ్డాయో అవి ఆత్మయే స్వరూపముగాగల నాకుకూడా వర్తిస్తాయి కదా! 'ఆత్మ తత్త్వప్రాప్తి' అనునది మనోమాత్ర విషయమే అవుతుంది.... అంతే గాని అది ఈ ఇంద్రియములకు విషయమే అయి ఉండలేదు.

పైగా, బాహ్యవిషయములు తెలుసుకోవటానికికూడా ఈ మనస్సే పరికరమగుచున్నది. ఈ ఇంద్రియములను వెలిగిస్తున్నది, ఉపయోగించుచున్నదికూడా మనస్సే. అట్టి మనస్సును కూడా నియమిస్తున్నది, అధిరోహిస్తున్నది ఎవరు? నిర్విషయుడనగు నేనే కదా!

ఆహా! బాలుడు తనయొక్క అజ్ఞాన కారణంగా చీకటిలో దయ్యమును చూస్తూ ఉంటాడే.... అట్లాగే మనస్సుకు కూడా గుదిబండలాగా ఈ దృశ్యముతో బంధము ఏర్పడుతోంది. మరి మనస్సును సన్మార్గంలో ఎట్లా నడిపించాలి? ఇక నాకు ఒక్కటే ఉపాయం కనబడుతోంది. తన ప్రియుడు లభించిన తరువాత స్త్రీ మరిక అన్యుని స్మరిస్తుందా? లేదు కదా...! నా ఈ బుద్ధి కూడా సంసార భ్రమలను ఆశ్రయించ కుండా పరమశాంతి పూర్వకమగు ఆత్మత్వమునే అవధరించు గాక! ఆపై ఇక అన్యపదార్థముల గురించి చింత ఏముంటుంది? నా మనస్సు క్రోధరహితమై, కామవర్జితమై, పవిత్రవంతమై పాపరహితమై ఉండు గాక! అప్పుడది స్వయముగానే ఆత్మ పదమునందు విశ్రాంతి పొందగలుగుతుంది. ఆహా! సద్గురువులగు వసిష్ఠులవారు బోధించియున్న ఏడవ భూమికయందు ఎప్పటికి సంస్థితుడనై సుస్థిరుడనై ఉంటానో! ఎప్పటికి 'జీవన్ముక్తి' సుఖమునందు దృఢపూర్వకంగా విశ్రాంతి పొంది, ఈ జగత్తునందు యథావిధిగా విహరిస్తూ ఉంటానో కదా!

ఈ నామనస్సు ఎప్పటికప్పుడు కొత్త కొత్త కల్పనలను రచించుకుని అందులోనే మునిగి తేలుతోంది కాని, వాటిని త్యజించదేం? అది ఎప్పటికి తన వికల్పత్వము త్యజించుటచే నీటిలో ప్రవేశించిన ఉప్పుచే తయారు చేయబడ్డ బొమ్మ లాగా ఆత్మయందు లయించిపోతుందో కదా! అది తన తుచ్ఛరూపమును త్యజిస్తేగాని ఉద్వేగము, దుఃఖము నశించవు.

ఈ 'సంసారము' అనే సముద్రము 'తృష్ణ' అనే తరంగాలతో వ్యాపించి ఉన్నది. ఆశ అనే మొసళ్ళు ఇందులో యథేచ్ఛగా సంచారం చేస్తున్నాయి. ఈ సంసారసముద్రం దాటేది ఎప్పుడు? దుఃఖము, దిగుళ్ళు మొదలైనవి లేకుండేవి ఎన్నటికి?

ఈ ప్రపంచములో ప్రవేశించిన కొందరు శమదమాది ఉత్తమగుణములను ఆశ్రయించి తత్ఫలితంగా పరిశుద్ధులగుచున్నారు. ఉత్తమమగు ఆత్మపదమును పొందుటకు అర్హులగుచున్నారు. నేను కూడా అట్టి అర్హత పొందాలి? శోకరహితుణ్ణి కావాలి? అది ఎట్లా, ఎన్నటికి ఒనగూడుతుందో?

ఓ చిత్తమిత్రమా...! ఓ సంసారజ్వరమా! ఏమిటి నీవు చేస్తున్నది? ఈ స్త్రీ, పుత్రశరీరాది సంభ్రమములన్నీ కలుగజేస్తున్నావా? ఫలితమేమిటి? మేము సత్యవస్తువగు ఆత్మను పొందకయే పోవుచున్నాము కదా? కట్టుకొయ్యకు త్రాడుచే దున్నపోతు కట్టివేయబడినట్లు మేము నీయొక్క దుష్ట, అల్ప, అధమ దృష్టులచే బంధింపబడుచున్నామే? ఓ ప్రియచిత్తమా! అయినా, నిన్నని ఏం లాభం? ఇదంతా మా స్వయం కల్పితం మాత్రమే. ఏది ఏమై ఉన్నప్పటికీ మాయందు అజ్ఞానం మాత్రం తొలగుటలేదు. అందుకే నీవు దుష్టవై దశదిశలవైపు విజృంభిస్తున్నావు. ఇక చాలు. నీవు దూరదృష్టి, నిర్మలదృష్టి ఆశ్రయించదలుచుకోకపోతే నిన్ను నేను ఉపేక్షించను. నీవు నా సేవకుడివేగాని, యజమానివి కాదు సుమా! అందుచేత ఇక ఉపశమించు.

మనం ఉచితమైన విషయములను ఉచితమైన రీతిగా స్వస్వరూపజ్ఞాన లక్ష్యముతో విచారించాలి. ఎంతకాలం మమ్ములను అల్పప్రలోభములతో బాధిస్తావు చెప్పు? అయినా నీ రూపమేమిటి? ఎక్కడ ఉంటావు? నీవు ఏ పదార్థంతో తయారుచేయబడ్డావు?

మా అజ్ఞానమే నీయొక్క స్వరూపం. అంతకు మించి నీకు రూపురేఖలే లేవు. అయితే సర్వులలో ఏకస్థమైయున్న ఆత్మతత్త్వమొక్కటే నీకు విషయము, లక్ష్యము, మననము, దిక్కు అగుగాక!

ఓ బుద్ధీ! మనం తెచ్చిపెట్టుకున్న ఈ 'చిత్తము' అను జాడ్యమును చూచావా? ఇది మనిద్దరినీ కూడా రాగద్వేషముల వైపుగా త్రోసి వేయుచున్నదే! ఈ చిత్తము ఎప్పుడైతే గాలివీచికలు లేని స్థలంలో దీపం లాగా ప్రశాంతమై, ప్రకాశవంతమై, బాధారహితమై ఉంటుందో, అప్పుడు నీకు, నాకు కూడా ఇంతటి నీచత్వము, మూర్ఖత్వము, జాడ్యత్వము ఉండవుకదా!

మిత్రమా! బుద్ధీ! జీవుడు అను రూపము పొందియున్న నేను నీకు ఒక విన్నపం చేస్తున్నాను. నా మాట కాదనకపోతే నేను, నీవు కూడా మోక్షస్వరూపులం కాగలం. మనం ఈ పది రోజులుగా వసిష్ఠ మునీంద్రుని వచనాలు విన్నాం. మరి కొద్ది రోజులు వినబోతున్నాం. ఆ వాక్యముల సారాన్ని, అందు ప్రకటితమగుచున్న నాయొక్క , నీయొక్క వాస్తవమగు స్వరూప స్వభావములను గ్రహిద్దాం. ఓ మతీ! నీకు సాష్టాంగ దండప్రణామం చేసి మరీ వేడుకొంటున్నాను...... నా మాట విను. ఈ సంసారమును త్యజించివేయుటలో నాకు సహకరించు, అప్పుడు నీవు భవ్యమగు పూర్ణపదప్రాప్తిని పొందగలవు.

ఓ ఇంద్రియములారా! విషయముల పట్ల గల అభిలాషచే మీరు పొందుచున్నదేమిటి? అతి త్వరగా శిథిలమే అగుచున్నారు. మీరు సహకరించాలే గాని, మనం ఆత్మపదమును ఎందుకు పొందలేము? అందుచేత మనం ఈ సంసారమును అనాదరిద్దాం. ఈ వస్తు సముదాయము నుండి ప్రాప్తించే ఇంద్రియసుఖము తుచ్ఛము, తృణప్రాయము, దుఃఖ పరిణామయుతము అయి

ఉంటోంది. "నేను ఆత్మత్వము పొందేదెట్లా?" అను మార్గములో పయనిస్తున్న నాకు ఉచితరీతిగా మీరు సహకారం అందించెదరుగాక! ఇప్పుడు నియమనిష్ఠాదులచే కొంచెం బాధింపబడుచున్నప్పటికీ, మీకు 'స్పర్థ' తొలగి నిరవధికమగు సుఖమునే పొందగలరు సుమా!

ఓ మనస్సా! ఎన్నో ఉపాధులలో ప్రవేశించటం, నిష్క్రమించటం ఇప్పటికే మనం ఎంతగా నిర్వర్తించామో ఎవరు చెప్పగలరు? ఇప్పటికి ఈ వసిష్ఠ మునీంద్రుల ఆప్తవాక్యములు వినే భాగ్యం పొందాము. ఎంతోకాలంగా "ఈ శరీర -ధన -బంధు వియోగములచే ఏర్పడుచున్న దుఃఖాలు తొలగేది ఎట్లా?" అని మనం యోచిస్తూ ఉండేవారము కదా! ఇప్పుడు నిర్మల జ్ఞాన దృష్టితో ఈ బోధ విందాం. తద్వారా నీవు సంకుచితత్వం వదలి సువిశాలత్వం పొందగలవు.

మనస్సుతో ఏది పొందుతామో అదే పొందబడినదగుచున్నది. అయితే, మనస్సుచే ఒక విషయం అనేకసార్లు ఆలోచింపబడినప్పటికీ, అద్దానిని నిశ్చయ స్వరూపమగు బుద్ధి కూడా గ్రహించాలి. బుద్ధి గ్రహించకపోతే ఆ ప్రయత్నం నిష్ఫలం అవగలదు సుమా! నా మనస్సు శాశ్వతాత్మనే అన్నిటా అంతటా మననం చేస్తూ ఉండునుగాక! నా ఈ చిత్తము ఆత్మజ్ఞాన విషయముల కొరకై ఉరకలు వేస్తూ ఉండునుగాక!

అందుచేత ఈ నా బుద్ధి అర్థమును గ్రహించుటలో సర్వదా సమాయత్తమై అతితీక్షణము, సునిశితము అయివుండు గాక!

శ్రీ వసిష్ఠ మహర్షి ఇప్పటి వరకు వైరాగ్యము, దైవము, ముముక్షుత్వము మొదలైన అనేక విషయాలు చెప్పారు. వైరాగ్య ప్రకరణం, ముముక్ష వ్యవహార ప్రకరణం, ఉత్పత్తి ప్రకరణం, స్థితి ప్రకరణం పూర్తి అయ్యాయి. అనేక దృష్టాంతాలతో ఈ జీవుని వాస్తవ స్వభావము, ఆరోపితమైన ప్రమేయత్వముల గురించి విశదపర్చారు. ఉత్పత్తి, స్థితి ప్రకరణాల అవగాహన అర్హుడగు జీవునికి వివేక దృష్టిని, పరమోత్తమమగు అవగాహనను ప్రసాదించగలవు.

శ్రవణం అవసరమే. శ్రవణమే లేకపోతే ఉత్తమ విచారణము యొక్క సమాచారం లభించదు. అయితే శ్రవణమొక్కటే సరిపోతుందా? ...లేదు.

ఆత్మతత్త్వము గురించిన మననం అత్యంతావశ్యకం. మననముచే నిశ్చయాత్మకమైన బుద్ధి, బుద్ధికి కూడా ఆవలనున్న స్వస్వరూపానుభవం – ఈ రెండు ఒనగూడగలవు. అందుచేత నా "మనో–బుద్ధి–చిత్త–అహంకారాలు" ఆత్మతోటి అద్వితీయమైన అనుభవంతో పరితప్తమగు గాక! పరిభూషిత మగుగాక!

❖❖❖

పదకొండవ రోజు

2. ఎఱుగబడటమే ప్రాప్తించటం

ఆ విధమైన ఆలోచనలతో రామచంద్రుడు ఆ రాత్రంతా గడిపాడు. ఇంతలో భళ్ళున తెల్లవారింది. శ్రీరాముడు సోదర సమేతంగా వసిష్ఠాశ్రమములో ప్రవేశించాడు. మహర్షికి సోదరులు సాష్టాంగ నమస్కారములతో ప్రియవచనములతో సంతోషం కలిగించారు. ఆయనను రథమునందు కూర్చుండబెట్టి, సేవించుచూ సభకు కొనివచ్చారు. దశరథ మహారాజు సింహాసనం దిగి ఎదురేగి మహర్షికి సుస్వాగతం పలికాడు. ఇతర రాజులు, సామంతరాజులు, ఋషులు, మునులు, ప్రజలు మొదలైన వారంతా సభలో తమ తమ స్థానములు అలంకరించారు. ఆహాః! ఆ సభలోని వారందరూ పూర్వ పుణ్యవశాత్తు "వసిష్ఠుని ముఖమండలమునుండి వెలువడే ఆప్త వాక్యాలు వినుట" అను ఉత్కృష్టమగు అవకాశమును పొందివున్నారు. మొదటగా దశరథ మహారాజు ఇట్లు పలికాడు.

దశరథ మహారాజు: సభలోని వారందరికి సుస్వాగతం. మనందరికి అనేక జన్మల సుకృతఫలంగా ఋషులు ఈ సభకు వేంచేయడం, మహత్తరమగు ఆత్మ గురించి ప్రవచనముచే మమ్ములను, మా ప్రజలందరినీ, మనందరినీ పునీతులను చేయడం జరుగుతోంది. శ్రీ వసిష్ఠ మహర్షి – రామచంద్రుల మధ్య జరుగుతున్న సంవాదము పది రోజులుగా వింటున్నాం. ఈ రోజు పదకొండవ రోజు "ఉపశమనం" అను విషయం గురించి విచారణ ప్రారంభమగుచున్నది.

హే వసిష్ఠ మహర్షీ! మా పాదాభివందనం స్వీకరించండి. నిన్నటి రోజు సుదీర్ఘంగా సంభాషించుట చేత ఏర్పడిన శ్రమ నివారణమయినదని భావిస్తున్నాను. ఆనందదాయకమగు మీ 'వచనములు' అను అమృతవృష్టిచే మేమందరము పరితృప్తులమగుచున్నాము. మా అంతఃకరణములు శీతలమొనర్చ బడుచున్నాయి. అవివేక పూర్వకమైన, అజ్ఞానపూర్వకమైన, అవిచారణాపూర్వకమైన అనేక అల్ప దృష్టులు మీ ప్రవచన స్రవంతి ప్రసాదిస్తున్న 'ఆత్మదృష్టి'చే మ్రింగివేయబడుచున్నాయి.

మేము అపూర్వమగు ఆనందం పొందుచున్నాము. సర్వోత్తమమగు బ్రహ్మపదమే ఆశయముగా గలిగినట్టి మీ వాక్యాలు మాలోని రాగము, మోహము మొదలైన వికారములకు అమోఘమైన ఔషధంగా పరిణమిస్తున్నాయి. "సజ్జన సాంగత్యమే ఆత్మావలోకమునకు సుఖమైన బాట" అను వాక్యమును నిరూపిస్తున్నాయి.

మా స్వరూపము గురించి ప్రవచిస్తూ, మాకు మా యొక్క అఖండ, అప్రమేయత్వములను సుస్పష్టపరచుచున్నందుకు మీకు మరల మరల నమస్కరిస్తున్నాం.

చంద్రకిరణములు అంధకారమును తొలగించునట్లుగా, మీ బోధ మా శారీరక మానసిక దోషములను దూరీకరిస్తున్నాయి. మీ మాటలు వింటున్నంత మాత్రంచేతనే 'తృష్ణ – లోభము'

మొదలైన తీవ్ర జాడ్యాలు సన్నగిల్లుచున్నాయి. పుట్టుగుడ్డి సిద్ధాంజనము (మంత్ర సిద్ధమైన కాటుక)ను కళ్ళకు పెట్టుకుంటే చీకట్లో కూడా వస్తువులను చూడగలుగుతారు కదా! అట్లే మీ వాక్యములు వింటూ ఉండగా స్వస్వరూపమగు శుద్ధాత్మను మేము ఇప్పుడు చూడగలుగుచున్నాము. మీరు అనేక యుక్తులచే, దృష్టాంతములచే మా హృదయములందలి సంసారవాసనలు క్షీణింపజేస్తున్నారు. ఉదారమైన చిత్తము గల మీవంటి మహాత్ముల వచనములవలె ఆనందం కలుగజేసేవి ఈ సృష్టిలో ఇంకేం ఉన్నాయి? ఏమీ లేవు.

కుమారా! రామచంద్రా! బ్రహ్మవేత్తలతో సంభాషించని దినములన్ని అంధకారయుక్తములేనని గ్రహిస్తున్నావు కదా! ఇప్పుడు ఈ మునీంద్రులు మనందరిపట్ల అతి ప్రసన్నంగా వున్నారు. ప్రస్తుత విషయం గురించి నీవు ఉచితమైన రీతిగా ప్రశ్నిస్తూ ఉండు. ఏమాత్రం సంశయించకు. నిన్ను నిమిత్తంగా చేసుకొని ఈ మహర్షి అనేక ఆధ్యాత్మ విశేషాలు ప్రపంచానికి ప్రతిపాదిస్తున్నారు. వారు చెప్పేదంతా నీకు, మాకు ఈ సభికులందరికి భవిష్యత్తులో అనేకమంది ముముక్షువులకు శుభప్రదం కాగలదు.

హే మహర్షీ! మీ తదుపరి వాక్యామృతం గ్రోలటానికి మేమంతా వేచి ఉన్నాం. మీ కరుణ రూపమగు ఆత్మతత్త్వజ్ఞానం కొనసాగించి లోకములను పావనం చేయ ప్రార్థన.

శ్రీరాముడు: స్వామీ! మహర్షీ! ఎంతో ఉదారబుద్ధితో మీరు చెప్పుచున్న వచనామృతం నేను స్వీకరించగలగడం, గ్రహించగలగడం – మీ ప్రవచనాశక్తి విశేషం చేతనే. ఇదంతా మీరు మాపై ప్రసరించు కరుణామృతం. తమ ఆదేశమును అనుసరించి, మీరు చెప్పినది ఈ సంవాద సమయంలో విన్న తరువాత మరల ఆ విషయములను రాత్రి నిద్రించే ముందు పునశ్చరణ చేసుకుంటున్నాను. ముఖ్య విషయాలు నెమఱవేస్తున్నాను. అట్లు చింతన చేస్తున్నంతమాత్రంచేత నా హృదయంలో ఎప్పటినుంచో తిష్ట వేసియున్న నిద్ర, మౌఢ్యము, జడత్వము సన్నగిల్లుచున్నాయి. హృదయమును ఎంతగానో విస్తరింపజేస్తున్నాయి. మీరు చెప్పు బోధ మనోహరంగాను, పరమ పురుషార్థసాధకంగాను, బ్రహ్మానందప్రదంగాను, పరమ పవిత్రంగాను ఉన్నది. పది రోజులుగా మీరు చెప్పుచున్నదానిని ముందు వెనుకలు విచారణపూర్వకంగా గత రాత్రంతా పునఃపఠనం చేశాను.

మీ ఉత్తమోత్తమ ప్రవచనము సనక సనందనాదులకు కూడా శిరోధార్యమే. కరువు కాటకాల చేత మోడువారిన ప్రదేశంలో కారుమబ్బులు, చల్లటి గాలులు, కుండపోత వర్షం ఎంతటి ఆహ్లాద జనకంగా ఉంటాయో, మీ వాక్యాలు అంతటి ఆనందప్రదంగా ఉన్నాయి. వాటిని మననం చేసుకున్నప్పుడు బుద్ధి సౌభాగ్యప్రదమౌతోంది. స్వల్పజ్ఞులము, పుణ్య పాప భావములచే దొర్లింప బడుచున్నవారము, స్వయంకృత, అల్ప భావములకు బద్ధులము అగు మమ్ములను, వికాసవంతము, స్వచ్ఛము అగు మీ ప్రవచనాలు పరమశోభాయుక్తంగా ప్రభావితం చేస్తున్నాయి, తీర్చి దిద్దుచున్నాయి. ఆ సర్వాత్మస్వరూపుడగు పరమేశ్వరుడే మీ రూపంగా మాపై కరుణాప్రవాహం వర్షింపజేస్తున్నాడు. మమ్ము పరిశుద్ధులుగా తీర్చిదిద్దడానికి మాపై కరుణతో మీరు, తమ ఉపదేశములను కొనసాగించ వలసిందిగా ప్రార్థన.

శ్రీ వసిష్ఠ మహర్షి : ప్రియ రామచంద్రా! ఇప్పుడు మనం ఉపశమన ప్రకరణములో ప్రవేశిస్తున్నాం. "ఇది హితకరము, ఉత్తమ సిద్ధాంతయుక్తము" – అని విజ్ఞుల అభిప్రాయం. సావధానచిత్తుడవై విను–

ఒక మండపము కొన్ని స్తంభములచే అవధరింపబడుచున్నట్లుగా ఈ సుదీర్ఘ సంసారము రాజస–తామస జీవులచే నిత్యము అవధరించబడుతోంది. ఇక సత్వగుణమునందు స్థితి కలిగియున్న ధీరులు ఈ సంసారమాయను నీలాగానే నిరాదరించివేస్తున్నారు. పాము కుబుసమును విడుచునట్లు వారు "నేను జీవుడను" అను భావమునే విడిచివేస్తున్నారు. సత్వ జాతిలోని బుద్ధిమంతులు, రాజససాత్వికులు కూడా "ఈ జగత్తుకు మూల కారణమేమిటి?" అను ప్రశ్నను మథించి, విచారించడం జరిగినప్పుడు తప్పక బ్రహ్మమును ఎఱుగుచున్నారు.

శ్రీరాముడు : సారవస్తువగు బ్రహ్మమును ఎట్టివారు ఎఱుగుచున్నారు? ఎట్టివారు ఎఱుగలేక పోవుచున్నారు?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఎవరి బుద్ధి అయితే శాస్త్ర, సజ్జన సాంగత్యములచే, యజ్ఞ, దాన, తపాల వంటి సత్కార్యముల అభ్యాసములచే సర్వవిధములైన పాపభావములను త్యజించివేస్తుందో, "ప్రజ్వలించు దీపము" వలె ప్రకాశవంతంగాను, నిర్దోషంగాను ఉంటుందో, అట్టి వారికి మేము చెప్పు 'బ్రహ్మము' అనబడునది తప్పక అనుభవమగుచున్నది. ఓ రామా! ఆత్మయే నిత్యము, స్థిరము, సత్యము, సర్వశేష్యము (సర్వదా మిగిలి ఉండేది) కదా! ఇక దిగుళ్ళు అనుమానములు ఎందుకు? అది మనందరి నిజ స్వరూపమే! అయితే, ...ఆత్మచే ఆత్మ గురించి విచారించి ఎఱుగనంత వరకు అది ఎవరికీ ప్రాప్తించుటలేదు.

అది అనుభవపూర్వకంగా ఎఱుగబడుటయే, "ప్రాప్తించుట" సుమా! నాయనా! నీవు ప్రాజ్ఞులలో ప్రమాణశీలుడవు. ధీరుడవు ఉత్తమ సాత్విక రాజసిక భావములు కలవాడవు. నీవు మేము చెప్పునది తప్పక గ్రహించగలవు. మరొక విషయం. ఈ జీవులలో అనేకులు నివురుగప్పిన నిప్పువలె నిర్మల స్వభావులై, బ్రహ్మమును ఎఱుగగలుగుటకు అర్హులై, తగినవారై ఉన్నారు. అయితే వారిలో కొందరు అనేక అల్పజ్ఞాన వాక్యములు విని, అంతటితో వేదోపనిషత్ సారవస్తువగు ఆత్మ శాస్త్రము విషయమై కొన్ని దురభిప్రాయములు కలిగి ఉంటున్నారు. అట్టివారిని ఉద్దేశించి మేము "నాయనలారా! మీరు స్వయముగా పరిశీలించి ఆత్మశాస్త్రముచే జీవులు – సంఘములు పొందు ప్రయోజనమేమిటో గ్రహించండి. కొన్ని అభిప్రాయాలకు కట్టుబడి పరిశీలనారాహిత్యం వహించి ఉండటంచేత జన్మ కర్మలు వృథా అగుచున్నాయి. అపవిత్రంగానే ఉండిపోతున్నాయి" అని హెచ్చరిస్తున్నాం.

ఓ సర్వజనులారా! మీరంతా ఈ 'సంసారసంరంభము'ను అంతటినీ వివేచనా బుద్ధితో పరిశీలించి చూడండి. 'ఇది నిత్యం, సత్యం. ఇది అనిత్యం, కనుక అసత్యం' అని విభాగం చేయండి. సత్యము నందే పరాయణులు కండి. అన్ని తరగతులలోని జనుల యోగ క్షేమములు దృష్టిలో పెట్టుకొని మేము ఈ అధ్యాత్మశాస్త్రమును ప్రతిపాదించుచున్నాము. లోక కళ్యాణమే మా ధ్యేయం.

దయచేసి నికృష్టమగు భేద భావ ప్రవాహంలో కొట్టుకుపోకండి. మానవజన్మ ఎంతటి ఉత్తమ అవకాశమో గ్రహించండి. ఇక్కడ మిమ్ములను ఉద్ధరించడానికి శాస్త్రములు, గురువులు సర్వదా సిద్ధంగా ఉన్నారు. మీరు కూడా సర్వసన్నిద్ధులు కండి.

శ్రీరాముడు : తండ్రీ! ఏది సత్యమో, ఏది కాదో నిర్ణయించడం ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : దీనికి శాస్త్రములు ప్రమాణము చెప్పుచున్నాయి.

1) ఏ వస్తువైతే 'ఆది'లోను, 'అంతము'లోను లేదో, అది మధ్యలోకూడా 'లేనిదే' అగుచున్నది.

2) ఏది ఆద్యంతములలో ఉండియే ఉన్నదో, అది మధ్యలో కూడా తప్పక ఉండియే ఉన్నది.

3) ఆద్యంతాలలో లేని పదార్థం గురించి "ఇది సత్యమే" అను బుద్ధిచే ఎవడు నిమగ్నుడౌతాడో... అట్టి మూర్ఖునకు వివేకము జనించేది ఎట్లా?

❖

ఇక్కడ ముక్తి ఎవరికి? బంధమెవరికి? అను ప్రశ్నలను మేము తరచితరచి చూచాం. పరిశీలించాం. పరీక్షించాం. గమనించాం.

జాయతేమనఏవేహ మనఏవవివర్ధతే ।
సమ్యగ్దర్శనదృష్ట్యాతు మనఏవహిముచ్యతే ॥ (సర్గ 5, శ్లో 11)

"ఈ ప్రపంచమున మనస్సే ఉత్పన్నమగుచున్నది. మనస్సే వృద్ధి చెందుతోంది. సమ్యక్ దృష్టి పొందినప్పుడు మనస్సే ముక్తిని పొందుతోంది."

❖

ఓ రామచంద్రా! ఈ పది రోజులుగా మనం చేసియున్న విచారణలోని విశేషములను ఎప్పటికప్పుడు 'పూర్వపర' మననము చేస్తూ, మరల మరల మనోబుద్ధులచే పరిశీలించి, హృదయంలో పదిలపరచుకుంటున్నావు కదా! అది అత్యావస్యకం సుమా!

ఇతఃపూర్వం 'సత్వ –రజ –తమో గుణభేదం'చే తయారుకాబడిన ఈ జీవజాతులన్నిటి విచిత్ర – ఉత్పత్తుల గురించి కొంతవరకు మనం చెప్పుకున్నాం. పరబ్రహ్మము గురించి అనేక విషయాలు చర్చించుకున్నాం.

పరబ్రహ్మమే మాయాశక్తిచే 'జగత్తు' రూపముగా అజ్ఞాన దృష్టికి కనబడుచున్నది. అదియే పరమార్థమున పరిశీలిస్తే 'నిష్ప్రపంచకము' అయి ఉన్నది. ఈ స్థూల–సూక్ష్మ–సత్–అసత్ దృశ్యజగత్తుకంటే విలక్షణమైనది అది.

జగదీశుడు, సర్వశక్తిమంతుడు అగు పరమాత్మనుండి ఈ జగత్తు మనోకల్పిత చమత్కారంచేత ఎట్లు కల్పితమైనదిగా ఉత్పన్నమగుచున్నదో,.... ఇప్పటిదాకా చూచాం.

మాయ – ఈ 'మాయ'అనేది కాలవశంగా చూస్తే ఎప్పటికప్పుడు జలతరంగంలాగా అనుక్షణం మార్పులు చెందుతూ నాశనమయ్యేదిగానే ఉంటోంది. అనగా, దేశ కాలముల దృష్ట్యా అంతము

కలిగియే ఉంటోంది. ప్రవాహరూపంగా చూస్తేనో..... ఇదంతా అనంతమైనది. చిత్తమే మనుజుడు. చిత్తమే మాయ.

అనేకమంది మహనీయుల అభిప్రాయములను పరిశీలించి, ఆ తరువాత ఈ అధ్యాత్మ, శాస్త్ర విషయములను నీముందు ఉంచుచున్నాను. ఈ విషయములను (ఈ సంవాదములోని విశేషాలను) మననపూర్వకంగా హృదయంలో పదిలపరుచుకోవాలి. వివేకముతో హృదయమును విస్తారపరచుకోవాలి. అప్పుడు మోక్ష స్వరూపడవు కాగలవు. మాయ స్వయముగా స్వస్థానమగు ఆత్మయందు లయించగలదు. దృశ్యము – దేహములు – సంబంధములు – అనుబంధములు – బాంధవ్యములు – జన్మ – జీవనము – మృత్యువు మొదలైనవి ఎవరి దృష్టిలో బంధములు కావో.... వారిని "మోక్ష స్వరూపులు" అని పిలుస్తున్నారు.

ఆత్మవేత్తలు అవ్యాజమైన ప్రేమతో అందిస్తున్న ఆత్మజ్ఞాన సమాచారం అనాదరించటం ఉచితము కాదు. శ్రేయము కాదు! అనేక సత్కర్మల ప్రయోజనంగానే "ఆత్మ యొక్క స్వభావమై చెప్పబడు సమాచారము పరిశీలించాలి...." అనే ఉత్సుకత ఈ జీవునిలో బయలుదేరుచున్నది.

మమ్ము ఆశ్రయించుచున్న శిష్యులు, తదితర ప్రియజనులు 'శరీరాత్మభావము'ను త్యజించెదరు గాక! ఆత్మతో ఏకత్వము పొంది, 'అఖండము, అద్వితీయము, శుద్ధము, శాశ్వతము అగు ఆత్మయే నేను' అను ఎఱుకను, భావనను సుస్థిర పరచుకొనెదరుగాక! ఇదియే మా ఉద్దేశము, లక్ష్యము కూడా.

❖❖❖

3. ఇప్పటికి లేనిది? ఇంకనూ పొందవలసియున్నది?

శ్రీరాముడు : మహాత్మా! మనస్సే ఈ ముల్లోకములందు సంసారియగు జీవుడుగా అగుచున్నది కదా! ...అది ఎట్లా 'జీవుడు' రూపం పొందుతోంది? ఎట్లా జరామరణములకు పాత్రమగుచున్నది? ...అనే విషయమై మీరు అనేక విశేషాలు బోధించారు. ఇంతవరకు బాగానే ఉన్నది. ఇప్పుడు... ఈ సంసారము నుండి తరించుటకు నిశ్చలమైన, సులభమైన మార్గమేమిటో ...అది బోధించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : మొట్టమొదట మనుజుడు శాస్త్రాభ్యాసం చేత, తీవ్రవైరాగ్యం చేత సజ్జన సాంగత్యం చేత మనస్సును శుద్ధపరచుకోవాలి. ఈ మనస్సును జ్ఞానమునకు యోగ్యమైనదానిగా తయారుచేయాలి. ఆ విధంగా సౌజన్యయుక్తం అగుచున్న మనస్సుకు వైరాగ్యం ప్రాప్తిస్తుంది. అప్పుడు ఆతడు "నేను–ఆత్మ–జన్మ–దృశ్యము" మొదలైన వాటి వాస్తవతత్వం అభ్యసించటానికి ఉపక్రమించాలి. శాస్త్రజ్ఞులు, బ్రహ్మవిష్ఠులు అయిన సద్గురువులను విధిపూర్వకంగా సమీపించాలి. వారు ఉపదేశించే మార్గంలో ధ్యాసను నిలపాలి, గ్రహించాలి. నిష్కామకర్మ, సాత్వికమైన భావాలు, సుతీక్ష్ణము, విస్తారము అగు అవగాహనల సహాయంతో క్రమంగా పరమపవిత్రమగు ఆత్మపదమును పొందగలడు. పరిశుద్ధమగు 'విచారణ' చేతనే ఈ జీవుడు చివరికి ఆత్మను దర్శించగలుగుతాడు.

తావద్భ్రమమహాంభోధౌ జనస్తృణవదుహ్యతే ।
విచారతటవిశ్రాన్తిమేతి యావన్నచేతసా ॥ (సర్గ 5, శ్లో 18)

బుద్ధి సహాయంతో 'ఆత్మవిచారణ' అనే ఆవలి ఒడ్డు జేరుటయే ఈ జీవునికి విశ్రాంతి. అప్పటి వరకు ఈ జీవుడు కెరటాలపై తేలియాడే గడ్డిపరకలాగా ఈ సంసారసాగరంలో కొట్టుమిట్టాడుతూనే ఉంటాడు.

విచారణచే ఆత్మతత్త్వము ఎరిగినవాని బుద్ధి సమస్త మానసిక రుగ్మతలను తొలగించివేస్తోంది. ఒక స్వర్ణకారుడు "ఇది బంగారము, ఇది భస్మము" అని చిటికలో గ్రహిస్తాడు కదా! తత్త్వజ్ఞునకు స్వయముగా నిత్య–అనిత్య వివేకం కలుగుతోంది. అజ్ఞానముచే ఈ దృశ్యమును ఒక పరిచ్ఛిన్న వ్యవహారముగా గాంచుచున్న జీవులారా! మీరంతా నిరుత్సాహపడకండి! ఓపికతో తత్త్వవిచారణ చేయండి. అప్పుడు మీరు తప్పకుండా వివేకము పొందగలరు. తద్వారా మీ స్వస్వరూపమేమిటో, ఎంతటిదో మీరే గ్రహించగలరు. "నేను దేశ కాలాలచే అపరిచ్ఛిన్నుడను, అక్షయుడను, శాశ్వతుడను" అని తెలుసుకుంటారు. ఈ భయ, దుఃఖాదులు ప్రాప్తించటానికి మూలకారణమేమిటి?

సారవంతమగు ఆత్మను ఎఱుగనివానికే చిత్తసమ్మోహం అనబడేదంతా ఉంటుంది. ఆత్మను ఎఱుగటం జరిగిందా, అది సుఖదాయకం అవుతుంది. భ్రమలన్నీ తొలగుతాయి. అది ఎఱుగబడక పోతే దుఃఖమునకే హేతువగుచున్నది. అనంత సుఖమును, శాంతమును సముపార్జించాలంటే ఆత్మను ఎఱుగవలసిందే! అందుకు వేరే మార్గం లేదు. నాశనమే పర్యవసానముగాగల ఈ దేహముతో మిశ్రమమైయున్న ఆత్మను పంచకోశముల* నుండి వేరుచేసి చూడాలి సుమా! అప్పుడే ఈ జీవునకు స్వస్థత లభిస్తుంది. అందుకు వివేకము అత్యంత ఆవశ్యకం.

శ్రీరాముడు : హే మహర్షీ! ఆత్మ ఈ శరీరమునందు (పంజరములో) పిట్ట వలె చిక్కుకున్నది కదా! ఈ శరీరము ఏర్పడి ఉన్నంతకాలం విశ్రాంతి ఎక్కడిది?

శ్రీవసిష్ఠ మహర్షి : బురదలో ఒక మణి పడిందనుకో... ఆ మణికి, బురదకు సంబంధం ఎక్కడన్నా ఉంటుందా? నిర్మలమగు ఆత్మకు ఈ దేహంతో ఏమాత్రం సంబంధం లేదు.

మరొక దృష్టాంతము విను. పద్మము జలంలో ఉంటుంది కదా......! అట్టి ఒక పద్మము యొక్క దళములపై కొన్ని జలబిందువులు ఉండవచ్చు. కానీ ఆ జలబిందువులు పద్మదళంలో ప్రవేశించవు కదా! అట్లాగే, పంచకోశములు ఆత్మను స్పృశించలేవు. ఆత్మలో ప్రవేశించలేవు.

❖

ఈ బ్రహ్మం – జీవుడు ఉపాధిచే భిన్నం కావచ్చు. అధిష్ఠానం దృష్ట్యా వేరువేరు కానేకాదు....! ఈ జీవుడే సత్యదృష్టిచే 'బ్రహ్మము' అయి ఉన్నాడని గ్రహించవలసినదిగా చేతులెత్తి ప్రకటించుచున్నాను.

---

* పంచకోశములు : 1) శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, అహంకారము
2) అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ ఆనందమయ కోశములు.

'జడమే' అయినట్టి ఈ మనస్సు 'మురికి గుంటలో తాబేలు' లాగా పడి ఉన్నది. ఆత్మ విచారణను వదలి భోగద్వారములైనట్టి ఇంద్రియ విషయముల వెంట పరుగులు తీస్తూ బహు కలుషితమై ఉంటోంది. మనస్సు ఈ విధంగా ఎంతకాలం నిమగ్నమౌతుందో అంతకాలం ఈ సంసారాంధకారమును ద్వాదశాదిత్యులు వచ్చికూడా పటాపంచలు చేయలేరు. అటువంటి ఈ మనస్సు ప్రబుద్ధమైనదా, మరుక్షణం యథార్థవిషయం తప్పక ఆకళింపు చేసుకుంటోంది.

మనస్సు దేహముతో తాదాత్మ్యము చెందుతూ ఉంటే.... ప్రాజ్ఞుడైనవాడు అది పట్టించుకోకుండా వృథాకాలయాపన చేస్తాడా? లేనేలేదు. "నా హృదయము నుండి అజ్ఞానం తొలగిపోవాలి" అని నిర్ణయం చేసుకుంటాడు. గురువులను ఆశ్రయించి ఉపదేశం పొందుతాడు. ఆత్మజ్ఞులచే ప్రబోధించబడినవాడై తపోయజ్ఞ దానాదులతో మనస్సును పరిశుభ్రపరచుకుంటాడు. ఎందుకంటే, ఈ సంసారం అత్యంత దుఃఖప్రదమైనది కదా!

ధూళిచే ఆకాశము అపరిశుభ్రమౌతుందా? లిప్తమౌతుందా? అసలు ధూళికి, ఆకాశమునకు సంబంధమెక్కడిది? ఈ దేహాదులు ఉండనీ... లేకుండనీ! ...ఆత్మ ఈ దేహాదులచే, ఈ పంచకోశాలచే లిప్తమయ్యే ప్రసక్తే లేదు. బురదలో బంగారు ఉంగరం ఉంటే బురద బంగారమౌతుందా? బంగారము తన స్వతత్వమును కోల్పోయి బురదగా సంతరించుకుంటుందా! ఈ జడదేహంలో ఆత్మతో కలిసి ఉన్నప్పటికీ ఇది ఆత్మరూపం ఎలా చెందుతుంది? చెందదు. ఆత్మ జడదేహ విభాగి అవుతుందా? అవదు.

శ్రీరాముడు : సుఖదుఃఖాదులు ఎక్కడి నుండి వచ్చి పడుచున్నాయి? ఇవి శరీరానివా? ఆత్మవా?

శ్రీవసిష్ఠ మహర్షి : అదిగో ఆ ఆకాశమును చూడు! దానిలో మాలిన్యము గాని, బిందుత్వము గాని ఉన్నాయా? ఉండవు కదా! ఆత్మ యందు ప్రతీతమై అగుపిస్తున్న ఈ సుఖదుఃఖాదుల అనుభవం అసత్యమైనదే! ఆత్మకు సుఖదుఃఖాదులు లేవు.

పోనీ, "ఈ సుఖ దుఃఖాదులు శరీరమునకు సంబంధించినవే" అని అందామా? ఈ శరీరము స్వతహాగా జడమే కదా! జడమైన వస్తువునకు అనుభవమనేదే ఉండదు. 'ఒక కలం అనుభూతిని పొంది కవిత్వం రాస్తోంది' అని అనం కదా! అనుభవమే ఉండనట్టి వస్తువుకు సుఖమేమిటి? దుఃఖం ఏమిటి? లేక 'ఇవి ఆత్మకు సంబంధించినవి' అందామా? ఆత్మ సర్వానికి అతీతమైనది కదా!

అందుచేత "ఆత్మయే స్వయముగా సుఖదుఃఖముల భావన చేసి తద్ద్వారా వివర్తము పొందుతోంది. తనయొక్క భావనాపరిధిలో బాలురక్రీడవలె, భావనావిన్యాసంగా సుఖదుఃఖాదులన్నీ పొందుతుంది – అని అనక తప్పదు.

అందుచేత "అంతాకూడా నిత్యము, ప్రశాంతము అయినట్టి ఆత్మయొక్క రూపమే...." అను భావనతో ఇక్కడి పదార్థములను, సంఘటనలను గాంచుచుండుము. ఆత్మయందు కనిపించే ఈ విశాల సృష్టి సమూహమంతా జలంలో కనిపించే తరంగముల వంటిదే. ఒక మణి అకారణంగానే సమీపవస్తువులపై ప్రకాశమును ప్రసరింపజేయుచున్నట్లు, ఆత్మ స్వసత్తామాత్రంచేత అకారణంగానే ఈ సృష్టిని విస్తరింపజేస్తూ ఉన్నది.

అజ్ఞాన దృష్టి యందలి 'జగత్తే'... జ్ఞానదృష్టిచే ఆత్మ!... ఈ జగత్తు, ఆత్మ ఒకే రూపములు కావు. అట్లాగే వేరువేరు రూపములైనవి కూడా కావు. జలమే తరంగరూపం కదా! తరంగము జలమే కదా!

ఈ జగత్తు మిథ్యయే. అయినప్పటికీ అజ్ఞానకారణంగా ఇట్లు భ్రాంతిరూపంగా విస్తరిస్తోంది.

సమ స్తంఖల్విదంబ్రహ్మ సర్వమాత్మైవమాతతమ్
అహమన్యదిదంచాన్యదితి భ్రాన్తింత్యజానఘ. (సర్గ 5, శ్లో 39)

ఈ జగత్తంతా బ్రహ్మమే కనుక "నేను వేరు...... బ్రహ్మము వేరు" అను భ్రాంతిని త్యజించివేయుము. ఎందుకంటావా? బ్రహ్మము దేశ కాలములచే పరిచ్ఛేదమగునది కాదు.

అట్టి బ్రహ్మము నందు "నేను – నీవు – జగత్తు" అనబడు విచ్ఛేదం ఎట్లా సంభవం చెప్పు? అగ్నిలో మంచుకణం ఉంటుందా? ఎలా ఉంటుంది? అగ్నిలోని ఒక అగ్నిశిఖకు సంబంధించినవి, సంబంధించనివి, ఆ అగ్నిలో ఏమి ఉంటాయి? ఏకము, సర్వరూపము అయిన పరమాత్మ యందు ఇక రెండవ కల్పనయే సంభవించదు.

'చిత్' రూపమగు ఆత్మయే "స్వస్వరూప అభావం" అనబడు ఒకానొక సమయంలో ఇట్లు 'జగత్తు' అనబడు క్షణక్షణ పరిణామయుతమగు అనుభవప్రాప్తిని పొందటం జరుగుతోంది. ఈ పొందబడుచున్నదంతా స్వయంకల్పితమగు భావనను అనుసరించే ఉంటోంది. భావనయే సుఖము, భావనయే దుఃఖము. ఇక, ఆత్మయో? భావనలకు ఉత్పత్తి–స్థితి–లయస్థానం.

నశోకోస్తినమోహోస్తి న జన్మాస్తినజన్మవాన్ ।
యదస్తీహతదేవాస్తి విజ్వరోభవరాఘవ ॥ (శ్లో 43, సర్గ 5)

నిర్ద్వంద్వోనిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమాత్మవాన్ ।
అద్వితీయోవిశోకాత్మా విజ్వరోభవరాఘవ ॥ (శ్లో 44, సర్గ 5)

సమఃస్వస్థఃస్థిరమతిః శాన్తకోకమనామునిః ।
మౌనీవరమణిస్వచ్ఛో విజ్వరోభవరాఘవ ॥ (శ్లో 45, సర్గ 5)

వివిక్తఃశాన్తసంకల్పో ధీరధీర్విజితాశయః ।
యథాప్రాప్తానువర్తీచ విజ్వరోభవరాఘవ ॥ (శ్లో 46, సర్గ 5)

వీతరాగోనిరాయసో విమలోవీతకల్మషః ।
నాదాతా నపరిత్యాగీ విజ్వరోభవరాఘవ ॥ (శ్లో 47, సర్గ 5)

విశ్వాతీతపదంప్రాప్తః ప్రాప్తప్రాప్తవ్యపూరితః ।
పూర్ణార్ణవవదక్షుబ్ధో విజ్వరోభవరాఘవ ॥ (శ్లో 48, సర్గ 5)

వికల్పజాలనిర్ముక్తో మాయాంజనవివర్జితః ।
ఆత్మనాత్మనితృప్తాత్మా విజ్వరోభవరాఘవ ॥ (శ్లో 49, సర్గ 5)

అనన్తాపారపర్యన్త వపురాత్మవిదాంవర ।
ధరాధరశిరోధీరో విజ్వరోభవరాఘవ ॥ (శ్లో 50, సర్గ 5)

వాస్తవానికి ఇక్కడ దుఃఖముగాని, మోహముగాని, జన్మగాని, జన్మను పొందునట్టిదిగాని లేదు. ఏదైతే కలదో అది సర్వదా ఉండియేవున్నది. దానినే 'ఆత్మ' అని అంటున్నాం. కనుక నీవిక దుఃఖరహితుడవు, నిశ్చింతుడవై ఉండుము. శీతోష్ణములు, మొదలైన ద్వంద్వములకు అతీతుడవై, నిత్యసత్యమగు స్వస్వరూపమునందు స్థితి కలిగియుండుము.

"లేనిదేదో పొందవలెను... ఉన్నదేదో విడువవలెను... ఇది ప్రాప్తించాలి... అది ప్రాప్తించ కూడదు... వీరు మా వారు... వారు కాదు..." – అనునట్టి యోగక్షేమభావములకు కట్టుపడవద్దు. ఆత్మవంతుడవై, అద్వితీయుడవై శోకరహితుడవై, సంతాపవర్జితుడవై ఉండుము. సముడవు, స్వస్థ చిత్తుడవు, స్థిరమైన బుద్ధి కలవాడవు అయి ఉండుము. మౌనివై, ఒక ఉత్తమమైన మణిలాగా స్వచ్ఛతతో ప్రకాశించెదవుగాక!

"అవిద్య" గాని, దానియొక్క కార్యక్రమవ్యవహారములుగాని స్వతఃసిద్ధమైనవి కావు. కల్పితమైనవి మాత్రమే. సంకల్పరహితుడవై, ధీరబుద్ధితో స్వాధీనచిత్తము కలిగియుండుము.

ప్రాప్తించిన వ్యవహారములను నిర్వర్తిస్తూనే, దుఃఖరహితుడవై ఉండుము. దుఃఖాదులను నీవు గ్రహించవద్దు. 'గ్రహించటం' అనే స్వభావం చేతనే దుఃఖములు సంభవిస్తున్నాయి. వీతరాగుడవు, చింతారహితుడవు, నిర్మల చిత్తుడవు పాపవర్జితుడవు అగుము. ఏ పదార్థమునూ గ్రహించనూ వద్దు... త్యజించనూ వద్దు.

సర్వదా ప్రపంచమునకు అతీతమైయున్న (ఆవల ఉన్న) బ్రహ్మపదమును పొందియే ఉండుము. ఆత్మవస్తువు వాస్తవానికి సర్వదా ప్రాప్తించియే ఉన్నది. "ఇప్పటికి లేనిది ఒకటి ఉన్నది..... అది నేను పొందాలి" అను యోచన సాంసారికమైనదేనని, జ్ఞానాగ్నిచే అది దగ్ధం కాగలదని గ్రహించు.

పూర్ణుడవై పూర్ణసముద్రంలాగా విక్షోభరహితుడవు కమ్ము. విజ్ఞానివై ఎట్టి శోకమును పొందనే వద్దు. వికల్ప జాలం నుండి విముక్తుడవు కమ్ము. వికల్పజాలమంతా నీ నుండే, నీ చేతనే కల్పితమై బహిర్గతమౌతోంది. నీయొక్క విజ్ఞానముతోకూడిన దృష్టి అవగాహనలు మాత్రమే అద్దానిని నిరోధించగలవు.

గురువులుగా మేము మీ స్వరూప విషయమై విశ్లేషణము చేసిచూపుతున్నాం. అయితే దర్శించవలసినది, గ్రహించవలసినది మీరే! 'మాయ' అనే పొర మీపట్ల తొలగిపోవు గాక!

ఓ రామా! ఆత్మయందు, ఆత్మచే పరితృప్తుడవై, సంతాపములు లేనివాడవై ఉండుము. "నేను ఆత్మస్వరూపుడను" అను ఎఱుకతో చైతన్యస్వరూపము సంతరించుకో. మేరుపర్వతం లాగా ధీరుడవై సహనశీలుడవై, పరితాపరహితుడవగుము.

ప్రాప్తించిన దానిని అనుభవించుచు, ఏ వాంఛలు లేక, గ్రహణ, త్యాగరహితుడై ఉన్నవాడు స్వల్ప ప్రయత్నాల చేతనే ఆత్మ యొక్క ఔన్నత్యాన్ని స్వయంగా గాంచుచున్నాడు. మహాసముద్రము

లాగా 'ఆత్మ'చే ఆత్మయందు పరిపూర్ణుడవై, పూర్ణకాముడవై శాంతి సుఖములను ఆశ్రయించుము. అమాయకులగు కొందరు జీవులు "ఈ ఎదురుగా కనబడు సంఘటనలు, పదార్థాలు, వస్తు జాలం అన్నీ వాస్తవమే" అని భావన చేయుట చేతనే ఇక్కడ దుఃఖం, రాగం, కౌతుకం, ఆవేశం, హింసాప్రవృత్తి భయం, క్రోధం మొదలగునవి ఏర్పడుచున్నాయి. "ఈ ప్రపంచం మిథ్యా రూపం" అని ఎరుగువాడు అసత్‌స్వరూపం అయినట్టి ఇద్దాని కొరకు పరుగులు తీస్తాడా? లేదు.

ఓ రామా! నీవు తత్త్వజ్ఞుడవు. కల్పనారహితుడవు. ఇక నీకు పెద్దగా చెప్పవలసింది ఏముంటుంది? చిలుక, పంజరము'లో చిక్కుకున్నట్లు ఆత్మ శరీరమునందు చిక్కుకున్నదని భావించ కూడదు. మౌనము – ప్రశాంతము – నిర్మలము – అఖండము – సత్యము – నిత్యము అగు ఆత్మ ఎక్కడ? జడము, భ్రమాత్మక, స్వప్నతుల్యము అగు ఈ దేహమెక్కడ? అభాండమగు ఆకాశము ఘటాకాశరూపంగా (కుండలోని ఆకాశరూపంగా) ఘటంలో (కుండలో) చిక్కుకున్నదని అనటం సమంజసం కాదుకదా!

కనుక, ఆధి వ్యాధి వర్జితుడవై నిరంతరం ఆత్మజ్ఞానం కలిగి సుఖవంతుడవు కమ్ము. నీ ఉత్తమ, ప్రశాంత గుణములయొక్క భావీకరణముచే సమస్త జనులను ప్రసన్నులుగా చేస్తూవుండు. సమదృష్టి కలిగివుండి, చిరకాలంగా రాజ్యమును చక్కగా పాలించు.

"ప్రారబ్ధవశంచేత అనుభవించతగిన, నిర్వర్తించవలసిన కర్మలందు, వాటి ఫలములందు త్యాగముగాని, రాగముగాని యుక్తము కాదు" అని గ్రహించి ఉండు.

❖❖❖

4. కర్మబద్ధులు - విముక్తులు

ఓ రామా! "నాకు అద్వితీయమైనట్టి 'ఆత్మ' యొక్క సన్నిధానమాత్రం చేత ఈ జగద్వ్యవహారమంతా నేనే ఒనరుచున్నాను" – అను నిశ్చయమును జ్ఞానసిద్ధులగు యోగులు కలిగివుంటున్నారు. అట్టి నిశ్చయము కలిగియుండి, ఆపై కార్యములందు ప్రవృత్తుడగువాడు 'ముక్తుడే' అని మా అభిప్రాయం. ముక్త స్థితికి కర్మానుష్ఠానం విరోధము కాదు. కావలసిన పనిలేదు!

కర్మబద్ధులు - ఈ జీవుడు అనేక ప్రయాసల తరువాత మనుష్యదేహం పొందుచున్నాడు. అట్లు మనుష్యదేహం పొందిన తరువాత కూడా 'నిష్కామ కర్మానుష్ఠానము'నందు తత్పరులు కానివారు దుఃఖముల వైపుకే పయనించుచున్నారు. నిందిత కర్మలచే ఈ జీవుడు నరకమునకు వెళ్ళుచున్నాడు. మరల అక్కడి నుండి కామ్య – కర్మానుభవం కొరకు స్వర్గం వెళ్ళుచున్నాడు. కొందరు విహిత కర్మ లందు బద్ధకముచే అశ్రద్ధపరులై ఉంటున్నారే! అట్టివారు ఒక నరకమునుండి మరొక నరకమునకు, ఒక దుఃఖము నుండి మరొక దుఃఖమునకు, ఒక భయమునుండి మరొక భయమునకు అనుక్షణం ప్రయాణాలు చేస్తున్నారు. స్వవాసనలను దట్టంగా కల్పించుకొంటూ వాటికి తామే బద్ధులగుచున్నారు. దుష్కర్మ ఫలముల ఆధిక్యత చేత జంతు జన్మలు, అక్కడి నుండి స్థావర రూపములు పొందుచున్నారు.

శుద్ధ సాత్వికులు - కొందరు ధన్యులగు జీవులు తమయొక్క మనస్సుచే ఈ మనస్సుకే సాక్షీభూతమైయున్న 'ఆత్మ'ను గురించి విచారణ చేస్తున్నారు. తమయందలి తృష్ణను రహితం చేసి వేస్తున్నారు. కర్మయందు అకర్మ, జన్మయందు జన్మరాహిత్యం వారికి సుస్పష్టముగా సర్వదా సర్వత్రా అనుభవమగుచున్నాయి. అట్టి జీవులే శుద్ధ సాత్వికులు, వారు ఉత్తమ కైవల్యమును పొందుచున్నారు.

నిషిద్ధకర్మలు - హింసించుట, ద్వేషించుట, క్రోధము, పారుష్యము, లోభము మొదలైనవి "ఆశ్రయించకూడదు" అని శాస్త్రములు గుర్తుచేస్తున్నాయి.

రాజస సాత్వికులు - ఈ జీవులు సాత్వికము, లోక కళ్యాణ కారకములగు కర్మలకు సంబంధించిన ప్రవృత్తి – సంస్కారములను కలిగియుంటున్నారు. "స్వధర్మభావనతో భగవదర్పిత భావనతో ఈ కర్మలు నేను చేయాలి. తద్వారా సర్వాత్మకుడగు ఆ భగవంతుని సంతోషింపజేయాలి" అను మననము కలిగి, ఆయాకర్మలందు ప్రవృత్తములగుచున్నారు. వీరు క్రమంగా ఒక శ్రేష్ఠమైన జన్మ నుండి మరికొంత శ్రేష్ఠమైన జన్మను అనుభవించుచూ, ఒకానొక పవిత్రసమయములో (ఒకానొక జన్మలో) ముక్తులగుచున్నారు. అట్టివారు తమయొక్క చివరిజన్మలో, పుట్టినవెంటనే పూర్ణచంద్రునివలె వృద్ధిని గాంచుచున్నారు. వారి ఆయా జన్మలలో "సాధన చతుష్టయం" బలపడుచూ వెంటనంటి వస్తూ ఉంటాయి. బ్రహ్మవిద్యకు ఉపాయభూతములైన సమస్త విద్యలు వచ్చి చేరుచున్నాయి. శ్రేష్ఠత్వము, మనోహరత్వము, మైత్రి, సౌజన్యము, కరుణ, జ్ఞానము మొదలైన గుణములన్నీ ఆతనిని వచ్చి ఆశ్రయిస్తున్నాయి.

ఓ రాఘవా! ఎవడైతే సమస్త కార్యములు చేస్తున్నప్పటికీ, ఫల, అఫలములందు సమరూపుడై వర్తిస్తాడో, హర్ష శోకములు పొందకయే ఉంటాడో, అతని పట్ల ఈ సుఖదుఃఖములు మొదలైన ద్వంద్వములన్నీ నిర్లిప్తం అయిపోతాయి. తెల్లతెల్లవారినప్పటి చీకటిలాగా నశించిపోతాయి. చిత్తము సమస్త సద్గుణములచే పరిశుద్ధమౌతూవుంటుంది. అట్టి సదాచారసంపన్నుణ్ణి జనులు "ఈతనిని మేము కలిగి ఉండాలి" అని తలుస్తారు. ఎందుకంటే, ఆతని యందు సద్గుణ సంపద స్వయముగా, అసంకల్పితముగా ప్రవర్తిస్తూ ఉంటుంది.

సాధన చతుష్టయం - సాధు సాంగత్యం, శ్రవణం, మననం, నిధిధ్యాస మొదలైన ఉత్తమ గుణములచే పరిపూర్ణుడై ఉంటున్న ఆతనిని చూచి సంతోషించినవారై సద్గురువులగు జ్ఞానులు జ్ఞానసంపదను ప్రసాదిస్తున్నారు. "ఇది ఆత్మ – ఇది అనాత్మ" అను వివేకము వారియందు స్వయంగా ప్రకాశిస్తుంది. అట్టి విచారయోగము సహాయంచే ఆ జీవుడు ఆనందైకరసమగు ఆత్మస్వరూపమును వీక్షించగలుగుతాడు. అంతఃకరణమునందు ఆత్మకు లక్షణములైన అఖండత్వము, నిత్యత్వము, శుద్ధత్వము, ప్రకాశమయత్వము మొదలైనవి రూపము దిద్దుకుంటాయి. ఆత్మయే ఆతని మననము, స్వభావము అగుచున్నది. ఉత్తమ శాంతియే ఆతని ధారణ. మనస్సు సర్వదా నిర్గుణ (గుణములకు అతీతమైన) బ్రహ్మము రూపమందు ఐక్యమై ఉంటోంది. 'ఆత్మ' అనబడు అనుభవమునందు నిత్యము ప్రబోధితుడై అతడు ఉంటున్నాడు.

చూచావా రామా! ఉత్తమ లక్ష్యంతో, దృష్టితో, భావనతో ఉపాధిని పొందిన జీవుడు జీవితం అను ఈ అవకాశమును వృథా పరుచుకోడు. మహాత్ములు, ఆత్మద్రష్టలు అగు సద్గురువులను సేవించి, వారు బోధించు యుక్తులచే నిర్మల బుద్ధిని సంపాదించుకుంటాడు. అట్టి బుద్ధిచే చిత్తమునందలి ఆత్మవస్తువును ప్రకాశింపజేసుకుంటాడు.

అంతఃకరణమున ప్రకాశించుచున్న బ్రహ్మమును అనునిత్యంగా ఆస్వాదిస్తున్నాడు. పరమ పురుషార్థ రూపమగు ఉత్తమగతిని తన యొక్క స్వస్థానమునందే పొందుచున్నాడు.

❖❖❖

II. జనకోపాఖ్యానము

1.సిద్ధగీతాగానం

'మిథిల – విదేహ' అనే పేరుగల రాజ్యమును జనకమహారాజు పాలిస్తున్నాడు. ఆయనకు దేనిపట్లా ఎట్టి వ్యథ ఉండేది కాదు. 'ఇది ఆపద, 'ఇది సంపద' అనబడు స్పర్ధ అంతరంగమున లేకుండానే మహావిష్ణువులాగా సౌజన్యపూర్వకంగా రాజ్యం పాలిస్తూఉన్నారు. అయితే ఆయనకు కొన్ని సందేహాలు ఎక్కడో అంతరంగంలో చూచాయగా మినుకుమినుకుమంటూ ఉండేవి.

ఈ జీవుడెవడు? ఈ సంసారము ఏమై ఉన్నది? భ్రమలను కల్పిస్తున్నది ఎవరు? భ్రమలను కల్పించుచున్నవానికి, ఆ భ్రమలు అనుభవించుచున్నవానికి గల సంబంధమేమిటి?

నేనెవరు? ఈ రాజ్యాదులు నావేనా? కాదా! అహంకారము భ్రమయా? వాస్తవమా? అందరి యందు భగవానుడు ఉన్నాడని వేదములు ఘోషిస్తున్నాయి, అయితే నాయందు కూడా ఉండాలి కదా! ఉంటే ఏ రూపములో ఉన్నాడు?

జ్ఞానం అంటే ఏమిటి? అజ్ఞానం అనగా ఎట్టిది? ఎవరిచే కల్పితం? ఈ మనస్సు పొందే అల్పత్వాన్ని, చంచలత్వాన్ని నిరోధించటం సాధ్యమేనా? ఇక్కడ ఏది త్యజించాలి? ఏది గ్రహించాలి?

ఇట్లు అనేక ఆలోచనలు పొందుతూ ఉండేవాడు. ఒక రోజు ఆయన వనవిహారం చేసే ఉద్దేశంతో సపరివారంగా ఒక పర్వతప్రాంతం చేరారు. పరివారము నంతటినీ వదలి పర్వతగుహలలో ఒంటరిగా సంచరించసాగాడు. ఒక చోట ఆయనకు కొన్ని శబ్దములేవో అలవోకగా వినిపించ సాగాయి. అనేక సాధనలచే సముపార్జించియున్న యోగబలంతో మనస్సును ఏకాగ్రం చేసి ఆ శబ్దములను వినసాగాడు.

ఆ శబ్దములు అదృశ్యరూపులగు సిద్ధుల పరస్పర సంభాషణ అయి ఉన్నట్లు యోగబలం చేత, తార్కిక బలంచేత గ్రహించాడు. "ఆహాఁ! ఇక్కడ ఏదో సంభాషణ వినవస్తోంది. ఇవి సిద్ధులు మాట్లాడుకొనే మాటలు! అయితే సిద్ధులు ఏకాంతవాసులు కదా! మహానుభావులతో సమీప్యత అంత తేలికగా లభించదు. ఈ రోజు నా పుణ్యం ఫలప్రదమౌతోంది కాబోలు. వీరు పవిత్రాత్మ స్వభావులు. వీరి మాటలు వింటుంటే, ఉత్తమోత్తమమగు ఆత్మవస్తువు గురించే సంభాషించు కుంటున్నట్లు నాకు అనిపిస్తోంది. సరే, పూజ్యులగు వీరి వాక్యములను వినమ్రతతో శిష్యభావనా సమన్వితుడనై వినెదను గాక" – అని తనలో అనుకున్నాడు. మనస్సును తదితర విషయముల నుండి వెనుకకు మరల్చి ఏకాగ్రతతో ఆ శబ్దమును వినుటకు, అర్థమును గ్రహించుటకు ఉద్యుక్తుడయ్యాడు.

ఒకానొక సిద్ధుడు : మిత్రులారా, ఇప్పుడు ఆత్మజ్ఞాన విషయమై కొన్ని విశేషాలు చెప్పుకుందాం. కొంత సమాచారం చర్చించుకొందాం. మనమన అవగాహనలకు సంబంధించిన అనుభవాలను విశ్లేషించుకుందాం.

❖

ఒకటవ సిద్ధుడు :

ద్రష్ట దర్శనముల సంయోగ స్థానం - ఒకటి చూస్తున్నది. మరొకటి చూడబడుచున్నది. అవియే – ద్రష్ట – దృశ్యములు కదా! పరిమిత, అపరిపక్వ దృష్టికి, ఈ ద్రష్ట – దృశ్యములు వేరు వేరైనవిగా అనిపించటం, ప్రాప్తించటం జరుగుతోంది. అయితే ఈ ద్రష్ట –దృష్టి –దర్శనం –దృశ్యం కూడా ఒకానొకచోట సంయోగము పొందుచున్నాయి. ఏకైక రూపమై ప్రదర్శనమగుచున్నాయి. అట్టి నిరుపమానందన స్వరూపం అయిన సంయోగ స్థానం ఏదై ఉన్నది?

ఒకానొక అనిర్వచనీయమగు తత్త్వము ఈ 'నేత్రములు' మొదలైన ఇంద్రియముల ద్వారా విషయములతో సంయోగమును ఆశ్రయిస్తోంది. ఆ తత్త్వమే 'ఇంద్రియ విషయములు' అను ఆకారముగల బుద్ధివృత్తులను పొందినదగుచున్నది. సర్వమును 'ఇది సుఖము', 'ఇది దుఃఖము' 'ఇది కావాలి' 'ఇది వద్దు' అని నిర్ణయించేది, భావనచేసేది, అనుభవమును పొందేది అదే.

అట్టి నిరతిశయ భూమానంద స్వరూపమైన ఆత్మనే...... నేను ఆరాధిస్తున్నాను. 'భగవంతుడు' అని చెప్పబడుచున్నది అదే. సవికల్ప – నిర్వికల్ప సమాధులచేత, బాహ్య – అభ్యంతర ఇంద్రియ నిగ్రహములచేత నాచే నిరంతరం ఉపాసించబడుచున్నది అదే.

ఎవరు ఎక్కడ ఉంటే, అది వారికి అక్కడే, అప్పుడే లభించియే ఉన్నది. ఇక దాని కొరకు మరొక స్థానం వెళ్ళాలా? మరి కొంత సమయం వేచి ఉండాలా? ఎందుకు?

అయ్యది "నా యొక్క, సర్వుల యొక్క, సర్వము యొక్క" స్వస్వరూపమునకు వేరైయున్నది కాదు. అట్టి అద్వితీయమైనది (వేరుకానట్టిది), అఖండమైనట్టిది (అనేక జీవులుగా మారు స్వభావము లేనట్టిది), స్వస్వరూపమైనట్టిదియగు ఆత్మ భగవంతునకు ఇదే నా నమస్కారం. దృశ్యరూపము, నా స్వరూపముకూడా సర్వదా అయి ఉన్న 'ఆత్మ'కు ప్రణామములు. సర్వజీవులు తానై, సర్వసాక్షిగా వేరై ప్రదర్శనమగుచున్న అస్మదాత్మదేవా! నీకు నమస్కారం!

❖

రెండవ సిద్ధుడు :

భావనకు మునుముందే ఉన్న సాక్షిసత్త - ఈ "నేత్రములు" మొదలైన ఇంద్రియములందు 'అనుభవము' స్వరూపముగా ప్రత్యక్షమై "జ్ఞానము" ఉండి ఉన్నది. – ఆ జ్ఞానం ఈ ఇంద్రియములు రూపుదిద్దుకొనుటకు ముందే ఉండి ఉన్నది.

'నేను చూచుచున్నాను' అను రూపముగల అనుభవమునకు ముందే ఆ అనుభవమును ఆశ్రయించు 'నేను' ఉండియే ఉన్నది. అదే విధంగా 'నేను' అనబడునది భావించబడుటకు ముందే, ఆ 'నేను'ను భావించుటకు సిద్ధమగుచున్న సత్త ఉండియే ఉండాలి కదా?

భావించువాడు భావనకంటే మును ముందే ఉండి ఉన్నాడు. అట్టి 'సాక్షి రూపసత్త' విషయమై కొందరు "అది ఉన్నది.... అదియే ఉన్నది" – అని అంటున్నారు. మరి కొందరు "అది కళ్ళకు కనబడటం లేదుగా!... కనుక లేదు" – అని వాదిస్తున్నారు.

"అసత్తన్నా సదుచ్యతే" – అది 'ఉన్నది', 'లేదు', అని కూడా చెప్పబడుతోంది. అట్లు 'ఉన్నది', 'లేదు' అను విషయమై ఆ రెండింటిని దర్శిస్తూ, అనుభవం పొందే ఒకానొక సాక్షిత్వము ఉండాలి కదా! ఈ అస్థిత్వ – నాస్థిత్వము (ఉన్నది – లేదు) పక్షముల రెండిటియందును మధ్యగతమై, సాక్షిస్వరూపమున వెలుగొందుచూ ఉన్నదేది?

ఔను.....! అది మనస్సుకు, వాక్కుకు అలభ్యముగానే ఉంటోంది. అనుభవమాత్రమే అగుచున్నది. అదియే 'ఆత్మ' అను సంజ్ఞతో మనం చెప్పుకుంటున్నాం.

ఆ ఆత్మ తాను ప్రకాశిస్తూ, తదితరములైన సర్వ వస్తువులను, సమస్త దృశ్యములను ప్రకాశింపజేస్తోంది. అది 'అస్థిత్వము'ను ఆశ్రయించిందా....... 'జగత్తు' అనే కార్యము ఏర్పడుచున్నది. అది 'నాస్థిత్వము'ను ఆశ్రయించినప్పుడో.... 'జగత్తు' తిరోభావరూపము పొందుచున్నది. అట్టి ఆత్మవస్తువునే అనేకులు అనేక నామ – రూపములతో ఉపాసిస్తున్నారు. అందరి ఆరాధన, తపన అదియే. అట్టి 'ఆత్మతత్త్వము'ను నేను నిత్యము ఉపాసిస్తున్నాను.

❖

మూడవ సిద్ధుడు :

ఆధారుడు, నియామకుడు - "నేను, నీవు, అతడు, ఆమె, వారు, వీరు" అనునవన్నీ ఉన్నది ఎక్కడ? ఎందులో? ఈ సర్వమునకు ఆధారం ఎవరు? ఈ సమస్తము ఎవనికి చెందినది? వీటన్నింటిని నియమించుచూ ప్రభువై పాలించుచున్నవాడు ఎవరు?

ఎవనియొక్క సంకల్ప బలముచేత సర్వము ఉత్పన్నమై ఒకానొక నియమానుసారం ప్రవర్తిస్తోంది? ఈ సర్వమునకు 'కారణ భూతుడు' ఎవడు? ఎవడు ఉంటే మాత్రమే ఇవన్నీ ఉండ గలుగుచున్నాయి? అసలు ఈ సమస్తము ఎవడై యున్నాడు? మాయచే జగద్వ్యవహారములన్నింటినీ నిర్వహిస్తూ సర్వరూపములు తానే అయి ఉన్నాడు.... నామరూపములకు సంబంధించనివాడు ఎవడు? అట్టి సత్యము, నిత్యము, సమము, సర్వము అగు పరమాత్మనే నేను ఆరాధిస్తున్నాను.

❖

నాలుగవ సిద్ధుడు :

సర్వనిర్వచనములకూ ఆలవాలము, సూచకము (Zone of/indicative of - all definitions)–

"అహమ్..... (నేను)" అను భావన సర్వులయందు సర్వదా సర్వమునకు కారణమై వెలుగొందుచున్నది కదా...! ఈ 'అ'కారము ఆదిగా, 'హ' కారము అంతముగా గల 'అహమ్' అను శబ్దము సూచిస్తున్నది దేనిని?... అదియే 'ఆత్మ' అనబడు మరొక శబ్దముతో కూడా ప్రతిపాదించబడుతోంది. అదియే తదితర వస్తువులన్నిటినీ ప్రకాశింపజేస్తోంది.

అంతేకాదు! సర్వవేదాలలో, తదితరమైన శాస్త్రాలలో అనుగతమైనది అదే. బహు విధాలుగా నామ రూపాదులతో కూడినదై అనేక చమత్కారాలచే ప్రవచింపబడుచున్నది కూడా అదే!

అన్ని అక్షరముల సముదాయ రూపమగు శబ్దజాలమునందు అతడు అంతర్గతుడై ఉన్నాడు. "ఇది సుందరమైనది.... ప్రియమైనది... స్వీకరింపతగినది..... ఆశ్చర్యకరమైనది... పవిత్రమైనది" మొదలైన నిర్వచనములన్నీ ఎవరివి? అహంభావనకే ఆది అయినట్టి 'శుద్ధచిత్' తత్వము యొక్క చమత్కారమే. ఆ ఆత్మభగవానుడే సర్వాకారుడు అయి ఉన్నాడు.

అనగా, అతడే సర్వులుగా ఆకారము గ్రహించుచున్నాడు కదా! కాబట్టి సర్వ నియామకుడు, సర్వవ్యాపకుడు అయి ఉన్నాడు. ఆ సర్వవ్యాపకుడు అనవధ్యుడు. ఆతనిని వధింపగలిగినది, నిరోధింప గలిగినది ఎక్కడా ఏదీ ఉండజాలదు. ఆతడు విభాగములుగా అగుటయే లేదు.

ఆతడు వాస్తవానికి ఏనాడూ మరొకటేదీ అగుట లేదు. కనుక 'జీవుడు', 'మనస్సు' మొదలైన వన్నీ ఆతనిపట్ల భ్రమచే ఆపాదించబడుచున్నవి మాత్రమే. ఆతడు సర్వదా నిర్గుణ బ్రహ్మము నందే స్థితి కలిగివుంటున్నాడు. జలం తరంగమగుచున్నప్పటికీ జలము జలముగానే ఉంటోంది కదా!

"సోఽహమ్... సోఽహమ్... సోఽహమ్" - ఆతడే నేను .. నేను ఈ నామ రూపములు కాదు. మనోబుద్ధులు నేను కాదు. చిత్తాహంకారములు నేను కాదు. ఆతడే నేను..... నేనే ఆతడు.

శ్వాసఉచ్ఛ్వాసలచే 'సోహమ్' మంత్రం అసంకల్పితంగానే నాచే నిరంతరం జపించబడుచున్నది కదా! అట్టి ఆత్మ పరమేశ్వరుని ఆరాధిస్తున్నాను... ఉపాసిస్తున్నాను. శరణు వేడుతున్నాను. ఆతడు నిరామయుడు (తీళిజీళీజిలిరీరి) అని తెలిసికూడా, నామరూపములను ఉపకరణములుగా తీసికొని ఆ ఆత్మానంద తత్త్వమువైపుగా ప్రయాణిస్తున్నాను.

❖

ఐదవ సిద్ధుడు :

న అన్యమ్, న బాహ్యమ్ - ప్రతి ఒక్క జీవుని 'హృదయ గుహ'లోను ఒకానొక 'సత్త' స్వరూపుడగు భగవానుడు కాపురము ఉండివున్నాడు. సాక్షి స్వరూపుడై వెలుగొందుచూ, సర్వమునూ అతడు వెలిగించుటకు మూలకారకుడు అగుచున్నాడు. అతడెవరు? అతి చమత్కారంగా, 'న అన్యమ్', 'న బాహ్యమ్' (Not different from one's own self. Not anything outside).

అంతరాత్మ స్వరూపుడగు ఆ భగవంతుని ఏమరచి, ప్రక్కకు పెట్టి .... ఈ జీవుడు ఎక్కడో ఉన్నట్లుగా భావించబడు అన్యదేవతలను ఆశ్రయిస్తున్నాడేమిటి? ఎంత ఆశ్చర్యం?

ఓయీ, జీవుడా! నీ హృదయంలో సర్వదా వేంచేసియుండి, సర్వ స్థితిగతులందు, నిశ్చలుడు, నిర్మలుడు అయివుంటున్న ఆ అంతరాత్మయే నీవు. మరేదీ నీవు అయి ఉండలేదు.... ఉండబోవు! చేతిలోని 'మణి'ని పూర్తిగా మరచి, ఎక్కడో దూరముగాగల ఒక్క గాజుముక్కను చూచి "అహో! అది నన్ను సమీపించకూడదా...! ఏంచేస్తే అది పొందగలను?" అని నీవు ఎందుకు కలవరిస్తున్నావు? గుప్పిట విప్పి మణిని చూచినట్లు స్వహృదయమునకు స్థానమైయున్న ఆ స్వస్వరూపాత్మను దర్శించవేం?

ఆ భగవంతుడు అంగుష్ఠమాత్రుడై సర్వుల హృదయములందు సుఖాసీనుడై అంతరాత్మ స్వరూపుడైయుండియే ఉన్నాడు. అందుచేత, ప్రతి ఒక్కరికి మేము చెప్పుచున్నది ఒక్కటే... సర్వ జీవులారా! మీలో ఏ ఒక్కరూ పరితపించవలసిన పనేమీ లేదు. ఆ పరమాత్మ మీ హృదయమునందే సర్వదా వేంచేసియున్నారు. అది గ్రహించండి... ఆరాధించి తరించండి. పరమాత్మ స్వరూపులై సంతృప్తులు అవండి. నా ఆరాధన, ఆరాధ్యము సర్వాంతర్యామి అగు నా అంతరాత్మయే!

❖

ఆరవ సిద్ధుడు :

ఆశ రహితంకాగా అప్పుడు శేషించి ఉండేది! - ఈ జీవుని యందు క్షణక్షణం అసంఖ్యాకంగా, అంతులేకుండా ఏవేవో క్రొత్త క్రొత్త ఆశలు ఏర్పడుచున్నాయి. ఈ 'ఆశ' అనుదానికి అంతు ఉండటంలేదు. ఆశలు ఎందుకు ఏర్పడుచున్నాయి? 'ఆశించుట' అను ప్రకృతి సంబంధమైన స్వభావము చేతనే కదా! ఒకానొక జీవుడు సమస్త ఆశలు పరిత్యజించాడనుకో... అప్పటికీ ఆతనియందు శేషించి ఉండునదేమిటి?

ఆ శేషశయనుడు (అట్లు శేషించు దాని యందు శయనించువాడు) 'చిద్రూప పరబ్రహ్మము' అను సంజ్ఞతో చెప్పబడుచున్నాడు. అదియే బ్రహ్మము. అదియే మర్మము. అది సర్వదా ప్రాప్తించియే ఉన్నది. అట్టి బ్రహ్మముయొక్క జ్ఞానానుభవము ప్రాప్తించిన తరువాత ఇక 'ఆశ' అను విషలతకు స్థానమెక్కడిది? వెలుతురు ఉన్నచోట చీకటికి ఉనికి ఎక్కడ?

హృదయమును ఆశారహితము చేసి అప్పుడు శేషించి ఉండే ఆత్మయే నాచే ఆరాధించబడు పరమోత్కృష్టతత్త్వము. అదియే నా ఆరాధ్య దైవము. అదే సర్వస్వము. నా ప్రయత్నములన్నీ అటు వైపుకే!

❖

ఏడవ సిద్ధుడు :

క్షుద్రాశయం, మహాశయం - ఈ జగత్తులో 'భోగము' అను అనుభవమును పొందదానికి అనేక వస్తువులు ఎదురుగా కనిపిస్తున్నాయి. ఇవన్నీ వాస్తవానికి సారరహితం. ఇవి అనుక్షణం ఒక స్థితి నుండి మరొక స్థితికి పయనిస్తున్నాయి.

శాస్త్ర వాక్యములు, గురుబోధలు "ఈ జగత్ పదార్థములు నిస్సారములే" అని పదే పదే జీవులకు గుర్తు చేస్తున్నాయి. ఈ జీవులు అవన్నీ వింటూకూడా ఎందుకో 'దుర్బుద్ధి'నే ఆశ్రయిస్తున్నారు. "ఈ వస్తుజాలం సుఖప్రదములు. ఇవి మమ్ములను తదితరుల కన్నా గొప్పగా చేస్తాయి.... కనుక కలిగి ఉంటాం గాక" .. అను యోచనయే జీవన విధానమును శాసించటం జరుగుతోంది. వీరు స్వల్ప వస్తువులకొరకై ద్వేషించుకొనుచున్నారు... దుఃఖించుచున్నారు... శ్రమించు చున్నారు.... పరుగులు తీస్తున్నారు. ఫలితంగా, అజ్ఞానంచే ఆవరించబడిన మనస్సు గలవారై మరల మరల అనేక నీచ ఉపాధులు పొందుచున్నారు. దుర్బలమైన స్థితి గతులు తెచ్చి పెట్టు కుంటున్నారు.

అట్టి భోగ్యవస్తువులను జీవిత లక్ష్యముగా అంగీకరించు మానవులు – వారిని మానవులు అని అనకూడదు. మానవరూపంలో ఉన్న గాడిదల వంటి వారే! ఎందుకంటే వారు తమ మనస్సు లందు ఎన్నో 'నిష్ప్రయోజనకరము, త్యాజ్యార్హము' అగు వేదనలు, రోదనలు మోస్తున్నారు కదా!

'ఆత్మ జ్ఞానము', 'ఆత్మానుభవము' – అనునవి లక్ష్యముగా కలిగి జీవించువారి జీవితములు మాత్రమే అర్థయుక్తము, శుభకరము, పవిత్రము కూడా! వారి కర్మలు, వారి శబ్దములు, భావములు క్రమంగా సుఖ శాంతులు సంతరించుకోగలవు.

కనుక ఆత్మతత్త్వజ్ఞానులు, ఆత్మస్వభావులు అగుటకు యత్నించుటచే మహాశయులు (మహత్తరమైన ఆశయములు కలవారు) అగుట ఎంత ఉత్తమం! అట్టి మహాశయమే నా మార్గం.

❖

ఎనిమిదవ సిద్ధుడు :

ఇంద్రియ సద్వినియోగం - పర్వతాలు రెక్కలతో లేస్తూ ఊళ్ళమీద పడుతుంటే, ఇంద్రుడు తన వజ్రాయుధంతో ఆ పర్వతముల రెక్కలను ఖండిస్తున్నాడు కదా...! అట్లాగే 'ఇంద్రియములు' తమ ఇష్టం వచ్చినట్లు ఆయా విషయములపై వ్రాలుచుండగా ఈ మానవుడు చూస్తూ ఊరుకోవటం ఉచితం కాదు. 'వివేకము' అనే దండముతో వాటిని పదేపదే అణచివేయాలి.

ఇంద్రియసర్పాలు యథేచ్ఛగా ప్రవర్తిస్తూ ఉండే సమయంలో ఆజీవుని హృదయంలో సుఖశాంతులు ఉండే అవకాశమెక్కడిది? ఈ ఇంద్రియాలను నియమించటం ఎఱుగనప్పుడు ఇవి అనంత దుఃఖములలోకి ఈ జీవుని త్రోసివేస్తున్నాయి. దుర్భర జన్మపరంపరలను ప్రాప్తింప జేస్తున్నాయి.

అరేఁ! ఎంతో శ్రమించిన తరువాత, ఆశ్రమకు ఫలితంగా 'మానవుడు' మొదలైన ఉత్తమమైన ఉపాధులు పొంది కూడా, ఈ జీవులలో అనేకులు వాటిని సద్వినియోగపరుచుకోవటం లేదే? శాస్త్రములు, "ఇంద్రియములను ఎట్లు నియమించటం ఉచితం?" – అనే విషయమై అనేక మార్గములు చూపుచున్నాయి.

ఇంద్రియాలు దుర్వినియోగబడకుండు గాక! ఎందుకంటే, అందుకు అంతిమ ప్రయోజనం దుఃఖం, అవివేకం, సంకుచితత్వమే అగుచున్నది. "ఇది సన్మార్గం, ఇది దుర్మార్గం" అని విచక్షణ చేయబడి, అప్పుడు సరియగు మార్గములో, అనగా శాశ్వతము, అఖండము అగు ఆత్మావగాహన పెంపొందించు మార్గంలో – ఈ ఇంద్రియములు వినియోగించబడుగాక! సర్వ అవకాశములు సద్వినియోగ పరచుకుని ఆత్మావగాహన పెంపొందించుకోవటమే సన్మార్గం. అదియే నా సాధన.

❖

తొమ్మిదవ సిద్ధుడు :

ఇంద్రియాతీతత్వం - ఈ విషయములన్నీ కూడా దుఃఖప్రదములుగానే పరిణమిస్తున్నాయి. ఈ ప్రపంచంలో కనిపించేవన్నీ ఇంద్రియ సంబంధితములే కదా!

మరిప్పుడు ఉపాయమేమిటి? విషయముల వెంటే పరుగులు తీయాలా? ...లేదు.

మానవుడు ఈ బాహ్య, అభ్యంతర వ్యాపారములను నిరోధిస్తూ ఉండాలి. అప్పుడు క్రమంగా ఈ విషయములచే ఏర్పడుచున్న దుఃఖము రహితం అవుతుంది. అట్లు నిరోధించటంలో కొంత శ్రమ ఉన్నమాట నిజమే.

అయినాసరే! బాహ్య – అభ్యంతర వ్యాపారములు క్రమపరచాలి. "అల్పసుఖమును త్యాగం చేసి ఉత్తమ సుఖమును సముపార్జించటం" – అనేది లోకంలో అందరికీ తెలిసిన విషయమేకదా! విషయ సుఖము అధిగమించబడిందా..... అప్పుడు ఆత్మసుఖమే లభించగలదు కదా! అట్టి 'ఉపశమనము'చే ఇంద్రియ వ్యాపారం నిరోధిస్తే, చిత్తము శమిస్తుంది.

చిత్తము ఇంద్రియములనుండి రక్షితమయిన చోట 'జడత్వము' లేనట్టి శుద్ధ పరబ్రహ్మానుభవం లభించగలదు. ఉత్తమ స్థితి లభించగలదు. అప్పుడు ప్రాప్తించుచున్న నిత్యోదిత 'ఆత్మ' లేక పరబ్రహ్మమునకు ఇవే నా నమస్కారములు. ఆనిత్యోదిత పరబ్రహ్మమే నా దృష్టి, నిష్ఠ కూడా!

❖

ఒకానొక సిద్ధుడు : మంచిది... ఈ సమయంలో మనం చక్కటి విషయాలు గుర్తు చేసుకున్నాం. ఇక ఈ విషయములు మనం మరికొంత యోచించుకుంటూ ఉండెదముగాక! ఇక మనం మన స్వస్థానములకు వెళ్లుదాం!

❖❖❖

2. విచిత్ర ప్రపంచం
స్థితిగతులు - ముందువెనుకలు

ఆ విధంగా సిద్ధులు గానం చేసిన గీతములలో అర్థమును తరచి తరచి యోచిస్తూ జనకమహారాజు ఇక ఇంటిముఖం పట్టాడు. కొంతయోచన తరువాత ఆతనియందు ఒక భీరువు వలె విషాదం ఏర్పడింది. క్రమంగా అంతఃపురం జేరాడు. పరివారమునంతటినీ వారి వారి స్థానములకు పంపివేశాడు. కోట యొక్క ఒక ప్రసాదభాగం అధిరోహించాడు. ఒకచోట ఒంటరిగా అటూఇటూ పచార్లు చేస్తూ అతి చంచలముతో కూడినట్టి ఈ విచిత్రమైన ప్రాపంచిక గతుల గురించి తీవ్రమైన పరిశీలన చేయసాగాడు.

జనక మహారాజు (స్వగతంగా) : అంతులేకుండా ఆశలు...! అల్పమైన జీవితకాలం...! ఆహా! ఎంతటి ఖేదకరమైన విషయం! ఏమి విపత్తు వచ్చిపడింది! ఈ జన్మమృత్యుజరాభయాదులలో ఎప్పుడో ఎందుకో చిక్కుకున్నాను. ఇంకేమున్నది? మిక్కిలి కష్టప్రదమైన చంచల జీవిత దశలందు బలాత్కారంగా దొర్లించబడుచున్నానే!

ఈ స్వల్ప జీవితాన్ని, రాజ్యాదులను చూచి ఎందుకు అప్పుడప్పుడు నాకు తెలియకుండానే నేను మురిసిపోతున్నాను? ఈ అనంత కాల వ్యవస్థలో నా జీవితం ఎంత స్వల్పమైనది?

అట్టి స్వల్పకాలిక జీవితంలో ఎన్ని స్థితిగతులు!... ఎన్ని ఒడుదుడుకులు...! ఇంతలోనే ధనం, రాజ్యం, జాతి,అధికారం, ప్రతిష్ఠ... మొదలైన మాయా వస్తువుల పట్ల అంతులేనన్ని ఆశలు కల్పించుకొని, ఆ ఆశాపాశముల బంధంలో ఇరుక్కొని ఉన్నానే! “విమర్శ– విశ్లేషణ – అవగాహన”లను ఆశ్రయించని నాకు కాలమును దుర్వినియోగ పరుచుకుంటున్నందుకు ధిక్కార మగుగాక!

ఈ రాజ్యము, రాజరికము మొదలైన పైపై పటాటోపాలు మహా అయితే కొన్ని సంవత్సరాలు ఉంటాయి. ఆపై ఇవన్నీ తొలగవలసినదేకదా! నాకున్న బుద్ధి, శక్తి, యుక్తి ఇవన్నీ కూడా వీటిని కొద్దికాలం కలిగి ఉండటానికి మాత్రమే వెచ్చిస్తే, అది ఎంతటి మూర్ఖత్వం! ఎంతమంది ఇతః పూర్వం ఈ రాజ్యం ఏలారు? కాలక్రమేణా ఎంతమంది వచ్చి ఈ మిథిలా నగరం ఏలబోవుచున్నారు. అయ్యో! ఈ తుచ్ఛమైన ‘బుద్ధి’ నన్ను “దుర్గతులు, నీచ భావము, తుచ్ఛమైన ఉపాధులు” వైపుగా నడిపిస్తోందేమిటి? ముందు ముందు ప్రాప్తించబోవు దుఃఖముల శమనము కొరకు ఇప్పుడు నేనేమైనా చేస్తున్నానా? అసలు ఈ విషయం గుర్తించి, చింతిస్తున్నానా? లేదు. ఇట్లా అయితే ఇక ఒక కంచరగాడిదకు నాకు తేడా ఏమి ఉంటుంది?

నేను వాస్తవానికి అనాది అయిన, అనంతమైన స్వరూపముగల ఆత్మ చైతన్యమునేకదా! మధ్యలో ఈ అల్పమైన ‘జీవితము’ అనబడునది నా స్వకీయమైన “శరీరముతో ఏర్పరుకొనిన సంబంధము” చేతనే ప్రాప్తించుచున్నది. ఇదంతా అవివేకముయొక్క ప్రభావమే. ఒక చిత్రపటంలోని చంద్రుని చూచి అమాయకబాలుడు, “ఈ చంద్రుని చల్లటి అమృతతుల్యమైన కిరణాలు నన్ను ఆహ్లాద పరుస్తున్నాయి” అని చెప్పుకొంటుంటే ఏమనాలి? “ఈ దేహమే నేను” అని భావించుచు, అనాత్మభూతమగు ఈ దేహాదులను ఆత్మరూపంగా తలచుచు వ్యర్థంగా కాలము గడపివేస్తున్నాను. ఇంతకు మించి నా విషయమై విశేషమేమీ లేనట్లు భ్రమతో కూడిన ధైర్యము కలిగి ఉంటున్నాను. ఏమి మూర్ఖత్వం!

ఎంత కష్టకాలం! -

ప్రపంచరహితేనాహ మింద్రజాలేనజాలినా ।
హాకష్టమతిముహ్యామి కేనాస్మిపరిమోహితః ॥ (శ్లో 9, సర్గ 9)

ఏ ఇంద్రజాలకుని ఇంద్రజాలముచే పరమమోహితుడనై నేను ఈ ‘రాజ్యము, రాజసింహాసనం, బంధువులు, స్వజనులు మొదలైనవాటిచే మోహం పొందుచున్నాను? ఈ ఎదురుగా కళ్ళకు కనబడేవి సత్యమని, నిత్యమని నేను ఎందుకు భావన చేస్తున్నట్లు?

జగత్పదార్థముల భావన - ఈ దృశ్య జగత్తును ఎంతగా పరిశీలించి చూస్తే ఏమి లాభం? ఇందులో సత్యమైన, అపరిచ్ఛిన్నమైన వస్తువంటూ ఏదైనా ఉన్నదా? ఈ ప్రపంచమంతా వెతికి చూచినప్పటికీ అట్టి వస్తువు లేదు కదా! ఈ నా శరీరమే కొంతకాలానికి నేలకూలిపోబోవుచుండగా ఇక ఎదురుగా నిలచియున్న జగత్పదార్థముల విషయం వేరే చెప్పేదేమున్నది? అసత్యము, అనిత్యము అయినవాటిచే నాకు చిత్త విశ్రాంతి ఎట్లా లభిస్తుంది?

అజ్ఞానదృష్టికి స్వల్పమైన విషయములు, పదార్థములు మహత్తరమైనవాటివలె అగుపిస్తున్నాయి. తత్ఫలితంగా సత్య వస్తువుయొక్క అనుభవం అత్యంత దూరంగానే ఉండిపోతుంది. నేను ఏ సత్యవస్తువుకై అన్వేషిస్తున్నానో, అది నా మనస్సుకు కూడా సాక్షి అయి, ఈ సర్వమునకు నియామకమై వెలుగుచున్నది.

ఎక్కడికి వెళ్ళాలి? ఏమి చూడాలి? – ఆ సత్యవస్తువు నాకు ఎంత సమీపంలో ఉన్నదో తరచి చూస్తే 'ఆ సత్యమే నేను' అని తెలియ వస్తోంది. అట్టి 'నిత్య–శుద్ధ–అఖండ–అప్రమేయ' పరమాత్మ యొక్క దర్శనం ఎక్కడికి వెళ్ళితే లభిస్తుంది? అతడు నా హృదయమునందే హృదయమునకు సాక్షీభూతుడై ఉన్నాడు కదా! కనుక ఆతని కొరకు హృదయమునందే వెతకాలిగాని, ఎక్కడో బయట వెతికితే ఏం లాభం? నా దివ్య చైతన్య – స్వభావం నాయందే వెతికి దర్శించాలికాని, మరెక్కడెక్కడో కాదే!

హృదయములోనే ఉంటూ కూడా ఆతడు ఎందుకు లభించుట లేదు? బాహ్య పదార్థముల పట్ల నిరంతరం ఏర్పడుచున్న ప్రియాప్రియములతో కూడిన భావనయే అందుకు అడ్డగుచున్నది కదా! ...కనుక, సర్వ బాహ్యపదార్థములను త్యజించివేసెదనుగాక! అసలు అపేక్ష ఎందుకు ఉండాలి?

ఈ జీవులలో అనేకులు "మేము భోగములను పొందవలసియున్నది" అను లక్ష్యముతో అల్ప ఆశ్రయములగు ధనార్జన, పంచేంద్రియములను సంబంధించిన రాగముతో కూడిన విషయములు – మొదలైన వాటియందు తీవ్రముగా ప్రవృత్తులగుచున్నారు. కాని ఏం లాభం? అవి లభించినా, అవన్నీ క్షణభంగురములే కదా!

నీటిలో 'ఆవృత్తములు' ఎంత కాలం నిలిచి ఉంటాయి? ఇవన్నీ కూడా అంతమాత్రమే! చిటికెలో మాయం అయ్యేవే! ఈ ధనాదులు సంపాదించే కాలంలో, కలిగియుండే కాలంలో కూడా జీవునకు అనేక దుఃఖములను కలుగజేస్తున్నాయి కదా! ఇట్టి తుచ్ఛము, నిస్సారము అయినట్టి పదార్థముల కొరకు ప్రయత్నించుచూ, వర్తమానపు శక్తి యుక్తులనన్నిటినీ నేను ఎందుకు నేలపాలు చేసుకోవాలి?

'పరబ్రహ్మం' అను శబ్దంచే చెప్పబడుచున్న ఆత్మవస్తువు సర్వదా తాను వెలుగుచూ సర్వమునూ వెలిగించుచూ ఉండియే ఉన్నది. అది ఈ నా శరీర ధారణకు ముందే ఉంది. ఇప్పుడు కూడా ఉంది ఈ శరీరం త్యజించబడవచ్చు, అయినప్పటికీ అది అట్లే ఉండి ఉంటోంది. దాని యందు ఏ సమయం లోనూ ఎట్టి మార్పుచేర్పులు ఉండవు. ఆ పరబ్రహ్మము నా కంటే వేరైనది కాదు. బ్రహ్మానంద స్వరూపం, ఏకైక సత్యం అదియే. అట్టి ఆత్మ వస్తువును ఎఱుగుట కొరకు, అట్టి ఎఱుక 'అనుభవం'గా పరిణమించుటకు ఈ వర్తమానపు శక్తియుక్తులను నేను ఎందుకు వినియోగించ రాదు? ఏ విషయసుఖాలైతే, ఉపేక్షించినంత మాత్రం చేత నిత్య సత్యమగు 'ఆత్మ'యే లభిస్తుందో, అట్టి 'ఆత్మ స్వభావం'ను వదలి.... గడ్డిపరకల వంటి విషయ సుఖాల కొరకు, ఈ రాజ్యం, అధికారం మొదలైన తుచ్ఛ వ్యవహారాల కొరకు నేను ఎందుకు అఱ్ఱులు చాచాలి? ఎవరి కొరకు అపేక్షించాలి? అవి ఉంటే ఉండనీ, లేదా తొలగనీ! అందులో ఏం విశేషం ఉన్నది? ఈ రాజ్యాదులు ఎదురుగా ఏర్పడి ఉన్నంత మాత్రం చేత అవి నావి అవుతాయా? అవన్నీ బాహ్యమైనవే కదా! నాది విదేహరాజ్యం.

'నాది' అనతగినదిక్కడ ఏమి ఉన్నది - ప్రతిక్షణం, ప్రతిరోజు, ప్రతి మాసం, ప్రతి సంవత్సరం వస్తోంది, పోతోంది. "అనేక సుఖాలు పొందవలెనను లక్ష్యంతో ఆయా ప్రయత్నాలన్నీ నిర్వర్తించటం" – అనునదంతా చివరకు దుఃఖరూపముగానే పరిణమిస్తోంది. అసలు ఈ ప్రపంచంలో వినాశనం కానిదంటూ ఎక్కడా ఏదీ లేనేలేదు. అతి త్వరలో కాలగర్భంలో కలిసిపోయే ఏ వస్తువునైనా 'ఉత్తమ వస్తువు' అని అనటం ఎట్లా?

కాబట్టి 'నేను కలిగియున్నాను' అని ఏదేది నాచే భావించబడుచున్నదో – అట్టి రాజ్యములు, తదితర జనులతోటి సంబంధ బాంధవ్యములు, ఈ శరీరాదులు ...ఇవన్నీ భ్రమ కారణంగానే అట్లు భావించబడుచున్నాయి.

అనంతమగు మహాకాల దృష్టిచే, లేక... తత్త్వదృష్టిచే చూచినప్పుడు 'ఇంద్రుడు – బ్రహ్మ' మొదలైన వారి పదములు కూడా అత్యంత స్వల్పమైనవిగాను, కాలముచే నశించిపోయేవి గాను, దుఃఖ ప్రయాసలతో కూడుకొన్నవి గాను తెలిసిపోవుచుండగా ఇక ఈ అత్యంత స్వల్పకాలికమగు ఈ మిథిలా రాజ్య సింహాసనం ఎంతటిది?

ఈ దృశ్య జగత్తును వివేచనాదృష్టితో పరిశీలిస్తూ ఉంటే నాకు ఒక్కటే అనిపిస్తోంది.... జీవులకు నిరంతర చిత్త విశ్రాంతి పొందింపజేయగల పదార్థమేదీ ఇక్కడ లేనేలేదు.

ఈ రోజు సుందర స్త్రీలు, మహారాణులు తమ జడలకు అలంకరించిన సుకుమార సుగంధ పుష్పాలు రేపటికి వాడి, శల్యమై ఒక మూలకు నెట్టివేయబడుచున్నాయి. నేడు ఈ శరీరం అనేక కిరీటాలను, భుజకీర్తులను ధరించి, అనేకులను శాసిస్తూ ఇటూ – అటూ తిరుగుచుండ వచ్చుగాక! ఇదే శరీరం కొద్ది రోజులకు మూల్గుతూ మట్టి యందు కూలబోవుచున్నదే....!

మరి మూర్ఖురాలగు నా చిత్తం ఇదంతా గమనించదేం? ఇది ఆయా తుచ్ఛ విభవము లందు, సంబంధము లందు, జాత్యహంకారము లందు ఎందుకు విశ్వాసం కలిగి ఉండి, రోజులు గడుపుచున్నదో నాకు అర్థం కాదు!

ఆకాశంలో పిల్లగాలులు ఆస్వాదిస్తున్న ఒక పక్షి ఆ ఆకాశాన్ని వదిలి "ఈ అడవిలో నేలపై బియ్యపు గింజలు ఎలా వచ్చిపడ్డాయి?" అనే ఆలోచనే చేయకుండా, నేల వ్రాలి వలలో చిక్కుకుని వేటగాని చేతులలో హింసించబడుచున్నది కదా! ...ఆ పిట్ట వేటగాని బుట్టలోకి త్రోసివేయబడు చున్నట్లు, నా ఈ చిత్తము తుచ్ఛము, నశ్వరము, ప్రమాదకరము" అగు విషయ సుఖముల వైపుకే ఆకర్షించబడుతోంది!

ఆశాపాశములు -

అరజ్జురేవబద్ధోఽహ మపంకోఽస్మికలంకితః ।
పతితోస్మ్యుపరిస్థోపి హా మమాత్మన్హతాస్థితిః ॥ (శ్లో 16, సర్గ 9)

హాఁ ! హతవిధీ! ఇక్కడ త్రాడువంటిదేమీ ఎదురుగా లేకున్నప్పటికీ నేను మాత్రం ఇక్కడి విషయములకు కట్టివేయబడి ఉన్నానే? ఆశాపాశములు వివేచనా శక్తిని కట్టివేసి ఉంచుతున్నాయి.

బురద లేకుండానే నేను కళంకితుడనగుచున్నాను. జన్మ జన్మలుగా ఆర్జించిన దుర్వాసనలు, కుసంస్కారములు నన్ను దోషపూరితునిగా చేస్తున్నాయి.

"నీవు ఆత్మవే సుమా"- అని పెద్దలు పలుకుచున్నారు. ఆ వాక్యం విని కూడా ఏం లాభం? సర్వమునకు ఆవల ఉన్నట్టి నేను ఇప్పుడు ఇక్కడ జడత్వముచే కూలబడి ఉన్నాను. నా ఆత్మ యొక్క వాస్తవతత్త్వాన్ని ఇక్కడ "అజ్ఞానం, దురాశలు, రాగద్వేషములు, జాతి మొదలైన అహంకారాలు" - కప్పివేస్తున్నాయి. కారుమేఘం సూర్య ప్రకాశాన్ని అచ్ఛాదించునట్లు, నేను స్వతఃగా మహాధీమంతుడును, శుద్ధుడను, అఖండుడను అయినప్పటికీ మోహం వచ్చిపడి నన్నెందుకో ఆవరించి వేస్తోంది.

ఏది నేను? ఏది నాది? -

క ఇ మే మహాభోగాః? క ఇమే మమబాంధవాః?
బాలో భూతమయేనేవ సంకేతేన అహమాకులః ॥

ఈ మహాభోగము లేమి? ఈ నా బంధువులంతా ఎవరు? ఆహా! ఒక బాలుని లాగా వ్యర్థంగా "నేను, నాది" అను కల్పనచే నిష్కారణంగా వ్యాకులపడుచున్నానే? ఈ 'భోగం', 'దృశ్యం' లందు నేను ఎందుకు స్వయంగా విశ్వాసం కల్పించుకొనుచున్నాను? నా యొక్క తుచ్ఛ విశ్వాసమే నాకు జరా-మరణాల కల్పనను ఆపాదింపజేయుచు, అత్యంత భయదాయకం అగుచున్నదే? ఈ ధన, బాంధవాదులు ఉంటే ఉండనీ, ...లేదా పోతే పోనీ! వీటితో నాకేమిపని? నీటిలో ఏర్పడే 'బుడగలు' లాగా ఇవన్నీ మిథ్యా రూపంగానే సంప్రాప్తిస్తున్నాయి. వీటితో సంబంధాలు దర్పణంలోని ప్రతిబింబాల వంటివే కదా!

మనం అనేకమంది చక్రవర్తుల గురించి విన్నాం. వారు మహా భోగములు అనుభవించారు. ఉత్తమగుణ సంపన్నులగు బంధువులను కలిగియున్నారు. ....అవన్నీ ఏమైనాయి? కేవలం నామ మాత్రంగానే మిగిలాయే? ఇప్పటి నాకు సంబంధించిన వస్తువిశేషములన్నీ భవిష్యత్‌లో అంతే కాబోతున్నాయి. మరి ఈ వర్తమానము నందు నేనెందుకు విశ్వాసం వహించి ఉండాలి? గొప్ప రాజుల విభవాలకు ఏం గతి పట్టింది? అంతే కాదు... ఇతఃపూర్వపు బ్రహ్మదేవునిచే రచించబడిన అనేక బ్రహ్మాండాలన్నీ ఇప్పుడేమైయ్యాయి? మటుమాయమై పోయాయే! అనేక మంది బ్రహ్మలే గతించారు. ఈ బ్రహ్మాండం యొక్క గతి కూడా అంతే కాబోవుచున్నది. ఇక నాకు 'నాది' అనబడు భావం గాని, అపేక్ష కాని ఎందుకు ఉండాలి?

జలం బుద్బుదములను తన యందే లయం చేసుకుంటూ ఉంటుంది. 'కాలుడు' అనబడువాడు లక్షల కొలది ఇంద్రులనే మ్రింగివేశాడు. మరి స్వల్ప విశేషముల యందు విశ్వాసము కలిగి ఉండే నా వంటి మూర్ఖులను చూచి విజ్ఞులు నవ్వుకొనుటలో తప్పేమున్నది?

అనంతకోటి బ్రహ్మదేవులు గతించారు. అనేక సృష్టిపరంపరలు గడిచిపోయాయి. ఎందరో రాజులు కోట్ల సంఖ్యలలో ధూళికణములవలె వినష్టమైపోయారు. ఇక నేనెంత? ఈ రాజ్యమెంత? ఈ నా బంధుజనమెంత? ఈ స్వల్ప ఇంద్రియ సుఖములు ఎంతటివి? ఈనా స్వల్ప జీవితమునందు

ఏవేవో పొందాలని ఆశలు కలిగి వుండడం ఎంతటి మూర్ఖత్వం! ఎంతటి నీచమైన స్థితి! ఎంతటి అల్పాశ్రయం!

దేహాత్మ బుద్ధి - ఈ ప్రపంచమంతా 'సంసారము' అనే రాత్రి యందు పొందబడుచున్న ఒకానొక దుష్టస్వప్నం వంటిది మాత్రమే. 'ఈ నా దేహం, తదితర దేహంలు, పదార్థజాలం' మొదలైన వాటి యందు ఇంతకాలంగా ఎంతో నమ్మికతో వ్యవహరిస్తున్న నాకు ధిక్కారమగు గాక! పుత్రులు, పేరు ప్రతిష్ఠలు మొదలైన కల్పనలన్నీ కూడా వ్యర్థములు, అసత్య స్వరూపాలు కూడా! ఈ 'అహంకారం' అనే పేరు గల పిశాచంతో కూడి ఉండాలని నాకు చెప్పినదెవరు? ఇట్లా అజ్ఞాని వలె నేను ఎందుకు ఉంటున్నాను? ఒకవైపు క్షణములు, నిమిషాలు, రోజులు, సంవత్సరాల రూపమున ఉన్న సూక్ష్మ కాలం చేత ఆయువు క్షణక్షణం విచ్ఛిన్నమైపోతోందే. మరొకవైపు ఏవేవో ఆశలు, ఆర్తులు, అసంతృప్తులు ఇంతకింతకు ప్రవృద్ధమగుచూ ఎదురుగా ఉన్న సమయమంతా ఆక్రమించి వేస్తున్నాయే!.

ఇదంతా చూస్తూ కూడా నేను ఎందుచేత విచారణ చేయుటలేదు?

ఓ ఆశా సమూహములారా! మీరంతా నా ముందు ఎందుకు విజృంభిస్తున్నారో చెప్పండి? కాలం యొక్క గతి ఎట్లున్నదో గమనిస్తున్నారా? ఏమి కాలమహిమ! బ్రహ్మ మొదలైన దిక్పాలకులే వారి వారి ఆసనములలో ప్రతిమలుగా కాలం చేత శాసించబడి ఆటాడింపబడుచున్నారే? మరి ఏమి ఆశించి ఏం లాభం? కాలం యొక్క క్రీడా వ్యసనము కారణముగా క్షీరసాగరంలో ప్రశాంతంగా నిదురించే విష్ణుదేవుడంతటి వాడు కూడా ఆకాశాన రాక్షసులతో యుద్ధంలో పాల్గొనవలసివస్తోంది.

ఈ కాలము మహా రుద్రులను ఎందరినో భక్షించివేసింది. ఓ నా ఆశలారా! అట్టి కాలము నందు మీరు, నేను ఒక లెక్కా? మరి ఇదంతా గమనించకుండా మీ ఇష్టం వచ్చినట్లు పెత్తనం చెలాయిస్తున్నారేం?

అనురక్తి, విరక్తి - తెల్లవారుతోంది, ప్రొద్దుగ్రుంకుతోంది. ...రోజులు గడిచిపోతున్నాయి. కాని, దోషరహితం, ఆనంద స్వరూపం అయిన వస్తువు లభించిన రోజు ఒక్కటైనా ఉన్నదా? లేదు. చెరువు ఒడ్డున కాకులు, కొంగలు వచ్చి వ్రాలునట్లు ఈ ప్రాణుల యొక్క చిత్తము లందు భోగముల పట్ల 'ఆశ' స్ఫురిస్తోంది. వారు ఆ ఆశల వెంటనే పరుగులు తీస్తున్నారు. అంతేకాని ఆత్మ సాక్షాత్కారం కొరకు ప్రయత్నించుట లేదు... పొందుట లేదు. మరి ప్రయోజనమేమిటి? అనేక కష్ట సుఖములు వస్తున్నాయి.... పోతున్నాయి.

కష్టాత్కష్టతరంప్రాప్తో దుఃఖాద్దుఃఖతరంగతః ।
అద్యాపినవిరక్తోస్మి హాధిఙ్మామధమాశయమ్ ॥ (శ్లో 31, సర్గ 9)

అల్పమైన కష్టం నుండి అధికమైన కష్టం, చిన్న దుఃఖం నుండి పెద్ద దుఃఖం, ...ఇట్లా దుర్భర అనుభవాలన్నీ వచ్చి పడుతున్నప్పటికీ నాకు ఈ సంసారం పట్ల విరక్తి ఏర్పడటం లేదు. నేను ఎంతటి అధమ చిత్తుడను! ఏ రమణీయ పదార్థాలపై నేను దృఢమైన ప్రతిష్ఠ కలిగి ఉన్నానో – అవన్నీ నశించిపోయేవే కదా! ఈ ప్రపంచంలో 'చిరస్థాయి'గా వుండే వస్తువు ఏదైనా ఒక్కటన్నా ఉన్నదా?

ఈ సంఘటన–దుర్ఘటనలు, ఈ సంబంధ బాంధవ్యములు, ఈ సుఖదుఃఖములు, ఈ ప్రియ, అప్రియములు, ఈ శరీరపు ఆకర్షణ–వికర్షణలు ...ఇవన్నీ కూడా కొంతకాలం క్రితం లేవు. మరి కొంతకాలం తరువాత ఉండవు. మధ్యలో ఉన్నట్లు తోచుచున్నాయి. ఇవి సత్యము ఎలా అవుతాయి?

ఈ 'వయస్సు' అనబడేది మధ్య కాలంలో మాత్రమే రమణీయంగా ఉంటోంది. ఈ 'యాగం' మొదలైనవి తదనంతరంగా కొద్దికాలం మాత్రమే రమణీయంగా ఉంటున్నాయి. ఇంద్రియ అనుభవములు విచారణ చేయకపోవుటచేతనే ప్రియంగా ఉంటున్నాయి. ఏది ఏమైతేనేం? ఏవేవి రమణీయముగా ఉంటున్నాయో, అవన్నీ కూడా 'వినాశనము' అను ఒక అగమ్య ప్రదేశము వైపుకు ఎక్కుపెట్టబడి ఉన్నాయి. మరివన్నీ అపవిత్రము కాక ఇంకేమిటి?

మనుజుడు ఏయే పదార్థములయందు తనయొక్క విశ్వాసమును బంధించుకొని ఉంటున్నాడో, ఆయా పదార్థములన్నీ తరచూ దుఃఖమునే కలిగించడం మనం చూస్తూనేవున్నాం.

జీవులు ఎందరో ఈ ప్రపంచంలోకి వస్తున్నారు. ఇక్కడకు వచ్చి ఇక్కడ జడస్వభావమును ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ నాది, నీది అను లోభమును కలిగియుంటున్నారు. అట్టి లోభ స్వభావము యొక్క ఫలితమేమిటి? అధికమైన పాపపు క్రియలతో కూడినది, అధికమైన క్రూరత్వముతో కూడినది, అధికమైన దుఃఖములను జనింపజేసేది అయినట్టి భవిష్యత్ స్థితిని పొందటమే కదా!

మానవ జన్మ ప్రాప్తించింది ఇందుకా? అయ్యో! బాల్యమంతా అజ్ఞానముతో గడిచిపోతోంది. యౌవనమందామా... మన్మథుడు అను వానిచే పచ్చిగా మోసగించబడుతోంది. వార్ధక్యం కుటుంబ చింతలు, ఒడలుచున్న భౌతికదేహములచే బాధింపబడుచున్నది.

ఇక ఈ జీవులు తమను తాము ఎప్పటికి ఎట్లు ఉద్ధరించుకోగలరో? చర్విత చరణంగా జన్మలు వస్తున్నాయి, పోతున్నాయి. ఈ జీవుడు తన యొక్క శాశ్వతత్వమును మాత్రం గమనించ లేకపోతున్నాడు.

నిస్సార సంసారం -

ఆగమాపాయివిరసం దశావైషమ్యదూషితమ్ ।
అసారసారంసంసారం కింతత్పశ్యతిదుర్మతి ॥ (శ్లో 37, సర్గ 9)

ఈ సంసారం అపారమైనది. నిస్సారమైనది. అయినప్పటికీ ఎంతో సారవంతమైనదిగా ఎంచ బడుతోంది. ఇది ఆద్యంతములలో అసద్రూపమైనది(Unreal from the beginning to the end). భోగకాలములో విరసమైనదై ప్రాప్తిస్తోంది (Distasteful at the time of experiencing). దారిద్ర్యము, రోగము, వార్ధక్యము, భయము, ఉద్వేగము – మొదలైన వాటిచే పరమదూషితమైనది. అట్టి ఈ నిస్సార సంసారమును దుర్బుద్ధి చేతనే నేను ఆశ్రయిస్తున్నాను. అపరిపక్వమైన అవగాహన చేతనే ఇందు ఏదో పొందవలెనని దేవులాడుచున్నాను.

ఒకడు రాజసూయము, అశ్వమేధము మొదలైన అనేక యాగములను ఎంతో ప్రయాసతో నిర్వర్తించి, చివరకు బ్రహ్మ దేవత్వం పొందుతాడు. కాని మహాకాలము యొక్క సమక్షములో ఆ

బ్రహ్మదేవత్వము కూడా క్షణికమే కదా! ఎక్కడ ఏ గొప్ప విశేషమున్నది? ఆపదలచే పీడించబడని ప్రదేశమంటూ ఈ ముల్లోకములలో ఎక్కడ ఉన్నది? "అనేక సుఖములకు ఆలవాలము, అనేక పుణ్య కార్యముల యొక్క అంతిమ ప్రయోజనము" అని చెప్పబడే స్వర్గలోకమే అసురులు చేసే దండయాత్రలచే బాధింపబడుచున్నదే! ఇక భూ, పాతాళాల గురించి వేరే చెప్పేదేముంది?

బాహ్యమే ఈ విధంగా ఉన్నది. ఇక అంతఃకరణం అగు 'చిత్తం' గురించి ఏం చెప్పాలి? ఈ చిత్తము నిండా అనేక శారీరక మానసిక వ్యాధులు, వ్యథలు నిక్షిప్తమై ఉన్నాయి. చెదలు కొయ్యను బాధిస్తున్నట్లు ఎన్నో దురవగాహనలు చిత్తములో తాండవం చేస్తున్నాయి. ఇవన్నీ విచారించబడేది ఎట్లా? ఎప్పటికి?

ఏదో ఆర్తి...! - ఈ ఎదురుగా ఉన్న వర్తమాన జగత్తు విషయానికి వస్తే దీనినెత్తిపై 'నాశనము' అనునది అవశ్యం నెలకొనియున్నది. రమణీయమని అనుకొనబడే వస్తువులన్నిటిలో అరమణీయతే దాగి ఉంటోంది కదా! "ఇవి సుఖప్రదములు" అని అనుకొనబడేవాటియందు అనేక దుఃఖపరంపరలు వ్యవస్థితములై ఉంటున్నాయి.

మరి నేను దేనిని చూచి 'ఇది నిర్దుఃఖము' అని నిర్ణయించి ఆశ్రయించాలో అర్థమవటం లేదు. ఈ జగత్తు, ఇందలి పదార్థాలు చివరికొచ్చే సరికి దుఃఖములే ప్రయోజనంగా కలిగి ఉండగా, మరి నా మనస్సునందు "ఇది పొందాలి..... అది పొందాలి" అనే ఆరాటం ఎందుకు?

ఎప్పటికప్పుడు దేనికి దానికే క్షణికం -

జాయన్తేచమ్రియన్తేచ ప్రాకృతాఃక్షుద్రజంతవః ।
ధరాతైరేవనీరన్ధ్రా దుర్లభాఃసాధుసాధవః ॥ (శ్లో 42, సర్గ)

ప్రాకృతస్వభావులగు క్షుద్రజీవులు అనేకులు జన్మిస్తున్నారు. చచ్చుచున్నారు. ఇట్టి అనేక జీవులచే ఈ జగత్తు పరిపూర్ణమైయున్నది. కాని, ఉత్తములగు మహాత్ములు అతి దుర్లభంగా ఎక్కడోగాని తారసపడుట లేదు. ఈ విలాసినుల అందమైన కళ్ళు వీరి ప్రేమాధిక్యత మొదలైనవన్నీ క్షణభంగురమే కాబట్టి, వీరిని ఆశ్రయించినవారు నవ్వులపాలు అగుచున్నారు. ఎవరికైతే 'కన్ను తెరిస్తే సృష్టి – కన్ను మూస్తే ప్రళయము' అయి ఉన్నదో, అట్టి జగత్పాలకులే కాలముచే మ్రింగబడుచున్నారు.

ఇక ఈ వర్తమానం, ఇందు ఏర్పడియున్న స్థితిగతులు క్షణికంగాక మరింకేమిటి?

సంపదలకంటే ఆపదలే నయమే! - ఈ ప్రపంచంలో 'దీర్ఘకాలంగా ఉండేవి, రమణీయములైనవి' అయిన కొన్ని పదార్థములు ఉన్నాయనే అందాం! ...కాని, వాటన్నిటియొక్క పర్యవసానమేమిటి? వాటిని ఆర్జించటం, రక్షించుకోవటం, వినియోగించటం – ఇవన్నీ శ్రమతో కూడుకున్నవే కదా! ఓ నా చిత్తమా! అట్టివాటిని ఆశించటంలో ఏం ప్రయోజనం పొందగోరుచున్నావు చెప్పు? ఈ విచిత్రమైన సంపదలన్నీ 'నశించుట' అను స్వభావం తప్పక కలిగియే ఉన్నాయి. కనుక అవి నా దృష్టిలో గొప్ప ఆపదలే అగుచున్నాయి. ఏది ప్రియమో, అది కోల్పోవుచున్నప్పుడు బాధగానే ఉంటుంది కదా! 'కోల్పోవుట' అనేది ఏనాటికైనా తప్పేది కాదు మరి!

అందుచేత, ఓ సంపదలారా! మీకన్నా ఆపదలే నయం. ఎందుకంటారా? "దారిద్ర్యము, బంధు వినాశనము" మొదలైన ఆపదలు "సాధువులను దర్శించుట, తీర్థ యాత్రలను సేవించుట, వ్రతాలు, పూజలు ఆచరించుట" మొదలైన వాటియందు నన్ను నియోగిస్తున్నాయి. ఆ ప్రయత్నాలు వివేక, వైరాగ్యాల వైపుగా నన్ను నడిపిస్తున్నాయి. అందుచేత, నేను సంపదల కంటే ఆపదలే ఉత్తమ మైనవిగా అభిప్రాయబడుచున్నాను.

వ్యర్థ కల్పనలు - సముద్రజలంలో ప్రతిబింబించే చంద్రుడు నిజచంద్రుడు కాకపోయినప్పటికీ ఉపరితలపు నీటియొక్క కదలిక "చంద్రుని కదలిక" అని అనిపిస్తూ భ్రమింపజేస్తుంది కదా! ఈ 'జగత్తు' అనునది మనస్సు యొక్క వివర్తము మాత్రమే. పైగా, ఇది క్షణభంగురం. అట్టి ఈ జగత్తు లోనికి 'నేను' 'నాది' అనబడునవి ఎక్కడినుండో వచ్చిపడుచున్నాయి. అట్టి వ్యవహారసరళి అంతా నిరర్థకమే అయి ఉన్నది. 'భోగములు పొందవలెను' – అను ఆశతో కూడిన ఈ మనస్సు కాకతాళీయ న్యాయముచే జగత్ స్థితిని పొందుచున్నది. ముందుగా మనస్సు, ఫలితంగా ఈ జగత్తు. "ఇది కావాలి, ఇది తొలగాలి" – అను కల్పనలను వ్యర్థంగా చేస్తోంది. ఫలితంగా, ఈ 'జగత్తు' అనబడేదంతా నా చుట్టూ అలుముకోనారంభిస్తోంది.

ఈ సాంసారిక దశలన్నీ దేశ–కాల వస్తువులచే పరిమితము, సంకుచితము, నిరోధము పొంది ఉంటున్నాయి. ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక తాపములచే సంతప్తమై ఉంటున్నాయి. అగ్ని శిఖ వంటి ఈ సాంసారిక దశలందు ఒక దోమవలె నేను ఎందుకు అనురక్తుడనై ఉంటున్నానో.... ఎంత తరచినా కూడా అర్థమగుటలేదు.

ఇక్కడ ఆవేశపూరితమైన అనురక్తి కలిగిఉండటం ఎంతటి ప్రమాదం. ఇంతకన్నా అగ్ని యందు భస్మం అవటం మేలు. లేక, రౌరవాది నరకములలో దొర్లటం మంచిది. అంతే గాని, సుఖదుఃఖ రూపములగు ఈ సాంసారిక దశలను ఏవేవో కల్పనలు చేసుకుంటూ ప్రవర్తించటం మాత్రం ఉచితం కాదు. ఈ సంసారమే సర్వ దుఃఖములకు మూలస్థానం. దీని యందు పడిన జీవులకు ఇక సుఖమెక్కడిది? అల్పమైన దుఃఖమును అధికమైన దుఃఖ సంఘటనతో పోల్చుకొనుచూ, 'ఇది సుఖరూపము' అను భావన మాత్రమే ఇక్కడ సుఖముగా చెప్పబడుచున్నది. "ముందు ముందు దుఃఖముగా పరిణమించగలదు" అని తెలిసి కూడా ఈ జీవుడు కొన్నిటిని సుఖప్రదములుగా గాంచుచున్నాడు. ఇంకేమని చెప్పాలి?

మనస్సును రహితం చేసేది ఎట్లా - ఆహా! నేను కూడా అధముడనై, కట్టె, రాయి వలె మూగ వాడినై, అజ్ఞానినై ఇంతకాలం విచారణాహీనుడుగానే ఉండిపోయానే? ఈ విశాల సంసార వృక్షానికి మూలం మనస్సే కదా! 'సంసారము' అనబడే వ్యవహారం అసంఖ్యాకములగు సంకల్పములతో బ్రహ్మాండములతో, విరాట్ పురుషులతో, సుఖదుఃఖ ఫలములతో, రాగ, లోభాలతో కూడియున్నది.

ఇంతటి వ్యవహారములు రుచిచూస్తూవున్న చిత్రకారుడు ఎవరు? మనస్సే కదా!

ఈ మనస్సు యొక్క రూపమేమిటి? - మననముచేయు స్వభావమే మనస్సు. మననమే సంకల్పము కూడా! అట్టి సంకల్పము ఉపశమించిందా.... సంసారమే ఉపశమించగలదు. 'సంకల్పించ కుండుట' అనునది అభ్యసించామా ...అప్పుడు ఈ సంసార వృక్షము నీరు లేని చెట్టు లాగే శోషించిపోతోంది.

'అవిచారణ' అను అశ్రద్ధచే ఏర్పడిన "ఆశించుట, ప్రియముగా భావించుట, లాభము, అసూయ, ఇంద్రియ విషయ లోలత్వము" మొదలైనవి ఈ సంసార వృక్షమును మరల చిగురింప చేస్తున్నాయి. "వివేకముతో కూడిన అవగాహన, అమనస్కముతో కూడిన అభ్యాసము" ఈ ఇద్దరూ అంగరక్షకులై, ఈ జీవుని 'సంసారము' అను ప్రమాదము నుండి కాపాడగలరు.

ఈ సంసార వృత్తులు పైకి మాత్రమే రమణీయంగా ఉంటున్నాయి. 'మనస్సు' అనే వానరం యొక్క ఉనికిచేతనే చపలత్వము పొందుచున్నాయి. ఇందలి పదార్థజాలమంతా నాశవంతమైనదే.

ఇట్టి సంసారవృత్తులలో నేనెందుకు పడి కొట్టుకోవాలి? అనేక ఆశాపాశములతో కూడి, ఉచ్చ, నీచ స్థితులతో కూడినదై మహా దుఃఖప్రదములైన ఈ సంసార వృత్తులలో నేను ఎంతకాలంగా, ఎంతగా రమించానో! ...అదంతా గతం మాత్రమే. "హా! చచ్చాను! చంపుతున్నాయి! ఇక గతేమిటి! నేను పాపిని! దుఃఖితుడను! బలహీనుడను!" – అనుకొనే రోజులు గతించిపోయాయి.

గతం గతః! ఇప్పుడు నేను 'పరితాపము' అను స్వభావమును తొలగించుకొంటున్నాను. ఇక విశ్రాంతి పొందెదను గాక! ఇప్పుడిక ఎటువంటి సాంసారిక వస్తువుల గురించిగాని, వ్యక్తుల గురించి గాని, సంబంధముల గురించి గాని, సంఘటనల గురించిగాని నేను దుఃఖించవలసిన పనియే లేదు.

నేను ఎందుకు దేని గురించి వేసట చెందాలి? చాలు... నేను ఇప్పుడు ప్రబుద్ధుడనైనాను, ప్రసన్నుడనైనాను. నా 'పారమార్థిక ధనము'ను దొంగిలించుచున్న దొంగను కనిపెట్టాను. ఆ దొంగ ఎవ్వరో కాదు... నా మనస్సే! అతను దొంగయే కాదు, ప్రమాదకరమైన శత్రువు కూడా. అతనిచేత నేను చాలా కాలంగా మోసగించబడుచున్నాను. పీడించబడుచున్నాను.

సరే... ఇక నేనే ఆ మనస్సును పీడించటం ప్రారంభిస్తాను. ఇంతకాలం ఈ మనస్సును పరిశీలించ లేదు, సరియైన చికిత్సను ఆశ్రయించ లేదు. ఇప్పుడు "ఉత్తమ కార్యాచరణము, శాస్త్రోక్తమైన అభ్యాసము, గురువులు చూపు లక్ష్యమువైపు దృష్టి సారించటం" మొదలగు శుభ ప్రయత్నములు ఈ మనస్సును ఉద్ధరించవలసిందే!

ఈ మనస్సు వివేక ప్రభావముచే 'అనాది' యగు 'బ్రహ్మతత్వము'నందు ప్రతిష్ఠింపబడుగాక! అట్టి బ్రహ్మజ్ఞానానుభవమునందు ఇది ప్రశమనము పొందుగాక.

వివేకోదయం - ఆ సిద్ధుల వాక్యములు వినుచుండగా నాయందు 'అజ్ఞానము'ను పరిశీలించ గల సత్యదృష్టి బలపడుచున్నది. వారి ఉపదేశములు నన్ను మహా బలవంతునిగా తీర్చిదిద్దుచున్నాయి.

ఇక నేను "నిరతి శయానందమునకు సాధనము" అని చెప్పబడుచున్న 'పరబ్రహ్మము'ను శరణు వేడుటకు ఉపక్రమిస్తున్నాను.

ఇప్పటి నుండి ఆత్మస్థితుడనై వుంటాను. తదితర వ్యసనములన్నీ త్యజించి వేస్తాను. ఏకాంతముగా, సుఖముగా ఉంటాను. "ఈ దేహమే నేను, ఈ రాజ్యాదులు నావి" మొదలైన అసత్య స్ఫురణలను పారద్రోలివేస్తాను. ఇక్కడి సుఖము నాది కాదు. దుఃఖము నాదికాదు. ఈ రెండింటినీ చూపిస్తూ భ్రమింపజేసే మనస్సు కూడా నాదికాదు. ఈ విధంగా ఈ 'మనస్సు' అనే శత్రువును వధించి వివేకము ద్వారా సప్తమ భూమికారూపమైనట్టి 'పరమ శాంత స్థితి'ని పొందుతాను.

అట్టి త్రోవను చూపించగల ఓ వివేకమా! నీకు నమస్కారం! రమ్ము. మనం ఈ జన్మకర్మల మనోజాడ్యమును తొలగించివేద్దాం. నీవు నాకు సేనానాయకుడివై తోడుగా ఉంటేనే నేనీ సంసార జాడ్యముపై యుద్ధం ప్రకటించి, జయించగలుగుతాను.

❖❖❖

3. సునిశ్చయం

ఆ విధంగా జనక మహారాజు కోటలో ఒక ఏకాంత ప్రదేశంలో చింతన చేస్తూ ఉన్నాడు. ఇంతలో ఆంతరంగికుడైన ఒక ద్వారపాలకుడు రాజును సమీపించి ఇలా విన్నవించసాగాడు–

ఆంతరంగికుడు : హే మహారాజా! తమకు సదా సర్వదా దిగ్విజయమగు గాక! ఇప్పటికే కాలాతీత మైనది. అదిగో బ్రాహ్మీముహూర్తం ప్రారంభం కానున్నది. నేటి ఉదయానికి మీ కొరకై ఎన్నో ముఖ్య రాచకార్యములు వేచి ఉన్నాయి. లేచి, మంగళస్నానం కొరకు సిద్ధంకండి. వేదపారాయణులగు బ్రాహ్మణులు కొద్దిసేపటి క్రితమే వచ్చి 'అఘమర్షణం' జపిస్తున్నారు. వారంతా తమ వేదోచ్ఛరణలతోను, వేదార్థ ప్రసంగములతోను మిమ్ములను మెప్పించి, మీ వద్ద దక్షిణతాంబూలములు స్వీకరించ వేడుక కలిగియున్నారు. మీ సంధ్యావందనాది కార్యక్రమముల కొరకు అంతా సిద్ధం చేయబడి ఉంది. మీ వంటి మహనీయులు తమ కార్యక్రమముల విషయంలో నియమమును అతిక్రమించి వర్తించరు కదా! నా ఈ అధికప్రసంగమునకు క్షమార్హుడను. తమ ఆజ్ఞావాక్యములకై వేచియున్నాను.

ద్వారపాలకుడు చెప్పుచున్న విషయములను గంభీరంగా వింటూనే, ప్రశాంత, మౌన చిత్తుడగు ఆ మహారాజు విచిత్ర జగత్‌స్థితి గురించి ఇట్లు పర్యాలోచించసాగాడు.....!

జనకమహారాజు (తన అంతరంగమున) : "ఈ రాజ్యమేమిటి? ఈ సుఖమేమిటి? క్షణభంగురమైన రాజ్యసుఖములతో నాకిప్పుడు కొంచెమైనా ప్రయోజనం లేదుకదా! 'మృగతృష్ణ' అంటే ఏమిటో తెలిసిన తరువాత అట్టి మృగతృష్ణలో నీరు త్రాగి దాహం తీర్చుకోవటానికి మూర్ఖుడు మాత్రమే పరుగులు తీస్తాడు. కనుక నేను 'మిథ్య' యగు ఈ సంసారమంతా పరిత్యజించివేస్తాను. 'శాంత సముద్రం'లాగా ఏకాంతమును ఆశ్రయించి ఉంటాను. అసద్రూపములైన ఈ భోగములతో నా కేమిటి పని?

సర్వ కర్మలను త్యజించి కేవలం బ్రహ్మమును శరణువేడి సుఖశాంతి సమన్వితుడనౌతాను. ఓ చిత్తమా! కొంచెం నా మాట విను. ఈ "జన్మ, జరా, మరణ, జడత్వ" రూపమగు సాంసారిక అల్ప అనుభవము అనే బంధం మనం తొలగించుకోవాలి సుమా! మనకు సంబంధించినది అసంబంధితమైన దాని నుండి వేరు చేసి అవగాహనతో దర్శించాలి. ఉపశమనం కొరకు ప్రయత్నిద్దాం. విషయ సుఖ లేశములను ఆస్వాదించుటలో అత్యంత చాతుర్యంగల నీ అభ్యాసమును త్యజించు. భ్రాంతి చేత మాత్రమే నీవు ఈ ప్రాపంచిక స్థితులందు సుఖమును అవలోకిస్తున్నావు. కాని, అవన్నీ అత్యంత స్వల్ప సుఖములు మాత్రమే. వాటి వలన ఏర్పడే దుఃఖము మాత్రం అపారం.

ఓ ప్రియాచిత్తమా! శక్తియుక్తులు ఉన్న కాలమంతా భోగాశక్తియందు నిమగ్నమగుచున్నావు. భోగించు శక్తి క్షీణించినప్పుడు అశక్తురాలవై అల్పత్వమును అనుభవించుచున్నావు. నిజం చెప్పు... ఇంతవరకూ నీకు నిజమైన తృప్తి అంటూ ఎప్పుడైనా లభించిందా? ప్రయోజనము లేని శ్రమ ఎందుకో చెప్పు?

బ్రహ్మమును విచారించుటచేతమాత్రమే అకృత్రిమమగు తృప్తి లభిస్తోంది. అందుచేత నీవు సద్వస్తువు వైపు మరలుటయే ఉచితం."

ఆ మహారాజు ఇట్లు విచారణ చేస్తూ ఉండగా ఆతని చపలచిత్తము శమించింది. ఆయన ఒక చిత్రములోని పురుషుని వలె మౌనస్థుడయ్యారు. ఆంతరంగిక ద్వారపాలకుడు రాజు యొక్క స్వభావౌన్నత్యమేమిటో కొంతవరకు ఎరిగినవాడే. అందుచేత భయ, గౌరవాదులతో ఏమీ మాట్లాడ కుండా, నిలుచునియున్నాడు. ఆ తరువాత జనకమహారాజు ఒక్క క్షణంలో సర్వమును తూష్ణీభావంతో త్యజించినవాడయ్యారు. శాంతచిత్తుడై ప్రాణికోట్ల జీవన విధానమును తలచుకొంటూ ఇట్లు మరల చింతనచేయసాగాడు.

నేను ఆత్మను కాని దెప్పుడు? - ఈ ప్రపంచంలో గ్రహించదగ్గ వస్తువేది? దేనిని నేను ప్రయత్నించి సాధించాలి? ఇక్కడ 'నాశరహితము, ఉత్తమము, ఆనందకరము, దోషరహితము' అయిన ఏదైనా పదార్థము ఉంటేకదా, అందుకు విశ్వాసముతో ప్రయత్నించగలిగేది? అట్టి పదార్థము లేనప్పుడు నేను ఈ ఎదురుగా కనబడే వస్తువులచే ఎందుకు బంధించబడాలి? ఆకర్షించబడాలి? వికర్షించ బడాలి?

ఆయా క్రియాదులందు తత్పరుడనై ఉండుటచేతగాని, లేక నిష్క్రియత్వముచే గాని నాకు ఏం ప్రయోజనం? ఎందుకంటే ఉత్పన్నమైన ప్రతి వస్తువు నశించిపోవుచున్నది. ఈ శరీరమే తీసుకుందాం. ఇది అసద్రూపంగానే ఆవిర్భవించింది. ఇక ఇది ఉండుట చేత గాని, లేక, లేకుండకపోవుట చేత గాని నేను పొందే మార్పు – చేర్పులు ఏమి ఉంటాయి?

నేను క్రియలందు ఆసక్తుడనై ఉండవచ్చు, లేదా క్రియారహితుడనై ఉండవచ్చు. అట్టి ఉభయ అవస్థలలోకూడా సమరూపముగా స్థితి పొందియున్నట్టి పరిశుద్ధ చైతన్య స్వరూపుడనే నేను. ఈ వర్తమాన క్షణంలో కనబడుచున్న శరీరము వంటి అనేక శరీరములు రావచ్చుగాక! పోవచ్చుగాక!

అవేవీ కూడా నేను కాదు. నాకు సంబంధించినవి కూడా కాదు. నేను వాటికి సంబంధించినవాడను కూడా కాదు. వాటికి అతీతమై, కాని, వాటి ఉనికికి కారణమగుచున్న శాశ్వతతత్త్వము, అనిర్దేశము, అప్రమేయమునై ఉన్నాను. ఎందుకంటే చైతన్యం చైతన్యంగానే ఉంటుందికాని అది 'జడం' అవుతుందా? లేదు. 'శుద్ధ చైతన్యమే' అయి ఉన్న నాకు ఈ శరీరాదులచే కలిగే హాని ఏమి? వృద్ధి ఏమి?

నాభివాంఛామ్యసంప్రాప్తం సంప్రాప్తంనత్యజామ్యహమ్ ।
స్వస్థఆత్మనితిష్ఠామి యన్మమాస్తితదస్తుమే ॥ (శ్లో 24, సర్గ 10)

కాబట్టి నేను ప్రాప్తించని దానిగురించి కోరవలసిన పనిలేదు. ప్రాప్తించిన దానిని వదలవలసిన పనికూడా లేదు. అందుకని, సర్వదా స్వస్థరూపమున ఆత్మయందే నెలకొని ఉంటాను.

❖

అసలు ఆత్మ నన్ను విడచి వెళ్ళినది ఎప్పుడు? అది సర్వదా నాయందే నిరతిశయానంద రూపంలో సాక్షిస్వభావంతో, నా కన్నా వేరు కానట్టిదై వేంచేసియే ఉన్న –అదే నేను. నేను అఖండం, అప్రమేయం, అద్వితీయం, నిత్యోదితం, నిత్యనిర్మలం, జగదతీతం, జగదాత్మకం అగు ఆత్మస్వరూపుడనే!

ఏ ఆత్మ స్వరూపము నాదై ఉన్నదో, అది నేను సర్వదశలందు సర్వదా కలిగియే ఉన్నాను. ఇక భ్రమ ఎందుకు? క్రొత్తగా పొందవలసినది ఏమి ఉంటుంది?

నా యొక్క అజ్ఞానకాలంలో కూడా నేను అఖండం, శుద్ధం, నిత్యం, నిర్మలం, సర్వం అయిన ఆత్మనే అయి ఉన్నాను. 'ఆత్మ' అనబడునది నా కంటే వేరుగా లేనేలేదు. నేను దానికి వేరుగా లేను.

కార్యాకార్యములు -

నమమేహకృతేనార్థో నాకృతేనేహకశ్చన ।
క్రియయాఽక్రియయావాపి యత్ప్రాప్తంతదసన్మయమ్ ॥ (శ్లో 25, సర్గ 10)

ఆయా కార్యాలు చేయుట చేత గాని, లేక చేయకుండుట చేత గాని నాకిక ఎట్టి ప్రయోజనమూ లేనేలేదు. క్రియాక్రియలచే ప్రాప్తించినదంతా 'మిథ్యా రూపములే' అయి ఉన్నాయి. "నేను అది పొందలేకపోయానే? ఎలా పొందాలి?"...అనే ఉద్వేగం గాని, చంచలం గాని నే నెందుకు, ఎవరి నిర్ణయం ప్రకారం పొందాలి? శాస్త్రములచే చెప్పబడినవి, లౌకికంగా నిర్ణయించ బడుచున్నవి అనేక కార్యక్రమములు నా సమ్ముఖమునకు వచ్చుచున్నాయి. మంచిదే. వాస్తవానికి వాటి నుండి నేను కర్తగా పొందవలసినది గాని, పొందదగినవి గాని లేవు. అయినప్పటికీ క్రమానుసారం ప్రాప్తించే ఆయా క్రియలు నా ఈ చేతులు, కాళ్ళచే నిర్వర్తించబడు గాక! ఎందుకంటే చేష్టారహితుడనైతే ఈ శరీరం శుష్కిస్తుంది కదా! దీనిని నేనుగా ఎందుకు శుష్కింపజేయాలి?

ఆసక్తిరాహిత్యం - ఆసక్తి రహితుడనై సమరూపమున నెలకొని ఉంటాను. ఇకప్పుడు అట్టి సమరసభావనను భావించు భావనారాయణుడగుచుండగా... ఈ దేహము యొక్క ఉత్పన్నమునకు కారణమగుచున్న క్రియ, అక్రియలు, ఆ క్రియాక్రియల ఫలితములగు పుణ్య పాపములు, పుణ్య పాపములకు స్థానభూతమైన ప్రారబ్ధములు... ఇవన్నీ 'లేనివే' అవుతాయి. సర్వప్రయోజనములు

నన్ను తాకకుండా నాకు వేరై ఉంటాయి. నేను ఆయా స్థితులందు జ్ఞాన మహిమచే నిర్లిప్తుడనై ఉంటాను. అదియే నా నిర్వికల్పసమాధి!

చైతన్యమే అయినట్టి నాకు 'సశరీరము, అశరీరము' అనబడు వ్యక్తావ్యక్తములచే ప్రయోజనము గాని, హాని గాని ఏముంటుంది? నేను ఆసక్తిరహితుడనవటమే నా సర్వ ప్రయత్నముల ప్రయోజనం. ఆపై ఏది ఎట్లా ఉంటే ఏం? ఏది ఎట్లా ఉండకపోతే ఏం?

"కర్మ" అనుదాని యందు రెండు తత్త్వాలు ఇమిడి ఉన్నాయి–

1. కర్తృత్వము (I am the doer); 2. భోక్తృత్వము (I am the enjoyer of fruits of action).

ఈ రెండూకూడా మనస్సుచే కల్పించబడినవి మాత్రమే. ఈ రెండు ఉపశమించటం జరిగిందా, ఇక సర్వకార్యములు కూడా "నాచే చేయబడనివే" అవుతాయి. ఈ కర్తృత్వము, భోక్తృత్వము విషయములలో మనుజుడు తన అంతఃకరణంలో ఎటువంటి నిశ్చయం రూఢిగా కలిగి ఉంటాడో ఆతడు ఈ దేహము, భావము మొదలైనవన్నీ ఆ తీరుగానే పొందుతూ ఉంటాడు.

ఆత్మ నిశ్చయము - నేను ఈ శరీరముతో పుట్టలేదు. దీనితో నశించువాడను కాను. నేను దేనికీ కర్తను కాను. భోక్తను కాను. ఎందుకంటే ఇవన్నీ స్వతఃసిద్ధమగు నిర్ణయము కలిగిలేవు. కనుక జడమై ఉన్నాయి.

నేను 'జ్ఞానము' యొక్క ముందు, వెనుకల కూడా ఉన్నట్టి జ్ఞేయమే స్వరూపముగా కలవాడను. శుద్ధ చైతన్యమే అయి ఉన్న నాకు కర్తృత్వము లేదు. భోక్తృత్వము కూడా లేదు. ఈ కర్తృత్వ, భోక్తృత్వములు దృశ్యమునకు సంబంధించినవి మాత్రమే. ఇక నేనో... అనుభవమే స్వరూపముగా గల జ్ఞాన (knower) తత్త్వమును.

❖

అమ్మయ్య! ఇప్పుడు నా బుద్ధి "కర్తృత్వము, భోక్తృత్వము" అనే జాడ్యమును దూరీకరించినదై శుభ్రము చేయబడిన దర్పణము వలె ప్రకాశిస్తోంది. ఒక గొప్ప వ్యాధి నుండి నివారణ పొందినదై 'ఆత్మ పదము' అనబడు దానియందు దృఢనిశ్చయము సంతరించుకుంటోంది.

ఇప్పటివరకు నాకు ఏర్పడి ఉండిన ఇష్ట అనిష్టముల ప్రాప్తికి కారణం ఎవరు? మరెవ్వరూ కాదు... నా అవిచారణయే! నా అధీరత్వమే! నా అల్పమైన ఎరుకయే! అట్టి అధీరత్వమును నేను ఈ క్షణమే త్యజించివేస్తున్నాను.

❖❖❖

4. చిత్తమును శాసించటం

ఆ జనకమహారాజు తన అంతరంగంలో ఈ విధమైన చింతన చేస్తూ మౌనం వహించి ఉన్నాడు. "ఆ సూర్య భగవానుడు కాంతిని ప్రసాదించుట, (కిరణజన్య సంయోగముచే) వృక్షములు, పశువులు, మనుష్యులు మొదలైన వాటిని జీవింపజేయుట, తటాక జలమును ఎండింప జేయుట

– మొదలైన క్రియలను మౌనముగా నిర్లిప్తముగా, అసంగముగా నిర్వర్తిస్తున్నాడు కదా! నేను కూడా ఆయా ప్రాప్తించిన క్రియలను నిర్వర్తించెదను గాక" అను స్వకీయమైన సునిశ్చయమును పొందాడు. గాంభీర్యము, ప్రశాంతత, ఆనందము ఆయన ముఖము నందు తొనికిసలాడాయి. అప్పుడు ప్రక్కనే నిలచియున్న ద్వారపాలకుని వైపు దృష్టి సారించారు.

జనకుడు : ఓయీ! ద్వారపాలకా! నీ "విద్యుక్త ధర్మ నిర్వహణ" నాకు సంతోషం కలుగజేస్తోంది. నేడు నిర్ణీతమైన రాజకార్యములకు అంతా సిద్ధం చేయించండి. దేవ, బ్రాహ్మణులు యథారీతిగా పూజించెదము గాక!

ఆ రోజు పగలంతా సభాకార్యక్రమములు, న్యాయనిర్ణయ కార్యక్రమములు, విద్యావినోదములు యథారీతిగా జరిగాయి. ఆ రాత్రి చాలాసేపు రాజు ఏకాంతంలో ధ్యానమగ్నుడై గడిపాడు. కాని, చిత్తము పరిపరివిధాలుగా పోతూనే ఉండటం గమనించాడు. "అరె! ఈ మనస్సు ఈ విధముగా అనేకత్వమును, దుష్టత్వమును, విషాదత్వమును, బలహీనత్వమును మాత్రమే ఆశ్రయిస్తోందేమిటి? ఇంత విన్నాను... ఇంత విచారణ చేశాను... కాని ఏం లాభం?" అని ఆశ్చర్యపోయాడు.

❖

జనక మహారాజు : ఓ 'చిత్తము' అను పేరుగల మిత్రమా! నీతో ఈ సమయంలో కొన్ని విషయాలు ముచ్చటించాలని ఉన్నది. ఇటు వచ్చి నాకు ఎదురుగా కూర్చో...!

ఓ ప్రియ చిత్తమా! ఈ చపల సంసారము ఆత్మకు నిజమైన సుఖము ప్రసాదించగలుగుచున్నదా చెప్పు? కనుక నీవు శాంతమును పొందుము. శాంతముచే మాత్రమే ఉత్తమ ఆత్మసుఖము లభించగలదు.

చిత్తము : ఔనూ... ఈ సంసారము అనబడేది ఎక్కడి నుండి వచ్చిపడింది?

జనకుడు : చెపుతాను, విను! నీవు ఏ విధంగా సంకల్పములు చేస్తూన్నావో, ఆ విధంగానే... ఆయా రూపముననే ఈ సంసారము విశాలత్వము చెందుతోంది. ఒకడు ఒక విత్తును తెచ్చి, దానిని మహావృక్షముగా పెంచి పోషించిన తరువాత "అయ్యో! ఈ విశాల శాఖలుగల మహావృక్షము ఎక్కడి నుండి దాపురించింది? దీని వలన ఇంటిగోడలు పగులుచున్నాయి; పురుగులు, ముళ్ళు, చెత్తచెదను ఆవరిస్తున్నాయి" అని వగచునట్లు నీవు కూడా ఈ సంసారము గురించి వగచుచున్నావు.

చిత్తము : నేను పొందుచున్న ఈ వ్యధలకు కారణమేమిటి?

జనకుడు : ఓ దుష్టచిత్తమా! నీయందు భోగముల పట్ల ఇచ్ఛ ఉన్నది. అదియే సకల దుస్థితులకు కారణమగుచున్నది. ఫలితంగా శారీరక మానసిక వ్యాధులు నిన్ను వదలి పెట్టకున్నాయి.

విషయ చింతన, విషయములు - ఈ ఇంద్రియములకు సంబంధించిన శబ్ద–స్పర్శ–రూప–రస–గంధానుభవములు చేతనే జనన మరణ రూపమగు ఈ సంసారమంతా ఆవిర్భవిస్తోంది. కనుక ఈ ఇంద్రియ విషయముల పట్ల, దృశ్యవస్తువుల తోటి సంబంధ బాంధవ్యముల పట్ల ఏర్పడు 'చింతన' లేక 'మననము'ను త్యజించు. అప్పుడు శాంతి లభించకపోతే నన్నడుగు.

ఇక్కడ కొంచెం పరిశీలనగా చూడటం జరిగితే, సారవంతమైనది, దీర్ఘ సుఖమును, లేదా, దుఃఖ మిళితం కాని సుఖమును ఇవ్వగలిగేది ఏమున్నది? మన వద్ద 'బుద్ధి' అను పేరుతో చెప్పబడే విశ్లేషణ శక్తి ఉన్నది. అట్టి బుద్ధితో పరిశీలించి ఏది శ్రేష్ఠమో దానినే స్వీకరించాలి గాని, ఏది అలవాటో దానిని మాత్రమే గ్రహించటం ఉచితం కాదు కదా! కనుక నీవు 'గ్రుడ్డి'గా ముందుకు అడుగులు వేయవద్దని నా మనవి.

ఓ సాధూ! ప్రియచిత్తమా! ఈ సంసారము అపారమైనది. ఒకదానికి ప్రయోజనంగా మరొకటి ప్రాప్తిస్తూనే ఉంటుంది. "ఇది పొందిన తరువాత నాకింక ఆశించవలసినది ఏదీ ఉండదు" అని జీవుడు అనుకుంటూనే, ఏవేవో ఆశిస్తూ ఉంటాడు. సరే... పొందుతాడు, లేక, పొందడు... ఏది ఏమైనా ఆశించటం మాత్రం ఆగదు. అది ఆతడు గమనించుట లేదు. ఆశించినంతకాలం దుఃఖం, శ్రమ, ఉద్వేగం తప్పవు.

కాబట్టి ఉపాయమేమిటి? 'ఆశ' అనుదానిని లేక, 'ఆశించుట' అను స్వభావమును త్యజించటయే ఉపాయం. ఈ దృశ్యమును ఆసక్తిచే గ్రహించనూ వద్దు... ద్వేషముచే త్యజించనూ వద్దు... 'ఆశించకపోవటం' అనుదానిని అభ్యసిస్తూనే ఆత్మకాముడవగుము. సాక్షి రూపమున స్థితి కలిగియుండుము. అటు తరువాత ఏది ఎట్లు ఉచితమో అట్లే ఆచరించుము.

ఏవీ కూడా నిన్ను స్వయముగా స్పృశించుటలేదు. నీవు ఆసక్తితో ఆశించినప్పుడు, ఆశ్రయించి నప్పుడు మాత్రమే అవి నిన్ను లోబరుచుకుంటున్నాయి. తత్ఫలితంగా సుఖదుఃఖములు నిన్ను ప్రభావితం చేస్తున్నాయి. కనుక ఓ చిత్తమా! నీ దోషములన్నీ నీయొక్క స్వయంకృతములే!

❖

అయినా, ఈ దృశ్యము సత్యమైతే మనకెందుకు? లేక 'మిథ్య' అయితే ఏమున్నది? దీని యొక్క గుణ అగుణములచే మనం ఎందుకు హర్ష విషాదములు పొందాలి?

ప్రియమైన మనస్సు గారూ! ఈ దృశ్యముతో మనకేమీ సంబంధం లేదు. అది నీ యొక్క భావనను అనుసరించి మాత్రమే ఉంటోంది. "ఏదైతే స్వయముగా లేదో... అట్టి వస్తువుతో నీకు సంబంధం ఎట్లా పొసుగుతోంది?" అని ప్రశ్నిస్తే నాకొక సమాధానం లభిస్తోంది. ఈ మనస్సు కూడా లేని వస్తువే కదా! అసలు నీవే లేవు. మరొక లేని వస్తువగు దృశ్యముతో నీకు సంబంధం... ఆ సంబంధము యొక్క ప్రభావంచే నేను సుఖదుఃఖములు, మానావమానములు, ప్రియాప్రియములు పొందటమా? ఇదంతా ఎంతటి చమత్కారమైన విషయం!

"ఒక గొడ్రాలు ఉన్నది. ఆమె యొక్క రెండవ కుమారుడు ఆకాశంలోని ఒక చదునైన ప్రాంతంలో కొన్ని విత్తులు నాటాడు. అదొక పెద్ద పూదోటగా పరిణమించింది. ఆ పూదోటలో అనేక రకాల పూల తీగలు, మొక్కలు వేరువేరు వరుసలలో కనబడుచున్నాయి. అందులోని రెండవ వరుసలోని మూడవ మొక్కకు పూచే ఆ పెద్ద పువ్వు చూచారా! అది ఎంత అందంగా ఉన్నది?"

ఈ దృశ్య పదార్థములతో ఏర్పడు సంబంధము ఆ పూవుపట్ల ఏర్పడు ప్రియత్వము వంటిది. ఈ పదార్థములు అసద్రూపములే (అసద్రూపము = ఒక వస్తువు కొద్ది క్షణముల క్రితం ఒక

రూపంగాను మరికొన్ని క్షణముల తరువాత మరొక రూపంగాను ఉంటోందనుకోండి... అప్పుడు అది వర్తమానంలో 'అసద్రూపం' అని చెప్పబడుతోంది.) అయి ఉన్నాయి.

పోనీ ఓ మనసా! "నాఽన్యత్ కించిదస్తి" (ఆత్మతప్పితే మరింకేదీ లేదు) అను సిద్ధాంతము ప్రకారం నీవు స్వతఃగా ఆత్మవే కదా! 'జగత్తు' అనబడునది అసత్తే అయి ఉన్నది కదా! ఆత్మ యొక్క మననమే మనస్సు. కనుక స్వతఃగా చైతన్యమే అయి ఉన్న మనస్సుకు క్షణకాలికము, భావనామాత్రము, అసత్తు అగు ఈ జగత్తుతో సంబంధం ఉండటమేమిటి? ఎక్కడన్నా చచ్చిన వానికి బ్రతికియున్నవానికి 'స్పర్శ' మొదలైన సంబంధాలు పొసగుతాయా?

లేదా, "మననము" అను నా స్వభావము (మనస్సు), మననము చేయబడుటచే ఏర్పడియున్న దృశ్యము – ఈ రెండూ సత్తే అని అనుకుందాం. రెండూ స్థితికలిగియే ఉన్నప్పుడు 'సత్తా' దృష్ట్యా రెండిటిలోను సత్తా – అనబడు ఏకత్వము ఉన్నట్లే కదా! ద్రష్ట ఉన్న చోటే దృశ్యముంటుంది. భావకుడు ఉన్న చోటే భావన ఉంటుంది. కనుక ఉభయములు ఒకే తత్త్వం యొక్క రెండు వైపులు.

ఈ అభిప్రాయం మనం ఒప్పుకుంటే 'మనస్సు – దృశ్యము' సర్వదా కలిసియే ఉంటున్నాయి కదా! ఇక సంయోగ వియోగ భావములచే హర్ష విషాదములు ఎక్కడి నుండి వచ్చి పడుచున్నాయి?... కారణం, నీ దగ్గర ఆత్మ విషయమై తగినంత సమాచారం లేకపోవటమే సుమా! మరి సమాచారం కొరకు ప్రయత్నించాలి కదా! అందుకేం చేయాలి? శాస్త్రములను, గురువులను సమీపించి సమాచారం సేకరించాలి. స్వయముగా విచారణ చేయాలి. అంతేగాని "నేను దుఃఖితుడను.... అల్పుడను" అని అనుకుంటూ కూర్చుంటే ఏమిటిలాభం?

కనుక ఓ మనస్సా! ఈ 'సంసారము' అనేది మానసిక వ్యాధి యొక్క రూపమే. ఇది కలుషితమైనది. క్షణక్షణం విక్షేపముతో కూడినట్టిది.

అట్టి ఈ సంసారమును దయచేసి త్యజించు. సమాధిని అభ్యసించు. శాంతరూపమగు ఆత్మ యందు నిలకడ పొందటానికే ఉత్సాహం కలిగియుండు. అంతేగాని స్వయంగా భ్రమను స్వీకరించటం, మోహము – మందత్వము కలిగియుండటం నీకు ఉచితమా? ఎందుకు? ఎంతకాలంగా ఈ పదార్థములను ఆశ్రయించుటచే ఏమి ప్రయోజనం చెప్పు?

నతదిహాస్తి సమున్నతముత్తమం వ్రజసియేనపరాం పరిపూర్ణతామ్
తదవలంబ్య బలాదతిధీరతాం జహిహిచంచలతాం శఠరేమనః. (శ్లో 18, సర్గ 12)

ఈ దృశ్యంలో పూర్ణత్వము లేదు. ఇందులో ఏమైనా అనుమానమున్నదా? అందుచేత అభ్యాస, వైరాగ్యములచే ధీరత్వము నవలంబించి చంచలత్వమును విడచివేయవలసినదిగా నిన్ను శాసిస్తున్నాను!

❖❖❖

5. భూత భవిష్యత్‌లను జయించడం - వర్తమానంలో ఏర్పడి ఉండడం

శ్రీ వసిష్ఠ మహర్షి : శ్రీరామచంద్రా ! ఆ జనకుడు ఆ విధముగా విచారణ చేస్తూనే యథాప్రాప్తంగా రాచకార్యములు నెరవేరుస్తూ ఉండేవాడు. ధీరత్వముతో కూడిన తన సునిశిత బుద్ధిని ఉపయోగిస్తూ "నేను" "నాది" అనబడు అహంకార మమకారములను అధిగమించాడు. ఆయనకు విషయముల పట్ల ఏమాత్రం ఉత్సుకత, ఉద్వేగములు ఏర్పడుట లేదు. ఈ ఎదురుగా ఉన్న దృశ్యములు అతడు త్యజించుట లేదు. గ్రహించుట కూడా లేదు. దేని పట్లా ప్రియత్వము గాని, ద్వేష బుద్ధిగాని ఏర్పడ కుండానే వర్తమాన కాలములో ప్రాప్తించుచున్నదానిని శోకరహితుడై నిర్వర్తిస్తూ ఉంటున్నాడు. అన్ని సమయముల యందు వివేకమును విడుచుట లేదు. అందుచేత 'సమ్యక్ జ్ఞానం' ఏ మాత్రం కళంకితం అగుటలేదు. మేఘాలు లేనట్టి నిర్మలమైన ఆకాశములో సూర్యుడు నిర్విరామంగా ప్రకాశి స్తున్నట్లు అతని హృదయములో నిష్కళంకమగు చిదాత్మత్వము సర్వదా ప్రకాశించసాగింది. "ఔను! నేను బ్రహ్మమయుడను. సర్వభూతజాలములందు సదృశ్యమైయున్న ఆత్మ భగవానుడను. అందుచేత నేను సర్వభూతాత్మ కోవిదుడను అగుచున్నాను. సర్వులూ, సర్వమూ నాయందే, నా సర్వ రూపం గానే నిత్యము ఉండి ఉండటం జరుగుతోంది," – అను ఎఱుక, భావన, అనుభవం అతని యందు సుదృఢత్వం పొందాయి.

శ్రీరాముడు : హే మహర్షీ ! అట్టి ఆత్మానుభవం పొంది యుండి కూడా క్లిష్టత, స్పర్థలతో కూడిన లౌకికమగు రాజ్యపాలన నిర్వర్తించగలిగారా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ లోక వ్యవహారములన్నీ మాయ చేతనే సంభవిస్తున్నాయి. అయితే అసంగము అయినట్టి ఆత్మ ఏ ఒక్క వ్యవహారముచేతనూ ఏ ఒక్క క్షణములో కూడా స్పృశించబడుటలేదు. ఈ విషయము జనకుడు సుస్పష్టంగా గ్రహించాడు. సమచిత్తుడగు అతడు ఈ రాజ్యాదుల విషయములో ప్రసన్నత్వము పొందుటలేదు. దుఃఖము పొందుట లేదు. సర్వదా 'విముక్తుడు' అగుటచే ఆతడు పూజ్యుడు, జ్ఞానవృద్ధుడు, ఇహపరముల పట్ల నిశ్చలానుభవుడుగా మనఃస్థితి పొందాడు. అందుచేత 'రాజ్యాన్ని పాలించుట' అను ప్రవాహపతితత్వమగు ధర్మమును ప్రశాంత చిత్తముతో నిర్వర్తించు చున్నాడు. యథావిధిగా రాజ్యం ఏలుచూకూడా శోకము, పరితాపము, వివశత్వము మొదలైనవి ఆతడు పొందుటలేదు.

"మానసిక దోషములచే స్వస్వరూపము నుండి తిరోభావం పొందటం .... మరలా ఆవిర్భావం పొందటం" – ఈ రెండూ ఆతని పట్ల ఏర్పడుట లేదు. దైనందికంగా వచ్చిపోయే హర్షవిషాదములు, అర్థ అనర్థములు ఇవన్నీ అకర్తృత్వాభిమానం యొక్క ప్రభావం చేత, ఆత్మ చైతన్యమునందు, తరంగములు సముద్రములోలాగా, లయించి ఉంటున్నాయి.

సుషుప్తియందు ఉన్నవానివలె ఆతడు మెలగుచూ ఉన్నాడు. రాగద్వేషములు, భూతభవిష్యత్తుల గురించిన చింతలు ఆత్మ సామీప్యతచే తడిపివేయబడ్డాయి. వాసనాభావంబున మనస్సు భూత

భవిష్యత్తులను జయించి, వర్తమానంలో ఏర్పడి మాత్రమే ఉంటోంది. అనగా దానిలో భూత – భవిష్యత్తుల చింతలు తొలగిపోయాయి. కేవలం వర్తమానంలో మిక్కిలి 'సంతుష్టి'తో అనువర్తిస్తోంది.

చూచావా రామా! ఒకడు తన మెడలో ధరించిన గొలుసు కనిపించక, ఇల్లంతా వెతకి చిందులు వేసి చివరికి మెడలోనే ఉన్నట్లు గమనించి ప్రశాంతపడునట్లు, ఈ జీవుడు సర్వదా ప్రాప్తించియే ఉన్నట్టి ఆత్మ యొక్క సమాచారము, లేక, జ్ఞానముచే మాత్రమే ప్రశాంతత పొందగలడు. అట్టి ఆత్మజ్ఞానం లభించేంతవరకూ ఈ చిత్తముచే తత్త్వ విచారణ చేయిస్తూనే ఉండాలి. 'ఆత్మతత్త్వ విచారణ' అనేది సజ్జన సాంగత్యముచే అభ్యుదయం పొందుతూ ఉంటుంది. "సర్వ సమత్వ దృష్టి" అలవడుతూ ఉంటే ఈ మనస్సు విశాలత్వం పొందుతుంది.

1 స్వవిచారణ, 2 సజ్జన సాంగత్యము ...ఈ రెండింటితో సమానమైనవి ఇంకెక్కడుంటాయి? అందుచేత రామా! నీ యొక్క "ఊహ, అపోహ"లను సచ్ఛాస్త్రము, వివేకములచే శోధన చేయి. లక్ష్యశుద్ధితో శాస్త్రానుసారం ప్రయత్నిస్తూవుండగా, క్రమముగా నీ బుద్ధి నిర్మలమవుతుంది. అప్పుడు అఖండమగు ఆత్మను, లేక ఆత్మతత్త్వమును నీకు మరింకెవ్వరూ గుర్తు చేయనక్కర్లేదు. అప్పుడు నీవు అజ్ఞానాంధకారముచే బాధించబడవు సుమా!

ప్రజ్ఞ - ఓ మహామతీ! రామచంద్రా! ఈ సంసారము అనేక దుఃఖ కల్లోలములతో అనేక విపత్తులతో నిండివుంటోంది. "అధిగమించడానికిక సాధ్యమా?" – అను రీతిలో అనేక విషయ పరంపరలు ప్రాప్తిస్తున్నాయి. అయితే, ఈ సంసార నదీ జలమును "ప్రజ్ఞ" అనే నావ సహాయముతో దాటివేయవచ్చు. కోమలమైన పూతీగను అల్పమైన గాలి కూడా అటు ఇటూ కదిలిస్తూ బాధిస్తుంది. ప్రజ్ఞా విహీనుడైన ఒక మూఢుని అతి స్వల్పమైన విషయములు కూడా బాధించగలుగుతాయి.

ఒకానొకడు నిస్సహాయుడుకావచ్చు. శాస్త్రములలోని ఆయా వివరణాదులు అతనికి తెలియకపోవచ్చు. కాని అతడు కనుక శ్రద్ధ, ప్రజ్ఞలతో కూడిన పరిశీలకుడై, క్రమంగా విజ్ఞానశీలుడు అయినాడా.... ఇక ఆతడు ఈ సంసార సముద్రమును అవలీలగా దాటివేస్తున్నాడు, కార్యసిద్ధిని పొందుచున్నాడు. అజ్ఞుడో.... అతడు ఎంతో బలవంతుడైతే మాత్రం ఏమి లాభం? చివరకు అధోగతే శరణ్యమగుచున్నది. అందుకే మానవుడైనవాడు తన ప్రజ్ఞను 'శాస్త్రము' 'సత్సాంగత్యము' అను రెండింటి సహాయముతో కాపాడుకోవాలి. తోటమాలి అందమైన పూల మొక్కలను అతి జాగ్రత్తగా రక్షించుకొనుచున్నట్లు, ఈ జీవుడు కూడా ప్రజ్ఞను, అవగాహనను దృఢపరచగల ఆయా కార్యక్రమాలను కాపాడుకోవాలి. అనేక సత్కర్మల రూపమున ప్రజ్ఞ (Wisdom) తప్పకుండా, ఉత్తమమైన, అమృత తుల్యమైన ఫలములను ప్రసాదించగలదు.

ఈ జనులందరూ ధన – వస్తు – అధికారాలను సంపాదించడానికి అనేక ప్రయత్నములను చేస్తున్నారు కదా! అదే విధముగా ఈ ప్రజ్ఞను వృద్ధి చేసుకోవడానికి కూడా సర్వ ప్రయత్నములు చేయాలి కదా!

"అసలు ఈ సంసారము అనబడేది ఎక్కడినుండి, ఎట్లా విజృంభిస్తోంది?"

సీమాన్తంసర్వదుఃఖానా మాపదాంకోశముత్తమమ్ ।
బీజంసంసారవృక్షాణాం ప్రజ్ఞామాన్ద్యంవినాశయేత్ ॥ (శ్లో 27, సర్గ 12)

ప్రజ్ఞామాంద్యముచేతనే సర్వ దుఃఖములకు, ఆపదలకు అలవాలమైన ఈ సంసారము స్వీయ హృదయము నుండి ఉద్భవిస్తోంది సుమా! అందుచేత మీరంతా ఏమాత్రం బద్ధకించకండి. ప్రయత్న శీలురై ప్రజ్ఞామాంద్యమును తొలగించుకొండి? స్వర్గ, పాతాళ, బ్రహ్మ లోకములలో ఏయే సుఖములు ప్రాప్తించగలవని జనులు అనుకుంటూ ఉంటారో, అవన్నీ కూడా ఇప్పుడే, ఇక్కడే ఉత్తమ ప్రజ్ఞచే, ఇదంతా అర్థం చేసుకున్నవాడు పొందుచున్నాడు. నాయనలారా! మహానుభావులంతా ఉత్తమోత్తమమైన తమ యొక్క 'ప్రజ్ఞ' చేతనే ఈ ఎదురుగా తారసపడుచున్న భయంకర సంసారాన్ని దాటి వేస్తున్నారు. అంతేగాని వారు ఎచ్చటకో వెళ్ళుట చేతనో, ఏదో చూచుట చేతనో కాదు సుమా! దానము, తీర్థము, తపస్సు – వీటంన్నిటియొక్క అంతిమ లక్ష్యము ఉత్తమ ప్రజ్ఞ సముపార్జించుటయే!

పారమార్థిక జీవితం విషయం అటుంచి ఈ లౌకిక జీవితం విషయం కూడా అంతేకదా! ఈ భూమిపై చరించుచున్న ఈ జీవులు ఏవేవైతే సంపత్తులు పొందుచున్నారో.... అవన్నీ 'ప్రజ్ఞ' అనే పండ్ల చెట్టు నుండి రసభరితమై పడిరాలిన ఫలములే కదా! అంతే కాదు. భయంకరమైన పంజా గల ఒక సింహమును రెండు మూడు నక్కలు తమ తెలివితేటలతో, 'ప్రజ్ఞ'తో జయించి వేస్తున్నాయి. ప్రజ్ఞ కారణంగానే సామాన్యుడై పుట్టిన ఒకానొకడు మహానాయకుడు కావడం, రాజు కావడం చూస్తున్నాం. అట్లాగే స్వర్గ – మోక్షములు మొదలైనవి కూడా ప్రజ్ఞావంతులకే లభిస్తున్నాయి.

ప్రజ్ఞ = తెలివి + ప్రయత్నము + సాహసము.

గొప్ప విషయాలు కూడా ప్రజ్ఞానవంతుడు స్వల్పకాలంలో గ్రహించి అనేక మందిని అధిగమించి వేయటం ప్రపంచంలో మనం చూస్తున్న విషయమే.

❖

వివేకుల హృదయంలో ఉండేది ఈ 'ప్రజ్ఞ' అనే మణియే. అది వారికి కల్ప వృక్షములాగా కోరుకొన్న ఫలములు సిద్ధింపజేస్తూ ఉంటుంది. నావను నడపటం చేతనైనవాడు తుపానును ఎదుర్కోగలుగుతాడు. ఈత నేర్చినవాడే మునిగిపోకుండా గట్టుజేరుతాడు. అశిక్షితుడు, అప్రజ్ఞావంతుడు సంసార సాగరాన్ని దాటగలడా? లేదు. ప్రజ్ఞను సునిశితం చేయని వాని బుద్ధి స్వల్ప విషయములచే ఆకర్షణ వికర్షణలకు లోను అవుతోంది. వివేక వైరాగ్యములతో కూడిన బుద్ధి సన్మార్గములో నియమించ బడినప్పుడు ఆ బుద్ధే నావలాగా సంసారమును దాటింపజేస్తోంది. అసన్మార్గమును ఎన్నుకొన్నందుకు పర్యవాసనం ఆపదలు, దుఃఖాలు వచ్చిపడటంలో ఆశ్చర్యం ఏమున్నది? కవచం ధరించిన వానిని బాణాలు తాకినా ఏమీ చేయలేవు కదా! ప్రజ్ఞ లేక తెలివి మరుగున పడిన క్షణాలలో 'తృష్ణ' వచ్చి చేరుతుంది. కామ, క్రోధ, లోభ, మోహాదులు ఆ తృష్ణ యొక్క సైనికులై వాటి నుండి రాగము, ద్వేషము, చింత మొదలైనవన్నీ వచ్చి పడుచున్నాయి. ప్రజ్ఞావంతుని అవన్నీ ఏమాత్రం సమీపించలేవని గ్రహించు.

ఓ రామచంద్రా! నీవు సమ్యక్ దృష్టిని సంపాదించి, అట్టి దృష్టిచే ఈ ప్రపంచమును గాంచుచూ మోక్ష స్వరూపుడవు కావాలని అనుకుంటున్నావా! అయితే వెంటనే ప్రజ్ఞను ఆశ్రయించు. గుణదోషతత్త్వ వివేకము ద్వారా 'సమదర్శి'వి అగుము. ఇక సంపదలు గాని, ఆపదలు గాని నిన్నేమీ చేయలేవు.

పిధానంపరమార్కస్య జడాత్మావితతోసితః ।
అహంకారాంబుదోమత్తః ప్రజ్ఞావాతేనబాధ్యతే ॥ (శ్లో 39, సర్గ 13)

ప్రజ్ఞ కొరవడిన తరుణంలో ఏర్పడిన 'అహంకారము' అనబడే దట్టమైన మేఘము 'పరమాత్మ' అనే సూర్య భగవానుని కనబడకుండా కప్పివేస్తుంది. ఆ మేఘము "ప్రజ్ఞ" అనబడే వాయువీచికచే త్రోసివేయబడుతుంది!

మొక్కలు నాటే ముందు రైతు భూమిని దున్ని సిద్ధము చేయునట్లు నీవు హృదయమును "స్వవిచారణ, గురువాక్య విశ్లేషణ, ఉత్తమ కార్యక్రమములు" అను భాగాలు గల నాగలితో హృదయ క్షేత్రమును సిద్ధము చేసి 'వివేకము - ప్రజ్ఞ' అను పంటను సంపాదించు. అప్పుడు ఈ విచారించ బడుచున్నదంతా నీకు స్వయముగా సుస్పష్టం కాగలదు.

❖❖❖

6. మనోవిచారణ

ఓ రామచంద్రా ! "ఆత్మానుభవ ప్రాప్తి" అనే మార్గములో ముఖ్యముగా మూడు ప్రతిబంధకాలు తారసపడుచున్నాయి–

1. అసత్‌భావన - "అసత్" లేక "అసత్యము" అయిన విషయములను పదే పదే సత్యమైనట్లు భావన చేయుట.

2. అహంకార మమకారములు - "నేను మరియు నాది" అను భావనను ఆశ్రయించడం. తనను తాను తదితరులకు వేరైనట్లుగా దర్శించటం.

3. దేహాత్మభావన - "ఈ దేహమే నేను. దేహ పరిమితుడనైన నేను దీనితో వృద్ధి క్షయములు పొందువాడనై ఉంటున్నాను" అను రూపముగల సంకుచితత్వమును భావన చేయడం.

ఆ జనకమహారాజులాగా నీవు కూడా పరిశుద్ధ చిత్తముచే ఆత్మ విచారణ చేయి. పై విఘ్నములను ప్రయత్నపూర్వకముగా తొలగించుకో. అప్పుడు జ్ఞానులు పొందినట్టి బ్రహ్మపదమును నీవు కూడా పొందగలవు. ప్రాజ్ఞులైనట్టి కొందరు సాత్వికులు, మరియు రాజస సాత్వికజాతీయులు ప్రాప్తములన్నింటిలోకి అత్యంత ఔన్నత్యము అయినట్టి ఆత్మతత్త్వమును స్వయముగా తమయొక్క వివేక బలముచేత గ్రహిస్తున్నారు.

❖

ఆత్మశాంతి పొందనంతవరకూ ఈ 'ఇంద్రియములు' అనే శత్రువులను సరియైన రీతిలో నియమించి, ఆత్మానుసంధానం చేస్తూనే ఉండాలి.

శ్రీరాముడు : మహాత్మా! ఈ ఇంద్రియములను అనేక దుఃఖములతో కూడిన సంఘటనలు ఆశ్రయించి ఉంటున్నాయి. ఇక మేము ఈ దుఃఖములను ఎట్లా జయించడం?

ప్రసన్నేసర్వగేదేవే దేవేశేపరమాత్మని ।
స్వయమాలోకితేసర్వాః క్షీయన్తేదుఃఖదృష్టయః ॥ (శ్లో 4, సర్గ 13)

శ్రీ వసిష్ఠ మహర్షి : సర్వమునందు వ్యాపించియున్నవాడు, సర్వ ఇంద్రియ నియామకుడు ద్రష్ట యొక్క వాస్తవ స్వరూపమే తానైయున్న, ఆ పరమాత్మ ప్రసన్నుడై సాక్షాత్కరించగానే సమస్త దుఃఖాలు వాటంతట అవే క్షయిస్తాయి. ఈ మనుష్యానందం మొదలుకొని బ్రహ్మానందం (సృష్టికర్తకు లభించే ఆనందం) వరకు "ఆ పరమాత్మ యొక్క అనుభవము" అనే ఆనందము ముందు 'సూర్యుని ముందు దివిటీ' లాగా అత్యంత స్వల్పమైనవే. 'పర అపర' స్వరూపుడైన ఆ పరమాత్మ సాక్షాత్కరించిన తరువాత ఇక మోహములు, వాటికి బీజము వంటివైన దుర్వాసనలు, అహంకారము, సర్వ విధమైన ఆపదలకు సంబంధించిన భయోద్వేగములు స్వయముగా శమించిపోతాయి.

ఓ రామా! వివేకముతో కూడిన బుద్ధితో "ఈ సమస్తము బ్రహ్మమే కదా....!" అన్న దృష్టిని కలిగియుండుటే పరమ పురుషార్థమగు ఐశ్వర్యమని మా అభిప్రాయం. ఎవ్వడైతే నిరంతర ఆత్మవిచారణ గావించుచు, "ఈ జగత్తు అనిత్యమే కదా!" అను నిర్ణయముచే సర్వాతీతత్వము అలవరచుకుంటాడో అట్టివాడు కాలక్రమేణా జనకమహారాజులాగా ఉత్తమ శాంతిని తప్పక పొందుతాడు.

శ్రీరాముడు : ప్రారబ్ధము చేతనే వివేకము ప్రాప్తిస్తుందా? లేక అది స్వయముగా తనంతట తానే ఏదో ఒక ఆకస్మికమైన సమయములో ఉదయిస్తుందా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఏ జీవుడైతే ఈ సంసారం పట్ల భయభీతుడై "ఉత్తమమైన అవగాహనయే ఇందుకు మార్గము" అని గ్రహించి ఆత్మ జ్ఞానము కొరకు స్వప్రయత్నమును ఆశ్రయిస్తాడో, అట్టివానికి మాత్రమే వివేకంతో కూడిన దృష్టి రూపుదిద్దుకుంటుంది. 'ఆత్మజ్ఞానము' అనబడేది ధనము వలన గాని, బంధువుల వలన గాని, 'దైవం' అనుదాని చేతగాని అనేక కర్మల చేత గాని ప్రాప్తించేది కాదు. అందుకొరకై చేసే పురుష ప్రయత్నము చేతనే అది సాధించబడుతోంది. వివేకము, వైరాగ్యము – ఈ రెండింటి విషయంలో "ప్రారబ్ధం ఉంటేనే అవి లభిస్తాయి"... లేదా "స్వయంగా, కాకతాళీయంగా లభిస్తాయి" అని తలచి, తెలియని ఏదో శక్తిపై ఆధారపడేవారు, మా దృష్టిలో, మూర్ఖులు మాత్రమే.

"ఆః! ప్రారబ్ధం ప్రతికూలంగా ఉంటే మేమేమి చేస్తాం? అందుకే వివేకం మాకు లభించడం లేదు" అని తలచే వారు జ్ఞానుల దృష్టిలో, ఆయా వికల్పాలకు దాసోఽహమ్ అంటున్న మందభాగ్యులు మాత్రమే! కనుక, ఓ సభికులారా! మీ అందరికీ నేను విన్నపం చేస్తున్నాను. మీరంతా అట్టి మాటలు కట్టిపెట్టండి. చక్కగా వివేకముతో కూడిన దృష్టిని అలవర్చుకోండి. ఆత్మ చేతనే ఆత్మను దర్శించండి. ఉత్తమ బుద్ధి ద్వారా సంసారసాగరమును దాటివేయండి. మనమిప్పుడు చెప్పుకున్న ఈ జనకుని వృత్తాంతము అజ్ఞాన వృక్షమును ఛేదించగలదని, జ్ఞాన సుఖమును కలిగించగలదని పెద్దలు అంటూ ఉంటారు. సుబుద్ధి ఒక్కడే తన యందు పరమాత్మ సాక్షాత్కారమును గాంచగలడని చెప్పుటే దీని ఉద్దేశము.

ఎండ వేడిమి చేత మంచు కరిగిపోతుంది. అట్లాగే ఆత్మతత్త్వ విచారణచే ఈ సంసార పటాటోపము, లేక, వికల్పము క్షణాలలో నశించిపోతోంది. "ఈ దేహమే నేను" అనునదే అజ్ఞానము యొక్క పరాకాష్ఠ. అట్టి సంకుచిత స్వభావం నశించిందా, ఇకప్పుడు మహత్తరమైన, సర్వ వ్యాప్తమైన నిజాత్మప్రకాశము స్వయముగానే ఆవిర్భవిస్తోంది. అనగా, ఆత్మ యొక్క విస్తారము ఉదయించగలదు.

❖❖❖

7. స్వయం విచారణ

శ్రీరాముడు : మహర్షీ! జనక చక్రవర్తి మహారాజుగా ఉంటూనే పాము కుబుసమును విడుచునట్లు... అహంకారాన్ని త్యజించివేశారు కదా! అది అట్లు ఎలా సాధ్యపడింది? ఏ పరికరాలు, కార్యక్రమాలు ఆయన ఉపయోగించారు? లేక, సిద్ధులు చెప్పిన అభిప్రాయములు విన్నంతమాత్రం చేతనే ఆయన సంసారమును జయించి వేశారా? లేక, అందుకు మరేమైనా కారణాలు ఉన్నాయా?

శ్రీ వసిష్ఠ మహర్షి : సిద్ధుల వాక్యములను మననం చేస్తూ స్వయంగా విచారణ చేయుట చేత 'అహంకారము' అనబడే మూలవాసనను ఆయన జయించారు (లేక) త్యజించారు (లేక) అతీతత్వము వహించారు. అయితే, ఏదైనా ఎవ్వరికైనా లభించాలంటే సుదీర్ఘమైన అభ్యాసం, విచారణ అవసరం కదా! అట్లాగే, చిరకాలమిత్రుడైన 'స్వవిచారణ'యే ఆతనికి అందుకు తోడైనది. అహంకారము క్షయించగా విశాలచిదాకాశము నిర్మలం అవుతుంది. 'అజ్ఞానాంధకారము' అనగా, "ఈ దేహము మొదలైనవే నేను" అని తలచుటయే కదా! అట్టి అజ్ఞానం నశిస్తే ఇక ఎట్టి బాహ్యామైన పరికరములు అవసరం లేకుండానే ఆత్మ ప్రకాశము స్వయంగా ఆవిర్భవిస్తోంది. అందుచేతనే, ఉత్తముల దృష్టిలో:

1. ఈ జగత్తు స్వయంగా లేదు ... భావనను, అనుసరించి ఏర్పడి ఉంటోంది.

2. 'అహం' అను పదవాచ్యము కూడా లేదు. 3. నేను పూర్ణ స్వరూపుడనేగాని శూన్యముకాను.

– అను మూడు అవగాహనలు ఏకసమయంలో ఏర్పడి ఉంటున్నాయి. అట్లాగే నీ మనస్సు కూడా సర్వదా ప్రశమనం పొందిఉండుగాక! ఎదురుగా ఉండే వస్తువులందు నిమగ్నము కాకయే ఉండుగాక!

అసలు 'బంధము' అంటే ఏమిటి? -

ఉపాదేయానుపతనం హేయైకాన్తవివర్జనమ్ ।
యదేతన్మనసోరామ తద్బన్ధంవిద్ధినేతరత్ ॥ (శ్లో 20, సర్గ 13)

ఆయాప్రాప్తించియున్న వస్తువులందు, స్థితి గతులందు కొన్నిటిపట్ల "వీటిని ఎల్లప్పుడూ నేను కలిగి యుండాలి" అని, మరికొన్నిటిపట్ల "ఇవి తొలగాలి" అని బుద్ధిని కలిగియుండుటే రాగ ద్వేషముల యొక్క రూపము. రాగద్వేషములు కలిగియుండుటే బంధము. అవి లేకుండుటే బంధరాహిత్యము లేక 'ముక్తి' లేక 'మోక్షము'.

తొలగాలి = హేయదృష్టి లేక త్యాజ్య బుద్ధి;
పొందాలి = ఉపాదేయ దృష్టి లేక గ్రాహ్య బుద్ధి.

ఈ రెండు దృష్టులను త్యజించి ఇక ఇప్పుడు శేషించే 'సాక్షి రూపం' నందు 'నిలకడ' కలవాడవై స్వచ్ఛతను పొంది ఉండు. గ్రాహ్య – త్యాజ్య బుద్ధిని నశింపజేసుకొన్నవారు ఇక దేనినీ ఇచ్ఛగించరు. దేనినీ ద్వేషించరు. వారి హృదయమునందు "బ్రహ్మాత్మత్వము" అనబడే సమరసభావన అకృత్రిమంగా వెల్లివిరిసి ఉంటుంది. ఆకాశం మేఘములచే ఆవరించబడి ఉన్నప్పుడు చంద్రుడు కనబడతాడా? "ఏదో పొందాలి... ఏదో తొలగాలి" అను రూపముగల తృష్ణ హృదయములో ఏర్పడి ఉన్నంత వరకు అట్టి వికల్పము యొక్క ప్రభావం చేత ఈ జీవుని పట్ల సంసారము ఉండియే తీరుతోంది. సంసారం ఉన్నంతవరకు భేద భావం, జీవ భావం అనే జాడ్యం వదలదు.

అనుకూలమైన పదార్థములందు "ఇచ్ఛ" ప్రతికూలమైన పదార్థముల పట్ల "అయిష్టత", లాభాలాభముల పట్ల రాగద్వేషములు – ఇవి ఏర్పడుచున్నచోట బుద్ధి మందగిస్తూనే ఉంటుంది. ఆతనిలో వైరాగ్యం ప్రదీప్తం కాదు. అట్టి తరుణంలో బ్రహ్మాత్మ రూపమైన సమత్వము, నిర్మలత్వము ఎట్లు ఉండగలుగుతాయి?

❖

వాస్తవానికి నిరామయము, ఏకము అగు పరబ్రహ్మమే సదా వెలుగుచుండగా ఇక ఈ భేద కల్పనలన్నీ భ్రమ కాక ఏమిటి చెప్పు? ఇష్టము–అయిష్టము, పొందబడినవి–పొందవలసినవి మొదలైనవన్నీ చపల వానరం వంటి ఈ చిత్తము యొక్క నృత్య భంగిమలే. చిత్తము గంతులు వేస్తుంటే 'సౌమ్యత్వము, నిష్కామత్వము' లకు చోటులేకుండా పోతోంది. కొందరు మహనీయులు తమ యొక్క ఉత్తమ ప్రయత్నముచే త్యాజ్యగ్రాహ్య దృష్టిని జయించి వాసనారహితులై ఉంటున్నారు. అట్టి జ్ఞానులందు ఆశా రాహిత్యం, నిర్భయం, నిత్యత్వం, సమత్వం, జ్ఞానం, నిరపేక్ష, నిష్క్రియత్వం (నేను అకర్తను అను ఎఱుక) నిర్వికల్పత్వం, ధైర్యం, మైత్రి, సమబుద్ధి, తుష్టి, శాంతి, మృదుభాషణ – మొదలైనవి స్వయంగా రూపము పొందుచున్నాయి.

శ్రీరాముడు : తండ్రీ! ఈ చిత్తము అల్పత్వమును ఆశ్రయిస్తూ ఆత్మత్వమునకు దూరమగుచున్నది కదా! ఏమిటి ఉపాయం? మేమేం చేయాలి?

శ్రీ వసిష్ఠ మహర్షి : నీరు పల్లపు ప్రాంతాలకు పోతుంటే ఏం చేస్తున్నాం? వంతెనకట్టి ఆ ప్రవాహాన్ని నిరోధించి ఎత్తు ప్రాంతాలకు తరలిస్తున్నాము కదా! అట్లాగే, ఈ చిత్తము అధోగతికి వెళుచున్నప్పుడు చూస్తూ ఊరుకుంటామా? లేదు. 'ధ్యానము' 'భగవన్నామ స్మరణ' మొదలైన ప్రత్యాహారముల చేత చిత్తమును ఆయా విషయముల నుండి వెనుకకు మరల్చాలి

బాహ్యా అనర్థాన్ ఇమాం త్యక్త్వా ; తిష్ఠన్, గచ్ఛన్, స్వపన్, శ్వసన్ ।
సర్వథా సర్వదా సర్వాన్ అన్తరాంశ్చ విచారయ ॥

ఒక చోటకూర్చుని ఉన్నప్పుడు లేక నడుచుచున్నప్పుడు, నిదురిస్తున్నప్పుడు, మేల్కొని ఉన్నప్పుడు – సర్వావస్థలలోనూ, సర్వ విధములా, సర్వ సమయములందు... అంతరంగంలో ఆత్మ విషయమే విచారణ చేస్తూ ఉండాలి.

ఈ మనస్సు బుద్ధి, ఆత్మ ఏమై ఉన్నాయి? నేను ఎవడను? ఎంతటి వాడను? నేను వేటికి 'సంబంధించని'వాడను? దేనికి 'సంబంధించిన' వాడను? దేని కొరకు ఏ రూపంగా ప్రయత్నించాలి? వేటి పట్ల ఉదాసీనంగా ఉండాలి?

...ఈ విషయాలు విశ్లేషణపూర్వకంగా గ్రహించి ఉండు. అందుకు శాస్త్రములు, జ్ఞానుల ప్రవచనములు నీకు సహకరించ గలవు. అట్టి "విచారణ, అవగాహన ఆశ్రయించబడని సమయంలో 'మోహం' అనే దారపుప్రోగులతో 'చింతా సమూహాలు' అనే ముళ్ళతో కూడిన (వాసనలు) అనే వల నేయబడుతోంది. "తృష్ణ, కోరికలు తీర్చుకొనుట" అను ప్రయోజనమే రూపంగా గల చేపలు పట్టటానికి 'సంసారం' అనే తటాకంలోకి ఆ వల పదే పదే విసరబడుతోంది...ఫలితం? అనేక జన్మ పరంపరలు! ఈ వాసనలు అనే వలను 'బుద్ధి' అనే పదునైన కత్తితో త్రెంచుకుంటూపోవాలి. మహా వాయువు మేఘాలను ఖండఖండం చేయునట్లు బుద్ధిచే వాసనలను మొదలంట పెరికివేయాలి.

❖

ఓ రామచంద్రా! అందుచేత చిరకాలాభ్యాసం ఆశ్రయించుట ద్వారా నీ బుద్ధిని దృఢతరం చేయి. 'ఆత్మను భావించుట' అను ప్రయత్నముచే అది స్థైర్యము పొందేటట్లు చేయి. చిత్తము ధీరత్వముతో కూడుకొని ఉండాలి సుమా! మనస్సు ఈ సంసారము, లేక, అవిద్య యందు అనాదిగా తగుల్కొని యున్నది. అట్టి మనస్సును సముద్ధరించటానికి అత్యంత నిర్మలమైన, సునిశితమైన బుద్ధిని సముపార్జించాలి.

నీ మనస్సు అఖండమగు బ్రహ్మాకార వృత్తిచే ప్రకాశించు గాక! ఈ సంసార వృక్షమును అట్టి బ్రహ్మాకార వృత్తి అనే గొడ్డలిచే నరకటం అత్యంత సులభం. మనస్సు వృత్తుల యొక్క సముదాయమే కదా! బ్రహ్మాకార వృత్తిచే తదితర వృత్తులన్నీ మ్రింగివేయబడు గాక! అప్పుడు ఇక్కడే, ఇప్పుడే బ్రహ్మపద ప్రాప్తి పొందుటచే సుస్థిరుడవు, సౌమ్యరూపుడవు, అనంత, అఖండానంద స్వరూపుడవు పరమేశ్వరుడవు అవుతావు. ఆత్మదృష్టిని స్థిరం చేసుకొన్నావా, నీవు పరమేశ్వరుడవై మా అందరిచే నమస్కరించతగినవాడవే అవుతావు.

ఎవడైతే అంతటా ఆత్మరూపమునే చూస్తూ, ఈ దృశ్యము పట్ల "సన్మాత్ర భావన" చేస్తూ అన్య పదార్థ భావనను త్యజించి వేసి ఉంటాడో, అట్టి వానిని ఈ'హర్షశోకవిషాదములు' అనే దోషాలు అంటజాలవు. తాక జాలవు.

రాగద్వేషవినిర్ముక్తః సమలోష్టాశ్మకాంచనః ।
యుక్తఇత్యుచ్యతేయోగీ త్యక్తసంసారవాసనః ॥ (శ్లో 43, సర్గ 13)

ఎవడైతే రాగ ద్వేషముల పరిధి నుండి తనను తాను తొలగించివేసుకొని మట్టిని, రాయిని, బంగారాన్ని సమబుద్ధితో చూస్తాడో, అట్టివాడు ముక్తుడే.

అట్టివాడు ఏది చేస్తున్నా, ఏది భుజిస్తున్నా, ఏది దానం చేస్తున్నా, ఏది వధిస్తున్నా – దేని పట్లా కూడా ఏమాత్రం "ఆసక్తి" అనేది కలిగి ఉండడు. ఆసక్తి లేదు కాబట్టి వాటిచే కలుగుచుండే

సుఖదుఃఖము లందు సమభావము కలిగియుండగలుగుతాడు. "ఇది ఇప్పుడు ఇట్లు చేయుట మాత్రమే నా వంతు" – అని భావించుచూ, ఇష్ట అయిష్టములను పరిత్యజించేవానిని బంధించగలిగే కర్మలు ఎక్కడా ఏమీ ఉండవు."

❖❖❖

8. మనస్సు - ప్రశాంతత

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ మహామతీ! రామా! ఈ జగత్తు అంతా చైతన్యమయమే కదా! ఇక, భోగాశ కలిగి ఉండాల్సిన పనేముంది? భోగాశను వీడినట్టి మనస్సు అకృత్రిమమైన ప్రశాంతతను పొందుతోంది.

శ్రీరాముడు : హే మహర్షీ! ఈ మనస్సు జడమైనదా? చేతనమైనదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : వాస్తవానికి ఈ మనస్సు జడమైనదే. అందుచేత, అది స్వయంగా దేనిని సాధించలేదు. తనను తాను ఉద్ధరించుకోలేదు.

ఒక వనంలో ఒక సింహం ఉన్నది. అది జంతువులను వేటాడటానికి బయలుదేరుతోంది. ఆ ప్రక్కనే ఉన్న ఒక పిల్లి మాంసం మీద గల అపేక్ష వల్ల ఆ సింహమును అనుసరించి వెళ్ళుచున్నది. అట్లాగే, ఈ మనస్సు అనే పిల్లి స్వయంగా దేనినీ సాధించలేదు గాని, తనకు సాక్షిగా తనను ప్రకాశింపజేయుచున్న ఆత్మ నుండి చైతన్యము పొందినదై ఆత్మయొక్క ఇచ్ఛాదులను ఆశ్రయించి ప్రవర్తించుచున్నది. చిత్త శక్తి యొక్క ప్రభావం చేత ప్రాప్తించుచున్నది. దృశ్యము నందు ప్రవేశించి ఆయా అనుభవములకు 'భోక్త' అగుచున్నది. "అసద్రూపము" అయినట్టి ఈ మనస్సు అద్వితీయమైనట్టి ఆత్మను ఏమరచి, కేవలం జగదాకారమును భావించటం జరుగుతోంది. కాని, చైతన్యము యొక్క ప్రభావం చేతనే అది జీవించటం జరుగుతోంది. అదే మనస్సు మరొక సమయంలో ఆత్మను సంస్మరించుటచే తన మనోరూపమును – జడత్వమును వదలినదై మరల చైతన్యముగా అగుచున్నది. స్వయముగా జడము, చైతన్యముచే ప్రకాశింపబడునది అగు ఈ మనస్సు మృతప్రాయమే అవుతుంది గాని, కార్య సమర్థము కాగలదా? లేదు.

'చిత్తము' అంటే ఏమిటి? - "చిత్‌స్వభావం' నుండి స్వయంగా అభివ్యక్తమైన కల్పన అసత్ మయమైన విషయములను ఆశ్రయించియుండటం. లేక, నిత్య అనిత్యములను విశ్లేషించక పోవటం."

కలన (illution)– చిత్తము 'చిత్' నుండే బయల్వెడలుచున్నది. ఈ చిత్తము "ద్రష్ట, దర్శనము, దృశ్యము" అను రూపమున క్రియారూపంగా ఆవిష్కరించ బడుచున్నప్పుడు, అట్టి 'చిత్' యొక్క త్రిపుటీ చమత్కారమే "కలన", "కల్పన" అను శబ్దములచే చెప్పబడుతోంది.

ఆ కల్పనయే మరొకప్పుడు "నేను చిద్రూపాన్నే గాని ఈ ద్రష్ట, దృశ్యం మొదలైన సంకుచితుడను, లేక, పరిమితుడను కాదు" అని ఎఱుగుచున్నది. సముద్రం నుండి బయలుదేరిన ఉప్పు బొమ్మ ఏ కారణంగానో మరల సముద్రంలో పడితే ఏమౌతుంది? నామరూపాలు పోగొట్టుకొంటుంది. అట్లే ఈ చిత్తము స్వస్వరూపమును ఎఱిగినప్పుడు తిరిగి చిద్రూపమే అగుచున్నది.

విషయరహితమైన చైతన్యమే "సనాతన బ్రహ్మము" అని అంటున్నాం. ఆ చైతన్యం విషయ సహితమైనప్పుడు 'జీవుడు – కలన – కల్పన' మొదలైన శబ్దములుగా చెప్పుకొంటున్నాం. అనగా బ్రహ్మమే కించిత్ 'విషయాసక్తి' పొందినప్పుడు కల్పనారూపమై హృదయంలో సద్వస్తువును బోలి ఉంటోంది. ఆ 'ఆసక్తి'యే సంకల్ప వికల్ప రూపములతోకూడి 'మనస్సు' అగుచున్నది.

ఈ మనస్సు నిత్యానుభవ రూపమైనట్టి తన ఆత్మను విస్మరించి 'స్మృతి' రూపమును చెందుచున్నప్పుడు, జడరూపమును బోలి, "చిత్తము" అని అనిపించుకుంటోంది.

చిత్తము యొక్క ధర్మములు -

1. జరిగిపోయిన విషయముల గురించి 'మననం' చేయటం లేక 'విషయాకార కల్పన' కలిగి ఉండటం.

2. భవిష్యత్తు విషయము గురించి సంకల్పములు ఆశ్రయించటం.

3. "ఇది పొందాలి ఇది తొలగాలి" అను రూపమునగల హేయ – ఉపా దేయములతోగూడిన పరిచ్ఛిన్నత్వము.

ఈ చిత్తమే బ్రహ్మాండాకారమును (macrocosm) స్వమాయావశంచేత పొందుచున్నది. మరొకప్పుడు తనను తాను మరచి "నేను ఒక జీవుడను (microcosm)... నేను ఈ శరీరమును... ఇవి నావి..... ఇవి కావు....ఇవి నాకే ఉండాలి......" మొదలుగా గల అనేక జీవ భ్రాంతులకు లోను అగుచున్నది. మరల అర్హత పొంది, గురువుల చేత, శాస్త్రములచేత బోధింపబడేంతవరకు తనయొక్క అద్వితీయ పూర్ణానంద స్వరూపమును గుర్తెరుగుట లేదు.

❖❖❖

9. ప్రమత్తత - పరిభ్రమణం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! ఉత్తమమైన బుద్ధి పొందటమనేది అనేక జన్మలలోని పరిశ్రమకు ప్రయోజనంగా సిద్ధించుచున్నది. ఈ మానవ జన్మ బుద్ధిని సునిశిత పరుచుకొనుటకు ఒక మహత్తరమైన అవకాశము. శాస్త్రములను విచారణ చేయుటచేత, ఉత్తమమైన వైరాగ్యమును ఆశ్రయించుటచేత, ఇంద్రియ నిగ్రహమును అవలంబించుట చేత తనను తాను ఉద్ధరించుకోవాలి. జాగ్రత్ – స్వప్న – సుషుప్తుల నుండి అతడు తన చిద్రూపమును వేరుపరుచుకోవాలి.

చైతన్యమే స్వరూపముగా గల ఈ జీవుడు "సంసార మోహము" అనే కల్లు త్రాగి ప్రమత్తతో వుంటున్నాడు. "విషయములు" అనే మృగములు సంచరించే అరణ్యంలో పచార్లు చేస్తూ అనేక ఒడుదుడుకులు అనుభవిస్తున్నాడు. "అజ్ఞానము" అనే మత్తుతో అల్ప దృష్టులచే వేసట పొందుచున్నాడు. దీనికి కారణమేమిటి?

శ్రీరాముడు : "జ్ఞానము" యొక్క అభావనయే. అజ్ఞానముయొక్క ఆశ్రయమే కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి : "శాస్త్రం – శ్రవణం – ప్రభోదం" అనువాటి సహాయంతో బ్రహ్మ రూపత్వం పొందబడాలి. లేకపోతే ఈ దృశ్యజగత్తు నందు అవిశ్రాంతమైన పరిభ్రమణం తప్పించుకోలేనిది. చిత్తం ప్రబుద్ధం కానంత వరకూ ఆత్మ అనుభూతము కాదు.

ఎదురుగా కనిపిస్తున్నప్పటికీ, ఈ జగత్తు యొక్క స్థితి "ఊహలోని రూపములు" లాగా మిధ్యాభూతమే అయి వున్నది. చిత్తము యొక్క వృత్తి రూపమే ఈ "జగత్తు" అనబడే కల్పన.

శ్రీరాముడు : 'కల్పితమాత్రం' అగు ఈ జగత్తును కల్పిస్తున్నది ఎవరు?

శ్రీ వసిష్ఠ మహర్షి : అంతఃకరణము నందున్న "సర్వసాక్షి" రూపమగు పరమ చైతన్యమే ఈ 'కలన' లేక 'కల్పన' లేక 'చిత్తము'ను ప్రకాశింపచేస్తోంది. ఎంతటి చమత్కారమో చూచావా!

చైతన్యము వాస్తవానికి జ్ఞానమే ధర్మముగా కలిగియున్నది. 'నిత్యబోధ' స్వరూపమైయున్నది. 'సర్వసాక్షి' అయి వున్నది. కాని, చిత్రంగా అంతఃకరణ వృత్తిచే అల్పత్వము చెందుతోంది. అయితే, ఆ అంతఃకరణ వృత్తి 'సాక్షి చైతన్యము' యొక్క 'నిరంతర ప్రబోధ' చేతనే ప్రవర్తించగలుగుతోంది.

ఒకచోట శిలచే మలచబడిన ఒక నర్తకి శిల్పమున్నదనుకో.... ఆ శిలాకన్య స్వయముగా నృత్యము చేయగలదా? లేదు కదా! అట్లే, సాక్షి చైతన్యము లేకపోతే ఈ మనస్సు గాని, 'కలన'గాని ఎక్కడా దేనిని ఎరుగజాలవు. చిత్రంలోని రాజు శంఖం పూరించు శబ్దం వినిపించలేనట్లు, మృగతృష్ణా సదృశమైన ఈ మనస్సు కూడా చైతన్యము యొక్క సహకారం లేకపోతే క్రియావంతం కాలేదు. ఆత్మ యొక్క శక్తి చేతనే మనస్సు ఉంటోంది. వాస్తవానికి ఆత్మకు వేరుగా 'మనస్సు' అనేదే లేదని మనం ఇతఃపూర్వమే కొన్నిసార్లు చెప్పుకున్నాం.

రాముని కంటే వేరుగా రాముని గుణములు వుంటాయా? జలమునకు వేరుగా తరంగాలు వుంటాయా? ...మనస్సు గాని, సంకల్పము గాని ఆత్మకు వేరుగా లేవు. అవి శుద్ధ చైతన్యము కంటే వేరు కాదు.

అయితే అజ్ఞానుల స్ఫురణశక్తి యొక్క బాహ్య ప్రసరణచే 'మనస్సు' అనే పేరుతో అధ్యాత్మశాస్త్ర బోధ కొరకు చెప్పుకుంటున్నాం. సంకల్పము గాని, విషయ వృత్తులు గాని ఏర్పడనప్పటి 'జీవసంవిత్తు' పరమాత్మయే అగుచున్నది.

జీవుడు - ఈ 'జీవుడు' అనబడువాడు... స్పందాత్మకమగు ప్రాణం మరియు చిదాత్మకమగు ఆత్మతత్వం – ఈ రెండింటి యొక్క అజ్ఞానపూరితమైన "అధ్యాస" చేతనే ఉత్పన్నమగుచున్నాడు. చిద్రూపము చమత్కారములైన 'కల్పనలు" చేయుచున్నవి.

"ఈ దేహమే నేను, ఇది నా స్వభావము"... "ఈ పుత్రుడు – భార్య – ధనము – ఇవన్నీ నావి"... "ఇవి సుఖకరములు – ఇవి దుఃఖకరములు"... "ఇవి ప్రియములు – గ్రాహ్యములు – ఇవి త్యాజ్యములు"... "ఇవి మాజాతి – అది కాదు"... ఇత్యాది జడభావములను ఆశ్రయిస్తోంది. అట్లు ఆశ్రయిస్తున్న సందర్భములో మనం ఆ చిద్రూపమును "జీవుడు' అని అంటున్నాం.

శ్రీరాముడు : అట్టి జీవునికి బుద్ధి చిత్తము మొదలైనవన్నీ ఎక్కడినుండి వచ్చి చేరుతున్నాయి? ఈ జగత్తు ఎక్కడినుండి ఏర్పడుచున్నది?

శ్రీ వసిష్ఠ మహర్షి : సంకల్పం నుంచి ఏర్పడుతోంది. సంకల్పమే జగత్తు. ...కాని సంకల్పమునకు స్వకీయమైన ఉనికి ఎక్కడ? అట్టి "అసత్తు" అయినట్టి సంకల్పమునకే "బుద్ధి – చిత్తము – జీవుడు." మొదలైన పేర్లను శాస్త్రవేత్తలు కల్పించడం జరిగింది. కాని, పరమార్థానికి అవేవీ లేవు.

కేవలం ఆత్మయే ఏకరసమై సర్వదా అన్నివైపులా, అన్ని వేళలా వెలుగొందుచున్నది.

అందుచేత, ఈ జగత్తు అంతా ఆత్మయే. ఈ కాలము యొక్క క్రమము కూడా ఆత్మయే. ఆత్మ ఆకాశము కంటే కూడా అత్యంత సూక్ష్మమై, స్వచ్ఛమై వెలుగుచూ వున్నది. అది అత్యంత నిర్మలమైనది. అది అల్ప బుద్ధికి "లేదేమో!" అని అనిపిస్తోంది. కాని సర్వదా సర్వము నందు శుద్ధ చిద్రూపమై వెలయుచునే ఉంది. ఈ కళ్ళు, చెవులు మొదలైన ఇంద్రియాలకు లభించదు కాబట్టి "అది అసత్తు"గా కొందరు అవగాహన చేసుకుంటున్నారు. ఇంద్రియములకు అవిషయమైనది, కేవలము అనుభవమునకు మాత్రం ప్రాప్తించేది అయినట్టి ఆత్మ సర్వదా సద్వస్తువేనయ్యా!

శ్రీరాముడు : అట్టి ఆత్మ సాక్షాత్కారం దూరస్థమగుటకు కారణం ఈ మనస్సే కదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఔను. విషయములు అనే వాసనలను కలిగియున్నంత వరకు ఈ మనస్సు ప్రతిబంధకమే అయి ఉంటోంది. అయితే, ఎక్కడైతే చిత్‌స్వరూప సాక్షాత్కారం కలిగి ఉంటుందో అక్కడ అజ్ఞాన కారణమైన ఈ మనస్సు తనంతట తానే శమిస్తోంది. వెలుతురు వుండే చోట చీకటి ఎట్లా వుంటుంది?

1. "ఆత్మ దృష్టి" ఉన్న చోట ఈ దృశ్యము అదృశ్యమై వుంటోంది.

2. "దృశ్య దృష్టి" అవలింబించే చోట 'ఆత్మ' అనుభవమునకు లభించడం లేదు. అనగా, చిత్తముచే కల్పించబడిన మిథ్యావస్తువు, మిథ్యా సంబంధములు మననము చేస్తూ వుంటే, ఆత్మ విస్మరించబడుతోంది.

దృష్టియే సృష్టి. దృష్టియే జగత్తు. ఏది ఏ దృష్టితో చూస్తే ఇది ఆ విధముగానే ప్రాప్తిస్తోంది. మరొకరకముగా చెప్పాలంటే అతి స్వచ్ఛమైన "ఆత్మ సంవిత్తు" యొక్క సంకల్ప పరంపరల చేతనే ఈ దృశ్యములన్నీ ఆవిర్భూతములగుచున్నాయి. అందుచేత రామా! నీవు ఈ 'దృశ్యదృష్టి'ని త్యజించు. 'ఆత్మదృష్టి'నే ఆశ్రయించు. "నాకు ఇష్టమైన వారు, నాకు ఇష్టము లేని వారు కూడా ఆత్మస్వరూపులే కాని, మరింకేమీ కారు" అనే అవగాహన కలిగి ఉండి, ఇక ఆపై విధివిధానముల ప్రకారం నీ కార్యక్రమములను నిర్వర్తించు.

శ్రీరాముడు : ఆత్మ యొక్క దర్శనం అవడం ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : సంకల్పమే చిత్తము. పరమాత్మని సంకల్పమే 'జగత్తు' అనబడు దృశ్యము. సంకల్పము యొక్క అభావమే.... చిత్తము యొక్క నాశనము కూడా. చిత్తము అభావించబడితే.... ఇక ఆపై మోక్షము స్వతహాగానే ఎదురు వచ్చి నిలబడగలదు.

సంకల్పము ఉంటే మనస్సు ఉంటుంది. మనస్సు అడ్డుగా ఉన్నంతవరకూ ఆత్మ దర్శనము కాదు. సర్వ సంకల్పములు త్యజించబడ్డాయనుకో... ఇకప్పుడు శేషించేది సత్తా సామన్యమే.

ఆత్మసందర్శనం - కాబట్టి నీవు ఈ "నేను – నాది" అను మూలవృత్తులతో సహా సర్వ సంకల్పములకు ఆవలకు చేరుకో. అప్పుడిక మిగిలి ఉండే 'సత్తాస్థితి' యందు స్వస్థుడవై ఉండు.

శ్రీరాముడు : ఈ 'నేను – నాది' అనబడే మూలవృత్తులు ఎందు నిమిత్తం, ఎందులో నుంచి, ఎప్పుడు, ఎట్లా బయల్వెడలుచున్నాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవి బయల్వెడుచున్నది చిత్తము నుండే. చిత్తమో.... ఆత్మ సత్తా నుండే.

ఆత్మ ఒకానొకప్పుడు అనిర్వచనీయముగా 'సంకల్పము' అనబడు క్రియా విశేషము వైపుగా ఉన్ముఖమగుచున్నది. అప్పుడది తన యొక్క "చిత్స్వరూపము"నందు కించిత్ 'అన్యధా' భావము పొందుచున్నది. ఆ 'అన్యధా' యొక్క రూపమే – "అహము... త్వమ్... సః" (నేను–నీవు–అతడు) అనునవి. అట్టి అన్యధా భావమే ఈ సంసారోత్పత్తికి హేతువు. ఆ సమయంలో ఏర్పడుచున్న 'ధ్యాస' కు 'చిత్తము' అను పేరు పెట్టబడింది. "కనుక 'అన్యధా' అను ధ్యాస యొక్క ప్రసరణయే చిత్తమునకు బీజము" – అని శాస్త్రములు ప్రవచిస్తున్నాయి.

కలన (Illusion): కలన లేక కల్పన అను మరొక పేరు కూడా ఉపయోగించబడింది. ఆత్మ తన యొక్క నిత్య నూతనమగు "నిర్వికల్ప చిత్స్వభావము" నుండి ఒకానొకప్పుడు 'చ్యుతి' పొందినదగుచున్నది. అట్లు 'సంకల్ప వ్యవహారము' కళంకితమైన సత్తయే 'కలన'అను శబ్దముచే ఉద్దేశించబడుతోంది. అట్టి 'కలన' యొక్క ప్రతిభ చేత ఈ జగత్తు యొక్క ఉత్పత్తి నిమిత్తం 'మనస్సు' ఆవిర్భవిస్తోంది. సంకల్పములే మనస్సు యొక్క రూపం.

కలనయే ప్రాణశక్తి కూడా. ప్రాణశక్తి నిరోధించబడినప్పుడు మనస్సు కూడా విలయమగు చున్నది. ఒక అద్దం పగిలిపోతే, ఆ అద్దంతో పాటే అందలి ప్రతిబింబం కూడా నశించడం జరుగుతుంది కదా! ప్రతిబింబము దర్పణము యొక్క కల్పిత రూపమే అయినట్లుగా, ఈ మనస్సు కూడా ప్రాణము యొక్క రూపమే అయి వున్నది.

స్పందనము + అనుభవము = మనస్సు, ప్రాణము.

ఒక్కడు ఎక్కడో దూరముగా ఉన్న ఒకానొక పదార్థముయొక్క మానసికానుభవం తన యందు పొందుచున్నాడనుకో... అట్టి మనోకల్పిత పదార్థముతో ఏర్పడిన అట్టి సంబంధము ఒకా నొక 'గతిశక్తి' చేతనే సంభవిస్తోంది కదా! ఆ గతి శక్తినే 'స్పందనము' అని కూడా అంటున్నాం. అట్టి గతి శక్తి చిత్తముతో కూడుకొని ఉన్నప్పుడు 'అనుభవము' అనునది సిద్ధిస్తోంది. చిత్తము మరెక్కడో వుంటే... ఆ సమయములో 'చూపు' ఒక వస్తువుపై ప్రసరించినప్పటికి ఆ అనుభవము' అనునది ఏర్పడదు. కనుక చిత్తమే ఒక వస్తువుతోనో లేక విషయముతోనో ఏర్పడే 'సంబంధము'ను నిర్వచించడం, శాసించడం జరుగుతోంది. అందుచేత చిత్తమే జగత్తు. చిత్తమే సంసారము.

"స్పందము - అనుభవము" ఈ ఉభయ శక్తుల సమ్మేళనమే భావాభావములకు కారణం. వాటి సమ్మేళనమే 'ప్రాణము'. ఆ ప్రాణమే మనస్సు. 'ప్రాణవాయుశక్తి'ని చలింపచేసేది చైతన్యమే!

ప్రాణవాయువు సర్వ రాగములు త్యజించుట చేతను, (వైరాగ్యము చేతను), ప్రాణాయామ అభ్యాసము చేతను, సమాధిని ఆశ్రయించుట చేతను అసద్వ్యసనములు క్షయించుట చేతను, పరమార్థమైనట్టి 'బ్రహ్మజ్ఞానము' చేతను నిరోధింపబడగలదు. ఈ ప్రాణవాయు శక్తి చలనరూపమే అయి ఉన్నది కదా! అది తన యందు చలన శక్తి కలిగియున్నప్పటికీ అది స్వయముగా తనకు తాను చలించలేదు. అనగా అది స్వతహాగా జడమైనదే. దానిని చలింపచేయునది ఎవరు?... ఆత్మ చైతన్యమే సుమా! ...అట్లాగే మనస్సు కూడా. మనస్సు స్వతహాగా జడమే అయివుండి, ఆత్మ చైతన్యము చేత ప్రవర్తింపచేయబడుచున్నది. ఆ ఆత్మయే స్వయం ప్రతిభచే 'చిత్‌శక్తి' లేక జ్ఞానశక్తి స్వరూపమై, అతి స్వచ్ఛమైన, స్వయంవ్యాపకమై ఉన్నది.

సంకల్పించకపోవడమే మనో నాశనం - సంసారోపశమనం.

ఈ వర్తమానపు ఉపశమన ప్రకరణము యొక్క సారాంశము సంక్షిప్తముగా రెండు మూడు వాక్యాలలో చెప్పుకోవాలంటే...

"చిత్+స్పందశక్తి" ఈ రెండింటి యొక్క సంబంధమే మనస్సు. అట్టి సంబంధము మిథ్యారూపమున ఉత్పన్నమగుచున్నది. కనుక మనస్సు మిధ్యయే అయి ఉన్నది. అందుకే ఈ మనస్సును 'అవిద్య - మాయ' అని కూడా అంటున్నాం. అదియే ఈ 'సంసారము' అను దానిని కలుగజేస్తున్న అజ్ఞానం. చిత్ - స్పందములకు 'సంకల్పించుట' అను ప్రక్రియ చేత సంబంధము ఏర్పడుచున్నది. కనుక సంకల్పించుటయే మనస్సు యొక్క రూపము.

అందుచేత - 'సంకల్పించకుండుట' అను విశ్రాంతిచే ఈ 'సంసారము' అనబడేది తృటిలో జయించివేయబడగలదు. ఈ జగత్తు యొక్క ఉపశమనము సంకల్ప రాహిత్యము చేతనే జరుగగలదు.

❖❖❖

10. 'జలము' ఉపమానం - చైతన్యము

శ్రీ వసిష్ఠ మహర్షి : జలమును - తరంగములను ఉపమానంగా తీసుకొని చైతన్య తత్త్వమును విశదీకరిస్తాను. విను-

జలమును భేదదృష్టితో దర్శిస్తున్నప్పుడు ...జలము యొక్క కదలిక, తరంగ దృష్టి, తరంగాలు" ...అనే వివర్తము ఏర్పడుతోంది. అదే విధంగా చైతన్యమే ...స్పందనశక్తి, అంతఃకరణము యొక్క సంకల్పము, చిత్తము" ...అయి ఉంది.

వాయువు నందలి చలనముతో పోల్చతగు స్పందనశక్తి (Vibration) ఒకప్పుడు చైతన్యము చేత ప్రబోధితం అవుతోంది. విషయములతో కూడిన చైతన్యమే సంకల్ప పరంపరల ఫలితంగా చిత్తముగా పరిణమిస్తోంది.

ఈ చిత్తము (మనస్సు) అనబడేది ఒక బాలునికి కనిపించే దయ్యం లాగా మిథ్యారూపంగా కల్పించబడుచున్నది. తరంగము వాస్తవానికి జలమే కదా! ఈ చిత్తము యొక్క వాస్తవ స్వరూపం కూడా అఖండ మండలాకారమగు ఆ చిద్వస్తువే సుమా!

ఎక్కడైనా తరంగములు ఏ ప్రయత్నమైనా చేసి జలాన్ని ఖండించగలవా? జలాన్ని తరంగం ఖండించటం ఏమిటి? అది మొదలే హాస్యాస్పదం. అట్లాగే, ఆ "చిత్‌స్వభావము" (చిత్ యొక్క నిర్మలత్వము – పూర్ణత్వము – అఖండత్వములను) ఏ అన్యమైన దాని చేతను ఖండింపబడజాలదు. జలము .. ఒకానొక ద్రవపదార్థము. తరంగమో... ఆ జలము యొక్క కదలికచే ఏర్పడే ఒకానొక ఆకారము. ఈ రెండూ అభేదమే కనుక అవి ఒకదానిని మరొకటి ఎదుర్కొనటమనేది ఉండదు. అట్లాగే 'చిత్'కు 'అచిత్'కు అసలు అభేదమే ఘటిల్లదు. మరి అచిత్ (దృశ్య పదార్థము – నీవు – నేను మొదలైనవి) బయలుదేరి చిత్‌ను మరొకటిగా ఎట్లా చేస్తుంది? చిత్‌ను ఖండించటమేమిటి? తరంగముల భేదం చేత జలం వేరువేరు కానట్లే 'జీవులు – జగములు' మొదలైన వాటి చేత చిత్ ఖండం కాదు కాబట్టి అది "అఖండము".

మనస్సు అనునది ఎక్కడ? జలములో 'తరంగము' అని చెప్పబడే వేఱైన పదార్థమున్నదా? కనుక, "చిత్ మనస్సు అను స్పందన కలిగి ఉన్నది! ఆ మనస్సు ఆత్మను ఆవరించి ఉంటోంది" – అనునవన్నీ అల్పమైన ప్రవచనములు మాత్రమే.

అభేదము దర్శిస్తున్నప్పుడో...! ఒక వేళ ఈ 'చిత్' స్పందరహితమై అమనస్కంగా ప్రకాశిస్తోంది అనుకో.. అట్టి స్థితిలో కేవలము చిద్రూపమే శేషించి ఉంటుంది కదా! ఇకప్పుడు మనస్సుకు చోటు గాని, రూపము గాని ఉండదు. 'నేను కేవల స్వరూపుడను' అను అచింత్యమైన ఎఱుక మాత్రం ప్రవర్తిస్తూ ఉంటుంది.

ఈ విధంగా భేద – అభేదములు అనబడే రెండు పక్షము లందు "చిత్తము అనబడే పదార్థమే లేదు." అని విశ్లేషించబడుతోంది. అయితే "మరి మాకు మనస్సు అనుభవమౌతోంది కదా...!" అని ఎవరైనా అంటారేమో!

నాయనలారా! ఆ మనస్సుగాని, చిత్తముగాని మీ స్వస్వరూపము కంటే వేరైనవి కావు, కానేరవు. వేరుగా తోచుట భ్రమ మాత్రమే. ఇక మీరో? ... చిత్ యే స్వరూపముగా కలిగి ఉన్నవారు. భ్రమ చేత మాత్రమే అనుభవమగుచున్న ఈ చిత్తము అనబడు దానిని "సమ్యక్" యొక్క అభ్యాసముచే జయించి వేయండి. అట్టి అభ్యాసము యొక్క ప్రయోజనమే "బ్రహ్మజ్ఞానము".

❖

అందుచేత ఓ రామచంద్రా! నీవు "మనస్సు అనబడేది ఒకటి ఉన్నది. ఏదేదో చేసి దానిని తొలగిస్తాను" ... అనే దుర్బల మనఃసంకల్పములను దరికి రానీయకు. అట్లు మొండిగా భావించుటచే కొందరు శ్రమ – క్లేశములకు లోనగుచున్నారు. ఉన్న వస్తువునైతే మనం తొలగించుటకు ప్రయత్నించ వచ్చు. లేని వస్తువును ఎట్లా తొలగిస్తాం? 'సంకల్పించుట' అను క్రియను మాని వేసి చూడు. ఇక 'మనస్సు' అనేది ఎక్కడున్నది? అభ్యాసమే సంకల్పరాహిత్య స్థితిని ధ్రువీకరించటానికి ఉపాయం.

శ్రీరాముడు : తండ్రీ! సంకల్పాత్మకమైన మనస్సు అనబడేది అసలు ఉందా? లేక లేదా? ..."మనస్సుచే ఈ జీవుడు బద్ధుడగుచున్నాడు" అని కొన్ని శాస్త్రములు చెప్పుచున్నాయి కదా!

శ్రీ వసిష్ఠ మహర్షి : "సంకల్పాత్మకమగు మనస్సు" అనునది ఎక్కడా లేదు. సంకల్పము చేయుటయే మనస్సుగా చెప్పబడుతోంది. అది మిధ్యా జ్ఞానముచే ఉత్పన్నమగుచున్నది. కల్పనయే దాని రూపము. హృదయమందు ఉన్నట్టి సాక్షి చైతన్యమునకు జ్ఞానోదయమైన మరుక్షణం అది శమించిపోవుచున్నది.

ఈ మనస్సు జడమైనది మాత్రమే. దానిని తొలగిస్తున్నది సాక్షి చైతన్య స్వరూపుడవగు నీవే. "నేను ఆత్మస్వరూపుడనే" అను భావనను ఆశ్రయించావా... ఇక అది మృతప్రాయమే అగుచున్నది. ఎఱిగినంత మాత్రం చేత మృతప్రాయంగా మిగిలిపోయే ఈ మనస్సుచే ఈ ప్రపంచము సృష్టించబడట మేమిటి? పొందబడుట ఏమిటి? రూపము గాని, ఆధారము గాని లేని మనస్సుచే సాక్షి చైతన్యుడవగు నీవు బాధింపబడటం ఏమిటి?... ఇవన్నీ మూర్ఖ వాక్యములు కావా చెప్పు?... నెమలి ఈకచే కొండ పిండి చేయబడటమంటే ఎట్లాంటిదో.... చంద్ర కిరణము తాకుటచే బుగ్గలు కందటమంటే ఎటువంటిదో... స్వతః సిద్ధమగు ఉనికియే లేని మనస్సుచే ఆత్మ స్వరూపుడగు జీవుడు హింసించబడటం కూడా అట్టిదే!

"ఒకడు మనస్సుచే అనేకచోట్లకు ఈడ్వబడుచున్నాడు"... "మరొకడు ఈ మనస్సును జయించడానికి తీర్థయాత్రల నిమిత్తమై దట్టమైన అడవులలోకి ప్రయాణములు చేస్తున్నాడు"... ఇటువంటి కథనమంతా మా దృష్టిలో చిన్నపిల్లల చేష్టలే. పరమార్థ దృష్టిచే మనస్సు మొదలైనవి లేవు. "ఏకమ్ సత్" అని శాస్త్రాలు అనటంలో ఉద్దేశ్యం అదే! ఎందుకంటే మనస్సు ఒక మిధ్యా రచనయే కదా! ఎంత అన్వేషించినా "ఇదిగో, మనస్సు అనబడునది ఇక్కడ ఈ రూపంలో ఉంది" ....అన్నట్లుగా మనకేమన్నా లభించుచున్నదా? ...లేనే లేదు. ఒక మిధ్యా వస్తువు చైతన్య మూర్తిని జయించుటయా? స్వప్నంలో కనిపించిన ఒక చెఱువులో ఆ స్వప్న ద్రష్ట మునిగి మరణించుటయా?

ఆహా! మహామాయావి అగు ఆ మయునిచే సృష్టించబడిన ఇక్కడి 'దృశ్యము' అను మాయ ఎంతటి చమత్కారమైనదో చూస్తున్నావా రామా? తనకు స్వరూపమే లేదు.... ఊరుకున్నంత మాత్రం చేతనే, అది లేకయే పోగలదు... అటువంటి 'మనస్సు" అనబడు మిధ్యా వస్తువుచే ఈ జనులందరు ఆడించబడుచున్నారు. కనుక మనస్సు స్వయంకల్పితం మాత్రమే కాని, ఎవరో కల్పించి మనకు అంటకట్టింది కాదు.

❖❖❖

11. అజ్ఞానవశం చేత....

శ్రీవసిష్ఠ మహర్షి: ఎప్పుడైతే అజ్ఞానం కలిగిందో, అప్పుడు ఈ జీవుడు సర్వ ఆపదలకు అర్హుడగు చున్నాడు. ఆతడు పొందని క్లేశం ఏమున్నది...? అసలు ఈ 'సృష్టి' అంతా కూడా అజ్ఞాన కారణంగానే ఉత్పన్నమగుచున్నది. అయ్యో! ఎంతటి విషాదకరమైన విషయం! ఈ జీవుడు అజ్ఞాన వశం చేతనే 'మనస్సు' దేహం మొదలైనవిగా గల జడవస్తువులచే బాధింపబడుచున్నాడు. పోనీ ఆతడు సరిగ్గా

పరిశీలన చేస్తున్నాడా? లేదు. మరల మరల 'అసన్మార్గము'నే అవలంబిస్తున్నాడు. తన దుఃఖము కొరకే ఈ సృష్టిని సమాశ్రయించి ఉంటున్నాడు.

శ్రీ రాముడు : మరి ఈ జాడ్యమునకు ఉపాయం?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ మనస్సు, ఈ సృష్టి – ఇవన్నీ ఎట్లా ఉత్పన్నమైనాయి? 'అవిచారణ' చేతనే కదా! అందుచేత అజ్ఞానమయమైన ఈ సృష్టి 'సువిచారణ' మాత్రం చేత పేలవమైపోతోంది. ఇక దీనిని గురించి దుఃఖించటం ఎందుకు?

ఈ సృష్టి మనుజుని స్వయం కల్పితమైనట్టి 'భ్రాంతి' యొక్క రూపమే అయి ఉన్నది. "సాయంకాలం ఆకాశంలో పక్షులు అటూ ఇటూ ఎగురుతుంటే అది నాకు నా ప్రియురాలి విరహం గుర్తు చేస్తోంది" అనే వ్యాఖ్యానం ఎంతగా భ్రమ స్వయం కల్పితమో, ఈ సృష్టిని కూడా ఈ జీవుడు అట్టి స్వయంకల్పిత కథనముల చేతనే పొందుచున్నాడు. అట్టి కథనములను మొదలంట్లా త్యజించాడా... ఇక ఇదంతా ఆ జీవుడు తన స్వస్వరూపంగానే ఆస్వాదించగలడు.

❖

ఏది ఏమైతేనేం? "మిధ్యారూపము, కల్పితము, ఎచ్చటా కూడా ఉనికి లేనిది, అల్పము" అయినట్టి ఈ మనస్సు చేత లోకమంతా హతం కావటం మనం చూస్తున్నాం. అయితే, మానవుడన్న వాడు కల్పితమయమగు ఈ సృష్టిని, 'అసద్రూపము' అయి ఉన్న ఈ మనస్సును తన వశం చేసుకోవటానికి సిద్ధపడాలి. అట్లా సిద్ధపడని వాడు అధ్యాత్మ జ్ఞానప్రవేశమునకు ఏ విధంగా అర్హుడు కాగలడు చెప్పు? అల్పదృష్టి, స్వల్పములనైన వాటి కొరకు ఆశ, బలహీనమైన అవగాహనలు గల జీవుల యొక్క దుష్టబుద్ధి బాహ్యపదార్థము లందే స్థిరపడిపోయి ఉంటుంది. "వీటిని పొందితే నేను పూర్ణత్వమును పొందుతాను" అని భ్రమను చెందుతోంది. అట్టి బుద్ధి తన అంతరంగము యొక్క స్వరూపమును గ్రహించలేకపోతోంది. సూక్ష్మమైన విశేషములను గుర్తించలేకపోతోంది. సూక్ష్మ బుద్ధి లేని సమయములో ఈ సంసారము యొక్క అల్ప శబ్దములకు కూడా ఈ మనస్సు భీతిల్లుచున్నదే! అల్పమైన విషయముల పట్ల అహంకార – మమకారములు ఏర్పడుచున్నవే!

జ్ఞాన శూన్యుడైనవాడు తన యొక్క మనస్సు చేతనే అతి క్రూరముగా దీర్ఘకాలము నుండి హింసించబడుచున్నాడు. స్వల్ప సుఖములచే పరిపరి విధములుగా మోసగించబడుచున్నాడు.

అనేకమైన అపనమ్మకములతో, స్వల్పములయిన విషయముల మధ్య ఉన్మత్తుడై వ్యవహరించే అట్టి వాని ముందు ఉత్కృష్టమైన సత్య విషయములను ప్రతిపాదించుట ఎట్లాగో మేము గ్రహించ లేకపోతున్నాము.

❖❖❖

12. ఉపదేశములకు అర్హులు - అనర్హులు

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఇప్పుడు శాస్త్రములచే చెప్పబడు ఉపదేశముల సారమును గ్రహించనట్టి వారి విషయమై కొన్ని విషయములు సర్వజనులకు మనవి చేస్తున్నాను.

కొందరు జనులు ఈ సంసార సాగరములో "విషయ – సుఖాభిలాషలు" అనే తరంగములచే కొట్టుకొని పోబడుచున్నారు. 'పరమార్థ విషయము'లో వారు అత్యంత చెవిటితనం, మూగతనం వహించి ఉంటున్నారు. ఆత్మ తత్వ విచారణ చేయడం, యుక్తి సహాయంతో ఉత్తమ సత్యమును పరిశీలించటం – ఇవన్నీ వారిని సమీపించుట లేదు. అట్టివారు అధ్యాత్మ విద్యను గ్రహించడానికి అనర్హులే అగుచున్నారు.

"కళ్లు మూసుకొనే నడుస్తాం! అది అంతే!" అని చెప్పుకుంటూ కళ్లు తెరవని బాటసారికి బాట ప్రక్కన గల పూతోటను ఎవరు చూపించగలరు? వాసన చూడలేని వారికి సుగంధం వెదజల్లే అత్తరులు, రసాయనాలు అందిస్తే ఏం ప్రయోజనం? మత్తుగా త్రాగినవాడికి 'వాదము – చర్చ' ద్వారా నిజము నిరూపించడానికి ప్రయత్నించగలమా? ఆతడు న్యాయ నిర్ణయమును అర్థం చేసుకో గలడా? విచక్షణ – సద్విమర్శలను ఆకళింపు చేసుకోగలడా?

ఒకడు తన సందేహములను తీర్చుకోవడానికని శ్మశానానికి వెళ్ళి పెద్ద గొంతుకుతో శవ పేటికలతో అరిచి చెప్పితే ఏదైనా ప్రయోజనముంటుందా? మూర్ఖునికి నీతి వాక్యములు వినిపించ గలమా? మనస్సు మొండికేస్తూ ఉండగా దురభ్యాసములకు దాసోహమగుచున్న వానికి సన్మార్గము యొక్క ఔన్నత్యము గురించి చెప్పే సుందరమైన భాషాప్రయోగాలు ఎందుకు పనికి వస్తాయి?

అనర్హుల ముందు ఆధ్యాత్మ విద్యను ప్రతిపాదించడం అట్టిదే అగుచున్నది.

❖

ఓ సర్వజనులారా! నాదొక విన్నపము. ఏ మనస్సైతే 'యదార్థానికి లేదు' అని క్రిందటి సర్గలో మనం నిరూపించామో... "అట్టి మనస్సు నా ఇచ్ఛ యొక్క రూపమే. ఇచ్ఛ, అభ్యాసములను బట్టి మనస్సు ఉంటోంది. కనుక "ఇచ్ఛ, అభ్యాసములు సరి అయిన మార్గములో నియమిస్తూ ఉంటే ఇక మనస్సు జయించబడినట్లే" – అని ఎందుకు సంభావించరాదు?

మరొక విషయం. ఒకానొక బాటలో "ఆ దూరంగా ఎత్తుగా కన్పిస్తున్నది ఒక పెద్ద బండ రాయేమో?" అని సందేహము, భయము ఏర్పడి ఉన్నాయనుకో... అది దూరముగా చూచిన రథ సారధి "అయ్యో! ఎట్లా ప్రయాణించడం ... అని భయపడుతున్నాడనుకుందాం. ఇంతలో "అది బండరాయి కాదు, ఏదో క్రీనీడ మాత్రమే... అక్కడ బండరాయి లేదు" అని ఎదురుగా వస్తున్న బాటసారులు చెప్పారు. ఇప్పుడు "ఆ బండరాయి తొలగించబడినట్లే" అని ఎందుకు భావించరాదు.

శ్రీరాముడు : అవును. రథసారధి నిరభ్యంతరంగా అట్లు భావించవచ్చు.

శ్రీ వసిష్ఠ మహర్షి : అదే రీతిగా "మనస్సు – అనేదే లేదు" అని శాస్త్రములు, మేము కూడా

స్వానుభవ పూర్వకంగా ప్రకటిస్తున్నాం కదా! కాబట్టి "ఈ మనస్సు సర్వదా తొలగించబడినట్లే" అని ఎందుకు భావించరాదు.

యదార్థానికి 'లేనిదే' అయినట్టి మనస్సుకు "ఈ మనస్సును జయించడం మా వల్ల కాదు" అనుకుంటూ తిరుగాడే వారు ఎక్కడో దూరముగా కనిపించిన త్రాడును చూచి పామనుకుని ఇక్కడ నుఋగులు కక్కేవారే అవుతారు.

జ్ఞానదృష్టి - జ్ఞాని ఎల్ల వేళల తన ఆత్మనే సర్వత్ర దర్శిస్తూ ఉంటాడు. ఆయా తదితర శరీరములను చూచుచున్నప్పుడు "ఓహో! ఇక్కడ ప్రాణ శక్తులు ప్రకటనమగుచున్నాయి కదా!" అని మాత్రమే తలచుచున్నాడు. ఆ శరీరములలో ఆత్మయే చైతన్యమూర్తిగా వ్యవహరిస్తూ జడమగు ప్రాణాదులను చలింపజేయుచున్నదని గ్రహిస్తున్నాడు. రెండు పాత్రలలోని ఒకే ద్రవము వలే, రెండు గృహముల స్థానంలో ఒకే ఆకాశము వలే, ఈ నానా విధ దేహాలలో ఒకే ఆత్మ అధిష్టించి ఉంటోందని ఆతడు ఎరుగుచున్నాడు.

జ్ఞాని తన ఇంద్రియములను చూచి "ఓహో! మీరంతా మీ మీ ధర్మములను నియుక్తులగు చున్నారు కదా! మంచిది" అను విధముగా దర్శిస్తున్నాడు. ఇక అతనికి మనస్సు అనేదేదీ, ఎక్కడా వేరే అగుపించదు.

ఆత్మ... జ్ఞానశక్తి కలిగి ఉంటుంది. ప్రాణములు ... స్పందనశక్తి కలిగి ఉంటున్నాయి. ఇంద్రియములు... రూపము, రసము మొదలైన వాటిని సాక్షాత్కరించుకొను శక్తి కలిగి ఉంటున్నాయి.

"ఈ ఆత్మ – ప్రాణ – ఇంద్రియములు వాటి ధర్మములను అనుసరించి ప్రవర్తన కలిగి ఉంటున్నాయి. మరిక బంధం ఎవరికి?... ఎక్కడ?..." అని జ్ఞాని ప్రపంచమును ప్రశ్నిస్తున్నాడు.

ఈ కనబడే జీవులందరిలో ప్రస్ఫుటమగుచున్న వ్యవహార శక్తంతా సర్వ శక్తిమంతుడు, సర్వ నిర్మాత అగు ఆ పరమాత్మ యొక్క కిరణముల ప్రసరణయే అయి ఉన్నది. అదిగో! ఆకాశములో సూర్యుని చూడు. అనంత సంఖ్యలో సూర్య బింబము నుండి కిరణాలు బయలు దేరుచున్నాయి. ఆ కిరణములన్నీ సూర్యుని స్వభావమును వేరైనవి కావు. ఒక్కొక్క కిరణం ఒక్కొక్క వస్తువును ప్రకాశింప జేస్తోంది. కాబట్టి "తటాకంపై ప్రసరించే కిరణం వేరు... ఇంటిపై ప్రసరిస్తున్న కిరణం వేరు"... అని అనగలమా? లేదు కదా! "ఈ వేరువేరు జీవరాసుల ద్వారా ప్రకటితమగుచున్న దంతా ఒకే ఆత్మ శక్తియే" అను అనుభవం ఉత్తమ జ్ఞానులు పొందుచున్నారు. ఏ జీవి దేనిని అవగాహన చేసుకుంటున్నప్పటికీ "ఎఋగుట" అను స్వభావము ఒకే తీరై ఉన్నది కదా!

జగత్తు లేదు... ఆత్మయే ఉన్నది - ఈ జగత్తును విజ్ఞాన దృష్టితోను, భ్రాంతి రహితమైన దృష్టితోను చూస్తున్నప్పుడు "ఇది అంధప్రాయమే, లేక, లేనిదే" అని తెలియవస్తోంది. అట్టి ఉత్తమ దృష్టిచే ఈ జీవుడు అనబడువానికి ఆత్మ కంటే వేరైన సత్తా లేనేలేదు. ఈ శృతి వాక్యములు చూడు:

"నాన్యోస్తి దృష్టమ్" = ఈ కనబడుచున్నదేదీ బ్రహ్మము కన్నా వేరుగా ఉండుట లేదు.

"నాన్యోస్తి విజ్ఞాతమ్" = బ్రహ్మము కంటే వేరుగా ఏదీ తెలియబడుట లేదు.

"జీవో బ్రహ్మేతి నాపరః" = ఈ జీవుడు బ్రహ్మమే గాని, వేరే ఏమీ కాదు.

...ఈ వాక్యములన్నీ జగత్తు యొక్క మిధ్యత్వమునకు, ఆత్మ యొక్క సత్యత్వ – నిత్యత్వములకు ప్రమాణములగుచున్నాయి.

శ్రీరాముడు : అయితే స్వామి! "బ్రహ్మము చేతనము – ఈ జీవుడు అచేతనము" – అని అనవచ్చా?

శ్రీ వసిష్ఠ మహర్షి : అట్లా అయితే ఈ జీవుని యందు శక్తి ఉండేది కాదు. స్వకీయమైన ప్రయత్నము – అవగాహన – బంధము – మోక్షము" మొదలగునవి కూడా ఉండేవి కావు. అందుచేత జ్ఞానులు సిద్ధాంతీకరించునది విను–

'ఆత్మ' కంటే వేరుగా ఈ చిత్త జీవులు లేరు. ఉన్నట్లు తోచటమంతా స్వకీయమైన భ్రమచేతనే. అందుచేత నీకు పైపై కనిపిస్తున్న ఈ 'జీవుడు – చిత్తము' అనునవి ప్రతిబింబ మాత్రములు, అసద్రూపములు మాత్రమే. కనుక "ఈ జీవుల వాస్తవస్వరూపము "నిత్యము–నిర్మలము–అఖండము అయిన ఆత్మయే" – అను దృష్టిని కలిగి ఉండు.

❖

ఓ జనులారా! మీ చేత మీరే కల్పించుకుంటున్న "మనస్సు" అనబడు దాని కారణంగా మీ యొక్క 'పరమార్థ దృష్టి'ని కోల్పోవుచున్నారే! అందుకు ఫలితంగా మీరు పొందుచున్న దుఃఖ పరంపరలను చూస్తుంటే – మానసిక రోగపీడితుడగు కుమారుని బాధలు చూస్తున్న తండ్రిలాగా – మాకు ఎంతో పరితాపం కలుగుతోంది.

మూర్ఖత్వము - పరిమిత దృష్టిని ఆశ్రయించి "సూక్ష్మము, మంద్రము" అయిన ఆత్మ విశ్లేషణా సమాచారం మొదలంట్లా తిరస్కరిస్తున్న మూర్ఖులు అనేకులు ఈ భూమిపై సంచారం చేస్తున్నారు. ఈ ఇంద్రియ విషయములే మహత్తరమైనవని తలచే అట్టివారు తాము పయనిస్తున్న మార్గము ఎట్టిదో ఎరుగలేకున్నారు.

'గాడిద, మూర్ఖుడు' – ఈ ఇద్దరు అనేక దుఃఖభారములను అనుభవించుటకే జనించు చున్నారు. అల్పమైన అవగాహనయే కారణం అవటం చేత, ముమ్ముందుగా "అసంతృప్తి" పొంది, అటు తరువాత "మాకు అవి లేవు, మేము ఇవి పొందలేదు" – అని ఇక ఈ మానవుడు అసంతృప్తికి కారణాలు వెతకడం జరుగుతోంది. నిందించటం, ద్వేషించటం, దూషించటం మొదలైన నరక మార్గ పతితులుగా పరిణమించటం జరుగుతోంది.

సముద్రంలో ఎన్నో బుద్బుదములు లేస్తున్నాయి. లయిస్తున్నాయి. అదేవిధంగా ఈ "దేహం నందు ఆత్మాభిమానం, ఇంద్రియ విషయముల పట్ల ఆకర్షణ, పాప కర్మల పట్ల బుద్ధి" కలిగినట్టి అనేక మంది జీవులు జనిస్తున్నారు. మరణిస్తున్నారు. ఎన్నో కోళ్ళు, పశువులు ప్రతిరోజు కసాయివారి చేతులలో విగత జీవులగుచున్నాయి. ఈ భూమిపై జనించే ప్రాణులలో ఎన్నో కోట్ల ఈగలు, దోమలు ప్రతి రోజూ వాయువు చేత నసింపజేయబడుచున్నాయి. జాలరి వల వేసి వేలాది చేపలను పట్టి కాల్వగట్టు ప్రక్కన పరచి అమ్ముచున్నాడు. విచారణ, పరిశీలన లేనట్టి మూర్ఖ మానవుల జన్మలు కూడా అట్టివే అగుచున్నాయి.

అట్టి మూర్ఖుల గురించి దుఃఖించి ఏం ప్రయోజనం? నీటిలో ఒక పెద్ద చేప అనేక చిన్న చేపలను, కీటకములను మ్రింగుచున్నది. ఆ పెద్ద చేప ఒకనాడు ఒక జాలరి చేతికి చిక్కి శల్యమగు చున్నది. పేను వంటి స్వల్పమగు పురుగులను పెద్ద జాతి పురుగులు మ్రింగుతున్నాయి. ఆ పెద్ద జాతి పురుగులు సాలె పురుగు నిర్మించిన గూటిలో చిక్కి ప్రాణాలు విడుస్తున్నాయి. ఆ సాలెపురుగును పెద్ద జాతి బొద్దింక వచ్చి భోంచేస్తోంది. ఆ బొద్దింకను కప్ప భుజిస్తోంది. కప్పను పాము ఆరగిస్తోంది. పామును ముంగిస – ముంగిసను పిల్లి – పిల్లిని కుక్క – కుక్కను ఎలుగుబంటి – ఎలుగుబంటిని చిరుత పులి – చిరుత పులిని సింహం – సింహమును శరభం – ఈ విధంగా ఒక దానిని ఒకటి చంపుకుంటున్నాయి. శరభం పెద్ద కొండను ఎక్కి మేఘమును ఢీకొనబోయి చచ్చుచున్నది.

ఆ మేఘము వాయువుచే తొలగించివేయబడుతోంది. వాయువు పెద్ద పెద్ద పర్వతములచే తన దిశను కోల్పోతోంది. ఆ పర్వతములను వజ్రాయుధం క్షణంలో చూర్ణంగా చేసివేయగలుగుతోంది. వజ్రాయుధం ఇంద్రునిచేతికి దాసోఽహం అవుతోంది. ఆ ఇంద్రుడు విష్ణుదేవునిచే ఒక్కక్షణ కాలంలో నియమించబడుచున్నాడు. మరొక క్షణంలో తొలగించబడుచున్నాడు. అంతటి విష్ణువు వంటివాడు కూడా కాలమహిమ చేత అనేక దుఃఖములతో కూడుకున్న చేప, తాబేలు, పంది వంటి ఉపాధులలో ప్రవేశించవలసి వస్తోంది.

అనేక విషయములు తెలిసిన మహా పండితులు, శరీర సౌష్టవము కలవారు కూడా తమ దేహములలో ప్రవేశించిన సూక్ష్మజీవులచే భక్షించబడుచున్నారు.

❖

చూచావా రామా! ఈ విధంగా ఈ కనబడే ప్రాణి కోట్లన్నీ ఆయా తదితర ఆదిభౌతిక జీవుల పాలబడి విచ్ఛిన్న మగుచున్నాయి. అవి ఈ భూమిపై సంచరిస్తున్న కొద్దికాలం అజ్ఞాన విషయములను ఆశ్రయించి, వాటినే అంటి పెట్టుకొని వుంటున్నాయి. అజ్ఞానం చేతనే ఈ జీవులు పరస్పరం హింసించుకోవడం – భక్షించుకోవడం చేస్తున్నాయి. ....అయితే జ్ఞానికి ఇక్కడ కోరుకొనవలసిన విషయం గాని, ద్వేషించ వలసిన విషయం గాని ఉండుట లేదు.

ఒక పురుగు దగ్గర నుండి అనేక జీవజాతులు ఈ భూమిపై నిరంతరం ఉత్పత్తి, వినాశనములు పొందుచున్నాయి. జలాశయాలలో పెద్ద ఆకారములు గల మొసళ్ళు తిమింగలములు ఉత్పన్నమగు చున్నాయి. భూమి లోపల తేళ్ళు – పాములు – రకరకాల ఆకారములుగల పురుగులు – ఇవన్నీ ఉత్పన్నమవుతున్నాయి. ఒక ప్రాణి దేహము నందే అనేక సూక్ష్మ ప్రాణులు, విచిత్ర క్రిమిజాలం ఉత్పత్తి పొంది, నివసించి ఇంతలోనే నశిస్తున్నాయి. స్థావరములగు వృక్షములలోను, పొదలలోను, రంగు రంగుల క్రిమి కీటకములు పుట్టుచున్నాయి. మంచుకొండలలో కూడా కొన్ని ప్రాణులు నివాసం కలిగిఉన్నాయి. ఇంకా మలములందు కొన్ని కీటకములు జనించి, చరిస్తున్నాయి. ఇట్టి అసంఖ్యాకములైన రకరకములగు ప్రాణులన్నీ జ్ఞానముతో కూడిన ఆశ్రయము, అవగాహనలు లోపించిన కారణంగానే ఏర్పడుచున్నాయి. అయితే ఇట్టి ఈ సృష్టి వ్యవహారముల పట్ల "అపేక్ష –

దుఃఖము – రాగము – ద్వేషము” మొదలైనవి ఉండవలసిన అగత్యమే లేదు. నిరంతర ఉత్పత్తి – వినాశనములతో కూడిన సంసార భ్రమలను ‘సుఖ దుఃఖ’ భావములు రెండూ ఉచితములు కావు.

శ్రీరాముడు : ఈ విధంగా మహా వృక్షము యొక్క ఆకుల వలె పలువిధములైన జీవకోట్లు ఉత్పత్తి అగుచున్నాయి. మరల వినాశనం పొందుచున్నాయి. వీరి దుఃఖములన్నీ తొలగేది ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : తన బుద్ధిని ‘సునిశితము – నిర్మలము’ చేసుకొన్న వారికే సత్య దృష్టిచే శాంతి ప్రాప్తించుచున్నది. అల్ప విషయములపై ధ్యాస కలిగి వ్యవహరిస్తున్న కుబుద్ధులను దుఃఖ రహితులను చేయటం ఎలాగో మాకు కూడా తెలియడం లేదు. మా విచారణ వినకుండానే తిరస్కరించే వారి దౌర్బల్యము మేమెట్లా తొలగించగలం చెప్పు? అందుకే శ్రీరామావతారం ఈ జగత్తుకు అత్యావస్యకమై... నీవు అవతరించావు.

ఈ మనుజులలో కూడా కీటక–ఈగ–తేనెటీగ–జంతువు–వృక్ష ధర్మాలు ఆశ్రయించే వారు ఉన్నారు. అట్టివారు ఉపదేశములకు అర్హులు కాలేక పోవుచున్నారు. దృశ్య విషయము లందు సంలగ్నమైన మనస్సు గల మనుజునకు, పశువులకు భేదమేమీ ఉండదు. పశువులు త్రాటితో ఈడ్వబడుతూ ఉంటే, మూఢచిత్తులగు మనుజులు తమ మనస్సుల చేతనే ఈడ్వబడుచున్నారు. ‘స్వచిత్తము’ అనే బురదలో ఇరుక్కొని “సర్వనాశనము” అను పర్యవసానము కొరకై అనేక కార్యారంభములను రచించుకొంటున్న వారిని చూచినప్పుడు – గోడలు, శిలలు కూడా – “అయ్యో! పాపం” అని రోదిస్తున్నాయి.

శ్రీరాముడు : జీవునికి ఇన్ని దుఃఖములు ప్రాప్తించటానికి కారణమేమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఎవరైతే తమ చిత్తములను జయించరో ...వారికి అంతటా దుఃఖములే సంప్రాప్తమౌతూ ఉంటాయి. అప్రయత్నశీలురను, పిడివాదములు చేసే వారిని, ఇంద్రియ విషయములే ఉత్తమ ప్రాప్తములుగా భావించే వారిని, దుఃఖ పర్యవసానము గల కార్యక్రమములను పరమ ఉత్సాహముతో ప్రారంభించే వారిని, వాటిపై గొప్ప నమ్మకము గలవారిని ఆయా పర్యవసానములే ఆలోచింపచేయగలగాలి. లేదా, అవతార మూర్తివగు నీ వర్తనమే మార్గం చూపాలి. వారు వర్తమానములో మాత్రం ఈ బోధకు తగినంతగా అర్హులు అగుటలేదు. ఎవరైతే తమ చిత్తములను జయించి ఉంటారో అట్టివారి పట్ల మా బోధ తెల్లటి వస్త్రముపై రంగు వలె “సుస్థిరము, మహా ప్రభావ సమన్వితము” అగుచున్నది. అర్హులగువారి కొరకై గురువులు వెతుకుతూ ఉంటారు.

❖❖❖

13. మనోనాశనం

శ్రీరాముడు : ‘మనస్సు’ అనబడేది లేదని మీరు చెబుతున్నది అంగీకార యోగ్యమే అయినప్పటికీ, మమ్ములను ఈ ఇష్టాయిష్టాలు, సుఖదుఃఖములు, భయగర్వములు, విడచిపెట్టనంత వరకు ప్రయోజన మేముంటుంది చెప్పండి! అందుచేత మనస్సును అతీత స్థితిలో సుస్థిరపరుచుకోవడం ఎట్లా?

శ్రీ వసిష్ఠమహర్షి : నాయనా! పదే పదే చెప్పినదే మరలా చెప్పుచున్నాను. 'మిధ్యయే' అయి ఉన్న మనస్సు అనబడేదాని గురించి వ్యర్థమైన కల్పనలు చేయవద్దు. అమ్మచే వర్ణించబడే "ఆ బారెడు జడలతో పిల్లికళ్ళు గల దయ్యం" గురించి విని బాలుడు నిజంగానే "దయ్యము" అనే దానిని చూస్తున్నట్లు భ్రమించి కెవ్వున అరుస్తాడు చూచావా? ఆ విధముగా మనస్సుచే జనులు క్షణంలో బద్ధులు, దుఃఖితులు అగుచున్నారు. ఆత్మ తత్త్వమును ఏ మరిచి మూఢునిలా అనంతకాలం ఈ మనస్సు నలువైపులా విజృంభిస్తూనే ఉంటోంది. అయినా రామా! నీవిప్పుడు ఈ మన సంవాదముచే పరమార్థ సత్యమగు 'ఆత్మ'ను చక్కగా ఎఱుగుచున్నావు కదా! 'చిత్తము' అనేది సంకల్ప పరంపరలు కారణంగానే వృద్ధి చెందుతోంది. అందుచేత నీవు ఈ దృశ్య సంకల్పములను వెనువెంటనే త్యజించి వేయి. ఈ దృశ్యమును గనుక నీవు ఆశ్రయించావా... ఇక అంతే .. నీవు చిత్తసహితుడవు, బద్ధుడవు అవుతావు. "ఈ దృశ్యము అసత్యము, అసంభవము కూడా" – అని ఎఱిగిన వాడవై దీనిని త్యజించావా – ఇక నీవు చిత్త రహితుడవు ముక్తుడవు అగుచున్నావు.

ఈ దృశ్యము త్రిగుణముల స్వైరవిహారము కారణముగా మాయతో కూడినదై వుంటోంది. దీనిని ఆశ్రయించావా ...బంధము. పూర్తిగా త్యజించావా ...మోక్షము.

ఈ సత్యమును గ్రహించి అట్టి ఎఱుకను అంతరంగమున పదిలపరుచుకొని, ఇక ఆపై ఏది ఎట్లు ఉచితమో, అది అట్లే నిర్వర్తించు. "ఆ బాహ్య – అభ్యంతర దృశ్యములు రెండూ నేను కాను" అని భావించుచూ ఒక పర్వతములాగా స్థిరముగా వుండు.

1. హృదయేశ్వరుడగు ఆ పరమాత్మ యొక్క ఉనికి ఆకాశంలా అతి విశాలమైనదని ఎఱిగి ఉండు. ఆయనే నీకు కనబడే ఆయా నామరూపాలు అగుచున్నాడని సమాధానము పొంది ఉండు.

2. "ఇది జగత్తు – ఇది ఆత్మ" అను భ్రాంతి రూపమై ద్వైతకల్పనను పూర్ణముగా వదిలివేయి. అప్పుడు శేషించి ఉండే సాక్షి చైతన్యమునందు సిద్ధుడవై ఉండు. లేదా అట్టి అభ్యాసాన్నైనా ఆశ్రయించు.

3. "దృశ్యము – దృష్టి"ల మధ్య 'దర్శనము' అనే గల అనుభవం ఉంటోది కదా!... అట్టి అనుభవమునకు కర్తయగు ఆత్మయే దృష్టి – దర్శన – దృశ్యము లందు అనుస్యూతమై ఉంటోంది. అట్టి విషయరహిత సాక్షితత్వమును సర్వదా భావన చేస్తూ ఉండు. అట్టి భావనలో జగత్తు ఉండదు కనుక అది 'భావరహిత స్థితి' యే అవుతుంది.

4. ఆస్వాదించునది – ఆస్వాదించబడునది అను రెండిటికీ మధ్య ఉండే విషయరాహిత్యాన్ని ఆరాధించు, ఉపాసించు.

5. అనుభవి – అనుభవనీయము (The Experiencer - Experiences) అను రెండిటి మధ్య నిరాలంబమై, ఆ రెండిటి కన్నా వేరుగా ఉనట్టి శుద్ధతత్త్వమును సమాశ్రయించి ఉండు.

6. జాగ్రత్ – స్వప్న – సుషుప్తిల మూడిటి కంటే విలక్షణమైన స్వరూపము నందు మనోబుద్ధులను ప్రతిక్షేపించి ఉండు.

అట్టి "శుద్ధ చిన్మాత్ర స్వభావనము" అని పిలువబడే ఆత్మసత్తను ఏమరచి, విషయములను

భావించటం, దృశ్యముచే ఆకర్షించబడటం దౌర్భాగ్యం అనిపించుకోదా? అట్లు దృశ్యమును ఆశ్రయించుటే "చిత్త దశను పొందటం" అని గ్రహించు.

ఓ మహాబాహో! రామా! "ఆత్మ జ్ఞాన స్వరూపము" అనే యుక్తి చేత చిత్తము అనే సంకెళ్ళను త్రెంచివేయి. చిత్తము అనే పంజరము నుండి ఆత్మ అనే సింహమును విడిపించు.

❖

శుద్ధమగు స్వాత్మస్థితిని వదలి విషయోన్ముఖుడవు నీవు ఎందుకు కావాలి? విషయముల పట్ల ధ్యాసచే విషయాకారుడవై బంధమును పొందుతున్నావు. ఇతఃపూర్వపు అనుభవము, దృశ్య సంస్కారముల కారణం గానే ఆత్మకు అన్యమైన 'చిత్తము – స్థూలము' అను రూపములు ప్రాప్తించటం జరుగుతోంది. మరల అభ్యసిస్తూ రాగా, "నిరంతరము మననము" మొదలగువాటిచే ఈ చిత్తము ఆత్మత్వము దృఢనిశ్చయంతో స్వీకరించటం జరిగితే, అప్పుడా చిత్తము 'శుద్ధాత్మ'తో స్వయముగా ఏకమగుచున్నది. అప్పుడు "ఇది ఆత్మ – ఇది చిత్తము" అని చెప్పటానికి కూడా "ద్వైతము" అనేది మిగలదు. "జగత్తంతా ఆత్మయే" అనే జ్ఞానం అంతఃకరణంలో వికసించిన తరువాత ఇక విషయ సహితమగు చేతనమెక్కడ? ఉపాధి సహితమగు చిత్త మెక్కడ? చేతనమగు మృతులెక్కడ? ....'కేవల పరమార్థ స్థితి' యందు వీటన్నిటికీ చోటే వుండదు.

చిత్తము అంటే అసలు ఏమిటి? - "ఈ దేహము – ఈ ఇంద్రియములు – వీటి వ్యవహారములు – ఇవే నా రూపము" అను పరిమిత దృష్టి – అనుభవస్థితియే 'చిత్తము' అను శబ్దముచే చెప్పబడుతోంది. అట్టి చిత్తమే, ఆద్యంతాలు లేనట్టి దుఃఖాలను విస్తరింపజేస్తోంది. "నేను ఈ భౌతిక శరీర పరిమితుడను" అన్న కీలక స్థితిని పరిశీలించి పరమార్థంగా చూచినప్పుడు "బ్రహ్మమునకు అన్యంగా 'జీవసత్త' అనబడేదే లేదు" అని తెలియవస్తోంది. కనుక "నేను బ్రహ్మమునే!" అనునట్టి అనుభవమును, అనుభూతిని పొందుటయే చిత్తము యొక్క ఉపశమనము సుమా! అదే పరమ సుఖము.

"ఈ చిత్తము కూడా జగత్తులోని భాగమే కదా! ఈ జగత్తంతా ఆత్మయే" అను నిశ్చయం చేత 'చిత్తము లేకపోవటం' అనేది సిద్ధించగలదు. దానినే చిత్తము యొక్క నాశనం, ఉపశమనం అని కూడా పిలుస్తున్నాం.

ఇట్టి సత్యజ్ఞానోదయమైనప్పుడు "స్వాత్మయే – అంటే నేనే ఈ జగత్తు" అను అనుభవస్థితి కలుగుతోంది. ఇకప్పుడు సూర్యోదయముచే చీకటి పటాపంచలైనట్లు, మనస్సు స్వయంగానే నశించి పోతోంది. మనస్సు అనే సర్పం శరీరంలో ఉండి యథేచ్ఛగా సంచరిస్తున్నంత వరకు భయము – ఉత్కర్షలు ఉండేతీరుతాయి. అట్టి సర్పమును "బ్రహ్మాత్మైక్య విజ్ఞానము" చేత, 'సమాధి' చేత పట్టి, ఆశ, తృష్ణ అనే కోరలు పీకి "సర్వసమత్వము" అనే బుట్టలో వేయాలి. ఇక దాని వల్ల భయముండదు.

చిత్తమే ఇష్టము. మనస్సే మననము. చిత్తములో నుండి పుట్టుకొస్తున్న భ్రాంతి అనే దయ్యమున "సమైక్యజ్ఞానము" అన్న మంత్రముచే బలాత్క్రమంగా వినాశనం చేయాలి. ఎందుకంటే, ఎంతో బలము గలది, మొండిది అయిన ఈ చిత్తపిశాచము అనేక జన్మలుగా శరీరంలో ప్రవేశించి

ఆక్రమించుకొని ఉంటోంది. "నేను – నీవు – తదితరులు – సర్వము... పరిశుద్ధమగు ఆత్మయే" అను ఉత్తమ భావనచే ఇక చిత్తపిశాచము ఈ దేహంలో నిలవలేదు. అప్పుడు ఉద్వేగము – వ్యధ తొలగుతాయి. భయములు – వేసటలు – భ్రమలు ఉండవు.

"ఆత్మ సర్వదా లభించియే ఉన్నది కదా! ఇక నాకు రాగమెందుకు? ద్వేషమెందుకు? కోర్కెలతో పనేమున్నది? ఇక నాకు బాహ్యమున గాని, అంతరంగమున గాని అపేక్షించవలసినదేదీ ఉండ జాలదు. ఏదీ నాకు సుఖముగాని, దుఃఖముగాని కాజాలదు" – అనే నిశ్చయముతో ఆత్మజ్ఞులు ఈ జగత్తులో వ్యవహరిస్తున్నారు. అందుచేత వారు చిత్తరహితులే అగుచున్నారు. అంతఃకరణములో ఎట్టి కోర్కెలు జేరకుండా, దుఃఖరహితమైన ఉత్తమపదమును సొంతం చేసుకుంటున్నారు.

❖❖❖

14. తృష్ణ

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! ఈ జీవుడు ఒకానొక అతిగట్టిదైన త్రాడుచే చేతులు కట్టబడి ఈ సృష్టిలోకి మరల మరల ఈడ్చుకురాబడుచున్నాడయ్యా! ఆ త్రాడు పేరే "తృష్ణ". ఇప్పుడు ఈ తృష్ణ గురించి కొన్ని విశేషాలు చెపుతాను. విను–

ఆత్మ ఒకానొకప్పుడు తన బ్రహ్మస్వభావమును ఏమరచి, చిత్తము అను దానిని ఆశ్రయిస్తోంది. అట్టి చిత్తము అపవిత్రమగు ఈ సంసారము అనబడు దానికి బీజమగుచున్నది. అట్టి చిత్తము జీవుని బంధించు జాలము వంటిది సుమా! అంటే ఏమిటి? ఆత్మ ఇంద్రియ వృత్తులకు సంబంధించిన అనుభవములను ఆశ్రయించినదై, చిత్తముచే కల్పించబడిన "ఈ దేహాదులే నేను" అను నిశ్చయమును పొందుతోంది. ఆ చిత్తము రాగ ద్వేషములు, వాసనలు ఏర్పడటానికి దోహదమగుచున్నది.

అంతకంతకు పెరిగిపోతున్న ఈ తృష్ణ మహామోహప్రదమగుచున్నది. మహాభయ దాయకమగు చున్నది. అది ఆత్మనే మూర్ఛిల్ల జేస్తోందే? అది ఉదయించినప్పుడల్లా అనంతాత్మ యందు జగత్తులు అను వికారములు ఏర్పడుచూనే ఉన్నాయి.

ఓ రఘురామా! 'ప్రళయాగ్ని' వేడిమినైనా సహించవచ్చునేమో గాని ఈ తృష్ణ యొక్క దాహకత్వం సహించటం బ్రహ్మ రుద్రాదులకు కూడా అంత తేలిక కాదు. ఆహా! అతి తీక్ష్ణమై కృష్ణవర్ణము (నలుపు)తో కూడినదై, అతి దీర్ఘమై, అనేక దుఃఖములే ప్రయోజనముగా కలిగినదై, శీతలము – భయంకరము కూడా అయినట్టి ఈ తృష్ణ అనే ఖడ్గము ఉపాధిపరంపరలను అత్యంత క్రూరంగా పరపర నఱకివేయుచున్నదే! "వారించుటకు అలవి కాదేమో" అని అనిపించే "న్యూనత, అవమానము, స్వల్పత్వము, అసూయ, దుఃఖము, జాడ్యము" ఇవన్నీ ఎక్కడి నుండి బయలుదేరుతున్నాయి? ఈ విషయం మేము బాగా పరిశోధించాం. "ఇవన్నీ ఈ జీవుని యొక్క 'ఇది–అది కావాలి' అను రూపం గల తృష్ణ నుండే బయలుదేరుచున్నాయి" అని మేము కనుగొన్నాం.

ఈ తృష్ణ అనే పెద్దపులి మనస్సు అనే బిలంలో ప్రవేశించి 'ఇంద్రియములు' అనే రక్తమాంసాలను

ఆకలిగా పీక్కుతింటున్నది. ఈ ప్రాణులను కొండరాళ్ళ మీదికి, ముళ్ళ పొదలలోకి ఈడ్చుకుపోయి ముక్కలు – ముక్కలుగా చేసి నములుచున్నది.

తృష్ణాపీడుతుడైన జీవుడు - అది ఎప్పుడు, ఎట్లా పుడుతోందో, ఏ రూపంగా మనస్సును ఆక్ర మిస్తోందో, ఈ జీవుడు గమనించలేకపోవుచున్నాడు. దాని చేత పీడించబడుచున్న ఈతడు అతి దీనమైన అంతః కరణం కలిగి ఉంటున్నాడు. శక్తిహీనుడై, విమోహితుడై ఆక్రందనములు చేస్తున్నాడు. ఒకదాని తరువాత మరొకటి చొప్పున అనేక విషయములు, వ్యవహారములచే పదే పదే ప్రతిహతుడగు చున్నాడు.

తృష్ణ అనే త్రాచుపాము ఎక్కడ ఉండదో, అక్కడ మాత్రమే ప్రాణవాయువులు స్వస్థత పొందు తాయి. అక్కడ అసంకల్పితంగా పుణ్యం వర్ధిల్లుతూ ఉంటుంది. కందిరీగల చేతను, తదితర కీటకముల చేతను స్పృశించబడని పూతీగ మరింత అందమైన పుష్పాలను ప్రసాదించగలదు కదా!

తృష్ణారహితుడు ప్రారంభించే ప్రతి కార్యక్రమము అద్భుతమైన ప్రయోజనం కలిగి ఉంటుంది. లోకమునకు అనిర్వచనీయమైన శుభమును, ఆహ్లాదమును చేకూర్చగలుగుతుంది. అతని ప్రతిపలుకు సుఖ శాంతిప్రదములు అవుతాయి.

"అసలు తృష్ణ నివసించే చోటెక్కడండీ?" అని ప్రశ్నిస్తే... "అది గూడు కట్టుకుని ఉండేది వివేక రహితుని హృదయంలోనే! అది అక్కడ అత్యంత వ్యాకులత్వంచే భ్రమరూపంగా ఉరకలు వేస్తోంది" అనునదే మా సమాధానం. అయ్యో! కాలికి కట్టిన యంత్రపు త్రాడుచే అంత పెద్ద పక్షి కూడా ఈడ్వబడుచున్నట్లు ఈ జీవులు అనేక బంధనములు, సంకుచిత స్వభావముల వైపు నెట్టుకుపో బడుచున్నారే! తృష్ణను ఆశ్రయించినందుకు ఫలితంగా చివరికి మిగిలేది క్షయము, చింత, శోకములు, కూలబడటములే అగుచున్నది. తృష్ణచే ఉద్భవించిన చింతలచే గొప్ప ప్రజ్ఞాపాటవములు కలవారు, అనేక విషయములు తెలిసివారు కూడా చివరికి విచ్ఛిన్నులై హతమొనర్పబడుచున్నారు కదా! దయాశూన్యము, కర్కశము అయిన వేట కత్తి యొక్క పదునైన అంచుచే సాధు జంతువులు ఖండిచ బడుచున్నట్లు "దయ, వివేకము, ఉత్తమ ఆశయము, భగవధ్యానము" మొదలైన సాధు గుణాలు తృష్ణచే తెగకొట్టబడుచున్నాయి. నూతిపై మొలచిన పచ్చటి తృణములను (గడ్డిపరకలను) భక్షించడానికి వెళ్ళి, లేడి నూతిలో పడిపోయినట్లు, ఈ తృష్ణను వెన్నంటి వెళ్తే మూఢుడు 'నరకం' అనే అంధకూపంలో పడిపోతున్నాడు. లోకంలో "ముసలితనం చాలా దుర్భరం. చివరకు కళ్ళు కూడా కనబడవు కదా!" అంటూ ఉంటారు. కాని అతి సూక్ష్మమైన ఈ తృష్ణా పిశాచం వార్ధక్యం కంటే కూడా అధికంగా ఈ జీవుని గ్రుడ్డివానిగా, దీనునిగా చేసివస్తోంది.

అమంగళకరమగు 'తృష్ణ' అనే పిశాచం హృదయంలో కిచిత్ ప్రవేశించుట చేతనే అంతటి తృష్ణచే బంధితుడైన ఆ సూర్యభగవానుడు కూడా ఒక గుంజకు త్రాటిచే కట్టబడినట్లు ఆకాశంలో అటూ ఇటూ త్రిప్పబడుచున్నాడు. అందుచేత ఓ రామా! ఈ ప్రాణి కోట్ల ప్రశాంతతను విచ్ఛిన్నం చేస్తూ దుఃఖమే ప్రయోజనంగా కలిగిన ఈ 'తృష్ణ' అనబడే భూతము నీచే అల్లంత దూరంలోనే త్యజించివేయబడు గాక!

తృష్ణచేతనే వాయువు వీచుచున్నది, పర్వతములు నిలబడుచున్నాయి, ఈ భూమి జీవరాసులను ధరిస్తోంది. ఈ మూడు లోకములు కూడా తృష్ణచేతనే ధరింపబడుచున్నాయి. ఒకడు ఒకచోట ఒక త్రాడు చేత కట్టబడితే, ఆ బంధం నుండి విడిపించుకోవటం తేలికే నేమో గాని, 'తృష్ణ' అనే బంధం నుండి మాత్రం ఈ జీవుడు అంత తేలికగా విడివడలేడు. అందుకు "మహా ప్రయత్నం" కావాలి. అందుచేత, రామా! నీవు "సంకల్పములను విడుచుట" అను ఉపాయంతో తృష్ణను పరిత్యజించు.

సంకల్పములే మనస్సు. మనస్సే తృష్ణకు ఉనికి స్థానం. అజ్ఞానముతో కూడి బలవత్తరమగు సంకల్పముల పరంపరయే తృష్ణ అయి ఉన్నది. మరొక రహస్యం. "ఈ దేహమే నేను" అనబడు దేహాభిమానమును ఈ జీవుడు ఎందుకో ఆశ్రయించుచున్నాడు. అజ్ఞానమయము, సర్వ దురాశలకు నిమిత్తము అయినట్టి అట్టి అభిమానమే తృష్ణకు నివాస స్థానం కల్పించుచున్నది. అనాత్మభూతములైన ఈ దేహము మొదలైనవాటి యందు ఆత్మాభిమానం త్యజించిన మరుక్షణం దుఃఖములన్నీ తమంతట తామే సమసిపోతాయి. అప్పుడు నీవు జ్ఞానిగా పరిగణింపదగిన వాడవౌతావు.

అందుచేత "నేను సర్వపదార్థములకు అతీతముగా నిత్యమై, సత్యమై, భవ్యుడనై ఉన్నాను" అను రూపము గల "అనహమ్" భావనచే ఈ తృష్ణ అనబడు దానిని కత్తిరించివేయి. ఈ జగత్తులో కనిపించే విభూతులన్ని తిరస్కరించి వేయి. ప్రపంచాతీతమగు 'పరబ్రహ్మము' నందే సుస్థిర చిత్తుడవు, స్వస్థుడవు కమ్ము.

❖❖❖

15. చికిత్స

శ్రీరాముడు : హే మహాత్మా! సద్గురూ! "ఈ తృష్ణ, అహంకారములను త్యజించండి" అని మీరు చెప్పిన వాక్యాలు అత్యంత ఆప్తవాక్యాలు గానూ, గంభీరంగానూ ఉన్నాయి. కాని, నాదొక సందేహం. 'అహంకారం'ను త్యజించ వలసివస్తే ఈ దేహమును కూడా పరిత్యజించ వలసివస్తుందేమో కదా! ఎందుకంటే, అహంకారమునకు ప్రాణమునకు ఒకానొక ఐక్యత ఉన్నది. మరి ఒక వైపు ప్రాణములను రక్షించుకుంటూ కూడా మరొక వైపు అహంకారమును వినాశనం చేయటం సంభవమేనంటారా? పెద్ద పాకను ఒక తాటి స్తంభము ధరించి ఉంటున్నట్లు అహంకారమే ఈ దేహమును ధరించుచున్నది. అట్టి అహంకారమే నశిస్తే, ఇక ఈ దేహమును ధరించే దెవరు? ఇది నేలకూలక తప్పదు. కాబట్టి హే మహావక్తా! నేను ఈ అహంకారమును ఎట్లా పరిత్యజించాలి చెప్పండి? ఈ "అహంకారము – ప్రాణము – శరీరము"ల సంబంధం విషయంలో నన్నేం చేయమంటారు?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ లోకంలో జనులు మూడు రీతులైన అహంకారమును కలిగి ఉంటున్నారు–

1. "ధ్యేయ-జ్ఞేయ" వాసనతో కూడిన అహంకారము (దేహాహంకారము) -

ధ్యేయము = ఇంద్రియములచే పొందబడవలసినవిగా భావించబడుచున్నవి.

జ్ఞేయము= ఇంద్రియములచే తెలుసుకొనవలసినవిగా భావించబడుచున్నవి.

ఇట్టి అహంకారము కలిగి ఉన్న జీవుల భావన లేక, అంతఃకరణము నందలి నిశ్చయము విను! దేహేంద్రియములు, అన్న పానాలు, తదితర బాహ్య పదార్థముల సంఘాతమే నేను. ఈ దేహం, ఈ అన్నపానాదులు నా జీవితము నిమిత్తమే ఉన్నాయి. ఇవి ఉన్నచోటే నేను ఉన్నాను. ఇవి లేనప్పుడు నేను కూడా లేను.... – ఇది 'పరిమితావగాహన', మరియు, 'ప్రధమాహాంకారము' అని కూడా శాస్త్రములు పిలుస్తున్నాయి.

2. 'ధ్యేయ వాసనాత్యాగము'తో కూడిన అహంకారము (చిద్రూపాహంకారము) - ఇట్టి త్యాగ మార్గమును అవలంబించిన జీవులు తత్త్వవిచారణను ఆశ్రయించుటచే ఈ దేహ – ఇంద్రియ సంఘాతమును, మనస్సును వేరు చేసి పరిశీలిస్తున్నారు. క్రమంగా, "ఈ మనస్సు, దేహం, ఇంద్రియాలు అసత్తే అయి ఉన్నాయి" అను నిశ్చయము దృఢపరుచుకొనుచున్నారు. అట్టి విచారణ–నిశ్చయముల యొక్క బలముచే "నేను 'సద్వస్తువు' అగు చిద్రూపాహంకారమును" అను రెండవ అహంకారమును హృదయములో ప్రవేశపెట్టుచున్నారు. "ఈ దృశ్యములో కనిపిస్తున్న, వినిపిస్తున్న ఏ ఒక్క వస్తువుతో కూడా నాకు సంబంధమే లేదు. అవి నా యందు లేవు. నేను వాటి యందు కూడా లేను" అను ఎఱుకను, బుద్ధిని, పరిపక్వపరుచుకొనుచున్నారు. ఆ అవగాహనను అంతర్లీనంగా కలిగి ఉంటూనే లీలామాత్రంగా ఆయా నియమితమైన క్రియలను నిర్వర్తించుచున్నారు. అట్టి ప్రశాంత బుద్ధితో కూడిన నిశ్చయము యొక్క ప్రభావంచే సర్వ బాహ్య విషయములపై ప్రియ – అప్రియములను తొలగించుకొనుచున్నారు. ఉపసంహరింప జేసుకొనుచున్నారు. లోకానుకూలంగా లోకోపకార దృష్టితో నిర్వికారంగా వర్తమానము నందు చేయవలసనవి మాత్రం నిర్వర్తిస్తున్నారు.

అతడు "ధ్యేయ త్యాగాహంకారి" అగుచున్నాడు. అట్టివాడు అట్టి ఉత్కృష్టతచే ముక్తుడే సుమా!

3. జ్ఞేయ వాసనాత్యాగముతో కూడిన అహంకారము - ఇట్టి అహంకారము ఆశ్రయించే మహనీయుడు "నాతో సహా ఈ జగత్తు అంతా బ్రహ్మమే కదా! ఇక వాసన లెవరికి? ఎందుకు? ఎక్కడ?" అను రూపము గల సాక్షాత్కారం పొందుచున్నాడు. వాసనలన్నింటిని క్షయింప జేసి, నిర్మాల్యుడగుచున్నాడు. అహంకారమునకు ఆవల సాక్షిస్వరూపమును అభ్యసించుచున్నాడు. సర్వ మానసిక వికల్పములను త్యజించివేస్తున్నాడు. "తను, తదితరులతో సహా సర్వము దివ్యము అగు ఆత్మ ప్రదర్శనా చమత్కారమే!" అను దృష్టిని, అవగాహనను పెంపొందించుకుంటున్నాడు.

అట్టివాడు సదా నిర్వికల్పుడగుచున్నాడు. సర్వదా దేహరాహిత్యాభిమాని అగుచున్నాడు. ఈ విధమైన వాసనాత్యాగముచే దృశ్య కల్పనంతా సమసిపోగా, ప్రశాంత స్థితిని పొంది 'ఎరుగుట' అను దానిని ఉపసంహరించి 'నిర్వికల్ప సమాధి'యందు ప్రవేశించుచున్నాడు. అతడు 'జ్ఞేయత్యాగి' అనుపేరుతో చెప్పబడుచున్నాడు.

❖

ధ్యేయ వాసనాత్యాగం అవలంబించి, లోకమునకు ఉచితమైన కార్యములను ఒనర్చు జీవన్ముక్తులైన వారిలో జనకమహారాజు వృత్తాంతం ఒక దృష్టాంతం. జ్ఞేయ వాసనాత్యాగం చేసి శాంతిని

పొందినట్టి విదేహముక్తులగు మహాత్ములు ఉన్నారు. అట్టివారు సర్వోత్తమమగు బ్రహ్మము నందే స్థితి కలిగియున్నారు. శుకమహర్షి అట్టివారే. ఓ రామచంద్రా! ఈ ధ్యేయ - జ్ఞేయ వాసనా త్యాగులిద్దరూ సమానులే సుమా! రెండు మార్గములు ముక్తిదాయకములే అవుతాయి. ఈ జీవునకు సంతాపము లేకుండా చేసి, క్రమముగా ఆత్మతత్వమును ప్రాప్తింపజేస్తాయి.

జ్ఞేయ వాసనాత్యాగి = సమాధి యందు అర్హుడైనవాడు

విదేహముక్తుడు = దేహరహితుడు.

ధ్యేయవాసనాత్యాగి = సమాధి నుంచి లేచి వ్యుత్థానకాలంలో వ్యవహరించే వాడు; జీవిస్తూ ఉంటూనే ముక్తత్వము కలిగి ఉన్నవాడు. దేహవాసహితుడు, దేహము ఉండి కూడా దేహవాసనలు లేనివాడు.

వీరిద్దరూ కూడా 'అవిద్య'ను అధిగమించుటచే కేవల బ్రహ్మ పదంలో సుస్థితులై ఉంటున్నారు. ఈ దేహ-విదేహముక్తుల గురించి (ధ్యేయ - జ్ఞేయవాసనా త్యాగుల గురించి) పదకొండు రోజులుగా కొన్ని విషయాలు చర్చించాం. ఇక ముందు కూడా మరికొన్ని విషయాలు చెప్పుకో బోతున్నాం.

❖❖❖

16. జీవన్ముక్తుడు

శ్రీరాముడు : హే మహర్షీ! మీరు తృష్ణ నుండి విడివడినట్టి జీవన్ముక్తుల గురించి, విదేహముక్తుల గురించి విశదీకరించటం జరిగింది. "ధ్యేయ వాసనాత్యాగి - జ్ఞేయ వాసనాత్యాగి" అనబడుచున్న వారిద్దరి గురించి మరి కొన్ని విశేషాలతో నిర్వచించి ముందుగా చెప్పమని నా ప్రార్థన. అటు తరువాత యదావిధిగా తదితర విషయాలు ప్రస్తావన కొనసాగించండి.

శ్రీ వసిష్ఠ మహర్షి : సరే! నీవు కోరిన విధంగానే జీవన్ముక్త - విదేహముక్తులను నిర్వచిస్తాను విను. వారు ఏ ఉపాయములచే తృష్ణ నుండి విడివడుచున్నారో నీవే గ్రహిస్తావు.

❖

ఎవడైతే కాలానుగతంగా నిరంతరం ఏర్పడుచుండుటే, స్వభావంగా కలిగి ఉండే ఆయా సుఖ దుఃఖాలను, హర్ష శోకాలను తన అంతరంగంలో పొందకుండానే ఉంటాడో అట్టివాడే 'జీవన్ముక్తుడు' అని పిలవబడుచున్నాడు. అతనికి ఇష్ట-అయిష్టములు గాని రాగ-ద్వేషములు గాని ఉండవు. ఇక, ఆయా ప్రాప్తించే వ్యవహారములను మాత్రం, సుషుప్తుని వలే మమకార - కర్తృత్వములు లేకుండానే నిర్వర్తిస్తూ వుంటాడు.

అతనికి "ఈ దేహమే నేను, దేహ సంబంధములైన ఈ ధన-గృహ-బంధుజనుల వ్యవహారం నాది" అనే అహం - మమత్వములు ఉండవు. హర్ష శోకములు గాని, కామ క్రోధములు గాని, దర్పము దీనత్వములు గాని అతని అంతరంగ ప్రజ్ఞను ఏమాత్రం స్పృశించవు. ఇక ఇక్కడ తారసబడే ఇంద్రియ విషయములను దూర ప్రదేశములోని ఎవరికో సంబంధించినవిగా చూస్తాడు. తన

అంతరంగంలో (నిదుర లేచి స్వప్నములను చూస్తున్నట్లు) ఆతడు 'ఆత్మజ్ఞానము' అను స్థానంలో నిదుర లేచి ఉంటాడు. ఈ సర్వమును 'ఆట, ఆటవిడుపు'ల వలె చూస్తూ ఉంటాడు. సర్వకళా పరిపూర్ణుడైన పూర్ణచంద్రుడు ఏ తీరుగా, తన ఉనికిచే తాను ఆహ్లాద భరితుడై, తదితరులను ఆహ్లాద పరుస్తూ ఉంటాడో, మన ఈ జీవన్ముక్తుడు కూడా స్వాభావికంగానే సంతోషము, ఉల్లాసములచే పరిసేవితుడై వ్యవహరిస్తూ ఉంటాడు. ఇక 'విదేహముక్తులు' విషయానికి వస్తే వారు ఇంద్రియ గోచరమైన ఈ దృశ్య ప్రపంచానికి సంబంధించినవారు కారు. వారి గురించి వచనముల చేత చెప్పటమంటే చిన్న పాత్రతో "పెద్దధాన్యపు గుట్ట"ను కొలవటం వంటిది. ఇప్పటికి మాత్రం ముక్తుని స్థితి గతులు ఏ తీరుగా ఉంటాయో మరి కొన్ని విశేషాలు చెపుతాను. విను–

విషయ రహితము (సర్వ ఆశలు అధిగమించినట్టిది) - ఒక్క వాక్యంలో చెప్పాలంటే 'ముక్తి' అనగా ఈ ఇంద్రియ విషయముల పట్ల సర్వ ఆశలు వర్జితమైనప్పటి 'ఇచ్ఛ'చే, ప్రవాహపతితంగా ప్రాప్తించిన కర్మలను ఆచరించుచుండటమే. ఎప్పుడైతే, ఈ జీవుని యొక్క బుద్ధి – దృశ్య విషయములో "ఇది సత్యమే" అను భావన, భోగముల పట్ల ఆశ కలిగియున్నదై; బాహ్య పదార్థము లందు స్థితి కలిగి ఉంటుందో – అదియే దృఢమగు సంసారబంధము!

జీవన్ముక్తులు తమ హృదయమును సంకల్పరహితం చేసుకుంటున్నారు. బాహ్యపదార్థము లందు లీలామాత్రంగా పాల్గొనుచున్నారు. వారు విషయ ఆశావర్జితమైన ఇచ్ఛచే ఆయా పరిస్థితులకు అనుకూలంగా ప్రశాంతమైన అంతరంగముతో వ్యవహరిస్తున్నారు.

బాహ్య పదార్థముల పట్ల గల ఆసక్తి చేత తృష్ణ వృద్ధి పొందినప్పుడు ఈ జీవుడు 'బద్ధుడు' అగుచున్నాడు. విషయములన్నిటి యందు వాసనారహితమైన చిత్తము కలిగి ఉన్నప్పుడు, ఈ జీవుడే 'ముక్తుడు' – ఈ ఇద్దరి మధ్యలో వ్యత్యాసం ఇంత మాత్రమే.

క్షోభరహితం - ముక్తుని యందు మనకు కనిపించే ఒక విశేషమేమంటే – విషయములు ప్రాప్తించటానికి ముందు గాని, ఆ విషయములు తొలగుచున్నప్పుడు గాని ఆతని యందు ఆ రాగ విరహాదులచే కలిగే దుఃఖం ఉండదు. ఎల్లప్పుడు ఆతడు వర్తమానకాలము నందు స్థిరమైన బుద్ధి కలిగి ఉండి, ఉచితానుచితములను అనుసరించి "ఇది నాకర్తవ్యమై ఉన్నది, అందుచేత చేస్తున్నాను" ...అని నిర్ణయించుకుని ఉంటాడు.

"ఈ వస్తువో, విషయమో నాకు ప్రాప్తించాలి" – అను ఇచ్ఛయే బంధం. అనగా, ఇంద్రియాలను స్వీకరించిన జీవుడు, ఇంద్రియ విషయాలకు దాసుడవటం జరుగుతోంది. ఈ పదార్థముల గతి, పరిణామములు ఎటిగావా... ఇక వాటి పట్ల తృష్ణ ఏర్పడదు. ఈ 'సత్–అసత్' రూపములైన పదార్థములచే ఆకర్షణ–వికర్షణలను చెందకుండా ఉండే పరమోదార చిత్తము గల మహాత్ముడు జీవన్ముక్తిని పొందినట్లే. అందుచేత ప్రియరాఘువా! నీవు బంధ–మోక్షములను, సుఖ–దుఃఖాలను, ఆశ–నిరాశలను, సత్–అసత్‌లను మొదలంట్ల త్యజించి ఉండు. ప్రశాంతమగు ఆకాశము వలె క్షోభరహితుడవై ఉండు. మహా సముద్రము వలె ప్రాప్తాప్రాప్తము లందు గాంభీర్యం వహించి

ఉండు. "జన్మ-మృత్యు రహితమగు ఆత్మ స్వరూపుడను" అని ఎఱిగి ఉండు. ఇక ఈ జనన-మరణ చింతలచే మనస్సును మరెన్నటికీ కళంకితం చేసుకోకు.

గొప్ప నిశ్చయం కలిగి ఉండటం - ఓ రామచంద్రా! వాస్తవానికి ఈ దృశ్యపదార్థము లేవీ నీవు కావు. నావి కావు. ఇవేవీ నీ యందు ఏక్షణమందు కూడా లేవు. నీవు కూడా వాటి యందు లేవు. ఈ దృశ్య పదార్థములన్నీ 'వాస్తవ పదార్థము' కంటే అన్యంగానే ఉంటున్నాయి. అతి తుచ్ఛమైన పర్యవసానము కలిగినవి అగుచున్నాయి. అయితే, నీవు మాత్రం వీటన్నిటికీ అన్యమైనట్టి నీ శుద్ధ స్వస్వరూపమును ఆశ్రయించి ఉండు.

ఈ ప్రపంచమంతా 'అసత్తే' అయినట్టి అజ్ఞానముచే ఆవిర్భవించి 'సత్-అసత్' రూపమున స్థితి కలిగి ఉంటోంది. ఇక నీవో... దీనికంతటికీ పరమై వెలయుచున్నావు. అట్టి సర్వమునకు అతీతమగు చైతన్యమూర్తివగు నీవు పదార్థముల పట్ల 'తృష్ణ' కలిగి ఉండటమేమిటి? ఎంత అసమంజస మైన విషయమది! అదిఎట్లా సంభవమో చెప్పు?

ఒక్కసారి ఈ 'దేహము - దృశ్యము'లను కాస్త పరిశీలించి చూచినప్పుడు నాలుగు విధములైన నిశ్చయములు కలుగుచున్నాయి-

1.దేహాత్మ భావన - తల్లి తండ్రులచే నిర్మించబడినట్టి "కాళ్ళు, చేతులు, పొట్ట, తల"గల ఈ దేహమే నేను" అనే భావన. ఇది అజ్ఞాన దృష్టి చేతనే కలుగుచున్నది. నిశ్చయంగా ఇది మహాబంధముగా పరిణమించబోవుచున్నది.

2 శుద్ధ చైతన్యభావన - ఈ దేహేంద్రియము లకన్నిటి కంటే వేఱైనట్టి, అత్యంత సూక్ష్మమైనట్టి శుద్ధ చైతన్యమునే 'నేను - అను నిశ్చయం. ఇది మోక్షమునకు దారి తీస్తోంది.

3. "సర్వాత్మాహమ్" భావన - ఈ జగత్తునందలి సర్వజీవుల యొక్క ఆత్మస్వరూపమును నేను! నేను అక్షయడను - అను నిశ్చయము. ఇది కూడా మోక్షదాయకం అగుచున్నది.

4. "జగదహమ్" భావన - ఆకాశము వలె శూన్యమే అయినట్టి ఈ ఆధ్యాత్మిక, ఆధి దైవిక, ఆధి భౌతికాత్మకమైన ఈ జగత్తంతా 'నేను' - అను అవగాహన. ఇది కూడా మోక్షమునకు దారి తీస్తోంది.

ఈ నాలుగింటిలో మొట్టమొదటిది మలిన వాసనలచే ఏర్పడుతోంది. బంధమగుచున్నది. తక్కిన మూడు శుద్ధ సాత్త్విక వాసనల ప్రయోజనంగా లభిస్తోంది. కనుక, సత్వరం అనుసరణీయమగు చున్నాయి. "ఈ జగత్తంతా ఆత్మస్వరూపుడనగు నేను అయి ఉన్నాను" - అను నిశ్చయం అవలంబించి ఉన్న తరువాత, ఇక అట్టివాని చిత్తము ఖేదము ఎట్లా పొందుతుంది? వాస్తవానికి అంతా కూడా ఆత్మ యొక్క మహిమచే వ్యాపించి ఉంటోంది. అందుచేత 'సర్వము ఆత్మయే' అనే నిర్ణయం చేసుకొన్న జీవుడు ఇక బంధంలో తగుల్కోడు.

అవగాహన - సర్వమునకు అధిష్ఠానమైఉన్నట్టి ఆత్మ వివిధమైన వాదములచే వివిధమైన పేర్లతో పిలువబడుతోంది. "శూన్యం, బ్రహ్మం, పురుషుడు, ప్రకృతి, విజ్ఞానము, ఈశానుడు, మాయ, శివము" అను పేర్లన్నీ ఆత్మకు చెందినవే.

వాస్తవానికి ఈ జగత్తంతా సదా సన్మాత్ర స్వరూపం అయి ఉన్నది. ఇందులో ద్వైతము గాని, భిన్నత్వం గాని ఎచ్చటా ఏ మాత్రం లేవు. పరమార్థ సత్య జ్ఞానం చేత ఈ ప్రపంచమంతా వ్యాపించ బడి ఉన్నది. అయితే భ్రాంతి గల బుద్ధికి అసత్యమైనదంతా సత్యము వలె గోచరించటం జరుగుతోంది. అనంతమైన ఆకృతి గల సముద్రమంతా జలము చేతనే పూర్ణమై ఉన్నది కదా! బ్రహ్మ నుండి ఒక స్థంభం వరకు ఈ జగత్తంతా ఆత్మ చేతనే పరిపూర్ణమై ఉన్నది. అందుచేత ప్రమాణములచే అసలు విషయం గ్రహించబడినప్పుడు "బ్రహ్మమొక్కటే సత్యము" అను వాక్యముచే సమీక్షించ బడుతోంది. సముద్ర జలము కంటే తరంగాలు వేరా? మట్టి కంటే మట్టిబొమ్మ వేరా? శిల కంటే శిల్పం వేరా? కాదు. బ్రహ్మము కంటే భిన్నంగా 'జగత్తు' అనబడునది ఏ నాడూ, ఏ క్షణం నందు వేరు కాదు.

ద్వైతాద్వైత తత్పరం - 'జీవుడు' అని మనం పిలుస్తున్నది 'స్వసత్త'నే. ఆ బ్రహ్మసత్తయే "అద్వైత – పరమాత్మమయ శక్తి" అని కూడా గ్రహించు. అట్టి బ్రహ్మసత్త 'జగత్ రచన' అనే లీలచే ఈ జగత్తుగా విజృంభిస్తోంది. ద్వైతరూపం గాను, అద్వైతరూపం గాను, ఇంకా ఏవేవో భేదములచే కనబడే ఈ జగత్తంతా బ్రహ్మమే. ఆ బ్రహ్మమే "నా వారు, నీ వారు, భార్య, భర్త, సోదరులు" – మొదలైన అనేకానైకమైన భావానుగతములైన రూపములతో కూడి కనిపిస్తోంది. అజ్ఞానము చేత రచించబడుచున్న ఇట్టి జగత్తు వృద్ధి చెందితే ఏమున్నది? నశిస్తే ఏమున్నది? నీ స్వరూపము జ్ఞానమే అయి ఉండగా నీవు ఈ అనేక నామరూపముల పట్ల సుఖ దుఃఖములు పొందవలసిన పనేముంటుంది? అందుచేత, నీవు ఆయా క్రియలందు వ్యవహరిస్తున్నప్పుడు కూడా, అద్వైతమును ఆశ్రయించియే ఉండు. అద్వైత సత్తామయుడవై ఉండు. ఆయా కర్మలను ఆచరిస్తున్న క్షణాలలో మాత్రం ద్వైతమును ఆశ్రయించిన వాని వలె వ్యవహరించు. ఈ విధంగా ద్వైతాద్వైతముల రెండిటి యందు తత్పరుడవై ఉండు. అంతేగాని అనేక అశుభనిమిత్తములచే నిండి ఉన్న ఈ భయంకర సంసారభూములందు అజ్ఞానముచే ద్వైత వ్యవహారములను నమ్ముకొని, అందు తన్మయుడవై వెఱ్ఱిగా, మొండిగా కూలిపోవద్దు. నీ అద్వైత–నిత్యానంద–అఖండత్వమును ఏమరువవద్దు.

"ఈ జగత్తు బ్రహ్మమే" అను ఎఱుక మరియు జ్ఞప్తి పరమార్థంగా పరిశీలిస్తే ఈ 'ద్వైతము' అనునది సంభవమే కాదు. ఈ దృశ్య వ్యవహారమంతా కల్పన చేస్తున్నది చిత్తమే కదా! అట్టి కల్పన వాస్తవ మెట్లా అవుతుంది?

శ్రీరాముడు : అయితే ఈ జగత్తు ద్వైతమా? అద్వైతమా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఈ ప్రపంచమున ద్వైతమూ లేదు. ఏకమూ లేదు. సంఖ్యా సహితమైన దానిలో మాత్రమే "ద్వైతము, అద్వైతము" – అనబడేవి సంభవించవచ్చునేమో! మహాత్ములు ఈ జగత్తును సంఖ్యా రహితమైనదానికిగా గాంచుచున్నారు. సత్ నుండి భావనా రూపంగా ఉదయించటం చేత, ఇది 'సన్మాత్రమే' లేక 'బ్రహ్మమే' అయి ఉన్నది.

యదార్థానికి దేహముల సంఘాతరూపములై కనిపించుచ్చు ఈ "నేను – నీవు" అనునవి గాని, ఈ జగత్తు అనబడునదిగాని లేనేలేవు.

'నేను' అనునది బ్రహ్మమే. బ్రహ్మము జన్మరహితమైనది. కనుక 'నేను' అనబడేది కూడా జన్మరహితమైనదే!

'నేను – నీవు – ఈ జగత్తు' అనునవన్నీ బ్రహ్మమే అయి ఉన్నాయని అనుకున్నాం కదా! బ్రహ్మము సర్వోత్తమమైయున్నది. అది అనాది. ప్రకాశములన్నిటికీ ప్రకాశము. దానిని విశద పరచటానికే వేరు వేరు శాస్త్రములు అనేక ప్రమాణాలను ఉపయోగిస్తున్నాయి. ఆ బ్రహ్మమునకు 'జన్మించుట' మొదలైన వికారములు లేవు. అది సర్వ చింతనల కంటే అతీతమైనది. నిర్వికారమైనది. దాని యందు ఇంద్రియ సమూహమంతా లేదు.

ప్రాణశక్తి అంతటికీ ఆధారం కూడా బ్రహ్మమే. అది సర్వ కల్పనా రహితమై సర్వకారణములకు కారణమై, నిత్యోదితమైన స్వరూపమై, సర్వవ్యాపకమై యున్నది. ఈ కళ్ళు మొదలైన సర్వ ఇంద్రియము లలో చిత్ప్రకాశమై ఉన్నది అదే! మనం ఎన్ని వాక్యాలు ఉపయోగించినప్పటికీ దానిని విశదీకరించ లేమనే చెప్పక తప్పదు. ఎందుకంటే, అది అనుభవమాత్రమే కదా! ఈ చర్చలన్నీ చేసిన తరువాత చివరికి అది లభిస్తున్నది స్వస్వరూపము నందే. స్వస్వరూపముగానే !

ఓ రామచంద్రా! మరల ఎలుగెత్తి ప్రకటిస్తున్నాను. విను ఈ జగత్తు, ఇందులో తారసపడుచున్న నేను – నీవు – వాడు – వీడు మొదలైనవన్నీ... ఆ ఆనందైక బ్రహ్మమే అయి ఉన్నాయి. ఉన్న నిజం అదే. అందుచేత 'ఇదంతా బ్రహ్మమే' అనే నిశ్చయం నీవు నిరభ్యంతరంగా కలిగియుండు.

శాంతి ప్రవచనములతో ఆ నాటి సభ చాలించబడింది.

❖❖❖

(పదకొండవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

పన్నెండవ రోజు

III. పుణ్యుడు - పావనుడు సంవాదం

1. మహాత్ముల అవగాహన-సంచారం-స్వభావం

శ్రీరాముడు : హే మహాత్మా! తమరు నిన్నటి రోజున 'ముక్తులు – వారి లక్షణములు' విషయమై అనేక విశేషాలు చెప్పారు. జీవన్ముక్తులైన మహాత్ములు ఈ జగత్తులో తదితర జీవులు లాగానే ఆయా 'ఉపాధి, స్థితిగతి, జీవన వ్యాపారము' మొదలైనవి కలిగి చరిస్తున్నారని అన్నారు కదా! అట్టివారి అవగాహన, సంచారం, స్వభావం ఏ రీతిగా ఉంటాయో మరికొంత వినాలని ఉన్నది.

శ్రీ వసిష్ఠ మహర్షి : ఔను ! జీవన్ముక్తులైన మహానుభావులు అనేకులు సమాహితమైన చిత్తంతో, కామము, లోభము, మోహము మొదలైన దుర్గుణములను అధిగమించినవారై ఈ ప్రపంచంలో లీలామాత్రంగా పాల్గొనుచున్నారు. వారి గురించి సవివరమైన వ్యాఖ్యానం మరల మరల చేయటం అవసరమే. కనుక చెపుతాను విను.

❖

జీవన్ముక్తుడు ఈ ప్రపంచమునందు సంచరిస్తున్నప్పటికీ, ఆతడు మొదట్లో , మధ్యలో, చివర కూడా రసహీనమే అయినట్టి ఈ సంసారము యొక్క గతులను చూస్తున్నప్పుడు దుఃఖించడు. హసించడు. ప్రాప్తించిన కార్యములను మాత్రం ప్రియాప్రియాతీతుడై చేస్తూ ఉంటాడు. శత్రుమిత్రులందు సమదృష్టి కలిగి ఉంటాడు. ధ్యేయవాసనలను (Outgoing tendency of the senses) త్యజించివేసి ఉంటాడు. అతని దృష్టిలో "అది పొందలేదు ... కనుక పొందాలి; ఇది ఇట్లు కాదు...వీరు హితులు... వారు అహితులు" అనునవన్నీ సారహీనమైన పిల్లల ప్రేలాపనలు మాత్రమే. ఆతడు ఉద్వేగరహితుడై, సజ్జనులకు హితకరుడై ఉంటాడు. ఆతని అంతఃకరణము సర్వదా 'వివేకము' అనే వెలుగుచే ప్రకాశిస్తూ ఉంటుంది. 'జ్ఞానము' అనే ఉపవనంలో ప్రవేశించి, ఎప్పుడూ వాహ్యాళి సలుపుతూ ఉంటాడు. సర్వమునకు అతీతమైయున్న 'బ్రహ్మపదము'ను ఆశ్రయించినవాడై, పూర్ణ చంద్రుని లాగా శీతలాంతఃకరణానుభవం పొందుతూ ఉంటాడు. ఆ మహాత్మునికి ఇక్కడ మిక్కిలి అప్రసన్నత్వమునూ – మిగుల సంతుష్టుడుగనూ చేయగల్గునదేదీ ఉండదు..

ఇక, ఈ ఇంద్రియములను ఆకర్షిస్తున్న విషయములు తటస్థపడినప్పుడు వాటితో శత్రువుల మధ్య ఉన్నట్లే ఉంటాడు. అయితే తన దయ, దాక్షిణ్య భావములను మాత్రం వీడడు. గురుసేవ, సంఘసేవ వంటి సమయోచితములైన కార్యములను లోకానుకూలంగా నిర్వర్తిస్తూ ఉంటాడు. అట్టి పుణ్యాత్మునకు ఇక దుఃఖముల ఊసెక్కడ?

ఆతడు "దీనిని నేను కోరుకొన్నాను... పొందాను" అనే ఇష్టము దరిజేయనీయడు. "అయ్యో! ఇది ఇప్పుడు ఎందుకు పొందాను?" అనే అయిష్టము కలిగి యుండడు. సర్వమును మొదలంట సన్న్యసించియే ఉంటాడు.

నాభినన్దతినద్వేష్టి న శోచతినాకాఙ్క్షతి ।
మౌనస్థః ప్రకృతారంభీ సంసారేనావసీదతి ॥ (శ్లో 7, సర్గ 18)

దేనినీ వాఛించడు, ద్వేషించడు. కనుక ఆతనికి అసంతృప్తి ఉండదు. దుఃఖించవలసిన పని ఉండదు. 'మితభాషి' అయి, ప్రాప్తించిన కార్యక్రమాలందు ఆసక్తిరహితంగా ప్రతిస్పందిస్తూ ఉంటాడు. అడిగితే ఉపయోగకరమైన వాక్యములనే పలుకుతాడు. అడగకపోతే, ఒక రాయిలాగా మెదలకుండా ఉంటాడు. సర్వుల పట్ల ప్రియమును వహించి ఉంటాడు. అయినా కూడా, ఎవ్వరి పట్ల ఉద్రేక పూరితములైన ప్రేమద్వేషములు కలిగి ఉండడు. మృదుభాషి అయి, ప్రాణికోట్ల హృదయమును ఎఱిగినవాడై ఉంటాడు. తదితరులనందరిని తనకంటే వేఱుకానివారిగా దర్శిస్తూ ఉంటాడు. అనేక యుక్తాయుక్తమైన విషయములతోను, దృష్టులతోను ఆశలతోను, క్రియలతోను కూడియున్న ఈ లోక వృత్తాంతమంతా అరచేతిలో ఉసిరిగపండు వలె సుస్పష్టం గాను, పక్షపాతరహితం గాను చూస్తూ ఉంటాడు.

ముక్తిపదమును అలంకరించిన మహాత్ములు తమ అంతరమున శీతల బుద్ధికలిగి ఉన్నవారై నాశవంతమగు ఈ జగత్తు యొక్క గతినంతటినీ చూచి, నవ్వుకుంటూ ఉంటారు.

చూచావా రామా! ఎవ్వరైతే తమ చిత్తమును జయించి వేస్తారో, ఈ ఇహ పరములు రెండిటినీ ఎఱిగి ఉంటారో అట్టి మహాత్ముల స్వభావమేమిటో నీకు తెలియజేశాను.

మూర్ఖత్వము - ఇక మరి కొందరు తమ చిత్తమును జయించకుండా, విషయ భోగములు అనే బురదలో ఇరుకుకొని ఉంటున్నారు. మూర్ఖత్వము వహించి ఉంటున్నారు. అట్టివారి గురించి కూడా, ఒకటి రెండు విషయాలు ఇక్కడ ప్రస్తావిస్తాను. విను-

అట్టివారికి అగ్నిజ్వాలల వంటి నారీసమూహమే గొప్ప విషయంగా తోచుచున్నది. ధనము, గృహము మొదలైన వాటి పట్ల గల అభిలాషచే కలహము, క్లేశము, దుఃఖము, దురవగాహన మొదలైన ఆపదలనన్నిటినీ తెచ్చిపెట్టు కుంటున్నారు. అట్టి వారు యజ్ఞము, యాగము వంటి ఆయా కర్మలను ఫలాపేక్షతో చేస్తున్నారు... ఫలితమేమిటి? నిరంతరంగా అనేక సుఖదుఃఖ దశలకు లోను కావటమే అగుచున్నది.

ఇప్పుడు చేయవలసిన దేమిటి? - ఓ ప్రియరామచంద్రా! నీవు 'ధ్యేయవాసన' తొలగించబడగా, అప్పటి పూర్ణదృష్టినే అవలంబించాలి సుమా! 'జీవన్ముక్తత'ను ఆశ్రయించు. స్వస్థచిత్తుడవై ఈ లోకమునందు హాయిగా విహరించు.

అంతరంగమున సమస్త ఆశలు త్యజించివేయి. రాగములు, వాసనలు లేనివాడవై ఉండు. బాహ్యమునమాత్రం వర్ణాశ్రమ ధర్మములను నెరవేర్చుచు, ఈ లోకమున వ్యవహరిస్తూ ఉండు.

చక్కగా, ఉత్తమ ఆచారసంపన్నుడవై ఉంటూనే, అంతరమున క్రియారహితుడవై ఉండు. ఈ సాంసారికమైన, పారమార్థికమైన దశల నన్నిటినీ చక్కగా విచారణ చేయి. మహత్తరమగు 'బ్రహ్మపదము'ను భావన చేస్తూ యథాతథంగా ఉండు.

అంతరంగమున ఆశావర్జితుడవై, బాహ్యానికి శుభాశుభయుక్తుడవై క్రియలను ఆచరిస్తూ ఉండు. ఈ ధన బంధు జనాదులన్నీ తొలగుచున్నప్పుడు లోకమర్యాద కొరకు ప్రతిస్పందిస్తున్నప్పటికీ, అంతరమున మాత్రం ప్రశాంత స్థితిని విడువవద్దు, .. విడువవలసిన పనిలేదు. గాలికి కొండపైగల చెట్లు కదలుతాయేమోగాని, కొండ కదలుచున్నదా?

బయటకు అవసరమైన చోట కోపం చూపిస్తూన్నప్పటికీ, అంతరమున మాత్రం కోపమనునదేదీ లేనివాడవై ఉండు. బాహ్యానికి సర్వకార్యములు నిర్వర్తిస్తూ, అంతఃకరణమునందు మాత్రం సర్వమునకు అకర్తవై, క్రియారహితుడవై ఈ లోకమున మెలగుచూ ఉండు.

❖

ఓ రఘురామా! ఈ కనబడే సర్వపదార్థముల సారాసారమేమిటో నీకు తెలుసు. ఈ మన సంవాద ప్రారంభంలో నీవు సుస్పష్టంగా ప్రకటించావు. కాబట్టి, ఏది ఎట్లు 'ధర్మనిరతి'చే ఉచితమో, అది అట్లే నిర్వర్తించు. అయితే ఈ క్రింది విషయం గుర్తుంచుకో.

కృత్రిమోల్లాస హర్షస్థ, కృత్రిమోద్వేగ గర్హణః ।
కృత్రిమారంభ సంరంభో, లోకే విహర, రాఘవ ॥

ఓ రాఘవా! కృత్రిమమైన ఉత్సాహం, కృత్రిమమైన హర్షం, కృత్రిమమైన ఉద్వేగం, కృత్రిమ నింద, కృత్రిమమైన కార్యారంభం, కృత్రిమ క్రోధం కలిగి ఈ లోకంలో విహరించు. అయితే, అహంకారాన్ని పారద్రోలివేసి స్వస్థ చిత్తుడవై సర్వదా ఆకాశం వలె శోభిస్తూ ఉండు. కళంకరహితుడవై, మేఘరహిత వినీలాకాశంలాగా విస్తరించియుండు. ఇక్కడ రూపం పొందే రకరకాల ఆశాపాశముల నుండి విముక్తుడవై, సర్వవృత్తులందు అతీతత్వము, మహామహిమత్వము వహించి యుండు. పైకి మాత్రం ఈ రీతిగానే ఈ వర్ణాశ్రమ స్వభావ యోగ్యములైన, లేక, ప్రజాహితములైన కార్యములను చేస్తూ ఆనందమయంగా ఈ లోకమున విహరించు.

❖

నబంధోస్తినమోక్షోస్తి దేహినఃపరమార్థతః ।
మిథ్యేయమింద్రజాలశ్రీః సంసారపరివర్తినీ ॥ (శ్లో 27, సర్గ 18)

ఓ రామచంద్రా! యథార్థానికి బంధం గాని, మోక్షం గాని లేనే లేవు. ఈ కనబడేదంతా 'మిథ్యయే' అయినట్టి ఇంద్రజాల వైభవం మాత్రమే. ఇంద్రజాలమే ఈ సంసార చక్రము నంతటినీ త్రిప్పుతోంది. ఈ ప్రపంచమంతా భ్రాంతిమాత్రమే. ఇది అజ్ఞానం చేతనే ఏర్పడటం, కనబడటం జరుగుతోంది. బాగా దాహంతో ఉన్నవాడికి మృగతృష్ణలో తియ్యటి నీళ్ళు కనిపిస్తాయి చూచావా? అజ్ఞానంతో కూడిన ఆర్తి కలవాడు జగత్తు పట్ల "ఇదంతా నిజమే" అను బుద్ధిని కల్పించుకొనుచున్నాడు.

నాయనా! నీవు ఆత్మస్వరూపుడవేకదా! అసంగము, ఏకరూపము, సర్వవ్యాపకము అయినట్టి ఆత్మకు అస్సలు బంధమెట్లా కలుగుతుందో చెప్పు? బంధమే లేకపోతే, ఇక మోక్షమెక్కడిది? ఎవరికి? ఈ బంధ, మోక్ష, ఆర్తులు సాక్షాత్‌జ్ఞానము లేనంత వరకే ఏర్పడుచున్నాయి.

❖

తత్త్వ జ్ఞానం యొక్క అభావం చేతనే ఈ విశాల సంసార భ్రాంతి ఉత్పన్నమవుతోంది. ఒకడు త్రాడును చూచి, 'పాము' అని భయపడ్డాడనుకో, ఆ భయం పోయేది ఎట్లా? 'అది త్రాడు మాత్రమే' అని ఎరుగుట చేతనే కదా! తత్త్వ జ్ఞానం చేత మాత్రమే ఈ సంసారభ్రాంతి ఉపశమనం పొందుతోంది.

రాఘవా! నీవు ఇప్పటికే నీ సూక్ష్మబుద్ధిచేత ఆత్మతత్త్వమును గ్రహించావు. అహంకారరహితుడ వయ్యావు. ఇక, ఆకాశము వలె నిర్మలుడవై చెన్నొందుము. సర్వదా సర్వమునకు కేవల సాక్షిరూపుడవై ఉండుము. బంధుమిత్రుల గురించిన సర్వవాసనలనూ నిశ్చింతగా త్యజించివేయి. ఎందుకంటావా? అసత్ స్వభావులైన బంధుమిత్రాదుల గురించి చింత వ్యర్థమే అవుతుంది 'సత్' స్వభావుడవు అగు నీవు అసత్తుకంటే, అవిద్యకంటే, వాటి సర్వ కార్యముల కంటే విలక్షణమైనవాడవు సుమా!

అవిద్యాకారణం చేత నిన్ను సమీపిస్తున్న "నేను బంధము కలవాడను .. బద్ధుడను" అనునట్టి వాసనలను క్రమక్రమంగా త్యజించివేయి. ఈ భోగములతోను, భోగసాధకులైనట్టి బంధుమిత్రాదుల తోను, ఈ కనబడే జగత్ పదార్థములతోను, శుభాశుభకర్మలతోను ఆత్మకు ఏమాత్రం సంబంధం లేదు. నీవు ఆత్మవే అయి ఉన్నావు. ఇక దేనికోసం ఎందుకు పరితపించాలి?

ఆత్మతత్త్వమొక్కటే సారమైనది. 'అట్టిసార వస్తువునే నేను" అను దృఢ బుద్ధి కలిగిన తరువాత నీకిక భయమెందుకుంటుంది? జగద్భ్రమలచే నీవు భీతి ఎందుకు చెందాలో చెప్పు? చైతన్యదృష్టితో పరిశీలించి చూస్తే ఈ బంధు జనులు అసలు ఉత్పన్నమే అయి ఉండలేదు. ఇక సుఖ దుఃఖము లేమిటి? పరితాపమెందుకు?

❖

ఒకవేళ – "ఆత్మ నిత్యమే అయి ఉండవచ్చు గాక! కాని, సంగము పొందుతోంది. తద్వారా దుఃఖం పొందుచున్నది కదా!" అని అంటావేమో? ఇక్కడ ఒక్క విషయం నీవు ముఖ్యంగా గమనించు.

నీవు ఇతఃపూర్వం ఉండియే ఉన్నావు. భావికాలంలో కూడా ఉండబోవుచున్నావు. ...సరే, ఇప్పుడు ఉండనే ఉన్నావు. నీ బంధువులు కూడా అంతే కదా!... అట్టి నిత్య స్వభావముగల ఆత్మను ఎఱిగిన తరువాత ఇక సుఖదుఃఖ, "న్యూన – అధిక" భావములకు చోటెక్కడిది?

మరొక విషయం - ఇప్పుడు ఈ వర్తమానకాలంలో నీకు సమీపంగా కనిపించే బంధువులను ప్రాణసమానంగా భావించి, వారి కొరకు దుఃఖిస్తున్నావు, బాగానే ఉన్నది! మరి, నీ గడచిపోయిన జన్మల మాటేమిటి? ఆయా జన్మలకు సంబంధించిన బంధువుల గురించి కూడా దుఃఖిస్తూ కూర్చుంటున్నావా? ఇప్పటి ఈ బంధువులు కూడా భవిష్యత్తులో అట్టివారేకదా! కాబట్టి అట్టివారి కొరకు పరితాపం పొందటం ఉచితమెట్లా అవుతుంది?

❖

ఇక మనం ఈ జీవుల యొక్క ఒకరితో మరొకరికి ఏర్పడుచున్న మనస్సు యొక్క సంబంధములను చూస్తామనుకో... మనోదృష్టితో చూస్తే నీవు, నీ బంధువులు పూర్వం వేఱువేఱుగా ఉన్నారు. ఇప్పుడో? ఇప్పుడు కూడా వేఱువేఱుగానే ఉన్నారు. ఇకపై కూడా ఆ విధంగానే ఉంటారు. ఈ మార్గంగా అంతా పరిశీలిస్తే ఈ 'బంధుత్వం' అనబడేది స్వల్పకాలికమని, మొదలే భ్రమ అని తెలియ వచ్చుచున్నది. అట్టి వీరల గురించి సత్యమని నమ్మి ఎందుకు శోకించాలి?

పోనీ, ఈ భౌతిక శరీరం దృష్ట్యా చూద్దామా? పూర్వం ఉన్నవారు ఇప్పుడు లేరు. ఇప్పుడున్నవారు ముందు ముందు ఉండబోరు. అసలు, సంసారమే నీపట్ల క్షీణించుచుండగా, మధ్యలో ఈ బాంధవ్యాల గురించి దుఃఖించటమేమిటి? ఈ విధంగా "ఆత్మ సంగము ఏర్పరుచుకుంటోంది" – అని అనుకు న్నప్పుడు కూడా నీవు ఎవరి గురించీ శోకించవలసిన పనిలేదు. ఇక అసంగమగు 'కూటస్థ ఆత్మ' గురించి గ్రహించావా... ఇక నీకు "దుఃఖించవలసిన పనిలేదు" – అని వేరే చెప్పనే అక్కర్లేదు.

❖

కాబట్టి ఈ మాయామయ జగత్తు విషయంలో అసలు శోకించటం ఏమాత్రమూ యుక్తం కాదు. 'సహజ సంతోష వృత్తి'ని అవలంబించటమే ఉచితం. ఏది చేయవలసి వచ్చుచున్నప్పటికీ, అవన్నీ నిర్లిప్తంగా నిర్వర్తించు. కాని, సహజంగానే ఆనంద స్వరూపుడవగు నీవు ఎల్లప్పుడూ సహజ సంతోషవృత్తిని అలవాటుచేసుకో.

మాగచ్ఛదుఃఖితాయుక్తా ప్రాకృతేజాగతేక్రమే ।
తథైవముదితాయుక్తా యుక్తంకార్యానువర్తనమ్ ॥ (శ్లో 42, సర్గ 18)

ఈ ప్రాపంచక పదార్థములచే నీవు సుఖదుఃఖములకు లోను కావలసిన పనేమీ లేదు. సర్వత్రా సమరూపము అభ్యసించుటచే మహనీయులు ఈ సుఖదుఃఖాలను అధిగమించివేస్తున్నారు. పరమాత్మ సర్వవ్యాపి, సమరూపుడు కదా! నీయందు కూడా ఆతడే సమరూపుడై వ్యాపించి ఉన్నాడని గ్రహించు.

ఓ రామచంద్రా! నీవు అనంతుడవు. 'సత్' స్వరూపుడవు. ఆకాశము వలె సర్వ వ్యాపకుడవు. సర్వత్రా ప్రకాశమయమైన జ్యోతిస్వరూపుడవై వెలుగుచుండగా ఇక, అంధకారమునకు చోటెక్కడిది? శుద్ధ స్వరూపుడవగు నీయందు సుఖదుఃఖాదులు బంధుత్వ, అబంధుత్వాదులు ఉండటమేమిటి? నీవే సర్వహృదయము లందు ఉన్నవాడవై ఒక పూలదండలోని ధారంలాగా సూక్ష్మరూపమున అంతటా వ్యాపించి ఉన్నావు. అయితే, అతిసూక్ష్మమగు నీ రూపము ఈ సర్వ జగత్పదార్థము లందు వ్యాపించి ఉన్నప్పటికీ, అది స్థూలదృష్టికి మాత్రం గోచరించుటలేదు.

❖

అజ్ఞానియే మరల మరల జన్మలను పొందుచున్నాడు. జ్ఞాని, వీటిని వేటినీ పొందుటయే లేదు. జ్ఞాని ఈ శరీరాదులచే జన్మించడు. ఇవి నశించినప్పుడు తాను నశించడు. ఆతడు ఈ ప్రపంచ స్థితిని చూచి మోహించడు. జ్ఞానబలముచే సర్వదా సుఖరూపుడుగానే ఉంటాడు. ఆహా!

ఈ సంసారమంతా నిరంతరం దుఃఖపూర్ణమై అజ్ఞానముచేతనే విస్తారమగుచున్నది కదా! కాని రామా! నీవు మాత్రం 'జ్ఞాని'గానే అయి ఉండాలి సుమా! "నాకు జన్మాదులు ఉండవు" అని గ్రహించటమే జన్మరాహిత్యం.

ఈ కనబడేదంతా భ్రమ మాత్రమే... భ్రమకు భ్రమ కాక మరొక రూపమెక్కడున్నది?... స్వప్నంలో కనిపించే వాటికి స్వప్నత్వమే స్వరూపం గాని, ఇక మరే పదార్థంతో అవి తయారవుతాయి చెప్పు?... మిక్కిలి ప్రకాశవంతమై స్ఫుటరూపం కలిగి భాసిస్తూ, భ్రమ మాత్రమే అయిన ఈ జగత్తు సర్వశక్తిమంతుడగు ఆ పరమాత్మ యొక్క శక్తియే అయి ఉన్నది.

వాస్తవానికి ఈ ప్రపంచంలో ఒకనికి మరొకడు బంధువుగాని, శత్రువుగాని కానేరడు. ఈ శత్రు, మిత్ర ఉదాసీనులంతా కాలానుగతంగా 'ఈశ్వరేచ్ఛ' చేతనే సంభవించుచున్నారు. ఈ జగత్తులో తారసపడే వ్యవహారమంతా జలములోని తరంగాలలాగా ఒకదానికి మరొకటి కారణమగు అనేక సంఘటనలతో ఎప్పటికప్పుడు ఛిన్నాభిన్నమగుచున్నది. ఇట్టి ఈ జగత్తును మననం చేస్తూ, దుఃఖించేవారు మా దృష్టిలో అమాయక బాలురవంటివారు మాత్రమే.

చలనశీలమగు సంసార చక్రం నిరంతరం పై నుండి క్రిందకు, క్రింద నుండి పైకి తిరుగాడుతూనే ఉన్నది. స్వర్గంలోని జీవులు ఒకానొకప్పటికి నరకం చేరుచున్నారు. నరకంలోని జీవులు స్వర్గానికి వెళ్ళుచున్నారు. ఒకడు ఒక ద్వీపం వదలి మరొక ద్వీపం ప్రవేశించునట్లే ఈ జీవులంతా ఒక ఉపాధిని వదలి మరొక ఉపాధిని ఆశ్రయించుచున్నారు. ఇట్టి స్వప్నకల్పితమైన అవాస్తవ జగత్ వ్యవహారముల కొరకు కొందరు మాయాబద్ధులగు జీవులు తెంపులేని శోకం అనుభవిస్తున్నారు. మరి వారికి నేనేమి, ఎట్లా చెప్పాలి?

ఒకప్పుడు మహాధీరులై అటూ ఇటూ సంచరిస్తున్న వారు మరొకప్పుడు అతి దీనత్వం పొందుచున్నారు. దీనులు మహాధీరులగుచున్నారు. పతనము ఉత్పత్తిలచే ఈ జీవులు తమకు తామే విభ్రమములను కల్పించుకొనుచు, సంచలనము పొందుచున్నారు. దీపశిఖకు స్థిరాకారం ఉంటుందా? ఈ సంసారచక్రము నందు కూడా ఏదీ ఎన్నటికీ 'ఒక రూపము' కలిగి ఉండుటలేదు. ఈ సంసార దృష్టి ఏర్పడి ఉన్నంతవరకు స్వచ్ఛత్వము గాని, దుఃఖరాహిత్యము గాని ఏ జీవునకు కూడా సాధ్యపడేది కాదు. అనుక్షణం 'మార్పు' చెందుచుండే స్వభావంగల ఈ విషయముల పట్ల ఇది మాకు ఇట్లు ఉండాలి... అని అనుకొని ఎవడు సుఖం పొందగలడు చెప్పు? అందుచేత, రామా! ఈ ప్రపంచంలో తారసపడే "నాది, నాకు చెందినది, నీది, నీకు చెందినది, వారిది, వారికి చెందినది" – మొదలైనవన్నీ మెల్లకన్నువాడు రెండవ చంద్రుని చూచునట్లు, కేవలం భ్రమ చేత మాత్రమే అట్లు అనిపిస్తున్నాయి. ఇందులో ఏమాత్రమూ సందేహంలేదు. అందుచేత ఈ "నేను", "నీవు", ఈతడు నా వాడు, ఆతడు శత్రువు" – అనునట్టి మిథ్యాదృష్టులన్నీ నీ పట్ల నశించు గాక. అయితే ఆయా అనుకూలములైన వ్యవహార సరళి లోకమునకు అవసరమైయున్నది కనుక, ఇక్కడి వ్యవహారతత్పరతను లీలామాత్రంగా బాహ్యమునకు మాత్రమే అవలంబించు. నీకు బంధువులుగా ఉన్నవారి పట్ల ....

ఆత్మదృష్టిచే చైతన్యమాత్ర స్వరూపులుగాను, లౌకిక దృష్టిచే నీ ఆయా కర్తవ్యములు గాను భావించు... అంతేగాని, ఒక గాడిదలాగా లేనిపోని భారములన్నీ కల్పించుకొని భ్రమాత్మికమైన నమ్మికతో, ఈ సంసార లంపటములయందు కాలయాపన తాత్సారములతో కూడిన బుద్ధిని పొందవద్దు. నిష్కారణముగా దుఃఖములను, వాసనాభారములను తెచ్చిపెట్టుకోవద్దు. వాసనలను క్షీయింపజేయ గల క్రియలను విచారణలను శ్రద్ధగా ఆశ్రయిస్తూరాగా, ఈ సంసారభారం స్వయంగా రహితమైపోగలదు.

అయం బంధుః అయంనేఽ తి గణనా లఘుచేతసాన్ ।
ఉదారచరితానాంతు విగతావరణైవధీః ॥

"ఈతడు బంధువు, ఈతడు శత్రువు" అనే భేదదృష్టంతా అల్పబుద్ధి కలవారికే ఉంటుంది. ఉదారచరితులకు అట్టి పరిచ్ఛిన్నదృష్టిగాని, ఆవరణయుక్తమైన బుద్ధిగాని ఉండదు. వారు, "ఈ సర్వము నందు నేను ఉండనే ఉన్నాను.. ఈ సర్వము సర్వదా నా యందే ఉన్నది" అను నిశ్చయము గల ధీరబుద్ధి కలిగి ఉంటారు. కనుకనే వారిపట్ల సర్వ ఆవరణలు (All Limited perceptions) తొలగిపోతున్నాయి.

నాస్తమేతినచోదేతి యశ్చిదాకాశవన్మహాన్ ।
సర్వంసంపశ్యతిస్వస్థః స్వస్థోభూమితలంయథా ॥ (శ్లో 63, సర్గ 18)

అట్టి ప్రాజ్ఞునకు ఇక ఉత్పత్తి వినాశనములు ఉండవు. ఆతడు 'ఆకాశము' వలె మహత్తరమైన రూపము కలిగి, సర్వ విక్షేపములు నశించినవాడై స్వస్థచిత్తుడై ఉంటాడు. ఆకాశమున ఎక్కడో ఉండి ఈ భూతలమును వీక్షించుచున్నట్లు ఆతడు ఈ జగత్పదార్థములను, జనులను, సంఘటనలను చిద్విలాసంగా, భావాభావములకు అతీతంగా చూస్తూ ఉంటాడు.

ఓ రామచంద్రా! ఈ ప్రపంచమునగల జీవ జాతులన్నీ ఈ జీవునకు బంధువులే. ఎందు కంటావా? ఆతడు అనేక వేలాది జన్మలు ఎత్తియే ఉంటాడు. ప్రతి జీవజాతిలోను అతడు అనేక మార్లు జన్మించియే ఉంటాడు. ఇక ఆతని జాతి ఏది? ఆతని జాతి కానిదేది? కనుక 'నేను ఈ జాతికి చెందిన జీవుడను' అని తలచుట భ్రమ కాదా చెప్పు? పలువిధములైన విచిత్ర జన్మభ్రమలతో గూడిన ఈ జగత్తునందు, "ఈతడు నా బంధువు – ఈతడు నా శత్రువు" అనునదంతా మిథ్యా దృష్టి రూపముననే భ్రాంతిగా విజృంభిస్తోంది. వాస్తవానికి చూస్తే ఈ ముల్లోకములందలి జీవులు జీవభావదృష్టిచే నీ బంధువులే అయి ఉన్నారు. వారూ జీవులే.... నీవు జీవివేకదా! అంతేకాదు. ప్రతిజీవుడు అనేక జీవజాతులలో జన్మలు పొందుచూనే ఉన్నాడు. ఇక బ్రహ్మాభావ దృష్టితో చూచావా.... నీవే వారందరి స్వరూపముగా అగుచున్నావు. కాబట్టి నీ వారు కాని వారెవ్వరు?

ఈ విషయంలో ప్రాచీనమైన కథ ఒకటున్నది. ఇద్దరు అన్నదమ్ముల సంవాదముచే "బంధుత్వము అనబడునది స్వయం కల్పితమైన చమత్కారమే" అని నిర్ణయింపబడింది.

❖❖❖

2. నదుఃఖార్వం

జంబూద్వీపంలో గల ఒక పర్వతంపై 'దీర్ఘతపుడు' అనే మునీశ్వరుడు ఉండేవాడు. ఆతడు ఉదార మనస్కుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు, మహాతపశ్శాలి కూడా. ఆతనికి ఇద్దరు కుమారులు ఉండేవారు. వారి పేర్లు పుణ్యుడు, పావనుడు. గంగానది ఒడ్డున ఒక ఆశ్రమం నిర్మించుకొని, ఆతడు తన ఇద్దరు కొడుకులతోను, భార్యతోను ప్రశాంతంగా రోజులు గడుపుతూ ఉండేవాడు.

కొంతకాలం గడచిన తరువాత ఆతని ఇద్దరు కుమారులలో పెద్దవాడైన పుణ్యుడు అభ్యాసవశం చేత 'బ్రహ్మజ్ఞాని' అయ్యాడు. కాని, రెండవవాడగు పావనుడు మాత్రం కొంత గ్రహించి, మరికొంత గ్రహించక మిగిలి ఉన్నాడు. ఆతడు 'పూర్ణ బ్రహ్మపదము' పొందకపోవటం చేత మార్గమధ్యంలోనే వ్రేలాడుతూ ఉండేవాడు.

ఆ విధంగా అనేక సంవత్సరాలు దొర్లాయి. అదృశ్యమైన రూపంతో జీవుల ఆయువును క్షణ క్షణం మ్రింగివేసే స్వభావం గల కాలం గడచిపోసాగింది. దీర్ఘతపునకు వందేళ్ళు నిండాయి. ఒక నాటికి ఆతనికి ఈ సంసారముపై తిరస్కారపూర్వకమైన బుద్ధి పుట్టింది. నశ్వరమైన జీవుల చేతను పుట్టుక, రోగము, అకస్మాత్ సంఘటనలు, వార్ధక్యము, మృత్యువు, మొదలుగాగల వివిధ దుస్సహమైన, నిస్సారమైన వృత్తాంతముల చేతను నిండి ఉండి, భయంకర ఆకారము కలిగిన ఈ సంసారముపై ప్రీతిని త్యజించాడు. యోగబలంతో వార్ధక్యముచే జర్జితమైన తన భౌతికదేహం త్యజించాడు. కల్పనా రహితము, విషయములు లేనట్టిది, నిత్యోదిత చేతనా స్వరూపము, రాగద్వేష రహితము అయినట్టి 'బ్రహ్మపదము' నందు ప్రవేశించాడు. ఎంతో కాలం, భర్తను సేవిస్తూ వస్తున్న ఆతని భార్య కూడా బ్రహ్మభావము పొందినదై తన భర్తను అనుసరించింది. సామాన్యమైన భౌతిక దృష్టికి వారిద్దరు అలభ్యులు, అగోచరులు అయ్యారు.

చనిపోయిన తల్లితండ్రుల భౌతికదేహాలకు పుణ్యుడు దహనము మొదలైన అంత్యక్రియలు పూర్తి చేశాడు. ప్రజ్ఞచే నిత్యానిత్యములు ఎఱిగియుండుటచే ఆతడు యథాతథంగా తన సాధన పఠనాదులను కొనసాగించసాగాడు. కాని పావనుడు మాత్రం తల్లితండ్రులను పోగొట్టుకొన్న దుఃఖం నుండి బహుకాలం విడివడలేక పోయాడు. అత్యంత దుఃఖాక్రాంతమైన మనస్సుతో ఆ ఆశ్రమం చుట్టుప్రక్కల గల అరణ్యంలో పిచ్చిపిచ్చిగా సంచరిస్తూ విలపించసాగాడు. ఇది గమనించిన పుణ్యుడు ఒకరోజు పావనుని తన ప్రక్కన కూర్చోబెట్టుకొని ఈ విధంగా సంభాషించసాగాడు.

పుణ్యుడు : తమ్ముడూ! అజ్ఞానివై ఈ విధంగా ఎందుకు పరితాపం పొందుచున్నావు? నీవు, నేను, నాన్నగారు, అమ్మ ఒకచోట కూర్చుని అనేకసార్లు చర్చించిన ఆత్మ విశేషాలన్నీ మరచిపోయావా? నీవు గొప్ప తెలివిగలవాడివే కదా! మన అమ్మ నాన్న ఎక్కడికి వెళ్ళారు చెప్పు? వాళ్ళు 'బ్రహ్మపదము'ను పొందారు. ఆ బ్రహ్మమే సర్వ జీవులకు నిలయం కదా! బ్రహ్మవేత్తల స్వరూపం కూడా అదే. స్వస్వరూపం పొందిన వాళ్ళ గురించి ఎందుకు రోదిస్తున్నావో చెప్పు?

పావనుడు : అన్నా! మనలను కని, పెంచి, పెద్దచేసిన అమ్మ నాన్నలు మన కళ్ళముందు నుంచి మాయమై, ఎటో వెళ్ళిపోయారే? ఆ భగవంతుడికి మనం ఏం అన్యాయం చేశామని ఈ పిచ్చిపని చేశాడు చెప్పు?

పుణ్యుడు : "ఈతడు నా తండ్రి, ఈమె నా తల్లి" అను రూపము గల భావనలన్నీ ఉత్తమ సత్యము పట్ల ఉదాసీనత, విచారణ కొరవడటం, అజ్ఞానం... కారణంగానే ఉదయిస్తున్నాయి. శోకించతగని వాటి గురించి నీవు శోకిస్తున్నావు. "గతించిపోయిన, గతించిబోయే" విషయాల గురించి శోకించి లాభమేమున్నది చెప్పు?

తమ్ముడూ! "దీర్ఘతపుడు నా తండ్రి, ఆతని భార్య నా తల్లి" అని భావిస్తున్నావు... బాగానే ఉంది. కాని, వాస్తవానికి వారు మాత్రమే నీకు తల్లితండ్రులా? కాదు. ఎందుకంటే నీవు ఇంతకు ముందు వేలాది జన్మలలో అనేక మంది తల్లితండ్రులను పొందియున్నావు. అదేవిధంగా వారు కూడా తమ ఇతఃపూర్వపు జన్మలలో వేలాదిమందిని తమకు బిడ్డలుగా పొందియున్నారు. కనుక, "నీవు, నేను" మాత్రమే వారికి పుత్రులం" అనటం మూర్ఖమే అవుతుంది. ఇట్టిదే ప్రతిఒక్క జీవుని యొక్క ప్రతిఒక్క సంబంధం కూడా !

మిత్రబాంధవవృన్దాని జన్తోర్జన్మనిజన్మని ।
ఋతావృతావతీతాని ఫలానివమహాతరోః ॥ (శ్లో 34, సర్గ 19)

ప్రతిజన్మలోను ఈ జీవునకు ఎందరో బంధువులు, మిత్రులు, పరిచయస్తులు కలుగుచున్నారు. "ప్రేమవశం చేతనే నేను నా తల్లితండ్రుల గురించి శోకిస్తున్నాను" అని నీవు అనదలచుకొంటే, మరి, నీవు నీ గతించిపోయిన జన్మలలోని తల్లి తండ్రుల గురించి, బంధువుల గురించి ఎందుకు శోకించుటలేదో నేను తెలుసుకోవచ్చా?

పావనుడు : నిజమే, నీవు చెప్పేదానిలో వాస్తవముంది. అయితే ఈ దృశ్యం మరల మరల వస్తోంది, పోతోంది. ఇదంతా ఎక్కడి నుండి వచ్చి పడుతోంది?

పుణ్యుడు : ముక్కుకు సూటిగా నీ ప్రశ్నకు బదులివ్వాలంటే – 'జగత్ కల్పన'కు అజ్ఞానమే కారణం. 'అజ్ఞానము' చేతనే ఈ దృశ్యమంతా ప్రకటితమవటం, ఎదురుగా నిలిచి ఉండటం, భ్రమింపచేయటం జరుగుతోంది.

యథార్థానికి నీకు మిత్రులుగాని, సోదరులు గాని, తదితర బంధువులు గాని లేరు. ఎట్టటి ఎండకు కాలిపోతున్న ఎడారిలోని ఇసుక దిబ్బపై నీళ్ళు ఉంటాయా? బ్రహ్మస్వభావమగు ఆత్మయందు జన్మము లేదు. మరణము లేదు. ఇక, నీకు కనిపిస్తున ధన–ధాన్య–రాజ్య విభవములు, ఐనవాళ్ళు, కానివాళ్ళు, అనుబంధములు... ఇవన్నీ భ్రమతో కూడిన సాంసారిక దృష్టికి మాత్రమే తారస పడుచున్నాయి. పైగా, ఇవన్నీకూడా, మూడు నాళ్ళముచ్చట్లే కదా! "ఇవి నాకు కలవు" అని విఱ్ఱవీగేంత సేపు పట్టదు... వీటి రాకపోకలు! అందుచేత, సోదరా! కాస్త పరమార్థదృష్టిచే సత్యాన్ని విచారించు. ఈ "నేను – నాది – నీది" అను వ్యవహారమంతా కేవలం కల్పనయే అయి ఉన్నది.

అంతేకాని, వాస్తవం మాత్రం కాదు. ఇప్పుడు మన ఇరువురి మధ్య ఏర్పడివున్న అనుబంధమును విజ్ఞాన దృష్టిచే పరిశోధించామనుకో, "నీకు నేను గాని, నాకు నీవు గాని ఏ ఒక్కక్షణమందు కూడా లేము" – అనియే తెలియవస్తోంది. అందుచేత, "స్వప్నంలోని వస్తుజాలం వంటిది, భ్రమ చేత మాత్రమే అనుభవమగునది" – అయినట్టి ఈ "నీవు, నేను" మొదలైన భ్రమలన్నీ నీ హృదయంలోంచి ముందుగా పారత్రోలివేయి.

పావనుడు : మరి ఈ జీవుల జన్మ మృత్యువుల సంగతేమిటి?

పుణ్యుడు : "ఇది నశించుచున్నది, ఇది జన్మించుచున్నది" – ఇటువంటి దృష్టులన్నీ స్వసంకల్పములతో రూపం పొందిన భ్రమచేత మాత్రమే నీముందుకు వస్తున్నాయి. మరల మరల విజృంభిస్తున్నాయి. అంతేకాని అదంతా వాస్తవమైనది కాదు.

'ద్రష్టత్వము' అను క్రియావిశేషమునకు కూడా కర్తయగు ఆత్మ ఒకానొక తరుణంలో అజ్ఞాన తాపముచే ఆఛ్ఛాదితమై ఉంటోంది. ఎడారిలో మృగతృష్ణాజలం కనబడుతోందిచూడు. అట్లాగే "శుభ, అశుభ కర్మలు" అనే చంచల, స్వవాసనపూర్వకమైన తరంగాలు ఈ అనంత సంసార సాగరంగా స్ఫురిస్తున్నాయి. మేఘాలు ఆకాశాన్ని కప్పి వేస్తున్నట్లు, సాంసారిక భావనలు ఆత్మాకాశాన్ని కప్పివేస్తున్నాయి. అయితే మేఘములు కమ్మినంత మాత్రం చేత ఆకాశం లేకుండా పోతుందా?... లేదు. ఈ భ్రమలన్నీ ఏర్పడవచ్చు, లేక మరొకప్పుడు తొలగిపోవచ్చు. నిర్మలమైన చిదాకాశము ఎప్పటియట్లే అప్రమేయముగా, అఖండముగా సర్వదా ఉండి ఉంటోంది.

చిదాకాశమే నీయొక్క, నాయొక్క, మన అమ్మా, నాన్నల యొక్క వాస్తవ స్వరూపం.

❖❖❖

3. సంబంధబాంధవ్యముల అతీతత్వము

కఃపితాకించవామిత్రం కామాతాకేచబాన్ధవాః ।
స్వబుద్ధ్యైవావధూయన్తే వాత్యయా జనపాంసవః ॥ (శ్లో 1, సర్గ 20)

పుణ్యుడు : తమ్ముడూ! పావనుడా! తల్లి ఎవరు? తండ్రి ఎవరు? మిత్రులెవరు? బంధువులు ఎవరు? గొప్ప గాలి వీస్తుంటే ధూళి లేస్తుంది చూచావా! ఈ అనేక జీవుల సంబంధములు ఆ ధూళి లోని వేరు వేరు రేణువుల యొక్క సామీప్య సంబంధములవంటివి మాత్రమే.

ప్రతి జీవునకు తదితర జీవులంతా ఆ జీవుని యొక్క 'స్వబుద్ధి, భ్రాంతి'లచే కల్పించబడినవారై ఉన్నారు. ఆత్మయే రాగ, ద్వేష, మోహములను ఆశ్రయించుచున్నప్పుడు – "వీరు బంధువులు, వీరు మిత్రులు, వీరు హితులు" – అనువాటితో కూడిన ఈ ప్రపంచం విస్తరింప జేయుచున్నది.

ఒకనిని చూచి నేను "ఇతడు నాకు సంబంధించినవాడు" – అని సంకల్పించినప్పుడు మాత్రమే అతడు నాకు బంధువు అగుచున్నాడు. అట్లా కాకుండా, "ఆతడు అప్రియమైనవాడు, వ్యతిరేకి, ద్వేషింపదగినవాడు" – అను రూపం గల వ్యతిరేకభావనచే శత్రువు అగుచున్నాడు. భావనామాత్రం

చేతనే విషము అమృతము గాను, అమృతము విషము గాను అగుచున్నది. ఈ సంసారము యొక్క ప్రాప్తి, స్థితి, గతి కూడా కేవలం 'భావించుట' అను క్రియావిశేషము చేతనే సంభవిస్తోంది.

సర్వదేహములందు ఏకరూపమున వెలుగుచున్నట్టి 'సర్వవ్యాపి'యగు ఆత్మకు "ఇతడు నా బంధువు, ఇతడు నా మిత్రుడు" అను కల్పన ఎట్లా ఉంటుంది? ఎక్కడ ఉంటుంది? నీవైనా, నేనైనా ఈ రక్త మాంస బొమికలతో కూడిన అస్థిపంజర శరీరములమా? కాదు. ఈ దేహగృహం మనం ఆశ్రయించాం గాని మనం ఈ దేహములం కాము సుమా! అందుచేత కొంచెం ఏకాంతంలో కూర్చుని "చేతనా స్వభావుడైన నాయొక్క యదార్థ స్వరూపము ఏమై ఉన్నది...?" అని నీ చిత్తములోనే విచారణ చేయడం ప్రారంభించు.

పరమార్థమగు "శుద్ధ చైతన్య దృష్టి"తో ఈ దృశ్యమును ఆమూలాగ్రం పరిశీలన చేయడం జరిగితే, అప్పుడు, " 'పావనుడు' అనబడే నీవు గాని, 'పుణ్యుడు' అని పిలువబడుచున్న నేను గాని ఈ దేహపరంగా లేనే లేము" అని తెలిసి వస్తుంది. దేహము పట్ల 'ఇది నేను' అను రూపము గల అభిమానం, మిథ్యా జ్ఞానం ఏర్పడియుండుట చేతనే ఈ మన రూపాలన్నీ ఈ విధంగా విజృంభించి, లయిస్తున్నాయి. ఈ కనబడే వేలాది వేర్వేరు శరీరములన్నీ 'కల్పన' చేతనే కన్పిస్తున్నాయి కాని, ఇవన్నీ స్వతహాగా ఉన్నవి కావు.

మనం భౌతిక దృష్టిచే, లేక, "దేహ దృష్టి" చే పరిశీలిస్తే – ఇక్కడ నశ్వరమైనది కానిదేమున్నది? ఇక్కడ తల్లి ఎవరు? అయినవాడెవ్వడు? కానివాడెవ్వడు? మిత్రుడెవ్వడు? శత్రువెవడు? ఈ ఎదురుగా కనబడుచున్న 'దేహములు' అను ఉపాధులకు అతీతమై, సాక్షిమాత్రమై ఉన్నట్టి 'చైతన్య దృష్టి' అలవరుచుకున్నావనుకో... అప్పుడు అనంతరూపమగు 'చిదాత్మ' మాత్రమే ఉనికి కలిగి అగుపిస్తుంది. అట్టి చిదాత్మ యందు "ఇది నాది, అది నీది" అనే భేదం ఉంటుందా? ఉండదు. ఒక సముద్ర తరంగానికి ఏ తరంగం ఏ తరంగానికి శత్రువు? ఏ తరంగం ఏ తరంగానికి మిత్రుడు? ఉన్నదంతా జలమే కదా!

పావనుడు : అయితే అన్నా!. ఈ ప్రశ్నకు బదులు ఇవ్వు. మనోబుద్ధి అహంకారములు అనబడే సూక్ష్మ తత్వమే నేను కదా! అట్టి మనోబుద్ధులకు "ఈతడు నా అన్న" – అని నీవు లభించుచున్నావే? మరి "శత్రు మిత్రులు, బంధువులు కానివారు" లేరని నీవు ఎట్లా అనగలవు? జన్మ పొందినప్పటి నుండీ ఏర్పడియున్న బంధువులను "వీరు నా వారు" అని అనుకోవటం లోకధర్మమే కదా! వారిని యథారీతిగా బంధుత్వపూర్వకంగా కలిగియుండటం ఎందుకు సముచితం కాదు?

పుణ్యుడు : నీవు చెప్పేది బాగానే ఉన్నది. అయితే, నాది మరొక ప్రశ్న. కొన్ని సంవత్సరాల క్రితం మాత్రమే జన్మచే ఏర్పడుచున్న ఈ సంబంధబాంధవ్యములు శిరోధార్యమేనని అనుకుందాం.... మరి, ఇతఃపూర్వం గడచిన అనేక జన్మలలో బంధు మిత్ర ధనాదుల మాటేమిటి? అవన్నీ అక్కడక్కడ వదలి వచ్చినందుకు ఇప్పుడు దుఃఖిస్తూ కూర్చుంటున్నావా? ఈ వర్తమాన జన్మలో కూడా ఎన్నెన్నో అనుబంధాలు ఏర్పడటం, మరల కాలముచే మ్రింగివేయబడటం జరుగుతోంది కదా!

ఏది ఏమైనా, ఇవన్నీ కూడా కొన్ని సంవత్సరముల తరువాత క్రితం జన్మలోని విశేషాలు లాగానే రూపరహితం కాబోతున్నాయి కదా! ఈ విషయం నీవుగాని మరొకరుగాని ఒప్పుకోక తప్పదు. అయితే, ఎప్పటికప్పుడు, ఆ వర్తమాన సమయంలోని బంధు మిత్ర శత్రుత్వాదులు నిన్ను మోహింపజేస్తున్నాయి. ఇది గమనిస్తున్నావా?

ఎప్పటికప్పుడు వచ్చి పోతూ ఉండే ఈ సంబంధముల పరంపరలో దేనికొరకు హర్షించాలి? దేని కొరకు దుఃఖించాలి? అందువలన వచ్చే ప్రయోజనం ఏమి ఉంటుంది? ఈ అత్యంత కల్పితమైనట్టి అనేక బంధుమిత్రాదులలో కొందరు మరణాదులు పొందినందుకు దుఃఖించటం, మరికొందరి వృద్ధిని చూచి సంతసించటం – ఇదేనా, మన పని? మనం ఇందుకే జన్మిస్తున్నామా? మనం ఈ దేహంతో పుట్టటానికి మునుముందు ఇవన్నీ లేనేలేవు కదా!

తమ్ముడూ! మరొక మాట నీవు ఇంతక్రితం మృగజాతులలో జన్మించి ఉన్నావు. అనగా, వాటందరిలో నీకు బంధువులు ఉన్నారు. మరి ఆ మృగములు వేటాడబడుచున్నప్పుడు నీవు దుఃఖించుట లేదేమి?

పావనుడు : అయి ఉండవచ్చునేమో! అయితే అవన్నీ ఇప్పటి నా దృష్టిపథంలో లేవు కదా!

పుణ్యుడు : అవును! ఆ రీతిగానే ఈ వర్తమానపు సంబంధాదులన్నీ ఒకప్పటికి నీ దృష్టిపథంలోంచి తొలగిపోబోతున్నాయి. ప్రతిజీవుడు 'వృక్షము, సింహము, పులి, చేప' మొదలైన అనేక రూపములను ఎత్తుచు, ఎన్నో బంధుత్వములను పొందటం, త్యజించటం చేస్తూనే ఉన్నాడు. అయితే ఏం? ఎప్పటి కప్పుడు వర్తమాన కల్పన యందు నిమగ్నమగుచు, 'అయ్యో నేనొక అల్ప దుఃఖ పేద జీవిని" అని దుఃఖములు తెచ్చిపెట్టుకుంటున్నాడు. అంతరంగమునందు ఆత్మదృష్టి ఏర్పడనంత వరకు ఈ వ్యవహార స్రవంతికి అంతు లేదు.

అనేక జన్మల చమత్కారం - "తపస్సు – ధ్యానము – భగవత్కటాక్షము"ల ప్రయోజనంగా నాకు ప్రాప్తించిన సునిశిత దృష్టిచే నేను చూడగలుగుచున్నట్టి నీ పూర్వజన్మల కొన్ని వృత్తాంతాలను చెబుతాను విను–

నీవు పూర్వం ఒకానొకప్పుడు "దశార్ణవ" అను పేరుగల దేశంలో ఒక కోతివై పుట్టావు. ఆ తరువాత "తుషార" అనే మరొక దేశంలో రాజకుమారుడవై పుట్టావు.

ఇంకా, మరికొన్ని విశేషాలు చెప్పమన్నావా? అయితే విను–

ఒకప్పుడు కోసలదేశంలో ఒక బ్రాహ్మణుడుగా జీవిస్తూ భిక్షాటన చేస్తూ ఉండేవాడివి. వంగ దేశంలో 'లొట్టిపిట్ట'గా అనేక చెట్లను ఆశ్రయించావు. ఒకచోట గుఱ్ఱంగా పుట్టి అనేక యుద్ధ భూములలో ప్రవేశించి డెక్కలతో అనేక మృతదేహములను స్పృశించావు. మరొకచోట ఒక తాటిచెట్టు తొఱ్ఱలో పురుగుగా జీవించావు. దోమగాను, బాతుగాను పుట్టి ఉన్నావు. మరొకప్పుడు హిమాలయాల లోని ఒక కొండశిఖరప్రాంతంలోని ఒక ఇరుకైన చోట రంగులచారలు గల పురుగుగా పుట్టావు. మరొక చోట నేలలో తేలుగా జన్మించి, ఒకటిన్నర సంవత్సరములు గడిపావు. ఆ తరువాత ఒక

చండాల కన్యకకు పుత్రుడవై జన్మించావు. ఆ తరువాత ఇక్కడి దీర్ఘతపునకు, అంటే మన తండ్రికి – ఈ విధంగా కుమారుడవై జన్మించావు. ఇంకా చెప్పాలంటే ఈ జంబూద్వీపంలోనే అనేక జీవ జాతులలో అనేక మార్లు పుట్టటం, చావటం నిర్వర్తించి ఉన్నావు.

విశుద్ధమైనట్టి "సూక్ష్మబుద్ధి"చే నాకు లభిస్తున్న 'సంయక్‌దర్శనము' అను ప్రభావంచేత నీకు చెప్పినదంతా నేను ఎదురుగా చూడగలుగుచున్నాను. అనేక జన్మలలో చేసిన ఆయా ఉత్తమ ప్రయత్నముల ప్రయోజనంగా నాకు ఈ దివ్య దృష్టి ప్రాప్తించింది. నాకు కూడా అజ్ఞానస్థితిలో అనేక జన్మలు గడచిపోయాయి. జ్ఞానాభివృద్ధి కొరకై ఆ సంగతి కూడా ప్రస్తావిస్తాను.

నేను కూడా కుక్కగాను, కప్పగాను, మృగములను వేటాడే వేటగానిగాను, వంగదేశంలో ఒక చెట్టుగాను, వింధ్య పర్వత ప్రాంతంలో ఒక ఒంటెగాను, కొంగగాను, ఒక రాజుగాను, పులిగాను జన్మించటం జరిగింది. పదియేళ్ళు గ్రద్దగా ఉన్నాను. ఒక వందయేళ్ళు సింహంగా జీవించాను. కొంతకాలం ఒక పిచ్చుకనై గూళ్ళు కట్టుకుని జీవించాను. మరల మరొక ప్రదేశంలో ఒక సమయంలో ఒక మండలాధీశునికి కుమారుడుగా పుట్టి అనేకమందిని హింసిస్తూ పెత్తనం చెలాయించాను. నా దుష్టస్వభావానికి ప్రతిఫలంగా ఆ జన్మలో నేను కొందరిచే సంహరించబడ్డాను కూడా! ఆహా! ఏం చెప్పాలి! భిక్షకుడు ఇంటింటికీ వెళ్లి కబళం కోసం కేకలు వేస్తున్నట్లు నేను అనేక ఉపాధులలో ప్రవేశించాను. మరల ఇంతలోనే నిష్క్రమించాను. ఇటువంటి అసంఖ్యాకమైన భూతకాలపు జన్మలను నేనిపుడు సుస్పష్టంగా సంస్మరించగలుగుచున్నాను.

కాబట్టి తమ్ముడూ! నీకూ నాకు కూడా ఇంతకు ముందు ఎందరో తల్లిదండ్రులు, సోదరులు, స్నేహితులు, బంధువులు వేరువేరుగా ఏర్పడి, తరువాత మరెప్పుడో కాలముచే ఎటకో తీసుకుపోబడ్డారు. ఇక ఈ వర్తమానంలోని మనిద్దరి అన్నదమ్ముల సంబంధము కూడా అటువంటిదే. ఈ గడచిపోయిన అసంఖ్యాకమైన సంబంధాలలో వేటివేటి కొరకు సంతోషించాలి? వేటివేటి కొరకు దుఃఖించాలి?

పావనుడు : అన్నా ! ఔను ! నిజమే...!

పుణ్యుడు : నీవు ఎవరి కోసం దుఃఖించవలసినపనీ లేదు. ఎందుకంటావా? జగత్తు స్థితే అట్టిది.

అనన్తాఃపితరోయాన్తి యాన్త్యనన్తాశ్చమాతరః ।
ఇహసంసారిణాంపుంసాం వనపాదపపర్ణవత్ ॥ (శ్లో 33, సర్గ 20)

వనమందలి వృక్షపర్ణముల వలె సంసారజీవు లమగు మనకు ఎందరో సంబంధీకులు సంభవించారు, సంభవించ బోవుచున్నారు.

కింప్రమాణమతఃపుత్ర దుఃఖస్యాత్రసుఖశ్యచ ।
తస్మాత్సర్వంపరిత్యజ్య తిష్ఠావఃస్వచ్ఛతాంగతౌ ॥ (శ్లో 34, సర్గ 20)

ఈ తతంగమంతా "ఇది సుఖము, ఇది దుఃఖము" అను భావనతో పరికించదలచుకొన్నావా... ఇక ఈ సుఖదుఃఖములకు అంతు ఎక్కడ? కనుక, నీవు ఈ దృశ్యదృష్టిని, దీని వలన కలుగుచున్న శోకమును పరిత్యజించాలయ్యా! మనం ఇప్పుడు నిర్మలత్వమునే ఆశ్రయించుదాం.

సావధానం - ఈ ప్రపంచమంతా మనకు ఎదురుగా ప్రాప్తిస్తున్నది కదా! అయితే "ఇదంతా మనస్సులోనే అహంభావ రూపంగా ఉన్నది" అని ఆత్మజ్ఞులు చెప్పుచున్నారు. ఇది వేరు, అది కావాలి, వారు మావారు కాదు, ఏదో పొందాలి" మొదలైన తుచ్ఛ దృశ్యవ్యధలను విడచి పెట్టి, ఆత్మజ్ఞులు అనుసరించే మార్గం మనం ఎందుకు అనుసరించరాదు? అదే మనకు శ్రేయస్కరం, అంతే గాని, ఆయా స్వల్పవిషయాల గురించి మననం చేస్తూ, దుఃఖిస్తూ కాలయాపన చేయటం ఏం ఉచితం? ఈ ప్రపంచంలో "జన్మ ఉన్నతి పతనం" అను కార్యములు ఒక పెద్ద చక్రము యొక్క పరిభ్రమణం లాగా అనివార్యంగా కొనసాగుచున్నాయి. ఇటువంటి అతి చంచలమైన సంసార స్థితిగతులను పట్టుకుని మనం ఎందుకు వ్రేలాడాలి? వాటిలో ఏదో ఎందుకు దేవులాడాలి?

అందుచేత, భావ అభావములకు అతీతమై, స్థితిగతులచే మలినపరచజాలని విషయమగు "ఆత్మ" గురించే మనం సావధానమనస్కులమై విచారణ చేద్దాం. అంతేగాని, మనం మూఢచిత్తులం కాకూడదు. మూర్ఖంగా దృశ్యమునే ఆశ్రయించ దలచామా – ఇక దీనత్వము, నైరాశ్యము, అజ్ఞానము మాత్రమే లభించే ప్రాంతాలకు జేరవలసివస్తుంది.

జ్ఞానుల చర్యలు, అజ్ఞానుల చర్యలు - తమ్ముడూ! యథార్థానికి నీకు తల్లి గాని, తండ్రి గాని లేరు. దుఃఖములూ లేవు. జన్మలూ లేవు. ఎందుకంటే నీవు అన్ని సమయములందూ 'శుద్ధాత్మ'యే స్వస్వరూపముగా కలిగి ఉన్నావు. నీకు వేరుగా ఈ జన్మలు గాని, ఈ దేహములు గాని లేవు. అయితే అజ్ఞానులు ఇక్కడి దృశ్యములోని 'సత్యము, సారము' గమనించటంలేదు. వారు తమ ఈ సంసారయాత్రలో అనేక క్రియావ్యవహారములను నిర్వర్తిస్తూ 'మొదలే అసత్యము' అయిన వ్యవహారము లందు "ఇవి ఎంతో సారవంతమైనవి" అను బుద్ధిని ఏర్పరుచుకొని గుర్తించుచున్నారు.

ఇక తత్త్వజ్ఞానులేంచేస్తున్నారంటావా? వారు ఉదాసీనులై 'స్వస్థత'తో కూడిన చిత్తము కలిగి ఉంటున్నారు. ఆయా ప్రాప్తించిన కార్యములను సంగరహితులై నెరవేర్చుచున్నారు. ఈ సర్వమునకు కేవలం సాక్షీమాత్రులై ఉంటున్నారు.

రాత్రిపూట గదిలో దీపం వెలిగిస్తాంకదా! ఆ వెలుగులో గదిలో వస్తువులు కనిపిస్తున్నాయి. ఆ దీపమునకు "వీటికి వెలుగు ఇవ్వటం నాకు ఇష్టం. ఇవంటే నాకు ఇష్టం ఉండదు. అందుచేత, వీనికి నేనెందుకు వెలుగు ఇవ్వాలి?" అను రాగముతో కూడిన కర్తృత్వాభిమానము ఉన్నదా? లేదు. నీవు కూడా ఆయా క్రియలకు కర్తవగుచున్నప్పుడు అభిమానరహితుడవై, అకర్తవై ఉండు. తత్వజ్ఞులు ఆ విధంగానే ఈ ప్రపంచంలో విహరిస్తున్నారు. ఒక దర్పణంలో ఆయా ఎదురుగా ఉన్న వస్తువులు ప్రతిబింబిస్తున్నప్పటికీ, ఆ ప్రతిబింబిత వస్తుజాలము యొక్క ధర్మములను దర్పణము పొందుతోందా? లేదే! అట్లాగే, తమ యందు అధ్యస్తమై ఉంటున్న ఆయా కార్యములను, వ్యవహారసంబంధములను గమనిస్తూ, నిర్వర్తిస్తూ కూడా, జ్ఞానులు, తమయొక్క ఆత్మత్వమును, ఆత్మ ధర్మములను త్యజించరు. "అఖండమగు ఆత్మయే నా స్వరూపము" అను సుదృఢమైన ధ్యాసచే 'దృశ్యతాదాత్మ్యము' అను దోషమును సుదూరంగా విడచివేస్తున్నారు.

అందుచేత తమ్ముడూ! 'ఇచ్ఛ' అనేరూపంతో ఏర్పడుచున్న కళంకమును ముందుగా త్యజించివేయి. నీ హృదయంలో స్వయంగా వివేకబలంచే ఆత్మభావన సాక్షాత్కరింపజేసుకో. 'ఆత్మ స్థితి'ని సర్వదా ఆశ్రయించు. ఈ సంసారభ్రమను మొదలంట త్యజించివేయి. ఈ దృశ్యవ్యవహారమంతా త్యజించ బడగా, ఇక అప్పటికి కూడా శేషించబడి ఉండే స్వస్వరూపస్వభావముచే సంతుష్టుడవై ఉండు.

❖

ఆ విధంగా పుణ్యునిచే బోధింపబడిన పావనుడు సూర్యోదయసమయంలో భూమి ప్రకాశించ నారంభించునట్లుగా వికసిత హృదయుడయ్యాడు. బహుకాలం అన్నదమ్ములిద్దరు పరస్పర సహ జీవనంతో జ్ఞానవిజ్ఞాన పారంగతులైనారు. కాలక్రమంగా అఖండము, అద్వితీయము అయినట్టి నిర్వాణము అధిష్ఠించారు. నూనె తరిగి పోయినట్టి దీపంలాగా వాళ్ళిద్దరు మనోప్రశమనమును పొందారు.

❖❖❖

4. ధ్యేయవాసన - చికిత్స

శ్రీవసిష్ఠమహర్షి : చూచావా! పుణ్యుడు చెప్పినట్టుగానే, ప్రతి జీవునికి ఇతఃపూర్వమే అనేక దేహాలు, అట్టి ప్రతి దేహమునకు సంబంధించి అనేక మంది బంధుమిత్ర, అమిత్రాదులు ఉండి ఉంటారు. వారిలో ఎవరిని త్యజించాలి? ఎవరిని గ్రహించాలి? "అసలు ఈ జీవునకు శోకము, మోహము ఎక్కడి నుండి దిగుమతి అగుచున్నాయి?" అనే విషయం మేము పరిశోధించాం. "అంతరంగములోని తృష్ణయే" అని సమీక్షిస్తున్నాం. అందుచేత శాంతి పొందాలంటే తృష్ణను జయించాలి.

అట్లా కాకుండా ఎప్పటికప్పుడు ఆయా విషయములను కల్పిత వ్యవహారములను ఆశతో కూడుకొని ఆశ్రయిస్తూపోతే, ఆ పయనానికి అంతెక్కడ? శాంతి ఎప్పటికి చెప్పు? కట్టెపుల్లలు వేస్తున్న కొద్దీ అగ్ని జ్వలిస్తూనే ఉంటుందికదా! విషయ చింతన చేతనే ఈ సాంసారిక దుస్థితులు వృద్ధి చెందుతున్నాయి. విషయ చింతన లేకపోతే దుఃఖాదులు కూడా ఉండవు.

ధ్యేయ వాసన - "ఏదో పొందాలి, ఇంకేదో కావాలి, ఏవేవో ఇంద్రియ విషయముల ప్రాప్తిచే మాత్రమే ఉపశమనము, లేదా, అంతా అశాంతియే, తదితరులకు లభించే వన్నీ నాకు లభించాలి, నాకు చెందినవి తదితరులకు లభించకూడదు" – ఇట్టి అనేక ధ్యేయవాసనలను ఈ జీవుడు కలిగి ఉంటున్నాడు. ఆ మార్గంలో ఎన్నటికి శాంతి? కనుక నీవు "ధ్యేయ వాసనా త్యాగము" అనే రథం అధిరోహించు. కరుణాదృష్టితో, ఉదార చిత్తముతో తదితర జీవరాసులన్నిటినీ దర్శించి సర్వభూతదయ కలిగియున్న వాడవై ఈ ప్రాకృత వ్యవహారములను ఆచరిస్తూవుండు. అంతేగాని, ఇక్కడ భేద దృష్టి యందు తాదాత్మ్యం చెందవద్దు. "ధ్యేయ వాసనారాహిత్యం" ఆశ్రయించినవాని స్థితి 'స్వస్థితి' అవుతుంది. అట్టి స్థితియే నిర్మల నిష్కామ ఉపాధిరహిత బ్రాహ్మీస్థితి. వివేకము, పరమార్థబోధలను తన వెంట నిడుకుని, ఈ జగత్తునందు విహరించేవాడు ఇక్కడ మోహితుడు కాడు. ఆతనిని సంపదలన్నీ వదలి

వెళ్ళవచ్చు గాక! బంధువులు బహిష్కరించవచ్చుగాక! అతడు దైన్యము పొందడు. సుస్థిరమైన స్వతత్వమును అవధరించగలడు. జ్ఞాని యొక్క దృష్టి, అవగాహనలచే ఏర్పడే స్వధైర్యమును మించిన సంపద గాని, స్వజనము గాని లేరు. ఆపదల సమయంలో ప్రతికూల స్థితిగతులలో నిస్సహాయ వాతావరణంలో మనలను రక్షించేది అదే. అందుచేత నీవు జ్ఞానివై ఉండు.

ఓ రామా! ఈ "విషయములు" అనే ఆపదల నుండి నిన్ను నీవే లేవనెత్తుకోవాలి. వైరాగ్యము చేతనూ, శాస్త్రాధ్యయనము చేతనూ, మహత్తరమైన ఉదారము మొదలగు గుణముల చేతను ఆత్మోద్ధరణకై ఉద్యుక్తుడవు కావాలి. విషయ త్యాగము చేసేవారి చిత్తము స్వల్పసమయంలో మహత్తర రూపం పొందుతుంది. అట్టి చిత్తము ప్రసాదించే ఫలితమేమిటంటావా? ఈ ముల్లోకములలోని రత్నరాసులు గాని, తదితర ఐశ్వర్యములన్నీ గాని లభించినప్పటికీ, ఆ నిర్మల చిత్తము ముందు దిగదుడుపే. "శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు, సంఘటనల పట్ల ఏర్పరచుకొన్న ఆశానిరాశలు" – వీటినే 'విషయములు' అని అంటున్నాం. విషయ త్యాగములు చేయక పోవుటచేతనే ఈ సంసార కుక్షిలోని జీవులు మరల మరల ఊర్ధ్వ, అధోగతులను, జననమరణములను పొందుచున్నారు. ఫలితంగా వారి మనస్సులు దుఃఖమయములుగా ఉంటున్నాయి.

అదే మనస్సు బ్రహ్మజ్ఞానముచే పరిపూర్ణమైనప్పుడు ఇక ఈ లోకమంతా అమృతమయముగా కనపడుచున్నది. పాదరక్షలు ధరించి నడిచేవానికి బాటలన్నీ చర్మం పరచినట్లు ఉంటాయి కదా!

అయితే ఒక్క విషయం; ఆశకు వశం గాని మనస్సు మాత్రమే వైరాగ్యము యొక్క సహాయము చేత 'పూర్ణత్వం' పొందుతోంది. ఆశ ఎక్కడ ఉంటుందో అక్కడ "దుఃఖం మోహం" అనే మాలిన్యాలు ఉండనే ఉంటాయి. ఆశ – అనే వాసనాత్యాగం చేసిన వారి హృదయంలో 'లోభం, దైన్యం' ఉండవు. అగస్త్య మహాముని జలం పానం చేయగా మిగిలియున్న శూన్యసముద్రంలాగా అది ప్రశాంతము పొందుచున్నది. తృష్ణను జయించి 'శాంతము, వైరాగ్యము'లతో కూడుకొని ఉన్నప్పుడే, ఈ హృదయం శోభిస్తుంది. ఇచ్ఛారహితులు, బ్రహ్మజ్ఞానముచే పూర్ణులగువారు ఈ ముల్లోకములను తృణప్రాయంగా చూస్తున్నారు. ఈ జనసమూహము, తత్సబంధములు గోష్పాదజలంలాగానూ, ఒక 'మహాకల్పము' కూడా అర్థ నిముషములాగానూ కన్పట్టగలదు. ఇచ్ఛారహితునియందు మనకు కనిపించే శీతల సౌమ్యత్వము మనకు హిమాలయ పర్వతాలలోగాని, పూర్ణ చంద్రునియందుగాని, చందన వృక్షమందుగాని, అరటి తోటలోగాని లభించదు సుమా! అతని యందుగల ప్రశాంతతను క్షీరసాగరంతోనో, జగన్మాత లక్ష్మీదేవి ప్రసన్న వదనంతోనో పోల్చవచ్చునేమో!

ఈ అంతఃకరణమును కలుషితం చేస్తున్నదేది?... "ఆశ" అను పిశాచమే! ఈ చిత్తం యొక్క ఆశలే, దశదిశలా ప్రసరించి ఉన్నాయని గ్రహించు. ఆశ తొలిగించబడినప్పుడు ఇదే చిత్తము బ్రహ్మమై వెలుగొందుచున్నది. ఎప్పుడైతే ఆశలు లయిస్తాయో, రహితమౌతాయో – మరుక్షణం అంతకు ముందటి అల్ప ధైర్యం కూడా బహువిస్తారమైన ఒక మహా వృక్షంలాగా శతశతాధిక శాఖలుగా విస్తరిస్తుంది. వైరాగ్యయుక్తుడు, ఇంద్రియములను జయించివేసినవాడు, ఆశ నశించగా

ధైర్యము వహించినవాడు, అగు జీవుడు ఉత్తమోత్తమమైన పదమును తనకు తానే అధిరోహిస్తాడు. ఆతనికి మరొకరెవరో వచ్చి ప్రసాదించవలసిందేమీ ఉండదు.

అభయం! - ఓ రాఘవా! ఈ జీవుడు కనుక పవిత్రాంతఃకరణుడై, చిత్తవృత్తులకు చోటు ఇవ్వకుండా ఉన్నాడనుకో ... ఇక ఈ జన్మకర్మ మొదలగు వాటి గురించి భయాదులు ఉండవు. ఈ చిత్తము వృత్తిరహితమై "అచిత్తత్వము" పొందిందా, ఇక ఈ జీవుడు పూర్ణమగు మోక్ష స్థితిని పొందినవాడే అవుతాడు.

చింతన చేయటమునే 'వృత్తి' అని అంటున్నాం. అట్టి చిత్త వృత్తి 'ఆశ' చేతనే ప్రవృత్త మౌతోంది. కదలించబడుతోంది. 'ఆశ' అనే చిత్త వృత్తిని జయిస్తే, ఈ జీవుడు తప్పక "చిత్తరాహిత్య స్థితి"కి అర్హత పొందుతాడు.

ఏది ఏ వృత్తితో కూడుకొని ఉంటుందో – అది ఆ వృత్తి యొక్క "అభావము" చేతనే నివృత్తి అవుతుంది. కనుక చిత్తమును ఉపశమింపజేయడానికి "భావరాహిత్యం" లేక "భావాతీతమైన కేవల సాక్షిమాత్రం" అభ్యసిస్తూ రావాలి. ఈ "పుత్ర, విత్త, లోక" విషయముల గురించి సర్వకోర్కెలను వదలి వేయాలి. ఇక విధి–ధర్మములు అంటావా.... అవన్నీ ఆశ, నిరాశ, వేదన, దోష దర్శనం వంటి దోషభావములచే స్పృశించబడని బుద్ధితో ఉపాసనాభావంతో నిర్వర్తించబడు గాక!

ఓ సభికులారా! ఆశ అనబడే సంసార బంధమును విడనాడి, చిత్తమును ముక్తత్వము వైపు నడిపే ఉపాయాలను గురించి యోచించండి. మనసులో ఉండే దుష్ట ఆశలే ఆత్మకు బంధనమును కల్పించుచున్నాయి. అట్టి దుష్ట ఆశలు ఉపశమించిన తరువాత ఇక ముక్తుడు కానివాడు ఎవడుంటాడు? కనుక క్రమక్రమముగా ఆశలు త్యజించివేస్తూ ఉండండి. లేదంటే బలి చక్రవర్తిలాగా అకస్మాత్తుగా ప్రబోధం పొందండి. పరిపూర్ణమైన జ్ఞానవృత్తిని అవలంబించండి.

శ్రీరాముడు : హే మహర్షీ! "ఆత్మ తత్త్వ ప్రవచనము" అను తమ యొక్క కృపారస స్రవంతిచే మేమంతా ధన్యులమౌతున్నాం. నిర్మలమగు ఆత్మ పథంనందు విశ్రాంతి పొందుచున్నాం. హృదయంలో 'తృష్ణ' అనే నిబిడాంధకారం ఉపశమిస్తోంది.

మీ దివ్యమైన వచనములు వింటున్నకొద్దీ ఇంకా వినాలనిపిస్తోంది. మీరు బలి చక్రవర్తి అకస్మాత్తుగా ప్రబోధితుడైనాడని అన్నారు కదా! ఆ వృత్తాంతము తెలియజేయమని ప్రార్థిస్తున్నాను. తమ వంటి మహాత్ములు 'బోధ' అనే అమృతం వర్షింప జేయటంలో అలసటయే ఎరుగరు కదా!

❖❖❖

IV. బలి చక్రవర్తి

1. చర్విత చర్వణం

శ్రీ వసిష్ఠ మహర్షి : ఓ రఘురామా! బలి చక్రవర్తి వృత్తాంతమొకటి చెప్పుచున్నాను. ఇది వింటే శాశ్వతమైన 'తత్త్వానుభవం' అవగాహనకు రాగలదు.

ఈ బ్రహ్మాండమునకు ఒకానొక దిక్కు నందు భూమికి అధోభాగంలో పాతాల లోకం ఉన్నది. అది కొండంత ఆకారంగల దానవులచే తదితర పాతాళజీవులచే వ్యాప్తమై ఉన్నది. ఒకానొక సమయంలో ఆ పాతాళ లోకమున విరోచనుడు అను వాని కుమారుడు, బలి చక్రవర్తి, పాతాళ–భూ లోకములను ఆక్రమించి రాజ్యమేలుతూ ఉండేవాడు. అతడు తన భక్తి, త్యాగ నిరతులచే విష్ణు భగవానుని రక్షణ పొందియున్నాడు. అందుచేత, ఆతని పేరు వింటేనే దేవతాదులు కూడా భయ పడేవారు. ఆతడు దేవతలపై దండెత్తి వారిని జయించి, వారి విభవములను సొంతం చేసుకున్నాడు. వారిని అల్పప్రదేశ పరిమితులుగా చేసివేశాడు.

చాలా కాలం గడిచిపోయింది. ఒక సమయంలో ఆ బలి చక్రవర్తి హృదయంలో వైరాగ్య పూర్వకమైన పరిశీలన జనించింది. ఇది ఇట్లా ఉండగా, ఆతడు ఒక రోజు వాహ్యాళికై బయలుదేరాడు. పరివారాన్ని, రాజ్యాన్ని వదలి ఒంటరిగా అటునుంచి మేరుపర్వత శిఖర ప్రాంతంలోని ఒక నిర్మానుష్య ప్రదేశం చేరాడు. ఒకానొక అనుకూల ప్రదేశంలో సుఖాసీనుడై ఇక యోచించసాగాడు –

బలిచక్రవర్తి (తనలో) : రాక్షసకులంలో పుట్టాను. తపస్సు చేసి కష్టపడి ఎంతో శక్తి సంపాదించాను. దేవతలను కూడా గజగజలాడించాను. సద్గురువులగు శుక్రాచార్యులవారి సమక్షంలో ఎన్నో యజ్ఞ, యాగాదులు నిర్వర్తించాను. ఇప్పుడు ఈ పాతాళ లోకంలో రాజ్య మేలుచున్నాను. ఎంత కాలం ఈ ముల్లోక విహారం? అనేకమైన అద్భుత కర్మలు నిర్వర్తించాను. అంతా బాగానే ఉన్నది కానీ, ఈ విశాల రాజ్యము వలన నాకు ఏమి ప్రయోజనం? ఆజ్ఞాపించటాలు – దుస్తులు – స్తోత్రములు – దేవతలపై దండెత్తటాలు, – వారి విభవములను మూటకట్టుకుని పాతాళలోకం చేర్చటాలు – తదితర రాచకార్యములు ఇవన్నీ కూడా చిన్న పిల్లల ఆటలోని కల్పిత విశేషములులాగా ఉన్నాయి. ఎన్ని భోగములు ఎంత అనుభవిస్తే మాత్రం వాటిలో ఏమున్నది ప్రత్యేకత? ఇవన్నీ నిజముగా సుఖ ప్రదములా? కానే కావు. ఈ భోగములు 'అవిచారణ' చేతనే రమణీయంగా తోచుచున్నాయి.

నిజానికి ఇక్కడ నాశనశీలము కానిదేది? అదే పగలు... అదే రాత్రి... అవే అన్నపానములు. ఆహా! ఈ విధంగా చర్వితచర్వణముగా చేసిందే అనేకసార్లు మరలామరలా చేసుకుంటూపోతున్నాం. అనుభవించిందే మరలా అనుభవిస్తున్నాం. ఆత్మ జ్ఞానులగు మహాత్ములు ఈ ఆశలను, ఆలోచనలను, ప్రవర్తనలను చూచి నవ్వుకుంటున్నారే! ఈ భౌతికమైన వస్తువులు, రాజ్యములు, మొదలగు వాటిని

చూచుకొని "అహో! మేము ఎంతటి వారం!" అని మురియటమేమిటి? స్వల్పకాలంలో వేరొక గతిని పొందబోయే "ఈ భోగాలు – బంధుమిత్ర సమాగమాలు – ఈ కాంతాలింగనాలు" ఇవన్నీ పిల్లలు ఆడుకొనే ఆటల వంటివే కదా! రసహీనమైన ఈ క్రియాకలాపములందు ఎన్ని రోజులు నిష్ప్రయోజనంగా గడచిపోతున్నాయి? ఎంత ఆయుష్షు వృథా అవుతోంది! బుద్ధిమంతుడైనవానికి ఇదంతా చూస్తుంటే 'సిగ్గు' అనిపించదా? ఇదంతా వ్యర్థవ్యవహారమే కదా!

జలం తరంగ రూపం పొంది, మరల ఆ తరంగం జలరూపం అగుచున్నట్లు ఇతఃపూర్వపు క్రియలనే ఈ జనులు పదేపదే పొందుచున్నారు. ఇందులో క్రొత్తది, అద్భుతమైనది అంటూ ఏమున్నది?

పిచ్చివాడు "ఏమిటి ప్రయోజనం?" అని యోచించకుండానే ప్రతిరోజూ ఏవేవో క్రియలు చేస్తున్నట్లే, నేను కూడా ఈ రాజ్య, సుఖ, భోగ క్రియాదులను ఆశ్రయిస్తున్నాను. ఎందుకు? వీటిలో కర్మ రాహిత్యముగానీ, కృతకృత్యముగానీ ఏమైనా ఉన్నదా? లేనప్పుడు, శాంతి లభించనప్పుడు వీటి వల్ల ఏం ప్రయోజనం? కనపడీ కనపడకుండా ఈ కర్మలు నేను ఎంతకాలం ఆచరించాలి? దీనికి అంతు ఎక్కడ?

యథార్థానికి ఈ కనపడేదంతా వస్తు శూన్యమే కదా! వాస్తవమైనదీ, శాశ్వతమైనదీ ఉపశమన సహకారికమైనదీ ఈ ముల్లోక వస్తువులలో ఏదైనా ఉన్నదా? లేదే! ఈ అతి విస్తారమగు బాల క్రీడను ఈ జీవులు మాటిమాటికీ దుఃఖము కొరకే వ్యర్థముగా ఆశ్రయించుచున్నారే!

దేనిని పొందిన తరువాత, ఇక కర్తవ్యమంటూ ఏమీ ఉండదో అట్టి ఉత్తమ పురుషార్థం ఇక్కడేదీ కనిపించుట లేదు. ఈ తుచ్ఛమగు విషయసుఖములకంటే ఉత్తమమైనదేదీ ఇక్కడ లేదా? సరే... ఈ విషయం గురించి విచారిద్దాం...!

❖

ఇట్లా యోచన చేస్తూనే బలి చక్రవర్తి ధ్యాననిష్ఠుడయ్యాడు. ఆ తరువాత మరల కనుబొమ్మలు విశాలం చేసి యోచించసాగాడు. ఆతనిలో ఏవో ఆలోచనలు తళుక్కున మెరిశాయి. ఇతఃపూర్వపు సంస్కారములు, తాను విని ఉన్నట్టి శాస్త్రార్థాలు స్మృతిపథంలో వెలిశాయి. అయితే వాటిని ఆతడు సమన్వయించుకోలేకపోయాడు. ఇతర ఆలోచనలన్నీ కట్టిపెట్టి ఒకప్పుడు తనకు, తన తండ్రి విరోచనునికి జరిగిన ఒక సంభాషణను స్మృతి పథంలోకి తెచ్చుకుని పరిశీలించసాగాడు.

❖❖❖

2. ఒకప్పటి బలి - విరోచనుల సంవాదం

బలి: తండ్రీ! ఈ ఇహపర లోక విషయాలన్నీ ఆమూలాగ్రం తెలిసి ఉన్నవారు, మహాత్ములు, తత్త్వవేత్త, గొప్పమేధస్సు గలవారైన మిమ్ములను కొన్ని విషయాలు అడిగి తెలుసుకోవాలనుకుంటున్నాను. దయచేసి అనుగ్రహించండి.

ఈ జగత్తులో అనేక దృశ్యవ్యవహారములు, కార్యక్రమములు తారసపడుచున్నాయి. "సుఖప్రాప్తి" అను మృగతృష్ణలోని వ్యవహారంలాగా, ఇక్కడ తారసపడే అనేక సంఘటనలు, వ్యవహారములు

భ్రమ మాత్రమే కదా! ఇవన్నీ దుఃఖకరములేనని నాకు అనిపిస్తోంది. ఈ భ్రమలన్నీ చాకచక్యంగా పుట్టుకొస్తున్నాయి. ఈ సంసారమునకు అంతు ఉన్నదా? ఇదంతా ఉపశమించటమెట్లా?

కోపశాన్తేమనోమోహః క్వాతీతాఃసక లైషణాః ।
విరామరహితంకుత్ర తాత విశ్రమణంచిరమ్ ॥ (శ్లో 45, సర్గ 22)

కింప్రాప్తేహ సమస్తేభ్యః ప్రాప్యేస్మింస్తృప్తిమాన్పుమాన్ ।
కిందృష్ట్వాదర్శవంభూయో నతాతోపకరోత్యలమ్ ॥ (శ్లో 46, సర్గ 22)

ఈ మనస్సు దుఃఖరహితమైన పూర్ణశాంతిని పొందే సమయం గాని, చోటు గాని ఎన్నటికైనా, ఎక్కడైనా ఉన్నదా? దేనిని పొందిన తరువాత ఈ జీవునకు మరల పొందవలసినదంటా ఏమీ ఉండదు?... ఏ మార్గం లేక ఉపాయంచే బ్రహ్మ లోకపర్యంతము ఇక ఆశించవలసినదేమీ ఉండదు? ...దేనిని దర్శించిన తరువాత ఇక దర్శించవలసినదేమీ ఉండదు...?

హే తండ్రీ! ఒక్క విషయం మాత్రం అత్యంతసుస్పష్టమౌతోంది. ఈ సాంసారిక భోగములు అనేకం ఉండవచ్చుగాక! ఇవన్ని కూడా వాస్తవమైన, శాశ్వతమైన సుఖమును ప్రసాదించగలిగేవి ఏమాత్రం కాదు. పైగా.... ఇక్కడి భోగములు చూచారా? ఇవి చాలా మంచివారి మనస్సులను కూడా క్షోభింపజేయగలుగుచున్నాయే! కుసంస్కారములకు మార్గమగుచున్నాయే!

సరే, నా మాటలు అటు ఉంచండి. ఇప్పుడు నాదొక ప్రశ్న. ఇక్కడ "స్వాభావికంగానే ఆనందదాయకము, ఉత్తమము, ఎప్పటికీ ప్రశాంతదాయకము" అయిన వస్తువుగాని, విషయముగానీ ఏదైనా ఉన్నదా? ఉంటే, అద్దానిస్థితిని పొంది, నేను విశ్రాంతిని అనుభవించగలను! అప్పటిదాకా నన్ను ఆవరించియున్న విచారము, అగమ్యత్వము, అవివేకము, క్షోభ వదిలేట్లు లేవు. మిమ్మ శరణువేడుచున్నాను. బోధచే నన్ను సముద్ధరించండి.

❖❖❖

3. మంత్రి వశం అయిపోతున్న రాజుగారు

విరోచనుడు : చాలా సంతోషం. ఇప్పటికి నీవు ఉత్తమవిచారణకు వచ్చావు. ఔను! సర్వ మనోవ్యథలు, సంతాపాలు, ఆర్తులు, కర్మవ్యవహారాలు రహితం కాగల ఒకానొక ఉత్తమ స్థానం ఉన్నది. ఆ స్థానం గురించి తెలుసుకుంటే నీకు గాని, మరెవ్వరికైనా గాని, సర్వ నిరుత్సాహాలు, ఉద్వేగాలు, దుఃఖాలు ఉపశమిస్తాయి. అయితే ఆ స్థానం గురించి, అక్కడి 'రాజాధిరాజు' గురించి, ఆ రాజుగారిని సేవించే ఆతని మంత్రి గురించి కొన్ని అతి చమత్కారమైన విశేషాలు ఉన్నాయి. అవి ఏమిటో చెపుతా విను–

అంతటా అన్నివేళలా ఆక్రమించియున్న ఒక మహాసామ్రాజ్యం ఉన్నది. ఒక రాజాధిరాజు ఆ రాజ్యం ఏలుచున్నాడు. ఆ రాజ్యంలో, లేక, ఆ రాజాధిరాజుగారి సమక్షంలో ఇక్కడ కనబడే స్వర్గ–మర్త్య–పాతాళ లోకములు, సముద్రాలు, పర్వతాలు, వనములు, తీర్థములు, నదులు, చెఱువులు,

భూమి, ఆకాశం మొదలగునవి లేవు. అక్కడ అంతరిక్షం లేదు, వాయువులేదు, ఈ సూర్యచంద్రులు లేరు. లోకేశులగు విష్ణు-బ్రహ్మ-ఇంద్ర-మహేశ్వరులు కూడా అక్కడ లేరు. దేవ-దానవులు గాని, భూత-యక్ష-రాక్షసాది భిన్న స్వభావజీవులు అక్కడ లేరు. పంచభూతములకు ఊర్ధ్వ-అధో దిశలకు, స్వర్గ-నరకాదులకు, హిమాలయము వంటి పర్వతాదులకు ఆ స్థానంలో చోటే లేదు.

ఆ రాజ్యాన్ని (లేక) స్థానాన్ని ఏలే ఆ రాజు మహామహనీయుడు. అద్వితీయుడు. నిత్యుడు అఖండుడు. ఆనందమయస్వరూపుడు. ఆతడు ఆనిర్వచనీయ ప్రకాశశీలుడు. రాజాధిరాజగు ఆతడు సర్వవ్యాపి. సర్వస్వరూపుడు. అంతేకాదు.... మహత్తరమైన శక్తి సంపన్నుడగు ఆ రాజు సంకల్ప మాత్రం చేతనే దేనినైనా సరే సృష్టించగలడు, స్థితింపజేయగలడు, లయకారుడై లయింపజేయగలడు.

ఆ రాజుగారు ఒకానొకప్పుడు సర్వ రాచకార్యములు నిర్వర్తించటానికి గాను తన యొక్క 'సంకల్పము' అను ప్రభావముచే - "సర్వలక్షణ సమన్వితుడు, సర్వలక్షణ విలక్షణుడు" అగు - ఒక గొప్ప మంత్రిని, నియమించుకున్నారు. అన్నిటినీ నిర్ణయించి, సమాలోచనలు చేసి, సర్వ వ్యవహారాలు నడిపేదీ మంత్రిగారే! ఇష్టం, అయిష్టం, వాటిని ఆశ్రయించి ఉన్న నవరసాలు - ఇవన్నీ కూడా మంత్రి గారి మంత్రాంగమే. ఆ అధికారమంతా ఆ మంత్రికి ప్రసాదించింది ఆ రాజు గారే!

ఇక రాజుగారు ఏం చేస్తూ ఉంటారు? - ఆయన ఏమీ చేయరు. కేవలం సాక్షీభూతుడై సర్వమును తిలకిస్తూ ఉంటారు. రాజుగారు అక్కడ ఉంటే చాలు.... ఆయన సమక్షంలో మంత్రి చేత సమాలోచించబడి సర్వము జరిగిపోతోంది. రాజు యొక్క ఉద్దేశమును అనుసరించే, కనుసైగ మాత్రంగా మంత్రి సర్వ వ్యవహారములు నడిపిస్తున్నారు.

ఆ మంత్రి కూడా తక్కువ వాడేం కాదు. "ఇది అసంభవం... ఇట్లా ఘటిల్లదు"- అనునవి కూడా సంభవింపజేయగల సామర్థ్యం ఆ మంత్రికి ఉన్నది. అతడు ఎంతటి వాడంటే.... తన శక్తి యుక్తులు, వ్యూహాలు ప్రయోగించి మహారాజంతటి వాడిని తన మాట తూ.చ. తప్పకుండా వినేట్లు చేసుకుంటున్నాడు. ఇక రాజుగారు తన స్వభావం - అధికారం ఏమరచి మంత్రి చేస్తున్న దాని కంతటికీ వశుడి వలె ఉంటున్నాడు. మంత్రి చేస్తూన్న కొన్ని పిచ్చిపనులు తనను బాధించేవి, తన అధికారాన్ని ప్రశ్నించేవి అని తెలిసి కూడా ఎందుకో అట్లా ఊరకుని ఉండిపోయి చూస్తున్నాడు.

ఏది ఏమైతేనేం! ఆ మంత్రి మాత్రం దేనిని స్వయంగా, అంటే, రాజుగారిచే ప్రసాదించబడిన అధికారం లేకుంటే ఏదీ నిర్ణయించనూ లేడు, నిర్వర్తించనూ లేడు. అనుభవించనూ లేడు. రాజును వేరుగా చూస్తే ఆ మంత్రి కేవలం జడం మాత్రమే. ఆతనికి ఆ అధికారం ప్రసాదించింది మహారాజే కదా! అజ్ఞుడై - జడుడై ఉండి కూడా, రాజుగారి కొరకు రాజు ప్రసాదించిన అధికారముల చేతనే కార్యములు నిర్వర్తిస్తూ ఉంటాడు. మంత్రి పనులు చేస్తూ ఉంటే, ఇక రాజు ఏదీ చేయకుండా సింహాసనం అధిష్ఠించి కూర్చుని సాక్షి మాత్రంగా అంతా చూస్తూ ఉంటాడు.

కుమారా! బలీ! నీవు గొప్ప బలపరాక్రమములు కలవాడివే. దేవతలను కూడా అలవోకగా అల్లల్లాడించావు. కాని ఏం లాభం? 'ఆ రాజ్యం' నీవు సంపాదించుకోనేలేదు. అందుకే నీకీ దుఃఖం

సంప్రాప్తిస్తోంది. నీ బలపరాక్రమములు 'ఆ మంత్రి' ముందర ఎందుకూ పనికిరావటంలేదు. అది గమనించు. ఇక రాజు అంటావా.... ఆయనను జయించగల వారంటూ ఎవరూ ఉండరు. ఆయనను ప్రసన్నం చేసుకుంటే చాలు. ఆ రాజ్యం నీకు ప్రాప్తించినట్లే!

బలి: తండ్రీ! శారీరకమైన, మానసికమైన బాధలంటూ ఉండనట్టి ఓ మహాత్మా! మీరు చెప్పే ఆ రాజ్య స్థానం ఎక్కడున్నది? అది మనకు ప్రాప్తించేది ఎట్లా? దానిని పొందినవారెవరైనా ఉన్నారా? మీరు చెప్పే ఆ రాజాధిరాజు సమాచారం ఎప్పుడూ వినలేదే? మనం ఒక ఆటలాగా జగత్తులన్నీ మన భుజబలంతో జయించాం కదా! మనచేత కూడా జయింపబడజాలని ఆ రాజెవ్వడు? మీరు దేవతలనే భయపెట్టారు కదా! మీరు కూడా ఆతనిని జయించలేరా? ఆ మంత్రి మనందరి కంటే బలవంతుడా?

విరోచనుడు : అవును. ఈ దేవతలు – రాక్షసులు, వీరంతా ఒక్కసారి గుమిగూడి దండెత్తినా సరే – బలిష్టుడగు ఆ మంత్రిని జయించలేరు. యముడు, కుబేరుడు, ఇంద్రుడు, తదితర దేవ దానవ వీరులు – అంతా కలిసి కూడా ఆ మంత్రిని భయపెట్టలేరు. మన వద్ద ఉండే గదలు, చక్రాలు, శస్త్రాలు, రథాలు, అస్త్రాలు – ఇవన్నీ ఆ మంత్రి ముందు సూర్యుని ఎదురుగా ఉంచిన దివిటీ వంటివి మాత్రమే. మనస్సే రూపముగా గల ఆ మంత్రి శస్త్రాస్త్రములకు, ముష్టిఘాతములకు అసలు విషయమే కాదు. ఈ దేవాసురులనందరినీ, నీతో–నాతో కూడా, తన వశం చేసుకుని నడిపిస్తున్నాడు.

ఆ మంత్రి విష్ణువు కాదు. కాని, నీ ప్రపితామహుడగు హిరణ్యాక్షుడు మొదలైన మహాపరాక్రమ వంతులను ఆక్రమించి వినాశన మొనర్చుచున్నాడే! విష్ణువును నిమిత్తంగా చేసుకుని వాళ్ళందరినీ కడతేర్చింది ఆతడే. ఆతడు సర్వులకు జ్ఞానోపదేశం చేసే నారాయణుడు మొదలగు దేవతలను కూడా తన వశం చేసుకొని అనేక యోనులందు పడవేయుచు, ఆయా ఉపాధులలో ప్రవేశింప జేసి తోలుబొమ్మలాట ఆడిస్తున్నాడు! ఆతని ప్రతాపం చేతనే సామాన్యుడగు మన్మథుడు కూడా అత్యంత శక్తిమంతుడై తన పంచబాణములతో త్రిలోకములను ఆక్రమించి, సామ్రాట్టు వలె విజృంభించ గలుగుచున్నాడు. అది సరే. మనకు దేవతలకు అనేక సార్లు అనేక యుద్ధాలు కల్పించినది 'క్రోధము' కదా! ఈ క్రోధము అనబడేది దుష్టాకారయుతమై, గుణహీనమై, దుర్మతియుతమై సురాసుర సమూహమును వినాశనం చేస్తోందికదా! ఈ క్రోధము యొక్క ఉనికి ఆ మంత్రి యొక్క కళాప్రదర్శనా విభాగము లోనిదే!

బలి: నేను అతి చమత్కార స్వరూపుడగు ఆ మంత్రిని వశం చేసుకోగలనా?

విరోచనుడు : నీ ప్రయత్నం ఉచితం, ఆవశ్యకం కూడా! అది ఉత్తమోత్తమమైన విషయం. నీవు తప్పక సాధించగలవు. అయితే నీవు ఆ రాజాధిరాజును ఆశ్రయించి మంచి చేసుకుంటే గాని, మంత్రిని ఏమీ చేయలేవు.

మంత్రిని జయించనంత వరకు నీకు శాంతి – సౌఖ్యాలు లేవు. ఆ రాజును ఆశ్రయించే వారికి మంత్రి సులభసాధ్యుడు. లేదా, పెద్ద పర్వతమును ప్రక్కకు నెట్టటం అసాధ్యమయినట్లే

ఘనీభూతమై ఎదురుగా ఉన్న ఆ మంత్రిని కదల్చలేము. ఆతనికి వశులము, బందీలము కావలసిందే గాని, ఇంకేమీ చేయలేము.

ఒకానొకప్పుడు సుకృత పరిపాకం చేత ఆ రాజుగారిలో వివేకదృష్టి జనిస్తోంది. కాలక్రమంగా రాజుగారికి, "ఏమైనా సరే, ఈ మంత్రిని నా వశంలో ఉంచుకోవలసిందే" – అను కోరిక వృద్ధి అగుచున్నది. అటుపై స్వల్పయత్నముతోనే మంత్రి నిరోధింపబడుచున్నాడు కూడా.

పుత్రా! బలీ! నీవు అనేకమంది దిక్పాలకులను, ఇంద్రుడినీ కూడా జయించావు. కానీ ఏం లాభం? నీ 'మనస్సు' అనే ఈ మంత్రి ఈ మూడు లోకములందలి బలిష్ఠులైన వారందరి కంటే మిక్కిలి బలిష్ఠుడు. ఆతడు తలచుకొంటే క్షణంలో మూడు లోకములను మృతప్రాయం చేసివేయగలడు. ఆతని ముందు నీ కండ బలం ఎంతటిది? అట్టి మనస్సు అనే మంత్రిని జయించగలిగితే పరాక్రమ వంతుడ వనిపించుకుంటావు.

ఆ మంత్రివర్యుడే ఈ మూడు లోకములకు ఉనికిని, ఔన్నత్యమును ప్రసాదిస్తున్నాడు. ఆతడు అస్తమిస్తే, ఈ మూడు లోకాలుకూడా అస్తమిస్తాయి.

కనుక కుమారా! మనం ఊరికే దుఃఖిస్తూ నిర్లిప్తతను, నిరుత్సాహాన్ని, నిస్తేజాన్ని అవలంబిస్తూ కూర్చుని ఉంటే వచ్చే లాభం ఏమిటి చెప్పు? మనం అజ్ఞానమును పారద్రోలాలి. ఏకాగ్రచిత్తులమై 'మనస్సు' అనే మంత్రిని జయించాలి. మనస్సును జయించామా, ఇక ఇప్పటివరకు మనచే జయించ బడని లోకములన్నీ జయించబడినట్లే! లేక, మంత్రిగారు వచ్చి ఇచ్చవచ్చినట్లు మనలను ఆడిస్తున్నారా... మనం జయించిన లోకములన్నీ జయించబడనట్లే!

అందుచేత "నిత్యసుఖస్వరూపము, అనంత సిద్ధి" అయిన ఆత్మ భగవానుని, సమక్షము కొరకు మనం 'మనస్సు' అనే మంత్రిని జయించాలి. మనస్సును జయించటానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధం కావాలి. అన్నిటికీ సిద్ధపడి, అందుకు ప్రయత్నించాలి.

ఈ మనస్సు అనే మాంత్రికుడు నిన్ను, నన్ను, ఈ లోకములను బొమ్మలాట ఆడిస్తూ ఉన్నాడు. మనకు ఈ బాహ్య జీవులగు దేవతలు మొదలగువారు నిజమైన శత్రువులు కాదు. వారు 'మహా'అయితే ఒక ఉపాధిని ఖండించగలరు. మన నిజమైన శత్రువు మన మనస్సే.

అసలైన శత్రువును కొంపలోనే పెట్టుకొని, ఆ శత్రువును గెలిచి, లోబరుచుకోకుండా, ఇక ఈ లోకములన్నీ మనం గెలిచి వశంచేసుకుంటే మాత్రం ఏం ప్రయోజనం?

❖❖❖

4. ఆ మంత్రి మనవశమయ్యేదెట్లా?

బలి: గొప్పబలశాలి, స్వయంకృతము అయిన ఆ మంత్రి గారిని మేమెక్కడ జయించగలం చెప్పండి? అది ఏదో కొద్ది మందికే సాధ్యం. మేము నియతిని, ప్రారబ్ధము (law of causation & tendencies born of past actions)లను అనుసరించి "రాజ్యాలు – యుద్ధాలు" మొదలైన అనేక లౌకిక క్రియా

విశేషములలో చిక్కుకున్నాం. ఆ మంత్రి మహాబలశాలి అని మీరే అంటున్నారు కదా! అయినా, ఆతనిని జయించటానికి ఉపాయాలేమన్నా ఉన్నాయా? శాస్త్రాదులు చదవాలా? మంత్ర-తంత్రాలేమైనా నేర్వాలా? లేక ఇంకా ఏం చేస్తే మనం మంత్రిని తిరిగి వశపరచుకోగలం? ఈ విషయాలు సత్వరం చెప్పండి.

విరోచనుడు : కుమారా! ఆ మంత్రి మహాబలశాలి, అజేయుడు అయినమాట నిజమే. అయినప్పటికీ ఆతనిని జయించే మార్గం ఉంది చెపుతాను విను –

పుత్రయుక్త్యాగృహేతోసౌ క్షణాదాయాతివిశ్వతామ్ ।
యుక్తింవినాదహత్యేష ఆశీవిషివోద్ధతః ॥ (శ్లో 3, సర్గ 24)

'యుక్తి'(ఉపాయం) చేత ఆతడు క్షణంలో వశీకృతుడౌతాడు. యుక్తిలేకపోయిందా, ఒక 'కోడెత్రాచు' లాగా ఎంతటివారినైనా సరే, భస్మీ భూతంచేసి వేయగలడు.

ఒక బాలుని లాలించినట్లుగా యుక్తి చేతనే ఆతనిని లాలిస్తూ, వశం చేసుకోవాలి. అట్లా వశం చేసుకున్నామా... రాజుగారిని దర్శించి దివ్యపదమును పొందుతాం కదా! రాజు యొక్క దర్శనమైతే మంత్రి కూడా మన వశం అవుతాడు. మంత్రి మన వశం అయ్యాడా రాజు దర్శనం అవుతుంది.

యావన్నదృష్టోరాజాసౌ తావన్మన్త్రీనజీయతే ।
మన్త్రీచయావన్న జితస్తావద్రాజానదృశ్యతే ॥ (శ్లో 7, సర్గ 24)

రాజు దర్శనం కానంతవరకు మంత్రిని జయించలేం. మంత్రిని జయించనంతవరకు రాజుగారు మనకు కనిపించరు.

చిత్రం చూచావా! రాజదర్శనం కాకపోయినంతకాలం ఆ దుష్ట మంత్రి నిన్ను నానాతిప్పలు పెడుతూనే ఉంటాడు. "రాగములు, ద్వేషములు, హర్షము, ఉద్రేకము, మానము, అవమానము, క్రోధము, లోభము, దిగులు, దుఃఖము", ఈ విధంగా అనేక తళుకుబెళుకులతో తన యజమానికే భ్రమగొలుపుతాడు. ...ఏదోవిధంగా ఆమంత్రిని వశం చేసుకోవాలి.

అనేక శాస్త్రార్థాలు తెలిసినవారు కూడా ఆ మంత్రిని జయించలేక పోవుటచే వారికి రాజదర్శనం కావటంలేదు. అందుచేత కుమారా! బుద్ధిమంతుడైనవాడు ఈ రెండిటి కొరకు అభ్యాసపూర్వకంగా నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలి– 1. రాజ దర్శనం చేయటానికి, 2. మంత్రిని ఓడించటానికి.

పురుష ప్రయత్న పూర్వకమైన అభ్యాసం చేత ఆ రెండిటిని ఒక్కసారిగా నిర్వర్తించటమే శుభ ప్రదం. అభ్యాసం సఫలీకృతం అవుతూ ఉంటే ఇక దుఃఖాదులు లవలేశమైనా ఉండనట్టి 'ఆత్మ పదము' అను ఉత్తమ స్థానం మనం పొందగలుగుతాం. మహాత్ములగు అనేకులు ఆ స్థానం పొంది సంసార శ్రమనంతా నశింపజేసుకున్నవారై, నిత్యవికసిత హృదయులై ఉంటున్నారు. సర్వ సంశయాలూ నశించుటచే ప్రశాంత స్వరూపులగుచున్నారు.

ఆ మహారాజుండే స్థానం ఏర్పడిఉన్న దెక్కడ? సర్వ దుఃఖములు వినాశనం పొందే మోక్షమే ఆ స్థానం. అక్కడి రాజు ఆత్మ దేవుడే కదా! అట్టి ఆత్మయే ...మనుష్యానందము మొదలుకుని బ్రహ్మ దేవుని ఆనందము వరకు ఆనందము లన్నిటికన్నా పరమైయున్నది. అద్దానిని 'నిరతిశయానందము' అని అంటారు. అంతకుమించి కోరతగినది, పొందవలసినది ఉండదు. కాబట్టి అది ఇంద్రియానందం వంటిది కానే కాదు. ఇంద్రియములకు పరమై ఉన్న ఆ ఆత్మదేవుడే మిక్కిలి ప్రజ్ఞానవంతుడగు మనస్సును తనకు మంత్రిగా నియమించుకొనినాడు.

ఈ జగత్తు ఎక్కడి నుండి వచ్చింది?... మట్టి కుండగా అగునట్లు, పొగ మేఘ రూపంగా పరిణమించినట్లు, మనస్సు నందు గల సూక్ష్మ వాసనలే ఈ జగత్తు ఆకారంగా పరిణమించుచున్నాయి.

బలి: "మనస్సును జయించితే సర్వము జయించబడినట్లే" అని అన్నారు కదా! ఈ మనస్సును జయించటానికి ఏమైనా యుక్తులు, ఉపాయాలు, మార్గాలు చెప్పమని ప్రార్థన.

విరోచనుడు : యుక్తిచే ఏదైనా సాధిస్తున్నాం కదా! ఈ మనస్సు విషయంకూడా అంతే. ఒక ఉపాయం చెపుతాను... విను–

విషయాన్ప్రతిభోః పుత్ర సర్వానేవహిసర్వథా ।
అనాస్థాపరమాహ్యేషా సాయుక్తిర్మనసోజయే ॥ (శ్లో 17, సర్గ 24)

"విషయభోగములన్నిటి యందూ కోర్కెను సంపూర్ణంగా త్యజించివేస్తే చాలు" ఇదే మనో జయమునకు ఉపాయం.

విషయములపట్ల కోర్కె లేకపోవటమే ఉత్తమమైన యుక్తి. మదించిన ఏనుగు వంటి ఈ మనస్సును "విషయ రాహిత్యము" చేత మాత్రమే వశం చేసుకోగలం. అయితే, ఒక్క విషయం.

ఏషాహ్యత్యన్తదుష్ప్రాపా సుప్రాపాచమహామతే ।
అనభ్యస్తాతిదుష్ప్రాపా స్వభ్యస్తా ప్రాప్యతేసుఖమ్ ॥ (శ్లో 19, సర్గ 24)

ఒక విధంగా చూస్తే విషయ రాహిత్యమనేది ఇంచుమించు అసాధ్యం. మరొక విధంగా చూస్తే అది సాధించటం తేలిక కూడా! అభ్యాసం చేసే వానికి సులభసాధ్యమే. అభ్యాసం లేకపోతే మాత్రం అసాధ్యం.

ఈ విషయవిరక్తి అనేది క్రమక్రమంగా అభ్యసిస్తూవస్తే పారిజాత పుష్పపు సుగంధం లాగా అంతటా వ్యాపించి విస్తృతం పొందగలదు. అయితే, విత్తనం నాటకపోతే ధాన్యం ఫలిస్తుందా? భోగము లందు ఆసక్తి కలిగియే ఉండి "విషయములు రహితం కావేం?" అనుకుని ఏం ప్రయోజనం? అభ్యాసం కొరవడితే అనుకున్నది ఎవరైనా ఎట్లా సాధిస్తారు?

అందుచేత అభ్యాసం చేతనే ఆ మంత్రిగారు నీ వశం అవుతారు. సాంసారిక విషయములందు విరక్తి చెందనంతవరకు జీవులు ఈ 'సంసారము' అనే మురికి గుంటలో వసిస్తూ దుఃఖాదులను పొందుచూనే ఉన్నారు. మనుజుడు ఎంతటి బలవంతుడైనా, తాను స్వయంగా నడవకపోతే, ఒక

చోటునుండి మరోచోటికి అప్రయత్నంగా వెళ్ళిపోగలడా? అభ్యాసం లేకపోతే విషయములను ఎవ్వరూ జయించలేరు. అందుచేత దేహమును ధరించినందుకుగాను, ఈ జీవుడు 'ధ్యేయవాసన'ను త్యజించటం అభ్యసించాలి. ఏదో పొందాలి... అనేదే ధ్యేయవాసన!

కుమారా! నీవు "సుఖదుఃఖలకు"లకు అతీతమైనట్టి అప్రమేయ స్థితిని పొందాలనుకుంటే, ఎట్లాగైనా భోగముల పట్ల ఏర్పడే నమ్మకమును తగ్గించుకోవాలి. 'విషయత్యాగము' అనే రూపం గల పురుష ప్రయత్నమును మించిన శుభసాధనం మరేదీ లేదు.

బలి: తండ్రీ! ఇతఃపూర్వపు అనేక జన్మలలోను, ఈ వర్తమాన జన్మలోను మేము ఆర్జించియున్న 'ప్రారబ్ధము' మమ్ములను అల్పమైన దృశ్య విషయముల వైపు నెట్టుకుపోతుంటే మేము ఏం చేయాలి? ధ్యేయ వాసనా త్యాగం ఎట్లా సాధ్యం?

విరోచడు : "మేము నియతి లేక ప్రారబ్ధముచే ప్రేరేపించబడి మాత్రమే, శుభాశుభకర్మలు నిర్వర్తించ గలం. మాకు మేముగా ఏమీ చేయలేము" – అని బద్ధకస్థులగు వారు మాత్రమే పలుకుచున్నారు. శాస్త్రదృష్టి కలవారు ఆ విధంగా అనరు. అన్నిటికన్నా ఉత్తమమైనది వర్తమాన – ప్రయత్నమే.

ఎందుకంటే వర్తమానంలో శ్రద్ధతో నిర్వర్తించవలసియున్న ప్రయత్నం నీ చేతిలో ఉన్నది. వర్తమాన సుదృఢ ప్రయత్నములచే పూర్వ సంస్కారములను, వ్యసనములను, దౌర్బల్యములను జయించి వేయాలి.

బలి: తండ్రీ! వర్తమానపు పురుష ప్రయత్నం గురించి మీరు నొక్కి వక్కాణిస్తున్నారు... బాగానే ఉన్నది. అయితే నాదొక సందేహం. తాతగారైన ప్రహ్లాద చక్రవర్తి ఎట్టి వర్తమాన ప్రయత్నాలు లేకుండానే, బాల్యంలోనే ఈ సంసార చిటపటలైన హర్ష– దుఃఖాలను ఉపశమింప జేయగలిగారే? అది వారికి ఎలా సాధ్యపడింది?

విరోచనుడు : అట్టి మహనీయులు ఈ ఉపాధి ప్రాప్తించటానికి ముని ముందే ఇతఃపూర్వపు స్వప్రయత్నాలచే హర్షామర్షములకు నిమిత్తభూతములైన పూర్వ కర్మలను క్షయింపజేసుకుని ఉన్నారు.

"అంతరంగంలో గూడుకట్టుకొని ఉన్న సుఖదుఃఖములకు సంబంధించిన 'అవగాహన – ఆశల ప్రకటనమే ప్రారబ్ధము' – అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అయితే, ఎండమావులలో కనబడేదాని పట్ల 'అది జలము' – అను భావం యథార్థమైన జ్ఞానముచే నశిస్తుంది కదా! పురుష ప్రయత్నబలముచే ఏర్పడిన నియతి రూపమగు ప్రారబ్ధమును కూడా తప్పకుండా భావౌన్నత్యముచే జయించివేయవచ్చు.

సర్వమునకు కర్త అగు ఈ "జీవుడు" అనబడు వాడు మనస్సుకంటే వేరుకాదని మా అభిప్రాయం. ఈ మనస్సు దేనిని ఏ విధంగా కల్పన చేస్తుందో దానిని ఆ విధంగానే పొందటం జరుగుతోంది. మనస్సు "ఇదియే నియతి" అని కల్పన చేస్తూ ఉంటుంది. అట్టి స్వయంకల్పితమైన నియతిని అనుసరించే "ఇది నియతి – ఇది అనియతి" అనునట్లుగా ఆయా పదార్థములను గాంచుచూ ఉంటుంది. నియతి (Destiny)ని కూడా చిత్తమే స్వసంకల్పానుసారంగా ఉత్పత్తి చేయటం జరుగుతోంది. చిత్తమే (లేక మనస్సే) స్వరూపముగా గల ఈ జీవుడు ఒకానొక అర్థవంతమైన జన్మయందు 'సాక్షి

చైతన్యసాక్షాత్కారం' పొందుచున్నాడు. అనగా చిత్తము "అనియతము, నిత్యము, ఏకస్వభావము" – అగు పరమాత్మ యందు ఉపశమనం పొందుతోంది. "నేను సర్వదా సాక్షిమాత్రమగు శుద్ధ చైతన్యమే" – అనే భావన పొందుచున్నది. అప్పుడు అట్టి మనస్సు గల జీవుడు సమాధి రూపమగు "నిర్విషయము"ను స్వీకరించుచున్నాడు. ఆకాశము నందు చలన రహితమైన వాయువులాగా చిత్రభావము నందు సంగరహితుడై, సమాధి వహించి, మౌనస్వరూపుడై ఉంటున్నాడు. సమాధి నుండి లేచుచున్నప్పుడు శాస్త్రములు చెప్పు నియమావళిని ఆచరించుచున్నాడు. తాను గ్రహించిన ఉత్తమ సత్యమును తదితరులకు తెలియజేయుటకు ఆయా శిష్టాచారములందు ప్రవర్తించుచున్నాడు.

పుత్రా! వాయువు వీచుచున్నప్పుడు కొండపై చెట్లు కదులుతూ ఉంటాయి. కొండకాదు కదా! మోక్ష స్వరూపుడగు జ్ఞానికూడా అటు సమాధి నిష్ఠుడైయున్నప్పుడు ఇటు ఆయా వర్ణాశ్రమ ధర్మములు నిర్వర్తిస్తున్నప్పుడు సర్వవిషయములు గ్రహించి ఉండుటచే ఏర్పడిన స్థిరమైన మనస్సు కలిగి ఉంటాడు. తాను మాత్రం విక్షేపరహితుడై ఉంటాడు. అయితే ఈ మనస్సు జయింపబడనంత వరకు నియతి గాని, ప్రారబ్ధము గాని జయింప బడజాలదు.

మానవ జన్మ పొందుటచే ఈ జీవుడు ఉత్తమమైన 'కర్మ – జ్ఞానము'లను ఆశ్రయించుటకు అర్హత, అవకాశము పొందినవాడగుచున్నాడు. ఇప్పటి సంకల్పములు – కార్యక్రమములను అనుసరించే ఉత్తరోత్తర పరిణామములు ఉండబోవుచున్నాయి. అందుచేత కుమారా! నీ సంకల్పములు నీ అధీనంలోనే ఉన్నాయి కనుక, చక్కగా ఉత్తమ సంకల్పములనే ఆశ్రయించు. వైరాగ్యము – పురుష ప్రయత్నముల ద్వారా బ్రహ్మ భావము గూర్చి చింతన చేయి. ఎవరికి ఏది ప్రాప్తిస్తున్నదో, లేక, ప్రాప్తించుట లేదో – అదంతా పురుషార్థము (effort) యొక్క పర్యవసానమే అయివున్నది సుమా! అందుచేత ప్రయత్నించి భోగములందు విరక్తిని సమకూర్చుకో. "అగమ్యము – సుదీర్ఘము" అగు సంసారమును అధిగమించాలంటే 'విషయములపట్ల విరక్తి' అను ఔషధం అత్యంతావశ్యకం. భవము (సంసారము) అధిగమించబడనంతవరకు దివ్యమగు పరమశాంతి లభించదు. మోహహేతువులైన ఈ దృశ్యవిషయములపట్ల అనురాగమున్నంతవరకు అశాంతి తొలగదు.

ఈ సంసారంలో కనబడే భోగములన్నీ అతి చంచలములు, దుఃఖప్రదములు అయి ఉన్నాయి. అయినప్పటికీ, అజ్ఞానముచే మోహితుడగుచున్న ఈ జీవుడు వాటిచే ఆకర్షించబడుచున్నాడు. అట్టి ఆకర్షణ నుండి విడివడాలంటే "శ్రవణము – మననము – నిధిధ్యాస"లను అభ్యసించాలి. మనస్సును ఆత్మానుసంధానం చేయాలి. అభ్యాసం లేకపోతే భ్రమ తొలగదు. భ్రమ తొలగకపోతే నీ స్వస్వరూపమే అయి ఉన్న ఆత్మదేవుని దర్శించ లేవు. ఆ రాజాధిరాజును దర్శించనంత కాలం అత్యంత వ్యాకులతో కూడిన "విషయములను ఆశ్రయించటం, విడవటం, ఇంతలోనే మరి కొన్ని విషయములను సమీపించటం" – అనే శ్రమ తప్పదు.

ఈ నీకు పూర్ణమగు శాంతి–సంతృప్తులు లభించకపోవటానికి కారణం అల్ప దృష్టిచే విషయములను "ఇవే సర్వస్వం" అను బుద్ధితో సుదీర్ఘకాలం ఆశ్రయించటమే!

బలి : దానవేశ్వరా! ఏ విషయవిరక్తిచే నిరంతరం ఆత్మ యందు 'స్థితి' కలిగి యుంటామో - అది కలిగే దెట్లా?

విరోచనుడు : గొప్పవస్తువును చూచినప్పుడు అల్పవస్తువును కోరుకోవటం స్వయంగానే సన్నగిల్లుచున్నది కదా! ఆత్మ సందర్శనముచే, లేక ఆత్మను ఎరుగుటచే విషయములపట్ల విరక్తి తప్పక పొందగలవు. అందుచేత, 'ప్రజ్ఞ' అనే ఒరిపిడిరాతితో 'ఉత్తమవిచారణ' అనే ప్రయత్నముచే ఆత్మ విచారణ చేయాలి ఆత్మచే ఆత్మదర్శనం చేస్తూ ఉండాలి.

మొదటి దశ : ఒక రోజుకు 'పగలు, రాత్రి' అనే రెండు విభాగములున్నట్లు, ఈ మనస్సును కూడా రెండుగా విభజించాలి-

మొదటి భాగమును : ఈ శరీర నిర్వహణకు కావలసిన ఉపభోగాలకు వినియోగించు.

రెండవ భాగవము : శాస్త్రముల, గురువుల బోధలను గ్రహించటానికి, ఆకళింపు చేసుకోవటానికి వినియోగించు. (లేదా) విషయములవైపు పరుగిడుచూ అపరిశుద్ధమగుచున్న ఈ మనస్సు యొక్క కొంత భాగాన్ని "గురువులను సేవించుట, బుద్ధి మంతులతో సంభాషించుట, స్వానుభవాలను శాస్త్రప్రవచనాలతో సరిపోల్చుకొనుట" - మొదలైన సన్మార్గాలలో వినియోగిస్తూ ఉండు.

రెండవ దశ : కొంతకాలమైన తరువాత నీ మనస్సు కొంత పరిపక్వమౌతుంది కదా! అప్పుడు నీ మనస్సును నాలుగు భాగాలుగా చేయి-

మొదటి భాగమును : దేహయాత్రకు సంబంధించిన వాటితో పూరించు.

రెండవ భాగమును : ఉత్తమ కర్మలకు వినియోగించు.

మూడవ భాగమును : గురు శుశ్రూషచే పూరించు.

నాలుగవ భాగమును : శాస్త్రశ్రవణం, మననం చేయి.

అప్పుడు క్రమంగా నీ చిత్తము తత్త్వనిశ్చయముతో కూడిన 'పరిపక్వత' పొందగలదు.

మూడవ దశ : క్రమంగా పరిపక్వత ప్రాప్తిస్తూ ఉంటుంది కదా! ఇక రెండు భాగములను శాస్త్ర - వైరాగ్యము లందు వినియోగిస్తూ ఉండు. తక్కిన రెండు భాగములను కూడా క్రమక్రమంగా 'ధ్యాన - గురుపూజ - ధర్మనిరతి'లతో పూరించు.

శుభ్రమైన వస్త్రం మాత్రమే రంగును చక్కగా స్వీకరించుచున్నది కదా! ఏ చిత్తములో అయితే విషయాభిలాష సన్నగిల్లుతూ వస్తుందో, అట్టి శుద్ధ చిత్తము మాత్రమే జ్ఞానప్రాప్తికి యోగ్యమగుచున్నది.

శనైః శనైః లాలనీయం యుక్తిభిః పావనోక్తిభిః ।
శాస్త్రార్థ పరిణామేన పాలయేత్ చిత్తబాలకమ్ ॥

ఈ చిత్తము అనే బాలుడిని యుక్తి (ఉపాయము)చేతను, పవిత్రములైన శాస్త్ర - గురు వాక్యముల చేతను లాలించుచు, చిదేకరసమును పొందింపజేయాలి. అప్పుడది స్వయముగా ఆహ్లాదకరమై, సుందర-శీతలమై విరాజిల్ల గలదు. నాయనా! బలీ! ఎట్టి 'కృత్రిమము' గాని, 'కుటిలభావన' గాని ఏమాత్రం లేకుండా, ఉత్తమ 'బ్రహ్మాకారవృత్తి'ని బుద్ధిచే ఆశ్రయిస్తూ ఉండు.

ఈ ఇంద్రియములు, ఈ విషయములు, ఈ వృత్తులు, వీటిని అనుభవిస్తున్న ఈ జీవుడు – ఇవన్నీ కూడా "సచ్చిదానంద రూపమైనట్టి అధిష్ఠాన బ్రహ్మమే అయి ఉన్నాయి" ... అను దృష్టిని బలపరచుకో. చక్కటి ప్రజ్ఞా, విచారణద్వారా "ఆత్మ దర్శనముచే తృష్ణారాహిత్యము, తృష్ణారాహిత్యముచే ఆత్మ దర్శనము" – ఈ రెండూ పరస్పరం వృద్ధి పొందింప జేసుకుంటున్నాయి.

భోగములందు 'అప్రీతి' జనించుటచేతనూ, సర్వోత్తమమగు ఆత్మయొక్క సందర్శనము అగుట చేతనూ పరబ్రహ్మమునందు నీకు శాశ్వతమైన విశ్రాంతి సమకూరగలదు.

ఎందుకో తెలియదుగాని ఈ జీవుడు విషయానందమునే గొప్ప విషయంగా ఎంచుచున్నాడు. వాటి కొరకు ఆశ్రయిస్తూ ఆ ప్రయత్నంలో విశ్రాంతిని కోల్పోవుచున్నాడు. వాస్తవానికి, పూర్ణమైన శాంతికి ఈ జీవుడు అర్హుడే. ఇందులో అనుమానం ఏమాత్రం లేదు. ఎందుకంటే ఈ జీవుడు పరమశాంతమగు ఆత్మయేకదా!

మరల చెప్పుచున్నాను! ఈ జీవుని స్వస్వరూపము పరమానందము, పరమశాంతము కదా!

1. విషయముల పట్ల విరక్తి లేకపోయిందా .. ఇక ఎన్ని యుక్తులుంటే ఏం ప్రయోజనం? ఆత్మను దర్శించటానికి బుద్ధి ప్రవృత్తిని పొందనే పొందదు.

2. ఆత్మ దర్శనము కానంతవరకూ ఈ ఇంద్రియ విషయములు – బాహ్య విషయములు జీవుని ప్రలోభింపజేస్తూనే ఉంటాయి.

కనుక నీవు ఇటు విషయవిరక్తి, అటు సమాధి ఒకేసారి అభ్యసిస్తూ రావాలని మరల గుర్తు చేస్తున్నాను. పురుష ప్రయత్నము ఉన్నప్పుడే ఈ బుద్ధి ఆత్మవైపు ప్రసరించటం జరుగుతోంది. 'భోగత్యాగం' అనే పురుషప్రయత్నంచే శ్రేయము అయినట్టి పరమాత్మ యందు విశ్రాంతి సులభ మగుచున్నది. పురుష ప్రయత్నంచే మాత్రమే ప్రారబ్ధమును దూరీకరించవచ్చు. భోగముల పట్ల ధ్యాసయే మోక్షమార్గంలో ప్రబలమైన ప్రతిబంధకం. విరక్తిచే వివేకం, వివేకంచే విరక్తి జనించుచు, క్రమక్రమంగా బలపడుచున్నాయి. సముద్రం– మేఘముల వలె ఒకదాని ఉనికికి మరొకటి కారణ మగుచున్నాయి. (Discrimination through dispassion and dispassion through discrimination--both should be cultivated simultaneously).

❖❖❖

5. ముగ్గురు మిత్రులు - అప్రీతి, వివేకము, అభ్యాసము

ఒక చోట ఒక ముగ్గురు మిత్రులున్నారు. ఆ ముగ్గురూ పరస్పర అనురాగంతో ఒకరికొకరు తోడై సంచరిస్తూ ఉంటారు. వారు :

1. భోగముల పట్ల అప్రీతి / విరాగము
2. 'ఇది సత్తు, ఇది అసత్తు' – అను వివేకము
3. నిత్యమూ ఆత్మనే సందర్శించు అభ్యాసం

నాయనా ! బలీ! ఎంతటి ప్రయత్నం చేసైనా, పళ్ళతో పళ్ళుకొరికి అయినా సరే... భోగముల పట్ల వైరాగ్యం సంపాదించు. ప్రారబ్ధము అనబడు ఇతఃపూర్వపు కుసంస్కారాలను, దురవగాహనలను జయించటానికి ప్రయత్నం చేయి. అందుకు వర్తమాన పురుష ప్రయత్నములే నీకు తోడు సుమా!

జీవుడు ధనం ఆర్జించినంత మాత్రంచేతనే తప్పేమీ లేదు. అయితే పురుషప్రయత్న పూర్వకంగా, జనసమ్మతమైన మార్గం అవలంబించి ఆర్జించు. అట్టి ధనాదులను మోక్షమార్గం ఉపదేశించే మహాత్ముల పాదములు ఆశ్రయించటానికి వినియోగించు. సజ్జనులు, గుణశీలురు, ఆత్మతత్త్వముతో ఏకీభావము అనుభవించువారు – అగు మహాత్ములు ఉన్నారు. వారితో సంసర్గము పొంది, వారిని ఆశ్రయించావా, విరక్తి జనించగలదు. విషయములపట్ల విరక్తిచే అంతరంగంలో 'విచారణ' అను దానికి తగినంత చోటు లభిస్తుంది. విచారణచే వేదోపనిషత్తులు మనకు ప్రతిపాదిస్తున్నట్టి 'అద్వైత బ్రహ్మము'నందు నిశ్చయ జ్ఞానం ఉదయిస్తుంది. ఇక ఆ తరువాత 'మననము – నిధిధ్యాస'లచే క్రమంగా అత్యుత్తమమగు ఆత్మపదము తప్పక ప్రాప్తించగలదు.

కనుక ఈ విషయములపట్ల విరక్తియే ఆత్మయందు విశ్రాంతికి బీజము, మార్గము, ఉపాయము అయి ఉన్నది. 'కల్పన' అను బురదయందు చిక్కుకుని, నానాక్లేశములు అనుభవిస్తున్న ఈ జీవునికి 'దృశ్య విషయములపట్ల సదవగాహన' ఇప్పుడు అత్యంత ఆవశ్యకం. పుత్రా! ఇక నీ విషయానికి వస్తే నీకు పూర్ణమగు విషయ విరక్తి ఇంకా కలుగలేదు. అయినా కూడా నిర్మల చిత్తుడవగు నీకు నీ ఉత్తమ అభ్యాసముల వశంచే త్వరలో భ్రాంతి అంతా తొలగగలదు. అట్టి శుద్ధ సదాశివ బ్రహ్మ స్వరూపుడవగు నీ స్వస్వరూపమునకు ఇదే నా నమస్కారము.

నీ వర్తమాన పురుషకారమును దష్టిలో పెట్టుకొని కొన్ని ముఖ్యమైన సూచనలు ఇస్తున్నాను–

1. దేశాచారములకు, ధర్మనిరతికి విరుద్ధంకాని విధంగా ధనం సంపాదించు.

2. అట్టి ధనమును భోగముల కొరకే వ్యర్థపరుచుకోవడం శ్రేయస్సు కాదు. బ్రహ్మవేత్తలగు సాధువులు ఏమి చూచి సంతోషిస్తారో, ఆ మార్గంలో నీ ధనం వెచ్చించు. మహాత్ములతో సంసర్గమునకు అర్హుడవు అవుతూ ఉండు.

3. నీ సాధన సంపత్తి, మహాత్ముల ప్రవచనములు తోడు అగుచుండగా, అధ్యాత్మ శాస్త్ర విచారణను ఆశ్రయించు.

4. అట్టి స్వప్రయత్నము యొక్క ప్రయోజనముగా నీ కంఠము నుండి ఊడిపడ్డ హారములాగా ఆత్మలాభం పొందు.

❖❖❖

6. మనోరచన - మనోవ్యాధి

బలిచక్రవర్తి (తనలో) : అవును. గొప్ప విచారణ శీలురలో ఒకరుగా శ్లాఘించబడే నా తండ్రి విరోచన చక్రవర్తి నాకు అంతా చెప్పే ఉన్నారు కదా! దైవవశాత్తు అదంతా ఇప్పుడు స్పష్టంగా గుర్తుకు వస్తోంది. సద్గురువుల స్పర్శచే కాబోలు, ఇప్పుడు నాకు ప్రత్యక్షంగా భోగముల పట్ల

అరుచి, అతీతమైన స్వభావం ఏర్పడుచున్నాయి. ఫలితంగా "స్వచ్ఛము – అమృత శీలము" అయినట్టి శాంతి యొక్క సామీప్యత లభిస్తోంది.

ఆహా! ఇంత వరకు అనేకమైన ఆశాపరంపరలను అనుసరిస్తూ గడ్డిపోచలవంటి ధనం, స్త్రీలు మొదలైన విషయములే మహత్తరమైనవి అనుకుంటూ వచ్చాను కదా! చివరికి ఏమైనది? స్పర్థ, అశాంతి, ఆవేశ – కావేశములు నన్ను కప్పి వేశాయి! ఎంత పరితాపం పొందాను! కలలోని దుస్సంఘటన వలె అవన్నీ తుచ్ఛమని, అసత్యమని తేలిపోయింది.

అమ్మయ్య! ఇప్పుడు ఈ భూమి ఎంత ప్రశాంతంగా కనబడుతోంది! శమము ఉన్నచోట ఇక సుఖ దుఃఖ దశలన్నీ తొలగిపోతాయి. నా అంతఃకరణం పూర్ణచంద్ర బింబంలాగా నిరతిశయానందాన్ని పొందుతోంది. ఇంతవరకు మనోవేగముచే వేలాది భ్రాంతులలో సంచరించాను. అనేక క్షోభలతో కూడికొని ఉన్న ఈ విభవములు సంపాదించడానికి ఎన్నో దుఃఖపరిణామములు గల కార్యక్రమాలను నిర్మించుకున్నాను. అజ్ఞానం యొక్క విలాసముచే రక్త మాంస మాత్రములగు తుచ్ఛ శరీరములు నన్ను ఆకర్షించి వివశుణ్ణి చేశాయి.

ఎన్నో ఐశ్వర్యములను చవి చూశాను. గొప్పగొప్ప రాజ్య విభవములను అనుభవించాను. అనేక ప్రాణికోట్లను వశం చేసుకొని పరిపాలించాను. ఏం ప్రయోజనం? నా ఆశలు క్షయించాయా? లేదు. ఆశ ఉన్నంతకాలం తృప్తి ఏది?

ఈ ప్రపంచంలో నాలాగే అనేకమంది జనులు ఒకసారి అనుభవించినవే అనేకసార్లు అనుభవిస్తూ దీనులు అగుచున్నారు. ఇప్పుడు నేను సర్వము పరిత్యజించుచున్నాను. స్వబుద్ధిచే అంతా కూడా విడచిపెట్టి తత్త్వబోధచే పూర్ణస్వరూపమును సంతరించుకోదలిచాను. 'స్వాత్మ' యందే పరిపూర్ణుడనై ఉండి ఉండెదను గాక! ఎందుకంటే 'మృత్యువు' అనబడు గొప్ప విపత్తు వాటిల్లినప్పుడు ఈ స్త్రీ, రత్న, రాజ్యాది భోగములన్నీ నన్ను విడచిపెడతాయి. ఒక్క స్వాత్మ మాత్రమే నన్ను వెంటనంటి ఉంటుంది కదా! ఇంతకాలం అవివేకినై వీటిని నేను ఎందుకు నమ్ముతూ ఉన్నాను? నేను దేవతలతో విరోధం కల్పించుకున్నది ఈ తుచ్ఛ జగత్తుపై ఆధిపత్యం కోసమా?

"మనోరచన మాత్రమే" అయినట్టి ఈ దృశ్య జగత్తును నేను కలిగి యుండుటయే ఓ గొప్ప 'మానసిక వ్యాధి' అయివున్నది. ఇట్టి వ్యాధికి ఇప్పుడు, ఇక్కడ చికిత్స చేసుకోకపోతే ఇక ఇక్కడ జీవించినందుకు ఏం గొప్ప ఫలితం పొందినట్లు? ఆత్మ విషయం ఎఱిగియున్న మహాత్ములకు ఈ జగత్తునందు ప్రీతి జనిస్తుందా? ...లేదు.

ఒక గొప్ప దుఃఖకరమైన విషయం ఏమిటంటే.... పిచ్చి వాడినై నేను ఇంతకాలంగా అల్పము – అల్పకాలికము అయినట్టి ఏవేవో ప్రాపంచిక విషయాలను ఆశ్రయించాను. అనర్థములైనవాటిని కూడా అర్థవంతములని భావిస్తూ వస్తున్నాను. నా కోరికలు ఒక అంతూ పొంతూ లేకుండా క్షణానికో విధంగా ఉంటున్నాయి. అజ్ఞానపూర్వకమైన లక్ష్యములతో, హావ భావములతో నేను చేయని చండాలపుపనులేమైనా ఉన్నాయా! ఒక్కొక్క సమయంలో నేను చేస్తున్న తప్పుడు పనులన్నీ

మరొకప్పుడు దుఃఖకరముగానే పరిణమించబోవుచున్నాయి కదా! అయినా కూడా, ఈ తుచ్ఛమైన ఇంద్రియ విషయములను అంటిపెట్టుకొని వివేచన చేయకుండా కాలాన్ని వృథా చేసుకుంటున్నానే!

అయినదేమో అయినది. ఇంకా పాత విషయాలే గుర్తుకు తెచ్చుకొని మరి కొంత కాలయాపన చేయడం అనవసరం. "ఈ వర్తమాన కాలంలో నేను కలిగి ఉంటున్న అజ్ఞానం తొలగేది ఎట్లా? ఏఏ ప్రయత్నములు చేసి ఈ వర్తమానాన్ని సఫలీకృతం చేసుకోగలను?" – అనే విషయాలు ఇప్పుడు నాకు ముఖ్యం.

ఆ "పరబ్రహ్మము" అనగా ఎవరు? ఎక్కడుంటాడు? ఆతడు "అనంతమైన ఆకారము కలవాడు, .. కారణములకే కారణము" కదా! అట్టి పరబ్రహ్మము తోటి 'ఐక్యము' పొందినప్పుడుమాత్రమే ఆత్మయందు పూర్ణ సుఖము ఆవిర్భవించగలదు. అజ్ఞానము నశించినప్పుడు ఐక్యము సుసాధ్యం అవుతుంది. అందుచేత ఇప్పుడు నాకు అజ్ఞానం తొలగాలి. అందుకుగాను గురువులగు శుక్రాచార్యుల వారిని శరణు వేడుతాను.

"ఈ దృశ్య ప్రపంచం ఏమై ఉన్నది? 'అహం' అను ప్రత్యయమే రూపంగా గల ఈ జీవుడెవడు?" ఈ రెండింటి గురించి క్షుణ్ణంగా చూసి తెలుసుకోవడానికి ఆచార్యులవారే నాకు ఇప్పుడు దిక్కు.

❖

హే! శుక్రాచార్యా! పరమేశ్వరా! ఎవరు మిమ్ములను ఆశ్రయిస్తే, వారిని మీరు ప్రసన్నులై అనుగ్రహిస్తూ ఉంటారు కదా! అట్టి మిమ్ములను శరణాగతుడనై మనస్సుచే ధ్యానం చేస్తున్నాను. మీరు ఉపదేశిస్తేనే నేను సాంసారిక విషయములు అనే బురద నుండి బయట పడగలుగుతాను. స్వామి! ఎటో తెలియని నిస్సారమైన దూర తీరాలకు కొట్టుకుపోతున్న నాకు, మీరే ఆలంబనము. పరమాత్మ స్వరూపంలో స్వయంగా స్థితి పొందివుండడం ఎట్లాగో తెలియజేసి నన్ను ఆదుకోండి...!

❖

ఈ విధంగా ఆ బలి కనులు మూసుకొని ఏకాగ్రతతో, భక్తిపూర్వకంగా గురువైన శుక్రాచార్యుల గురించి ధ్యానించడం ప్రారంభించాడు. బ్రహ్మజ్ఞాన తత్పరులై, నిత్యము స్వస్వరూపమందే నిశ్చలులై ఉండే శుక్రాచార్యులు తన శిష్యుని ప్రార్థన విన్నారు. "ఆహా! నా శిష్యుడు జ్ఞానము అభిలషించి నన్ను ఆశ్రయిస్తున్నాడు కదా! సంతోషం! ఇతని సందేహములను నివర్తింప జేస్తాను" – అని తలచారు. వెంటనే శిష్యుడు బలి చక్రవర్తి ముందు ప్రత్యక్షమైనారు. ఆయన శిష్యవాత్సల్యం అట్టిది మరి!

గురుదర్శనంచే పులకాంకితుడై బలి ప్రేమగా కాళ్ళు కడిగి శిరస్సుపై జల్లుకుని, ఉచితాసనంపై కూర్చుండబెట్టి, తాను ఆయన పాదాల దగ్గిర ఆసీనుడైనాడు.

❖❖❖

7. నీ - నా స్వరూపం చిత్‌యే

బలిచక్రవర్తి : హే మహాత్మా! తమకు ఎంతో శ్రమ కలిగించాను, క్షమించండి. మీరు ఇతఃపూర్వమే నాపై అనుగ్రహంతో చెప్పియున్న కొన్ని తాత్త్విక విషయాలు నా బుద్ధి యందు వికసించుచున్నాయి. తమతో మరికొన్ని విషయాలు సంభాషించాలని, సంప్రతించాలని నా బుద్ధి నన్ను ప్రేరేపిస్తోంది.

ఓ దేవా! ఇక్కడ ఎదురుగా కనిపిస్తున్న ఈ విషయ భోగములన్నీ అత్యంత మోహకరములే కదా! వీటిపట్ల నాకు విరక్తి ఏర్పడుతోంది. "పరమార్థ తత్త్వము గ్రహించటమే అత్యంత అవశ్యకం" – అను నిశ్చయం నాయందు ఏర్పడింది. అయితే నాలో కొన్ని ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి.

ఈ జీవుడు సుఖమును కోరుకుంటున్నాడు కదా! సుఖములన్నిటిలోకి ఉత్తమోత్తమమైన విషయం ఏది? అట్టి అవధి యొక్క స్వరూపం ఎట్టిది? వాస్తవానికి నేనెవడను? మీరెవరు? ఈ జగత్తు ఏమైయున్నది? – ఈ తత్త్వమంతా నాకు త్వరగా తెలియజేయమని వేడుకొంటున్నాను.

శుక్రాచార్యులు : నాయనా! ఇప్పుడు ఆకాశమార్గంలో ప్రయాణమునకు సన్నిద్ధుడనై ఉన్నాను. సప్తఋషులు నా వెంట వేంచేసి ఉన్నారు. ఒక దైవకార్యం నిమిత్తం అవశ్యం వెళ్ళవలసియున్నది.

బలి : తమ వంటి జీవన్ముక్తులకు కూడా అవశ్యం నిర్వర్తించవలసిన కార్యక్రమములు ఉంటాయా స్వామీ?

శుక్రాచార్యులు : జీవన్ముక్తులు కూడా "ప్రాప్తించిన కార్యములను ఉపేక్షించటం" అనే స్వభావం కలిగియుండరు. నీవు అడిగిన ప్రశ్నకు సమాధానం విస్తారంగా చెప్పటానికి సమయం చాలదు. అయినా కూడా సంగ్రహంగా చెపుతాను. విను.

చిదిహాస్తిహిచిన్మాత్ర మిదంచిన్మయమేవచ ।
చిత్త్వంచిదహమేతేచ లోకాశ్చిదితిసంగ్రహః ॥ (శ్లో 11, సర్గ 26)

నీవు – నేను – తదితరములనేకమైన వాటితో కూడి ఎదురుగా కనిపిస్తున్న ఈ జగత్తు కూడా చైతన్యము యొక్క స్వరూపమే. ఈ దృశ్యమంతా "చిత్తు (ఎఱుగుచున్నట్టిది)" యొక్క అధీనంలోనే ఉన్నది; 'ఎఱుక' యందే అధ్యసించబడి యున్నది. 'ఆరోపించబడుట' అను చిత్తుయొక్క ప్రక్రియయే ఈ జగత్తు.

అందుచే, నీవు–నేను–అంతా చిన్మాత్రమే! ఈ సమస్త లోకములు చిన్మయములే. తత్త్వమంతటికి సారము ఇదే. నీవు కనుక శ్రద్ధావంతుడవు, వివేకివి అయ్యావా – "ప్రశాంతమగు చిత్ చైతన్యమే ఇదంతా" అను నిశ్చయముచే సర్వము పొందగలవు. అట్లా కాకుండా, శ్రద్ధ వివేకాలు లేకపోయినాయా …అధికంగా చెప్పిమాత్రం ఏం ప్రయోజనం? ఎంత చెప్పినా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

1. చిత్ 'విషయాకార కల్పన' కలిగియుండుట.
2. చిత్ విషయరహితమై ఉండుట.

విషయాకార కల్పనయే బంధము. అట్టి కల్పన లేకపోవటమే ముక్తి. విషయాకారకల్పన లేనట్టి చిత్ 'పూర్ణాత్మ స్వరూపమే' అయి ఉంటుంది. సమస్త సిద్ధాంతముల అంతిమ సారం ఇంతే!

ఇప్పుడు ఇట్టి నిశ్చయము అవలంబించి ఈ జగత్తునంతా అవలోకించు. అఖండాకార వృత్తిని ఆశ్రయించి సర్వము పరిశీలించు. అప్పుడు నిశ్చయముగా బ్రహ్మమును పొందుతావు.

నిత్యమైన, సత్యమైన సుఖం అదొక్కటే. ప్రియశిష్యా! పెద్దలు నాకోసం ఆకాశమార్గంలో వేచియున్నారు. ఇక సెలవు. ఇట్లు పలికి శుక్రాచార్యులు గాలియొక్క అలవలె అంతర్ధానమైనారు.

❖❖❖

8. నేనెవడను? ఎంతటి వాడను?

అప్పుడు ధీమంతులలో శ్రేష్ఠుడైన బలిచక్రవర్తి ఇట్లు చింతన చేయసాగాడు.

యుక్తముక్తంభగవతా చిదేవేదంజగత్త్రయమ్ ।
చిదహంచిదిమేలోకా శ్చిదాశాశ్చిదయంక్రియా ॥ (శ్లో 2, సర్గ 26)

సబాహ్యాభ్యన్తరేసర్వం చిదేవంపరమార్థతః ।
అస్తిచిద్వ్యతిరేకేణ నేహకించనకుత్రచిత్ ॥ (శ్లో 3, సర్గ 26)

మహాత్ములగు శుక్రాచార్యులు చెప్పినది వాస్తవమే కదా! ఈ మూడు లోకములు చిన్మాత్రము (All pervading consciousness- The Knower) అను స్వరూపమే! నేను కూడా "చిత్" (ఎఱుగుట) అనేదే స్వరూపముగా కలిగి ఉన్నాను. ఈ సప్తలోకములు, సర్వ దిక్కులు, సర్వక్రియలు చిన్మయములే. ఈ బాహ్య అభ్యంతర దృశ్య సమూహమంతా చిద్రూపమే. 'చిత్తు'కు భిన్నంగా ఈ బ్రహ్మాండము నందు ఏ వస్తువునూ లేదు? ఆ చైతన్యమే సూర్యుని రూపంగా ప్రకాశింపజేయకపోతే, సూర్యునకు అంధకారమునకు భేదమెక్కడ ఉండేది?

ఈ భూమిని కూడా "ఇది భూమి" అని ఎఱుగుచున్నదేది? చైతన్యమే కదా! చైతన్యము తన మాయారూపములుగా ఈ దిక్కులను, పర్వతములను, జగత్తును, ఆకాశమును, శరీరమును ప్రకాశింపజేస్తోంది. కాబట్టి వాటన్నిటికీ ఉనికి ఏర్పడుతోంది. లేకపోతే అవే ఉండవు.

ఈ సమస్తము చిద్రూపమే! - ఈ ఇంద్రియములు, దేహము, మనస్సు, ఇచ్ఛ, శూన్యాకాశం, వీటన్నిటికీ వేరైన భావసముదాయమూ, ఈ సర్వజగద్విషయాలూ – ఇవన్నీ చిత్ యొక్క రూపములే!

మరొక విషయం! ఈ శరీరం ద్వారా 'శబ్దము, స్పర్శ, రూపము' మొదలైనవన్నీ అనుభవ మవుతున్నాయి. అయితే వాటినన్నీటినీ ఎఱుగుచున్నది చిద్రూపుడనైన నేనే కాని, ఈ శరీరము స్వయంగా దేనినీ ఎఱుగజాలదు కదా! ఒక కొయ్య, ఒక మంచు గడ్డవలె అచేతనమే ఈ శరీరము. శరీరినగు నేను చేతనమును. స్వయంగా ఏదీ ఎఱుగలేనట్టి ఈ శరీరముతో నాకేం పని? "శరీర" స్వరూపుడనగు నేను ఈ శరీరమునకు ఆవల సర్వదా చైతన్య స్వభావంతో ప్రసరించియే ఉన్నాను.

నేనెవరు? ఉపాధిచే నిర్వచింపబడనిది, సర్వజగత్తుకు ఆత్మ, చేతన స్వరూపము అగు చిద్వస్తువును నేను. ఆకాశము నందు సూర్య-చంద్ర-నక్షత్రాది ప్రకాశించు సర్వ వస్తువులందు, ఈ భూత సముదాయము నందు, సర్వ దేవతలందు, సర్వ రాక్షసులందు, సర్వ స్థావర, జంగమ జీవులందు ఉండి ఉన్నదీ ఈ చైతన్యమే!

అట్టి నిత్యోదిత చైతన్యమే నేను. ఈ బ్రహ్మాండములందంతటా కేవలం చైతన్యమే కలదు. అనగా నేను సర్వదిక్కులందు నిండియున్నాను. నాకు శత్రువెవడు? మిత్రుడెవడు?

'బలి' అని పిలువబడుచున్న ఈ భౌతిక శరీరం ఒకవేళ నేల కూలుతుందనుకో.... అందువలన దేహినగు నాకేమి? నేను దేహిగా, ఎఱుగువాడిగా సర్వమునకు అతీతుడనై, అసంగమై, ఈ ఎఱుగ బడుచున్న దానికంతటి కంటే ప్రత్యేకమై యథాతథంగా ఉంటాను! తమచే కదల్చబడే మేఘఖండాలు నేల కూలినా కూడా వాయుతరంగాలు యథాతథంగా ఆకాశంలో ఉంటాయి కదా!

నాచే ఎఱుగబడుచు, ఉనికిని పొందుచున్న, ఈ శరీరములచే, లోకములచే నేను ఛేదించ బడటమేమిటి? అసంభవం. 'ద్వేషము' అనునది కూడా చిత్ చేత ప్రకాశించబడినప్పుడు మాత్రమే ద్వేషరూపమున భాసిస్తోంది. అందుచేత 'రాగము - ద్వేషము' అను రెండు భావనలూ చైతన్యము యొక్క అధీనంలోనే ఉన్నాయి. అనగా, అవి కూడా చిద్రూపములే.

బలి కొంతసేపు మౌనము, ధ్యానములలో గడిపాడు.

❖

బలి (తనలో) : ఔను! ఎంత పరిశీలించి చూచినా చైతన్యమునకు వేఱైనదేదీ ఎక్కడా కించిత్ కూడా కనిపించటం లేదు. నేను సర్వదా శుద్ధ - చిన్మాత్ర స్వరూపుడను. అట్టి నాయందు రాగము గాని, ద్వేషము గాని, మనస్సు గాని, మనోవృత్తులు గాని ఎట్లా ఉంటాయి? అవి లేనప్పుడు ఇక వికల్పమగు కల్పనయే నా యందు సంభవించదు కదా!

కనుక, సర్వవ్యాప్తమై, సర్వ వికల్పములకు అతీతమై, అద్వితీయమై, నిత్యమై, ఆనంద మయాత్మకమగు చిద్రూపమే నేను. నాచే ఎఱుగబడునదేదీ నన్ను మరొకటిగా చేయజాలదు. నాకు వేఱుగా ఉండజాలదు. ఈ ప్రపంచము నామరూపాలతో కూడి ఉన్నది. ఇది నామరూప రహితమగు చైతన్యమునకు 'సంజ్ఞ' కాగలదా? లేదు. ఏ చిత్‌శక్తి అయితే సర్వత్రా వ్యాప్తమై నామ రూప కల్పనకు అధిష్ఠానమై వెలయుచున్నచో - అదియే ఓం-తత్ శబ్దాత్మక రూపమున స్ఫురిస్తోంది.

దృశ్య - దర్శనములకు అతీతమై, నిర్మలమై, నిత్యమై సర్వమునకు ద్రష్టయగు పరమేశ్వరుడను నేను! అట్టి నన్ను ప్రకాశింపజేయగలిగేది మరెక్కడా ఏదీ లేదు. నేను స్వయంప్రకాశ రూపుడను.

బాగానే ఉన్నది! అయితే నిత్య ప్రకాశమాత్రుడనగు నాయందు "నేను ఈ శరీరమును, జీవుడను" అను పరిమిత భావం ఎందుకు ఏర్పడింది?... ఆత్మస్వరూపుడనగు నేను నా ఔన్నత్యమును ఏమరచి, దృశ్యమునకు ద్రష్టత్వము ఆపాదించుకొనునపుడు ఆ కల్పనచే - నీళ్ళలో ప్రతిబింబించే చంద్రబింబంలాగా - పరిచ్ఛిన్న భావన ఉద్భవిస్తోంది.

అనగా 'నేను జీవుడను' అను భావన భ్రాంతియే కాని, యథార్థము మాత్రం కాదు. 'అంతిమ సాక్షాత్కార వృత్తి' చే ఉద్భూతమగు శుద్ధ స్వరూపమే నేను కదా! మరి, అట్టి రూపమును స్వీకరించి, తద్ద్వారా, ఈ 'భ్రాంతి' రూపమగు జీవభావమును త్యజించివేస్తే పోతుంది.

❖

ఓ నా ఆత్మస్వరూపమా! జీవ భావ రహితమై, 'విషయములు' అను కళంకమే లేనట్టి 'ముక్త స్వరూపము – మహత్తరము' అయినట్టి 'సాక్షి చైతన్యమే' నీవు సుమా! అట్టి నీకు ఇదే నా నమస్కారం. నీవే చిద్రూపమువు.

"శ్రవణ–మనన – నిధిధ్యాస – సమాధి" రూపమగు ఆ నా సాక్షి చైతన్యమునకు నేను పదే పదే నమస్కారం చేస్తున్నాను. సర్వాన్ని ప్రకాశింపజేయుచు, "జ్యోతి రూపము" అయి ఉన్న నాకు నేను నమస్కరించుచున్నాను. ఆహా! నిర్విషయమై, చిద్రూపమాత్రుడనై, బ్రహ్మాండమంతా పరిపూర్ణం చేస్తున్నది నేనే కదా! శాంతస్వరూపుడను; సర్వమును ఎఱుగువాడను; సత్–చిత్ మాత్రము అగు మహస్స్వరూపుడను. ఆకాశం కంటే కూడా అనంతుడను, సర్వవ్యాపకుడను; అణువు కంటే కూడా అత్యంత సూక్ష్ముడను; స్వతఃగానే చిత్ స్వరూపుడను, శుద్ధ బ్రహ్మాన్ని అగు నన్ను సుఖము, దుఃఖము మొదలైనవి ఎట్లా స్పృశిస్తాయి?

అన్నిటినీ ఎఱుగుచూ – దేనిచేతా కూడా ఎఱుగబడనివాడను ...వర్తమానంలో ఉండిఉంటూనే, 'భూత – భవిష్యత్తు'లందు కూడా ప్రసరించి ఉన్నవాడను; సర్వ వ్యాపకుడను, విషయ శూన్యుడను. ఇక్కడ ఉన్నదంతా నా తోనే నిండిపోయి ఉన్నది. నేను శుద్ధ–అనంత–అద్వితీయ–స్వరూపుడను. నన్ను ఈ జగత్తు గాని, ఇందులోని భావ, అభావములు గాని, ఆయా పదార్థములు గాని, దేశ – కాలాదులు గాని 'పరిచ్ఛిన్నం' చేయగలవా?... లేదు.

నాకు పరిచ్ఛేదమే లేదు - కొందరు తత్త్వశాస్త్ర పరిచయం కొరకు "ఇది శరీరము, ఇది మనస్సు, ఇది బుద్ధి, ఇది అహంకారము" అని నా గురించి చెప్పుకుంటూ పోతున్నారు. అట్లు పరిచ్ఛేదం చేయటం చేత ఇబ్బందేమీ లేదు. ఎందుకంటే, నా స్వమాయచే నేనే ఈ శరీర–మనో–బుద్ధి –అహంకారములుగా అయి వ్యవహరిస్తున్నాను కదా! "నా రూపములే" అయివున్న అవన్నీ నాకంటే వేరు ఎట్లా అవుతాయి? "నా బుద్ధి వేరు – నేను వేరు" – ఎట్లా అవుతాం? ఒక వస్తువు యొక్క ఒక వైపు రూపం అదే వస్తువు యొక్క మరొక వైపు రూపంచే నిర్మితమైనట్లు గానూ, ఆధారభూతం గానూ అనిపిస్తున్నంత మాత్రం చేత ఆ వస్తువునకు వచ్చే లోటేమిటి?

❖

వాస్తవానికి నేను సర్వకాలములందును, సర్వత్రా వ్యాప్తమై, సర్వ కర్తనై, సర్వ స్వరూపమై వెలుగొందుచున్నాను. అద్వితీయ చైతన్య స్వరూపుడను, సర్వ విషయ స్వరూపుడను అగు నేనే, ఈ జగత్తుకు కారకుడను అగుచున్నాను.

ఇదంతా వాస్తవానికి నా సంకల్ప వికల్పములే. అయితే పరమార్థంగా చూస్తే, ఇక్కడ ఏదీ ఉత్పన్నమవ్వటం లేదు, నశించడం లేదు. ...మరి, చిద్రూపుడనగు నాకు ఇక్కడగల సంకల్ప

వికల్పములచే పనేమున్నది? బంధమేమున్నది? దేని వల్ల ఎక్కడ ఏది వృద్ధి? ఏది నాశనం? నేను ఒకప్పుడు అజ్ఞానమును ఆశ్రయించి ఉన్న సమయంలో కూడా, సర్వదా సర్వమునకు ఆవల రాజాధిరాజునై ఉండుట కొనసాగుచునే ఉన్నది. నా స్వస్వరూపమును నేను గ్రహిస్తున్నప్పుడు, నా గురించి పలుకుటకు ప్రయత్నిస్తున్న వేదాంత శాస్త్రం నన్ను 'జ్ఞాని'గా శ్లాఘించుచున్నది. అస్మదాత్మ స్వరూపాన్ని ఏమరచినప్పుడు నన్ను "అజ్ఞాని" ...అని పిలుస్తోంది.

జ్ఞానం - అజ్ఞానముల భేదము అంతవరకే! జ్ఞాన-అజ్ఞానములు నాక్రీడలు; నాలీలలు; నాచమత్కారములు; అస్మత్ జగద్రచనాకళాకళలు మాత్రమే!

కథారచయిత కథారచనను, పాత్రల గుణ-ప్రవర్తనాదులను కల్పిస్తూ, కొనసాగిస్తూ ఉండగా,.... తత్సమయంలో తనను తాను పోగొట్టుకుంటున్నాడా? లేదే? అట్లాగే నేను అజ్ఞానిగా చరిస్తూ ఉన్నప్పుడు కూడా ఆత్మస్వరూపుడనే!

అందుచేత ఇంతఃపూర్వపు అజ్ఞానమును చూచి ఇప్పుడు వేదన చెందవలసినది ఏదీ లేదు. నన్ను నేను ఆశ్రయించి, ప్రశాంత చిత్తుడనగుదునుగాక.

❖

మహాప్రజ్ఞావంతుడగు ఆ బలిచక్రవర్తి ఆ విధంగా చింతన చేస్తూ, క్రమంగా ప్రశాంత చిత్తుడయ్యాడు. సర్వ సంకల్ప - కల్పనలను రహితం చేశాడు. అ-ఉ-మ అనబడు ఓంకారము యొక్క మూడు మాత్రలకు పరమై ఉన్నట్టి అర్ధమాత్రను భావించుచు మౌనం వహించాడు.

అ = సత్ (Existence); ఉ = చిత్ (Knowledge); మ = ఆనందము (Bliss); అర్ధమాత్ర = విశుద్ధాత్మ స్వరూపము (లేక) తురీయాత్మకమగు బ్రహ్మము.

చేత్యము, చేతనము - ఈ రెండిటికీ అతీతుడైనాడు. అనగా, ధ్యానము చేయువాడు - ధ్యానము - ధ్యేయ వస్తువు ...ఈ మూడు విషయాలు లేని వాడైనాడు. నిర్మలుడై, వాసనలన్నీ వర్జించినవాడై, గాలివీచని చోట దీపంలాగా నిశ్చలత పొందాడు. శాంతచిత్తుడై, బ్రహ్మపదమును ఆశ్రయించాడు. ఒక శిలయందు చెక్కబడిన శిల్పములాగా చాలాకాలం స్థిరంగా ఉన్నాడు.

ఇక ఆతనియందు విషయదోషములు లేవు. "నిర్మల బ్రహ్మ భావప్రాప్తి" అను 'సత్త' కలిగి నిర్మలాకాశంలా శోభించాడు.

❖

బలి చక్రవర్తి నిశ్చేష్టుడై, అఖండమగు ఆత్మయొక్క అనుభవమునందు నిమగ్నుడై ఉన్నాడు. సేవకులు ఆతనిని సేవించటానికి సమీపించి ఏమీ పాలు పోక, చూస్తూ నిలబడ్డారు. ఇంద్రుడు, సిద్ధులు, తదితరులగు దేవతలు ఆతనిని సేవించటానికి సమీపించి, ఆతనిని ఆదరణతో చూడసాగారు. ఉదాసీనులు ఆశ్చర్యచకితులైనారు. తత్త్వజ్ఞులు "తత్వజ్ఞానం సంపాదించినందుకు ప్రయోజనం ఇదికదా!" అని ఆనందం పొందారు.

అజ్ఞానులగు అనేకమంది రాక్షస ప్రజలు విషయమేమిటో తెలియక "ఇది శత్రువుల మంత్ర – తంత్ర ప్రమేయం కాదు కదా?" అని భయము – విస్మయము పొందసాగారు. అక్కడి మంత్రులంతా ఒక చోట గూడి "ఇప్పుడు మన కర్తవ్యమేమిటి? మన రాజును మనం దక్కించుకోవాలి. అందుకు మరి ఏమిటి ఉపాయం?" అని సమాలోచన చేశారు. మనం ఇప్పుడు ఉపాయం కోసం శుక్రాచార్యుల వారిని ఆశ్రయించవలసిందే!" అని నిర్ణయించుకున్నారు. వారంతా శుక్రాచార్యులవారికి గురుస్తోత్రం సమర్పించారు.

గురువగు శుక్రాచార్యులు దేదీప్యమానమైన దేహముతో వ్యక్తమై, అక్కడ ప్రత్యక్షమైనారు. సమాధిలో ఉన్న బలిచక్రవర్తిని చూచి సంతోషంగా తల పంకించారు. ఆర్తులై, తనను సమీపించే రాక్షస జననమును సంబోధిస్తూ ఇట్లు పలికారు.

శుక్రాచార్యులు : నాయనలారా! మన ఈ బలి చక్రవర్తి ఆత్మలో విశ్రమించి సంసార భ్రమరహితుడు అయినాడు. స్వయముగా విచారణ చేయుటచే సర్వమునకూ అధిష్ఠానమైన బ్రహ్మపదము ఈతనికి సంప్రాప్తించింది. ఉత్తమోత్తమమైన సిద్ధిని పొందాడు. ఇది ఆశ్చర్యకరమైన విషయమే!

సరే! సమాహిత చిత్తుడగు ఈతనిని ఇట్లే ఆత్మ యందు సుస్థితుడై కొంతకాలం ఉండనివ్వండి. శాంతమగు ఆత్మధర్మపదమును వీక్షించనివ్వండి. ఎందుకంటే, ఇంతకాలంగా ఎన్నెన్నో విషయాలు ఆశ్రయించుటచే ఇతని మనస్సు ఎంతగానే అలసి పోయింది. ఇప్పుడితనియందు సంసార భ్రమలన్నీ తొలగిపోయాయి. అందుచేతనే ఇప్పటికి ఆత్మయందు విశ్రాంతి లభిస్తోంది. మీరు మాత్రం ఇతనిని పలుకరించ వద్దు. కాలక్రమముగా ఇతడు సమాధి నుండి స్వయంగానే జాగ్రత్తును పొందగలడు. అప్పటి వరకు మీరంతా మీమీ ధర్మములు నిర్వర్తిస్తూ రాచకార్యములు శ్రద్ధా భక్తులతో నెరవేరుస్తూ ఉండండి. మీ అందరికీ శుభమగుగాక!

శుక్రాచార్యులు ఇట్లు పలికి అంతర్ధానమైనారు. దైత్యులు గురు ఆజ్ఞను శిరసావహించారు.

❖❖❖

9. కేవల సమరూపం

చాలా కాలమయినది. ఒక రోజు బలి చక్రవర్తి సమాధి నుంచి జాగృతి పొందినవాడై, కనులు తెరిచాడు. ఆతనికి, సపర్యలు చేస్తున్న సేవకులు ఈ విషయం మంత్రులకు, తదితర నగర ప్రముఖులకు తెలియజేయాలని బయలుదేరారు.

బలి చక్రవర్తి లేచి కూర్చున్నాడు. సంతృప్తి, ప్రశాంతతలతో కూడినవాడై, ఈ విధంగా ఆలోచన చేయసాగాడు.

బలి చక్రవర్తి (తనలో) :

అహోనురమ్యాపదవీ శీతలాపారమార్థికీ ।
అహమస్యాంక్షణం స్థిత్వా పరాంవిశ్రాన్తిమాగతః ॥ (శ్లో 4, సర్గ 29)

"ఆహా! ఈ 'పరమార్థసంపద' ఎంతటి రమణీయమైనది! క్షణకాలం ఇందు విశ్రమించిన మాత్రంచేత ఎంతటి విశ్రాంతి, ప్రశాంతతలను పొందాను!

ఈ సమాధి ముందు బాహ్యవిభవములైనట్టి ఈ రాజ్యాధిపత్యము, ధన, జన, నారీజనాది విభవములు ఎందుకు పనికొస్తాయి? వాస్తవానికి బాహ్యజగత్తులో శాంతి ఎక్కడ? సమాధి యొక్క పరిపాకముచే లభించే ఆనందం మరెక్కడా ఏ విధంగానూ లభించదనుటలో సందేహం లేదు. అయితే పాప కార్యక్రమముల పట్ల, విషయసముదాయముల పట్ల ధ్యాస, ఆశలు గల జనులు తమ అంతరంగమున సర్వదా ప్రసరించియున్న సమాధి యొక్క ఔన్నత్యమును గుర్తించలేకపోతున్నారు కదా! సమాధినిష్ఠులైన వారి సరమానందం గురించి తెలిసిఉండి ఉంటే, నా ఈ సహజనులలో అనేకులు బాహ్యజగత్తులలో ఇట్లా వృధా సంచారాలు చేసేవారా? శాంతి, సుఖముల కొరకై ఎక్కడెక్కడో బాహ్యంగా తచ్చాడేవారా? లేదు.

❖

దూరంగా జనులు హడావిడిగా అటూ ఇటూ పరుగులు తీయటం గమనిస్తూనే, ఆతడు తన ఆలోచనలు కొనసాగించసాగాడు.

"నేను 'చిత్ – ఎఱుక' అనునదే రూపముగా కలవాడను కదా! చిద్రూపము (ఎఱుగుట అను తత్త్వము) నందు "ఇది ఇష్టము – ఇది అయిష్టము; ఇది నాది – ఇది కాదు" – మొదలుగాగల వికల్పములు ఎక్కడ ఉంటాయి? కనుక ఇక్కడ నాకు గ్రహించవలసినదేది? త్యజించవలసినదేది?

కాని, ఎందుకో ఈ మనస్సు అనాది కాలం నుండి విషయము లందు ప్రవర్తించుచూ, వాటితో శీఘ్రంగా ఏకత్వం పొందుతోంది. వాస్తవానికి చైతన్యరూపుడనగు నేను దేనిచేత బంధింపబడగలను?... ఈ కనబడే పదార్థములచేతనా? ...ఇవన్నీ నా సంకల్పమును అనుసరించే అనుభవమగుచున్నాయి కదా! నాచే కల్పించబడిన కల్పనలు నన్ను బంధించటమేమిటి? చిత్ స్వభావుడనగు నన్ను బంధించునదేదీ ఎక్కడా ఉండటానికే వీలులేదు. కనుక నాకు బంధమనునదేలేదు. బంధమే లేనప్పుడు, ఇక మోక్షము యొక్క ప్రసంగమెక్కడిది?

"నాకు మోక్షము కలుగుగాక!" అనబడు సుప్రసిద్ధమగు లోక ప్రసిద్ధమగు వాక్యమునే తీసుకుందాం! మోక్షము శరీరమునకా? కాదు. అది జడమైనది. స్వతంత్రమైన యోచన, భావన లేని శరీరమునకు మోక్షమేమిటి?... పోనీ, మనస్సుకా? – అది కూడా జడమే. నాచే నిర్వర్తించబడేదంతా నా మననము యొక్క రూపమే కదా! మనస్సు అంటే నా యొక్క మననము చేయు క్రియయే కదా! మననము స్వయంగా ఉన్నదికాదు. స్వతంత్ర పతిపత్తికాదు. అద్దానికి మోక్షమేమిటి?

ఇక, నాకా? 'ఎఱుగుచుండుట' – అనబడు చిద్రూపుడనగు నేను ఇతఃపూర్వం దేనిచేత బంధించబడ్డాను? బంధరహితుడనగు నేను 'మోక్షము కావాలి' అని దిక్కుల వెంట చూడటమేమిటి? మూఢత్వం కాదా? అన్నిటికీ సర్వదా వేత్తై (అప్రమేయుడనై) ఉన్నాను కదా! ఇక నాకు బంధమేమిటి? మోక్షమేమిటి?

యథార్థానికి నాకు బంధముగాని, మోక్షముగాని లేవు... అమ్మయ్య! ఇప్పటికి నా అజ్ఞానం ఉపశమించింది. ఇక నాకు 'ధ్యానము'చే గాని, లేక 'ధ్యానము చేయకపోవుట' చేత గాని ప్రయోజనం ఏమున్నది? 'ధ్యానాధ్యానములు' అను రెండు భ్రమలను వదలివేసి, 'స్వాత్మ' రూపమునే ఉభయ సమయము లందు అవలోకిస్తూ ఉంటాను. ఇక ఏది వస్తుందో, రానీ.... పోతుందో, పోనీ...! ఈ వచ్చిపోవు వాటితో నా ఆత్మ స్వరూపమునకు ఏర్పడగల వృద్ధ – క్షయములు ఏమి ఉంటాయి? ఈ దృశ్యమంతా సర్వదా మమాత్మ స్వరూపమే కదా!

భోగములు గాని భోగముల యొక్క అభావము గాని నేనిప్పుడు కోరుకొనుట లేదు. దుఃఖ రహితమగు 'కేవల–సమరూపము' నందే స్థితి కలిగి ఉంటాను. ఇక ఈ జగత్తును పొందనవసరం లేదు. త్యజించవలసిన పని లేదు. అట్లే, "బ్రహ్మాభావము అనబడు మరొక భావమును పొందాలి. ఈ జగద్భావమును వదలాలి", "కర్మ, ప్రయోజనములు" – మొదలుగా గల తతంగం కూడా నాకు అక్కర్లేదు.

అవన్నీ 'అసత్యములు, భ్రమాత్మకములు' ... కదా! అసత్యములైనవాటి కొరకు ఇచ్ఛాపూర్వక మైన 'త్యజించాలి' అను ప్రయాస మాత్రం దేనికి? ...నేను మృతుడను కాదు. జీవితుడను కాదు. సత్తును కాదు. అసత్తును కాదు. ఈ దేహము గాని, ఈ రాజ్యాదులు గాని కాను. తదితర దేహములు, రాజ్యాదులు కాను.

మరి నేనెవరు? ...మహత్తరమైన 'శుద్ధ చిదాత్మ' యే నేను. అట్టి నాకు నా నమస్కారం. ఈ రాజ్యములు, ఈ శరీరము ఉంటే ఉండవచ్చు... లేకపోవచ్చు. నేను మాత్రం ఆత్మ యందు శాంతి రూపమున సుస్థితుడనై ఉన్నాను. ఉంటాను.

ఆత్మ కాక, తదితరములైన విషయములన్నీ ఉన్నా ఒక్కటే! లేకున్నా ఒక్కటే! నాకు సంబంధించిన వస్తువుగాని, విషయంగాని, ఎక్కడా ఏమాత్రం లేవు. కర్తృత్వముతోకూడిన కార్యమంటూ నాకు ఎక్కడా లేనే లేదు. ఈ ప్రాకృత వ్యవహారములైన 'రాజ్యపాలన' నాచే నిర్వర్తించబడినప్పటికీ, నా తత్త్వమునకు ఇబ్బంది ఏమీ ఉండజాలదు.

❖

జ్ఞానులలో ఉత్తముడగు ఆ బలి చక్రవర్తి అట్లు నిర్ణయించుకొన్నాడు. పరిపూర్ణాత్మ స్వరూపుడు అయ్యాడు. 'ఆత్మవేత్త' అని ఆత్మజ్ఞులచే శ్లాఘించబడ్డాడు. తనను సమీపిస్తున్న దానవ జనులను – సూర్యుడు ఉదయిస్తూ ఆయాలోకములను చూస్తున్నట్లు – చూడసాగాడు. వారి వారి నమస్కారములకు చిరునవ్వుతో ప్రతినమస్కారం చేసి, లేచాడు.

రాచకార్యములను, 'ధ్యేయవాసనాత్యాగము'తో కూడుకున్నవాడై యథావిధిగా నిర్వర్తించ సాగాడు. అర్ఘ్యపాద్యములతో దేవతలను, బ్రాహ్మణులను, గురువులను పూజించటం, అర్థించటానికి వచ్చినవారిని సత్కరించటం, ఎప్పటిలాగానే చేస్తూ ఉండేవాడు.

❖

కొంతకాలం గడిచింది. ఒకానొక సమయంలో బలిచక్రవర్తి ఒక గొప్ప యజ్ఞం ప్రారంభించాడు. ఎన్నో భూతకోట్లకు సంపదలు ఇచ్చి తృప్తిపరచాడు. శుక్రాచార్యులు మొదలగు పెద్దల శుభాశీస్సులు పొందాడు. అయితే, ఇంద్రుడు ఆ యజ్ఞమును చూచి, "ఈ బలి ఇంత గొప్పయజ్ఞం చేస్తున్నాడు. కొంపతీసి, ఆతడు ఇంద్రపదవికోసం ఇదంతా చేయటం లేదు కదా ఇతడు మహాబలోపేతుడైతే రాక్షసజాతి వారు అదిచూచుకొని మరింత లోకకంటకులౌతారు కదా!" అని భయం పొందాడు. తన జ్యేష్ఠ సోదరుడైన విష్ణు భగవానుని ఆశ్రయించాడు. అయితే బలి, ఈ భౌతికమైన స్వర్గాదుల కోసం యజ్ఞం చేస్తున్నాడా? ...లేదు. జ్ఞాని అయి, స్వధర్మముననుసరించి చేస్తున్నాడు.

ఇంద్రుని కోరికను అనుసరించి, బలి చక్రవర్తిని నిరోధించే నిమిత్తం విష్ణుమూర్తి వామనావతారుడై యజ్ఞశాలను సమీపించాడు. కార్యచతురుడగు వామనుడు "అయ్యా! నాకు మూడు అడుగుల నేల ఇప్పించండి. అంతే చాలు" అని అర్థించాడు. గురువగు శుక్రాచార్యుల హెచ్చరికను కూడా పాటించ కుండా, అంతా తెలిసి కూడా, బలిచక్రవర్తి మూడు అడుగుల నేల ధారపోశాడు. "అపరిమితము, శాశ్వతము అగు చైతన్యము ముందు పరిమిత వస్తువులగు ఈ రాజ్యాదులు ఎంతటివి?" – అని ఎఱిగి ఉండుట చేతనే ఆ విధంగా దానం చేసివేశాడు. ఇక విష్ణుభగవానుడు మాయాజాలం చేత త్రివిక్రమాకారుడై తన పాదములచే త్రిలోకములను ఆక్రమించి 'మూడవ అడుగు' బలిచక్రవర్తి శిరస్సుపై ఉంచి, ఆతనిని పాతాళలోకమునకు పంపి, అచ్చట పరిమితునిగా చేసి, తానే బలిచక్రవర్తికి రక్షకభటుత్వం వహించాడు.

❖

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఇప్పటికి కూడా బలిచక్రవర్తి పాతాళలోక రాజై ఉన్నాడు. జీవన్ముక్తుడగు ఆతడు స్వస్థచిత్తుడై, నిరంతర పరమాత్మ ధ్యాన పరాయణుడై వెలుగొందుచున్నాడు. ఈ ప్రపంచముపట్ల ఇందు అనుదినం తారసపడే ప్రియా ప్రియ సంఘటనల పట్ల ఉదాసీనుడై, "నేను సర్వదా అఖండమగు ఆత్మ తత్త్వమునే కదా!" అను ఎఱుకను ఆశ్రయించి చరిస్తున్నాడు. ప్రారబ్ధ వశంచేత తనకు కాలానుగుణంగా ప్రాప్తించబోయే ఇంద్రత్వమునకై వేచియున్నాడు. సంపద అయినా, ఆపద అయినా రావచ్చు. పోవచ్చు. ఆతని సమత్వము విఘ్నము పొందుట లేదు. చిత్ర పటంలో కనిపించే భయంకరమైన దావాగ్నికి ఉష్ణత్వం ఉంటుందా? బలియొక్క బుద్ధికూడా సుఖ దుఃఖ సమయములందు చంచలము పొందుటలేదు. ఈ భోగములు, ఈ అనేక విభవములు –ఇవన్నీ ఆత్మ స్వరూపుడనగు నా సమక్షంలో జరిగే వినోదములే కదా! – అని భావనచేస్తున్నాడు. ఆతని మనస్సు వైరాగ్య ప్రభావంచే శాంతిని పొందింది. సుఖ దుఃఖములు, భావ, అభావములు – ఇవన్నీ ఎట్లా వస్తున్నాయో అట్లాగే పోతున్నాయని గ్రహించాడు. వాటియందు ఉపశాంతి ఉండ జాలదని గమనించి, వాటికి "అతీతత్వము" ఆశ్రయించాడు. అతడిప్పుడు రసాతలంలో, పాతాళ లోకంలో, పూర్ణచిత్తుడై, నిరంతర ఆత్మారాముడై విహరిస్తున్నాడు.

త్వరలో ఆ బలి చక్రవర్తి ఇంద్ర పదవిని పొంది, ముల్లోకములను పాలించుచు ఈ బ్రహ్మాండమున చిరకాలం వసించగలడు.

అయితే అట్టి పదవి ప్రాప్తించినప్పుడు మోదముగాని, అది తొలగుటచే ఖేదముగాని పొందడు. సర్వ స్థితి గతులందు సమరూపము కలిగి సదా సంతుష్ట చిత్తుడై ఉంటున్నాడు.... ఉండగలడు. ప్రారబ్ధానుసారం ఏది ప్రాప్తిస్తే అది పొందుచూ స్వస్థచిత్తుడై, ఆకాశమువలె నిర్మలుడై విరాజిల్లు చున్నాడు. ఆ విధంగా ఆతడు పారబ్ధమును జయించివేసి, ప్రజ్ఞచే కేవలసాక్షి అయిచెన్నొందుచున్నాడు సుమా!

❖❖❖

10. సన్మార్గావిష్కరణ

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రాఘవా! బలిచక్రవర్తి ఏ మార్గంలో జ్ఞాని అయ్యాడో వివరించాను. నీవు కూడా అట్టి దృష్టిని అవలంబించి జీవన్ముక్తుడవగుము. "నేను నిత్యాత్మస్వరూపుడనే!" అని నిశ్చయించి, స్వపౌరుష వశం చేత అద్వైత పదమును ఆశ్రయించు.

ఓ జనులారా! తుచ్ఛమగు వస్తు సముదాయములపట్ల దృష్టినంతా నిలిపి, తృప్తికై వృథాగా వెతకకండి. బలిచక్రవర్తి అన్ని వేలాది సంవత్సరాలు సువిశాల రాజ్యాదులను అనుభవించి, తృప్తిని పొందనే లేదు. చివరికి వైరాగ్యమునే ఆశ్రయించాడు. ఇక్కడ భోగములుగా కనిపించుచున్నవన్నీ కాలక్రమేణా దుఃఖ కారకములుగానే పరిణమిస్తున్నాయి. భోగ సమూహమునంతా బుద్ధిచే త్యజించి, నిత్య-సత్య-సచ్చిదానంద-దుఃఖరహితము అయిన ఉత్తమపదమేదో అదే లక్ష్యముగా కలిగి ఉండండి.

ఈ దృశ్య పదార్థములు వివేచనాదృష్టిలేని వారికి అనేక వికారములు కలుగ జేస్తున్నాయి. "దూరపు కొండలు నునుపు".... అన్నట్లుగా, వీటి యందు అవాస్తవం పేరుకుని ఉన్నదని గమనించండి. నిష్ప్రయోజనంగా - నిష్కారణంగా ప్రాపంచిక వృత్తుల వెంట పరుగులు తీసే ఈ మనస్సును హృదయ కుహరంలో వేంచేసి - బాహ్యఅభ్యంతరములను ఆక్రమించి సర్వమునకు సాక్షి అయి వెలుగొందే ఆత్మవైపుగా ప్రయాణింపజేయటమే ఉచితం.

నాయనా! నీవు ఎట్టి వాడవో ఎఱుగుము. సర్వమును ప్రకాశింపజేయు "చిదాదిత్యుడవు" అయి, ఈ ప్రపంచమంతటా నీవే వ్యాపించియున్నావు. మరి నీకు శత్రువు ఎవరు? మిత్రుడెవడు? ఈ దృశ్యములోని ఏవో కొన్ని సంఘటనలనుచూచి, అంతమాత్రం చేత వ్యర్థంగా ఆత్మపదము నుండి ఎందుకు చ్యుతి పొందటం? ఓ మహాబాహో! నీవు వాస్తవానికి అనంతుడవు. ఆది పురుషుడవు. పురుషోత్తముడవు. చిన్మాత్ర శరీరుడవు. అట్టి నీవు స్వమాయచే ఈ వివిధ పదార్థముల రూపమును ధరించి, విజృంభిస్తున్నావు.

త్వయిసర్వమిదంప్రోత్రం జగత్స్థావరజఙ్గమమ్ ।
బోధేనిత్యోది తేశుద్ధే సూత్రేమణిగణా యథా ॥ (శ్లో 47, సర్గ 29)

"నిత్య బోధ స్వరూపుడవు, శుద్ధుడవు" అగు నీ యందు - దారము నందు మణుల వలే - స్థావరజంగమాత్మకమగు ఈ ప్రపంచమంతా గ్రుచ్చబడియున్నది.

నీవు జన్మించుట లేదు. మరణించుట లేదు. జనన మరణ భ్రాంతి ఎందుకు చెప్పు?

శ్రీరాముడు : హేమహర్షీ! జీవునికి ఈ జనన మరణాదులు ఎందుకు ప్రాప్తిస్తున్నాయి?

శ్రీ వసిష్ఠ మహర్షి : తృష్ణ వృద్ధి చెందుటచేతనే "జన్మాదులు" అనే భవరోగం ప్రబలుతోంది. తృష్ణ సన్నగిలితే అవి కూడా సన్నగిలుతాయి. "తృష్ణ – తృష్ణా రాహిత్యము" ...ఈ రెండిటిలో ఏది ఉచితమో, ఏది అనుచితమో నీవే పరీక్షించుకో. భోగములపట్ల తృష్ణను విడనాడు. కేవలం సాక్షీ మాత్రుడవై ఉండు. జగదీశ్వరుడవు – చిదాదిత్యుడవు అగు నీ ఉనికిచేతనే, నీవు స్వీకరించుటచేతనే, స్వప్నతుల్యమైనట్టి ఈ జగద్విలాసమంతా ప్రతిభాసిస్తోంది.

ఓ సర్వజనులారా! మీరంతా వ్యర్థంగా శోకించకండి. యథార్థానికి 'సుఖ దుఃఖములు' అనునవేవీ మీకు లేవు. మీరంతా స్వతఃగా పరిశుద్ధ చిత్తులే అయి ఉన్నారు. మీలో ప్రతి ఒక్కరు "సర్వాత్మ స్వరూపులు, సర్వవస్తు ప్రకాశకులు" అయి ఉన్నారని మరువవద్దు.

బంధము నుండి విడివడుటకై ఇప్పటికిప్పుడే ప్రయత్నశీలురు కండి. దీపమున్నప్పుడే ఇల్లు చక్క బెట్టుకోవాలి కదా! ఒక చమత్కారమైన విషయం గమనిస్తున్నారా? ఈ మనస్సుకు మొదట ప్రియంగా తోస్తున్న విషయములు, పదార్థములు చివరకు చూస్తే దుఃఖదాయకములుగానే క్రమ క్రమంగా పరిణమిస్తున్నాయి. మొట్టమొదట కొంత అప్రియంగాను, కష్టంగానూ అనిపించే తపస్సు ఇంద్రియ సంయమము మొ॥నవి జీవునకు కాలక్రమేణా అత్యంతికమైన సుఖం ప్రసాదిస్తున్నాయి.

అందుచేత రామా! సప్త భూమికలలో ఉన్నంతవరకు అభ్యాసం వదలవద్దు. ఆపై అభ్యాసమునకు సంబంధించి కల్పన కూడా పరిత్యజించు.

శ్రీరాముడు : స్వామీ! శాశ్వతమైన సమత్వము లభించేది ఎట్లా?

శ్రీ వసిష్ఠ మహర్షి : "ఇష్ట, అయిష్టములు" అనే కల్పన త్యజించుటచేతనే శాశ్వతమైన సమత్వం లభిస్తోంది. అట్టి సమత్వం హృదయంలో సుస్థిరపడితే జీవుడు మరల ఈ సంసారము నందు జన్మించడు. ఒక అల్లరి పిల్లవాడిలాగా ఈ మనస్సు తన ఇచ్ఛ వచ్చిన పదార్థము లందు సంలగ్నమౌతోంది. దానిని వాటి నుండి తొలగించి అధిష్ఠానమగు చిన్మాత్రమునందే నెలకొల్పాలి. అభ్యాసం చేత, 'సర్వాత్మ భావన" అను అంకుశంతో ఈ మనస్సు అనే మదపుటేనుగును నిగ్రహించాలి. అప్పుడు మోక్షము అనబడేది దానంతట అదే ముంగిటకు వచ్చి వాలుతుంది.

ఈ జీవులలో అనేకులు "ఈ దేహము నిత్యము" అని నమ్మికొని ఉంటున్నారు. మిథ్యా దృష్టిచే కలుషితమైన 'చిత్తము' కలిగి ఉంటున్నారు. భోగసంకల్పములకు వశీభూతులగుచున్నారు. మూర్ఖత్వం, అవివేకములను ఆశ్రయించటం కంటే దుఃఖప్రదమైన విషయం ఇంకెక్కడా ఏదీ ఉండదు. వారంతా వివేకులు కావాలనే మా శుభాకాంక్ష.

ఆత్మతత్త్వనిర్ణయం విషయంలో వివేక, వైరాగ్యాలు చాలా ముఖ్యం. హృదయాకాశంలో ఉదయించే 'అవివేకము' అను మేఘమును "విచారణతో కూడిన వివేకము" అనే వాయువు యొక్క

వేగంతో తొలగించి వేయాలి. స్వయంగా ప్రయత్నించాలి. సచ్ఛాస్త్రములు పరిశీలించటం, ఆత్మజ్ఞులు చెప్పే ఉపదేశాదులు వినటం నిర్వర్తించాలి. లేకపోతే ఆత్మవిచారణ ఎట్లా ఉదయిస్తుంది చెప్పు? ఊరకే తర్కిస్తూ కూర్చుంటే ఏం ప్రయోజనం? గురూపదేశముల ద్వారా అంతర్ముఖ దృష్టిచే స్వయంగా ఆత్మను అవలోకించాలి. లేకుంటే ఆత్మ వ్యక్తం కాదు.

ఓ రామా! నీవు గురూపదేశాలచే ఆత్మ స్థితిని పొందినవాడవయ్యావు. నీకు విస్తృతమైనట్టి ఆత్మ బోధ ప్రాప్తించుచున్నది. "వికల్పములంటూ లేనట్టి చిన్మాత్రయే (లేక పరమాత్మయే) దేశ కాలములన్నిటా వ్యాపించి యున్నది" – అను విజ్ఞానమును సుస్థిర పరచుకో. సర్వసంకల్పములకు అతీతుడవై, సంశయవిభ్రమములన్నీ పాముకుబుసంలాగా విసర్జించివేయి. బాహ్యప్రపంచ కౌతుకములను దరిజేరనీయ వద్దు. దుఃఖం నశించాలంటే అధిరోహణముయొక్క క్రమం చెబుతాను, విను–

1. జ్ఞానము కొరకై సిద్ధపడటం.
2. అందుకు సాధనభూతమైన "విచారణ (Enquiry)"ను చేకూర్చుకోవటం.
3. విచారణచే జనిస్తున్న అవగాహనలను వివేక వైరాగ్యములచే కాపాడుకోవటం.
4. ప్రమాదము, ఆలస్యము – ఈ రెండింటిని దగ్గిరకు రానీయకపోవటం.
5. 'సమాధి సుఖము' అను అమృతమును పానం చేయటం.
6. ఉత్తరోత్తర భూమికలను అధిరోహించటం.
7. ఏడవ భూమికయందు విశ్రాంతి, సుఖాభివృద్ధి.

ఎప్పటి వరకైతే 'ఆత్మ దోషముతో కూడినది' అని నీకు అనిపిస్తోందో – అప్పటి వరకు ప్రయత్నం చేస్తూ ఉండవలసిందే! ఆవరణములు తొలగగానే సర్వ కళంకములు తొలగిపోతాయి. నీ యొక్క 'శుద్ధ బ్రహ్మైక్యము' ప్రకటితమౌతుంది. అప్పుడు అన్నీ తొలగి, 'కేవల బ్రహ్మానంద స్వరూపుడవు' అయి ఉంటావు.

❖❖❖

V. ప్రహ్లాద - నారాయణ సంవాదం

1. హిరణ్యకశిప సంహారం

శ్రీ వసిష్ఠ మహర్షి : రఘురామా! దానవేశ్వరుడు, హరిభక్తులలో శ్రేష్ఠుడూ అయిన ప్రహ్లాదుడు ఒకప్పుడు విచారణ చేసిన విధమేమిటో చెబుతాను. ఈ విచారణ పరిశీలించుటచేత సర్వోత్తమమైన జ్ఞానం లభించగలదని అనుభవజ్ఞులగు మహనీయుల అభిప్రాయం.

❖

పాతాళలోకంలో 'హిరణ్యకశిపుడు' అనే పేరు గల ఒక దైత్యుడు ఉండేవాడు. ఆతని ముందు సురలు గాని, అసురులు గాని యుద్ధంలో నిలబడలేకపోయేవారు. ఆతడు నారాయణుడంతటి యుద్ధ నైపుణ్యం కలవాడని లోకప్రసిద్ధి. తన బలపరాక్రమములతో ఇంద్రుని జయించి, ఆతని వద్ద ముల్లోకముల ఐశ్వర్యములను లాగివేసికొని అనుభవిస్తూ ఉండేవాడు.

హిరణ్యకశిపుడు పెట్టే బాధలు భరించలేక దేవతలు శ్రీహరిని శరణువేడారు. "సరే! సరి అయిన సమయం రానీయండి" అని చెప్పి వారికి ఆయన అభయమిచ్చి పంపారు. కొంతకాలానికి హిరణ్యకశిపునకు "ప్రహ్లాదుడు" అనే కుమారుడు కలిగాడు. ఆ పిల్లవాడు శ్రీమన్నారాయణుని పట్ల అనన్యమైన భక్తి కలిగి ఉండేవాడు. హరిద్వేషి అయిన హిరణ్యకశిపుడు వరగర్వంతో క్రిందా మీదా చూడకుండా "హరిభక్తి" కలిగి ఉన్న ప్రహ్లాదుని అనేక రకాలుగా హింసించాడు. ఆశ్రితవత్సలుడగు హరి తనను దూషించినా, ఏమనడు గాని.... తన భక్తుని బాధిస్తే ఊరుకుంటాడా?

ఒకరోజు ప్రహ్లాదుని పిలిచి హిరణ్యకశిపుడు, "ఏమిరా, అబ్బాయీ! నీవు చెప్పే హరి ఎక్కడ ఉన్నాడురా? నాకు భయపడి ఎప్పుడో పారిపోయాడు. ఇప్పటికిప్పుడు నీ హరిని చూపించు... ఎక్కడున్నాడో! లేదా, హరిభక్తి మరచిపో. ఈ రెండూ కాదంటావా, ఈ రోజు ఈ గదాదండంతో నిన్ను సంహరిస్తాను... అప్పుడు ఏ హరి వచ్చి అడ్డుకుంటాడో చూస్తాను" అని హూంకరిస్తూ పలికాడు. అప్పుడు అనన్యమైన భక్తి గల ప్రహ్లాదుడు "నాన్నా! హరి సర్వాంతర్యామి. అతడు లేని చోటే లేదు. నీవు కోరుకోవాలే గాని, ఆయన నీకు అంతటా దర్శనమిస్తాడు. నీ అంతః శత్రువులైన కామ-క్రోధ-లోభ-మోహ-మద-మాత్సర్యాలను జయించి, నిర్మల హృదయంతో ఒక్కసారి ఈ సర్వమును పరిశీలించు. అంతా నీకే స్పష్టమౌతుంది" అని వినమ్రతతో పలికాడు.

అంతే... హిరణ్యకశిపునకు భలే కోపం వచ్చింది. "ఓరీ దుష్టుడా! అంతటా వ్యాపించి ఉన్నాడని పిచ్చిపిచ్చి మాటలు పలుకుతున్నావు, అయితే నీ హరిని ఈ స్తంభంలో చూపించగలవా....?" అని పలికాడు. అప్పుడు ప్రహ్లాదుడు "ఓ! తప్పకుండా! సర్వమునకు అంతర్యామి, శాశ్వతమైన ఆధారము అయిన నారాయణుడు ఈ స్తంభములో మాత్రం ఎందుకు ఉండడు?" అని చేతులు

జోడించి నమస్కరించాడు. హిరణ్యకశిపుడు తనలో, "ఈ రోజు ఈ సంగతేదో తేల్చుకోవాలి...." అని అనుకున్నాడు. గద చేతపట్టుకుని వీరావేశంతో ఆ ప్రక్కనే ఉన్న స్తంభమును గదతో మోదాడు. "పెటపెటా" ధ్వనులతో స్తంభం చీలిపోయింది. చిత్రమైన "సింహం తల – మానవుని మొండెం" రూపంలో భయంకర శబ్దాలు చేస్తూ ఒక ఆకారం బయల్వెడలింది. కొద్దిక్షణాల్లోనే ఆ రాక్షసుడిని అదుపులోనికి తీసుకొని పగలు-రాత్రి కాని సంధ్యా సమయంలో, ఇంట్లో బయట, లోపల కానట్టి గుమ్మం మీద, 'ఆయుధములు' అని చెప్పబడనట్టి తన గోళ్ళతో ఆ హిరణ్యకశిపుని పొట్ట చీల్చి చంపివేసింది.

దుష్ట శిక్షకుడు, శిష్టరక్షకుడు అగు ఆ శ్రీహరి ఆ విధంగా లోకకంటకుడగు హిరణ్యకశిపుని, అతని పరివారాన్ని దునుమాడి భక్తుడగు ప్రహ్లాదునికి, దేవతలకు, ఎల్లలోకములకు అభయమిచ్చి లక్ష్మీ సమేతుడై అంతర్ధానమైనాడు. భక్తులకు లక్ష్మీ నరసింహ స్వరూపమును ఉపాసనకై ప్రసాదించి, తన ఆశ్రిత వాత్సల్యాన్ని లోకమునకు చాటాడు.

క్రమంగా అంతా సద్దుమణిగింది. ప్రహ్లాదుడు అంతఃపురం జేరాడు. ప్రహ్లాదుడు పట్టాభిషిక్తుడై తండ్రి స్థానములో రాజ్యం ఏల వలసియున్నది. నరసింహస్వామి కొద్ది గంటలలో సృష్టించిన కల్లోలాల గురించి యోచిస్తూ, ఆ రోజు రాత్రి ప్రహ్లాదుడు ఏకాంతంగా తనలో ఈ విధంగా చింతించసాగాడు.

❖❖❖

2. నారాయణీకరణం

ప్రహ్లాదుడు (తనలో) : ఆహా! ఈ మా కుటుంబ సభ్యులగు రాక్షసులలో కొందరు కొందరు "మేం గొప్పవాళ్ళం! గొప్ప సంపదలు గలవాళ్ళం! మమ్ములను ఎవరేం చేస్తారు?" అని ఎప్పుడూ విఱ్ఱవీగుతూ సంచరించేవారు. వాళ్ళందరినీ శ్రీమన్నారాయణుడు కొద్ది నిమిషాల సమయంలో నల్లులను నలిపినట్లు సంహరించివేశాడే! 'మేం గొప్ప పరాక్రమాలు కలవాళ్ళం!' అనుకున్నవాళ్ళు చివరకు, ఆ సామర్థ్యంతో ఏం స్థిరత్వం పొందారు? అందరూ కూడా చంచల సముద్రంలో తరంగాలులాగా కొంతకాలం క్రితం ఈ భౌతిక ప్రపంచంలో ఉద్భవించి, మాన-మద-గర్వాలతో నినాదాలు చేస్తూ, ఆయా శరీరాలతో కొద్దికాలం ఈ భూమిపై సంచరించి, చివరకు ఆ శరీరాలను ఇక్కడే వదలి ఎటో వెళ్ళి పోయేవారే కదా! ఆ రాజ్య సంపదలు, దేవతల పట్ల ఉపయోగించే దూషణ శబ్దజాలాలు ఇప్పుడే మైనాయి? ఎందుకు పనికివచ్చాయి? హరి నృశింహరూపుడై వచ్చి క్షణాలలో అనేకమంది రాక్షసవీరుల మాన-మద-గర్వాలు హరించివేశారే! అంతా హరించుకుపోగా, వారికి ఈ లోకంలో ఏమైనా మిగిలిందా?

ఇదంతా పరిశీలిస్తుంటే ఇవి ఎంత కష్టతరమైన విషయాలు! "మమ్మల్ని చూచి దేవతలే పారిపోతున్నారు, చూచారా!" ... అని గర్విస్తూ చేసియున్న సంచారం ఈ రోజు రాక్షసజాతికి ఏం

సుఖం తెచ్చిపెట్టింది? ఈ సంపదలు అల్పమైన మిత్రులు కాబట్టే ఇవి మమ్ములను దుఃఖపూరితులుగా చేసివేస్తున్నాయి. దేవతలచేత ఊడిగం చేయించుకున్నట్టి ఉద్యమపరులగు రాక్షస వీరుల ఇళ్ళు ఇప్పుడు దైన్య – నిరుత్సాహాలతో పొగచూరుచున్నాయి. మొన్నమొన్నటివరకూ దేవతలు నా తండ్రికి భయపడి దీనులై ఉండేవారు. ఇప్పుడో – నా బంధువులు ఆ దైన్యత్వాన్ని తాము అనుభవిస్తున్నారు. విధిగతిని ప్రవచించటం ఎవరి తరం! నిన్నటిదాకా మా నగరం వనములతో, భవనములతో ఈ సృష్టికే ప్రత్యేకమైన ఆభరణములాగా వెలుగొందేది. ఇప్పుడేమైనది? ఆ నరసింహస్వామి వచ్చి రెండు గడియల కాలంలో తన తాండవంతో అంతా నేలమట్టం చేశాడు. పేరు పేరునా బయటకు పిలిచి అనేకమంది రాక్షస వీరులను మట్టుపెట్టాడు.

ఏ వింజామరములైతే మా తండ్రి సేవలో నిరంతరం పరిశ్రమిస్తూ ఉండేవో – అవన్నీ ఇప్పుడు ఆ ఇంద్రుని సేవించటానికి వెళ్ళాయి. ఆ నారాయణుని శరణు వేడినందుకు దేవతల కష్టాలు కడతేరి, వారు సంతోషముగా ఉంటున్నారు. 'విపత్తు' అనే సముద్రంలో మునిగిపోతున్న దేవతలను విష్ణు భగవానుడు రక్షించాడు. అన్నిటికీ ఆయనే సమర్థుడు. ఆయన అండచూచుకొనే... ఈ రోజు దేవతలది పైచేయి అయి, వారు దైత్యులను వేధింప గలుగుతున్నారు. బాణాలు, కండబలం, లౌకికమైన తెలివితేటలు ఉపయోగించి నరసింహరూపుడగు విష్ణుదేవుని ఎవరు వశం చేసుకోగలరు?

❖

ఈ లోకములోని శరణార్థులందరికీ శరణు వేడుటకు అత్యంత శ్రేయోదాయకమైన స్థానమే ఆ శ్రీమన్నారాయణుడు. అందుచేత సర్వభావములచేతను, సర్వప్రయత్నములచేతను ఆ హరిని శరణు వేడటమే ఉపాయం. జీవులందరికీ ఆతడేగదా, గతి! ఆ విష్ణువును వశపరచుకోవాలంటే ఆయనను ప్రేమించాలి. అల్పమైనవాటిని ప్రేమించి అల్పమైన గతిని నేను ఎందుకు పొందాలి? సృష్టి – స్థితి – లయములకు కారణభూతుడగు ఓ పరమేశ్వరా! నారాయణమూర్తీ! సర్వమునకూ మూలకారణము, అచింత్యము అగు నీ మహిమకు నమస్కారం!

అస్మాన్నిమేషాత్ ఆరభ్య నారాయణమజం సదా ।
సంప్రపన్నోస్మి సర్వత్ర నారాయణమయోస్మ్యహమ్ ॥

'జన్మ' అనబడునదేదీ లేనివాడా! జన్మకర్మలకు ఆవల ఉన్నవాడా! హే నారాయణా! ఈ క్షణం నుండి నిన్ను మాత్రమే శరణు వేడుచున్నానయ్యా! ఈ సర్వ దేశ – కాల – వస్తువులందు అంతటా నేను నారాయణమయముగా గాంచుచున్నాను.

ఓం నమోనారాయణాయేతి మంత్రః సర్వార్థ సాధకః ।
నాఽపైతి మమ హృత్కోశాత్ ఆకాశాదివ మారుతః ॥

ఆకాశము నుండి వాయువు తొలగి, మరింకెక్కడికైనా వెళ్ళి పోగలుగుతుందా? లేదు. అట్లాగే "ఓం నమోనారాయణాయ" అనే మంత్రం ఏమాత్రం నా హృదయకోశము నుండి తొలగకుండుగాక! సర్వార్థ సాధకమై సర్వదా వెలుగొందుగాక!

తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం ...ఇంకా తదితర దిక్కులన్నీ కూడా విష్ణు స్వరూపములే. ఆకాశము కూడా విష్ణు స్వరూపమే. ఈ జగత్ అంతా విష్ణు స్వరూపమే అయినప్పుడు, ఇక నేనో! అప్రమేయుడగు ఆ విష్ణువునే కదా! అహో! ఇప్పుడు నేను విష్ణుమయుడను అయ్యాను. "నేను విష్ణు రూపుడనే" అను ఐక్యము పొందకుండా, "విష్ణువునకు వేరైనదేదీ ఎక్కడా ఉండజాలదు..." అను అవగాహన కలిగి ఉండకుండా విష్ణుపూజ చేస్తే స్వల్పప్రయోజనమే – అని నాకు అనిపిస్తోంది.

హరిః ప్రహ్లాదనామాయో మత్తో నాఽన్యోహరిః పృథక్ ।
ఇతి నిశ్చయవానన్తర్వ్యాపకోఽహంచ సర్వతః ॥

విష్ణువే ప్రతిఒక్కని రూపంగా ప్రదర్శితమౌతున్నాడు. నేను విష్ణురూపుడనే. నా రూపం మరొకటేదో అయి ఉండదు. ఉండజాలదు. అట్లాగే సర్వ జీవులు కూడా! ఆ విష్ణువే ఈ ఉపాధిలో 'ప్రహ్లాదుడు' అను పేరు కలిగి ఉంటున్నాడు!

మరొక ఉపాధిలో మరొక పేరు! విష్ణువుకు వేరుగా ఎక్కడ ఏమి ఉన్నది? ...అందుచేత నేనే అంతటా వ్యాపించి ఉన్నాను. నేనే విష్ణువును. నేనే ఈ సర్వరూపాలలో సర్వదా వ్యాపకుడనై ఉన్నాను. ఈ అనంత ఆకాశమును తన రెక్కలతో నింపి వేయగల గరుడుడు నాకు వాహనమై ఉన్నాడు. పక్షులు చెట్ల కొమ్మలపై విశ్రాంతి తీసుకుంటూ ఉంటాయే...! ఆ విధంగా చక్రము, శంఖము, గద, అస్త్రములు మొదలైనవన్నీ ఈ నా చేతులలో అరూపంగా, ప్రేమాస్పదంగా విశ్రాంతి తీసుకుంటూ ఉంటున్నాయి.

నా ఈ చేతిగోళ్ళు మణి మాణిక్యాల వలె కాంతులు వెదజల్లుచున్నాయి. క్షీరసాగరం మథిస్తున్నప్పుడు, ఆ ఒరిపిడికి నొప్పి పొందినది ఈ నడుమే. ఆ విష్ణువు కీర్తి అనేక శోభలతో, అనేకమంది మూర్తుల రూపమున నాకు కనిపిస్తోంది. అహో! విష్ణుమాయయే క్రొత్త జగత్ సమూహములను ఎప్పటికప్పుడు ప్రకటించుచూ "ఒక గొప్ప ఇంద్రజాలంలోని విలాసం" లాగా నాకు ఎదురవుతున్నది. అనేక నామ రూపాలతో జయ జయ నినాదాలు ఈ జనులు పలికేది ఆ ఏకోనారాయణునే కదా!

విష్ణు స్వరూపుడనగు నా ముఖమునందు ఈ సూర్యచంద్రులు రెండు కళ్ళలాగా వెలుగొందుచున్నారు. నా నీలమేఘ శరీరమే అంతటా అన్నివేళలా అఖండమై వెలుగొందుచున్నది. ధవళ ఛాయలతో శబ్దరూపమై ఆకాశమువలె మూర్తీభవించు 'పాంచజన్యము' అనే శంఖము ఈ నా కుడిచేతిని అలంకరించి ఉంటోంది. బ్రహ్మదేవునికి జన్మస్థానమైయున్న కమలము నా నాభి యందు జన్మించి నా చేతిని అలంకరించి ఉంటోంది. దేవ దానవులను కూడా మర్దించగల గద, దిక్కులను రక్తవర్ణముతో నింపివేయగల సువర్ణచక్రం నన్ను అంటిపెట్టుకొని ఉంటున్నాయి. చెడును ఖండించి, దేవతలకు, భక్తులకు ఆనందాన్ని ఇచ్చే ఖడ్గమిదే. ధనుష్టంకారాలతో దుర్మార్గుల గుండెలు 'దడేలు' మనిపించగల శారఙ్గము అను పేరుగల ధనుస్సు నా హస్తమును అలంకరించియున్నది.

అసంఖ్యాకములగు ఈ బ్రహ్మాండములన్నిటినీ నా యందు అనంతకాలంగా ధరించి ఉంటున్నాను. ఈ భూమి నా రెండు పాదములు. ఆకాశం నా శిరస్సు. ఈ 'స్వర్గ–భూ–పాతాళములు'

అనబడే మూడు లోకములు నా భౌతిక శరీరం. దిక్కులు నా పొట్ట. గరుడుని మూపును అధిరోహించి నేను వస్తుంటే లోకకంటకులు, అధర్మ నిరతులు అయిన దుష్టజీవులు వెనక్కు తిరిగి పారిపోతున్నారు. ఆ నీలవర్ణుడు, పీతాంబరధారి, గదాధరి, లక్ష్మీసమేతుడు అచ్యుతుడు అయిన మహావిష్ణువును నేనే అయి ఉన్నాను. సంకల్ప మాత్రం చేత ఈ ముల్లోకములను క్షణంలో దహించివేయగలను కదా! ఇక నన్ను ఎదుర్కొనగలవారు ఎవరు? కాలాగ్నిలో ప్రవేశించే మిడతలాగా నన్ను ఎదుర్కొనువాడు స్వవినాశనము గావించుకొనుచున్నాడు. మంద దృష్టి కలవారు వెలుతురును సహించలేనట్లు దేవతలు, రాక్షసులు నా తేజోమయ రూపమును చూచి సహించలేరు. బ్రహ్మ, ఇంద్రుడు, అగ్ని, రుద్రుడు మొదలగు మహనీయులంతా వేనోళ్ళ ఎల్లప్పుడూ పొగడుచున్నది నన్నే! నేను పరమైశ్వర్యయుక్తుడను.

సర్వ ద్వంద్వములకు అతీతుడను. సర్వోత్తమమైన మహిమతో కూడుకున్న వాడను. సముద్రంలో సుడిగుండం ఉన్నట్లు, ఈ మూడులోకములు నాయందే ఉన్నాయి.

ఒక వైపు నుండి దుష్టులగువారిని బలాత్కారంగా వినాశనమొనర్చటం, మరొక వైపుగా మేఘాలకు, పర్వతాలకు, సర్వ జీవులకు నివాసస్థానమై ఉండటం – ఈ రెండూ నా కార్యక్రమములే!

సర్వ సృష్టులు తన యందు ధరిస్తున్న నా విశ్వ – విశ్వంభర – విశ్వాంతరాళ – విశ్వాంతర్గత – విశ్వరహిత రూపం క్షణకాలం సాక్షాత్కరించినంతమాత్రం చేత ఈ జీవుల సర్వ దుఃఖములు తొలగిపోతాయి! అట్టి విష్ణుస్వరూపుడనగు నాకు నేను సాష్టాంగ దండ ప్రణామములు చేస్తున్నాను.

❖

3. విష్ణు స్తవనం

ఆ విధంగా ప్రహ్లాదుడు తన తనువును, మనస్సును విష్ణుమయంగా చేస్తూ, ఇంతలోనే "నేను ఇప్పుడు అట్టి మహిమాన్వితుడగు మహావిష్ణువును పూజించి సంతసింపజేస్తాను"... అని తలచాడు.

ప్రహ్లాదుడు : శంఖ చక్ర గదాధారివగు ఓ మహాప్రభో! విష్ణుమూర్తీ! నా పూజ యొక్క అనుకూలత కొరకు కల్పించుకున్న ఈ రూప నామములు ఒక వ్యష్టి కాదు! సమష్టి కూడా కాదు. మరి ఇంకెవరు? నా వాస్తవస్వరూపమే! ఇందులో ఏమీ సందేహమునకు ఆస్కారం లేదు.

నాయొక్క "వాస్తవరూపమే" అయిఉన్న ఆ విష్ణు భగవానుని హృదయంలోనే ఉండి – నాకు నేనే, నా గురించి నేనే ఈఈ పలుకులన్నీ పలుకుచున్నాను. హృదయంలో నుండి, ప్రాణవేగంచే భావన ద్వారా కల్పించబడుచున్న ఈ పుష్పాంజలిని, ఆ విష్ణుభగవానుని పాదాలకు సమర్పిస్తూ... ఇదే నా స్తోత్రం!

వైనతేయ సమారూఢః స్ఫురచ్ఛక్తి చతుష్టయః
శంఖ చక్ర గదా పాణిః శ్యామలాంగ చతుర్భుజః
చంద్రార్క నయనః శ్రీమాన్ కాన్త నన్దకనందనః
పద్మపాణిః విశాలాక్షః శారఙ్గధన్వా మహాద్యుతిః ॥

తదేనం పూజయామ్యాశు పరివార సమన్వితమ్
సపర్యయా మనోమయ్యా సర్వసంభార రమ్యయా
తతఏనం మహాదేవం పూజయిష్యామ్యహమ్ పునః
పూజయా బాహ్యసంభోగమహత్యా బహురత్నయా ॥

గరుడుని తన వాహనంగా కలవాడు, "ఇచ్ఛ, జ్ఞానము, క్రియ, అనుగ్రహము" అనే నాలుగు దివ్యమైన శక్తులు కలవాడు, శంఖము, చక్రము, గద చేతులందు ధరించినవాడు, చంద్ర సూర్యులే తన రెండు కళ్ళుగా కలవాడు, అయిన ఆ విష్ణువు సర్వే సర్వత్రా వెలుగొందుచున్నాడు. 'నందకము' అను పేరు గల ఖడ్గం చేత ధరించి సుజనులకు సంతోషం కలుగజేస్తూ ఉంటాడు. విశాలమైన నేత్రములు కలవారై, చేతిలో కమలము కలిగియుంటాడు. భుజము 'శారఙ్గము' అను పేరు గల ధనుస్సు ధరించి భక్తులకు ఉత్సాహం కలుగజేస్తూ ఉంటాడు. అట్టి సాంగ - సపరివార - సమేతుడగు విష్ణుదేవుని పూజ మనస్సుతో ప్రారంభిస్తున్నాను.

మనస్సుతో పూజ అయిన తరువాత రత్నములు పుష్పాదులతో బాహ్యమైన పూజ కూడా చేస్తాను. ఉభయ రీతులలో అర్చించెదను గాక!

❖

ఇట్లా తలచి, ఆ ప్రహ్లాదుడు సర్వసామాగ్రి సహితంగా లక్ష్మీపతియగు విష్ణుదేవుని పూజించాడు. అభిషేకములతోనూ, పూలతోనూ, ధూప దీప నైవేద్యములతోనూ, ప్రదక్షిణ-నమస్కార-ఆత్మ సమర్పణ లతోనూ ఆయనను అర్చించాడు. ఆ అంతఃపురంలోనే ఉచితాసనం సమర్పించాడు. ఉత్తమ, నిష్కల్మష భక్తితో నిండిన మనస్సుతో మానసిక పూజ ఆచరించాడు.

కొంతసేపు బాహ్యపూజ. మరికొంత సేపు మానసికమైన పూజ. ఈ విధంగా ఆతని సాధన కొనసాగింది. కొన్ని రోజులు అర్చనాదులను చేస్తూనే ఉన్నాడు. "యథా రాజా, తథా ప్రజా" అన్నట్లుగానే అక్కడి దైత్యులు కూడా విష్ణుభక్తిని అలవరచుకోసాగారు. ప్రజలు ఆచారములకు కారణభూతుడు రాజే కదా!

❖❖❖

4. దేవతలలో కలకలం - ఊరట

రాక్షసులందరూ విష్ణుద్వేషం త్యజిస్తున్నారనీ, విష్ణుభక్తిని సమాశ్రయిస్తున్నారని వార్తలు స్వర్గలోకం వరకు వ్యాపించాయి. ఇంద్రాది దేవతలు ఈ విషయం విని ఆశ్చర్యపోయారు. "ఈ దైత్యు లేమిటి? విష్ణుభక్తిని స్వీకరించటమేమిటి? ఎందుకిట్లా జరుగుతోంది?" అని ఆశ్చర్యపోసాగారు. గబగబా క్షీరసాగరం జేరి, నారాయణునితో ఇట్లు నివేదించారు.

దేవతలు : హే దేవాధిదేవా! ఆదినారాయణా! ఎంత ఆశ్చర్యమో చూచారా? మీ పట్ల ఎల్లప్పుడూ విరోధభావాలు కలిగి ఉండే రాక్షసులు ఈ రోజు మీ పట్ల భక్తితో తన్మయులై ఉంటున్నారు. మరి,

కారణమేమిటో తెలియదు. ఇదంతా ఏదైనా మాయయొక్క చర్య కాదు కదా! నిన్న మొన్నటిదాకా ప్రశాంతచిత్తులగు మునుల ఆశ్రమాలకు వచ్చి విధ్వంసం చేస్తూ ఉండటమేమిటి? ఈనాడేమో ... పవిత్రమైన జన్మ – స్థితి – గతులకు కారణం కాగల విష్ణుభక్తిని అలవరచుకోవటమేమిటి? ఎంతో ఉత్తమ కర్మల ప్రయోజనంగా విష్ణుభక్తి అలవడుతుంది. దుష్కర్మలను నిర్వర్తించేవారు మాయలోనే కొట్టుమిట్టాడుతారు తప్ప... విష్ణు భక్తికి అర్హత పొందకూడదే? పరహింసాపారాయణుడై ఉండే ఒక నీచుడు నీతి శాస్త్రకోవిదుడైనాడంటే అది ఎంత అసమంజసం? ఈ రాక్షసులు విష్ణు భక్తులౌతున్నారంటే, ఈ వార్త మమ్ములను ఎందుకో, భయపెట్టుతోంది. అమూల్యమైన ఒక మణి చెత్త కుండీలోనో, గాజు పెంకుల మధ్యో ఉండటం ఏం ఉచితం చెప్పండి! అకాలంగా పుష్పాలు పూస్తే... అది సుఖ ప్రదమంటారా? ఎక్కడన్నా మేక, కుక్క కలిసి జీవిస్తాయా? ఏ పదార్థం ఎక్కడుండటం శోభ కాదో ... అది అక్కడుండటం శుభమెట్లా అవుతుంది? పులి శాకాహారం తీసుకుంటుంటే ... అది అపసవ్యమే కదా! ఏ జీవికి ఏఏ గుణాలు ఉంటాయో... ఆ జీవి అందుకు తగినట్టి స్థితి గతులకే యోగ్యుడౌతాడని వేదనిర్ణయం కదా! అనుచితమైన రెండు వస్తువులు ఒకే చోట ఉండకూడదు కదా! కమలములు నీళ్ళలో ఉన్నప్పుడే శోభిస్తాయిగాని.... నేలపై శోభించవే! ఈ దానవులు ఎంతో కాలంగా క్రూరము – విచారణరహితము – అపవిత్రము అయిన ఏవేవో ఆచార వ్యవహారాలలో నిమగ్నమౌతూంటారు. మరొకరిని హింసించటంలో తప్పు లేదని సముదాయించుకుంటారు. మరి... అధమమైన నీచప్రవృత్తి గల రాక్షసులెచట? సృష్టి మొత్తంలో అత్యంత పవిత్రము, అనేక జన్మలలో ఆర్జించుకున్న పుణ్య ఫలితం అయినట్టి విష్ణుభక్తి ఎక్కడ? కమలాలు ఉండే సరస్సులో దుష్టమొక్కల పెరుగుదల దుఃఖ ప్రదమే అయినట్లు ...మీ పట్ల దానవుల భక్తి కూడా మాకు శుభ సూచక మనిపించటం లేదు.

శ్రీమన్నారాయణుడు : ఓ దేవతలారా! ప్రహ్లాదుడు నా భక్తుడు. మీరు అతని గురించి చింతించవలసిన పనే లేదు. ఆతనికి ఇదే ఆఖరు జన్మ. ఈ జన్మలోనే తన యొక్క భక్తి ప్రభావం చేత మోక్షమునకు అర్హుడు అగుచున్నాడు. ఇంతకీ మీరు ఎందుకు దుఃఖిస్తున్నారో చెప్పండి?

గుణవాన్ నిర్గుణోజాత ఇతి అనర్థక్రమం విదుః ।
నిర్గుణో గుణవాన్ జాత ఇత్యాహుః సిద్ధిదంక్రమమ్ ॥

గుణవంతుడు గుణహీనుడైతే అనర్థమౌతుంది గాని, గుణహీనుడు ఎందుచేతనైనా గుణవంతుడు అవుతూంటే ...అది మంచిదే కదా! అది అందరికీ సంతోషమైన విషయమే. ప్రహ్లాదుని సుగుణములు, మరొకరిని దుఃఖపెట్టేవి కానేకావు. సర్వసహజీవులకు విష్ణుతత్త్వానందం కలుగజేయ గలిగేది. అందుచేత మీరు నిశ్చింతగా మీమీ స్వస్థానములకు వెళ్ళండి. విష్ణుతత్త్వం అందరి సొత్తు సుమా!

ఇట్లు పలికి విష్ణుభగవానుడు క్షీరసాగర కెరటములలో అంతర్ధానమైనాడు. అప్పటి నుండి దేవతలు ఊరటజెందారు. తాము కూడా ఆతని పట్ల స్నేహ, సౌహార్ద్రభావాలు కలిగి ఉండటం ప్రారంభించారు. మహాత్ములు ఎవరి పట్ల సంతుష్టి కలిగి ఉంటే, తదితరులకు కూడా వారి పట్ల గురి కుదురుతుంది కదా!

❖❖❖

5. తరుణోపాయం

ప్రహ్లాదుడు ఈ శరీరంతోను, వాక్కుతోను, మనస్సుతోను వివిధ సమయాలలో వివిధరీతులుగా విష్ణు పూజ చేస్తూ కొన్ని రోజులు గడిపాడు. కొంతకాలానికి, ఆతని అంతరంగంలో వివేకము, సంతుష్టి, వైరాగ్యాది ఉత్తమ గుణాలు పెంపొందాయి. ఈ దృశ్య ప్రపంచంలో ఇంద్రియాలకు తారసపడే భోగసముదాయాలు – 'పెద్దల దృష్టిలో పిల్లల ఆటలు'లాగా అర్థరహితంగా తోచ సాగాయి. మనుష్యులు సంచరించే చోట తేళ్లు, పాములు సంచరిస్తాయా? శాస్త్రార్థములను మననం చేస్తూ ఉండే ఆ ప్రహ్లాదుని మనస్సులో లౌకికమైన ధన, నారీ జనాది విషయాలకు చోటు లభించటం లేదు. ఆతనికి ఈ సకల దృశ్యపదార్థములలో ఏ ఒక్కటీ ప్రీతి గొలుపటం లేదు. "ఈ దృశ్య భోగాలన్నీ రోగ రూపములే కదా! వీటిలో ఏం ప్రత్యేకత ఉన్నది?" అను నిస్సంశయమైన అవగాహన ఆతని యందు రూపుదిద్దుకొన్నది.

ఆతడు భోగాల పట్ల సర్వ ఆశలను విడనాడాడు. అయినప్పటికీ, ఎందుకో... ఆతని మనస్సు పూర్ణ విశ్రాంతి పొందనే లేదు. ఆతని చిత్తము ఇటు భోగములను ఆశ్రయించుటలేదు... అటు శుద్ధ బ్రహ్మమునందు విశ్రాంతి పొందుట లేదు. ఆతనికి ఏమి చేయాలో పాలుపోవటం లేదు.

❖

విష్ణు భగవానుడు తన యొక్క "శుద్ధసాత్వికము – సర్వత్రా వ్యాప్తము" ... అయినట్టి జ్ఞాన శక్తిచే తన భక్తుడగు ప్రహ్లాదుని మానసిక స్థితిని గమనించాడు. భక్తులకు సంతోషం, ఉత్సాహం కలిగించటం ఆయన యొక్క స్వభావం కదా! అందుచేత పాతాళమార్గంగుండా ప్రహ్లాదుని పూజా మందిరంలో ప్రవేశించాడు. ప్రహ్లాదుడు తన ఎదుట మూర్తివంతుడై ప్రత్యక్షమైన విష్ణుభగవానుని చూచాడు. పులకిత శరీరుడై హర్షాతిరేకంతో పెద్ద గొంతుకతో ఇలా గానం చేశాడు.

ప్రహ్లాదుడు :

త్రిభువన భవనాభిరామకోశం, సకల కలంకహరం పరం ప్రకాశమ్
అశరణశరణం శరణ్యం, ఈశం, హరిమ్, అజమ్, అచ్యుతమ్, ఈశ్వరం ప్రపద్యే ॥

కువలయదలనీల సంనికాశం, శరదమలాంబర కోటరూపమానమ్
భ్రమర – తిమిర–కజ్జల–అంజనాభం, సరసిజ చక్ర–గదాధరం ప్రపద్యే॥

విమల మలికలాప కోమలాంగం, సితజల పంకజ కుడ్మలాభ శంఖమ్ ।
శ్రుతిరణిత విరన్చి చంచరీకం, స్వహృదయ పద్మదలాశ్రయం ప్రపద్యే ॥

సితనఖగణ తారకావికీర్ణం, స్మితధవలానన పీవరేన్దు బింబమ్
హృదయమణి మరీచిజాలగంగం, హరిశరదంబరమ్ ఆతతమ్ ప్రపద్యే ॥

అవిరలకృతసృష్టి సర్వలీనం, సతతమ్ అజాతమ్, అవర్ధనమ్, విశాలమ్
గుణశతజరఠాభిజాత దేహమ్, తరుదలశాయినమ్ అర్భకం ప్రపద్యే ॥

నవ వికసిత పద్మరేణుగౌరం, స్ఫుటకమలా వపుషా విభూషితాంగమ్
దినశమ సమయా అరుణాంగరాగం, కనకనిభాంబర సుందరం ప్రపద్యే॥

దితసుత నలినీ తుషారపాతం, సురనలినీ సతత ఉదిత అర్కబింబమ్
కమలజ నలినీ జలావపూరం, హృదినలినీ నిలయం విభుం ప్రపద్యే ॥

త్రిభువన నలినీ సితారవిందం, తిమిర సమాన విమోహ దీపమగ్ర్యమ్
స్ఫుటతరమ్ అజడం చిదాత్మతత్త్వం, జగదఖిలార్తిహరం హరింప్రపద్యే ॥

ప్రభో ! శ్రీమన్నారాయణా! వాసుదేవా! త్రిలోకరక్షకా! హృదయం లోపల, బయట కూడా ఉన్న అంధకారం నశింపజేయు మహానుభావా! ఈ జగత్తులు, సూర్యచంద్రులు ఏర్పడుటకు కారణ మైనవాడా! నమస్కారమయ్యా! దిక్కులేనివారికి దిక్కునీవేకదయ్యా! సర్వ శరణ్యుడవు, ఈశ్వరుడవు, అజుడవు, సర్వ దుఃఖహారుడవు అగు ఓ విష్ణుభగవాన్ ! నేను నిన్ను శరణువేడుచున్నాను. హృదయ కమలంలో వేదమే స్వరూపముగా గలిగినట్టి బ్రహ్మదేవుని ధరించినట్టి నీవే మమ్ములను రక్షించాలి! అనంత, ఆకాశస్వరూపుడవు. ఆదిమధ్యాంత రహితుడవు, ఈ విశాలసృష్టినంతా నీ యందు లీన మొనర్చుకున్నవాడవు, ఉత్పత్తి – వినాశ రహితుడవు అగు ఓ తండ్రీ! ప్రళయ కాలసమయంలో నీవు “సత్యము” మొదలైన మాయాగుణములచే ప్రేరేపితులై, సనాతనులై, సుందర దేహులై ఒక పసిబిడ్డ రూపంలో మఱ్ఱిచెట్టు ఆకుపై శయనిస్తారట కదా! అట్టి మీకు సాష్టాంగదండ ప్రణామములు. లక్ష్మీదేవిచే అలంకరించబడిన వక్షస్థలం గల మిమ్ములను సేవిస్తున్నాను. సర్వవ్యాపకులై, దుష్ట క్రియలను నిర్వర్తించే రాక్షసులను మట్టుబెట్టి, మీ భక్తులగు దేవతలను, తదితరులను సర్వదా రక్షిస్తూ ఉంటారు కదా! నాకు మార్గము – ఆశ్రయము – లక్ష్యము మీ పాదములు మాత్రమే! మిమ్ములను శరణువేడుచున్నాను. కిరణములన్నిటికీ సూర్యుడు ఉత్పత్తిస్థానమైనట్లు... ఈ జగత్తులోని ప్రతిజీవికి ఉత్పత్తి స్థానం మీరే! ‘అజ్ఞానం’ అనే కారుచీకటిలో తారట్లాడుతుంటే, మాకు లభిస్తున్న కాంతి దీపమే మీరు. మీరు నిత్యులు! స్వయం ప్రకాశకులు! జడత్వముకంటే విలక్షణమైనట్టి చిదాత్మస్వరూపులు! స్మరణ మాత్రంచేత సర్వజీవుల దుఃఖమును హరించివేసేవారు! హే శ్రీహరీ! నారాయణా! సర్వేశ్వరా! దీనబంధూ! మిమ్ములను నేను మరలమరల ఆశ్రయిస్తున్నాను. శరణు వేడుచున్నాను. ప్రియురాలు ప్రియుని పొందగోరునట్లు, బెంగపడిన బిడ్డ తల్లియొక్క స్పర్శను కోరు కున్నట్లు, నేను మీ ఆగమనాన్ని కోరుకొంటున్నాను. మీ దర్శనమైనది, ఇక నాకేం కావాలి!

❖

ప్రహ్లాదుడు చేసిన స్తుతులను విని విష్ణుభగవానుడు సంతోషించి, ఎంతో వాత్సల్యంతో ఇట్లు పలికాడు–

శ్రీమన్నారాయణుడు : పుత్రా! ప్రహ్లాదా! నీ భక్తిపూర్వకమైన స్తోత్రానికి నేను సంతసించాను. నీలో ఉన్న కొంచెం నిరుత్సాహం తొలగించాలనే ఉద్దేశంతో వచ్చాను. నీకు ఏమి కావాలో కోరుకో! అది నేను నీకు సంతోషంగా ఇచ్చి నిన్ను ఆనందపరుస్తాను.

❖

ప్రహ్లాదుడు అది విని, కాస్త యోచనలో పడ్డాడు. ఆహా! ఏమి సుదినం! సర్వలోక నియామకుడగు పరంధాముడు నా ముందుకు వచ్చి ఏమి కావాలో కోరుకోమంటున్నారే! ఏదో సామాన్యులైతే, మనం సామాన్యమైన విషయాలు అడుగుతాం! సర్వకర్త, సర్వభోక్త అగు ఈ సర్వేశ్వరుని ఏం అడగాలి? ఏవో కొన్ని వస్తువులు అడగవచ్చు! ...కాని, ఏది పొందినా, అదంతా కొంత కాలానికి విసుగు కలిగిస్తుంది. ...చివరికి దుఃఖంగా పరిణమిస్తుంది కదా!

ప్రహ్లాదుడు : స్వామీ! నేను ఏదీ కోరి ధ్యానించటం లేదు. మీపట్ల స్వభావసిద్ధంగా ప్రేమ జనించింది. నాకు ఇంకేం కావాలి. అహంతు అ కామః!

శ్రీమన్నారాయణుడు : నాయనా! నీ అప్రకృత్రిమ భక్తి ప్రేమలకు మరింతగా సంతోషించాను. ఏది కావాలన్నా ఇచ్చి సంతోషింపజేయటానికి నేను సంసిద్ధం.

ప్రహ్లాదుడు (తనలో) : అయినా... ఈ సర్వలోకములలో ఉత్తమోత్తమమైనదేది? సర్వసంసార దుఃఖములను తొలగించగలిగేది ఏదైనా ఉన్నదా? అట్టిదేదైనా ఉండి ఉండవచ్చునేమో! అయితే, స్వల్పబుద్ధిగల నాకు అదియేమో తెలియటం లేదే!

అయినా, నా ఎదురుగా ఉన్నది సామాన్యుడా! సర్వజ్ఞుడగు నారాయణుడు కదా! నా బుద్ధిని ఉపయోగించి ఏదో ఒకటి అడిగే బదులు, ఆయననే సంప్రతించి, ఆ తరువాత అడిగితే పోలేదా?

ప్రహ్లాదుడు (శ్రీమన్నారాయణునితో): హే ప్రభో! మీరు సర్వసంకల్పముల ప్రదాత కదా! సర్వ లోకాలలో అంతఃస్థితులై ఉంటారు. ఇక మిమ్ములను నేనేం కోరాలి! దర్శనం ప్రసాదించారు. నాకు అంతే చాలు! అయితే, అంతటి మీరు నాపై దయతో ఏదైనా కోరుకోమంటే... ఏదోకటి కోరుకోవాలి కదా..! నా అల్పబుద్ధిని ఉపయోగించి ఏమైనా కోరితే... ఆ కోరిన దాని ప్రయోజనం కూడా అల్పంగానే ఉంటుంది. మీరు భక్తులకు తండ్రి, సోదరుడు, మిత్రుడు, సర్వస్వము కదా!

అందుచేత మీకు ఒక చిన్న విన్నపం చేస్తున్నాను. మీరు ఏది సర్వోత్తమమని, దుఃఖసంసార దోషరహితమని అనుకుంటారో ...అట్టి దానిని, నా అర్హతను అనుసరించి మీరే ప్రసాదించండి. మీరు ఏది ఇస్తే, దానిని మహాప్రసాదంగా స్వీకరిస్తాను.

శ్రీమన్నారాయణుడు : నాయనా! ప్రహ్లాదా! సర్వోత్తమమైనది సర్వదోషరహితమైనదై ఉండాలి. సర్వవస్తువులకు, దృశ్యమంతటికీ అతీతమైనదై ఉండాలి కదా! అందుచేత, పరమానందదాయకమైనది వస్తుజాలంలో లేదు. 'ముక్తి'యే అన్నిటికీ మించినది. అయితే, సంసార భ్రమరహితమైనట్టి ముక్తస్థితి సమగ్రమైనట్టి నీయొక్క అవగాహననుండే ప్రాప్తిస్తుంది. అందుకు నీకు నీవుగా తత్త్వవిచారణను ఆశ్రయించటమే ఉపాయం.

పరమోత్తమమైన ఆశయంగల నీవు బ్రహ్మమునందు ప్రశాంతపూర్వకమైన విశ్రాంతి లభించే వరకూ 'తత్త్వవిచారణ'ను చేయి. ఆత్మయొక్క స్వరూప స్వభావాల గురించి "విచారణ"కు ఉపక్రమించు. శుభమస్తు!

❖

ఇట్లు పలికి, చిరునవ్వు కురిపిస్తూ నారాయణుడు అంతర్ధానమైనాడు. ప్రహ్లాదుడు స్వామికి భక్తి పారవశ్యంతో హృదయకుసుమాంజలి సమర్పించటం పూర్తి చేసి, అప్పటికప్పుడే ఏకాంతంగా ఒక చోట పద్మాసనం వేసుకొని కూర్చున్నాడు. కొంతసేపు అత్యంత ప్రీతిపూర్వకంగా శ్రీమన్నారాయణుని స్తోత్రం గానం చేశాడు. ఇక ఆ పై విచారణకు ఉపక్రమించాడు.

❖❖❖

6. తత్త్వ విచారణ

ప్రహ్లాదుడు (అంతరంగంలో) : సర్వసంసార దుఃఖాలను సంహరించ గల ఆ విష్ణుమూర్తి ఇప్పుడు నాకు చెప్పినదేమిటి? 'విచారణ చేయి' అని కదా! సరే, ఇప్పుడు నేను విచారణ ప్రారంభిస్తున్నాను. నేను విచారణ చేయవలసింది దేని గురించి? 'నేను' గురించే! అదియే ఆత్మవిచారణ కూడా కదా!

నేను అనగా ఎవడను? - ఈ మాట్లాడుచూ, నడుచుచూ, కూర్చుంటూ, ఆయా ప్రయత్నములు చేస్తూ, విషయములను స్వీకరిస్తూ ఇప్పుడు ఈ విచారణకు ఉపక్రమిస్తున్నట్టి నేను ఎవరు?... దృశ్యంలోని ఒక వస్తువునా?

"కొయ్య-రాయి-మట్టి" వంటి ఒక పదార్థమునా? దేహములో ఉంటూ సర్వమును చూస్తున్నట్టి నేను ఒక బాహ్యమైన వస్తువును ఎట్లా అవుతాను? ఒక వస్తురూపంగా చూస్తే ఈ దేహమునకు బాహ్యమైనదేదీ నేను కాదు.

ఈ దేహమే నేనా? - (ఒక్కసారి తన దేహం వైపు చూచాడు). ఈ కనబడే నా దేహమును ఒక్క సారి పరిశీలనగా చూస్తే, ఇది కొద్దికాలం క్రితం రూపందిద్దుకొని మరికొద్ది కాలంలో నశించబోతోంది. ఇది స్వయంగా ఏమీ చేయలేదు. దీనిని ఆయా క్రియలకు వినియోగిస్తున్నది నేను. మరి నేను ఈ దేహమును అవుతానా? రక్త – మాంస – బొమికలచే రూపంకలిగియున్న ఈ దేహం ప్రాణవాయువుచే ఉనికి – చలనములను పొందుతోంది. ఈ దేహనాశనమునకు కూడా సాక్షినైన నేను ఇందులోని కాళ్ళు, చేతులు, చర్మము అవటానికే వీలులేదు.

నేను శబ్దమునా? - "ప్రహ్లాదా" అని జనులచే పిలువబడుచున్న నేను ఒక శబ్దమునా? శబ్దం ఈ నా చెవులచే కల్పించబడినదై శూన్యాకాశంలో ఉత్పన్నమౌతూ, ఇంతలోనే శూన్యమును పొందు తోంది. పైగా, అది బాహ్యమునందే ఉంటోంది. స్వయంగా ప్రవర్తించేదికాదు కనుక అది జడమైనది మాత్రమే. జడమైనది నేనెట్లా అవుతాను?

స్పర్శానుభవమే నేనా? - ఈ చర్మమును ఏదైనా తాకినప్పుడు ఒకక్షణ కాలంలో 'స్పర్శ' అనే అనుభవం పుట్టి, ఇంతలోనే నశించిపోతోంది. ఒకప్పుడు ఏర్పడి, మరొకప్పుడు లేకుండా పోవుచున్న అచేతనమగు 'స్పర్శ'ను నేనెట్లా అవుతాను. అది నాచే పొందబడే 'అనుభవం' మాత్రమే. 'అనుభవజ్ఞుడు' అయిన నేను వేరు... అనుభవం వేరు. స్పర్శజ్ఞానం-స్పర్శాభవం నాకు కొన్ని సమయాలలో ఉండవచ్చు గాక! మరికొన్ని సమయాలలో ఉండకపోవచ్చు. అయ్యది నేనెట్లా అవుతాను?

నా స్వరూపము రుచియా? - ఈ శరీరంలో ఒక భాగమై ఈ శరీరంలాగానే అనిత్యమైన ఈ నాలుక నేను తింటున్నప్పుడు 'రుచి' అను అనుభూతిని కలుగజేస్తోంది. పైగా, ఈ నాలుక నా ముక్కు క్రింద నుండి కంఠభాగం వరకు మాత్రమే విస్తరించియున్నది. 'ఆస్వాదన' అనేది కూడా ఒక బాహ్యమైన అనుభవం మాత్రమే. అటు పదార్థము – ఇటు నాలుక ఒక చోట జేరినప్పటి నా అనుసంధానమే అది. అనగా అది నా సమక్షంలో నాచే, ప్రభావితమై ఉంటోంది. అట్టి జడానుభవం మరి నేనెట్లా అవుతాను? కాను.

కనబడే రూపము నేనా? - ఒకానొక రూపంతో నేను చూడబడుచున్నాను. అయితే ఇక్కడ చమత్కారం ఏమంటే – ఈ రూపము అనబడేది కనుల యొక్క అధీనంలో ఉంటూ, ద్రష్ట యందు పరికల్పన పొందుచున్నది. ద్రష్ట యొక్క దృష్టిని అనుసరించి నా ఈ దేహము "ప్రియ–అప్రియ, శత్రు–మిత్ర" ఇత్యాది భావాలతో దర్శించబడుతోంది. నేను ఈ దేహంలో ద్రష్టత్వము' అనే నా 'కళ' ను ప్రదర్శిస్తున్నాను. కనుక ద్రష్ట ఈ నా భౌతిక రూపము కంటే వేరు అయి ఉన్నాడు. రూపం ఏర్పడటానికి ముందే ద్రష్ట ఉన్నాడు. ఎట్లా అంటే, చూచేవాడు మునుముందుగా ఉంటే కదా, 'చూడటం' అనే ప్రక్రియ ఏర్పడగలిగేది?

అందుచేత దృష్టి యొక్క స్వభావమగు 'రూపము'ను నేను కాదు. ఆ రూపమును గుర్తిస్తున్న 'ద్రష్ట' యొక్క స్వభావమును స్వీకరిస్తున్న వాడనే నేను. కనుక 'రూపం' యొక్క అనుభవ పరిమితుడను నేను కాదని తేలిపోతోంది.

సువాసన (ఆఘ్రాణం) నేను అవుతానా! - రూపములాగానే గంధము కూడా అనుభవం మాత్రమే. అది కూడా స్వయంగా ప్రవర్తించేది కాదు. కాబట్టి అది నేను కాదు.

మరి ఇంతకీ ఈ ప్రపంచంలో సంచారం చేస్తున్నట్టి నేను ఎవరు?

ఈ మనస్సు - బుద్ధి - అహంకారములు నేనా? - నా యొక్క మననము చేయు స్వభావమే మనస్సు కదా! అనగా, నేను ఈ దృశ్యము మొదలైన వాటిని మననం చేస్తూ ఉండగా, అట్టి ప్రక్రియను విజ్ఞులు 'మనస్సు' అనే పేరు పెట్టారు. నేను చేస్తున్న పని వేరు... నేను వేరు కదా! అందుచేత మనస్సు అనబడేది కూడా నేను కాదు.

అదే కారణంగా నిర్ణయాత్మకస్వభావం అయినట్టి ఈ 'బుద్ధి' కూడా నేను కాదు. 'నేను చేయు నిర్ణయము – నేను' .... వేఱువేఱై ఉన్నాము కదా!

ఇక 'అహంకారము' అనబడేదానికి నేను వస్తే... 'నేను' అను భావనయే అహంకారము కదా! ఆ భావనను భావనచేస్తున్న నేను "అట్టి భావనకంటే ముందే ... అట్టి భావన ఏర్పడుటకు స్థానమై" ఉండనే ఉన్నాను కదా! కనుక "నేను ఒక జీవుడను ... ప్రహ్లాదుడను... ఈ జాతి వాడను" వంటి పరిమిత అహంకారభావన ఏదీ నేను కాదు.

మరినా వాస్తవ స్వరూపమేమిటి? నేనెవడను? - (ఒక్కసారి ఆనందంగా కేకవేసి, మరల ఇట్లు అనుకోసాగాడు.) ...ఓహో! ఇప్పుడు తెలిసిపోతోంది. ఆత్మకు మమత్వమనేదేదీ లేదు

మనస్సు లేదు. ఆత్మ మనస్సు కంటే మునుముందే ఉన్నది. ...ఈ పంచేంద్రియములకు సంబంధించిన ఏ అనుభవమూ ఆత్మ కాదు. ...సర్వ సంకల్పములకు ఆవల ఆత్మ ఉన్నది. ...శుద్ధ చైతన్యరూపము అద్దానిది ...అట్టి ఆత్మయే ఎల్ల వేళలా నేను.

చిన్మయరూపుడనగు నా యందు విషయము లనేవే ఉండవు. సర్వమును ప్రకాశింపజేయునది నేనే. శాశ్వతమూ, అఖండమూ అగు నా యొక్క స్వస్వరూపము చేతనే గదిలోని దీపం వలె, – ఒక రాయి మొదలుకొని, సూర్యుని వరకూ సర్వమూ ప్రకాశింప జేయబడుతోంది.

ఈ జగత్తంతా ఏ నిర్వికల్ప చిదాభాసం అయి ఉన్నదో ...అట్టి సర్వ వ్యాపకమగు సర్వాత్మయే నేను!

❖

అగ్ని చేతనే అగ్నికణములు ప్రజ్వరిల్లుచున్నాయి కదా! చైతన్య స్వరూపుడనగు నావలెనే ఈ ఇంద్రియ వృత్తులన్నీ స్ఫురిస్తున్నాయి. అన్నిటినీ వెలిగిస్తూ సర్వకార్యములందు ప్రసరించి ఉన్నది ఆత్మయే. దాని సమక్షమునందు సర్వపదార్థముల సత్త ప్రతిపాదించబడుతోంది. ప్రతిబింబములకు ఆశ్రయం అద్దమే కదా! ఈ దేహ – ఇంద్రియ – మనో – బుద్ధులకు ఆత్మయే ఆశ్రయమైవున్నది. చంద్రుడు శీతలంగా, పర్వతం ఘనంగా, పాలు ద్రవంగా ఉండేది ఆ చిద్రూపప్రభావం చేతనే.

“ఈ ఎదురుగా ఉండే పదార్థాలు (Matter) ఎక్కడ నుండి వచ్చాయి?” అని మనం పరిశీలించు కుంటూ పోయామనుకో. అప్పుడు కూడా “ఆకాశం ...ఆకాశం నుండి వాయువు ...వాయువు నుండి అగ్ని, ...అగ్ని నుండి జలం ...జలం నుండి ఘనం” అను పరిశీలనలన్నీ ఆత్మ దగ్గిర నుండే బయలుదేరి, ఆత్మ వద్దకు వచ్చి ఆగుచున్నాయి. ఎందుకంటే... ఆకాశం ఆత్మ యొక్క ధ్యానం నుండే బయల్వెడలుతోంది.

ప్రతిదానికీ మరొక కారణం ఉండి తీరుతోంది ...ఒక్క ఆత్మకు తప్ప! ఆత్మకు మాత్రం మరొక కారణమంటూ ఏదీ లేదు. ‘సత్’ రూపమైనట్టి అదే, సర్వ కారణములందూ వ్యాపించి ఉంటోంది.

ఆత్మచేతనే సర్వమూ కలుగుచున్నాయి. “శీతలం” నుండి అనేక ఆకారములైన మంచు గుట్టలులాగా ఆత్మ భగవానుని నుండే సృష్టికి కారణ భూతులగు బ్రహ్మ – విష్ణు – మహేంద్రాదులు ఆవిర్భవిస్తున్నారు. వారంతా సృష్టికి కారణమగుచూ, ఆత్మయే తమ ఉత్పత్తి – ఉనికి – ఔన్నత్యములకు కారణముగా కలిగి ఉంటున్నారు. అట్టి ఆత్మకు, ఆపై, మరొక కారణమంటూ ఏదీ లేదు. దానిని మనమెవ్వరమైనా “చిత్తము – విషయము – ద్రష్ట – దర్శనము – దృశ్యము” అని పిలువదలచుకొంటే, అదంతా “పరిమితమైన అవగాహన వల్లనే” అని అనకతప్పదు.

అట్టి నిత్య స్వయంప్రకాశరూపము, నా రూపము, సర్వుల స్వస్వరూపము అగు ఆత్మకు పలుమార్లు వందన సమర్పణ చేస్తున్నాను.

ఇప్పుడు నాకు తెలియవస్తున్నదేమంటే.... నిర్వికల్పమగు “చిదాత్మ” యందే గుణ భూతములైన పదార్థములన్నీ స్థితి కలిగి ఉండి, భావావేశముచే ప్రకాశిస్తున్నాయి.

ఇదంతా సంకల్పమాత్రమే! - సూక్ష్మమగు ఈశ్వరరూపమే కారణములన్నిటికీ కారణమై ఉన్నది కదా! అయితే ఆ చైతన్యము ఏ పదార్థము గురించి ఎట్లు సంకల్పిస్తుందో, అది అట్లే అంతటా సంభవించుచున్నది. మరింకేది కాదు. “ఇది కుండ” అని అనుకుంటే అట్టిది “మట్టి కంటే వేరైన కుండ” అనునట్లుగానే అనుభవమౌతోంది. అది దేనినైతే భావించదో అట్టిది స్థూల సూక్ష్మ రూపమున ఉన్నప్పటికీ కూడా అది నశించినదిగానే అగుచున్నది. ఆ విశాల చిదాకాశము ఒక దర్పణము వంటిది. ఈ జగత్సంబంధమైన భూతాకాశాది విశేషములు, పదార్థములు, అన్నీ అందులో ప్రతిబింబిస్తున్నాయి.

అట్టి చిదాకాశమే నేను. ఆత్మయందే ఈ పదార్థములన్నిటి యొక్క – మనోబుద్ధిచిత్తాహంకారాల యొక్క – ఉత్పత్తి, వృద్ధి, క్షయాలు అధ్యస్థమై ఉన్నాయి.

స్వస్వరూపమగు ఆత్మను పొందటానికి అర్హతలేమిటి? – అట్టి ఆత్మ అజ్ఞులచే గాంచబడుటలేదు. ఇక చిత్తరహితులగు నిర్మల జీవుల చేతనో – అది సర్వదా పొందబడియే అనుభవమౌతోంది. అతి నిర్మలమగు చిదాకాశము సజ్జనులగు జ్ఞానులకు మాత్రమే గోచరిస్తోంది. సమస్తమునకూ కారణ భూతమగు చిద్రూపము నుండే వివిధమగు ఆచారములతో కూడిన దృశ్యలత విజృంభిస్తోంది. కొండపై నుండి చెట్లు లేస్తున్నట్లుగానే, చేతనరూపుడగు పరమాత్మ నుండి ఈ సువిశాల ప్రపంచమంతా ఆవిర్భవిస్తుంది.

బ్రహ్మ నుండి గడ్డిపరకవరకూ సర్వాన్ని ప్రకాశింపజేసేది పరమాత్మే. తాను ఆకార రహితము, ఆద్యంత రహితము, ఏకము, సర్వవ్యాపకము అయి ఉండికూడా, అదే తరుణంలో ఈ చరాచర ప్రాణికోట్ల హృదయాంతరములలో ‘అనుభవం’ రూపమున ఉన్నది నేనే. ఆ పరమాత్మయే సర్వరూపుడై, ప్రహ్లాద రూపుడై కూడా చెన్నొందుచున్నాడు. అనగా, ఈ ప్రహ్లాదనామ ధేయజీవుని సద్గుణ దుర్గుణాలన్నీ ఆ పరమాత్మవే!

ఈ ఎదురుగా కనబడేదంతా ఉన్నది నాలోనే...! - ఈ స్థావర జంగమాత్మకమగు ప్రాణికోట్ల శరీరాలన్నీ అపరిచ్ఛిన్న రూపంగా పరమాత్మ స్వరూపుడనగు నాయందే ఉన్నాయి. అనుభవ స్వరూపము, ఏకమూ అగు నేనే సర్వమునకు దృక్కును కూడా.

నేనే ద్రష్టను ...చూడబడుచున్నది కూడా నేనే! ...దృక్, ద్రష్ట, దర్శనము – ఇవన్నీనా చిత్కళలే! ఈ అసంఖ్యాకములగు కాళ్ళు చేతులు కలిగినవాడను నేనే.

నేను సూర్యుని రూపమును ధరించి ... అదిగో.. ఆకాశంలో విహారం చేస్తున్నాను. వాయు దేహముతో అన్ని వైపులా సంచారం చేస్తున్నాను. శంఖ – చక్ర – గదా సహితమగు నా రూపమే జగత్తుగా వ్యవహరించబడుచున్నది.

నేనే ఈ జగత్తునందు ఆవిర్భవించి కూడా, సర్వదా పద్మాసనముపై విరాజమానుడనై నిర్వికల్పసమాధియందు మిక్కిలి శాంతిని పొందుచున్నాను ...చతుర్ముఖుడగు బ్రహ్మను నేనే.

తాబేలు తన శరీర భాగములన్నీ తన యందు దాచుకుంటుందే! ఆ రీతిగా నేను త్రినేత్రుడనై ప్రళయకాలంలో ఈ జగత్తునంతా సంహారమొనర్చున్నాను. ఒక సమయంలో ఇంద్రరూపమును పొంది ఈ మూడు లోకములను నేనే పాలన చేస్తున్నాను.

కుమారస్వామినై దేవతల సేనానాయకుడనైనది నేనే. ఈ అనేక స్త్రీ పురుష రూపములు కూడా నావే! నేనే!

ఒక వైపు అనంత ముఖుడనై ఒప్పుచున్నాను. మరొక వైపు దేహదారుడను అగుటచే దేహత్వమును పొందుచున్నాను ...నేనే జీవాత్మను. నేనే పరస్వరూపుడను. పరమాత్మను!

నేనే రసరూపుడనై భూమి యందు మొక్కలను ఉత్పన్నం చేస్తున్నాను.

స్వలీలార్థమిదం చారు జగదాడమ్బరం తతమ్ ।
మయాభిజాత బాలేన పఙ్కక్రీడనకం యథా ॥ (శ్లో 49, సర్గ 34)

ఆడుకోవటానికి బాలుడు మట్టిబొమ్మను నిర్మించుకొనునట్లు, నాయొక్క విలాసము కొరకే ఈ జగదాడంబరమంతా విస్తరింపజేశాను. ఈ లోకక్షేమాభిలాషులగు దేవతల, లోకకంటగులగు రాక్షసుల రూపంగా చెన్నొందుచున్నది నేనే!

ఇదంతా నన్నే ఆశ్రయించి ఉంటోంది - నేనే అంతటా కార్యరూపమున వ్యాపించి ఉన్నాను కదా! అయితే, నా స్వస్వరూపం నాకు సాక్షాత్కారమైన మరుక్షణం ఈ కార్యరూపసత్తా అంతా నశించగలదు. అంటే ఏమిటి...? తత్త్వదర్శనముచే జీవన్ముక్తుడనైనానా,.. పరివ్యక్తమగుచున్న ఈ జగత్తంతా అప్పుడు "లేనిదే" అయిపోతోంది. నా "చిద్రూపము" అనే దర్పణము వంటి స్వరూపంలో ఏది ప్రతిబింబిస్తుంటే అది మాత్రమే ఉనికిని కలిగి ఉంటోంది. తదితరమైన దానికి ఉనికియే లేదు. అందుకే నాకంటే వేరుగా ఈ ప్రపంచంలో ఏదీ లేనే లేదు.

పుష్పములోని శోభ, సుగంధము, కాంతి కూడా నేనే! ఏదైతే సంకల్పరహితమై ఉన్నదో అది నేనే!... రసతన్మాత్ర (The factor of taste) మొట్టమొదట జలంలో వ్యాపించి ఉండి, అదే వృక్షములోకి ప్రసరిస్తోంది కదా! ఆ విధంగానే అన్నిటికీ నిమిత్తకారణాన్ని(That which is causing all else) నేనే.

సర్వోత్తముడనై, సర్వపదార్థములందూ అంతర్యామినై నా ఇచ్ఛచే ఈ పలు విధములైన 'జీవ సంవిత్తు' లను ఉత్పన్నం చేస్తున్నాను. పాల యందు నేయి, జలమునందు రుచి ఉన్నట్లు, అన్నింటా – అందరి యందూ మూడు కాలములందూ చిత్‌శక్తిరూపంగా ఉంటున్నాను. దిక్కులన్నీ పూరించుచూ భ్రమగాని, సంకోచముగానీ లేనివాడనై ఉన్నాను. సర్వపదార్థములకు అస్థిత్వము ప్రసాదించుటచే 'సర్వకర్త' ను నేనే. విరాట్ సామ్రాట్టుగాను (సమష్టి – వ్యష్టిగానూ) వ్యవహరిస్తున్నది నేనే.

నేనెంతటి విశాల రూపుడను! - ఈ 'విశాల జగత్తు' అనే రాజ్యం నేను కోరకుండానే లభిస్తోంది. ఆహా! నేనెంతటి విస్తార స్వరూపుడనో కదా! నాయందు నేనే ఇమిడి ఉండుట లేదే! నిరతిశయానందరూపమున స్వయంగా అనుభూతమగుచున్న నా ఆత్మయొక్క అంతమును నేను

చూడలేకపోతున్నానే! రాజతీవితో నడచిపోతున్న ఒక ఏనుగును ఉసిరికాయలో పట్టి ఉంచగలమా? బ్రహ్మచే నిర్మించబడిన 'జగత్తు' అను చిన్నిఇంట్లో అనంత విస్తారస్వరూపమగు నా చిత్స్వరూపము పట్టేదెట్లా? ఈ లోకాలు ఈ బ్రహ్మాండాలు దాటిపోయి, "24 లేక, 36 తత్త్వాలు" దాటి పోయి వెళ్ళుచున్నప్పటికీ నా స్వస్వరూపమునకు అంతుదొరకటమే లేదు.

నాకు, ఈ పరిమిత కల్పనలా? ఎట్లా కుదురుతుంది?

ఇదంతా బాగానే ఉన్నది ...ఇప్పుడు నాదొక సందేహం-

"అనంతుడను, ఆశ్రయరహితుడను" అగు నాకు ఈ దేహాదుల కల్పనంతా ఎట్లా కలిగింది? ఆది – అంతము లేని చిత్ స్వరూపుడనగు నేనెక్కడ? రక్త మాంస నిర్మితమైన 'శరీరము' అనబడే ఈ పరిమితత్వము – న్యూనత ఎక్కడ? ఇది నాకు సంభవించటమేమిటి? ఈ 'నీవు – నేను' అను కల్పనలన్నీ మిథ్యా రూపములు, భ్రమమాత్రమే కదా!

దేహము ఉండుట ఏమిటి? లేకుండుట ఏమిటి? మృతుడెవడు? జీవితుడెవడు?

ఆహా ! 'ఆత్మజ్ఞానము' ను వదలిపెట్టి, ఈ ప్రాపంచిక ఐశ్వర్యములందు, "ఇవి ఎంత బాగున్నాయి!" అని ప్రీతిగొన్నట్టి నా పూర్వీకులంతా ఎంతటి మూర్ఖులు!

క్వేయం కిల మహాదృష్టిర్భరితా బ్రహ్మబృంహితా ।
క్వసరీసృపభీమాశా భీమా రాజ్యవిభూతిభిః ॥ (శ్లో 67, సర్గ 34)

బ్రహ్మజ్ఞానమును ప్రవృద్ధం చేయగల ఇప్పటి నా పూర్ణ దృష్టి ఎచట...? త్రాచు పాములులాగా భయంకర ఆపదలతో కూడిన ఈ రాజ్యాలు, సంపదలు ఎక్కడ?

అవును. శుద్ధ చిన్మయ దృష్టే అన్ని దృష్టులకన్నా ఉత్తమోత్తమైనది.

చిన్మయ దృష్టి - నేను విషయవర్జితుడనై, సర్వపదార్థములందూ సాక్షి రూపమున ఉన్నాను. అట్టి చిదాత్మస్వరూపుడనగు నాకు నేనే మరల మరల నమస్కరించుచున్నాను. చిరకాలంగా "తుచ్ఛ సంసార ప్రవాహము" న పడి ఉన్న నేనిపుడు "జన్మరాహిత్యము" అనే ఒడ్డుకు చేరుతున్నాను.

ఇప్పటికి నేను సర్వ అనర్థములు నివృత్తి అవగల స్వస్థానం వైపు తిలకిస్తున్నాను. ఏ సుఖం పొందాలో, అది పొందటం చేత ఇప్పుడు నేను సఫలుడను. సర్వోత్తముడను.

ఇట్టి శాశ్వతమగు ఆత్మజ్ఞానసామ్రాజ్య సుఖమును వదలుకోవటమేమిటి? దుఃఖములగు ఈ భౌతిక రాజ్యసంపదలను పట్టుకుని వ్రేలాడటమేమిటి? ఎంతటి తుచ్ఛము? ఈ రాజ్యాది సంపదలన్నీ కొయ్య – మట్టి – శిలా మయమే కదా! వీటియందు ప్రీతి గొనటమంటే ఒక కీటకంలా ఈ ఉపాధిని వెచ్చించటమే అవుతుంది.

నా తండ్రి హిరణ్యకశిపుడు తక్కువవాడేం కాదు. మహాతపశ్శాలియే. కాని, ఆయన చేసినదేమిటి? "అవిద్యామయములే" అయినట్టి ఈ రాజ్యాలు ఏలటం, తినటం, త్రాగటం యందు మాత్రమే దృష్టి ఉంచి, ఆయన ఈ అవయవాలను తృప్తి పరచటానికే అవకాశాలన్నీ వినియోగించారు. కాని,

ఏం సాధించినట్లు? ఏం పురుషార్థం పొందినట్లు? హృదయంలోని అజ్ఞానం తొలగనేలేదే? ఈ బ్రహ్మానంద సాగరం ముందు రాజ్యాలు పొందటం, వాళ్ళనీ, వీళ్ళనీ ఓడించటం ఎంత చిన్న విషయాలు? బ్రహ్మానందం పొందితే, ఇక తక్కినవన్నీ పొందినట్లే. అంతేకానీ, రాజ్యాలు పొందితే బ్రహ్మానందం లభిస్తుందా? లేదే. పరిపూర్ణమగు బ్రహ్మానందం పొందేవానికి ఈ తుచ్ఛ విషయములలో వెతకవలసిన సుఖం ఏమైనా ఉంటుందా? ఏ మాత్రం ఉండదు.

❖

అనంతమగు 'దివ్యపదము'ను వదలిపెట్టుకొని, పరిచ్ఛిన్నమగు ఇంద్రియ వ్యవహారములను వాంఛించే వాడు ఏదో తెలివితక్కువచేతనే అట్లు చేస్తున్నాడు కాని, నిజంగా తెలిసికాదు. తియ్యటి తెల్లద్రాక్షపళ్ళను ఇంట్లో పెట్టుకొని, "తెల్లటి వేపపళ్ళు తెల్లటి ద్రాక్షపళ్ళకంటే మరింతరుచిగా, సొగసుగా ఉంటాయి".... అని తలచుచు వేపపళ్ళు తిందామని వేపచెట్టు ఎక్కేవాడిని ఏమనాలి? పూర్ణమగు ఆత్మదృష్టిని వదలి, దృశ్యము పట్ల ఆసక్తి కలిగి ఉండటం అట్టిది. చెఱకురసం ప్రక్కన పెట్టి, కుంకుడు రసంకోసం కష్టించి తెచ్చుకోవటమే అది! అది మూర్ఖత్వమే మరి.

నా పూర్వీకులు తెలివితక్కువచేత గొప్ప గొప్ప రాజ్యాలు ఏలాలని కోరుకున్నారు. నేను మాత్రం ఆ తప్పు చేయను. భోగములను ఆశ్రయించటానికి ఉపయోగపడే ఈ శరీరమును చూచుకొని "ఈ శరీరముతోటివాడినే నేను" అనే బుద్ధిని జయిస్తాను. "ఈ శరీరము కంటే విలక్షణమైన నిత్యమగు ఆత్మవస్తువునే నేను" అను రూపంలో ఉండే 'ఆత్మబోధ దృష్టి' ని ఆశ్రయించటం కోసమే సర్వదా ప్రయత్నిస్తూ ఉంటాను.

ఆరాటమంతా మటుమాయం - ఆత్మతత్త్వమును ఆశ్రయిస్తున్నప్పుడు "ఈ మూడు లోకములలో ఇక పొందవలసినదేమీ లేదు" అను అవగాహన కలుగుతోంది. ఇక రాజ్యాలు పొందినవాడో, ఇంకా ఏదో కావాలనీ, పొందాలనీ ఆరాటపడుచూనే ఉన్నాడు కదా? "చిద్వస్తువు"నందే సమస్తమైన అనుభవములూ ఉన్నాయి. అట్టి చిద్వస్తువునే ఎందుకు అనుభవించరాదు?

ఎందుకంటే... సర్వవ్యాపకమై, స్వస్థమై, నిర్వికారమై, స్వస్వరూపమై, సర్వదా వెలుగొందుచున్నట్టి ఆ చైతన్యమునందే సమస్త సుఖములు, అందుకు సాధనలు ప్రతిబింబిస్తున్నాయి.

తేజములోని ప్రకాశశక్తి... చంద్రునిలోని శీతలము... త్రిమూర్తులలోని జ్ఞాన – ఐశ్వర్య – విజయములు... ఇంద్రునిలోని త్రిలోకాధిపత్యము... ఇవన్నీ కూడా అఖండ చైతన్యము లోనివే. మనస్సు యొక్క శీఘ్రగతి, వాయువులోని బలము, అగ్నిలోని దాహకత్వము, జలములోని రుచి, తపస్సిద్ధులు ఇవన్నీ కూడా అనిర్దేశము, అప్రమేయము అగు చైతన్యమునందే ఒనగూడుచున్నాయి.

❖

సూర్య ప్రకాశము అనేకచోట్లకు ఒకేసారి ప్రసరిస్తోంది కదా! వికల్పరహితమైనట్టి చిత్‌శక్తి వివిధ పదార్థములలో ఒకేసారి ప్రసరించి ఉండి, సర్వ అనుభవములకూ తానే కర్త – భోక్త అయి ఉంటోంది. తానే ఆయా పదార్థముల రూపములను పొందినదై తద్వారా ఈ సువిశాల ప్రపంచమును రచించుకొంటూ పోతోంది.

అఖండమగు శుద్ధచైతన్యము త్రికాలములందలి అనేక పదార్థములతో కూడి అనేక కల్పనలను అనుభవిస్తోంది. కానీ, స్వస్వరూపమున అది పరిపూర్ణముగానే సర్వదా ఉండి ఉంటోంది. అనేకమైన అనుభవాలు ఉన్నాకూడా, సమత్వముచే పూర్ణరూపమున విరాజిల్లుతోంది.

పదార్థము లందు భేదముండవచ్చు గాక, అనుభవం ఒక్కటే కదా! ఒకే అనుభవం చేదు, తీపి, ప్రియము, ఆశ్చర్యము, అవసరము, అనవసరమూ వంటి అనేక కోణములను ప్రకటిస్తోంది. తేనెను, వేపరసమును రుచి చూస్తున్న అనుభవం ఒక్కటే. అదేవిధంగా... అద్వయమై, సత్తారూపమై ఉన్న 'చిత్' శక్తిచే జీవుల భావములు, పదార్థ జాలములు ఇదంతా ఏకకాలమున సమరూపమున అనుభవించబడుచున్నాయి. అనగా... సంకల్పవర్జితమైన, సూక్ష్మాతిసూక్ష్మమైన ఆ చిత్‌శక్తి సర్వ పదార్థము లందూ ఒకేసారి వ్యాపించియున్నది.

❖❖❖

7. వర్తమాన - భూత - భవిష్యత్తులను నిషేధించటం : దృశ్యము యొక్క అభావ స్థితి

ప్రహ్లాదుడు (అంతరంగంలో) : ఒకప్పుడు ఈ చిత్తము వేదవచనములు, ఆచార్యుల ఉపదేశములు విని బాగుగా విచారణ చేయటం చేత 'దృశ్య సమూహం యొక్క అభావన' అనుదానిని గుర్తెరుగుతోంది. అనగా దృశ్యం యొక్క 'భావించకుండుట' ను ఆశ్రయిస్తోంది. అందుకు ఫలితంగా శోక – మోహ జనితమైన దుఃఖమును పరిత్యజిస్తోంది. ఆ స్థితిలో ఈ సమస్తపదార్థములను చూస్తున్నప్పుడు, 'ఇవన్నీ లేనివే కదా!' అనబడు నిషేధము చేయుచున్నది. అప్పుడిక పరమార్థ – అద్వైత భావము కలిగి ఉంటోంది. అప్పటి చిత్తము "వస్తువులపైననో, విషయములపైననో, జీవులపైననో రాగము కలిగి యుండుట" అను దుష్టస్వభావమును విడచిపెట్టేస్తోంది.

అట్టి విషయరహిత చిత్తము గురించి చెప్పుకోవాలంటే... అది గడచిపోయిన కాలానికి చెందిన సర్వవిషయాలతో సంబంధము లేనిదగుచున్నది. అదియే వాసనారాహిత్యము కదా! ...ఈ వర్తమాన కాలంలో ప్రాప్తిస్తూ, ఎదురుగా నిలచియున్న దృశ్యమును కూడా ఉపేక్షిస్తూ త్యజించి వేస్తోంది. "ఇది పొందాలి, ఇది ఇట్లా ఉండాలి, ఇది తొలగాలి" అను విధంగా రూపం కలిగి వుండే 'భవిష్యత్తుతో సంబంధాలు' కూడా వదలివేస్తోంది.

ఎక్కడ దృశ్యవ్యవహారం ఉంటుందో, అక్కడ మాత్రమే 'భూత–వర్తమాన–భవిష్యత్తులు' అనబడేవి ఉంటాయి. చిత్తంలో నుండి దృశ్యవ్యవహారమే తొలగితే, అట్టి చిత్తము కాలమును అధిగమించినది అగుచున్నది. అప్పుడు ఆ చిత్తమే సమత్వము తన స్వభావముగా గల 'చిత్‌శక్తి' అగుచున్నది.

చిత్ శక్తికి అన్యమైనదంటూ ఏదైనా ఉంటే, అదంతా భ్రమ యొక్క ప్రభావమే. అట్టి త్రికాలాలకూ అతీతమైన 'సమత్వము'చే నా చిత్తము నింపివేయబడి, అది శుద్ధచైతన్యమై అలరారు గాక!

ఏదైతే అన్ని వేళలా ఉండి ఉండటం చేత నిత్యమై యున్నదో, అట్టిది భూతకాలమని, గాని, భవిష్యత్ కాలమని గాని, వర్తమాన కాలమని గాని చెప్పలేం కదా!

అనిత్యమైన విశేషాల కంటే సూక్ష్మమైనట్టి చిత్‌శక్తియే ఆదరణీయం. అయితే అట్టి నిత్యమగు చిత్‌శక్తి వాక్కునకు అవిషయమే అయినట్లున్నదే! "అవును. ఆత్మ అనబడేది ఎక్కడున్నది?" అను కొందరి "'ఆత్మ – అభావ సిద్ధాంతము' కూడా, ఇంద్రియానుభవముల దృష్ట్యా జగత్ పదార్థముల దృష్ట్యా "ఔను కదా!" అను రీతిగా సార్థకమే అగుచున్నది.

త్రికాల విషయములన్నీ త్యజించిన చిత్తమే వేద వేదాంతాలచే ప్రతిపాదించబడే అత్యుత్తమ మైన విషయం

ఆత్మ : నాయొక్క – తదితరులందరి యొక్క స్వస్వరూపమునకు ఏమాత్రం వేరు కానట్టి విషయరహిత చిత్తమే, లేక చిత్‌శక్తియే 'ఆత్మ' అని కూడా చెప్పబడుతోంది.

బ్రహ్మము : మహత్తరమైనదగుటచే అదియే బ్రహ్మము అని కూడా పిలువబడుతోంది.

నాస్తి : ఇంద్రియములకు విషయమే కాదు గనుక "అది ఎక్కడున్నది?"...అని ప్రశ్నించ బడుతోంది. 'లేదు' అని వాదించబడుతోంది.

సర్వము : శబ్ద ప్రకృతి కంతటికీ అదే నిమిత్తము. కనుక, 'అది సర్వము' అని ప్రతిపాదించ బడుతోంది.

మోక్షము : మరి సర్వము "తానే" అయి ఉన్నది కదా! ఆ పరమ చైతన్యమునందు దృశ్యమంతా శమించి పోవుచున్నది. కనుక "మోక్షము" అని కూడా అనబడుచున్నది. బంధరహితమగు ఆత్మను అంతటా – అన్నిటా – అంతాగా సందర్శించటమే 'మోక్షము'.

సంకల్పజాలము - కంట్లో పొరవంటి దోషము ఉన్నప్పుడు ఎదురుగా ఉన్న వస్తువులు కనిపించవు కదా! చైతన్యము కూడా 'విషయముల గురించి సంకల్పించుట' అను దోషము కలిగి ఉన్నప్పుడు జగత్తును సమ్యక్‌దృష్టితో వీక్షించజాలదు. ఒక పక్షి యొక్క ఒక కాలును తాడుతో కట్టి ఉంచితే ఆ పక్షి ఆకాశంలో ఎగురగలదా? "ఇది ఇష్టం, అది అయిష్టం" అనే మాలిన్యమును అడ్డు పెట్టుకున్న ఆ చిద్వస్తువు ఆకాశమును వ్యాప్తం చేయలేకపోతోంది.

అనగా... "నేను కాళ్ళు – చేతులు గల ఒక జీవుడను" అనే మరల మరల తలచుచున్నదిగాని, "నేను చిత్ చైతన్యమును" అని అనుకొని చిదాకాశములో విహరించలేకపోతోంది.

బోయవాని వలలోకి పక్షులు వచ్చి పడుచున్నట్లు, ఈ జీవులంతా తమయొక్క సంకల్పపరంపరల చేతనే మోహం అనే జాలంలో పడుచున్నారు. నా తండ్రి హిరణ్యకశిపుడు, నా తాతలు మొదలగు వారంతా తెలిసి తెలిసీ సంకల్ప జాలముచే పరివేష్టితులై చివరికి "అసంఖ్యాక విషయ సమూహాలు" అను వాటి యందే కూలిపోయారు. ఫలితం? దుఃఖరహితమగు ఆత్మపదవిని వారు గుర్తించనేలేదు. పాపం! దీనులగు నా పూర్వీకులనేకులు ఈ భూమిపై శరీరం పొంది, గర్వితులై కొద్దికాలం అటూ

ఇటూ సంచరించి, చివరికి పొగలో పడ్డ పురుగులాగా వినాశనం పొందారే! ఏవేవో భోగములకొరకై ఆరాటపడి, అందుచేత కలిగే సుఖ దుఃఖములవెంట పరుగులు తీసే బదులు, వాళ్ళుకూడా తమకున్న ఓపికను, అవకాశములను ఆత్మతత్త్వము తెలుసుకోవడానికి ఉపయోగించి ఉంటే ఎంత బాగుండేది! దుర్బుద్ధితో, 'దృశ్య' లేక 'సాంసారిక' భావాభావములనే చీకటి పొరలలో చిక్కుకునేవారు కాదు కదా! చివరికి జరుగుచున్నదేమిటి? ఎన్నో చక్కటి ఉపాయాలు ఉండి, తెలివితేటలు ఉండి కూడా క్రిమికీటకముల వలె అన్న – పాన – మైథునముల కొరకై బ్రతికి దీనంగానే గతించిపోతున్నారే! తెలిసికూడా తెలియని వారై చరిస్తున్నారే!

ఎవనియందైతే సత్య – జ్ఞాన ప్రభావం చేత 'ఇష్టములు – అయిష్టములు' అనే ప్రోద్బలము శమిస్తోందో, అట్టివాని జీవితమే సార్థకం.

స్వస్వరూపం సర్వదా కళంకరహితమే! ఎక్కడన్నా చంద్రునిలో ఉష్ణత్వముంటుందా? ఉండదు. శుద్ధమై, నిర్మలాకృతిచే వెలుగు స్వస్వరూపమగు చిద్వస్తువునందు కళంకము ఉండటం ఎట్లా సాధ్యం? అందుచేత, "నేను కళంకితుడను... స్వల్పుడను... పాపిని" అను మాటలు సరికాదు. అట్లు, "నేను అజ్ఞానిని – బద్ధుడను – అల్పుడను"... అని మనోధర్మాలను ఆత్మపై ఆపాదించటం ఏఒక్కరికీ సరికానేకాదు.

ఓనా ఆత్మదేవా! నమస్కారం! - నిర్మలము, నిత్యము, నిఖిలము, నిరుపమానము అగు ఓ నా ఆత్మదేవా! స్వస్వరూపమా! నీవు అవిచ్ఛిన్నమగు చిదాత్మస్వరూపమవు. అట్టి నీకు నమస్కారం. అనగా, నాకే నా ఈ నమస్కారం.

హే ఆత్మ భగవాన్! ఒక మణి తానున్న చోట అన్ని వైపులా కాంతిని ప్రసరిస్తుంది కదా! నీవు ఉన్న చోట నలువైపులా జ్ఞానమును ప్రసరింపజేస్తావు. నీ గురించి ఇంతకాలానికి తెలుసుకున్నాను. ఎంత ఆశ్చర్యము! ఎంతో, ఎక్కడెక్కడో వెతికి వేసారి, చివరికి నిన్ను నా యందే సర్వదా ఉండి ఉన్నట్లుగా కనుగొన్నాను. నేనూ నీవు ఒక్కటే!

"నేను నిన్ను పొందాను" అనునది సరి అయిన వాక్యమే కాదు. "నిష్కళంక తేజోమయుడవైన నీవు నేనే అయి ఉన్నావు" అనునది ఇప్పుడు గ్రహిస్తున్నాను. మహామహిమాన్వితాశయముతో కూడిన నీ నిత్యోదయమును నేను గాంచుచున్నాను. ఓ ఆత్మదేవా! నిన్ను ఏదో ఏదోగా, ఎక్కడోగా, ఎప్పటికోగా అనుకోవటం చేత ఏర్పడిన సర్వ వికల్పజాలములనుండి విడివడి, ఇప్పటికి నాకు వాస్తవస్వరూపంగా లభిస్తున్నావు.

ఓ ఆత్మ భగవాన్! పరమార్థమున ఏదేదైతే నీ రూపమై ఉన్నదో అది అట్లే, యథాతథంగానే ఉండుగాక! "నేను అల్పుడను... స్వల్పుడను... జీవుడను" అని అనుకుంటూ, తద్వారా నిన్ను కించపరచినందుకు కాస్త క్షమించవయ్యా! 'నేను' అనునది లేదు. అంతటా తానే ఉన్నది. ఆ తానే నేను. "ప్రహ్లాదుడు" అను నామధేయముతో పిలువబడుచున్న హే ఆత్మనారాయణా! నీకు నేను నమస్కరిస్తున్నానయ్యా! 'జీవుడు' అని దేనినైతే అంటున్నామో, అందుకు అభిన్నుడవు నీవు.

నీవే, లేక, నేనే బ్రహ్మము కూడా! ఓ ప్రహ్లాదా! ఓ అనంతుడా! ఓ అంతర్యామీ! "నేను.... నేను" అను శబ్దమునకు నిత్యార్థమై ఉన్నవాడా! నీవే శివమూ, శాంతమూ, అద్వైతమూ, ఆనందమూ కూడా. "సర్వాంతర్యామియగు నారాయణుడే సర్వదా సర్వరూపాలుగా వేంచేసి ఉన్నాడు" అని వేద-పురాణ-ఉపనిషత్తులు ఎలుగెత్తి గానం చేస్తున్నాయి కదా? అనగా? "ఈ ప్రహ్లాదుడు' - అను జీవాత్మ రూపంగా వేంచేసి ఉన్నది నారాయణుడే - అనియే కదా! కనుక నేను నారాయణుడనే!

బ్రహ్మ మొదలైన వేదజ్ఞులు "వేదాంతవేద్యా!" అని ఎప్పుడూ సంబోధన చేస్తున్నది నా స్వరూపమునే! 'వేదము' అనగా తెలియబడేది. 'వేదాంతుడు' అనగా తెలియబడేదంతా తెలుసు కుంటున్న ఆయన. 'వేదాంత వేద్యుడు' అనగా తెలుసుకుంటూ ఉంటున్నట్టి ఆయనను తెలుసుకుంటున్న వాడు. ఆ తెలుసుకునే ఆయనే నారాయణుడు. ఆయనే నేను.

ఏమీ తెలియని అజ్ఞానులు కూడా సర్వదా సర్వప్రదేశములందూ సంబోధించేది నన్నే కదా! సమస్త ఇంద్రియములకూ అధిష్ఠాన దేవతవై భాసించు ఓ పరమాత్మా! నీ కన్నా వేరుగా 'నేను' అనేదే లెనప్పుడు "ఏదో ప్రయత్నించి ఈ నేనుకు మోక్షం కల్పించాలి" అనునది ఎంతటి హాస్యజనిత వాక్యం! "నేను వేరు, ఆ నారాయణుడు వేరు" అని నీ కొరకై (నాతండ్రి వలె) ఎక్కడో వైకుంఠంలోనో, తదితర లోకాలలోనో వెతకటం ఎంతటి హాస్యాస్పదం? ఎంతటి మూర్ఖత్వం? ఎంతటి దురహంకారం?

నా రూపంగా నీకు నీవే, ...ప్రహ్లాద రూపంతో నారాయణమూర్తి రూపానికి నమస్కరించు కోవటం నీ చమత్కార విశేషం, లేక నీ ప్రతీతి యొక్క ప్రభావం. 'ప్రహ్లాదుడు' అను పేరుతో చెప్ప బడుచున్న నేనే పరమాత్మను. నారాయణుడే ఈ ప్రహ్లాద నామధేయ జీవుడు. (శివోజీవః)

నేనే భక్తుడను... నేనే భక్తిని... నేనే భక్తి లభ్యుడను. (జీవోశివః। శివోజీవః)

పూర్ణ చంద్రుని లాగా అమృతతుల్యుడను. నిర్మలుడను. ఆనందైక రసమూర్తిని. నారాయణుడను. ఎందుకంటే.... ఓ శ్రీమన్నారాయణా! నీది కానిదేమున్నది?

నా సన్నిధానంలో నీవు, అతడు మొదలైనవి కల్పిత దృష్టిచే మాత్రమే ఉన్నాయి. హే ప్రకాశ స్వరూపా! ఆత్మ చైతన్య భగవాన్! నాకు అన్యమైనదంటూ ఏది ఎక్కడున్నది చెప్పండి? నా సొంతము, వాస్తవము, అఖండము అగు మీకిదే చేతులెత్తి మరల మరల మ్రొక్కుచున్నాను. జగద్రూపుడనై, సర్వ దృశ్యరూపుడనై మొక్కుచున్నాను.

❖❖❖

8. సుఖ విశ్రాంతి

పహ్లాదుడు (అంతరంగంలో) : ఇక్కడ ఎవరెవరైతే, ఏమేమైతే కనబడుచున్నాయో - ఇవన్నీ కూడా బ్రహ్మస్వరూప బోధకమూ, ఏకమూ, వికారరహితమూ, అనుభవస్వరూపమూ, ఓంకార సంజ్ఞచే ఉద్దేశించబడినదీ అగు ఆత్మయేకాని, మరి వేరొకటేదీ కాదు. వీరు-వీరంతా ఆత్మస్వరూపులే! నేనూ ఆత్మస్వరూపుడనే! కనుక వీరంతా మమాత్మస్వరూపులే! అట్టి చైతన్యాత్మ యొక్క ప్రభావము ఈ

బొమికలు – మాంసము – క్రొవ్వు – రక్తము లందు వ్యాపించి ఉన్నప్పటికీ, వీటన్నిటి కంటే అది పరము అయి ఉన్నది. అంతరమున ఉంటూనే సూర్యుడు మొదలైన మహాప్రభావవంతములగు పదార్థ జాలమునంతా ప్రకాశింపజేస్తోంది. అది తలచుకొని స్వసత్తచే అగ్నిని ఉష్ణముగానూ, అమృతమును రసవంతముగానూ చేసివేసేస్తోంది.

నారాయణత్వం - ఒక రాజుగారు సర్వభోగాలను అనుభవిస్తున్నట్లు, ఆత్మయే ఈ 'శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ' భావములన్నీ పొందుతోంది.

అది నిష్క్రియం... కానీ గతివంతమంతా అదే. శాంతం... కానీ, సర్వవ్యవహారాలు నిర్వర్తిస్తోంది. నిర్లిప్తం... కానీ, కర్మలన్నీ ఆచరించేదీ అదే.

ఈ ఆత్మ ఇతఃపూర్వం ఎట్లా ఉన్నదో ఇప్పుడూ అట్లే ఉన్నది. ఇక ఎప్పటికీ అట్లాగే ఉండ బోతోంది. నేను ఆత్మనే అయిఉండి, అప్పుడప్పుడు ఏమఱచినంత మాత్రం చేత... నేను ఆత్మను కానిదెప్పుడు?

అజ్ఞాన ప్రహ్లాద రూపుడనై మమనారాయణ స్వరూపం ఏమరచి ఎన్నో జన్మపరంపర లందు సంచరించియున్నప్పటికీ, నారాయణత్వం నన్ను ఏమాత్రం ఏ క్షణంలోనూ ఏమరచనేలేదు. అది నన్ను వదలలేదు. వదలదు కూడా. అది ఇక్కడ ఎలా ఉన్నదో, ఇంకొకచోట కూడా అట్లే ఉన్నది. 'జీవుడు' అనబడు వేషధారణచే ఈ విహిత – నిషిద్ధ కర్మలను, కర్మఫలములను అనుభవిస్తూనే తాను మాత్రం సర్వవృత్తులకూ ఆవల, సమరూపమున సర్వదా సర్వమై వెలయుచున్నది. పరమార్థంగా చూస్తే దానికి రాక పోకలు లేవు. కానీ, కర్మానురూపంగా స్వయంగా ఆవిర్భవిస్తున్నది అదే. తన యొక్క సన్నిధాన మాత్రంచేత, బ్రహ్మదేవుని నుండి ఒక గడ్డిపురుగు వరకు (పిపీలికాది బ్రహ్మ పర్యంతం) గల భోక్త – భోగ్యములకు తానే ఆధారమై ఉంటూ, పదనాలుగు భువనములను క్రియావంతం చేస్తోంది. తాను ఎప్పుడూ నిష్క్రియమై ఉంటూనే, స్వసత్తచే వాయువుకంటే కూడా వేగంగా పయనిస్తూ ఉంటోంది. తనయందు తానే ఉండి ఒక రాయి కంటే ఎన్నో రెట్లు నిష్క్రియత్వము, ఆకాశము కంటే ఎన్నెన్నో రెట్లు నిర్లిప్తత్వము కలిగి ఉంటోంది.

జరామరణములను దాటి వేయుటమెట్లా? - వాయువు ఆకులను కదల్చుచున్నట్లే ఆత్మ సర్వ ప్రాణికోట్ల మనస్సులను చలింపచేస్తూ ఉంటోంది. సారథి గుఱ్ఱములను అదలించి నడిపిస్తున్నట్లు, నారాయణ స్వరూపమగు మమాత్మ ఈ ఇంద్రియ సమూహములన్నిటినీ నడిపిస్తోంది. అనేక దుర్దశలను తన యందు దాచుకొని ఉన్న ఈ 'దేహము' అనే గృహంలో అది ఏవేవో కార్యక్రమములను రచించుకుని ఉంటోంది. ఆత్మ సామ్రాట్టు ఈ శరీరాలలోని శబ్ద స్పర్శాది ఇంద్రియార్థములన్నీ చవిచూస్తున్నాడు.

మనం అట్టి పరమాత్మను కనుగొనటానికే సర్వదా అన్వేషణ సాగించాలి. పరితపించాలి! ధ్యానించాలి!... ఎందుకా?... ఆ ఆత్మ దేవుని ధ్యానించినప్పుడు మాత్రమే మనుజుడు జరా మరణములను దాటివేయగలడు.

అత్యంత సులభం - ఓ సహజీవులారా! అట్టి ఆత్మదేవుని పొందటం చాలా దుర్లభమని అనుకుంటున్నారా? కానేకాదు సుమా! మీ జ్ఞాన చక్షువులు తెరవండి. ఆతడు అతిసులభంగా మీ ఎదురుగా లభిస్తాడు. స్మరణ మాత్రం చేత ఉత్తమ బంధువుగా మీకు వశుడు కాగలడు. సర్వప్రాణుల హృదయాంతరంగుడే నారాయణుడు. సర్వప్రాణికోట్ల హృదయకమలంలో సంచరించే ఆయన కంటే దగ్గరివాడెవ్వడూ లేడు. మీకు మీ సుగుణ దుర్గుణములు కూడా ఆయన కంటే దగ్గిరైనవి కావు. ఉచ్చ స్వరంతో కేవలం ప్రణవోచ్చారణతో స్మరించినంత మాత్రం చేతనే ఆ ఆత్మ స్వరూపము మీకు అభేదమై ప్రత్యక్షమగుచున్నది.

ఆత్మానారాయణో గతిః - ఒక డబ్బు ఉన్నవాడిని సేవించారనుకోండి... ఏమౌతోంది? అభిమానము, గర్వము కలిగించ గల కొంత ధనం లభించవచ్చేమో! అదే, ఆ ఆత్మభగవానునే సేవిస్తే....? మీలో ఉన్న అభిమాన గర్వాదులు తొలగిపోతాయి. ఆ ఆత్మదేవుడే మీరై ప్రకాశిస్తారు.

ఆయనని సేవించటమెట్లా? ఆయన సర్వసంపద సహితుడు కాబట్టి, మీ సంపదలు ఆయనకెందుకు? ...అందుచేత మీ భావనచే ఆయనను సేవించండి.

ఆయన ఎక్కడున్నాడు?... పుష్పాలలో సుగంధం, నువ్వులలో నూనె, రసమయ పదార్థాలలో రుచి ఉన్నట్లు ఆత్మభగవానుడు సర్వదేహము లందు వ్యాపించి ఉన్నాడు. మనందరి హృదయాలలోనూ ఆయన ఎల్లప్పుడూ ఉండి ఉన్నప్పటికీ, మనం అవిచారణవశంచేత చేతనారూపమగు ఆత్మ భగవానుని తెలుసుకోలేకపోతున్నాము. చాలా కాలం క్రితం ఎప్పుడో ఎక్కడో చూచి మరచిన బంధువు వలె మనం ఆయనను పలకరించకుండా ఈ ప్రాపంచిక కల్పనలలో మునిగితేలుతున్నాం. ఇక చాలు. ఇక నుండి ఆత్మానారాయణుని అనుక్షణ సందర్శనమునకై మనమంతా ఉపక్రమించెదము గాక!

ప్రయోజనం? - తత్త్వవిచారణచే పరమేశ్వరుడగు ఆ ఆత్మ ఎరుగబడిందా, అప్పుడు ఎంతో ఇష్టమైనవాడు కనిపించినట్లుగా జీవునకు పరమానందం ఉదయించగలదు. ఆత్మదృష్టిచే శరీర సంబంధమాత్రములైన జరామరణముల వ్యవహారం విచ్ఛిన్నమై పోతుంది. జీవుడు తనకు తానే తెచ్చిపెట్టుకొన్న 'ఆశలు' అనే త్రాళ్లు ముక్కలు ముక్కలుగా త్రెంచివేయబడతాయి. కామ-క్రోధ-మోహాది శత్రుభటులు వెనక్కు చూడకుండా తుఱ్ఱుమని పారిపోతారు. వారి తిరోగమనం చూచి మనం చిరునవ్వు చిందిస్తాం. ఇక తృష్ణ, అసంతృప్తులు మనస్సు ముందు నిలువలేక మటుమాయ మవుతాయి.

అస్మిన్దృష్టే జగద్దృష్టం శ్రుతేస్మిన్సకలం శ్రుతమ్ ।
స్పృష్టే చాస్మిఞ్జ గత్స్పృష్టం స్థితేఽస్మిన్సంస్థితం జగత్ ॥ (శ్లో 19, సర్గ 35)

పరమాత్మను దర్శిస్తే బ్రహ్మాండమంతా దర్శించినట్లే. పరమాత్మ కథనం వింటే సమస్తమూ శ్రవణం చేసినట్లే. పరమాత్మను స్పృశిస్తే జగత్తంతా స్పృశించినట్లే. ఆతని ఉనికియే జగత్తుకు ఉనికి. దృక్స్వరూపుడగు ద్రష్ట ఉండి ఉండటమే ఆతని ఉనికికి సాక్ష్యం, దృష్టాంతం కూడా!

❖❖❖

9. ఇంద్రియాతీతజాగృత్

పహ్లాదుడు (అంతరంగంలో) : ఇంద్రియాలన్నీ నిదురిస్తున్నప్పుడు కూడా మేల్కొని ఉండేదేది? ఆత్మయే. ఈ ఇంద్రియములు అవివేకులపై ప్రహారాలు సలుపుచుండగా, ఆత్మదేవుడు జీవులకు రక్షకుడై ప్రశాంతనిర్వైషమ్యాలను అందించుచున్నాడు.

అంతటా విహరిస్తున్నది ఆత్మయే! - జీవరూపమున అటూ – ఇటూ, పైనా – క్రిందా సంచరిస్తున్నది ఆత్మయే. ఈ భోగములన్నీ అనుభవిస్తున్నది అదే. శరీరమునకు వస్త్రము అలంకరణ మగుచున్నట్లే, ఈ దృశ్యవ్యవహారమంతా ఆయనకు అలంకారప్రాయం. అది శాంతంగా స్వవశంగా ఉంటూనే చెఱుకుగడలో రసంలాగా అనేక విషయాలను స్వీకరిస్తూ, త్యజిస్తూ తాను సర్వదేహములందు వ్యాపించి ఉన్నది. రాత్రింబగళ్ళు లాగా అనేక విషయాలను స్వీకరిస్తూ త్యజిస్తూ తాను మాత్రం ఎప్పటిలాగే అధిష్ఠానసత్తగా ఉంటోంది.

సర్వవ్యాపకము - ఆకాశమునందలి శూన్యము, వాయువునందలి నిరంతర చలనము, అగ్ని యందు ప్రకాశము, పదార్థములందలి రసము (లేక రుచి), అగ్నిలోని ఉష్ణము, చంద్రునిలోని శీతలము, బ్రహ్మాండములందలి సత్తారూపము ఆ ఆత్మయే! ఆత్మానారాయణుడే!

మసి యందు నలుపు, మంచు నందు చల్లదనము, పుష్పములో సువాసన ఉన్నట్లే సర్వదేహము లందు దేహి వ్యాపించి ఉన్నాడు. ఏ విధంగా అయితే కాలము, సత్త సర్వత్రా వ్యాపించి ఉన్నాయో, ఏ విధంగా ఈ భూమి అన్ని వైపులా అనుగతమై ఉన్నదో – అదే రీతిగా ఆత్మ ఈ కళ్ళు మొదలైన అన్ని ఇంద్రియాలలో వ్యాపించి ఉండి, అన్నిటినీ ప్రకాశింపజేయుచున్నది. దేవాదిదేవుడగు ఆత్మ బ్రహ్మాది దేవతలకు కూడా ఉనికి స్థానమైయున్నది.

నేను ఆ ఆత్మను : ఆత్మానారాయణుడను! - కేవలశుద్ధ స్వరూపుడను. ఆకాశమునకు ధూళి కణములతో ఏం సంబంధం? కమలము, జలము ఒక దానితో మరొకటి కలువవు కదా! ఆత్మయే స్వరూపముగా గల నాతో కలువగలిగింది ఏదీ లేదు.

ఈ జగత్తులో ఏర్పడే కల్పనలతో నాకేం పని? జీవుని భయకంపనలతో ఒక శిలకేం సంబంధం?

నాకు ఎట్టి అన్యపదార్థములతో ఏమాత్రం సంబంధమే లేదు. సుఖ దుఃఖములు ఈ దేహమునకు కలుగవచ్చు. కలుగకపోవచ్చు. సొరకాయ నీటిలో పడినంత మాత్రం చేత ఆ సొరకాయలోని ఆకాశమునకు వచ్చే హాని ఏముంటుంది.

సుఖ దుఃఖముల వలన నాకు వచ్చే హాని ఏమీ లేదు. ఎవ్వడైనా ఒకదారం తీసుకొని దీపము యొక్క ప్రకాశమును బంధించగలడా? సర్వపదార్థములకు అతీతుడను, ఆత్మయే స్వరూప స్వభావములుగా గలవాడను అగు నన్ను భావాభావములు గాని, ఇంద్రియములు గాని, కామ క్రోధాదులు గాని బంధించలేవు. వాటితోనాకు సంబంధమే లేదు.

బంధము, ముక్తి మొదలైనవి మనస్సుకు మాత్రమే. నాకు కాదు.

ఆకాశమును ఎవరు బంధించగలరు? మనస్సును హత్య ఎవరు చేయగలరు? ఈ దేహం వంద ముక్కలైనప్పటికీ దేహరహితమైన ఆత్మ ఖండితం ఎట్లా అవుతుంది? కుండ పగలవచ్చు, లేక కుండకు చిల్లి పడవచ్చు, కుండకు, ఆ కుండలోని ఆకాశమునకు సంబంధమే లేదు కదా! ఆకాశమునకు ఏమి హాని?

"అదృశ్య పిశాచము" అన దగ్గ ఈ మనస్సే వ్యర్థంగా సర్వరూపములను గ్రహిస్తోంది. మనస్సు ఉంది కనుకనే, మనస్సును అనుసరించే దృశ్యజాలమంతా ఏర్పడి ఉంటోంది.

అయితే మనస్సు స్వయంగా ఏదీ చెయ్యలేదు. దానిచేత అన్నీ చేయిస్తున్నది నేనే. అయితే, జడ మాత్రమైన మనస్సు యొక్క కోతిగంతులు ఉపశమించాలంటే 'ఆత్మజ్ఞానం' ఒక్కటే మందు. అనేక సుఖ దుఃఖకరములగు వాసనలతో ఆజ్ఞాన దశలను కష్టపడి మరీ ఆశ్రయిస్తున్న మనస్సుకు ఆత్మజ్ఞానం చేత అపరిమితమగు సుఖవిశ్రాంతులు లభిస్తున్నాయి.

ఏమి విచిత్రం! ఇంతకాలం చూచిందీ, అనుభవించిందీ, గ్రహించిందీ, సంకటములన్నీ పొందిందీ మరొకటైనట్టిది. అది మనస్సే గాని, నేను కాదు. "నేను దీనికి భోక్తను అనగా 'మనస్సు' అనబడేది ఉపయోగబడే ఒక ఉపకరణము. నేను ఆ ఉపకరణమును ఉపయోగించువాడనై ప్రత్యేకంగా ఉన్నాను" – అను అధ్యాస అజ్ఞానముచేతనే కలుగుతోంది.

ఇతఃపూర్వపు 'అజ్ఞానం' అనే ఇంద్రజాలమునకు రచయిత ఎవరు?... నేనే సుమా! చైతన్యము నందు ప్రతిబింబిస్తున్న ప్రకృతిని, చైతన్యమును వేఱుచేసి చూచిన మరుక్షణం ఈ మనస్సు, దేహము – ఇవన్నీ నా భావనలుగానే తెలియవస్తున్నాయి.

ఓ సమస్త సహజీవులారా! మీరంతా మమాత్మస్వరూపులే! నేను మీ ఆత్మస్వరూపుడనే!

సంబంధమేమీ లేనట్టిది - దోషదృష్టిచేతనే అజ్ఞానమనే తెర ఉండి ఉంటోంది. శుద్ధాత్మకు ఏ క్షణంలోనూ ఎట్టి హాని లేదు. అందుచేత భోగములు పొందాలని గాని, వదలాలని గాని నాకు కోర్కె ఉండ వలసిన అవసరమేదీ లేదు. జీవించాలి, మరణించాలి – అనే వాంఛలతో కూడా నాకు పని లేదు. ఏది ఎట్లైనా రానీ... పోనీ, నాకు అపేక్ష అక్కర్లేదు. ఉపేక్ష కూడా అఖ్కర్లేదు. ఈ దేహంలో వివిధ వాసనలు ఉండవచ్చు... తొలగవచ్చు. నాకు వాటితో గాని, వాటికి నాతో గాని సంబంధమే లేదు.

ఓయీ! అజ్ఞానమా! – కేవలం పరిశీలించక పోవటం చేత ఇంతకాలం నీ చేతిలో ఓడిపోతూ వచ్చాను. అనేకసార్లు నాలోని జ్ఞానరత్నాలను అపహరించి నన్ను అపహాస్యం పాలుచేశావు. అనేక మార్లు పెత్తనం చెలాయించావు. అయితే ఏం? సర్వాంతర్యామియగు నారాయణునిచే "ఆత్మ గురించి విచారణకు ఉపక్రమించు" అని బోధించబడ్డాను కదా! ఒకసారి నేను విచారణకు పూనుకోగానే, ఎక్కడికో పారిపోవుచున్నావే! ఏదీ! నీ వాదోపవాదములేమిటో చెప్పు! ఆత్మానుభూతితో సరితూగే బ్రహ్మానందాన్ని నీవు ఇంద్రియార్థాలలో చూపగలవా?

పరమాత్మయగు విష్ణు భగవానుని అనుగ్రహంచేత కలిగిన విచారణజ్ఞానముచే "అజ్ఞానము" అనే ఇంటి దొంగను కనిపెట్టేశాను. 'పరబ్రహ్మజ్ఞానము' అనే మంత్ర సహాయంతో అహంకారపిశాచాన్ని పారద్రోలివేశాను. వివేకధనం సంపాదించి 'దురాశ' అనే అజ్ఞాన దారిద్ర్యాన్ని వదలించుకున్నాను. అందుచేత నేనిపుడు పరమేశ్వరుడనై వెలయుచున్నాను.

❖❖❖

10. ఆత్మ సూర్యోదయం - అహంకార, మమకార అస్తమయం

ప్రహ్లాదుడు (అంతరంగంలో) : నేనిపుడు తెలుసుకోవలసిందంతా తెలుసుకున్నాను. చూడవలసినదంతా చూచాను. దేనిని పొందిన తరువాత ఇక పొందవలసినదేమీ ఉండదో – అట్టి ఉత్తమ పదార్థమగు ఆత్మజ్ఞానాన్ని పొందాను. ఇది ఒక పరమార్థమైన ప్రదేశం. ఇక్కడ అనర్థములు గాని, విషయసర్పములు గాని, మోహపూర్వకమైన ఆశలు గాని లేవు. తృష్ణ రజోగుణం అనే ధూళి, బూజు ఇక్కడ కనిపించవు. 'ఉపశాంతి' అనే దిశగా వీస్తున్న ఆనందవీచికలచే ఆహ్లాదం వెల్లివిరిస్తోంది. ఈ పారమార్థిక ప్రదేశం ఎంతటి మహత్తరమైనది! స్తుతి, ప్రణామం, ప్రార్థన, నియమము, శ్రవణముల చేత విష్ణు భగవానుని సేవించుట చేతనే ఈ ఆత్మదేవుడు నాకు ప్రత్యక్షమై లభించాడు. ఇంతా అయిన తరువాత, నేను గాంచినది మరెవ్వరినో కాదు.

నా ఆత్మ స్వరూపమే నా కోరికపై ఇట్లా విష్ణురూపముగా ప్రాప్తించింది.

అహంకారమునకు ఆవల ఉన్నట్టి అట్టి విష్ణు భగవానుని ఆత్మ చైతన్యము నా స్మృతిపథంలోనే లభించింది. ఆయన అనుగ్రహంచేత అహంకారమునకు స్థానమే లేనట్టి సనాతన బ్రహ్మము (లేక) ఆత్మ నాచే దర్శించబడుచున్నది.

ఓనా అహంకారమా! – సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలచే నడిపించబడే నిన్ను ఇప్పుడు దాటి వేస్తున్నాను. ఇంతకాలం నీవు చేస్తున్నదేమిటి? ఇంద్రియములను ఎఱగావేసి నన్ను వశం చేసుకున్నావు. "తృష్ణ, కామము, దుఃఖములు, వాసనా సమూహములు, ఉత్పత్తి–పతనములు, ఊర్ధ్వ–అధోలోకములు, రకరకాల ఉపాధులు, ఆశాపాశములు ...ఇవన్నీ కల్పించి, వీటికి సంబంధించిన అనేక కార్యక్రమములలోకి ప్రేరేపించింది నీవు కాదా?

నాకు శత్రువువై నా ఆత్మనే నీవు ఆక్రమించావే? అల్పసామర్థ్యము, పిరికితనము కలవాడు పిశాచములచే బాధించబడినట్లు నేను ఈ సంసారమున చిక్కి నీకు ఎంతోకాలం బందీనయ్యాను. నేను ఆత్మ గురించి సంప్రదిస్తున్న మరుక్షణం నీవు నీ ఉనికినే కోల్పోతున్నావు.

విజ్ఞానదృష్టిని పొందినట్టి నేనిప్పుడు నిన్నొక చిన్న ప్రశ్న వేస్తున్నాను... నీవు అసలు ఉన్నావా? ఉంటే, ఎక్కడున్నావు?...

చీకట్లో దయ్యంలా స్ఫురించే నీవు వివేకోదయంచే ఆత్మ ప్రబుద్ధం కాగా, ఎటో అదృశ్యమై పోయావు. దీపం వెలిగించగానే చీకటి ఎక్కడికి పారిపోతుందో, నీవుకూడా అక్కడికే పారిపోయావు.

ప్రకాశమానమగు దీపం వెలిగినట్లు ఇప్పుడు నా హృదయంలో వివేకము వెలగగానే అహంకారము యొక్క ఛాయ కూడా లేకుండా పోతోంది.

ఓ ఆత్మ భగవానుడా! స్వస్వరూపుడా! సూర్యోదయం కాగానే దొంగలు వెనక్కి చూడకుండా పారిపోతారు కదా! ఆత్మజ్ఞానోదయం (లేక) ఆత్మసాక్షాత్కారం అయిందా – అహంకారం మొదలైనవన్నీ పలాయనం చిత్తగించవలసిందే. చూచారా! మీ దర్శనం కానంతవరకూ కఠోరుడగు అహంకార యక్షుడు ఎంతగా భ్రమింపజేశాడో... మాటలతో చెప్పలేను. పిశాచాలులాగా మిథ్యారూపంగా ఆవిర్భవించిన అహంకార – మమకారాలు తొలగిపోగా కొండచిలువ తొలగించబడిన వృక్షంలాగా నేను స్వస్థుడనయ్యాను. ఆశలన్నీ శమించటం చేత, గొప్ప వర్షం పడిన తరువాత దావాగ్నిలాగా, అంతఃకరణం ప్రశాంతపడుతోంది. సుఖంగా ఇదే జగత్తులో ఉంటున్నాను.

ఇక అహంకారం లేదు. మోహం లేదు. దుఃఖం లేదు. దురాశ లేదు. మనోవ్యధ లేదు.

ఎక్కడైనా ఆకాశంలో పూతోటలు ఉంటాయా? లేదు. ఆత్మ యందు ద్వితీయమైనదేదీ ఉండటానికే వీలు లేదు. చిత్తము నందు అహంకారము అనే పిచ్చి ఉండటం చేతనే ఇంతకాలం జ్ఞానం శోభించలేదు. దుమ్ముకొట్టి ఉన్న గుడ్డకు ఎంత రంగు వేస్తే మాత్రం ఏమి అంటుతుంది? అహంకారం, తృష్ణ నిండి ఉన్న మనస్సు జ్ఞాన సమాచారం వినసే వినలేదు. ఒకవేళ వినినా ప్రయోజనం లభించదు.

హే ఆత్మ భగవాన్! మీ సమక్షము అతిప్రసన్నము, అహంకారరహితము, ఆనందసాగరము, సాక్షీమాత్ర స్వరూపము అని సుజ్ఞానులు ప్రవచిస్తూ ఉన్నారు. తమకు వందనములు. ఎండిన తటాకంలో మొసళ్ళు చచ్చిపోతున్నట్లు, భ్రమలు తొలగిన మనస్సుతో అహంకార – మమకారాలు నిస్తేజమైపోతాయి. ఆత్మజ్ఞానము యొక్క ప్రభావంచేత చిత్తము స్వయంగా శమిస్తోంది.

అహంకారరహిత సువిశాల ఆత్మతత్త్వమా! ఏమి నీ మహిమ! ఆశ – చింతలు లేని దానవై సర్వమునకు సాక్షీమాత్రంగా, ఆనందమే స్వభావముగా కలిగి యున్నావు. బుద్ధిలో ప్రతిబింబించే చైతన్యము నీవే. ఈ "నేను–నీవు, అతడు–ఆమె–ఇది–అది" అనబడే సర్వ జీవుల హృదయము లందు, మనస్సు లందు సర్వదా ప్రకాశిస్తున్నట్టి నిన్ను ఏమని వర్ణించాలి? వేద వేదాంగాలే నిన్ను వర్ణించాలంటే, వాటికి మాటలు చాలకపోతున్నాయి. నా పంచ ప్రాణాలు, పది ఇంద్రియాలు, మనస్సు బుద్ధి నాతో సహా ఈ సర్వజీవులు – ఈ కళలన్నీ నీ యొక్క కల్పితరూపములు. ఎందుకంటే నీవు అన్నివేళలా "నిరవయవము, నిత్యోదితము, అమృత రూపము" అయి ఉన్నావు. నీకు నీవే పరిపూర్ణమై ఉంటూ సత్–శాంత ప్రభావముచే హృదయాంధకారమునకు దీపపు కాంతివగుచున్నావు. సర్వవ్యాపివైనప్పటికీ, అదృశ్యరూపమున ఉన్నదానివై ఒప్పుచున్నావు. (లేక)

ఈ పంచ ప్రాణములు, దశ ఇంద్రియములు, ఈ మనస్సు, బుద్ధి, ఈ కనబడే ప్రహ్లాదాదిగా సర్వజీవులు నా యొక్క కల్పిత రూపములు.

పరమాత్మ (ఆవల ఉన్న ఆత్మస్వరూపం = పరమ్ + ఆత్మః) నా నిజస్వరూపం.

నేను నిజరూపంగా నిరవయవమును. నిత్యోదితుడను. అమృత స్వరూపుడను.

ఓ చిద్రూప భగవాన్! ఓం నమోనారాయణాయ! సర్వవృత్తులకు అతీతులై, ఏతత్‌సమయంలోనే మీరు పరమప్రేమను ప్రకటించుచున్నారు. సర్వపదార్థముల స్వభావమునకు ఆధారభూతులై ఉన్నారు. బుద్ధికి ఆవల ప్రకాశిస్తూ ఉండే మిమ్ములనే అందరూ అనేక పేర్లతో ఆరాధిస్తున్నారు.... అర్చిస్తున్నారు. అట్టి మీకు ఇప్పుడు నమస్కరిస్తున్నాను. మీపట్ల నా నమస్కారం తెంపు లేని జలధారవలె సదా, సర్వదా కొనసాగుగాక! నేనే మీరు! మీరే నేను!

❖❖❖

11. మనస్సుతో మనోజయం

ప్రహ్లాదుడు (అంతరంగంలో) : అమ్మయ్యా! ఇప్పటికి కదా, నేను కామాగ్నిచే తప్తమై, మీదకు వస్తున్న మనస్సు అనే ఖడ్గమును – శమాది గుణములతో కూడినదైన మరొక ఖడ్గముతో ఛేదించి వేయగలుగుచున్నాను!

సహజీవులను నారాయణునికి అన్యంగా దర్శించటమే ఈ ఇంద్రియముల బహిర్ముఖత్వం. సర్వే సర్వత్రా నారాయణ సందర్శనమే (అనన్యదర్శనమే) అంతర్ముఖత్వం.

అట్లు, బహిర్ముఖంగా పోతున్న ఇంద్రియాలను ఇంద్రియములతోనే నిగ్రహించి ఆత్మోన్ముఖం చేస్తున్నాను. శుద్ధ మనస్సుచే మలినమనస్సును జయించి ఆత్మాహంకారముచే, ఈ శరీరాహంకారాన్ని మర్దించి నిశ్చింతగా ఆత్మోన్ముఖుడనగుచున్నాను. త్యజించ వలసినదంతా త్యజించగా ఇక త్యజించుటకు అశక్యమై శేషించే 'చిత్' మాత్రమునందు స్థితి పొంది సర్వోత్తముడనై భాసించుచున్నాను.

శ్రద్ధచే అశ్రద్ధను అడగింపజేస్తున్నాను. విచారణచే అవిచారణను ప్రక్కకు నెట్టుచున్నాను. 'నేను ఎఱుగుచున్నవాడను' అనబడే జ్ఞాతృత్వాభిమానమును రహితంచేస్తూ కేవల జ్ఞప్తి మాత్రుడనై వెలుగొందుచున్నాను. సత్యాత్మ స్వరూపమగు నా స్వస్వరూపమా! ఆత్మదేవా! తమకు నమస్కారమయ్యా! అంతటా సర్వదా వేంచేసి ఉన్న స్వామీ! ఓం నమో భగవతే వాసుదేవాయ!

మనసామనసి ఛ్ఛిన్నే నిరహంకారతాం గతే ।
భావేన గలితే భావే స్వచ్ఛస్తిష్ఠామి కేవలః ॥ (శ్లో 77, సర్గ 35)

మనస్సు మనస్సుచే ఛేదించబడగా అప్పుడు అహంకారం 'నిర్మూలమై. 'దేహో–హమ్' భావం ప్రక్కకు నెట్టబడి 'బ్రహ్మో–హమ్' భావము అధిరోహింపబడ, 'నేనే' కేవల చిద్రూపుడనై ఉన్నాను. ఇక ఈ శరీరం విషయానికి వస్తే, ఇది భావన, అహంకారం, మనస్సు అనునవేవీ లేకుండా, తాను కోరునదంటూ ఏమీ లేకుండా, కేవలం ప్రాణక్రియామాత్రంచే శుద్ధాత్మయందు నెలకొనియున్నది.

సర్వులందు ఒకేరీతిగా ఉండే ఓ ఆత్మదేవా! (సమం సర్వేషు బూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్!). నీవు నిన్ను ప్రేమించే భక్తులను భోగైశ్వర్యముల సంప్రదానముచే అనుగ్రహిస్తూ ఉంటావు. విశ్వేశ్వరులగు బ్రహ్మ – విష్ణు – మహేశ్వరుల నిజస్వరూపము నీవే. పరమశాంతియుతమగు మీ

యందు నాకు ఇప్పటికి నిరతిశయానందము, పరమ విశ్రాంతి లభించుచున్నది. మోహబేతాళుడు, అహంకార రాక్షసుడు, దురాశాపిశాచం నీ ఊసుఎత్తగానే ఇక నాకు కనబడకుండా అదృశ్యమైనారు. దురహంకారం, తృష్ణ తోకముడుచుటచే నేను సంతాపరహితుడనైనాను. "నేను కొందరికంటే అధికుడను కదా" – అను రూపంగల స్వాభిమానం నడ్డి విరగగొట్టబడింది. దురాశలకు మూలమైన అసంఖ్యాకమైన వాసనలు సౌభాగ్యవశంచేత క్షయించాయి. ఏం ఆశ్చర్యం! మిథ్యారూపమైన దురహంకారమును ఆశ్రయించినప్పటి నేను ఎవడను? ఎవడైననూ, ఇప్పుడు మాత్రం ఆత్మగానే శేషించుచున్నాను. ప్రత్యక్షముగా నిరతిశయానంద రూపుడనైనాను. అపరిచ్ఛిన్న బ్రహ్మాకార వృత్తియుతుడనగు నేను హాయిగా దృశ్యమునందు ఉంటూనే విముక్తుడనైనాను.

ఈ స్వాత్మానుభవం శాస్త్రముల, జ్ఞానుల వాక్యముల ప్రమాణమునకు సరిపోవుచూ, మననమాత్రముచే స్వతఃసిద్ధంగా పొందబడినదగుచున్నది. మనస్సు సర్వమును వదలివేసి, కేవలం అఖండము, అప్రమేయమునందు సమాధినిష్ఠ పొందుగాక. భగవంతుడగు ఆత్మయందే సర్వము నియోగించుచున్నాను.

ఇప్పటి నా మనస్సు - మనస్సు విషయ శూన్యమౌతోంది. మనన వివర్జితమూ, ఈషణా రహితము అగుచున్నది. అహంకారమమకార భ్రమలన్నీ పరిత్యజించింది. రాగరహితమై భోగేచ్ఛను విసర్జించింది. కట్టెలన్నీ బయటకు లాగబడగా శేషించే అగ్నిగుండంలాగా శమించింది. అహో! ఒకప్పుడు ఈ మనస్సు ఏవేవో సంఘటనలకు ఎంతగా ఆక్రోశించేది... ఎంతగా పరితపించేది! ఒకే సమయంలో అనేక రకాలుగా, అనేక సమయాలలో ఒక రకంగా ఉంటూ, అనేక ఉపాధుల రాక పోకలకు వశమైపోయి సహింపనలవికాకుండా ఉండేది. అట్టి ఆపదలన్నీ ఇప్పుడు తొలగి పోయాయి.

అద్వయ చిద్రూపము – పూర్ణాత్మ ఇప్పుడు అనుభవమగుచున్నది. కేవల సాక్షి చైతన్య స్వరూపమగు నాపట్ల జడత్వము గాని, జనన మరణాదులుగాని ఉండటానికి అవకాశమే లేదని ఇప్పుడు గ్రహించాను.

❖❖❖

12. ఆత్మ స్తవనం

ప్రహ్లాదుడు ఏకాంతముగా ఆత్మతత్త్వమును ఉద్దేశించి, మరల ఇట్లు స్తవనం చేయసాగాడు.

ప్రహ్లాదుడు : చాలా రోజుల గడచిపోయిన తరువాత ఇప్పటికి నిరతిశయానందమగు ఆత్మ స్మృతికి వచ్చింది. హే ఆత్మదేవా! అదృష్టవశంచేత మీ పునఃదర్శనమయింది. మహాత్ముడవగు మీకు నమస్కారం. మిమ్ములను చూస్తూ, నమస్కరిస్తూ, చిరాలింగనమొనర్చుచున్నాను. కడివెడు పాలలో చిన్న పాత్రతో నీరు పోసినపుడు ఆ నీరు తన రూపమును పోగొట్టుకొని పాలతో ఏకమగుచున్నదే! నా మనస్సు కూడా మిమ్ములను సమీపించి మీతో ఏకత్వము పొందుచున్నది. నేను – మీరు

ఒక్కటే అగుచున్నాము. హే ఆత్మ భగవాన్! మీరు కాకుండా ఈ ముల్లోకాలలో పరమప్రియమైనవాడు ఇంకెవ్వడూ ఎవ్వరికీ ఎక్కడా లేనే లేడు. మిమ్ములను పొందనంతకాలం రక్షణ - ధ్వంసన - ఆగమన - నిష్క్రమణ - మొదలైన క్రియా వ్యవహారములు జరుగుచున్నాయి. మిమ్ములను పొందిన మాహాత్మ్యముచే నేను ఇంద్రియములు లేనివాడనైనాను. ఈ ఇంద్రియములు, ఇవి చూస్తున్న విషయములు ఎక్కడ ఉంటున్నాయో, ఎక్కడికి పోవుచున్నాయో ఏమోగాని, నేను మాత్రం ఇంద్రియాతీతుడను, నిష్క్రియుడను అగుచున్నాను.

ఓ ఆత్మదేవా! మీరు మీ సత్త వలన ఈ విశ్వమంతా వ్యాపించి, సర్వత్రా అగుపించుచున్నారు. ఇక్కడి నుండి మీరు మరెక్కడికి పోగలుగుతారు! అసలు మీరు లేనిచోటెక్కడ? అందుచేత, "వెళ్ళుట - వచ్చుట" - అనునదంతా మీకు సంబంధించినది కాదగును.

ఒకప్పుడు నీవు జన్మరహితులని, నేను జన్మసహితుడనని భ్రమచేత అనుకుంటూ ఉండేవాడను. ఇప్పుడు మనిద్దరి మధ్య ఆ భేదంకూడా లేనేలేదని తెలిసిపోతోంది.

ఇప్పుడు నాకు నీవు సమీపస్థుడ వయ్యావు. ఎంతటి సమీపస్థుడవంటే ... నాకు నీవుగాని, నీకు నేను గానీ వేరుగా లేనేలేము. ఓ హితుడా! అదృష్టవశంచేత నేడు నీ సాక్షాత్కారం పొందాను.

స్వామీ! అఖండమగు ఆత్మదేవాదిదేవా! నీవు కృతకృత్యుడవు ! జగత్‌కర్త, భర్త నీవే! స్వామీ! నీకు నమస్కారం! నీ యందున్న నాకు, నా యందున్న నీకు నమస్కారం. ఈ ప్రహ్లాదోపాధి యందు నీవే ఉండి సర్వాత్మకమగు నీకు నీవే నమస్కరించుకోవటం ఈ చమత్కారం. ఈ సంసారంలో ఆకు లోని ఈనెలాగా అంతర్లీనంగా ప్రసరించి ఉన్నది నీవే.

ఓ నిత్యనిర్మలాత్మా! చక్రహస్తా! అర్ధచంద్రధరా! విబుధనాథా! పద్మజా! బ్రహ్మదేవా! విష్ణూ! శంకరా! ఇంద్రుడా! పదేపదే ప్రణామములు స్వామీ!

వ్యవహార దృష్టికి మన ఇద్దరి మధ్య కనబడే భేదమంతా నీటికి అలలకు గల భేదమే! అది అసత్య కల్పనయే. అనంత విచిత్ర రూపిణి, సదసద్రూపిణియగు మాయ వలన మనిద్దరి మధ్య అసత్యం కల్పనగా విజృంభిస్తోంది. నీవు లీలావినోది కదా! మాయ అనబడేది నీ కల్పనయే. ద్రష్ట - స్రష్ట - సృష్టి కూడా నీవే! నాయందు, సర్వులయందు, సర్వముయందు వ్యాపించియున్నది నీవే! నా యందు నేనుగా ఉండి కామాది దోషాలచే అసత్పథంతో తన పూర్ణభావాన్ని కోల్పోయి ఇంతకాలంగా నీవే సంచరిస్తున్నావు. జన్మ జన్మాంతరాలుగా బహువిధ దుఃఖములను, వ్యవహారములను చవి చూచావు. ఇంతలోనే క్రమక్రమముగా వివేకానుకూలమగు అనేక దృష్టాంతములను చూచావు.

❖

వ్యవహారదృష్టి ఉన్నంత వరకు నిన్ను ఎవరు పొందగలరు? హే పరాత్పరా! నీవు, ఈ మట్టి - కొయ్య - పాషాణాలతో కూడిన తక్కిన జగత్తంతా మిథ్యయే. నిన్ను పొందితే సర్వమూ పొందినట్లే. పొందకపోతే ఏమీ పొందనట్లే! నిన్ను పొందినవారికి ఇక కోర్కెలుండవు. కోర్కెలు ఈడేరటమనగా అదియే! ప్రభూ! నేను నిన్ను సర్వదా పొందియే ఉన్నాననీ, నీకూ నాకూ అంతరమే లేదనీ గ్రహించాను.

అట్లు గ్రహించుటచే నిన్ను "పొందినవాడను, కనుగొనినవాడను" – అయ్యాను. నీ యథార్థ రూపం ఏమిటో ఇప్పుడు నాకు తెలిసిపోయింది. మోహము తొలగించి నిన్ను నేను సర్వత్రా చూచుచుండగా ఇక కళ్ళతోనో, స్పర్శతోనో ఒకటి రెండు చోట్ల మాత్రమే చూడటమేమిటి? ఇంద్రియము లందు, అంతరంగ వృత్తులందు వ్యాపించి అన్నిటినీ ప్రకాశింపజేస్తున్నట్టి నీవు అనుభూతికి గోచరం కానిదెప్పుడు! నిన్ను కొత్తగా పొందవలసినదిగా ఎట్లా అనడం?

నీవు నాలోనే ఉన్నావు. నిన్ను మరెక్కడో వెతకవలసిన పనిలేదు. ఒక శబ్దమును విన్నంత మాత్రం చేత, ఆ శబ్దశక్తిని ప్రకాశింపజేస్తున్నట్టి నీవు నాకు దూరస్థుడవు అవుతావు? తీపి – చేదు – కారములను ఆస్వాదిస్తూ నీవు ఏ క్షణంలోను అప్రత్యక్షమైనవాడవు కాదు. నేను ఒక పుష్పసువాసన ఆఘ్రాణిస్తున్నప్పుడు ఈ చేతిలోను, ముక్కులోను ఉండి, ప్రీతిచే అనుభవ రూపంగా తారసపడే నీవు ఎల్లప్పుడు చేతిలోని పండు వలె (కరతలామలకం వలె) తారసపడియే ఉన్నావు.

❖

వేద వేదాంతములచే, తర్కము, మీమాంస మొదలైన శాస్త్రములచే, పురాణములచే వర్ణించి చెప్పబడుచున్న సనాతనమగు ఆత్మను ఒక్కసారి తెలుసుకున్నామా – ఇక మరుచుట అనేది ఉండదు. హే ఆత్మదేవా! నిర్మల స్వరూపులగు నిన్ను గాంచిన తరువాత ఇక ఇంతఃపూర్వపు రుచికరములైన భోగములు ఇప్పుడు లెక్కకు వచ్చుటయే లేదు. నీ యొక్క నిర్మల ప్రభావము చేతనే సూర్యచంద్రులు ప్రకాశిస్తున్నారు. ఈ పర్వతములను భారవంతముగా చేసినది మీరే. ఆకాశమును ఆక్రమించి వాయువును సంచరింప జేస్తున్నది మీరే! నమస్తే వాయుః! త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి! భూమి సర్వమునకు ఆధారమగుచుండగా, ఆ భూమికి మీరే ఆధారం.

అమ్మయ్య! నేడు నాకు, గల భేదం అదృష్టవశం చేతనే తొలగినది. నీవే నేను... నేనే నీవు. మనిద్దరిలో కొంచెం కూడా భేదం లేదు. జలమునకు, తరంగమునకు భేదమేమున్నది? కొండకు – కొండరాయికి భేదమెక్కడిది? కుండలో నింపిన తటాక జలానికి – తటాకంలోని జలానికి భేదం ఏముంటుంది? ఈ 'నేను – నీవు' మొదలైన శబ్దములన్నీ నీ మాహాత్మ్యముచే ప్రకటనమగుచూ, నిన్నే తెలియపరుచుచున్నాయి. సమానాధికములు ఏమాత్రము లేనట్టి కార్యకారణ ఉపాధికారకములైన 'నేను – నీవు' అను శబ్ద ద్వయమునకు ఇదే నమస్కారం. ఇక ఉపశమించమని ఆ శబ్ద ద్వయమునకు నా విన్నపం. నిత్యసత్యమగు అభేదమే పరిఢవిల్లును గాక!

❖❖❖

13. నాకు ... నేనే నమస్కారం!

అనంతుడు, నిరహంకారుడు, రూపహీనుడు, అత్యంత సమస్వరూపుడు అగు నాకు నేనే నమస్కరించుచున్నాను. సత్యము, సాక్షీభూతము, నిరాకారము, అపరిచ్ఛిన్నము అగు ఆత్మ దేవుడు నా యొక్క నిర్మల స్వరూప, స్వభావములై వెలయుచున్నాడు. కొత్తగా ఇంకేం కావాలి?

ఈ మనస్సు ఏవేవో కారణాలు కల్పించుకొని ఎందుకోసమో క్షోభించుచుండవచ్చు గాక! ఇంద్రియ వృత్తులు స్ఫురించుచున్నాయా? అయితే కాని! ప్రాణ – ఆపానములు ప్రవహింపజేయు ఏదో శక్తి విజృంభిస్తోందా? విజృంభించనీ. చర్మ – మాంస – బొమికలతో కూడిన ఈ భౌతిక శరీరము మనస్సు అనే సారథిచే ఆశాపాశములనే త్రాళ్ళ సహాయంతో సంచరింపజేయబడుచున్నదా! ఏది ఏమైనా కానీ! కాకపోనీ! వీటితో నాకు సంబంధమే లేదు. ఈ శరీరం ఇట్లాగే అనేక రోజులు ఉండనీ. లేక, ఎప్పుడో ఒకప్పుడు నేలకూలనీ! ఈ సర్వ, కార్యక్రమములకు మూలము, కారణభూతము అగు ఆత్మను గ్రహించాను. ఇంక నాకు ఏమి భయం? ఇంకేమి కావాలి? వచ్చేదేమున్నది? పోయేదేమున్నది?

చాలాకాలం తరువాత నేను నాయందుగల ఆత్మదేవుని చూస్తున్నాను. ఈ జగత్తు ఎట్లాగైతే కల్పాంత సమయంలో లయమైపోతోందో, అట్లాగే నా భ్రాంతి కూడా ఇప్పుడే అంతమొందింది. ఈ సంసారములో తిరిగి తిరిగి అలసి, సొలసిపోయి ఉన్న నాకు ఇప్పుడు పరమ విశ్రాంతి అయిన ఆత్మభగవానుడుండే స్థానములో ఆతిథ్యం లభించింది. ఓ ఆత్మదేవా! నీవు సర్వమునకు అతీతుడవు. సర్వుల స్వస్వరూపము నీవే. అట్టి నీ యొక్క స్వరూపమును చేతులెత్తి చూపించుచున్న వేదాది శాస్త్రములకు, గురువులకు నమస్కారం. భోగ్యవస్తువులన్నీ ప్రకాశింపజేస్తూకూడా, నీవు వాటి దోషములచే ఏమాత్రం స్పృశించబడవు కదా! అభినివేశ శూన్యము, ఉదాసీనము, సర్వసమము అగు సాక్షీభావంగా నీవు వెలుగొందుచున్నారని గుర్తిస్తున్నాను.

హే పరమాత్మా! పువ్వులందు సువాసన ఉన్నట్లు, తోలుతిత్తిలో గాలి ఉన్నట్లు నువ్వులలో నూనె ఉన్నట్లు నీవు సర్వజీవులలో వెలుగొందుచున్నావు. నీవు నిరహంకారుడవై కూడా రక్షిస్తున్నావు – శిక్షిస్తున్నావు – దానమొనర్చుచున్నావు – స్వీకరిస్తున్నావు – పోరాడుచున్నావు – పరిగెడుచున్నావు. మరి, నీ మాయ అంతటిది. నీ "ప్రోద్బలం – సంకల్పం – సహకారం – పాల్గొనడం" చేతనే సృష్టికాలంలో నేను జీవ స్వరూపంతో అనేక ఉపాధులలో ప్రవేశించడం, వాటిని పాలించడం జరిగింది. ఇంతలోనే నీ సంకల్పమును అనుసరించి ప్రళయ కాలంలో ఈ జగత్తును, ఉపాధులను ఉపసంహరించి ఉపరతిని పొందటం జరుగుతోంది.

❖

ఒక చిన్న మఱ్ఱివిత్తనంలో ఒక పెద్ద మఱ్ఱివృక్షము యొక్క స్వభావమంతా దాగి ఉన్నది కదా! అత్యంత సూక్ష్మరూపుడవగు నీయందు ఈ సంసారమండలమంతా త్రికాలములందూ ఇమిడి ఉన్నది. నీవే భ్రాంతి కల్పితములగు వివిధ పదార్థముల ఆకృతిని వహించి ప్రకటించుకొనుచున్నావు. అనేక భావ పరంపరలన్నీ బయల్వెడలుచున్నది నీనుండే కదా! చివరికి, అఖండానందమయ స్వరూపము ఆవిర్భవిస్తున్నది నీ నుండే.

❖❖❖

14. ఓ స్వస్వరూపాత్మ దేవా!

ప్రహ్లోద నామధేయా! ఓ నా స్వస్వరూపాత్మదేవా! "నేనెవ్వడను? ఎక్కడున్నాను?" – అనే విషయాలు నీవు మరలమరల యోచించవలసినదిగా నా మనవి. పూర్వమోహదశలను చూచి నీవు నవ్వటమే జరుగుతుంది. స్వచ్ఛంగా నవ్వుకుంటూనే ఈ క్రోధ, మాన, కాపురుష , క్రూరత్వములను సర్వదా పరిత్యజించుము. నీచ జనులకు మాత్రమే ఉచితమైన మాన, మద, గర్వములను మహనీయులు దగ్గరకు రానిస్తారా? ఒకప్పుడు 'చింతలు' అనే అగ్నిలో దగ్ధమగుచూ కార్యములందూ, పీడలందూ, ఆరంభములందూ సంక్షుభితమయ్యే అజ్ఞానదశలు తొలగిపోయినాయి సుమా! ఆ దుర్దశలన్నీ కూడా విజ్ఞాన వికాసముచే భస్మం చేయబడ్డాయి. ఇప్పుడు నీవు దేహనగరమునకు రాజై 'పూర్ణమనోరథులు' అయ్యావు.

ఓ స్వస్వరూపస్వామీ! ఆకాశమును ఎవడైనా తన పిడికిలిలో బంధించగలడా? అట్లాగే ఈ ప్రపంచంలో కనిపించే ఆయా సుఖదుఃఖ సంఘటనలచే నీవు బంధింపబడలేరు. అవి నిన్ను తాకనైనా లేవు. ఈ ఇంద్రియములు, చిత్తము, భోగములు – వీటన్నిటికంటే సమున్నతులగు నీవు నీకే సర్వదా చెందియున్నట్టి ఆత్మసామ్రాజ్యాన్ని అధిరోహించావు.

అపారామ్బరపాన్థస్త్వ మజస్రా స్తమయోదయః ।
అవభాసకరో నిత్యం బహిరన్తశ్చ భాస్కరః ॥ (శ్లో 46, సర్గ 36)

అనంత ఆకాశంలో బాటసారియగు ఆ సూర్య భగవానుని వలె మీరు స్వయంప్రకాశ స్వరూపుడవై, జ్ఞానదృష్టికి "నిత్యోదిత ఆత్మ ప్రకాశము"గానూ, అజ్ఞాన దృష్టికి "ప్రహ్లోదుడు అనబడే ఒక వ్యక్తి" గానూ తెలియవస్తున్నావు.

స్వతహాగా నిష్క్రియుడవు, పరమశాంత, నిర్లిప్త అప్రమేయ స్వరూపుడనగు నీముందు నీ సేవ కొరకై ఈ ఇంద్రియములు, ఇంద్రియార్థములు నిలచి ఉన్నాయి. కాముకునికై కామిని తళుకు బెళుకులు చూపునట్లు ఈ ఎదురుగా ఉన్న రూపాదులన్నీ 'దృష్టి' అను సేవకురాలిచే కనులలో ఉండే దర్శనశక్తికి ఉపాహారంగా కొనిరాబడుచున్నాయి. సర్వదా ప్రశాంతంగా అచ్యుతులై ఉంటూనే ఈ 'దృశ్యము'ను స్వీకరించండిగాని, తాదాత్మ్యము చెందటమా? కానేకాదు. అవసరం లేదు.

ఓ ప్రహ్లోదాత్మదేవా! నీవు మహనీయుడవు. ఎందుకంటే, ఒకవైపు – ఈ శరీరమధ్యంలో ఉండి సాక్షిస్వరూపులై ప్రాణవాయువుల సంచారము వీక్షిస్తూ ఈ ఇంద్రియములద్వారా ఈ జగత్తును పొందుచున్నావు. మరొకవైపు మార్పు చేర్పులు ఉండనట్టి బ్రాహ్మీతత్త్వమునకు నిత్యసాక్షులై వెలుగొందు చున్నారు. ఈ 'దేహము'అనే పుష్పము యొక్క సౌరభము నీవే. ఇందలి అమృతరసము నీవే. నీవు ఈ దేహమును విడచినారా – ఇక ఆపై ఇది ఎవరికి ప్రేమాస్పదమౌతుంది? ఈ ప్రహ్లోద ఉపాధిలోనే కాదు. సర్వప్రాణులందు, అణువణువునా నిండియున్న స్నేహరసం నీవే. 'శరీరము' అనే కట్టెయందు అణిగియున్న నిప్పువలె నీవు ఉండనే ఉన్నావు. సర్వోత్తమాస్వాదమగు అమృత రూపుడవు నీవు. సమస్త తేజములను ప్రకాశింపజేసేది నీవే.

ఈ పదార్థములన్నిటి ఉనికినీ గ్రహించేది నీవు. అంతర్–హృదయస్తులగు ఆత్మదేవా! ఈ దృశ్యమంతా నీ సంప్రదర్శనమే! నీయొక్క ప్రభావంచేతనే ఈ కళ్ళు మొదలైన ఇంద్రియములు తమ పనులను తాము చేయగలుగుచున్నాయి. వాయువు యొక్క చలనమునకు, చిత్తము యొక్క చాంచల్యమునకు, బుద్ధి యొక్క ప్రకాశ, అప్రకాశములకు మూలకారణం నీవే.

నీవు ఉపసంహరించుటచేతనే ఈ వాక్కు 'మరణము – మూర్ఛ – నిద్ర' లందు విలీనమై పోవుచున్నది. ఇంతఃపూర్వపు శరీరములను, ఇప్పటి ఈ శరీరమును, ఇక ముందు ఏర్పడబోయే శరీరమును దీపమువలె ప్రజ్జ్వరిలింపజేసేది నీవే. ఒకే బంగారము నుండి అనేక ఆభరణములు ఉత్పన్నమగుచున్నట్లు, నీ నుండియే ఈ వివిధ సంసారపదార్థములు, సంబంధములు, సంఘటనలు ఉత్పన్నమగుచున్నాయి. నీకు నీవే, స్వవిలాసముగా 'నేను – నీవు – అతడు' అను మాయతో గూడిన శబ్దములన్నీ వ్యవహారింపజేయుచూ, స్పందించుచున్నావు. నీవే, ఈ ప్రహ్లాద నామధేయ వ్యష్టిగా ఉంటూనే, ఇంతలోనే ఏతత్‌సమయంలోనే అసంఖ్యాక ప్రాణుల ఆకార, ఆచారాదుల రూపంగా పరిలక్షింపబడుచున్నారు. వేరువేరు అగ్ని శిఖలు వేరువేరు అగ్ని ఖండములని అజ్ఞాన దృష్టికి అనిపించవచ్చునేమోగాని, అగ్ని సర్వదా ఒక్కటే కదా! నీ సృష్టియందు నీవే నీకంటే వేరైన ఆకారము వలె అగుపడుచున్నావు. సర్వాకారములూ నీకు అభిన్నమైనవే.

ఈ బ్రహ్మాండమంతా నిండియున్న అవిచ్ఛిన్న స్వరూపుడవు నీవే. చెట్టుకు వేలాది పూలు పూస్తున్నట్లు ఈ భూతజాలమంతా నీయందే ఉత్పత్తి అయి పరిభ్రమిస్తోంది. నీ వలననే ఈ విధంగా అభివ్యక్తమయ్యే సర్వ పదార్థములూ సృష్టి రూపమున ప్రకాశమొందుచున్నాయి.

చూస్తున్నది మీరే .... చూడబడుచున్నది మీరే! - ఓ నా స్వస్వరూపాత్మ స్వరూపా! ప్రహ్లాద నామధేయా! ఒక గుడ్డివాడు ఒక అందమైన యువతి రూపలావణ్యములను చూడగలడా? లేడు. నీవే లేకపోతే, ఇక ఈ అందమైన వస్తుసంపద ఉండి కూడా లేనట్టే. ఎందుకంటే, వస్తువులకు కార్య – కారణ శక్తిని ప్రసాదించేది నీవే కదా! నీవే లేకపోతే ఈ శరీరము, ఈ జగద్విశేషములు నిస్తేజము, అనుభవరహితము అగు కొయ్య, మట్టితో సమానమే. వెలుగు ఉండుట చేతనే ఒక గొప్పకొండ యొక్క ఔన్నత్యాన్ని చూడగలుగుతాం. వెలుగు లేకపోతే, అంతా చీకటిమయమే కదా!

ఓ ఆత్మేశ్వరా! నిన్ను పొందిన తరువాత ఇక సర్వ సుఖ దుఃఖాలు నశించిపోతాయి. సూర్యుడు ఉదయించగానే చీకటి, మినుకుమినుకుమనే నక్షత్రాలు, మంచు – అన్నీ లీనమైపోతాయి కదా! నిజానికి నీ అంగీకారం చేతనే సుఖ దుఃఖములు ఏర్పడి ఉండగలుగుచున్నాయి. ఎంతటి చిత్రమో చూచారా?

1. నీవు దర్శించుచుండుటచేతనే సుఖ దుఃఖములు స్థితిని పొంది ఉంటున్నాయి.
2. నీవు కాదంటే, అవి ఇక ఉండవు.
3. దీపం తొలగించగానే దీపపు కాంతి చీకట్లో విలీనమై పోవునట్లు, నిన్ను దర్శించగానే సుఖ దుఃఖములన్నీ, స్వయంగా సంపూర్ణముగా లయించగలవు.

ఏవి నీ సత్తచే ఏర్పడి ఉంటున్నాయో, అవి నీ అద్వితీయ దర్శనముచే 'లేనివి' అగుచున్నాయి. నిన్ను ఆశ్రయించి ఉన్నవి నిన్ను ఆశ్రయించుటచే మాత్రమే జయింప బడుచున్నాయి.

❖

అయినా ఒక్కమాట! వాస్తవానికి పరమానంద స్వరూపుడవగు నీ యందు అత్యంత భంగురమైన సుఖ దుఃఖము లెక్కడ! ఒక నిమిషములో ఒక లక్షవభాగము ఎప్పుడు పుడుతోందో, ఎప్పుడు నశిస్తోందో ఎవ్వరమైనా గమనిస్తున్నామా? అట్లాగే నిన్ను ఎరిగినట్టి జ్ఞాని దృష్టిలో ఆ సుఖదుఃఖాలు ఎప్పుడు ఏర్పడుచున్నాయో ఎప్పుడు తొలగుచున్నాయో గమనించుటకు అర్థమే అగుటలేదు. అయినా, ఈ సుఖదుఃఖములు నీ అనుగ్రహం చేత పుడుతూ, నశిస్తూండటమేమిటి? ...అవి నిన్నే భ్రమింప జేయమేమిటి?

జగత్తు, ఉత్పత్తి, లయములు - ఈ జగత్తు నీవు గాంచుటచే ఉత్పన్నమగుచు, నిన్ను గాంచుటచే విలీనమై పోవుచున్నది. దృష్టాంతానికి ఒక స్వప్న ద్రష్ట తన స్వప్నంలో చూచే వస్తుజాల మంతా స్వప్నం అంతమైనప్పుడు ఎటు పోతున్నాయి? అట్లాగే ఆత్మజ్ఞానము ప్రాప్తించగానే ఈ జగత్తు ఎటు పోవుచున్నది? "లేనిదే" అగుచున్నది. "ఈ జగత్తు ఏ క్షణమందూ లేదు" – అని తెలిసిపోతోంది. ఏ క్షణంలోనూ ఏమాత్రం లేనట్టి ఒక వస్తువు ఒక కార్యమెట్లా నిర్వర్తిస్తుంది? ఎవరైనా కొన్ని జల తరంగములను ఒక మాలగా చుట్టి తన మెడలో ధరించగలరా? "సుఖ – దుఃఖములు లేవు..." అను ఆత్మజ్ఞాన సంబంధమైన ఎఱుకచే, ఇవి పుట్టిన మరుక్షణం చచ్చుచున్నాయి. వివేకులు మిమ్ములను దర్శించుటచే సర్వస్థితులందూ ఏకరీతిగా ఉండగలుగుచున్నారు.

ఓ అనంతరూపా! అవివేకులకు మీరు ఎన్ని రకములుగా తోచుచున్నారో చెప్పనలవికాదు. వాస్తవానికి మీకు ఇహ పరములనేవి లేవు. మీరు అవయవరహితులు! నిరహంకారీ! నిరాకారీ! సర్వకర్తా! ఓ ఈశ్వరా! సర్వేశ్వరా! ప్రహ్లాదనామధేయుడగు నా స్వరూపమా! సర్వస్వరూపా! ఆత్మభగవాన్! నీ ఆకారము బ్రహ్మాండము కంటే ఎంతో ఎంతో విస్తృతమైనది! పరమశాంతిపరాయణా! నీకు దిగ్విజయమగు గాక! నిఖిల ఆగమములకు నీవు అతీతము! ఆగమములకు (వేదములకు) ఆధారుడవు! జయ జయ! పరమాత్మా! జాతా! (పుట్టుచున్నది మీరే!) అజాతా! (పుట్టుక లేని) క్షతా! (నశించుచున్నది) అక్షతా! (నాశనము లేని) భావా! అభావా! జయా! అజయా!... నీకు సర్వదా జయమగుగాక!

ఇప్పుడు నేను శాంతుడనైనాను. యదార్థమేమిటో తెలుసుకున్నాను. జయించాను. ఇందులకే ఇంతకాలం జీవించాను. నాకూ – నీకూ కూడా నానమస్కారం!

నా వాస్తవ స్వరూపము తత్ స్వరూపము, – నిరామయమూ, స్వతఃసిద్ధమూ, స్వసంసిద్ధమూ రాగరంజనా రహిత స్వరూపమూ అయిఉన్నది. ఇక నాకు బంధమేమిటి? విపత్తెక్కడ? సంపద ఎక్కడ? నాకు జననమరణము లెక్కడివి? నేను క్రొత్తగా నిరామయమగు నిత్యశాంతి పొందటమేమిటి? ...నేను సర్వదా శాంతి స్వరూపుడనే అయి ఉన్నాను.

❖❖❖

15. దానవులు - దీనత్వము

ఈ విధంగా చింతనచేస్తున్న ప్రహ్లాదుడు క్రమంగా నిర్దోషము – నిర్ద్వంద్వము – నిర్వికల్పము అగు స్వస్వరూప సామ్రాజ్యములో ప్రవేశించాడు. సమాధిని అవధరించాడు. ఒక చిత్రపటంలోని బొమ్మలాగా, శిల్పిచే మలచబడిన శిలావిగ్రహంలాగా ఉండిపోయాడు. అట్టి నిర్వికల్ప సమాధిలో సుస్థిరుడైనాడు.

అక్కడి అసుర మంత్రివరేణ్యులు, తదితరులు ప్రహ్లాదుని సమాధి నుండి ప్రబోధింపజేయాలని ఎంతగానో ప్రయత్నించారు. కాని ఏమి లాభం? అతడు మాత్రం రాతియందు చెక్కబడిన సూర్యుని వలె ప్రశాంతభావంతో ఏకదృష్టితో ఉండిపోయాడు. ఏ పిలుపు కాని, ఏ దృష్టి కాని అతని దరి చేరటమేలేదు. ...ఆ విధంగా కొన్నిరోజులు గడచిపోయాయి.

అంతరంగంలో ఆతడు ఏకము – అఖండము – అప్రమేయం – నిర్విషయము – నిరవధికము అగు బ్రహ్మానందం అనుభవిస్తున్నాడు. ఆతని అనుభవస్థితి వాక్యాలకు అందేది కాదు ఒక చెంబు సహాయంతో సముద్రజలం ఎంతటిదో ఏమని విశదపరచగలం? అయితే, బయటకు మాత్రం చూచేవారికి "ఈతడు నిరానంద స్వరూపమగు మృత్యువును పొందినాడా ఏమి?" – అన్నట్లుగా ఉన్నది. ఇక పాతాళ సామ్రాజ్యములో అసుర జాతి యొక్క జీవనవిధానం కొన్ని మార్పులు చెందసాగింది. ఎందుకంటే వాళ్ళను పాలించే నాయకుడు లేడు. మొన్నమొన్నటిదాకా దేవతలకు సింహస్వప్నమై, విష్ణుద్వేషి అయి, బలపరాక్రమవంతుడై పరిపాలించిన హిరణ్యకశిపుడు నృసింహస్వామి చేతిలో హతమైపోయాడు. నేడు ఈ ప్రహ్లాదుడు సమాధిని అవధరించి రాక్షసనాయకత్వానికి సుదూరముగా, అంతరంగ వ్యవస్థితుడై స్వస్వరూప ఏకాంత పారవశ్యము నందు ఉండిపోయాడు. ఎవరెంత ప్రబోధం చేసినా ఆతని పట్ల అది చెవిటివాడి ముందు శంఖారావమగుచున్నది.

❖

రాజు లేకపోతే అల్పయోచనలుగలవారి కార్యక్రమం ఉద్ధృతమై అంతా అరాచకమే అవుతుందిగదా! పాతాళపురంలో అరాచకం ప్రారంభమైంది. "పెద్ద చేప చిన్నచేపను మ్రింగటం" – అనే మత్స్యన్యాయం తాండవించింది. బలవంతులు బలహీనులను పీడించసాగారు. ప్రజలు నిస్సహాయులై అనేక పీడలు ఎదుర్కొనవలసి వచ్చేది. సామాన్య ప్రజలు దిక్కులేక నిస్సహాయులు కాసాగారు.

ఏకరసస్వరూపము పొందియున్న ప్రహ్లాదునకు ఈ వివరాలన్నీ తెలియనే తెలియవు. ఆతడు సుషుప్తిలోని వ్యక్తిలాగా సమాధి తత్పరుడయ్యే ఉన్నాడుకదా! ఇక బలవంతులగు దైత్యులు విచక్షణా శూన్యులై ఆవేశ కావేశాదులతో తమలోతామే కలహించుకోసాగారు. గుణవంతులు గుణహీనులచే హింసించ బడసాగారు. బలహీనుల సొత్తు బలవంతులు లాక్కోవటం, జనులు మాన మర్యాదలు వదలి ప్రవర్తించటం, అధర్మం, అబలల, పీడితుల గొంతుకలు వినిపించుకోకపోవటం – ఇవన్నీ

అంగీకార యోగ్యం కాసాగాయి. అంతఃపురంలో కట్టుబాట్లు భ్రష్టమైనాయి. అనేకులు అధర్మపరుల దుశ్చర్యలకు తమ ధన, జనములను పోగొట్టుకొని, చెప్పుకొనుటకు దారిలేక, ఇక చేసేది లేక, చింతామగ్నులై, బిచ్చగాండ్రై చరించసాగారు.

❖

ఎప్పుడూ లేనిది, హఠాత్తుగా ఆంతరంగికంగా రాక్షస జాతిలో ఇట్టి పరిణామాలు రావడం చూచి అక్కడి పెద్దలకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి వచ్చింది. మరొక వైపు దేవతాబాలకులు వచ్చి అసురులను పరాభవిస్తుంటే, వాళ్ళలో వాళ్ళకు ఐకమత్యం లేక, అవమానాలు దిగమింగుకోవలసి వచ్చింది. వాళ్ళలో వాళ్ళు పోట్లాడుకొనుచూ, ఉద్విగ్నతతో దీనులు కాసాగారు.

❖❖❖

16. సృష్టికే ఎసరు

ఆ విధంగా అనేక రోజులు గడచిపోయాయి. నిఖిలజగత్కళ్యాణకారకుడు, క్షీరసముద్ర నివాసి, శత్రుమర్దనుడు అగు విష్ణుమూర్తి ఒక రోజు తన నిద్రాముద్రను విడిచారు. నెమ్మదిగా కళ్ళు తెరిచారు. పాతాళం, తద్వారా దేవలోకం, తదితర లోకాలూ అస్తవ్యస్తంగా ఉండటం గమనించారు. తన జ్ఞాననేత్రములచే సర్వజగత్తు యొక్క గతి – దుర్గతులను పరిశీలిస్తూ ఇట్లు తనలో యోచించ సాగారు.

శ్రీమహా విష్ణువు (మనస్సులో) : ఆహా! పరమభక్తుడగు ప్రహ్లాదుడు బ్రహ్మపదమున విశ్రమించియున్న ఈ సమయంలో పాతాళ లోకంలో నాయకుడు లేకుండాపోయాడు. ఇక దానవులు తమను తామే హింసించుకొంటూ క్రమంగా తమకు తామే బలహీనులగుచున్నారు. రాక్షసులు లేకపోతే, అప్పుడు పర్యవసానమేమిటి? దేవతలలో "మేము విజయము పొందాలి" అనే పట్టుదల ఉండదు. పట్టుదల ఉండని చోట ఉత్తమ శక్తి, యుక్తులు బలహీనపడిపోతాయి. క్రమంగా దేవతల ఉనికికే ఎసరు వస్తుంది. దేవతలు శాంతించి, వారంతా ద్వంద్వరహితమైన బ్రహ్మమును పొందుతారు. అభిమాన రహితులై స్వర్గసుఖములను త్యజించివేస్తారు.

దేవతలు ఆ విధంగా నాశనమవటం జరిగితే అప్పుడేమౌతుంది? క్రమంగా భూలోకంలో యజ్ఞ యాగాది క్రియలు కూడా నశిస్తాయి. ఇష్ట భోగములనూ, తదితర ప్రయోజనములను ప్రసాదించే దేవతలు లేకపోతే ఇక కర్మలకు ప్రయోజనములు ఏం ఉంటాయి? అందుచేత "కర్మ ఉత్కృష్టత" అను కార్యక్రమముతో కూడిన మానవులు బద్ధకస్థులౌతారు. క్రియలు నశిస్తే కర్మభూమి అగు భూలోకం నశించిపోతుంది. భూలోకమే నశిస్తే ఇక ఏమున్నది? ఈ సంసారమే నశించ బోవుచున్నదే!

❖

అరే! భలేచిక్కు వచ్చిపడిందే. ప్రళయం తరువాత నేను చేసిన ఈ సృష్టి అకాలంగా, అర్థంతరంగా లుప్తమైపోతోందికదా! నాచే కల్పితమైన ఈ విశాలజగత్తు నశిస్తే నా ఈ లీలయే భంగమై పోగలదు.

అప్పుడు నేను కూడా "చంద్ర – నక్షత్ర – ఆకాశ" శూన్యమగు నా ఈ శరీరమును విలీనమొనర్చుకొని తత్ పదమున వెలయవలసివస్తుందే! అది అకాలమగు విపరీతపరిణామం అవటం చేత ఉచితం కాదు, శ్రేయము కాదు. ఎందుకంటే, ఈ జీవులు ప్రకృతిలో లయం పొందినప్పటికీ, మూలాజ్ఞానం ఉండనే ఉంటుంది. కాబట్టి 'మరల జన్మించాలి' అనే తపన మిగిలియే ఉంటుంది. ఈ సృష్టి ఏర్పడియే ఉండవలసిన అగత్యమున్నది. అందుచేత ఈ దానవులు తమతమ పరాక్రమములతో జీవించి ఉండటం అవసరమే. రాక్షసులు ఉంటే, దేవతలు కూడా ఉంటారు. అప్పుడు తపస్సు, యజ్ఞము మొదలైన క్రియావ్యవహారాలకు కూడా చోటు ఉంటుంది. సంసారము అనబడునది ఉంటుంది. అప్పుడు సృష్టికి సంబంధించిన అసందర్భపూర్వకమైన రసాభాస ఉండదు. కనుక నేనిప్పుడు పాతాళలోకం వెళ్లి ప్రహ్లాదుని 'రాజ్యపాలన' అను కర్తవ్యంలో నియమించటమే సముచితం. ఒకవేళ ప్రహ్లాదుని బదులుగా మరొకరిని రాజ్యపాలనయందు నియమిద్దామంటే, అది సమంజసం కాదు. ఎందుకంటే ఈ ప్రహ్లాదదేహము అత్యంత పవిత్రమైనది. ఈతడు ఇక మరల జన్మించడు. వర్తమానానికి ఈతడు కొంతకాలం రాజ్యపాలన నిర్వర్తించవలసిన 'యోగం' ఉన్నది. అటుతరువాత కూడా కల్పాంతమువరకు ఈతడు ఈ సృష్టికే ఒక ఆభరణమై జీవించటమే ఈశ్వరనియతి.

నియతికి ఏమాత్రం భంగం కాకూడదు కదా! అందుచేత నేనిప్పుడు ప్రహ్లాదుని ప్రబోధింప జేస్తాను. ఈతడు తనయొక్క జీవన్ముక్త స్థితిలో నిర్విఘ్నంగా ఉంటూనే, రాజ్యపాలన చేయుచుండును గాక! అప్పుడే దేవతలూ ఉంటారు... అసురులూ ఉంటారు. ద్వంద్వము ఉంటుంది. అప్పుడు మాత్రమే నా లీల చెక్కు చెదరకుండా ఉంటుంది. వాస్తవానికి ఈ జగత్తు యొక్క ఉదయము – క్షయమూ, ఈ రెండూ నాకు ఒక్కటే అయినప్పటికీ నేను యథారీతిగానే సర్వమూ ఏర్పాటు చేసి ఉంచటం ఇప్పటినా స్వభావము అయి ఉన్నది.

ఇప్పుడు ఈ క్షీరసాగరశయనము ఈ రీతిగా ఒక ప్రక్క కొనసాగిస్తూనే, యోగనిద్రలో ఉండి ఉంటూనే, ఇక్కడ నిద్రాముద్రకు భంగం లేకుండానే నేను పాతాళానికి వెళ్ళటం, ప్రహ్లాదునితో సంభాషణ, జగత్తును సుస్థిరీకరించటం మొదలైనదంతా జరుగుచుండును గాక.

❖❖❖

17. నారాయణోపన్యాసము

ఆ విధంగా యోచించిన శ్రీహరి సర్వాత్మకుడైయుండినట్టి తనయొక్క ప్రభావంచేత క్షీరసాగరంలో శయనసముద్రంలో ఉంటూనే, నీరు కూడా చొరజాలనట్టి పాతాళబిలం ప్రవేశించారు. ప్రహ్లాదుని అంతఃపురం ప్రవేశించి అక్కడ బ్రహ్మదేవునివలె సమాధి యందు నిమగ్నమైయున్న ప్రహ్లాదుని చూచారు. ఆ దగ్గరలో పచార్లు చేస్తున్న రాక్షసులు నారాయణాగమనముచే ప్రవేశించిన వైష్ణవ తేజమునకు తాళలేక దూరంగా వెళ్ళసాగారు. వాళ్ళంతా విషయమేమిటో అర్థంగాక తమ మంత్రి వర్యులకు ఆ విశేషమును నివేదించటానికి పరుగులు తీశారు.

ఆకాశంలో అప్పుడే చంద్రుడు ఉదయిస్తున్నాడు. విష్ణు భగవానుడు వేంచేసి ప్రహ్లాదుడు సమాధిలో ఉండియున్న విశాల మందిరంలో ఒక ఉన్నతాసనంపై ఆసీనులైనాడు. శంఖ, చక్రాది ఆయుధములను ధరించి పరివార సమేతుడైయున్నారు. లక్ష్మీదేవి పూతీగ వంటి హస్తములతో స్వామికి వింజామరలు వీచుచున్నది. దేవ – ఋషులు, మహర్షులు ఆయనకు నమస్కరిస్తూ స్తోత్రములు సమర్పిస్తున్నారు. నవ్వుతో కూడిన నునులేత పెదవులతో స్వామి, "నాయనా! ప్రహ్లాదా! లే! ప్రబుద్ధుడవు కమ్ము" అని పలుకుతూనే పాంచజన్యం పూరించారు. విష్ణుదేవుని ప్రాణవాయువుల నుండి జనించిన ఆ ధ్వని రాక్షసులను మూర్ఛిల్లేటట్లు చేసింది. ఆ ధ్వని విని విష్ణుదేవుని అనుచరులు బ్రహ్మానందం పొందారు.

రాక్షసుల చక్రవర్తి అయినట్టి ప్రహ్లాదుడు విష్ణుదేవుని శంఖానాదం ఎక్కడో హృదయాంతరాళలోని లోతుల నుండి విన్నాడు. నాదస్వరం విన్న ఆడత్రాచుపాములాగా బోధను పొందసాగాడు. ఆతని ప్రాణశక్తి క్రమంగా బ్రహ్మరంధ్రమునుండి లేచి శరీరమంతా వ్యాపించింది. ప్రాణవాయువులు నెమ్మదిగా అంగ ప్రత్యంగములలోనికి ప్రవేశించాయి. ఇంద్రియ నవ ద్వారములు ఉత్తేజితము లైనాయి. "లింగ శరీరము" అనే దర్పణమునందు చైతన్యము ప్రతిబింబించింది. అది క్రమంగా విషయోన్ముఖమై చిత్‌జడరూపమున మనోభావంగా పొందింది. ఆ విధంగా చిత్తము సంచలనమును ఆశ్రయించుచుండగా ఆతని నేత్రములు అర్ధనిమీలితములు అయి విచ్చుకున్నాయి. నాడీ రంధ్రములలో దాగి ఉన్న జ్ఞానశక్తి ప్రాణాపానవాయువుల వలన సముత్సాహపూరితమైనది. ఇక, ప్రహ్లాదుడు నెమ్మదిగా కదలసాగాడు.

ప్రాణములు పూరితం అయిన తరువాత ఆతని మనస్సు పరిపూర్తి పొందసాగింది. తెల్లవారిన తరువాత సరోవరంలాగా ఆతని ప్రాణములు, మనస్సు, కళ్ళు వికసించాయి. "నాయనా! ప్రహ్లాదా! ప్రబుద్ధుడవు కమ్ము" అను శబ్దతరంగాలు ఆతని చెవులను, మనస్సును మరల మరల తాకాయి. మననశక్తి, స్మృతిశక్తి అభివృద్ధి అగుచుండగా ఆతడు తటాలున లేచి శ్రీవిష్ణుమూర్తికి నమస్కరించాడు.

❖

శ్రీమన్నారాయణుడు : నాయనా! ప్రహ్లాదా! నీవు నీ నిజస్వరూపమును స్మరించుటచే ధన్యుడ వైనావయ్యా! నాకు సంతోషం. అయితే ఒక్క విషయం. నీకు ఈ నీ దేహాన్ని తిరస్కరించి, త్యజించ వలసిన అవసరం ఇప్పుడేమున్నది? ఇటు ప్రారబ్ధముయొక్క ప్రభావముచే ఏర్పడి ఉన్న దానవ రాజ్యాన్నీ, అటు అప్రమేయము, నిర్మలము, నిత్యము అగు ఆత్మస్వరూపమును ఒక్కసారే అవధరించి ఉండవచ్చును కదా! ఇప్పటికే నీవు సంకల్పరహితుడవయ్యావు. కనుక నీకు కొత్తగా త్యజించ వలసినదేమున్నది? గ్రహించవలసిన దేమున్నది? ఆత్మతో ఏకత్వము పొందిన తరువాత ఇక నీకు ఈ శారీరక సుఖదుఃఖముల వలన వచ్చే కీడు, మేలు ఏమున్నాయి?

కనుక, లేఁ! ఈ నీ భౌతిక దేహము ఈ కల్పాంతమువరకు అనేక జీవులకు మార్గదర్శకమై ఉండబోవుచున్నది. అవశ్యం జరగబోయే నియతి అది. అందుచేత, నీవు చక్కగా లేచి రాజ్యపాలన

చేయి. ప్రవాహపతితంగా ఏదైతే తప్పక నిర్వర్తించవలసి వస్తుందో అద్దానిని జ్ఞానులు త్యజించరు. తప్పక నిర్వర్తిస్తారు. కనుక నీవు ఉద్వేగరహితమైన భావములతో ఒనగూడినవాడవై, కల్పాంతము వరకు ఈ ఉపాధితో నిలచి ఉండు. కుండ పగిలినప్పుడు ఆ కుండలోని ఆకాశం మహాకాశంలో విలీనమైపోతుంది కదా! నీవు కూడా ఈ ఉపాధి కల్పాంతమునందు నేలకూలగానే ఆపై ఇక బ్రహ్మపదమున వెలయగలవు. ఇప్పటికి మాత్రం ఈ శరీరంతో జీవన్ముక్తుడవై ప్రకాశించెదవు గాక!

❖

పుత్రా! ఇప్పుడే "ఇది కల్పాంతము" అని ఒకవేళ పొరబడ్డావా ఏమిటి? ద్వాదశ ఆదిత్యులు ఒక్కసారే ప్రేరేపితులై ఒకేచోట ఉదయించటం, ఎక్కడికక్కడ జగత్తు ప్రజ్జ్వలించటం మొదలైన కల్పాంతము యొక్క సంజ్ఞలేమీ లేవు కదా! ఈ జీవులు, ఆ పర్వతములు, నీవు, నేను, ఆకాశము, తదితర జగత్తు – ఇవన్నీ ఏమీ చెక్కు చెదరనేలేదే! మరి, "ఈ శరీరము త్యజించబడాలి" అనే అభినివేశము దేనికి? ఇది కల్పాంతము కానేకాదు. అందుచేత నీకు నీవుగా ఈ దేహమును పరిత్యజించనే వద్దు. కేవలం దేహం అట్టి బెట్టుకున్నంత మాత్రంచేత, అది అజ్ఞానమనిపించుకోదు. ఎవనిమ నస్సైతే తన యందు అజ్ఞానము, అల్పవిశేషముల ఆశ్రయం కలిగి ఉంటుందో, తన యందు దుఃఖ మోహములను పేర్చుకుని ఉంటుందో ...అట్టివానికి మాత్రమే ఈ శరీరధారణమనేది బాధాకరమై ఉంటుంది.

"నేను ఎందుకూ పనికిరానివాడను. ఎందుకు తగుతాను? ఇక నా గతి, నేను చేయగలిగినది ఇంత మాత్రమే.

కృశోఽ తిదుఃఖీ మూఢోఽ హమేతాశ్చాన్యాశ్చభావనాః ।
మతిం యస్యావలుమ్పన్తి మరణం తస్య రాజతే ॥ (శ్లో 38, సర్గ 39)

నేనొక మూఢుడను, దుఃఖితుడను, శరీరమాత్రుడను, అల్పకాలికుడను ...అని భావించే వానికే 'మృత్యువు' అనే అనుభవం ఆవశ్యకమగుచున్నది.

బద్ధ జీవులు - ఈ జగత్తులో కొందరు జీవుల అంతఃకరణములు అనేక ఆశాపరంపరలు కలిగిఉంటున్నారు. అనేక చంచల వృత్తులు వచ్చిచేరి, ఆ అంతః కరణములను అనేక దుర్మార్గములలోకి ఈడ్చుకునిపోతున్నాయి. ఎందుచేత? ఆత్మవ్యతిరిక్తమైన అవివేకమును స్వీకరించుటచేతనే! అవివేకము తృష్ణ రూపమున తాండవించుటచేతనే! అందుకు ఫలితంగా వారు అనేక సాంసారిక విషయములను గాడిదలవలె మోస్తున్నారు. వారి చిత్తములలో అనేక వృత్తులు అనుక్షణం ఏర్పడి, అవన్నీ అనేక సుఖదుఃఖ ఫలములను అవిశ్రాంతపూర్వకంగా ఇచ్చుకుంటూ పోతున్నాయే! 'కామము' మొదలైన అనర్థములచే ఆ మనస్సులు క్షణక్షణం అటూఇటూ ఈడ్వబడుచున్నాయే! అట్టివారు తమయందు 'కామము' అనే సర్పమును కలిగియుండి అనేక ఆధివ్యాధులకు అర్హమగుచున్నారు. అట్టివారికే 'మరణము' అనే ఔషధము ఆవశ్యకమగుచున్నది... అంతేగానీ, నీవంటి వారికి కాదు.

మరణము అంటే ఏమిటి?... ఓ ప్రహ్లాదా! ఈ శరీరము పరిత్యజించబడుటయే లోకములో 'మరణము' అనే పేరుతో వ్యవహరించబడుతోంది. ఆత్మకు మరణమెక్కడిది? అది సర్వదా నిష్క్రియము కదా! ఇక ఈ శరీరము అసత్తే కదా! అసత్యము, భ్రమమాత్రము అయిన ఈ శరీరానికి మాత్రం "ఈ శరీరము చచ్చుచున్నది" ... అనే పదప్రయోగం ఎంతవరకు సమంజసం? కనుక 'మృత్యువు' అనే ప్రక్రియను ఈ శరీరమునకు కూడా మనం ఆపాదించటం కుదరదు.

ఆత్మజ్ఞానం కలుగనంతవరకు శరీర భ్రమ ఉండియే తీరుతుంది. "అన్ని వైపులా ఆత్మతత్త్వమును దర్శించుట" అను విరామం లేని యథార్థదర్శియొక్క జీవితమే నిజమైన జీవనం. అదిమాత్రమే సర్వవిధములా శోభించుచున్నది.

ఎవడైతే అహంభావరహితుడై, నిర్లిప్తుడై, సమదృష్టిని పొందిఉంటాడో – అట్టివాడు ధన్యుడే! కనుక రాగద్వేషరహితమగు బుద్ధితో ఈ జగత్తును సాక్షివలె దర్శిస్తూ ఉండాలి. ఈ జగత్తు యొక్క అసారత్వమును సంపూర్ణముగా గ్రహించి, అటుపై "గ్రహించటం – త్యజించటం" అనబడే రెండిటినీ వదలివేయాలి. ఈ చిత్తమును సాక్షిస్వరూపమునకు సమర్పించివేయాలి. తుచ్ఛమగు వ్యవహార రూపంగా ప్రకాశిస్తున్న ఈ బాహ్యవస్తువులందు మనస్సు సక్తము కాకూడదు. ఈ మనస్సును బ్రహ్మము నందు మాత్రమే లీనం చేయాలి. సత్యదృష్టిని అవలంబించి, ఆపై లీలగా లౌకిక వ్యవహారములు ఆచరించుచున్నప్పటికీ, అన్నివేళలా వాసనాశూన్యుడై ఉండాలి.

ఇష్ట, అయిష్టములు సంఘటిల్లుచున్నప్పుడు ఎవడైతే ఎట్టి రాగ ద్వేషాలు ఏమాత్రం పొందడో ...అట్టి వాని జీవితమే ధన్యము. మానససరోవరంలో ఉత్తమ జాతి హంసలు సంచరిస్తున్నట్లు హృదయసరోవరంలో కూడా శాంతి, క్షమ, భక్తి, వైరాగ్యము, ఉత్తమ ఆశయము – మొదలైన ఉత్తమ గుణములు వెల్లివిరియు గాక! ఎవనిని చూస్తే... లేక... ఎవని పేరు చెప్పుకుంటే తదితర జీవులు ఆనందమును పొందగలుగుతారో, అట్టివారి జీవితము ధన్యము.

నీవు అంతటి మహామాన్యుడవు –ప్రహ్లాదుడవు! సార్ధకనామధేయుడవు! కనుక ప్రియ ప్రహ్లాదా! నీ యొక్క చరిత్ర వినటంచేత, నీ జ్ఞాన భక్తివాక్యాలు అనుసరించటంచేత ఈ సర్వజనులు శుభమును పొందగలుగుతారు. అటువంటి నీకు ఈ జీవితముపట్ల అయిచ్ఛ ఉదయించవలసిన పనేమున్నది? నీవు ఇచ్ఛాయిచ్ఛలకు అతీతుడవు కదా!

❖❖❖

18. దేహము - జీవము - జీవుడు

శ్రీమన్నారాయణుడు : బిడ్డా! ప్రహ్లాదా! నీయొక్క సమాచారవిశేషములు అధికం చేసే ఉద్దేశంతో నీకు ఈ దేహము, జీవనము, మరణము, జీవుల గురించి మరికొన్ని వాక్యాలు చెపుతాను, విను–

స్థైర్యం దేహస్య దృష్టస్య జీవితం ప్రోచ్యతేజనైః ।
దేహాన్తరార్థం దేహస్య సంత్యాగో మరణం స్మృతమ్ ॥ (శ్లో 1, సర్గ 40)

'జీవము' అనగా ఏమిటి? ప్రత్యక్షంగా ఎదురై కనిపిస్తున్న ఈ రక్తమాంసమయ దేహము యొక్క ఉనికినే జనులలో అనేకులు 'జీవనము' అని పిలుస్తున్నారు. ఈ జీవుడు మరొక దేహము కొరకై దీనిని విసర్జించినప్పుడు, ఆ ప్రక్రియయే 'మరణము' అని చెప్పబడుతోంది. నీవు మహామతివి అవటంచేత ఈ రెండు అవస్థలనుండి విడివడ్డావు. "ఈ దేహముతోటిదే మా జీవనము" అని అనేక మంది జీవులు మరలమరల మననం చేస్తున్నారు. అది నిజమా? కాదు!

నీ విషయానికివస్తే నీకు అట్టి దేహాత్మకమైన బుద్ధి లేనేలేదు. అందుచేత నీ ప్రాణములకు 'ఇంకొక చోటికి పోవటం' - అనేదే ఉండదు. ఇక నీకు జీవితమూలేదు, మరణమూలేదు. "నీకు జీవితమే తగుతుంది... మరణము తగదు" - అని నేను ఇంతవరకు చెప్పినదంతా కేవలం దృష్టాంత ప్రదర్శనము కొరకే. సర్వజ్ఞుడవైన నీకు మరణమేమిటి? జీవితమేమిటి? ఆకాశము స్వతహాగా శూన్యమైనది. అందులో వాయువు ఉన్నది. వాయువు ఆక్రమించుకొని ఉన్నంతమాత్రం చేత ఆకాశము తన శూన్యత్వమును త్యజిస్తోందా? లేదుకదా! కనుక దేహబుద్ధి ఏ మాత్రం లేనట్టి నీవు సర్వదా దేహశూన్యుడవే అయి ఉన్నావు.

వ్యవహారం - అయితే వ్యవహారం కొరకు, దేహధర్మములైనట్టి శీత-ఉష్ణ-స్పర్శ జ్ఞానాదులు నీకు ఉన్నాయి కనుక, 'నీవు ఈ దేహమున ఉన్నావు' అని వ్యవహరించబడుతోంది. వృక్షము ఎత్తుగా పెరగటానికి ఆకాశము కారణము కాకపోయినప్పటికీ, "ఆచోట (ఆకాశం)లో ఒక పెద్ద వృక్షము ఉన్నది" అని జనులు చెప్పుకుంటూ ఉంటారు కదా! ఇది కూడా అట్టిదే. ఆకాశం సదా నిరాకారంగానే ఉంటుంది గాని, వృక్షాదుల ఆకారం సంతరించుకోదు కదా!

ఇక్కడ స్పర్శ - జ్ఞానముల విషయంలో 'ఆత్మయే దీనికి కారణం' - అని చెప్పబడుతోంది. అది లోకరీతి. నీవు మాత్రం ఆత్మప్రబోధం పొందుటచే నీపట్ల ద్వైతమంతా ఉపశమించింది. పరిచ్ఛిన్నమగు దేహాత్మ బుద్ధి అజ్ఞులకు మాత్రమే ఉంటుంది గాని, నీ వంటి విజ్ఞులకు కాదు. నీ బుద్ధి ఒక్క పరబ్రహ్మము నందు మాత్రమే పరినిష్ఠమై ఉండుటచే, నిన్ను శాస్త్రాదులు "చిత్ప్రకాశం ..." అని వర్ణిస్తున్నాయి. సర్వదా సర్వరూపుడవగు నీపట్ల దేహ - అదేహములు, పరిగ్రాహ్య - పరిత్యాజ్యములు అపాదింపబడజాలవు. జలమునకు ఆకారమెక్కడున్నది? ..."స్వయమ్ ఆత్మా!"

ప్రియప్రహ్లాదా! అత్యంత ఆహ్లాదకరమైన వసంతకాలం రానిమ్ము... లేదా, సర్వమును దిగమ్రింగి వేయగల ప్రళయకాలం వచ్చిపడనీ ...కొండలు నేల కూలనీ ...ఉత్పాతగాలులు వీచనీ ...ఈ జగత్తంతా భస్మం కానీ ...వచ్చేదేమున్నది? పోయేదేమున్నది? ఆత్మ యందే సర్వదా వెలయుచున్న నీకు వచ్చే కీడేమిటి? మేలేమిటి? ఈ పదార్థములన్నీ ఎంతగానో ఉండు గాక, లేదా ఊడు గాక! ఇంతకు అంత అగుగాక, లేక వినష్టమైపోవు గాక! ఈ శరీరమే ఖండఖండములగు గాక! ఆత్మ నశించదు. వర్ధిల్లదు. ఈ శరీరస్పందనము ఆత్మస్పందనమెట్లా అవుతుంది? అవదు.

❖

ఆత్మతో ఏకత్వము పొందినవారికి "నాకు దేహముతో ఉనికి, సంబంధములు ఉన్నాయి. నేను దేహము కలవాడను" - అను చిత్తవిభ్రమమంతా నశించుచున్నది. అప్పుడిక "త్యజించుచున్నాను

– త్యజించుటలేదు" – అను కల్పన అంతా ఉండదు. "దీనిని పూర్తి చేసిన తరువాత అది నిర్వర్తించవలసి ఉన్నది... అది ప్రారంభిస్తాను ... ఇది పరిత్యజిస్తాను" – అనే సంకల్పములన్నీ క్షయించిపోతాయి. ముక్త పురుషులు అన్నీ చేస్తూనే ఏదీ చేయనివారే అయి ఉంటున్నారు. "అవయవములే కర్మలు చేస్తాయి. నిరవయవియగు ఆత్మ దేనికీ కర్త కాదు. అట్టి నిష్క్రియమగు ఆత్మయే నేను" – అని భావించువానికి కర్తృత్వమెక్కడుంది? ఎక్కడ అకర్తృత్వము ఉంటుందో, అక్కడ అభోక్తృత్వము కూడా సిద్ధించుచున్నది.

అభోక్తృత్వం ప్రాప్తించాలంటే 'నేను దేనికీ కర్తను కాదు' అను అకర్తృత్వము ఆశ్రయించటమే సర్వోత్కృష్టమైన ఉపాయం.

ముక్తి, పరమ శాంతి - కర్తృత్వము, భోక్తృత్వము నశించాయా ... ఇక శేషించేది పరమ శాంతియే సుమా! అట్టి శాంతి సుస్థిరమైనప్పుడు దానిని శాస్త్రములు ముక్తి అని పిలుస్తున్నాయి.

ప్రబుద్ధులు, చిన్మయులు, విశుద్ధులు అగువారు సమస్తము అతిక్రమించి వెలయుచున్నారు. గ్రహించుట కొరకై త్యజించునది గాని, త్యజించుటకై గ్రహించునది గాని ఇక్కడ వారికేదీ ఉండుటలేదు. గ్రహించబడుచున్నది – అట్లు గ్రహించుటకు కర్త, అవయవములు, అవయవి, వాటికి సంబంధించిన ప్రమాణ–ప్రమేయములు ఇట్టి వివిధ వికారములన్నీ అజ్ఞాన సమయంలో తారసపడతాయేమోగాని, ఆత్మను ఎరిగిన జ్ఞానులందు వాటికి చోటుండదు. "గ్రహించువాడు, గ్రహించబడునది" – అను వ్యవహారసరళి సన్నగిల్లగా అప్పుడు ఉదయించే శాంతికే 'మోక్షము' అను మరొక పేరు.

నీ వంటి పురుషశ్రేష్ఠులు సర్వదా అట్టి ముక్తియందు వెలయుచూ, శాంతులై ఉంటున్నారు. సుషుప్తి సమయంలో అవయవముల కదలికలవలె ఈ జగత్తులో సంచారం చేస్తున్నారు. నాయనా! పరబ్రహ్మబోధ పొందియుండుటచే నీకు సర్వవాసనలు తొలగిపోయినాయి.

పరావబోధవిశ్రాన్తవాసనో జగతి స్థితిమ్ ।
అర్ధసుప్త ఇవేహేమాం త్వం పశ్యాత్మస్థయా ధియా ॥ (శ్లో 21, సర్గ 40)

కాబట్టి, ఈ జగత్ స్థితినంతా అవలోకిస్తున్నప్పుడు ఆత్మయందు సంస్థితమైన బుద్ధి కలవాడవై, సగం నిద్రిస్తున్న వానివలె ఉండు. పరబ్రహ్మమునందు లీనమైన చిత్తము కలవారు, "ఇవి చాలా బాగున్నాయే!" అని తలచి, ఏ బాహ్యవస్తువు లందూ ఏమాత్రం ఆసక్తి గొనరు. ఇక్కడి దుఃఖాలచే ఉద్విగ్నులు కారు. ఒక అద్దము తనకెదురుగా ఏముంటే అద్దానినే తన యందు ప్రతిబింబిస్తూ ఉంటుంది కదా! నిత్యముక్తులగు వారు అనాసక్తులై, అనిచ్ఛాపూర్వకంగా ఆయా ప్రాప్తములైన కార్యాలను నిర్వర్తిస్తూ ఉంటారు.

జాగ్రతి స్వాత్మని స్వస్థాః సుప్తాః సంసారసంస్థితౌ ।
బాలవత్ప్రవివేపన్తే సుషుప్తసదృశాశయాః ॥ (శ్లో 24, సర్గ 40)

ఉత్తమ ఆత్మదర్శనము చేయుచున్న మహనీయులు నిర్మలహృదయులై ఈ సంసార విశేషములన్నీ చూస్తున్నప్పుడు మౌనము, నిర్లిప్తత, అతీతత్వము వహించి ఉంటున్నారు. నిద్రలో బాలుడు

అసంకల్పితంగా నడచివెళ్ళుచూ ఉంటాడు. చూచావా?... అట్లా ఉంటుంది, ఈ సంసారంలో జ్ఞానుల సంచారం!

❖

ప్రియభక్తా! ప్రహ్లాదా! నీవు అంతరమున బ్రహ్మపదమును పొందియే ఉన్నావు. అందుచేత విధివశాత్తూ తారసపడి, నీ విధ్యుక్తధర్మమై ఎదురుగా నిలిచిన ఈ పాతాళలోక చక్రవర్తిత్వమును యథారీతిగా పొంది ఉండు. అనంతరం చ్యుతిరహితమగు పరబ్రహ్మమును యథారీతిగా పొంది ఉండు. తదనంతరం చ్యుతిరహితమగు పరబ్రహ్మతత్వమును అవధరించగలవు.

అయితే అవన్నీ కూడా సర్వదా నీయొక్క నిర్విషయానంద స్వరూపమున నిర్విషయతత్వమై ప్రదర్శనమగు గాక! నీవు సర్వదా అచ్యుతుడవే సుమా!

❖❖❖

19. ప్రహ్లాద పట్టాభిషేకము

ఆ విధంగా 'జగదద్భుత వస్తుదర్శకుడు' అగు ఆ శ్రీమన్నారాయణుడు వెన్నెలవంటి సుమధుర వాక్కులు పలికాడు. ఉత్తమజ్ఞానోదయమగు మాటలచే ప్రహ్లాదుని కనులు వికసింపజేశాడు. భగవానుని మాటలన్నీ శ్రద్ధగా విన్న ప్రహ్లాదుడు మననవ్యాపారమును అవలంబించినవాడై, వినమ్రుడై ఇట్లు పలికాడు.

ప్రహ్లాదుడు : తండ్రీ! నారాయణా! దీర్ఘకాలంగా, అసంఖ్యాక జన్మలుగా ఏవేవో మానసిక వ్యాపారాలచే డస్సియున్న నేను తమ అనుగ్రహం చేత సర్వ విశేషములను అధిగమించి నిర్విషయమునందు కొద్ది క్షణాలు విశ్రాంతిని పొందాను. స్వస్వరూపమున సుస్థిరుడనై తత్ఫలితంగా "సమాధి – అసమాధి" స్థితులలోని సమస్థితిని, సమబుద్ధిని అవధరించాను. స్వామీ! నిర్మల బుద్ధితో నా అంతరంగమున మీ దర్శనం చేసుకున్నాను. ఈ రోజు ఈ సమయంలో మీరు నా బాహ్యమునందు కూడా దర్శనం ప్రసాదించారు.

హే మహానుభావా! ఆదివిష్ణూ! ఇప్పుడు నేను ఏమై ఉన్నానో చెపుతాను... వినండి.

అనంత నిర్మలాకాశమున ఒకానొక ఆకాశవిభాగము ఎలా వెలయుచున్నదో... అట్లే సర్వవిధ సంకల్పముల నుండి విడివడినట్టి నేను స్వతఃసిద్ధము (That which is Present by Itself) నందు సర్వదా నిత్యవిముక్తుడనై వెలయుచున్నాను. మీ యొక్క ఆజ్ఞ తీసుకొని ఆత్మచింతన యందు ప్రవేశించాను. ఎందుకొరకు? ఏదో శోకమోహముల చేతనో, బీభత్సవిషయములచే ఏర్పడిన వైరాగ్యం చేతనో, సంసారభయం చేతనో, ఈ శరీరం త్యజించాలనో, సమాధిని ఆశ్రయించ లేదు. స్వస్వరూపం యొక్క దర్శనభాగ్యం కొరకే ఆ చింతనయందు నిమగ్నుడనైనాను. మనస్సు నిర్మల మగుచున్నది. అనేకత్వమంతా తొలగుతూ, క్రమంగా ఏకత్వము నాపట్ల తాండవించుచున్నది. ఒకే వస్తువు వెలయుచున్న చోట శోకమెచ్చట? జన్మలేమిటి? సర్వదా సర్వముగా ఉన్న నాకు స్థితి గాని, విలయము గాని, భయాభయములు గాని ఎక్కడి నుండి వస్తాయి?

హే మహేశ్వరా! సర్వేశ్వరా! ఇప్పుడు నాకు 'ఈ దేహము త్యజించాలి' అనే ఇచ్ఛ కూడా లేదు. ఎందుకంటే, స్వతఃసిద్ధముగా ప్రాప్తించిన పవిత్రేచ్ఛతో వర్తమానంలో ఎందుకంటే, దృశ్య మంతటినీ త్యజించి దీనికి అతీతమైన స్వయంప్రకాశమున సుప్రసిద్ధంగా అవస్థితుడనై ఉన్నాను. "ఇది సంసారము. దీనిని వదిలించుకోవాలి" .. అను పరితాపము అజ్ఞానదశలోనే ఉంటుందిగాని, సుజ్ఞాన దృష్టిని అవధరించిన తరువాత కాదు.

దేహభ్రాంతి - "దేహము ఉంటే దుఃఖం ఉంటుంది. దేహము లేకుంటే గొడవే ఉండదు" అని భావిస్తే అది మూర్ఖత్వమేనని నా ఉద్దేశం. ఎందుకంటే, "ఇది ఉండాలి... ఇది ఉండకూడదు... ఇది సుఖము.. ఇది దుఃఖము" అనురూపంగా కనిపించే ఊగిసలాటంతా చిత్తము యొక్క చాంచల్యమే. ఆ చిత్తము అల్పవిషయములను ఆశ్రయించి ఉండుట చేతనే అట్లు ప్రవర్తిస్తోంది. 'నేను వేరు... తదితరులు లేరు' అనునది ఆత్మబుద్ధి లేనిచోట మాత్రమే ప్రబలుచున్నది. దుర్బలులను సాంసారిక మిథ్యాభ్రాంతులు సమీపిస్తున్నాయి గాని, ప్రాజ్ఞులను అవి సమీపించలేవు.

తండ్రీ! కమలలోచనా! నారాయణా! నేను ఇప్పుడే "నా అంతరంగమున ఉన్న నిత్య సత్యము. వాస్తవము ఏమి?" అని తీవ్రపరిశీలన చేశాను. ఒక చమత్కారమైన విషయం నిస్సందేహమై తెలియవచ్చింది. నీవే నాయందు సర్వదా సత్యమై, నిత్యమె, అఖండమై, అప్రమేయమై వెలయుచున్నావు.

నీవు కాక మరేమీ లేనట్టి నాయందు హేయ – ఉపాధేయములు, త్యాజ్య – గ్రాహ్యములు (కలిగి ఉండవలసినవి – త్యజించవలసినవి) అంటూ నాకేమీ కనిపించటంలేదు. ఇక 'సత్ – అసత్' రూపమున ఉత్పన్నమైన ఈ జగత్తు అంటారా? ఇది ఆత్మ చైతన్యము యొక్క అభాస లేక ప్రతిబింబ భావన మాత్రమే. స్వామీ! నేను ఇప్పుడే స్వస్వరూపము యొక్క సర్వవ్యాప్తిని గ్రహించాను. స్వభావవశం చేతనే దృక్–దృశ్య విచారణ చేసి, అందుకు ఫలితంగా స్వయంగా పరమాత్మ స్వరూపుడ నయ్యాను. భావ, అభావ విముక్తుడనై సమాధిని ఆశ్రయించాను. ఇప్పుడు మీ ఆజ్ఞానుసారం ఈ స్థితిని పొందాను.

స్వస్వరూపమున విశ్రమిస్తూనే, మీరు ఆజ్ఞాపిస్తున్నది నిర్వర్తించటానికి ఇప్పుడు నేను సిద్ధంగా ఉన్నాను. హే పుండరీకాక్షా! శాస్త్రములు చెప్పియున్న విధి, విధానములతో మిమ్ములను ఇప్పుడు పూజిస్తాను. నా పూజ దయచేసి స్వీకరించండి.

❖

ఎవ్వని బాహ్యాభ్యంతరములందైతే అసంఖ్యాక జగత్తులు ఉన్నాయో అట్టి భువనేశ్వరుడగు నారాయణుని ప్రహ్లాదుడు మంత్ర – క్రియ – స్తోత్రాదులచే పూజించాడు. అప్పటికప్పుడు శ్రీమన్నారాయణుని సమక్షంలో ప్రహ్లాదుడు సింహాసనాన్ని అధిరోహించాడు. దేవతలు ఆ పట్టాభిషేక మహోత్సవానికి విచ్చేసి ప్రహ్లాదుని భక్తి విశేషాలు శ్లాఘించారు. మహోత్సవానంతరం నారాయణుడు ప్రహ్లాదుని ఉద్దేశించి ఇట్లు పలికారు.

శ్రీమన్నారాయణుడు : ప్రియ ప్రహ్లాదా! సమదర్శనము చేయు బుద్ధితో, ఇష్ట – అనిష్ట ఫలములను త్యజించి, విషయానురాగములు గానీ, భయక్రోధములు గానీ లేనివాడవై రాజ్యపాలన చేసెదవు

గాక! సర్వోత్తమము, ఆనందమయము అగు అద్వితీయ దివ్యపదమును పొందినప్పటికీ నీకు విధించబడిన ఈ రాజ్యపాలన నిర్లక్ష్యము చేయకుండెదవు గాక! నీ తండ్రి, పినతండ్రుల వలె స్వర్గమర్త్య లోకాలలో ఉద్వేగములు కలిగించకుండెదవు గాక! ప్రజానుగ్రహము, శత్రునిగ్రహము మొదలైన అవశ్య కర్తవ్యములు ప్రాప్తించినప్పుడు దేశ – కాల – క్రియల ఔచిత్యమును దృష్టిలో పెట్టుకొని, సేవాభావంతో భగవత్ భక్తి, సమర్పణ భావములతో నిర్వర్తించు. రాగ రహితమైన బుద్ధి నిన్ను సర్వదా ఆశ్రయించి ఉండును గాక!

ప్రహ్లాదుడు : స్వామీ! నాకు దిక్కు, మార్గదర్శకులు, సద్గురువులు మీరే. మీ కరుణ చేతనే నేను మహత్తరమైన ఆత్మతత్త్వమును దర్శించి పునీతుడనైనాను. తమ వాక్యములు నాకు మరల మరల ప్రసాదించవలసినదిగా నా విన్నపము. ఈ సంసారము సర్వదా నన్ను ఆక్రమించకుండేది ఎట్లా?

శ్రీమన్నారాయణుడు : మమత్వమును పరిత్యజించి సమభావముతో నీ విధ్యుక్తమైనది నిర్వర్తించావా ... ఇక ఈ విషయములు నిన్ను ఏమాత్రం స్పృశించలేవు.

అయినా నీకు పెద్దగా ఏం చెప్పాలి? ఈ సంసారము యొక్క గతినంతా చక్కగా గ్రహించియే ఉన్నావు కదా! అత్యుత్తమమైన బ్రహ్మపదమును పొందియే ఉన్నావు. ఇక నీకు క్రొత్తగా చేయవలసిన ఉపదేశమేమీ లేదు. విషయాసక్తి గాని, భయక్రోధములుగాని లేనట్టి నిన్ను, నీ పాలనలోని ప్రజలను దుఃఖ దుర్గంధములు వేధించలేవు. ఇకనుండి అసుర స్త్రీలు నిరంతరం తమ మంగళ సూత్రముల గురించి భయపడుతూ ఉండవలసిన పనేమీ లేదు. దేవదానవుల సఖ్యతచే జగత్తులు ప్రశాంతమయంగా ఉండగలవు. నీ ఉనికిచే సర్వజనులూ ఆనందముగా జీవించగలరు. గాఢమగు అజ్ఞానాంధకారాన్ని నిరసించిన నీవు ఇట్లే సర్వదా స్వప్రకాశమానమగు బ్రహ్మాత్మభావమున వెలుగొందుము. శత్రువులగు కామ, క్రోధాదులను దగ్గిరకు రానీయకుండా, బాహ్యమున రాజ్యలక్ష్మిని, అంతరమున శాంతి మొదలైన గుణములతోకూడిన "ఆత్మ – స్వారాజ్యలక్ష్మి" ని ఏలుకో! విజయోస్తు... దిగ్విజయోస్తు!

ఇట్లు పలికి, సర్వేశ్వరుడగు నారాయణుడు యథాస్థానమగు క్షీరసాగరం ప్రవేశించాడు. ప్రహ్లాదుడు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికాడు.

❖❖❖

20. సమీక్ష

శ్రీ రామచంద్రుడు : హే భగవాన్! సర్వధర్మజ్ఞా! శ్రీ వసిష్ఠ మహర్షీ! అత్యంత శుద్ధములగు ప్రహ్లాద కథనమునకు సంబంధించిన వివరణచే నేను ఎంతో తృప్తి పొందాను. చంద్రునిలోని ఓషధులవలె మీ ప్రవచనమంతా నన్ను ఎంతో ఆహ్లాదపరిచింది. పరమ పవిత్రములగు మీ వాక్యములు వినినంత మాత్రం చేతనే గొప్పసుఖమును పొందాను.

అయితే నాదొక చిన్న సందేహం. మీరు ఇంతఃపూర్వం "పురుష ప్రయత్నము వలననే సర్వము ప్రాప్తమై, సుసంపన్నమౌతాయి" అని చెప్పియున్నారు కదా!

మరి ప్రహ్లాదుడు విష్ణుభగవానుని సహాయం లేకుండానే తన స్వకీయ ప్రయత్నమాత్రం చేతనే ఎందుకు ప్రబోధం పొందలేదు? విష్ణువే ప్రత్యక్షమై మార్గం చూపుతూ ప్రబోధం ప్రసాదించారు కదా? అట్టి అగత్యం ఎందుకు ఏర్పడింది?

శ్రీ వసిష్ఠ మహర్షి : నాయనా! రామా! మహాత్ముడగు ఆ ప్రహ్లాదుడు ఏదైతే పొందాడో అదంతా 'స్వీయపౌరుషబలం' చేతనే పొందాడుగానీ, మరింక దేనిచేతనో కాదు.

మరొక విషయం! 'నారాయణుడు' అనగా ఎవరు? ...ఒక వ్యక్తియా? ...కానే కాదు. నువ్వులు – నూనె వలె, పూలు – వాసన వలె, రంగులు – చిత్ర పటమువలె, ఆత్మయు – నారాయణుడు అభిన్నులు. తటాకము – జలములాగా జనార్ధనుడు – ఆత్మ ఈ రెండూ పర్యాయ పదములే నని గ్రహించు. విష్ణువే ఆత్మ. సర్వజీవుల యొక్క , ఈ జగత్తు యొక్క ఆత్మయే విష్ణువు.

ఆ ఆత్మయే తన పరమశక్తి వలన 'ప్రహ్లాదుడు' అను ఆత్మను విష్ణుభక్తునిగా ఒనర్చింది. అనగా, ప్రహ్లాదుడు ఆత్మ వలననే ప్రబోధం పొందాడు. అంతరంగ నిత్య స్వస్వరూపమగు ఆతడు స్వయముగా విచారణపరుడై, క్రమంగా పరమోత్కృష్టమైన స్వస్వరూప జ్ఞానం పొందాడు.

ఒక సమయంలో ఆత్మ స్వయంగా ప్రబోధమొందుచున్నది. మరొకప్పుడు భగవంతుడు, భక్తసులభుడు అగు విష్ణుని ప్రబోధము పొందుతోంది.

అయితే ఒక్క మాట. ఒకడు సుదీర్ఘకాలం పూజ – ధ్యానాది అనేక కార్యక్రమములు నిర్వర్తించవచ్చు గాక! విచారణహీనుడైతే మాత్రం ఆ బ్రహ్మదేవుడైనా సరే, జ్ఞానమును కలిగించజాలడు. కనుక 'పురుష ప్రయత్నముచే కలుగు ఆత్మవిచారణ'యే స్వస్వరూప సాక్షాత్కారమునకు ముఖ్యమైన ఉపాయమని అందరూ గమనించెదరుగాక!

పురుష ప్రయత్నము -

శ్రీరాముడు : మరి వరము ప్రసాదించటం మొదలైన వాటి మాట ఏమిటి?

శ్రీ వసిష్ఠ మహర్షి : అవన్నీ మధ్యేమార్గ ఉపాయములు మాత్రమే. అందుచేత నీవు ముఖ్య ఉపాయమైనట్టి 'ఆత్మవిచారణను అవలంబించుట'ను తప్పక ఆశ్రయించు. కొంచెము శ్రమించి అయినా సరే, పంచేంద్రియములను వశపరచుకో. సర్వవిధములా 'ఆత్మవిచారణ' అనేది అభ్యాసం చేయి. ఒక్కటి సర్వదా గుర్తు పెట్టుకో ... ఎవరెచ్చట ఏది పొందుచున్నప్పటికీ, అదంతా వారియొక్క పురుష ప్రయత్నఫలమేగానీ, మరింకెవ్వరో ఎక్కడినుండో ఇచ్చింది కాదు.

అందుచేత నీవు పురుష ప్రయత్నమును ఎప్పటికప్పుడు అవలంబించి, ఈ ఇంద్రియములను దాటివేయి. ఈ ఇంద్రియములకు ఎదురుగా ఉండి కనబడుచున్న దృశ్యరూప సంసార సముద్రమును దాటి, దాని కావల ఉన్న పరమపదమును పొందుము.

శ్రీరాముడు : అయితే జనార్ధనుడు ప్రహ్లాదునకు ప్రత్యక్షమై మార్గదర్శకము ప్రసాదించారు కదా! ఆయన దయచేతనే ప్రహ్లాదుడు ఆత్మదర్శనం చేయగలిగాడు కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : పురుష ప్రయత్నం లేకుండానే జనార్ధనుడు కనిపించగలిగితే, యిక పశు పక్షాదులకు కూడా ఆత్మదర్శనము లభిస్తూ ఉండేదే.

ఎంతటి ఉత్తమ గురువైనా ప్రయత్నహీనుడైన శిష్యునకు తత్త్వబోధ చేయగలుగుతాడా? స్వస్వరూపాత్మానుభవం కలుగజేయగలడా? లేదు. ఏ పురుషప్రయత్నము చేయని అజ్ఞానిని కూడా గురువే కనుక ఉద్ధరించగలిగితే, దాని అర్థం ఆ గురువు తనకు ఇష్టమైతే ఒక ఎద్దుకో, ఒక లొట్టి పిట్టకో, మరొక తన ఇష్టమైన జీవునకో ఆత్మోద్ధరణ గావించేవాడే. కానీ అది అట్లా సంభవించదు. ముఖ్యంగా, ఒకటి గమనించాలి. ఆత్మ సామ్రాజ్యంలో తదితరుల వలన గాని, గురువు వలన గాని, ధనము వలన గాని మహత్పదము లభించదు. మరింక?

ఏ విధమైన ప్రయత్నం చేసైనా సరే... ఈ మనస్సును వశపరచుకొనగలిగితే చాలు. తనంతట తానే ఈ జీవుడు మహత్పదమును పొందవచ్చు. ఒకడు వైరాగ్యమును అవలంబించి, అభ్యాసవశంగా ఈ ఇంద్రియ సర్పములను స్వాధీన మొనర్చుకున్నాడా, ఇక ఆపై ఆతనికి ఈ మూడు లోకములలో పొందవలసినదేమీ ఉండదు. అందుకు శాస్త్రములు, గురువులు సహకారం అందించటానికి సర్వదా సిద్ధంగా ఉన్నాయి.

అందుచేత రామా! నీవు ఆత్మ ద్వారా ఆత్మను ఆరాధించుము, దర్శించుము. ఆ తరువాత ఇక ఆత్మయందే వెలయుము. అందుకు చేసే ప్రయత్నంలో శాస్త్రములు, గురువుల అనుభవం, మహనీయుల చరిత్రలు నీకు చక్కగా ఉపకరించగలవు.

భక్తి నుండి జ్ఞానము - అయితే, కొందరు శాస్త్రములచే అందింపబడుచున్న స్వస్వరూపమునకు సంబంధించిన సమాచారాన్ని వింటున్నా కూడా, 'అవగాహన – దృష్టి – కర్మ' ల దృష్ట్యా, తమ బుద్ధిచే అప్పటికప్పుడే స్వీకరించలేకపోతున్నారు. ఎందుచేత? సానపెట్టవలసియున్న కత్తిలాగా వారి బుద్ధి కొంత సునిశితం కావలసి ఉన్నది. అట్టివారు గాలిచే ఎగురకొట్టబడిన ఎండుగడ్డిపరక లాగా ఈ సంసారఎడారిలో పచార్లు చేస్తున్నారు. అట్టి వారి సంసారాక్రందనలు వినిన సత్యద్రష్టలగు జ్ఞానులు అట్టి సంసార జీవులను సత్పథమున పెట్టి సముద్ధరించటానికి, నిష్కల్మష హృదయులుగా జేయటానికి 'విష్ణుభక్తి' ని కల్పించారు. అట్టి భక్తిని ఆశ్రయించువారు క్రమంగా చిత్తశుద్ధిని పొంది, ఈ సంసారాసక్తతనుండి విడిపడినవారగుచున్నారు. భక్తిచే విశుద్ధమైన మనస్సు లభిస్తోంది. విశుద్ధమైన మనస్సుచే ఆత్మవస్తు సందర్శనం ప్రాప్తించుచున్నది.

అందుకే భక్తి యొక్క అభ్యాసము (ప్రయత్నము) – వైరాగ్యము (రాగరాహిత్యము) – ఈ రెండూ ఎల్లప్పుడూ కాపాడుకోవాలి – అని చెప్పబడుతోంది.

సర్వతత్త్వ స్వరూపుడు, సర్వజీవస్వరూపుడు అగు సర్వేశ్వరుని ప్రేమించుటయే భక్తి కదా! భక్తిచే జ్ఞానము ప్రజ్జ్వరిల్లుతోంది. కాని కొందరు భగవంతుని పట్ల భక్తిని నిలుపుకోలేకపోతున్నారు. అనగా, అనేక విషయవాసనలు, దృశ్య సంపర్కములు, కలిగియుండుటచే బుద్ధి యందు ఏకాగ్రత, నిర్మలత్వము కొరవడి ఉంటోంది. అట్టి జీవుల కొరకు "పూజించుట – పూజింపబడుచున్నది (పూజ్య – పూజకములు)" అనునవి గౌణముగా (at lower stage) కల్పించబడ్డాయి.

అయితే ఇంద్రియములు వశం కాకపోయినంత కాలం ఈ జీవునకు 'ఉత్తమదృష్టి' లభించదు. పూజలు మొదలైనవి 'ఇంద్రియాలను వశపరచుకొనుట' అను మార్గంలో ఏర్పరచబడిన ఉపాయాలు మాత్రమే. సర్వపూజలయొక్క అంతిమ ప్రయోజనము ఈ జీవుడు ఇంద్రియ లోలత్వమును జయించి, తానే వాటిని వశం చేసుకోవటం. ఏ జీవుడైతే ఈ ఇంద్రియములకు వశమగుచున్నాడో, అట్టివాడు ఈ సంసారారణ్యంలో అవిశ్రాంతంగా సుఖదుఃఖ బద్ధుడగుచున్నాడు. ఒకటి తరువాత మరొకటిగా ఉచ్ఛ – నీచ జన్మ పరంపరలను పొందుతూనే ఉన్నాడు. అందుచేత 'పూజల యొక్క ప్రయోజనము ఇంద్రియములను వశం చేసుకోవటమే' అని మరొకసారి సర్వజనులకూ గుర్తు చేస్తున్నాను. 'విచారణ – ఇంద్రియముల ఉపశమము' ల కొరకై ఒక్కసారే ఉపక్రమించాలి. ఈ రెండూ లేకపోతే హరి లభించడు. ఆ రెండూ లేనివాడిని హరి కూడా కాపాడలేడు.

అందుచే రామా! నీవు నీ చిత్తము 'విచారణ – ఉపశమనము' లను బాగా ఆశ్రయించునట్లు, ఇక అప్పటి నూతన చిత్తముతో ఆత్మను ఆరాధించు. అప్పుడు తప్పక ఆత్మజ్ఞానము, ఆత్మ స్థితి సిద్ధించ గలవు. ఆ రెండూ లేనప్పుడు మానవుని చిత్తమునకూ, గాడిద చిత్తమునకూ భేదమేమున్నది? ఇంకొక విషయం. నీవు కేశవాదులను ఎంతగా ప్రార్థిస్తావో, అంతకన్నా ఎక్కువగా ముందు నీ చిత్తమును ప్రార్థించు.

"ఓ చిత్తమా! నీవు తుచ్ఛమైన ఈగలవలె క్రుళ్ళిన పదార్థముల వంటి ఈ నశ్వర ఇంద్రియ అనుభవమునే ఎందుకు ఆశ్రయించుచున్నావమ్మా? ఆ ప్రక్కనే అమృత కలశం ఉంటే, అది వదలిపెట్టి ఈ ఇంద్రియ మార్గములో ఉన్న దుర్వాసనలతోకూడిన మాంసము వంటి విషయాలను ఆశ్రయించి 'చాలు ... చాలు' అనుకుంటున్నావా? ఎదురుగా 'ఆత్మ' అనే ఉత్తమ పదార్థం ఉండగా అనర్థములను, సంసార బంధములను, దృశ్యపదార్థజాలమును ఎందుకు ఆశ్రయించాలి చెప్పు?" అని క్రమక్రమంగా ఈ నీ చిత్తమునకు బోధ చేయి. ఆత్మను ప్రాప్తింపజేయగల ఉత్తమ ప్రయత్నములందు నియమించు.

❖

సర్వస్యైవ జనస్యాస్య విష్ణురభ్యన్తరే స్థితః
తం పరిత్యజ్య యే యాన్తి బహిర్విష్ణుం నరాధమాః. (శ్లో 26, సర్గ 43)

ఓ రామచంద్రా! అసలు 'విష్ణువు' ఎక్కడున్నాడు? ఆతడు సర్వజనుల అభ్యంతరమున (అంతరంగమున) వెలయుచున్నాడు. అట్టి అంతరంగ విష్ణువును త్యజించి బహిర్ విష్ణువును సేవించే విషయం అత్యంతికము (Finest) కాదు సుమా!

హృదయ గుహయందు వెలయుచున్న సనాతన చైతన్యతత్త్వమే ఆత్మయొక్క ముఖ్య శరీరం. అదే నారాయణుని ముఖ్య స్వరూపం, నివాస స్థానం కూడా. ఇక, ఈ శంఖ–చక్ర–గదాధర రూపం అంటావా, ఇది మాయచే కల్పించబడినదే! ముఖ్య విషయం విడచి, గౌణము (అముఖ్యము, అప్రధానము, తత్‌లక్షణ మాత్రము, గుణసంబంధమైనది)ను మాత్రమే ఆశ్రయించేవాడు స్వల్పాహారం కోసం అమృతమును ఏమరచుచున్నవాడే అవుతాడు. ఆతడు మహత్తరమును విడచి స్వల్పమునకై

అఙ్గులు చాచుచున్నట్లే అవుతుంది. అందుచేత రఘునందనా! ఆత్మ వివేకమే అన్నిటికన్నా ఉత్తమమైనది. అదియే పరమ లక్ష్యమైయున్నది. అన్ని ప్రయత్నములయొక్క ఉత్తమ ప్రయోజనం అదే. ఆత్మోపాసనయే విష్ణుభక్తియొక్క అర్థము-విధి-విధానము కూడా! "ఈ కనబడే సర్వ దేహాలు-నాతోసహా-ఆత్మ స్వరూపులే" - అనునదే విష్ణుభక్తి యొక్క పూర్ణ లేఖ్యాంశము.

బాహ్య మూర్తిపూజ - అయితే కొందరు 'ఆత్మ వివేకము' విషయమై సరిగా పట్టించుకోవటం లేదు. మోహమగ్నమగు చిత్తమునకు వశులై, సుందరమగు ఆత్మతత్త్వమువైపుగా దృష్టి సారించలేక పోవుచున్నారు. కారణం? వారి వారి చంచల చిత్తమే. అట్టి చంచలచిత్తుడు అభ్యాసబలం కొరకై శంఖ-చక్ర-గదాధారియగు విష్ణుమూర్తిని అర్చించటం సాధకులసౌకర్యము కొరకై విజ్ఞులు, శాస్త్రములు పరికల్పిస్తున్నాయి. అది వృథా అని నా ఉద్దేశం కాదు సుమా! అట్లు బాహ్యమూర్తిని అర్చించుచూరాగా, తపస్సు - వైరాగ్యములు బలపడుచుండగా... క్రమంగా చిత్తము నిర్మలమగుచున్నది. అట్టి నిత్య పూజ యొక్క ప్రయోజనంగా ఉత్తమమైన వివేకం ఉదయిస్తుంది. వివేకము క్రమంగా చిత్తమును దోషరహితం, పవిత్రం చేస్తుంది. బీజమే కొన్నాళ్లకి పుష్పలత అయి, ఆ తరువాత పుష్ప - ఫలాదుల సౌరభాన్ని వెదజల్లుతుంది కదా! శాస్త్రములు ప్రతిపాదిస్తున్న హరిపూజాఫలముగా ఆత్మ తనంతట తాను తనను పొందుచున్నది.

అభ్యాసవశం, ఆకస్మికం - ఓ రఘువీరా! ఒకానొక ప్రతిభావంతుడు విష్ణువు నుండి (అనగా సాకార బ్రహ్మం నుండి) ఒక వరం పొందాడనుకో... ఆ ఫలించిన వరం కూడా అభ్యాస ప్రయోజనమే కదా! అంతేగాని ఆకస్మికంగా... ప్రయత్నమనేదే ఏమీ లేకుండా (అప్రయత్నంగా) ఎవరికీ ఏదీ లభించదు. అయితే, కొన్ని కొన్ని ప్రయత్నముల యొక్క ఒకానొక ప్రయోజనం మనకు అప్పటికప్పుడే ఎదురుగా కనపడకపోవచ్చు. మరొక సమయంలో ఏర్పడుచున్న ప్రయోజనములను చూస్తున్నప్పుడు, అల్ప దృష్టిగల జనులు ఏదో తెలియని 'అదృష్టము' అనబడు దానికి ఆపాదిస్తున్నారు. "సమగ్ర దృష్టితో ఇదంతా పరిశీలించినప్పుడు "ఏదైనా సరే, పురుషకారము చేతనే పొందబడుచున్నది" అని తప్పక తెలియవచ్చుచున్నది.

మనస్సు, నియామకం - సుఖము - దుఃఖము - మానము - అవమానము, గ్రాహ్యము - త్యాజ్యము, అల్పము - అధికము ఈ విశేషాలన్నీ ఉన్నది మనస్సులోనే. భూమియే సర్వ సంపదలకు ఆకరమై (Abode) ఉన్నట్లు మనస్సు యొక్క నియామకమే (The conditioning of mind) సర్వవ్యవహారములకు ఆధారం. భూమి త్రవ్వే వానికి, కట్టెలు కొట్టేవానికి, సుతీక్ష్ణమైన శాస్త్ర ప్రతిపాదిత విషయాలు పరిశీలించేవానికి - అందరికీ కార్యసిద్ధి కావాలంటే నిగ్రహమే (disciplining the mind) ఉపాయం అవుతోంది. మరింకేదీ ఉపాయమై ఉండలేదు.

మనస్సు, ఉపశమనం -

> **తావజ్జన్మసహస్రాణి భ్రమన్తి భువి మానవాః ।**
> **యావన్నోపశమం యాతి మనోమత్తమహార్ణవః ॥** (శ్లో 37, సర్గ 43)

"మనస్సు" అనే మహాసముద్రం ఉపశమించనంతవరకు జీవుడు వేలకొలదీ జన్మలు ఎత్తుతూ ఈ భూమండలమున పరిభ్రమిస్తూనే ఉంటాడు. ఒకానొకడు బ్రహ్మవిష్ణు రుద్రాదులను చిరకాలం పూజించవచ్చు! వారికి ఆతని పట్ల ఎంతో వాత్సల్యం కలుగవచ్చు గాక! అయినా కూడా, వారు ఆతని సత్ ప్రయత్నం, సదవగాహన లేకుండా "మనోవ్యాధి" అనే ఉపద్రవం నుండి ఆతనిని రక్షించగలరా? లేదు.

దేహవ్యాధికి ఔషధం – చికిత్స ఎవరికి వారే స్వీకరించాలి కదా! అట్లాగే మనోవ్యాధికి చికిత్స ఎవరికి వారే స్వీకరించాలి. ఒకరికొరకై మరొకరు చికిత్స తీసుకోవటం ఎలా కుదురుతుంది? అందుచేత నీకు నీవే విచారణ చేయాలి. అయితే, అట్టి విచారణకు కావలసిన సమాచారం, సందేహ నివృత్తి మొదలైనవి గురువులు, త్రిమూర్త్యాది దేవతలు, శాస్త్రములు తప్పక అందించటం జరుగుతుంది. వస్తువుపై వెలుతురు పడినా, ఆ వస్తువును నీవు కనులు తెరచి చూచినప్పుడు కదా, నీకు తెలియవచ్చేది!

అందుచేత, రాఘవా! నీవు ఇంద్రియములకు, అంతఃకరణమునకు ఎదురుగా (విశేషములుగా) తారసపడే ఈ బాహ్యవిషయములను వదలివేయి. అంతర్స్థితుడవు అగుము. చైతన్య స్వరూపం ఒక్కదానినే చింతించుము. అప్పుడు నీకిక జన్మ-పునర్జన్మల ప్రహసనమంతా మొదలే ఉండదు. సంవేద్యములగుచున్న (ఈ తెలియవచ్చుచున్న) సర్వ బాహ్య అభ్యంతర విషయములనుండి విడివడి "నిరామయము, పరమానందమయము, అనంతము, సన్మాత్రము" అగు చైతన్యాన్నే ఆస్వాదించు.

"నేను సర్వదా శుద్ధ చైతన్యమునే కదా!" అని భావించుచు నిన్ను నీవు గాంచు. నిన్నే సర్వత్రా సర్వముగా దర్శించుచుండుము. సర్వము నీ స్వరూపంగా అభ్యసిస్తూ ఉండు. (మమత్మా సర్వభూతాత్మా – మమసాధర్మ్య మాగతః) అప్పుడు అట్టి చైతన్య తత్త్వమును ఆస్వాదిస్తున్న నీవు, పునరావృత్తి రహితమగు స్థానమును పొందగలవు. అప్పుడు ఈ పునర్జన్మాదులు నీకు ఆపాదించబడవు.

నీ దృష్టిలో నీవు పునర్జన్మరహితుడవై ఉంటావు. సర్వాత్మకుడవై ఆత్మారాముడవై అనుక్షణికంగా ఆత్మసాక్షాత్కారం ఆస్వాదిస్తూ ఉంటావు.

❖❖❖

(పన్నెండవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

పదమూడవ రోజు

VI. మనోదర్పణం

గాధి వృత్తాంతం

1. మాయాదర్శన కుతూహలం

శ్రీవసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! "ఈ సంసారమాయ అంతమయేది ఎట్లా?" – అను ప్రశ్నకు సమాధానం "చిత్తమును జయించుటే" అయి ఉన్నదయ్యా! మరి ఉపాయమంటూ, వేరే ఏమీ లేదు. ఇక మిగతా (తదితర శాస్త్ర-నిర్దేసిత) ఉపాయాలన్నీ చిత్తమును జయించుట కొరకే రచించబడి ఉన్నాయి.

శ్రీరాముడు : హే మహర్షీ! అసలు 'జగత్తు' అనబడే ఈ మాయ ఎట్లా విస్తరిస్తోంది? ఆ వైచిత్ర్యమేమిటి? ఈ జీవునిపట్ల గుదిబండవలె సంప్రాప్తిస్తున్న ఈ 'చిత్తము' అనునది ఎట్లా రూపుదిద్దుకుంటోంది?

శ్రీ వసిష్ఠమహర్షి : చిత్తము అనబడేది ఆత్మస్వరూపుడగు ఈ జీవుని స్వయంకృత చమత్కారమే! నీ ప్రశ్నకు సమాధానంగా 'గాధి' అనే ఒక బ్రాహ్మణ బాలకుని వృత్తాంతం చెపుతాను. శ్రద్ధగా విను.

❖

కోసల దేశంలో ఒకానొకప్పుడు 'గాధి' అనేపేరు గల ఒక బ్రాహ్మణబాలకుడు ఉండేవాడు. ఆ పిల్లవాడు గొప్పగుణశాలి, వేదవేత్త, బుద్ధిమంతుడు, ధర్మమూర్తి కూడా. ఆతని చిత్తము చిన్నప్పటి నుండి విషయములపట్ల విరక్తి కలిగి, ఎంతో శోభిస్తూ ఉండేది. ఉత్తమ భావాలు గల ఆ గాధి ఒక రోజు తన బంధుజనమునందరినీ క్షణంలో త్యజించివేసి, అరణ్యం చేరాడు. అక్కడ 'గిరి' అను పేరు గల ఒక ప్రదేశంలోని ఒక సరోవరం సమీపంగా ఆశ్రమం నిర్మించుకొని ప్రశాంతంగా తపస్సు ప్రారంభించాడు. "పరంధాముడగు విష్ణుమూర్తి యొక్క మహత్తర దర్శనం నాకు లభించును గాక" అను ఏకైక ధ్యేయముతో శ్రద్ధగా తపస్సు కొనసాగించసాగాడు.

ఎనిమిది మాసాలు గడిచాయి. ఆ పిల్లవాడి పట్టుదల, ఏకాగ్రత, భక్తిశ్రద్ధలు చూచి విష్ణుమూర్తి చాలా సంతోషించారు. ఒక సుదినం ఆయన శంఖ చక్ర గదాధారి అయి గాధి ముందు ప్రత్యక్షమైనాడు.

శ్రీవిష్ణుమూర్తి : ఓ ప్రియబాలకా! నీ ఏకాగ్రత, నిర్మలహృదయం చూచి సంతోషించానయ్యా. నీ తపస్సు ఫలించింది. ఇకలే బిడ్డా! ఏమి కావాలో ... కోరుకో.

గాధి : హే మహావిష్ణో! నారాయణా! మీరు అసంఖ్యాక జగత్తులలోని ప్రాణుల హృదయములలో సాక్షిస్వరూపులై ఉంటారు కదా! అట్టి మహత్తర స్వరూపులగు మీకు ఇవే సాష్టాంగ దండప్రణామాలు,

మూడు జగత్తులకు – (స్వర్గ, మర్త్య, పాతాళ జగత్తులకు; జాగ్రత్, స్వప్న, సుషుప్త జగత్తులకు) – సర్వదా ఆధారభూతులగు మీకు పదే పదే నమస్కారం.

హే భగవాన్! నాకొక చిన్నకోరిక ఉన్నది. చిదాకాశము నందు మీ వలన కల్పించబడే ఈ సంసారమాయ యొక్క పూర్వాపరాలు దర్శించాలని నా అభిలాష.

శ్రీవిష్ణుమూర్తి : ఓం! తప్పకుండా, ప్రియగాధీ! నీవు నా మాయను దర్శిస్తావు!... తదనంతరం నా భక్తుడవవటం చేత త్యజిస్తావు కూడా!

❖

ఇట్లు పలికి శ్రీమహావిష్ణువు అంతర్ధానమయ్యాడు. ఆ బాలకుడు జగత్పతిని దర్శించటం చేత పరమప్రీతిని పొందాడు. మనస్సులో శ్రీవారిని దర్శించిన మధురానుభవం నిండియుండగా, క్రమంగా రోజులు గడుపసాగాడు. ఎప్పటి లాగానే తపస్సు, ధ్యానము, స్వాధ్యాయము, అతిథిపూజ నిర్వర్తిస్తూ అదే ఆశ్రమంలో చాలా రోజులు గడిపాడు.

ఒకరోజు ఉషఃకాలం సరోవరంలో స్నానం ఆచరించి ఒడ్డున ఒక చక్కటి చోట పద్మాసనం వేసుకుని కూర్చున్నాడు. ఆతని మనస్సు విష్ణుభగవానునితో కలిగిన సమాగమం, మాయ యొక్క చమత్కారముల గురించి యోచన చేస్తూ ఉన్నది. కొంతసేపైన తరువాత యథాసమయమైన తరువాత మరల స్నానాదులు చేయాలని లేచి సరోవరంలో ప్రవేశించాడు. స్నానమైన తరువాత ఆచమనం చేసి, సంకల్పం చెప్పి "అఘమర్షణ సూక్తం" పఠించసాగాడు.

...అప్పుడు హఠాత్తుగా ఒక చోట యథాలాపంగా ఉచ్చారణ ఆగిపోయింది. తరువాత శ్లోకం గుర్తుకు రాలేదు. గుర్తుచేసుకోనే ప్రయత్నంలో మరొక మంత్రమేదో స్మృతికి వచ్చి, స్ఫురించ సాగింది. ధ్యాస – పరధ్యాసలను సమన్వయించుకుంటూ ఉండగా నీటి మధ్యలో ఏదో దృష్టిని ఆకర్షించింది. అక్కడ అతనికి ఏదో విశేషపరంపరలు కనిపించసాగాయి. అన్నిటినీ మరచి ఇక అటే దృష్టి, శ్రద్ధలను సారించసాగాడు. తన ధ్యాస నీటిమధ్యలో ఉండి ఉండగానే ప్రాణాలు దేహం నుండి బహిష్కరించబడుచున్నట్లు నవ్యానుభూతి పొందసాగాడు. అతని ధ్యాస ఏదో నూతన మార్గంలో ప్రసరించసాగింది. ఆ గాధియొక్క తదనంతరానుభవం ఇట్లా కొనసాగింది.

❖

నిలుచున్నపాటునే గాధి యొక్క ప్రాణాలు శరీరంలోంచి బహిర్గతమైనాయి. శరీరం నేల కూలింది. "అయ్యో! నేను ఎంత ప్రయత్నించినా ఈ దేహం ఉపయోగానికి రావటంలేదే?" – అని ఆ జీవుడు కొద్దిసేపు తచ్చాడుతూ విచారించాడు. పాలిపోయిన ఆ శరీరం యొక్క ముఖం ఎండిపోయిన ఆకులాగా శుష్కమైపోయింది. కళ్ళుమూతలుబడి, బిగదీసుకుపోయాయి. ఎవరో బంధువులు ఆ నిర్జీవ శరీరం అక్కడుండటం గమనించారు. కొద్దిసేపట్లో ఈ వార్త అటూ–ఇటూ పొక్కింది. దగ్గర బంధువులంతా ఎక్కడెక్కడి నుండో వచ్చి అక్కడకు చేరారు. ధూళితో నిండిన ఆ శరీరాన్ని దీనంగా చూస్తూ ఆతని తల్లి నెత్తి – నోరూ బాదుకుంటూ రోదించసాగింది. సోదరీసోదరులు కాళ్ళ దగ్గర

ప్రక్కప్రక్కన కూర్చుని ఏడుస్తూ కళ్ళనీళ్ళు కార్చసాగారు. వారి రోదనధ్వని కొద్దిసేపు బిగ్గరగా, మరికొంతసేపు ఏవేవో అస్పష్ట శబ్దాలతో వినిపించసాగింది. అవయవములు ఒకదానితో మరొకటి ఇంతకాలం కలిసి ఉండి, ఇక చాలునని, వియోగం కొరకు మౌనంగా వేచి ఉన్నట్లు ఉన్నాయి. ప్రాణాలు నోటి నుండి నిష్క్రమించాయి కాబోలు... నోరు తెరచి ఉన్నది. పళ్ళు మిఱమిఱ మెరుస్తూ చూచేవారికి కొంచం భయం కలిగిస్తున్నాయి. చెవులు మౌనంగా రోదనలను వింటూ, "నా పట్ల ఎవరికి ఎంత ప్రేమ ఉన్నదో?" అని గమనిస్తున్నట్లుగా ఉన్నాయి. కాస్త దూరం నుండి చూస్తుంటే, ఏదో నిశ్చలమైన తపస్సులో నిమగ్నమైనట్లుగా ఆ దేహం మౌనంగా, శాంతంగా కనబడుతోంది. "నాయనా, బాబూ! ఎంతపని చేశావు... చెప్పినా వినలేదుకదా! అంతటివాడివి, ఇంతటివాడివి, అట్లా అనేవాడివి, ఇట్లా ఉండేవాడివి, మేం పాపిష్టివాళ్ళం... నిన్ను దక్కించుకోలేకపోయాం" అని చాలాసేపు అరుస్తూ ఉండుటచేత అక్కడి చాలామంది బంధువుల గొంతుకలు జీరబోయాయి. కానీ ఏం లాభం? వాళ్ళు ఏడ్చి ఏం సాధించగలరు? అశుభమగు ఆ 'శవము'ను అక్కడి నుండి తొలగించి దూరంగా నిర్జన ప్రదేశంలో పారవేసిరావలసిందే కదా.

❖

'గాధి' అని ఇంతకాలం సంబోధింపబడుతూ వస్తున్న ఆ దేహి తన భౌతిక దేహము యొక్క గతినంతా గమనిస్తూ ఇక చేసేది లేక మరొక చోటు వెతుక్కుంటూ అక్కడి నుండి బయలుదేరాడు. ఆ మృతాత్మ అరణ్యప్రాంతంలో గల ఒక ఆటవిక కుగ్రామంలో ఒక స్త్రీ గర్భంలో ప్రవేశించింది. అక్కడి గర్భవాసనా వ్యధలచే వ్యాకులపడింది. క్రమంగా నియమితకాలంలో శిశువై జన్మించింది. ఆటవిక జాతి నివసించే ఒక వాటికలో జన్మించిన ఆ బాలుడు 'కటంజుడు' అనే పేరుతో పిలువబడుచూ క్రమంగా 14 ఏళ్ళ బాలుడైనాడు. ఆ పిల్లవాడు అక్కడి పెద్దల మాటలు పెడచెవిని పెట్టుచూ అల్లరి చిల్లరగా తిరుగ ప్రారంభించాడు. కొన్ని వేటకుక్కలను వెంటబెట్టుకుని చుట్టు ప్రక్కల గల అడవులలో సంచరిస్తూ వందలాది మృగములను చంపుతూ కాలం గడుపసాగాడు. మృగముల పచ్చి మాంసమే అక్కడి జనులకు ముఖ్యాహారం.

కొంతకాలం తరువాత అక్కడి శ్వపచ (కుక్క మాంసం తినే ఒకానొక జాతివారి) కన్యను వివాహం చేసుకొన్నాడు. వాళ్ళిద్దరూ అక్కడ చిలక-గోరింకల వలె విహరించసాగారు. వారికి చాలా మంది సంతానం కలిగారు. కొంతకాలానికి దొంగతనం వంటి దుష్ప్రవర్తనల కారణంగా అక్కడివారిచే ఊరి నుండి వెడలగొట్టబడుటచే, ఊరికి దూరంగా ఒక గుడిసె కట్టుకొని ఉండవలసివచ్చింది. ఆతని బుద్ధి పరమ కాఠిన్యంగా, చేతలు బహుక్రూరంగా ఉంటూ ఉండేవి.

❖

కొంత కాలానికి అక్కడ ప్రబలిన ఒక భయంకరవ్యాధి సోకి ఆతని భార్య, పిల్లలు ఒకరొకరుగా మరణించారు. పాపం ఆతడు ఒంటరివాడైపోయాడు. గుంపులోంచి తప్పిపోయిన లేడి లాగా విలవిల్లాడి పోయాడు. ఆతని ఇతఃపూర్వపు హింసాప్రవృత్తిని దృష్టిలో పెట్టుకుని ఊరివారు గాని, తదితర బంధువులు గాని ఊళ్ళోకి రానీయలేదు. ఆతనికి సంసారము పట్ల విశ్వాసం సన్నగిల్లింది.

ఒక మారుమూల ప్రదేశంలో ఒక చోట కూర్చుని చాలా రోజులు రోదించాడు. ఏం చేయాలి మరి? అక్కడి శ్వపచజాతి వారు ఆతనిని దరిజేరనీయరాయె! తన దుష్ట, నీచ చర్యలకు బహిష్కరించారు మరి! కొద్ది రోజుల తరువాత కటంజుడు అక్కడి నుండి లేచాడు. దీర్ఘప్రయాణాలు చేస్తూ, చుట్టుప్రక్కల దేశాలు సందర్శిస్తూ భిక్షాటనంతో కడుపు నింపుకుంటూ కొంతకాలానికి "కీర" అనే దేశం చేరాడు. ఆ దేశానికి ముఖ్య పట్టణమైన కీరనగరం ప్రవేశించాడు.

ఆతడు ఆ విధంగా కీర పట్టణంలో ప్రవేశిస్తూ అక్కడంతా ఎంతో సందడిగా ఉండటం చూచాడు. అక్కడి విశేషాలు తెలిశాయి. ఆ దేశపురాజు ఆ క్రితం రోజే అకస్మాత్తుగా మరణించాడు. దురదృష్టవశాత్తూ చనిపోయిన ఆ రాజుకు సంతానంలేదు. ఆ దేశపు రాజ్యాంగం ప్రకారం ఆ పరిస్థితులలో పట్టపుటేనుగు ఆ దేశపు ఏ పౌరుడి మెడలో పూలదండ అలంకరిస్తే ఆతడే రాజు అవుతాడు. ఆరాజ్యంలోని వివిధ ప్రదేశాల నుండి ప్రజలు తమతమ అదృష్టములను పరీక్షించు కోవటానికి కీర పట్టణానికి తరలివచ్చారు. ఆ రోజు తదితర రాజ్యప్రజలకు (వేరే దేశపు పౌరులకు) పట్టణప్రవేశం నిషేధం. అయితే భిక్షకుడగు కటంజుని విషయం అక్కడి సైనికుల దృష్టికి రానేలేదు. వచ్చి ఉంటే, ఆతనిని అక్కడ ఉండనిచ్చేవారు కాదు.

❖

రాజవీధులన్నీ జన సందోహంతో నిండిపోయాయి. ఎవరికి వారే మెడలను సవరించుకుంటూ దేవుళ్ళకు మొక్కుకోవటం, ఊహలలో విహరించటం చేస్తున్నారు. భిక్షకులంతా ఒక వైపుగా నిలబడి ఈ తతంగమంతా కుతూహలంగా చూస్తూ ఆనందిస్తున్నారు. ఆ భిక్షకులలో ఒక చివరగా బిక్కుబిక్కు మంటూ, అక్కడి తదితర భిక్షకుల అదరింపులు, ఛీదరింపులూ పొందుతూ ఆకలి, విసుగులను దిగమ్రింగుకుంటూ కటంజుడు ఒక మూల నిలబడి చూస్తున్నాడు.

ఇంతలో సర్వాంగసుందరంగా అలంకరించిన పట్టపుటేనుగు ఆ వీధిలోకి రానే వచ్చింది. తమని దాటి ముందుకు పోతున్న పట్టపు ఏనుగును చూస్తూ, జనులు ఉస్సురనుకుంటూ, అక్కడి సైనికులకు వెరచి, మాట పైకి రాకుండా, నిరుత్సాహంగా చూస్తున్నారు.

ఇంతలో ఆ ఏనుగు భిక్షకులు నిలుచున్నచోటికి వచ్చింది. సరాసరి కటంజుని మెడలో పూల మాల వేసింది. కటంజుడు ఆ హటాత్సంఘటనకు విస్తుపోయాడు. ఇంకా ఆశ్చర్యం నుండి తేరు కోకుండానే, ఒక్కసారి దుందుభులు మ్రోగాయి. సైనికులు ఆ భిక్షకుని పేరు అడిగి తెలుసుకున్నారు. "మన క్రొత్త మహారాజు కటంజులవారికి విజయోస్తు, దిగ్విజయమస్తు!" – అని బిగ్గరగా కేకలు మిన్నుముట్టాయి. పరిచారికలు చేతిలో పూదండతో ఆతనిని సమీపించారు. వారు వివిధ గంధ లేపనములతో, ఆభరణములతో ఆతనిని అలంకరించారు. ప్రజలు చుట్టుముట్టి జేజేలు పలుకు చుండగా కటంజుని రాజసభకు తీసుకొనిపోయి, రాజసింహాసనంపై కూర్చోబెట్టారు. బ్రహ్మాండంగా ఐదు రోజులు పట్టాభిషేకమహోత్సవం జరిగింది. క్రొత్తగా వచ్చిన రాజుకు "గవలమహారాజు" అని నూతన నామధేయం ప్రతిక్షేపించారు.

ఇకప్పటి నుండి ఆతడు కీరపుర స్త్రీలతో విరాజిల్లుతూ, చింతావిషాదరహితుడై మంత్రులతో కూడి రాజ్యపాలన చేయసాగాడు. కొద్ది నెలలో ఆతని ఇచ్ఛను అనుసరించి అనేక రాజశాసనాలు అమలుకు వచ్చాయి. కార్యదక్షులగు ప్రతినిధులు రాజ్యంలోని వివిధ ప్రదేశముల నుండి రాజ శాసనములు అమలుపరుస్తుండగా, ఆతడు దక్షతతో రాజ్యం ఏలుచూ రోజులు, నెలలు, సంవత్సరాలు గడపసాగాడు. ఆతడు "గవలమహారాజు" అనే నూతన నామధేయంతో అక్కడ ప్రసిద్ధికెక్కాడు. ప్రజలందరూ ఆ మహారాజును ఎంతగానో ప్రస్తుతించుచూ ఉండేవారు.

❖❖❖

2. శాస్త్ర విరుద్ధం

గవలమహారాజు (కటంజుదు) యొక్క పరిపాలనాదక్షతచే ప్రజలు శోక - భయ - క్లేశ రహితులై సుఖంగా కాలంగడుపుచుండేవారు. ఆ సమయంలో ఆతడు తన ఇంతఃపూర్వపు ఆటవిక జీవితమంతా పూర్తిగా విస్మరించాడు. నిరంతరం స్తవనములతో, మంగళగీతములతో ఆనందిస్తూ, మత్తులో ఉన్నవానివలె రోజులు గడపసాగాడు. ఆ విధంగా ఎనిమిదేండ్లు గడచిపోయాయి. అతని సంస్కారమే మారిపోయింది. దయ - దాక్షిణ్యము - దానము - న్యాయము వంటి ఆర్యగుణములతో ఆతడు ప్రజలకు ప్రియుడైనాడు.

ఒకరోజు గవలునకు ఎందుకో తన మునుపటి రోజులు గుర్తుకు వచ్చాయి. "ఈ రాజ్యపాలన, ఈ సంరంభములు బాగానే ఉన్నాయి గాని, నా మునుపటి ఏకాంత జీవితం ఇప్పుడు లభించుటయే లేదే? పూర్వం ఆటవిక - శ్వపచజాతిలో ఉన్నప్పుడు గోచిపెట్టుకొని వేటాడుతూ ఉంటే ఎంత బాగుండేది! ...రహస్యంగానైనా సరే, ఒక్కరోజు ఈ రాజ్యపాలన ప్రక్కకు పెట్టి, నా ఇంతఃపూర్వపు రూపంలో దగ్గిరగా ఉన్న అడవిలో సంచరించి రావాలి" అని అనుకున్నాడు. ఆలోచన వచ్చినదే తడువుగా, ఆ సాయంకాలం అంతఃపురం త్వరగా చేరాడు. ఏకాంత మందిరంలో ప్రవేశించాడు. తన అలంకరణములన్నీ ఊడదీసి ఆటవిక రూపంలో గోచిపెట్టుకొన్నాడు. "అమ్మయ్యా! హాయిగా ఉన్నది. ఈ కృత్రిమమైన అలంకారాలు మనిషికి ఎందుకు?" - అని అనుకుంటూ, ఒకరిద్దరు మంత్రులకు - రాజుకు మాత్రమే తెలిసి ఉండే రహస్యమార్గం గుండా అంతఃపురం నుండి బైటపడ్డాడు. ఆతడు ఇప్పుడు అచ్చం ఇతః పూర్వపు కటంజునిలాగానే ఉన్నాడు. అయితే, ఆతని చిత్తము ఇప్పుడు తన ప్రాచీన క్రౌర్యమును త్యజించి ఔదార్యముతో నిండి ఉన్నది.

క్రమంగా కీరపట్టణం వదలి, అడవుల వైపుగా వెళ్ళే మార్గంలో అడుగులు వేస్తూ బయలు దేరాడు. కొద్దిసేపు నడచిన తరువాత ఆతనికి ఒకచోట అత్యంత సుపరిచితమైన ఆటవికుల డప్పుల - బూరల శబ్దం వినిపించింది. "ఇదేమిటి, మా శ్వపచులు ఉపయోగించే బూరలశబ్దాలు వినబడు తున్నాయి?" అని అనుకుంటూ అటువైపుగా నడిచాడు. ఆశ్చర్యం! వాళ్ళు ఎవరో కాదు! తన శ్వపచ జాతి బంధువులే. వాళ్ళ డప్పుల శబ్దాలకు పూర్వసంస్కార ప్రభావం చేత ఒక్కసారి పైకి ఎగిరిగంతులు

వేయసాగాడు. వాళ్ళతో బాటే లయగా నృత్యం చేయ ప్రారంభించాడు. ఆ శ్వపచుల నాయకుడు కటంజుని గుర్తుపట్టేశాడు.

శ్వపచులనాయకుడు : ఓరి కటంజుడా! నువ్వట్రా! ఈ కీరదేశం ఎప్పుడొచ్చావు? ఇంతకాలం ఏమైనావు! చాలా రోజులకు కనిపించావే! ఇప్పుడు నాజూకుగా తయ్యారయ్యావు! ఇదివరకు మొరటుగా అందరిని హింసిస్తూ హంగామా చేసేవాడివి కదా! ఇంతకాలం ఎక్కడో ఏ అడవిలోనో నీవు ఏ మృగానికో ఆహారమైపోయావని అనుకున్నాం. ఇక్కడేం చేస్తున్నావు? ఇక్కడి రాజు కళలను ఆదరిస్తాడని, మన తప్పెట నృత్యం చూచి బట్టలు, డబ్బు ఇస్తాడని విని మేము వచ్చాం. ఇక్కడ ఏంచేస్తున్నావు? ఇక్కడి వాళ్ళు ఎవరైనా తెలుసా?

ఆ శ్వపచులనాయకుడు మాట్లాడుతూనే ఉన్నాడు. కటంజునకు నోట మాట రాలేదు. ఇంకేం మాట్లాడకుండా వెనుకకు తిరిగి కీరపట్టణం వైపు పరుగు లంకించుకున్నాడు. అక్కడి శ్వపచజాతివాళ్ళు "వీడికి ఇంకా బుద్ధిరాలా?" అని అనుకుంటూ తమ తప్పెట తాళనృత్యం కొనసాగించారు.

కటంజుడు ఎవ్వరికంటా పడకుండా అంతఃపురం చేరి మరల రాజవస్త్రాలు ధరించాడు. "ఇంకా నయం! కీరరాజ్య ప్రజలకి నేను వేరే దేశపు ఆటవికులలోని శ్వపచజాతివాడినని తెలియలేదు. బ్రతికిపోయా" – అని అనుకున్నాడు. అక్కడి రాజ్యాంగ విధానం అతడు ఎఱిగియే ఉన్నాడు.

❖

మరొకరెండు రోజులు గడిచాయి. రెండో రోజు సాయంకాలం రాజసభాప్రాంగణంలోని వినోద భవనానికి రాజు ఏనుగుపై తరలి వచ్చాడు. ప్రజల వినోదం కొరకు మంత్రులు ఆ రోజు శ్వపచుల తప్పెటనృత్యం ఏర్పరచారు. రాజు ఎప్పటిలాగానే ఆ సభకు వచ్చి సింహాసనం వైపుగా అడుగులు వేస్తూ ఉన్నాడు. శ్వపచజాతి నాయకుడు, తదితర శ్వపచజాతి వారు కటంజుని గుర్తుపట్టారు. "అయ్య బాబోయ్! మన కటంజుడే ఇక్కడి రాజు!" అని ఆశ్చర్యపోయారు. తమలో తాము గుసగుసలాడటం ప్రారంభించారు. ఇదంతా ఏమాత్రం తెలియని రాజు ఎప్పటిలాగానే పోయి రాజ సింహాసనంపై ఆసీనుడైనాడు. శ్వపచజాతినాయకుడు ఒక మంత్రిదగ్గిరకు వెళ్ళి "అయ్యా! ఆ రాజు ఎవరో కాదు. మా ఆటవిక శ్వపచజాతి వాడే. మా ఊరి నుండి ఎనిమిదేళ్ళ క్రితం వెళ్ళిపోయాడు. ఇక్కడ రాజయ్యాడని మాకు తెలియనే తెలియదు" అని చెప్పుకుంటూపోతున్నాడు. అది వింటున్న కీరరాజ్యపు మంత్రి అవాక్కయ్యాడు.

ఏమిటీ? మా గవలమహారాజు మా దేశపు పౌరుడు కాదా? పైగా ఆతడు ఒక ఆటవికుడా? అందులోనూ, కుక్కమాంసం తినే ఆచారంగల శ్వపచజాతి వాడా? ఎంత ఘోరం, అరిష్టం జరిగి పోయింది! కీరదేశపు రాజ్యాంగం ప్రకారం ఇది చాలా అరిష్టముతో కూడిన దోషమైన విషయమే? ఇప్పుడేంచేయాలి?

తప్పెట నృత్యం జరుగుతుండగానే ఈ విషయం తదితర మంత్రులకు తెలిసిపోయింది. క్రమంగా గుసగుసలు బయలుదేరాయి. వినోదసమయం అయిపోయేసరికి విషయమంతా చాలా

మందికి తెలిసిపోయింది. రాజు అంతఃపురానికి వెళుతూ జనులలో అనేకులు విషణ్ణంగా ఉండటం గమనించాడు కూడా. అయితే, అప్పటికీ ఆతనికి కారణం తెలియదు. కనుక పట్టించుకోలేదు. కానీ ఆ తరువాత ఆతనికి జరిగిందేమిటో తెలిసింది. క్రమంగా 'ఒక దూరదేశపు శ్వపచజాతివాడు ఇంతకాలం రాజ్యం ఏలాడు' అనే వార్త కీరదేశమంతా పాకింది. పురవాసులలో అనేకమంది దేశభక్తికలవారు దుఃఖితులైయ్యారు. సేవకులు ఆతని ఆజ్ఞలను తృణీకరించసాగారు. ఆతనిని "క్రూరకర్మలు చేసే ఒక అమంగళుడు" గా ప్రజలు చూడసాగారు. రాజసభకు ప్రజలు రావటం మానివేశారు. సేవకజనులలో చాలామంది అంతఃపురానికి రావటంలేదు. ఆతడు చాలాసార్లు పలకరించినా మంత్రులు తిరిగి పలుకుటయేలేదు. "ఏమిటిది? క్రమంగా నేను చిల్లిగవ్వ కూడా లేని దూరదేశపు బాటసారిగా అయిపోతున్నానా?" – అని వ్యధ చెందసాగాడు.

❖

నాలుగురోజులు గడిచాయి. రాజ్యాంగసంరక్షకులగు మంత్రులందరూ ఒకచోట సమావేశ మైనారు. అయ్యో! ఈ పొరపాటు ఎట్లా జరిగినా మంత్రులమైన మనమే కదా, బాధ్యులం! మనం చాలాకాలం ఈ విదేశీ శ్వపచుని పాలనలో ఉన్నాం! రాజ్యాంగాన్ని సరిగ్గా అమలు పరచలేకపోవటం మనది ఎంత తప్పు! – అని చర్చించుకోసాగారు.

కొద్దిమంది మంత్రులు "దేశానికి మేము చేసిన ఈ తప్పుకు ఆత్మాహుతియే శరణ్యం" – అని నిర్ణయించుకున్నారు. అప్పటికప్పుడు అక్కడ పెద్ద అగ్నిగుండం తయారుచేసి "కీరరాజ్యమునకు మా వలన అంటిన దోషము తొలగుగాక! కీరప్రజలకు మంచి జరుగుగాక" అని కేకలు వేస్తూ అగ్నిగుండంలో ప్రవేశించి ఆత్మాహుతి చేసుకున్నారు. పట్టణమధ్యంలో జరిగిన ఈ సంఘటనను చూస్తూ స్త్రీలు పెద్దగా కరుణారసస్వరముతో ఏడవసాగారు. అనేకమంది ప్రజలు ఆ అగ్నిగుండం చుట్టూ నిలుచుని చూస్తూ తమ బుద్ధిని కోల్పోయారు. నిప్పులో ఉడుకుచున్న శరీరముల దుర్గంధం పట్టణమంతా వ్యాపించింది.

ఇది ఇట్లా ఉండగా, రాజు నిర్వీర్యుడు – అధికారహితుడు అయ్యాడని సంఘవిద్రోహులకు తెలిసిపోయింది. దొంగలముఠాలు దేశంలోని అనేకచోట్ల ఇళ్ళపై బడి ఇష్టం వచ్చినట్లు దోచుకోసాగారు. అనేక జరగరాని సంఘటనలు చోటు చేసుకోవటం చేత ప్రజలు తమ మాన – ధనాదులకు రక్షణ కోల్పోయారు.

❖

కాకతాళీయంగా రాజయి, సద్గుణములతో సజ్జనసహవాసము, ఎనిమిదేళ్ళు రాజ్యాధికారం అనుభవించిన కటంజుడు ఒక్క నాలుగు రోజులలో ఏర్పడిన కకావికలాలన్నీ గమనించాడు. "అయ్యో! నా వల్లనే కదా, ఈ జరగరానిదంతా జరిగిపోతోంది! ఇంతగొప్ప దేశానికి నా కారణంగా ఇంతటి అనర్థం జరిగిపోతుంటే, నేను ఇప్పుడేం చేయాలి? అయినా ఇకనేను ఎవరికోసం, ఎందుకు జీవించాలి? మరి కొంతమంది మంచివారు ఆత్మాహుతి చేసుకోక ముందు నేనే తొలగితే, వీరు

మరొక రాజును శాస్త్రానుసారం ఎన్నుకుంటారు. అందుచేత ఈ ప్రజల ఇప్పటి దుర్దశ తొలగటానికి నాకు నేనే ప్రాణత్యాగం చేస్తాను!"

ఇట్లు తలచి కటంజుడు వీధిలోకి వచ్చాడు. ఒక ప్రదేశంలో చితిపేర్చాడు. "ఓ కీరదేశ ప్రజలారా! మీరు ఆవేశపడి మరికొన్ని అనర్థములు తెచ్చిపెట్టుకోకండి. కీరదేశ సంక్షేమం కోరి ఈ గవలుడు భౌతికదేహం అగ్నిపాలు చేస్తున్నాడు" అని మూడుసార్లు పెద్దగా ప్రకటిస్తూ మరిక ఎవ్వరేమంటున్నదీ ఏమాత్రం వినకుండా అగ్నిప్రవేశం చేశాడు.

❖

సరోవరంలో అఘమర్షణ సూక్తం గానం చేస్తూ యథాలాపంగా ఉన్న గాధి కంఠంలో మంటగా ఉన్నట్లు అనిపించి, ఒక్కసారి నలువైపులా చూచి, తాను ఎక్కడున్నదీ గుర్తుతెచ్చుకున్నాడు.

❖❖❖

3. సుదీర్ఘ మనో పరిభ్రమణం

శ్రీవసిష్ఠ మహర్షి : ఒడ్డుకు చేరిన సముద్ర తరంగం క్షణ కాలంలో శాంతిస్తుంది చూచావా! అట్లా గాధి పొందిన దృశ్యమంతా క్షణంలో మటుమాయమైపోయింది. మనోసంకల్ప రూపమగు సమ్మోహనము నుండి ఆతడు విరతి (withdrawl) పొందాడు. కల్లుత్రాగుటచే మత్తెక్కినవాడు కైపు తగ్గగానే, ఆ మత్తు నుండి విడివడునట్లు ఆతడు కీరరాజ్య పాలన – దేశ వ్యవహారాలు మొదలైన వాటి నుండి విడివడ్డాడు. "ఆహా! నేను గాధి అను పేరుతో పిలువబడే మునిని కదా" అని నిజ రూపం తలచుకుంటూ, జల మధ్యం లోంచి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఒడ్డుకు చేరాడు. ఆకాశం, నేల, దిక్కులు ఎప్పటి వలెనే ఉన్నట్లు గమనించి ఎంతో ఆశ్చర్యపడ్డాడు.

గాధి తనలో తాను "ఆహా! నేనెవడను? ఏమి చూచాను? ఇప్పుడు నాకు అనుభవమైనదంతా ఏమిటి?" అని జరిగినదంతా తర్కించుకున్నాడు. ఓహో! అదీ సంగతి. కొంచం అలసిపోయి ఉండటం చేత, డస్సి ఉన్న నేను కొద్దిక్షణాలు ఏదో భ్రమను స్వప్న సదృశంగా చూచాను కాబోలు." అని అనుకుంటూ బాటలో నడవసాగాడు. ఆశ్రమం వైపు పోతూ ఇంకా ఇట్లు తలపోయసాగాడు.

గాధి (తనలో తాను) : నేను రాజ్యపాలన చేస్తూ చేస్తూ నా వలన తదితరులకు జరిగిన దోషమును పరిహరించుకోవటం కోసం అగ్నిలో ప్రవేశించాను కదా! ఆ అనుభవమునకు సంబంధించిన స్త్రీలు, మంత్రులు, శ్వపచజాతి ఆటవికులు, సభికులు మొదలైన వారంతా ఎవరు? ఎక్కడున్నారు? నేనా, అవివాహితుడను, స్త్రీ యొక్క కరస్పర్శను కూడా ఎరుగను. ఇక నా బంధువులా, వాళ్ళంతా దూరంగా ఉండే నా స్వగ్రామంలో ఉన్నారాయె! మరి నేను అగ్ని ప్రవేశం చేసింది ఎవరి సమక్షంలో? స్వప్న నగరం వంటి ఈ సంఘటనలను అసలు ఎందుకు పొందినట్లు?

అవును! అదంతా స్వప్నం వలె భ్రమయే అయి ఉంటుంది. నేను మృతి చెందటం నా బంధువులు రావటం, ఈ భౌతిక దేహమును చూచి ఏడవటం, నేను మరొక తల్లి గర్భంలో ప్రవేశించటం,

ఆటవిక శ్వపచులలో పుట్టి పెరగటం, పెళ్ళి, పిల్లలు, మా జాతివారి గ్రామ బహిష్కరణ, పరరాజ్య ప్రయాణం, రాజవటం, నా తోటి గ్రామస్థులు నన్ను గుర్తించటం, మంత్రులకు ఆ రహస్యం తెలిసి పోవటం, వారిలో కొందరి ఆత్మాహుతి, చివరికి నేనే ఆత్మాహుతి చేసుకోవటం, ఇదంతా సుదీర్ఘంగా అనుభవించినాను గాని, అంతా ఒక స్వప్నమే అయి ఉంటుంది. ఇప్పటికి అది కలే గాని, అబ్బా! అప్పటికి మాత్రం ఎంతగా సత్యమైన అనుభవం! ఏడ్చాను, నవ్వాను, హింసించాను, భంగపడ్డాను, భయపడ్డాను, రాజ్యాధికారం చెలాయించాను! ...నేను పొందనిది లేదు. అరె! "నేను గాధిని" అనే విషయమే ఆ సుదీర్ఘ సమయంలో జ్ఞాపకం రాలేదే? అవునులే. స్వప్న సమయంలో జాగృత్ స్థితి విశేషం జ్ఞాపకం రావటం లేదుగా! ఇదీ అంతే.

అయినా, అంత సుస్పష్టంగా అనేక విషయాలు అనుభవించాను కదా! ఊళ్ళో వాళ్ళని హింసించటం చేత వాళ్ళు నన్ను నా పెళ్లాం బిడ్డలను బహిష్కరించారు. నా పెళ్ళాం బిడ్డలు నా కళ్ళ ఎదురుగా మరణించారు. నేను దేశ దేశాలు నడుచుకుంటూ కీరదేశం ప్రవేశించాను. భిక్షకుల మధ్యలో భయంభయంగా నిలబడి ఉన్న నన్ను పట్టపు ఏనుగు వచ్చి పూలమాలతో అలంకరించింది. రాజయ్యాను. న్యాయనిర్ణయాలు చేస్తూ, రాజ్యపాలన చేశాను. మా గ్రామంవారైన శ్వపచులు నన్ను ఊరి బయట చూచి గుర్తించారు. ఆ రోజు నేను గోచీ పెట్టుకుని రాజాంతఃపురం నుండి రహస్య మార్గం గుండా బయటకు వెళ్ళకపోతే నేను ఇంకా రాజుగానే ఉండే వాడినేమో! అరెరేఁ! నేనట్లా చేయవలసింది కాదు.

కనుక అదంతా అసత్యమో, స్వప్నమో ఎలా అవుతుంది? కాదు. ఏది నిజం! ఏది అసత్యం! చండాల-రాజ జీవితములలో ఒక్కటైనా సత్యమా! రెండూ స్వప్నమేనా? ఇదే విష్ణుమాయ కాబోలు. అవును! పిచ్చెక్కిన పులి పిచ్చి పిచ్చిగా అడవులలో సంచరిస్తున్నట్లు ఈ చిత్తము కూడా భ్రాంతి దృష్టులతో పరిభ్రమించటం జరిగిందా? అయి ఉండవచ్చు.

❖

ఈ విధంగా ఆయా సంఘటనను గురించి చిత్తము యొక్క మోహము గురించి ఆలోచిస్తూ గాధి అక్కడి తన ఆశ్రమం చేరాడు. కొద్దిరోజులు గడచిపోయాయి. ఆతడు యథాప్రకారంగా తన ధ్యాన, తప, అధ్యయనాదులు కొనసాగించసాగాడు.

ఒక రోజు ఒక బాటసారి ఆ ఆశ్రమానికి వచ్చాడు. ఆతడు, దీర్ఘమైన ప్రయాణాలు చేసి ఉండటం చేత కాబోలు, ఎంతో అలసిపోయి, నీరసంగా కనిపించాడు. గాధి ఆ అతిథిని ఆహ్వానించి, ఉపచారాదులతో సేవించాడు. కొంతసేపైన తరువాత ఆ బాటసారి కాస్త ఓపిక, ఉత్సాహము పుంజుకున్నాడు.

గాధి : అయ్యా! మీ అలసట తొలగిందా? మధ్యాహ్నం మీరు వచ్చే సమయంలో ఎంతో అలిసి పోయి, దస్సి ఉన్నారు. ఏమైనా అనారోగ్యం కారణమా?

బాటసారి : లేదు నాయనా! నేను ఇంతగా కృశించి ఉండటానికి ఒక ముఖ్య కారణమున్నది.

ప్రయాగలో ఆలయం చుట్టూ రోజుకు వేయి అంగప్రదక్షిణాలు 100 రోజులుగా చేశాను. అందుచేతనే నీరసంగా కనిపిస్తున్నాను. నీ అతిథి సేవలచే నా అలసట కొంచం తగ్గింది. చాలా సంతోషం.

గాధి : అంత శారీరక శ్రమ పొందవలసిన అగత్యం మీకేమున్నది?

బాటసారి : అదంతా ప్రాయశ్చిత్తంగా చేయవలసి వచ్చింది.

గాధి : మీరేమి తప్పు చేశారని ప్రాయశ్చిత్తం అవసరమైనది?

బాటసారి : ఇక్కడికి ఉత్తరంగా చాలా దూరంగా 'కీర' అనే ప్రసిద్ధ దేశం ఉన్నది. ఆ దేశానికి గల సరిహద్దులలో ఒక నిర్జన ప్రదేశంలో ఒక ఆశ్రమంలో తపస్సు చేసుకుంటూ రోజులు వెళ్ళబుచ్చుకునే వాడను. ఒకసారి ప్రజల ఆహ్వానం మీద అక్కడి ముఖ్య పట్టణమైన కీరనగరం వెళ్ళాను. పురాణాలు చెప్పుతూ అక్కడివారి ఆతిథ్యంలో చాలా రోజులు గడిపాను. అయితే అక్కడ అకస్మాత్తుగా రాజ్యాంగ విరుద్ధమైన ఒక అపశ్రుతి బయటకు పొక్కింది. ఆ దేశాన్ని ఎనిమిదేళ్ళుగా ఒక పరాయిదేశీయుడు పాలించాడు. అంతే గాదు... ఆ రాజు ఇతఃపూర్వం ఒక ఆటవిక – కుక్క మాంసంతినే ఆచారం గల శ్వపచజాతి వాడట. ఆతడు విజాతీయుడని తెలియగానే ఆతనిని అక్కడి ప్రజలు తిరస్కరించారు. ఆతని పాలనలో ఉన్నందుకుగాను వాళ్ళు ప్రాయశ్చిత్తం చేసుకోవటం ప్రారంభించారు. నేను చూస్తూ ఉండగానే అక్కడి కొందరు రాజ్య శ్రేయోభిలాషులు, ఆ రాజు కూడా అగ్నిలో ప్రవేశించారు. ఆ విధంగా నిండు ప్రాణాలు కళ్ళకెదురుగా హాహాకారాలు చేస్తూ మసికావటం చూచి నా మనస్సు కకావికలు అయినది. ఇక అక్కడ ఉండలేకపోయాను. ఎన్నో మైళ్ళు కాలినడకన ప్రయాణించి 'ప్రయాగ' వెళ్ళాను. అక్కడ నా మనస్సుకు ప్రాయశ్చిత్తం చేసుకోవటానికి 100రోజులు ఉపవాసం ఉంటూ దైవార్చన సాగించాను. ప్రతిరోజూ దేవాలయంలో వేయి ప్రదక్షిణలు, అంగప్రదక్షిణలు, ధ్యాన పూజాదులు నిర్వర్తించాను. కొన్ని రోజులయిన తరువాత నా మనస్సు కుదుటపడింది. ఇక కొన్నాళ్ళకి అక్కడి నుండి బయలుదేరి దేశాటనం చేస్తూ ఈ రోజుకు నీకు అతిథినయ్యాను. నియమ నిష్ఠలతో నిర్వర్తించిన ధ్యాన పూజాదుల వలన కలిగిన శారీరక శ్రమ వల్ల నేను కొంచం కృశించినట్లున్నాను.

❖

ఆ బాటసారి చెప్పుచున్నదంతా విన్న తరువాత గాధిమునికి ఆశ్చర్యం వేసింది. ఏవేవో ప్రశ్నలు వేసి కీరపట్టణం గురించి ఏవేవో విశేషాలన్నీ విన్నాడు. ఆ రాత్రి వాళ్ళు మాటలు చెప్పుకుంటూ ఉండగా వాళ్ళకు తెలియకుండానే గడచిపోయింది. తెల్లవారిన తరువాత ఉపాహారం తీసుకొని బాటసారి గాధి వద్ద సెలవు తీసుకొని ఎటో వెళ్ళిపోయాడు. అతిథి మర్యాదలతో ఆ బాటసారిని సాగనంపిన తరువాత ఇక గాధి ఆలోచనలో పడ్డాడు.

గాధి : అరె! ఎంత ఆశ్చర్యం! ఈ బాటసారి చెప్పిన దానికీ, నేను తటాకంలో అఘమర్షణ మంత్ర పఠనం చేస్తూ భ్రాంతి వశం చేత పొందిన అనుభవ పరంపరలకూ ఎంతో పొంతన కుదురుతోందే! నేను ఏది దర్శనం చేశానో అదంతా ఇతనికి పూసగ్రుచ్చినట్లుగా ఎవరైనా చెప్పారా? ఎవరు చెపుతారు? నేను మరెవ్వరితోనూ చెప్పనే లేదు కదా! ఏది మాయ? ఏది భ్రాంతి? చూస్తుంటే ఈ

ఆశ్రమం, ఇక్కడి మా స్వగ్రామంలోని నా బంధువులు, ఈ బాటసారి... ఇవన్నీ మాయలోనివేనా! లేక, కీర రాజ్యం మాయలోనిదా? నేనెవరిని? ఈ మాయ ఏమిటి? గాధి అనగా నేనేనా? మరెవ్వరన్నానా?

నేను ఆ బంధుజనం మధ్యలో అగ్నిప్రవేశం చేయటం 'మాయలోనిదే' అనటంలో ఏమాత్రం సందేహం లేదు కదా! 'కీర నగరం' అనబడేది ఉన్నదా? లాభం లేదు. ఏది ఏమైనప్పటికీ ఈ సర్వ అనుభవ పరంపరలోని సత్యాసత్యములేమిటో కనిపెట్టవలసిందే. కనిపెట్టేది ఎట్లా! ఆ! ఏమున్నది ఈ బాటసారి 'ఉత్తరం వైపు కీరదేశం' గురించి సూచించాడు కదా!

❖

ప్రయత్నశీలుడు పొందలేనిదంటూ ఏముంటుంది? గాధి జగన్మాయను సంపూర్ణంగా దర్శించాలనే ఉద్దేశంతో తన ఆశ్రమం నుండి బయలుదేరాడు. చాలా రోజులు ప్రయాణించి ముందుగా ఆటవిక శ్వపచులు ఉండే జనారణ్య ప్రాంతం చేరుకున్నాడు. తాను పుట్టి, కటంజుడు అను పేరుతో పెరిగి సంచరించిన ఆ గ్రామంలో తన జ్ఞాపకాలకు సంబంధించిన ఎన్నో చిహ్నాలు చూచాడు. పుట్టి ఎన్నో ఏళ్ళు పెరిగిన ఆ ప్రాంతమంతా ఎంతో సుపరిచితంగా కనిపించింది. అది చూచిన ఆతని మనస్సంతా వైరాగ్యంతో నిండిపోయింది. అక్కడి ఆతని ఇతఃపూర్వపు గృహం గోడలు కూలి ఉన్నాయి. తాను ప్రతిరోజూ పరుండే చాప శిథిలమై ఓ మూల కనిపించింది. ఊరికి చివరిగా ఉన్న ఆ గుడిసెలో భోజన పానములకు ఉపయోగించిన చిప్పలు, బొచ్చెలు, కుండలు అస్తవ్యస్తంగా పడి ఉన్నాయి. ఆ ప్రాంతమంతా బొమికలు పుట్టెలతో నిండి ఉన్నది. అంతా పరిశీలిస్తూ ఆతడు శ్వపచుల గ్రామమంతా చుట్టి వచ్చాడు. అక్కడి వారిలో తనకు పూర్వపరిచయస్థులు కొందరు తారసపడ్డారు. వారిలో తనకు సుపరిచయమైన ఒక వ్యక్తితో వారి భాషలో సంభాషణ ప్రారంభించాడు.

గాధి : బాబూ ! నీ పేరు సుబ్బడు కదా!

ఆ మనిషి : ఆ! నేనే నయ్యా సుబ్బడు. నాపేరు నీకెలా తెలిసింది?

గాధి : అదిగో, ఆ చివర ఊరికి దూరంగా గుడిసె కనిపిస్తోందే! అక్కడ ఎవరుండేవారు?

ఆ వృద్ధ శ్వపచుడు : ఓహో! అదా! అక్కడ కటంజుడనే ఒకడు పెళ్ళాంబిడ్డలతో ఉండేవాడు. వాడు మా వాడే. అయితే ఊళ్లో దొంగతనాలు, తిట్టటం, కొట్టటం చేస్తుంటే మా నాయకులు బహిష్కరిస్తే పెళ్లాం బిడ్డలతో సహా వెళ్ళి అక్కడ గుడిసె కట్టుకున్నాడు. చాలాకాలం క్రితం పెళ్లాం బిడ్డలు చచ్చిపోతే వాడు ఏదో దేశానికి వెళ్ళి భిక్షాటనం చేసుకుంటూ రాజు అయ్యాడు. ఆ మధ్య అక్కడేదో గొడవ వచ్చి చచ్చిపోయాడని విన్నాను. ఇక్కడ నుండి వెళ్ళిన తరువాత ఆతను చాలా మంచివాడుగా మారాడట. ఆతని గురించి తమరు ఎందుకు అడుగుచున్నారు? మీరు గాని కీరదేశం వాళ్ళా?

❖

ఈ విధంగా అక్కడి వారి అనేకులతో కటంజుని గురించి సంభాషించాడు. అక్కడి వారికి ఏదో సర్దిచెప్పుచూ అక్కడే ఒక మాసం రోజులు గడిపాడు. తాను ఆటవిక – శ్వపచజాతి సంబంధమైన

భావము చేత పొందిన విశేషాలనే అక్కడివారు కూడా కటంజుని పరంగా చెప్పటం విన్నాడు. అయితే ఆ గాధి యొక్క చిత్తము అప్పటికీ తృప్తి పొందలేదు. అక్కడ ఉన్న అనేక అడవి ప్రదేశాలను గుర్తుపడుతూనే, తనలో ఇట్లు చింతించసాగాడు.

గాధి (తనలో) : ఆహా! నేను ఎన్నో ఏనుగులను చంపి, ఆ దంతములను ఈ గోడలలో గ్రుచ్చి మట్టితో తాడించాను. ఈ ఏనుగు దంతములు ఇంకా చెక్కుచెదరలేదు. ఇక్కడ నా భార్యతో, కొడుకులతో సమావేశమై మాంసపు ముక్కలు కాల్చుకు తినటం, సురాపానం చేయటం – అవన్నీ ఇప్పటి సంఘటనలలాగానే ఉన్నాయే! ఎన్నోసార్లు నా భార్యతో కూడి వానరమాంసం తిని, కల్లు తాగి సింహచర్మం పరచుకొని పరుండే వాళ్లం. మాంసం తిని బలిసిన జోడు కుక్కలను ఇక్కడే కట్టేసే వాళ్ళం. అప్పుడు నా చిన్నతనంలో ఇక్కడ అమ్మోరి గుడి దగ్గర ఆడుకుంటూ ఉండేవాళ్ళం. ఇదిగో, ఇక్కడ బండరాయి మీద కూర్చుని జంతువుల రక్తం త్రాగుతూ, పాటలు పాడుకుంటుండే వాళ్ళం కదా! ఈ మూల, పొదల దగ్గిర పిట్టలను పట్టుకోవటానికి వల పన్నే వాళ్ళం. ఆహా! విధాత చేష్టలు ఎంత చిత్రమైనవి! సరే! ఇప్పుడు కీరదేశం వెళ్ళి అక్కడి చమత్కార విషయాలుకూడా చూచి వెళ్తాను.

❖

ఇట్లా అనుకుంటూ, ఇక అక్కడి నుండి కీరదేశంలో ప్రవేశించాడు. తాను గవలమహారాజుగా సంచరించిన అక్కడి ప్రాంతాలు చూస్తూ కీరనగరం ప్రవేశించాడు. అక్కడ ప్రజలతో సంభాషించాడు.

గాధి : బాబూ! ఇక్కడ కొంతకాలం క్రితం 'కటంజుడు' అనే ఒక శ్వపచజాతివాడు రాజ్యం ఏలాడట గదా! ఆ విశేషాలు కాస్త చెప్పండి.

కీరపురవాసి : ఓ తాపసీ! మీరు విన్నది నిజమే. ఇక్కడి మహారాజు సంతానం లేకుండా మరణించటం చేత, ఇక్కడ 'మంగళహస్తి' అనే పేరు గల ఆచారమును అనుసరించి కటంజుడనే పేరు గల శ్వపచుడు 'గవలరాజు'అనే పేరుతో ఎనిమిదేళ్ళు రాజ్యం ఏలాడు. ఆతడు విదేశీయుడని తెలిసిన తరువాత మేం ప్రజలమంతా ఆతనిని త్యజించాం. అప్పుడాతడు నిప్పులలోకి దూకి ప్రాణాలు విడిచాడు. అదంతా జరిగి ఇప్పటికే ఒక సంవత్సరం అయింది.

❖

గాధి అనేకులతో గవలమహారాజు గురించి అనేక విషయాలు చర్చించగా, అవన్నీ తన జ్ఞప్తిలో అనుభవపేటికలో ఉన్నట్టి విషయాలుగా తెలియవస్తున్నాయి. "సందేహం లేదు ఇక్కడ గవలరాజుగా ఎనిమిదేళ్ళు రాజ్యం ఏలింది నేనే" అని తలచుచూ నగరంలో సంచరించసాగాడు. ఇంతలో ఆ రాజవీధిలో దూరం నుండి ఏదో కోలాహలం వినవచ్చింది. జనం ప్రక్కగా వెళ్ళి నిలబడ్డాడు. ఇప్పటి రాజు విష్ణువు అనే అతను ఆ సమయంలో వాహ్యాళికై గుఱ్ఱాల మీద తన సైనికులతో వెళ్ళటం – అంతా గమనించాడు.

ఏమి ఆశ్చర్యం! ఏమి చమత్కారం! నేనిప్పుడు తటాకంలో నిలుచుని, అఘమర్షణ మంత్రం చదువుచూ, ఒక స్వప్న సదృశంగా కొద్ది నిమిషాలు పరధ్యానంలో ఉండిపోయాను. ఆ కొద్ది

నిమిషాలలో 70 సంవత్సరాల సుదీర్ఘానుభవం పొందటమేమిటి? అప్పటివన్నీ ఇప్పటి నా ఈ జాగ్రత్‌లో ఇక్కడ సరితూగుతూ ప్రాప్తించటమేమిటి? ఇక్కడ నాకు తారసపడినదంతా స్వప్నము వలె అలీకము (భ్రమ) అనునది తథ్యమే కదా! ఈ భ్రమ అంతా ఎక్కడి నుండి ఎట్లా వచ్చి నాకు ప్రాప్తించిందో – నేను గ్రహించలేకపోతున్నాను.

ఆహోఁ! "మనోమోహము" అనే వలలో చిక్కుకుని ఒక పక్షిలాగా నేను ఎంత అలసిపోయాను! ఎన్నెన్ని కష్టాలుపడ్డాను! ఈ నా మనస్సే అనేక వాసనలచే కొట్టబడినదై, తనయొక్క 'బోధ' స్వరూపమును కోల్పోయి ఒక చిన్నపిల్లవాడులాగా నలువైపులా పరుగులుతీసి ఈ మాయనంతా గాంచినదే!... ఎందుకు ఇట్లా జరిగింది?

ఓహో! చక్రధారుడగు విష్ణు భగవానుడు నాకిచ్చిన వరం సఫలం చేయటానికే నాకు ఈ మాయను రుచి చూపించి ఉంటారు. నా కిప్పుడంతా గుర్తుకు వస్తోంది. ఇక నేను నా ఆశ్రమానికి వెళ్ళి అక్కడ ఈ మాయ యొక్క స్థితి గతుల గురించి సమన్వియించుకోటానికి, ఎరుగటానికి ప్రయత్నం చేస్తాను.

❖

గాధి ఇట్లు నిర్ణయించుకుని, తాను నివసిస్తూ ఉండే గిరి ప్రాంత సమీపంలోని ఆశ్రమం చేరాడు. ఇక ఆ రోజు నుండీ కొంచెం నీళ్ళుమాత్రమే పుచ్చుకుంటూ భక్తి, ఏకాగ్రతలతో విష్ణుప్రీతి కొరకు తపస్సు ప్రారంభించాడు. ఒక సంవత్సరకాలం గడిచింది. ప్రసన్నమూర్తి, శ్యామలాకారుడు, పుండరీకాక్షుడు, ఆశ్రితజనవత్సలుడు అగు విష్ణుభగవానుడు ఒక శుభదినం గాధికి ప్రత్యక్షమై దర్శనమిచ్చాడు. ఆ ముని వెంటనే స్వామి పాదాలపై బడి, మ్రొక్కి, అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి, పూలు చల్లి, స్తోత్రం చేసి ఆనందపరిచాడు.

శ్రీమన్నారాయణుడు : పుత్రా! మరల ఏమి కోరి నా దర్శనం కొరకు ధ్యానం చేస్తున్నావయ్యా? నీవు నా 'మహామాయ'ను చూచావు కదా! నీవు కోరినట్లే మాయను చూపాను. మరల ఏమి విశేషం?

గాధి : హే భగవాన్! మీ అనుగ్రహవశం చేతనే కాబోలు, ఈ భూమి నంతటినీ ప్రకాశింపజేస్తున్న మాయ యొక్క మహిమను సందర్శించాను. అంతా అయిన తరువాత ఇప్పుడు అనేక సందేహాలు నన్ను పుంఖానుపుంఖాలుగా చుట్టుముట్టుచున్నాయి. ప్రభూ! నేను తటాకంలో నిలబడి అఘమర్షణ మంత్రం జపిస్తూ కొద్దినిమిషాలు కాబోలు, పరధ్యానంలో మునిగాను. అంతే! నా మనస్సు నందే 60 సంవత్సరముల సుదీర్ఘానుభవం ఆ కొద్దినిమిషాలలో ఒక స్వప్నంలోలాగా పొందాను. ఇంతలో యథాస్థానంలో జాగృత్ పొంది నిజాశ్రమం చేరాను.

ఇంతవరకూ బాగానే ఉన్నది. అయితే ఇప్పుడొక బహుచమత్కారమైన విషయం చూచాను. అదేమిటంటే – నేను ఏదేదైతే మనస్సులో సందర్శించానో – అదంతా ఈ జాగ్రత్‌లో ఏర్పడియే ఉంది. మనస్సులో ఏదేదో పొందటమేమిటి?... అదంతా 'జాగ్రత్'లో ఏర్పడి ఉండటమేమిటి? నాకు అసలు ఏమీ అర్థమే కావటం లేదు. 'కటంజుడు' అను ఆటవికునిగా, కీరదేశాన్ని ఏలిన గవళమహారాజుగా

నేను గాంచినదంతా వాసనల చేత నా మనస్సులోనే పొంది ఉన్నాను కదా? భ్రమ చేత పొందిన సుదీర్ఘ-అల్పకాలిక అనుభవముల ఉత్పత్తి-వినాశనములు, ఆ ఉపాధి రాక పోకలు, తదితరములు - మనస్సుతో ఏర్పడినవే కదా! మనస్సులో ఏర్పడినవి మనస్సులోనే ఉండాలి. మరి, బయట ఎందుకు వాస్తవమై కనిపిస్తున్నాయి? అట్లా బయట (జాగ్రత్‌లో) కనిపించటానికి కారణమెవ్వరు? స్వప్నంలో లాగా తారసపడిన "ఆ వ్యక్తులు, ఆ ప్రదేశములు" ఇవన్నీ బయటకు ఎవరు తెచ్చారు? ఆ వ్యక్తులంతా ఎవరు? వారికి, నాకు, నా మనస్సుకు ఏమిటి సంబంధం? ఎవరు ఎవరి గురించి ఎందుకు ఎచ్చట స్వప్నంలోలాగా గాంచుచున్నారు? ఆ కీరదేశ జనులకు, ఆటవిక శ్వపచ జాతి జనులకు నేను ఏర్పడియే ఉన్నాను.... అదెట్లా ఒనగూడింది? ఇవన్నీ మీ నుండి తెలుసుకోవాలను కున్నాను. అందుకే మీ సందర్శనం కొరకు నిష్ఠతో ధ్యానించాను. మీరు జగద్గురువులు. మాయకు ఆవలుండి, మాయను రచిస్తున్న పరాత్పర స్వరూపులు. మీరుగాక, నాకు ఇంకెవరు దిక్కు? అందుచేత నేను చూచినదంతా ఏమిటో సవిస్తరంగా చెప్పమని ప్రార్థిస్తున్నాను.

శ్రీమన్నారాయణుడు : కుమారా! నీవు చూచినదీ, చూచుచున్నదీ - అంతా ఆత్మయొక్క స్వరూపమే. అయితే, "మాయను చూడాలి" అనే నీ యొక్క వాసనాబీజము నుండే ఈ జగద్రూపభ్రమ అంతా ఏర్పడి, అనుభవమైనది. ఆ దర్శనం చేస్తున్న సమయంలో తత్త్వదృష్టి కొరవడుట చేత నీ చిత్తము దృశ్యముతో తాదాత్మ్యభావన పొందటం జరుగుతోంది. ఈ విషయం మొట్టమొదట గుర్తించు. తదాత్మ్య భావము చెందకపోయావా... నీకీ వర్తమాన దృశ్యమూ లేదు, కీరదేశపు దృశ్యమూ లేదు. ఉభయములు ఆత్మస్వరూపములే!

ఇక, అక్కడి జనులంతా ఎవరంటావా? ...అన్నివైపులా జలంతో నిండిన మహాసముద్రంలో ఒక కెరటం మరొక కెరటమును తాకుతున్నట్లు, ఒక ద్రష్టకు మరొక ద్రష్ట తారసపడుచున్నాడు. ఒక చమత్కారమైన ప్రశ్న. ఈ ఎదురుగా కనబడే ఆకాశం, పర్వతములు, భూమి, దిక్కులు - ఇవన్నీ నీకు ఎక్కడో బయటగా ఉన్నాయని అనుకుంటున్నావా? ...కానే కాదు.

ఒక విత్తనంలో "మహావృక్షం, ఆకులు, కాండము, కాయలు, పూలు, కొమ్మలు, వేళ్ళు.... వాటి వాటి భవిష్యత్ కార్యక్రమములు" అంతర్లీనంగా ఉన్నాయి కదా? అట్లాగే, దేశ కాల వశంచేత చూడబడుచున్న విశేష పరంపరలన్నీ చిత్తములోనే ఉండి ఉంటున్నాయి. విత్తులోంచి ఏదో సమయంలో మహావృక్షపు వివిధ భాగాలన్నీ వెలువడుచున్నట్లు - సర్వ అనుభవములు చిత్తము నుండే బయల్వెడలి ప్రకటితమగుచున్నాయి. వాస్తవానికి 'దృశ్యము' అనబడే వ్యవహారం అంతా మనస్సులోనే ఉన్నది గాని, బయట ఏనాడూ లేదు. విత్తులో ఉన్నదే బయట రూపం దిద్దుకుంటున్నట్లుగానే... మనస్సులో ఉన్నదే ఎదురుగా దర్శించబడటం, అనుభవించబడటం జరుగుతోంది.

ఒక కుమ్మరి ఉన్నాడు. ఆతడు రకరకములైన చిత్రవిచిత్ర ఆకారములలో కుండలు మొదలైన వాటిగా మట్టిని మలచుచున్నాడు. ఆతడు తాను చేస్తున్న ఆకారములన్నీ తన మనస్సులోనే కలిగిఉన్నాడు కదా! ఆ విధంగానే దర్శన స్పర్శనాది క్రియలు, రకరకాలైన చింతనలు, భూత-వర్తమాన-భవిష్యత్

కాలములు, ఈ ఇంద్రియములకు తారసపడుచున్న సూర్య చంద్ర నక్షత్రాది పదార్థజాలములు – ఇవన్నీ మనస్సులో ఉండి, మనస్సుచే నిర్మించబడి, మనస్సుచే పొందబడుచున్నవే! మనస్సే వాటిని నిర్మించి, మరల మనస్సే వాటిని ఉపసంహరిస్తోంది. మనస్సు చేసే నిర్మాణచమత్కారములేమిటో దృష్టాంతంగా నీకు చెప్పాలంటే "పిల్లలు – వారి ఆటలు, వృద్ధులు – వారి భ్రమలు, జనులు – వారి మద ఆవేదన అనురాగ రోగాది సందర్భములలో విషయములను పొందే విధానం" ...ఇవి గమనిస్తుంటే నీకే అంతా తెలియగలదు. ఒకడు తన స్వప్నంలో ఏవేవో ప్రదేశాలను, వ్యక్తులను చూస్తున్నాడనుకో... ఆ ప్రదేశాలు, వ్యక్తులు ఆ స్వప్నద్రష్టయొక్క భావపరంపరలలోని అంతర్లీన విభాగములే కదా! ఒకడు ఏదో భ్రాంతిలో ఉన్నప్పుడు ఎదురుగా ఉన్న వస్తువులను గమనించడు. మదముచే నిండిన మనస్సుతో ఒకడు ఒక సుందర స్త్రీని చూస్తున్నప్పుడు "ఇది రక్త–మాంస–బొమిక లచే తయారు కాబడిన భౌతిక పదార్థమే" అనే విషయం స్ఫురించదు. ఒక గొప్ప చెట్టు యొక్క కాయలు, పూలు, ఆకులు కనబడతాయిగాని, వేళ్ళు కనబడనట్లు, సత్పదార్థమైనట్టి బ్రహ్మము అవలంబిస్తున్న మనస్సు నందే ఈ లక్షలాది సంఘటనల పరంపరలన్నీ నిక్షిప్తమై ఉన్నాయి.

ఒక చెట్టును వ్రేళ్ళతో సహా పెకలించి పడేశామనుకో... ఇక ఆ చెట్టుకు క్రొత్త ఆకులు కాయవు కదా! వాసనల నుండి విముక్తుడైన జీవునకు ఇక జన్మకర్మలు ఉండవు. వాసనల చేతనే మనస్సు తయారు చేయబడింది.

అనంత జగజ్జాలములు ఇమిడి ఉన్న అట్టి "వాసనామయ ప్రపంచము" నందే నీకు అనుభవమైన శ్వపచజాతి జీవుని భావము ప్రకటితమైనది. ఇందులో ఆశ్చర్యమేమున్నదయ్యా? వాసనల ప్రతిభాస వలననే రకరకాల మనోవ్యథలతోనూ, సంరంభములతోనూ కూడిన ఆటవికభావములన్నీ నీవు పొందావు. అంతే కాదు... అట్టి 'వాసనామయ ప్రపంచం' యొక్క చమత్కారం చేతనే "ఆ బాటసారి రావటం, ఆతనితో భుజించటం, సంభాషించటం, ఆయా విశేషాలు విని ఆశ్చర్యపడటం, మాయను తెలుసుకోవాలనుకోవటం, నా కొరకై ధ్యానం చేయటం" – మొదలైనవన్నీ కూడా పొందడం జరిగింది.

గాధి : స్వామీ! స్వప్న సదృశంగా కటంజుడు అనే పాత్రధారణచేస్తూ... ఏవేవో మనస్సులో దర్శించటం – భౌతికంగా నా ఆశ్రమానికి వచ్చిన అతిధి – బాటసారితో సంభాషణ... ఈ రెండూ ఒక్కలాంటివే నంటారా?

శ్రీమన్నారాయణుడు : అవును. ఆ ఆటవికజనం ఏ విధంగా భ్రమ మాత్రమే అయి ఉన్నదో, ఆ అతిథితో సంభాషణ కూడా ఆ విధంగానే భావనల, వాసనల ప్రకటీకరణమే అయిఉన్నది. ఇంకా విను. "ఇప్పుడు లేచి శ్వపచుల గ్రామం, కీరదేశం వెళ్ళుచున్నాను... ఇక్కడి ఈ జనులతో సంభాషించు చున్నాను... వ్యక్తులను గుర్తిస్తున్నాను... ఆయా సంఘటనలతో సరిచూచుచున్నాను..." మొదలైనవన్నీ కూడా భ్రమలోని అంతర్లీనభాగమే సుమా! "ఇది కటంజుని పురాతన గృహం..." అని అక్కడి వారు చెప్పటం, "ఔను... ఇవన్నీ నేను ఒకప్పుడు పొందియున్నవే" – అని తలపంకించటం కూడా భ్రమ చేతనే జరుగుతోంది. "ఇదిగో... ఇప్పుడు కీరనగరం వచ్చాను... వీరు గవలమహారాజు

అనబడియున్న నా గురించే చెప్పుచున్నారు... నేను వింటున్నాను... ఎంత ఆశ్చర్యం... వీళ్ళు నాకు ఇంతఃపూర్వం తెలిసినవారే" – అని నీవు భావిస్తున్నదంతా మనస్సు యొక్క వికారములే గాని, మరింకేమి కాదు. ఓ మునీ! ఇన్ని మాటలెందుకు? నీవు దేనిని 'ఇది నిజమే' అని అనుకుంటు న్నావో – ఇదంతా మనస్సు యొక్క కల్పన అని, మోహము యొక్క అభ్యున్నతి అని గ్రహించు.

ఈ మనస్సు వాసనతో కూడుకొని ఉన్నప్పుడు ఇది తన అంతరమున ఏది దర్శించాలని అనుకొంటే అద్దానినే దర్శించగలదు. మామూలుగా అసాధ్యమైన విషయాలు కూడా ఒకడు తన స్వప్నంలో దర్శిస్తున్నాడు కదా!

కనుక గాధీ! మనోమోహమే జగత్తుకు బీజం. ఆ ఆటవికులు, ఆ కీరదేశీయులు, వారి ఆచార నమ్మకములు, వారి ప్రాయశ్చిత్త బుద్ధులు, ఆ రాజధాని, అక్కడి జనుల దేహత్యాగములు... వీటినన్నిటినీ నీవు మోహము చేతనే పొందావు. జీవుడు మోహము చేతనే ఈ శరీరమును, 'వీటి వలన – వీటి ద్వారా' ఏర్పడే సంబంధ బాంధవ్యములనూ పొందుచున్నాడు.

శ్రీగాధి : పరంధామా! ఇప్పుడు నేను పొందిన కీరరాజ్యాది అనుభవములు భౌతికమా? మానసికమా! ఆ అనుభవములు నన్ను ఎలా సమీపించాయి?

శ్రీమన్నారాయణుడు : సుదీర్ఘప్రయాణం చేస్తున్న ఒక బాటసారిలాగా ఈ నీ వర్తమాన శరీరాన్ని ఆశ్రయించి ఉన్నావు. తపోధ్యానాదులచే డస్సి ఉన్న నీవు నిజ వాసనలచే ఆ 'అనుభవములు' అను చోటికి వెళ్ళావు. ఒక అద్దములోని దృశ్యము మరొక అద్దంలో ప్రతిబింబించినట్లు మరొక ద్రష్టత్వము నీయొక్క ద్రష్టత్వములో ప్రతిబింబించింది. ...కానీ అవన్నీ సత్యమైనవే కావు.

స్వప్నంలో ఏదో ఆకస్మికంగా చూస్తూ ఆ స్వప్నద్రష్ట తన్మయుడౌతాడు చూచావా? ఆ రీతిగా నీవు ఆటవికత్వము, రాచరికత్వము మొదలైనవన్నీ పొందావు. నీయందలి ద్రష్టత్వపు అంతరంగ వాసనలే నిన్ను అందుకు పురికొల్పాయి. ఏది ఏమైనా వాటిలో ఏ ఒక్కటీ నీవు కావు. నీవు చూచిన కీర నగరం మాయయే. ఒక పిచ్చివాని వలె మనస్సునందే అంతా పొందుచూ నాలుగు వైపులా పరిభ్రమించి వచ్చావు.

కాబట్టి, ఇకలే! లేచి, శాంతుడవై ఉండు. నిజాశ్రమ ధర్మమునకు ఉచితమైనట్టి స్వాధ్యయనము అగ్ని హోత్రము మొదలైన కార్యములను యథారీతిగా ఆచరించు. ఎందుకంటే ఇహలోకంలో కర్మశూన్యులైన మనుజులు శ్రేయమును పొందజాలరు.

❖

సర్వేశ్వరుడగు నారాయణుడు ఇట్లు ఉపదేశించి, చిరుమోముతో క్షణంలో అంతర్ధానమైనారు.

❖❖❖

4. సుజ్ఞానప్రాప్తి

విష్ణుభగవానుడు అంతర్ధానమైన తరువాత గాధి తనకు కలిగిన 'సమ్మోహనము' గురించి మరల విశ్లేషించటం ప్రారంభించాడు.

గాధి (తనలో) : ఇదేమిటి? "అంతా మోహము చేతనే గాంచినావు" – అని నారాయణుడు వ్యాఖ్యానిస్తున్నాడు? అసలు అతిథి, ఈ భూమండపము – ఇవన్నీ ఉన్నాయా? లేవా?

❖

అతడు మరికొన్ని చిన్న – పెద్ద సందేహాలు పొందాడే గాని, సంశయములు తొలగనే లేదు. ఇంకా ఆత్మసాక్షాత్కారం పొందనే లేదు. ఇక అక్కడి నుండి లేచి ఆకాశంలోని మేఘంలాగా అటూ ఇటూ సంచరించసాగాడు. మరల ఒకసారి ఆటవిక గ్రామం, కీరదేశం వెళ్ళి తిరిగి నిజాశ్రమమైన గిరి ప్రాంతానికి వచ్చాడు. ఆశ్రమం చేరిన రోజు నుండి మరల విష్ణుభగవానుని ఆరాధించసాగాడు. అతి స్వల్పకాలంలో జనార్థనుడు మరల ప్రత్యక్షమైనారు. ఎవరికి ఆ విష్ణుదేవుడు ఒకసారి దర్శనమిస్తారో, అట్టివారికి ఆతడు బంధువు అవుతాడు. స్వామి చిరునవ్వుతో గాధిని సమీపించి ఆతని ప్రక్కనే చేరి కూర్చున్నారు.

శ్రీమన్నారాయణుడు : ఏమిటయ్యా? మరల నా దర్శనం కోరుకున్నావు? మళ్ళీ ఏమైంది?

గాధి : స్వామీ! సుస్వాగతం! మీకు శ్రమనుకలిగించి నందుకు క్షమించండి. ఏం చేయమంటారు మరి? ఈ మాయ యొక్క చమత్కారం నన్ను అత్యంత ఆశ్చర్యపరుస్తోంది.

హే శ్రీమన్నారాయణా! మీ దర్శనమైన తరువాత నేను కీరదేశం తదితర స్వప్న భావిత ప్రదేశములలో ఒక ఆరు నెలల పాటు తిరిగి వచ్చాను. క్రితంసారి వెళ్ళినప్పటి సమాచారం ఈసారి సమాచారంలో ఏమీ భేదం లేదు. ప్రభూ! "భూమండల ప్రదేశమంతా మాయ చేతనే చూచావు" అని మీరు అన్నారు కదా? మాయావశం చేత నేను గాంచినది "మరొకచోట – మరొక సమయంలో" ఎట్లు ఏర్పడి ఉన్నాయో నాకు బోధ పడుటలేదు.

ఇక రెండవ ప్రశ్న. నేను చూచిన మాయ నాకు సంబంధించినది మాత్రమే కదా! మరి కొందరు జనులు కూడా నేను చూచిన మాయలో భాగస్వాములై ఇప్పటికీ భౌతిక ప్రపంచంలో కొనసాగుతూ ఉన్నారే? ఆ ఆటవికుని వృత్తాంతమంతా ఈ ఇంద్రియములకు లభిస్తూ ఉండటం జరుగుతోందే? మీరు నాకు "ఇది మాయయే" – అని చెప్పారు. సరే, బాగానే ఉన్నది. మాయచే అంతరంగమున చూడబడినవి జగత్తులోనికి ఎలా "ఇతర జీవుల స్వతంత్ర రూపాలు"గా ఉన్నాయో నేను గ్రహించలేకపోతున్నాను. 1. అది మాయయే, 2. అక్కడి జనులు పూర్వాపరాలు ...ఈ రెండు విషయాలు సమన్వయ మగుటయేలేదు. పైగా అక్కడ అంతా చూచిన తరువాత నా మోహము మరింత అధికమైనది.

అయితే, సత్యస్వరూపులగు మీనోటివెంట 'అయథార్థం' అయినదేదీ రాదని నేను ఎఱుగుదును. మహాత్ముల వచనములు మోహమును తొలగిస్తాయేగాని, వృద్ధిచేయవు. అయితే నాలో తెలియరాని

అజ్ఞానం పేరుకొని ఉన్నది. మీ కృపచేత మాత్రమే అది తొలగగలదు. అందుకే మీ ముందు మరల ప్రస్తావిస్తున్నాను.

కీరరాజ్యం మొదలైనవన్నీ అక్కడ ఏర్పడి ఉండగా, "అదంతా భ్రమయే నయ్యా!" – అని చెప్పుచున్నారు. ఎందుచేత?

శ్రీమన్నారాయణుడు : ఓహో! అదా? ఆ విషయం కొంత చూచాయగా చెప్పే ఉన్నాను. మరికొంత వివరంగా చెపుతాను విను.

కీరదేశవాసులు – భూతమండలమున ఉన్న కీరదేశ వాసుల అందరి చిత్తము నందు కూడా నీ చిత్తమునందు లాగానే – కటంజుని ఆటవిక వృత్తాంతం అంతా కాకతాళీయన్యాయముచే ప్రతి భాసించటం జరుగుతోంది. అయితే ... ఒక వ్యక్తి నందు, లేదా ఒక సమూహమునందు... ఏదైతే మిథ్యారూపంగా ప్రతిభాసిస్తోందో – అట్టి ప్రతిభాస మొదలంట తొలగే వరకు అట్లాగే ప్రతిభాసిస్తుంది. జ్ఞానం వెల్లివిరిసినప్పుడు అదంతా మటుమాయమౌతుంది.

❖

ఆ ఆటవికశ్వపచుల కీకారణ్యగ్రామంలో ఒకానొక శ్వపచజాతివాడు ఒక గుడిసె నిర్మించుకున్నాడు. అక్కడికి ఇప్పుడు వెళ్ళిన నీవు, "ఈ గుడిసె నేను నిర్మించుకున్నదే" అని అనుకుంటున్నావు. "ఈ గుడిసె కటంజునిది" – అని అక్కడివారు తలచుచున్నారు. ఒక తాటిచెట్టుపై కొన్ని కాకులు వ్రాలినప్పుడు దూరంగా ఉన్న ఏదో వస్తువు ఆ చోట నుండి "తినే వస్తువు" లాగా ఆ కాకులన్నిటికీ అనిపించవచ్చు. వాటన్నిటిలోని ఆకలి, దప్పికల సంస్కారం చేత అది అట్లా అనిపిస్తోంది. అంతమాత్రం చేత ఆ చూడబడేది ఆహారపదార్థమే అవవలసిన పని లేదు.

అనేకులు ఒక చోట చేరి కల్లు సేవించారనుకో... వారందరికి పరిసరాలన్నీ తేలియాడుచున్నట్లు కనిపించవచ్చు గాక. అంత మాత్రంచేత అక్కడివన్నీ ఎందులోనో తేలియాడుచున్నట్లా? అట్లే ఒక్కొక్కసారి అనేకులు ఈ స్వప్నమాత్ర జగత్తును ఒకే భ్రాంతితో గాంచుచున్నారు. ఒకడు "నీవు నా తండ్రివి" అను భ్రాంతిని పొందుచుంటే, "అవును, నీవు నా ప్రియమైన కుమారుడివి" అని మరొకరు గాంచుచున్నారు. అంతమాత్రం చేత తండ్రి–కొడుకుల సంబంధంలో భ్రాంతి యొక్క విభాగము, పాత్ర లేదా? ఉన్నది. గడ్డి మొలచిన ప్రాంతంలో అనేక లేళ్ళు విశ్రమిస్తున్నట్లు, ఈ జీవులు ఒకే విధమైన భ్రాంతి విశేషంలో పాల్గొనుచున్నారు. ఒకే ఆటలో అనేకమంది బాలురు క్రీడించుచున్నారు చూచావా? ఒకే యుద్ధంలో అనేకమంది సైనికులు కలిసి "వీరు మన శత్రువులు... మేమంతా ఈ దేశం వాళ్ళం" – అని తలచుచు వధించటం, బంధించటం, జయించటం, పారిపోవటం, ఓడిపోవటం సామూహికంగా పొందుతూ ఉంటారే! ఓ గాధీ! ఈ సంసార జీవులంతా ఆ విధంగా పరస్పరం స్వప్నానుభవం వంటిది పొందుచున్నారు. ఒక కాలదృష్టితో మరొక కాలగమనాన్ని అల్పంగానో, అధికంగానో భావించటంకూడా మాయలోని విభాగమే. అఖండ పరమాత్మరూపమగు 'కాలము' అనబడునది ఆత్మ యందే స్థితి కలిగియున్నది. అయినప్పటికీ కాలము దేనికీ ప్రతిబంధకము

కాదు, ఉత్పాదకమూ కాదు... కాలస్వరూపుడగు భగవంతునికి రూపమంటూ ఏదీ లేనే లేదు. ఆతడు అఖండుడు. ఆతనినే "జన్మ, కర్మ – రహితమగు బ్రహ్మము" అని కూడా పెద్దలు చెప్పుచున్నారు.

గాధి : కాలము యొక్క రూపము ఈ సంవత్సర, యుగ కల్పములే కదా!

శ్రీమన్నారాయణుడు : నిజమే. అయితే కాలము సూర్య – చంద్ర గమనములచే కల్పితమైనదే. ఒక భావస్థిరత్వము అంగీకరించిన తరువాత కాలము పొందబడుచున్నది. ఉత్పాతరూపమగు కాలముచేత తదితర సర్వ పదార్థములు పరికల్పితమగుచున్నాయి.

❖

"భ్రాంతి చిత్తులగు జీవులు ఒకే విధమైన ప్రతిభాస (లేక) భ్రమచే ఒకే విధమైన సంభ్రమము పొందుతూ ఉంటారు" – అనునది ఇక్కడ సిద్ధాంతం. ఈ సిద్ధాంతమును అనుసరించే కీరదేశవాసులు "ఆటవికుడు రాజగుట" – అనుదానిని గాంచినారు. నీవుకూడా ఆ రీతిగానే అదంతా పొందావు. అందుకే అదంతా 'మాయయే' అని చెప్పాను.

సరే! అయినదేమో అయింది. ఇప్పుడు చిత్తనైర్మల్యము నీవు సంపాదించాలి. మనస్సును అధిగమించి స్వబుద్ధిచే ఆత్మవిచారణ చేయి. అందుకు నీ ఆశ్రమవాసానికి సంబంధించిన తపోధ్యానములను నిర్వర్తిస్తూ ఉండు. మరి ఇక నాకు సెలవా?

❖

ఇట్లు పలికి విష్ణు భగవానుడు అంతర్ధానమైనారు. గాధి మాత్రం మోహముతో కూడిన మనోవ్యాధి నుండి బయటకు రాలేకపోయాడు. ఇంకా అధికమైన స్థూలబుద్ధికలవాడై ఏవేవో అనుమానాలతో సతమతమవసాగాడు. కొద్దిరోజులు గడచిన తరువాత మరల విష్ణు భగవానుని ఆరాధించటం ప్రారంభించాడు. మరల విష్ణుదేవుడు ఆతని యందు ప్రత్యక్షమైనారు. ఆతడు ప్రణామం చేసి, మనోవాక్కాయములచే పూజించి మరల ఇట్లు పలుకసాగాడు.

గాధి : దేవాదిదేవా! మీరు 'అదంతా మోహమే' అని చెప్పివెళ్ళారు, బాగానే ఉంది. కానీ, ఆ ఆటవిక జీవితం, చావు, పుట్టుక మొదలైన అనేక అనర్థములతో కూడిన ఆ సాంసారిక వ్యవహారమంతా తలచుకుంటేనే ఇప్పటికీ ఎంతో భయం వేస్తోంది. నా చిత్తము విషాదముతో విమోహితమౌతోంది. ఇప్పుడు ఈ మోహబుద్ధి తొలిగేది ఎట్లా? హే భగవాన్! భక్త సులభుడా! నాలోని మోహం నివృత్తి చేయమని చెప్పి, మీరు వెళ్ళిపోతే చాలదు. నివృత్తి అయ్యే వరకు మీరు ఇక్కడే ఉండండి. నన్ను ఏదైనా పవిత్ర కార్యక్రమము నందు నియమించండి. నన్ను కాపాడండి.

శ్రీమన్నారాయణుడు : (పకపకానవ్వుచూ) శంభరాశురుని ఆడంబరంలాగా ఈ జగత్తంతా మాయామయమైనదే! అట్టి ఆశ్చర్యకరమైన 'కల్పన' అంతా ఆత్మతత్త్వవిస్మరణ చేతనే ఉద్భవించింది. ఆటవిక గ్రామం, ఆ కీరదేశ రాజరికం, తదితర వృత్తాంతములు అజ్ఞానవశంచేత తప్పక సంభవమే. స్వప్నంలో ముందుగా అనుకోని ఏవేవో విషయాలు, ఎప్పుడో చనిపోయిన వ్యక్తులు స్వప్నద్రష్టకు సత్యమువలే అనుభవమగుచున్నాయి కదా?

భూత మండలములోని కీరదేశవాసులు కూడా నీలాగానే భ్రమను పొందుచున్నారు. నీవు వారి దగ్గిరకు పోయి సంభాషించినప్పుడు వారు తమ భ్రమలనే వల్లించిచెప్పారు. అవి విని నీవు నీ భ్రమచే "ఇట్లా ఎట్లా అయినది?" అని వేదన పొందుచున్నావు. నీ సుస్పష్టత కొరకు నీ అనుభవములోని మరికొన్ని విశేషాలు చెప్పుతాను. ఇవి వింటే నీ చింతలు తొలగుతాయి.

❖

కటంజుడు అను ఒకానొక జీవుడు ఇప్పుడు నీచే గాంచబడిన శరీరము, గ్రామము, గృహము కలిగి పూర్వము భూత మండలమున (In the zone of matter) జనించి ఉన్నాడు. ఆతడు అదే విధంగా తన కుటుంబసభ్యులను పోగొట్టుకుని ఆ తరువాత కీర రాజ్యానికి ప్రభువు అయినాడు. ఆ తరువాత జనులకు తన జన్మరహస్యం తెలియుటచే అగ్ని ప్రవేశం చేశాడు.

నీవు తటాకంలో ప్రవేశించి అఘమర్షణ మంత్రం జపిస్తూ ఉండగా, నా సంకల్పవశం చేత ఆ కటంజుని (ఆటవికుని) వృత్తాంతము (లేక) అనుభవమంతా నీ అంతఃకరణంలో ప్రకాశించింది. అట్లా ప్రకాశిస్తున్న దానినంతా పొందుతూ, "నేను కటంజుడను" అని నీవు అందలి అనుభవ పరంపరలన్నీ పొందావు.

ఈ చిత్తము బహుమచత్కారమైనది. అది ఒకప్పుడు తాను చూచినది విన్నది క్షణంలో త్యజిస్తుంది. మరొకప్పుడు, సుదీర్ఘ కాలం కలిగి ఉంటుంది. చూస్తూనే, చూడకుండా ఉండిపోతుంది. అసలు ఏ మాత్రం ఎన్నడూ చూడనివి పొందుతూ పోతుంది. ఒకడు స్వప్నంలోను, మనోరాజ్యంలోను, సన్నిపాత సమయము నందు రకరకాలైన అనేక దృశ్యవ్యవహారములను గాంచటం తెలుసు కదా! ఆ విధంగానే జాగ్రత్తులో కూడా స్వయముగా భ్రమను వీక్షించగలదు.

ఇందుకు దృష్టాంతాలు అనేకం చెప్పుకోవచ్చు. త్రికాలజ్ఞుడైన ఒక యోగి దృష్టి యందు భవిష్యత్ కాలము నందలి సమస్తమూ భూతకాలస్థము వలే తెలియుచున్నది కదా! అట్లాగే గడచి పోయిన కటంజుని చరిత్ర వర్తమాన కాలమైన నీ బుద్ధియందు నా సంకల్పముచే కనిపింపజేయటం జరిగింది. అయితే ఇక్కడొక చిత్రం! అప్పటి ఆయా అనుభవాలలో నిమగ్నమైనది నీవేగాని, అట్లు నిమగ్నమవటానికి నేను చేసింది ఏమీ లేదు. నేనల్లా, నీ మనోదర్పణంలో కొన్ని అనుభవ పరంపరలను ప్రతిబింబింప జేసాను. అంతేఁ!

"ఈ శరీరాదులు నేను... ఈ కుంటుంబము, ఇల్లు, వాకిలి నావి... వీరు నా వారు... ఇది నా ఊరు... ఇవి నా కులగోత్రములు" – అనునట్టి అనేక భ్రమలందు అజ్ఞాని నిమగ్నుడగుచున్నాడు. వాటిని మహత్తరమైనవిగా గాంచుచు తాదాత్మ్యము చెందుచున్నాడు. కానీ జ్ఞాని అవే సంఘటనలను పొందుచున్నప్పటికీ, గాంచుచున్నప్పటికీ, వాటియందు ఏమాత్రం నిమగ్నుడు అగుటలేదు. ఎవ్వడైతే "సమస్తమూ ఆత్మయే" – అను సర్వాఽహమ్ భావనను కలిగి ఉంటాడో ఆతడు వాటియందు ఏ మాత్రం నిమగ్నుడు కాదు. అందుచేత, ఆతడు ఈ పదార్థవిభాగముచే కలుగు అనర్థభావమును అతడు పొందకుండానే ఉంటాడు. పరిచ్ఛిన్న పదార్థములందు కలుగుచుండే అహంభావనయే

బంధకారణమగుచున్నది. అంతకుమించి ఈ జీవునకు వేరుగా బంధమెక్కడిది? ఈ జీవుడు వాస్తవానికి అమృతతుల్యమగు శుద్ధ చైతన్యస్వరూపమే కదా! ఎండు సొరకాయ బుఱ్ఱ నీటిలో పడినా నీటిలో మునుగదు చూచావా? సత్యాసత్యవివేకి అయినట్టి జ్ఞాని భ్రమలలో, సుఖ దుఃఖాలలో మునుగడు.

నీవు ఇంతకు ముందు వాసనాజాలగ్రస్థుడవు, విచేతసుడవు (one who adopted ignorance and illusion) అయ్యావు. అందుచేతనే నీ అంతరంగము నందు ఆ కటంజుని వృత్తాంతమంతా దోషబుద్ధిచే పొడమినది. అనగా 'అజ్ఞానము' అనే మనోవ్యాధి నీయందు ప్రవర్తించటం జరిగింది. అజ్ఞానము తొలగకపోవుట చేత ఇంకా నీ ఆత్మస్వరూపమును నీవు దర్శించుటలేదు. వర్షం పడుతుంటే ప్రయత్నం చేసి ఇంటిలోకి పరుగులు తీసేవాడే జడివాన నుండి తప్పించుకోగలడు. నిలబడి వర్షం పడే చోటే ఉండేవాడు తడవక ఏంచేస్తాడు? పూర్ణజ్ఞానము లేకపోవుట చేత నీవు చిత్తభ్రమను తొలగించుకో లేకపోయావు. అందుచేతనే నీ చిత్తంలో ఏదేది భాసిస్తుందో – అద్దాని యందలి అభిమాన కారణంగా వెంటనే దానికి వశీభూతుడవగుచున్నావు.

మాయ నాలుగువైపులా విస్తరించి ఉన్నది. అట్టి ఈ మాయ యొక్క నాభిస్థానము (It's Root) చిత్తము నందు ఉన్నది. అట్టి చిత్తము లేక మనస్సును ఎదుర్కొని పోరాడాలి. మనస్సును ఆత్మ యందు లయింప జేసి, దానిని రహితం చేయాలి. అట్టి వారిని మాయాచక్రం ఇక ఏమీ చేయలేదు, ఏమాత్రం బాధించలేదు. కనుక ఓ గాధీ! నీవిక లెమ్ము. మనోనిరోధకమగు తపస్సును ఇక్కడే పది సంవత్సరాలు ఆచరించు. అంతేగాని నిష్ఫలమైన వేదన, అభిలాషలతో కాలం వృథా చేసుకోకు. నిర్మలహృదయం సంపాదించావా... అనంత – అఖండ జ్ఞానం పొందగలవు.

ఇట్లు పలికి విష్ణుభగవానుడు అంతర్ధానమైనాడు.

❖

భగవానుడు చెప్పినదంతా ఆ గాధి మరల మరల విచారణ చేశాడు. ఇతఃపూర్వపు కటంజుని భావపరంపరలను పరిశీలించి విచారణ చేశాడు. భావప్రదర్శనరూపమైనట్టి విచిత్రమైన దైవగతి – జగత్‌గతిని విశ్లేషించి చూచాడు. వివేక వైరాగ్యములు పొందాడు. "అహో! నా చిత్తము నందు ప్రతిబింబించిన కొన్ని క్రియా విశేషములను నేను చేస్తున్నట్లు భావించి భ్రమించాను కదా! ...వాస్తవానికి సర్వవేళలా నేను విజ్ఞానస్వరూపుడనే!" అని గ్రహించాడు. చిత్త నిరోధము కొరకు, జ్ఞానలక్ష్మిని సంపాదించటానికి ఆతడు ఋష్యమూకపర్వతంపైకి వెళ్ళాడు. విష్ణుభగవానుడు ఆజ్ఞాపించినట్లు అక్కడ పదేళ్ళు తపస్సు చేశాడు. క్రమంగా భయ, క్రోధములను విసర్జించి పారమార్థిక సత్త"ను అవధరించాడు. జీవన్ముక్తస్వరూపుడైనాడు.

బ్రహ్మానందనిమగ్నుడై, పరిపూర్ణచిత్తుడై, పూర్ణ చంద్రుని వలె అనంత బ్రహ్మాకాశము నందు విహరించసాగాడు.

❖❖❖

5. విచారణ యొక్క ఆవశ్యకత (The need of Analysing)

శ్రీవసిష్ఠమహర్షి : చూచావా రఘునందనా? ఈ విధంగా 'మాయ' అతివిశాలము, అచింత్యము, మహా మోహమయము, భయంకరము కూడా అయి ఉన్నది. అది పరమాత్మను ఆశ్రయించుకొనియే ఉన్నది. లేకపోతే 4,5 నిమిషాల పరధ్యానం ఎక్కడ? '60' సంవత్సరాల ఆటవిక జీవుని అనుభవం ఎక్కడ? అసత్యమైనదేది? సందిగ్ధరహితమైన సత్యమేది? అందుకే ఈ 'మాయ' మహామోసకారి అని చెబుతారు. అసావధానచిత్తుని అది క్షణంలో సంకటములందు పడవేయగలదు.

శ్రీరాముడు : అవును స్వామి! మీరన్నట్లు మాయ అతిచమత్కారమైనదే! వేగంగా తిరుగుచూ, సర్వాంగాలను ఛేదించ గల ఈ మాయను విజ్ఞులగువారు ఎట్లా నిరోధించగలుగుచున్నారో చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : నాయనా! ఈ సంసారరూప మాయాచక్రం నలువైపులా విస్తరించియున్నది. ఇట్టి సంసార చక్రము యొక్క ఇరుసు (Inner - wheel) ఈ మనస్సేనని గ్రహించు. పురుషప్రయత్నం చేత, ధీరబుద్ధి చేత ఈ మనస్సు (లేక) చిత్తమును నిరోధించామా... మాయ యొక్క చక్రభమణం కూడా దానంతట అదే ఆగిపోతుంది. పిల్లలు ఆడుకునే త్రాడుతో చుట్టబడిన చక్రం యొక్క భ్రమణం ఆ త్రాడును పట్టుకుంటే ఆగిపోతుంది కదా? ఈ మనస్సును నిరోధించాలి. ఇక మోహం ఉండదు.

ఓ రామా! నీవు చక్రయుద్ధంలో కుశలుడవే కదా! ఈ మాయాచక్రం నిరోధించటానికి ఎందుకు ప్రయత్నించకూడదు? నాభిస్థానం పట్టుకుంటే, చక్రం ఆగిపోతుంది. కాక ఆ చక్రం యొక్క తదితర భాగములను పట్టుకోబోయామా... చేతికి గాయం కాగలదు. ఈ మనస్సును నిరోధించాలి. ఇక మోహము ఉండదు.

ఈ మనస్సు 'జన్మజరామరణములు' అనే సంసారచక్రంలో ఇరుసులాగా ఉంటోంది. మనస్సును మనస్సుతోనే నిరోధించాలి. ఉద్ధరించాలి, పరిభ్రమణము నుండి ఈ మనస్సును మళ్ళించు. ఆత్మయే తన స్వరూపముగా కలిగియుండి కూడా ఈ జీవుడు ఎందుకు దుఃఖములు పొందుచున్నాడు?

ఎందుకో విను– ఈ జీవుడు తన దేహభృతి కొరకై చాలా ఉపాయములను అందిపుచ్చు కుంటున్నాడు. మరి చిత్తము గురించో? ...చిత్తమును నిరోధించ గల ఉపాయములు ఆశ్రయించక పోవుట చేతనే అనేక దుఃఖపరంపరలను ఒకటి తరువాత మరొకటిగా పొందుతూ పోతున్నాడు. చిత్తము నిరోధించబడితే, ఇక కృత్రిమమగు దీనస్థితులన్నీ తొలగిపోయినట్లే. ఈ సంసార మహారోగం ఉపశమించాలంటే 'చిత్తనిరోధము' తప్ప వేరే ఔషధం లేనే లేదు. మరి, తపో–దాన–తీర్థ క్రియాదులంటావా... అవన్నీ చిత్తనిరోధము కొరకే ఉన్నాయి.

అందుకని, 'పరమశ్రేయమైనట్టి చిత్తమును వశపరచుకొనుట' అనుదాని గురించి యోచించు. ఆ పని వదలి చిన్నపిల్లల ఆటల లాగా ఏవేవో కార్యక్రమాల వల్ల ఏం ప్రయోజనం? కుండ యొక్క ఆకాశం కుండలోనే ఉన్నట్లుగా, చిత్తము నందే ఈ సంసారమంతా ఉన్నదని పదే పదే ప్రకటిస్తున్నాను. కుండపగిలితే 'ఘటాకాశం' (Space belonging to the pot) అనేది ఉంటుందా? ఎక్కడుంటుంది?

చిత్తము నశించిందా – సంసారము కూడా నశిస్తుంది. నీవు 'చిత్తము' అనే కుండను 'ఆత్మ తత్త్వ జ్ఞానము' అనే ఉపకరణముచే పగులగొట్టి బ్రహ్మాకాశములో ప్రవేశించు.

శ్రీరాముడు : అచిత్తత్వదశ ఎలా పొందటం?

శ్రీవసిష్ఠమహర్షి : అందుకు రెండు ఉపాయాలను చెపుతాను.

1. వర్తమానంలో ప్రాప్తించే విషయములను బాహ్యబుద్ధితో మాత్రమే సేవించటం.
2. భూత – భవిష్యత్తుల గురించి అనుసంధానమే చేయకపోవటం.

ఈ రెండు ఉపాయాలను అనుసరించు. అప్పుడు చిత్తము అచిత్తత్వదశను తప్పక పొందగలదు.

భవిష్యత్ - భవిష్యత్తు గురించి సంకల్పములను, సంబంధములను, పదార్థభావములను క్రమంగా త్యజిస్తూ వచ్చావా... అప్పుడు పరమపావనమగు చిత్తరహితస్థితిని తప్పక పొందగలవు. చిత్తము అంటే సంకల్పములే!

సంకల్పములు ఉన్నంతవరకూ సంకల్పవిభూతులు (Effects of Perceptions) ఉండియే ఉంటాయి. అవి ఉంటే చిత్తము కొనసాగుచూనే ఉంటుంది. సంకల్పములు కాకుండా చిత్తమునకు వేరే రూపమెక్కడిది? కనుక రామా! నీవు నీ అంతరంగమునందు సర్వసంకల్పములు త్యజించివేయి. ఆత్మ చిత్తరహితమై ఉంటే, "ఆత్మ తన కూటస్థ రూపమున ఉన్నది" అని అంటాం. అప్పుడు ఈ సంసారమునకు మూలభూతమైన "కామ, కర్మ, వాసనలు" మూలజ్ఞానంతో సహా పటాపంచలవుతాయి. ఇదియే మహాసిద్ధ మంత్రం.

ప్రత్యక్ చైతన్యము - చిత్తరహితమగు ఆత్మను "ప్రత్యక్ చైతన్యము" అని అంటూ ఉంటారు. స్వస్వభావయుతము, మనోరహితము అయిన ఆత్మయందు కల్పనారూపమైన మాలిన్యమే ఉండదు. ఆత్మ యొక్క మహత్తర స్థితి ఏమిటో గ్రహిస్తే – అది వాస్తవానికి చిత్తము లేనట్టి పరమార్థ స్థితియే అవుతుంది. మనందరి స్వస్వరూపమగు ఆత్మ స్వతఃగా నిరతిశయానంద స్వరూపము, పరమాత్మ స్వభావము, సర్వజ్ఞము, సమ్యక్‌దృష్టిమయము అయి ఉన్నది.

ఆశల నుండి దుఃఖం - శ్మశానంలో కాకులు ఉన్నట్లు ఎక్కడ ధ్యాస – ఆసక్తి ఉంటే, అక్కడ ఆశలు ఉంటాయి. ఎక్కడ ఆశలు ఉంటే అక్కడికి సుఖ, దుఃఖములన్నీ వచ్చి చేరుతాయి. ఆశ నుండే మిగతా సంసారమంతా పరిఢవిల్లుతోంది. స్వస్వరూపాత్మ యొక్క 'ఏమఱుపు' చేతనే బాహ్యత్వ పూర్వకమైన "ధ్యాస" ప్రభవించి ప్రవృద్ధమౌతోంది. వస్తుతత్వమేమిటో గ్రహించిన జ్ఞానుల మనస్సునందు 'ఆశలు' అనేవే ఉండవు. ఇదంతా మిథ్యయేనని వారికి తెలుసు.

శ్రీరాముడు : పదార్థములలోని మిథ్యాత్వము జీవుడు గ్రహించేది ఎట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : శాస్త్ర – సజ్జన సాంగత్యముల సహాయంచేత 'మనోనిరోధం' నిరంతరం అభ్యసిస్తూ రాగా, అప్పుడు ఈ వస్తువులందలి అవస్తుతత్వమేమిటో ఎరుగబడుతూ ఉంటుంది. అందుచేత, ఓ సభికులారా! దృఢ ప్రయత్నములచే, సునిశ్చియములచే, శాస్త్ర–సత్సాంగత్యాదులచే క్రమంగా ఈ చిత్తములోని అవివేకమును తొలగించండి. బలవంతంగా అయినా సరే, ఆ మనస్సును ఆత్మ

యందు ప్రవేశపెట్టండి. ముల్లును ముల్లుతోనే తీయగలం. వజ్రమును వజ్రముతోనే సానపెట్టగలం. పరమాత్మ దర్శనమునకు ఆత్మజ్ఞానమే ముఖ్య కారణమగుచున్నది.

శ్రీరాముడు : మహర్షీ! ఆత్మజ్ఞానమునకు ముఖ్యకారణమగుచున్నదేది? మరొక్కసారి చెప్పండి.

శ్రీవసిష్ఠమహర్షి : స్వానుభూతములగు సుఖ – దుఃఖములను ఆత్మయే త్యజించుటకు ఇచ్ఛగించుచున్నది కదా! కనుక ఆత్మజ్ఞానమునకు ఆత్మయే ముఖ్యకారణం. అందుచేతనే, "బద్ధుడనై ఉన్న నేను ఉద్ధరించ బడేది ఎట్లా?" – అని తలచువానికి మాత్రమే శాస్త్రములు, గురువులు మార్గము చూపగలుగుతాయి.

మనోరహితం - ఓ రామచంద్రా! నీవు మాట్లాడుచున్నప్పుడూ, ఇచ్చుచున్నప్పుడూ, పుచ్చుకొను చున్నప్పుడూ, కనులు మూసినప్పుడూ, తెరచినప్పుడూ, అన్ని సమయములలో మనోరహితుడవై ఉండు. లేక, ఆత్మవస్తువును మాత్రమే మననం చేస్తూ ఉండు. కేవలం చైతన్యమును మాత్రమే పారాయణం చేస్తూ ఉండు. నిరంతరం ఆత్మచింతనచే ఆత్మయొక్క నిర్మలత్వం అనుభవం కాగలదు.

నాయనా! నీవు జన్మిస్తున్నప్పుడు, జీవిస్తున్నప్పుడు, మరణిస్తున్నప్పుడు, తదితర మహర్దశ – దుర్దశ లందు, నిష్క్రియుడవైనప్పుడు, క్రియాతత్పరుడవైనప్పుడు, అన్ని వేళలా "నేను శుద్ధమగు ఆత్మ సత్తయే కదా" అనునట్టి కేవల చైతన్యాంశమునందే సుస్థిరుడవై ఉండు. "నాది, నాకు చెందినది, నా దేహము, నాకు సంబంధించినవారు" అను రూపము గల సర్వవాసనలూ త్యజించు. సర్వదా తదేక నిష్ఠతో చైతన్య మాత్ర తత్పరుడవగుము. వర్తమానంలో, భూతకాలపు యోచనలలో, రాబోవు వార్ధక్యాది దశలలో, రాజత్వాది స్థితులలో, దేహం ఉన్నప్పుడు, లేనప్పుడు – అన్ని వేళలా చైతన్య మాత్రము నందే ఏకైక 'నిష్ఠ' కలిగి ఉండు. అద్దానినే భావించు, అనుసంధానం చేయి. సమాధి తత్పరుడవగుము.

సర్వకాల, సర్వావస్థల యందు "నేను ఆత్మ స్వరూపమగు చైతన్యమును. అదియే ఒక పురుగు నుండి బ్రహ్మదేవుని వరకు కూడా" – అను ఎఱుకను వదలనే వద్దు. బాల్య, యౌవన, వార్ధక్యాల లోనూ, జాగ్రత్, స్వప్న, సుషుప్తులలోనూ కేవల చైతన్యమునే ఆశ్రయించు. అద్దాని యందే నీ నిష్ఠ అంతా ప్రతిష్ఠించబడు గాక! 'బాహ్య విషయాలు' అనే మాలిన్యం నీచే త్యజించబడు గాక!

మనస్సును ఆత్మ యందు విలయమొనర్చుచూ, ఆశాపాశములను త్వరత్వరగా విచ్ఛేదన మొనర్చుచుండుము. అప్పుడు కేవలం విజ్ఞాన స్వరూపము నందు సంస్థితుడవగుటలో నీకేమీ కష్టముండదు.

సంబంధమే లేదు.... నీయందు శుభ, అశుభములు, ఇష్ట అయిష్టములు, ఆశ నిరాశలు శమించు గాక! ప్రతిజీవుడు తాను కోరుకుంటున్న ఉత్తమశాంతి, ఆనందములను ఆత్మ చైతన్యమును ఆశ్రయించినప్పుడే పొందగలడు. కర్మ–కర్తృ–కరణ సహితుడవై ఉన్నప్పటికీ, నీవు మాత్రం వాటన్నిటి కంటే వేరైన వాడివై ఉండుము. విజ్ఞానమయ బుద్ధి కలిగి ఉండు.

ఈ ఇంద్రియములు, ఇంద్రియవిషయములు నిన్ను స్పృశించనట్టి సాక్షిరూపమును వహించు. ఒక అద్దంలో ప్రతిబింబించే వ్యవహారంలాగా ఈ సర్వదృశ్యవ్యవహారములను గాంచుచుండుము.

అద్దమునకు అందులో ప్రతిబింబించే దృశ్యమునకు సంబంధమే ఉండదు కదా! ఆ అద్దం 'ఇవి నా వస్తువులు' అనే మమకారం ఏమైనా కలిగి ఉంటుందా?

నీకు కూడా (దర్పణము – దర్పణాంతర్గత ప్రతిబింబిత వస్తువు వలె) ఈ సంసారముతో ఏమాత్రం సంబంధమే లేదు. ఉండవలసిన పని లేదు. సాక్షిరూపమున సర్వ వ్యవహారములు గాంచు చుండుము. 'నిర్వికల్పము – నిరాలంబము' అయినట్టి కేవల నిజరూపము (one's own absolute form) అగు చిన్మాత్రము నందు స్వరూపస్థితి కలిగి ఉండు.

❖

ఓ రఘువీరా! నీవు ఈ జాగ్రత్–స్వప్న–సుషుప్తులకు సంబంధించినవాడవే కావు. అట్లాగే, సృష్టి–స్థితి–ప్రళయములు కూడా నీకు లేవు. అందుచేత ముక్తిరూపమున వీటన్నిటికీ ఆవల ఉన్న పరబ్రహ్మమే నీవై ఉండు.

నీవు సర్వ దృశ్యములను కేవలం ప్రకాశింపజేయువాడవు. గదిలో దీపముచే ప్రకాశించబడే వస్తువులకు దీపము యొక్క ప్రకాశమునకు సంబంధమేమున్నది? నీచే ప్రకాశింపజేయబడుచున్న – అనగా గాంచబడుచున్న – వస్తుజాలమునకూ, నీకూ సంబంధము లేదు. అట్టి బుద్ధి వృత్తులకు ఆవల ఉంటూ, "బుద్ధి వృత్తులను కూడా ప్రకాశింపచేయుచున్న చిన్మాత్రమునే నేను" అని గ్రహించి, అచ్చుట స్థిరుడవై ఉండు.

నిజచైతన్యం - 'స్వ–పర' ధ్యాసలను త్యజించివేయి. ఈ జగత్తు ఉన్నా, లేకున్నా నీవు మాత్రం 'విభాగ రహితమైన వజ్రస్తంభం' లాగా ఆత్మను ఆశ్రయించి స్థిరంగా ఉండు. సంకల్ప మయములే అయినట్టి లౌకిక విషయాల మధ్య ఉండవలసి వస్తున్నప్పుడు 'ధీరత్వ – ధార్మిక' భావాలు కలిగి ఉండి, అదే సమయంలో 'ధర్మాధర్మ రహిత స్థితి' ని పొంది ఉండు.

❖

ఓ రాజీవలోచనా! రఘుపుంగవా! ఎవడైతే జ్ఞానమాత్రము – సాక్షీరూపము అగు తన ఆత్మ తత్త్వమును అనుభూతమొనర్చుకుంటాడో అట్టివానికి హాలహల విషం కూడా అమృతతుల్యమే అవుతుంది. ఈ జీవులలో అనేకులు 'నిర్మలము – నిరవయవము' అగు తమయొక్క శుద్ధచైతన్యమును విస్మరించటం చేతనే అజ్ఞానం ఉదయిస్తోంది. అజ్ఞానం చేత సంసారభయమునకు సంబంధించిన మహామోహము పుట్టుకొస్తోంది. అదంతా సర్వ అనర్థములను ఉత్పత్తి చేస్తోంది.

కనుక నిర్మలమగు నిజచైతన్యమును జపిస్తూ ఆరాధిస్తూ మననం చేస్తూ రాగా, ఈ సంసార భ్రమకు కారణమగుచున్న మహామోహం దానంతట అదే తొలగిపోతుంది. ఇందులో సందేహించ వలసిన పనేమీ లేదు.

ఆశ క్షీః జ్ఞానం - ఎవడైతే స్వస్వరూపమును అవధరించి 'ఆశ' అనే మహాసముద్రాన్ని దాటివేస్తాడో, అప్పుడు జ్ఞానభాస్కరుని కిరణాలు ఆతడున్నచోట నలువైపులా ప్రసరిస్తాయి. జ్ఞానమున్న చోట ఆశ ఉండదు. ఆశ ఉన్నచోట జ్ఞానము పెంపొందదు.

స్వాత్మభావమును అవలోకిస్తూ, అద్వైత బ్రహ్మానందమున సంస్థితుడైన మనుజునకు మిక్కిలి రుచికరమైన అమృతం కూడా ఎక్కడబడితే అక్కడ ఉండే నీరులాగా గోచరిస్తుంది. ప్రత్యగాత్మ భావం పొందిన అట్టి జీవన్ముక్తులతో మునులమగు మేము ఎల్లప్పుడూ మైత్రి కలిగి ఉంటాం.

ఇక ఈ విషయం ఎరుగని మనుజుల విషయమంటావా... మా దృష్టిలో వారు మనుజాకారంలో ఉండే జంతుజీవుల వంటివారే. 'స్వజ్ఞానం' కారణంగా 'సర్వోతీత–సర్వ స్వరూప స్థితి – సర్వోన్నత స్థితి' ని పొందిన తత్త్వజ్ఞాని వద్దకు తదితర జ్ఞానార్తులు, యోగులు జ్ఞానం కొరకై సమీపిస్తూంటారు.

తత్త్వజ్ఞుడు - 'దివ్యజ్ఞాన నేత్రయుతుడు' అగు తత్వవేత్త ఏది ఎట్లు దర్శిస్తున్నాడో – అది తత్త్వజ్ఞులు కాని వారిచే ఇంతవరకూ దర్శించబడుటలేదు. ఇక ముందు దర్శింపబడజాలదు. ఈ సూర్యప్రకాశం సహాయం లేకుండానే వారు అంతర్లీన సత్యాన్ని సుస్పష్టంగా చూస్తున్నారు.

ఏ జీవుడైనా సరే, స్వజ్ఞాన వశం చేతనే సర్వోన్నత స్థితిని పొంది ఉంటున్నాడు. మిట్టమధ్యాహ్నం దీపపు వెలుగు ఒక అవస్తువే కదా! బ్రహ్మవిద్యచే ఆత్మను ఎఱిగిన వానికి సూర్య, ఇంద్రాది ఆయా మహా లోకములన్నీ అవస్తువులే అవుతాయి. ఓ రామా! మహాతేజస్సు కలవారి లోనూ, యోగ – వశిత్వాది సిద్ధులు పొందిన వారిలోనూ, బలవంతులలోనూ, ఆయురైశ్వర్యములు కలవారి లోనూ, గొప్ప విద్వత్తు, వక్తృత్వములు కలవారి లోనూ – వీరందరిలో తత్త్వజ్ఞానము ఉన్నవాడే అత్యంత ఉన్నతుడై వెలయుచున్నాడు.

ఆత్మజ్ఞాని ఔన్నత్యం - పరమేశ్వరుని నిజరూపం ఆత్మయే. ఆత్మరూపుడగు పరమేశ్వరుని ప్రకాశం చేతనే ఈ సూర్య, చంద్ర, అగ్ని, మణి, తారలు ప్రకాశిస్తున్నాయి. జ్ఞేయులగు – జ్ఞాత (తెలిసికొను దానిని తెలిసియున్న వారగు) తత్త్వజ్ఞుల ప్రభావం చేతనే ఈ జగత్తులో ఆనందవీచికలు ప్రభవిస్తున్నాయి.

ఆత్మజ్ఞాన రహితులగు మానవులు నేలలో పురుగుల కంటే, కీటకముల కంటే, జంతువుల కంటే అధికులేమీ కాదు. ఎందుకంటే, ఒకడు ఆత్మజ్ఞుడు అవనంత వరకూ 'మోహము' అనే పిశాచం విజృంభిస్తూనే ఉంటుంది. తత్త్వవేత్తల దృష్టిలో ఆత్మజ్ఞుడు మాత్రమే సచేతనుడు. అతడు మాత్రమే స్వతంత్రాన్ని అనుభవిస్తున్నాడు. ఆత్మజ్ఞుడు కానివాడు దేనికీ స్వతంత్రుడు కాదు. అందుచేత అచేతనుడే. ఆతడు దుఃఖము కొరకే అనేక ఆశలు, ఉద్వేగములు, తాత్సారములు కలిగి ఉంటున్నాడు.

అజ్ఞాని సర్వదా మృతుడే. ఆత్మజ్ఞుడే సజీవుడు.

ఆత్మానుభవ ప్రభావం - ఆకాశంలో దట్టంగా మేఘములు అలుముకున్నప్పుడు నాలుగు వైపులా ప్రకాశము సన్నగిల్లుతుంది కదా!... ఈ చిత్తము స్థూలపదార్థములను రాగయుక్తముగా భావిస్తూ ఉన్నప్పుడు స్థూలమగుచున్నది. అట్టి సమయంలో ఆత్మజ్ఞానం పలాయనం చిత్తగించుచున్నది. అయితే జ్ఞాని తన మనస్సులోంచి క్రమంగా విషయభోగాలందలి అభిలాషను తొలగిస్తూ ఉంటాడు. ప్రాప్తించిన వాటి పట్ల లోభము గాని, ప్రాప్తించని వాటి పట్ల ఆశ గాని ఆతనికి ఉండదు. తన మనస్సును ఎండుటాకు వలె కృశింపజేస్తాడు. సర్వకాల, సర్వావస్థల యందును 'ఆత్మజ్ఞానము'

అనే అమృతమును సేవిస్తూ సంతృప్తిగా, ప్రశాంతంగా ఉంటాడు. ఆతనికి ఈ జన్మ, జరా, మృత్యువులు గానీ, వాటి మధ్య సంఘటితమయ్యే ఆయా వ్యవహారములు గానీ ఒక లెఖ్ఖలోనికిరావు. ఆతడు అనాత్మ యందు ఆత్మభావము కలిగి ఉండడు. ప్రతి అనుభవమును ఆత్మభావముచే పునీతం చేసి మహాప్రభావ సంపన్నుడై ఉంటాడు.

అనాత్మభావం - ఓ రామచంద్రా! స్వతహాగా సూక్ష్మమే అయిన ఈ చిత్తము చమత్కారంగా స్థూలత్వం పొందుతోంది. ఈ దేహము పట్ల ఆశచేతను, పుత్ర, దార, ధనాది విషయాలపై ఏర్పడే మమకారము చేతనూ చిత్తము స్థూలపడుతోంది. అదంతా భ్రాంతి చేతనే. అహంకారము యొక్క వికారమే మమకారభ్రాంతి! దృశ్యము నందు ఏర్పడుచున్న భ్రాంతి పూర్వకమైన ఆసక్తి 'ఈ శరీరమే నేను' అను ఒకానొక అజ్ఞానవృత్తిని వృద్ధి చేస్తోంది. వ్యర్థమైన పదార్థములను ఇచ్ఛగించుట చేత, దోషభావముల చేత, జరామరణముల పట్ల గల దురవగాహనల చేత బుద్ధి అనారోగ్యమగుచున్నది. "బాహ్య వస్తుజాలం రమణీయమైనది" – అనే వికల్పభావం చేత, "ఇవి స్థిరంగా ఉండగలవు" అనే తుచ్ఛవిశ్వాసం చేత ఈ జీవుడు త్యాజ్యగ్రాహ్య వ్యవహారములన్నీ శ్రమించి మరీ స్వీకరిస్తున్నాడు. ఫలితం? ఆతని ఆ చిత్తమౌఢ్యమే శారీరక మానసిక వ్యథల రూపమున విస్తరిస్తోంది. ఇక ఆపై ఉన్మత్త క్రియా వ్యవహారాలు, అంతు లేని దుఃఖాలూ, అనేక జన్మ పరంపరలు వచ్చి కూర్చుంటున్నాయి.

ఓయీ! జీవుడా! నీవు అవిచారణ చేతనే తుచ్ఛములైన ధన, మణి, స్త్రీ (శృంగారం) వంటి స్వల్ప విషయాలు గొప్పవైనట్లు భావించి తుచ్ఛమైన ప్రలోభంలో పడుచున్నావు. నీ మనస్సు స్థూలమగుచున్నది. అందుచేతనే ఆత్మబోధ తగినంతగా గ్రహించలేకపోతున్నావు.

కనుక, దృశ్యము పట్ల ఏర్పడే ఆశను త్యజించు. అధిష్ఠానమైయున్న స్వస్వరూపమగు ఆత్మ యొక్క విస్తారతను, ప్రసన్నతను, కాలః కాలత్వమును గ్రహించు. ఆనందించు. అంతేగాని, ఉత్పత్తి – వినాశన స్వభావయుతాలైన ఈ పదార్థములు నీకేం ఉత్తమ వస్తువును చేకూరుస్తాయి చెప్పు? అవన్నీ నీకు చివరికి విషయ వైషమ్యత్వమును తెచ్చి పెడుచున్నాయి. భయంకరములైన విషయ భోగములను సేవిస్తూ పుండుపై వ్రాలే ఈగ లాగా తుచ్ఛత్వం కొనితెచ్చుకుంటే ఎట్లా? సునిశిత – సుతీక్ష్ణ దృష్టిని వదలి, స్థూలత్వం పొంది ఏం ప్రయోజనం?

అందుచేత ఈ చిత్తం వికాసవంతమగు చైతన్యాన్ని ఆశ్రయించి స్వతంత్రం పొందు గాక!

❖

ఓ రామచంద్రా! చిత్తము అనే వృక్షం శరీరము అనే ప్రదేశంలో నెలకొని ఉంటోంది. అనేక చింతలు ఈ చిత్తవృక్షమును పర్యవేక్షించి ఉన్నాయి. ఆ వృక్షం నుంచి 'పుట్టటం – పెరగటం – చావటం' అనే పళ్ళు నిరంతరం కాస్తున్నాయి. అది 'ఆశలు' అనే పొడవాటి కొమ్మలతో, వికల్పములు (Misconceptions) అనే ఆకులతో విస్తరించి ఉన్నది. అట్టి చిత్తవృక్షము గురించి తాత్సారం చేయటం ఉచితం కాదు. ఇక ఏమాత్రం శంకించకుండా 'ఆత్మ విచారణ' అనే ఆంపముతో ఆ వృక్షమును మొదలంట వ్రేళ్ళతో సహా నరికి, పెకలించి వేయాలి.

మనస్సు, సూక్ష్మబుద్ధి - ఈ మనస్సు అనేక అనుమానాలకు తావు. ఇది సర్వదా బహిర్ముఖం అగుటకే ఉత్సుకత చూపుతోంది. ఎన్ని అనుభవములు పొందుతున్నా, ఎంతకాలం గడచిపోతున్నా కూడా ఇది అంతర్ముఖం అవటమే లేదు. అరె! ఏమాత్రం విశ్రాంతి పొందటానికి ప్రయత్నించదే? ద్వేషములను, అసూయలను ఆశ్రయిస్తుందే గానీ, 'శమ, దమ, తితిక్ష' మొదలైన ఉత్తమ ఉపకరణాల ఊసే ఎత్తదేం? అన్ని వేళలా క్రోధమునూ, సుఖ, దుఃఖాలను మాత్రం పొందుతోంది. తన విశ్రాంతి స్థానమేదో తానే గ్రహించలేకపోతోంది. ఇట్టి మనస్సు అనే ఏనుగును 'అతి సూక్ష్మ బుద్ధి' అనే సింహం యొక్క గోళ్ళు ఉపయోగించి నిరోధించాలి.

ఓ మనస్సా! ఇక నీవు శమించు. ఆత్మజ్ఞాన వివేకం కలుగనంతసేపే నీ ప్రతాపం.

❖

ఓ రాఘవా! చిత్తము - అనే పిశాచం తనకు వీలున్నంత వరకూ తృష్ణ (Passion)నే సేవిస్తోందయ్యా! 'అజ్ఞానం' అనే వటవృక్షం క్రింద విశ్రమిస్తోంది. నిత్యం 'అనంతకోటి జన్మలు' అనే మహారణ్యంలో సంచరిస్తోంది. అజ్ఞానులలోని చాంచల్యమే దాని రూపం. ఏమి దాని విన్యాసం! ఏమి దాని ఎత్తుగడలు! అట్టి చిత్తమును వివేక - వైరాగ్యములతో నిరోధించాలి. స్వాత్మ గృహం నుండి దానిని వెడలగొట్టనంత వరకు ఆత్మకు 'ముక్తి' అనుమాట కల్ల.

ఈ మనస్సును ఒక విషసర్పంతో పెద్దలు పోలుస్తూ ఉంటారు. దీనికి "శుభ-అశుభ కర్మలు" అనే రెండు కోరలున్నాయి. ఇది 'దేహము' అనే కుబుసమును కలిగి ఉండి, విశ్రాంతి లేకుండా ప్రాణవాయువులను భక్షిస్తోంది. 'భయములు' అనే మృత్యువును తెచ్చిపెడుతోంది. అట్టి ఈ మనో - విషసర్పాన్ని 'అభ్యాస, వైరాగ్యములు' అనే గరుడ మంత్రముచే నిర్జించాలి. లేకపోతే, ఇది అనేక దేహరూప శవములను భక్షిస్తూ అమంగళస్వరూపంతో దిక్కులన్నీ సంచరిస్తూనే ఉంటుంది. 'అవమానము, శోకము, భయము' అనే దుర్వ్యసనములను కలుగజేసుకుంటూ ఇట్లు బిగ్గరగా రోదిస్తూనే ఉంటుంది.

❖

ఈ మనస్సు ఒక కోతి వంటిది. ఇది జన సమూహమును, వారితో సంబంధములను గాంచుచూ, పిచ్చిపట్టిన దానివలె గంతులేస్తోంది. దీనిని నాలుగు వైపుల నుండీ బంధించాలి. లేకపోతే ఆత్మసిద్ధి ప్రాప్తించదు.

అభావము - నాయనా! రామా! నీవు అభావమును ఆశ్రయించి వాసనలను, సంకల్పములను, తదితర సర్వ కల్పనలను బుద్ధిపూర్వకంగా నిరోధించెదవు గాక! తద్వారా జీవన్ముక్త ఫలమును పరిపూర్ణముగా పొందెదవు గాక!

అసంకల్పముచే సుకృత - దుష్కృత ఉభయవిషయములను పరిత్యజించు. ఈ జన్మ - జాతి భేదములన్నిటినీ మనస్సులో రహితం చేయి. శంకారహితంగా స్వస్వరూపమునందు యథాతథంగా విహరిస్తూ ఉండు.

❖

ఈ మనస్సు కోపము – అసూయ – ఆశ – ఉద్వేగము మొదలైన రూపంతో ఆ పరబ్రహ్మమును కప్పి ఉంచుతోంది. తృష్ణ అనే నోరు తెరచి 'విషయములు' అనే మాంసపు ముక్కలను నములునట్లు చేస్తోంది. మోక్షము విషయంలో నిద్ర – ఆలశ్యములను కలుగజేస్తోంది.

ఇట్టి మనస్సు పట్ల నీవు దయ చూపవద్దు. నిర్దయగా దీనిని నియమించి నీ యొక్క వైరాగ్య మహాప్రయత్నమునకు మనస్సు వల్ల కలుగుచున్న విఘాతములను, అడ్డులను తొలగించుకో!

అప్పుడు నీవు పూర్ణానందైశ్వర్యుడవు కాగలవు. శుద్ధ చిత్తముచే మలిన చిత్తమును పూర్ణముగా శమింపజేసి అఖండ శోభాయమానుడవు కమ్ము.

తత్త్వజ్ఞానం చేత మనస్సును మలినరహితం చేసి ప్రత్యగాత్మ యందు నియమించు.

ఇక ఆపై ఈ స్థూల – సూక్ష్మ – కారణ శరీరసహితమగు సమస్త జగత్తును అనాదరంతో తృణప్రాయంగా చూడు. క్రమంగా ఈ సంసారము నుండి తరించు. శాస్త్రములకు అవిరుద్ధంగా మెలగుచూ ఉండు. లోకములకు శుభం కలుగజేసే దృష్టితో లీలాపూర్వకంగా ఈ ప్రపంచమున వ్యవహరించెదవు గాక!

❖❖❖

VII. ఉద్దాలకుని అంతరంగాన్వేషణ

1. చిత్తవృత్తులు

శ్రీవసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఈ చిత్తవృత్తులను గమనిస్తున్నావా? ఇవి ఇహ – పరలోకముల పట్ల గల ఆసక్తిచే అతిదీర్ఘమై ఉంటున్నాయి. అవి తమ యందు అనేక వాసనలు కలిగి ఉండి కంటికి (పైకి) కనబడకుండానే, సూక్ష్మమై ప్రవర్తిస్తున్నాయి. ఇవి క్షణక్షణం జీవుని సమాధి నుండి నివర్తింపజేస్తున్నాయి. ఒకవేళ ఈ చిత్తవృత్తులను ఆత్మ యొక్క తత్త్వమును స్వీకరించుట యందు నియమించగలిగామా, అప్పుడిక నిర్మలత్వమును ప్రకటించగలవు. పదునైన కత్తి యొక్క అంచు వంటి ఈ చిత్తవృత్తుల గురించి, ఏమాత్రం, 'పోనీలే' అనే తాత్సారం కూడదు. చక్కటి ఈ మానవజన్మ పొందిన తరువాత ఇక నిదానం పనికిరాదు. శ్రవణము, మననము మొదలైన ఉపాయాలచే ఈ బుద్ధి పరమాత్మపై లగ్నమయ్యేట్లు చేయాలి. వివేకం సహాయంతో బాహ్యవృత్తులను నిరోధిస్తూ క్రమంగా 'అఖండము, అప్రమేయము, నిత్యము, నిర్మలము' అగు ఆత్మవస్తువుతో స్నేహం పెంపొందించుకోవాలి. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కపెట్టుకోవాలి కదా! ఈ శరీరము పుష్టి, దీప్తి కలిగి ఉన్నప్పుడే గురు శుశ్రూష, వినటం, యోచించటం, ఉపశమనము వంటి ఉత్తమ ప్రయత్నములను స్వీకరించాలి. సద్బుద్ధిని చక్కగా పెంచి, పరిపోషించుకోవాలి. అట్లా కాకుండా, శరీరం వృద్ధాప్యంలో ప్రవేశించిన తరువాత అప్పుడిక ఈ జీవుడు ఏమిచేయగలడో నాకేమీ అర్థం కావటంలేదు.

నా వాక్యాలలోని అంతరార్థం చక్కగా గ్రహించ గలిగినట్టి ఓ రాఘవా! నేను చెప్పు వాక్యార్థమును భావన చేయుటచే ఈ జీవుడు తప్పకుండా ఉత్తమ సుఖమును పొందగలడు. 'ఉద్దాలకుడు' అను మహర్షి ఏ విధంగా అయితే సర్వపదార్థములనూ పరిశోధిస్తూ క్రమంగా పంచ కోశములను, వాటి కారణము లందు లయింప జేసి అధిష్ఠానమగు సన్మాత్రము కొరకై అన్వేషణ సాగించాడో – నీవు కూడా అట్లాగే ధీరబుద్ధిచే అంతఃకరణమును మాటి మాటికీ శోధించు. ఆత్మ కొరకై అంతరంగము నందు అన్వేషణ కొనసాగించు. అప్పుడు అంతా నీకే విదితమౌతుంది.

శ్రీరాముడు : హే మహావక్తా! నేను ఉద్దాలక మహర్షి గురించి విని ఉన్నాను. కానీ, ఆయన "అంతరంగ శోధన – అన్వేషణ" గురించి విని ఉండలేదు. ఆ మహానుభావుని కథనమేమిటో వివరించండి.

శ్రీవసిష్ఠమహర్షి : పంచభూతముల పరిశోధనచే ఉద్దాలక మహాముని ఏ విధంగా పరమజ్ఞాన దృష్టిని పొందారో – అదంతా వివరించి చెపుతాను విను.

❖❖❖

2. ప్రయత్నము - సంఘర్షణ

గంధమాదన పర్వతంపై గల ఒక వనప్రదేశంలో ఒక తటాకం ఉన్నది. ఆ తటాకం ప్రక్కనే గల ఒక కొండశిఖరం పై 'ఉద్దాలకుడు' అనే పేరుగల ఒక మునిబాలుడు ఉండేవాడు. ఆ పిల్లవాడికి నేను నా పురుషప్రయత్నంచే తప్పకుండా శాస్త్రప్రవచితమైన ఉత్తమ పురుషార్థం సాధించగలను" అనే కొండంత ఆత్మవిశ్వాసం ఉండేది.

మొట్టమొదట ఆతడు తాను విన్న, చదివిన శాస్త్రవిషయ సారమును పరిశీలించసాగాడు. కానీ ఎంత ప్రయత్నించినా ఆతని బుద్ధి తన ప్రకంపనములను వదలనే లేదు. "ఇక ఇట్లా కాదు. నేను మునుముందుగా శుద్ధమైన అంతఃకరణం సంపాదించాలి. ఆ తరువాతే మిగతా విషయాలు" – అని అనుకున్నాడు. ఇక శ్రద్ధగా తపస్సు, అధ్యయనము మొదలైన తీవ్రప్రయత్నములతో కొంత కాలం గడిపాడు. క్రమంగా ఆతనియందు వివేకము ప్రవేశించింది. ఒక్కసారి ఈ సంసార ప్రహసన మంతా గమనించిన తరువాత ఆతనికి ఎంతో భయమనిపించింది.

ఒక రోజు ఒక ప్రదేశంలో ఏకాంతంగా ఆసీనుడై శుద్ధ చిత్తముతో ఇట్లు యోచించసాగాడు.

❖

ఉద్దాలకుడు (తనలో) : దేని యందైతే విశ్రాంతి పొందిన తరువాత ఇక మనుజుడు మరల దుఃఖించడో, జన్మతో సంబంధమే ఉండదో అట్టి వస్తువు ఏది? మనస్సు లేని చోట దేనితోనూ సంబంధం ఉండదు కదా! మనోవ్యాపారమంటూ ఉండనట్టి పవిత్రమైన ఉత్తమ పదము నందు నేను విశ్రమించెదను గాక! అయితే అది ఎలా సాధ్యం? అది సాధ్యపడాలంటే, "ఏదో పొందాలి" అనే భోగతృష్ణను జయించివేయాలి. "ఈ పని, తరువాత ఆ పని, ఇవి పొందాలి, ఇందుకు ఏదో చేయాలి" ...అనేదంతా కల్పనతో కూడినదే. ఆత్మ పదమునందు విశ్రాంతి తీసుకుంటూ అట్టి కాల్పిక వ్యవహారములు చూచి ఎప్పటికి పకపకా నవ్వుకుంటానో! కమల పుష్పదళంపై నీటి బిందువులు ఉండవచ్చు గాక.

కదా వికల్పజాలం మే న లగిష్యతి చేతసి ।
స్థితమప్యుజ్ఝితాసఙ్గం పయః పద్మదలే యథా ॥ (శ్లో 21, సర్గ 51)

కమలం ఆ నీటి బిందువులను స్వీకరించదు కదా! ఆ విధంగా అభాసమాత్రమైన ఈ దృశ్య వికల్పములు నన్ను ఎప్పటికి స్పృశించకుండా ఉంటాయో! ఉత్తమబుద్ధితో అతి కల్లోలమైన తృష్ణను ఎప్పటికి అధిగమిస్తానో? ఈ లోకములోని ప్రాణుల సంసార క్రియలను పిల్లవాళ్ళు ఆడుకుంటున్న ఆట లాగా ఎన్నటికి చూస్తానో? నా చిత్తము ఇప్పటికిమాత్రం క్షణక్షణం చంచలమై ఉంటోంది. వికల్పములు కలిగి ఉన్నదై, ఊయలలాగా చంచలత్వం వహిస్తోంది. ఒక పిచ్చిపట్టినవాని వలె భ్రమతో కూడుకుని ఉండే నా మనస్సు ఎన్నటికి శమిస్తుందో?

❖

ఓ నా అంతఃకరణమా! నీవు ఎప్పటికి ఆత్మస్వరూపమును పొందుతావు? ఎప్పటికి ఈ తుచ్ఛ దృశ్య ప్రపంచమును చూచి ఎగతాళి చేయగలవు? పూర్ణబుద్ధిని పొంది ఏనాటికి బ్రహ్మాండ శరీరధారి అగు విరాట్పురుషుని వలె హాయిని, సంతుష్టిని పొందుతావో కాస్త తెలియజేస్తావా? నేను అంతఃకరణము నందు 'సమరూపము' కలిగి ఉన్నవాడనై పరమాత్మతో ఐక్యమవ్వాలి. ప్రశాంత – సౌమ్య–సమగ్ర స్వరూపుడను కావాలి. అమృతము, కౌస్తుభమణి మొదలైనవాటి యందు, ధర్మ–అర్థ–కామ విషయము లందు నిస్పృహుడను కావాలి. వేలాది ఆశలతో నిండి ఉన్న ఈ అతిచంచల దృశ్య శోభను నిద్రపోతున్నవాని వలె పొందాలి, అది ఎట్లా సాధ్యం? కల్పనలన్నీ శమిస్తే, అప్పటి నా బుద్ధి మాత్రమే ఈ బాహ్య–అభ్యంతర జగత్తును "చిన్మాత్రమయం"గా వీక్షించగలదు. అట్టి వీక్షణ యందు సుస్థిరుడనై ఉండాలి. ఇది ఇప్పటి నా కార్యక్రమం.

చిత్తము శాంతించు గాక! గుడ్డివానికి చూపు వచ్చినట్లుగా నేను 'చిదేకరసము' అనబడు పరమ ప్రకాశమును పొందాలి. అభ్యాస వశంచే అట్టి ఉత్తమ ప్రకాశము సమృద్ధమగుచుండగా కాల కళలన్నీ దూరంగా త్యజించి వేయబడాలి!

ఇష్టం–అయిష్టం, హేయం–ఉపాధేయం (something to get rid of - something to get) తొలగి నా అంతఃకరణము శుద్ధం కావాలి. స్వప్రకాశపదము నందు సుస్థితుడనై ఆనందమును సాధించాలి.

దురాశ - కానీ, ఇప్పటి నా స్థితి అందుకు అనుకూలంగా లేదే? ఈ వర్తమాన అజ్ఞానాంధకారపు కాళరాత్రి దురాశలతో, అవిద్యతో, జడత్వంతో, అనేక దోషాలతో నిండి ఉన్నది. అన్నిటికీ కారణం మనస్సే కదా!

ఈ మనస్సును ఎందుచేత జయించలేక పోతున్నాను? ఒక పర్వత గుహలోని అంతర్భాగంలోని శిలలాగా మనోవ్యాపార రహితుడనై నిర్వికల్ప సమాధి యందు ఎందుకు ఉండలేక పోతున్నాను?

అహంకారమే నన్ను మోసగిస్తోంది. 'స్వాభిమానము' అనే మహామదం గల ఈ అహంకారమును 'జ్ఞానము' అనే ఆయుధంతో నిర్మూలించాలి.

నిర్వికల్ప ధ్యానము నందు విశ్రాంతి పొందాలి. నా మనస్సు మౌనవ్రతం అవలంబించి ఉండగా తలపై పక్షులు గూడుకట్టుకునే స్థితి నేను ఎందుకు పొందగూడదు? ధ్యానము నందు స్థిర బుద్ధి కలవాడనై స్థాణువువలె నిశ్చలంగా ఉండెదను గాక! "తృష్ణ కామాదులతో కూడి జన్మించటం" అనే అలవాటును త్యజించి సంసార పటాటోపాన్ని చిత్తు చేసెదను గాక!

❖

విషయైర్నీయమానే తు చిత్తే మర్కట చఞ్చలే ।
న స లేభే సమాధానప్రతిష్ఠాం ప్రీతిదాయినీం ॥ (శ్లో 39, సర్గ 51)

ఈ విధంగా యోచన చేసిన ఆ ఉద్దాలకుడు మరల మరల ఆసీనుడై ధ్యానం అభ్యసించసాగాడు. అయితే, ఆతని చిత్తంమాత్రం కోతిలాగా విషయముల వైపుకే ఆకర్షించబడుతూ ఉండేది. ఆతను

కోరుకొన్నట్లు సంతోష దాయకమగు స్థిరప్రతిష్ఠ (సమాధి) పొందనే లేదు. కొద్దిసేపు బాహ్య విషయాలు బాహ్యము నందే త్యజించి సత్వగుణ ప్రధానమగు సమాధి యందు స్థితిని పొందేవాడు. ఇంతలోనే రజోగుణం వచ్చి ఆక్రమించేది. చిత్తము భయమును, ఆలశ్యమును, ఉద్వేగమును పొందేది. కొద్ది నిముషాలలో ఆతని మనోమర్కటం సమాధి సుఖమును త్యజించి కల్లు త్రాగినవాడు వీథిలోనికి వెళ్ళినట్లు ఎక్కడెక్కడికో పరుగులు తీసేది.

కొంతసేపు హృదయాకాశంలో సూర్యుని వంటి జ్యోతిని చూస్తూ ఉండటం.... ఇంతలోనే బహిర్ముఖం కావటం.... మరికొంతసేపటికి "అరే ... ఈ విషయములు నన్ను ఆక్రమిస్తున్నాయే" అని గుర్తుకు రావటం... మరల సంఘర్షణ ... మరల ప్రయత్నించి సమాధి వైపుగా సిద్ధం కావటం... ఇంకొంచెం సేపు ఇటు విషయములను, అటు సమాధిని కూడా త్యజించి అజ్ఞాన ఆత్మజ్యోతుల మధ్యగా ఒకానొక 'సన్నిద్రాస్థితి' యందు చిక్కుకుని ఉండి పోవటం...

ఈ విధంగా ఉద్దాలకుడు ప్రతి రోజూ ధ్యానం కొరకు ప్రయత్నిస్తూ ధ్యానవృత్తు లందు వ్యాకులం పొందుతూ ఉండేవాడు. మొత్తం మీద, తృష్ణ శేషించియే ఉండేది. తృష్ణా తరంగములచే సంకటములు పొందుతూనే ఉండేవాడు. ఎక్కడో దోవతప్పిన బాటసారిలాగా ఏకాకి అయి ఆ పర్వతముపై వ్యాకుల చిత్తంతో అటూ ఇటూ తిరుగుతుండే వాడు.

కొంతకాలం గడచింది. ఇక ఇట్లా కాదని, ఒక రోజు ఒక కొండగుహలో ప్రవేశించాడు. ఆకులతో ఒక ఆసనం తయారుచేసుకొన్నాడు. దాని పైన మృగచర్మం పరచాడు. క్రమంగా చిత్త వృత్తులను సూక్ష్మపరచుకున్నాడు. విషయములు సమీపించకుండా మనస్సును కట్టడి చేశాడు. ఉత్తర దిక్కుగా కూర్చుని కాలిమడమలచే వృషణములను తొక్కిపట్టి, బ్రహ్మ మొదలైన గురుపరంపరా ప్రాప్తమైన 'పద్మాసనం' వేసి కూర్చున్నాడు. ఇక ఏకాగ్రతతో ఇట్లు చింతన చేయసాగాడు.

❖❖❖

3. ఓ మనస్సా! ఇక ఆపవయ్యా నీ పరుగులు!

ఉద్దాలకుడు : ఇప్పుడు నేను బాహ్య ప్రపంచంలోంచి అంతరంగములోనికి ప్రవేశిస్తున్నాను.

ఓ మూర్ఖమనసా! కొంచెం ఆగు, ఎటు పోతున్నావ్? ఈ సంసారవృత్తుల వలన మనకేం ప్రయోజనం? చివ్వరికి దుఃఖమునే కలిగించబోయే కార్యక్రమములను ఎవరైనా చేబడతారా? దుష్ట స్థితి గతులకు తీసుకుపోయే మార్గంలో ఎవరైనా తెలివి గలవారు ఆసక్తి కలిగి ఉంటారా? మనం 'శాంతి' అనే అమృతం వదలిపెట్టటమేమిటి? కల్పవృక్షం వదలి ముళ్ళకంపలోకి దూరట మేమిటి? అందుకని నా ప్రియాతి ప్రియమైన మనస్సా! కాస్త యోచించు. నీవు బ్రహ్మ లోకానికి వెళ్ళినా, (లేక) పాతాళ లోకానికి వెళ్ళినా, ఏం ప్రయోజనం? మనం నిరతిశయానంద రూపమైన నిర్వాణం సంపాదించాలి గాని ...కాకి లాగా, పిచ్చుక లాగా పీచు వంటి విషయపరంపరలను కాదు. నీవు చెప్పినట్లుగా ఇన్నాళ్ళూ ఆశలవెంట పరుగులు తీశాను. ఏమైంది? ఆశలు తీరనప్పుడల్లా దుఃఖం

వచ్చిపడింది. ఒక ఆశ తీరగానే మరొక ఆశ వచ్చి పడింది. ఆశలు తీరనంతకాలం అపూర్ణత్వము వచ్చి పడుతూనే ఉన్నది కదా!

కనుక, నీవు భోగములందలి ఆశను త్యజించు. నిరతిశయానంద రూపమైనట్టి సుందరమైనట్టి, శ్రేయమైనట్టి మోక్షము కొరకే ప్రయత్నించు. ఈ 'ఇష్టములైనట్టివి చేకూర్చుకోవటం - ఇష్టం లేని వాటిని వదలించుకోవటం" అనే వ్యవహారమంతా నీకు దుఃఖమునే కలుగజేస్తోంది సుమా! ఏమి సుఖం? ఎక్కడి సుఖం? నూతిలో కప్పలాగా ఈ శబ్ద, స్పర్శ, రూపాది ఇంద్రియ విషయములలో నిరర్ధకంగా నీవు ఎందుకు చిక్కుకుంటున్నావ్? సరే, ఇంతకాలం తిరిగావు. ఇప్పటి వరకూ ఏమి పొందామో చెప్పు? సర్వ వృత్తుల యొక్క ఉపరమము (Withdrawal) కొరకై మనం ఎందుకు ప్రయత్నించ కూడదు? అదొక్కటే సదేహ - విదేహ కైవల్యములకు మార్గమైయున్నది.

ఓ చెవులారా ! వ్యర్థముగా ఖేదము పొందవద్దు. మరల మరల బహిర్ముఖం అవుతూ, గీతములకై, ఘంటానాదములకై పరుగులు తీసి చివరికి మూర్ఖ మృగముల వలె క్షయం పొందటం భావ్యమా? ఆటవికులు చేసే ఆడ ఏనుగుల ఘీంకార శబ్దానుకరణను విని పరుగులు తీస్తూపోయి వాళ్ళు పన్నిన వలలో పడిపోయే మగ ఏనుగులాగా ఉన్నది మన విన్యాసం!

ఓ రసేంద్రియమా! ఎఱను చూచి లొట్టలు వేస్తూ పరుగులు తీసి గాలమునకు చిక్కుకునే చేపలాగా నాశనమును తెచ్చిపెట్టుకోవద్దు.

ఓ నేత్రములారా! 'నేత్రవృత్తి'తో ఏకత్వము పొంది రూపలోభముచే ఎగిరెగిరి, నిప్పులోనికి పయనించి దగ్ధం అయ్యే మిడతలాగా మీరు రూపాకర్షణలకు లోను కాకండి.

ఓ నాశికమా! సువాసనచే ఆకర్షించబడి పువ్వులో ప్రవేశించి, అక్కడనుండి బయటకు రాలేక శల్యమయ్యే తేనెటీగలాగా కడతేరకు.

❖

కురఙ్గాలిపతఙ్గేభమీనాస్త్వేకైకశో హతాః ।
సర్వైర్యుక్తైరనర్థైస్తు వ్యాప్తస్యాజ్ఞ కుతః సుఖమ్ ॥ (శ్లో 21, సర్గ 51)

ఓ అజ్ఞాన మానసమా! ఏనుగు, చేప, మిడుత, తేనెటీగ - ఇవన్నీ ఒక్కొక్క ఇంద్రియమునకే వశీభూతమై వినాశనము తెచ్చిపెట్టుకుంటున్నాయి. ఇక పంచేంద్రియములు గల ఈ మానవునకు సుఖమెక్కడిది?

ఓ మనస్సా! నీవు పట్టుపురుగును చూచావా? అది తన నుండి సహజంగా వెలువడే 'చొంగ' చేత తన్ను తానే బంధించుకొనుచున్నది. ఆ బంధమును బహుగట్టిగా, సువిశాలంగా నిర్మించుకుని, మధ్యగా తాను విశ్రమించుచున్నది. ఇక ఆపై ఆ బంధనము నుండి బయల్వెడలలేక కృంగిపోతోంది. దిక్కు తోచక అలమటిస్తోంది. నీవు కూడా నిన్ను నీవు బంధించుకోవటానికే ఈ విషయవాసనలను నీ యందు కలిగి ఉంటున్నావు. "ఏదేదో వినాలి, చూడాలి, స్పర్శించాలి, ఆఘ్రాణించాలి, రుచిచూడాలి" అనుకుంటూ బయలుదేరుతున్నావు.

ఎప్పుడు ఎక్కడ ఉంటే అక్కడ ఏవేవో కల్పనలలో ప్రవేశిస్తున్నావు. కళ్ళు మూసినా తెరచినా పరుగులు మాత్రం ఆపవు కదా! కొంచెం సేపు నీ ఇంద్రియ తాదాత్మ్యము ఆపు. నే చెప్పేది శ్రద్ధగా విను.

'పుట్టటం - చావటం' మొదలైన రూపములలో ఉన్న ఈ సంసారరోగమును మనం 'రహితం' చేయాలి. అందుచేత 'కర్మ - ఉపాసన'లచే నీవు శుద్ధిపడు. జ్ఞానవిషయాలు మరలమరల విను. అజ్ఞానం సమూలంగా నశించిందా - ఇక నీకు అనంత విజయం ప్రాప్తించగలదు.

దేనినైనా ఆశ్రయించే ముందు, "ఇది మనకు యోగ్యమా? అయోగ్యమా? యుక్తమా? అయుక్తమా? శ్రేయమా? ప్రేయమా? అర్థమా? అనర్థమా? ఉచితమా? అనుచితమా?" ...అని పరిశీలించాలి. అంతేగాని గుడ్డిగా దుఃఖంలోనో, ఆవేశంలోనో, భయంలోనో, అనుభవంలోనో ప్రవేశించరాదు. ఈ 'జగత్ ప్రవృత్తి' ని కించిత్ పరిశీలించు. ఇదంతా మరణ, దారిద్ర్య, నీరస, యౌవన, వార్ధక్యాలు కలిగి అగమ్యంలోనికి పరిగెత్తుకుపోతున్నది. అశ్రద్ధగా ఉన్నామా మరణానంతర ప్రవృత్తి 'నరక-స్థావర' గతులకు దారి తీస్తున్నది. 'జగత్ ప్రవృత్తి ఇట్టిది' అని మనకు తెలిసి కూడా వాటిని త్యజించకుండా ఎందుకు లీనమై ఉండాలి? మనం అధమత్వాన్ని ఎందుకు ఆశించటం? ఎంత చెప్పినా వినవా? నీవు హితం లేని దానివి కనుకనే నేను చెప్పే హితోపదేశం వ్యర్థమవుతోంది.

❖

సర్వమును విచారించిచూచినవాడు చూస్తూ ఊరుకోడు. చిత్తమును పూర్తిగా నాశనం చేయవలసిందే. శీతకాలంలో మంచు ఎక్కువగా ఉంటున్నట్లు, అజ్ఞానాధిక్యత ఉన్నంతవరకూ చిత్తము యొక్క ఆధిక్యత ఉండి తీరుతోంది.

వసంతకాలం రాగానే మంచు కరిగిపోతుంది. వివేకము వర్ధిల్లుతుండగా ఈ చిత్తము, ఇది కల్పించే న్యూనత, ఆధిక్యతలు, సుఖ దుఃఖములు తొలగిపోతాయి. వాసనాక్షయం అగుచుండగా చిత్తము తన రూపమునే కోల్పోవుచున్నది.

చిత్తము నందు అవివేకము పేరుకుని ఉన్నప్పుడు ఆ అసద్రూప చిత్తమునకు ఎంత బోధిస్తే మాత్రం ఏం లాభం? వివేకి విషయంలో మాత్రమే శాస్త్రబోధ మహా ప్రభావితమౌతోంది.

అవివేకికి శాస్త్ర శ్రవణం చేసినప్పటికీ చిత్తములో మార్పు ఉండదు. వివేకికి క్రమ క్రమంగా చిత్తమే ఉండదు.

అందుచేత ఓ మనస్సా! నీవు వివేకముచే నశించుటయే స్వభావముగా గలిగి ఉన్నావు. అసద్రూపం అయి ఉన్న నిన్ను ఎందుకు త్యజించరాదు? నీకు బోధించి, క్రమంగా నిన్ను త్యజించటమే మంచిది. లేకుంటే నిన్ను ఊరకే వదిలితే, ఇక నేను కూడా తెలివి తక్కువవాడిని అవవలసి వస్తోందే గాని, ప్రయోజనం ఉండటం లేదే?

❖❖❖

4. నేనెవడను? ఈ శరీరమునా? ఒక జీవాత్మనా?

నేనెవడను?... సర్వ వికల్పములకు ఆవల ఉన్నవాడను. నిర్వికల్పుడను. చిత్ రూపము చేత ప్రత్యక్షమై ఉన్నవాడను. అహంకార వాసనా రహితుడను. అహంకారమునకు బీజభూతమైనట్టి చిత్తముతో నాకు ఎట్టి సంబంధం లేదు. అజ్ఞానుల దృష్టికి "ఈ శరీరం నేను. అనేక ఆత్మలలో ఒక ఆత్మను నేను" – అనునట్లుగా తోచుచున్నది. అనేక దుఃఖముల కొరకే మనస్సు అట్టి భావనలను ఆశ్రయిస్తోంది. ఒక మారేడు పిందెలో ఏనుగు ఉన్నదంటే ఎవరు నమ్ముతారు? అనంతమగు ఆత్మ తత్త్వము పరిచ్ఛిన్నత్వమును భావన చేసి, ఆ తదుపరి అధిగమించలేకపోతోంది.

మనస్సు 'దుఃఖ ప్రదములగు వాసనలు" అనే బురదలో ఇరుక్కొనుట చేతనే తదితర యాతనలన్నీ వచ్చి పడుతున్నాయి. వాసనలను ఎల్లప్పుడూ ఆశ్రయించాలనుకొనే ఈ మనస్సును నేను దూరంగా త్యజించివేస్తున్నాను.

"ఈ దేహమే నేను, ఒక ఆత్మను నేను,. వేరువేరు ఆత్మలు తదితరులు" – అనునది మిథ్యాభ్రాంతి నుండి పుడుతోంది. విచారణ శూన్యులగు బాలుర వంటి వారికి అట్టి యోచన వస్తోంది. అదే అహంకారం. అది మహామోహము గాక మరింకేమీ కాదు. విచారణ పరుడగు నాకు అట్టి దుర్వ్యసన పూర్వకమైన అహంకారంతో పని లేదు.

❖

జ్ఞానమే నా స్వరూపం!... కాలు బొటనవేలునుండి శిరస్సు వరకు గల ఈ శరీరము యొక్క అణువణువూ చాలా బాగా విచారించాను. నేను జ్ఞానమాత్రమును. మరింకేదీ కాదు. జ్ఞానమే బాహ్యమున ఈ దిక్కులన్నిటినీ పరిపూర్ణం చేసి ఉంటోంది. అదియే ముల్లోకము లందు ఏకరూపమై వెలయుచున్నది. దాని యందు "దేశ – కాల – దేహ" పరిచ్ఛేదం అంటూ ఏదీ లేనే లేదు. అందు మరొక పదార్థం అంటూ ఏదీ ఉండజాలదు.

దేనికైతే పరిచ్ఛిన్నరూపము గానీ, నామవికల్పముగానీ, ఏకత్వముగానీ, అనేకత్వముగానీ, మహత్వముగానీ, అణుత్వముగానీ ఉండనే ఉండవో... అట్టి జ్ఞానస్వరూపమే నేను.

జ్ఞానస్వరూపుడనగు నేను నా సాక్షిరూపముచే ఈ మనస్సు అనబడుదానిని ఎదురుగా గాంచు చున్నాను. వివేకంచే జనించిన జ్ఞానంచే మనస్సును ఇప్పుడు నా యందు లయం చేసివేస్తున్నాను.

శరీరం - ఇక్కడ మాంసము, ఇక్కడ రక్తము, ఇక్కడ బొమికలు, ఇక్కడ ప్రాణవాయువులు – ఇంతేకదా ఈ శరీరం? ఇక ఇందులో 'అహంకారం' అనబడేది ఎక్కడున్నది? ఈ దేహము యొక్క సంచలనాత్మక శక్తి ప్రాణవాయువులకు సంబంధించినది.

ఇందలి జ్ఞానము మహాచైతన్యమునకు సంబంధించినది. 'జన్మ–జర–మరణము' మొదలైనవన్నీ శరీరమునకు సంబంధించినవి. ఇందులో అహంభావముగా ఉన్నదేది?

మాంసము, రక్తము, ఎముకలు, చలనశీలమగు ఇంద్రియములు, ఎఱుగుట (జ్ఞానము) – ఇవన్నీ 'నేను' అను పదమునకు భిన్నమైనవే కదా! కాని ఏమి చమత్కారం! 'నేను' అనునది వాటన్నిటిని 'నావి' అనుచున్నది. ఏది ఏమైనా అవి మాత్రం 'నేను' కాలేవు. మరి ఈ ఉపాధిరూపమున 'నేను' అను అహంభావరూపమున ఉన్నదేది?

చెవులు, ముక్కు, నాలుక, చర్మము, కళ్ళు – వీటన్నిటికీ వేరై, వీటి యందు ఉండి, అనుభవమును పొందుచున్నది ఏది? ఎక్కడిది?

నేను - ఈ మనస్సు 'నేను' అను పదముచే ఉద్దేశించబడటానికి వీలులేదు. ఇందు గల వాసనలు కూడా "నేను" అనబడునది అయి ఉండటానికి కుదరదు. కనుక, చిన్మాత్రమగు ఆత్మయే అహంభావరూపమున, లేక 'నేను' అను రూపమున ప్రకాశించుచున్నది.

ఆరోపిత దృష్టి - ఇక ఆరోపిత దృష్టితో చూద్దాం. ఈ వినటం, చూడటం, స్పర్శించటం, ఆఘ్రాణించటం, రుచి చూడటం – ఇవన్నీ 'నేను' చేతనే పొందబడుచున్నాయి. అనుభవములన్నీ అనుభవజ్ఞుని ప్రదర్శనలే కనుక అవన్నీ నేనే.

అపవాద దృష్టి - "నేను ఏద్రై ఉన్నాను?" అను ప్రశ్నకు సమాధానం వెతికినప్పుడు, అపవాద దృష్టి (Attributive perception)చే చూస్తే ఇవేమీ నేను కాదు.

'నేను సర్వమును ఎఱుగుచున్నవాడను' అనునదే సత్యము. "ఈ దేహము నేను. దీని తోనే ఉంటాను. దీని తోనే పోతాను" – అనునది మాత్రం సత్యదృష్టి కాదు.

❖

ఆహా! పిచ్చికుక్క వెంటబడినప్పుడు ఒక పిల్లవాడు అనేక వికారములు ప్రదర్శిస్తున్నట్లు, నేను ఇంతకాలం నేను కాని వాటిచేత వికారములు పొందాను. ఎంతో బాధించబడ్డాను. అమ్మయ్యా! సౌభాగ్య వశం చేత ఇంతకాలానికి 'అజ్ఞానము' అనే దొంగను కనిపెట్టాను. పరమార్థమగు 'ఆత్మ జ్ఞానము' అనే సొత్తును అపహరించిన ఆ దొంగ ఆట ఇక సాగనివ్వను.

ఎందుకంటే, నేను స్వతహాగా దుఃఖరహితుడనే. అట్టి నేను దుఃఖములు పొందటమేమిటి? ఆకాశమునకు, మేఘములకు సంబంధముంటుందా? అవి రెండూ ఒక్కటి అవుతాయా? లేదు అట్లాగే ఈ దుఃఖములకూ, నాకూ సంబంధం లేదు.

❖

నవరసాలు పోషించే నటునిలాగా 'అహంకారం' అనే వేషం ధరించి నేను నా మనస్సుకు ఉపదేశాలు చేస్తున్నాను. ఈ శరీరం ధరించి, శరీర సంబంధ మాత్రములైన 'తెలుసుకోవటం, ఉండటం, రావటం, పోవటం' మొదలైనవి నిర్వర్తిస్తున్నాను. అయితే, ఆత్మ సందర్శనం చేత నేను అసలు అహంకారవిషయుడనే కాను. నటుడు తాను వేసే వేషం కంటే వేరైన వాడే కదా!

నేను లేకపోతే ఈ కళ్ళు ఉండవు, చూపు ఉండదు, చూడబడేవీ ఉండవు. నా కంటే వేరుగా చూస్తే వాటికి ఉనికి లేదు. అవన్నీ ఈ దేహము నందో, లేక, మరెక్కడనో ఉంటే ఏమున్నది? లేక పోతే ఏమున్నది? నేను వాటన్నిటికీ సంబంధించినవాడను కాను.

ఏమి చమత్కారం! చెట్టు మీద భూతంలాగా ఈ జగత్తు నందు పచార్లు చేసే ఈ 'అహమ్' అనునది ఎవరు? ఎవనిచే, ఎప్పుడు, ఎట్లు, ఎందుకు కల్పించబడుచున్నది? –ఈ ప్రశ్నకు రాకుండానే నేను ఇంతకాలం గోతిలో చిక్కిన లేడిలాగా పడిఉన్నానేమిటి?

ఈ కన్ను ఏదో 'రూపము' అనే విషయాన్ని చూస్తోంది. అది ఆ రూపమును గాంచుట యందు నిమగ్నమై ఉండగా, ఇక ఆ దృశ్య విషయమును 'ఇది దుఃఖ విషయము' అను అర్థమును ఇచ్చి తదనుభవం పొందుచున్న నేనెవడిని?

ఈ త్వక్ (చర్మము) స్పర్శయందు ఉన్ముఖమగు చుండగా, "ఆహా! బాగుగదా!" అని చెప్పుచూ దుష్ట పిశాచంలాగా పాల్గొనుచున్న అహమ్ ఎవరు?

నాలుక రుచిని స్వీకరిస్తూ ఉండగా "ఇప్పుడు భుజిస్తున్నాను. ఇవి ఎంత రుచిగా ఉన్నాయి!" – అనే దుష్టభ్రమ కలుగుచున్న దెవరికి? చెవుల శబ్దమును పొందుతూ ఉండగా "అయ్యో! ఈ మాటలచే నన్ను ఇంతగా అవమానిస్తున్నారా?" – అనే దుఃఖమును పొందుతూ, అతి దీనంగా స్పందిస్తున్నది ఎవరు? ఈ ముక్కు ఏదో వాసన పొందుచుండగా "అబ్బే! ఏం బాగోలేదు" అనుకుంటూ చెప్పుచున్నదెవరు?

అహంకార కల్పన! - ఈ ఇంద్రియములు తమ పనులు చేస్తూ ఉంటే, వాటి యందు, మృగతృష్ణా జలం లాగా అహంకారం వచ్చి తేలియాడుచున్నది. కనుక... "ఈ దేహేంద్రియాదులే నేను" అనే "భావన" భ్రాంతి నుండి, బూటకపు కల్పన నుండి బయలుదేరుతోంది. ఈ దేహేంద్రియాదుల పట్ల గల అహంభావము ఇప్పుడు నాచే పరిత్యజించబడుగాక!

❖

ఈ దేహమును కదల్చుచున్న దెవరు? వాసనలా? ...లేదు. ఎందుకంటే, ఒకడు సదభ్యాసం చేత వాసనా రహితుడైనప్పటికీ ఈ దేహము తన జీవన హేతువగు కర్మయందు ప్రవర్తన కలిగియే ఉంటోంది. 'కనుక శరీరవ్యాపారమునకు వాసనలు కారణం' అనటానికి వీలులేదు. వాసనలు దేనికి సంబంధించినవో ఈ దేహకర్తృత్వం అద్దానిది అవుతుంది.

❖

ఓ మలిన చిత్తమా! నేనిప్పుడు చేస్తున్న విచారణ అంతా నీవు గమనిస్తున్నావు కదా! ఒక్క విషయం గ్రహించు. వాసనారహితంగా జరుగుచున్న కర్మ వ్యవహారము లందు 'నేను దుఃఖిని' అనే అనుభవం ఉండజాలదు. వర్తమాన కర్మలు ఎప్పుడైతే వాసనారహితమౌతాయో, ఇక "భవిష్యత్తులోని సుఖ – దుఃఖానుభవములు" కూడా ఉండజాలవు.

అదియే వాసనాత్యాగం. మూర్ఖులగు ఓ ఇంద్రియములారా! మీరు మీ వాసనలను త్యజించి, అటుపై యథాతథంగా మీ పనులను నిర్వర్తించారా – ఇక మీరూ, నేనూ దుఃఖం పొందము. ఒక బాలుడు మట్టితో బొమ్మ తయారు చేసుకొని, ఆడుకుంటూ, అది పగిలిపోతే పెద్దపెట్టున ఏడుస్తాడు చూచారా? మీరు కూడా విషయ సముపార్జన యందు శ్రమిస్తున్నారు. కోల్పోతున్నప్పుడు దుఃఖం పొందుతున్నారు. ...అందుకు వాసనలు కలిగి ఉండుటే కారణం.

ఓ ప్రియమైన శుద్ధ చిత్తమా! అదిగో, ఆ తటాకంలో తరంగములు అగుపిస్తున్నాయి కదా! ఒక ప్రశ్న వేస్తున్నాను. ఆ తరంగములు జలము కంటే వేరా? కాదు. ఈ వాసనాదృష్టులు కూడా జ్ఞానదృష్టితో చూస్తే "ఆత్మ కంటే వేరు కాదు" – అని గ్రహించు.

ఓ ఇంద్రియములనే పిల్లవాళ్ళల్లారా! పట్టుపురుగు తన దారములో చిక్కుకొని నశించునట్లు మీరు మాయందు బయలుదేరే తృష్ణ యందు చిక్కుకొని వ్యర్థముగా పరితపించకండి.

కొండను ఎక్కుచున్న బాటసారి వడదెబ్బకు క్రిందబడి కొట్టుకొంటున్నట్టు మీరు 'సంసారం' అనే ముళ్ళ ప్రదేశంలో పడి కొట్టుకోకండి. పూలను దారం బంధించి ఉంచుతున్నట్లు మీరు బంధింపబడి ఉండుటకు వాసనలే కారణం.

'వాసనలు' అనబడేవి ఎక్కడి నుండి వచ్చాయి? భ్రాంతి నుండే! భ్రాంతిచే కల్పించబడేవి యథార్థం కాదు. అవి 'సంకల్పించకపోవటం' అనే శస్త్రం చేత సులభంగా ఛేదించబడగలవు. గాలి వాటుకు దీపం ఆరిపోవుచున్నట్లు వాసనలే అజ్ఞానానికి, వినాశనానికి హేతువులు అగుచున్నాయి. చిత్తము అనగా వాసనలే.

❖

హే చిత్త సర్వేన్ద్రియకోశ తస్మాత్స ర్వేన్ద్రియైరైక్యముపేత్య నూనమ్ ।
ఆలోక్య చాత్మానమసత్స్వరూపం నిర్వాణమేవామలబోధమాస్స్వ ॥ (శ్లో 69, సర్గ 52)

సర్వ ఇంద్రియములను ఆయా పనులకు పురమాయిస్తూ క్రింద – మీద చేసే ఓ చిత్తమా! ఇప్పటి దాకా మనం చెప్పుకున్న విచారణలోని ఆయాకారణాల వలన ఒక క్రొత్త విషయం వెలికివస్తోంది.

నీవు కూడా తదితర ఇంద్రియములలాగానే అసత్తువు, ఉపకరణ మాత్రము అయి ఉన్నావు. ఇక నుండి సాక్షిరూపమైన 'ఇంద్రియరూప మాత్రము' అయి ఉండు. వేద శాస్త్రజ్ఞులు మనకేం చెప్పుచున్నారు? "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" "ద్వితీయమైనదంటూ మరొక్కటేదీ స్వయం ఉనికి కలిగి ఉండలేదు" – అని కదా! మనం దీనిని చక్కగా గ్రహిద్దాం. అంతేగాని భ్రమను కలిగి ఉండవద్దు. భ్రమ అనే విషూచి అనంత దుఃఖదాయకమైయున్నది. 'అహంకారము కలిగి ఉండుట' అను అలవాటే ఆ భ్రమ, లేక, వాసన యొక్క స్వరూపం. అదే అనేక సార్లు అజ్ఞాన ప్రేరితమైన విషయ అభిలాషలను కలుగజేస్తోంది. ఆత్మతో సంబంధమును, ఏకత్వమును అనుబంధమును దూరం చేస్తోంది.

'ద్వైతము / ద్వితీయము' అనే విషూచిని మనం అతి నిపుణతతో అధిగమిద్దాం... త్యజిద్దాం. ఓ మిత్రమా! చిత్తమా! నీవు సంసారరహితుడవు కమ్ము. ఈ జనన – మరణాది సర్వభయములను త్యజించు. పూర్ణానంద స్వరూపుడవు కమ్ము.

❖❖❖

5. నిర్లిప్తుడను - అప్రమేయుడను - అసంగుడను

ఉద్దాలకుడు : "అనంతాకారయుతము, అత్యంత సూక్ష్మము, విషయరహితము" అగు నా ఆత్మ స్వరూపమును ఈ వాసనలు కొంచమైనా స్పృశించగలవా? లేదు.

బాలుని దృష్టిలో 'బేతాళుడు' అనే లేని ఆకారం కల్పించబడుచున్నదే! అట్లాగే బుద్ధి యందు అహంకారము, సూక్ష్మవాసనలు కల్పించబడుచున్నాయి. అట్టి వాసనల సహాయంతో మనస్సు జడములను ఉపయోగించి తదితర జగత్తును పొందుతోంది. మనస్సు జాగ్రత్తు నందు, ఇంద్రియ విషయము లందు పాల్గొనుచూ అనేక జాగృత్‌దృశ్యానుభవములు సంపాదించుకుంటోంది. అదే మనస్సు స్వప్న సమయంలో భావనచే వాసనామయ విషయములను నాడీ ప్రదేశంలో పొందుతోంది.

మనస్సు యొక్క 'జాగ్రత్, స్వప్న' – అనుభవములు నా సమక్షంలో జరుగుచున్నాయి. నేనో... చిత్స్వరూపుడనై, నిర్లిప్తుడనై అంతా వీక్షిస్తూ ఉన్నాను.

నా స్వరూపమైనట్టి 'చిత్తు'నకు జనన మరణములు లేవు. 'సర్వవ్యాపి, నిరాకారము' అయిన చైతన్యము నందు ఉద్భవించేదేది? నశించేదేది?... కాబట్టి, జీవుడు దేని యందు నశిస్తాడు? జీవుని యందు ఏది నశిస్తుంది?... స్వస్వరూపమగు 'చిత్తు' నకు ఈ శరీరాదుల యొక్క రాక పోకలచే క్రొత్తగా వచ్చేదేమున్నది? కోల్పోయేదేమున్నది?...

ఎందుకంటే... 'సర్వాత్మ' యగు చైతన్యమే అందరి యొక్క జీవనము. అట్టి చైతన్యమే నేను. సమస్త దేశ కాలము లందూ, సర్వ వస్తువులందూ చిత్ స్వరూపమే వ్యాపించియున్నది. మరప్పుడు 'జీవించు కాలము, జీవించని కాలము' అనేవి ఎక్కడున్నాయి? అనగా, నా స్వస్వరూపమగు చిత్తునకు జీవన – నిర్జీవనములు లేవు. ఏ కాలంలోనూ ఏదీ అభిలషించ వలసిన పనే మీాలేదు.

"ఇది మరణించుచున్నది, ఇది జీవించుచున్నది" – ఇట్టి అనేక వికల్ప కల్పనలన్నీ కేవలం మనస్సుకే గానీ, నిర్మలమగు ఆత్మకు కావు. ఏ అంతరంగమైతే "ఈ దేహాదులే నేను" అను దురహంభావనను తన యందు ఏర్పరుచుకొని ఉంటోందో ...అట్టి అంతరంగము మాత్రమే తన యందు జనన మరణాదులను పొందుతోంది. ఆత్మ యందు మాత్రం 'అహమ్' భావన గాని, మరే భావన గానీ ఉండవు. ఇక దానికి జనన మరణాదులు ఎక్కడుంటాయి? మృగతృష్ణ మిథ్యాభ్రమ అయినట్లు; దేహము, మనస్సూ – ఈ రెండూ మిథ్యయే. వాటి యందు ప్రతిబింబించే 'అహంకారము' మాత్రం సత్యమైనదెట్లా అవుతుంది? ...జడమే కదా ... అభిమానం దేనికి?

ఈ కనబడే పదార్థముల విషయానికి వస్తే ... ఇవన్నీ కూడా జడమైనవే కదా! ఈ శరీరం కూడా ఒక జడపదార్థం మాత్రమే. ఇది స్వయముగా ఏదీ చేయుటలేదు.

చైతన్యస్వరూపుడనగు నేను ఈ దేహము మొదలైన జడపదార్థములపట్ల అభిమానం ఎందుకు కలిగి ఉండాలి?

❖

ఈ పదార్థములన్నీ ఉన్నప్పుడూ, లేనప్పుడూ కూడా నేను ఉన్నాను. ఈ రక్తమాంసమయ దేహమునందు లీనమగుచూ, 'ఇది నాది' అని తలచుచున్న మనస్సును చూస్తే నాకు జాలివేస్తోంది. అట్టి అభిమానము విచారణ చేసినప్పుడు తప్పక నశించుచున్నది.

మనస్సు – చిత్తము – బుద్ధి అనునవి స్వయంగా చైతన్యములు కావు. జడములు మాత్రమే! అవి మరొక దానిచే ప్రవర్తింపజేయబడుచున్నాయి. అవి కల్పనలోని విభాగములు. కనుక అవి అహంకారము అను దానిని తామే సృష్టించగలవా? ...లేదు. ఇక ఈ దేహంలో ఇంద్రియములున్నాయి కదా!... ఇవి ఉపకరణములు మాత్రమే. ఇవి 'రూపము' మొదలైన విషయములను సాక్షాత్కరింప జేయుటలో నిమగ్నమై ఉన్నాయి.

ఈ బాహ్యపదార్థములు తమ తమ పదార్థత్వమును వ్యక్తపరచుట యందు స్థితి కలిగి ఉన్నాయి. వాటన్నిటి యందూ 'నేను' అనునది ఎక్కడున్నది? ఇవన్నీ నాచే ఉపయోగించబడుచూ, 'తెలుసుకోబడుచున్నవి' అయి ఉన్నాయి.

ఇక 'గుణములు' విషయం!... శాస్త్రకారులు గుణములను సత్వము రజము తమము – అను మూడు విధాలుగా విభజించారు. ఈ సత్వరజోతమస్సులు "ప్రకాశము (తెలివి) పొందుట, ప్రవృత్తిని పొందుట, మోహము పొందుట" – అను మూడు రకాలుగా ఏర్పడి ఉంటున్నాయి. ఈ త్రిగుణముల రకరకాల పాళ్ళకలయికయే ప్రకృతి. మాయ, ప్రధానము అని కూడా దీనిని పిలుస్తారు.

గుణములు ఎవరివి? ...గుణివి (one who is exhibiting qualities). గుణి లేకుంటే గుణాలు ఉండవు. కనుక గుణములు స్వయంగా జడములు మాత్రమే. గుణి గుణములకు ముందే, గుణాల కంటే సూక్ష్ముడై, గుణములకు స్థానమై, కారణమై ఉంటున్నాడు. అతడు గుణములకు అప్రమేయుడు.

గుణి యొక్క స్వరూపము 'సత్ బ్రహ్మము'. అది సర్వదా తన స్వాత్మభావన యందు నెలకొని ఉన్నది. అది అఖండము. "అహంకారము" అనబడేది అఖండమగు సత్ బ్రహ్మము నందు చోటు పొందజాలదు. అనగా 'అహంకారం' అనేది ఎక్కడా, ఏ రూపంలోనూ ఉండజాలదు.

❖

బాగున్నది!... అయితే, ఈ 'జీవుడు' అని తారసపడేవాడెవడు? ఒకే సూర్యుడు అద్దం లోనూ, తటాకం లోనూ, కళ్ళ యందు ప్రతిబింబిస్తున్నాడు కదా! ...అదేవిధంగా ఒకే చిత్తు ఈ దేహము లన్నిటి యందూ ప్రతిబింబిస్తోంది.

అనగా... ఈ దేహమున కనిపించే చిదాభాసుడు పరమానంద చిదాత్మయే. సర్వవ్యాపి, సర్వకాలమయుడు, మహత్తరరూపుడు అగు చిదాత్మ సర్వదేహము లందూ 'దేహి' గా వెలయుచున్నాడు. అట్టి మహత్తర రూపునకు 'ఈ దేహము నాది' అను దేహాభిమానము, అహంకారము ఎట్లా కలుగుతాయి. కనుక అట్టి అల్పభావము ఆపాదితమే గానీ, వాస్తవం కాదు.

దేహి - ఈ దేహము నందు దేహిగా అభిమానం కలిగి ఉంటున్నవాడెవడు? వాని ఆకారము ఎట్టిది? ఆతడు ఎట్లా ఏమని నిరూపించబడతాడు? ఆతని రంగేమిటి? రూపేమిటి? ఏ పదార్థముచే ఆతడు తయారగుచున్నాడు?

అహం భావము ప్రదర్శిస్తున్న నేనెవరిని? నేను అహంభావమునా? అందుకు వేరైన వాడినా? అహంభావము నాచే గ్రహించబడుచున్నదా? లేక, నేను అహంభావముచే గ్రహించబడుచున్నావా? అహంభావము నన్ను కల్పిస్తోందా? నేను అహంభావమును కల్పించుకుంటున్నానా?

భావాతీతం! - ఇట్లు యోచించినప్పుడు 'నేను అహం భావమునకు మునుముందే ఉండి ఉన్నాను" అని తెలిసిపోతోంది. ఈ భావాభావములు నా యందు గానీ, భావాభావముల యందు నేను గానీ లేము.

అవును. ఈ ప్రపంచమున 'అహంభావాభిమాని' అనువాడెవ్వడూ యథార్థానికి లేడు. కనుక నేను అహంకార రహితమగు చిదాత్మ స్వరూపుడను. అట్టి నాకు ఎద్దానితోనూ ఏ సంబంధమూ లేదు. అహంకారము అసత్తేనని నిరూపించబడుతోంది కదా! ఇక ఎవనికి దేనితో ఏమి సంబంధం? అట్టి సంబంధము యొక్క అభావము సిద్ధిస్తున్నప్పుడు సర్వద్వైతకల్పనలూ వాటంతట అవే నశిస్తున్నాయి. మరి నేను నిర్లిప్తుడను, అప్రమేయుడను, అసంగుడను కదా!

❖❖❖

6. ఇక శోకం దేనికి?

ఈ విధంగా ఈ జగత్తంతా బ్రహ్మాత్మకమే అయి ఉన్నది. సత్స్వరూపుడనగు నేను ఎందుకు వ్యర్థంగా శోకించాలి? అన్ని సమయాలలోనూ నేను అద్వైత సామ్రాజ్యమున స్థితుడనై ఉన్నానని నిరూపించబడుతోంది కదా!

ఈ జీవుడు చేరతగ్గ అన్నిటికన్నా ఉత్తమోత్తమ స్థితి ఏది? ...ఏకమై, నిర్మలమై, సర్వవ్యాపకమై శుద్ధమై ఉన్నట్టి ఆత్మపదమే – అన్ని రూపు లందు, అన్ని దిక్కులందూ, అన్ని వేళలందూ వెలయుచున్నది. మరి 'అహంకారము' అనే కళంకమే అసంభవం. అహంకారమనేది లేనే లేనప్పుడు, ఇక దానిని 'తొలగించుకోవాలి' – అనేది ఎక్కడుంది? అట్టి ప్రసక్తి అక్కర్లేదు.

పదార్థములు లేవు ఆత్మ మాత్రమే ఉన్నది - యథార్థానికి పదార్థజాలమంటూ ఎక్కడా ఏదీ లేదు. సర్వవ్యాపియగు ఆత్మ మాత్రమే ఉన్నది. ఒకవేళ అభాస మాత్రం చేత ఎప్పుడైనా పదార్థముల ఉనికి సంభవించినా, ఆత్మతోటి వాటికి ఎట్టి సంబంధమూ లేదు. బాహ్యపదార్థములు – ఆత్మదృష్ట్యా చూస్తే – అవన్నీ ఆత్మచే కల్పించబడి, భావించబడుచున్నవే! ఆత్మ నిర్వర్తించే మననమే తన రూపముగా గల ఈ మనస్సు ఇంద్రియములతో గూడి, స్వప్న దృష్టాంతములాగా విజృంభిస్తోంది. అది పొందుచున్న భావన అంతా తనకు తానే కల్పించుకొనుచున్నది. అది తనకు బాహ్యమైన పదార్థములేవీ సాక్షాత్కరించు కోలేదు. బాహ్యపదార్థము లేవీ దానిని స్పృశించజాలవు. కల్పనయే మనస్సును – పదార్థములను ఒక చోటికి తెచ్చుచున్నది. కనుక ఈ జగత్తు యొక్క అసలు రూపం కల్పన మాత్రమే.

ఇక చిత్ ఎల్లప్పుడూ నిర్లిప్తమైనది. అది మనస్సుతో గానీ, ఇంద్రియములతో గాని, బాహ్య పదార్థములతో గానీ సక్తము (Attached / Involved) అగుటలేదు. వాటన్నిటికీ అది అతీతమై, అనిర్వచనీయమై ఉంటోంది. వాస్తవానికి – 1. బాహ్యపదార్థములు, 2. ఇంద్రియములు, 3.

మనస్సు, 4. చిత్ – ఈ నాలుగు ఒక దానితో మరొకటి కలియకుండానే తమ తమ స్థానములలో ఏర్పడి ఉంటున్నాయి. రాయి, మణి, లోహము, త్రాడు (సూత్రము) ఒకచోట ఆభరణ రూపంలో ఉన్నా అవి ఒకదానికి మరొకటి వేరే కదా!

అజ్ఞానము నుండి అహంకారము - అజ్ఞానము చేతనే మహాభ్రమ ఉదయిస్తోంది. అట్టి మహాభ్రమ వలన 'ఇది నాది, ఇవి ఇంకా పొందాలి' అనే వ్యవహారం ఏర్పడుతోంది. వాస్తవం ఎరుగక పోవటమే అజ్ఞానం. అది జగద్భ్రాంతిగా పరిణమిస్తోంది.

ఆత్మతత్త్వము ఏమరుస్తున్నప్పుడు 'అహంకారము' అనే చమత్కృతి ఉదయిస్తోంది. వేడి ఉన్నచోట మంచు ఉంటుందా? ఆత్మను దర్శించగానే – అహంకారము, పదార్థభావనా, – రెండూ తొలగిపోతాయి. అనగా అవి లేనివిగా తెలియవస్తాయి.

ఆత్మకు భిన్నమైనదేదీ లేదు. అంతయు బ్రహ్మమే అయి ఉన్నది. కాబట్టి బ్రహ్మమునే భావనచేస్తాను.

అహంకారభ్రమస్యాస్య జాతస్యాకాశవర్ణవత్ ।
అపునః స్మరణం మన్యే నూనం విస్మరణం వరమ్ ॥ (శ్లో 25, సర్గ 53)

ఆకాశంలో కనిపిస్తున్న నీలపు రంగులాగా మిథ్యారూపంగా కనిపిస్తున్న ఈ అహంకారం నా స్మృతి పథంలో పూర్తిగా తొలగేంత వరకు అధిగమించివేస్తాను. అట్లు అధిగమించిన తరువాత, శేషించుచున్న ఆత్మస్వరూపము నందు ఆత్మ స్వరూపుడనై ఉంటాను. శాంతాత్ముడనై, నిర్మలాకాశమువలె అనంతత్వము, అఖండత్వము, శుద్ధత్వము, శాశ్వతత్వము వహిస్తాను. మూల అవిద్య సహితంగా అహంకార భ్రమను సర్వదా త్యజించివేస్తూ ఆ భ్రమకు కూడా సర్వదా సాక్షిమాత్రుడనై ఉంటాను.

❖

లాభం, నష్టం - వృద్ధి, క్షయములు తమ స్వభావముగా గల ఈ దేహాదులపట్ల 'ఇది నేను, ఇది నాది' అను అహంభావము ఎన్ని అనర్థాలు కలుగ జేస్తోంది! ఎన్నెన్ని తాప, సంతాపములకు కారణమగుచున్నది! అవును. హృదయాకాశంలో 'అహంకారము' అనే మేఘం స్ఫురించగానే, ఇక దుర్వాసనలతో గూడిన ఈ దేహాదులు మరల మరల ఉత్పన్నం అవుతూనే ఉన్నాయి. దేహములను అనుసరించినంత కాలం ఇహ పరలోకములు, మరణములు, పునర్జన్మలు, దుఃఖములు కలుగుతూనే ఉంటాయి.

అహంకారము అనే గ్రద్దకు కనబడుచున్న భోగ్యపదార్థములన్నీ ఎప్పటికో అప్పటికి నాశన మయ్యేవే కదా! పాపం, అజ్ఞానులగు అనేకమంది జీవులు, "ఇంత వరకూ ఇది పొందాను. ఇహ ఇక్కడి నుండి ఇది పొందబోవుచున్నాను" అను రూపంలో అంతరంగంలో అవిశ్రాంత భావోద్రేకం కలిగి ఉంటున్నారు. అట్టి అంతఃకరణము జ్ఞానాగ్ని చేత దగ్ధమొనర్చబడు గాక! "ఇది ఉన్నది, ఇది లేదు" – అనునట్టి చింతలన్నీ భ్రమకల్పితమగు అహంకారము వైపుగానే సారించబడుచున్నాయనీ, ఆత్మ వైపునకు కాదనీ జనులంతా గుర్తించెదరు గాక!

❖❖❖

7. ఈ జీవుడు గమనించడేం?

అహంభావే పరిక్షీణే శుష్కః సంసారపాదపః ।
భూయః ప్రయచ్ఛత్యరసో న పాషాణవదఙ్కురమ్ ॥ (శ్లో 32, సర్గ 53)

ఉద్దాలకుడు : ఈ దేహాదులందు ఎప్పుడైతే అహంభావము క్షయిస్తుందో, అప్పుడిక సంసారవృక్షము ఎండి నీరసించగలదు. ఆత్మజ్ఞానం ఉన్నచోట రాగము గాని, ద్వేషము గాని, తృష్ణ గాని ఉండవు. మనస్సు నందు "ఈ ప్రపంచం మిథ్యయే" అను ఉన్నతమైన నిశ్చయం దృఢపడిందా ... ఇక భోగ వాసనలు సన్నగిల్లుతాయి. మనస్సు చిత్ ప్రతిబింబమును నిర్మలస్వభావముతో కూడి గ్రహిస్తూండగా, క్రమంగా సంకల్ప – వికల్పములను త్యజించగలుగుతుంది. రాగరహితమైనప్పుడు శుద్ధమగుచున్నది. ఆత్మను దర్శించినప్పుడు స్వస్థత పొందగలుగుచున్నది.

ఈ చిత్తము తన అవయవరూపములైనట్టి ఈ ఇంద్రియములను బహిర్ముఖము నుండి అంతర్ముఖము వైపుగా తరలించినప్పుడు తత్త్వజ్ఞానం ఉదయిస్తోంది. జ్ఞానాగ్నిలో తనకు తానే దగ్ధమై, ఆత్మ ప్రకాశంచే నిర్మలత్వం పొందుతోంది. "ఆహా! ఈ దేహం నా కంటే భిన్నమైనది కదా!" అని గ్రహించినదై విషయవాసనలను త్యజిస్తోంది. స్వవినాశనమును కూడా అంగీకరించి గొప్ప దేశభక్తి గల యుద్ధవీరుని వలె 'బ్రహ్మతత్త్వము' అనే సామ్రాజ్యమునకు తన సేవలను అందిస్తోంది.

❖

ఈ మనస్సును శుద్ధపరచటంలో అశ్రద్ధగా ఉన్నామా... ఇది దేహానికి సంతాపం కలుగ జేస్తూ ఉంటుంది. అట్లాగే, దేహము మనస్సునకు సంతాపకరము అగుచున్నది. కుండ పగిలితే అందులోని నీళ్ళు తొలగుతాయి కదా! అలాగే ఈ మనో దేహములలో ఒకదాని వాసనలు నశిస్తే, రెండూ నశిస్తాయి. కుండలోని నీరు కుండను ఆశ్రయించుకుని ఉన్నట్లు శరీరము, మనస్సు ఒకదాని కొకటి కాస్త సహకరించుకుంటున్నాయి. అయితే, ఇంతలోనే, పరస్పరం సంతాపకారణమయి, ద్వేషించుకుంటున్నాయి. అవిద్య నశిస్తే, ఆ రెండూ 'లేనివి' అగుచున్నాయి. ఆ రెండూ రహితత్వమును సంతరించుకున్నప్పుడు ఈ జీవునకు పరమసుఖము లభించగలదు. ఆ రెండిటిలో ఏ ఒక్కటి ఉన్నా ఈ జీవునకు దుఃఖము శమించటమనేది కల్ల. విరుద్ధ స్వభావం కలిగిన ఈ మనోదేహములు ఎక్కడ ఉంటే అక్కడ దుఃఖపరంపరలు వచ్చి పడుతూనే ఉంటాయి. ఈ రెండిటి సంబంధము వలననే జీవునకు విషయసుఖము లందు ఆసక్తి జనించుచున్నది. అట్టి దౌర్భాగ్యం తప్పక గమనించ వలసిన విషయం.

బాలుడు పిశాచముల యొక్క కల్పన చేసుకుంటూ ఉంటాడే!... అట్లాగే ఈ మనస్సు తన సంకల్పముల చేతనే ఈ దేహమును కల్పించుకొనుచున్నది. ఈ శరీరమును ఒక వైపు నుండి భోజనము మొదలైన వాటిచే పుష్టిచేస్తూ, మరొకవైపు నుండి తన దుఃఖములన్నీ ఈ దేహమునకు అంటగట్టుచున్నది. మనస్సుచే దుఃఖములను అందుకున్న ఈ శరీరం దుర్వ్యసనములను సేవిస్తూ,

రాగ–ద్వేష–శోక–మోహ–లోభ–పాపాదులను ఉత్పన్నం చేస్తూ, తద్ద్వారా జనించిన కుసంస్కారాలను మనసులోనికి నెట్టుచున్నది. అనగా, మనస్సుకే ద్రోహం తలబెట్టుచున్నది. కన్నకొడుకే తండ్రిని బాధించునట్లు ఈ శరీరము మనస్సు యొక్క భ్రమను అధికం చేస్తోంది.

❖

ఇక ఈ అనేక జీవుల పరస్పర సంబంధం ఇంకా చమత్కారంగా ఉంటోంది. స్వతఃగా చూస్తే ఒకడు మరొకనికి మిత్రుడూ కాడు, శత్రువూ కాడు. కాని సుఖకల్పనచే 'మిత్రుడు', దుఃఖ, భయకల్పనచే 'శత్రువు'లను మనస్సు పొందుచున్నది.

నాస్తి శత్రుఃప్రకృత్యైవ, నచమిత్రం కదాచన,
సుఖదం మిత్రమిత్యుక్తమ్, దుఃఖదా శత్రువత్స్మృతాః ॥

ఎవరి వలన సుఖం లభిస్తుంటే ఆతడు మిత్రుడని, ఎవరి వలన దుఃఖం సంభవిస్తుందో ఆతడు శత్రువని మనస్సుచే ప్రతీతి ఏర్పరచబడుచున్నది.

ఈ శరీరం దుఃఖములను అనుభవిస్తూ మనస్సును హింసిస్తోంది. ఇక మనస్సు కూడా తన సంకల్పములచే ఈ దేహమును దుఃఖానుభవ స్థానంలో కూల్చివేస్తోందాయె! ఇట్టి పరస్పర దుఃఖ దాయకము, స్వభావ విరుద్ధములైన దేహమనస్సుల పోకడలను ఈ జీవుడు గుర్తించకున్నాడేం?

మనస్సు నశిస్తే శరీరము దుఃఖం పొందదు. అందుచేత "శ్రద్ధ – అసక్తి – అత్యవసరము" లతో కూడిన ప్రయత్నం చేసి జ్ఞానమును, తత్సాధనములను సమకూర్చుకొనెదనుగాక! మనస్సునకు ఆత్మజ్ఞానం కలుగనంతవరకూ ఈ దేహం ఉండి ఏం లాభం? లేకపోయి ఏం లాభం? అనర్థములు తప్పునవి కావు.

ఓ మనోదేహములారా? మీరిద్దరూ పైకి ఒకరికొకరు సహకరించుకున్నట్లు ఉన్నా, లోలోన ఒకరిని మరొకరు హింసించుకుంటున్నారు. అయితే 'అభేదాధ్యాస' (A Sense beyond all differences)చే ఏకరూపులగుచున్నారు. వంట చేసేటప్పుడు అగ్ని, జలము సహకరిస్తున్నట్లు మీరిద్దరూ మోక్షోపాయ సాధనల విషయంలో నాకు సముచితంగా సహకరించండి.

❖

మనస్సు నశిస్తే దేహము వాసనారహితమగుచున్నది. అప్పుడు దేహరాహిత్యము అనుభవమౌతోంది. కానీ, దేహం నశించినా మనస్సు నశించటంలేదు. అందుచేత వివేకముతో ముందుగా మనస్సును నశింపజేస్తాను. 'సంకల్పము – తృష్ణ' అను రెండు చక్రములు గల ఈ మనస్సును త్యజించి, తత్ఫలితంగా ప్రాప్తించే 'పరమాత్మ' అనే విశాలభూమిలో ప్రవేశించి ప్రశాంతంగా, సుఖంగా ఉంచుతాను. క్షయిస్తున్న మనస్సు క్రమంగా తన స్వభావమైన వాసనాపరంపరలను కూడా క్షయింపజేస్తుంది కదా! ఇక నాకు దుఃఖించుటకు విషయములేమి ఉంటాయి?

చర్మ – రక్త – మాంస – బొమికలతో కూడిన ఈ శరీరం అల్పాశయునకు శత్రువు వంటిదే. అయితే, మనస్సు ఉంటే ఇది శత్రువులా ప్రవర్తిస్తుంది. మనస్సు ఉపశమిస్తే ఇది ఉన్నా ఒక్కటే,

లేకున్నా ఒక్కటే. దానితో నాకు సంబంధమే ఉండదు కదా! అజ్ఞానదశలో ఉన్నప్పుడు ఏఏ భోగములను ఆకాంక్షించానో – అట్టి భోగములతో నాకేమి సంబంధం లేదు. ఈ శరీరమునకు సంబంధించిన సుఖావేశములతో నాకేమి పని?

❖

ఓ 'ఉద్దాలకుడు' అను పేరుచే ఆరోపించబడినవాడా! నేను దేహమును గాని, నామమును గాని, మనస్సును గానీ కాదు. నా యందు స్ఫురించే ఈ నామ రూపముల కంటే ఆత్మ అత్యంత విశిష్టమైనది.

ఒక ఉక్తి చెపుతాను... విను. ఈ శరీరం మరణించినప్పుడు, ఇక్కడ కాళ్ళు – చేతులు – తదితర దేహము ఉన్నప్పటికీ అది కదలగలదా? లేదు. కానీ, ఈ దేహంతోబాటే నేను లేకుండాపోయే వాడను కాదు. ఈ దేహమునకు అతీతమైన వాడను. ఇచ్ఛాశక్తిచే ఈ దేహమును కదిలించేవాడను. అదలించేవాడను. నిత్యుడను. నిరంతర ప్రకాశ శీలుడను. వ్యాపక స్వరూపుడను. సూర్యమండలమందలి సూర్యునితో కూడా సాంగత్యం పొంది, అట్టి ఆకాశములోని సూర్యుని ఎరుగుచున్నట్టివాడను. అంతేగాని, కేవలం అజ్ఞుడను, దుఃఖిని కాదు. నాకు దుఃఖము గానీ, దుఃఖత్వము గానీ, అనర్థత్వము గానీ లేవు. దేహం ఉన్నా, పోయినా నేనెప్పుడూ సంతాపరహితుడనే.

యత్రాత్మ తత్ర న మనో నేన్ద్రియాణి న వాసనాః ।
పామరాః పరితిష్ఠన్తి నికటే న మహీభృతః ॥ (శ్లో 74, సర్గ 53)

ఆత్మ ఎప్పుడైతే వికసిస్తుందో – ఆ స్థానం, లేక, స్థితిలో మనస్సు గానీ, ఇంద్రియములు గాని, వాసనలు గాని ఉండజాలవు. రాజుగారు నివసించే అంతఃపురంలో భిక్షగాళ్ళు ఉంటారా?

❖

ఓ శరీర మనస్సులారా! మీ ఇద్దరికంటే విలక్షణమైన నేను బ్రహ్మ పదమును ఎల్లప్పుడూ పొందియే ఉన్నాను. ఇప్పటికీ, ఎప్పటికీ అది పొందబడియే ఉన్నది.

నేను కేవలుడను! ...ఇట్లు సమస్త దృశ్య వ్యవహారముపై విజయము పొందాను. శాంతుడను, నిరవయవుడను అయ్యాను. నాకు ఇచ్ఛలు గానీ, క్రియలు గానీ లేవు. నువ్వుల నుండి నూనె వేరు పడిన తరువాత, ఆ నూనె, నువ్వులు సంబంధం గాని, సమాన లక్షణాలు గానీ కలిగి ఉండవుకదా!

నాకిప్పుడు దేహ – ఇంద్రియ – మనస్సులు మొదలైన వాటితో ఏమాత్రం సంబంధం లేదు. ఇక ఈ దేహేంద్రియ మనస్సులు ఉంటే ఉండనీ. అదీ వినోదమే. ఆత్మ పదము నుండి అభాస మాత్రంగా ప్రకటితమగుచున్న బుద్ధి నా సమక్షంలో ఏదైనా 'శేషించిన ప్రారబ్ధకర్మ' ను పొందవలసి వస్తే, పొందనీ. కర్మలే లేనివానికి ప్రారబ్ధకర్మలు ఎక్కడివి?

సర్వమునకు సాక్షి అయిన నాకు ఈ దేహాదులతో ఈ దేహాదుల అనుభవంగానీ, అభిమానంగానీ ఉండాలనిగానీ, ఉండకుండాలనిగానీ లేదు.

ఓ సహా ఆత్మజ్ఞానులారా! అత్యుత్తమమగు ఏకాత్మ బుద్ధితో సంచరించే మీరే నాకు బంధువులు, స్నేహితులు కూడా. మీరంతా నిరంతర ఆత్మోదయం కలిగి, సములై, స్వస్థులై, సౌభాగ్యయుతులై ఉంటున్నారు కదా! నా మీద దయతో మీ జట్టుతో నన్ను కూడా చేర్చుకోండి.

ఓ 'ఉద్దాలకుడు' అను పేరుతో పిలువబడుచున్న ఆత్మదేవా! నీవు ఏ ప్రమేయం లేకుండానే, స్వతహాగానే అత్యంత స్వచ్ఛులై ప్రకాశిస్తున్నావు. పూర్ణకాములై, ఆత్మసత్త స్వరూపులై రమణీయ ఆనందం, ఉపశమనములచే వెలుగొందుచున్నావు. సదాచారము, మృదుభాషణము, పూర్ణత్వము, అబాధిత్వము మీ భావములలోని అకృత్రిమ లక్షణములై ఉంటాయి. ప్రకాశము, ద్వైతరాహిత్యము, వికల్పరాహిత్యము మీ స్వభావములే అగుచున్నాయి. ఓ ఉద్దాలకనామధేయ ఆత్మదేవా! నీకు నమస్కారం.

సమస్తమూ కల్పన చేతనే ఆవిర్భవిస్తోంది. ఆ సర్వకల్పనలకూ ఆవల, సమస్త కల్పనలకు కారణభూతుడనై, స్థానమై, ఆధారభూతుడనై నేను ఉన్నాను.

❖

ఇప్పుడు అజ్ఞాన మనస్సు రహితమైపోయింది. వికల్పయుక్తమగు చిత్తము మచ్చుకైనా దొరకుటలేదు. ప్రత్యక్షముగా కళ్ళకు కనిపించే ఈ దృశ్యజాలమంతా త్యజించివేయబడింది. నేను బ్రహ్మానందస్వరూపుడనై పరమాత్మయందు అనిర్వచనీయము, ఆద్యంత రహితము అయిన శాంతిని, విశ్రాంతిని పొందుచున్నాను.

❖

ఈ విధంగా విచారణ చేస్తూ ఉద్దాలకుడు నిర్మలమైన, ఉదారమైన బుద్ధితో కనులు సగం మూసుకొన్నారు.

❖❖❖

8. శాంతి - విశ్రాంతి

అర్ధ ఉన్మీలిత నేత్రుడు అయి, ఉద్దాలకుడు 'పరబ్రహ్మము' అను పదములో సంస్థితుడగుటకు ఉద్యుక్తుడయ్యాడు. ఓంకారమే పరమపదము యొక్క సంజ్ఞ కదా! ఇక ఘంటానాదం లాగా ఓంకారం ఉచ్చరించ ప్రారంభించాడు. 'ఓం'కారానికి శిరస్సు వంటిదైన 'అర్ధమాత్ర'ను ఆశ్రయించాడు. ఓంకార వృత్తికి శబ్దార్థముల వలె ఉపహితమైన చైతన్యమును అనుసరించుచూ, సుషుమ్నానాడిని సమీపించాడు. "కూటస్థ జీవచైతన్యము ఇక బాహ్యమునకు ఏమాత్రం అభిముఖం కాదు" అను స్థితి వరకూ ఓంకారము ఉచ్చరిస్తూనే ఉన్నాడు. ఆ ప్రణవము 'అ'కారము – 'ఉ' కారము – 'మ' కారము – అర్ధమాత్ర – అను నాలుగు పాదములు కలిగి ఉన్నది.

'అ'కారం ...రేచకం - ప్రణవము యొక్క 'ప్రథమాంశ' యగు అకారమును ఉచ్ఛ స్వరముతో ఉచ్చరిస్తూ ఉన్నారు. అతని దేహం అప్పుడు సంక్షుబ్ధమై, బాహ్య ప్రదేశములకు వెళ్ళుచుండే

ఉత్సాహం చూపుచుండే వాయువు చేస్తున్న శబ్దంతో నిండిపోయింది. 'రేచకము' అను పేరుతో చెప్పబడే 'ప్రాణ నిష్క్రమణ క్రియ' ఆతని శరీరమును ఖాళీ చేయసాగింది.

అట్లు ఆతని దేహము నుండి వెలువడిన వాయువులు చిత్ రస పూరితమై, గూడును వదిలిన పక్షి లాగా బాహ్యాకాశంలో ప్రవేశించాయి. అప్పుడు ఆతని హృదయంలోని జ్వాజ్వల్యమానమగు అగ్ని దేహాన్నంతటినీ ఆక్రమించింది. ఆతని భౌతికదేహం భస్మమైనది. అయితే రామా! ఉద్దాలకునకు, అట్టి స్థితి ప్రణవముయొక్క ప్రథమక్రమభావన చేతనే అనుద్వేగకరంగా కలిగింది. అంతేగానీ, హఠయోగం చేత కాదు. ఎందుకంటే బలవంతంగా చేసే హఠయోగం శ్రమ, దుఃఖములనే కలుగజేస్తుంది సుమా!

'ఉ'కారం ...కుంబకం - క్రమంగా ఉద్దాలకుడు 'అ'కారోచ్చారణ నుండి 'ఉ'కారోచ్చారణ సమారంభించాడు. అప్పుడు 'ఉ'కారోచ్చారణ క్రమంలో ప్రాణముల సమస్థితి ఏర్పడింది. 'నిశ్చల కుంభము' అను పేరుతో ప్రసిద్ధమైన ప్రాణక్రియ జరిగింది. నాసికారంధ్రములలో వాయువు నిరోధించబడింది. ఆ వాయువు పైకిగానీ, క్రిందకుగానీ, బయటకుగానీ, లోపలికిగానీ పోజాలక చలనరహితమైనది. శరీరమును భస్మమొనర్చగల అగ్ని మెరుపువలె క్షణంలో శాంతించింది. అప్పుడు ఎఱ్ఱటి శరీరభస్మము మాత్రమే కనిపించింది. తెల్లటి బొమికలు చేష్టారహితమై కనిపించాయి. మహా వాయువుచే ఊర్ధ్వమునకు కొనిపోబడిన ఆ అస్థిసహిత భస్మము క్షణంలో ఆకాశము నందు వ్యాపించి అదృశ్యమైపోయింది.

ఈ స్థితి కూడా ప్రణవముయొక్క ద్వితీయ క్రమంచే ఏర్పడింది. అంతేగాని, బలవంతంగా చేసే హఠయోగం వలన కాదు.

'మ' కారం ...పూరకం - ఆ తరువాత ఉద్దాలకుడు శాంతిదాయకమగు ప్రణవము యొక్క తృతీయ క్రమము నందు వాయువును పూరించాడు. అదియే 'పూరకము' అను ప్రాణక్రియగా అప్పుడు 'జీవ చైతన్యము' అనే అమృతము యొక్క మధ్య గల ప్రాణసమూహం మంచు యొక్క స్పర్శలాగా బాహ్యాకాశంలో శీతలత్వం పొందింది.

క్రమంగా ఆ జీవ చైతన్యము గగన మండలత్వం పొందింది. ఆతని ప్రాణవాయువులు చంద్రుని చల్లటి కిరణములు లాగా అమృత తుల్యములయ్యాయి. వాయువుచే కొనిపోబడగా మిగిలిన దేహభస్మముపై ఆతని ప్రాణవాయువుల యొక్క అమృతధార కురిసింది. అప్పుడు చంద్ర బింబమువలె శోభాయమానమైన ఒక క్రొత్త శరీరం ప్రకటితమైనది. చతుర్భుజములతో విష్ణుభగవానుని ఆకృతి వలె నూతనశరీరం ఉదయించింది.

ఆ ఉద్దాలకుని నూతన శరీరం వికసిత నేత్రములతో, ముఖముతో, అతి దీప్తితో శోభను పొందింది. జలప్రవాహం తటాకమును నింపునట్లు, వసంత కాలం వచ్చి వృక్షములలో రసమును నింపునట్లు అమృతమయమగు ప్రాణములు ఆ శరీరాన్ని నింపాయి. నిర్మలస్వరూపము, దోష రహితమగు ఆతని నూతన శరీరం ప్రస్తుతం చేయబోయే కార్యక్రమములకు తగినట్లుగా ఉన్నది.

❖

అటు తరువాత ఉద్దాలకుడు ఒకచోట పద్మాసనమున శరీరమును 'సుదృఢం' చేశాడు. ఏనుగును కట్టుకంబళమును కట్టినట్లు పంచేంద్రియములనూ బంధించాడు.

'నిర్వికల్ప సమాధి' నిమిత్తం తన మనన స్వభావమును వినిర్మలం చేయటానికి ప్రయత్నించ సాగాడు. "ఆశ – తృష్ణ – విసుగు – ఆలశ్యము" లవైపుగా వెళ్ళుచున్న తన స్వభావము (మనస్సు)ను, ప్రాణయుక్తమైన చిత్తమును శుద్ధ పరచి, మరలించుటకు అనేక విధములుగా ప్రయత్నించాడు. దున్నపోతు త్రాళ్ళచే లాగబడునట్లు ఆతనిని చిత్తము సుదూరంగా 'బంధువులు – గృహములు – సుపరిచితులు" వైపుగా లాగబడుచూ ఉండటం గమనించాడు. అట్లు విషయములవైపుగా పరుగులెత్తే వ్యాకుల చిత్తమును మరల మరల సునిర్మలమొనర్చి బలపూర్వకంగా నిరోధించేవాడు.

క్రమంగా ఆతని ప్రయత్నం ఫలించింది. రెండుకళ్ళు అర్ధనిమీలితం చేశాడు. మౌనవ్రతధారి అయి, ప్రాణాపాన నిశ్చలాభ్యాసంచే ముఖము నందు 'శీతలసుగంధము'తో పోల్చతగిన ఒకానొక ప్రశాంతతను పొందాడు. అట్టి ప్రశాంత స్థితిలో ఇంద్రియములను విషయముల నుండి వేరుచేసి తన ప్రశాంత స్వభావమునందు ఇముడ్చుకున్నాడు. సూర్యభగవానుడు లోకములను త్యజించుచున్నట్లు ఆయన బాహ్య విషయధ్యాసను త్యజించివేశాడు. ఆత్మతత్త్వదర్శనము వృద్ధిపొందుచుండగా మనో వాక్కులు మొదలైన విషయములన్నీ తన యందే లయం చేసివేశాడు.

అప్పుడు కాలిమడముచే 'గుదస్తంభనం' చేసి నవద్వారములందలి వాయువును నిరోధించారు. ఆతని కంఠము ఇప్పుడు ఆత్మరస ప్రపూర్ణమై రజోగుణ, తమోగుణములను అభావించుచు స్వచ్ఛమైనది. మనస్సును ధారణా యుక్తులచే సమాధికి అభిముఖం చేశాడు. ఆ మనస్సును తన హృదయాకాశంలోనే ధరించి ఉన్నాడు. అప్పుడది నిర్మలాకాశంలాగా నిర్మలత్వమును, సౌమ్యత్వమును పొందింది.

❖

మధ్య మధ్యలో మందంగా విచ్ఛేదకరములగు విపరీత భావాలు పొడచూపేవి. వాటిని జాగ్రత్తగా గమనిస్తూ బ్రహ్మాకార వృత్తిచే ఆ వికల్ప సమూహం తనను సమీపించకుండా జాగరూకుడ య్యేవాడు. క్రమంగా వికల్పజాలములన్నీ నశించాయి.

ఆ తరువాత తన హృదయాకాశంలోకి దృష్టినంతా సారించాడు. తమోగుణ ప్రేరితమైన అంధకారముచే ఆచ్ఛాదితమైన వివేకసూర్యుని (అస్పష్ట వివేకానుభవమును) చూచాడు. వెనువెంటనే 'సత్వగుణాభివృద్ధి' ని ఆశ్రయించి, తద్వారా ప్రాప్తించిన ఉత్తమ జ్ఞానము, మనస్సులచే తమోగుణ ప్రేరితమైన అంధకారమును నశింపజేశాడు. అప్పుడు ఒకానొక రమణీయమైన 'తేజః పుంజము' ను దర్శించాడు. అట్టి దర్శనములో పాత్ర వహిస్తున్న రజోగుణమును గమనించి, దానిని మ్రింగివేసి సత్వగుణ సమృద్ధుడైనాడు. క్రమంగా ఆ తేజఃపుంజము ఉపశమించింది.

❖

అప్పుడు ఆ మునీంద్రుని మనస్సు నిద్రా తరంగములచే చంచలమై, భ్రమణశీలమై ఉండసాగింది. మద్యపానముచే మత్తెక్కిన మనిషిలాగా ఆతడు నిద్రను పొందాడు. కానీ వివేక

ప్రబోధచే ఆ నిద్రను వినష్టం చేశాడు. నిద్ర నశించిన తరువాత మనస్సు 'వివిధ వాసనలతో పరికల్పితమైన రూపముగల ఆకాశము' ను భావన చేయసాగింది. ఆతడు ఆ ఆకాశమును కూడా తొలగించి వేశారు. ఆ విధంగా ఆకాశానుభూతికూడా నశించిన తరువాత 'మత్తు దిగుచున్నప్పటి తాగుబోతు' లాగా కొంచం విమోహితుడైనాడు.

ఆ మనోమోహాన్ని కూడా పారద్రోలిన తరువాత ఆతని అప్పటి మనస్సు క్షణకాలం నిర్వికల్ప సమాధిలో విశ్రమించింది. అప్పటి స్థితి 'తేజస్సు, తమము, నిద్ర, మోహము' – అనేవి లేనట్టిది. వాక్కుకు అగోచరమైనది.

ఆతని చిత్తము అట్లు విశ్రమించి, మరల ఇంతలోనే ప్రపంచ వృత్తికి మరలింది. కాసేపు ప్రవృత్తిలోనూ, మరికొంచెం సేపు నివృత్తిలోనూ ప్రవర్తిస్తూ ఆతని చిత్తము త్వరలోనే చిత్తత్వము వదలి చిద్రూపత్వమును పొందింది. అతిశీఘ్రంగా సర్వప్రపంచము కంటే అన్యమైన ఆకారమును పొందింది. వృత్తిగత చైతన్యము తన విషయాకారమును త్యజించి సర్వవృత్తులకూ సాక్షి అయినట్టి కేవల చిద్రూపత్వమును సంతరించుకొని ప్రకాశించింది.

తత్త్వసాక్షాత్కారం - క్రమంగా ఉద్దాలకుడు సమాధిద్వారా తత్త్వసాక్షాత్కారం యొక్క ప్రబోధం పొందాడు.

శ్రీరాముడు : తత్త్వసాక్షాత్కారం అనగా?

శ్రీవసిష్ఠమహర్షి : "సర్వ ప్రపంచమునకు అధిష్ఠానం, ద్వైతరహితము, శుద్ధము, మహత్తరము అగు చిదాకాశమే నేను" అని ఎరుగుటయే – తత్వసాక్షాత్కారము యొక్క ప్రబోధమని అంటాం. "నీవుగా కనిపించేది నేనే" అనబడు స్వభావసిద్ధమైన, అకృత్రిమమైన ఎఱుక ఆస్వాదనయే తత్త్వ సాక్షాత్కార ప్రబోధం.

అట్టి స్థితిలో ఆతడు దృశ్య, దర్శన వర్జితుడైనాడు. ఏదైతే సర్వవిషయ లేశములకు ఆధార భూతమో, సముద్రతుల్యమో, బ్రహ్మాది మహాత్ములచే సర్వదా ఆస్వాదించబడుచున్నదో అట్టి ఆనందాన్ని పొందాడు. ఆనందసాగరం అన దగినట్టి పరమాత్మ యొక్క సత్తాసామాన్య రూపమును అవధరించాడు. ఉద్దాలకుని 'జీవచైతన్యము' అనే హంస ఆనందసరోవరంలో స్థితి కలిగి పూర్ణచంద్రుని వలె గాలి వీచని ప్రదేశంలో దీపంలాగా, గోడపై లిఖించబడిన కళాఖండంలాగా, తరంగాలే లేనట్టి సముద్రం లాగా, శరత్కాలంలోని మేఘములలాగా నిశ్చలత్వం పొందింది.

అట్టి మహాప్రకాశమునందు ఆతడు చిరకాలం ఉన్నాడు. అతడు ఆ స్థితిలో ఉంటూ ఉండగా మనోమార్గంలో అనేక మంది ఆకాశసంచారులను, సిద్ధులను, అనేక మంది దేవతలనూ చూచాడు. 'ఇంద్రుడు, సూర్యుడు' మొదలైన అనేక పదవులను ప్రసాదించగల విచిత్రమైన అనేక సిద్ధులు ఆతనిని సమీపించాయి. ఒక ఉదార చిత్తుడగు యువకుడు తనదారిన పోతూ పిల్లలు ఆడుకొనే ఆటలను పట్టించుకుంటాడా? అలాగే ఉద్దాలకుడు కూడా ఆతడు ఆ సిద్ధులను ఆదరించనేలేదు.

❖❖❖

9. పరమపదము

అట్లు సిద్ధులను నిరాకరించిన తరువాత ఆతడు 'సమాధి' అను ఆనందమందిరంలో ఆరు నెలల కాలం ఉన్నాడు. సిద్ధ, సాధ్య, బ్రహ్మాదులకు మాత్రమే సాధ్యం అగుచూ ఉండే సర్వోత్కృష్టమగు 'జీవన్ముక్తము' అను పదము నందు ప్రతిష్ఠితుడైనాడు. అక్కడ పూర్ణమగు ఆత్మానందమును పొందాడు.

ఆతని ఆత్మచైతన్యము క్షుద్రమైన విషయానందము గాని, విషయసుఖము గాని లేనిదై స్వప్రకాశమగు తన పూర్ణస్వరూపము నందే ఉండి శోభించింది.

ఎవ్వడైనా సరే, ఎవరైనా కొంత సమయం మనస్సుచే అట్టి సమాధియందు స్థిమితము పొందితే, ఇక ఆతని మనస్సు స్వర్గసుఖములు గానీ, విషయసుఖములు గానీ చూచి ప్రీతిని పొందే ప్రసక్తియే ఉండదు. అట్టి నిర్వికల్పసమాధిలో ఏర్పడే ఆనందమే బ్రహ్మానందమనీ, ఆత్మైక్యస్థితి అని చెప్పబడుతోంది. అచ్చట ఉండే స్థితియే శాంతి యొక్క ఆత్యంతికము, నిత్య శ్రేయము కూడా. అక్కడ విశ్రమించే వానిని ఇక ఎట్టి భ్రమ బాధించదు. అట్టి అఖండ అప్రమేయ దృష్టి కలవాడు ఇక 'దృశ్యదృష్టి' యందు ప్రవేశం చేయడు.

అనగా... శ్రవణ, మనన, సమాధుల సహాయంతో శుద్ధచిత్తమును పొందినవారు ఆ మహదానంద పదమును పొంది, ఇక ఆపై ఈ దృశ్యప్రపంచమును ఒక విషయంగానే చూడరు. చక్రవర్తి పదవి అధిష్ఠించినవాడు ఒక పెంకుటిల్లును చూచి "ఇట్టి ఇల్లు కలిగి ఉండటం ఎంతో సంతోషం కలుగజేస్తుంది కదా!" అని తలుస్తాడా? లేదు కదా!

శ్రీరాముడు : అట్టివాడు ఇక ఈ ప్రపంచమువైపు ఎప్పటికీ దృష్టి సారించడా?

శ్రీవసిష్ఠమహర్షి : అట్టి 'ఆత్మ పదము' నందు విశ్రాంతి పొందినవానిని 'ప్రబుద్ధచేతస్కుడు' – అని అంటారు. అట్టి స్థితిలో సమాధిని అవధరించినవాడు ఇతరులు ఎంతో ప్రయత్నిస్తే గానీ మరల 'వ్యుత్థానదశ'కు రాడు. ఆరవ భూమిక దశలో బాహ్యప్రయత్నం చేత వ్యుత్థానదశకు తిరిగిరావచ్చు. – ఇక ఏడవ భూమికలో ప్రవేశించినవాడు తనకు తానుగా వెనుకకు మరల వలసిందే.

❖

మహాత్ముడగు ఉద్దాలకుడు ఆ విధంగా ఆరునెలలు సమాధి స్థితియందుండి, మరల తనకు తానే ఉత్థానదిశగా ప్రబుద్ధుడైనాడు. మధ్యే మార్గంలో మహాతేజఃసంపన్నులను, చామరములను వీస్తూ సేవించే దేవతాస్త్రీలను, పతాకములు అమర్చబడిన దేవతా విమానములను, మునులను, విద్యాధరులను చూచాడు.

అక్కడి కొందరు దేవతలు ఆతనిని పలకరిస్తూ ఇట్లు సంబోధించారు. ఓ మహానుభావా! ఉద్దాలకా! మీకు ప్రణామం చేస్తున్న మమ్ములను అనుగ్రహిస్తూ, గమనించండి. ఈ విమానం ఎక్కి దేవలోకం రండి. ఈ మొత్తం ప్రపంచంలో ఉండే భోగములన్నిటి కన్నా కూడా స్వర్గలోకమే అధికమైనది కదా! మీరు ఏభోగములను కోరుకుంటే అవన్నీ కల్పాంతమువరకు అనుభవించవచ్చు.

ప్రపంచంలో తపస్సు, యజ్ఞము మొదలైన కార్యక్రమములన్నీ స్వర్గభోగములు అనుభవించటం కోసమే నిర్ణయించబడ్డాయి కదా! ఈ విద్యాధరుల వైపు చూస్తున్నారా! వీరంతా మిమ్ములను ఉపాసిస్తున్నారు. ధర్మ, అర్థ, కామములలో ముఖ్యఫలం కామమే కదా! అట్టి కామానందం ప్రసాదించ గల ఉత్తమ స్త్రీలు స్వర్గంలోనే ఉంటారు."

ఆ మాటలు విని, ఉద్దాలకుడు చిరునవ్వుతో వినమ్రంగా వారికి అతిథి సన్మానపూర్వకంగా నమస్కరించాడు. కానీ, భ్రమరహితుడై వారు చెప్పిన మాటలు పట్ల మౌనం వహించాడు. వారి పట్ల అభినందన గానీ, త్యాజ్యము గానీ ప్రకటించలేదు. "ఓ సిద్ధులారా! నా నమస్కారం స్వీకరించి సెలవు ఇప్పించండి" అని పలికి యథాతథంగా సమాధి వ్యాపారం కొనసాగించాడు. విషయభోగ విరక్తుడైన ఆ ఋషీశ్వరుని సేవిస్తూ సిద్ధులు కొద్దిరోజులువేచి ఉండి మరల ఎటో వెళ్ళిపోయారు.

❖

అది మొదలుకొని జీవన్ముక్తిని పొందిన ఉద్దాలకుడు తన ఇచ్ఛాపూర్వకంగా వనములందూ, ఆశ్రమములందూ సంచారం చేస్తూ ఉండేవాడు. మధ్య మధ్యలో ఒక చోట ఆసీనుడై ధ్యాననిష్ఠలో ప్రవేశిస్తూ ఉండేవాడు. ఒక్కొక్కసారి ఒక్క రోజు, కొన్నిరోజులు, సంవత్సరం, కొన్ని సంవత్సరములు సమాధియందు ఉంటూ, మరల మేల్కొంటూ ఉండేవాడు.

క్రమంగా పొందిన జ్ఞాన తేజస్సుచే ఆతడు ఒకవైపు చైతన్యముతో ఐక్యమై ఉంటూనే మరొకవైపు వ్యవహార తత్పరుడై ఉండేవాడు. ఉభయములోని ఏకత్వము పొందేవాడేగాని, అజ్ఞానివలె విక్షేపం పొందేవాడుకాదు. సర్వకాల సర్వావస్థలలోనూ సమాధియొక్క అభ్యాసం వదిలేవాడు కాదు.

శ్రీరాముడు : మహర్షీ! అంటే, ఉద్దాలకుడు ప్రపంచమును పొందుచున్నప్పుడు, ప్రపంచరహితుడు అగుచున్నప్పుడూ సమాధి యొక్క అభ్యాసం కొనసాగిస్తున్నాడని చెప్పుచున్నారు కదా! ఆతని ఇప్పటి సమాధి యొక్క అభ్యాసం నిర్వచించి చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : చెపుతాను విను – 1. అంతఃకరణము, 2. ఆ అంతఃకరణములో ఏర్పడే వృత్తులకు సాక్షియగు చైతన్యము – ఈ రెండిటినీ ఆతడు వేరు పరచి, పరిశీలించే వాడు. అదే ఆతని వర్తమానపు సమాధి యొక్క అభ్యాసము. అట్టి అభ్యాసముచే అపరిచ్ఛిన్నమగు చిద్భావమును పొందేవాడు.

ఇక ఆతని యందు రాగ ద్వేషాదులు లేవు. అహంకార, మమకారాలు; పరిచ్ఛిన్న, అపరిచ్ఛిన్నములు, ఉద్వేగ, ఉదాసీనములు లేవు. సూర్యకాంతి భూమిపై సమరూపమున వ్యాపించు చున్నట్లు ఆతడు సర్వభూతము లందూ సమరూపుడై వర్తిస్తూ ఉండేవాడు. అంతటా బ్రహ్మమునే గాంచుచూ ఉండేవాడు. ఎవరైనా సరే, 'సాక్షిచైతన్యము' అను సమాధి యందు భావన చేయటం చిరకాలం అభ్యసిస్తూ రాగా, అప్పుడు స్వప్రకాశమైనట్టి 'నిరతిశయానంద చిద్రూపము' తప్పక పొందుతారు. ఉద్దాలకుడు సంపాదించిన నిర్ద్వంద్వ, అద్వైత, అప్రమేయ సుస్థితిని అభ్యాసంచే ఎవరైనా తప్పక పొందవచ్చు.

ఒక కళాఖండంలో లిఖించబడిన సూర్యుడు ఉదయించడు అస్తమించడు కదా! ఆతడు ఈ దృశ్యవ్యవస్థలో ఉదయించటం లేదు... అస్తమించటం లేదు. సర్వత్రా శాంతిమయుడై ఉన్నాడు. ఆతని చిత్తము నిరతిశయానంద ప్రాప్తిచే ఉపశమించింది. కర్మ బీజములన్నీ క్షయించుటచే, ఆతనిపట్ల జననమరణ పాశములన్నీ విచ్ఛిత్తి పొందాయి.

"ఈ జన్మ – జరా – మరణాలు దేహపరిమితములే గాని, నన్ను స్పృశించేవి కావు" అనునది అతని వర్తమానానుభవం. ఆతడు అపరిచ్ఛిన్నమగు 'సత్తాస్ఫూర్తి' అనే ఉత్కర్ష (Sense)చే మహాభావయుతుడైనాడు.

ఇక ఆతని వర్తమాన నూతన దేహం ప్రత్యక్షరూపమై, నిర్మలమై, పూర్వదశా విస్మరణచే చిత్త రహితమై, బ్రహ్మస్వభావమై వెలుగొందింది. కనుక, ఇది ఆతని భావ, అనుభవముల దృష్ట్యా ఆతని పూర్వదేహము వంటిది కాదని గ్రహించు. ఆతని స్వభావము 'సత్తాసామాన్యము' ను సంతరించుకుని ఉన్నది.

❖❖❖

10. స్వస్వరూప చైతన్యముతో ఏకత్వం – ధారణ

శ్రీరాముడు : హే బ్రహ్మర్షీ! 'సత్తా సామాన్యము' అని అన్నారు కదా! అంటే ఏమిటి?

శ్రీవసిష్ఠమహర్షి : ఒకనిలో విషయ సంస్కారములన్నీ సంపూర్ణంగా రహితమైనాయనుకో ... అప్పుడు చిత్తము నశించినదే అవుతుంది. అప్పుడు శేషించే దానిని చిత్ సామాన్యస్వరూపము అంటారు.

ఎప్పుడైతే చిత్తు వృత్తిరహితమై ప్రతిబింబత్వము నుండి తన బింబరూపమగు చైతన్యమున లీనమౌతుందో – అప్పటి బింబము యొక్క ఆకాశసదృశమగు నిర్మల సత్తయే 'సత్తా సామాన్యము.'

శ్రీరాముడు : అది ఎట్లా, ఎప్పుడు సిద్ధిస్తుంది?

శ్రీవసిష్ఠమహర్షి : చిత్తవృత్తి యందు అభివ్యక్తమగుచున్న చైతన్యము ఈ బాహ్య – అభ్యంతర జగత్తు నంతా నిరాకరించి, కేవలం స్వస్వరూపమున ఎప్పుడు ఉంటుందో అప్పుడు సత్తా సామాన్యము సిద్ధించినట్లు. అట్టివాడు సర్వభూతములపట్ల పారమార్థికమైనట్టి 'స్వస్వరూప చిన్మాత్రానుభవం' కలిగి ఉంటాడు. ఒక దృష్టాంతం చెపుతాను. తాబేలు కొంచెం ప్రమాదం గమనించగానే తన అవయవాలను స్వయంగా, అసంకల్పితంగా తనలోకి లీనం చేసుకుంటుంది చూచావా! ఈ సామాన్య సత్త సంపాదించిన యోగి ఈ ఎదురుగా ఉండే సమస్తమును ప్రత్యేకమైన భావనాయత్నం లేకుండానే స్వభావ సిద్ధంగా ఆత్మ యందు లయం చేసుకుంటాడు. సమస్తమును తన ఆత్మగా దర్శిస్తాడు. అదియే సప్తమ భూమికకు సంబంధించిన ప్రరూఢ దృష్టి.

ఈ స్థితిలో 'సదేహముక్తి – విదేహముక్తి' అనే భేదం ఉండదు. ఈ విషయం ఒకటి రెండు సార్లు ముముక్షు వ్యవహారప్రకరణలో, ఆ తరువాత కూడా గుర్తు చేశాను.

అట్టి దృష్టి 4,5 భూమికలలో కూడా కలుగుతుంది. అయితే అది సప్తమభూమికలో రూఢి చెందుతుంది. అట్టివానికి వ్యుత్థాన దశయందు కూడా వెంటనంటే ఉంటుంది. బోధచే అట్టి దృష్టి జ్ఞానికి తప్పక కలుగుతుంది. అజ్ఞానికి ఎంత విన్నా కలుగదు.

జీవన్ముక్తులగు మహాత్ములంతా అట్టి దృష్టి యందే ఉండి, ఈ భూమిపై పాదరసంలాగా, ఆకాశంలో వాయువులాగా నిర్లిప్తంగా ఈ ప్రపంచంలో సంచరిస్తున్నారు. మేమంతా అట్టి దృష్టి అభ్యసిస్తూ ఈ భూతలంపై ఉంటున్నాం. ఆకాశంలో నారదుడు మొదలైనవారు, ఊర్ధ్వలోకాలలో బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు మొదలైనవారు అట్టి దృష్టినే కలిగి ఉంటున్నారు.

ఇక ఉద్దాలకుని విషయం కొనసాగిద్దాం. ఆతడు సర్వభయ వినాశకరమగు 'సత్తా సామాన్యము' లేక 'జీవన్ముక్తము' ను ఆశ్రయించి ప్రారబ్ధక్షయం అయ్యే వరకు ఈ 'జగత్' అను రూపం గల గృహంలో వసించాడు. కొంతకాలం జరిగిపోయింది. ఆ తరువాత ఆతడు 'నేనీ దేహమును త్యజించి విదేహముక్తుడను అగుదును గాక!' అనే దృఢబుద్ధిని పొందాడు. ఆశ్రమం నుండి బయలుదేరి ఒక పర్వతప్రాంతం చేరాడు. అక్కడ గల ఒక సెలయేటి ఒడ్డున పద్మాసనం అవధరించాడు. కళ్ళు సగం మూశాడు. కాలిమడమతో గుదమును నిరోధించి తొమ్మిది ఇంద్రియద్వారములను సంయమనం చేశాడు. చిత్తముచే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను ఏకం చేసి హృదయంలో చేర్చాడు.

హృదయగత వృత్తులను స్వస్వరూప చైతన్యములో ఏకం చేశాడు. క్రమంగా చిద్ఘనరూపుడైనాడు. సమముగా ఉన్న కంఠంతో శోభించాడు. నాలుకను కంఠము యొక్క ఊర్ధ్వ ప్రదేశంలో ప్రవేశపెట్టాడు. నెమ్మదిగా ప్రాణవాయువులను నిరోధించుచూ వచ్చాడు. ఆతడు ఇప్పుడు దంతములతో దంతములను స్పృశించటం లేదు. తన మనోదృష్టిని బాహ్య, అభ్యంతరములందు గానీ, ఊర్ధ్వ, అధోభాగములందు గానీ, రూపము మొదలైన విషయములందుగానీ, శూన్యము నందుగానీ ఉంచుటలేదు. కేవలం చిన్మాత్రము నందే స్థితుడై ఉన్నాడు.

❖❖❖

11. ప్రశమనం

ప్రాణప్రవాహ నిరోధం చేత ఆతని దేహము మనస్సు మొదలైనవి తమ చంచలత్వమును వదలిపెట్టాయి. ఇక ఆతడు సమరూపుడై, ప్రసన్నముఖుడై, చిద్రూపుడై బ్రహ్మానందానుభవం పొందాడు. ఆతని శరీరం గగుర్పొడిచింది. రోమములు నిక్కబొడుచుకున్నాయి. క్రమంగా "అంతఃకరణ వృత్తి విలయం" అను అభ్యాసంచేత చిత్ సామాన్యరూపమున ప్రవేశించాడు. ప్రతి బింబమును వదలి, బింబభూతమగు చిన్మాత్రమును అభ్యసించటం చేత హృదయము నందు బ్రహ్మానందమును అనుభవించాడు. అట్టి 'చిత్ సత్తే' ను అనుభవించటం చేత, కొంత సమయానికి తన యొక్క ఉద్దాలక రూపమును మరచి, క్రమంగా తన యొక్క స్వానుగతమైన నిత్య ప్రకాశరూపము లేక చిత్ సామాన్య రూపమును పొందాడు. అనగా, ఈ జగత్తు కంతటికీ ఆశ్రయభూతమై సర్వదా అపరిచ్ఛిన్న

మైనట్టి ఆత్మ సత్తాయే నేను. అను ఏకత్వానుభవం పొందాడు. విక్షేపమంతా సంపూర్ణంగా నశించగా, సమరూపుడై సర్వోత్తమానంద ప్రాప్తి పొందాడు. అతి సుందరమగు ముఖకాంతితో పరమ విశ్రాంతి పొందాడు. ప్రారబ్ధముల వినాశనముచే, జీవించి ఉండగానే సర్వోత్కృష్టమగు నిర్మల పదము అవధరించాడు. ఇక ఆతనియందు చిరకాలానుగతమైన సంసారభ్రమ మొదలంటా రహితమైనది.

చిత్రంలో లిఖించబడిన చిత్రంలాగా, పూర్ణచంద్రుని లాగా శోభించాడు. స్వనిర్మల పదమున ప్రశమనం పొందాడు. సర్వవికల్పరహితుడు, నిర్వికారుడు, అతిసౌందర్య స్వభావుడు అయ్యాడు. బ్రహ్మలోక పర్యంతము గల సర్వసుఖములను త్యజించివేసినవాడయ్యాడు. ఏ బాహ్యమైన ఐశ్వర్యమైనా సరే ఎక్కడ ఒక గడ్డిపరక వంటిదౌతుందో – అట్టి వాక్ అగోచరమగు పరమానందమును పొందాడు.

❖

ఆ ఆనందం ఎట్టిది? మనం మాటలలో ఏం చెప్పుకోగలం? ఆ ఉద్దాలకుడు ఇప్పుడు పొందిన బ్రహ్మానందము అవధులు లేనిదని చెప్పవచ్చు. ఓ రామా! సర్వజీవరాసుల యొక్క ఉత్తమోత్తమ లక్ష్యం అదే. ఈ అంతులేని బ్రహ్మాండములన్నీ దాని యందే ఉన్నాయి. అందుచేత అది అపరిమితము. అది ఈ అనంతాకాశమును కూడా తన పొట్టలో వ్యాప్తం చేసుకొని ఉంచుకొనగలదు. అదియే దిక్కులన్నీ ఎల్లప్పుడూ వ్యాపించి ఉన్నది. సర్వమునకు ఆధారభూతమూ, పరిపోషకమూ అదే! ఎంతో భాగ్యం చేత మాత్రమే ఉత్తమ జీవులచే అది సేవించబడుతోంది.

సర్వవాక్–ప్రవృత్తి–నివృత్తి–నిమిత్త–ఉపాదాన ధర్మములకు అది అతీతమైయున్నది. దానినే 'సత్యజ్ఞానానందము' అని వేదజ్ఞులు పిలుస్తున్నారు. ఎప్పుడైనా సరే, 'ఇది సుఖము' అనుటకు కారణము అదే.

ఉద్దాలకుడు అట్టి శుద్ధ బ్రహ్మము లేక బ్రహ్మానందరూపము పొందాడు. ఆతని జీవము ఆ రీతిగా విదేహత్వము నిర్మల, అనాది బ్రహ్మభావము పొంది అక్కడే ఆరు నెలల వరకు ఉన్నది. ఆ తరువాత ఆతనిచే పరిత్యజించబడిన భౌతికదేహము ఆ పర్వత ప్రదేశంలో నాడులు అనే తంతువులు కలిగి వీణవలె ఒప్పుచున్నది.

అనంతరం కొంతకాలానికి పర్వతకన్యలతో కూడిన బ్రాహ్మి మొదలైన మాతృగణం ఒకానొక భక్తుని కోర్కెలు తీర్చటానికి ఆకాశము నుండి ఆ ప్రదేశానికి వచ్చారు. ఆ మాతృగణంలో ఒకరైన ఖింఖిణీదేవి ఆ ఉద్దాలకునిచే పరిత్యజించబడిన భౌతిక దేహాన్ని తనకు కిరీట హారంగా చేసుకొన్నది. మహాభగవతియగు ఖింఖిణీదేవి శిరోమాల యందు ఆ ఉద్దాలకుని దేహం శయనించింది.

❖

ఓ రాఘవా! ఈ దృశ్యమంతటికీ సంబంధించిన వివేకము జనించగా స్ఫురించే ఆత్మానందమే ఇందలి సారం. ఆరంభం నుండి, ఉద్దాలకుని విదేహముక్తి వరకు గల కథనం విన్నావుకదా! ఎవని హృదయంలో అయితే ఇందలి కథనం ఉత్పన్నమై 'ఉత్తరోత్తర భూమికలను అవధరించుట' అను రూపమున విస్తరిస్తుందో – అట్టివాడు ధన్యుడు. అట్టివాడు త్రివిధ తాపములచే తపించడు.

అట్టివాడు ఈ ప్రాపంచిక విషయములందు సంచరిస్తే సంచరించుగాక! అయినప్పటికీ "సత్యము, శాంతము, సహజ సంతోషము" – అనే సుగంధములను వీడడు. సర్వోత్తమమగు మోక్ష ఫలమును తప్పక పొందుతాడు.

❖❖❖

12. ధ్యానము - విశ్లేషణ

శ్రీవసిష్ఠమహర్షి : ఓ రామా! మనం 'ఉద్దాలకుని విదేహముక్తి' ప్రసంగంలో చెప్పుకొన్న విధంగా నీవు వివేకము, వైరాగ్యము, సమాధుల అభ్యాసంతో కూడిన వాడవై ఎప్పటియట్లే విహరించు. ఆత్మతో ఆత్మ గురించి చక్కగా విచారణచేసి 'వ్యాపక పరబ్రహ్మము' నందు విశ్రాంతి పొందు. ఈ దృశ్యమంతా ఉపశమించబడి ఆత్మపదము యొక్క అనుభవం సుస్థిరపడే వరకు పదే పదే అనేక కోణముల నుండి విచారణ కొనసాగించాలి.

శ్రీరాముడు : మహాత్మా! 'విచారణ' అనగా మీ నిర్వచన మేమిటో సంక్షిప్తంగా చెప్పండి.

శ్రీవసిష్ఠమహర్షి : 'విచారణ' అంటే – శాస్త్రములను ఉత్తమ బుద్ధితో వినటం... చిత్త శోధనము, ఆత్మతత్త్వ పరిశీలన... గురువాక్యములందు విశ్వాసం... ఆత్మవస్తువుపై నమ్మకము, సదవగాహనను పెంపొందించుకోవటం... ఇంద్రియములను నిరోధించి ఆత్మానుభవంవైపు తరలించటం

ఎవ్వరికైనా సరే, "వైరాగ్యము, ఆత్మ చింతనాభ్యాసము, వేదాంత శాస్త్ర శ్రవణము, ఆత్మ పరీక్ష, గురువాక్య విశ్వాసము, ఇంద్రియ నిగ్రహము, ప్రజ్ఞ – అను క్రమముచే బ్రహ్మపదము తప్పక చేకూరగలదు.

ఒకడు సర్వమును త్యజించి కేవలం ప్రజ్ఞను మాత్రమే ఆశ్రయిస్తే, ఒక్క ప్రజ్ఞచే కూడా బ్రహ్మపదము లభిస్తుంది.

నీ బుద్ధి జ్ఞానయుక్తమై, అతి తీక్ష్ణమై అవిద్యాకళంకరహితమై ఉండటానికి సర్వవిధ ఉపాయాలు ఆశ్రయించు. ఒకవేళ 'వైరాగ్యము' మొదలైన సామాగ్రి లేకపోవచ్చు గాక – అయినా కూడా సుతీక్ష్ణమైన బుద్ధిని సంపాదిస్తే అందు నిత్యమగు బ్రహ్మము సుస్పష్టముగా ప్రకటన కాగలదు.

శ్రీరాముడు : హే మహర్షీ! మీరు భూత, భవిష్యత్, వర్తమానములకు ఈశ్వరుడై ఉన్నారు. మీకు నమస్కరిస్తూ రెండు ప్రశ్నలు అడుగుచున్నాను.

1. ఒక వైపు వ్యవహార తత్పరుడై ఉంటూనే, మరొకవైపు సమాధిస్థితుని వలె, విశ్రాంతి పొందుచున్నట్టి జ్ఞాని ఎవరైనా ఉన్నారా?

2. ఒకడు ఒక ఏకాంత స్థలంలో సమాధి నియమమును అనుష్ఠించుచున్నాడనుకోండి. మరొకడు సమాధినిష్ఠుడై కూడా, వ్యవహారతత్పరుడై ఈ జనావళి మధ్య సంచరిస్తున్నాడనుకోండి. ఈ ఇద్దరిలో శ్రేష్ఠుడెవడౌతాడు?

శ్రీవసిష్ఠమహర్షి : రామా! అసలు 'సమాధి' అంటే ఏమిటని నీవనుకుంటున్నావో చెప్పు.

శ్రీరాముడు : "గుణ సముదాయ రూపమైన ఈ దృశ్యప్రపంచమంతా అనాత్మయే" – అని గ్రహించటం. అట్లు పరికించుట చేత అంతఃకరణం శీతలత్వం పొందుతుంది. అట్టి స్థితియే 'సమాధి' అని చెప్ప బడుతోందని నా అభిప్రాయం.

శ్రీవసిష్ఠమహర్షి : ఈ దృశ్యముతో మనకు సంబంధం ఎందుకు ఏర్పడుతోంది? మనస్సు ఉండుట చేతనే కదా! "అట్టి మనోసంబంధమైన దేదీ ఆత్మయగు నాకు లేదు" – అని నిర్ణయించుకొన్న తరువాత, పూర్ణకాముడై కూడా ఒకడు వ్యవహారపరుడగుచున్నాడు. మరొకడు ఏకాంతము నందు సంస్థితుడగుచున్నాడు.

వారిద్దరూ అంతఃకరణంలో పూర్ణకాములే. కనుక ఇద్దరూ సుఖవంతులే! ఎందుకంటే, సర్వ తపోధ్యానాదుల అంతిమ ఫలితం ఏమిటి?... అంతఃకరణ శీతలత్వమే!

ఒకడు ఒక ఏకాంత ప్రదేశంలో సమాధిని ఆశ్రయించాడనుకుందాం!... కానీ ఆతని అంతః కరణం మాత్రం అనేక అంతఃకరణ వృత్తులచే చంచలమగుచున్నదనుకో ... ఆ సమాధి పిచ్చివాని గంతుల వంటిదే కదా! అట్లాకాకుండా మరొకడు అనేక విషయపరంపరల మధ్య తాండవనృత్యం చేస్తూ ఉండగా ఆతని చిత్తము మాత్రం వాసనారహితమై ఉంటూ ఉంటే – ఆతని మనఃస్థితి ఒక ప్రబుద్ధుని ఏకాంత సమాధిస్థితితో సమానమే అవుతుంది.

అందుచేత రామా! వ్యవహారతత్పరుడగు జ్ఞాని, అరణ్యంలో ఏకాంతాన్ని ఆశ్రయించిన జ్ఞాని – ఇద్దరూ ఒక్కటేనయ్యా! వారిరువురు సంశయరహితమగు బ్రహ్మమును పొందినవారే అగుచున్నారు.

❖

ఒకానొకడు ఒక కథ వింటున్నాడనుకో... కానీ, ఆతని అంతరంగ లక్ష్య – ఉద్దేశములకు సంబంధించిన ముఖ్యచిత్త విభాగం మరెక్కడో సంలగ్నమైయున్నదని అనుకుందాం... అప్పుడాతడు ఆ కథకు సంబంధించిన పాత్రల సుఖదుఃఖములను తాను పొందుతాడా? లేదు. అట్లాగే, వాసనలు నశించిన తరువాత ఈ చిత్తము క్రియలు నిర్వర్తిస్తూనే, 'నిర్వర్తించనిది'గా, అనగా, అకర్తగా ఉండిపోగలుగుతుంది.

ఇంకొక దృష్టాంతం విను. ఒకడు తన అంగములను కదల్చకుండా చేష్టారహితుడై శయ్యపై నిదురిస్తున్నాడనుకో... కానీ, అతని చిత్తము గోతిలో పడిపోతున్నట్లుగా కల కంటోందనుకుందాం ... అప్పుడాతని చిత్తము భయాందోళలనతో 'పడిపోవుట' అను కర్తృత్వము అనుభవిస్తూ ఉంటుంది... కాళ్ళూ చేతులు పదిలంగా శయ్యపై విశ్రమిస్తున్నప్పటికి కూడా... ఘన వాసనలతో కూడిన చిత్తము భావనలచే ఏర్పడిన సంసక్తతలకు కర్తయే అగుచున్నది.

చిత్తము యొక్క అకర్తృత్వమే చిత్తము యొక్క సమాధి. అదియే కేవలీభావముకూడా. అదియే పరమసుఖము. విశ్రాంతి.

అయినా ఒక ప్రశ్న. "ధ్యానము-అధ్యానము, సమాధి-అసమాధి" ...అను శబ్దములను దేనిని దృష్టిలో పెట్టుకుని చెప్పుచున్నారు? శరీరమును దృష్టిలో ఉంచుకొనా? కానే కాదు. శరీరము కదల వచ్చు, కదలక పోవచ్చు. చిత్తం యొక్క చంచలత్వ-అచంచలత్వములనే 'అసమాధి-సమాధి' అని పిలుస్తున్నారు. కాబట్టి రాఘవా! నీవు వాసనారాహిత్యముచే అట్టి చిత్తమును అంకురరహితం చేయాలి. వాసనారాహిత్యముతో కూడిన మనస్సునే స్థిరత్వము యొక్క అనుభవంగా గ్రహించు. అదియే ధ్యానము, కేవలీ భావము, సమాధి కూడా. వాసనారహితమగు మనస్సు అత్యున్నతమగు బ్రహ్మ పదమునకు దారి తీయగలదు. ఆ బ్రాహ్మీస్థితియే మోక్షం. ఘనవాసనలతో కూడిన చిత్తము రకరకాల కర్తృత్వములను కలిగియున్నదగుచున్నది. ఆ కర్తృత్వముల ద్వారా దుఃఖములన్నీ వచ్చి ముంగిట వాలుచున్నాయి. ఇది గ్రహించి నీవు వాసనలను సూక్ష్మతరము చేయి.

❖

'సమాధి' అను దానికి మరొక వైపు నుండి నిర్వచనం విను-

జగత్తు దేహము మొదలైనవాటితో సమావేశమైయున్న ఈ దృశ్యము నందు "ఇది నేను, ఇది నాది" అను రూపము గల అహంకార-మమకారములు ఏర్పడుచున్నాయి. వాటి నుండి ఇచ్ఛ, భయము, శోకము ఉత్పత్తి అవుచున్నాయి. "నాది" అనునది చిత్తము నుండి మొదలంట తొలగించ బడితే, అట్టివాని ఆత్మ ప్రశాంతపడుతుంది. అట్టి ప్రశాంతస్థితియే సమాధి.

కనుక రామా! అట్టి సమాధి యొక్క అనుభవము నందు, ఈ కర్మలు చేయటం, చేయకపోవటం ఒక ప్రత్యేకమైన విషయమే కాదని నీవు గ్రహించాలి. సమస్త పదార్థముల పట్ల 'అహమ్ - మమ' అను అభిమానములను త్యజించి, ఆ తరువాత ఇక నీ అభిమతానుసారం చరించు.

ఒక కొండపై ఏకాంతంగా ఉండు. లేదా... గృహస్థుడవై వ్యవహారములను నిర్వర్తించు. రెండూ నీకు ఒక్కటే అవుతాయి.

ఏ గృహస్థుడైతే అహంకారాది దోషములను నశింపజేసి సమాహిత చిత్తం సంపాదించు కుంటాడో - అట్టి గృహం ఆతనికి నిర్జనప్రదేశంలోని ఆశ్రమంతో సమానమే అవుతుంది. సమాహిత దృష్టి కలిగి, నిత్య - అపరోక్షస్థితి పొందినట్టి నీవంటి మహాత్ములకు గృహమూ ఒక్కటే, అరణ్యమూ ఒక్కటే. ఆకాశము మొదలైన పంచభూతముల దృష్ట్యా 'ఇది గృహము - ఇది అరణ్యము' అన్న తేడా ఎక్కడున్నది? 'చిత్తము' అనే మహాకాశంలో 'శాంతము' అను స్వస్థత సంపాదించుకొని ఉన్నవానికి జన సమూహముచే వ్యాప్తమైన నగరం కూడా నిర్జన వనమే. రాగాది వృత్తులచే విక్షేపము పొందుచున్న చిత్తము గల మూఢునకు నిర్జన వనం కూడా అనేక జన సమ్మర్థములు - సమాచారములతో నిండిన నగరమగుచున్నది.

❖❖❖

13. చిత్త విచికిత్స

ఈ సంసార జీవుని చిత్తము నిండా అనేక రాగ, ద్వేష, భయములతో కూడిన విషయపరంపరలు నిక్షిప్తమై ఉన్నాయి. విషయములన్నీ లయిస్తే, అప్పుడు వాసనాబీజము మాత్రమే మిగిలి, చిత్తము సుషుప్త దశను పొందుతుంది. ఇక వాసనా బీజం కూడా తొలగితే, ఆపై చిత్తము శాంతమయమై ఉంటుంది. ఆ శాంతమయచిత్తమే మోక్షం పొందుతుంది. అంతే గానీ, విషయ సహిత చిత్తము ఎట్లా పొందుతుంది?

ఇది గ్రహించి, రామా! ఆపై ఏది, ఎట్లు ఉచితమనుకుంటావో అట్లాగే ఆచరించు. సమాధి యందున్నట్టి ద్రష్ట ఆత్మను సర్వపదార్థములకు, విషయములకు, సంఘటనలకు అతీతమైనదిగా గాంచుచున్నాడు. తాను వ్యవహారమునందు ఉన్నప్పుడు ఆత్మయే సర్వ పదార్థముల రూపముగా ఉన్నట్లు గాంచుచున్నాడు. ఎవనిపట్ల రాగ – ద్వేషములు నశించిపోతాయో, ఎవనికి సమస్త పదార్థములు బ్రహ్మముగా, సమరూపముగా కనిపిస్తాయో – అట్టి విశాలాకారయుతుడే 'సమాధి స్థితుడు' అనబడతాడు.

వింటున్నావా రామా! మరల ఒకసారి ప్రకటిస్తున్నాను. సమాహిత చిత్తము జాగ్రత్తులోని – స్వప్నములోని ఆయా సమావేశములను, సర్వ దృశ్య వ్యవహారములను బ్రహ్మరూపము గానే వీక్షించుచున్నది. స్వప్న ద్రష్ట స్వప్నంలో చూచేవి స్వప్నద్రష్ట కంటే వేరైనది కానట్లే, జాగ్రత్ ద్రష్ట కూడా జాగ్రత్‌లో చూచేది ఆ జాగ్రత్ ద్రష్టకు వేరైనదేదీ కాదు. జ్ఞాని అంతర్ముఖమైన మనస్సు కలవాడై తాను నిద్రిస్తున్నప్పుడు, మేల్కొని ఉన్నప్పుడు, నడుచుచున్నప్పుడు, తెలిసిన తెలియని ప్రదేశాలలో ఉన్నప్పుడు "ఈ తటస్థ బడుచున్నదంతా ఆత్మస్వరూపుడనగు నా స్వరూపమే" – అని గ్రహించి ఉంటున్నాడు. ఎందుకంటావా? ప్రాణికోట్ల చేత, పృథివి మొదలైన పంచభూతముల చేత నింపబడి ఉన్న ఈ దృశ్యజగత్తు అంతర్ముఖదృష్టి గలవానికి విషయమే కాదు. ఇదంతా ఆతనికి ఎందుకూ ఉపకరించక, సదా శూన్యరూపమునే పొందుచున్నది.

❖

దృశ్యమునకు సంబంధించిన సర్వధ్యాసలు, (వాటికి సంబంధించిన కామ, క్రోధ, లోభములు) ఉపశమించినప్పుడు అంతఃకరణంలో శీతలత్వం (Calmness & Tranquility) చోటుచేసుకుంటుంది. అట్టివాడు సర్వేసర్వత్రా ప్రశాంతతను దర్శించగలడు.

అన్తస్తృష్ణోపతప్తానాం దావదాహమయం జగత్ ।
భవత్యఖిలజన్తూనాం యదన్తస్తద్బహిః స్థితమ్ ॥ (శ్లో 34, సర్గ 56)

ఇక తదితర సంసారజీవుల అంతరంగంలో 'తృష్ణ' అనే అగ్నిజ్వాల ఏర్పడి ఉండటం చేత వారికి ఈ జగత్తంతా దావాగ్నిచే నిండి ఉన్నట్లుగా మరియు, దాహమయమై ప్రాప్తిస్తోంది. అంతః కరణం ఏ విధంగా ఉంటే బాహ్యజగత్తు ఆ రీతిగానే అనుభవమౌతోంది.

చిత్తమే బాహ్యమున జగత్తుగా ప్రాప్తించుచున్నదని జ్ఞానులు ఎరిగియే ఉన్నారు. ఈ అంతరిక్షం, పృథివి, వాయువు, ఆకాశము, పర్వతము, నదులు, దిక్కులు – ఇవన్నీ అంతఃకరణము యొక్క వివిధ రకములైన స్పందన విభాగములే అయిఉండి, బాహ్యమున తోచుచున్నాయి. చిత్తము లేనిదే బాహ్యమే ఉండదు.

మట్టిచెట్టు నుండే మట్టి విత్తులు బయలుదేరుచున్నట్లు సత్స్వరూపమగు ఆత్మ యందు గల ఈ జగత్తు బాహ్యముగా గోచరిస్తోంది. యథార్థానికి ఏవీకూడా బాహ్యమున గాని, అంతరమున గానీ లేవు. అంతా పూర్వవాసనలను అనుసరించే జీవునకు అనుభవమవటం జరుగుతోంది. ఒక చిన్న డబ్బీలో ఉంచబడ్డ కస్తూరియొక్క సువాసన ఆ చుట్టుప్రక్కల వ్యాపించి ఉంటున్నట్లు, లోన గల ఆత్మ తత్త్వమే బాహ్యమున జగదాకారముగా భాసించుచున్నది. అనగా ఆత్మయే విశాలత్వముచే బాహ్యమున జగద్రూపముగానూ, అంతరమున అహంకారరూపముగానూ స్ఫురించుచున్నది.

అయితే, ఒక ముఖ్యవిషయం. బాహ్యమున ఈ జగత్తు గాని, అంతరమున అహంకారం గానీ, ఆత్మ కాదు. అది స్థూలమైన ఏ రూపమూ కాదు. ఆ రెండిటి యందూ అనుస్యూతమై ఉన్న విభు స్వరూపమగు సన్మాత్రమే అది. ఆత్మ తన యొక్క ఆంతరికమగు చిత్తము ఏ పూర్వవాసనలతో కలిగి ఉన్నదో – తదనుసారమే బహిర్ముఖంగా తదితర జగత్తును గాంచుచున్నది. ఈ జాగ్రత్ వాసనలచే హృదయంలో స్వప్నమనో రాజ్యములను కూడా గాంచుచున్నది. బాహ్యము నందూ, అంతరం నందు కూడా అనుస్యూతమై ఉన్న సద్రూపమగు ఆత్మ నుండి ఈ జగత్తు అనుదాన్ని మనం వేరు చేశామా, అప్పుడీ జగత్తు అనబడేది మృతప్రాయమే అవుతుంది. అట్లు వేరు చేయనంత కాలం ఈ బాహ్య, అభ్యంతరములు తొలగనే తొలగవు. అహంకార, మమకారముల 'అధ్యాస' చే పదార్థాల అల్ప, అధిక భేదము గురించిన భయము కలుగుతూనే ఉంటుంది. అందుచేత సర్వ భేదాలకు అతీత్వము అభ్యాసం చేస్తూ ఉండాలి.

మనోవ్యాధిచే నిహతుడగుచున్న జీవునకు ఈ ఆకాశం, భూమి, పర్వతము, నదులు, దిశలు …ఇవన్నీ ఆధిభౌతిక – ఆధిదైవిక – ఆధ్యాత్మిక తాపములను కలుగజేస్తూనే ఉంటున్నాయి. మనో వ్యాధి తొలగేది ఎట్లా?

యస్త్వాత్మరతిరేవాన్తః కుర్వన్కర్మేన్ద్రియైః క్రియాః ।
న వశో హర్షశోకాభ్యాం స సమాహిత ఉచ్యతే ॥ (శ్లో 43, సర్గ 56)

ఎవ్వడైతే అంతరమున ఆత్మయందు మాత్రమే ప్రీతి కలిగి ఉంటాడో, అంతటా సన్మాత్రమగు ఆత్మనే వీక్షిస్తూ ఉంటాడో – అట్టివాడు ఈ దృశ్యమునకు పట్టుబడడు. అట్టివాడు కర్మేంద్రియములచే క్రియలు ఒనర్చుచున్నప్పటికీ హర్ష – శోకములకు వశుడుకాడు. ఇక, అతడు 'సమాధిస్థితుడు' అని అనిపించుకుంటాడు. ప్రశాంతబుద్ధికలిగి, అంతటా ఆత్మను గాంచుచూ, ఇక ప్రాపంచిక పదార్థముల గురించి శోకించక, వాటిని తలచక ఉండేవాడు సమాధిపరుడు. అట్టి సుస్థితికి చేరినట్టి మహనీయుడు ఉత్పత్తి – వినాశనయుక్తమగు ఈ జగత్తుయొక్క గతిని వీక్షిస్తూ, అజ్ఞులందు ప్రసిద్ధమై ఉంటున్న ఈ అహంమమత్వాది దృష్టులను చూచి నవ్వుకుంటూ ఉంటాడు.

సమాధి బుద్ధి - "సూర్యకిరణములు కెరటములలో ప్రతిబింబించటం జరుగుచున్నప్పుడు అక్కడ వెండితీగలు ఉన్నట్లు భ్రమ కలుగవచ్చు గాక! అవి మెఱుపులే గానీ వెండితీగలు ఎలా అవుతాయి? ప్రత్యగాత్మయే వాస్తవ స్వరూపముగా గల నా యందు ఈ అహంకార, మమకారములు గానీ, తదితర జనన మరణాది వికారములు గానీ ఉండజాలవు. నేను సర్వదా అసంగుడను. అద్వైత స్వరూపుడను. కూటస్థుడను. సమరూపమగు బ్రహ్మమునే నేను." అనునదే సమాధి బుద్ధి. కాబట్టి ఆతని పట్ల జీవస్థితి, అహంకారము, దృశ్యము, జగత్తు మొదలైన విభాగములు ఉండవు. మనస్సు ఉండదు. ఆ మనస్సు చేసే కల్పనలూ ఉండవు. సర్వాత్మ స్వరూపుడగు అట్టి జ్ఞాని మాత్రమే ఉనికి కలిగినవాడు అగుచున్నాడు. ఇక తక్కినవారు లేనివారే అవుతారు. అట్టి సమదర్శి ఆకాశము వలె స్వచ్ఛుడై ఉంటాడు.

శ్రీరాముడు : మహర్షీ! సమదర్శియొక్క శాస్త్రవిహిత విశేషాలు ఎట్లా ఉంటాయి?

శ్రీవసిష్ఠమహర్షి : అట్టి సమదర్శి ఆకాశము వలె స్వచ్ఛుడై ఉంటాడు. సహజం గాను, స్వభావసిద్ధం గాను లోకానుకూలము కొరకై శాస్త్ర, శిష్టాచారములకు అవిరుద్ధమైన బాహ్యక్రియలు ఒనర్చుచూ ఉంటాడు. హర్ష, క్రోధ – వికారములు ఎదురు పడినప్పుడు శిల, కొయ్యల వలె చలించక శాంత స్వభావుడై ఉంటాడు. సర్వజీవులనూ తనవలె చూస్తూ ఉంటాడు. స్వభావంగానే పరుల ద్రవ్యములను మట్టిగడ్డల వలె చూస్తాడు. అట్టివాని దృష్టే సరి అయిన దృష్టి.

అజ్ఞాని - అజ్ఞాని దృష్టి ఎలా ఉంటుందో కూడా చెపుతాను. ఇక్కడి సువర్ణము, ఐశ్వర్యము మొదలైన వాటిని ఆతడు మిథ్యారూపములుగా గాంచడు. పోనీ, సద్రూపములుగా గాంచుతాడా... అదీ లేదు. ఆతనికి సద్రూపానుభవమే లేనప్పుడు సద్రూపముగా ఎట్లా గాంచుతాడు? జ్ఞాని మాత్రమే ఈ పదార్థ జాలమును మిథ్యారూపముగానూ, సద్రూపముగానూ కూడా గాంచగలడు.

❖

ఉత్తమాశయము కలిగి, బ్రహ్మపదమును పొందినవాడు ధనహీనుడు కావచ్చు. లేక ఐశ్వర్య వంతుడు కావచ్చు. ఆతనికి పుత్రులు, బంధువులు ఉండవచ్చు ... ఉండకపోవచ్చు. ప్రాపంచికమైన అభ్యుదయ స్థితి పొందవచ్చు ... పొందకపోవచ్చు. ఏది ఏమైనప్పటికీ ఆతడు మాత్రం సమరూపుడై, హర్షశోకములచే, ప్రాప్తాప్రాప్తములచే ఆటంకపరచబడజాలక యథాతథంగా ఏర్పడి ఉంటూ ఉంటాడు. అట్టివాడు అనేక భోగములతో స్వజనులతో నిండి ఉన్న గృహము నందు ఉన్నా... లేక సర్వ భోగవిరతుడై జనరహితమైన కీకారణ్యంలో ఏకాంతంగా ఉన్నా... కాక, మన్మథుని తీవ్రవేగమును పొందుతూ మద్యపానరతుడై ఉన్నా... బహిరంగ ప్రదేశంలో నృత్యం చేస్తూ ఉన్నా... లేదా, సర్వమును పరిత్యజించి జటాధారి అయి పర్వతగుహలో తపస్సు చేస్తూ మౌనవ్రతుడై ఉన్నా... సదా, చందనము మొదలైన సుగంధ ద్రవ్యములు ఒంటికి అలదుకొని స్త్రీలను లాలిస్తూ ఉన్నా... ఆయా లౌకిక కార్యములందు నిమగ్నమై ఉన్నా... తన జ్ఞానము యొక్క బలిమిచే దేని చేతా తాకబడకుండా ఉంటాడు. ఎందుకంటే, ఆతడు మనస్సును వికార రహితంగా ఉంచుకుంటాడు.

మనో–దేహము లందు ఆతడు అహంకారమును ఆశ్రయించకపోవటం చేత, ఆతడు ఏది ఒనర్చు చున్నప్పటికీ ఒనర్చనివాడు అయి ఉంటున్నాడు. బంగారము బురదలో పడినంత మాత్రం చేత అది తన సహజసిద్ధమగు స్వప్రకాశమును వదులుకుంటుందా? లేదేఁ!

ఇక అజ్ఞానులంటావా? వాళ్ళు విషయములు సేవిస్తున్నప్పుడల్లా వాసనలు పెంపొందించు కుంటున్నారు. అజ్ఞాన వాసనలతో ఇంద్రియములను అజ్ఞాన మార్గంలో ఉపయోగిస్తూ ... ఇంకా ఇంకా సాంసారిక దృష్టులను, సంస్కారాలను అధికం చేసుకుంటున్నారు. భోగ్యములైనట్టి శబ, స్పర్శ, రూప, రస, గంధములు వారి మనస్తత్వములపై పెత్తనం చెలాయిస్తున్నాయి.

కాబట్టి, విజ్ఞుడైనవాడు ఈ కనబడే వస్తువుల గురించి సరి అయిన అవగాహన కలిగి ఉండాలి. అప్పుడు ఆతని పట్ల సర్వవస్తువులు తమంతట తామే కాలక్రమంగా శమిస్తాయి. "అనేక వస్తువుల సత్త" – యొక్క అభావముచే చిత్తము నందలి కళంకములన్నీ స్వయంగా నశిస్తాయి.

శ్రీరాముడు : స్వామీ! అసలు వాసనలు ఎలా ఏర్పడుచున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : అహంకార, మమకారముల అధ్యాస చేతనే 'వాసన' అనబడే అనర్థం ఏర్పడుతోంది. ఫలితమేమిటి? ఆనందమే స్వస్వరూపముగా గల ఈ జీవుని జీవితమంతా అనేక రీతులైన దుః ఖములకు ఆలవాలమైపోతోందే! అహంకారం నశించిందా... జ్ఞానం తనంతటతానే స్వయంగా వికసిస్తుంది. అట్టి జ్ఞాన ప్రభావంచేత అంతఃకరణంలో సమత్వం ఉదయిస్తోంది. ఒకడు చీకట్లో మెత్తటి త్రాడును తాకి 'అమ్మబాబోయ్' అని అరచి, గడగడ వణుకుచున్నాడనుకో.... "అది పాము కాదు, త్రాడే" అని తెలిసిపోతే వికారాలన్నీ మటుమాయమౌతాయికదా!

కాబట్టి రామా! జ్ఞానము సంపాదించి, తద్ద్వారా దేనితోనూ సంబంధము లేనివాడవై ఉండు.

యత్కరోతి యదశ్నాతి యద్దదాతి జుహోతివా ।
నతజ్ఞస్య నతత్రజ్ఞో మాఽకరోతు కరోతువా ॥

ఏది చేస్తున్నా, భుజిస్తున్నా, ఇస్తున్నా, హోమం చేస్తున్నా, జ్ఞానికి వాటితో గాని, వాటికి జ్ఞానితో గాని సంబంధమే ఉండదు. అదీ చమత్కారం! ఆతనికి ఆ కర్మలు చేయటం, చేయక పోవటం ఒక్కటే. పూర్ణజ్ఞానికి కర్మలచే గానీ, కర్మల యొక్క అభావంచే గానీ, ప్రయోజనమేముంటుంది చెప్పు? ఆతడు అన్ని స్థితులందూ ఆత్మ జ్ఞానముచే ఆత్మ యందే సంస్థితుడై ఉంటాడు. గండశిలపై పడిన విత్తు మొలుస్తుందా? జ్ఞాని యొక్క అంతఃకరణము నందు కోర్కెలు జనించవు. ఆతని యందు ఏదేది జనిస్తుందో అదంతా జలమందలి తరంగముల వలె ఆతని రూపమే (ఆత్మ రూపమే) అయి ఉంటుంది? ఇంక స్పర్ధకు చోటెక్కడ? ఓ రాఘవా! ఈ బ్రహ్మాండమంతా జ్ఞాని యొక్క స్వరూపమే. ఆతడూ బ్రహ్మాండస్వరూపమే అవుతాడు. ఎందుకంటే ... యథార్థానికి ఈ జగత్తులో దేశ, కాల, వస్తు కృతమగు విభాగమంటూ ఏదీ లేదు. ఇక్కడ అనుభవము మాటేమిటంటావా? స్వకీయమగు కల్పనయే ఇట్లు ఈ రీతిగా ప్రవర్తిస్తున్నదని గ్రహించు. జ్ఞానియగు ఉత్తమ పురుషుడు అతిపావనము, ఏకరూపము, సర్వాద్వైత బంధరహితము అగు సన్మాత్రరూపుడై ఉంటాడు.

జ్ఞానికి, పరమాత్మకు భేదమేమీ లేదు. అజ్ఞానము అనబడేది భ్రమ మాత్రమే. కనుక అజ్ఞాని "ఎఱుకను ఏమరచిన పరమాత్మ" కాక మరింకేమీ కాదు.

❖❖❖

14. అభేద నిర్ణయం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రఘురామా! ఆత్మ స్వప్రకాశయుక్తమై అంతటా వెలయుచున్నది. అదియే అజ్ఞాన కారణం చేత "అహంకారము – వస్తుజాలము – దేశకాలములు".. మొదలైన విశేషములతో కూడిన జగత్తుగా విస్తారత సంతరించుకుంటోంది.

'అనుభవం' – అనునది ఆత్మయొక్క విన్యాసమే. లవణము యొక్క లవణత్వానుభవం ... చెఱుకు యొక్క మాధుర్యానుభవం... శిల యొక్క కాఠిన్యానుభవం.... పర్వతము యొక్క గురుత్వానుభవం... జిహ్వము యొక్క రుచిత్వానుభవం... వృక్షము యొక్క శాఖత్వానుభవం... ఆకాశము యొక్క శూన్యత్వానుభవం... అహంకారం, కుండ, గోడ, శరీరము, ఆవర్తము ... మొదలైన రూపత్వానుభవం... అంతా కూడా ఆత్మ యొక్క 'అనుభవము' అనబడు స్వవిస్తారమే సుమా!

జ్ఞాన దృష్టిచే చిద్బ్రహ్మము తోటి సర్వపదార్థముల అభేదమే సిద్ధిస్తోంది. ఆత్మ యొక్క ఘనత్వానుభవం అహంకారం గానూ, ఆ అహంకారముచే సిద్ధిస్తున్న పదార్థజాలం గాను ప్రకటిత మౌతోంది. అజ్ఞాన దృష్టికి మాత్రమే చిత్తము చిత్తు కంటే వేరైన దాని వలె దృశ్యమానమౌతోంది. ఆత్మ యొక్క చైతన్యము ద్వారా కలిగే సత్తా రూపానుభవమే స్వయముగా అహంకారరూపంగా ఏర్పడుతోంది. ఆ కనబడేదానిని మనం 'చిదాభాసుడు' అని అంటున్నాం.

చూచావా! అంతరాత్మ తన స్వప్రకాశము యొక్క అనుభవముచే వృత్తిభేదం చేత భిన్న వస్తు జాలములుగా చిదాభాసము లందు అనుగతమై ఉంటోంది. స్వయముగా తాను విస్తరించి, తనచే ఏర్పడి ఉన్న చోటును తనకు అన్యమైనదాని వలె గాంచుచున్నది. అహంకారముగా ఆవిర్భవిస్తున్నది. అది ఆత్మ యందు ఆత్మ యొక్క చిత్ (Awareness) రూపమే! అదియే 'అంతఃకరణము' అను మరొకటిగా కవులు వర్ణిస్తున్నారు. అంతఃకరణమంతా ఆత్మయే.

❖

యథార్థానికి ఆత్మ పదార్థరూపంగా ఏదీ అగుటలేదు. నీరు తరంగంగానూ, ఆవర్తంగానూ, బుద్బుదం గానూ, ఏమైనా మారిపోతోందా! నీరు సర్వదా నీరుగానే ఉంటోంది కదా! ...అట్లాగే, ఆత్మ కన్నా భిన్నంగా మరొక పదార్థమేదీ సంభవించదు.

ఆత్మ ఆస్వాదించ తగినట్టి మరొక్కటేదీ ఎక్కడా ఏర్పడజాలదు. వికారము పొందటానికై ఆత్మకు భిన్నమై వేరొక్కటేదీ ఎక్కడా లేదు. "ఆత్మచే పొందబడుచున్నది" అనునదంతా గొడ్రాలి రెండవ కుమారుని వలె పొంతనకు దొరకని వాక్యం.

ఆత్మ జన్మించదు. మరణించదు. అది శరీరాంతర్గతమై, శరీరములకు ముందు వెనుక, శరీరసమయంలోను - బయట - లోపలా అంతటా ఒకే తీరుగా సర్వదా వెలయుచున్నది. అసత్తు అగు ఈ జగత్తంతా ఆత్మయందే భాసించుచున్నది. అనంతపరిపూర్ణజ్ఞాన స్వరూపమగు పరమాత్మ ఏకరూపముననే ఉన్నాడు. తనయందు తానే జగత్‌రూపంగాను, తదితర సర్వరూప-నామ-తత్వములుగాను స్థితి కలిగియున్నాడు.

❖

ఓ రాఘవా! ఇప్పటివరకూ నేను చెప్పుచున్న దానిని అనుసరించి "అహంకారమునకు, జగత్తునకూ భేదమేమీ లేదు" - అని నిరూపించబడుతోంది కదా!

ఒక అత్యుత్తమ సత్యం ప్రకటిస్తున్నాను. విను. వాస్తవానికి చిత్తముగానీ, చిత్తము కలవాడుగానీ, జగత్తు అనబడు విభ్రమముగాని లేవు. వస్తూ ఉన్న వర్షం ఒక్కసారి ఆగిపోవునట్లు, శుద్ధ సన్మాత్ర జ్ఞానము చే ఈ జగత్తు ప్రశమనము పొందగలదు. అనగా నీవు జ్ఞానివైనావా.... నీ దృష్టిలో ఈ జగత్తు ఒక్కక్షణంలో లేకుండా పోగలదు. జలంలో తరంగాలు ఎందుకుంటున్నాయి? జలమే తరంగాలుగా అగుపించటం జరుగుతోంది కదా!

ఆ జలము యొక్క ద్రవత్వస్వభావంచేతనే కదా! మాయావియగు ఈశ్వరుడు స్వమాయచే ఆవృతమైన "జ్ఞప్తిరూపనిజాత్మ" యందు ఈ జీవదశలను పొందుచున్నాడు. అనగా ఏమిటి? "నేను జీవుడను ... ఇది జగత్తు" అను రూపముగల భావము ఆ ఈశ్వరుడే తనకుతాను తనయందు కల్పించుకొనిన మాయచే గాంచి, అనుభవించుచున్నాడు. అట్టి అనుభవమును గాంచుచున్నట్టి సమయంలో "నేను ఈ దృశ్యవ్యవహారమునకు స్వయముగా రచయితనైయున్నాను. కనుక ఈ కనబడే సర్వమునకు నేనే ఈశ్వరుడను. సర్వదా పూర్ణుడను" అనే విషయం పూర్తిగా ఏమరుచుచున్నాడు.

ఎంతటి చమత్కారం! ఏ విధంగా అయితే జలమునందు ద్రవత్వమూ, వాయువునందు చంచలత్వమూ ఉన్నాయో, అదేవిధంగా జ్ఞప్తిమాత్రుడగు ఈశ్వరునియందు అహంకారము - దేశము - కాలము మొదలైనవన్నీ ఉన్నాయి. ఈశ్వరస్వరూపుడు అగు ఈ జీవుడు ఒక వైపునుండి 'నేను ఈశ్వరుడను' అను భావముచే ఆవరణము (Limitation)గానీ, పరిచ్ఛేదము (Partition)గానీ లేనట్టి తన నిరతిశయానంద జ్ఞానమును ఎరుగుచునే ఉన్నాడు. అయితే, మరొకచోట మరొకవైపున, అహంకారవశంచేత 'నేను జీవుడను' అను రూపముగల జీవభావము పొందుచున్నాడు. అట్టి జీవభావముచే ఈ పంచభూత, ప్రాణ, ఇంద్రియాదులందు విషయసంబంధమగు 'అధ్యాస' కలిగి ఉంటున్నాడు. అట్టి సమయంలో "ఈ దేహమే నేను. ఈ దేహమునకు అనుభవమగుచున్నవే నా పరిధి"... అని భావించుచున్నాడు. అయితే, ఈ స్వయంకల్పిత పరిమితులు యథార్థమా? కానేకాదు. అగుటకు వీలు లేదు కూడా.

అజ్ఞాని ఆయా కర్మవాసనల చేతనూ, దర్శన, లాభాది భోగ వైచిత్ర్యములచేతనూ ప్రియ - మోద - ప్రమోద వ్యవహారముల చేతనూ అనేక దృష్టిపరంపరలను తనయందు కలిగి ఉంటున్నాడు.

తృప్తి పొందాలని తపిస్తూ ఎచ్చటెచ్చటికో వెళ్ళి వెతుకుచున్నాడు. అయితే ఒకడు జ్ఞాని కావచ్చు... అజ్ఞాని కావచ్చు. ఎరుగబడుచున్న వైచిత్ర్యమంతా అభిన్నమగు ఆత్మచేతనే నిర్వర్తించబడుచున్నదని గ్రహించు. ఈశ్వరుడే ఇచ్ఛాకామములకు అనుగుణంగా తన అంగములను ఆయారూపములుగా పరిణమింపజేస్తున్నాడని గమనించు.

పరమార్థస్థితి - ఓ రామచంద్రా! ఈ జగత్తంతటికీ అధిష్ఠానమైయున్న పరమాత్మ యొక్క జ్ఞానమే పరమార్థ స్థితి. సర్వజీవుల జీవనము దేనియొక్క అధీనమైయున్నదో.... అట్టి పరమానంద రూపమే ఈ జీవుని స్వరూపం. సచ్ఛాస్త్రములు, గురూపదేశములు సహకరించుచుండగా ఎప్పుడైతే జీవుడు ఈ సత్యం గ్రహిస్తాడో అప్పుడిక "ఈ భోక్త – భోగ్యముల రెండిటి యొక్క అధిష్ఠానం చిద్రూపమగు ఆత్మయే" ... అని తప్పక గ్రహిస్తున్నాడు. ఇకప్పుడు జీవ, ఈశ్వరులకు భేదమేమున్నది? ఎక్కడున్నది?

"ఈశ్వరుడే సంకల్పముల ఆధిక్యత చేత జీవుడగుచున్నాడు. జీవుడే సంకల్ప, ఆసక్తి క్షయం చేత ఈశ్వరుడగుచున్నాడు. జీవ, ఈశ్వరుల భేదం లేనట్లే, ఈశ్వరుడు, బ్రహ్మమునకు భేదం లేదు. అనగా, శాంతమై... అఖండమై, పరిపూర్ణమై బ్రహ్మము మాత్రమే శేషించుచు.... అది సర్వుల వాస్తవరూపమై ప్రకాశించుచున్నది.

బోధప్రయోజనం... సాక్షాత్ ప్రయోజనం - కాబట్టి రామా! ఈ జగత్తంతా బ్రహ్మమే. "అట్టి బ్రహ్మము ప్రశాంతము ... జననరహితము... ఏకము ... అనాది... పూర్ణప్రకాశస్వరూపము ... ఆనందైకరసము... విషయచిహ్నరహితము" అనునది మన ఇప్పటి వరకు జరిగిన చర్చ యొక్క సారాంశము. ఈ జగత్తు యొక్క ప్రశాంతరూపమును బోధించుట కొరకు బోధించువారమగు మేము కొన్ని భేదరూపములగు శబ్దజాలమును ఆశ్రయించటం తప్పటం లేదు.

శాస్త్రకారులచే బోధ యొక్క ప్రయోజనము కొరకు "మనస్సు, బుది, అహంకారము, చిత్తము, జీవుడు, ఈశ్వరుడు"... మొదలైన శబ్దజాలం కల్పించబడుతోందికదా! ఈ శబ్దజాలమంతా బోధ ప్రయోజనము కొరకే గాని, సాక్షాత్ ప్రయోజనముకొరకు కాదని నీవు గ్రహించు. నీవు ఇవన్నీ వింటూనే, భోగత్యాగలక్షణం ద్వారా అఖండార్ధరూపమైనట్టి 'ఓం' కారము యొక్క లక్ష్యార్థమును గ్రహించు.

ఆ లక్ష్యార్థం నిత్య, అపరోక్ష చిన్మాత్రమే అయి ఉన్నది. అదియే మనందరి వాస్తవ రూపమని చేతులెత్తి ప్రకటిస్తున్నాను. అదే సమస్తం అయి, ముందు, వెనుక, మధ్యల యందు ఆక్రమించియున్నది.

❖❖❖

VIII.సురఘు-మాండవ్య-పర్ణాదుల సంవాదం

1. సురఘు అంతర్మథనం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! శాస్త్రములచే, గురువులచే ఉపయోగించబడుచున్న "జీవుడు – ఈశ్వరుడు – మనస్సు – బుద్ధి – అహంకారము" – మొదలైన శబ్దమయ దృష్టి అంతా శిష్యులకు అద్వితీయము – ఏకము – అఖండము అగు ఆత్మ విషయం బోధించటానికై కల్పించబడుచున్నది. ఈ విషయం విశదీకరించ గల "సురఘురాజు, మాండవ్య మహర్షి, పర్ణాదుడు" – అను ముగ్గురి మధ్య జరిగిన ఒక పురాతనమైన సంవాదము చెపుతాను .....విను.

❖

'కైలాసము' అను ప్రసిద్ధ హిమాలయ శిఖరం శంకరభగవానుని నివాసమై ఒప్పుచున్నది. ఆ పర్వత ప్రాంతంలో ఒక చోట ఒక కిరాత రాజ్యం ఉన్నది. అక్కడి ఆటవికులు అడవులలో సంచరిస్తూ రుద్రాక్షమాలలు, ఇంధనము (కట్టెలు), ఫలములు సంపాదించి, తదితర ప్రదేశములలో విక్రయిస్తూ జీవితాలు గడుపుతూ ఉంటారు. ఆ రాజ్యమును ఒకప్పుడు 'సురఘుడు' అనేవాడు పాలిస్తూ ఉండే వాడు. 'హేమజట' అనునది ఆతని మరొక పేరు. సురఘుడు విభవాలలో కుబేరునితోనూ, జ్ఞానములో బృహస్పతితోనూ, కావ్య సాహిత్యాదులలో శుక్రాచార్యునితోనూ సమానుడని జనులు అనుకుంటూ ఉండేవారు. ఆతడు ప్రజలను కన్నబిడ్డలవలే పాలిస్తూ ఉండేవాడు. దుష్టజనుల విషయంలో మాత్రం కాలయముని వలె సింహస్వప్నంగా ఉండేవాడు. అక్కడి రాజ్యాంగాన్ని అనుసరించి దొంగల విషయంలో, తదితర సంఘవిద్రోహుల విషయంలో అతిక్రూరంగా శిక్షలు అమలు పరుస్తూ ఉండే వాడు. "నిగ్రహ – అనుగ్రహాలకు ఆతనికి అతడే సాటి" అని అందరూ అనుకుంటూ ఉండేవారు.

ఆ సురఘు చాలాకాలం ఆ కిరాతరాజ్యం ఏలాడు. కొంతకాలానికి జ్ఞానసంపన్నుడగు ఆతని హృదయంలో ఒక నూతన వేదన ప్రారంభమైనది. "అయ్యో! నేను నిర్దయగా శిక్షలు అమలుపరుస్తున్నానే! ఇది హింసయే అవుతుంది కదా! శిక్షలు అమలుపరచేటప్పుడు వారి రోదనం కర్ణకఠోరంగా ఉంటున్నదే! సర్వజీవరాశులు ఆ భగవంతుని స్వరూపులే కదా! ఈ బాధించటం ఎంత వరకూ ఉచితం?" అని తనలో తాను మథనపడుతూ ఉండేవాడు. కొన్ని రోజులు అట్లా గడిచాయి. ఒకరోజు రాత్రి విశ్రాంతి గృహంలో పవళించి ఉండగా ఆతని అంతర్ మథనం ఇంకా అధికమైనది.

సురఘు (తనలో) : అయ్యో! నేను అధికారం ఉన్నది కదా అని, అనేక మందిని దుఃఖితులనుగా చేస్తున్నానా? సర్వప్రాణుల దుఃఖమూ నావంటిదే కదా! అందుచేత నా దగ్గర ఉన్న ధనమంతా అందరికి పంచివేస్తే – అప్పుడు పేదరికం ఉండదు. అప్పుడు సంఘవిద్రోహులే ఉండక పోవచ్చుకదా! ఉట్టి దండనతో ఏం ప్రయోజనం?

అయ్యో! నిర్దయగా శిక్షలు అమలు పరచకపోతే జనులలో అధర్మప్రవృత్తి నశించదు. అమలు పరిచితే జీవులను హింసించటమే అవుతుంది. ఏం చేయాలి? ఈ రాజ్యం ఏలే పని ఎంత నీచమైనది? రాజుగా ఉన్నంత కాలం వధ – బంధనాది వ్యవహారం తప్పేటట్లులేదు. పోనీ రాజ్యం వదిలేద్దామా! రాజ్యం అరాచకమౌతుందను కారణంగా ఈ మంత్రులు, నా జాతి ఆటవిక ప్రజలు నన్ను వదిలేటట్లు లేరు? వీళ్ళందరినీ తప్పించుకొని నేనెక్కడికి వెళ్ళగలను? నా కుమారులు ఎదిగేవరకు రాజవంశంలో పుట్టటం చేత ఈ ధర్మం అనివార్యం. ధనం పంచటానికి మంత్రులు ఒప్పుకోరు. నా ఆలోచన విని వాళ్ళు పకాలున నవ్వుచున్నారు. ఇప్పుడు నాకు త్రోవ ఏమిటి?... ఇట్లా ఆలోచిస్తూ ఆ రాత్రంతా కునుకు లేకుండా గడిపాడు.

అతని పూర్వజన్మ పుణ్యవశం చేత కాబోలు, ఆ మర్నాడు ఉదయం మాండవ్య మహర్షి ఆ త్రోవలో పయనిస్తూ శిష్యులతోసహా ఆ ప్రాంతానికి రావటం జరిగింది. మహాజ్ఞాని, శాస్త్రకోవిదుడు అగు ఆ మహర్షి గురించి వినటం చేత సురఘురాజు వాళ్ళని ఆహ్వానించి ఆతిథ్యం ఇచ్చాడు. ఆ మహర్షిని, వారి శిష్యులను తన సేవలతో సంతోషపెట్టాడు. మహర్షిని తన మందిరానికి ఆహ్వానించి ఏకాంతంగా ఆయనతో సంభాషించసాగాడు.

సురఘు రాజు : హే మహర్షీ! మాండవ్యా! తమ రాకచే నేను అనిర్వచనీయమైన పరమశాంతిని పొందుచున్నాను. పేదవానికి రాజు కనికరంలాగా మీ సాన్నిధ్యం నాకు లభించింది. మీలాంటి మహనీయుల కృపారసవృష్టి ప్రసరించటానికి గాను, నేను ఎప్పుడు ఏం పుణ్యం చేశానో ఏమో!

దేవా! సర్వధర్మజ్ఞా! మీకు శ్రమ అనుకోకపోతే నాకున్న ఒక సంశయమును నివృత్తి చేయమని వేడుకొంటున్నాను. మీవంటి మహనీయులతో సంసర్గం ప్రాప్తించిన తరువాత మావంటి సంసార జీవులకు దుఃఖశమనం తప్పక కలుగగలదని పెద్దల వాక్యం. దుఃఖము యొక్క తత్త్వము ఎరిగిన పండితులు "సంశయమే దుఃఖము యొక్క మూలస్థానం" అని చెప్పుతారు కదా! స్వామీ! నా సంశయమేమిటో వినండి.

నేను రాజుగా దోషులను క్రూరంగా దండించ వలసివస్తోంది. మరికొందరిని అనుగ్రహించ వలసి వస్తోంది. ఈ దండన, అనుగ్రహములను నిర్వర్తించే విధినిర్వహణలో నాకు విషమ దృష్టే సంప్రాప్తిస్తోంది కానీ సమదృష్టి కాదు. సమదృష్టిచే మాత్రమే జీవుడు మోక్షమార్గానికి అర్హుడౌతాడని మోక్షశాస్త్రములు ఘోషిస్తున్నాయి. మరి ఇట్టి పరిస్థితులలో నాయందు సమదృష్టి యొక్క ఛాయలైనా ఎట్లా ఉద్భవించగలవో నాకర్థమవటం లేదు. అనేక రోజుల నుండి ఈ విషయమై నాలో అంతర్ సంఘర్షణ జరుగుతోంది. నాకు దిక్కుతోచటం లేదు. ఈ రాజ్యం వదలి ఎచ్చటకో పారిపోవాలని, సమదృష్టికై ఏవైనా ప్రయత్నాలు చేసుకోవాలని అనేకసార్లు అనుకున్నాను. అయితే ఇక్కడి రాజవంశంలో పెద్ద కొడుకునై పుట్టినందుకు నేను రాజుగా ఉండక తప్పుటలేదు. ఎక్కడికో పారిపోతే, అప్పుడు నేను ధర్మము తప్పినవాడనే అవుతానేమోనని కూడా నా సందేహం!

ఇప్పుడు ఏమిచేయటం ఉచితమో తమరు ఆనతివ్వండి. మీరు ఉచితమని అంటే, ఇప్పటికిప్పుడు మీకు శిష్యుడనై సర్వము పరిత్యజించి వచ్చేయటానికి కూడా నేను సిద్ధమే. ఇప్పుడు

ఏది ఉచితమో, అది మీరు ఆజ్ఞాపించమని వేడుకుంటున్నాను. నాపై దయతో సముచితమైన మార్గం చూపండి. ఈ 'రాజదండన' వంటి క్రూర క్రియలను నేను కొనసాగించలేను. నాపై దయతో నన్ను ఆజ్ఞాపించండి.

మాండవ్యమహర్షి : ఓ రాజా! నీ మనస్సు అలసత్వం చేత అల్పత్వం పొందిందయ్యా. ఈ శరీరాన్ని స్నానాదులు ఏ విధంగా ధూళి మొదలైనవాటిని తొలగిస్తాయో, మనస్సును కూడా ఆత్మసమాచారము, నిర్మల పర (ఆత్మ) ధ్యానము వంటి ప్రయత్నములచే ప్రతిరోజు నిర్మలస్నానం చేయించాలి. నీవు త్యజించవలసినది త్యజించవలసినంతగా త్యజించలేదు. ఆశ్రయించి ఉండవలసినది తగినంతగా ఆశ్రయించటం లేదు. అందుచేతనే నీ మనస్సు అల్పభూములలో చిక్కుకొని వేదన చెందుతోంది. నిస్తేజం అనుభవిస్తోంది.

సురఘు : స్వామీ! ఈ మనస్సు యొక్క అల్పత్వం తొలగేది ఎట్లా?

మాండవ్యమహర్షి : అందుకు ఎల్లప్పుడూ మూడు విధములైన ప్రయత్నములను ఆశ్రయించాలి–

1. మనస్సు ఏర్పరచుకొంటున్న రాగమును తొలగించి ఎప్పటికప్పుడు వైరాగ్యంతో నింపాలి.
2. కర్మల ప్రయోజనముల పట్ల ఏర్పడే 'ఆశ్రయము' ను నిరోధించి, "కర్మఫల త్యాగము" లేక "కర్మఫలములను భగవంతునికి సమర్పణ చేయుట" అను త్యాగమును అభ్యసించాలి.
3. ఆత్మజ్ఞానపర్యంతము 'శ్రవణము, మననము' మొదలైన ఉపాయాలను అనుసరిస్తూండాలి.

మనస్సులో ఏర్పడే సంతాపం 'స్వవిచారణ' చే శీఘ్రంగా ఉపశమించగలదు.

ఈ పుత్ర, స్త్రీ, జన, ధనాదులు ఏమై ఉన్నాయి?... నా శరీరంలో చోటుచేసుకొని ప్రవర్తించుచున్న ఈ ఇంద్రియములతో నాకు ఏర్పడుచున్న సంబంధము ఎట్టిది?... ఈ మనో–బుద్ధి–అహంకారముల స్వరూపం ఎట్టిది?... ఇంతకీ నే నెవరిని?... ఈ జగత్తు ఎక్కడినుంచి ఏ విధంగా నాకు ప్రాప్తిస్తోంది?... ఎట్లా ఉపశమిస్తోంది?... ఈ జనన మరణములు ఎట్లా కలుగుచున్నాయి?

ఓ రాజా! స్వమనస్సుచే పై విషయాలు బాగుగా విచారణ చేయాలి. అట్టి తీవ్ర, దీర్ఘవిచారణ చేత నీవు 'పూర్ణమహత్వము' ను పొందుతావు. నీయొక్క సత్ స్వభావమును ఎఱుగుటచే ఇక ఈ సుఖ, దుఃఖాది దశలు నీ చిత్తమును డోలాయమానం చేయలేవు. అప్పుడు నీ మనస్సు జగత్ స్వరూపమును విడచి "సర్వదా సిద్ధించియే ఉన్న దుఃఖ రహితమగు బ్రహ్మ స్వరూపము" ను సంతరించుకుంటుంది. అప్పుడది జలమందు తరంగంలాగా తనకు తానే శమించగలదు. అది జీవన్ముక్త వ్యవహారమునందు సమర్థత పొందగలిగినప్పుడు మలినరూపము వదలి పూర్వఃపూర్వ తత్పూర్వరూపం పొందగలుగుతుంది.

నీవిప్పుడు దృశ్యమును సందర్శిస్తున్నావు కదా! ఎప్పుడైతే నీవు ఆత్మను సందర్శిస్తావో, ఇకప్పుడు లోకపాలకులగు బ్రహ్మమొదలైనవారు కూడా, బిడ్డలు తండ్రికృప కోరుకొంటున్నట్లు, నీ కృపను కోరుకుంటారు. అందుచేత వివేకజనితమైన జ్ఞానముచే నీవు ఆత్మను అవలోకించు. అప్పుడు 'ఆకాశము

– సముద్రము – మేరుపర్వతము' వంటి మహత్తర పదార్థములకు కూడా అర్థ ప్రదాతవు నీవే అవుతావు. ఎందుకంటే మహత్తంతా ఆత్మసత్త యొక్క ఆధీనమే అయి ఉన్నది. ఆత్మజ్ఞానముచే మహత్వము నొందిన తరువాత ఇక చిత్తము ఈ సంసారము నందు మునుగదు.

గోష్పాదజలం (ఆవు గిట్టచే ఏర్పడిన గుంటలోని జలం)లో ఏనుగు మునుగుతుందా? ఎలా మునుగుతుంది? ...కానీ, ఆ గోష్పాదజలంలో శిథిలమైన అంగములు గల ఒక దోమ లాగా నీ మనస్సు 'దృశ్య సంపర్కము' అనే సంసార గోష్పాదజలంలో చిక్కుకుంటోంది. అది అనేక నీచదృష్టులను, అవగాహనలను, అభిప్రాయములను కలిగి ఉండి దృశ్య వ్యవహారంలో ప్రవేశిస్తోంది.

ఈ మనస్సు తన యందు వాసనలను కలిగి ఉంటోంది. అందుచేతనే దృశ్యము నందు ఆకర్షణ–వికర్షణల తాడనం పొందుతోంది. అందుచేత ఓ రాజా! 'స్వయం జ్యోతిస్వరూపం' అయినట్టి 'ఆత్మమాత్రానుభవం' శేషించే వరకూ నీవు అంతయూ త్యజిస్తూ పోవలసిందే.

బంగారపు గనిలో పనిచేసేవాడు బంగారం లభించే వరకూ గనిని శోధిస్తూనే ఉంటాడు కదా! ఆత్మలాభం కలిగేంత వరకూ ఆధ్యాత్మ శాస్త్రములను విచారణ చేస్తూనే ఉండాలి.

"వస్తు రూప బుద్ధి... ఆత్మబుద్ధి" - వస్తురూప బుద్ధియే సర్వ అనర్థములకూ కారణమగు చున్నది. అట్టి వస్తురూప బుద్ధిని ఉత్తమ బుద్ధిచే పరిశుభ్రపరచాలి. నిర్మలమగుచున్న బుద్ధి సాయంతో క్రమంగా ఈ దృశ్యము నంతటినీ పరిత్యజించి వేయాలి. అప్పుడు నీ చేతనే నీకు 'ఆత్మ' అను పూర్ణ లాభం చేకూరుతుంది. అట్లా కాకుండా ఏదో ఒక చోట కొన్ని విషయములు మాత్రం త్యజిస్తే ఆత్మలాభం ఎలా చేకూరుతుంది?

నీవు కొన్ని విషయములను వదులుతూ, మరికొన్ని విషయములను ఆదరిస్తూ ఉండుట చేతనే నీకు ఇప్పటి డోలాయమానస్థితి ఏర్పడుతోంది. నాయనా! మరల చెప్పుచున్నాను –

యావత్సర్వం న సంత్యక్తం తావదాత్మా న లభ్యతే ।
సర్వావస్థాపరిత్యాగే శేష ఆత్మేతి కథ్యతే ॥ (శ్లో 44, సర్గ 58)

సమస్త పదార్థములు త్యజించబడనంత వరకూ ఆత్మానుభవప్రాప్తి కలుగదు. సర్వావస్థలను పరిత్యజించుటచే, అప్పుడు నీయందు ఏది శేషిస్తుందో – అదే 'ఆత్మ' అని చెప్పబడుతోంది.

ఈ మామూలు లౌకిక జీవితమే చూడు...! ఇక్కడ ఒక ఉత్తమ వస్తువును పొందాలంటే కొన్ని స్వల్పవస్తువులను త్యజించవలసి వస్తోంది. సామాన్య ప్రాపంచిక వస్తువుల విషయమే ఇట్లా ఉంటే, ఇక ఆత్మలాభం గురించి వేరే చెప్పాలా? సర్వ త్యాగం కాకుండా, కొన్ని వదలి మరికొన్నిటిని పట్టుకుని ఉంటే ఆత్మ ఎట్లా లభిస్తుంది? అందుచేత సర్వ, అన్య విషయముల కొరకై కార్యములను నిర్వర్తించటం" – అనేది పరిత్యజించి, "సర్వయత్నములూ ఆత్మలాభము కొరకే" చేయాలి. అప్పుడు మనుజుడు అద్దానిని తప్పక పొందుతాడు. అట్లా కాకపోతే ... పొందడు.

అందుచేత, 'స్వాత్మావలోకనము' కొరకు సర్వస్వము త్యజించాలి. ఉపాయం అదొక్కటే.

జగత్తు - (జ...గత్) జనిస్తూ ... గతిస్తూ ఉండేదంతా 'జగత్తు' అను పేరుతో వ్యవహరించ బడుతోంది. ఈ జగత్తులో వర్తమానంగా నీవు పొందుచున్న సర్వమును... అది గతించే లోపల నీవే దానిని త్యజించినవాడవై ఉండు.

నీకున్న సర్వము త్యజించుచూ పో!... సర్వము త్యజించిన తరువాత కూడా ఏదైతే ఇక నీవు త్యజించుటకు వీలు కాదో, అదే పరమపదమని ఇంకొకసారి ప్రకటిస్తున్నాను. అట్టి పరమపదమును అధిరోహించి, అటుపై ఈ జగత్తులో లీలావినోదిగా, క్రీడావిహారిగా వినోదించు.

సురఘుడు : మహర్షీ! అసలీ జగత్తు అనబడేది ఏ మూలపదార్థముచే తయారుచేయబడుతోంది?

శ్రీమాండవ్యమహర్షి : ఈ జగత్తంతా కార్య – కారణ మయమైయున్నది. ఇదంతా కూడా సన్మాత్రాత్మ యందు స్వకల్పనచే ఏర్పడి ఉంటోంది. 'సత్' నుండి బయల్వెడలి, ఆ సత్తుకు భిన్నమైన దాని వలె రూపం కలిగి ఉంటోంది.

నీవు సత్ స్వరూపుడవు. కనుక, నీచే చూడబడేదంతా నీస్వరూపమే అయి, నీకు భిన్నమైన దాని వలె నీకు సంప్రాప్తిస్తోంది. వాస్తవానికి ఇదంతా నీకు అభిన్నం. అట్టి నీకు భిన్నమై ప్రాప్తించేదంతా (అనిపించేదంతా) నీవు త్యజించు. అందుకు కారణమగుచున్న నీయందలి మూల అజ్ఞానాన్ని కూడా నాశనం చేయి.

నీ మనోరూపమైనదంతా నీచే నీయందే లయించివేయబడు గాక! లయం కాబడుచున్న మనస్సు సత్–చిత్ రూపమును పొందుచున్నది. నీ మనస్సు లయించేది నీ రూపము నందే సుమా! మనస్సు లయించగా శేషించేది ఏది? ఏకరస బ్రహ్మమే.

ఏకరస బ్రహ్మము ఇక అనుభవమాత్రమే కాని, అది ద్రష్టత్వము కాదు. ద్రష్టత్వము లేని చోట ద్రష్ట లేడు, దృశ్యం లేదు. సుఖదుఃఖాలు, కార్య – అకార్యము లనబడేవన్నీ ఉండనే ఉండవు. నీ అశాంతి తొలగిపోవుటకు అది అత్యుత్తమ మార్గం.

నేను చెపుతూ, ఉద్దేశించుచున్నదేమిటో అది స్వవిచారణచే నీవు తప్పక గ్రహించగలవు. యోచన చేయి. విచారణచేయి. ఇక మేము వెళ్ళివస్తాం. శలవా?

❖

ఇట్లు పలికి మాండవ్యమహర్షి సురఘు రాజును, ఆతని ప్రజలను ఆశీర్వదించి, అక్కడి నుండి తమ ప్రయాణాన్ని కొనసాగించారు. సురఘు రాజు వారికి వీడ్కోలు చెప్పి, ఆ తరువాత ఒకానొక ఏకాంత ప్రదేశం చేరాడు.

అక్కడ పద్మాసనాసీనుడై ఏకాగ్రచిత్తంతో స్వవిచారణ ప్రారంభించాడు.

❖❖❖

2. ఇంతకీ నే నెవరు?

సురఘురాజు (అంతరంగంలో) : త్యజించవలసినది త్యజించవలసినంతగా త్యజించలేదని మహర్షి నాకు గుర్తు చేశారు. విచారణ ఇంకా కొనసాగించమని ఆజ్ఞాపించారు. దేనిని గురించి విచారణ? ఈ గ్రాహ్య – త్యాజ్యములు నిర్వర్తిస్తున్న 'నేను' గురించి కదా!

ఇంతకీ నేనెవడను? - కిరాతరాజ్యం ఏర్పడి ఉన్న ఈ పర్వతము, పర్వత ప్రాంతం నేనా? కాదు. ఇవన్నీ బాహ్యమున ఉన్నాయి కదా! ...నేను ఈ పర్వతమును కాదు. ఈ పర్వతము నాది కాదు. అట్లాగే ఈ జగత్తు నేను కాదు. ఈ జగత్తు కూడా నాది కాదు. నేను ఈ నేలను కాదు... ఈ నేల నాది కాదు.

ఈ కిరాత రాజ్యము కూడా నేను కాదు. ఎందరో రాజులు ఈ రాజ్యమును పాలించారు. మరింకెందరో పాలించనున్నారు. కనుక 'ఈ రాజ్యము నాది' అనునది అవాస్తవమే. కేవలం సర్వ జనులు సమ్మతించుటచేత మాత్రమే నేనీ రాజ్యానికి రాజయ్యాను. కల్పనా మాత్రం చేతనే 'రాజుగా ఈ రాజ్యం నాదే' – అనే భ్రమపూర్వకమైన భావన కలుగుతోంది. ఈ 'రాజు' అనే సంకేతం త్యజిస్తే అప్పుడు నేను ఇక్కడ దేనికీ సంబంధించనివాడను అవుతాను. ఇక్కడి రాజుతో ఏర్పడే మంత్రి – ప్రజ – సేవకజన – శత్రు రాజ్యసంబంధములకు కూడా నేను సంబంధించని వాడను అవుతాను.

అమ్మయ్యా! సంకేతముచే ఇంతవరకూ ఏర్పడియున్న, కల్పించుకొనియున్న 'సంకేత సంబంధం' క్రమంగా నా దృష్టి పథం నుండి తొలగుతోంది.

కుటుంబముచే నేను పరిమితుడైనవాడనా? - సరే, ఇక ఈ 'భోగజాలము, కుటుంబము' విషయానికి వద్దాం. ఇవన్నీ నావా? కావు. ఇందలి సభ్యులందరికీ వేరువేరు ఆశలు, జీవిత లక్ష్యములు ఉండి ఉండగా, 'వీరు నావారు' అని నేను భ్రమించటమేమిటి? నా కుటుంబసభ్యులు, భృత్యులు నాతో కల్పితసంబంధం కలిగి ఉంటున్నారు. అదంతా వాస్తవమెట్లా అవుతుంది? సందర్భానుచితంగా ఇవన్నీ మార్పు, చేర్పులు చెందుచున్నాయి కదా?

నేను శరీరమునా? - చేతులు, కాళ్ళు మొదలైనవాటితో కూడిన ఈ దేహంలో జడములైనట్టి మాంసము, ఎముకలు మొదలైనవి కూడా ఉన్నాయి. కానీ నేను ఈ దేహములోని తదితర విభాగముల వలె ఒక జడవస్తువునా?

'ఇది ఇట్లు' అని గ్రహించగలుగుచున్న నేను జడమెట్లా అవుతాను? నీళ్లలో కమలం ఉన్నప్పటికీ నీళ్లు వేరు, కమలం వేరు కదా! జడమగు రక్త–మాంస–అస్థులతో కూడిన ఈ శరీరమునకు, చైతన్యమగు నాకు సంబంధమెట్లా ఉంటుంది? ఇవి ఎన్నటికీ నావి కావు. ఈ కర్మేంద్రియములు నేను కాదు.

నేను భోగములకు సంబంధించినవాడినా? - ఈ భోగములు నేనా? ఎట్లా ? భోగములు బాహ్యములైన అనుభవములే కదా? ఈ భోగములు చవిచూస్తున్న ఇంద్రియములు కూడా నేను

కాను. అవి నావి కావు. అట్లాగే జడమాత్రములై మిథ్యా రూపంగా కనిపించే బుద్ధి మొదలైనవి కూడా నేను కాదు.

నేను మనోరూపుడనా? - సర్వ సంసార దోషములకూ మూలమైనట్టి మనస్సును నేనా? అసలు, మనస్సు అంటే ఏమిటి? మననము అను ప్రక్రియయేకదా! మనస్సు అను దానికి స్వకీయమైన ఉనికి ఎక్కడున్నది? కాబట్టి మనస్సు గాని, బుద్ధిగానీ, అహంకారము గానీ, నేను కాదు. ఈ మూడూ అంతఃకరణము యొక్క భౌతికరూపములు.

ఈ విధంగా విచారించగా ఈ దేహము మొదలుకొని ఇంద్రియములు – మనస్సు – బుద్ధివరకూ గల ఏవీ నేను కాదని అతిస్పష్టంగా తేలిపోతోంది.

నేను ప్రమేయుడనా? - ఇక మిగిలింది ఈ ప్రమేయము (Relationship)తో కూడుకొని ఉన్న చేతనుడగు ఈ జీవుడే కదా? అయితే 'నేను ఒక జీవుడను' అని అనుకొనుచున్న నేను అట్టి జీవ భావము ప్రారంభం కావటానికి ముందే ఉండివున్నాను.

త్రిపుటి (Three - Dimensions) – 1. తెలుసుకొనుచున్నవాడు (Perceiver), 2. తెలియబడు చున్నది (Object), 3. తెలివి / తెలుసుకొనుట (Perceiving) ... త్రిపుటికి సాక్షి అయిన మరొకదానిచే త్రిపుటి ఎరుగబడుచున్నది. అందుచేత వ్యక్తిగత ప్రమాత (The Perceiver or Knower) ఆత్మ యొక్క యథార్థ స్వరూపము కానేరదు.

మాండవ్య మహర్షి "సర్వమును త్యజించవయ్యా!" అని ఆజ్ఞాపించారు కదా! కనుక సాక్షిచే ఎఱుగబడుచున్న ప్రమాత ప్రమేయములను కూడా త్యజించివేస్తున్నాను. అవి నేను కానప్పుడు వాటిని త్యజిస్తే నాకేమి నష్టం? ఏమి కష్టం?... 'ఇవన్నీ నావి కావు, నేను కాదు' అని గమనిస్తే చాలుకదా!

అవును.. ఇప్పుడు శేషించిన వికల్ప, సంకల్ప రహితమగు విశుద్ధచైతన్యమగు ఆత్మనే నేను.

❖

ఆహా! ఎంత ఆశ్చర్యం! నేను ఇతఃపూర్వం కూడా ఆత్మను సర్వదా పొందియే ఉన్నాను! కానీ, నిత్యసాక్షిత్వమును వదిలి నేను జీవుడను... నేను భోక్తను అని అనుకుంటూ దయ్యం పట్టిన వాని వలె ఇంతకాలం ప్రవర్తిస్తున్నాను.

ఎప్పుడైతే సర్వమునకు సాక్షి రూపుడను నేను' అని గుర్తు చేసుకొన్నానో, మరుక్షణం ఉత్తమమగు పురుషార్థలాభుడను అగుచున్నాను. ఇది నాకు ఎంత సుఖప్రదమైన విషయం! అనంతరూపుడగు ఆత్మయే నేనైయున్నాను. అట్టి నా పరమాత్మత్వమునకు అంతమే లేదు.

నా యందు ఏ పరమాత్మ ఉన్నదో అదే పరమాత్మ బ్రహ్మదేవుని యందు ఇంద్రుని యందు, యముని యందు, వాయువు నందు, సర్వభూతజాలము నందూ సమముగా అవతరించినదై ఉన్నది. ముత్యపుమాల యందు దారం లాగా సర్వుల యందూ అనుగతమై ఉన్నది.

నా యొక్క, సర్వుల యొక్క 'స్వానుభవమాత్రం' అగు చిత్‌శక్తి అతి నిర్మలమైనది. అది విషయ వ్యవహార వివర్జితమైనది. అది సర్వ దిక్కులనూ సర్వదా పూర్ణమొనర్చుచున్నది. అత్యంత మధురమైనది.

అయితే అజ్ఞానులకు మాత్రం అది భయంకరాకృతిగానే తోచుచున్నది. సర్వపదార్థము లందూ వ్యాపించి ఉన్న ఆ చిత్‌శక్తి అతిసూక్ష్మమై ఉండుటచే, ప్రజ్ఞానదశ యందు ఏర్పడి ఉన్న స్థూలదృష్టి కారణం చేత నేను గుర్తించలేకపోయాను.

అట్టి ఉత్పత్తి వినాశనరహితమగు చిత్‌శక్తినే నేను. చిత్‌శక్తి స్వరూపుడనగు నేను పాతాళము నుండి బ్రహ్మలోకము వరకూ సమస్త భువనము లందూ స్థితి కలిగి ఉన్నాను. సర్వశక్తి నిలయం ఆ చిత్‌శక్తియే. అయ్యది నిరతిశయానందముచే పరిపూర్ణమైయున్నది. సూర్యుడు మొదలైన ప్రకాశింప జేసే వస్తువులన్నిటినీ ప్రకాశింపజేసేది అదే. 'బ్రహ్మాండములు' అనే ముత్యములను ధరించిన దారం అది.

అది సర్వాకార-వికారయుక్తమై కూడా సర్వాకార-వికార వివర్జితమై ఉన్నది. భూతకోట్ల అన్నిటి రూపమూ అదే. కనుక సర్వ రూపత్వము ఆ చిత్ శక్తికే ఆపాదయోగ్యము. పదునాలుగు లోకములందలి పదునాలుగు విధములైన జీవరాసులను తన ఉదరమున ధరిస్తున్నది అదే.

జగత్తు అనబడు అనుభవరూపమంతా ఆత్మయే కానీ మరింకేమీ కాదు. ఆ ఆత్మయే సమస్తము అయి ఉండుటచే సుఖ దుఃఖ దశలన్నీ మిథ్యారూపములు మాత్రమే!

'పరాచైతన్యము' అను వేద ప్రసాదిత నామధేయమునకు అది ఒప్పుచున్నది. చైతన్య రూపమై ఉన్న నా ఆత్మ జగత్తంతా వ్యాపించియున్నది. మరొక వైపుగా, ఇచ్చట ప్రవేశించి నాట్యం చేస్తోంది.

యథార్థానికి ఈ మనోదేహాదులు లేవు. తుచ్ఛములైనట్టి ఈ దేహము, దాని ద్వారా ప్రాప్తిస్తున్న దృశ్యం నశిస్తున్నప్పటికీ, ఆత్మ ఏమాత్రం నశించుటలేదు... మరి ఈ జగజ్జాల నాటకమంతా ఏమిటి?

అవును.... తెలిసింది. ఇదంతా 'చిత్తము' అను నటుడే తన నటనా చాతుర్యంతో రచిస్తున్నాడు. ఎప్పుడైతే బుద్ధి జగద్విశేషాలతో తన్మయత్వము పొందకుండా సాక్షిత్వము పొందుతుందో, అప్పుడు ఇందలి నాటకీయత్వమంతా తెలిసిపోతోంది. దీపం వెలుగుతుంటేకదా, గదిలోని వస్తువులు ఏమై ఉన్నాయో తెలిసేది!

ఆహా! నేను నిగ్రహ, అనుగ్రహములతో ప్రజలను శిక్షిస్తున్నప్పుడూ, సన్మానిస్తున్నప్పుడూ నా మనస్సు ఎందుకు వ్యాకులత పొందిందో ఇప్పుడు తెలుస్తోంది. నాకు వ్యర్థంగా దేహబుద్ధి కలగటం చేతనే, అట్లు భ్రమ పొందాను. అందుకే దుఃఖించాను. యథార్థానికి అసలు ఈ దేహమే లేని పదార్థం కదా!

అమ్మయ్య! ఇప్పటికి నేను జ్ఞానవంతుడనయ్యాను. శరీరాదు లందు 'ఈ శరీరమే నేను... ఆ శరీరమే ఆతడు' అను రూపంలో ఏర్పడిన 'దేహాత్మదృష్టి' అనే దుర్దశ తొలగింది. మరుక్షణం చూడ వలసినది చూస్తున్నాను. పొందతగినది పొందుచున్నాను.

❖

ఈ కనబడే జగద్గతమైన దృశ్య వ్యవహారమంతా 'మాయ' చే 'చిత్తు' నందు స్వప్నసదృశ్యంగా సంభవించుచున్నది. ఈ జగత్తు నందు 'ఆత్మ' లేక 'చిత్తు'కు అన్యమై ఏర్పడేదంటూ ఎక్కడా ఏదీ

లేదు. ఇక అందులో నిగ్రహమేమిటి? అనుగ్రహమేమిటి? అవన్నీ ఎక్కడున్నాయి? ఎట్లా ఉన్నాయి? సుఖం, దుఃఖం, మానం, అవమానం ...ఇవన్నీ స్వయంకల్పితం, ఊహాజనితం అయిన కథా సన్నివేశాల వంటివి కాక మరింకేమిటి? కాబట్టి 'నేను వీరిని శిక్షిస్తున్నాను, వారిని సంతోష పెడుతున్నాను'... అను భావన కూడా స్వప్న జనితమగు భ్రమ వంటిదే. అంతా కూడా వ్యాపకబ్రహ్మమే అయిఉండగా సుఖమేమిటి? దుఃఖమేమిటి? నేను ఇంతకాలం మూఢుడనై దోషదృష్టితో జగద్దర్శనం చేస్తున్నాను. ఇప్పుడు సౌభాగ్య వశం చేత మాండవ్యమహర్షి గుర్తు చేయటంతో, జ్ఞానిని కావటం జరిగింది.

❖

ఆనంద స్వరూపం, పరిపూర్ణం అగు ఆత్మ యొక్క అనుభవం కలిగిన తరువాత ఇక దేనికై శోకించాలి? దేనికి మోహితుణ్ణి కావాలి? 'ఇంకనూ చూడాలి? ఇంకా పొందాలి' అని ఎందుకు అనుకోవాలి? ఏమి చేయాలి? ఎక్కడికి వెళ్ళాలి? ఆగమ-సంచిత-ప్రారబ్ధ కర్మలు ఎవరికి? ఎందుకంటే 'అలౌకిక చమత్కారం' అగు చిదాకాశ మొక్కటే విద్యమానమై ఉన్నది కదా!

కిం చిదేవమిదం నామ చిదాకాశం విరాజతే ।
నమో నమస్తే నిస్తత్త్వ దిష్ట్యా దృష్టోఽసి సున్దర ॥ (శ్లో 36, సర్గ 50)

భౌతికత్వమే లేనట్టి ఓ స్వస్వరూప పరమాత్మా! నీకు నమస్కరిస్తున్నానయ్యా! మహద్భాగ్యం చేతనే నీవిప్పటికి నాయందు నేనుగా కనిపించావు. కదయ్యా!

ఆహా! ఇప్పటికి నేను ప్రబుద్ధుడనై సర్వము చక్కగా ఎరుగగలిగాను. గురుదేవుడగు మాండవ్య మహామునికి, ఆయన వాక్యములకు నమస్కారం. సమ్యక్జ్ఞానం ఉదయించిన కారణంచేత నేను అనంత రూపుడనయ్యాను. అనంతరూపమగు ఓ నా ఆత్మస్వరూపమా! నీకు నేను చేతులెత్తి మ్రొక్కుచున్నాను. అహో! నా స్వస్వరూపమే అయిన ఆత్మ గురించిన జ్ఞానం ఎంత మహత్తరమైనది! అట్టి జ్ఞానముచే అత్యంత సహజంగా, అకృత్రిమంగా రాగ ద్వేషముల అభావం ఏర్పడుతోంది. తద్వారా జాగ్రత్ – స్వప్న – సుషుప్తులలోని విషయ స్థితి నశిస్తోంది. నన్ను నేను ఉపాధిరహితునిగా గాంచుచున్నాను. 'బ్రహ్మమునందు ఏకీభావము' అను ఒకానొక నిశ్శబ్ద పూర్ణానుభవం తారస పడుతోంది. సంసార భ్రమరహితుడునగుచున్నాను. అహమ్, మమ (నేను, నాది) అను వృత్తులు లేనివాడనగుచున్నాను. సర్వమునకు సాక్షీభూతమగు ఆత్మ లేక శుద్ధబ్రహ్మము నందు సమరూపుడనై ప్రకాశించుచున్నాను.

❖

వింటున్నావుకదా, రామచంద్రా! మన ఈ విశ్వామిత్రుడు రాజర్షిత్వమునుండి బ్రహ్మర్షిత్వము పొందారు చూచావా! అట్లాగే ఆ హేమజట (లేక సురఘురాజు) తన వివేకముచే సంపాదించిన సునిశ్చయముచే పరమోత్తమమగు 'బ్రహ్మపదము' ను పొందాడు. రాత్రింబవళ్ళు కలుగజేస్తున్నప్పుడు సూర్యభగవానుడేమన్నా ఖేదముగానీ, మోదముగానీ పొందుచున్నాడా? లేదే! ఆ విధంగానే ఆ

రాజు కూడా తాను అనుష్ఠించుచున్న ధర్మార్థముల వలన ప్రాప్తించే క్రియలచే గానీ, దైవగతిచే అనివార్యంగా ప్రాప్తించే అనర్థములు, దుఃఖప్రదములగు ప్రవాహపతిత వ్యవహారములచే గానీ, ఏమాత్రం ఖేద మోదములు పొందటం లేదు. జల ప్రవాహముచే అనునిత్యంగా తాడనం పొందే పర్వతం యథాతథంగా, నిర్వికారంగా ఉంటున్నట్లు తాను నిర్వర్తించే రాజోచితమైన నిగ్రహ (punishing) – అనుగ్రహ (Awarding) విషయముల పట్ల అచంచలుడై, దుఃఖరహితుడై ఉంటున్నాడు. దైనందినక వ్యవహారములు సలుపుచున్నప్పుడు హర్షామర్షములను (Happiness and unhappiness) పొందనివాడై తన ఉదార, గంభీర స్వభావంతో సముద్రమును కూడా మించిపోయాడు. "సుషుప్తిచే నిశ్చలము, చైతన్యముచే ప్రకాశవంతము" అగు చిత్తవృత్తిచే నిశ్చల ప్రకాశమయమగు అగ్నిశిఖ వలె ప్రకాశించాడు.

ఆతడిప్పుడు నిర్దయుడు కాదు. దయావంతుడు కాదు. ద్వంద్వము, మత్సరము లేవు. అనర్థిగాని, అర్థిగాని, అతిబుద్ధిసహితుడుగానీ కాకుండానే యథారీతిగా ప్రాప్తించిన కార్యములను ఆచరిస్తూ సమదర్శియై ఒప్పుచున్నాడు. ఆతని అంతఃకరణం ఇప్పుడు సమదర్శనశీలమై చపలరహితమై, ధీరత్వ సమన్వితమై, వృత్తిరహితమై, పూర్ణ చంద్రుని వలె సంపూర్ణత్వము సంతరించుకొని ఉన్నది.

❖

ఎవడైతే, ఈ జగత్తంతా చిత్తము యొక్క కల్పన మాత్రమే' ...అని నిశ్చయించుకుని ఉంటాడో, ఆతని బుద్ధి ఇక ఈ భౌతిక సుఖదుఃఖములు లేనిదే అగుచున్నది.

ప్రబుద్ధుడై, నిరంతరం సమాధినిష్ఠుడై ఉన్నవాడు ఈ శరీరాదులను బాహ్యవస్తువుగా చూస్తూ, సర్వదా ఉల్లాసముతో ఉంటాడు. ఆతని చిత్తం ఆతనికి వికాసమును ప్రసాదిస్తూ ఉంటుంది. ఆతడు కూర్చున్నప్పుడు, నిలుచున్నప్పుడు నిదురిస్తున్నప్పుడు సర్వదా చైతన్యమునందు లయం పొంది ఉంటాడు.

ఆ రాజు కూడా అట్లే చైతన్యము నందు ఐక్యత పొందియున్నాడు. రాజ్యపాలనను నిర్వర్తిస్తూ కూడా, అత్యంతాసక్తి రహితుడై ఉన్నాడు. అఖండాకారయుతుడై ప్రకాశించాడు. నదీజలం పూర్ణ సముద్రంలో కలియునట్లు, మంచుగడ్డ కరుగుటచే తన ఆకృతిని వీడునట్లు అతడు సర్వమును స్వస్వరూపము నందు లయింపజేసుకొని 'నేను సర్వమునకు సాక్షిని' అను సాక్షీరూపంలో ప్రవేశించాడు. బ్రహ్మాండములన్నిటికీ ఉత్పత్తి స్థానము, బ్రహ్మాదులకు కూడా నియంత అయినట్టి పరబ్రహ్మమునందు ప్రవేశించాడు. స్వబుద్ధిచే నిర్మలము దుఃఖరహితము ఆనంద పరిపూర్ణము అగు ఆత్మను పొందాడు. అట్టి ఆత్మప్రాప్తిచే ఈ జన్మ మొదలైన దశలను మనస్సులో అధిగమించివేశాడు.

కుండ పగిలితే కుండలోని ఆకాశం మహాకాశంలో లీనమగుచున్నట్లు ఆతని భావన పూర్ణత్వం పొందగా ఆతడు పరబ్రహ్మస్వరూపుడైనాడు.

ఓ దశరథరామా! నీవు కూడా హర్షశోకాదులకు కారణమగుచున్న 'పాపదృష్టి'ని నశింప జేసుకొని ద్వంద్వరహితుడవై అత్యంత శ్రేయోదాయకమగు మోక్షపదమును ఆశ్రయించు. అప్పుడు

నీవు తప్పక దుఃఖరహితుడవౌతావు. చీకట్లో కదులుతుంటే ఏదైనా తగలటంచేత బాలుడు క్రింద పడవచ్చు. దీపం ఉంటే ఆ ఇబ్బంది ఉండదు కదా! ఆ సురఘు మహారాజు 'జ్ఞానదృష్టి' అనే దీపం చేబూనటం చేతనే ఆతని మనస్సు అజ్ఞానాంధకారంలో పడకుండా కాపాడుకోగలిగాడు.

ఒకడు గోతిలో పడినప్పుడు ఏం చేస్తాడు? ఒడ్డున ఉండే వేటినైనా ఆలంబనంగా పట్టుకుని బయటకు రావటానికి ప్రయత్నిస్తాడు కదా!

వివేకమును, వివేకులను ఆశ్రయించి తద్వారా తన చిత్తమునకు శాంతిని ప్రసాదించాలి. ఆ సురఘు మాటిమాటికీ పవిత్రదృష్టిని అభ్యసించాడు. ఇతరులకు కూడా అద్దానిని ఉపదేశించాడు. క్రమంగా ఏకము అయినట్టి బ్రహ్మమునందు సమాధితత్పరుడైనాడు.

❖

శ్రీరాముడు : మునీంద్రా! మీరు "ద్వంద్వరహితం అవాలి" అని ఆజ్ఞాపిస్తున్నారు. అయితే మా మనస్సు గురించి గమనిస్తున్నారా? గాలి వీచే చోట నిలబెట్టబడి ఉన్న నెమలి పింఛంలాగా ఈ మనస్సు స్థిరంగా ఉండటమే లేదే! దీనిని స్థిరీకరించేది ఎట్లా? ఎంతగా మరల మరల విన్నా కూడా ఇది బ్రహ్మపదము నందు ఏకాగ్రనిష్ఠ పొందుట లేదు. దీనిని సుస్థిరీకరించటం ఎట్లాగో చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : మనస్సు విషయంలో ఇప్పటికే 13 రోజులుగా మనం చాలా విషయాలు చెప్పుకున్నాం. సరే ...జ్ఞానియగు సురఘు ఆతని చిన్ననాటి స్నేహితుడగు పరిఘుడి మధ్య ఒక అద్భుతమైన సంవాదం జరిగింది. ఆ తరువాత ఆ ఇద్దరూ కూడా 'ఏకరూపసమాధి' యందు తమ తమ చిత్తములను సంలగ్నం చేసియున్నారు. తమ చిత్త, ఇంద్రియముల విషయంలో అత్యంత ప్రబుద్ధులై ఉన్నారు. అందుచేత వారిరువురి పరస్పర సంవాదము ఈ సమయంలో ప్రస్తావించటానికి సముచితంగా ఉంటుంది. వీనులకు విందై, హృదయములను పవిత్ర పరచగలదు. అది నీ ప్రశ్నకు సమాధానంగా చెపుతాను. విను.

❖❖❖

3. సురఘు - పరిఘు సంవాదము

శ్రీవసిష్ఠ మహర్షి : పారశీక దేశాధిపతి 'పరిఘ' అనునాతడు మన సురఘు రాజుకు చిన్ననాటి స్నేహితుడు. ఒకప్పుడు పారశీక దేశంలో అనావృష్టి సంభవించింది. అక్కడి ప్రజలు అనేకమంది ఆకలి బాధకు తాళలేక మరణించటం జరిగింది. అది చూచి పరిఘురాజు తట్టుకోలేకపోయాడు. 'అయ్యో! నా ప్రజల కష్టమును తొలగించ లేకపోయానే! ఇక నేను రాజుగా అనర్హుడను' అని తలచాడు. బహుదూరపు బాటసారి ఒక చోట మార్గమధ్యంలో తగలబడుచున్న గ్రామం చూచి కూడా తన దీర్ఘ ప్రయాణం కొనసాగించునట్లు ఆతడు ఆ రాజ్యమును త్యజించి అక్కడి నుండి బయలుదేరాడు. విరాగి అయి, అరణ్యంలోని ఒకానొక ఏకాంత ప్రదేశంలోని ఒక గృహంలో ప్రవేశించాడు. అక్కడ తపస్సు చేయటం ప్రారంభించాడు. శాంతిని, ఇంద్రియదమమును ఆశ్రయించి

చాలా కాలం తపస్సును కొనసాగించాడు. ఆ దీర్ఘకాలంలో అక్కడ గల ఒక వృక్షము నుండి తమకు తాముగా వ్రాలిన ఆకులను తింటూ ఉండేవాడు. అక్కడికి కొంతదూరంలో ఉంటున్న ఆటవిక గ్రామ జనులు ఆకులు తింటూ తపస్సు చేసే ఆతనికి 'పర్ణాదుడు' అను పేరు పెట్టి చెప్పుకునేవారు.

అనేక సంవత్సరములు ఏకాగ్రతతో తపస్సు చేయటంచేత, సమాధిని అభ్యసించటం చేత ఈశ్వరానుగ్రహం ఆతనిపై ప్రసరించింది. చిత్తము శుద్ధి పొంది ఆతడు రాజర్షి అయ్యాడు. క్రమ క్రమంగా జ్ఞానయుక్తుడై, సద్బుద్ధియుతుడై, శీతోష్ణాది ద్వంద్వరహితుడై, ఆశావర్జితుడై, శాంతచిత్తుడై, రాగ, ద్వేష, క్రోధరహితుడై జీవన్ముక్తుడుగా ప్రసిద్ధికెక్కాడు.

ఆ విధంగా తపస్సు యొక్క ప్రభావంచే పరమ పవిత్రమైన మనస్సును సంపాదించుకొన్న ఆ పరిఘుడు కొన్నాళ్ళ తరువాత లోకసంచారం చేయటానికి బయలుదేరాడు. ఒకసారి కాకతాళీయంగా సురఘుడు రాజ్యమేలుతున్న కిరాత రాజ్యం ప్రవేశించాడు. చిన్ననాటి పరిచయం చేత సురఘుని కలిశాడు. జీవన్ముక్తులు అయిన ఆ ఇద్దరూ ఏం సంభాషించుకున్నారో శ్రద్ధగా విను.

❖

సురఘురాజు : మిత్రమా! బహుకాలం తరువాత కలిశాం. మీరు ఆకులు మాత్రమే తింటూ తపస్సు చేస్తూ ఉంటారని వింటూనే ఉన్నాను. జనులు 'పర్ణాదముని' అను పేరుతో మీ సుదీర్ఘ ఏకాగ్ర తపస్సు గురించి కథలుగా చెప్పుకుంటున్నారు. పరమపవిత్రమగు సుకృతం చేతనే మీరు ఇక్కడికి రావటం, నేను మీ సమక్షమును ఆస్వాదించటం జరుగుతోంది. మీ సందర్శనముచే చిత్తము పరమానందభరితమౌతోంది. మనస్సు శీతలత్వం పొందుతోంది. వియోగం ప్రేమను ద్విగుణీకృతం చేస్తుందని పెద్దలు అంటారు. మన చిన్ననాటి సంభాషణలు లీలలు, చేష్టలు స్మరించు కుంటుంటే గొప్ప వినోదంగా ఉంటుంది.

పర్ణాదుడు : మిత్రమా! మాండవ్య మహర్షి కృప చేత మీరు ఆత్మజ్ఞానం పొందారని నేను కూడా విన్నాను. నేను తపస్సుచే ఈశ్వరుని ఆరాధించి ఆయన కృపచే ఆత్మజ్ఞానం పొందాను.

సరే! మీరిప్పుడు దుఃఖరహితుడవై పరమకారణమగు బ్రహ్మము నందు విశ్రాంతిని పొందారు కదా? ఆత్మారాముడవగుటచేత మీ చిత్తముతో ప్రసన్నత్వం ఉదయించిందా? ప్రసన్న గంభీరములతో కూడిన సమదృష్టిచే సర్వజనహితంగా రాజ్యపాలన చేస్తున్నారు కదా? మీ రాజ్యంలో ప్రజలు ధన ధాన్య సంపన్నులై, శారీరక,మానసిక బాధలు లేకుండా సంతాపవర్జితులై జీవిస్తున్నారు కదా? ప్రజలు ఎట్లా కోరుకుంటారో అట్లే పాలన జరుగుతోంది కదా? ధర్మరక్షణలో అధర్మశిక్షణలో మీ యశస్సు అన్ని వైపులా విస్తరిస్తోందా? ధాన్యం కళ్లెంలో పని చేసేవారు మీ యశస్సు గురించి ఆనందంగా పాటల రూపంలో పాడుకుంటున్నారా? మీ ధన-ధాన్య-ఐశ్వర్య-భృత్య-కుటుంబ-పుత్ర -నగరాదులు క్షేమంగా ఉన్నాయి కదా? మీ ఈ భౌతిక శరీరం మానసిక వ్యధారహితమై ఇహ-పర లోకము లందు ఉత్తమ ఫలములను ప్రసాదించ గల పుణ్యకార్యము లందు నియోగించబడుతోంది కదా? ఈ విషయములు అనేవి అమాయక జీవులకు రమణీయంగా తోచుచూ, అజ్ఞాన క్రియలచే

చివరికి శత్రువులుగా పరిణమిస్తున్నాయి. అట్టి విష సర్పములను నిరోధించటానికి మీరు "వైరాగ్యం" అనే గరుడ మంత్రం మననం చేస్తున్నారు కదా?

ఆహా! మిత్రమా! మనిద్దరం చాలాకాలం వియోగం అనుభవించాం. కాలవశం చేత ఈ రోజు కలుసుకున్నాం. ఈ శరీరధారులగు జీవులకు ప్రతిరోజూ ఇష్ట-అనిష్టములు, సంయోగ-వియోగములు, సుఖ-దుఃఖములు కలుగుతూ ఉంటాయి. నా ప్రియ స్నేహితులైన మిమ్ము కలవటం ప్రీతికరం అయిన విషయం. ఈ దీర్ఘజీవదశలో ఎన్నడో విడిపోయి ఈ రోజు కలిశాం. ప్రాణుల కర్మానుసారంగా నడచే ఈశ్వరేచ్ఛ యొక్క విలాసం ఎంత చిత్రమైనది!

సురఘు : ఔను మిత్రమా! ఈశ్వరేచ్ఛారూపమగు నియతియొక్క ఆశ్చర్యకరమైన'గతి'ని ఎవరు ఎరుగగలరు? మనిద్దరం ఎంతోకాలం ఎక్కడెక్కడో ఉండి ఇప్పుడు కలుసుకున్నాం. ఈశ్వరేచ్ఛే ఈ రోజు మనిద్దరినీ కలిపింది. నాకైతే ఇప్పుడెంతో సంతోషంగా ఉన్నదయ్యా! మిమ్ము చూచుట చేత పాపము క్షయించగా పుణ్య వృక్షం ఫలిస్తోంది. నేను వ్యాకులరహితుడను కృతకృత్యుడను అయ్యాను. మీ రాకచే మా నగరం, మా ప్రజలు పరమ పవిత్రమగుచున్నాము.

"మహాత్ములతో సమాగమం మోక్షముతో సమానం" అని పెద్దలు అంటారు కదా! ఇప్పుడు ఆత్మానుభవం విషయంలో మీ నుంచి కొన్ని విశేషాలు వినాలనుకుంటున్నాను.

❖❖❖

4. సమాధి - సమాహిత చిత్తము

పరిఘముని : నాకూ మీ నుంచి వినాలని ఉన్నది. ఈ సంసారజాలము నందు ఏఏ క్రియలు నిర్వర్తించబడుచున్నాయో... అవన్నీ కూడా సమాహిత చిత్తునకు మాత్రమే సుఖప్రదమౌతున్నాయి. తదితరులంతా అనుక్షణికమైన సుఖదుఃఖ భావపరంపరలచే తాడనం పొందుచున్నారు. సాంసారిక విషయములలో ఎక్కడో ఏదో సుఖం ఉన్నట్లు మినుకుమినుకుమంటూ భ్రమ కలుగజేస్తోంది. అసలు సంకల్పములే లేకపోయాయా .. సమాధి సుఖం లభిస్తుంది. అట్టి పరమ శాంతిమయమగు సమాధి సుఖం ముందు ఈ సాంసారిక సుఖములు ఎంతటి అల్పమైనవి! జ్ఞాని అయినవానికి సమాహిత చిత్తం అవసరం. సమాహితచిత్తం సంపాదించటానికి సమాధి అనుష్ఠానం తప్పితే వేరే మార్గమేముంటుంది? కనుక ఈ సాంసారిక విశేషములను త్యజించి మనస్సుతో వ్యవహార రహిత సమాధిని మీరు దినచర్యలో కొంత సమయం కేటాయించి అనుష్ఠించుచున్నారు కదా!

సురఘురాజు : అదేమిటి మిత్రమా... అట్లా అడుగుచున్నారు? "సంకల్పవర్జితము - శాంతియుతము - శ్రేష్ఠము - శ్రేయోదాయకము - అయినట్టి పరమానందమును అనుభవిస్తున్నావా?" అని అడగకుండా, "మనస్సుతో మధ్యమధ్యలో వ్యవహారరహిత సమాధిని అనుష్ఠిస్తున్నావా?" అని అడుగు చున్నారే! ఎందుకంటే జ్ఞాని వ్యవహారములలో ఉండవచ్చు. ఉండకపోవచ్చు. ఏది ఏమైనా కూడా అసమాహిత చిత్తుడై ఉంటాడా? ఉండడు కదా! అసమాహిత చిత్తుడైనవాడు జ్ఞానియే కాదు కదా!

జ్ఞాన సహితులైనవారు నిత్య ప్రబుద్ధ చిత్తులై ఉంటారు. వారు ఈ ప్రాపంచిక క్రియలు నిర్వర్తిస్తూ ఉండవలసి వచ్చినప్పటికీ సదా ఏకత్వనిష్ఠులై ఉంటారు. అనగా, ఆత్మనిష్ఠులై ఉంటారు. అట్టి ఏకత్వ నిష్ఠయే వారి సమాధి. వారు వేరుగా అవశ్యమైన భౌతికసమాధిని ఆశ్రయించవలసిన పనేముంటుంది?

పరిఘమని : జ్ఞానమంటే ఏమిటి? సమాధి ఎప్పుడవసరం?

సురఘు : జ్ఞానము – సమాధి యొక్క అభ్యాసము గురించి నా మరికొన్ని అభిప్రాయములు వివరిస్తాను. వినండి. ఒకడు ప్రపంచమునంతా త్యజించి ఒక ఏకాంత ప్రదేశమునకు వెళ్ళి, అక్కడ పద్మాసనం వేసుకుని "బ్రహ్మాంజలి" ని సమర్పిస్తున్నాడనుకోండి. ఆతని చిత్తం ఆత్మ స్వభావమునందు విశ్రాంతి పొందకపోతే, ఇక, ఆతని సమాధి ఎట్టిది? ఆతని స్థితి సమాధి అని ఎట్లా అనిపించు కుంటుంది చెప్పండి?

అందుచేత 'ఆత్మతత్త్వబోధ' అనే అగ్నిచే సమస్త ఆశలు అనే గడ్డిపరకలు ఆహుతి అవటమే సమాధికాని, ప్రపంచం పట్ల తూష్ణీభావం కలిగి, ఇంద్రియములకు పని చెప్పనంతమాత్రం చేత అది సమాధి అని అనిపించుకుంటుందా? ఏకాగ్రము నిత్యతృప్తము, అబాధితము అయిన ఆత్మ వస్తువును దర్శించటమే సమాధి. అట్టి సత్యవస్తు అవలోకనమే పరాప్రజ్ఞ. అట్టి ప్రజ్ఞయే పరాకాష్ఠ.

ఎవ్వడైతే క్షోభ, అహంకార రహితుడై ద్వంద్వములలో తగులుకోకుండా ఒక కొండలాగా స్థిరమైన ఆకృతి కలిగి ఉంటాడో అట్టివాడే సమాధి స్థితుడు. అట్టివాడు నిశ్చింతను స్వభావపూర్వకంగా కలిగి ఉంటాడు. ఆతడు పొందవలసినది పొందినట్లే. ఆతనికిక త్యజించవలసినది గాని, స్వీకరించ వలసినదిగాని, ప్రాప్తించినదిగాని, ప్రాప్తించనిదిగాని ఉండవు. పరిపూర్ణ మనోగతుడై ఉంటాడు.

అట్టి జ్ఞానయుక్త మనస్కునకు నిరంతర సమాధి సిద్ధించినట్లే! పిల్లలు వ్రేళ్ళతో పట్టుకున్న దారం కొంచం గట్టిగా లాగగానే తెగుతుంది. సమగ్రము జ్ఞానయుతము అగు అవగాహన లేకుండా కేవలం మనస్సును బలవంతంగా భౌతికమైన సమాధిలో కూర్చోబెడితే, అది ఎప్పుడో విచ్ఛిన్నం అవుతుంది. జ్ఞాని యొక్క సమాధి విచ్ఛిన్నం కాదు. ప్రాపంచిక విషయములతో వ్యవహరించ వలసి వచ్చినప్పటికీ ఆతని సమాధి (లేక) సమాహిత చిత్తము యథాతథంగానే ఉంటుంది.

సూర్యుడు రోజంతా లోకములను ప్రకాశింపజేస్తున్నాడు. ఆ సమయంలో ఏమైనా విరామం కోరుకుంటున్నాడా? లేదు. దృఢ సంస్కారబలంచేత జ్ఞాని యొక్క బుద్ధి కూడా ఆత్మతత్త్వావలోకనంలో ప్రవేశించి, ఇక మరింకెక్కడో విశ్రాంతి విరామములను కోరుకోదు. జలం ప్రవహిస్తూ ఉండగా ఒక్కక్షణమైనా ఆగుతుందా? ఆవరణ నాశనముచే విజ్ఞాన దృష్టి (లేక, బోధ స్థితి లేక ఆత్మజ్ఞానం) ఏర్పడే వరకు జ్ఞానమార్గంలో పయనించేవాడు ఆగడు.

న విస్మరత్యవిరతం యథా కాలః కలాగతిమ్ ।
న విస్మరత్యవిరతం స్వాత్మానం ప్రాజ్ఞధీస్తథా ॥ (శ్లో 16, సర్గ 62)

కాలము తనయొక్క 'గతి' అను కళను వీడనట్లు, జ్ఞాని యొక్క బుద్ధి ప్రేమాస్పదమగు ఆత్మను ఎన్నటికినీ మరువదు. నడిచేటప్పుడు కాళ్ళకదలిక ఆపనట్లు ఆతని బుద్ధి నిశ్చయస్వరూపమగు

చిన్మాత్రమును ఏమరువదు. మిత్రమా! ఆవరణము నశించగానే చైతన్యస్ఫూర్తి విషయరహితమౌతుంది. ఆ చైతన్యస్ఫూర్తి ఇక ఎల్లప్పుడూ ఆత్మాకారవృత్తి కలిగి ఉంటుంది.

ఏ పదార్థమైనా 'సత్త' లేకుండా ఉంటుందా? జ్ఞానికి "ఆత్మాకార వర్జితమగు సమయం" అంటూ ఏదీ ఉండదు. "నేను లేను. కానీ ఈ పదార్థములు ఉన్నాయి" అన్న ప్రసక్తి ఎక్కడన్నా ఉంటుందా? "సద్గుణవంతుని నీచపనులు" అనునది ఉండదు కదా! నీచపనులు చేసేవాడు సద్గుణ వంతుడెలా అవుతాడు?

ఆత్మజ్ఞానికి ఆత్మను ఉపాసించని సమయమంటూ ఏదీ ఉండదు. ఆతని ఆత్మోపాసన అనుక్షణికం. పరిస్థితులు ఎల్లా ఉన్నా అవి ఆత్మజ్ఞానిని స్పృశించలేవు.

సర్వదా స్వస్వరూపముచే నేను ఆత్మనే. కనుక నిర్మలుడనై శాంతాత్ముడనై ఉన్నాను. అనగా సమాధి నిష్ఠుడనై ఉన్నట్లే. ఏద్దానితోనూ ఏ భేదమూ నాకు కనిపించుటలేదు. నా సత్త ఎల్లప్పుడూ ఆత్మయందే, అఖండమగు ఆత్మగానే సిద్ధిస్తోంది. నాసత్త యొక్క ఒక కళమాత్రమే ఈ మనస్సు.

మనస్సు ఉన్నదంటే సమాధిరాహిత్యం ఉన్నట్లే. అందుచేత 'మనస్సుతో సమాధిని అభ్యసించటం' అనేది ఎక్కడుంటుంది? మనస్సుకు స్వకీయమైన ఉనికి-రూప-గుణములు ఎక్కడున్నాయి.

మనస్సుకు సమాధినిష్ఠ కలగటమనేదే ఉండదు... సర్వదా నిత్యమగు ఆత్మతత్త్వమొక్కటే ఉన్నది... ఆత్మ ఒక్కటే సర్వవ్యాపకమై సర్వరూపములుగా ప్రసరించుచున్నది... ఆ అఖండ, అప్రమేయ ఆత్మయే నేను... ఆత్మకు వేరుగా 'మనస్సు' అనబడేదేదీ లేదు.

ఇక నాకు సమాధి ఏమిటి? అసమాధి ఏమిటి? మనస్సు ఏమిటి? దానిని నియోగించట మేమిటి? నియోగించలేకపోవటమేమిటి?... నా దృష్టిలో మనోబుద్ధులనబడేవి ఉండుటయే లేదు.

కార్య కారణ పరిణామ విభాగరహితులగు మహాత్ములు నిత్యం సర్వస్థితు లందు సమాహితత్వం కలిగి ఉండగలుగుచున్నారు. ఇక అక్కడ సమాధి, అసమాధి భేదములను కల్పించే వాక్యములకు చోటు ఉండటం లేదు.

నిర్మోహమాటమైన నా అభిప్రాయం మరొక్కసారి వినండి. సర్వభేదములు చేరలేని ఆత్మయే నా స్వరూపం, స్వభావం, స్వస్థానం కూడా! నేను ఇప్పుడూ, అప్పుడూ, ఎప్పుడూ ఉపాధి రహితుడనే, ఇక, నేను-నీవు-మనస్సు మొదలైనదంతా నా చిత్కళయే.

❖❖❖

5. సునిశ్చయం

పరిఘ మునీంద్రుడు : ఓ నేస్తం! మీరు నిజంగా జ్ఞానవంతులే! పరమమగు బ్రహ్మపదమును పొందారు. తత్ఫలితంగా పూర్ణచంద్రుని వలె శీతలాంతఃకరణము కలిగి వెలుగొందుచున్నారు. మధుర రసపూర్ణులై 'ఆనందము' అనే సంపదచే సేవించబడుచున్నారు. శీతల, లేత, సుందర కమలము

వలె విరాజిల్లుచున్నారు. మీ పలుకులు నిర్మలంగా, విశాలంగా, పూర్ణంగా గంభీరప్రకటాశయ యుక్తంగా ప్రభవిస్తున్నాయి.

ఆహా! స్నేహితుడా! మీరిప్పుడు స్వచ్ఛంగా ఆనందపూర్ణంగా, అహంకారమేఘరహితంగా, ప్రత్యక్షంగా, విశాలంగా, గంభీరంగా, ఉండే శరత్కాల ఆకాశంలాగా విరాజిల్లుచున్నారు. ఇష్ట, అనిష్ట సర్వవిషయములందు సమరూపులై కన్పట్టుచున్నారు.

సారాసార పరిచ్ఛేద పారగస్త్వం మహాధియా ।
జానాసి సర్వమేవేదం యథాస్థిత మఖణ్డితమ్ ॥ (శ్లో 6, సర్గ 63)

ఉత్తమ బుద్ధిచే సార, అసారములను నిర్ణయించి పారంగతులయ్యారు. "ఈ దృశ్య జగత్తంతా అఖండపూరమై బ్రహ్మముగానే, యథారీతిగా ఉన్నది" – అనునట్టి ఉత్తమోత్తమజ్ఞానం పొందారు.

ఇక్కడ కనబడే ఉత్పత్తి. నాశనముల రహస్యమేమిటో గ్రహించారు.

ఇక్కడి ఆరోహ, అవరోహములచే (ups & downs) ప్రేరితమగుచున్న 'చంచలరాగ దశలు' మీ యందు చోటు చేసుకోలేక పోతున్నాయి. దేని కంటే ఇక ఉత్తమమైన వస్తువు ఈ ప్రపంచం మొత్తంలో ఇంకొకటేదీ లేదో, ఉండబోదో, అట్టి నిజాత్మ వస్తువు పొందినవారై స్వమహిమ యందు పరితృప్తులై ఉన్నారు.

ఆత్మ – పరమాత్మయగు మీ కిదే నమస్కరిస్తున్నాను. మీ అవగాహన విషయమై మరికొంత వినాలని నా అభిలాష.

సురఘురాజు : మునీంద్రా! ఈ దృశ్యప్రపంచ మంతా మిథ్యయే కదా! కనుక మనకిక్కడ గ్రహించ దగ్గ పదార్థ మంటూ ఏదీ లేదు. గ్రహించ వలసినదే లేనప్పుడు, త్యజించ వలసినది మాత్రం ఏముంటుంది?

గ్రహిస్తే కదా... త్యజించేది! "ఇది ఉత్తమము... ఇది తుచ్ఛము" – అను వ్యవహారమంతా కేవలం దేశ కాలముల వలననే సంభవిస్తోంది. విజ్ఞుల అభిప్రాయం ప్రకారం, తుచ్ఛాతుచ్ఛములకు సంబంధించిన నిందా–స్తుతులను త్యజించివేయాలని కదా! దేశ కాలవశం చేత ఇప్పుడు ప్రాముఖ్య మైనది మరొకప్పటికి, ఒక నాటికి తుచ్ఛంగా కనిపిస్తోంది. ఈ విషయం ప్రతి ఒక్క జీవునికి అనుభవమగుచున్న విషయమే.

"అసలు నిందాస్తుతులు ఎందుకు కలుగుచున్నాయి?" అని మనం విచారణ చేస్తే "రాగము చేతనే" అని సమాధానం లభిస్తోంది. రాగము ఎట్లు ఉద్భవిస్తోంది?... ఇచ్ఛ వలననే.

ఇచ్ఛయో? ...అజ్ఞానంలోంచి, అజ్ఞానంచేత బయలుదేరుతోంది. కనుక బుద్ధిమంతుడైనవాడు మహోదారమగు బ్రహ్మపదార్థముచే ఇచ్ఛగించుతాడు. ఇంకదేనినీ కాదు.

ఈ ముల్లోకములందూ గల స్త్రీ–పర్వత–సముద్ర–వనములు, సమస్త ప్రాణులు, పృథివి, పంచ భూతములు – ఇవన్నీ వాస్తవరహితములే. వీటన్నిటి యందు సారమంటూ ఏదీ లేదు.

ఈ పురాతన శూన్యజగత్తునందు ఉన్నదంతా మాంస – అస్థి – కాష్ఠ – మట్టి – శిలామయమైనది మాత్రమే. ఇందులో మనం ఇచ్ఛగించవలసిందీ, వాంఛించవలసిందీ ఏముంటుంది? ఇచ్ఛ నివృత్తి కాగా, రాగద్వేషములు సంక్షయిస్తాయి. ఇంక అనేక మాటలెందుకు? ఎప్పుడైతే ఈ మనస్సు సర్వత్రా రాగద్వేషరహితమై శాంతమై, ఆత్మైకరసమై తన ఆత్మయందు కేవలం పరితృప్తి పొందుతుందో – అదియే ఉత్తమ ప్రతిష్ఠ. అదియే విశ్రాంతి. అదియే సమాధి. అదియే యోగము, జ్ఞానముకూడా.

❖

వారిద్దరు ఒకరినొకరు ఆత్మదృష్టితో సందర్శించుకుంటూ తెల్లవార్లూ సంభాషించుకున్నారు. మరునాడు వారు ఒకరి వద్ద మరొకరు సెలవు తీసుకుని, తమ తమ నియతిని అనుసరించి మార్గ పరాయణులయ్యారు.

❖❖❖

6. కేవలీ తత్త్వధ్యానం

శ్రీవసిష్ఠ మహర్షి : రాఘవా! మాండవ్యుల బోధ, సురఘు, పరిఘు (పర్ణాదముని)ల సంభాషణ విన్నావు కదా! వారి సంభాషణలోని అంతర్లీనగానమును విను. నీవు కూడా అట్టి జ్ఞానముచే ఇక్కడే పరమపదలాభమును సంపాదించు. అందుకొరకై ధీరులగు విజ్ఞులతో కలిసి చక్కగా విచారణ చేయి. ఉత్తమమైన 'సుతీక్ష్ణబుద్ధి'చే హృదయాకాశంనుండి 'అహంకారము' అనే కాలమేఘమును నశింపజేయి. సకలలోకాతీత ప్రాప్తము, ఆనందకరము, నిర్మలము అయిన చిత్తము నీయందు ప్రవేశించుగాక!

సర్వులలో అంతర్హితుడై ఉంటున్న ఆ పరమాత్మ ఒక్కడే ధ్యానయోగ్యుడు! ...అతడే శరణువేడ తగినవాడు! ...ఆతడే మన స్వస్వరూపుడవటంచేత ఆతనిని ఆరాధించటం అత్యంతతేలికైన విషయమే! ...అదే సర్వానంద సంపత్తి స్వరూపం! ...సుప్రసన్నం. చిదాకాశస్వరూపం!

అట్టి పరమాత్మ యందే స్థితి కలిగియుండు. నిత్యము ఆత్మవిచారణ తత్పరుడవై ఉండు. అంతర్ముఖుడవై, సుఖరూపుడవై చిదాస్వాదనపరుడవై ఉండు. అప్పుడిక నీ చిత్తము దుఃఖములచే పీడించబడే ప్రసక్తే ఉండదు. బాహ్యంలో కనబడే వ్యవహారతత్పరత, రాగద్వేషములు, జలము పద్మమును తాకనట్లు నీ అంతఃకరణమును కలుషితం చేయలేవు. నీవు వాటన్నిటికంటే మహత్తర స్వరూపుడవని గ్రహించు. ఏనుగు సింహమును బాధించగలదా? ఉత్తమ జ్ఞానంతో శాంతచిత్తుడవై ఉంటే, ఈ మనస్సు నిన్నేం చేస్తుంది? ఎట్లా బాధిస్తుంది.

నందనవనంలో ముళ్ళ చెట్లు ఉంటాయా? జ్ఞానియొక్క చిత్తములో భోగలంపటం ఉండదు. ఆతడు అనేక దీనదశలను పొందవచ్చుగాక! ఆతని చిత్తం మాత్రం తన విశాలరూపమును త్యజించదు. క్షుద్రమగు విషయ సుఖములను కాంక్షించక, కేవలం ఆత్మ వైపునకే అభిముఖమై ఉంటుంది. ఇక్కడి ఇంద్రియవిషయములకు ఎవడైతే అనురక్తుడై ఉంటాడో, ఆతడే ఇక్కడి జనన–మరణాదులను

చూచి దుఃఖములను పొందుతాడు. ఏ చిత్తమైతే సమస్తమును విచారించి, "ఈ ఇంద్రియాలు, విషయాలు, శరీరాలు, తదితర దృశ్యములు అవిద్యయే! మిథ్యాభ్రాంతియే" – అని ఎరుగుచున్నదో, అద్దానికి ఇక దుఃఖం ఎక్కడినుండి వస్తుంది?

శ్రీరాముడు : మహర్షీ! మనస్సుకు 'కర్తృత్వం (నేను కర్తను)' అనుదోషం తొలగాలంటే ఏం చేయాలి?

శ్రీవసిష్ఠ మహర్షి : రామా! ముందుగా ఈ మనస్సు పొందుచున్న మోహం, భ్రమల గురించి గమనించు. క్రమక్రమంగా అప్రమేయత్వమును అలవరచుకో. చక్కగా ఈ మనస్సు పొందుచున్న భావాభావములను గమనించావా... కర్తృత్వాభిమానం తనంతటతానే తొలగుతుంది. అది నిన్ను స్పృశించనైనా లేదు.

'అవిద్య' అనే చీకటిలో దీపం ఒక్కటే....! అది, "ఈ జగత్తు అవిద్య చేతనే అనుభవమగు చున్నది." అనే ఉత్తమ జ్ఞానం ఉదయించటమే! స్వప్నంలో పులులు, గండు పిల్లులు నిన్ను భయపెడు చున్నాయి అనుకో!... ఆ భయం పోయేదెట్లా? "ఇది స్వప్నం" అని గ్రహించుట చేతనే కదా! అవిద్య కూడా అంతే. 'ఇది అవిద్య' అని గ్రహిస్తే చాలు... అది తొలగిపోతుంది, తొలగిపోయినట్లే!

చేపలు నీళ్ళల్లో ఉన్నప్పటికీ ఆ నీళ్ళు చేపల కళ్ళను స్పృశించలేవు చూచావా! నీవు వ్యవహార పరుడవై ఉన్నప్పటికీ అంతరమున సంసారాసక్తుడవు కావద్దు. కేవలం బ్రహ్మమునందే నిమగ్నమైన బుద్ధిని కలిగి ఉండు. అప్పుడు కర్తృత్వ దోషములు, దుఃఖములు నిన్ను స్పృశించలేవు. ప్రదీప్తమగు చైతన్యమయ ప్రకాశం ప్రసరించుచుండగా అజ్ఞానాంధకారం క్షయించక ఏం చేస్తుంది?

తత్వజ్ఞాని యొక్క బుద్ధి స్వతహాగా పరమానందమును పొంది ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ జీవుడు జ్ఞాన సూర్యునిచే ప్రబోధితుడైనాడా, ఇక మరెప్పుడూ మోహము పొందడు. ఏ రోజులలో హృదయాకాశంలో ఆత్మచిత్భావన విస్తరిస్తుందో ఆ రోజులే జీవసహితములు. అట్టి క్రియలే ఆనంద యుక్తములు. నిరంతరాత్మచింతనచే మోహము తొలగి అంతఃకరణము శీతలత్వం పొందుచున్నది.

తాని మిత్రాణి శాస్త్రాణితాని తాని దినాని చ ।
విరాగోల్లాసవాన్యేభ్య ఆత్మచిత్తోదయః స్ఫుటమ్ ॥ (శ్లో 19, సర్గ 63)

ఎవరివల్లనైతే ఈ చిత్తము వైరాగ్యోల్లాసయుతమై ఆత్మాకారవృత్తిచే అభ్యుదయం పొందుతుందో, అట్టి వారే ఈ జీవునకు నిజమైన మిత్రులు. అట్టి శాస్త్రములే ఆప్తశాస్త్రములు. ఆ రోజులే రోజులు.

ఆత్మ దర్శనము నందు అనాదరణ కలిగి ఉన్న జీవులు దీనులు. ఎందుకంటే వారు ఈ జనన–మరణ చక్రము నందు అనేక దుఃఖములను పొందుచున్నారు.

ఈ జీవుడు అనేక విధములైన ఆశాపాశములచే నిరంతరం బంధింపబడుచున్నాడు. భోగ తృణములను అపేక్షిస్తూ అనేకసార్లు వార్ధక్యముచే కురూపుడగుచున్నాడు. శోకములు, దుఃఖములు పొందుచున్నాడు. దుష్కర్మలచేత, మోహంచేత, రాగం చేత, తృష్ణలచేత ఈడ్వబడుచూ, 'మనస్సు' అనే గృహంలో బంధితుడగుచున్నాడు. పుత్ర, స్త్రీ, బంధువులతో ఏర్పడే 'నావి, నావి' అను దురవగాహన లన్నీ చివరికి అతనికి బంధనములు అవుచున్నాయి. వార్ధక్యము – దుష్కర్మలు ఆతని విశ్రాంతిని

అనుక్షణం దూరం చేస్తున్నాయి. అతడు ఇహ – పరలోకములకు రాకపోకలు సాగిస్తూ అలసిపోయి తీవ్ర మనఃతాపముచే తప్తమగుచున్నాడు. పైకి పచ్చగా కనబడుచున్నాకూడా, అంతఃకరణంలో మాత్రం అతిదీనుడై ఉంటున్నాడు. భూత–భవిష్యత్తుల గురించి అనేక చింతనలతో సతమతమగు చున్నాడు. తన ఇంద్రియములచే తానే పరాజితుడగుచున్నాడు. నిత్యం కామ్యకర్మలచే ఆకర్షితుడ గుచున్నాడు. ఆవిర్భావ – తిరోభావములను మోస్తూ అజ్ఞానమహారణ్యంలో సొమ్మసిల్లి నేల కూలుచు న్నాడు. అనర్థములు – దుఃఖములు – దారిద్ర్యములు మరలమరల పొందుచున్నాడు. కర్మభారములచే శిథిలశరీరములతో ఆక్రందనం చేస్తున్నాడు.

ఎద్దువంటి ఈ జీవుని మనస్సు 'సంసారము' అనే బురదలో కుతిక్కాయ వరకు లేవలేనంతగా చిక్కుకుని ఉన్నది. ఉత్తమ ప్రయత్నముచే జ్ఞానబలం సంపాదించి ఆ మనస్సును బురద నుండి బహిర్గతం చేసినప్పుడు మాత్రమే మానవజన్మకు ప్రయోజనమున్నట్లు.

ఆత్మను దర్శించినప్పుడు మాత్రమే చిత్తము క్షయిస్తుంది. అప్పుడు భ్రమలన్నీ పోతాయి. జ్ఞానముచే ఆత్మ దర్శించబడగలదు. అయితే జ్ఞానం ఎలా లభిస్తుంది? నావికుని వలన నౌకాయానం లభించునట్లు మహానుభావుడగు జ్ఞాని యొక్క సాంగత్యముచే ఈ సంసారసాగరాన్ని దాటటానికి యుక్తి లభిస్తుంది. ఎక్కడ జ్ఞానిలేడో... ఆ ప్రదేశం నివాసయోగ్యమే కాదు. జ్ఞాని యొక్క వచనముల చేత, అభిప్రాయములచేత, భావతరంగాలచేత ఆతడు ఉన్నచోటు పరమ పవిత్రం అవుతుంది. సజ్జనులగు జ్ఞానులవలన ప్రపంచమునకు ప్రశాంతత, జీవులకు విశ్రాంతి లభించగలదు.

❖

కొంచెము వివేకము ఆవిర్భవించినట్టి ధీమంతుడు ఇక నిదురపోకూడదు. ఏది ఏమైనా సరే, మహామోహదాయకము, సంతాపదాయకము అయినట్టి ఈ ప్రపంచము నందు ఆదమరచి ఉండరాదు. ఆత్మలాభం ప్రాప్తించేవరకూ నిరంతరం యత్నశీలుడై ఉండాలి. అంతేకాని, దేహాభి మానంతో మాన–మద–గర్వాదులతో 'జన్మలు' అను బురదలోకి తనను తాను త్రోసివేసుకోరాదు.

కిమిదం కథమాయాతం కింమూలమితి కింక్షయమ్ ।
దేహదుఃఖమితి ప్రాజ్ఞైః ప్రేక్షణీయం ప్రయత్నతః ॥ (శ్లో 36, సర్గ 64)

ఈ దేహమేమిటి? దేహ సంబంధములగు దుఃఖాదులేమిటి? ఇవన్నీ ఎట్లా కలుగుచున్నాయి? వీటికి మూలమేమిటి? ఇవి ఎట్లా తొలగుతాయి? ...బుద్ధిమంతులు ఈ విధమైన ప్రశ్నలకు రావాలి. వచ్చి ప్రయత్నపూర్వకంగా విచారణ చేయాలి.

ఆత్మజ్ఞానులను సమీపించి సమాచారం సేకరించాలి. ఓ మిత్రులారా! శ్రోతలారా! ధనము గాని, మిత్రులుగాని, ఆత్మజ్ఞానమునకు వేరైన శాస్త్రములుగాని అజ్ఞాన సాగరమున నిమగ్నమైన జీవుని ఉద్ధరించగలవని అనుకుంటున్నారా? లేదు.

నిరంతర సహవాసంతో శుద్ధమనస్సును ఆశ్రయించండి. అట్టి శుద్ధమనస్సుతో కొంచెం పరామర్శించి చూడండి. ఈ మాత్రం చేత ఆత్మోద్ధరణ సంభవమగుచుండగా అట్టి ప్రయత్నం

చేయరెందుచేత? అరె! ఉత్తమమగు మానవజన్మచే లభిస్తున్న అనేక అవకాశములను బూడిద చేసుకుంటున్నారే! అది సరికాదు. అభ్యాస, వైరాగ్యములతో యత్నం చేయండి. తత్త్వజ్ఞానం సంపాదించటంలో తాత్సారం చేయవద్దని అందరికీ మనవి చేస్తున్నాను. దురాశచే ఏర్పడే శోక మోహముల విన్యాసమేమిటో గమనిస్తూ కూడా, ఉపేక్షిస్తూ ఉంటే ఎట్లా? అందుచేత ఆదరణపూర్వకంగా ఆత్మోద్ధరణకు నడుం కట్టండి. సన్మార్గంలో అహంకారం నశించేవరకూ విచారణను ఆశ్రయించండి. ఈ దేహమును "మట్టి - కొయ్య - శిల వంటిది"గా చూడటం అభ్యసిస్తూ ఉంటే చాలు... క్రమంగా సర్వదేవేశుడగు ఆ పరమాత్మ గూర్చిన జ్ఞానం లభ్యం కాగలదు. అహంకారం నశిస్తూ ఉండగా, చిద్రూపము ప్రకటితమగుచూ రాగలదు. వెలుగు రాగానే చీకటి ఎక్కడికో వెళ్ళిపోవుచున్నట్లు, అహంకారం నశిస్తూ ఉంటే ఆత్మదర్శనం స్వయంగా సిద్ధించగలదు. అప్పటి నిరతిశయానందంచే ఏర్పడే విశ్రాంత, నిర్వికల్పస్థితియే పరిపూర్ణస్థితి. అందుకు మనం అందరం అర్హులమే. అయ్యది మన స్వస్వరూపస్థితియే అయిఉన్నది కదా! ఇక అనర్హత ఎందుకుంటుంది? ...అందుకు ప్రయత్నించనప్పుడు మానవునికి ఇక జంతువుకు భేదమేమున్నట్లు?

విషయరహితమగు మనస్సుతో సాటివచ్చేదేదీ ఈ మూడు లోకాలలోనూ లేదు. అందు దృశ్యం కొరకై రాగం ఉండటానికి చోటే ఉండదు. కేవలం చిత్ప్రకాశం మాత్రమే అంతటా ఆక్రమించు కొని ఉంటుంది. ఇక నిర్వికల్పసమాధి అయినట్టి తురీయదృష్టి పొందావా... దానితో పోల్చతగినది మరేదీ ఉండదు. దానికదే సాటి. ఆ స్థితిలో విక్షేపములేవీ ఉండవు కనుక సుషుప్తితో పోల్చవచ్చు. అయితే సుషుప్తిలో జడత్వం (ఎరుక లేకపోవటం) ఉంటుంది. అదిమాత్రమే భేదం. ఆ అవస్థ ఆకాశమువలె సర్వవ్యాపకమైనది.

ఒక చోట ఒక కుండ ఉన్నదనుకో! ఆ కుండ పగిలితే కుండలోని ఆకాశం ఏమౌతుంది? మహాకాశంతో ఏకత్వం పొందుతుంది. అయితే, కుండలోని ఆకాశము మహాకాశము నుండి వేరు పడినదెప్పుడు? ఎప్పుడూ లేదు. అట్లాగే ఏ జీవునియందు మనోహంకారాలు తొలగుతాయో, ఆతనికి సర్వపదార్థములలోని అంతరమున ఉన్న పరమసత్యము గోచరించగలదు. ఆ పరమసత్యమే 'తత్'. ఆ తత్‌యే 'త్వమ్'. అదియే నీవు. రామా! అట్టి స్థితి స్వయముగా యోగముచే సిద్ధించగలదు. అది సుషుప్తికి దూరాతి దూరమేమీ కాదు. కానీ సుషుప్తి కానే కాదు. అయితే అది వాక్కుకు అతీతమైనది. అది ఈ జీవునికి హృదయములోనే అనుభూతమగుచున్నది సుమా!

❖

అనుభూతిం వినా తత్త్వం ఖణ్డాదేర్నానుభూయతే ।
అనుభూతిం వినా రూపం నాత్మనశానుభూయతే ॥ (శ్లో 53, సర్గ 64)

అనుభవం అనేది లేకపోతే సామాన్యములైన చక్కెర, పటికబెల్లం మొదలైనవాటి తత్త్వమే గోచరించదు. ఇక ఆత్మానుభవం గురించి వేరుగా చెప్పాలా? 'అనుభవం' అనేది లేకపోతే ఆత్మస్వరూపం కూడా గోచరించదు.

ఈ జగత్తంతా అనంతాత్మ స్వరూపమే. ఇక చిత్తముయొక్క బాహ్యవిషయములంటావా, ఇవన్నీ పరిణామయుతములు. కొంతకాలం గడచిన తరువాత ఇవి ఇట్లా ఉండవు. ఇట్టి దృశ్యమును పట్టుకుని వ్రేళ్ళాడవలసిన పనేమున్నది? అందుచేత రామా! ఈ బాహ్యవిషయములు నీచే శమించి వేయబడుగాక! సర్వత్రా దీప్తమై, బ్రహ్మాది దేవతలకు దేవదేవుడై వెలయుచున్న ఆత్మ నీపట్ల అనుభూతమగుచు, ప్రకటితమగుగాక!

పంచమ భూమికయందు విషయవాసన నశిస్తుంది. ఆరవ భూమికయందు పరమపురుషార్థమగు ఆత్మప్రకాశము ఉదయిస్తుంది.

ఏడవ భూమికలో సమాధి, అసమాధులు ఏకత్వాన్ని సంతరించుకుంటాయి. అట్టి సమత్వ కారణంచేత బ్రహ్మాదులకుకూడా అచింత్యమైనట్టి 'కేవలానందైక స్వరూపం' అను ఆత్మానుభవం శేషిస్తోంది.

❖❖❖

IX. భాస - విలాస సంవాదం

1. అభిమాన త్యాజ్యం

శ్రీవసిష్ఠమహర్షి : ఓ రామచంద్రా! ఆధ్యాత్మికయానం సుమార్గం కావాలంటే అభిమానత్యాజ్యం ఎంతో ఆవశ్యకం సుమా!

శ్రీరాముడు : 'అభిమానం' అంటే తమ ఉద్దేశం?

శ్రీవసిష్ఠమహర్షి : "ఈ ధనము, గృహము, బంధు జనము మొదలైనవి నావి. ఈ శరీరమే నేను" – అని అనుకోవటమే అభిమానం. మనస్సుతో అభిమానమనే మనో విభాగమును జయించి, ఆ మనస్సుతో ఆత్మదర్శనం చేయాలి. అభిమానమును జయించకుండా, దానిని కలిగియుండి ఎంతగా శాస్త్రాలు చదివినా, ఏమి విన్నా... ఏం ప్రయోజనం? చిత్రపటంలోని సూర్యుడు కిరణములను ప్రసరింపజేయగలడా? లేదు కదా! అహమ్, మమ అను భ్రమాత్మకమగు అభిమానం త్యజించకపోతే ఈ జగత్ దుఃఖం అస్తమించదు. అది ఉన్నంత వరకు ఆపత్తులు, వ్యాకులతలు, అజ్ఞాన బీజాంధకారాలు ప్రాప్తిస్తూనే ఉంటాయి. ఈ విషయమే నిరూపిస్తూ ' భాస – విలాస సంవాదం' అనే ఒక ప్రాచీన ఇతిహాసం ఉన్నది. అది వింటే అభిమాన త్యాజ్యము యొక్క ఆవశ్యకత ఏమిటో మరికొంత సుస్పష్టమౌతుంది. చెపుతాను. విను.

❖

సహ్యాపర్వత ప్రాంతం అతి సుందరమై ఒప్పుతూ ఉంటుంది. ఆ పర్వత ప్రాంతంలో మానవ – కిన్నెర – సిద్ధ – విద్యాధర – సాధువులకు నివాసయోగ్యమై, అనేక ప్రదేశాలు ఉన్నాయి. ఆ పర్వత ప్రాంతంలో ఒక చోట అత్రిమహాముని ఆశ్రమమున్నది. ఆ ఆశ్రమానికి కొంచెం దగ్గరలో శుక్రుడు, బృహస్పతి అను పేరు గల ఇద్దరు తాపసులు నివసిస్తూ ఉండేవారు. పేరుచే మాత్రమే గాని, వీరివురు దేవ, దానవ గురువులు కారు. ఆ ఇద్దరూ ఆప్తమిత్రులు. ఇద్దరూ శాస్త్ర విషయాలలోను, తపస్సు, ధ్యాననిష్ఠలందు గొప్పనిష్ణాతులు. వాళ్ళిద్దరికి విలాసుడు, భాసుడు అనే పేరుగల కుమారులు ఉండేవారు. ఆ భాస, విలాసులిద్దరూ చిన్నప్పటి నుండి కలిసి పెరుగుతూ ఏకమనస్కులై, ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. చిన్నప్పటినుండి అక్కడి ఆశ్రమధర్మములైన తపోధ్యానములు కలిసి నిర్వర్తిస్తూ ధ్యానవిషయములు వింటూ తమ తండ్రులకు అత్యంత ప్రీతిపాత్రులై ఉంటూ ఉండేవారు.

కొంతకాలం గడిచింది. భాస, విలాసులు యౌవనంలో ప్రవేశించారు. అంతా కాలముయొక్క మహిమయే కదా! కాలగతిని ఎవరు నిరోధించగలరు? అనుక్షణిక గమనశీలం అగుకాలం మౌనంగా, ఏది ఎట్లున్నా, తాను మాత్రం గతిస్తూ, స్థితి గతులను తన రీతిలో మార్చివేసుకుంటూ పోతుంది కదా! ఆ శుక్ర బృహస్పతులు కొంతకాలానికి వార్ధక్యము పొంది గూటిని విడిచిన పక్షుల వలె

భౌతిక దేహములను త్యజించి స్వర్గస్థులైనారు. తండ్రులు మరణించడంచేత భాస, విలాసులు జలము నుండి పెరికి వేయబడిన కమలద్వయమువలె దీనులు, ఉత్సాహరహితులు, సంతప్త హృదయులు అయ్యారు. తండ్రులకు దహనక్రియలు యథారీతిగా నిర్వర్తించారు. మహాత్ములు లోకరీతిని ఉల్లంఘించరు కదా!

వారిద్దరూ చింతాగ్రస్థులై పెద్ద పెట్టున దుఃఖిస్తూ చేష్టారహితంగా అక్కడక్కడే కొద్దిరోజులు గడిపారు. తమ తండ్రులతో ఏర్పడిన అనుబంధం చేత, వారు విరక్తి, అనురక్తి, వేదనల నుండి ముక్తులు కాలేకపోయారు. ఒక రోజు వారిట్లు సంభాషించుకున్నారు–

భాసుడు : మిత్రమా! చూచావా! మనం తండ్రులను కోల్పోయాము. అయితే శరీరధారులందరికీ ఎప్పటికో అప్పటికి మృత్యువు అనివార్యమే కదా! అయినా వారినుండి వియోగం మనం భరించలేక పోతున్నామే! ఇప్పుడు మనం ఏం చేయాలి? ఆలోచించు.

విలాసుడు : ఔను. తేనెటీగ ఒక పుష్పము వదిలి మరొక పుష్పమును ఆస్వాదించునట్లు ఈ జీవుడు ఆత్మజ్ఞాని కానంతవరకూ, ఒక శరీరమును వదలి మరొక శరీరమును గ్రహిస్తూ ఉంటాడు. కనుక మృత్యువు అనునది అత్యంత సామాన్యమైన దినచర్య వంటిది. ఈ విషయం మన తండ్రుల నుండి మనం అనేకసార్లు విన్నాం. అయినా, మన తండ్రుల నుండి మనకు కలిగిన ఈ వియోగం అత్యంత దుర్భరంగా ఉన్నది. ఎందుచేతనో మరి?

భాసుడు : ఎందుచేతనంటే, మనం ఎన్నో జ్ఞానవిషయాలు విన్నాం కాని, మనకు అనుభవజ్ఞానం లేదు. ఇక్కడ ఎంతకాలంవున్నా, మన మనస్సులు కుదుటపడవేమో!

విలాసుడు : అవును నీవు చెప్పింది నిజం. ఇక ఇక్కడ మనం ఉండటం ఉచితం కాదు. ఉండి చేసే దేమీ లేదు. మనం దేశాటన చేసి లోకాన్ని చూసి అనుభవజ్ఞానం సంపాదిద్దాం.

భాసుడు : మనం వేర్వేరుగా రెండు దిక్కులుగా పోదాం. పదేళ్ళ తర్వాత ఇద్దరం మరల ఇక్కడే కలుద్దాం.

ఇట్లు నిర్ణయించుకొని ఇద్దరూ ఎవరి త్రోవలో వారు అక్కడ నుండి బయలుదేరారు. రోజులు, మాసములు, సంవత్సరములు గడిచిపోయాయి. అనుకున్నట్లుగానే పదేళ్ళ తర్వాత అదే రోజు ఆ ఆశ్రమ ప్రాంతంలో ఒకరినొకరు కలిశారు. ఇట్లు సంభాషించుకున్నారు.

❖❖❖

2. ఏమి క్షేమ సమాచారం?

విలాసుడు : నా ఉత్తమ బంధువగు భాసుడా! స్వాగతం. మన వియోగం తరువాత నీవు ఇంతకాలం ఎక్కడెక్కడ సంచరించావు? నీ తపస్సు ఫలించిందా? బుద్ధి సంతాపరహితం అయినదా? విద్య సఫలీకృతమైనదా? ఆత్మజ్ఞానివైనావా? సర్వదా క్షేమమే కదా?

భాసుడు : మాననీయుడగు విలాసుడా! నీకు నేను కూడా సుస్వాగతం పలుకుచున్నాను. అమ్మయ్య! సౌభాగ్యవశం చేత నిన్ను మరల కలుసుకోగలిగాను. ఇక నా క్షేమ సమాచారాలు ప్రశ్నిస్తున్నావా? ఈ సంసారము ఏర్పడి ఉన్నంతకాలం నాకు క్షేమం కూడానా? అయ్యో నా రాత!

యావన్నాధిగతం జ్ఞేయం యావతీక్ష్ణా న చిత్తభూః ।
యావతీర్ణో న సంసారస్తావన్మే కుశలం కుతః ॥ (శ్లో 10, సర్గ 66)

జ్ఞేయమగు బ్రహ్మమును ఎరుగనంతవరకూ, కామసంకల్పములు నశించనంతవరకూ, సంసార సముద్రం దాటనంతవరకూ ఈ జీవునకు క్షేమమనే మాటెక్కడిది చెప్పు?

గొడ్డలితో వృక్షమును నఱుకునట్లు చిత్తమునుండి పుట్టే ఆశావృక్షమును మరల చిగురించకుండా మొదలంటా నరికినప్పుడే సౌఖ్యమనే మాట. జ్ఞానము కలుగనంతకాలం సమత్వం ఉదయించదు. సమత్వం లేనంతవరకు ఆత్మబోధ హృదయంలో ప్రవేశించదు. ఆత్మబోధ అనే ఔషధం సేవించకపోతే ఈ సంసారము అనే మహమ్మారి మరలమరల రకరకాల రూపాలలో పుట్టుకొస్తూనే ఉంటుంది. ఇక, ఈ శరీరములు పుట్టటం, బాల్యయౌవనవార్ధక్యమరణములు పొందటం, మధ్యేమార్గంలో ఏర్పడి ఉండే బంధు, సంపదల కొరకై రోదన – వేదనలు ఈ విధంగా చర్వితచరణంగా జరిగిపోతూనే ఉంటుంది.

జీవించి ఉన్నంతకాలం ఈ విధంగా అనేక మనోవ్యాకులతలతో కాలం గడచిపోతోంది. ఇక మరణించిన తరువాతనో, పశువు మొదలైన యోనులందు జన్మించి పాపకర్మల ఫలితం అనుభవించ వలసిందే కదా! కాదంటావా, స్వర్గాదులను చేరి పూర్వసంచితమైన పుణ్యకర్మల ఫలితం అనుభవించాలి. నా దృష్టిలో ఈ రెండూకూడా విరసములూ, నీరసప్రాయములే అయి ఉన్నాయి. అదంతా దీర్ఘకాలంగా ఏర్పడి ఉండగల వ్యర్థ ప్రయాసయేనని నా కనిపిస్తోంది. ఒక అనుభవం తరువాత మరొక అనుభవం.... ఈ ప్రయాసకు అంతు ఎక్కడ? విశ్రాంతి ఎక్కడ? శాంతి ఎక్కడ?

❖

అయ్యో! ఈ జీవులు అజ్ఞానభావములు, తృష్ణ అనే సర్పములను ప్రక్కనే ఉంచుకొని విషయ భోగక్రియలందు మరల మరల పొరలుచున్నారే! శుభాశుభముల చేత, న్యూనాధిక దుఃఖముల చేత, అల్పసుఖములచేత అనేక రాత్రింబవళ్ళు గడచిపోతున్నాయి! మిథ్యాక్రియాకారకులగు ఈ జీవులు మిథ్య అయిన క్రియలను, వాటి ఫలములను, దురాశలను, తదనుగుణమైన కర్మలను మరల మరల ఆశ్రయిస్తూ తమ ఆయువును నశింపజేసుకుంటున్నారు. ఈ మనస్సు తన ఉత్పత్తి స్థానమైన పరమాత్మను త్యజించి, వివేకం పోగొట్టుకుని 'ఆసక్తి తృష్ణ' అనే మత్తు పదార్థములను సేవించి, తూలుతూ ఎటో పరుగులు తీయుచున్నది. పిచ్చి అరుపులు అరుస్తోంది. 'అభిలాష' అనే ఒక దుష్టవ్యాధి పొందిన ఈ జీవుడు వ్యర్థంగా పరమ పురుషార్థమును పోగొట్టుకొనుచున్నాడే! మనోచాపల్యం చేత కాబోలు అల్పము, నీరసము అగు విశేషముల వెంట తాను చేసే పరుగులు ఆపలేకపోతున్నాడు.

మిత్రమా! ఇక ఈ దేహం గురించి ఏం చెప్పమంటావు? ఇది నిష్ఫలమగు క్రియలచే నీరసం పొందుతోంది. అల్పత్వము, శ్రమ, రోగము, దౌర్బల్యము ఇందులో దాగిఉన్నాయి. ఎండుటాకులాగా ఎప్పుడు నేలకూలుదామా అని ఎదురుచూస్తోంది. ఈ దేహము యొక్క ముఖము రజో గుణముచే కొట్టబడుచున్నదై, పుత్రకళత్రాదుల దురుసువచనములచే అవమానించబడుచున్నదై, కాంతిని పోగొట్టుకొని ధూసరమగుచున్నది. యౌవనకాలంలో మిసమిసలాడుచున్నప్పటికీ ఆ యౌవనం గడచిపోగానే రసవిహీనమై ఎండుటాకువలె మిగులుతోంది. కాలక్రమేణా శుష్కిస్తోంది. వయసు చెల్లుతున్నకొద్దీ ఈ దేహవృక్షం నుండి ఒక్కొక్క భోగశక్తి నేల రాలుతోంది. ఆ యౌవనపు శోభలూ, ఆ పటాటోపాలూ వార్ధక్యం వచ్చేసరికి ఎక్కడికి పోతాయో?... రోజులు గడుస్తున్న కొద్దీ బ్రతుకు దీనమగుచున్నదే!

ఒక్కసారి ఈ మనస్సును గమనించండి మిత్రమా! ఇది 'భోగములు' అనే విషసర్పములచే పూర్ణమై పైకి పెదవి విప్పలేనట్టి అనేక అంతర్ దుఃఖములను కలిగి ఉంటోంది. ఎందుకో... కారణాలు ఏమిటో ఈ మనస్సుకే తెలియదాయె! చివరికి ఇది 'మోహాంధకారము' అనే నూతిలో బావురు కప్పలాగా మిగిలిపోతోంది. నీచ వస్తువులను, తుచ్ఛవిషయక్రమములను ఆశ్రయించటంలో దీనిని కుక్కలతోను గ్రద్దలతోనూ, పందులతోనూ కూడా పోల్చటానికి వీలులేదు. 'తృష్ణ – అనురాగము' అను వాయువీచికలు ఈ మనస్సు అనే పతాకమును క్షణకాలం కూడా స్థిరత్వం లేకుండా రెపరెపలాడేట్లు చేస్తున్నాయి.

ఈ జీవుడు ఎన్నెన్నో ఆశాపరంపరలు కలిగిఉంటున్నాడు. ఆ ఆశల వెనుక ఏవో ఆశయములు ...ఆ ఆశయములన్నీ దుఃఖములవైపు, అజ్ఞాన భూముల వైపు అనుసంధానం చేయబడి ఉంటున్నాయి. కర్మలు, వాటిచే ప్రయోజనములు, వాటి నుండి ఏవేవో దుఃఖములు, అవి తొలగటానికి మరల కర్మలు... ఈలోగా పాపము, అల్పము అయిన దృష్టులు... ఏమిటిదంతా? అవిశ్రాంతంగా శరీరం తోనూ మనస్సుతోనూ అనేక కర్మవ్యవహారములలో చిక్కుకున్న ఈ జీవునికి శాంతి కరువు అవుతోంది. "ఇవి నేను చేయవలసినవి... ఇది సంపాదించవలసినవి... ఇవి దాచవలసినవి" అనుకుంటూ ఈతడు రోజులు గడుపుచున్నాడు. ఇంతలో శరీరం వార్ధక్యమునకు, రోగములకు గురి అవుతోంది. ఒక అనుకోని క్షణంలో మృత్యువు అనే గ్రద్ద వచ్చి వాలుతోంది. గ్రద్ద కోడిపిల్లను నోటకరుచుకొని పోవునట్లు ఈ శరీరమును నోట కరచుకొని వెళ్ళిపోతోంది. ఈ జీవుని తెలియని లోకాలలో త్రోసివేస్తోంది.

జీవితము అనే దుష్టనది యౌవనోత్సాహాలు అనే తరంగములతో, కామక్రోధములు అనే సుడులతో ఎటువైపుకో ప్రవహిస్తోంది. అట్టి జీవితము అను దానికి కర్త, భోక్త కూడా అయినట్టి ఈ జీవుడు ఆశ నిరాశల మధ్య మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ తనకు తెలియకుండానే ఎచ్చటెచ్చటికో దొర్లింపబడుచున్నాడు. 'ధనము, జనము, బాంధవ్యము, ఇళ్ళు, వాకిళ్ళు' మొదలైన వాటిని చూపించి ఈ జీవితము జీవుని తన వశం చేసుకొని, క్షణకాలం అలరించి చివరికి ఏది ఏమిటో తెలిసే లోపలే దుఃఖమహాసముద్రంలోకి తీసుకొని వెళ్ళి పడవేస్తోంది. ఈ అనంత బంధు మిత్ర సమాగమం,

ఆశాపరంపరలు, కాలక్షేపాలూ ఇవన్నీ జీవునిలో సత్యదృష్టిని కకావికలు చేస్తున్నాయి. కాల సాగరంలోకి పోయి కలిగియున్నవన్నీ కలిసిపోతున్నాయి. ఎక్కడా ఏదీ మిగలటంలేదు. అసలీ తతంగమంతా ఏమిటో, ఎక్కడికో, ఎందుకో, ఎప్పటివరకో, ఎవరు ఎవరికొరకు ఎంతకాలంగా కల్పిస్తున్నారో ఏమాత్రం అర్థం కావటం లేదు. అర్థవంతమైనవనుకున్నవన్నీ అనర్థంగా అయిపోతు న్నాయి. అర్థంతరంగా ఆగిపోతున్నాయి. ఇక ఏమి శాంతి? ఎక్కడి శాంతి? అంతా కూడా అగమ్యగోచరంగా ఉన్నది. "అహో! ఇవన్నీ నా సంపదలు" అనుకున్నవన్నీ క్షణంలో విడచి వెళ్ళు చున్నాయి. లేదా కొద్ది క్షణాల తరువాత ఈ జీవుడే వాటిని విడచి ఎటకో వెళ్ళిపోతున్నాడు.

ఈ జన్మ మృత్యువులు, ఈ చింతలు, ఈ దుష్ట క్రియాచారములు జీవుణ్ణి మలయమారుతంలోని ఎండుగడ్డి పరకలాగా దొర్లించుకుపోతున్నాయే! ఇక్కడి కార్యసముదాయములు చింతలను, ఆర్తులను, ఆందోళనలను కలుగజేయటంచేత ఈ జీవునికి ఒక్కక్షణమైనా విశ్రాంతి ఉన్నదా? లేదు. "ఇది చేశాను, ఇది చేస్తున్నాను, ఇది చేయబోతున్నాను" అను ఒకానొక మానసిక వ్యసనముచే, చింతలచే బంధింపబడిన ఈ జీవుడు 'నావారు – కానివారు' అని తలచుచూ తద్వారా పొందుచున్న రోదన – ఖేదములకు ఎక్కడైనా అంతు ఉన్నదా? అతిచంచలమగు ఈ మనస్సు క్షణంలో వృద్ధి చెందుతోంది. మరొక క్షణంలో ఏవేవో దీనాలాపనలు ప్రారంభిస్తోంది.

చూచావా సోదరా! ఈ విధంగా ఈ జీవుడు దేహాదులందు ఆత్మబుద్ధి కలిగి ఉంటున్నాడు. అనాత్మరూపములగు అనేక దుఃఖములను తనకుతానే సేకరిస్తున్నాడు. దీనత్వం పొందుచున్నాడు. అనేకసార్లు సుఖదుఃఖములచే జరామరణములచే కొట్టబడుచున్నాడు. ఈ జగత్తు నందు పొరలుచున్న ఈ జనులు రసశూన్యులై, ఎండిన ఆకులవలె చివరికి శైథిల్యమును పొందుచున్నారు. అయినా కూడా కుక్క దాలిగుంటలో కునుకులు తీస్తూ ఏమీ తెలియక ఏదీ గమనించనట్లు వారు ముందూ వెనకా చూచుకోకుండా బ్రతికివేస్తూ అనేక దుర్గతులకు ఎర అగుచున్నారు. అట్టి అసంఖ్యాక అమాయక సంసార జీవులలో ఈ నీ బాల్యస్నేహితుడగు ఈ భాసుడు అనబడే నేను కూడా ఒకడిని. ఇంకేం సుఖం? ఏమి శాంతి?

❖❖❖

3. అయితే, ఇప్పుడేం చేయాలి?

విలాసుడు : స్నేహితుడా! ఈ జీవుడు – జీవనములను చాలా చక్కగా విశ్లేషించావు. ఈ సంసార దుఃఖములకు అంతులేని మాట నిజమే. నీవు చెప్పిన విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని మనం కొంచెం విచారణ ప్రారంభిద్దాం.

మనకు కలుగుచున్న బంధములకు హేతువేమిటి? ...చిత్తమే కదా! ఒక పాశము వలె బంధ హేతువగుచున్న ఈ చిత్తమును ఖండింపగలిగామా మరింకేమీ అవసరం లేదు. ఒక చిన్న పిట్ట సముద్రమును దాటలేకపోవచ్చు. కాని గరుడపక్షి సప్తసముద్రాలను కూడా దాటివేయగలదు

కదా! 'వివేకం' అనే బలం సంపాదిస్తే మనకీ సంసారసాగరం చాలా తేలికగా దాటివేసే గోష్పదజలం కాగలదు. ఇదే జగత్తులో దేహాతీతులు, చిన్మాత్రమునందు స్థితిని సంపాదించినవారు కూడా ఉన్నారు. వారు ఒకబాటసారి జనసమూహమును చూస్తున్నట్లు – ఈ శరీరమును తదితర జగత్తును గాంచగలుగుచున్నారు. మనం ఆ మార్గంలో ఎందుకు ప్రయత్నించకూడదు?

ఈ శరీరం అభివృద్ధి చెందవచ్చు. లేదా, సంక్షోభం పొందవచ్చు. శిథిలం కావచ్చు. అయితే ఏం? చిన్మాత్రస్వరూపులం అయినట్టి మనకు వచ్చే లోటేముంటుంది చెప్పు? రథం చెడినంత మాత్రం చేత రథసారథి చెడతాడా? మనస్సు బాగుండవచ్చు. చెడవచ్చు. చైతన్యమునకు ఏమి నష్టం? సముద్ర జలం తరంగముల రూపంలో విస్తరిస్తుందనుకో... ఆ మాత్రానికి సముద్రము యొక్క పూర్ణత్వానికి ఏమి హానియో చెప్పు?

కమలం, జలం కలిసి ఉండవచ్చు. వృక్షం (కొయ్య), జలం కలిసి ఉండవచ్చు. అయినా కూడా కమలము – జలములకు, వృక్షము – జలము ఏమాత్రం సంబంధం లేదు కదా! అట్లాగే మనలోని పరమాత్మ స్వరూపమునకు, ఈ భోగములకూ ఏ మాత్రమైనా సంబంధం ఉన్నదా? లేదు. సముద్రానికి, అందులోని పర్వతానికి సంబంధం లేనట్లే చైతన్యమునకు బంధహేతువగు సంసారమునకు సంబంధమెక్కడిది?

కనుక నేస్తం! ఆత్మకు ఈ దేహమునకు ఏమాత్రం సంబంధం లేదు. నేను, నీవు ఆత్మస్వరూపులం కాని దేహమాత్రులం కాదే! "నా స్వరూపం ఈ దేహమే" అను దేహాత్మ బుద్ధియే నీవు చెప్పిన అనర్థాలన్నిటికీ కారణం. ఆత్మ, దేహముల పట్ల అజ్ఞానం చేత ఏర్పడుచున్న అభేద బుద్ధి కారణంగా సుఖ దుఃఖాది చిత్తవృత్తులు వృద్ధి చెందుచున్నాయి. ఒక దృష్టాంతం విను. ఒక నది ఉన్నది. ఆ నది యొక్క ఒడ్డున ఒక పెద్ద మఱ్ఱి వృక్షం ఉన్నది. ఆ పెద్ద చెట్టు నదీ జలంలో ప్రతిబింబిస్తోంది. అంత మాత్రంచే ఆ వృక్షానికి నదీజలానికి ఏమైనా సంబంధం ఉన్నదా? అవి రెండూ ఒక్కటే అవుతాయా? లేదు కదా! అట్లాగే ఆత్మ యందు ఈ దేహాదుల ఉనికి ప్రతిబింబిస్తోంది. అయినా కూడా ఆత్మకు దేహమునకు సంబంధం లేదు. ఆత్మయే మనిద్దరి స్వరూపంగానీ ఈ దేహాదులు కాదు కదా! ఈ దేహము, బుది, ఆలోచన, దృశ్యము మొదలైనవి ఆత్మదేహులగు మనం ఉపయోగించే 'ఉపకరణాలు' మాత్రమే కదా!

ఒక దర్పణములో కనబడే, ప్రతిబింబములు సత్యములా? కాదు దర్పణంలో వస్తువు లేదు కదా! పోని అసత్యములా! వస్తువు యొక్క కదలిక ఆ దర్పణంలో కనిపిస్తోంది కదా! "కనబడుతోంది. కాబట్టి అసత్యము" అని అనలేం. అందుచేత "దర్పణంలో కనబడే వస్తుజాలం సత్యం కాదు. అసత్యం కాదు. అనిర్వచనీయం. ఆత్మయందు ప్రతిబింబిస్తున్న ఈ శరీరము, దృశ్యము, అనుభవము, మనస్సు – మొదలైనవన్నీ అనిర్వచనీయం" అని ఆత్మజ్ఞుల అభిప్రాయం. దృశ్యములో ఏది మారినా, మారకున్నా కూడా అది ప్రతిబింబిస్తున్న దర్పణం ఏ మార్పు చేర్పులూ పొందదు కదా! దృశ్యము యొక్క కలిమిలేములచే ద్రష్టలేక, ఆత్మ ఏమీ పొందదు, కోల్పోదు. కొయ్య, శిల, జలము ఛేదించబడి నప్పటికీ దుఃఖములు పొందుచున్నాయా? లేదు. ఈ దేహము కూడా పృథివి మొదలైన పంచభూత

పరిణతియే కదా! దాని సంయోగ వియోగములచే గానీ, అది పునాదిగా కలిగి ఉన్న పుత్ర మిత్రాదులతో ఏర్పడే సంబంధ, బాంధవ్యములచేగానీ హాని, ఆహ్లాదం ఎందుకు ఏర్పడాలి?

భాసుడు : ఔను. ఏర్పడవలసిన పనిలేదు. కానీ మిత్రమా! ఈ సుఖ దుఃఖాలు పరిగెత్తుకుని వచ్చి మీద పడుచున్నాయి కదా!

విలాసుడు : ఒక కట్టెతో సంయోగం (తాడనం) పొందినప్పుడు జలంలో చలనం, శబ్దము మొదలైనవి కలుగుచున్నాయి. అట్లాగే చేతనముతో ఏర్పడిన సామీప్యత చేత జడమగు ఈ దేహము నుండి శబ్దము, చలనము మొదలైన క్రియలు సంభవిస్తున్నాయి. సుఖ దుఃఖాది వృత్తులు, అనుభవములు ఏర్పడుచున్నాయి. అయితే సుఖ-దుఃఖానుభవములు జడశరీరమునకు సంబంధించినవా? జడమైన దానికి అనుభవమే ఉండదు కదా! కనుక అవి శరీరానివి కావు. పోనీ ఆత్మకు సంబంధించినవా? ఆత్మ సర్వదా నిత్యము, నిర్మలము, శుద్ధము, అప్రమేయము కదా! మరి సుఖ దుఃఖములు ఎవరికి, ఎట్లు ఎందుకు కలుగుచున్నాయి?... అజ్ఞానము చేతనే, అజ్ఞానము కలిగియున్న జనులకు కలుగు చున్నాయి. అజ్ఞానం తొలగిన మరుక్షణం సుఖ దుఃఖాదులు ఉండవు. సర్వము చిన్మాత్రము నందు లయించగా, చిన్మాత్రానుభవమే సర్వత్రా గోచరిస్తుంది. అనగా ఈ "దేహం, దేహాన్ని అభిమానించు వాడు" ఇద్దరూ సంయోగముచే ఒకచోట ఒనగూడినా ఇద్దరూ సుఖ-దుఃఖములకు అనర్హులే. మధ్యలో అజ్ఞానం వచ్చి, సుఖ దుఃఖములను ఏర్పరచి ఉంచుతోంది. అజ్ఞానము అనగా? సత్యాసత్యము లను, నిత్యానిత్యములను వివేకదృష్టితో చూడకపోవటమే.

అజ్ఞాని యొక్క దృష్టికి ఈ ప్రపంచము సత్యమైనదానివలె గోచరిస్తోంది. జ్ఞాని యొక్క దృష్టికో, ఇది స్వప్నతుల్యంగా అసత్యంగానే ఉంటోంది. ఇద్దరూ ఇదే ప్రపంచంలో సంచరిస్తూ ఒకే విధంగా కార్యక్రమములు నిర్వర్తిస్తూ, ప్రక్కప్రక్కనే ఉంటున్నా కూడా ... వారిద్దరూ వేరువేరు దృష్టి అవగాహనలు కలిగి ఉంటున్నారు. ఎంత చమత్కారం!

గొడ్డలిలో కాష్ఠము (Wood), లోహము బాహ్య సంయోగంచే కలిసియే ఉంటున్నాయి. ఆ రెండిటికీ అభ్యంతర సంయోగం జరుగుతోందా? ...లేదే! జ్ఞాని ఈ జగత్తులో సంచరిస్తున్నప్పుడు అభిమానశూన్యుడై, ఆసక్తిరహితుడై ఉంటున్నాడు. మనోవృత్తి దృష్ట్యా చూస్తే ఆతనికి సుఖ దుఃఖా దులు కలిగి ఉండవచ్చు గాక! అభ్యంతరంలో (In the inner Recess) తాను ఆయా అనుభవము లన్నిటికీ వేరై ఉంటున్నాడు. మిత్రమా! భాసుడా! మరల ఒకసారి ఒక ప్రకటన చేస్తున్నాను.

జలం జలంలోని ప్రతిబింబమువలె ఆత్మకు, దేహమునకు ఏమాత్రం సంబంధం లేదు.

❖

విషయ రహితమగు శుద్ధ జ్ఞానం అంతటా, అన్నిటా సర్వదా వ్యాపించియున్నది. ఇక ద్వైత భావముచే కళంకితమైన తదితర జ్ఞానం అంటావా? అదంతా సత్యమే కాదు.

భాసుడు : కాకపోవచ్చు. కాని మనకు తదితరజ్ఞానం అనుక్షణికమై సత్యం వలె సంప్రాప్తిస్తోంది కదా!

విలాసుడు : ఎందుచేతనో మనం గ్రహించాలి. బాలుడు "అదిగో! ఆ చీకట్లో పెద్ద దయ్యం ఉన్నది.

నాకు కనిపిస్తోంది" అని తండ్రితో పలికాడనుకో. ఎంతో భయపడుచున్న ఆ బాలునికి ఆ తండ్రి ఏం చెపుతాడు? "బిడ్డా! నీవు పగలు ఆడుకునేటప్పుడు మట్టిచెట్టు చూచావే! అదే ఆ ఆకారం. అక్కడ దయ్యం లేదు, గియ్యం లేదు. నీకేం భయం అక్కర్లేదు" అని చెపుతాడు కదా! ఆ బాలుడు దయ్యం గురించి భావన చేసినట్లు, దుఃఖరహితమగు ఆత్మ తనయందు దుఃఖములకు సంబంధించి భావన చేస్తోంది. ఒకడికి స్వప్నంలో ఎక్కడో ఉన్న, లేదా, ఎప్పుడో గతించిన బంధువులు కనిపిస్తారు. వారితో ఆ స్వప్నంలో ఏర్పడే సమాగమం వాస్తవమా? ...కాదు కదా! ఆత్మకు, దృశ్యమునకు గల సంబంధం కూడా అట్టిదే!

స్థాణువును చూచి 'భూతం' అని అనుకుంటే స్థాణువు భూతం అవుతుందా? కాదు. కానీ ఆ దుష్టభూతము యొక్క అనుభూతిని అమాయక బాలుడు పొందుచున్నాడు. ఆత్మకు విషయములతో సంబంధం లేనప్పటికీ అంతఃకరణము యొక్క నిశ్చయముచే సంబంధం ఏర్పడుతోంది.

❖

కనుక, దేహములకు ఆత్మకు ఏ సంబంధం మనకు తోచుచున్నదో... అదంతా మిథ్యయే. ఒక కొయ్యబొమ్మ నీళ్ళలో పడినంత మాత్రం చేత నీరు ఆ బొమ్మలో ప్రవేశిస్తుందా? అట్లాగే దేహ ధ్యాస లేనట్టి ఆత్మ కూడా దుఃఖములచే బాధించబడదు.

భాసుడు : అంటే అర్థం ఏమిటి? దేహధ్యాస చేతనే దుఃఖము ఉండటం జరుగుతోందనా?

విలాసుడు : అక్షరాలా అంతే. దేహభావన చేతనే ఆత్మ దుఃఖం పొందుతోంది. కాబట్టి దేహాత్మ భావన త్యజించుటచే ఆత్మ ముక్తి నొందగలదని విజ్ఞుల స్పష్టమైన అభిప్రాయం. అదే అనుసరణీయం కూడా!

❖

ఒక తటాకంలో ఉన్నట్టి నాచు, ఆకులు, కాష్ఠము, జలము – పరస్పరం ఒకచోట ఉన్నప్పటికీ, వాటిలో ఒకదానితో మరొక దానికి అంతరంగ సంబంధం లేదు. కనుక అవి ఒకదాని పట్ల మరొకటి దుఃఖరహితంగానే ఉంటాయి. ఈ దేహ–ఇంద్రియ–మనస్సు–ఆత్మలు ఒక్కచోటే ఉన్నప్పటికీ అంతరంగ సంబంధం లేకపోతే దుఃఖరాహిత్యమును పొందగలం.

❖

వృక్షమునకు కారణం బీజమే అయినట్లు, ప్రపంచంలోని సర్వప్రాణులకూ "అంతరంగంలో గల సంగము" ఈ జరా మరణ మోహములకు కారణమగుచున్నది. ఏ జీవుని యందు అంతః సంగము (Attachement inwardly) ఉంటుందో ఆతడు మాత్రమే ఈ సంసార సాగరమున మగ్నుడు అగుచున్నాడు. అంతఃసంగ రహితుడో... సంసార సాగరమును దాటిన వాడగుచున్నాడు. అంతః సంగము గల చిత్తము అనంతశాఖాయుతమై ప్రకటితమౌతోంది. అంతఃసంగము లేని చిత్తము సంగరహితమై తనకు తానే వినష్టమగుచూ అచిత్తముగా, చితస్వరూపంగా పరిణమిస్తోంది.

విషయాసక్తము కాని చిత్తము సంసారమున ఉన్నప్పటికీ ఇబ్బందేం లేదు. అట్టి చిత్తము స్ఫటికమణిలింగమువలె అతి పవిత్రమైనది. అది విముక్తమే అవుతుంది. అట్లా కాకుండా చిత్తము విషయాసక్తమై ఉన్నదా ... అది గొప్పతపస్సు చేస్తున్నదైనా దృఢబంధము కలదిగానే ఉంటుంది.

అన్తఃసక్తం మనో బద్ధం ముక్తం సక్తివివర్జితమ్ ।
అన్తఃసంసక్తిరేవైకం కారణం బన్ధమోక్షయోః ॥ (శ్లో 34, సర్గ 67)

అంతఃసంసక్తియుతమైన మనస్సు బద్ధము. అంతఃసంసక్తిరహితమైన మనస్సు ముక్తము. కనుక, అంతఃసంగమే బంధ మోక్షములకు కారణం.

ఒక నౌక కొన్ని పదార్థములను తీసుకుపోతున్నదనుకో... అందులోని పదార్థములు దోషములు, ఆ నౌక పయనిస్తున్న జలంలోని తత్త్వాదులు వేరు వేరు కదా! ...అంతఃసంగము లేనివానికి కార్యములు ఆచరిస్తున్నప్పటికీ, కర్తృత్వము ఉండదు.

ఒకడు సుఖంగా పట్టు పరుపులపై పరుండికూడా స్వప్నంలో పులి, అరణ్యము మొదలైనవి చూచినప్పుడు అవన్నీ అనుభవించుచున్నవాడే అవుతాడు. కొండమీదనుంచి దూకటం, పులి మీద బడటం వాస్తవం కాకపోయినా, అనుభవంమాత్రం సిద్ధిస్తోంది. అనగా, ఇక్కడ జరుగుచున్నదేమిటి? చిత్తము తాను ఒక అనుభవమునకు కర్త అయినప్పుడు ఇంద్రియములు పని చేయకపోయినా, కర్తృత్వము, భోక్తృత్వము సిద్ధిస్తోందా!

కనుక మనం చిత్తమును అకర్తృత్వమునకు అలవాటు చేయాలి. చిత్తముయొక్క అకర్తృత్వముచే అభిమానరాహిత్యము సిద్ధించగలదు. చిత్తమును సర్వకార్యక్రమములకు అతీతస్థితిలో ప్రస్థానం చేయాలి. అప్పుడు జడపదార్థమాత్రమైన ఈ దేహం మననేం చేయగలదో చెప్పు?

అకర్తయగు మనస్సు - మనం ఈ మనస్సును సక్తత (Attachment) లేనిదానిగా సిద్ధింపజేద్దాం. అది క్రమంగా సర్వక్రియలకు 'నాఽహమ్ కర్తా! (నేను కర్తను కాదు)' అను అభ్యాసం ఆశ్రయిస్తూ ఉండుగాక! అప్పుడు మన మనస్సు అకర్తయే అవుతుంది. కర్తగాని మనస్సు కర్మఫలభోక్తకూడా కాదు. కర్తృత్వ, భోక్తృత్వములు తొలగినప్పుడు 'సంచిత-ప్రారబ్ధ-ఆగామి' కర్మలు స్పృశించజాలవు. అప్పుడది తన యొక్క అధిష్ఠానమగు శుద్ధ చైతన్యముగా శేషించగలదు. తరంగములు శమిస్తే ప్రశాంతజలమే శేషిస్తుంది కదా!

భాసుడు : నీవు చెప్పేదంతా బాగానే ఉన్నది. కానీ, మనస్సు ఎదురుగా ఉన్న వస్తువులను పొందకుండా ఎట్లా ఉంటుంది? ఎదురుగా జగత్తు ఉండగా అకర్తృత్వం, అసంగం ఎట్లా సాధ్యం?

విలాసుడు : ఒకానొకని మనస్సు దూరంగా ఉన్న ఏదో ఉత్సాహభరితమైన దృశ్యమును చూడటంలో లగ్నమై ఉన్నదనుకో... అప్పుడతడు సమీపంలోని శబ్ద, స్పర్శలు గుర్తించలేకపోవటం మనకు అనుభవ మగుచున్న విషయమే కదా! అనగా, దీని అర్థం ఏమిటి? మనస్సు ఎక్కడ లగ్నమైతే అక్కడ అనుభవం ప్రాప్తిస్తోందిగాని, శరీరం ఉన్నచోట కాదు – అని కదా! ఈ చిన్న అనుభవాన్ని ఆసరాగా తీసుకుంటే, "అసంసక్తుడు (Non - Attached) అయినట్టివాడు ఈ ప్రపంచంలో ఏకార్యంచేసినా, లేక జనులను సంహరించినా లిప్తుడు కాడు" – అనే మహత్తరమైన సిద్ధాంతం మనం గ్రహించగలుగుతాం.

సంసక్తి లేని మనుజుడు విక్షేపరహితమైన సుఖమును పొందుతాడు. ఇందులో నాకేం సందేహం లేదు. ఆతడు బాహ్యమున క్రియలు ఆచరించ వచ్చు. లేదా ఆచరించక పోవచ్చు. అట్టి వానికి

కర్తృత్వ, భోక్తృత్వములు ఉండవు. అంతఃసంగము లేని మనస్సు అకర్త. అదియే ముక్తము, శాంతము, ఉక్తము, నిర్లిప్తము కూడా.

❖

ప్రియనేస్తం! సర్వపదార్థముల అంతరమున ఆత్మ ఉన్నది. అట్టి ఆత్మకు బాహ్యంగా పరస్పర సమ్మిళితమైనట్టి పంచకోశములు (అన్నమయ-ప్రాణమయ-మనోమయ-విజ్ఞానమయ-ఆనందమయ కోశాలు) ఇంద్రియార్థాలు (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు), భోగ్య పదార్థాలు గోచరిస్తున్నాయి.

జీవుడు పంచకోశముల సమ్మేళణముచే బాహ్యపదార్థములను ఆశ్రయించటమే సంసారము. ఈ జీవుని స్వరూపం, స్వభావం, ఆనందమయమే అయినప్పటికీ, సంసారమును ఆశ్రయించుటచే ఆత్మానందము నుండి విడివడుచున్నాడు. పూర్ణుడై కూడా అసంపూర్ణానుభవం తెచ్చిపెట్టుకుంటున్నాడు. అట్టి బాహ్యపదార్థ ధ్యానం నిరసించాలంటే ఒక్కటే ఉపాయం, అది "సర్వదుఃఖప్రదమగు అంతరంగ విభాగమును మొదలంటా జయించటమే".

అందుకొరకై మనం ప్రయత్నిద్దాం. నదీజలం సముద్రజలంలో ప్రవేశించినప్పుడు ఆ సముద్ర జలంతో ఏకత్వం పొందుచున్నట్లు ఈ చిత్తము కూడా తనలోని అంతర్‌సంగదోషం త్యజించినప్పుడు ఇప్పటి సంసారదశనుండి విడివడినదై ఇతఃపూర్వపు శాంతరూపమును పొందుచున్నది. ఆకాశమువలె సునిర్మలమైనదా ....ఇక అప్పుడు ముక్తరూపమగు ఆత్మతో ఐక్యమొందుచున్నది.

❖❖❖

4. సంసక్తత - అసంసక్తత

(Attachment - Non Attachment)

భాసుడు : అత్యుత్తమ శ్రేయోభిలాషియగు ఓ సచివుడా! "సంగమే అంతటికీ కారణం" - అనే నీ వాక్యం నా కళ్ళు తెరిపిస్తున్నాయి. అయితే జీవునకు అసలు 'సంగము' అనే బంధం ఎట్లా కలుగుతోంది? మరల, మోక్షం ఎట్లా ఏర్పడగలదు? సంగమును నివారించటమెట్లా?

విలాసుడు : ఈ జీవుడు విచారణ చేయకపోవుటచేతనే అనర్థములన్నీ వచ్చిపడుతున్నాయి. ఆతడు ఎందుకో "ఇది దేహము,ఇది దేహి" - అను విభాగం చేసి విచారణ చేయటానికి ఉపక్రమించటమే లేదు. పైగా, ఇక్కడ ఏర్పడి ఉండే పరస్పరధర్మములు గురించి కొన్ని విపరీత భావాలను పొందుచూ, "ఈ దేహమే నేను, ఆ దేహమే ఆతడు" అను దృష్టిని, విశ్వాసాన్ని కలిగి ఉంటున్నాడు. అదే సంసక్తి. ఆ సంసక్తియే జీవుని బద్ధునిగా చేస్తోంది. మనం దానిని తొలగించుకోవటానికి ఉపక్రమించాలి.

ఇందు తారసపడే ప్రతి శరీరధారీ అనంతాత్మస్వరూపుడే. అట్టి అనంతాత్మ తత్త్వమును దురభ్యాసవశం చేత దేశ-కాల-వస్తు పరిచ్ఛేదమగు సంకుచిత దృష్టితో గాంచుచున్నాం.

భాసుడు : అట్టి దురభ్యాసం ఎట్లా మనకు అలవడింది? దాని యొక్క రూపమేమిటి?

విలాసుడు : అపరిచ్ఛిన్న సుఖస్వరూపమగు ఆత్మను విస్మరించి మనం విషయసుఖము కొరకై ఏర్పడి ఉండే అభ్యంతర సంసక్తి వైపుగా అభిముఖమవుతున్నాం. అట్టి అభిముఖత్వమే బంధానికి కారణమ గుచున్నది. ఇక జీవన్ముక్తుడో, "ఇదంతా కూడా ఆత్మయే కదా! ఇక నేను దేనిని కోరాలి? దేనిని త్యజించాలి? అట్టి శ్రమ నాకు అనవసరం" ...అను అసందిగ్ధమైన (Beyond doubt) అసంగ స్థితిని కలిగి ఉంటున్నాడు.

అసంసక్తుడు -

భాసుడు : అసంసక్తుని మనఃస్థితి, కార్యక్రమములు ఎట్లా ఉంటాయో చెప్పు.

విలాసుడు : ఆతని అవగాహన ఇట్లా ఉంటుంది–

"పరిచ్ఛిన్నమగు అహంకారానికి నేను విషయమే కాదు. నాకు భిన్నంగా ఎక్కడా ఏదీ లేదు. కాబట్టి, మిథ్యారూపములు మాత్రమే అయిన ఈ దేహాదులు ఉండు గాక! ఉండకుండు గాక! నేను మాత్రం వీటన్నిటికీ వేరైన వాడను. సర్వదా అసంగుడను."

అట్టి దృఢ నిశ్చయము కలిగిన అంతఃకరణము గలవాడు ముక్తభాజుడే అవుతాడు. ఆతనికి "అయ్యో! ఈ కర్మలు చేయవలసి వస్తోందే! వీటిని త్యజించాలి కదా" అను కర్మత్యాజ్యాసక్తి ఉండదు. ఫలేచ్ఛ లేకపోవడం చేత కర్మలందు ప్రవేశించడు. కర్మలు సిద్ధించినా, సిద్ధించకపోయినా సమభావము కలిగి ఉంటాడు. హర్షశోకములకు వశుడు కాకుండా ఆత్మ తత్త్వము నందు మాత్రమే నిష్ఠ కలిగి ఉంటాడు.

సర్వకర్మఫలాదీనాం మనసైవ న కర్మణా ।
నిపుణం యః పరిత్యాగీ సోఽసంసక్త ఇతి స్మృతః ॥ (శ్లో 8, సర్గ 68)

నేర్పుతో సర్వకర్మలను ఆయా క్రియలతో కాక మనస్సుతో త్యజించివేసి ఉంటాడు. ఆతని యొక్క ఆత్మజ్ఞాన ప్రభావం చేత సర్వ దుశ్చేష్టలు స్వయంగా, అకృత్రిమంగా అడగి పోతాయి. ఆత్మ శ్రేయస్సు కొరకై శ్రవణ–మననాది సత్క్రియలందు మాత్రమే శ్రద్ధాసక్తులు కలిగి ఉంటాడు.

సంసక్తి - మిత్రమా! భాసా! సంసక్తి వలననే దుఃఖరాశి అంతా విస్తరించి, వేలాది శాఖలుగా ప్రకటితమౌతోంది.

"ఒక గాడిద పెద్ద బరువు మోస్తూ త్రాడుచే ఈడ్వబడటం... ఒక వృక్షం శీత–వాత–తాపాలను మౌనంగా అనుభవిస్తూ కదలక మెదలక ఉండటం... ఒక పురుగు అనేక శరీరబాధలకు లోనగుచున్నప్పటికీ కూడా భూరంధ్రంలో కాలం గడపటం... ఒక పక్షి బాణ, శిలాదుల ప్రహారమునకు భయపడుతూ చెట్టుపై ఉండి ఆకలితో అలమటించటం... ఒక లేడి గడ్డి పరకలు కొరుక్కు తింటూ ఎప్పుడు ఏ కిరాతకుడు బాణం వేస్తాడోనని భయంతో వెనుకకు, ముందుకు బెదురుచూపులు చూడటం... పుణ్య పాపాధికారులగు జనులు పదే పదే అంగములను పోగొట్టుకుంటూ మృగ–క్రిమి–కీటక ఉపాధులను పొందటం, తృణములుగా స్థావరముగా పుట్టి జరామరణ పరంపరలను రుచి చూడటం."

...ఇవన్నీ కూడా సంసక్తి యొక్క ప్రభావం చేత ఏర్పడుచున్న ఫలవిస్తారమే. అది అనేక అనర్థములతో కూడి ఉన్నదై, బయట, లోపల కూడా అనేక పదార్థములవైపుగా విస్తరించి ప్రవర్ధమాన మగుచున్నది. 'సంసారము' అనునది సంసక్తి యొక్క రూపమే.

అయితే ఈ సంసక్తి రెండు రకాలుగా ఉంటూ రెండు వ్యతిరిక్త దిశలలో నియమించబడి ఉంటోంది.

1. వంద్య (ప్రశంసింపతగిన) సంసక్తి - ఇది వందనీయులగు తత్త్వవేత్తలలో ఉండే సంసక్తి. సంసారవర్జితమై, వివేకము చేత, ఆత్మతత్త్వబోధ చేత జనిస్తుంది. దీని ప్రభావం చేతనే శంఖ-చక్ర -గదాధారుడగు విష్ణువు వివిధ క్రియలచే ముల్లోకములనూ పాలిస్తున్నారు. నిరాలంబుడగు సూర్య భగవానుడు ప్రతిరోజూ గగనమార్గంలో యాత్ర సలుపునది ఈ వంద్యసంసక్తి చేతనే. అట్లాగే బ్రహ్మదేవుడు సృష్టికల్పన చేస్తున్నది, మహాకల్పాంతము తరువాత విదేహముక్తి వైపుగా పయనిస్తున్నది ఈ వంద్యసంసక్తి ప్రాభవం చేతనే. దీనిచేతనే విభూతిభూషితుడగు శివుడు 'గౌరి'అను బంధమున ఆసక్తుడై స్వశరీరమున స్థితి కలిగి ఉండి భక్తుల పాలిటి కొంగుబంగారం అగుచున్నారు. దీని ప్రభావం చేతనే బ్రహ్మాండమున సిద్ధలోకములు, తదితర పాతాళలోకములు జరామరణ వర్జితములైన మహర్లోకం, జనోలోకం, తపోలోకం, చరాచర ప్రకృతి రచన, స్థితి కలిగి ఉన్నాయి.

2. వంధ్య (సంకుచితమైన ప్రయోజనం కలిగి ఉండే) సంసక్తి - ఇది అజ్ఞానులలో ఉంటుంది. పరమపురుషార్థ రహితమైనది. ఆత్మతత్త్వ జ్ఞానరహితము. దేహధారులు దేహధారణ వైపుగా ఆకర్షించబడుటకు ఇది కారణం. దీని యొక్క రూపం సంసార దృఢాసక్తియే. గ్రద్ద ఎక్కడో ఆకాశంలో విహరిస్తూ క్రింద ఉన్న మాంసపు ముక్కపై ధ్యాస కలిగి ఉన్నట్లు వంధ్యసంసక్తి వశం చేత మనస్సు నందు వ్యర్థసౌందర్యాభిలాష కలిగి జీవుడు 'భోగములు' అనే లంపటంలో పడుచున్నాడు.

❖

మిత్రమా! భాసుడా! "సంసక్తి" యొక్క ప్రాభవం ఏమని చెప్పమంటావయ్యా! సంసక్తి వశం చేతనే గాలి వీస్తోంది. పంచభూతాలూ స్థితి పొంది ఉంటున్నాయి. ఈ చరాచర జగత్తంతా ప్రవృత్త మౌతోంది. స్వర్గంలో దేవతలు, భూమిపై మనుజులు, పాతాళంలో సర్పములు, అసురులు, మేడి పండులో పురుగులు సంసక్తి చేతనే స్థితి కలిగి ఉండటం జరుగుతోంది. దాని వశం చేతనే జలాశయ తరంగాలలో అసంఖ్యాకమైన ప్రాణికోట్లు ఉత్పన్నమగుచున్నాయి, చస్తున్నాయి ... లేస్తున్నాయి, పడుచున్నాయి. సంసక్తత చేతనే దేశసంచారం తరువాత కూడా నీకు సందేహాలు కలిగి ఉండటం జరుగుతోంది. మత్స్యన్యాయానుసారం బలవంతుడు బలహీనుని బాధించటం, శుష్కప్రతాపాలు జనులు ప్రకటించటం, నక్షత్ర మండలముల ఉదయాస్తమయాలు, చంద్రుని శీతల ప్రకాశం, ఇంద్రాది దేవతల సాంసారిక చర్యలు - అన్నిటికీ మూలం ఆయా జీవుల సంసక్తత వలననే.

నేస్తమా! అంతేకాదు. చిత్ర విచిత్ర వస్తుజాలముతో కూడిన ఈ ఎదురుగా ఉండే దృశ్య జగత్తును చూస్తున్నావు కదా! ఇదంతా వాసనా వశం చేత ఎవ్వరో చిదాకాశమున లిఖించారు. వాసనకి గల మరో పేరు సంసక్తత.

భాసుడు : అవును. ఈ జగత్తు బహుచమత్కారములైన విశేషాలతో కూడుకుని ఉన్నది. ఆసక్తి గల ఎవ్వరో దీనిని రచించారు.

మనఃసజ్జైకరజ్జేణ శూన్యే వ్యోమ్ని జగన్మయమ్ ।
యదిదం రచితం చిత్రం తత్సత్యం న కదాచన ॥ (శ్లో 40, సర్గ 68)

విలాసుడు : శూన్యాకాశంలో మనఃసంసక్తి అనే రంగుతో లిఖించబడిన ఈ జగత్‌చిత్రము సత్యమైనది ఎన్నటికీ కాదు.

భాసుడు : కాదా?

విలాసుడు : కానే కాదు. ఎందుకంటే ఇదంతా సంసక్తత గల జీవునిచే కల్పించబడి, సంసక్తత గల జీవగణముచే పొందబడుచున్నది. తృష్ణయే సంసక్తతకు నాంది.

సంసక్తత బహు ప్రమాదభరితమైనది కూడా అని గ్రహించు. అగ్నిశిఖచే తృణములుగా భక్షింపబడుచున్నట్లు ఆసక్త చిత్తుడు దుఃఖములచే శుష్కించుచు జ్వలించుచున్న నరకాగ్నులకు ఎండుకట్టె వలె అగుచున్నాడు. అనగా నరకాగ్నులన్నీ అట్టి ఆసక్తిసహిత జీవుల చేత, వారి కొరకే జ్వలిస్తున్నాయి. ఆతడు పొందని దుఃఖమంటూ ఎక్కడా ఉండదు. ఈ ప్రపంచంలోని దుఃఖజాలమంతా సక్తచిత్తుని కొరకు విస్తరిస్తూ రారమ్మని ఆహ్వానిస్తోంది. అవిద్య అంటే మరేమో కాదు. మనఃసంగమే అవిద్య. అదియే ఈ భారభూతములగు జరామరణములను కలుగజేసి కాలువ నీళ్ళులాగా విస్తరింపజేస్తోంది.

మనం ఇంతసేపూ చెప్పుకున్నది ఒక్క వాక్యంలో చెప్పాలంటే... అంతర సంసక్తియే అసలైన బంధం. దాని పరిత్యాగమే విమోచనం.

ఆసక్తి రహితమైన మనస్సు అనంతాకాశం వలె ప్రశాంతంగా ఉంటుంది. అట్టి మనస్సు ఉన్నట్లు కనబడుచున్నప్పటికీ లేనిదే కనుక, మనం జ్ఞానదృష్టిని సంపాదించాలి. జ్ఞానముచే విషయ వినాశనం సిద్ధిస్తుంది. విషయ రాహిత్యముచే మనస్సు సంసక్తి రహితంగా ఉంటుంది. సంసక్త రహితమైన మనస్సును సంపాదిస్తే... అదియే ముక్తి. అట్టివాడే ముక్తుడు.

❖❖❖

5. ఆత్మదృష్టి - ఆసక్తి రాహిత్యం

విలాసుడు : కనుక స్నేహితుడా! మనం సర్వదా సర్వ వ్యవహారములు ఆచరించుచున్నప్పటికీ, సర్వులతో కూడి ఉంటున్నప్పటికీ, నిషిద్ధములైన, అనిషిద్ధములైన లౌకిక, శాస్త్రీయ కర్మలను నిర్వర్తించ వలసి వస్తున్నప్పటికీ వివేకవంతులమై ఉండాలి. మనస్సును అసంసక్తమైన దానిగా ఉంచటం అభ్యసించాలి.

భాసుడు : అనగా మనస్సును ఏం చేయాలి?

విలాసుడు : మనం మనస్సును ...సాధ్య–అసాధ్యముల గూర్చిన క్రియలందు గాని, గతించిన సంఘటన (లేక) అనుభవములందు గాని ఉంచవద్దు. అట్లాగే దానిని వర్తమాన పదార్థములందు

గాని, ఆకాశమునందు గాని, దిక్కులందు గాని, వృక్ష జంతు జీవులందు గాని, తదితర ఆధిభౌతిక పదార్థము లందు గాని నిలుపవద్దు. అదే విధంగా, స్త్రీ పుత్రాదులందు గాని, ఇంద్రియవిషయ వృత్తులందు గాని, ఆధ్యాత్మిక వస్తుసముదాయమునందు గాని, భ్రూమధ్యమున గాని, నాశికాగ్రశమునందు గాని, ముఖమునందు గాని, కంటియందు గాని... నియమించవద్దు.

అంతేకాదు. మన మనస్సును అంధకారమునందు గాని, ప్రకాశమునందు గాని, హృదయాకాశమున గాని, జాగ్రత్-స్వప్న-సుషుప్తులందు గాని, సత్వ-రజః-తమో గుణములందు గాని, గుణసమ్మేళనములందు గాని, కార్యవర్గమునందు గాని, కారణమగు అవ్యక్తమునందు గాని, సృష్టి యొక్క ఆదిమధ్యాంతములందు గాని, దగ్గిరలో గాని, దూరంగా గాని, నామరూపాత్మకమగు పదార్థ సమూహములందు గాని, శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములందు గాని, భూతభవిష్యత్ జ్ఞానమునందు గాని, చిరంజీవాది సిద్ధులందు గాని మనం ఆసక్తం చేయరాదని నా సూచన, ప్రతిపాదన కూడా. 'సర్వాసక్తి రాహిత్యం' అంటే అదే.

భాసుడు : బాగానే ఉన్నది కాని, మరి ఈ మనస్సును ఎక్కడ ఉంచాలి. అనుక్షణం ప్రాప్తిస్తున్న క్రియా వ్యవహారముల మాటేమిటి? మనం వీటిని నిర్వర్తించుదామా! వద్దా?

విలాసుడు : మనం బ్రహ్మమున మాత్రమే స్థితికలిగి ఉందాం. సంగరహితులమై బ్రహ్మాభావమును పొందిన తరువాత ఇక ఈ ప్రాప్తించే వ్యవహారములు నిర్వహించవలసి వచ్చినా ఒక్కటే? అక్కర్లేక పోయినా ఒక్కటే. మేఘములకు ఆకాశమునకు సంబంధం లేనట్లు ఆత్మరతులమగు మనకు "ఈ కర్మలు - వాటిని నిర్వర్తించుటచే ఏర్పడే ఫలితములు" మొదలైన విశేషములతో ఏమాత్రము సంబంధం ఉండదు... ఏర్పడదు.

భాసుడు : అంటే మనం బుద్ధికి కూడా సాక్షిత్వం వహించి ఉంటామా?

విలాసుడు : "నేను బుద్ధికి సాక్షిత్వం వహిస్తున్నాను" అను రూపమున ఉండే ప్రయత్నపూర్వక ప్రయాసను కూడా వదలివేద్దాం. శాంతులమై, చిద్ఘనరూపులమై దేదీప్యమానమగు మణి వలె స్వాత్మ యందు స్థితికలిగి ఉందాం. క్రియాఫలేచ్ఛా రహితులమై ఉందాం. నిరంతరాత్మోదయం కలవారల మగుదాం.

సంసక్తి కారణమగు అవిద్యాకామవాసనలకు మనయందు ప్రవేశార్హత ఉండకుండు గాక! ఇక క్రియలంటావా, అవి మనం ఒనర్చుచున్నప్పటికీ వాటి ఫలితములను మనం పొందవద్దు. ప్రారబ్ధం క్షయం అయ్యేవరకూ ఈ దేహం ఉంటే ఉండనీ. దీని యొక్క ఉనికి గాని, లేమి గాని మనకు సంబంధించని విషయాలై ఉండు గాక! ఈ దేహమును, దీనితో ఏర్పడే విశేషాలను ఆత్మదృష్టితోనే చూస్తూ ఉందాం.

❖❖❖

6. ఆత్మారామం

విలాసుడు : మిత్రమా! భాసా! నేను అనేక ప్రదేశాలు సంచరించాను. నాకు విశాలాంతఃకరణులగు కొందరు మహనీయులు తారసపడ్డారు. వారంతా అసంసక్తి సుఖము (The pleasantness of non - attachment or non - relatedness)ను పొందుచూ, ఇదే ప్రపంచమున వ్యవహరిస్తూ కూడా భయ శోక వర్జితులై ఉంటున్నారు. మహాప్రక్షోభం కలిగించగల "ధనం నశించటం, దుర్బలత్వం, అవమానాలు వచ్చి పడటం" మొదలైన సందర్భాలలో కూడా ఏమాత్రం క్షోభను కలిగి ఉండకుండా ఉంటున్నారు. పరమార్థ సుఖముచే అంతఃకరణమునందు పూర్ణులై, ముఖంలో పూర్ణచంద్రశోభ వీడకుండా ప్రశాంతచిత్తులై ఇదంతా దర్శిస్తున్నారు. చిల్లగింజలు నీళ్ళలో వేస్తే నీరు నిర్మలం అయి ప్రకాశిస్తున్నట్లు, ఈ ఉపాధిని ఉపయోగించి సునిర్మలత్వాన్ని సంపాదించి సంచరిస్తున్నారు. విషయాసక్త రహితులు, సంతాపరహితులు, ఉత్తమమనస్సు గలవారు అగు మహనీయులు ఎక్కడుంటారో ఆ పరిసరాలు కూడా పరమ పవిత్రమౌతాయి.

జ్ఞాని నిత్యమూ ఆత్మయందే లీనమై ఉంటాడు. కనుక తదితర సర్వవిషయములూ చలిస్తున్నప్పటికీ తాను మాత్రము సర్వసమయము లందూ స్వస్థుడై ఉంటాడు. బాహ్యంలో కనిపించే సంచలనములు, క్షుభితమైన స్థితి – గతుల విన్యాసములు ఇక అతనిలోనికి ప్రవేశించలేవు.

భాసుడు : అంటే, ఇక్కడ ఉండే ఆయా పరిస్థితులకు ఆతడు స్పందించడంటావా?

విలాసుడు : జలంలో ప్రతిబింబించే సూర్యుడు తరంగముల అస్త వ్యస్తములకు సంక్షుభితమగుచున్నట్లు కనిపించినా కూడా, బింబ స్వరూపుడగు ఆకాశ సూర్యుడు ఆ ప్రతిబింబ సంబంధమైన అస్తవ్యస్తములచే స్పర్శించబడతాడా?

భాసుడు : లేదు. ఎట్లా స్పర్శించబడతాడు? ఆకాశంలో వెలుగుచున్న సూర్యునకు, జలంలో ప్రతి బింబించే ప్రతిబింబమునకు స్పర్శసంబంధం ఏమి ఉంటుంది?

విలాసుడు : బాగా చెప్పావు. తరంగములలోని సూర్య ప్రతిబింబము పొందే చిందరవందరలకు వాస్తవ సూర్యునికి ఏమాత్రం చెందనట్లు, వ్యవహారతత్పరుడు కావలసివచ్చిన జ్ఞానికి ఆ వ్యవహారా లలోని ప్రియాప్రియములు, సఫల విఫలములు, కార్య కారణములు – తనకు సంబంధించనివై ఉంటాయి. వ్యవహార తత్పరుడై ఉంటూనే "నేను నిత్యము, సత్యము, నిష్కళంకము అగు ఆత్మను. ఈ కర్మలు, తత్ఫలములు, సంబంధములు నన్నెట్లా అంటుతాయి?" అనే ప్రజ్ఞను కలిగి ఉంటాడు. ఆతనిని స్పృశించ గలిగేదీ, ఆశ్చర్యపరచ గలిగేదీ, మృత్యువుతో సహా... ఈ భూనభోంతరాళాలలో ఏదీ ఉండదు... ఉండజాలదు. మనం జ్ఞానులం కావటానికి ప్రయత్నించడమే ఉచితం కదా! మనం ప్రబుద్ధులం కావాలి.

భాసుడు : ప్రబుద్ధులు అనగా ఎవరు? ఎట్లా ఉంటారు? సంసారంలో చరించేటప్పుడు వాళ్ళ ప్రవర్తన ఎట్లా ఉంటుంది?

విలాసుడు : జ్ఞానభరితము, నిర్మలము అగు బుద్ధిని సంపాదించినవారిని ప్రబుద్ధులు అనే పేరుతో చెప్పుకుంటున్నాం. అట్టి "ప్రబుద్ధులు ఆత్మోదయ సమన్వితులు" అగు మహనీయులు ఎల్లప్పుడూ ఆత్మ యందే రమిస్తూ ఉంటారు. వారు బాహ్యానికి నెమలి పింఛము యొక్క చివరి భాగంలాగా చంచలంగా ఉండవచ్చు గాక! అంతరమున మాత్రం మేరు పర్వతంలాగా అచంచలంగా ఉంటారు. తెల్లగా ప్రకాశిస్తున్న మణిలో ఎదురుగావున్న ఎఱ్ఱటి వస్తువులు ప్రతిబింబిస్తుంటే, అంతమాత్రం చేత, ఆ ఎఱుపు మణికి అంటుతుందా?

ఆత్మదశ పొందిన చిత్తము సుఖ దుఃఖములచే రంజితం కాదు. కమలం జలంలో ఉన్నప్పటికీ జలం కమలమును అంటదు కదా! ఏ జీవుడైతే జీవేశ్వర తత్త్వమును ఎఱిగి, సచ్చిదానందమగు ఆ పరమాత్మ యందు సంలగ్నమైన చిత్తము కలవాడై ఉంటాడో అట్టివానిని ఈ సంసార విషయాలు, విశేషాలు ఏమాత్రం కలుషితం చెయ్యలేవు. పరమాత్మ జ్ఞానం పొంది, సర్వకల్పనా వర్జితుడై ధ్యానం యొక్క భావ–అభావము లందు కూడా ఆత్మానుభవమగ్నుడై ఉండే వానిని 'ఆత్మారాముడు, స్వసక్తుడు' అని కూడా పిలుస్తూ ఉంటారు. అట్టి వాడు భగవంతుడే అవుతాడు.

భాసుడు : మనం అసంగత్వం పొందేదెట్లా?

విలాసుడు : ఆత్మారాములము (ఆత్మ యందు రమించువారు) అయినప్పుడే ఈ ప్రపంచంతో మనం అసంగత్వం పొందగలుగుతాం. "ఆత్మజ్ఞానోత్కర్ష" చేత మాత్రమే సంసక్తి నశిస్తుంది. దానికి వేరే మరింకో మార్గమేదీ లేదు.

మనం ఈ జాగ్రత్ స్వప్నములలో తోచుచున్న ద్రష్టత్వమునకు కూడా అతీత భావులమవుదాం. భావాతీతమై ఉన్నట్టి మన యొక్క రూపం ద్వంద్వరహితం, నిత్యం, ఆత్మోదయాన్వితం అని శాస్త్రములచే అభివర్ణింపబడింది కదా! మనం శాస్త్రములు సూచిస్తున్న ఆత్మ యొక్క విశేషణముల పట్ల దృఢమైన భావనను ఆశ్రయించి ఉంటే ఆత్మ ప్రకాశరూపులమై వెలుగొందగలం. చంద్రబింబం క్రమంగా తన కళలను త్యజిస్తూ అమావాస్య వచ్చేసరికి తన యొక్క బింబ భూతమగు సూర్యుని యందు ఐక్య మవుతుంది చూచావా? (ఇక్కడ సూర్యుడు బింబంగాను చంద్రునియందు కనబడే ప్రకాశము ప్రతిబింబ వశంగా ఉద్దేశించబడింది).

మనం "నేను నిత్యుడను. ద్వంద్వరహితుడను. ఆత్మయోగాన్వితుడను. జన్మ మృత్యువులకు కూడా సాక్షి మాత్రుడను. ఇవి నా సమక్షంలో జరిగేవి. నేను వీటికి సంబంధించినవాడను కాను. అఖండుడనగు నాకు ఆద్యంతాలు లేవు" అనునట్టి బ్రహ్మాభావమును పొందుదాం.

మన చిత్తము తన చిత్త దశను వదలగా, మనం చిత్తరహితులమౌదాం. సర్వకల్పనా రహితమైనట్టి ప్రశాంత స్థితిని పొందుదాం. "జాగ్రత్ నందు సుషుప్తి" అంటే అదే. అప్పుడు మనం ఎక్కడున్నా ఏం చేస్తున్నా సుఖదుఃఖములు అనే త్రాటిచే బంధించబడం. ఆ విధంగా సర్వాతీతులమైన మనను వేధించ గల, ఆశ్చర్యపరచ గలదేదీ పదునాలుగు లోకాలలో ఉండజాలనప్పుడే మనిద్దరి జన్మలు సార్థకత పొందినట్లు.

భాసుడు : మిత్రమా! ఇంతకీ చిత్తమునకు సంతాపం కలుగజేస్తున్నట్టి అసలైన కారణమేమిటి?

విలాసుడు : ఇష్ట-అనిష్టములు, లాభ-అలాభములకు సంబంధించిన ఆశ-నిరాశలు అనునవి జీవాహంకారమునకు కారణమగుచున్నాయి. జీవాహంకారమే చిత్తమునకు సంతాపం కలుగజేస్తోంది.

భాసుడు : నిజమే! ఐతే ఇప్పుడీ జీవాహంకారం తొలగాలంటే మనం ఏం చేస్తే ఉపాయం?

విలాసుడు : "నేను బ్రహ్మమును. సర్వమును. పూర్ణమును" అనునట్టి ఆత్మదశను మన చిత్తము పొందేట్లు మనం చేయాలి. ఎందుకంటే, అట్లు పొందిన చిత్తమును మరింకేదీ ఏ విధంగానూ బాధించలేదు. ఆత్మశాస్త్రజ్ఞులు అట్టి చిత్తము యొక్క స్థితిని "జాగ్రత్‌సుషుప్తి" అని పిలుస్తూ ఉంటారు. అది నిరహంకృతమైన స్థితి. విజ్ఞుడు అట్టి చిత్తముతో హృదయ నిర్మల లక్ష్యముతో ఆయా కర్మలు (కర్తవ్యములను) నిర్వర్తిస్తూ ఉంటాడు. అయితే, ఆ కర్తవ్యములచే కూడా ఆతడు బంధించబడడు.

మనం కూడా అట్టి జాగ్రత్ సుషుప్త వృత్తిని అవలంబించి, ఆపై ప్రారబ్ధ పరిపాకముచే సంప్రాప్తించే మన వర్ణాశ్రమోచితమైన కర్మలు ఆచరిద్దాం. కానీ దేనినీ ఆచరించని వారుగానే ఉందాం. జ్ఞానులు కర్మగ్రహణం కానీ, కర్మత్యాజ్యం గానీ కోరరు. ప్రారబ్ధానుసారంగా ఏది ఎట్లు ఉచితమో, సందర్భమో అది అంతవరకు ఆచరించుచూ అకర్తవ్య భావమును అవధరిస్తూ ఉంటారు. మన మార్గం కూడా అదియే అగుగాక!

ఇష్టానిష్టముల విషయంలో సుషుప్తబుద్ధి కలిగియుండి మనం కార్యములు ఆచరిద్దాం. అప్పుడు మనం దేనికీ కర్తలం కాము. "అకర్తృత్వ స్వభావం" గ్రహించి ఆపై యథాతథంగా చేయవలసినవి చేద్దాం. చేయగూడనివి మానుదాం. సంకల్ప వికల్పరహితులమై ఉందాం.

మూడు నెలల పసిబిడ్డ ఊయలలో ఊగుతూ ఏ సంకల్పం లేకుండానే నవ్వటం, కేరింతలు కొట్టటం, కాళ్ళు చేతులు విదల్చటం చేస్తుంది చూచావా? మనం కూడా ఫలములను చింతించకుండానే క్రియలు ఆచరిద్దాం. విషయవర్జితులమై, విషయాతీతులమై, చైతన్యపదము నందు సంస్థితులమై ఉండటం అభ్యసిద్దాం.

❖

ఆత్మజ్ఞానం పొందిన తరువాత జీవుడు ఏ కర్మలు నిర్వర్తిస్తాడో... వాటి యందు ఆతడు 'నేను కర్తను' అనే భావం పొందడు. అకర్తృత్వం ఆతనికి స్వభావమే అవుతుంది. చిత్తము నందు వాసనలు లేకపోవటం చేత ఆతని అంతఃకరణము శీతలత్వం పొంది ఉంటుంది. సర్వ అవస్థలందూ సమరూపుడై, పరిపూర్ణుడై మహాతేజస్వి అయి ఉంటాడు. అన్ని ఋతువులలోనూ కొండ ఒకే తీరుగా ఉంటుంది కదా!

వృక్షములు, పచ్చిగరిక మొక్కలు గల పర్వతం గాలి వీస్తున్నప్పుడు ఆకుల కదలికచే కదలుచున్నట్లు కనబడుతుంది. ఆకులు కదలవచ్చునేమో గాని, పర్వతం కదులుతుందా? ధీరాత్ముడు బాహ్యము నందు లౌకికక్రియలచే చంచలము పొందినప్పటికీ అంతరమున అచంచలుడై ఉంటున్నాడు. అట్టి చంచల రహితమైన అంతరంగస్థితి మనం సంపాదించాలి. ఆపై ఈ శరీరములు ఉన్నా, లేకున్నా లేక, మరి ఏదైనా ఎట్లా ఉన్నా మన కేమి నష్టం?

జగత్తు యొక్క రాహిత్యము అనునది మనుజునకు అభ్యాసవశం చేతనే దృఢపడుతుంది. మొట్టమొదట జగత్ రహితమైనట్టి ఒకకానొక సుషుప్తస్థితిని అభ్యసించాలి. అట్టి స్థితి అభ్యాసయోగంచే దృఢపడినప్పుడు దానినే తత్త్వజ్ఞులైన మహాత్ములు 'తురీయ స్థితి' అని పిలుస్తారు. మనం అందుకు ప్రయత్నిద్దాం. సర్వ విఘ్నములనూ దూరీకరించి మహాభ్యుదయం పొందుచూ, జ్ఞానానందమయులమై ఆపై ఈ జగద్రచనను ఒక లీలవలె దర్శించటం అభ్యాసం చేద్దాం. భయ–శోక–ఆయాసములు లేని వారమై, సంసార భ్రమరహితులం అగుచూ, అట్టి తురీయావస్థలో సంస్థితులమై ఇక ఈ సంసారమున మనం పడవద్దు.

భాసుడు : పవిత్రమన 'స్వాత్మ పదవి' ని పొందినవాడు ఇక ఈ జగత్తులో ఏం చేస్తూంటాడు?

విలాసుడు : అట్టి ధీరబుద్ధి కలవాడు ఈ ప్రపంచమును చూచి, అజ్ఞానకారణం చేత ప్రకటిత మగుచున్న ఇందలి జీవుల ఉద్వేగాదులను గమనిస్తూ నవ్వుకుంటున్నాడు. ఒక ఎత్తైన మేడపై చివరి భాగంలో నిలబడి ఉన్నప్పుడు క్రింద రహదారిలో చరించు జనులను, రథాలను చూస్తున్నట్లు ... మనం కూడా దూరంగా ఉంటూ, ఈ సంసార విన్యాసమును దర్శిద్దాం. క్రొత్త ప్రదేశంలోని జన సమూహం లాగా అసంబంధీకులమై గాంచుదాం. బ్రాహ్మీస్థితిని ఆశ్రయించి జాగృత్–స్వప్న–సుషుప్తుల కంటేకూడా అతీతమైన మహదానందమైన స్థితిని పొందుదాం. యోగులు ఆశ్రయించే తురీయమును కూడా అధిగమించి అనిర్వచనీయము, శబ్దములకు అందనిది అగు అఖండ, అప్రమేయ స్వభావులం అవుదాం. తురీయాతీతు లమవుదాం.

❖

పరిగలితసమస్త జన్మపాశః సకల లీనతమోమయాభిమానః ।
పరమరసమయీం ప్రయాతి సత్తాం జలగతసైన్ధవఖణ్డవన్మహాత్మా ॥ (శ్లో 33, సర్గ 70)

అలా తురీయాతీతుడైన వ్యక్తికి తమోగుణాత్మకమగు అభిమానమంతా రహితమవుతుంది. లెక్క లేనన్ని జన్మలకు హేతుభూతములగు వాసనలు సన్నగిల్లు తాయి! కర్మపాశములు తొలగిపోతాయి. నీళ్ళలో పడ్డ ఉప్పులాగా మనస్సు స్వస్వరూపమునందు లయమయి, పరమానందమగు ఆత్మ సత్తను అవధరిస్తుంది! ...అందువలన మనం ఉత్తమ ప్రయత్నం వదలకుందుము గాక!

❖❖❖

7. ఆత్మ అప్రమేయమైనది

శ్రీవసిష్ఠ మహర్షి : చూచావా, రామా! ఆ విధంగా వారిద్దరూ మొట్టమొదట కుశల ప్రశ్నలతో ప్రారంభించి పరమోత్తమగు సన్మార్గమును విచారణ చేశారు. కాలక్రమంగా నిర్మల జ్ఞానం పొంది నిర్మలులయ్యారు. ముక్త స్వరూపులయ్యారు.

కనుక, జీవుడు ఈ జాగ్రత్ స్వప్న సుషుప్తులనబడే అవస్థాత్రయం యొక్క వాస్తవ స్వరూపం చక్కగా విచారిస్తూ ఉండాలి సుమా! వాటిని సాక్షిస్వరూపమగు 'చిన్మాత్రము' నందు సర్వ భావాభావములను లయం చేయాలి. అప్పుడు శేషించేది 'తురీయము' లేక కేవలీపదము.

శ్రీ రాముడు : భాస - విలాసుల సంవాదం వినిపించేటప్పుడు మీరు 'తురీయాతీత స్థితి' అనే పదం వాడారు. అది విదేహమైనదా? సదేహమైనదా? ఆతడు జీవన్ముక్తుడా? ఏ వేద వాక్యం ఆతనికి అన్వయిస్తుంది?

శ్రీవసిష్ఠ మహర్షి : తురీయమునకు ఆవల ఉన్న తురీయాతీత పదం, ఈ విదేహ, సదేహముక్తులకు, వేదవాక్యాలకు విషయమే కాదు. మనుజులకు ఆకాశము విషయమే కాదు కదా! అయితే అన్నీ కూడా ఉపశమించేది అందులోనే. వాయువునకు ఆకాశమే గమ్యస్థానమైనట్లు, విదేహముక్తులకు కూడా ఆ తురీయాతీతమే గమ్యస్థానం. పూర్ణమగు జ్ఞానమును పొందిన జీవుడు ఈ జాగ్రత్-స్వప్న -సుషుప్తులలోని జగత్తును కొంతకాలం క్రీడాపూర్వకంగా గాంచుచూ, ఒకానొకప్పుడు ద్వంద్వాతీతుడై పరమానంద భరితుడై తుర్యాతీతత్త్వము అవధరిస్తున్నాడు.

శ్రీరాముడు : ఈ శరీరం ఆ స్థితిలో ఉంటుందా? ఉండదా?

శ్రీ వసిష్ఠ మహర్షి : ఇట్టి ప్రశ్నకు మనం కొన్నిసార్లు సమాధానం చెప్పుకున్నాం. అయినా మరల సమాధానమిస్తున్నాను. విను.

ఈ దేహం క్షయం పొందినప్పుడు, లేక వృద్ధి పొందినప్పుడు... తదనుగుణంగా జ్ఞానం క్షయం పొందుతుందని గాని, వృద్ధి పొందుతుందని గాని అనుకుంటున్నావా? లేదు. అది భ్రమ మాత్రమే. వృద్ధి క్షయాలు అనేవి శరీరమువే గాని, అవి జ్ఞానమునకు లేదా మనస్సుకు సంబంధించిన ధర్మాలు కావు. మరి ఈ భౌతికదేహం యొక్క వృద్ధి క్షయాల విషయం నీకెందుకు? అందువల్ల ఏం ప్రయోజనం? దేహం ఏ అవస్థలో ఉన్నప్పటికీ నీవు మాత్రం కేవలం ఆత్మబోధ యొక్క స్థిరత్వం గురించే యోచించు, ప్రయత్నించు. ఈ ప్రకృతికి మునుముందుగా నీవు ఎట్లున్నావో.... అట్లే ఉండు.

ఓ రాఘవా! నీవు జ్ఞానివేనయ్యా! ఈ జాగ్రత్-స్వప్న-సుషుప్త అవస్థల గురించి, వీటిచే స్పర్శింపబడజాలని సత్య స్వరూపమగు బ్రహ్మము గురించి నీవు ఎరిగియే ఉన్నావు సుమా!

శ్రీరాముడు : ఎరిగి ఉన్నదానిని పొందవలసి ఉన్నది కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : "సోఽహం - తత్వమ్ - అహమ్ బ్రహ్మాస్మి - జీవోబ్రహ్మేతి నాపరః - సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ - ఆత్మ సత్యం జగత్ మిథ్యా - ఏకమేవా ద్వితీయమ్ బ్రహ్మ" మొదలగు అఖండ వాక్యార్థముల స్వరూపమగు ఆత్మను నీవు పొందియే ఉన్నావు. 'క్రొత్తగా ఆత్మను పొందాలి' అనే మోహమును దూరంగా ఉంచు. ఈ వాక్యములు నేను సర్వ దేహధారులను ఉద్దేశించి చెప్పుచున్నాను. "భౌతిక ధర్మములగు జన్మ, జరా, మృత్యువులను నేను పొందుచున్నాను" అను పేలవమైన భావనను మీరంతా వదలివేయండి. "నేను పూర్ణుడను, అఖండుడను, శాశ్వతుడను, ముక్తుడను" అను రూపము గల దుఃఖరహితమగు మహదైశ్వర్యమును సంపాదించండి. అంధకారం గానీ, మేఘములు గానీ లేనట్టి నిర్మలాకాశంలా శోభించండి. ఇష్టానిష్టములను త్యజించి, శీతలాత్మ ప్రకాశముచే పరిఢవిల్లండి.

❖

శ్రీరాముడు : మనస్సులో నుండి దృశ్యమునకు సంబంధించిన భ్రమలు ఎట్లా తొలగించుకోవటం? అది అంత తేలికైన విషయమా?

శ్రీవసిష్ఠ మహర్షి : మంత్ర ప్రభావం చేత ఆకాశగమన సిద్ధిని పొందిన ఒక యోగి నేలపై నిలబడి ఒక చోటి నుండి ఇంకో చోటికి దూర సుదూర ప్రాంతాలకు నడచి వెళ్ళే శ్రమను కోరుకుంటాడా? లేదు కదా! ఆత్మభావనచే సుసంపన్నమైన నీ మనస్సు నీచ వస్తువులను ఆశ్రయించ వలసిన పనేముంది? ఈ బ్రహ్మాండమంతా దేశ కాల వస్తుపరిచ్ఛేద రహితమగు 'శుద్ధ చిన్మాత్రము'చే పరిపూర్ణమై ఉండగా, "ఈ శరీరాదులు నేను. ఈ ధనము రాజ్యము మొదలైనవి నావి, నా వారు, కాని వారు" అనుకుంటూ భ్రమలకు చోటివ్వవలసిన పనేమున్నదో చెప్పు?

వ్యాపకమగు పరమాత్మకు 'ఆత్మ' అనే పేరు కల్పించుకున్నాం. యథార్థానికి ఆతడు నామ–రూప భేదములకు అతీతము, అత్యంత దూరము అయినవాడు. ఆతనిని మనస్సే సమీపించలేదు. ఇక గుణ, నిర్గుణములు ఎట్లా ఆతనికి వర్తిస్తాయి చెప్పు? నాటకంలో ఒకడు నిర్వర్తిస్తున్న పాత్ర యొక్క లక్షణములు మొదలైనవి ఆ పాత్ర ధరిస్తున్న వ్యక్తి యొక్క వ్యక్తిగత విశేషాలు నిర్వచించి చెప్పగలవా?

ఇక నీకు కనబడుచున్న వేర్వేరు భేదముల మాటేమిటంటావా? సముద్రము అనగా జలమే కదా! జలమునకు 'పెద్ద తరంగాలు చిన్న తరంగాలు' అనే భేదమెక్కడిదయ్యా! అద్దంలో ప్రతిబింబం కనబడుచున్నంత మాత్రం చేత అద్దంలో అద్దమునకు వేరైనదేదో పదార్థం ప్రవేశించిందంటావా? ఇక్కడి వేరువేరు లక్షణ విలక్షణములన్నీ జగన్నాటకాంతర్గత కల్పిత విశేషాలే!

సముద్రమంతా జలమే అయినట్లు, దర్పణంలో కనిపించేదంతా దర్పణమే అయినట్లు ఈ జగదాకారంగా విస్తరించి కనబడేదంతా పరమాత్మకు ఒక్క క్షణం కూడా భిన్నమైనది కాదు. పరమాత్మకు భిన్నమైన జగత్తునందు "దేహములు, అనుబంధములు, నావి, నీవి" అను భావనలకు చోటెక్కడ? అట్లాగే "నేను జీవుడను, అజ్ఞుడను, పాపిని, కర్మబద్ధుడను" అనునదంతా స్వస్వరూపజ్ఞానం లేనప్పుడు ఏర్పడే ప్రేలాపనలు మాత్రమే.

ఈ దేహాదులందు కనిపిస్తున్న నీ వెవడవు? వాటియందు నీకు చెందినదేది? చెందనిదేది? ఈ చెందిన చెందని విషయాల యొక్క తత్త్వమేమిటి? కొంచం యోచిస్తే భ్రమలు వాటంతట అవే తొలగుతాయి.

❖

యథార్థానికి ద్వైతం గాని, దేహాలు గాని లేవు. సూర్యుడున్న చోట అంధకారం పొసగదు కదా! ఆత్మతో "నీవు, నేను, ఆతడు, నీది, నాది, జన్మించుట, చచ్చుట, వృద్ధి, క్షయము" అను వ్యవహారమంతా ఏమాత్రం పొసగదు. ఒకవేళ 'ద్వైతము కలదు' అని ఎవ్వరైనా ప్రతిపాదించినా, ఆ ద్వైతముతో ఆత్మకు సంబంధం లేదు. శీతోష్ణములవలె, చీకటి వెలుగుల వలె అవి రెండూ పరస్పర విరుద్ధములైన విషయాలు. ఒకటి దర్శించుచున్నవానికి రెండవది అగుపించదు. అయితే 'ఉనికి' అనునది స్ఫురించే ప్రతిచోటా జడ చేతనాలు కలసి ఏర్పడి ఉంటాయి. ఆ రెండిటికీ ఒకానొక అవినాభావం ఉంటోంది.

అంతమాత్రం చేత "చిన్మాత్రమగు ఆత్మకు దేహముతోటి తాదాత్మ్యము కలదు" అని ఎవరైనా వాదిస్తారేమో. అటువంటి అభిప్రాయం "దావాగ్నిలో మంచు ముక్క రూపుదిద్దుకుంటోంది" అని అనుకోవడం లాంటిది సుమా! ఒకానొకడు మృగతృష్ణను దూరంగా ఉండి చూస్తున్నాడనుకో... "సూర్యుని తేజస్సు గాలివీచికలపై ప్రసరించినప్పుడు నాకు అట్లు జలతరంగములవలె భ్రమచేత అనిపిస్తోంది" అను జ్ఞానము యొక్క ప్రభావం చేత "అక్కడ తటాకం ఉన్నది" అను భావము నశిస్తుంది కదా! ఒక్క సత్య వస్తువు దర్శనముచే మాత్రమే మిథ్యా దృష్టి నశిస్తుంది.

❖

ఓ రామా! ఒక్క విషయం మాత్రం నీ "జ్ఞప్తి – ఎఱుక" పథం నుండి ఏ మాత్రం కోల్పోవద్దు. అదేమిటంటే... చిత్స్వరూపమగు ఆత్మ నిర్మలమై, నిత్యమై, స్వయంప్రకాశకమై, వికారరహితమై, అఖండమై, అప్రమేయమై సర్వదా వెలుగొందుచున్నది. అదియే నీయొక్క నా యొక్క వాస్తవ స్వరూపం.

నా ఈ వాక్యాలు వినటం జరుగుచున్న ఈ సభలోని, ఈ సభకు బాహ్యములోని అందరి స్వరూపం అదే! ప్రతి ఒక్కని వాస్తవ స్వరూపం అదే! నీవు గాని, నేను గాని, ఇక్కడి ప్రియ సభికులు గాని, భూత–భవిష్యత్–వర్తమానములలో తదితరులు గాని... ఆత్మకు వేరుగా మరేదీ అయి ఉండలేదు. అయి ఉండబోము. మనమందరమూ ఆత్మస్వరూపులమే అయి ఉన్నాము.

ఇక ఈ దేహానికి వస్తే ఇది అనిత్యము, మలయుతము. ఈ దేహం స్వయం ప్రకాశకం కాదు. ఇది మరొకదానిచే ప్రకాశింపబడుచున్నది. ఆత్మయగు నేను వికారరహితుడను. ఈ శరీరమో... వికారసహితమైనది. అట్టి ఈ శరీరంతో ఆత్మకు సంబంధమెట్లా కలుగుతుంది చెప్పు?

ఈ దేహము ప్రాణవాయువుచే చేష్టితమగుచున్నది. అన్నము, జలము మొదలైన వాటిచే వర్ధితమగుచున్నది... ఇంతలోనే ఎప్పుడో కృశించుచున్నది. దీనితో నేను వర్ధిల్లను, కృశించను... కనుక ఈ విధంగా దేహముతోటి జీవునకు సంబంధం పొసగనే పొసగదు.

పోనీ, ద్వైత దృష్టితో ఈ శరీర, ఆత్మలను పరిశీలించామనుకో... "ద్వైత సిద్ధి" అనగా "జీవునకు వేరైన మరొక సత్త కలదు" అని కదా? మరి ఆ రెండవ సత్త ఏమిటి? ...అది కూడా చైతన్యమే కదా! చైతన్యము, జీవునకు గాని; చైతన్యము, ఆ రెండవ సత్తకు గాని భేదం ఉండదు.

❖

పంజరంలో సింహం - చూచావా రామయ్యా! ఈ శరీరము, ఆత్మలను విచారణ దృష్టితో చూడకపోవడం చేతనే సర్వ అనర్థములు వచ్చి పడుతున్నాయి.

శ్రీరాముడు : జగత్‌దృష్టి అంతటికీ సారభూతమైనట్టి ఈ అంతఃకరణమునకు కారణమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ ప్రశ్నకు సమాధానం పెద్దలు "అజ్ఞానమే, మూఢత్వమే, అవిచారణయే" అని చెప్పుచున్నారు. ఆత్మయే "విపరీత సంస్కారములను గ్రహించుట" అను మోహముచే తన స్వసత్త యొక్క జ్ఞానమును త్యజించి భ్రమ బీజసహితమగు చిత్తాకార పరిణామమును ధరిస్తోంది.

స్వయం ప్రకాశమానుడు, స్వయం జ్యోతి స్వరూపుడు అగు సూర్యభగవానుని చూడు. గ్రహణసమయంలో ఆతని పట్ల 'రాహువు' అను తమస్సు ఏర్పడుతోంది చూచావా? వాస్తవానికి

సూర్యునిలో తమస్సు (Darkness) ఎట్లా ఉంటుందయ్యా? "సూర్యగ్రహణము" అనునది భూమిపై చరించే జీవుల యొక్క దృశ్యచమత్కారమే కదా!

అట్లాగే, మిక్కిలి అసంభవమైనప్పటికీ ఆత్మను జనన–మరణాదులు అనే అజ్ఞానం కప్పి ఉంచుతోంది. అనర్థహేతువులైన ఈ చిత్తం సత్యమగు ఆత్మతత్త్వం యొక్క ఎరుకచే, లేక, జ్ఞానముచే... గదిలో దీపం వెలిగించిన తరువాత చీకటి లాగా... క్షణంలో నశించగలదు. చిత్తమును పరిశుద్ధ పరచనంత కాలం అజ్ఞానం జనిస్తూనే ఉంటుంది.

ఓ జనులారా! మీరంతా ఈ చిత్తము గురించి, ఇందులో ఏర్పడివున్న దోషదృష్టుల గురించి బాగా విచారణ చేయండి. ఈ చిత్తమునకే 'జీవుడు, మనస్సు, అంతఃకరణము' మొదలైన పేర్లు కూడా ఉంటున్నాయని గ్రహించండి.

శ్రీరాముడు : ప్రభూ! మనం కొనసాగిస్తున్న ఈ విచారణ యొక్క ఆరూఢత కొరకు ఒక విషయం ముందుగా చెప్పండి. ఈ చిత్తమునకు 'జీవుడు – అంతఃకరణము' మొదలైన సంజ్ఞలన్నీ ఎట్లా ఏర్పడుచున్నాయి. ఎట్లా రూఢి పొందుచున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : అనేక తరంగాలు ఎక్కడినుండి వచ్చాయి? జలం నుంచే కదా! అట్లాగే సమస్త పదార్థములు సమష్ఠిచిత్తము నుండే ప్రాదుర్భవిస్తున్నాయి. ఆత్మతత్త్వముతోటి ఏకత్వధ్యాస' చే ఇది నీవు తప్పక గ్రహిస్తావు.

ఒక్కసారి సముద్రమును చూడు. అందు జలం ఒకచోట చంచలములైన అసంఖ్యాక తరంగాలు కలిగి ఉంటోంది. ఇంకొకచోట స్పందనరహితంగా, తరంగాలు లేకుండా ప్రశాంతంగా ఉంటోంది. స్పందనరూపమగు ఆత్మ ఒకచోట నిర్మలంగా, శుద్ధంగా, మరొక చోట ప్రతిబింబరూపంగా ఉంటోంది. శిల మొదలైనవి చలన రహితంగా తమ యందు తామే స్థితి కలిగిఉన్నాయి. కాని మానవుడు, తదితర జంతువులు చేష్టాయుతులై చలనము కలిగి ఉన్నారు. శరీరములన్నిటి యందూ ఆయా వివిధ రూపములలో పరమాత్మయొక్క శక్తి ఉండియున్నది. అయితే ఆ శక్తి కొన్ని దేహములలో కల్పితరూపమైన అజ్ఞానం కలిగి ఉంటోంది. ఆ పరమాత్మయే కల్పితమగు అజ్ఞానమును ఆశ్రయించి, ప్రసిద్ధుడై అట్లు ఉంటున్నాడని గ్రహించు.

ప్రతిబింబ దశను పొందిన పరమాత్మయే ఆజ్ఞానావరణను కలిగి ఉన్నప్పుడు "జీవుడు" అను పేరుతో మనం పిలుస్తున్నాం. వాస్తవానికి ఈ జీవుడు 'సంసారము' అను మాయాత్మకమైన పంజరంలోని సింహమని గ్రహించు.

❖❖❖

8. ఆత్మయే అంతా.... అన్నిటా

ఆత్మ ఒకచోట తన ప్రతిబింబిత మోహకళచే జీవధారణ చేస్తోంది. ప్రాణములను ప్రీతిగా భావించి వాటిని పొంది 'జీవుడు' – అని అనిపించుకుంటోంది. ఆత్మయే 'జీవుడు' గా అగుపిస్తోంది.

"నేను, నేను" అని అనుకొనుచు అహంకారముగా అగుచున్నది. అహంకారము ఆత్మయే.

'నిశ్చయించెదను గాక' అను వ్యవహారములో ప్రవేశించి 'బుద్ధి'గా అగుచున్నది. బుద్ధి ఆత్మస్వరూపమే! సంకల్ప, వికల్పములను ఒనర్చుటనే 'మనస్సు' అనుపేరుకు అర్హమగుచున్నది. మనస్సు ఆత్మ చమత్కారమే! ఆత్మయే!

మనోదేహములకు కారణమగుటచే 'ప్రకృతి' అగుచున్నది. ప్రకృతి ఆత్మయొక్క ఐశ్వర్యమే! ఆత్మయే! వర్ధిల్లుటచే 'దేహము'గా అగుచున్నది. దేహతత్వంకూడా ఆత్మయే!

అజ్ఞానాధిక్యతచే 'జడము' అని, చైతన్య ప్రాధాన్యము ప్రకటించినప్పుడు 'చేతనము' అని వచించబడుతోంది. జడ, చేతనములు ఆత్మవిన్యాసములే! ఆత్మయే!

శ్రీరాముడు : అసలు మనసు అనగా ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : రామయ్యా! మనం అనేక కోణాల నుండి ఇప్పటివరకు చెప్పుకున్న తరువాత మరల "మనస్సు అంటే ఏమిటి?" అని ప్రశ్నిస్తుంటే నాకు కొంచం నవ్వు వస్తోంది. అయినా నీవు అడగటం సముచితమే. విను. మరొక కోణం నుండి చెపుతాను.

"అజ్ఞానము – దానికి సాక్షి" ...మధ్య గల స్థితే పరమాత్మాభాసితమగు మనస్సు. ఆ మనస్సు అనేకత్వము పొంది "జీవుడు, బుది, చిత్తము, అహంకారము"... మొదలైన వేషములను, సంజ్ఞలను ధరిస్తోంది. నవరసాలు పోషించే నటుడు ఒక్కొక్క నాటకంలో ఒక్కొక్కరస సమన్వితమైన వేషం వేస్తున్నట్లు, మనస్సు అనేక ధర్మములను అవధరించి ప్రవర్తిస్తోంది.

మనస్సు యొక్క స్వరూపం ఆత్మయే. అయితే రామా! నీవిక్కడ ఒక విషయం అత్యంత సూక్ష్మ బుద్ధితో గ్రహించాలని మనవి చేస్తున్నాను. హెచ్చరిస్తున్నాను. అజ్ఞానులు, దుర్బుద్ధులు, మూఢులు అగు కొందరు తార్కికులు "ఇది మనస్సు, ఇది బుద్ధి, ఇది చిత్తము, ఇది జీవుడు, ఇది దేవుడు" అని అనేక నిర్వచనములలో ప్రవేశించి ఆయా సంజ్ఞలలో వ్యర్థంగా అభినివేశం కలిగి ఉంటున్నారు. విజ్ఞులు వాటిని సాధనములులాగా, ఉపకరణములుగా, సోపానములుగా చూస్తారేగాని, సాధ్యముగా కాదు. సాధకుడు సాధనములు ఎక్కడ పరిమితమౌతాయో గ్రహిస్తు ఉండాలని నా మనవి.

శ్రీరాముడు : మీ హెచ్చరికలో నాకు అత్యున్నతమైన పరమార్థమే గోచరిస్తోంది. అయితే మరొక సందేహం. శరీరం ఉన్నంత వరకు సంసారము ఉండియే తీరుతుంది కదా! సంసారం ఉన్నంత వరకు అజ్ఞానం ఉంటుందికనుక, సంజ్ఞల అవసరం ఉండియే ఉంటుంది కాదా? కాబట్టి సంసారమునకు కారణం ఈ దేహమేనని అనవచ్చా?

శ్రీవసిష్ఠ మహర్షి : జీవుడే సంసారమునకు కారణమగుచున్నాడుగాని, మూగము, దీనము అయిన ఈ దేహం సంసారమునకు ఏమాత్రం కారణం కాదు. కవిత్వం పెల్లుబికేది కవిలోంచిగాని, కలంలోంచి కాదే!

ఒక కుండలో నీళ్ళు ఉన్నాయనుకో... కుండపగిలితే నీళ్ళు నశిస్తాయా? ఆధారము, ఆధేయము – ఈ రెండిటిలో ఒకటి నశించినంత మాత్రం చేత రెండవది నశించదు. ఒక ఆకు ఎండిపోయిందనుకో

...అప్పుడు అందులోని రసం ఏమయింది? నశించిందా?... లేదు! అది సూర్యకిరణములలో ప్రవేశించింది. మరొక రూపుదిద్దుకున్నది. అంతే.

శరీరం నశించినా ఆత్మ నశించదు. ఆత్మను ఆశ్రయించి, ఆత్మేచ్ఛచే నిర్మితమై ఈ శరీరాదులు ఏర్పడి ఉంటున్నాయి.

అందుచేత... ఆత్మ వాసనా సహితమైతే ఈ శరీరం వాసన యందే ఉంటుంది. ఆత్మ యందు వాసనలు రహితమైతే ఈ శరీరం చిదాకాశంలో ఉంటుంది.

ఏ దుర్బుద్ధి అయితే "ఈ శరీరం నశించిందా ... నా పని అయిపోయినట్లే. నేను నశించినట్లే" అని అనుకుంటాడో, అట్టివానికి తల్లి స్తనంలో బేతాళం అనుభవమౌతుందని నా అభిప్రాయం.

❖

మననముచే బంధం ఏర్పడుతోంది. ఎప్పుడైతే ఉపాధులకు, సంస్కారములకు సంబంధించిన మననము తొలగుతుందో ...అప్పుడు అట్టి జీవుడు స్వతఃసిద్ధంగా తనయొక్క బ్రహ్మస్వభావమును సంస్మరిస్తాడు. నిరతిశయానందమును పొందుతాడు.

అయితే... శరీరం నశించినా చిత్తం ఉంటుంది. చిత్తమే జీవుని సూక్ష్మదేహం. చిత్తములో వేటి వేటి గురించి ధ్యాసలు, మననములు ఆధిక్యత కలిగి ఉంటాయో... ఆ అనుభవములకు అనుకూలంగా తరువాతి ఉపాధులు ఏర్పడుచున్నాయి.

శ్రీరాముడు : ఒకవేళ చిత్తమే నశించిందనుకోండి....? అప్పుడే మౌతుంది?

శ్రీవసిష్ఠ మహర్షి : అప్పుడింకేమున్నది? స్వస్వరూపమగు ఆత్మయే శేషించటమే పరమానంద దాయకమగు 'మోక్షము' అయి ఉన్నది.

కనుక... దేహము నశించుటచే ఏదీ నశించుటయే లేదు! ...ఇక చిత్తము నశించినప్పుడు స్వస్థానమే లభించగలదు. మరింక చింత దేనికో చెప్పు.

"ఈతడు మరణించాడు, నశించాడు" – అను కథనమంతా మిథ్యా కథనమే. అదంతా కూడా అసత్ కల్పన మాత్రమే.

ఈ జీవుడు స్వస్వరూపము విషయమై అజ్ఞానము ఏర్పడి ఉన్నంతవరకూ వేర్వేరు ఉపాధులను, దేశ కాలములను, స్థితి గతులను గ్రహించుచూనే ఉన్నాడు. ఒకానొకప్పుడు శాస్త్రపరిశీలనచే, స్వప్రయత్నముచే తన స్వరూపమేమిటో గ్రహించి ఈ జన్మ, కర్మల, చక్రమును నిరోధిస్తున్నాడు... లేక త్యజిస్తున్నాడు. లేనివిగా చూస్తున్నాడు. మోక్షము అనగా అదే!

'మరణము' అనే నదిలోని తరంగములచే కొట్టుకుని పోవుచున్న గడ్డిపరకలవలె కొందరు జీవులు దేశకాలముల కల్పనాపరంపరలలో అనేకసార్లు ప్రవేశ – నిష్క్రమణములను నిర్వర్తించుకుంటూ పోతున్నారు. ఒక దేశ కాలములలో ప్రవేశమే తన జన్మ అని, దాని నుండి నిష్క్రమణమే తన మరణమని భ్రమలను స్వీకరిస్తూ అనేకసార్లు "నేను దుఃఖిని, సుఖిని, నీచుణ్ణి, గొప్పవాడిని" ఇత్యాది యోచనా లంపటంలో మ్రగ్గుచున్నాడు. కొండముచ్చు ఒక చెట్టు వదలి మరొక చెట్టును ఎక్కుచున్నట్లు ఆతడు ఒక శరీరం వదలి మరొక శరీరంలో ప్రవేశిస్తున్నాడు. కొంతకాలానికి అది వదలి ఇంకొకటి...

చర్విత చరణంగా బహుదూరపు బాటసారిలాగా పయనం సాగిస్తూనే ఉన్నాడు. విస్తృతమైన వేరొక దేశ కాలములలో ప్రవేశించి "నేను ఇప్పుడే పుట్టాను" అని తలచుచూ ఉన్నాడు. పిల్లి తన కూనలను ఒక ఇంటిలోంచి మరొక ఇంటిలోకి చేరుస్తున్నట్లు అతడు తన వాసనలు ఒకచోట నుండి మరొక దేశకాలములకు గొనిపోవుచున్నాడు.

శ్రీరాముడు : ఈ జీవునికి ప్రయాసతో కూడిన ఈ ప్రయాణం ఎంత కాలం?

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. అది జన్మ, మృత్యు, వార్ధక్య, వ్యాధుల ప్రయాసతో కూడిన ప్రయాణమే. వాసనలతో కూడి ఉన్నంతవరకు ఆప్రయాస కొనసాగుతూనే ఉంటుంది. దున్నపోతుకు ముక్కు త్రాడు వలె వాసనలచే కట్టుబడిన ఈ జీవుడు "ఉపాధి-దేశము-కాలము" ...అను మూడు పదార్థములు గల అనేక స్థానాలకు ఈడ్వబడి అనేకసార్లు దుఃఖాలను, శిథిలత్వాన్ని పొందుచున్నాడు. వారి వాసనలే వారినట్లా బాధిస్తున్నాయి. అంతేగాని వారిని మరింకెవరో బాధించుట లేదు.

అజ్ఞాన ధోరణులు, కుమార్గములు ఆశ్రయించుటచే ఆతడు అనేక జీవితములను వృథా చేసుకుంటున్నాడు. వెట్టివాడు చేత సంచిని భుజాన వేసుకొని చెత్త చెదారమును నింపుకుంటూ భారంగా అడుగులు వేస్తూ దుఃఖితుడగుచున్నట్లు, ఈ జీవుడు తెలివిగా వాసనలు తొలగించుకో వలసింది పోయి, మరింకా పెంచుకుంటున్నాడు.

చూచావా! ఆతడు తన హృదయంలో జనిస్తున్న వాసనలచే పట్టుపురుగులాగా బంధితుడై దారిద్ర, వియోగాది దుఃఖముల భారం వహిస్తూ, వివిధ యోనులలో అవిశ్రాంతగా సంచారం చేస్తున్నాడు. అనేక దుర్దశలచే జర్జరితుడగుచున్నాడు. చిరకాలం నరక సమూహములలో పడి లేస్తున్నాడు.

❖

సభ ముగించబడింది. శాంతి మంత్రాలు ప్రవచించబడ్డాయి.

ఆ సభలో ప్రతి ఒక్కరు "ఆహా! మూఢులమై మూర్ఖులమై మేము సంసారారణ్యంలో ఎంతటి సుదీర్ఘ ప్రయాణాలు కొనసాగిస్తున్నాం! మహర్షి గుర్తుచేయకపోతే మా గతి ఏమిటి? ఇది ఎంతటి సుదినం! ఇక్కడి సంయోగ - వియోగాలలో ధ్యాసంతా కలిగియుండి ఉత్తరోత్తర విషయాలే యోచించటం లేదే! ధ్యాసను స్వస్వరూపం వైపు మరలించకపోతే ప్రయాస తప్పదుకదా! ఓ మహర్షులారా! ఓ రామచంద్రా! మీకు ధన్యవాదాలు. మాకు గుర్తుచేయవలసింది గుర్తుచేశారు! సర్వదా కృతజ్ఞులం" అని తమలో తాము చెప్పుకుంటూ గృహోన్ముఖులైయ్యారు.

❖❖❖

(పదమూడవ రోజు విచారణ పూర్తి అయింది)

❖❖❖

పదునాల్గవ రోజు

X. వివేక దృష్టి

1. ఆత్మ - దేహముల సంబంధం

పదునాల్గవ రోజు యథావిధిగా సభ ప్రారంభమైనది.

శ్రీరాముడు : తండ్రీ! మహర్షీ! నిన్నటి రోజు చివరిలో "ఈ జీవుడు దేహముతో కూడి అనేక దేశ – కాలములలో ప్రవేశ – నిష్క్రమణములను నిర్వర్తించటం" గురించి మీరు ప్రసంగిస్తున్నారు.

శ్రీవసిష్ఠ మహర్షి : మంచిది. మనం ఈ దేహం విషయమై మరికొన్ని విశేషాలు విచారణ చేద్దాం.

❖

ఓ రామచంద్రా! ఒక్క విషయం మరొక్కసారి గుర్తు చేస్తున్నాను.

దేహేజాతే న జాతోఽసి! దేహనష్టే న నశ్యసి ।
త్వమాత్మన్యకలంకాత్మా! దేహస్తవ నకశ్చన ॥

1. ఈ దేహం జనించుటచే నీవు జనించుట లేదు. దేహం కంటే ముందుగానే నీవు ఉన్నావు.
2. దేహము ఉన్నంతకాలం దేహాశ్రయుడిగా ఉండనే ఉన్నావు.
3. దేహం నశించినంత మాత్రం చేత నీవు నశించవు. దేహత్యాగిగా నీవు ఉండనే ఉంటావు.

నీ విషయం, నా విషయం, ఈ సభలోని ప్రతి ఒక్కరి విషయం, భవిష్యత్‌లోని సర్వజీవుల విషయం ఇట్టిదే.

నీవు వాస్తవానికి స్వాత్మ యందు అకళంకరూపుడవై వెలయుచున్నావు. ఈ దేహంతో నీకేమీ సంబంధమే లేదు. మనందరిలోని ప్రతిఒక్కరి విషయం ఇట్టిదే!. కుండ పగిలినా కుండలోని రేగు పండుకు ఏమీ కానట్లు (కుండ–బదర న్యాయం) ఈ శరీరం నశిస్తే జీవుడు నశిస్తాడనుకోవటం కేవలం కల్పన, భ్రమ మాత్రమే. నశ్వరమగు ఈ దేహం నశిస్తే అది ఎక్కడి నుండి వచ్చిందో అక్కడికే పోతోంది. "నేను ఈ శరీరంతో నశించుచున్నాను" అని తలచే మూఢ చిత్తునకు ధిక్కారమగు గాక!

దృష్టాంతంగా ఒక రథం తీసుకుని చెప్పుకుందాం. రథచోదకుడు, వెళ్ళవలసిన ప్రదేశం గురించి ఇష్ట, అనిష్టములు లేనట్టి గుఱ్ఱములు, రథము, త్రాళ్లు – ఒకదాని వంటిది మరొకటి కాకపోయినప్పటికీ – అన్నీ ఒక చోటికి చేరి ప్రవర్తిస్తున్నాయి కదా! అట్లాగే దేహి, ఇంద్రియములు, దేహము, మనస్సు ...ఇవన్నీ ఒక చోటికి వచ్చి ఆయా కార్యక్రమములను నిర్వర్తిస్తున్నాయి. తటాకంలోని స్వచ్ఛమైన నీటికి, బురదకూ ఉన్న సంబంధమే ఆత్మకు, ఈ దేహేంద్రియములకూ

గల సంబంధమని గ్రహించు. సుదీర్ఘమైన ప్రయాణం చేస్తున్న ఒక బాటసారి మార్గమధ్యంలో ఒక సత్రంలో బస చేస్తున్నాడనుకో... ఆతనికి ఆ రాత్రి శయనించే గదిలోని వస్తుజాలముతో ఏర్పడే 'నావి' అను మమత్వాభిమానం వంటిదే ఈ శరీరమునకు సంబంధించిన మమకారములు సుమా! ఆ గదిలోని వస్తువులతో ఏర్పడే "సంయోగముచే సుఖము, వియోగముచే దుఃఖము"లకు ఏమి అర్థమున్నది చెప్పు? ఆ బాటసారి అజ్ఞుడైతే సత్రంలో ప్రవేశించి, "ఆహా! ఇవి నావి, ఆ గది ఆతనిది, వీటిపై నాకే హక్కు? అయ్యో! ఇక తెల్లవారబోతోంది. వెళ్లి పోవలసి వస్తుందేమోగదా! ఎట్లా? నే వెళ్ళిన తరువాత ఇవన్నీ ఏమౌతాయి? ఏమో మరి!"...అని భ్రమించి అనేక దుఃఖాలు పొందుతాడు. ఆ బాటసారి కనుక జ్ఞాని అయితే "ఈ సత్రంలోని గది గాని, ఇందులోని సామగ్రి గాని ఈ సత్రం యజమానివి గాని, నావి కావు. నేను ఇక్కడ బస చేస్తూ, ఇక్కడి వాతావరణమునకు అనుకూలుడనై ఉంటాను. వీటిని సొంతమనుకొని మమకారం నే నెందుకు కలిగి ఉండాలి? ఇవి నావి కానప్పుడు వీటిని త్యజించటమేమిటి? కోల్పోవటమేమిటి?" అని గ్రహించి ఉంటాడు. వాటిని ఉపయోగిస్తూనే తాను వాటికి వేరై ఉంటాడు. ఆతనికి, అక్కడి వస్తువులకు గల సంబంధమే ఆత్మకు ఈ దేహాదులతో గల సంబంధం సుమా!

ఒక బాలుడు బాగా అల్లరిచేస్తున్నాడనుకో... ఆతని దాది ఆతనిని సమీపించి "ఓయీ! బాలుడా! నీవు ఇట్లాగే అల్లరి కొనసాగించావా... ఆ చీకటిలో నుంచి ఒక బేతాళుడొచ్చి నిన్ను పట్టుకుపోతాడు. ఆతనికి పెద్ద పెద్ద దంతములు, చింతనిప్పుల్లాటి ఎఱ్ఱటి కళ్ళు ఉంటాయి. తలపై రెండు కొమ్ములు కూడా ఉంటాయి. మరి ఆతనిని పిలవమంటావా?" అని భయపెట్టుచున్నదనుకో. ఆ బాలుడు చీకటి వైపు చూచి అక్కడి ఆ విశేషణములు గల ఒక ఆకారమును ఊహించుకుని "వద్దులే! నేను అల్లరి చేయను" అని ఊరుకుంటాడు చూచావా? ఆ బాలుని కళ్ళకు కల్పిత బేతాళుడు అగుపించినట్లు జీవునకు "ప్రీతి, అందము, సుఖము, దుఃఖము, గ్రాహ్యము, త్యాజ్యము" మొదలైనవన్నీ మిథ్యారూపంగా ఏర్పడుచున్నాయి. అయితే, వాటికి, ఆత్మకు సంబంధమే లేదు. ఆ కలుగుచున్నదంతా కల్పిత బంధమే.

❖

ఒక మహావృక్షము నుండి లభించిన కొయ్య నుండి వేరు వేరు విగ్రహములు తయారు చేయబడుచున్నట్లు, సమ్మిళితములైన పంచ భూతముల నుండి ఈ జనసమూహమంతా వేర్వేరుగా నిర్మించబడుచున్నారు. అందుచేత ఈ అనేక శరీరములను చూచి నీవు భ్రమ పొందవద్దు. ఒక పెద్దకట్టెల మోపులో ఉన్నవన్నీ కట్టెయే (కొయ్యయే) కాని, మరింకేమీ కాదు కదా! ఈ దేహం కూడా మనం పరిశీలించి చూస్తే ఇందు పంచభూతములు తప్పించి మరింకేమీ లేదు.

ఓ జనులారా! ఈ పంచభూతములు 'ఉత్పత్తి–క్షోభ–వినాశనము' లందు మీరు ఎందుచేత హర్ష శోకవశులగుచున్నారో కాస్త చెపుతారా?... అగ్ని యందు పడి, మిడత భస్మమౌతున్నట్లు మీరు కూడా పాంచభౌతిక సంఘాతమైన 'కామము' అను పేరు గల విషయాగ్నియందు ఎందుకు పడుచున్నారు? అందు ఏ గొప్ప, శాశ్వత విశేషం మీకు కనబడుతోంది?

ఇవన్నీ అజ్ఞానుల యందు మాత్రమే ప్రీతి జనింపజేస్తున్నాయి, కాని జ్ఞానులకు పంచభూత రూపములుగానే కనిపిస్తున్నాయి.

పరస్పర సంబంధం లేని రెండు వేర్వేరు వస్తువులను ఒకచోటికి తీసుకువచ్చి ఉంచామనుకో... ఆ రెండు వస్తువులకు ఒకదానిపై మరొక దానికి "రాగము" ఏర్పడుతోందా? లేదే! అలాగే 'చిత్తము – శరీరము' లకు ఒక చోట ఉన్నా ఒకదాని పట్ల మరొకదానికి రాగము ఏర్పడవలసిన పనేమున్నది? పనిలేదు. అయినా కల్పనచే ఏర్పడుచున్నది. అట్లాగే మట్టితో చేసిన అనేక సైనికుల బొమ్మలతో ఒక యుద్ధరంగమును నిర్మించి ఆట బొమ్మలలో ఉంచామనుకో... ఆ సైనికుల బొమ్మలన్నీ ఒకే మట్టితో తయారు చేయబడినప్పటికీ "ఇటు సైన్యం మన రాజ్యానిది...అటు సైన్యం శత్రు రాజులది"... అనే విశేషణము ఆపాదించబడుచున్నది కల్పన చేతనే కదా! ఈ బుద్ధి, ఇంద్రియములు, మనస్సు, ఆత్మల సంసర్గము మమత్వరహితంగా గాంచబడు గాక! శిలా విగ్రహములకు పరస్పరానుబంధం ఉండనట్లు ఆత్మకు ఈ దేహ, ఇంద్రియాల పట్ల రాగం ఉండకుండు గాక! వాటి కొరకు విలపించటం అత్యంత అసంగతమైన విషయమని ఆత్మ స్వరూపుడవగు నీవు గ్రహించు. తరంగం ఎక్కడెక్కడివో కొన్ని గడ్డిపరకలను ఒక చోటికి జేర్చునట్లు ఆత్మ పంచభూతములను ఒక చోటికి జేర్చి, తద్వారా ఈ జగత్తును గాంచుచున్నది. కెరటముల ప్రభావం చేత కొట్టుకురాబడుచున్న కొన్ని గడ్డిపరకలు కలుస్తున్నప్పుడూ, విడిపోతున్నప్పుడూ రాగ–ద్వేషాలు, హర్ష–శోకాలూ పొందుతాయా? లేదు కదా! ఈ పుత్రులు, పశువులు, అయినవాళ్ళు, కానివాళ్ళు అన్నరూపంలో ఏర్పడివున్న ప్రాణులన్నీ పంచభూత మాత్రములై ఆత్మ మహాసముద్రంలో కలవటం, విడిపోవటం చేస్తున్నాయి. ఇందులో శోకించటానికి గాని, సంతోషించటానికి గాని, ఏ విశేషమున్నది? జలంలో ఆవర్తములవలెనే 'చిత్తములు' అనురూపం పొందిన ఆత్మ పంచభూతములను ఒక చోటికి చేర్చి వినోదిస్తోంది.

సంచలనముచే మాలిన్యము పొందిన జలం క్రమంగా సంచలన రహితమగుచున్నప్పుడు ఆ మాలిన్యమును వదిలి శుద్ధరూపం పొందుతుంది చూచావా? జ్ఞానము యొక్క సహాయంచే విషయ రూపమును త్యజించుచున్న జీవుడు స్వయముగా బ్రహ్మరూపమును పొందుచున్నాడు. ఆకాశమున సంచరించే సిద్ధపురుషులు, దేవతలు వాయుమండలము నుండి భూమండలమును చూస్తూ ఉంటారు చూచావా! జ్ఞానము పొందిన జీవులు ఈ పంచభూతసముదాయమునుండి విడివడినవారై, తమ దేహముతో సహా సర్వబాహ్యవస్తు సముదాయమును తమ స్వస్వరూపముకంటే వేరైనదిగా గాంచు చున్నారు. దేహాతీతులైన జ్ఞానులు పంచభూతములను తమకు వేరైనదిగా, అసంబంధమైనదిగా గాంచుచుండుటచే తమయొక్క జన్మరాహిత్యమును ప్రత్యక్షముగా గాంచగలుగుచున్నారు. లేదా, "ఇదంతా మమాత్మవిన్యాసమే" అనురూపంగా ఆస్వాదిస్తున్నారు. సూర్యకాంతి మణి వలె స్వయం ప్రకాశమును అవధరిస్తున్నారు.

మద్యము త్రాగి మత్తులో ఉన్నవాడు తన యొక్క పూర్వస్థితులను, తదితర పరిచయములను, తన ఎదురుగా ఉన్న వస్తుజాలమును అస్పష్టంగా గాంచుతూ ఉంటాడు. ఆ మత్తు దిగిపోయిన తరువాత

మరల ఇతఃపూర్వజ్ఞానమును సుస్పష్టంగా తిరిగి పొందుతాడు. అట్లాగే దేహాతీతత్వము అవధరించిన మహనీయుడు ప్రమాణ, ప్రమేయముల నుండి విడివడి వికారరహితుడై తన ఆత్మను గాంచుచున్నాడు.

ఓ రామా! వివిధ సముద్రజలములు తరంగముల కల్లోలంచేత తేలియాడే గడ్డి పరకలతో సంయోగ – వియోగములు చేస్తున్నట్లుగానే... ఆత్మయే సమస్త వస్తు సంయోగ – వియోగాది క్రియా విశేషములను స్వయంకల్పితంగా నిర్వర్తిస్తోంది.

❖❖❖

2. ప్రపంచాతీతులు

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ ప్రపంచంలో కొందరు నేను వర్ణిస్తూవస్తున్న విశేషాలతో శరీరాతీతులై, ఆత్మతో ఏకత్వం పొందినవారై ఉన్నారు. వారు వీతరాగులై, పాపరహితులై బ్రహ్మపదమున వెలుగొందు చున్నారు. అట్టి వారిలో కొందరు బోధకులై బ్రహ్మతత్త్వ ప్రవచనం చేస్తున్నారు. అట్టి మహనీయులకు దిగ్విజయమగు గాక!

సముద్రంలోని మహాతరంగములు తమ యందు అమూల్యమైన రత్నములు కలిగి ఉండి కూడా, వాటి యందు ఆశ లేకుండానే యథాతథసంచలనంతో సంచరిస్తూ ఉంటాయి కదా! ఆ మహాత్ములు కూడా జ్ఞానులై, వాసనారహితులై అనాసక్త చిత్తముతో వ్యవహారములు ఆచరిస్తున్నారు.

తీరమున ఉన్న భవనం చూచి సముద్రం క్షోభ చెందుతుందా? మోదం పొందుతుందా?... గాలికి దుమారం లేచినంత మాత్రం చేత ఆకాశం మలినమై పోతుందా?... ఈ ప్రపంచ వ్యవహారములచే ఆత్మజ్ఞాని మలినం పొందడు, మార్పు పొందడు. చేర్పు పొందడు.

శ్రీరాముడు : అట్టి మహనీయులు అందరిలాగానే ఈ ప్రాపంచిక రాగ ద్వేషముల మధ్య మనగలుగుతారా?

శ్రీవసిష్ఠ మహర్షి : స్వచ్ఛమైనట్టి, మలినమైనట్టి చంచల జలతరంగములచే సముద్రము రాగము గానీ, ద్వేషము గాని పొందుతోందా? లేదు. ఆత్మజ్ఞాని కూడా భోగములచే రాగము గాని, ధన, జనాదుల రాకపోకలచే ద్వేషము గాని పొందుట లేదు.

యన్మనో మననం కించిత్సమగ్రం జగతి స్థితమ్ ।
తచ్చేత్యోన్ముఖచిత్తత్వవిలాసోల్లసనం విదుః ॥ (శ్లో 28, సర్గ 72)

"ఈ జగత్తులో ఉన్నది. ఉండబోయేది మనస్సు యొక్క సంకల్ప – వికల్పములు మాత్రమే" – అని అతనికి తెలుసు. "ఇదంతా విషయోన్ముఖమైన చైతన్యము యొక్క విలాసము మాత్రమే" అని ఆత్మజ్ఞాని ఎరిగియే ఉంటాడు.

❖

ఈ అహంకారము, ఈ త్రికాలస్థమగు విషయములు, ఈ దృశ్య, దర్శన సంబంధములు – సర్వమూ మనోవిజృంభణము మాత్రమే!

దృశ్య - దర్శనముల మధ్య దృక్ (That which is seeing) ఉన్నది. దృశ్యము దృక్ యొక్క ఆధీనంలో ఉన్నది. దృక్ ఈ దృశ్యమును ఎట్లు చూస్తే అట్లే ప్రాప్తిస్తూ ఉంటుంది. దృక్ యొక్క అధీనంలో ఉండే ఈ దృశ్యము సత్తయా?... కాదు! అసత్తయా?... కాదు!

ఇట్లు సత్త అని గాని, అసత్త అని గాని నిర్ణయించబడజాలనిది, హర్షశోకములకు అర్థమెట్లా అవుతుందో చెప్పు? కనుక ఈ దృశ్యము స్వయంసిద్ధము కానే కాదు. స్వయంసిద్ధమైనది 'దృక్' మాత్రమే. అదియే ఆత్మ! ఆత్మ సర్వదా అసంగమైనది.

శ్రీరాముడు : అయితే ఈ జీవులకు హర్ష శోకములు ఎందుచేత కలుగుచున్నాయి?

శ్రీవసిష్ఠమహర్షి : రామా! ఇప్పుడు నీకు కొన్ని కొన్ని సందర్భములలో హర్ష శోకములు కలుగుచున్నాయి. కదా! నిన్నొక చిన్న ప్రశ్నవేస్తాను- అట్లా ఏర్పడే హర్ష శోకములు సత్యమైనదాని గురించా? లేక... అసత్యమైనదాని గురించా? కాక సత్యాసత్యమైన దాని గురించా?

అసత్యమైనది మిథ్యయే కదా! మిథ్య, అవాస్తవం అయినదాని గురించి హర్షమెందుకు? శోకమెందుకు?

శ్రీరాముడు : ...!

శ్రీవసిష్ఠ మహర్షి : ఇక సత్యమైనదాని గురించి అంటావా? అది ఎల్లప్పుడూ సత్యమై నిత్యమై లభించియే ఉన్నది కదా! ...మరి హర్షమెందుకు? శోకమెందుకు? ...ఎందుకంటే నిత్యమైనది మాత్రమే సత్యము కదా!

ఇక "సత్యా సత్యమైనదాని గురించి" అని అంటావా?... ఎక్కడైనా విరుద్ధ ధర్మములు ఒక చోట ఒనగూడుతాయా?ఒకే చోట, ఒకేసారి వెలుగు చీకటి ఏర్పడినవై ఉంటాయా? అందుచేత 'సత్యాసత్యమైనది' అనే మాటయే మిథ్య. మరి నీవు దేనికైనా సరే, ఎందుకు విమోహితుడవు కావాలి చెప్పు?

❖

ఉత్తమ నేత్రములు గల ఓ రామచంద్రా! నీవు మొట్టమొదట మిథ్య అయినట్టి అసమ్యక్ దర్శనం (The illusion of seeing the variety and missing the unity) త్యజించు. సమ్యక్ దర్శనమును అవలంబించు. సమ్యక్ దర్శనమునందు సుస్థిరుడైనవాడు ఇక్కడెక్కడా ఏ స్థితిగతులలోనూ మోహం చెందడు.

ఆత్మ తన యొక్క దృశ్య-దర్శన సంబంధమైన విస్తారముచే తనకు తానే మనస్సు అను రూపంగా ప్రకటించుకొనుచున్నది. అందుకే విజ్ఞులు "దృశ్య-దర్శనములకు సంబంధించిన అనుభవ రూపమగు సుఖవృత్తి కూడా బ్రహ్మము యొక్క రూపమే" అని చమత్కారంగా విశ్లేషిస్తూ ఉంటారు. అలాగే, ఈ ఉపాధి కృతమైన భేద దృష్టి తొలగిపోయినప్పుడు... అప్పుడు ఏర్పడే సుఖము శివము, లేక, అఖండ బ్రహ్మమే. ...కాబట్టి 'బ్రహ్మము' అంటే ఏదో, ఎక్కడో ఉన్నట్టిది కాదు.

శ్రీరాముడు : సంసారము అనగా ఏమిటి?


శ్రీవసిష్ఠ మహర్షి : దృశ్య-దర్శనముల మధ్య గల ఒకానొక అజ్ఞానపూరితమైన సంబంధమునే మనం 'సంసారము' అనే శబ్దంతో ఉద్దేశిస్తున్నాం. దృశ్య-దర్శనముల మధ్య గల అనుభవం అజ్ఞానులకు సంసారముగా ప్రాప్తిస్తోంది.

అదే అనుభవం ద్రష్ట-దర్శనముల సంబంధమేమిటో ఎరిగిన ప్రపంచాతీతులకు మహాభ్యుదయ యుక్తమగు "మోక్షము" అను అనుభవం చేతికందిస్తోంది.

అనుభవం దృశ్యవృత్తితో కూడి ఉంటే బంధము. వృత్తి రహితమైనప్పుడు, అప్పుడు శేషించే అనుభవమే ముక్తి.

శ్రీరాముడు : ముక్త స్థితిలో 'అనుభవం' అనేది ఉంటుందా? ఉండదా?

శ్రీవసిష్ఠ మహర్షి : అనుభవమే ఆత్మయొక్క ముఖ్యదేహం. అయితే దేహి దేహము కంటే అత్యంత సూక్ష్ముడు. అనుభవం యొక్క ఉనికి-లేములు ఆత్మను స్పర్శించవు.



జ్ఞానము యొక్క బలిమిచే ఈ జీవుని సుఖసంవిత్తు వికారరహితమౌతుంది. అనగా, వృద్ధి క్షయ రహితమౌతుంది. వృద్ధి, క్షయ రహితమగు సుఖానుభవం పూర్ణానందస్వరూపమగు బ్రహ్మమే అయి ఉన్నది.

❖

కనుక రఘు రామా! నీవు దృశ్య-దర్శన వర్జితమైనట్టి సుఖమును ఆశ్రయించు. దానినే 'కేవలానుభవ దృష్టి' అని కూడా శాస్త్రములు చెప్పుచున్నాయి. అట్టి దృష్టిచే అప్పుడు ఉచిత సమయంలో సంసారబంధ రహితుడవౌతావు.

అట్లు జీవుడు కేవలమగు (That which is Absolute) తన సుఖస్వరూపమును ఆశ్రయిస్తూ ఉండటం చేత ఆతని యందు స్వస్వరూప దృష్టి ప్రకాశించగలదు. దృశ్యం రహితమైనప్పుడు, అప్పటి అనుభవమునకు, ద్రష్టకు భేదమేమీ ఉండదు. ఆ మార్గంలో లభిస్తున్న స్థితియే తురీయావస్థ. అదియే ముక్తి. ఏ జీవుడైనా సరే... దృశ్యదర్శన వర్జితుడై పరమాత్మ బుద్ధిని సంపాదించుకొంటే అది ముక్తస్థితి అవుతుంది.

ముక్తరూపమగు తురీయస్థితి యందు ఆత్మ ఏ తీరుగా ఉంటుంది? అది స్థూలమా? ...కాదు. సూక్ష్మము కూడా కాదు. ప్రత్యక్షముగాని, అప్రత్యక్షముగాని కాదు.

అద్దానిని చైతన్యము, జడము, సత్తు, అసత్తు మొదలైన పేర్లచే నిర్వచించలేం. దాని రూపం అహంకారం గాని, మరింకేదో గాని కాదు. "ఏకము, అనేకము, సమీపము, దూరము, ప్రాప్యము,

అప్రాప్యము" – మొదలైన వాచ్య వాచక శబ్దములు అద్దానికి ఆపాదించలేం. అది స్వరూపమని, సర్వవ్యాపకమని, పదార్థమని, అపదార్థమని, పంచభూతాత్మకమని, అపంచభూత రూపమని చెప్పలేం. అద్దాని గురించి చెప్పటానికి మాటలు లేవు... చాలవు. కానీ అన్ని శబ్ద–అర్థముల సమగ్ర ఆత్యంతిక సమన్వయం అదే!

శ్రీరాముడు : నామ – రూపాలు లేనట్టిది ఉన్నట్లా? లేనట్లా?

శ్రీవసిష్ఠమహర్షి : ఒక్క విషయం మాత్రం నిస్సంకోచంగా ప్రకటిస్తున్నాను. ఈ జీవునికి ఆరవ ఇంద్రియం మనస్సు. మనస్సుకు రూపమేమున్నది. అయితే, ఈ దృశ్యరూపమున సంతరించుకుని ఉన్నదంతా మనస్సు మాత్రమే. మనస్సుకు పరమై, ఆ మనస్సుకు కారణము, స్థానము, ఆధారము ఆత్మయే కదా! అట్టి ఆత్మతత్త్వమును, "అది ఏదీ కాదు" – అనటం కూడా సత్యవాక్కు కాదు. ఈ జగత్తును యథారూపమున గాంచగలుగుచున్న ప్రపంచాతీతులకు "ఇదంతా ఆత్మయే" అని అనుభవ మగుచున్నది. సర్వం ఆత్మయే!

ఈ జగత్తంతా ఆత్మమయమే అయి ఉన్నది. ఆత్మకు భిన్నంగా ఏదీ ఎక్కడా లేదు. ఆత్మయే పృథివిలో కాఠిన్యంగా, జలంలో ద్రవత్వంగా, తేజస్సులోని ప్రకాశంగా, ఆకాశంలో అవకాశంగా ప్రకాశిస్తోంది. ఒక నటుడు అనేక చోట్ల అనేక వేషాలు వేస్తున్నట్లు, ఆత్మ సర్వరూపములూ తానే అయి, తాను మాత్రం అవేవీ కాకయే ఉంటోంది.

చైతన్యమే లేకపోతే వస్తువుల సత్తా ఏమాత్రం సిద్ధించేది కాదు. అంతేకాదు... "ఆత్మకు భిన్నంగా నేను ఉన్నాను" అనే మాట ఉన్మత్త ప్రేలాపన మాత్రమే.

ఓ మహాత్మా! రామచంద్రా! సమస్త దేశ కాలములు, అందలి అనంత కోటి కల్పములు, ఆ కల్పముల మధ్య కనిపిస్తున్న అనేక బ్రహ్మాండములు, ఆ బ్రహ్మాండములలోని వివిధ జీవుల గమనాగమనములు –– ఇవన్నీ ఆత్మయే అయి ఉన్నాయి. ఆత్మకు వేరుగా మరొక కల్పన ఏదీ ఉండ జాలదు. కాబట్టి ఆత్మకు సంబంధించిన నిశ్చయబుద్ధి కలిగి ఉండు. ఆ బుద్ధికి కూడా పరుడవై ఉండు. బిడ్డా! సర్వదా ప్రపంచాతీతుడవై ఉండు. ప్రపంచస్వరూపుడవై ఆస్వాదించు.

❖❖❖

3. ఎవరీ రచయిత?

శ్రీరాముడు : హే మహర్షీ! మేము వస్తుదృష్టి నుంచి వైతొలగి ఆత్మ దృష్టికి చేరినప్పుడుకదా ముక్తి! అది సుసాధ్యమేనంటారా? దృష్టిని జ్ఞానమయం చేయటమెట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : రామచంద్రా! "ఇది ఉత్తమోత్తమమైన వజ్రం" – అని తెలిసిన తరువాత ఏదైనా త్యజించి అద్దానిని పొందాలని జనులు అనుకోవటం సహజమే కదా! విచారణదృష్టితో ఈ జగత్తును గమనిస్తున్న ఉత్తమ పరిశీలనపరులు ఇందలి సత్యాసత్యమేమిటో గ్రహిస్తున్నారు. ద్వైతత్యాగం చేసి ఆత్మ స్వరూపమగు ముక్తిని స్వభావంగా ఆకాంక్షిస్తున్నారు. పొందుచున్నారు.

నేనే ఆకాశమును. నేనే సూర్యుడను. దైత్యులు, దేవతలు, ఆ దేవతలు ఉండే స్వర్గలోకం నేనే! మేఘమండలం, పృథివి, సముద్రం, ధూళి, అగ్ని కూడా నేనే. వెయ్యి మాటలు అనవసరం. ఈ జగత్తంతా నేనే... ఈ ముల్లోకములందు ఆత్మ అయినట్టి నేను మాత్రమే సత్యమై ఉన్నాను... ఆత్మయే అయి ఉన్న నేను పరిచ్ఛిన్నుడను ఎట్లా అవుతాను నాకు అన్యమైనదంటూ, ఈ దేహంతో సహా ఈ మూడులోకాలలో ఏదీ లేదు...

ఇట్లు విచారణ చేసి నిశ్చింతుడవై ఉండు. జగత్తంతా ఆత్మమయమై ఉండగా... అట్లు గాంచటంలో ఏం కష్టం? అట్టి సంభావనను కించిత్ అలవరచుకుంటే ఇక నీవు హర్షశోకములకు వశుడవు గావు. అవి నిన్ను ఏమాత్రం ఓడించలేవు. కనీసం స్పర్శించనైనా లేవు.

తన్మయేఽస్మిన్కిల జగత్యఖిలే సంస్థితేఽనఘ ।
కిమాత్మయం పరం కిం స్యాత్కమలేక్షణ కథ్యతామ్ ॥ (శ్లో 7, సర్గ 73)

ఈ జగత్తులో ఏదేది ఎట్లు తారసపడినా సరే, ఆత్మజ్ఞానికి అదంతా తనకు అన్యమైనదిగా అనిపించదు. అందుచేతనే అతడు హర్షశోకాలు పొందడు. అజ్ఞుడు మాత్రమే వాటిని పొందుచున్నాడు.

❖

ఇంతకు ముందే మనం చెప్పుకొనియున్నట్టి మూడురకాల అహంకారదృష్టుల గురించి ... ఈ సందర్భంలో ఉచితం కనుక, మరల ప్రస్తావిస్తున్నాను విను–

1. 'నకించిదహమ్' దృష్టి - "నేను ఆకాశము కంటే కూడా అత్యంత సూక్ష్మమైనవాడను. ఈ సర్వలోకములలోని ప్రతి ఒక్క పదార్థమునకు పరమైనట్టి చిత్ స్వరూపమగు ఆత్మయే నేను" – అను దృష్టిని 'న కించిదహమ్ దృష్టి' అని పిలుస్తున్నారు. అట్టి దృష్టిని పెంపొందించుకున్న సాధకుడు "నేను ఒక పదార్థమునే కాదు కదా! ఇక నన్ను ఏది ఎట్లా బంధించగలుగుతుంది?" – అను వివేకమును సముపార్జించుకుంటున్నాడు. "పదార్థమునకు పరిమితులుంటాయి. పదార్థము లన్నిటికీ పరము, అప్రమేయము అయినట్టి నేను స్వభావసిద్ధంగానే అపరిమితుడను" – అను ఔన్నత్యదృష్టిని తత్త్వజ్ఞాని సంతరించుకుంటున్నాడు.

2. సర్వత్ర సర్వమహమ్ దృష్టి - "ఆత్మయే సర్వమై అంతటా వ్యాపించి, అన్నీ తానే అయి ఉంటోంది. నేను ఆత్మను కాబట్టి ...అన్నిటా వ్యాపించి, అంతయూ అయి ఉన్నది నేనే. నేలపై ఆహారం కొరకై అటూ ఇటూ తిరుగుచున్న ఒక పురుగు దగ్గర నుండి, ఈ మూడు లోకములనూ పరిపాలించి శాసిస్తున్న త్రిమూర్తుల వరకు ప్రసరించియున్నది నేనే." ఇక ఈ దృష్టిని అవలంబిస్తున్న సాధనపరులకు దుఃఖం ఎక్కడి నుండి రాగలదు చెప్పు?

3. "ఇదమ్ దేహమహమ్" దృష్టి - ఈ మూడవది అతి తుచ్ఛమైన దృష్టి. "ఈ దేహమే నేను" – అను భావన (లేక) దృష్టి (లేక) అహంకారము సర్వదుఃఖములకు, అశాంతులకు కారణమగుచున్నది.

❖

ప్రియమైన రామచంద్రా! నీవు ఈ మూడవ అహంకారమును మొదటి రెండిటితో, లేక ఆ రెండిటిని ఒక దాని సహాయంతో మొదలంట్ల త్యజించి వేయాలి. అప్పుడు నీయందు నిరహంభావ రూపమైనట్టి చిన్మాత్రము శేషిస్తుంది. అద్దానినే అవలంబించు. అద్దాని యందు తత్పరుడవై ఉండు.

ఆత్మ సర్వదా సర్వమునకు అతీతమైనదైనప్పటికీ, సర్వసత్తలకు పరమైనప్పటికీ, అయ్యది తనయొక్క మాయా శక్తిచే ఈ జగత్తును స్వీకరించి పొందుచున్నది. దీనిని పరిపూర్ణమొనర్చుచూ, స్వయంప్రకాశరూపమై వెలుగొందుచున్నది. అందుచేత నాయనా! ఇక నీకు సందేహాలు అనవసరం. తాత్సారం చేయవలసిన పనిలేదు. ఇప్పటికిప్పుడే "నిత్యోదితమగు ఆత్మయే నేను" అనే నిత్యానుభవాన్ని ఇప్పుడే గ్రహించు. అట్టి ఎరుక – దృఢనిశ్చయములచే 'దేహము, దేహసంబంధములు' మొదలైన వాసనలతో కూడుకునియున్న నీ హృదయగ్రంథిని త్యజించు.

అనుభవం - అయితే ఒక్క విషయం. మనం ఎంతో వివరంగా ఈ 14 రోజులుగా అనేక విషయాలు చెప్పుకుంటున్నాం ఈ మన సంవాదం మరికొన్ని రోజులు కొనసాగబోతోంది. మంచిదే. అయితే, ఆత్మ అనుమాన శబ్దప్రమాణములచే పొందబడేది కాదు మరి! సర్వదా, సర్వవిధములా సర్వరూపమైనట్టి ఆత్మ స్వానుభవము చేతనే ప్రత్యక్షం కాగలదని గ్రహించు. అందుకుగాను ఈ జీవుడు ఈ ఉపాధిచే ఏర్పడే సర్వ సంబంధములను, సర్వసందర్భములను అధిగమించ గల ఒకానొక సమగ్రమైన దృష్టిని సముపార్జించాలి. అదియే ఉపాధిని జయించటం, లేక త్యజించటం కూడా. ఉపాధికి సంబంధించిన కర్తృత్వ వృత్తితో కూడిన అంతఃకరణమును పరిశుద్ధపరచుకోవాలి. అందుకు మార్గం ఉత్తమమైన పరిశీలనయే. అనుమాన, ఉపమాన, శబ్ద ప్రమాణముల సహాయంతో ఉదయించగల జ్ఞానం నిన్ను భగవంతుడగు ఆత్మగా శేషింపజేయగలుగుతుంది. ఆ జ్ఞానం అణువణువునా ప్రవేశించి నిరంతరానుభవంగా రూపుదిద్దుకోవాలి సుమా!

❖

దేవదేవుడగు ఆత్మ సత్తు కాదు... అసత్తు కూడా కాదు. అణురూపం కాదు... బృహద్రూపం కూడా కాదు. సదసత్తుల మధ్య గల సత్యాసత్య స్వరూపం కూడా కాదు. కానీ... "సర్వం అదియే."

అదెట్లా అంటావా? ఒక జీవుడు ఒకనికి తండ్రి మరొకరికి కుమారుడు, ఇంకొకరికి భర్త, వేరొకరికి మిత్రుడు... అన్నీ అతనే గాని, వాటిలో ఏ ఒక్కటీ అతనిని నిర్వచించలేవు కదా! ఇది కూడా అట్టిదే.

ఆత్మ గురించి అనేక మాటలలో చెప్పుకుంటున్నాం. కాని యథార్థానికి అది వచించటానికి అలవి అయ్యేది కాదు. దానికి అన్యమైనదేదీ లేదు. కాబట్టి, ఇది గమనిస్తూనే, అత్యంత శ్రద్ధతో కూడిన శ్రోతవై నీవు సర్వత్రా నిర్వికారమగు ఆత్మనే దర్శిస్తూ ఉండు.

శ్రీరాముడు : స్వామీ! ఇంతకీ ఈ ఎదురుగా కనబడే అనాత్మ రచయిత ఎవరు?

శ్రీవసిష్ఠ మహర్షి : 'ఇది ఆత్మ – ఇది ఆత్మ కాదు' అనునట్టి ఈ నామరూప విభాగమంతా ఆత్మయే సర్వవ్యాపకమగు తన అజ్ఞానశక్తిచే తనయందు కల్పించుకొనుచున్నది.

సంస్థితః స హి సర్వత్ర త్రిషు కాలేషు భాస్కరః ।
సూక్షత్వాత్సుమహత్వాచ్చ కేవలం న విభావ్యతే ॥ (శ్లో 20, సర్గ 73)

ప్రకాశవంతమగు ఆ ఆత్మ త్రికాలములందు ఎల్లెడలా స్థితి కలిగియే ఉన్నది. అయితే అది అతి సూక్ష్మము, మహత్తరము కదా! అందుచేత స్థూలములగు ఈ దేహాదులందు ఆసక్తబుద్ధి గల మనుజులకు అది భావించటానికి అశక్యమై ఉంటోంది. ప్రయత్నించనివారికి అది అసంగతం గాను, అయోమయం గాను ఉండిపోతోంది. ప్రయత్నించేవానికో... అతిసులభం!

స్వప్న ద్రష్ట స్వప్నాంతర్గత సర్వపదార్థములలోను నిండి ఉన్నాడు కదా! అట్లాగే ఆత్మ సృష్టి అంతా – సర్వపదార్థములందూ నిండియున్నది. కాని స్వభావ వశంచేత 'బుద్ధి' (లేక) 'లింగశరీరము' నందు మాత్రమే ప్రతిబింబితమగుచున్నది. నీవు నిట్టనిలువుగా నిలబడ్డావనుకో... ఎదురుగా మరొక చోట చూచేవారికి కనిపించవు. కానీ ఆ ఎదురుగా ఒక నిలువుటద్దం అమర్చినప్పుడు అందులో ప్రతిబింబించుతావు. అనగా, అద్దం అక్కడ లేనప్పుడు కూడా నీ బింబం ప్రసరిస్తున్నప్పటికీ, నిలువుటద్దం లేనప్పుడు నీ రూపం అక్కడ చూడలేం కదా! ఆత్మ కూడా అంతటా ప్రసరించుతూ కూడా పుర్యష్టకము లేక లింగశరీరము (Subtle body) ఉన్న చోటే ప్రతిబింబిస్తోంది. గాలి అంతటా నిండి ఉన్నప్పటికీ, దాని ఉనికి తెలిసిరాదు. కాని వింజామరలు వీచినప్పుడు గాలి యొక్క ఉనికి స్పర్శకు లభ్యమగుచున్నది.

ఆత్మ అంతటా ఉన్నప్పటికి లింగదేహం ఉన్నచోట అహంకార రూపమున వ్యక్తమై అనుభూత మగుచున్నది. చిత్స్వరూపమై, సర్వవ్యాపకమైనట్టి ఆత్మ దేహము లందు మాత్రమే ఉన్నదను మాట సమగ్రం కాదు. అయితే వాయువు వీస్తున్నప్పుడు ధూళి ఎగురుచున్నట్లు, లింగదేహము ఉన్నచోట జీవుడుగా స్ఫురించుచున్నది. ఆకాశంలో సూర్యుడు ఉదయించినంత మాత్రం చేత జనులు నిదురలేచి తమ దైనందిన కార్యక్రమములు ప్రారంభించుకుంటున్నారు. పరమప్రేమాస్పదమై, నిరతిశయానంద రూపమైనట్టి ఆత్మ స్ఫురించినప్పుడే లింగ శరీరమున విషయభోగేచ్ఛ సంభవమగుచున్నది.

సర్వమూ ఉన్నది ఆత్మ యొక్క ప్రీతి కొరకే!

సూర్యోదయానంతరం జనులు ఆయా కార్యక్రమములు ప్రారంభిస్తున్నప్పుడు, ఆ కార్యములు ఫలించటం, విఫలం కావటం సూర్యునికి హాని వృద్ధులు కలిగించవు కదా! ఆత్మ దేవుని సత్తచే స్థితి పొంది ఉంటున్నట్టి ఈ దేహము ప్రవృద్ధమగుచున్నప్పటికీ (లేక) నశించినప్పటికీ ఆత్మకు ఏ హాని వృద్ధులూ ఉండవు.

ప్రాణికోట్లన్నిటి యొక్క ఆత్మ ఏ కాలమందూ కూడా జనించుటలేదు, మరణించుట లేదు. అది దేనినీ గ్రహించదు, వాంఛించదు. దానికి బంధము గాని, ముక్తి గాని లేవు. అది స్వయముగా అవధరించి అనాత్మయందు ఆత్మత్వము దర్శించుచూ, రజ్జు-సర్ప భ్రాంతిలాగా "ఈ దేహం మాత్రమే నేను. ఈ దేహము నా ఉనికి" అనే భ్రాంతి పొందుతోంది. అట్టి భ్రాంతి పొందుచున్నప్పుడు అది దుఃఖ భాజకము అవుతోంది.

ఏది ఏమైనా అనాదియగు ఆత్మ ఎన్నడూ ఉత్పన్నము కాలేదు. కాబట్టి నశించుట కూడా లేదు. అది తనకు భిన్నమైనదేదీ వాంఛించటం లేదు. దానికి భిన్నంగా ఏదైనా ఉంటే కదా... వాంఛించటానికి? అది దేశ కాలములచే అపరిచ్ఛిన్నము. కనుక బంధింపబడజాలదు. బంధమే లేని దానికి ముక్తి ఎక్కడిది? అది స్వస్థానము నుండి చ్యుతి పొందుటయే లేదు. కానీ, అవిచారణవశం చేత మూఢులగు జనులు, పాపం, నిష్కారణంగా దుఃఖం పొందుచున్నారు. ఆత్మ కొరకై ఎక్కడెక్కడో వెతుకుచున్నారు.

ఓ రామా! నీవు చక్కగా ఈ జగత్ క్రమము యొక్క పూర్వాపరములను విచారణచేయి. అంతే గాని, మూఢునిలాగా వ్యర్థంగా దుఃఖం పొందవద్దు.

❖

విజ్ఞుడైనవాడు బంధమోక్షములు అనే రెండుకల్పనలనూ త్యజించివేస్తున్నాడు. ఆత్మస్థుడై అంతరంగంలో ఒక యంత్రంలాగా మౌనముతో వ్యవహరిస్తున్నాడు.

న మోక్షో నభసః పృష్ఠే న పాతాలే న భూతలే ।
మోక్షో హి చేతో విమలం సమ్యగ్జ్ఞానవిబోధితమ్ ॥ (శ్లో 35, సర్గ 73)

ఓ జనులారా! మోక్షము అనబడేది ఎక్కడో ఆకాశంలో గాని, పాతాళంలో గాని, భూతలమందు గాని లేదు. ఉత్తమ ఆత్మ జ్ఞానముతో బోధితమగుచున్న నిర్మల చిత్తమే మోక్షం. ఒకానొకడు సర్వవాంఛిత పదార్థముల పట్ల ఆసక్తి త్యజించాడనుకో... అట్లు ఆసక్తి మొదలంట తొలగుటచే సంభవించే చిత్తము యొక్క 'స్వవినాశనం' లేక చిత్తరాహిత్యం 'మోక్షము' అనే శబ్దంతో ఆత్మజ్ఞులు ఉద్దేశిస్తున్నారు.

నిర్మల ఆత్మజ్ఞానం కలుగనంతవరకూ ఈ జీవుడు దీనుడుగానే ఉంటాడు. లేక "నాకు మోక్షము కలుగు గాక!" అను అభిలాషాసక్తుడై ఉంటాడు. చిత్తము బ్రహ్మత్వదశను పొందినప్పుడు, ఇక, ఆతనికి వేరే మోక్షమనబడేదేదీ అవసరమై ఉండదు.

ఓ సంసారాతీతమైన స్వరూపము కలవాడా! రామచంద్రా! 'ఇది బంధము, ఇది మోక్షము' అనే తుచ్ఛకల్పనను నీవు త్యజించు. మహాత్యాగము అవధరించియుండుటచే నీవు మోక్షరూపుడవై ఉంటావు. సర్వ వికల్పములు నశించిపోగా అంతఃసంగరాహిత్యముచే నిత్యోదితమైన శోభ కలిగి ఉండు. యథారీతిగా ఈ భూమండలమున దీప్తించే మణివై వెలుగొందుము.

❖❖❖

4. ఆశా రాహిత్యం

శ్రీరాముడు : మహర్షీ! ఈ స్థూల-సూక్ష్మ శరీరములన్నీ ఎందుకు, ఎప్పటి నుంచి, ఎట్లు ఉత్పన్న మవుతున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : (చిరునవ్వుతో) నీ ప్రశ్నకు ఒకవిధంగా సమాధానం చెప్పాలంటే... "కామ్య కర్మ వాసనలే!"

ఆత్మ తన ప్రేమాస్పదమగు స్వరూపమును ఏమరచినప్పుడు ఈ కామ్య కర్మ వాసనల క్రమముతో కూడిన సృష్టి అంతా పెంపొందుతోంది. తత్ఫలితంగా ఈ స్థూల–సూక్ష్మ–వ్యష్టి–సమష్టి శరీరములన్నీ ఉత్పన్నం అవుతున్నాయి. కొంచెం కల్లు సేవిస్తే గొప్పమత్తు వచ్చిపడుతుంది చూచావా? ఈ స్థూల–సూక్ష్మ–వ్యష్టి సమష్టి శరీరాలతో కొంచం అహంభావం ఏర్పడితే చాలు... అతి విశాలమగు మాయ తనంతట తానే జనిస్తోంది. ఆత్మ యొక్క 'అన్యధా' భావం చేత మాయ వచ్చిపడుతోంది. ఇక ఆపై పుణ్య, పాపవాసనలతో కూడిన అనర్థ పరంపర ప్రకటితమౌతోంది. ఆ అనర్థము నుండి వికారయుక్తమైన ఈ జగత్తంతా ఉత్పన్నమై ఎదురుగా నిలుస్తోంది. మహాసముద్రంలో కెరటములు, బుడగలు, సుడులు ఏర్పడుచున్నట్లు ఆత్మ మహాసముద్రంలో మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, వాసన, ఇంద్రియములు మొదలైనవి కల్పిత నామధేయములతో స్ఫురిస్తున్నాయి.

మనస్సు : పదార్థముల గురించి మననం చేయటం.

చిత్తము : పదార్థములయొక్క స్ఫురణ కలిగిఉండటం.

బుద్ధి : పదార్థములను నిర్వచించటం, నిశ్చయించటం.

అహంకారం : పదార్థములను అభిమానించటం.

చిత్తాహంకార యోర్ద్విత్వం వచస్యస్తి న వస్తుతః ।
యచ్చిత్తం సహ్యహంకారో యోఽహంకారో మనోహితత్ ॥ (శ్లో 5, సర్గ 74)

ఇవన్నీ ఒకే అంతఃకరణము యొక్క వివిధ పేర్లే కదా! అయితే, చిత్తము – అహంకారములకు మాటలోనే గాని భేదమేమీ లేదు. ఏది చిత్తమో, అదే అహంకారం కూడా! మంచు, తెలుపుదనం వేరు వేరైనవా? ఆ రెండిటిని విడదీసి చూడగలమా? అట్లాగే ... మిగతావి కూడా!

వస్త్రం నశిస్తే, దాని రంగు కూడా నశిస్తుంది కదా! ...మనస్సు, అహంకారములలో ఒకటి నశిస్తే రెండవది కూడా నాశనం పొందుతోంది.

శ్రీరాముడు : మనస్సు, అహంకారం నశిస్తేనే మోక్షం కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : మనస్సు ఉండటం, దానిని వదలటం – అవన్నీ చిన్న పిల్లల ముద్దు మాటల వంటివి మాత్రమే. బిడ్డా! నీ స్వరూపం దేనిచేతా ఎన్నడూ బంధింపబడని ఆత్మయే అయి ఉండగా, మనస్సు అనబడేదేదో నిన్ను బంధించటమేమిటి? నీవు దానినుండి విముక్తికై దేవులాడటమేమిటి? కాబట్టి, నీవు తుచ్ఛమగు "నేను ఈ మనస్సును కట్టేసి ఆపై ఇప్పుడు మోక్షం పొందవలసియున్నది" అను పట్టుదల రూపంలో ఏర్పడుచున్న మోక్షబుద్ధినికూడా నిస్సంకోచంగా వదిలి వేయవయ్యా! 'నాకు బంధం కలదు' అనే బంధబుద్ధిని, "ధన–ధార పుత్రాదులగురించి ఏర్పడే ఆశ నిరాశలచే బంధించబడే నిస్సహాయ పదార్థమును" అనే నిస్తేజకల్పనలను సుదూరంగా అట్టేబెట్టు. "నాకు మోక్షం కలుగ వలసియున్నది" అనే భవిష్యత్ ప్రాప్తబుద్ధి మనస్సులో ఉన్నంత కాలం సంసారమునకు సంబంధించిన ఛాయలు ఏర్పడి ఉన్నట్లేనని గ్రహించు.

ఉన్న రహస్యమంతా మనస్సులోనే ఉన్నది. మనస్సు ఉత్కంఠితము (Inquisitively emotional) అగుచూ ఉండగా, క్రమంగా అది ఈ దేహాకారమును ధరించుచున్నది. ఫలితంగా... సర్వ దోషములూ వచ్చిపడుచున్నాయి.

శ్రీరాముడు : అయితే బంధమోక్షములనబడేవి లేవంటారా?

శ్రీవసిష్ఠ మహర్షి : మహత్తరము అద్వితీయమూ అగు ఆత్మ సర్వమునకు అతీతమై ఉండి సర్వమునందు సర్వదా వ్యాపించి ఉండగా, ఇక బంధమెవరికి? మోక్షమెవరికి? అందుచేత మోక్షం విషయం అట్లా ఉంచి, ముందు నీ మనస్సును ఇంద్రియ విషయ మననరహితం, అఖండాత్మమననసహితం చేయి.

❖

ప్రాణవాయువు చలనధర్మం కలిగి ఉన్నది కదా! అది ఈ శరీరమున చలింపజేస్తూ ఉండగా ఈ హస్తపాద నాలుకలు తదితర అంగములు రసభరితమై చలిస్తున్నాయి. అవయవములను ప్రాణవాయువులే చలింపజేస్తున్నాయి. అయితే... సర్వవ్యాపియగు చైతన్యము తాను చలించదు. దేని చేతా చలింపబడదు.

దీపం సర్వపదార్థములను ప్రకాశింపజేస్తూ తాను యథారీతిగానే వుంటున్నట్లు, చైతన్యము సర్వ పదార్థములందు ప్రతిబింబించుచూ తాను స్వస్వరూపమునందే నెలకొని ఉంటోంది. అది జ్ఞానము ద్వారా సర్వమును ప్రకాశింపజేస్తోంది.

ఒకవైపు చైతన్యము అప్రమేయమై, నిత్యమై, జ్ఞానస్వరూపమై, శుద్ధమై వెలుగొందుచుండగా ... అల్పబుద్ధులగు సంసార జీవులు 'ఈ దేహములే మేము.. ఇవి మా అంగములు. అవి మా ధనములు' ధనములు మొదలైన దుఃఖదాయకమగు మిథ్యామోహం ఆశ్రయిస్తున్నారు. మా ప్రకటన, నినాదములపట్ల ఏమీ విననట్లే ఉంటున్నారు. ఎందుకోమరి?

కేవలాత్మ (The Absolute self)కు విరుద్ధమైన ధర్మములు గల ఈ దేహము నందు, జలంతో తరంగముల లాగా, రాగము మొదలైనవి ఏర్పడి ఉంటున్నాయి. అట్టి రాగాదులచే ఆవరించబడిన అనిత్యదృష్టిచే క్రమంగా ఎరుగబడేవి, పొందబడేవి, పరిణమించేవి.. మొదలైన క్రియాక్రమములన్నీ సంప్రాప్తిస్తున్నాయి.

మృగతృష్ణ ఎందుకు కనబడుతోంది. ఎండ, వేడిమి, గాలి వీచికల ప్రతిబింబముల కలయిక ధర్మములు తెలియకపోవటం చేతనే కదా! ఆత్మయొక్క ధర్మము తెలియక పోవటం చేతనే 'నేను పుట్టాను, పుట్టేవాడను, కర్తను,. భోక్తను' మొదలైన మిథ్యావాసనలు కలుగుచున్నాయి.

శ్రీరాముడు : స్వామీ! మనస్సు ఎందుకు మిథ్యావాసన వైపు ఈడ్వబడుతోంది.

శ్రీ వసిష్ఠ మహర్షి: అవిద్యను మిథ్యగాగాక, సత్యముగా తలచటం చేతనే ఆ మార్గంలో మనస్సు ఈడ్వబడుతోంది. మనస్సు ప్రమత్త (Passive & Dull) అయినప్పుడు శబ్ద స్పర్శాది విషయముల వైపు పయనిస్తోంది. విషయాభిలాషితమైన మనస్సు అవిద్యను ఆశ్రయిస్తోంది. ఆ అవిద్యను తనకు అనుభవప్రదాత (Source of experience)గా స్వయముగా తీర్చిదిద్దుకుంటోంది. కాబట్టి స్వయం

కల్పితమే అవిద్య. అంతేగాని దానిని మరెవరో ఈ మనస్సుకు అందిస్తున్నది కాదు. ఈ అవిద్య మిథ్యా రూపములుగా ఎరుగబడు గాక! అట్లు ఎరుగబడిన మరుక్షణం అది స్వయంగా నశించి ఎటకో చిత్తగిస్తుంది. "అది మృగతృష్ణయే" అని తెలిసిపోయిన తరువాత అక్కడకు వెళ్ళి "ఇక్కడ జలం ఉండాలే? ఏమైపోయింది?" అనే వాక్యం ఉత్పన్నం కాదు కదా! తెలుసుకొనబడిన తరువాత అవిద్య మనస్సును ఈడ్వజాలదు.

❖

చీకటి పోవటానికి దీపం వెలిగిస్తే చీకటి స్వయంగానే తొలగుతుంది చూచావా? ఆత్మజ్ఞానం ఉదయించిన మరుక్షణం వాసనలన్నీ వాటంతట అవే తొలగుతాయి.

శ్రీరాముడు : అవిద్య మొదలంటా తొలగాలంటే ఉపాయమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : నీవు ఆయా అధ్యాత్మ శాస్త్రములందిస్తున్న యుక్తులచే "అవిద్య లేదు" అను నిశ్చయం పొందావనుకో, అప్పుడు అవిద్యను నశింపజేయగలుగుతావు. అందుచేత రామా! సింహము బోనును పగలగొట్టి బయల్వెడలునట్లు – నీవు అవిద్యా నిర్మూలనం చేయాలి. "జడమగు ఈ దేహం కొరకై ఏర్పడి ఉన్న భోగాలతో నాకేమి పని?" – అనే నిశ్చయమును పెంపొందించుకోవాలి. అట్టి నిశ్చయం యొక్క బలంతో దృశ్యమునందు నీకు ఏర్పడే ఆశ అను దానిని నశింపజేయాలి.

ఆశాపరికరే రామ నూనం పరిహృతే హృదా ।
పుమానాగతసౌన్దర్యో హ్లాదమాయాతి చన్ద్రవత్ ॥ (శ్లో 24, సర్గ 74)

అప్పుడు ఆశ యొక్క పరివారమైన దేహాభిమానం, కామక్రోధాదులు తొలగుతాయి. తన ప్రయత్నముచే సుందరగుణములు సంపాదించుకున్న మనుజుడు తాను ప్రసన్నుడగుచూ, తదితర పరిసరములను కూడా ప్రసన్నం చేయగలుగుతాడు. అట్టి జ్ఞాని అధిక శోభాన్వితుడై మహద్రూపముచే తన యందు తానే ఇముడక... అపరిచ్ఛిన్నుడై ఉంటాడు. స్వాత్మయందు ప్రశాంతుడై, క్షోభావర్జితుడై, సుస్థిరుడై అత్యంత ధైర్యపూర్వకమైన మోక్షలక్ష్మితో శోభిల్లుతూ ఉంటాడు. అమృతము త్రాగిన వాని వలె, కుండలో వెలిగేదీపంలాగా దేదీప్యమానమైన మణిలాగా ఆత్మ జ్ఞాన ప్రకాశంతో శోభిల్లుతాడు. సర్వాత్మకుడై, సర్వవ్యాపకుడై, సర్వేశుడై, సర్వాకారుడై, నిర్వికారుడై ఎల్లప్పుడూ ఆత్మనే వీక్షిస్తూంటాడు.

ఆ స్థితిలో ఆతడు ఒక్కసారి తన గడచిపోయిన రోజులలోని చంచల చిత్తమును చూచి నవ్వుకుంటూ ఉంటాడు.

విషయసంగమును వీడుటచే, అభిమాన – సంతాపములను అధిగమించుటచే ఆతడు పవిత్ర చిత్తుడౌతాడు. ఆత్మయందు మాత్రమే ప్రీతి కలిగి ఉంటాడు. 'కామము' అనే బురదను కడిగివేసుకొని ఉంటాడు. 'బంధము' అనే భ్రమను మొదలంట్ల నరికి వేస్తాడు. శీతోష్ణ, సుఖ దుఃఖాది ద్వంద్వముల నుండి విడివడినవాడై, ఈ సంసార సముద్రమును దాటివేస్తాడు. సర్వోత్తమమగు విశ్రాంతిని, సర్వాతీతము, అలభ్యము అగు స్థానమును పొందుతాడు. పునరాగమనరహితుడై మోక్షసామ్రాజ్యమును అలంకరిస్తాడు. మనోవాక్కాయములచే సర్వజనులూ అభిలషించే చరిత్ర కలిగి ఉంటున్నాడు.

అట్టి ఆత్మజ్ఞాని దేనినీ ద్వేషించడు. వాంఛించడు. ఆతనికి సుఖ దుఃఖాదులు ఉండవు. దేనినీ గ్రహించడు, తిరస్కరించడు. నిందించడు. స్తుతించడు. స్వస్వరూపము యొక్క ఆవిర్భావము గాని, తిరోభావముగాని పొందడు. ప్రసన్నుడుగాడు. దుఃఖితుడు కాడు. సర్వకార్యములను త్యజించినవాడై, సర్వోపాధివర్జితుడై, సర్వాశలనుండి వినిర్ముక్తుడై ఉంటాడు. అందుకే మనం ఆతనిని 'జీవన్ముక్తుడు' అని పిలుస్తున్నాం.

❖

ఓ రామచంద్రా! సర్వ ఈషణములను (All urges, desire) పరిత్యజించివేయి. జలధారను సంపూర్ణంగా విడచివైచిన మేఘంలాగా నీ చిత్తము మౌనం వహించి ఉండుగాక! ఆశారాహిత్యమును ఆశ్రయించి ఉండు.

ఆశారాహిత్యం గల అంతఃకరణంవలన కలిగే సుఖం ఈ స్వర్గ – మర్త్య – పాతాళములలో మరెక్కడా దొరికేది కాదయ్యా! నీయొక్క నైరాశ్యము (ఆశారాహిత్యం)చే ఈ జగత్తునంతటినీ ప్రశాంతమయం, శీతలం చేసివేయి. 'ఆశించుట' అను దురభ్యాసము నుండి విడివడిన మనస్సు కలిగినవాడవై ఉదారచిత్తుడవై, మౌనివై, జ్ఞానివై శోభించు. ఏదీ కోరనట్టి మనస్సు కలవాడవై, ఉదార – జ్ఞాన – మౌన శోభితుడవై ప్రకాశిస్తూ ఉండగా... అట్టి శోభకు వసంత సౌకుమార్యము కూడా దీటు రాదు సుమా!

ఆశయే లేని మనస్సు ఇచ్చే సుఖం త్రిలోకాధిపత్యంలో కూడా ఉండదు.

❖

ఓ సాధూ! నీకు రెండవరోజు సంవాదంలో చెప్పాను. కోరిక శమించటమే 'శమము' అని అంటాం. అట్టి శమము సంపాదించినవాని అంతఃకరణం శాంతమయమౌతుంది. అప్పుడు నీ పట్ల ఆపదలన్నీ క్షయిస్తాయి. అట్టి శమం, శాంతం, నైరాశ్యం అను పర్యాయపదాలచే అలంకృతుడవై అటుపై ఈ భూమినంతటినీ గోష్పద తుల్యంగా చూడు. లోకముల ఆధిపత్యమును కూడా తృణ ప్రాయంగా దర్శించు.

ఈ మనుజులలో అనేకులు ధన సంచయం, పుత్ర కళత్రాదులతో సమాగమం వస్త్రాలంకరణం, వస్తు సముదాయం, అన్నపానాది క్రియా పరంపరలు – గొప్పగొప్ప విషయాలుగా గాంచుచున్నారు. ఆశలన్నిటినీ అధిగమించియున్న మహనీయులు ఆ వ్యవహారములన్నీ చూచి పకపకా నవ్వుకుంటు న్నారు. ఎవరి హృదయంలో 'ఆశ' అనే ఛాయ ఏర్పడటానికే జంకుతుందో... అట్టి మహనీయులతో మనం పోల్చగలిగినది ఈ ముల్లోకాలలో ఏదీ లేదు. "ఇది నాకు కావాలి,. అది నాకు వద్దు" అను రాగద్వేషములకు ఎవని చిత్తంలో చోటు దొరకదో... అట్టి స్వాధీన చిత్తుని గురించి చెప్పటానికి నా దగ్గిరున్న ఉపమాన–ఉపమేయాలన్నీ ఏమాత్రం సరిపోవు సుమా! అట్టివారు మా మహర్షులకు కూడా ప్రాతఃస్మరణీయులగుచున్నారు.

❖

అందుచేత రామా! నీకు మరల మరల గుర్తుచేస్తున్నాను. నీవు ఆశారాహిత్యమును అభ్యసించు. ఆశ్రయించు. అది సర్వసంకటవర్జితమని, పూర్ణసుఖస్వరూపమని బుద్ధియొక్క పరమసౌభాగ్యమని మహనీయులు ప్రవచిస్తున్నారు.

ఓ రాఘవా! అసలు ఇక్కడ తారసపడుచున్న ఆశతోగాని, నిరాశతోగాని నీకు (లేక, ఈ జీవునికి) ఏమాత్రం సంబంధం లేదు. ఎందుకంటే ఇక్కడ ఏర్పడివుండి ...నీకు ఆకర్షణ వికర్షణ కలుగజేస్తున్న ఈ జగత్తంతా స్వతఃగా మిథ్య మాత్రమే. ఇక నీవు వీటి పట్ల నాకు ఉండు గాక... లేకుండు గాక అను ప్రియాప్రియములకు సంబంధించిన కల్పనలతో ఎందుకు శ్రమించాలి చెప్పు?

ఓ సర్వజనులారా! నేను ఇంతగా బోధించిన తరువాత కూడా "ఈ దేహం, ఈ పదార్థాలు నావి. ఈ దేహము ఏర్పడుచున్న తరువాత సిద్ధిస్తున్న వాటిచే నేను పరిమితుడను" అను దృష్టిని వదలటానికి ప్రయత్నించక పోవటం ఉచితమేనా చెప్పండి? సద్వివేచన చేయమని నా ప్రార్థన.

❖

ఆత్మైవేదం జగత్సర్వం నానాతేహ న విద్యతే ।
ఏకరూపం జగజ్ఞాత్వా ధీరైర్నామ న ఖద్యతే ॥ (శ్లో 54, సర్గ 74)

ఓ రామా!ఈ ప్రపంచమంతా ఆత్మయే. ఇక్కడ అనేకత్వమనునదే లేదు. మీరు ఏకమైన ఆత్మ రూపంగా ఈ జగత్తును ఎరిగి ఈ జగత్తును ధీరస్వభావులైన వారు ఎలాంటి ఖేదమొందక ఉన్నారు.

ఓ రాఘవా! "ఈ పదార్థములన్నీ యథార్థదర్శనముచే ఆత్మ రూపంగానే తెలియవస్తున్నాయి" అని నీవు నీ బుద్ధికి మరల మరల గుర్తు చేయి. అప్పుడది అకృత్రిమమైన పరమ ధైర్యం పొందుతుంది. నిజమైన ఆశారాహిత్యం ఉదయిస్తుంది. ఇక ఆపై భావాభావకల్పితరహితుడవై... సర్వ వస్తువుల ఆద్యంతములందు ఉన్నట్టి 'సత్ చిన్మాత్రము' ను మాత్రమే అవలంబించి వుండు. ఇదీ నీవు ఈ జగత్తును గాంచవలసిన విధానం సుమా!

సింహమును చూడగానే లేడి ఏం చేస్తుంది? ఎక్కడికో దూరంగా పారిపోతుంది కదా! వైరాగ్యంచే ధీరమైనట్టి మనస్సు గలవానిని చూచి "రాగ-ద్వేష-ఆవేశ-భ్రమ-ఉద్వేగ-ఆశ-నిరాశాది భావనోద్రేక" - భరితమైన ఈ సంసారం తోక ముడిచి ఎక్కడికో పారిపోతోంది. ధీరబుద్ధి గల ఆత్మ జ్ఞాని ఒక కామోన్మత్త అయిన అతి సుకుమార స్త్రీని, శిథిలమైన శిలా విగ్రహమును ఒకేరకంగా చూస్తాడు. అందుచేత విషయభోగాలు ఆనందింపజేయటం గాని, ఆపదలు ఖిన్నపరచటం గాని జరుగదు. ఈ దృశ్య వైభవమంతా కలసి ఏకమై దండయాత్ర చేసినా సరే ....ఆతనిని స్వాత్మ నుండి తొలగించలేవు. ఆతని ఉదార బుద్ధి ఇక్కడి మోహాలను క్షణంలో చూర్ణం చేసివేస్తుంది. రాగ ద్వేషాదులు ఆతనిని ఆక్రమించలేవు. చలింపజేయలేవు, తానే వాటిని ఆక్రమించి అధిగమించి ఉంటాడు.

శ్రీరాముడు : మహర్షీ! మీరు మాకు విడమర్చి చెప్పుచున్న ఆత్మజ్ఞుల దృష్టి మాకు ఎంతోసంతోషమును, ఉత్సాహమును కలుగుజేస్తోంది. మేమంతా పూర్ణ జ్ఞానులుగా తీర్చిదిద్దబడటమే ఈ సంసారమును

అధిగమించటానికి తరుణోపాయం కదా! అందుచేత జ్ఞానుల దృష్టి అవగాహన, కార్యక్రమముల గురించి మీ నుంచి ఎంతైనా మేము వినవలసిందే. అందుచేత, ఆత్మజ్ఞానుల జగత్ సందర్శనం గురించి మరికొంత వివరించండి.

❖❖❖

5. జ్ఞాన సందర్శనం

శ్రీవసిష్ఠ మహర్షి : జ్ఞాని యొక్క జగత్ సందర్శనం గురించి మనం అనేక మార్లు చెప్పుకుంటూనే ఉన్నాం. అయినా కూడా మరల మరల విశదీకరించుకోవటం అవసరమే.

ఆతడు దేనిపట్లా ప్రీతి గొనడు. విజ్ఞాన దృష్టిని వదలడు. క్షోభను దరిజేరనీయడు. అనాసక్తతను బలపరుచుకుంటూ ఉంటాడు. దేహాతీతత్వం అవధరిస్తూ ఉంటాడు. వికారరహితుడు, నిరంతర ఆత్మసంలగ్నధ్యానమయుడు అయి ఉంటాడు. సర్వముచే అస్పృశ్యుడై ఉంటాడు.

శ్రీరాముడు : మీరు ఉపయోగించిన విశేషణములు – 1. అప్రీతి 2. విజ్ఞాన దృష్టి 3. అనాసక్తత 4. దేహాతీతత్వం 5. వికారరాహిత్యం 6. అస్పృశ్యత్వం – గురించి కొంచెం వివరించి చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : సరే. నీవు కోరినట్లు కొంచం వివరించి చెపుతాను విను –

ప్రీతి గొనకపోవటం – జ్ఞాని ఒక లతను–సుందర స్త్రీని, మట్టిని–బంగారాన్ని, నచ్చేవాటిని–నచ్చనివాటిని ఒకే రీతిగా చూస్తాడు. ఉభయ సమయములలోనూ నిర్వికారుడై, నిర్లిప్తుడై ఒక పర్వతంలాగా స్థిరాకృతితో ఉంటాడు. పవిత్రమైన ఆశయం, కార్యక్రమంతో ప్రయాణం చేస్తున్న ఒక బాటసారి రహదారి ప్రక్కన కనబడిన శ్మశానమును చూచినప్పుడు ఆతనికి దానిపట్ల ప్రీతి కలుగుతుందా? జ్ఞాని ఇక్కడ కనబడే సందర్భముల పట్ల, భోగములపట్ల ఏమాత్రం ప్రీతి గొనడు.

విజ్ఞాన దృష్టి కలిగి ఉండటం! - కళ్ళు తెరిచినంత మాత్రం చేత మరే విశేషప్రయత్నం లేకుండానే ఎదురుగా ఉన్న వెలుతురు కనబడుతుంది కదా! ఆత్మజ్ఞాని ప్రవాహపతితంగా వచ్చిపోతున్న ఆయా సంఘనలను, సందర్భములను, భోగసముదాయమును సక్తత లేని చిత్తంతో లీలామాత్రంగా అనుభవిస్తాడు. కాకతాళీయంగా తారస పడే ఈ వనిత, ధనము మొదలైన భోగములు అనుభవించ వలసి వస్తున్నప్పటికీ, ధీరునకు అవి సంతోషమునుగాని, దుఃఖమునుగాని కలిగించలేవు. సముద్ర మధ్యంలో స్థిరంగా ఉన్న పర్వతాన్ని ఓ రెండు కెరటాలువచ్చి తాకినంత మాత్రం చేత అవి పర్వతమును కదిలించగలవా? ఆత్మ యొక్క ప్రత్యక్షమును ఏకాగ్రతతో దర్శించుచున్నట్టి తత్త్వజ్ఞానిని ఈ దృశ్య ప్రపంచములో ఏర్పడుచున్న సుఖ దుఃఖములు తాకజాలవు. తాకినప్పటికీ, ఆతని ఆత్మ సందర్శనాన్ని ఏమాత్రం భంగపరచలేవు. ఆతడు ఎప్పటికి ఏది ప్రస్తుతమో... అదే నిర్వర్తించుచూ... ఆపై ఇక తన దృష్టినంతా ఆత్మజ్ఞాన మార్గంలో నియమించి ఉంచుతాడు.

క్షోభ పొందకపోవటం! - అనేక లోకములు నిర్మించవలసివచ్చుచున్నప్పటికీ ఆత్మ పరాయణుడగు బ్రహ్మదేవుడు వ్యగ్రుడగుచున్నాడా? ఆయా ఋతువులు వచ్చిపోతున్నప్పుడు పర్వతాలు ఏమైనా

క్షోభ పొందుచున్నాయా? లేదే! సర్వభూతస్థమై ఉన్న తన ఆత్మస్వరూపమును ఆశ్రయించి ఉన్నట్టి జ్ఞాని కూడా సమయోచితమైన క్రియాదులలో ఏర్పడే సంయోగ – వియోగములు చూచి వ్యగ్రుడుకాడు, క్షోభ చెందడు.

అందరిలాగానే ఆతడు కూడా నవ్వవలసినచోట నవ్వుతాడు, ఏడవవలసినచోట ఏడుస్తాడు. కాని, సర్వ విషయముల పట్ల 'ఇది మిథ్యయే కదా' అను అవగాహన, దృష్టులను వదలకుండా ఉంటాడు. అంతేకాదు. తదితరజనులకు అది గుర్తుచేస్తూ ఎంతో స్థైర్యం కలుగజేస్తాడు. భోగములను మిథ్యారూపంగా గాంచుచూ, కాఠిన్యం లేకుండా ... జితేంద్రియుడై సంతాప వర్జితుడై ఉంటాడు. దేశ కాల క్రమానుసారంగా సుఖము, దుఃఖము, సంపద, ఆపద – మొదలైన వాటి పట్ల నిర్లిప్తుడై, సాక్షీభూతుడై, అతీతుడై ఉంటాడు.

అనాసక్తుడై ఉండటం! - ఓ ప్రియ దశరథ రామా! ఈ శబ్దస్పర్శాది కర్మేంద్రియ వ్యాపార విషయాలలో పాల్గొనవలసి వచ్చినప్పటికీ, నీవు నిత్యమూ అనాసక్తుడవై ఉండు. వాటి యందు నీ చిత్తము అనాకర్షితమై ఉండు గాక! సంలగ్నం కాకుండు గాక!

అయితే... "ఈ బంగారం మలినమైనది" అని ఎప్పుడంటాం? బైట ధూళివంటివి ఉన్నప్పుడా? ...కాదు. లోపల రాగి వంటి అల్పలోహాలు ఉన్నప్పుడు మాత్రమే కదా!... అంతఃకరణంలో ఆసక్తి ఉన్నప్పుడు మాత్రమే "ఈ జీవుడు సక్తుడు" అని అనిపించుకుంటాడుగాని, బాహ్య కార్యక్రమములచే కాదని నీవు గ్రహించు.

దేహముతో అప్రమేయత్వం వహించి ఉండటం! - ఎప్పుడైతే ఈ దేహమును తనకు భిన్నమైనది గానూ, ఆత్మను వివేకదృష్టితోనూ మననపూర్వకంగా సందర్శిస్తూ ఉంటాడో, ఆతడు ఈ అవయవములు ఛేదించబడుచున్నప్పుడు కూడా అంతరంగంలో విక్షేపరహితుడై ఉంటున్నాడు. ఒక్కసారి నిర్మలజ్ఞానం సంపాదించావా.... ఇక ఆ ఆనందమయ వివేక దృష్టి నిన్ను విడచి ఎక్కడికీ పోదు.

తిరోగమనం స్వీకరించకపోవటం! (Non deviation - Non distraction) **–** 'నా స్వరూప స్వభావాలు సర్వదా ఆత్మయే. ఆత్మ ఇట్టిది" అని ఆత్మను ఎరిగినవాడు మరింకెప్పుడూ, ఎన్నటికీ అజ్ఞత్వం పొందదు. వర్షాకాలంలో పర్వతం మీద నుంచి జారి ప్రవహించిన జలం మరల వెనుకకు మరలుతుందా? త్రాడు పట్ల ఏర్పడిన 'ఇది పామేమో?" అనే భ్రాంతి తొలగిన తరువాత, ఆ త్రాడును చూచినప్పుడు భయం మొదలైన వికారములు ఏర్పడతాయా? అగ్ని యందు స్ఫుటం ఒనర్చబడిన బంగారం తన శుద్ధసహజ ఛాయ పొందిన తరువాత, దానిని నీళ్ళలో ముంచినంత మాత్రం చేత తన బంగారు కాంతులు పోగొట్టుకొంటుందా? చెట్టు నుండి తెగిజారిన పండును మరొకసారి కొమ్మకు అతికించినా కూడా, అతికి ఉండదు కదా? అట్లాగే "ఈ దృశ్యం స్వతఃగా అవాస్తవం" అనే సుజ్ఞానం నిశ్చలమైన తరువాత ఇక గుణములతో బంధం ఏర్పడదు. రాళ్ళగుట్టలోంచి మణిని వేరుచేసి మెడలో ధరించిన తరువాత, మరల ఆ మణిని రాళ్ళగుట్టలోకి విసరివేసే మూర్ఖుడెవడైనా ఉంటాడా? అవిద్య నుండి విద్యను ఎరిగిన తరువాత ఈ దృశ్యమునందు మరల ఎవడు మగ్నుడౌతాడు? సశాస్త్రీయమైన శివ తాండవం చూచిన తరువాత ఒక కోతి కుప్పిగంతులను చూచి ఆనందించేవాడెవ్వడో చెప్పు?

దృశ్య వికార రాహిత్యం! - "ఇది పాలు కాదు. సున్నపునీరు మాత్రమే" అని ఉత్తమ విచారణచే గ్రహించిన తరువాత "అయ్యో! నేను త్రాగలేకపోయానే?" అనే వేదన చెందే మూర్ఖుడెవడు? అట్లాగే ఉత్తమ విచారణచే వాసన నివృత్తి అవుతుంది. ఇక దిగులు పడటానికి, వేదన చెందటానికి ఇక్కడ ఏదీ మిగలదు. ఉత్తములగువారు "ఇది మజ్జిగ" అని భ్రమించుటచే త్రాగాలని కోరుకుంటారేమో గాని "కాదు... తెలిసిపోయింది... ఇది కల్లు" అని గ్రహించిన తరువాత త్రాగాలని అనుకుంటారా? తత్త్వజ్ఞుడు "సర్వము ఆత్మయే" అను ఎరుకను అవధరించిన తరువాత అందమైన స్త్రీ శరీరమును ఒకానొక లిఖిత చిత్రమువలె చూస్తాడుగాని, వికారాదులు పొందడు.

చిత్రంలో లిఖించబడిన స్త్రీ అంగములన్నీ ఆయా రంగుల సమ్మేళనము మాత్రమే కదా! అట్లాగే స్త్రీ పురుషుల జుట్టు – గోళ్ళు మొదలైన అవయవములన్నీ పంచభూతముల సముదాయమేనని గ్రహించి ఉంటాడు.

పటికబెల్లం తీపిని ఆస్వాదించిన తరువాత, ఆ తదుపరి త్రాగే నీళ్ళు పటికబెల్లపు తీపిని మరిపింపజాలదు కదా! ఆత్మానందం పొందినవాడు తదితర విషయ సుఖములను చూచినంత మాత్రం చేత ఆత్మను ఏమరువడు.

నిరంతరమైన నిమగ్నం - ఒకానొక ముగ్ధస్త్రీ దూరప్రాంతం వెళ్ళి ఇంకా రావలసియున్న తన భర్తయందు... ఆసక్తి కలిగియున్నదనుకో...ఆమె గృహకృత్యములందు తలమునకలై ఉన్నప్పటికీ తన అంతఃకరణమునందు తన భర్త యొక్క రాకచే ఏర్పడే స్నేహానుభవమునే మననం చేస్తూ ఉంటుంది కదా! శుద్ధ బ్రహ్మముతో సమాగమం, విశ్రాంతి పొందు ప్రయత్నశీలుడగు జీవుడు ఆ బ్రహ్మానందమును అనుభవిస్తూనే ఈ ప్రాపంచిక క్రియలందు పాల్గొంటూ ఉంటాడు. ఇవేవీ ఆతని ఆత్మానుభవమును నిరోధించలేవు. ఇంద్రాది దేవతలంతా కలిసికట్టుగా వచ్చి కూడా ఆతని బ్రహ్మానందానికి ఖేదము కలిగించలేరు. మనస్సును అధిగమించిన ఆత్మజ్ఞానికి 'చ్యుతి' కలిగించగలిగే శక్తి ఈ ప్రపంచములోని ఏ పదార్థమునకూ ఉండదు.

విషయములచే స్పర్శించబడకపోవటం! - వివిధ పుష్పరసములన్నీ తేనె యందు ఏకమై పోతున్నాయి. ప్రపంచములోని ఆనందములన్నీ బ్రహ్మానందమునందు సమరసమై పోతున్నాయి. తత్త్వజ్ఞుడగు మనుజుని బుద్ధిని ఎవరు దేనిని చూపించి ఏమరిపించగలరు? తన ప్రియుని పట్ల ఆసక్తమైన బుద్ధిగలస్త్రీ ఎన్ని విఘ్నములు, నిరోధములు కల్పించబడుచున్నాకూడా, అవన్నీ లెక్కచేయక ప్రియునియందే మనస్సు కలిగి ఉంటుంది చూచావా? అవిద్యారహితుడగు జ్ఞాని ఆత్మానందమును అనుభవిస్తూనే ఉంటాడు. కష్టములన్నీ వచ్చి పడుగాక! అవయవములు ఛేదించబడుగాక! విషాద సంఘటనలు తారసపడుగాక! సిరులు వచ్చుగాక....పోవుగాక! ఆతని ఆత్మానుభవం చెక్కుచెదరదు. "నిష్కళంకము, అత్యున్నతము, అంతర్గతము అగు ఆత్మను నేను" – అనునది ఏమరువడు.

ఆత్మజ్ఞాని ఈ చిత్తమును ఒక బాహ్యమగు ఉపకరణమువలె చూస్తాడు. కనుక ప్రారబ్ధకర్మలందు, దారిద్ర్యాది దశలందు, సంకటములందు ఆతని ఆత్మానుభవ స్రవంతికి అడ్డు ఉండదు. నగరంలో

ఉన్నా, అరణ్యంలో ఉన్నా, పర్వతములపై ఉన్నా, తపోవనంలో ఉన్నా, ఊపిరిసలపనన్ని పనులలో ఉన్నా... అవేవీ ఆతనికి హర్షశోకములుగా పరిణమించవు. ఆతడు సర్వదా ఈ సర్వముచే అస్పృశ్యుడై ఉంటాడు.

❖❖❖

6. సోదాహరణములు

శ్రీరాముడు : ఆత్మజ్ఞాని గురించి మీరు చెప్పే విశేషాలన్నీ ఆమోదయోగ్యమేనని ఒప్పుకుంటున్నాను. అయినా కూడా, ఈ రాజ్యాదులు, ఈ ధన జనాది విషయసంపర్కములు ఎదురుగా ఏర్పడి ఉండగా మనస్సు విజ్ఞతను, ఆత్మదృష్టిని ఎట్లా అలవరచుకోగలుగుతుందోనని... నాకు కొంచం అనుమానంగానే ఉన్నది. అనేకులు సంసారదృష్టిని వదలలేకపోవటం మనకు కనబడుతూనే ఉన్నది కదా!

శ్రీవసిష్ఠమహర్షి : ఉత్తమ ఉదాహరణలు కొద్దియే కావచ్చు. మనం ఆత్మజ్ఞానుల ప్రేరణాదులనే అనుసరణీయంగా స్వీకరించాలి గాని... సంఖ్యాపరంగా ఎక్కువ మంది కాబట్టి, అజ్ఞానుల సాంసారిక దృష్టిచే ఎందుకు సంక్షోభం పొందాలి?

ఆత్మ జ్ఞానం సంపాదించి కూడా యథాతథంగా ఈ ప్రాపంచిక కార్యక్రమములు నిర్వర్తిస్తున్న మహనీయులు ఎందరో ఉన్నారు. నీకు కొన్ని దృష్టాంతాలు చెపుతాను విను– జనక మహారాజు గురించి మనం చెప్పుకున్నాం. ఆతడు అందరు రాజులు లాగానే రాజ్యకార్యములందు నిమగ్నమై ఉన్నారు. అయినప్పటికీ సదా దుఃఖరహితుడై దేనికీ ఏమాత్రం వ్యాకులత పొందక ఉన్నాడు కదా!

మీ పితామహుడు దిలీపుని గురించి తెలుసు కదా! సర్వ కార్యములు నిర్వర్తిస్తూనే అంతః కరణంలో వీతరాగుడై చిరకాలం అయోధ్యను పాలించలేదా? మనువు రాగకళంకం లేని మనసుతో జీవన్ముక్తుడై ప్రజలను ఏలారు. మాంధాత చక్రవర్తి అనేక యుద్ధాలలో పాల్గొనుచూ బ్రహ్మజ్ఞానియై వెలుగొందారే! అట్లాగే, పాతాళంలో బలిచక్రవర్తి "ఇదంతా సమయోచితమే" ...అను అవగాహనతో ఏవేవో క్రియావ్యవహారములు నిర్వర్తిస్తూనే తాను మాత్రం సదా త్యాగి అయి, ఆసక్తిరహితుడై, జీవన్ముక్తుడై ప్రకాశించుచున్నాడు. దానవుల ప్రభువైన 'సముచి' అనేకసార్లు దేవతలతో యుద్ధం చేస్తూ వివిధములైన ఆచార–విచార తత్పరుడై కూడా ...దేనికీ ఏ మాత్రం ఖిన్నుడగుట లేదు. 'వృత్రాసురుడు' అనే రాక్షసుడు అత్యంత ఉదారచిత్తుడై, మాననీయుడై, తన దేహంతో అనేకసార్లు దేవతలతో యుద్ధం చేసి చివరికి పిల్లవాడు ఆట బొమ్మను వదిలినట్లు శరీరమును ఇంద్రుని చేతిలో త్యజించాడు. పాతాళాధీసుడైన ప్రహ్లాదుడు వాక్కు అగోచరమైన అక్షయసిద్ధి పొంది కూడా సాంసారిక మాయలో నిశ్చింతగా పాల్గొన్నాడు.

అట్లాగే శంబరాసురుడు కూడా! ఆతడు ఒక వైపు అనేక మాయలను సృష్టిస్తూ దానవుల కొరకు విష్ణువుతో యుద్ధం చేస్తూ ఉండేవాడు. మరొక వైపు అనాసక్తుడై కుశల బుద్ధితో ఉత్తమజ్ఞానాన్ని ఆశ్రయించి ఉండేవాడు. పరమ చిదాకాశమున ఏకత్వరూపుడై ఉంటూనే ....సంక్లిష్టమైన యుద్ధసన్నివేశాలు రచిస్తూ ఉండేవాడు.

సర్వదేవతాముఖ రూపుడైన అగ్నిదేవుడు ఒక్కసారే అనేక యజ్ఞ, యాగాలలో హవిస్సు స్వీకరిస్తూనే, ముక్తుడై... అప్రమేయుడై ఈ చరాచర సృష్టిని ఆక్రమించియున్నారు. ఆ చంద్రుడు తన యందు అమృతమును ధరించి ఈ భూమిపై ఓషధ రచనకు కారకుడగుచూ తాను నిర్వికారుడై పరమజ్ఞానముతో ప్రకాశిస్తున్నాడు. దేవతల పౌరోహిత్యం, గురుత్వం, భార్య కొరకు చంద్రునితో యుద్ధం... మొదలైనవి నిర్వర్తిస్తున్న బృహస్పతి తాను మాత్రం సర్వదా ముక్తస్వరూపముతో తేజరిల్లుచున్నారు. అట్లాగే శుక్రాచార్యుల విషయం తెలుసుకదా! ఆయన సర్వుల అభీష్టమును పాలించుచూ, తదనుకూలంగా నీతిశాస్త్రరచన చేశారు. అసురులకు గురువై, వారినందరినీ ఒక త్రాటిపై నడిపిస్తున్నారు. వాళ్ళకు దిక్కు - శ్రేయోభిలాషి ఆతడే. అయితే ఏం? నిర్వికారబుద్ధితో సాక్షిమాత్ర పూర్వకంగా కాలగమనం కొనసాగిస్తున్నారు. వాయుదేవుడు ఊర్ధ్వ అధోలోకాలను, ప్రాణములందలి అవయవాలను చలింపజేస్తూ ఉంటారు. సదా సర్వ ప్రదేశములందూ సంచరిస్తూ, ముక్తుడే అయి ఉంటున్నారు. ఆయనకు ప్రియుడెవ్వరు? అప్రియుడెవ్వరు?

నాయనా! రామా! బ్రహ్మజ్ఞులై కూడా తమకు నియమితములైన కార్యములను ప్రశాంత బుద్ధితో నిస్సంగులై నిర్వర్తించే మహనీయులెందరో ఉన్నారు. పరబ్రహ్మమూర్తియగు బ్రహ్మదేవుని చూడు. ఆయన ఈ లోకములన్నిటి యొక్క ఊర్ధ్వ-అధో-మధ్య గతి పరివర్తనములను రచించి ఉన్నవారే కదా! అయినప్పటికీ సమచిత్తము కలిగి తన సుదీర్ఘమగు ఆయువును గడుపుచున్నారు.

ముక్తుడగు విష్ణుభగవానుడు దేవతల సుఖం కొరకై అనేక యుద్ధములు చేస్తున్నారు. భక్తుల కొరకై మానవ - జంతు ఉపాధులను పొందుచూ బాల్య - యౌవన - వార్ధక్యాలు అనుభవిస్తున్నారు. శిలాకారంగాను, శిల్పాకారంగాను (జడంగా కూడా), స్త్రీ - చేప - తాబేలు - వరాహం వంటి జంతు, నర అవతారాలు స్వీకరిస్తూ అనేక కల్పములు భక్తుల హృదయాలలో సంచరిస్తున్నారు. ఇంత వ్యాసంగం నిర్వర్తిస్తూ కూడా తాను అప్రమేయుడై, అఖండుడై వైకుంఠమున వెలయుచున్నారు! ఆయన ఏ క్షణమైనా తన ముక్త స్వరూపమును వదలుచున్నారా? లేనే లేదు.

త్రినేత్రుడగు మహేశ్వరుడు ఒక సామాన్యకాముకుని వలె జగజ్జననియగు పార్వతీదేవితో తాండవ నృత్యం చేస్తున్నారు. గణపతి, కుమారస్వామి, నంది, భృంగి మొదలైన ప్రమథగణం అందుకు లయపూర్వకంగా తాళం వేస్తూ గానాదులు చేస్తున్నారు. అంతటి తన్మయంతో ఆనంద వైభవంగా నృత్యం చేస్తూనే ఆయన భక్తుల పిలుపు వినగానే వారి ముందు పార్వతీసమేతంగా ప్రశాంతమంగళ స్వరూపంతో ప్రత్యక్షమగుచున్నారు. ఉపయుక్తమైన ఉపాధులు కల్పించుకొని భక్తులు పొందే బెత్తపు దెబ్బలు తాము పొందుచున్నారు. ఆదిశక్తి స్వరూపిణియగు అమ్మవారు పార్వతీదేవి నిత్యముక్త అయి కూడా పరమశివుని శరీరార్ధభాగం స్వీకరించి, తన బిడ్డలు భక్తితో ఆక్రందన చేస్తున్నప్పుడు ఆ పరమశివుని ప్రేరేపించి వారికి సకల శుభములు కలుగజేస్తున్నారు కదా! ఇంత తతంగం జరుగుచున్నా, పార్వతీపరమేశ్వరులు ఆత్మతత్త్వమును అవధరించే ఉంటున్నారే!

మహాధీశాలి, వీరుడు, పరమ జ్ఞానసమువేతుడు, జ్ఞానరత్నములకు సముద్రము వంటివాడు అగు ఆ కార్తికేయుడు (కుమారస్వామి) నిత్యముక్తుడైయుండి లోక కళ్యాణార్థం తారకేశ్వరునితో

యుద్ధం నిర్వర్తించారే! మహాధైర్యయుక్తుడై, ధ్యానముచే విశుద్ధమైన బుద్ధిని సముపార్జించియున్న భృంగీశ్వరుడు ముక్తత్వము వహిస్తూనే ఒకసారి తన తల్లి పార్వతీదేవి పాదాలకు తన రక్తమాంసములను సమర్పించివేశారే.

అదిగో... అక్కడ చూడు. అక్కడ కోటి సూర్యుల ప్రకాశంతో ఈ సభలో ఆసీనులైన ఆ నారద మహర్షిని చూచావా? ఆయన తన తంబురను మీటుతూ 'నారాయణ, నారాయణ' అని ఉచ్చరిస్తు త్రిలోక సంచారం చేస్తున్నారు. తాను ఎక్కడికి వెళ్ళితే అక్కడ సర్వమూ పవిత్రం చేస్తున్నారు. ఆయన సర్వదా ముక్తుడే! ఆయనకు పొందవలసినదీ, పొందబడనిదీ అంటూ ఏదీ లేదు. ఆయన లోక కళ్యాణార్థం పరమేశ్వర నిర్ణయం అవధరిస్తూ అనేకమంది జనులతో సంభాషిస్తూ ఏవేవో ఉపాయాలు, చెపుతూ ఉంటారు. పురాణద్రష్టలు ఆయనకు 'కలహాభోజనుడు' అని బిరుదు ఆపాదించారు. ఆయన ఆయా క్రియాదులు నిర్వర్తించినంతమాత్రంచేత ఏ క్షణంలోనైనా తన జ్ఞాన, ముక్త స్వరూపం ఏమాత్రం ఏమరుచుట లేదుసుమా!

ఇక్కడ చూడు! దీప్యమానతేజస్సుతో వెలుగొందుచూ, ఈ మన సంవాదనకు ప్రారంభకులై, ప్రోత్సాహకులై ఈ సభను పావనం చేస్తున్న బ్రహ్మర్షి విశ్వామిత్రుని చూస్తున్నాం కదా! ఈయన తన తపోశక్తిచే జ్ఞాన–విజ్ఞాన పరివేష్టితులైనారు. సర్వమునూ ఎరిగిన సర్వమాన్యుడగు ముక్తపురుషుడు ఈయన. అయితే కూడా.... ఇప్పుడు లోకకళ్యాణం కొరకు యాగసంరంభమంతా చేస్తూ యాగరక్షణ కొరకై నీ ఆగమనాన్ని యాచించటానికి అయోధ్యకు వచ్చారు. తానింకా పొందవలసినదంటూ ఏదీ లేక పోయినా కూడా, లోకాలకు 'రామతత్త్వం' ప్రకటితం కావాలనే గొప్ప ఆశయంతో దశరథ మహారాజును ఆశ్రయిస్తున్నారు. ఆయన ముక్తపురుషుడై ఉండి కూడా కర్మలను ఏమైనా తిరస్కరిస్తున్నారా?... లేదే!

జీవన్ముక్తుడగు ఆదిశేషుడు ఈ భూమినంతా ధరిస్తున్నారు. నిర్విషయుడై ఉండి, సూర్య భగవానుడు ఆకాశంలో సంచారం చేస్తూ ఈ భూమిపైగల సకల జీవరాసులకొరకై దివారాత్రములు కల్పిస్తున్నారు. మహాజ్ఞానియగు పరశురాముడు తన ఆత్మస్వరూపమును ఆస్వాదిస్తూనే దుష్టశిక్షణ చేస్తున్నారు.

❖

చూచావా రామా! ఇంకా ఈ ముల్లోకములలో ఎందరో శతాధికసంఖ్యలలో యక్షులు అసురులు, మనుష్యులు, దేవతలు తాము ముక్తులై ఉండి కూడా ఈ జగద్రచనలో వారివారికి నియామకమైన ఆయాకర్మలను ముక్త బుద్ధితో నిర్వర్తిస్తున్నారు. అట్టి మహాత్ములు ఈ భూమిపై ఈ వర్తమానంలో ఎందరో ఉన్నారు.

అట్టి జీవన్ముక్తులలో కొందరు శోక, మోహదాయకములైన దార – పుత్ర – ధనాది ఐశ్వర్యముల మధ్య ఉన్నారు. యుద్ధము, జాతి సంరక్షణము, వ్యాపారము మొదలైన లౌకిక వ్యాసంగములలో నియమితులైయున్నారు. కానీ, వారి అంతఃకరణం మాత్రం ప్రశాంతతతో నిండిపోయి ఉంటోంది.

మరికొందరైతే జడస్వభావులై ఏదీ పట్టించుకోకుండా లౌకిక దృష్టితో చూస్తే పిచ్చివారిలాగా సంచరిస్తున్నారు. వారి దృష్టిలో వారికి దేనివల్లా ఏలోటూ ఉండదు. అట్టివారిలో కొందరి పేర్లు కూడా ఎవ్వరూ విని ఉండకపోవచ్చు.

భృగు, భరద్వాజాది మరికొందరు ఉత్తమజ్ఞానమును ఆశ్రయించి కూడా ఎక్కడో అడవులలో ఆశ్రమం నిర్మించుకొని తమను ఆశ్రయించిన శిష్యులను తీర్చిదిద్దుచున్నారు. మరికొందరు రాజ్యాలు ఏలుతూ వెసులుబాటులేని క్రియా సంరంభములో ఉంటున్నారు. సప్తర్షులు, తదితర మహనీయులు అగు మరికొందరు ఆకాశంలో జ్యోతిశ్చక్రమున నెలకొని ఉన్నారు. అగ్ని, వాయు, తుంబుర, యమ, వరుణాది ఇంకొందరు దేవతా కార్యములను నిర్వర్తిస్తూ బ్రహ్మజ్ఞాన సమన్వితులై ఉన్నారు. బలి, సుహోత్ర, అంధక, ప్రహ్లాదాది మరికొందరు పాతాళంలో వసించుచూ ఆత్మజ్ఞానమును పదిల పరచుకొనియే ఉన్నారు.

❖

అయితే ఒక్క విషయం నీవు ఇక్కడ గమనించాలి.

తిర్యగ్యోనిష్వపి సదా విద్యన్తే కృతబుద్ధయః ।
దేవయోనిష్వపి ప్రాజ్ఞా విద్యన్తే మూర్ఖబుద్ధయః ॥

జంతు ఉపాధులు పొందినప్పటికీ కొందరు మహాజ్ఞానులై వెలయుచున్నారు. తెలివితేటలతో కూడిన దేవయోనులలో జన్మించికూడా మరి కొందరు సంసారాసక్తతతో కూడిన తమ మూర్ఖబుద్ధిని వదలటమే లేదు.

సర్వరూపమై... సర్వవ్యాపకమైన ఆత్మయందు సర్వమూ, సర్వవిధములా సర్వత్రా సంభవమే అగుచున్నది. ఆహో! అనంత కార్య తత్పరుడగు ఆ పరమాత్మ యందు నీడవలె ఏర్పడుచున్న నియతి ఎంత చిత్ర విచిత్రమైనది! ఇదంతా ఆ పరమాత్మ యొక్క రచనా వైచిత్ర్యమే కాక, మరింకేమిటి?

❖

ఏది ఏమైనప్పటికీ ఆత్మ భగవానుని విన్యాసం సదా యథాతథంగానే ఏర్పడి ఉంటోంది.

విధిర్దైవం విధిర్ధాతా సర్వేశః శివ ఈశ్వరః ।
ఇతి నామభిరాత్మానః ప్రత్యక్చేతన ఉచ్యతే ॥

మనందరి 'ఆత్మ' అయినట్టి ఆ ప్రత్యక్ చైతన్యమే "బ్రహ్మ – దైవము – విష్ణువు – ధాత – ఈశ్వరుడు – శివుడు" – మొదలైన అనేక పేర్లతో చెప్పబడుతోంది.

❖

ఈ జగత్తులో అసంఖ్యాకంగా పదార్థాలున్నాయి. ప్రతి పదార్థంలోనూ అనేక తదితర పదార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇసుకలో బంగారు రేణువులుంటున్నాయి. ఆ బంగారు రేణువులోని ప్రతిఒక్కదానిలో తదితరమైన సూక్ష్మపదార్థముల అమరిక ఉంటోంది. అనేక పదార్థముల సంయోగ వియోగములచే దృశ్యపాంచ భౌతికజగత్తు ఏర్పడి ఉంటోంది. యుక్తమైన దానిలో అయుక్తత (Wrong aspect in

right things) దాగి ఉంటున్నది. అయుక్తమనుకున్నదానిలో కూడా యుక్తితో చూస్తే యుక్తత కనిపిస్తోంది. పాపం అయుక్త మనుకుంటాం. కానీ పాపభీతి చేతనే లోకము ధర్మమున ప్రవృత్తమై ఉంటోంది. అసత్యమైనది ఎదురుగా ఎంతో కాలం కనబడుచుండుటచే, "ఇది సత్యమే కదా!" అని భ్రమ కలుగజేస్తోంది.

'శూన్యధ్యాన యోగం' చేత కూడా ఆ "శూన్య సాక్షి" అయిన నిత్యాత్మ పదం ప్రాప్తిస్తోంది. ఇంద్రజాలంలో కుందేటికి కొమ్ములు మొలిపించబడునట్లు... ఇప్పుడు లేని వస్తువులు దేశకాల విలాసములచే ఉత్పన్నమగుచున్నాయి. వజ్రం వలె అత్యంత దృఢంగా కనిపిస్తూ ఉంటున్న వస్తువులు కూడా అకారణంగా నశించుటచే అందలి వివిధ పదార్థములన్నీ రూపాంతరం పొందుచున్నాయి.

ఈ నాశోత్పత్తి సమన్వితమైన అనేక పదార్థములతో కూడిన ఈ జగత్తును చూస్తున్నంత మాత్రంచేత ద్రష్టస్వరూపుడగు ఈ జీవుడు హర్షామర్ష, వినోదవిషాదాది వికారములు ఎందుకు పొందాలి? ఇక్కడ ఎట్టి ఇచ్ఛలేకుండానే ఉండటం ఉచితం సుమా!

ఈ ప్రపంచంలో అసత్తు సత్తువలె ఉంటోంది. ద్రష్టస్వరూపమగు సత్తు అసత్తువలె తోచుతోంది. ఇది గమనిస్తున్న విదిత వేద్యుడు (తెలియవలసినది తెలుసుకున్నవాడు) ఇంత మాత్రం చేత తన శాంతస్థితి నుండి చ్యుతి పొందడు. కనుక రామా! నీవు ఇక్కడ ఏర్పడే ఇచ్ఛ, అనిచ్ఛలను ఎంత శీఘ్రంగా త్యజిస్తే అంతమంచిది.

వివేకం లేకపోతే ఈ ప్రపంచంలో ఎవ్వరికీ ఏమాత్రం ముక్తి లభించదు. ఇక్కడ కోట్ల కొలది జనులు వివేకము కొరకై ప్రయత్నమైనా చేయకుండా "మాకాపని ఉన్నది... ఈ పని ఉన్నది" అని ఇక్కడి పంచేంద్రియ విషయ సమూహాలలో మునగటానికే ఇచ్ఛగించుచున్నారు. ఇక్కడ వివేకము కొరకై ప్రయత్నించే వారికి ముక్తి తప్పకుండా సుసాధ్యమే. ఇదే జగత్తులో ఇవే కార్యక్రమములు నిర్వర్తిస్తూనే మరొక వైపుగా వివేక, విజ్ఞానాదులను ఆశ్రయించి మోక్షస్వరూపులై విరాజిల్లారు... విరాజిల్లుచున్నారు... విరాజిల్లగలరు.

ఓ ప్రియ సహజీవులారా! సర్వశ్రోతలారా! వివేకముచే ముక్తి సుసాధ్యం... సులభం కూడా. అవివేకముచే అది అసాధ్యం... అలభ్యం. ఆ తరువాత మీ ఇష్టం. మీరు సన్మార్గం ఎన్నుకుని నిష్ఠతో ప్రయత్నిస్తూ ఉంటే సర్వాత్మస్వరూపుడగు ఆ భగవానుడు మీకు తప్పక మార్గదర్శకుడు కాగలడు.

❖

అందుచేత ఓ రామచంద్రా! మనస్సును జయించటం ద్వారా నీవు వివేకమును అభివృద్ధి చేసుకోవటం ఉచితం, శుభప్రదం కూడా.

మోక్షమును ఇచ్ఛగించేవారు ఆత్మదర్శనం కొరకు 'వివేకము'అనే ప్రయత్నం ఆచరించాలి. ఆత్మదర్శనము చేత మాత్రమే సర్వ దుఃఖములు సమూలంగా నశించగలుగుతాయి. రాగవర్జితులు, సంగరహితులు, మహాధీమంతులు, అయినట్టి సుహోత్రుడు, జనకుడు మొదలైనవారు ఇప్పుడు ఈ భూమిపై సంచరిస్తున్నారు. అట్లాగే అన్ని కాలములందూ అట్టి సుజ్ఞానవంతులగు వివేకులు ఈ

భూమిపై ఉంటూనే ఉంటారు. వారు ఏ సంఖ్యలో ఉన్నప్పటికీ, ఈ భూమిని పరమపవిత్రం చేస్తున్నారు.

తస్మాత్త్వమపి వైరాగ్యవివేకోదితధీరధీః ।
జీవన్ముక్తో విహర భో సమలోష్టాశ్మకాఞ్చనః ॥ (శ్లో 48, సర్గ 75)

కనుక రామా! నీవుకూడా వివేక, వైరాగ్యములను ఆశ్రయించు. ధీరబుద్ధిచే సువర్ణమును, మట్టిని సమబుద్ధితో చూడగల మహత్తర దృష్టిని అలవరచుకో. "ఆతడు అధికుడు, ఈతడు అధముడు, నేను కొరగాను, నేను గొప్పవాడను, అవి పొందాలి, ఇవి తొలగాలి"... ఈ రూపంలో ఉంటున్న సంసారజాడ్యమును త్యజించు. వివేక సూర్యస్వరూపుడవై సర్వస్థితులందు వర్తించెదవుగాక!

ముక్తి - ఓ నిష్కళంక స్వరూపా! రాఘవా! పదార్థములందలి 'అసంగము' చే కలుగు మనశ్శాంతి యొక్క రూపమే ముక్తి. అట్టి ముక్తి దేహము ఉన్నప్పుడూ లేనప్పుడు కూడా సంభవమే. "ఈ దేహము నేను... ఈ దేహ సంబంధముచే కలుగు గృహములు, బంధువులు మొదలైనవన్నీ నావి"... అను రూపముగా ఉండే భ్రాంతితో కూడిన ప్రీతిని నివారించటమే ముక్తి. ఈ దేహాదులందు ఏమాత్రం ప్రీతి, ఆసక్తి లేకుండానే జీవితం సాగిస్తున్నవానిని 'జీవన్ముక్తుడు'... అని అంటున్నాం. అట్లాగాకుండా, ఈ దేహాదులందు ఆసక్తి కలిగి జీవించేవాడు బద్ధుడు.

రాగద్వేషములు... ఈ రెండూ లేనివాడు ముక్తుడే - మోక్షము కొరకై "వినటం, మననం చేయటం, నిధిధ్యాస (అనన్యత్వం – ఏకాగ్రత్వం)... ఆత్మాఽహమ్‌భావన అనే సాధన చతుష్టయంతో ప్రయత్నించాలి. 'బ్రహ్మతత్త్వ నిశ్చయం' అనే ప్రయత్నం ఎల్లప్పుడూ చేస్తూ ఉండాలి. బుద్ధి శుద్ధత్వం పొందేవరకూ అట్టి ప్రయత్నమునుండి విరమించకూడదు.

"దుఃఖము ఉన్నది" ...అనునది రాగము ఉన్నది అనటానికి గుర్తే సుమా! రాగద్వేషములు తెలివిగా ఈ మనుజుని తమ వశం చేసుకుంటున్నాయి. అది గమనిస్తూ కూడా ఊరుకొని ఉంటే ఎట్లా? "ఈతడు మభ్యపెట్టి, మోసంచేసి, అంతా దోచుకుంటాడు" – అని తెలిసికూడా, ఒక దొంగకు తాను దాచుకున్న గుప్తధనం చూపిస్తూ వెంటబడతాడా, ఎవడైనా?

జడస్వభావపూర్వకమైన వాదోపవాదములను, మందబుద్ధిని.... ఎట్లాగైనా సరే... వదలిపెట్టి పరమాత్మను ఆశ్రయించాలి. 'యుక్తి, యత్నము'... ఈ రెండూ కూడా ఎంతో అవసరం. ఈ రెండూ లేకపోతే ఈ లోకంలో ఒక చిన్న పని కూడా చేయలేమని అందరికీ తెలుసు కదా! ఇక, మోక్షం విషయం మాత్రం వేరే చెప్పేదేమున్నది? సన్మార్గపూర్వకమైన ప్రయత్నములను వదలిపెట్టి, కేవలం 'పిచ్చా పాటి'తో 'మానవ జీవితము' అనే అవకాశం వృథా చేసుకుంటే ఎట్లాగయ్యా...?

కనుక ఓ సర్వజనులారా! మీరంతా ప్రయత్నశీలురయ్యెదరుగాక! ఈ విషయం నేను ఎంతో శ్రమించి మరల మరల గుర్తు చేస్తున్నాను. నాయనలారా! మహాధైర్యమును అవలంబించండి. అవరోధములను చూచి వెనుకాడవద్దు. ఉత్తమ ఫలితం లభించేవరకు ఆత్మ విచారణ చేయండి. దృఢ ప్రయత్నం ఉండాలేగాని... ఈ ప్రపంచంలోని అన్ని సంఘటనలు కలిసి కూడా ... అట్టివానిని

ఆ ప్రయత్నము నుండి విరమింపజేయలేవు. అంతేగాని... పరిమిత అవగాహనలతో కూడిన ఏవేవో వాదోపవాదములతో ఆత్మప్రకాశము వైపుగా గల మార్గము నుండి చ్యుతి పొందకూడదు. మీరంతా అచ్యుతలయ్యెదరు గాక! వేదరహస్యము ఎరిగిన మహాత్ములు సత్యజ్ఞానానంద స్వరూపమగు ఆత్మ పదమును పొంది, అద్దానిని మనకు విశదీకరించి చెప్పుచున్నారు.

"ప్రయత్నిస్తేనే ఆత్మ పదము లభిస్తుంది గాని, అది ఏదో గాలి వాటుగా లభించేది కాదు" అని నా విన్నపం.

❖❖❖

7. పరమ పురుషత్వం

శ్రీరాముడు : స్వామీ! ఈ జీవుడు ఏ హేతువు చేత జగత్తులలో ప్రవేశిస్తున్నాడు? ఆతడు ఒక జగత్తును వదలి ఇంతలోనే మరొక జగత్తులోకి ప్రవేశిస్తున్నాడు కదా! ఈ సుదీర్ఘ ప్రయాణానికి అంతెక్కడ?

శ్రీవసిష్ఠ మహర్షి: మనం కొంతసేపటి నుండి వివేకోదయం గురించి చెప్పుకుంటున్నాం కదా! జీవునికి ఎదురుగా నిలిచి ఉన్న ఈ జగత్తులన్నీ బ్రహ్మము నుండే అవివేక ప్రభావం చేత ఉద్భవిస్తున్నాయి. అవివేకముచేతనే స్థితి పొంది ఉంటున్నాయి. మరల వివేకముచే నశిస్తున్నాయి. 'బ్రహ్మము' అనే సముద్రంలో ఏర్పడే 'జగత్ సమూహములు' అనే తరంగపరంపరలను ఎవరు లెక్కించగలరు? సూర్యకిరణములలో ఉండే త్రసరేణువులను ఎవరు లెక్కించగలుగుతారు?

అసమ్యక్ దర్శనం (Perception of Duality) జగత్‌స్థితికి హేతువు. సమ్యక్ దర్శనముచే ఈ సంసారజలమంతా వినాశనం పొందగలదు. మిక్కిలి దుష్కరము, అత్యంత భయంకరము అయినట్టి ఈ సంసారసాగరాన్ని అధిగమించాలంటే అందుకు 'ప్రయత్నం – యుక్తి' రెండూ ఉండాలని అనుకున్నాం గదా!

'సంసారము' అనగా ఏమిటో ఎరిగిన విజ్ఞులు 'జీవితము' అనే సదవకాశమును దుర్వినియోగ పరచుకోరు. ఎందుకంటే, ఈ సంసారము... 'మోహము' అను జలంతో, 'మరణము' అనే సుడులతో 'పుణ్యాపాపములు' అనే తరంగములతో, 'నరకము' అనే బడబాగ్నితో, 'తృష్ణ' అను ప్రకంపనములతో, 'మనస్సు' అనే సుడిగుండముతో, 'జీవితము' అనే నదీసంగమ స్థానముతో, 'భోగములు' అనే ఎఱలతో, 'రోగములు' అనే క్రూర సర్పాలతో, 'ఇంద్రియములు' అనే మొసళ్ళ ఘర్ఘరనాదంతో, 'ఆశలు' అనే ఉప్పురసంతో ...ప్రాప్తిస్తోంది.

ఆహా! ఏమి దీని ప్రభావం! ఇందు స్త్రీలు తమ క్రీగంటి చూపులతో బుద్ధిమంతులైన వారిని కూడా కొద్ది క్షణాలలో తమ పాదాక్రాంతం చేసుకుంటున్నారే! ఇందులో ప్రవేశించిన జీవులు క్షణంలో తమ ఉపాధికి ముందే గల స్వస్వరూపం ఏమరుచుచున్నారే! మనస్సులోంచి ఆశలు పుడుతున్నాయి. ఆ ఆశలు ఆ మనస్సునే భ్రమింపజేస్తున్నాయి.

ఈ చంచల సంసారం దాటివేయటమే పౌరుషం. అంతేగాని, ఏదో రాజ్యంపై దండయాత్ర చేసి గెలవటం పౌరుషం కాదు. ఉత్తమ బుద్ధి, ఉపాధి, అవకాశములు లభించి కూడా సంసార సముద్రం దాటటానికి పయనించని వారిని ఏమని పిలవాలి?... కొద్దిమంది మాత్రం తమ యొక్క బ్రహ్మజ్ఞాన బలం చేత ఈ సంసార సముద్రమును ఆపోశన పట్టివేస్తున్నారు. ఈ జగత్తునంతటినీ బ్రహ్మమయం చేసి సాక్షీస్వరూపులగుచున్నారు.

ఓ రామా! నీవు అట్టి శ్రేష్ఠులగు బ్రహ్మజ్ఞానులతో కూడి విచారణచేయి. బుద్ధిచే 'ఇదంతా బ్రహ్మమే' అని గ్రహించు. ఆ తరువాత ఇందు క్రీడించు. అట్లు శోభించటమే ఉచితంగాని, ఇందు బద్ధుడవై ఉండటం ప్రజ్ఞ - అని అనిపించుకోదు. ఓ రఘుకులతిలకమా! రామచంద్రా!ఈ చిన్న వయస్సులోనే నీవు విచారతత్పరుడవైనావు. ఈ సంసారము గురించి చక్కగా చింతన చేస్తున్నావు. ఈ విషయం నీ గురువైన నాకు ఎంతో ఆనందాన్ని కలుగజేస్తోంది. నీవు ధన్యుడవు. నీలాగే, ఎవ్వడైనా సరే... ఈ సంసారమును అత్యుత్తమ బుద్ధితో విచారణ చేస్తే ఆతనిని ఇక మోహము సమీపిస్తుందా? దాని వల్ల కాదు.

మొట్టమొదట చక్కగా విచారణ చేయాలి. సర్పమువలె భయమును గొలిపే విషయభోగములను ప్రక్కకు నెట్టివేయాలి. వివేక దృష్టిని అలవరచుకోవాలి. ఆత్మ విషయమై సమాచారం సంపాదించాలి. ఆ తరువాత గరుత్మంతుడు సర్పములను భక్షిస్తున్నట్లు ఈ శబ్ద - స్పర్శాది విషయములపై ఆధీనత్వమును చెలాయించాలి. శబ్ద స్పర్శాది విషయములు నీకు దాస్యం చేయాలేగాని, నీవు వాటికి దాసుడవు, బద్ధుడవు అవటం పురుషకారం ఎట్లా అవుతుంది.

ఏదైనా ఒక వస్తువును, పొందాలనుకోవటానికి ముందు ఆ వస్తువు యొక్క తత్త్వం, ప్రయోజనం పరిశీలించి మాత్రమే స్వీకరిస్తాం. ఎందుకు? దాని ఉత్తరోత్తర ప్రయోజనం ఫలయుక్తంగా ఉండాలని ఉద్దేశ్యం కదా! అట్లా కాకుండా, 'పైకి బాగున్నది', అని అవిచారణ పూర్వకంగా వస్తువును తెచ్చుకున్నా మనుకో! ఏమౌతుంది?

శ్రీరాముడు : చిన్న పిల్లవాడు పెద్దలు చెప్పినా, వినకుండా తిను బండారాలు కావాలని ఏడ్చి తింటే... తెల్లవారే సరికి కడుపు నొప్పితో బాధపడినట్లంటారా?

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. అట్లా అల్పజ్ఞానియగు జీవుడు ఆత్మ విషయం ప్రక్కకు పెట్టి ఇంద్రియ విషయాలను అంటిపెట్టుకొని ఉంటున్నాడు. అందుకే దుఃఖాలు, దిగుళ్ళు ఆతనిని వదలటం లేదు.

వసంతకాలంలో వృక్షములన్నీ రససమృద్ధమై ప్రకాశించునట్లు, ఆత్మతత్త్వ దర్శనం చేసేవాని బలము, బుద్ధి, తేజము వృద్ధిచెందుతాయి.

రఘునందనా! తెలుసుకోవలసిన ఆత్మ వస్తువును నీవు చక్కగా తెలుసుకున్నావు సుమా! కనుకనే.... నీవు ఆనందామృత పూర్ణుడవై అతి శీతల స్వభావుడవై, తాపత్రయరహితుడవై, స్వచ్ఛుడవై పూర్ణచంద్రునివలె విరాజిల్లుతున్నావు. అందుచేతనే పురుషోత్తముడవగు నిన్ను చూచి ఈ సభకు వేంచేసిన మహనీయులెందరో మహదానందపడుచున్నారయ్యా!

❖❖❖

8.జీవన్ముక్తుల పవిత్ర దృష్టి

శ్రీరాముడు : హే మహర్షీ! ఈ జీవుడు తన ఆనంద స్వభావం ఆస్వాదించగలుగుటకు ముక్తి ఒక్కటే ఉపాయం కదా! అట్టి ముక్త పురుషులగు మహనీయులెందరో ఈ సభకు వేంచేసియుండటం ఈ అయోధ్యలోని మా అందరి అనేక పూర్వజన్మల పుణ్యఫలం. దృశ్యం నుండి మొదలంట విడివడియుండి జీవన్ముక్తులై ప్రకాశించే మహనీయులందరికీ శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నాను. జీవన్ముక్తులగు నారదుడు, విశ్వామిత్ర మహర్షి మొదలైనవారి 'దృష్టి – అవగాహనలు' మేము ఎంతగానో మరల మరల తెలుసుకుని ఉండటం మాకు ఎంతో అవసరమని నేను అనుకుంటున్నాను. అందుచేత జీవన్ముక్తుల పవిత్ర దృష్టి గురించి ఇంకా మరికొన్ని విశేషాలు వివరించమని మిమ్ములను వేడుకుంటున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి : రామా! మనం జీవన్ముక్తుల లక్షణములు, దృష్టులు, అవగాహనల గురించి వేరు వేరు సందర్భాలలో చెప్పుకున్నాం. ఇంకా ముందు ముందు అనేక కోణాల నుండి చెప్పుకోబోతున్నాం. జీవన్ముక్తత్వమే ఈ మన సంవాదం యొక్క అత్యుత్తమ లక్ష్యం. కనుక పదే పదే పునశ్చరణ అవసరమే. పునరావృత్తి దోషంగా సభికులు భావించరనే నా అభిప్రాయం. అందుచేత మరల పునశ్చరణ పూర్వకంగా జీవన్ముక్త స్వరూపం గురించి కొన్ని విశేషాలు సమీక్షిస్తూ ఉదహరిస్తాను, విను.

❖

సర్వేచ్ఛారహితుడగు ఆత్మజ్ఞాని ఈ ప్రపంచమును వ్యవహార దృష్టితో చూస్తున్నప్పుడు ఒక సుషుప్తుని వలె (గాఢనిద్ర పోయే వానివలె) అసంబంధపూర్వకంగా ఉంటాడు. పరమార్థ దృష్టిచే "ఇదంతా అసద్రూపమే కదా" అని గ్రహించి ఉంటాడు. లయించిపోయినట్టి మనస్సు కలవాడై ఆనందోన్మత్తుడై మెలగుచూ ఉంటాడు. ఆతని బుద్ధి అంతర్ముఖమగుటచే ఉదారత్వం వహించి ఉంటుంది. తాను అందరిలాగానే ఇంద్రియములను, వస్త్రములను, ధనాదులను కలిగి ఉన్నప్పటికీ తన అంతర్ముఖ దృష్టిచే ఒక స్తంభంలాగా తదితరుల వ్యవహారములను చూస్తూ ఉంటాడు. ప్రశాంత బుద్ధితో అంతా గమనిస్తూ... జనులు పొందే సంరంభమును చూచినప్పుడు నవ్వుకుంటూ ఉంటాడు.

భావిపదార్థములను అభిలషించడు. వర్తమాన పదార్థములపట్ల ప్రీతి కలిగి ఉండడు. గడచిన వస్తువుల గురించి చింతించడు. కానీ... సర్వము ఆచరిస్తూనే ఉంటాడు.

దృశ్య – (లౌకిక) వ్యవహారములందు తనను తాను సుదూరంగా అట్టేబెట్టుకొని సుప్తప్రాయుడై ఉంటాడు. ఆత్మ విషయంలో మాత్రం అత్యంత జాగరూకుడై ఉంటాడు. వ్యవహారములందు కుశలుడై ఉన్నప్పటికీ అంతర్గతంగా మాత్రం.... అంతఃపురంలో బాలకుణ్ణి బుజ్జగిస్తున్న దాది తన సొంత ఇంటిలోని బిడ్డ గురించే అదంతా చేస్తున్నట్లు.... ఆత్మ కొరకై వ్యవహారనిరతుడై ఉంటాడు.

అన్తః సర్వపరిత్యాగీ నిత్యమన్తరనేషణః ।
కుర్వన్నపి బహిః కార్యం సమమేవావతిష్ఠతే ॥ (శ్లో 9, సర్గ 76)

బాహ్యమున అన్ని కర్మలు చేస్తున్నప్పటికీ అంతరంగంలో ఏమీ చేయనివాడుగా ఉంటాడు. సర్వమూ మొదలే పరిత్యజించి, కోర్కెలేమీ లేనివాడై, సమరూపుడై ఉంటాడు.

యథా ప్రాప్తములైన క్రియల విషయంలోనూ, వర్ణాశ్రమ ధర్మముల విషయంలోనూ, పితృ పితామహాది క్రమం చేత ప్రాప్తించే ఆస్థి-రాజ్యాధికారాల విషయంలోనూ, బంధు మిత్ర సమాగమాది ఆయా సందర్భములలోనూ తాను నిర్వర్తించవలసినది తదనుకూలంగానే నిర్వర్తిస్తూ ఉంటాడు. అయితే ఏం? సర్వ విషయములలోనూ ఆతడు వర్తిస్తున్నప్పటికీ "అహమ్ కర్తాస్మి... నేను దీనికి కర్తను"... అనే కర్తృత్వాభినం రహితం చేసుకొని, ఆయా కార్యములు నిర్వర్తిస్తూ ఉంటాడు. సుఖ దుఃఖములు సమీపిస్తున్నప్పుడు వాటిని ఆత్మ రూపంగా ఎరిగి ఉంటాడు. అందుచేత ఇష్ట-అయిష్ట ఫలముల పట్ల సమరూపుడై, ఉదాసీనుడై ఉంటాడు.

దేని కొరకూ వాంఛించడు... ద్వేషించడు. శోకించడు... హర్షించడు. అనుకూల, ప్రతికూల కర్మాచరణ సమయములలో అనాసక్త చిత్తంతో వ్యవహరిస్తూ ఉంటాడు.

భక్తులందు భక్తుని వలె, ధీరులందు ధీరుని వలె, దుఃఖితులందు దుఃఖితుని వలె, యౌవన వృత్తాంతములందు యువకుని వలె ఉంటూనే... తాను సర్వదా తన అఖండ, అప్రమేయ స్వస్వరూపమును ఏమరువడు.

❖

ఆతని నోటివెంట పుణ్యప్రదమైన, శుభప్రదమైన మాటలే వస్తాయి. ఆతని వాక్యాలు సమగ్రత్వం, సుదీర్ఘ దృష్టి, సర్వహితము, లోక కళ్యాణము స్వభావసిద్ధంగా సంతరించుకుని ఉంటాయి. అభిమాన రహితంగా ఉంటాయి. కనుక, "ఈతడు ఏపాటివాడు?" అని చూపరులకు అనిపించవచ్చు. అయితే సూక్ష్మబుద్ధికి మాత్రం ఆతడు ధీరబుద్ధి సహితుడని, ఆందోళనారహితుడని, ఆనందోదయ సమన్వితుడని, కోమలస్వభావుడని తెలిసిపోతుంది. పుణ్యస్వభావుడై, ప్రసన్నముఖుడై పూర్ణప్రజ్ఞాసహితుడై, ఖేద - దుర్దశలు లేనివాడై ఆతడు ఉంటాడు.

సర్వ ప్రాణులను తన స్వరూపముగా గాంచుటచే ఆతడు సర్వులపట్ల అకృత్రిమమైన స్నేహము కలిగియుండి.... లోకబాంధవుడై ఉంటాడు. ఉదారచరితుడై, సర్వావస్థలయందునూ సమరూపుడై, సౌమ్యుడై, సుఖ సాగరుడై, తన సాంగత్యముచే అందరి దుఃఖములనూ హరింపజేసేవాడై ఉంటాడు. తాను ఎక్కడుంటే అక్కడ పూర్ణచంద్రునివలె అమృత కిరణములను, సమగ్రజ్ఞానభావములను ప్రసరిస్తూ ఉంటాడు.

ఆతనికి సుకృతముల చేతగాని, దుష్కృతములచేతగాని, భోగ త్యాగములచేతగాని, బంధు మిత్ర సమాగమములచేతగాని, కర్మ, నైష్కర్మ్యములచేతగాని, స్వర్గ పాతాళాదిలోకముల ప్రాప్తిచేతగాని, బంధ మోక్షములచేతగాని ప్రత్యేకించి క్రొత్తగా వచ్చిపడే ప్రయోజనమంటూ ఏదీ ఉండదు.

ఈ జగత్తంతా ఏకమగు బ్రహ్మముగా, తనకు సర్వదా అనుభవమగుచున్నట్టి, తాను ఇదంతా ఆత్మతత్త్వముగా గాంచుచున్నట్టి ఆ జీవన్ముక్తునికి ఇక బంధమేమిటి? మోక్షమేమిటి? ఈ బంధ

మోక్షముల భావనలచే ఆతని మనస్సు ఎన్నటికీ దీనత్వం పొందదు. 'సమ్యక్ జ్ఞానము' అను అగ్నిచే ఆతని సంశయములన్నీ భస్మీభూతం కాగా ఆతని చిత్తము సర్వత్రా ప్రియత్వము, ఆనందత్వము, నిర్మలత్వము, అప్రమేయత్వము, అఖండత్వము అన్ని వైపులా అనుభవిస్తూ ఉంటుంది. ఆతని మనస్సు భ్రమ – విభ్రమ వినిర్ముక్తమై (Having been relieved of all Illusions and fantacies), బ్రహ్మరూపమై, నశించక... ఉదయించక ఉంటుంది.

ఆతడు సర్వావస్థలయందునూ ఆకాశమువలె సమరూపుడై వెలయుచూ ఉంటాడు. ఊయలలో పడుకుని ఉన్న పసిబాలుడు ఎట్టి ఇచ్ఛ – సంకల్పములు లేకుండానే కాళ్ళు – చేతులు కదులుస్తాడు... నవ్వుతాడు చూచావా? ఆత్మజ్ఞాని ఎట్టి రాగాదులు లేకుండానే తన ఈ కాళ్ళు – చేతులను ఆయా చేష్టలలో నియమిస్తాడు. అట్లు నియమిస్తూనే తాను మదిరోన్మత్తుని వలె బ్రహ్మానందంలో ఓలలాడుచూ, పునర్జన్మ భయరహితుడై ఉంటాడు. ఇతఃపూర్వం తాను రాగసహితంగా నిర్వర్తించియున్న కర్మలు గుర్తుకు వస్తున్నప్పుడు, అదంతా చూచి నవ్వుకుంటాడు. వాటి ఊసులన్నీ అధిగమించి ఉంటాడు. ఇతఃపూర్వపు సంఘటనలను స్మరించడు... విస్మరించడు.

సర్వం సర్వప్రకారేణ గృహ్ణాతిచ, జహాతిచ ।
అనుపాదేయ సర్వార్థో బాలవచ్చ విచేష్టతే ॥

అన్నీ గ్రహిస్తాడు... త్యజిస్తాడు. ఏదీ గ్రహించకయే బాలునివలె చేష్టలు సల్పుచూ ఉంటాడు.

జ్ఞాని... అజ్ఞాని - జ్ఞానికి, అజ్ఞానికి ఉండే ముఖ్యమైన తేడా ఏమిటో చెపుతాను, విను–ఇద్దరు కూడా దేశకాల క్రియాక్రమానుసారం కార్యములందు ప్రవృత్తులగుచున్నారు. అయితే, జ్ఞాని ఆయా క్రియాజనితమైన సుఖదుఃఖములకు వశీభూతుడు కాడు. బాహ్యమందు మనస్సుచే ప్రాప్తించిన కార్యాలను మాత్రం శ్రద్ధగా చేస్తూ ఉంటాడు. అంతరంగంలో క్రియా వర్జితుడై ఉంటాడు. ఎందుకంటే బాహ్య పదార్థములన్నీ అసత్తేనని ఆతనికి తెలుసు. అందుకే వాటి ఫలముల కొరకై ఆతడు పరుగెత్తడు. ఆ ఫలములన్నీ అల్పము, సంకుచితము, స్వల్పకాలికము అగు ప్రయోజనములే కలిగి ఉంటాయని తెలుసు. దుఃఖదశలను గాంచడు. సుఖ స్థితిని అపేక్షించడు. కార్యసాఫల్యమునకు సంతోషించడు. కార్యవిఫలత్వముచే దుఃఖించడు. సూర్యగోళము చల్లబడు గాక! చంద్రమండలం అకస్మాత్తుగా అగ్నిజ్వాలలు వెదజల్లు గాక! అగ్ని అధోముఖంగా జ్వలించుగాక! అవన్నీ కూడా ఆత్మ జ్ఞానికి ఆశ్చర్యం కలిగించలేవు. "ఆత్మయందే అవన్నీ స్ఫురిస్తున్నాయి"... అను నిశ్చయము కలవాడై విస్మయ జాలమునందు కూడా ఆశ్చర్యచకితుడు కాడు.

దయచే ఆతడు దీనము వహించడు. అట్లని క్రౌర్యము నాశ్రయించడు. అవమానములందు లజ్జితుడు కాడు. దుష్కార్యములచే నిర్లజ్జ కలిగియుండడు. గర్వి, ప్రమత్తుడు, ఖిన్నుడు, హర్షి, ద్వేషి, భయ శోకయుతుడు అవడు. విశాలాకాశము వంటి జ్ఞానము గల ఆతనికి ఎవరిపైనా కోపం ఉండదు. ఆకాశంలో విత్తనం మొలకెత్తుతుందా?

❖

ఓ రఘురామా! నిరంతరం జనన మరణములతో కూడియున్న ఈ "జగత్ స్థితి" యందు సుఖంగాని, దుఃఖంగాని ఎట్లా ఉంటాయి? ఇక ఎదురుగా ఇక్కడుండేదంతా, ఈ దేహముతో సహా, పంచభూత సమన్వయమే కదా! స్వయముగా చపలము ప్రవర్తించే చోట సుఖ దుఃఖముల ప్రసక్తి ఏమిటో చెప్పు? ఎట్లా ఉండగలవో నాకర్థం కాదు. ఇక్కడ నిరంతరం ప్రాణికోట్లు జన్మిస్తున్నాయి. మరణిస్తున్నాయి. ఈ ఉత్పత్తి వినాశములను చూచి జగద్దృష్టిగల అజ్ఞానులు మాత్రమే హర్ష శోకములు పొందుచున్నారు. జగత్ రహస్యం తెలిసినట్టి సమర్థులగు జీవన్ముక్తులు ఇక్కడి ఉత్పత్తి వినాశనములను చూచి ఏమాత్రం స్పర్థ చెందరు.

రాత్రియందు కొద్దిక్షణాల నిద్రలో సుదీర్ఘకాలపు స్వప్నములు సంభవమౌతున్నాయి చూచావా? ఉత్పత్తి వినాశనాలతో కూడిన ఈ జగత్ సృష్టులలో ఏది సంభవం? ఏది అసంభవం? క్షణికమైన ఈ తుచ్ఛ ప్రపంచంలో "దీని గురించి సంతోషం... దాని గురించి దుఃఖం" అని ప్రసంగించుకోవటంలో అర్థమేముంది? అప్పుడాతనికి సుఖం యొక్క అభావమే సిద్ధిస్తుంది. తత్ప్రయోజనంగా సుఖం యొక్క వ్యతిరేకానుభవమైన 'దుఃఖము' అనుదానికి రూపం ఏర్పడ జాలదు. అనగా శోక మోహాదులను విస్తరింపజేసే దుఃఖానుభవమే జీవన్ముక్తునకు ఉండదు. సుఖ దుఃఖ సంక్షయము యొక్క ప్రభావంచే 'ఇది త్యాజ్యము - ఇది గ్రాహ్యము" అనునది కూడా ఆతనికుండవు. త్యాజ్యగ్రాహ్యములు లేవు కనుక, ఇష్ట, అనిష్టములు ఇంకెక్కడుంటాయి? శుభాశుభ దృష్టి నశించటంచేత భోగేచ్ఛ తొలగి ఆశారాహిత్యం బలంపుంజుకుంటుంది. అప్పుడు మనస్సే విలయమౌతోంది. మనోనాశనకారణంగా సంకల్పముల కల్పన ఉండదు. నువ్వులు బాగుగా వేగిపోయిన తరువాత ఇక నూనె గురించిన ప్రసంగమెక్కడిది?

❖

"నా స్వస్వరూపమగు ఆత్మకు వేరుగా ఎక్కడా ఏదీ ఉండజాలదు" అను దృఢ జ్ఞానముచే సంకల్ప, వికల్పములు నశిస్తాయి. ఇక ఈ సర్వ దృశ్య పదార్థములు ఆకాశమువలె స్థితి పొందుతాయి. అప్పుడు 'పరిచ్ఛిన్నము' అనునదేదీ ఉండదు. అట్టి మహాత్ముడగు ఆత్మజ్ఞాని ఎట్టి పదార్థప్రాప్తికీ సంబంధించనట్టి అకృత్రిమమగు ఆనందప్రాప్తిచే ప్రమోదితుడై ఉంటాడు. ఈ స్వప్నతుల్య జగత్తునందు యథా ప్రాప్తములైన పదార్థములను చిత్తముతో అవలోకించుచూ నిశ్శబ్దత్వము వహించి ఉంటాడు. ఈ ప్రపంచము పట్ల ప్రశాంత, మౌన రూపమగు నిద్ర వంటి స్థితి పొంది ఉంటాడు. అట్లు ప్రారబ్ధక్షయము అయ్యే వరకూ జీవితమును గడుపుచూ నిత్యతృప్తుడై ఉంటాడు. నిర్హేతుక ఆనందమును, అనిర్వచనీయ సంతృప్తిని పొంది ఉంటాడు.

ఏ జీవుడైనా సరే... జ్ఞాన నిర్మలహృదయ సముపార్జనచే 'జీవన్ముక్తుడు' అగుటకు తప్పక అవకాశమున్నదని సర్వజనులకు మనవిచేస్తున్నాను.

❖❖❖

9.యోగమార్గం

శ్రీవసిష్ఠ మహర్షి : రామచంద్రా! ఒక మండుచున్న కొరివిని చేతిలోకి తీసుకొని వర్తులాకారంగా త్రిప్పుచున్నావనుకో... అక్కడ ఒక వర్తులాకారపు వస్తువేదో ఉన్నట్లు భ్రమగొలుపుతుంది కదా!

శ్రీరాముడు : అవును మహర్షీ! అట్లా అనిపిస్తుంది.

శ్రీవసిష్ఠ మహర్షి : వాస్తవానికి అక్కడ వర్తులాకారపు వస్తువేమీ లేదుకదా! కొరివియే భ్రమచే అట్లా అనిపిస్తోంది. అట్లాగే మనస్సు యొక్క సంచలనము లేక చాంచల్యముచే మిథ్యా రూపమగు ఈ జగత్తు భాసిస్తోంది.

తటాకపునీటిలోకి మట్టి బెడ్డను విసిరితే జలంలో ఆవర్తాలు ఏర్పడతాయి. ఆవర్తాలు జలం కంటే వేరైనవి కావు కదా! ఆత్మయందు ఏర్పడే చిత్తస్పందనము చేతనే ఈ జగత్తు కన్పించటం జరుగుతోంది. ఇది మిథ్య అయి ఉండి కూడా 'సత్యము - నిత్యము' వలే తోచుచున్నది. అవిచారణ కారణంగా ఈ జీవుడు భ్రమపూర్వకమైన ఈ జగత్తును గాంచుచూ ఇందులో సుఖ-దుఃఖ-ఉద్వేగ భావ పరంపరలకు లోను అగుచున్నాడు.

శ్రీరాముడు : మహాత్మా! వసిష్ఠమహర్షీ! ఈ చిత్తము దేనిచే చలిస్తోంది? ఏ విధంగా దీని చలనం మనం నిరోధించవచ్చు? ఈ మనస్సును దహింపజేయటం చాలా ఆవశ్యకం కనుక... ఈ రెండు ప్రశ్నలకు సమాధానం విశదీకరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : "మంచు - తెల్లదనం" ... ఈ రెండూ వేరు వేరు కాదు కదా! 'అగ్ని - ఉష్ణము' వేరు వేరా? నువ్వులు - నూనె, పుష్పంలోని పుప్పొడి కణాలు - పుష్పసుగంధం ...ఈ ద్వంద్వాలు ఒకదాని కన్నా మరొకటి ఎట్లా వేరు, వేరైనవి అవుతాయి?

అట్లాగే చిత్తము, దాని స్పందనము ఒక దాని కంటే మరొకటి వేరు వేరు కానే కాదు. వాటి యందు గల "చిత్తం - స్పందనం" అనే భేద శబ్దములు కేవలం భ్రమ చేతనే కల్పించబడుతున్నాయి. గుణి - గుణములు (The possesser of attributes & Attributes)- ఈ రెండిటిలో ఒకటి లేదంటే రెండవది కూడా లేనట్లే కదా! చిత్తము - స్పందనములలో ఒకటి నశిస్తే రెండవది కూడా నశించి పోతుంది. అట్టి చిత్తము యొక్క నాశనము కొరకు రెండు విధములైన ఉపాయాలు ఉన్నాయి- 1.యోగము, 2.జ్ఞానము. ...అందు 'యోగము' అనేది చిత్తవృత్తి నిరోధకరూపమైనది.

శ్రీరాముడు : 'యోగము' అనగా ఏమిటో, దాని వలన జీవునకు సుఖము, శాంతి ఎట్లా లభిస్తాయో చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : ప్రాణాపాన నిరోధకమగు యోగయుక్తి గురించి మనం ముందు ముందు నిర్వాణప్రకరణ ప్రారంభంలో "భుశుండోపాఖ్యానం"లో కొన్ని, కొన్ని విశేషాలు సంభాషించుకోబోతున్నాం. అయితే ఇక్కడ నీవు అడిగావు కనుక కొన్ని విషయాలు ప్రస్తావిస్తాను.

❖

ఈ దేహమును మనం చూస్తున్నాం కదా! దీనిలోని ప్రతి శాఖ యందు అనేక నాడీ సమూహాలు ఉన్నాయి. అట్టి 72000 దాకా ఉండే నాడీ సమూహాలలో నిరంతరం వాయువు ప్రసరిస్తూ ఉంటుంది. అట్లు శరీరమంతా నిరంతరం ప్రసరిస్తూ ఉండే వాయువునే 'ప్రాణము' అని అంటాం.

ఈ ప్రాణము శరీరంలో అధో – ఊర్ధ్వ గమనములు చేస్తూ ఉంటోంది. తన సంచలనముచే వివిధ రకములైన క్రియలను నిర్వర్తించు ప్రాణమును ఆయా చోట్ల నిర్వర్తించే వేరు వేరు క్రియలను అనుసరించి ఐదు పేర్లను శాస్త్రజ్ఞులు కల్పించారు.

సుగంధమునకు ఆధారం పుష్పమే కదా! చిత్తమునకు ప్రాణమే ఆధారం.

అన్తఃప్రాణ పరిస్పన్దాత్సంకల్పకలనోన్ముఖీ ।
సంవిత్సంజాయతే యైషా తచ్చిత్తం విద్ధి రాఘవ ॥ (శ్లో 13, సర్గ 78)

లోన ప్రాణచలనము అగుచుండుటచే, సంకల్పోన్ముఖమై జనించునట్టి, జ్ఞానవృత్తే "చిత్తము". అట్టి జ్ఞానవృత్తిని 'సంవిత్తు' అని కూడా అంటారు.

ప్రాణములు స్పందించుట చేతనే జ్ఞాన వృత్తుల (ఎఱుగుచుండుట అను రూపం గల వృత్తుల) స్పందనము కూడా కలుగుచున్నది. జ్ఞానవృత్తులు చిదాభాసుని (Reflection of Absolute Self) ఉనికితో నిండి ఉంటున్నాయి. జలము యొక్క స్పందనముచే తరంగములు ఉత్పత్తి అగుచున్నట్లు జ్ఞానవృత్తుల స్పందము చేత విషయానుభవం కలుగుతోంది. దృశ్యజగత్తు యొక్క వాస్తవరూపం విషయానుభవమే!

ప్రాణ స్పందనమే చిత్తం అని చెప్పుకున్నాం కదా! కనుక ప్రాణములు గనుక నిరోధించబడితే... అప్పుడు చిత్తము కూడా తప్పక ఉపశమించగలదు. అట్లు చిత్తము, లేక, మనస్సు ఉపశమిస్తే 'జగత్తు' అనే అనుభవం కూడా విలయ మొందుచున్నది.

శ్రీరాముడు : మునీంద్రా! ఈ దేహంలో 72000 నాడులున్నాయి కదా! వాటన్నిటి యందు నిరంతరం గమనాగమనములు సలుపుచున్న ప్రాణవాయువులు మొట్టమొదట నాసిక ద్వారా ప్రవేశిస్తున్నాయి కదా! అట్టి నాసిక మొదలైన రంధ్రములందు గల ఆకాశంలో వాయువును నిరోధించటమే ప్రాణాయామమని వినియున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. అట్టి 'నిరోధము' అనే యోగములోగల వివిధ మార్గములను విశదీకరిస్తాను... విను.

1. అనేకాగ్రత నుండి ఏకాగ్రతకు - ఆశ్రయించబడుచున్న సాంసారిక వృత్తులందు అవిశ్వాసం దృఢపడాలి. "నేనిప్పుడు ఆశ్రయిస్తూవస్తున్న ఈ పదార్థజాలమంతా వాస్తవం కాదు. ఇదంతా నన్ను భ్రమింపజేసి... దుఃఖమును, మోహమును కలుగ జేస్తోంది. కాబట్టి ఇందుకు తగిన ఉపాయం కొరకై అన్వేషించాలి" అనే ప్రయత్నం దృఢపరచుకోవాలి. శాస్త్ర సజ్జన సాంగత్యంతోనూ, వైరాగ్యాభ్యాసం చేతను ఆ అవగాహన బలపడగలదు. అప్పుడు శ్రద్ధ, ఏకాగ్రతలు రూపుదిద్దుకుంటాయి. ప్రియాప్రియ

భావములు త్యజించబడతాయి. అట్టి ధ్యానముచేతనూ, అనేకత్వపుజాడ్యము తొలగుచున్నప్పటి 'ఏకత్వము' యొక్క దృఢాభ్యాసంచేతనూ ప్రాణచలనము నియమించబడగలదు.

2. ప్రాణాయామం - సుఖ పూర్వకంగా క్రమక్రమంగా నివర్తించబడే 'పూరకము – కుంభకము – రేచకము' అను విభాగములు గల ప్రాణాయామము యొక్క దృఢమైన అభ్యాసంచేతా, ఏకాంత ధ్యానయోగంచేతా ప్రాణచలనము నిరోధించబడగలదు.

3. ప్రణవోచ్చారణ - 'ఓం' కారమును సుదీర్ఘంగా ఉచ్చరిస్తూ... అద్దాని యందలి 'అ–ఉ–మ' లకు అంతర్లీనమై ఉండే 'చతుర్థమాత్ర'ను అవలంబించి ...అద్దాని శబ్దార్థము(That which is intended by Om)ను భావన చేయటం మరొక మార్గం. అట్టి పవిత్ర భావనచేస్తుండటంచేత క్రమంగా బాహ్య విషయములకు సంబంధించిన అజ్ఞానం పూర్తిగా తొలగిపోతుంది. సాంసారిక దృష్టులన్నీ శమిస్తాయి. అప్పుడు ప్రాణస్పందనము నిరుద్ధమౌతుంది.

వివిధ యోగాభ్యాసములు – ఇప్పుడు వివిధ యోగాభ్యాసముల గురించి, తద్వారా చిత్తము నిరోధించటం గురించి చెప్పుచున్నాను విను–

1. పూరకము - వాయువును నాసికాపుటముల ద్వారా సుదీర్ఘంగా స్వీకరించటం, మరల క్రమపూర్వకంగా త్యజించటమును 'పూరకము' అని అంటున్నాం. పూరకమును పదే పదే అభ్యసిస్తూ వస్తే ...క్రమంగా అట్టి అభ్యంతర పూరకముచే ప్రాణసంచలనము 'పర్వతంపై నిలచే నిశ్చల మేఘం లాగా' ఉపశమిస్తుంది. క్రమంగా మనస్సు నిశ్చలమౌతుంది.

2. కుంభము - పూరకముచే నాసికాపుటముల ద్వారా స్వీకరించిన వాయువును నిండు కుండలాగా దీర్ఘకాలం శరీరంలో స్థంభింపజేయటం... అట్లు స్థంభించిన తరువాత పూరకంలోలాగానే వాయువును తిరిగి వదలటం. ఈ అభ్యాసం చేత కూడా ప్రాణము స్తంభితమౌతుంది.

3. రేచకము - వాయువును నాసికారంధ్రముల ద్వారా బహిర్గతం చేసి, మరల వాయువు ప్రవేశించ కుండా కొద్ది క్షణములు నిలువరించటం. అట్టి దృఢాభ్యాసం చేత విశాలమగు ప్రాణము ఆకాశరూపమును పొందుతుంది. అభ్యాససమయంలో, వాయువు నాసపుటములను స్పృశించక పోవుటచే ప్రాణ చలనము, తద్వారా క్రమంగా మనోచంచలత్వము నిరోధించబడతాయి.

4. తాలువు-ఘంటికల యోగముద్ర - నోటిలోపలి దవడ యొక్క మొదటి భాగంలో వ్రేలాడుచుండే ఘంటిక (కొండ నాలుక)ను నాలుక చివరికొనతో అణిచిపెట్టి ప్రాణమును బ్రహ్మ రంధ్రమున ప్రవేశింప జేసి ధారణ ఒనర్చటం చేత ప్రాణస్పందన నిలువరించబడుతోంది. తీవ్ర యోగాభ్యాసులగు కొందరు దీనిని అభ్యాసం చేస్తున్నారు.

5. పరధ్యానం - "ఈ జగత్తుకు సంబంధించిన ఏవేవో విశేషాలు తెలుసుకోవాలి, గ్రహించాలి" అను రూపం గల ఒకానొక వృత్తి ఈ జీవునిలో అనుక్షణం బయల్వెడలుతోంది. అట్టి వృత్తినే 'సంవేదన వృత్తి' అని అంటారు. ఈ జీవుని ఆ సంవేదనా వృత్తి తన స్వకల్పనా వికారమును త్యజించి నిర్వికల్ప సమాధి యొక్క అభ్యాసం చేత సూక్ష్మ హృదయాకాశంలో లయం చేయబడిందనుకో... అప్పుడు కూడా ఈ ప్రాణస్పందన నిలపివేయబడుతుంది.

6. ఖేచరీ ముద్ర - నాసికాగ్రం వద్ద గల పంద్రెండు అంగుళముల వరకు గల నిర్మలాకాశంలో మనోదృష్టులన్నిటిని తరలించి తెచ్చి నిలిపామనుకో... అప్పుడు కూడా ప్రాణస్పందము నిరోధించ బడుతోంది.

7. బ్రహ్మరంధ్ర లయ ముద్ర - పంద్రెండ్రు అంగుళముల మేర ఉన్న శిరస్సు యొక్క ఉపరి భాగపు ప్రాంతమందు గల బ్రహ్మ రంధ్రమునందు అభ్యాసవశం చేత ప్రాణ వృత్తులను లయింప జేయుటచే ప్రాణస్పందమును నిశ్చలం చేయటం.

8. భ్రూ ముద్ర - ఈ నేత్రేంద్రియము అభ్యాస వశంచేత భ్రూమధ్య భాగంలో (Space between two eye - brows) చిరకాలం నిరోధించబడినప్పుడు సైతము ప్రాణము ఉపశాంతి పొందగలదు. అట్లు శాంతికి ఉపక్రమించిన ప్రాణము బ్రహ్మ రంధ్రమునందు ప్రవేశపెట్టుటచే ప్రాణము పూర్తిగా నిరోధించబడుతుంది.

9. గురు అనుగ్రహం - ఈశ్వరానుగ్రహం - అనేక జన్మలలో చేసిన, పుణ్యం త్యాగకర్మల ప్రభావంచే పరిశుద్ధుడు సంసిద్ధుడు అయినట్టి జీవుడు ఒకానొక జన్మలో గురువు యొక్క కరస్పర్శాది అనుగ్రహము చేతనో, ఈశ్వరానుగ్రహము చేతనో 'ఆత్మజ్ఞానం' కాకతాళీయంగా పొందుతుంటాడు. లేదా, ఒక్కసారిగా తీవ్ర ప్రయత్నమును స్వీకరించి కొద్దికాలంలో ఆత్మజ్ఞానం పొందటం జరగవచ్చు. అట్టి ఆత్మజ్ఞానం క్రమంగా సమస్త కల్పనలూ, సర్వ ఆశలు అధిగమించినదై ప్రకాశించగలదు. అట్టి స్థితిలో ప్రాణచలనము స్వయముగా నిశ్చలమగుచున్నది.

10. ధ్యానము - ఈ చిత్తమును తన హృదయాకాశంలో చిరకాలం లగ్నంచేస్తూ ఉంటే అట్టి అభ్యాసియగు యోగసాధకుడు స్వయముగా వాసనారహితుడే అవుతాడు. చిత్తమును భగవన్నామ స్మరణం వంటి అభ్యాసాలలో నియమించుటచే కూడా, అదేవిధంగా, క్రమంగా హృదయాకాశంలో ఆచిత్తము సుస్థిరమవగలడు. అట్టి ఆత్మ ధ్యానము చేయుటచే ప్రాణస్పందనము నిరోధించబడుతోంది.

ఇట్టి ఆయా ఉపాయములచే, అభ్యాసములచే ప్రాణము నియమించబడగా, "చిన్మాత్ర స్వభావుడగు ఆ పరమాత్మ నా యొక్క స్వాత్మరూపమే"... అని ఎరుగబడగలదు.

❖

శ్రీరాముడు : హే మహాత్మా! నాదొక చిన్న సందేహం. ఈ విశాల దృశ్యమంతా కూడా 'హృదయము' అనే దర్పణంలో ప్రతిబింబించటం జరుగుతోంది కదా! అట్టి ఈ ప్రాణుల హృదయం ఎట్లు తయారు చేయబడింది? దీని రూపము ఎట్టిది?

శ్రీవసిష్ఠ మహర్షి : ఈ సమస్త ప్రాణుల హృదయము రెండు విభాగములు కలిగి ఉంటున్నది–

1. త్యాజ్య (భౌతిక) హృదయం - పరిచ్ఛిన్నమగు ఈ భౌతిక రూపమునందు గల వక్షస్థల ప్రదేశంలో మాంస పిండ రూపంలో ఉన్నది చూచావా? ఇది త్యాజ్య హృదయం. హృదయం యొక్క ఈ విభాగం వాస్తవానికి హృదయమునకు ఉపకరణము వంటిది. ఇది జడమైన శరీరము యొక్క ఒక అవయవమై ఉన్నది.

2. గ్రాహ్య (అభౌతిక) హృదయం - ఇది జ్ఞాన మాత్రమగు హృదయ విభాగం. ఇది సర్వుల అంతరమున, బాహ్యమున కూడా ఉన్నది. కానీ రామా! ఇది వాస్తవానికి బయటగాని లోపలగాని లేదని కూడా చెప్పవచ్చు. ఎందుకంటే అది ఒక భౌతిక పదార్థం కాదు కదా! భౌతికం కానిది దేనికి లోపల? దేనికి బయట? ఇదే ప్రధానమగు హృదయం. దీనియందే జగత్తంతా స్థితి నొంది ఉన్నది. ఇది సర్వ పదార్థములకు ఆధారం... సర్వ సంపదలకూ నిలయం కూడా.

ఈ హృదయం యొక్క రూపము ఏమిటంటావా?... దాని రూపము ఎఱుక (Awareness) (లేక) జ్ఞానము (Knowledge Absolute) (లేక) సంవిత్తు. నేను మన సంవాదము యొక్క సౌలభ్యము కొరకు హృదయమును రెండు విభాగములు చేసి చెప్పాను. అయితే, జడము... శిలాసదృశము... మాంసపిండము అయిన త్యాజ్య (భౌతిక) హృదయం వాస్తవమైన హృదయం కాదని, గ్రాహ్య హృదయం అసలైన హృదయమనీ గ్రహించు.

వాసనాత్యాగపూర్వకంగా ఈ చిత్తమును సంవిత్ రూపమగు శుద్ధ – గ్రాహ్య హృదయంలోనికి ప్రవేశింపచేయాలి. అంతేగాని, దానిని శబ్దస్పర్శాది ఇంద్రియ విషయాలలో అట్టేబెట్టి రోజులు జడపూర్వకంగా గడపరాదు. చిత్తం ప్రబలంగా హృదయాకాశంలో... ఏ మార్గము (లేక) ఉపాయం చేతనైనా సరే... నియోగించబడినప్పుడు ప్రాణ చలనం నిరుద్ధమవుతుంది. వివిధ ఆచార్యులు, లోకమునకు వివిధమార్గాలు, తదితర క్రమములు ప్రసాదించారు. శ్రద్ధగా, లక్ష్యమును ఎరిగి ఆచరించినప్పుడు ప్రాణ స్పందనము నిరోధించబడుతోంది.

మనం పైన చెప్పుకున్న ఆయా యోగయుక్తులన్నీ అభ్యాసవశం చేత.... ఈ సంసారం త్యజించి మోక్షం సముపార్జించాలనుకున్న సాధకులకు ...తప్పకుండా ఉత్తమ ఉపాయములై సహకరిస్తున్నాయి. ప్రాణాయామము మొదలైనవి అభ్యాసముచే దృఢపడుతూ వైరాగ్యమునకు సహకరించి, తద్వారా, వాసనలు నిరోధించబడతాయి. అట్టి వాసనానిరోధము యొక్క సాఫల్యముచే ఈ జీవుడు ఔన్నత్యము సంపాదించి 'ఆత్మతత్త్వము'ను గ్రహించగలడు.

❖

కాలువలో ప్రవహిస్తున్న నీరు గట్టు కట్టినపుడు తన ప్రవాహ వేగమును ఉపసంహరించుకొని వెనుకకు మరలక తప్పదుకదా! మనం ఇంతవరకు చెప్పుకున్నట్టి "భ్రూమధ్యం నుండి, నాసికా ప్రదేశము నుండి, కంఠప్రదేశము నుండి 12 అంగుళముల వరకు గల ప్రదేశంలో చిత్తమును సుస్థిరం చేయటం" (ఖేచరీముద్ర) అనే అభ్యాసం చేత మనస్సు యొక్క పరిపరివిధత్వం ఉపశమిస్తుంది. ప్రాణముల నిరంతర సంచలనము శమిస్తుంది. అట్లాగే నాలుక యొక్క చివరిభాగంతో తాలువు (దవడ) నందు వ్రేలాడి ఉండే కొండనాలుకను పలుమార్లు స్పృశించటం అభ్యసించడం చేత కూడా త్వరితగతిలో ప్రాణసంచలనంపై ఆ సాధకునకు అధీనత్వం లభిస్తోంది.

అయితే ఒక ముఖ్యమైన విషయం అందరికీ గుర్తు చేస్తున్నాను. ఆయా యోగాభ్యాసాలన్నీ అంతిమ ప్రయోజనమగు "అఖండ – అప్రమేయానుభూతి" అను రూపంగల మోక్ష స్థితిని

ప్రసాదించుటకు ముందు కొన్ని వికల్పములు ఏర్పడే అవకాశం ఉన్నది. సాధకుడు నిష్కాముడై ఉంటే వికల్పములన్నీ వాటంతటవే తొలగుతాయి. "పరమ ఉపశమనము" అనే ఫలమును దృశ్య విషయఫలాసక్తి లేని సాధకునకు త్వరితగతిని కలుగచేస్తాయి. అయితే ప్రాణయోగాభ్యాస విధివిధానములను గురుముఖతః ఎరిగి అభ్యసించవలసినదని నా విన్నపం.

❖

అభ్యాసము చేతనే మానవుడు శోకరహితుడై ఆత్మారాముడుగా విరాజిల్లగలడు. కొంచెం శ్రద్ధ, పట్టుదల కలిగియుండి సాధన చేస్తే అంతఃకరణమునందు సుఖి కాగలడు.

అభ్యాసమునకు మించిన గురువు, మిత్రుడు, ఉపాయం, మార్గం వేరే ఉండవు. అభ్యాసముచే క్రమక్రమంగా ప్రాణస్పందనము సన్నగిల్లుతుంది. మనస్సు శాంతి పొందుతుంది. మనస్సు శాంతిస్తే నిర్వాణపదము లేక బ్రహ్మపదము, లేక మోక్షము శేషించగలదు.

ప్రాణస్పందనమే మనస్సు. మనస్సు వల్లనే ఈ సంసారభ్రమ అంతా కలుగుతోంది. కాబట్టి ప్రాణస్పందనము ఉపశమిస్తే సంసార దుఃఖము తనకు తానుగా నశించుచున్నది. అప్పుడు బ్రహ్మము నందు కల్పనాయుక్తమై ఉంటున్న మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం, దేహం, ప్రారబ్ధం, బంధం, మోక్షం' మొదలుగా వాక్సముదాయమంతా నివృత్తి చెందుతుంది. బ్రహ్మపదమే శేషిస్తుంది.

యత్రసర్వమ్, యతఃసర్వమ్, యత్సర్వమ్, సర్వతశ్చయత్ ।
యత్ర నేఽదమ్, యతో నేఽదమ్, యన్నేఽదమ్, నేదృశం జగత్ ॥

ఈ జగత్తుగా గోచరించేదంతా ఎందులో ఉండి ఉన్నది? దేని నుండి ఇదంతా ఆవిర్భవిస్తోంది? ఏది అంతటా వ్యాపించియున్నది? ఈ సర్వము స్వతఃగా ఏదై ఉన్నది? కానీ...

ఎందులో జగత్తు అనబడేదేదీ ఉండజాలదు? దేనినుండి మరొకటేదీ ఆవిర్భవించజాలదు? దేని రూపమైతే ఈ కనబడే జగత్తు, ఇందలి ఏ వస్తువూ కాదు? ఏ అంశంలోనూ దేనికి ఇది సామ్యము (comparison)కాదు?

అట్టి నిత్యనూతన అకళంక అప్రమేయ బ్రహ్మము, సాధకునికి ఒకానొకదశలో అనుభవమ వుతుంది. ఈ కనబడే జగత్తు నాశవంతమూ, వికల్పమయమూ కదా! ఇక్కడ నిర్గుణపరమాత్మకు సదృశమైనదేది లభిస్తుంది? అందుకే... ఏ దృష్టాంతమైనా బ్రహ్మమును సమగ్రంగా తెలియజెప్ప గలదా?... లేదు. సాధన యొక్క పరిపక్వస్థితిలో ఈ జీవుడు అనబడే చిద్రూపము... "గాంచువాడు, గాంచబడుచున్నది, గాంచుట" అను త్రిపుటితో సహా సర్వరూపరసాది బాహ్యావృత్తులకూ సాక్షిరూపత్వము అనుభవించ గలదు. నాటకము చూస్తున్న రాజుగారు రంగస్థలంపై ప్రవేశించి పాత్రధారుల రసావేశంలో జోక్యం కలిగించుకొనటం ఎంత రసాభాసయే గదా! యోగి తన సాక్షి స్వరూపము ఎరిగిన తరువాత ఈ జగత్తు అనే కల్పనతో తాదాత్మ్యం చెంది రసాభాస పొందడు. అతడు సర్వదా సాక్షి రూపమునే ఉంటాడు.

అట్టి చిద్రూపమే తేజోవంతములైన అన్ని పదార్థముల కంటేకూడా ప్రకాశవంతమైనది.

ఈ కామము మొదలైన సర్వ అభ్యంతర వృత్తులనూ ప్రకాశింపజేస్తున్నది అదే! 'చైతన్యము' అనే మహావృక్షము నుండి వివిధ రసయుక్తములగు ఈ జగద్రూపఫలములు నిరంతరం ఉత్పన్నమై నశిస్తున్నాయి. ఏ మహామతి అయితే ఈ సర్వసీమములకు ఆవల ఉన్నట్టి ఆ బ్రహ్మపదమును ఆవలంబించి ఉంటాడో... ధీరుడు, బ్రహ్మజ్ఞుడు అగు ఆతనిని 'జీవన్ముక్తుడు' అని మనం పిలుస్తున్నాం. అట్టి జీవన్ముక్తునకు సర్వభోగాభిలాషలు నశించిపోతాయి. హిత – అహిత కల్పనంతా ఉపశమించి పోతుంది. ఆతడిక ఎట్టి వ్యవహారమునందునూ హర్షముగాని, శోకముగాని పొందడు.

ఆతడే ముక్త మానసుడు. ఆతడే పురుషోత్తముడు.

❖❖❖

10. జ్ఞాన మార్గం

శ్రీరాముడు : మహాత్మా! "యోగయుక్తస్థితి" పొందటానికిగాను చిత్తమును నశింపజేయాలి కదా! అట్టి చిత్తనాశనమునకై ఉపాయమగు 'ప్రాణనిరోధం' గురించి చెప్పారు. అట్లాగే మరొక ఉపాయమైనట్టి 'సమ్యక్‌జ్ఞాన సముపార్జనం' గురించి కూడా చెప్పండి.

శ్రీవసిష్ఠ మహర్షి : "ఆద్యంత రహితుడు, అసాధారణుడు అగు పరమాత్మ ఒక్కడే ఈ జగత్తునందు కలడు. ఆతనికి అన్యంగా ఎక్కడా ఏదీ లేదు" ....అను ఏ మహత్తర నిశ్చయం ఉన్నదో... అద్దానినే విజ్ఞులు 'సమ్యక్ జ్ఞానం' అని పిలుస్తున్నారు. అట్టి సమ్యక్ జ్ఞాని, "కుండలన్నీ మట్టియే. వస్త్రములన్నీ దూదియే. జీవులన్నీ ఆత్మయే" అను భావన కలిగి ఉంటాడు.

మిథ్యాజ్ఞానముచే జన్మాదులన్నీ కలుగుచున్నాయి. మిథ్యా జ్ఞానము చేతనే కదా, బాటయందు మెలికలు తిరిగిపడియున్న త్రాడును చూచి 'ఇది పాము' అని భ్రమకలగటం! సమ్యక్ జ్ఞానం – అనగా, "పాము అన్నది నా భ్రమ. ఇక్కడ ఉన్నది త్రాడే" అని తెలియవచ్చుట వంటిదే!

సంకల్పాంశ వినిర్ముక్తమైనది, విషయవర్జితమైనది అగు తత్త్వమునకు 'సంవిత్తు' (Absolute Existence & Knowledge)అని పేరు పెట్టారు. అట్టి సంవిత్తు తన యొక్క స్వప్రకాశ స్వభావం చేత సర్వే సర్వత్రా నిండియున్నది. దానికి అన్యమైనదంటూ ఎక్కడా ఏదీ లేదు. అదే మోక్ష స్థానమూ... బ్రహ్మమూ కూడా. ఆ సంవిత్తు ఒక చోట శుద్ధరూపంగా ఎరుగబడినప్పుడు ఆ స్థానమును 'పరమాత్మ' అని అంటున్నాం. అది సర్వ పదార్థరూపమయినప్పటికీ... అశుద్ధ రూపకల్పనచే అదే 'అవిద్య'గా అగుచున్నది. దృశ్యపరిమిత దృష్టి కలిగిఉన్నప్పుడు పరమాత్మయే జీవాత్మగా పిలువ బడుతోంది.

"లేక అది అవిద్యను గాంచుచున్నది!" అని కూడా అనవచ్చు... ఓ రామచంద్రా! ఏదైతే తెలుసుకొనుచున్నదో అదే తెలియబడవలసినది. ఈ అభిప్రాయాన్నే వేదాంత పరిభాషలో – జ్ఞానమే జ్ఞేయమై ఉన్నది ...సంవిత్తే సంవేద్యము" – అని చెప్పబడుతోంది.

నీవు ఆ పరమాత్మగా ఆరాధించు లక్ష్యార్థము ఏమై ఉన్నది?... నీ వాస్తవ శుద్ధరూపమే! అదియే సర్వదేహుల యొక్క శుద్ధ రూపము కూడా! అనగా... నీవే సర్వమై, శుద్ధమై, శాశ్వతమై, అఖండమై, అప్రమేయమై... స్వతఃగా పరమాత్మవే అయి ఉన్నావు.

"నేను దేహముచే, ప్రదేశముచే, కాలముచే బద్ధుడను" అను భావన కలిగి ఉన్న సంవిత్తును "జీవుడు" అను పేరుతో పిలుస్తున్నాం. సంవిత్తు వాటికి అతీతమైన భావమును స్వీకరించియున్నప్పుడు, అట్టి సంవిత్తు యొక్క స్థితిని "శివము, మోక్షము" మొదలైన శాస్త్రీయ నామములతో చెప్పుకుంటున్నాం. జీవుడు వ్యక్తిగతమైన విశేషముల దృష్ట్యా చూస్తే, భ్రమయుతుడేగాని, "వాస్తవస్వరూపుడు" (నిజం) కాదు. ఈ జీవుని యొక్క శివస్వరూపం సర్వదా వాస్తవమై వెలుగొందుతోంది.

❖

కనుక రామా! సంవిత్తు... సంవేద్యము; జ్ఞానము... జ్ఞేయము; తెలుసుకుంటున్నవాడు... తెలియబడుచున్నది – ఇవన్నీ ఒకే అర్థం కలిగియున్నాయి.

ఈ అన్ని ద్వంద్వములమధ్యా ద్వైత కల్పనయే లేదు. అజ్ఞానవశం చేతనే ఆత్మ తనను తాను జగద్రూపంగా సంచయమొనర్చుకొనుచున్నది. ఏది ఏమైనా కావచ్చు.... ఆత్మకు అన్యమైనదంటూ ఎక్కడా ఏదీ లేదు.

ఈ ముల్లోకములలో కనబడేదంతా సత్యమగు ఆత్మయే అయిఉన్నది. "ఈ జగత్తంతా ఆత్మయే"... అనే నిశ్చయం నీ యందు స్థిరపడిందా, ఇక నీకు పూర్ణ కామత్వము సిద్ధిస్తుంది. సర్వమూ ఆత్మగా దర్శించ బడుచున్నప్పుడు ఇక భావాభావములు ఎక్కడుంటాయి? బంధమోక్షముల ప్రసక్తి ఎక్కడ?... ఎవరికి?

శ్రీరాముడు : మరి శాస్త్రములు బంధమోక్షముల గురించి ప్రస్తావిస్తున్నాయి కదా....?

శ్రీవసిష్ఠ మహర్షి: ముముక్షు విజ్ఞానం విస్తారింపజేయటానికి మాత్రమే శాస్త్రములు 'బంధమోక్షములు' అనే కథనమును ప్రతిపాదిస్తున్నాయి. ఇంతకీ ఈ జీవులు ఆత్మ అను ఏ వేరైన దానికై వేచివుండాలో చెప్పు?... కనుక ఇప్పటికి లభించనిదేదో అప్పుడు లభించాలి – అను ఉద్వేగం అనుచితమే అవుతుంది.

ఆత్మ లభించి ఉండనిదెప్పుడు? ఆత్మస్వరూపం కానిదేది.

❖

'చిత్తము' అనబడేది ఆత్మకు అన్యంగా ఏదీ ఎక్కడా ఉండజాలదు. బ్రహ్మమే సర్వదా ఈ దృశ్యము రూపమున శోభిస్తోంది. ఈ జగత్తంతా చిదాకాశమే. బంధమోక్షముల ప్రేలాపన వ్యర్థమైనదే సుమా! మహత్తుకు కూడా మహత్తు అయినట్టి బ్రహ్మమే 'విశాలము... విస్తారము' అయిన ఈ దృశ్యము రూపమున ఉన్నది.

అందుచేత ఓ ప్రియజనులారా! మీ రంతా 'ద్వైతము' అనే భావనను మీయందు రహితం చేయండి. యత్నశీలురై, అట్టి యత్నపూర్వక శ్రద్ధచే "ఆత్మ అనగా నేనే" అను ఎరుకను సుస్థిర పరచుకోండి. ఆత్మ స్వరూపులు కండి.

❖

ఓ రామా! కట్టె, శిల, వస్త్రము, దేహము మొదలైన పదార్థాలన్నీ వాస్తవానికి 'శక్తి' యొక్క వివిధ తత్త్వములే కదా! "అధిష్ఠానమగు సన్మాత్ర దృష్టి"తో చక్కగా విచారిస్తే వాటియందు లేశమైన భేదం కనిపించదు. వాస్తవం ఇది అయి ఉండగా, ఇక నీవు దేని కొరకు సంకల్పోన్ముఖుడవు అవుచున్నావో చెప్పు? నీవు దేనిని 'వస్తువు'గా చూస్తున్నావో... అది తన యొక్క ఆద్యంతములందు నాశనము లేనిదే అయి ఉన్నది.

వస్తువు యొక్క వాస్తవ తత్త్వమునకు ఉత్పత్తి, వినాశనములు లేవు. వాటి ఆద్యంతముల స్వరూపం ఆత్మయే. కనుక నీవు నిశ్చింతగా ఆత్మమయుడవై ఉండుము.

స్థావరజంగమాత్మకమగు ఈ జగత్తంతా పరబ్రహ్మరూపమగు చిదాకాశమే అయి ఉండగా ఇక ఇందు సుఖ దుఃఖములెచట? కాబట్టి రామా! నీవు సంతాపం పొందవలసిన పనిలేదు. ఒకే జలం చిత్ర విచిత్ర తరంగముల రూపమున స్ఫురిస్తోంది కదా! ఆత్మయే ఈ ద్వైతాద్వైతములుగా ఉత్పన్నమగుచూ సమూహంగా స్ఫురిస్తోంది. తత్త్వము తెలిసినవానిని ఈ విషయభోగములు ఏమాత్రం తాకనైనాలేవు. బంధించలేవు. పిల్లగాలులు పర్వతమును చలింపజేయగలవా? మహత్తరమగు ఆత్మను గురించిన విచారణ సల్పుచున్నట్టి జ్ఞానియొక్క మనస్సును ఈ తుచ్ఛప్రాపంచిక ఇంద్రియ వ్యవహారములు ఏమాత్రం ఖిన్నం చేయలేవు. అయితే, అల్పజలం గల తటాకంలో కొంగలు చేపలను పుటుక్కున మ్రింగివేస్తున్నట్లు, అల్పవిచారణతో కూడిన ఆశలతో నిండిన మనస్సు గల మూఢజీవుని దుఃఖములు వచ్చి నిరంతరం మ్రింగివేస్తున్నాయి.

❖

అందుచేత రామా! "ఇదంతా ఆత్మయే! అవిద్య అనబడేదానికి స్వయం ప్రభావం (Independent Existence) లేదు" అను దృష్టిని అభ్యాసం చేయి. అప్పుడు పరిశుద్ధమగు పరమాత్మగా శేషిస్తావు. ఆత్మారాముడవై విరాజిల్లుతావు. వివిధ జలాశయములలోని తరంగములు, ఫేనము (నురుగు) బుద్బుదములు (బుడగలు) జలమునకు వేరు వేరు కానట్లే... వివిధ కల్పనలన్నిటిలో ఆత్మ కాక మరేదీ ఎక్కడా లేదు. సర్వ ప్రయత్నములచే, ఉత్తమోత్తమ విచారణ చేసి ఈ విషయం చక్కగా గ్రహించు. ఈ సర్వ ఉపాధులందు స్ఫురించుచున్న 'నేను... నేను' అను సంవిత్తుతో సహా... ఇక్కడా – అక్కడా – ఎక్కడా అన్ని వేళలా ఆత్మయే ఉన్నది.

ఆత్మకు అన్యంగా "నేను" అనేది లేదు. కనుక... నేను ఆత్మనే.

ఈ మాత్రం గ్రహించటంలో కష్టమేమున్నది చెప్పు? "ఆ భగవంతునికి వేరుగా మరెక్కడో నేను ఉన్నాను" – అను భావన చేతనే సర్వ అనర్థములూ వచ్చి పడుతున్నాయి. "ఆత్మ తప్పితే మరింకెక్కడా ఏదీ ఉండదు" ...అను దృఢనిశ్చయముచే సర్వ అనర్థములూ తొలగిపోతున్నాయి. అందుచేత... సమ్యక్ ఆత్మదర్శివి కమ్ము. అప్పుడు... మనస్సుకు తారసపడుచున్న సర్వబంధముల నుండీ విముక్తుడవౌతావు.

విముక్తుడవై ఇక ఆ తరువాత ముందులాగానే ఏది ఎట్లు ఉచితమో, విధి విధానమో అట్లే వ్యవహరిస్తూ ఉండు. ఇక నీచే చేయబడేదేదీ నిన్ను స్పృశించజాలదు. నీ మనస్సు హానివృద్ధులను

అధిగమించగలదు. అట్టి నిత్య – సత్య – అఖండ – అప్రమేయ – సర్వగత ఆత్మ స్వరూపుడవై చెన్నొందుచున్నప్పుడు నీవు సర్వులకూ నమస్కారయోగ్యుడవౌతావు.

ఇట్టి అవగాహనాపూర్వకమైన అనుభవస్థితిని పెంపొందించుకొనుటయే 'జ్ఞానమార్గము' అను పేరుతో శాస్త్రజ్ఞులు మనకు ప్రతిపాదిస్తున్నారు.

❖❖❖

11. దృశ్య - దర్శన సంబంధాతీతత్వం

శ్రీవసిష్ఠ మహర్షి: ఓ రామచంద్రా! నీ యొక్క "సమ్యక్ జ్ఞానమార్గం" సుగమం కావటానికి ఉపకరించ గల ఒకానొక విచారణను అందిస్తాను. దీని సహాయంతో ఈ భోగములు ఎదురుగా ఉన్నప్పుడు కూడా వాటి కొరకై ప్రీతి గొనవలసిన అగత్యం లేనేలేదని శ్రోతలు గమనించగలరు.

❖

ఎద్లు బండిని లాగుతూ ఉంటాయి. అయితే ఆ బండిలోని పదార్థములను అనుభవించేది ఎద్లా?... కాదు. ఆ బండి యజమాని కదా! అట్లాగే... ఈ నేత్రములు కేవలం రూపాన్ని చూస్తాయి. కానీ ఆ రూపము వలన కలిగే సుఖం, దుఃఖం, ఆశ్చర్యం మొదలైనవి అనుభవించేది నేత్రములు కావు. నేత్రములందు ప్రవేశించిన సంవిత్స్వరూపుడగు ఈ జీవుడే సర్వం అనుభవించువాడు సుమా!

ఇక్కడ మనం ఒక ముఖ్యమైన ప్రశ్నను విచారించాలి. నేత్రేంద్రియములు రూపమునందు లగ్నమయినప్పుడు ఆత్మకు ఎందుకు క్షోభకలుగుతోంది? తన గాడిద గుంటలో పడినంత మాత్రాన చాకలి దిగులుగా చతికిలపడి కూర్చుంటాడా? బాటలోని బురద పాదాలకు అంటినప్పుడు "ఏమిరా దేముడా!" అనుకుని మనం ఊరుకుంటున్నామా? కాళ్ళు శుభ్రంగా కడుక్కుంటున్నాం. నేత్రం ఒక ఉపకరణము. ఇక దృశ్యము అట్టి ఉపయోగములలోని ఒకానొక 'సందర్భము'. అందుచేత ఈ జీవులు నేత్రములు సదవగాహనతో, సరిఅయిన మార్గంలో నియమించి ఉపయోగించుకోవటమే వినియోగం. అదియే 'యోగం'. అందుచేత ఈ నేత్రాది ఇంద్రియములను సరి అయిన సమాచారం జోడించి ఆపై ఆయా క్రమములందు ఉపయోగించడం అత్యవసరం. అట్టి సంబోధనను జ్ఞానులు ఎట్లు ఆశ్రయిస్తున్నారో చెపుతాను.... విను.

❖

ఓ నా నేత్రములారా! మీరు 'ఎంత బాగు!' – అని అనుకుంటూ ఈ స్త్రీ మొదలైన ఆయా అందంగా కనిపించే విషయాలలో బురదలో చిక్కుకున్నట్లు చిక్కుకోకండి. ఎందుకంటారా? ఏవేవి 'అందంగా కనిపిస్తున్నాయి' అని భావించి, శ్రమించి మీరు బయలుదేరుతున్నారో... అవన్నీ కూడా కొద్ది క్షణాలలో తీవ్రమైన మార్పులు చెందబోతున్నాయి. పైగా మిమ్ములనే నశింపజేస్తున్నాయి.

అంతఃస్థితమైయున్న చిదాత్మయే బయట కూడా ఆయా సర్వ పదార్థములందూ ప్రకాశించు చున్నది. అంతఃస్థితమై యుండే "అన్నమయ–ప్రాణమయ–మనోమయ–విజ్ఞానమయ–

ఆనందమయములు" అనబడే పంచకోశములు ఆత్మయొక్క ప్రకాశముచే స్థితి పొంది ఉంటున్నాయి. అందుచేత అవి "ఆత్మకు అభిన్నములు" అయి, అనుగమించబడుచున్నాయి. తీక్ష్ణ బుద్ధిగల ప్రాజ్ఞుడు తన కార్యక్రమములలో అధిక భాగం ఆత్మ సంబంధములగు కార్యక్రమములలో ఇంద్రియ, మనస్సులను నియమించి ఉంచుతాడు. ఇక యథాప్రాప్తములైన పదార్థానుభవమునకు సంబంధించిన క్రియలయందు "ఉదాసీనత్వము" వహించి నిర్వర్తిస్తూ ఉంటాడు. అంతేగాని, మూఢుని వలె ఈ రూప నామముల బురదలో తాదత్మ్యం పొందడు. ఈ దృశ్య పదార్థములన్నీ ఉత్పత్తి, వినాశనం కలిగి ఉన్నవేకదా! పైగా, ఇవన్నీ కూడా అవిచారణ చేతనే పైకి రమణీయంగా కనబడి ఆకర్షిస్తున్నాయి. మిథ్యయగు రూపములను ఆశ్రయించి మృత్యుముఖంలో ప్రవేశించవలసిన అగత్యం ఏమిపట్టింది?

ఓ ఇంద్రియములారా! ఆ పరమాత్మ సర్వ పదార్థములనూ ప్రకాశింపజేయుట యందు అతి సమర్థుడై ఉంటున్నాడు. అయినా కూడా, ఈ రూపాది విషయములందు ఉదాసీనుడై సాక్షి స్వరూపుడై ఉంటున్నాడు. కాబట్టి మీరు కూడా ఈ దృశ్యముపట్ల సాక్షివలె ఉండండి. సదసద్రూపమగు ఆత్మనే వీక్షిస్తూ ఉండండి. అంతేగాని ఆత్మకు వేరైనట్లు భావనచేసి నిరుపయోగమైన సంతాపమంతా పోగుచేసుకోండి. ఇక్కడ తారసపడుచున్న "భార్య, భర్త, కుమారులు, మిత్రులు, అమిత్రులు, ఐనవారు, కానివారు" – మొదలైనవారంతా 'ఇదంతా ఆత్మయే' అను దృష్టిని దృఢంగా కలిగి ఉండండి. ఆపై ఇక ఏమి చూడాలనుకుంటే అది చూడండి. భ్రమమాత్రం పొందకండి.

నేత్రాదులు సేకరించే దృశ్యము గ్రహిస్తున్న ఓ చిత్తమా! నదీజలంలోని తరంగము యొక్క ఆకారం ఎంత అనిత్యం? ఈ "జాతి – వస్తు – ప్రదేశ – సందర్భముల"... సంబంధాలన్నీ అంతే అనిత్యం. ఆకాశంలో కనిపించే మేఘము యొక్క ఆకారం లాగా మిథ్యయే అయినట్టి ఈ వస్తు సముదాయముల ఆగమన, నిష్క్రమణములలో లాభాలాభములేమి ఉంటాయి? కనుక నీవు ప్రశాంతంగా శమించి ఉండు.

అద్దంలో ప్రతిబింబంలాగా, ప్రళయకాలజలంలో నశించబోయే చేపలాగా చిత్తమునందు ఈ జగత్తు స్ఫురిస్తోంది. మధ్యలో భ్రమలాగా ఏర్పడి, భావోద్వేగాలను ఉత్పత్తి చేస్తోంది.

ఈ పదార్థములన్నీ సూర్య ప్రకాశం ఆశ్రయించుటచేతనూ, పదార్థములను ఆశ్రయించుట చేత సూర్యప్రకాశమూ వ్యక్తమగుచున్నాయి. ఈ విధంగా ఆధార ఆధేయములు జడమై స్ఫురిస్తున్నాయి. ఇక అట్టి సమావేశము చూచి జీవుడు "అంత అందంగా ఉన్నది!" అని అనుకుంటూ భ్రాంతికి లోనై నిష్కారణంగా కామాదులు ఎందుకు పొందాలి? ఈ జీవునకు వాస్తవానికి ఏ పదార్థంతోనూ ఎట్టి సంబంధం లేనే లేదు. ఇక వ్యధ దేనికి?

❖

1. రూపము, 2. నేత్రాదులచే కలుగుచున్న బాహ్య పదార్థముల 'దర్శనం' (ప్రకాశము), 3. మనస్సు యొక్క సంకల్పం ...ఈ మూడూ కూడా ఒక దానితో మరొకదానికి సంబంధము లేని మూడు తత్త్వములు, కాని, చిత్రం! 'ముఖము, దర్పణము'వలె ఈ మూడు కలిసిఉంటున్నాయి. అయితే... అజ్ఞానముచే మాత్రమే అవి మూడూ కలిసి ఉన్నట్లు కనిపిస్తున్నాయి.

జ్ఞానముచే అజ్ఞానము తొలగినప్పుడు ఆ మూడు వేరువేరుగానే కనిపిస్తాయి. అప్పుడా మూడూ శుద్ధ స్వరూపంగా, అధిష్ఠానమాత్రం (Made up of Absolute Self)గా శేషిస్తాయి. కొయ్య, లక్క కలిసి ఉన్నప్పటికీ వాటికి ఒక దానితో మరొకదానికి సారూప్యత -- ఏకత్వం ఉండదు కదా! "రూపము - ప్రకాశము - సంకల్పము" - ఈ మూడూ కూడా మనస్సు యొక్క ఉనికి చేత, చర్య చేత ఒకచోటికి వచ్చి ఒనగూడుచున్నాయి. అజ్ఞానము సంక్షయించుటచే మనస్సు లయించిందనుకో... అప్పుడు ఆ మూడూ కలియజాలవు.

❖

శరీరంలో కళ్లు, చెవులు, ముక్కు నోరు, చర్మము, కాళ్ళు, చేతులు వివిధ ధర్మములను నెరవేరుస్తున్నాయి కదా! అయితే మనస్సే ఇన్ని ఇంద్రియములను ఆయాధర్మములకై ప్రేరేపిస్తోంది. అట్టి మనస్సు ఇంద్రియ ధర్మములవైపుకే ప్రీతిరూపంగా ప్రసరిస్తోందిగాని, ఆత్మను ఎరుగుటలేదు. ఇంటికి అసౌకర్యం కలుగజేసే వస్తువును ఇంటిలోంచి తీసివేస్తాము చూచావా? పిశాచమువలె అల్ప, స్వల్పకాలిక వస్తువులవైపుగా ప్రసరిస్తున్న ఈ మనస్సును సర్వప్రయత్నములచే తన దుష్ట మార్గము నుండి విరమించేటట్లు చేయాలి.

ఓ మనస్సా! నీవు మిథ్యారూపంగానే విజృంభిస్తున్నావు! కానీ "ఆత్మ ఇంద్రియవిషయములను మననము చేయుట"యే నీ యొక్క స్వరూపమని నాకు తెలిసిపోయింది. అనగా, నేను మననము చేయుచుండటమే నీ స్వరూపమూ, ఉనికి కూడా! ఇప్పుడిప్పుడే నీ ఆనుపానులు తెలిసిపోతున్నాయి. ఆద్యంతమూ నీవు అసద్రూపమే కనుక నీవు భూత - వర్తమానములందు కూడా మృత ప్రాయుడవే. పంచేంద్రియముల ద్వారా శబ్ద -స్పర్శ - రూప - రస - గంధాలు ఏర్పడుచుండగా, నాకు వాటికి మధ్య నీవు ఎక్కడినుంచి వచ్చావు? ఈ జీవుడు నిన్ను తనవానిగా, తనంతటివానిగా ఎంచుటచేతనే అతని ఉపకరణార్థం నీవు బయల్వెడలుచున్నావు. అంతేగాని, వాస్తవానికి సర్వదా అసంగమగు చైతన్యమునకు నీవు సంబంధించిన దానవు ఏమాత్రం కానేకావు.

ఓ మనస్సా! నీయొక్క విజృంభణం నాకు కొంచంకూడా సంతోషం చేకూర్చటం లేదు. ఒక ఇంద్రజాలకుని మాయచే ప్రేరితమైన దానివలే నీవు క్షణకాలంలో ఉద్భవించి వివిధములైన విషయాకృతులను అవధరిస్తున్నావు. వ్యర్థంగా ఎక్కడెక్కడో తగుల్కొనుచున్నావు ఎందుకు?...

సరే! ఇంతవరకు ఏదైనా జరిగి ఉండనీ. ఇకపై ఏం చేయాలి అనే విషయానికివద్దాం. ఇక నీవు ఉంటే ఉండు. లేదా, తొలగిపో. నాకుమాత్రం నీతో ఏమీ సంబంధంలేదు. మిథ్యారూపుడవగుటచే నీవు ఎప్పుడూ గతించినదానివే అవుతావు. విచారణ దృష్టితో చూస్తే నీకు ఉనికియే లేదు.

ఓ మనస్సా! నిత్యమృతుడా! నీవు తత్త్వరహితుడవు. జడుడవు. భ్రాంతి మయుడవు. శఠుడవు అజ్ఞానసహితుడవు. అజ్ఞానికి మాత్రమే నీవు దుఃఖం కలిగించగలవు. విచారవంతుని నీవు ఏమీ చేయలేవు. అజ్ఞానకారణం చేతనే ఇంతకాలం 'ఈ మనస్సును తొలగించేది ఎట్లా?' ...అని నేను మథనపడ్డాను. ఇప్పుడో... నేను ఆత్మను దర్శించాను. ఆత్మకు వేరైనదేదీ ఎక్కడా ఉండజాలదు. కనుక నీవు లేవు.

మసక చీకట్లో కనబడిన ఏవేవో ఆకృతులన్నీ దీపం వెలగగానే మటుమాయ మౌతాయి చూచావా? జ్ఞానదీపం మాయందు వెలగనంత కాలం రాగ-ద్వేష-మోహ-క్రోధ-మద-మాత్సర్యాదుల క్రీనీడలతో భ్రమింపజేశావు. నిన్ను చాలాకాలం నిరోధించలేకపోయాను. మా దేహములలోనే ఉన్న ఆత్మవస్తువును ఎంతో కాలం కనుమరుగు చేశావు.

ఇక చాలించు నీ నాటకం. అజ్ఞాన పిశాచం తొలగగా ఈ దేహం శమ, దమాది ఉత్తమ గుణములకు ఆలవాలమై సజ్జనుల సద్వచనములు వినుటకు అర్హమగుచున్నది. ఎంత సంతోషించ వలసిన విషయం!

ఓ 'మనస్సు' అనే బేతాళమా! నీవు ఇతఃపూర్వమూ లేవు. ఇప్పుడూ ఉండజాలవు. ఇకముందూ ఏర్పడజాలవు. 'అసత్' స్వరూపమగు నీవు ఇంకా సిగ్గు పడక ...నవ్వుచున్నావా? నా ఈ గృహ దేహం నుండి "తృష్ణ-క్రోధము-మోహము" మొదలైన నీ పరివారాన్ని తీసుకొని ఇక బయలుదేరు.

❖

అమ్మయ్యా! 'వివేకము' అనే మంత్రమును ఆశ్రయించుటచే 'మనస్సు' అనే బేతాళుడు బయటకు పంపబడ్డాడు. గుహలోంచి తోడేలును వెడలగొట్టినపుడు ఆ గుహ ఎంత ప్రశాంతంగా ఉంటుంది! మనస్సు సంయమిస్తే అంతటి ప్రశాంతత లభిస్తుంది. ఏ ప్రాణికైతే "నేను ఈ దేహమాత్ర స్వరూపుడను" ...అనే బుద్ధి ఉంటుందో, ఆ ప్రాణిని 'క్షణభంగురము, జడము, శఠరూపము' అయినట్టి ఈ మనస్సు తన వశం చేసుకోగలుగుతోంది. ఆతనిని బంధించి తన ఇష్టం వచ్చినట్లు ఆట ఆడిస్తోంది. అయితే ఆ ప్రతాపము, ఆ ఆశ్రయశక్తి మనస్సుది కాదు. అదంతా అజ్ఞానము యొక్క ప్రతాపం మాత్రమే. "ఈ శరీరమునకు పరము, అద్వితీయము అగు ఆత్మశక్తినే నేను" అను ఎరుక గలవాని ముందు ఈ మనస్సు ఒక ఉపకరణం మాత్రంగా ఉండి పోతుంది. అట్టి వానిని అది బాధించజాలదు. ఆత్మసందర్శిని ఈ జగత్తు యొక్క ఉనికి లేములు తన సర్వ సమ స్వరూపం నుండి విఘ్నము కలిగించ లేవు. దీనమగు చిత్తము పూర్ణమగు ఆత్మను వశం చేసుకోవటమేమిటి?

కనుక నేను చిత్తము (మనస్సు)ను అంగీకరించనక్కర్లేదు... తిరస్కరించనక్కర్లేదు. ఆత్మ సందర్శన ప్రభావం చేత అది మృతప్రాయమై నా పూర్ణ స్వభావము నందు ఒక మూల ఒదిగి ఉండు గాక.

❖

"మనస్సు కలదు... నేను దానిని తొలగించుకోవాలి" అనే దుర్వ్యసనం, భ్రమ, ప్రయాస... అన్నీకూడా "స్వయం స్వరూపమగు ఆత్మ ఒక్కటే ఉన్నది" అను అవగాహన సహాయంతో తొలగిపోతున్నాయి. ఇప్పుడు దయ్యం వదలినవానివలె వ్యర్థత్వమంతా వదలి జీవన్ముక్తుడనై ఆత్మయందు ఆత్మచే ప్రశాంతుడనగుచున్నాను.

చిత్తముతో కూడి ఇంతకాలం నేను ప్రదర్శించిన హావభావములు చూచి ఇప్పుడు నవ్వువస్తోంది. నైర్మల్యం తొలగుటచే పరిశుద్ధుడను, సుఖుడను అగుచున్నాను. 'విచారణ' అనే మంత్రస్తవంచే చింతలన్నీ ఉడిగి, విషయవైషమ్యాలు తొలగి శాంతుడనైనాను. అహంకార దుష్టరాక్షసుడు మరణించాడు.

❖

అయినా... నాకు మనస్సు ఏమిటి? ఆశ ఏమిటి? తుచ్ఛమైన అహంకార మేమిటి? ఈ స్త్రీ పుత్రాదులు నావా? ...కావు. కానప్పుడు వాటి కొరకై నేను రోదించటమేమిటి? నాకు మనస్సు అక్కర్లేదు... ఆశ అక్కర్లేదు. నేను సర్వదా అద్వితీయుడను... కృతార్థుడను, చిత్స్వరూపుడను, నిర్మలుడను, నిర్వికల్పుడను, నిత్యుడను. అట్టి నా ఆత్మకు నేనే పలుమార్లు జేజేలు పలుకుతూ నుతిస్తున్నాను... నమస్కరిస్తున్నాను.

నాయందు శోకముగాని, మోహముగాని లేవు. అహంకారము, అభిమానము మొదలైనవి ఉండవు. అవన్నీ నాకు బాల్య చాపల్యము వంటివి. సర్వమునకు సర్వదా నేను సాక్షిని. నా సాక్షి స్వరూపమునందు ఆశ, కర్మ, సంసారము, కర్తృత్వము, భోక్తృత్వము, దేహములు - మొదలైనవి ఏర్పడజాలవు. సాక్షియగు నన్ను చేరగలిగినది, నాతో సమానమైనది ఏదీ లేదు. 'నేను' అను కల్పనకు ముందే ఉన్నదేదో అదే నా వాస్తవరూపం.

నేను 'ఆత్మ' అనే శబ్దమునకు వాచ్యుడను కాదు. ఏ శబ్దమునకూ నన్ను సంపూర్ణముగా ప్రవచించగల, ప్రకటించగల, నిర్వచించగల సామర్థ్యం లేదు.

అయితే 'అహం' అను ప్రత్యయమునకు అన్యమైనదంటూ ఏదీ లేకపోవటం చేత... అంతయూ నేనే. సర్వలోకములకూ ఆదికారణం, ఈ లోకములను వహించేది, ఈ లోకములు స్వరూపంగా కలిగి ఉన్నది, అంతరమున ఈ లోకములేవీ లేనివాడను నేను. అందుచేత 'ఇది తొలగాలి... ఇది ఉండాలి' అనేదేదీ నాకు ఆపాదించబడజాలదు. ఏ దేశ-కాల-వస్తువులూ నన్ను పరిచ్ఛిన్నం చేయజాలవు.

నిర్వికారాయ నిత్యాయ నిరంశాయ మహాత్మనే ।
సర్వస్మై సర్వకాలాయ మహ్యమేవ నమోనమః ॥ (శ్లో 45, సర్గ 80)

నిర్వికారమై, నిత్యమై, అంశరహితమై, సర్వరూపమై, సర్వకాలస్వరూపమై, రూపరహితమై, నామవర్జితమై, ప్రకాశస్వరూపమై, మహత్తరమై, ఏకమైనట్టి పరమాత్మను నేను.

సమరూపమై, సర్వవ్యాపకమై, సూక్ష్మమై, ఏకమై ఈ జగత్తు నంతటినీ ప్రకాశింపజేయుచున్నట్టి ఓ నా చైతన్య సాక్షి పరతత్త్వమా! నీవూ నేనూ ఒక్కటే కదా! మరి నీకు నేను నమస్కరించటమెట్లా?

నేల, పర్వతము, నది మొదలైన వాటితో కూడిన ఈ పదార్థ సంచయజగత్తు గాని; కాళ్ళు, చేతులు, కళ్ళు మొదలైన అమరికతో కూడిన ఈ దేహం గాని నేను కాదు. ఇవి ఉన్నా లేకున్నా ఫరవాలేదు.

ఇవి నాకు సంబంధించినవి కావు. నేను వీటికి సంబంధించను. లేదా... స్వయంప్రకటనచే అవన్నీ నేనే. ఉన్న చోట ఉంటూనే అంతటా ఉన్నాను. మనోవికల్పరహితుడను... సమత్వముచే శోభించువాడను. విశ్వమును లీలామాత్రంగా ప్రకటించువాడను. జగద్రహితుడను... శరీరములు లేనివాడను. జరాజన్మ రహితుడను. అచ్యుతుడను... చిత్స్వరూపుడను. గుణాతీతుడను.... ఈశ్వరుడను. నమస్కరించువాడిని, ఆ నమస్కారం స్వీకరించువాడను...నేనే!

❖❖❖

12. తత్త్వవేత్త

శ్రీవసిష్ఠ మహర్షి : హే మహాబాహో! రామచంద్రా! తత్వవేత్తయొక్క నిశ్చయం ఎట్లా ఉంటుందో మనం ఇంతవరకు చెప్పుకున్నాం.

ఎప్పుడైతే జీవుడు "ఈ ప్రపంచమంతా ఆత్మయే. ఆత్మకు ద్వితీయంగా దృశ్యంలేదు" అనే నిశ్చయం సంపాదిస్తాడో ...అప్పుడు ఆతనిని శాస్త్రజ్ఞులు 'తత్త్వవేత్త', 'అద్వితీయుడు' అని పిలుస్తున్నారు. అట్టివానికి తన చిత్తము కూడా ఈ దృశ్యములో అంతర్భూతమై తదితర దృశ్యముల లాగానే మిథ్యగా ఎరుగబడుచున్నది. ఆతనికిక దృశ్యంలో ఉద్భవం సంభవించదు.

ఈ జగత్తంతా అవిద్యయొక్క (లేక) మాయ యొక్క కార్యమే. అన్య చిత్తదృష్టిచే ఇది లేనిదే అవుతుంది. ఎవరికి వారికే వారివారి చిత్తమును అనుసరించి ఈ జగత్తు పరిపరివిధములుగా తోచుచున్నది. 'ఆకాశవృక్షం' అనే ప్రతీతి నీవు విన్నావుకదా! ఆకాశంలో వృక్షం ఎలా ఉంటుంది! ఈ జగదనుభవం కూడా అట్టిదే. వాస్తవానికి ఇదంతా శుద్ధ చిన్మాత్ర స్వరూపమే.

నౌకలో ఉన్న బాలునికి ఒడ్డున ఉన్న వృక్షాలు కదులుతున్నట్లు అనిపిస్తాయి. అవి నిజంగా వర్తులాకారంగా కదులుచున్నాయా?

కదులుచున్న యంత్రం (Giant Wheel)పై కూర్చున్నవానికి ఎదురుగా ఉన్నకొండ గిఱ్ఱున తిరుగుచున్నట్లు అనిపిస్తుంది. క్రింద నిలబడ్డవానికో... ఆ కొండ స్థిరంగానే కనబడుతోంది కదా!

అజ్ఞానికి ఈ చిత్తము వాస్తవమైనదానివలె అనిపిస్తోంది. ఈ బాహ్యాభ్యంతర పదార్థములన్నీ చిత్తము నుండే అసద్రూపంగా ఆవిర్భవిస్తున్నాయి. అందుచేత తత్వవేత్త వాటిని అతిసహజంగా మొదలంట త్యజించి ఉంటాడు. సంశయరహితుడై సంతాపవర్జితుడై తనకు రావలసినది, పోవలసినది ఏదీ లేనివాడై ఉంటాడు. ఈషణారహితుడై స్వానుభవముచే తన పారమార్థిక స్వరూపమునందు శుద్ధ చైతన్య చక్రవర్తి అయి విరాజిల్లుతూ ఉంటాడు.

ఈ ఎదురుగా కనులకు కనబడే దృశ్యమును అభావించినప్పుడు నేత్రముల కార్యక్రమం అజ్ఞానరహితమై, అప్పుడు తృష్ణాచాపల్యం కూడా నశించగలదు. మోహపంజరం విచ్ఛిన్నం కాగా, నిరహంకారం రూపుదిద్దుకొని దృశ్యాసక్తి తొలగుతుంది. అప్పుడిక కర్మలెవరికి? ఆ కర్మల ఫలితములు ఎవరికి సంబంధించినవి? సంచిత-ప్రారబ్ధ-ఆగామి కర్మల స్వభావంతోసహా చిత్తము ఉపశమించ గలదు. అజ్ఞాన నిద్ర పటాపంచలౌతుంది. అప్పుడీ జీవుడు ప్రబుద్ధుడు కాగలడు.

ఈ జగత్తంతా కూడా 'శాంతము, ఏకము' అగు బ్రహ్మమే. ఇక్కడ అనేకత్వముగాని, ఆత్మ కంటే భిన్నమైనదిగాని సంభవించజాలదు. ఇక తత్త్వవేత్తకు అంతఃకరణంలో విచారించటానికి ఏముంటుంది? ఆతనికి ఎక్కడ చూచినా ఆత్మయే అనుభవవిశేషమగుచున్నది. ఆతనికి అసత్ విషయమైన దేనితోనూ పనే ఉండదు. ఈ జీవదశలన్నీ ఆతనికి అసంగతమే అవుతాయి.

"ఆద్యంతరహితమగు పరమపదమును నేను" అను అనుభవముతో సౌమ్యుడై, సూక్ష్ముడై సర్వవ్యాపకుడై ఆత్మనే ఆస్వాదిస్తూ ఉంటాడు. చిత్తము ఉన్నా లేకున్నా చిత్తముచే తారసపడే సర్వ విషయములకు అతీతుడై, విరక్తుడై ఉంటాడు. ఆతనియందు ఆత్మ యొక్క సర్వసమౌన్నత్యము సర్వదా ఉదయించియే ఉంటుంది. పరిచ్ఛిన్నత్వమును గడచిన కలవలె త్యజించి అపరిచ్ఛిన్నుడై ఉంటాడు. అవిచారణా సమయంలో అడ్డుగోడవలె ఏర్పడియున్న ఇతఃపూర్వపు అహంకారం ఇప్పుడు ఏమైపోయిందో కూడా ఆతనికి తెలియదు. దీపం వెలిగించగానే చీకటి, ఆ చీకటిలో స్ఫురించే క్రీనీడాకారాలూ ఎటు పోతాయో ఎవరు చెప్పగలరు?

చిత్తము నశించిన తరువాత ఇక 'విచారణ చేస్తున్నవాడు ఉన్నవాడా? ఉండనివాడా?' అను మీమాంస అంతా అనవసరమగుచున్నది. అట్టి వికల్పము ఆశ్రయించవలసిన ఆగత్యం ఆతనికుండదు. అట్టి తర్జన భర్జనతో మనస్సును పునరుజ్జీవింపజేయవలసిన ఆవశ్యకత ఆతనికేముంటుంది? అందుచేత అంతఃకరణమునుండి సంకల్పములన్నీ పారద్రోలి, 'ఓం' కారమునకు లక్ష్యమైయున్న తురీయావస్థయందు సంస్థితుడై ఉంటున్నాడు.

❖

వింటున్నావా, రామా! జ్ఞాని ఇట్టి విచారణచే ఉత్తమౌన్నత్యమును అవధరిస్తున్నాడు.

అశ్నన్గచ్ఛన్స్వపం స్తిష్ఠన్నితి రాఘవ చేతసా ।

సర్వత్ర ప్రజ్ఞయా తజ్ఞః ప్రత్యహం ప్రవిచారయేత్ ॥ (శ్లో 17, సర్గ 81)

కాబట్టి నీవు నడుచుచున్నప్పుడు, కదులుచున్నప్పుడు, తినుచున్నప్పుడు, త్రాగుచున్నప్పుడు, నిద్రిస్తున్నప్పుడు 'ఆత్మ ప్రజ్ఞ'తో కూడి ఉండుము. స్వచిత్తముతో ప్రతిరోజూ ఆత్మ విచారణ కావిస్తూ ఉండు. సాధు చిత్తులగు ఎందరో మహనీయులు ఒక వైపు తమతమ వర్ణాశ్రమ ధర్మములను నిర్వర్తిస్తూ... వేటి చేతా స్పృశించబడక, తమ ఆత్మప్రజ్ఞను కాపాడుకుంటూనే వర్తిస్తున్నారు.

మాన మదరహితులై శరత్కాలంలోని పూర్ణచంద్రునిలాగా ప్రసన్నతతో వెలుగొందుచున్నారు. ప్రవాహపతితములైనట్టి తమకు నియమించిన కార్యముల మధ్య నీటిలోని తామరాకు వలె వ్యవహరిస్తున్నారు. మహా ధీమంతులై, మహా వివేకులై ఈ ప్రపంచమున వెలయుచున్నారు. వారే నీకు సోదాహరణులగు గాక!

❖

'వివేకదృష్టి' అను పేరుగల ఈ విభాగంలోని విశేషమంతా ఒకప్పుడు వింధ్య పర్వతంపై బృహస్పతి సోదరుడగు సంవర్తుడు చేసియున్న సంవాదముయొక్క సారాంశమై ఉన్నది. ఆతనిలాగానే విచారణతో కూడిన బుద్ధితో ఆత్మదృష్టిని అవలంబించు. ఆతనిలాగానే ఉత్తరోత్తర భూమికాక్రమంచేత ఈ సంసార సాగరమును అవశ్యం దాటగలుగుతావు.

❖❖❖

XI. వీతహవ్యుడు - అంతర్మథన యోగము

1. సంబోధన

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ సంసారమును యుక్తియుక్తంగా అధిగమించివేసిన మహనీయులెందరో ఈ భూమిపై ఉన్నారు. 'వీతహవ్యుడు' అనే ఒక ముని తీవ్రమైన విశ్లేషణ విచారణల ద్వారా ఆత్మ పదమునందు దృఢమైన ఆరూఢత సంపాదించారు. ఆయనకూడా ఇంద్రియ ప్రబోధ రూపంగా ఉత్తమ సమాలోచన నాశ్రయించి ఆత్మోన్నతి పొందియున్నారు. నీ యొక్క ఉత్తమ దృష్టి సముపార్జన కొరకై ఆయన సంబోధన, సమాలోచన వివరిస్తాను. అధ్యాత్మ వాఙ్మయంలో ఇది మహత్తరమైనదిగా శ్లాఘించబడుతూ ఉంటుంది.

❖

వీతహవ్యుడు ఒకప్పుడు అనేకమంది మునులుండే ఒక ప్రదేశంలో ఒక ఆశ్రమం నిర్మించుకొని ఎంతో సాధన చేశాడు. అట్లా కొంతకాలమైన తరువాత సమాధిని సముపార్జించాలని అక్కడినుండి బయలుదేరాడు. చాలాకాలం సరైన ఏకాంత ప్రశాంత ప్రదేశం కొరకై అడవులలోనూ, కొండలలోనూ సంచరించాడు. ఎంతగానో వెతకి వెతకి సొలసి, విరక్తుడయ్యాడు. కాలక్రమంగా అతనిలో వివేకముతో కూడిన పరిజ్ఞానం రూపుదిద్దుకొన్నది.

అరెరే! శారీరక, మానసిక వ్యధాపూర్వకమైన ఈ సంసారము ఎంత భ్రమదాయకమైనది! ఇందులోని ఆయా క్రియా కార్యక్రమాలన్నీ చివరకు 'భయం' అనే ఒడ్డుకు చేరుస్తున్నాయే!"

అని తలచి చకితుడైనాడు. "ఇక నేను అసారమగు ఈ సంచార వ్యాసంగం త్యజిస్తాను. ఏదో ఒకచోట ఆసీనుణ్ణై స్వకీయమైన విచారణ ప్రారంభిస్తాను" అని తలచాడు ఆ మునీంద్రుడు. తిరిగి పూర్వ ప్రాంతంలో గల తన పర్ణశాల జేరాడు. కాస్త సేద తీర్చుకున్న తరువాత ఆ పర్ణశాలలోనే ఒకచోట శుద్ధమగు మృగ చర్మమును పరచాడు. పద్మాసనం వేసుకున్నాడు. పాదములపై వ్రేళ్ళుంచి స్థిరాసనం స్వీకరించాడు. ఇంద్రియములలోకి మరల మరల ప్రవేశిస్తున్న మనస్సును మెల్లమెల్లగా వెనుకకు మరలుస్తూ ఉపాయములచే నిరోధించి, క్రమంగా మనస్సును ఇట్లు సంబోధించారు.

❖

ఓ మనస్సా! నీవు ఎంత చంచలమైనదానివి! ఎంత నిగ్రహించినా కూడా... మహత్తరంగాలచే కొట్టుకుపోబడుచున్న ఆకులాగా క్షణంలో అస్థిరత్వం పొందుచున్నావే!

ఈ నా నేత్రములు మొదలైన ఇంద్రియములు బహు భ్రమణయుక్తమై ఎన్నెన్నో విషయాలవైపు మరలుచున్నాయే? వాటివెంట ఈ మనస్సు, బుద్ధి కూడా 'తగుదునమ్మా' అని బయలుదేరుతున్నాయి. కాలితో తన్నబడుచున్న బంతిలాగా ఉరుకులు పరుగులు పెడుతున్నాయి. ఈ మనస్సు ఇంద్రియముల

నుండి బలం పుంజుకుంటోంది. ఇంద్రియములో?... మనస్సు నుండి బలం పుంజుకుంటున్నాయి. మనస్సు కొన్ని వృత్తులను ఆశ్రయిస్తోంది. ఇంతలోనే ఆ వృత్తులను త్యజించి, మరల నూతన వృత్తులలో ప్రవేశిస్తోంది. నేను దేనిని నిగ్రహించాలని అనుకుంటానో, దాని వైపుకే పరుగులు తీస్తోంది. చెట్ల కొమ్మలపై గంతులు వేసే కోతిలాగా అనేక పదార్థముల పరంపరను ఆశ్రయిస్తోంది. ఈ మనస్సును నియమించాలంటే ముందుగా దీనిని ఇంద్రియములనుండి వెనుకకు మరల్చాలి. ఎట్లా?

ఓ ఇంద్రియములారా! సముద్ర తరంగములవలె అతి చంచలముగా ప్రవర్తిస్తున్నారు కదా! ఆత్మ దర్శనము చేయటానికి మీకు ఇంకా సమయం కుదురుట లేదా? ఆశలతో, అల్ప ఆశయాలతో ఇంకా ఎంతకాలం సంచరిస్తారు? అనర్థదాయకమైన మీ చపలత్వం కొంచెంసేపు ఆపండి! ఒక్కసారి నేను చెప్పేది వినండి! మీరు చేస్తున్న కర్మలను, వాటి పర్యవసానమును కొద్దిసేపు పరిశీలించండి. మీరంతా మనస్సుకు ద్వారములు వంటి వారే కదా! కనుక, మీరు జడరూపము మాత్రమే. జడ స్వరూపులై, జడమాత్రమగు దృశ్యమును ఆశ్రయిస్తున్నారు. జలతరంగాలలో జలం పోస్తున్నట్లు మీరు నాచే దృశ్యముపై ప్రసరింపజేయబడుచున్నారు. మృగతృష్ణలో జలం కోసం వెతికే మృగాల వలె, మీరు దృశ్యము వైపు విజృంభిస్తున్నారు. జ్ఞానరహితులై, దుర్వినయులై కుమార్గము లందు ప్రవృత్తులవుచున్నారు. గుడ్డివాడు ముళ్ళపొదలవైపు వెళ్ళుచున్నట్లు, మీరు నన్ను పతనము వైపుకు నడిపించుచున్నారు.

ఏమి మీ చమత్కారం! చిదాత్మస్వరూపుడనగు నేను సాక్షీమాత్రుడనై సమస్తమును నెఱవేర్చుచున్నాను కదా! మధ్యలో మీరెందుకు వ్యర్థంగా భ్రమింపజేస్తున్నారు?

రజ్జు, సర్పభ్రాంతిలాగా (త్రాడును చూచి పాము అనుకొనునట్లుగా) అసద్రూపములగు ఈ ఇంద్రియములు విజృంభిస్తున్నాయి. "ఇవి నా నేత్రములు" అని ఎఱుగుచున్నది ఎవరు? నేను కదా! సర్వప్రకాశకుడు, సర్వసాక్షియగు ఆత్మయే నేను. నాచే ఎఱుగబడుచున్నదానితో నాకేమి సంబంధం? ...కనుక, మీరున్నప్పుడు, లేనప్పుడు నేనున్నాను. మీరు ఏర్పడనప్పుడు, నిర్వికారుడనై, నిర్విషయుడనై, పరమాత్మస్వరూపుడనై, నేనుండియున్నాను. మీరు ఏర్పడినంతమాత్రంచేత, లేక, శిథిలమైనంతమాత్రంచేత నాయొక్క 'ఉనికి' కుంటుబడుతుందా? అసాధ్యం!

సూర్యుడు ఆకాశంలో నిజేచ్ఛచే ఉదయించి ప్రకాశిస్తూ ఉంటే, జనులు తమతమ దైనందిన కార్యక్రమములు నిర్వర్తించుకుంటుంటారు. ఆ కార్యక్రమములతో సూర్యునకు ఏమి సంబంధం ఉంటుంది? అట్లాగే, నా చైతన్య సత్తయొక్క ఉదయముచే మీరు, మీమీ చేష్టలు నిర్వర్తిస్తున్నారు. మీ చేష్టలతో నాకేమి సంబంధం? వాటి పట్ల ఇష్టముగాని, అయిష్టముగాని ఎట్లా ఏర్పడగలవు? చైతన్య స్వరూపుడనైన నేను మీ చర్యలకు దుఃఖించటమేమిటి? సుఖించటమేమిటి?

ఓ చిత్తమా! నీవు ఇంద్రియములను మోసగించి దుఃఖభాజకములగు విషయములలో ప్రవేశింపజేస్తున్నావు. అయితే చమత్కారం చూచావా? ఆ ఇంద్రియ విషయములచే నిజానికి నీవే మోసగించబడుచున్నావు సుమా! 'దేహాభిమానము' అనే జాడ్యమును నీయందు కలిగియుండి....

తత్ప్రభావంచేత ఈ జగత్తులో ఇక్కడా, అక్కడా సంచరిస్తూ, అనర్థములన్నీ మూటగట్టుకుంటున్నావు. కుక్కలాగా నీచపదార్థముల వైపు మూతి సారిస్తున్నావు. భిక్షకుడులాగా క్షణక్షణం ఏదో ఒకటి అర్థిస్తూనే ఉన్నావు.

"నేను చేతనుడను... నేను జీవించువాడను... నేను ప్రత్యేకమైన వాడను... అను రూపంలో ఉంటున్న నీయందలి వాసన అత్యంత అసత్యమైనది. అట్టి భావన మిథ్యారూపమున ఉదయించి, దుఃఖమును కలుగ జేస్తోంది. స్వతఃసిద్ధమైన ఉనికి నీకు లేదు. ఇక చపలత్వమెందుకు? నీవు నా స్వరూపము కాదు. ఎందుకంటే, నా స్వరూపము సంవిత్తుకు అన్యమై ఏదీ ఎక్కడా ఉండదు. కనుక 'చిత్తము' అను పేరుతో చెప్పబడే నీవు దేనికైనా కర్తవా? భోక్తవా? లేక, కర్తృత్వ, భోక్తృత్వముల మధ్య ఉండే ఆశయే నీ స్వరూపమా? మొట్టమొదట తియ్యగా కనిపించి చివరకు చేదును చవి చూపటమేమిటి? దుఃఖాలు ఉండటమేమిటి? యథార్థానికి నీకు స్వరూపమే లేదు. మరి నీకు బంధుమిత్రులు ఎక్కడి నుండి వస్తారు? స్ఫటికానికి ఎదురుగా ఏ రంగు కాగితం ఉంటే ఆస్ఫటికంలో ఆ రంగు ప్రవేశిస్తున్నట్లు... నీవు శుద్ధస్వస్వరూపానికి గుణములను ఆపాదించి చూపుచున్నావు. పోనీ, ఆత్మ నిన్ను కల్పన చేసుకున్నదా? ఆత్మకు కర్తృత్వ – భోక్తృత్వ – అన్యత్వములు ఏ క్షణంలోనూ ఉండవు కదా! నీవు ఆత్మవే అయి ఉంటే నీయందు వికల్పములు ఉండకూడదే? ఆత్మ తనకు తానే పూర్ణమై ఉండగా, ఈ 'భావాభావములు, సుఖ దుఃఖములు' సంభవించటమెలా సాధ్యం? కనుక నీయందు కనిపించే కర్తృత్వ, భోక్తృత్వములు మిథ్యాభ్రమ మాత్రమే!

ఇప్పుడు ఒక యుక్తి నాకు తెలియవస్తోంది. ఆకాశంలో సూర్యబింబం ఉంటేనే క్రింద నీళ్ళలో సూర్యప్రతిబింబం లభ్యమౌతోంది. కనుక చైతన్యబింబం ఉన్నప్పుడే 'మనస్సు' అనే ప్రతిబింబం ఏర్పడగలుగుతోంది. శిలాప్రతిమ స్వయంగా నాట్యం చేయజాలనట్లు, కత్తిస్వయంగా కూరగాయలను కోయజాలనట్లు... మనస్సు స్వయంగా ఏదీ చేయజాలదు. బింబం కదలకపోయినా, తరంగ విన్యాసముచే ప్రతిబింబం కదలగలదు కదా! కనుక ఓ మనో ప్రతిబింబమా! నీవు నీ బింబమగు ఆత్మను ఆశ్రయించు. అప్పుడు "బింబస్వరూపుడనగు నాకు రాక, పోకలు, చావు, బ్రతుకులు ఉండజాలవు" అని సుగ్రాహ్యం కాగలదు.

ఒక మనుజునిచే ఒక వస్తువు నరకబడిందనుకో... ఇప్పుడా వస్తువును నరికిందెవ్వరు? మనుజుడు నరికాడా? కత్తి నరికిందా? మనుజుని ఇచ్ఛ చేతనే కదా, కత్తి నరికింది! పాత్ర నుండి పాలు గొంతులో ప్రవేశించినాకూడా... త్రాగుచున్నది ఆ వ్యక్తియేగాని... కర్తృత్వం పాలకు, పాత్రకు ఆపాదించం కదా! చిత్తము కూడా ఆత్మయొక్క ఒక ఉపకరణంవంటిదే! చిత్తముచే చేయబడేది ఆత్మకు ఆపాదించవలసిందేగాని... చిత్తమునకు కర్తృత్వం ఆపాదించటం కుదరదు.

కనుక ఓ చిత్తమా! సర్వజ్ఞుడగు పరమాత్మచే నీవు ప్రబోధితుడవై ఆయా యోచనలు నిర్వర్తిస్తున్నావు. యోచనలు ఆత్మవే గాని ...నీవి కావు. ఆత్మయే తన కర్తృత్వ, భోక్తృత్వ, కరణ ఉపకరణాదులచే ఈ జగత్తునంతా సంచయం చేసివేస్తోంది. ఆత్మయగు పరమేశ్వరుడే సర్వమునూ

ప్రబోధితం చేస్తున్నాడు. మూఢులైనవారు మాత్రమే మనస్సు – చిత్తములకు కర్తృత్వం ఆపాదిస్తున్నారు. ఆత్మసత్తచే జగత్తు యొక్క సత్త ఏర్పడి ఉంటోంది. "మనస్సు అనబడేది ఏదీ లేదు" అని తీక్ష్ణమైన జ్ఞానమున్న చోట ప్రస్ఫుటమౌతోంది.

నేను ఆత్మను. భ్రమమాత్రమగు చిత్తమునకే జన్మ, జరా, మరణాది కర్మలు గాని... వాస్తవ రూపుడునగు నాకు అవన్నీ ఉండవు. అందుచేత ఈ చిత్తము యొక్క జాడ్యములగు జన్మ, జరా, మరణాది భావానుభవములు నేను పొందకుండెదనుగాక! ఇంద్రజాలంలో వస్తువుల భ్రమలాగా భ్రమించబడుచున్న తరుణంలో చిత్తమనేది ఏర్పడుతోంది.

విజ్ఞానమాత్రమగు బ్రహ్మముయొక్క సమక్షమున చేత ఈ జగత్తంతా వికాసము పొందుతోంది. ఈ వికాసము చిత్తముది కాదు. సముద్రంలో జలమే అనేక తరంగములగుచున్నట్లు బ్రహ్మము యొక్క చిత్ శక్తియే ఈ దేవ – మనుష్య – జంతు ఆదిగాగల జగద్రూపంగా విజృంభిస్తోంది.

ఓ చిత్తమా! నీవే గనుక చిన్మయుడవైతే నీవు మరొక దానికొరకై దేబరించేదానవు కాదు. భూత –భవిష్యత్తులందు ఏకమై, అనేకమై, సర్వ వ్యాపకమై, సర్వదా ఏర్పడి ఉండే ఆత్మని ఎందుకు దర్శించలేకపోతున్నావు? 'నీవు, నేను' –అను అభాస అంతా స్ఫురిస్తున్నది ఆత్మయందే. ఇక దుఃఖం ఎవరికి? నీడకు ఆకారం కనబడుచున్నా కూడా, దానికి స్వయంభూతమైన ఉనికి లేనట్లు. ఆత్మకు అన్యమైనట్టి దేనికీ ఉనికి లేదు.

కనుక చిత్తము కేవలం జడము, అసద్రూపము, కల్పితము, అభ్యాసవశము మాత్రమే.

❖

సర్వమూ ఆత్మయే అయి ఉండగా... "ఈ బాల శరీరం నాది... ఈ వృద్ధ శరీరం నాది... ఈ పుత్ర, కళత్ర, పౌత్రులు, ఈ గృహ, ఆరామాలు నావి" అనుకుంటూ నేను చిత్తమును పెంపొందించుకున్నాను. ఆహా! అదంతా వ్యర్థమైన చింతనగాక మరేమిటి? ఈ దేహమే లేని వస్తువై క్రీడలో ఉపయోగించే క్రీడోపకరణము వంటిదై ఉండగా... అట్టి దేహముతో ఏర్పడే సంబంధాలు వాస్తవమైనవి ఎట్లా అవుతాయి?

ఆత్మకు దేహమే లేదు. కుందేటి కొమ్ముచే ఎవ్వరైనా పొడవబడతారా? ఛాయ వెళ్ళి ఒక గోడను కూల్చగలదా? ఈ దేహము తత్సంబంధములచే ఆత్మ నిరోధింపబడజాలదు. దుఃఖింపబడజాలదు.

చేతనము, జడము (ఆత్మ – దృశ్యము)ల మధ్య 'చిత్తము' అనబడే మూడవ వస్తువు ఏర్పడుటకే వీలులేదు. ఆత్మ యొక్క దృశ్యమునకు సంబంధించిన అభ్యాసవ్యసనమే చిత్తము.

కనుక ఇప్పుడు మార్గమేమిటి?... నేను సత్యవస్తుజ్ఞానమును ఆశ్రయించాలి. అప్పుడు చిత్త, జడ దృశ్య దృష్టులన్నీ ఉపశమిస్తాయి. అట్టి ఉపశమన స్థితి యొక్క "సాక్షాత్కార వృత్తి" నాకు అలవడు గాక!

అప్పుడిక చిన్మాత్రరూపమే స్వానుభవముగా శేషించగలదు.

"అట్టి స్వానుభవము యొక్క ఒకానొక చమత్కారమే ఈ చిత్తము" – అని అప్పుడు అనుభవం అవక ఏం చేస్తుంది?

❖

ఇట్లు తలచుచు వీతహవ్యముని అంతరంగములో మౌనము, నిశ్చలత్వములను వహించియున్నారు.

❖❖❖

2. స్వాత్మ - చిత్తముల సంవాదము

శ్రీవసిష్ఠ మహర్షి : వింటున్నావా రామా! ఆ విధంగా అంతరంగ మౌనం వహించి వీతహవ్యముని కొన్ని గంటలు గడిపారు. ఇతఃపూర్వపు దృశ్యాభ్యాసము యొక్క సంస్కార ప్రభావం చేత కాబోలు... ఆతని యందు కించిత్ ద్వితీయ వాదం పొడచూపింది. ఆ ద్వితీయమైనదే చిత్తము కదా! అప్పుడు ఆతని అంతరంగంలో కొంత వాదోపములు పొడచూపాయి. అట్టి క్రమమేమిటో వివరిస్తాను. విను–

వీతహవ్యుని చిత్తము: మిత్రమా! వీతహవ్యా! "చిత్తము చేతనే ఆత్మను దర్శించగలం" అని శ్రుతులు చెప్పటం విన్నావు కదా!

వీతహవ్యుడు : అవును... విన్నాను.

చిత్తము : "అన్ని ఉపకరణములలో కెల్లా చిత్తమే (మనస్సే) గొప్పది" ...అని కూడా శాస్త్రములచే చెప్పబడింది కదా!

వీతహవ్యుడు : అవును. అట్లా కూడా చెప్పబడింది.

చిత్తము : మరి నీవు ... "చిత్తమనునదే లేదు" ...అని నా ఉనికినే ఖండిస్తున్నావే?

వీతహవ్యుడు : ఓ... అదా నీ వాదన! ఒకడు తన ముఖమును చూచుకోవటానికి అద్దం ఉపయోగిస్తాడు చూచావా! అంతమాత్రం చేత దర్పణం చైతన్య జీవ సమన్వితమా?

ఆత్మ స్వరూపుడనగు నేను నా స్వరూపమును ఏమరచి అజ్ఞానదశను ఆశ్రయించుకొని ఉన్నప్పుడు... నా స్వరూపమును నాకు గుర్తుచేయటానికి శాస్త్రములచే, శ్రుతులచే, గురువులచే 'చిత్తము' అనబడే నీవు కల్పించబడుచున్నావు. నీకొక ప్రత్యేకమైన ... ఆత్మకు వేరైన... ఉనికి ఉన్నదని వారి ఉద్దేశం కాదమ్మా!

తత్త్వమసి (నీవు అదియే అయి ఉన్నావు...) అనే వాక్యార్థ సిద్ధికొరకు శిష్యుడిని తయారు చేయటానికి "ఇది దృశ్యము, ఇది కల్పన, ఇది సంబంధము, ఇది చిత్తము"... మొదలైన మొట్టమొదటి పాఠములలో నీకు చోటు కల్పిస్తున్నారు. అంతమాత్రం చేత నీయొక్క ఆత్మకు అన్యమైన ఉనికి అంగీకరిస్తున్నట్లు కాదు. ఆత్మసాక్షాత్కారమైన తరువాత, ఇక నీకు పాత్రగాని, ఉనికిగాని ఉండదు.

మధ్యే మార్గ పాథ్యవిశేషంగా మాత్రమే కనబడి, విషయం రూఢి అవగానే నీవు ఆ జ్ఞానంలో లయం అవుతావు.

ఓ చిత్తమా! పంచేంద్రియాలు ఉపయోగిస్తున్న జీవుడు ఏ సమాచారంతో వాటిని ఉపయోగిస్తున్నాడో... ఆ సమాచారమే నీ స్వరూపం. సర్వసమాచారములకు ముందున్న ఆత్మస్వరూపం గ్రహించబడుచుండగా... ఇక నీకు చోటు కనబడదు. అనగా చైతన్యప్రకాశము యొక్క ఒకానొక దృక్పథమే నీ స్వరూపం కదా! చైతన్య ప్రకాశమును ఎరిగిన తరువాత ఇక నీకేం పాత్ర ఉంటుంది? నీవు దేనిచే... దేని వలన ఏర్పడుచున్నావో... అది ఎరిగిన తరువాత ఇక నీ గురించి తర్జన భర్జనలు ఎవరికి కావాలి?

కాబట్టి నేస్తం! ఓ చిత్తమా! నీవు దేనికీ కర్తకాదు. అందుచేత దేనికీ దుఃఖ భాజుడవు కావద్దు. "ఈతడు నా వాడు... ఇవి నావి" అని క్లేశములు ఆశ్రయించవద్దు. జడమగు నీవు జడములగువాటిని ఆశ్రయిస్తే జడంగానే ఉండిపోతావు. అట్లాకాకుండా, నీ ఉత్పత్తి స్థానమైన చైతన్యమును ఆశ్రయిస్తే చైతన్యముగా రూపుదిద్దుకోగలవు. నీ నియామకుడగు ఈశ్వరునికి ఈ జగత్తునందు చేయబడిన – చేయబడబోవుచున్న – చేయబడియుండిన దేనితోనూ ఏమీ సంబంధం ఉండదు. నీవు కూడా అట్టి అసంబంధమును ఆశ్రయించు.

చిత్తము : నేను భావాభావ స్వరూపుడనే. ఒప్పుకుంటాను. అయితే నన్ను ఉపయోగించి ఉత్తమజీవులు ఆత్మజ్ఞానం సంపాదిస్తున్నారు కనుక. "నేను ఆత్మకు ఉపకారినే" అని ఎందుకు అనుకోరాదు?

వీతహవ్యుడు : నీవు ఆత్మకు ఉపకారం చేసేంతవాడివా? కార్య – కారణ సంఘాతమునందు ఏర్పడే అభిమానముచే నీవు అప్పుడప్పుడు "నేను ఆత్మకు ఉపకారం చేస్తున్నాను" ...అనే భ్రాంతిని పొందుచున్నావు. పంచప్రాణములు, మనోబుద్ధులు, దశేంద్రియములు... అన్నీ జడాలే కదా! ఇక ఇంద్రియాలచే ఏర్పడే భోగ, యోగములచే ఆత్మకు ఒరిగే నూతన ప్రయోజనమేమున్నది?

చిత్తము : అదేమిటి? ఈశ్వరునకు భోగానుభవం పొందించుట యందు నేను వర్తించుచున్నానని ఎందుకనుకోకూడదు?

వీతహవ్యుడు : అట్లాగా? ఈశ్వరుడు నిత్యతృప్తుడు కదా! ఆయన భోగానుభవం కొరకు నీవు బయలుదేరటమేమిటి?

స్వాభావిక ప్రకాశయుక్తుడు, సర్వవ్యాపి, ఏకరూపుడు అగు చిదాత్మయే ఈ జగత్తంతా సర్వరూపములుగా వ్యాపించి ఉన్నాడు. వానికి అన్యముగా ఏ కల్పనా ఉండదు. ఏకమూ, అనేకమూ కూడా ప్రకాశింపజేయుచున్నట్టి ఆత్మ తన యందు ఈ జగత్తును క్రీడావినోదంగా రచించుకొనుచున్నది. సమస్తము దానియందు సిద్ధించుచుండగా... ఇక దానికి అలభ్యమైనదేమి ఉంటుంది? ఆతడు ఒక దానిని ఇచ్ఛగించటమేమిటి? ఆ ఇచ్ఛను నీవు నెరవేర్చటమేమిటి?

పట్టపురాణి రాజమార్గంలో రథం ఎక్కిపోతుంటే ఒక మూర్ఖయువకునకు మన్మథవికారం జనించినట్లు... సర్వమూ ఈశ్వరస్వరూపమైన ఈ ప్రపంచమును చూస్తున్నప్పుడు నీకు ఇచ్ఛ, క్షోభ జనిస్తున్నాయి.

చిత్తము : సరేనయ్యా! నీ మాటలు ఒప్పుకుంటున్నాను. అయితే ఆత్మతో సంబంధం కలిగి నేను ఇట్లాగే ఉంటాను. నన్ను తిరస్కరించటం దేనికి?

వీతహవ్యుడు : అది కూడా సరికాదు...కుదరదు. ఎక్కడైనా ఫలం ప్రాప్తించేటప్పుడు పుష్పం మిగిలి ఉంటుందా? పుష్పము, ఆ పుష్పము యొక్క ఫలం ప్రక్కప్రక్కన ఉండటం ఎలా సాధ్యం? నీవు ఆత్మకు ప్రక్కన ఉండటమనేది అయోగ్యమైనదే.

"ఒక రెండిటి యొక్క సంబంధం".... అంటే ఏమిటి?

1. ఒకదాని యొక్క క్రియతో రెండవదాని క్రియ కలవటం. లేక,
2. ఒకదాని నుండి రెండవది ఆవిర్భావం పొందటం. లేక,
3. రెండిటి యొక్క ఏకత్వం. లేక,
4. సంబంధం ఏర్పడక ముందు ఆ రెండూ వేరు వేరుగా ఉండి. ఇప్పుడు ఏకమగుటకు సంసిద్ధపడుతూ ఉండాలి.

ఈ నాలుగు ప్రక్రియలూ చిత్తమునకు – ఆత్మకు కుదిరేవి కావు.

చిత్తము : కార్యవ్యవహారం దృష్ట్యా నాకు ఆత్మకు సంబంధం కనబడుతోంది కదా?

వీతహవ్యుడు : ఎట్లా కుదురుతుంది? ఆత్మ సర్వదా స్వయంప్రతిపత్తి కలిగినట్టి నిష్క్రియచైతన్యము.

నీవేమో స్వయంప్రతిపత్తి లేని జడమువు. మరొకదానిచే నియమించబడితేగానీ, నీవు దేనినీ నిర్వర్తించలేవు.

ఆత్మ నిర్వికారము... స్వయంభువము... ఆనందస్వరూపమూ...!

నీవేమో సుఖదుఃఖ భరితమూ... క్రియోన్ముఖము... ఉపకరణమాత్రము...!

మీ ఇద్దరికీ ఏకాకారత్వం ఎట్లా పొసగటం?

చిత్తము : పోనీ... పాలు నీరు వేరు వేరైనవై కూడా కలుస్తున్నట్లు, నేను ఆత్మ వేరు వేరై ఉండి కలుస్తున్నామని అనుకోవచ్చు కదా?

వీతహవ్యుడు : నీకు–ఆత్మకు, పాలు–నీరు వలె అర్థసంబంధం కుదరదు. మీ ఇద్దరివీ విరుద్ధ సంబంధములనీ ఇంతకు ముందే అనుకున్నాం కదా!

చిత్తము : లేకపోతే... అగ్ని – జలముల వలె మా ఇద్దరివీ విరుద్ధ సంబంధమని అనుకుందామా?

వీతహవ్యుడు : అగ్ని – జలముల వలె ఒకదానిచే మరొకటి నశింపజేయబడటం నీకు, ఆత్మకు ఏర్పడటం లేదు. కనుక ఆ ఉపమానం కూడా కుదరదు.

ఓ చిత్తమా! నీవు సంవిత్తు (ఆత్మ) యొక్క ఛాయవే కదా! ఈ ప్రపంచంలో ఆయా పదార్థాలు ఒకే గుణములు కలిగియున్నప్పుడు కలిసి ఉంటాయి. విరుద్ధగుణములు కలిగినప్పుడు విడిపోతాయి. నీవు ఆత్మనే ఆశ్రయించు. ఆత్మనుండి చ్యుతి పొందనప్పుడు నీవు కూడా ఆత్మవే అవుతావు.

చిత్తము : నాకు దృశ్యపదార్థముల ఉనికి కనిపిస్తోంది కదా!

వీతహవ్యుడు : అంతర్దృష్టి జ్ఞానంచే దృశ్య పదార్థమంతా లేనిదే అగుచున్నది. దృశ్యం రహితమైతే దుఃఖరహితమగు ఆత్మయే శేషిస్తోంది. అట్టి ఆత్మచే సంతుష్టిపొందు. నిరంతర ధ్యానముచే సమాధి నిష్టుడవై.. ఆత్మదర్శివై ఉండు.

చిత్తము : నేను కూడా సుఖము కొరకే దృశ్యమునందు వెతకుచున్నాను.

వీతహవ్యుడు : ... కదా? నీవు కనుక జడమాత్రములగు దేహ-ఇంద్రియ-దృశ్యము లందు 'సంకల్పము' అను రజోగుణమును ఆశ్రయించుటచే 'చ్యుతి' పొందటం ప్రారంభించావా... ఇక అది నీకు, నాకూ కూడా దుఃఖప్రదమే కాగలదు. మిత్రమా! చిత్తమా! ఈ విషయం మనం మరువకూడదు.

చిత్తము : కర్తృత్వమంతా ఆత్మదేనని అంటున్నావుకదా! ఇక నాకు బోధించటమెందుకు? నీవు చెప్పదలచుకొన్నది ఆత్మతోనే విన్నవించుకో!...

వీతహవ్యుడు : సంకల్ప - వికల్పములకు చోటు ఉండనట్టి, "కల్పన" అనే ధూళి ఏర్పడజాలనట్టి ఆత్మయందు కర్తృత్వం సంభవిస్తుందా? "ఆకాశమునకు కాళ్ళు - చేతులు ఉంటాయి" అని ఎవ్వరైనా అంటే, దానికి అర్థమేమన్నా ఉన్నదా? అట్లాగే ఆత్మకు కర్తృత్వం సంభవించదు. అయితే... ఆత్మయే తనయందు ఏకరూపముగానూ, అనేక రూపముగానూ సంభవిస్తోంది.

చిత్తము : అదెట్లా సంభవం?

వీతహవ్యుడు : నీకొక చిన్న దృష్టాంతం చెపుతాను. నీరే బుడగలుగా, తరంగములుగా, నురుగుగా, ఆవర్తములుగా, సుడులుగా సంభవిస్తోంది. "బుడగ గుండ్రంగా ఉన్నది. కనుక, జలం గుండ్రంగా ఉంటుంది"... అని ఎవరైనా అంటే మనం ఒప్పుకుంటామా? ఆవర్తమునకో, లేక తరంగానికో లేక బుద్బుదమునకో ఆకారం ఉండవచ్చు. జలానికి ఆకారం ఉన్నదా? లేదు. కనుక... ఆత్మయే ఆత్మ యందు ఆభాస మాత్రంగా జగద్రూపమై వెలయుచున్నది. జలం మధ్యలో మండుచున్న బొగ్గు ఉండజాలదు. ఆత్మ యందు రెండవ కల్పనయే సాధ్యం కాదు.

చిత్తము : 'ఆత్మ యొక్క కల్పనయే చిత్తము' అని అనవచ్చునేమో?

వీతహవ్యుడు : ఆత్మదేవుడు కల్పనారహితుడు. ఇక మనస్సో.... జడమైనది.

చిత్తము : ఇక ఆత్మ - మనస్సుల మధ్యగా "ఇది వేరు... అది వేరు. ఇది శుభము, అది అశుభము"... అనే కల్పన ఎక్కడుంటుంది?

వీతహవ్యుడు : ఉండదు. "కల్పన చేసే మనస్సే లేదు" ...అని అనుకుంటున్నప్పుడు. ఇక కల్పన ఎక్కడుంటుంది?... కాబట్టి ఈ సమస్తమూ విషయవర్జితమై, నిత్యనిర్మలమైనట్టి చైతన్యమే అవుతుందిగాని... మరింకేమీ కాదు.

ఇక్కడ కల్పన లేదు.... బంధములేదు. ఆత్మ సంవిత్తు మాత్రమే సర్వదా అన్ని వైపులా వ్యాపించియున్నది.

చిత్తము : అయితే 'నేను వేరు – ఇది వేరు' అనే కల్పన ఎక్కడుంటుంది? ఎక్కడి నుండి వస్తోంది?

వీతహవ్యుడు : ఎక్కడా ఉండజాలదు. అనాదియై, రూపరహితమై, సర్వవ్యాపకమైనట్టి ఆత్మయందు 'నేను – నీవు' మొదలైనవి ఎవరు ఆరోపించగలరు? ఆకాశంలో ఎవ్వరైనా అక్షరాలు వ్రాయగలుగుతారా? కనుక, నేస్తం! చిత్తమా! నీవు ఆత్మదృష్టిని అలవరచుకో.

ఆత్మ నిత్యోదయమైనట్టిది. సర్వవస్తువుల సారభూతమైనది. అది దిక్కులన్నీ వ్యాపించి పరిపూర్ణ మొనర్చుచున్నది. అట్టి ఆత్మను ప్రత్యక్షముగా గ్రహించనంతకాలం మిథ్యారూపమగు మృగ తృష్ణాజలం లాగా 'చిత్తము – జగత్తు' మొదలైనవి అనుభవం కాగలవు.

ఆత్మను మనం గ్రహించినామా.... దుఃఖములన్ని ఉపశమించిపోతాయి. కనుక, ఓ చిత్తమా! నీవు సుఖ దుఃఖ భ్రాంతిని, మోక్షము పొందాలనే సంచలనమును వదలిపెట్టు.

మనస్సుచే బద్ధులం కావటం... చిత్తముచే నిరోధించబడటం... ఇవన్నీ భ్రాంతియేగానీ యథార్థంకాదు. సత్స్వరూపమగు ఆత్మ ఒక్కటే వాస్తవం.

❖

అంతా విని వీతహవ్యుని చిత్తం కొంత కుదుటపడింది. ప్రశాంతత పొందింది.

❖❖❖

3. వీతహవ్యుడు - ఇంద్రియముల సంవాదం

శ్రీవసిష్ఠ మహర్షి : ధీరుడు, ముని శ్రేష్ఠుడు అగు ఆ వీతహవ్యుడు తన చిత్తమునకు ఏకాంతంలో బోధించి ప్రశాంతపరచారు. అప్పుడు ఆతని ఇంద్రియములు కొంత సమయం తరువాత కొంత ప్రకోపించటం ప్రారంభించాయి. వాటిని కూడా ఇట్లు సంబోధించారు.

❖

వీతహవ్యుని ఇంద్రియములు : ఓ మునీ! ఈ జీవుని ఉనికికి మాపాత్ర ఎంతోఉన్నది. కనులు లేనివాడు చూడలేడు. చెవులు లేనివాడు వినలేడు. ఇంద్రియాలు లేకపోతే జగత్తే ఉండదు. జగత్తు లేకపోతే జీవుడు ఉండడు. కనుక ఈ జీవుడు మా వలననే మనగలుగుచున్నాడు.

వీతహవ్యుడు : ఓ ఇంద్రియములారా! అవిద్యాకారణంగా ఆత్మకు వేరుగా మీ యొక్క 'సత్త' అనుభవమౌతోంది. మీరు మీ విషయములను ఆశ్రయిస్తున్నంత కాలం నాకు దుఃఖ పరంపరలే వచ్చిపడుచున్నాయి. కాలక్రమేణా మృత్యువు అనివార్యమే కదా! మిమ్ములను గుడ్డిగా ఉపయోగించి నందుకు ప్రయోజనంగా ఈ జీవునకు ఎన్నో నరకములు వచ్చిపడుచున్నాయి.

అందుచేత మీరు "మేము ఆత్మ కంటే వేరైన 'సత్త' గల వారము"... అనే మిథ్యావాదనను కాస్త వదలిపెట్టండి. నేను ఇంతక్రితం చిత్తముతో జరిపిన సంవాదమును మీరు కూడా విన్నారు కదా! జ్ఞానవశం చేతనే ఆత్మోపదేశం లభిస్తుంది.

ఇంద్రియములు : మేమంతా ఎక్కడినుండి ఉత్పత్తి అయ్యాం?

వీతహవ్యుడు : మనం నిజం చెప్పుకోవాలంటే మీ ఉత్పత్తి అజ్ఞానవశం చేతనే ఏర్పడుతోంది. అజ్ఞానం క్షయించినప్పుడు మీకు 'సత్త'యే ఉండదు. అనగా మీరు స్వతఃగా లేనివారై, ఉపకరణ మాత్రులై ఉండిపోగలరు.

ఇంద్రియములు : మా వలన జీవునికి సంతోషం కలుగుతోంది కదా! అట్లాగే జీవుని వలన మాకు సంతోషం కలుగుతోంది?...

వీతహవ్యుడు : మీరు కాలంచే ఏర్పడి, కాలంచే బలహీనులై, కాలంచే నశించుచున్నారు కదా! అందుచేత... ఇరువైపులా దహించబడే అగ్నిలాగా మీయొక్క రాకపోకలు జీవునకు వాస్తవమైన సుఖం కలిగించుట లేదు చూడండి!

మీరు ఉంటున్నంత కాలం 'భ్రాంత జీవులు' అనే తరంగాలతో కూడిన ఈ సంసార నదీ జలం కాలసాగరంలోకి నిరంతరం 'ఉరుకులు, పరుగులు' ఎత్తుతూ ప్రవేశిస్తోంది. మీ వలననే పరస్పరాహంకారం ఉత్పన్నమౌతోంది. ఫలితమేమిటి? రాగము, ద్వేషము, క్షయము, వధ, పరాజయం, చింత – మొదలైన అపశబ్దాలు వినబడుచున్నాయి. ఇక దుఃఖ పరంపరల వర్షధార గురించి చెప్ప నవసరమే లేదు. "భావాభావములు, హృదయవేదనలు, సంపదలచే, ఆపదలచే ఏర్పడే దుఃఖ వియోగాలు" అనే దుర్భరవాసనలన్నీ ఆ కాలసాగర జలంలోంచి నలువైపులా ప్రసరిస్తున్నాయి.

మిమ్ములను ధరించి అటూ ఇటూ సంచరించే ఈ దేహము యొక్క గతులను చూస్తుంటే ఇంకా జాలి వేస్తోంది. అనేక మనోంతర్గతమైన చపల చింతలు మీ మధ్య తిరుగాడుచున్నాయి. లోభము మీ కణ కణములనిండా నిండి ఉంటోంది.

ఇంకేమున్నది....? లోభమున్నచోట శమదమాది ఉత్తమగుణములకు చోటు దొరుకుతుందా? ఒక వేళ, కొంచెం శమం ఏర్పడినా కూడా 'ఉద్వేగం' వచ్చి, దానిని తుడిచిపెట్టి పోతోంది.

ఇంద్రియములు : మా వలన జీవునికి క్రియా వ్యవహారములు సుసాధ్యమౌతున్నాయి కదా?

వీతహవ్యుడు : నిజమే. కానీ, మిమ్ములను దుర్వినియోగపరచుకొనే జీవుల హృదయాలు దుర్వ్యసనాలు హృదయమంతా విస్తరిస్తున్నాయి. 'మహామోహం' అనే చీకట్లో 'అజ్ఞాన సమాచారములు' అనే గుడ్లగూబలు కాపురాలు చేస్తూ, నివాసాలు కట్టుకొని ఉంటున్నాయి.

ఓ ఇంద్రియములారా! మీ వలన జీవునకు లాభాలు వచ్చిపడుతున్నాయంటారా? ఆహా, ఎంతమాట? మీకు తెలియుట లేదో ఏమో? మీరు వచ్చి చేరటం చేత లెక్కలేనన్ని అనర్థాలు కూడా వచ్చిపడుచున్నాయి. మిమ్ములను అడ్డంపెట్టుకుని పిశాచములవలె అనేక పాపకార్యములు విజృంభిస్తున్నాయి. మీరు గనక పరిశుద్ధులై ఉంటే వివేకము, ఉత్తమగుణములు ఎక్కడో చాటు మాటుగా దాక్కొని ఉండేవా? మోహమనే మంచు ఇట్లా కురుస్తూ ఉండేదా? 'రజోగుణము' అనే ధూళితో హృదయం కప్పబడి ఉండేదా? ఈ విక్షేపములు కలిగించే వికల్ప సమూహములు నాపై

దాడి చేసేవా? మీరు మంచి మిత్రులై ఉంటే, హృదయంలో తదితరులపట్ల 'మైత్రి' జనించి, ఆత్మానుభవమునకు విత్తుగా అయ్యేదే! ఈ విధంగా చింతాపరంపరలు నన్ను ఉద్వేగ పరచేవా? అహో! ఇదంతా మీ ప్రభావం కాదా?

ఇంద్రియములు : మా మూలంగా మా సొంతదారగు జీవునికి అనర్థములు కలగటానికి కారణం ఆతడు అజ్ఞానముచే మమ్ములను అజ్ఞాన విషయాలవైపుగా వినియోగించటమే కదా!

వీతహవ్యుడు : అవును. ఒప్పుకుంటున్నాను. మేఘములు శమించగా... ఆకాశంలో సూర్యుని వెలుగు ప్రస్ఫుటమగునట్లు, హృదయంలోని అజ్ఞానం తొలగితే అంతః కరణంలో జ్ఞాన ప్రకాశం ప్రత్యక్షమౌతుంది. అప్పుడు హృదయం ప్రసన్నమై, విశాలమై, గంభీరమై, క్షోభావర్జితమై ప్రశాంతత పొందగలదు. వైషమ్యాలచే పరాజితం కాని హృదయం దానంతట అదే ఉపశమించగలదు.

అమృతాపూరపూర్ణేన నిత్యానన్దమయేన చ ।
స్థీయతే పురుషేణాన్తః శీతేన శశినా యథా ॥ (శ్లో 22, సర్గ 83)

అప్పుడు... మనుజుడు ఆత్మానందముచే నిత్యానందమయుడై పరిపూర్ణుడై శీతల చంద్రుని వలె విరాజిల్లగలడు! కనుక.... అజ్ఞానం నశించాలి.

ఓ ఇంద్రియములారా! జ్ఞానసముపార్జనకై మీరు నాచే చక్కగా నియోగించబడిన వారై స్నేహితులవలె ఉభయ శ్రేయస్సుకు కారణమయ్యెదరుగాక!

ఇంద్రియములు : అజ్ఞానముచే వినియోగించబడుచున్నప్పుడు మేము జీవునకు మరింత అజ్ఞానమును మూటకట్టుకొని తెస్తున్నాం. సరే! అజ్ఞాన నాశనమునకై మా యొక్క పాత్ర, ప్రయోజనము, ప్రాముఖ్యము ఎట్టిది?

వీతహవ్యుడు : చాలా గొప్పది. మనం కలిసి ఉన్న 'జీవితము' అనబడే ఈ కొద్ది సమయం సద్వినియోగపరచుకొని మన ఈ కలయికను శుభప్రదం చేసుకొనెదముగాక!

అజ్ఞానం నశిస్తే, అంతఃకరణంలో 'ఆత్మాకారవృత్తి' సుస్పష్టమౌతుంది. అప్పుడు ఈ చరాచర దృశ్య ప్రపంచమంతా మటుమాయమై దీని స్థానంలో 'సంవిత్ చైతన్యము' మాత్రమే మనకు అనుభవమౌతుంది. తత్ఫలితంగా ఆనందముచే పరివ్యాప్తమైన ఆత్మయొక్క పూర్ణ స్వరూపము అనుభూతమౌతుంది. అట్టి అనుభవం, అవగాహన, ఆశాజాలమున బంధించబడి, కేవలం దేహ సంగులై ఇంద్రియసంగులై చరించే వారికి లభించదు. మీ సహకారంతో తప్పకుండా జ్ఞానం ప్రవృద్ధం కాగలదు. మిమ్ములను సముపార్జించుకున్నదే అందుకు కదా! జ్ఞానాగ్నిచే "జర (ముసలి తనం), జన్మ" మొదలైనవి తారసబడే సంసారమార్గం సంక్షయించగలదు. జ్ఞానం ఉన్నచోట తుష్టి, పుష్టి, కాంతి మొదలైనవి వచ్చి చేరుతాయి. వివేకి అయినవాడు అవివేకమున పడకుండా సంసృతి (సంసారం) యందు చిక్కకుండా ఆత్మ యందే విశ్రాంతి పొందుతూ ఉంటాడు. కనుక ఓ ఇంద్రియములారా! మీరు చిత్తచాంచల్యముచే ప్రేరితులు కాకండి.

దృశ్యము పట్ల మౌనం వహించి ఉండండి. ఆత్మ భగవానునివైపుగా దృష్టిని, ప్రయత్నమును సారించండి. అప్పుడు ఆత్మాకారవృత్తిచే ఏర్పడే ప్రయోజనములన్నీ మనకు కలుగుతాయి. ప్రశాంత దాయకమగు గుణసంపదలు వచ్చి పడతాయి.

ఇంద్రియములు : కానీ– ఇక్కడ అభిరుచులు, అవి నెరవేరినప్పుడు సంతోషం ఏర్పడుచున్నాయి కదా?

వీతహవ్యుడు : 'ఆశించుట' అను చిత్తముయొక్క వృత్తిచేత అభిరుచులు ఏర్పడుచున్నాయి. ఆశలకు అడ్డుగోడ పెట్టినప్పుడు మాత్రమే ఉత్తమ గుణసంపదలకు చోటు దొరుకుతోంది. అయితే, ఏదైనా ఆశించేటప్పుడు దాని గుణదోషములను, తదనంతర దుష్ప్రభావములనూ చక్కగా పరిశీలించటమే విజ్ఞత కదా? "ఆత్మ యొక్క సత్త, దృశ్యం యొక్క పరిణామాలు" – ఈ రెండిటిలో ఏది శ్రేయస్సును కలుగజేస్తుందో... దానినే ఎన్నుకోవాలి. అంతేగాని, ఏది ప్రియమో, దానిని కాదు. నాకు మాత్రం అవస్తువగు ఈ ప్రపంచంలోని వస్తుజాలానుభవం, ఈ భూత భవిష్యత్తుల పట్ల ఏర్పడే ఆవేదనల కన్నా 'ఆత్మ సత్త'యే సుఖదాయకమను అభిప్రాయం కలుగుతోంది. దేనిలో అయితే... ఎట్టి అన్య పదార్థముల 'సత్త' ఉండదో... అట్టి ఆత్మనే మనం ఆశ్రయిద్దాం. ఉత్తమ సుఖమగు ఆత్మ మనకు ఎదురుగానే ఉండగా... మనం ఎక్కడెక్కడో ఏదేదో ఆశించి ఎందుకు వెతుక్కుంటూ పోవాలి? "నా యందు సత్యమై, ప్రసిద్ధమై ఉన్నట్టి ఆత్మయే మన స్వరూపం" అని ఎరిగి ఆపై ఉభయ శ్రేయస్సు పొందుతూ కలిసి ఉందాం. అప్పుడు చైతన్యమే మన రూపం అవుతుంది. చిత్తచాంచల్యమును తిరస్కరిద్దాం. అంతేగాని, అసద్రూపములను మనం ఆశించవద్దు. భావించవద్దు.

ఓ ప్రియ ఇంద్రియములారా! మనం సద్గురువుల ప్రవచనాలు విన్నాం. వేద – వేదాంగాలు అంతిమసారంగా ప్రతిపాదిస్తున్నదేమిటో గమనించాం. వాటి సారమేమిటి? అసారం ఏమిటి?

"దృశ్యము పరిత్యజించబడుగాక. పరిశుద్ధము – అఖండము – అద్వితీయము అగు ఆత్మయే మనచే మననము చేయబడు గాక!" అని కదా!

మిత్రులారా! ఇంద్రియములారా! ఈ నా నిర్ణయమును మీరు శిరసావహించెదరుగాక!

ఇంద్రియములు : ఓ వీతహవ్యా! నీవు చెప్పుమార్గంలో మేము జీవించి ఉండమేమో?

వీతహవ్యుడు : "మేము జీవనము సాగించువారము... లేక ఈ జీవుని జీవింపజేయువారము" అనే మిథ్యయగు యోచనను, సుఖ భ్రాంతిని మీరు వదలిపెట్టండి. మీరు నా యొక్క సాధనవస్తువులు మాత్రమే. సాధనలు లేనంత మాత్రం చేత సాధకుడు – సాధ్యము లేకుండా పోతాయా? అది అట్లుండగా... మీ అస్థిత్వము నాకు వేరైనవి కావు. మయావినా (నేను లేకుండా) మీకు అస్థిత్వం అనేది భ్రాంతి మాత్రమే. అట్టి భ్రాంతి ఈ మన విచారణచే పూర్తిగా తొలగిపోగలదు.

మీకంటూ ఏ స్వరూపం లేదు. భావనలేదు. కార్యక్రమం లేదు. మిమ్ములను ఉపయోగిస్తున్న నా వలనే మీకు 'ఉనికి' అనే గౌరవం కలుగుతోంది. మీకంటూ ఏదైనా స్వరూపం అనుభవమౌతుంటే, అదంతా ఆత్మ యొక్క అవిచారణా ఫలితమే అయిఉన్నది. విచారణచే మీ స్వరూపం కూడా వైషమ్య రహితమగు సన్మాత్రముగానే తెలిసిపోతోంది. వెలుతురు లేకపోవటమే చీకటి అయినట్లు...

విచారణ లేకపోవుటచేతనే 1. మీరు 2. మీ వలన విషయములు... అనుభవమౌతున్నాయి. ప్రకాశముచే అంధకారం తొలగునట్లు సమగ్రవిచారణచే మీరు స్వతఃగా లేనివారే అగుచున్నారు.

ఇంద్రియములు : ఇంతకాలం నీవు మాపైనే ఆధారపడి జీవించావే?

వీతహవ్యుడు : ఇంతకాలం నేను అల్పవివేకమును మాత్రమే కలిగి ఉన్నాను. సంకల్ప మాత్రంచే ఊహలో దయ్యం ఉద్భవమగున్నట్లు, అల్పవివేకంచే మీరంతా స్వల్పాకృతి పొంది చివరికి దుఃఖ కారకులగుచున్నారు. సృష్టికర్తనగు నాయొక్క 'ఆద్యంత సంకల్పము' చే సంకల్పకాలంలోనే మీరు సంక్షయించగలరు...లేక అధిగమించబడగలరు.

ఇదానీముదితం నిత్యం స్వప్రాగ్రూపే క్షయం గతే ।
వివేకస్య ప్రసాదేన వివేకాయ నమోనయః ॥ (శ్లో 36, సర్గ 83)

వివేకోదయంచే పూర్వపు అవిద్య నశించి మీ యందు, నా యందు, ఈ దృశ్యము నందు ఆత్మ స్వరూపమే ఉదయించగలదు. అట్టి వివేకమునకు ఇదే నమస్కారం.

ఓ ఇంద్రియములారా! మీరు ప్రబుద్ధము పొందితే పరమేశ్వర స్వరూపమే పొందుతారు. చిత్తత్వము నశించితే పరమేశ్వరత్వము ప్రకాశిస్తుంది. ఇతఃపూర్వంకూడా మీ స్వరూపం పరమేశ్వర ప్రకాశమే. ఇప్పుడు దృశ్యమును అధిగమించి, ఆత్మవస్తువును ఆశ్రయించుటకు ఉపకరించుటచే పరమ పవిత్రులౌతున్నారు. దీపం వెలిగిన తరువాత చీకటిలాగా మీలో దోషములు తొలగిపోతు న్నాయి. నిద్ర లేచినవాడు మౌఢ్యమునుండి ప్రబుద్ధుడగుచున్నట్లు, జ్ఞాన - విజ్ఞాన ప్రభావంచే మీయందు పరమేశ్వరత్వం ప్రకాశిస్తుంది. ఏదైతే మీవెంట అవివేకముచే జనించిందో అది వివేకముచే నశిస్తోంది... ప్రకాశముచే చిమ్మచీకటి నశిస్తున్నట్లు...!

'ఆత్మ విచారణ' ఉంటే చాలు, మీరు కోరకున్నాకూడా మీకు సుఖ సిద్ధిలభిస్తుంది. అందుచేత శాస్త్ర సిద్ధాంతయుక్తులచే 'ఇంద్రియములు - ఇంద్రియ విషయములు ఆత్మకు అన్యంగా లేవు" అని నాచే మరల మరల నిర్ణయింపబడుగాక!

ఓ ఇంద్రియములారా! ఇప్పుడు మీరు సంసారమును దాటివేసినవారయ్యారు. మీరు పూర్వం ఆత్మకంటే అన్యంగా ఉండి ఉండలేదు. ఇప్పుడు అన్యంగా లేరు. ఇకముందు అన్యంగా ఉండబోరు. మీకు శుభమగు గాక! మీస్వరూపమేమిటో ఎరిగిన తరువాత నేనిప్పుడు దుఃఖరహితుడనగుచున్నాను. పూర్ణతృప్తుడను, శాంతుడను అగుచున్నాను. "స్వాత్మయందు స్థితి కలిగి యుండుట" అనే తురీయపదమునందు విశ్రాంతి పొందుచున్నాను. చిత్తమునకు, ఇంద్రియములకు స్థితియే లేదు.

ఆత్మ ఒక్కటే అవశ్యం కలదు! ఆ ఆత్మయే నేను. దానికి అన్యంగా ఎచ్చటా ఏదీ లేదు. బోధ స్వరూపుడనై నేనే సర్వదా అంతటా, అన్నిటా వెలయుచున్నాను.

శుద్ధ చిద్రూపమగు ఆత్మయందు "ఈ ఆత్మయే నేను. అది నేను కాదు" అనే కల్పన కూడా ఉండదు. ఇక మరింకే కల్పనలు అసలే ఉండవని వేరే చెప్పాలా?

ఏకమై, అద్వితీయమైనట్టి ఆత్మ యందు 'ఆత్మకు వేరుగా ఏదీ లేదు" అనే కల్పనమాత్రం ఎట్లా సంభవం?

అందుచేత 'ఆత్మను నేను' అనే కల్పనకూడా ఇప్పటికిప్పుడు త్యజిస్తున్నాను. ఏమరొక చింతనకూ చోటివ్వకుండా జల తరంగముల అవినాభావంలాగా మౌనం వహించి ఉంటున్నాను. వాసనారహితుడనై, ప్రాణసంచారమునకు సంబంధించనివాడనై, సర్వదోష వినిర్ముక్తుడనై ఉండెదనుగాక! 'చిదాభాసము' అను ప్రతిబింబాశ్రయం లేనివాడనై, స్వయముగా అఖండము, అప్రమేయము అగు ఆత్మనై ఉంటాను. తటాకంలోని జలంలోను, కుండలోని జలంలోను, సముద్రజలంలోను ప్రతిబింబించే సూర్య ప్రతిబింబములకు సూర్యునితో ఏం సంబంధమున్నది? అన్నిటిలోనూ ప్రకాశిస్తున్నప్పటికీ ఆ ప్రకాశముయొక్క కర్తృత్వము లేనివాడను. ఆకాశంలో ప్రకాశించే సూర్యునిలాగా స్వయం ప్రకాశకుడను. అన్ని ఉపాధులలోని జ్ఞానతత్త్వమును, చిదాత్మస్వరూపుడను.

మనశ్చేష్టలకు, ఇంద్రియచేష్టలకు సంబంధించని వాడనగు నేను ఇప్పుడు మౌనమును, విశ్రాంతిని పొందుచున్నాను.

❖❖❖

4. మనోజగత్

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఆ వీతహవ్యుడు వింధ్యపర్వత ప్రాంతంలోని తన పర్ణశాలలో సుఖాసీనుడై సమాధియందు నిశ్చలుడయ్యారు. సర్వ శారీరక, మానసిక చేష్టలు త్యజించారు. సుందరమగు ఆత్మానందమొక్కటే ఇప్పటి ఆతని అనుభవం. సముద్రజలం తరంగత్వం త్యజిస్తే ఆ జలం ఎట్లా నిశ్చలంగా ఉంటుందో ఆతని మనస్సు ఆ రీతిగా అయింది. కట్టెలన్నీ కాలిపోయిన తరువాత అగ్ని ఉపశమించినట్లు, ఆతని దేహంలో ప్రాణసంచారం ఉడిగిపోయింది. నేత్రములు బాహ్యసంచలనం త్యజించి అర్ధనిమీలిత మయ్యాయి. ఆ కన్నుల మిగతా అర్ధభాగం పూర్తిగా అంతర్ముఖమయ్యాయి. నాసాగ్రం ఉత్తేజమై ఊర్ధ్వస్థితి పొందింది. శిరస్సు, శరీరము, కంఠము సమంగా స్థితి పొందాయి. ఆతడు ఒక కొండపై మలచబడిన శిల్పంలాగా కన్పట్టసాగాడు.

అట్టి మౌన-ప్రశాంత-క్షోభారహిత-చ్యుతిరహిత... ఆనందస్థితిలో ఉండగా 300 సంవత్సరాలు గడచిపోయాయి. అంతదీర్ఘకాలం ఆతనికి అర్ధముహూర్తంలాగా గడిచిపోయింది.

ఆతడు తన జీవన్ముక్త బలం చేత జ్ఞాని, ధ్యాని అయ్యారు. అంతకాలం ఆతడు సమాధి నుండి లేవనే లేదు, దేహమును త్యజించలేదు. అంతటి దీర్ఘకాలంలో ఆ పర్ణశాలకు బయట ఏర్పడే మేఘ గర్జనలు గానీ, సమీపంలోని సామంతరాజుల వేట కోలాహలాలు గాని, కోతుల కిచకిచలు, ఏనుగుల ఘీంకారాలు, సింహముల నాదాలుగాని, పిడుగులశబ్దాలు, భూకంపములచే ఏర్పడిన శిలాపాత శబ్దాలు, దావాగ్ని చిటపటలుగాని ఆతని సమాధికి విఘాతం కల్పించలేకపోయాయి.

ఆ సమయంలో కాలం కేవలం స్వతంత్రంగా, నిష్కారణంగా, మౌనంగా గడిచిపోయింది.

జలతరంగాల లాగా అనేక వర్ష, వేసవి కాలాలు వచ్చాయి...పోయాయి. నీళ్ళు అనేకసార్లు పర్ణశాలలో ప్రవేశించాయి. కొద్దికాలంలోనే ఆ వీతహవ్యుని భౌతిక దేహం బురదలో కూరుకు పోయింది. అయినా ఆతనికి ఏమాత్రం వ్యధగాని, ఆతని సమాధి స్థితికి విఘాతంగాని కలుగలేదు.

ఆతని పట్ల 300 సంవత్సరాలు కొద్ది క్షణాలులాగా గతించిపోయాయి. ఆ తరువాత ఆతని ఆత్మప్రభువు స్వయంగా సమాధి నుండి మేలుకొన్నారు.

శ్రీరాముడు : స్వామి! ఆ వీతహవ్యుని దేహం 300 వందల సంవత్సరాల భూమిలో కూరుకుపోయినా, అది చెడకుండా ఎట్లా ఉన్నది? ప్రాణాలు ఎట్లా నిలిచాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : భూమిలో కూరుకుపోయినప్పుడు ఆతని దేహమును రక్షించింది చైతన్యముగాని, ప్రాణములు కాదు. ఎందుకంటే సమాధిని స్వీకరించిన మరుక్షణం ఆతని దేహంలో ప్రాణములు తమ సంచలనము నుండి ఉపశమించి అవి సూక్ష్మత్వం పొందాయి.

శ్రీరాముడు : 300 సంవత్సరముల వరకు శరీరమునందు ప్రసరించకుండా సూక్ష్మత్వం పొందిన ఆతని ప్రాణములు మరల ఎందుకు ఉత్తేజం పొంది పునఃప్రసరణకు ఉపక్రమించాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆతని హృదయాంతరంగంలో ఎక్కడో ఒక మూల ఇంకా ప్రారబ్ధం శేషించియున్నది. అనగా కార్య - కారణములకు సంబంధించిన దేహసంబంధ కర్తృత్వ సంస్కారం ఎక్కడో రవ్వంత మిగిలియున్నది. అందుకే ఆతని చైతన్యం ప్రబలంగా హృదయంలో ఆవిర్భవించింది. స్వమనోరూపం ధరించింది. అయినా కూడా, ఆతడు స్వవిచారణచే జీవన్ముక్తత్వము అవధరించాడు కదా! కనుక ఆతని హృదయము నిర్మలత్వం కలిగియే ఉన్నది. సమాధి విఘాతానికి కొంత ముందుగా ఆతని మనస్సు ఆ పర్ణశాల నుండి బయల్వెడలింది.

❖

వింధ్యపర్వత ప్రాంతంలో ప్రశాంతముద్రను అవధరిస్తూనే ఆయన తన స్వసత్తమనస్సులతో హిమాలయముల వైపుగా బయలుదేరాడు. అక్కడ గల కైలాసపర్వతం సమీపించాడు. ఆ పర్వతం దగ్గరగా ఉండే ఒక కదంబవృక్షం (కడిమి చెట్టు) క్రింద గట్టువంటి ఎత్తు ప్రదేశంలో కూర్చుని ధ్యాన చిత్తంతో కొద్ది సంవత్సరములు గడిపాడు. మరల అక్కడి నుండి బయలుదేరి ఆ ప్రాంతంలోనే విద్యాధరత్వం స్వీకరించి సంచరించాడు. ఆ సమయంలో దేవతలచే ఆరాధింపబడుతూ ఇంద్రత్వం అవధరించి ఐదు యుగముల కాలం గడిపివేశాడు.

శ్రీరాముడు : మహర్షీ! ఆతడు కైలాసపర్వతప్రాంతంలో సంచరిస్తూ ఉండటం, ఇంద్రత్వంతో దేవతలచే ఆరాధింపబడుచూ ఐదు యుగముల కాలం గడపటం - ఇవన్నీ ఆతనికి ఎట్లు తారసపడ్డాయి? ఆతని భౌతిక దేహం వింధ్యపర్వత ప్రాంతంలోనే ఉండిపోయిందిగా? ఆతడు మనస్సుతో కదా, పర్ణశాల నుండి బయల్వెడలింది?

శ్రీవసిష్ఠ మహర్షి : అవన్నీ ఆతడు తన హృదయ ప్రదేశంలోనే పొందాడు. అనుభవించాడు. దేహం మాత్రం వింధ్యపర్వత ఆశ్రమంలోనే 300 సంవత్సరాలు ఉన్నది.

శ్రీరాముడు : ఆ విశాల ప్రదేశములను అల్పకాలంలో, అల్పమగు ఆతని హృదయప్రదేశంలో ఎట్లా అనుభవించారు? ఇదంతా జరిగినదని మీరు చెప్పుచున్నప్పుడు దేశకాలముల యొక్క 'అనియమము' ఏర్పడుచున్నట్లు అనిపిస్తోందే? ఆతని పట్ల ఈ దేశ కాలాలకు ఒకప్పుడు నియమము, మరొకప్పుడు అనియమము ఏర్పడుతోందా ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : ఒకప్పుడు శక్తి స్వరూపరహితమై ఉంటుంది. మరొకప్పుడు స్వరూపయుక్తమై ఉంటోంది. అది ఎక్కడ ఏ రూపంలో ఉదయిస్తే ఆ రీతిగా అనుభవమౌతుంది. అట్లాగే చైతన్యము కూడా! అది ఎక్కడ ఏ రూపంగా సంకల్పపూర్వకంగా ఆవిర్భవిస్తే అక్కడ ఆ రూపంగానే అనుభవం కాగలదు. చేతనము తన స్వభావమును అనుసరించి శీఘ్రంగా ఆయా రూపములు పొందుతోందని గ్రహించు. ఇక 'నియమం' విషయం అంటావా? చైతన్యప్రభావంచే బుద్ధియందు ఎప్పుడు ఎచ్చట నియమం (లేక) ఎట్టి అనుభవం స్వీకరించబడుతుందో... అప్పుడు అచ్చట తదనుకూలమైన నియమమే ఉదితమౌతూ ఉంటుంది.

ఒక ప్రశ్న– ఈ దేశ కాల నియమ క్రమములన్నీ వాస్తవానికి ఎక్కడ ఉన్నాయి?

శ్రీరాముడు : అవును... ఎక్కడున్నాయి?

శ్రీవసిష్ఠ మహర్షి : ఇవన్నీ బుద్ధిమయమగు చిదాత్మయందు అధ్యస్తమై ఉన్నాయి. అంతేగాని దేశ కాల వ్యవహారములన్నీ బయట ఎక్కడో లేవు.

చైతన్యము స్వరూపరహితంగా ఎరుగబడునప్పుడు... అట్టి చైతన్యమునందు అల్ప దేశకాలములు గాని, వాటిలో విశాల దేశ కాలములుగాని సంభవించవు.

కానీ... చైతన్యము స్వరూపసహితంగా ఎరుగబడినప్పుడు దేశకాలముల అనుభూతులు సంభవిస్తాయి. చైతన్యము యొక్క బుద్ధిపూర్వకమైన అనుభవమును అనుసరించి అల్పదేశకాలముల పరిధిలో విశాల దేశకాలముల అనుభవం సంభవించవచ్చు. లేదా, విశాల దేశ కాలాల పరిధిలో అల్పదేశకాలముల అనుభవం ప్రాప్తించవచ్చు.

ఈ కారణం చేత వాసనారాహిత్యం విజయపూర్వకంగా సాధించినప్పటికీ ఆ వీతహవ్యుడు కించిత్ ప్రారబ్ధ సంస్కారశేషం చేత తన హృదయస్థమైన 'చిదాకాశము'నందు వివిధ జగత్తులు, ఇంద్రత్వం, దేవతలచే పూజలు గాంచటం జరిగింది.

శ్రీరాముడు : జ్ఞానులలో కూడా వాసనలు ఉంటాయా? ఉంటే, ఆ వాసనలకు, ఈ సంసారజీవుల వాసనలకు భేదమేమైనా ఉంటుందా?

శ్రీవసిష్ఠమహర్షి : భేదం ఉంటుంది. బాగుగా వేయించిన విత్తనం బయటకు చూడటానికి మామూలు విత్తనంలాగానే ఉంటుంది. కానీ, లోన 'అంకురించుట' మనే స్వభావం కలిగి ఉండదు కదా! జ్ఞానులలో శేషించి ఉండే వాసనలు 'తదనంతర జన్మములు – పరిణామములు' కలిగి ఉండవు. వారి ఆయా కార్యక్రమములు వారియందు ఇచ్ఛ, అభిలాష, అభినివేశము కలిగించవు. సాంసారిక

జీవుడు ప్రతి కర్మచేత అద్దాని ప్రయోజనము వైపు తరలించబడుచున్నాడు. నిత్యానిత్య వివేకియగు జ్ఞానిని కర్మలు తాకలేకపోతున్నాయి.

ఇక మనం వీతహవ్యుని తదనంతర వృత్తాంతంలోకి వద్దాం. అటు తరువాత ఆ వీతహవ్యుడు త్రికాలజ్ఞుడయ్యాడు. అనేక విద్యలందు నిపుణుడైయ్యాడు. ఒక కల్పము కాలం నిర్మల జ్ఞానంతో మహేశ్వరగణమునకు నాయకత్వం వహించాడు. ఎవడు ఎట్టి సంస్కారం కలిగి ఉంటాడో... ఆతడు అట్లే ఈ దృశ్య విషయములు పొందుతూ ఉంటాడని అనుకొన్నాం కదా! ప్రారబ్ధకర్మ యొక్క దృఢ సంస్కారం జీవన్ముక్తుడైన వాని యందు కూడా ఆవిర్భవిస్తూ ఉంటుంది. అందుచేతనే వీతహవ్యుడు మనం చెప్పుకొనే అనుభవాలన్నీ పొందటం జరుగుతోంది.

శ్రీరాముడు : మహాత్మా! సందర్భోచితమనుకుని ప్రశ్నిస్తున్నాను. జీవన్ముక్తుని యందు కూడా బంధమోక్షముల దృష్టి ఉంటుందా?

శ్రీవసిష్ఠ మహర్షి : "ఒక జీవుడు ఈ దృశ్యమును ఏ దృష్టితో చూస్తున్నాడు...?" అను దానిని బట్టి గదా, బంధమోక్షములు ఉండేవి! అందరికీ ప్రత్యక్షమైయుండే ఈ జగత్తు అంతాకూడా జీవన్ముక్తుని దృష్టి యందు శాంతమై, నిర్మలమై ప్రశాంతాకాశసదృశమై, కేవలం బ్రహ్మమే, అయి ఉంటోంది. ఇక వారికి 'ఇది ఇంతవరకు బంధం, ఇక్కడ నుండి ఇది మోక్షం' అనే అల్ప సంభావనయే ఉండదు. ప్రారబ్ధానుగతంగా, లేక, సంస్కారానుగతంగా ఏది ఎట్లు ప్రాప్తించినా కూడా... లేక, ప్రాప్తించకున్నా కూడా వారు దేని పట్లా అభ్యంతర – నిరభ్యంతరములు అనుస్వాదించరు. కలిగి ఉండరు.

జీవన్ముక్తత్వము "1. దృష్టికి, 2. అవగాహనకు, 3. ప్రభావితమగుటకు" సంబంధించినది.

అంతేగాని అది కర్మలందు పాల్గొనటానికి, పాల్గొనక పోవటానికి సంబంధించినది కాదు. మరల చెపుతున్నాను...

సంవిద్రూపమగు చిదాకాశము ఎచట ఏ విధంగా భావనా పూర్వకంగా భాసిస్తుందో అచట ఆ విధంగానే అంతటా వ్యాప్తిపొందినదై ఉంటోంది.

ఏ అనుభవములు రాక, పోకలు చేస్తున్నప్పటికీ వీతహవ్యుడు మాత్రం స్వస్వరూపధ్యానం (ధ్యాస) వీడటం లేదు. "నేను అఖండము, అప్రమేయము, నిర్గుణము అగు బ్రహ్మమునే" అనే స్పష్టాతి స్పష్టమైన నిశ్చయమును కలిగి ఉండుటచే... తదితరంగా తారసపడేదంతా ఆతనికి స్వప్న తుల్యంగానే అనిపిస్తోంది. ఆత్మ స్వభావము నుండి ఏమాత్రం చ్యుతి పొందకుండానే ఆతడు అనేక జగత్తులను క్రీడా మాత్రంగా అనుభవించాడు....!

శ్రీరాముడు : వీతహవ్యుని జగదనుభవములు మనకు తారసపడుచున్న జగదనుభవము వంటిదేనా? ఆతని బ్రహ్మాండానుభవములకు, మన జగద్దర్శనమునకు ఏదైనా భేదముంటుందా?

శ్రీవసిష్ఠ మహర్షి : వీతహవ్యుని హృదయమునందలి చైతన్యము నావంటి – నీవంటి – సర్వజీవుల వంటి హృదయ చైతన్యమే. అయితే ఆత్మతో ఏకీభావం పొందినవానికి తదితర జీవులందరి అనుభవం

తనదే కాగలదు. ఓ రామా! అందరి దృశ్యానుభవం వంటిదే ఆతనిది కూడా! ఎటొచ్చీ, ఆయన అభ్యాసవశం చేత ఆత్మతత్త్వమును ఎరిగి ఉన్నారు.

ఆయనకి అనుభవములగుచున్న బ్రహ్మాండములు అసంఖ్యాకములై, రూపరహితములై ఉన్నాయి. ప్రతిభాసాదృష్టిచే అత్యంత సువిశాలములై ఉన్నాయి. ఆతనికి అవన్నీ స్వయం కల్పితంగానే అనుభవమగుచున్నాయి. అట్టి స్వకల్పిత బ్రహ్మాండమునందు ఒక సమయంలో 'నేను ఇంద్రుడను' అను అనుభవం ఆయన పొందారు. ఇంకొక సమయంలో ఇంకొక బ్రహ్మదేవుని కల్పంలో ప్రవేశించి గణపతి అయి, కైలాసమున ఉండేవారు. అవన్నీ కూడా మానసికమైనవే సుమా! అయితే భౌతిక అనుభవములకు – మానసికానుభవములకు నిత్యానిత్య వివేక దృష్టిలో భేదం లేదు.

అజ్ఞానదృష్టి కలవానికి, "నాచే దర్శించబడుచున్న ఈ బ్రహ్మాండములు, ఈ దృశ్యపరంపరలు నాకు ఎదురుగా మరెవ్వరో కల్పించి చూపిస్తున్నారు" అనే స్వయంకల్పితభ్రమ కొనసాగుతూనే ఉంటుంది.

అజ్ఞాన జీవుల ప్రయాణములు కూడా ఇట్టివే. అయితే వారు జన్మలు... వాటి నుండి వాసనలు... ఆ వాసనల నుండి జన్మలు... ఇట్లా పరంపరలుగా సాగుతూ ఉంటోంది. జీవన్ముక్తుని విషయం అట్లా ఉండుట లేదు. ఆతనిపట్ల సంకల్పములు స్వబుద్ధికి అధీనమై ఉంటున్నాయి. అందుకు కారణం, "నేను ఆత్మస్వరూపుడను కదా!"... అను అవగాహనయే!

శ్రీరాముడు : వీతహవ్యుని జగత్తులన్నీ మానసికమైనప్పుడు, అవి బాహ్యమున ఇంద్రుడు అవటం మొదలైన రూపాలుగా సంప్రాప్తిస్తున్నాయా? అవి బాహ్యమైనవైతే... ఆతడు విద్యాధరుడు, ఇంద్రుడు మొదలైన ఉపాధులు ఆశ్రయించాడా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆతని అనుభవాలన్నీ మానసికమైనవే. అయినా ఆతని వివిధ మనోప్రసరణలలో (విద్యాధరుడు – ఇంద్రుడు – గణపతి మొదలైన అనుభవాలలో) తదితర సంబంధిత జీవులు సచేతనులై ప్రాప్తించారు. అట్టి వివిధానుభవముల తరుణంలో 'నేను వీతహవ్యుడను' అను ఎరుకను వదలలేదు. అయితే ఆతని దృష్టి అత్యంత పవిత్రమై ఉండుటచే "నేను దేహాదులకు సంబంధించని ఆత్మ సత్తను" అను బ్రాహ్మీదృష్టిని ఆయన వహించియే ఉన్నారు.

❖

మనకు కనబడే ఈ సచేతన సృష్టికూడా మనకు భ్రాంతి, స్వప్నమాత్రమై ఆ వీతహవ్యునికి ప్రాప్తించినట్లే ప్రాప్తిస్తోంది. మనచే చూడబడుచున్న ఈ జగత్తు మనకు స్వప్నమువంటిదే అయినా, ఇక్కడ మనకు తదితర సచేతన జీవులు తారసపడుచున్నారు. జ్ఞాన దృష్టి దృఢపడితే నేను, నాకు తారసపడే ఈ సచేతనజీవులు – అంతయూ ఆత్మయే – అను అనుభవం స్పష్టపడి ఉంటూనే, తదితరమంతా యథారీతిగా ఉండగలదు.

బ్రాహ్మీదృష్టి, సాంసారిక దృష్టి - ఈ రెండిటి చమత్కారమును నీవు గ్రహించు. ఇక్కడ నీకు తారసపడే తండ్రీ, గురువులు, సభికులు, సోదరులు, అయోధ్యా ప్రజలు – అంతా ఆత్మానుభవం దృష్ట్యా – భ్రాంతి మాత్రమే. అనగా అదంతా మనస్సు యొక్క కల్పిత భ్రమ మాత్రమే. అట్లే

వీతహవ్యుని విషయంలో కూడా జరుగుతోంది. అయితే ఆతని జగత్తు దీనికి సదృశమైనది (ఈ జగత్తులో ఒకానొక చోటు) కాదు. అయితే, ఈ జగత్తు – ఆతని జగత్తు ... రెండూ లేనివే. కేవలం బ్రహ్మమే ఇక్కడా, అక్కడా కూడా భాసిస్తోందని మాత్రం గ్రహించు.

❖

భూత – భవిష్యత్ – వర్తమాన కాలములందలి, ఏఏ జీవునికైనా సరే... దృశ్యమానమయ్యే 'జగత్తు' అనబడేదంతా మనోమయమైనదేగాని మరింకేమీ కాదు. ఎంతవరకు దీని వాస్తవరూపం ఎరుగబడదో... ఎంతవరకు వజ్రంలాగా, పంజరంలాగా భావానుభవపరిమితమై ఉంటోందో... అంతవరకు చిదాకాశము ఎరుగబడకయే ఉంటోంది.

అజ్ఞానాన్మన ఏవేద మిత్థం సంప్రవిజృమ్భతే ।
ప్రత్యుల్లాసవిలాసాభ్యాం జలమమ్బునిధావివ ॥ (శ్లో 43, సర్గ 85)

సముద్రంలో జలం తరంగాలరూపంలో విస్తరిస్తోంది చూచావా? మనోమయజగత్తు కూడా ఆత్మయందు 'ఉత్పత్తి–వృద్ధి–క్షయము'ల రూపంలో విస్తరిస్తోంది.

శ్రీరాముడు : ఈ మనోమయజగత్తులను ఎవరు కల్పిస్తున్నారు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఎవరూ కల్పించటం లేదు. నిర్వికారమై నిరాకారమై, చిదాకాశస్వభావమై ఉన్న బ్రహ్మమే స్వయముగా, స్వమాయచే తనయొక్క కించిత్ ప్రదేశంలో మనోమయ జగత్తుల రూపంగా చేష్టితమగుచున్నది. అనగా, తనను తానే చిత్తము రూపమున కల్పించుకొనుచున్నది. అట్టి చిత్తము యొక్క మననశక్తియే మనోరూపం పొందుతోంది. ఆ మనస్సుచే తనయందు ఈ సువిశాల జగత్తును కల్పించుకొనుచున్నది. మనస్సే ఈ దృశ్యమంతా అంతర్లీనంగా వ్యాపించియున్నది. కానీ యథార్థానికి బ్రహ్మము కంటే భిన్నంగా ఇది దేనిచేతా వ్యాపించబడిఉండలేదు.

అనగా రామా! మరొక రీతిగా చెప్పాలంటే... నీకు ఏది జగత్తై కనిపిస్తోందో... అదంతా నీవు నీ స్వకీయ మాయచే అట్లు నిర్మించుకొని అనుభవిస్తున్నావు. నీ స్వరూపవిస్తీర్ణమునే జగత్తుగా గాంచుచున్నావు.

ఆత్మ దృష్టిని గ్రహించినప్పుడు నీవు ఈ నా వాక్యాల సారం గ్రహిస్తావు. ప్రతిజీవుని యొక్క దృశ్యజగత్ చమత్కారమంతా ఇట్టిదే! వీతహవ్యుడు ఆత్మదృష్టిని గ్రహించి, తదితర జగత్తులను గాంచుచున్నాడు.

❖❖❖

5. భౌతిక దేహ పునరాశ్రయం

శ్రీరాముడు : హే మహర్షీ! వీతహవ్యముని ఇంద్రత్వం, గణపతిత్వం మొదలైనవన్నీ పొందారని చెప్పారు కదా! అవన్నీ తన భౌతిక దేహంతోనే పొందారా?

శ్రీవసిష్ఠ మహర్షి : లేదు... అవన్నీ మనస్సుతోనే పొందారు. అయితే, ఆతని మనోదేహం భౌతికదేహ దృశ్యాది కల్పనంతా మనవలెనే గాంచటం జరిగింది.

శ్రీరాముడు : ఆతని భౌతికదేహం వింధ్యపర్వత ప్రాంతంలో ఆశ్రమంలోనే ఉండిపోయింది కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. అక్కడే మట్టిలోనే కూరుకుపోయి ఉన్నది.

శ్రీరాముడు : అయితే ఆయన మరల ఆయా అనుభవాల తరువాత ఆ శరీరంలో ప్రవేశించారా? ఎట్లా ప్రవేశించారు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ చమత్కార వైనమేమిటో చెపుతాను, విను–

"ఈ సర్వజగత్తు బ్రహ్మమే" అని మరికొంత నిర్ణయించుకున్న తరువాత ఆ వీతహవ్యుని మనస్సు తనకు తాను అనంతాత్మ స్వరూపంగా రూపుదిద్దుకున్నది. ప్రారబ్ధానుసారం ఆ శరీరమును అక్కడే పర్ణశాలలో ఉంచుకొని విద్యాధరత్వం, ఇంద్రత్వం, గణపతిత్వం పొందింది.

ఒక సమయంలో ఆ వీతహవ్యుడు పరమేశ్వరుని గణనాయకుడై ఉన్నారని అనుకున్నాం కదా! ఆ సమయంలో ఒక రోజు ఆయా కార్యవ్యవహారములు నిర్వర్తించిన తరువాత కైలాసంలోని ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుని ఆత్మధ్యానం చేయసాగాడు. ఆ సమయంలో కొంతసేపు తాను ఇతఃపూర్వం పొందియున్న అనేక దేహపరంపరల గురించి చమత్కారపూర్వకంగా పునశ్చరణ చేయసాగాడు. నశించినవి ఇంకా నశించనివి అయిన అనేక దేహాలు పరికించాడు. అట్టి నశించని దేహములలో వింధ్యపర్వత ప్రాంతంలో భౌతికస్థితిలో భూమిలో కీటకంలా పాతుకుపోయి ఉన్న వీతహవ్య నామధేయము గల భౌతిక దేహం దివ్యదృష్టిచే గమనించాడు.

ఆ దేహం వర్షాకాలపు ప్రవాహంచే కొట్టుకుపోబడి కొంత దూరప్రాంతంలోని ఒక కాలవ సమీపంలోని మట్టిలో లోపలగా ఎక్కడో కూరుకుపోయి ఉన్నది. వీపు వెనుక భాగమంతా బురదతో కప్పబడి ఉన్నది. శరీరమంతా నీటి ఆకులతో కప్పబడి ఉన్నది. పైన నీటి మొక్కలు మొలచి ఉన్నాయి. బాహ్యానికి అక్కడొక మురికినీటి గుంట మాత్రమే కనబడుతోంది గాని, మట్టిలో జీవఛాయ ఉన్న దేహమున్నదని ఎవరికీ ఏమాత్రం అనిపించే అవకాశమే లేదు.

తన అపంచీకృత గణపతి సూక్ష్మశరీరంతో ఇదంతా దర్శించిన ఆ మునికి తిరిగి ఆ శరీరంలో ప్రవేశించాలని అభిలాష ఏర్పడింది. ఇట్లు తనలో యోచించాడు.

వీతహవ్యుడు : ఇప్పుడు ఈ అపంచీకృత సూక్ష్మశరీరముతో రుద్ర గణమునకు నాయకుడనై ఇన్ని యుగాలు ఇక్కడ ఉండిపోయాను. ఇప్పుడు నేను వీతహవ్య నామధేయమైన స్థూలశరీరంలో ప్రవేశించాలి. అయితే ఆ దేహము యొక్క సర్వాంగాలు భౌతికంగా 300 సంవత్సరాలు ప్రాణసంచారం లేక పోవటంచే బిఱ్ఱుగా బిగదీసుకుని ఉన్నాయి. అందులో ప్రాణసంచలనం ఉద్ధరించటమెట్లా?

ఈ విషయం తన రుద్రగణంలో ఒక మిత్రుడు, పూర్ణజ్ఞాని అయిన ఒక సహచరుని సమీపించి చర్చించసాగాడు.

❖

వీతహవ్యుడు : మిత్రమా! నేను మరల శిథిలమై వింధ్య పర్వత ప్రాంతంలోని ఒక ప్రదేశంలో బురదలో ఎక్కడో అంతర్భాగములో నిస్తేజంగా పడి ఉన్న వీతహవ్యభౌతిక దేహంలో ప్రవేశించాలని అనుకుంటున్నాను. నా యొక్క కించిత్ ధ్యాసచే నా ప్రాణశక్తి అప్రసరణరూపంగా ఆ దేహంలో ఇంకా ఏర్పడియే ఉన్నది. ఆ దేహమును ఉత్తేజ పరచటమెట్లా?

రుద్రగణ సహచరుడు : స్నేహితుడా! మీరు ఆయా దేహములందు చేసి ఉన్న ఉత్తమజ్ఞాన సముపార్జనచే అత్యంత నిర్మలాత్మస్వభావులైనారని అందరూ అనుకుంటున్నారు కదా! మరల మీకు ఆ దేహలీలచే వచ్చే ప్రయోజనమేమున్నది?

వీతహవ్యుడు : నిజమే! నాకు ఆ దేహము గ్రహించుట చేతగాని, త్యజించుట చేతగాని క్రొత్తదైన ప్రయోజనమేమీలేదు. అయితే దేహగ్రహణము ఎట్టిదో... దేహత్యాజ్యము అట్టిదే కదా! కొంతకాలం క్రితం నేను ఆ శరీరంలో ప్రాణమును స్తంభింపజేసి, మనో దేహముతో బయల్వెడలి గణపతిత్వం వంటి ఆయా ప్రారబ్ధనియమాకమైన విధులను నిర్వర్తించాను. ప్రాణములు స్తంభన రూపంగా ఆ వీతహవ్య దేహంలో ఇంకనూ నిలచి ఉన్నాయి. కనుక ఆ దేహము పరమాణు రూపం పొందేంత వరకు ఆ దేహము ధరించి ఆ దేహము యొక్క వినాశనముతో బాటే నేను విదేహముక్తుడనౌతాను. స్వాత్మపదమును పొందుతూ నిర్విఘ్నంగా శాంతిని పొందుతాను.

రుద్రగణ సహచరుడు : మంచిది. మీ అభిమతానుసారం అట్లే అగు గాక! ఆ దేహములోని ప్రాణ శక్తిని తిరిగి ఉత్తేజపరచటం మీరు ఎరిగి ఉన్నదే! అయినా, అడిగారు కదా... చెప్పుచున్నాను. సూర్యమండలంలోని సూర్యగణనాయకుడగు పింగళుని ఆశ్రయించండి. ఆతడే దేహముల ప్రాణశక్తికి అధిపతి. మీరు కోరితే ఆయన తప్పక సహకరిస్తారు. దర్పణంలో ప్రతిబింబం ప్రవేశించినట్లు మీరు సూర్యమండలంలో ప్రవేశించండి. మీకు కార్యసిద్ధి కాగలదు.

❖

అపంచీకృతమగు గణపతి స్వరూపుడైన వీతహవ్యుడు అప్పుడు ఆ సహచరునికి కృతజ్ఞతలు చెప్పి సెలవు తీసుకున్నారు. కొలిమితిత్తిలోని అవకాశంలాగా సూక్ష్మమైనట్టి తన లింగదేహముతో సూర్యమండలములోకి ప్రవిష్టుడయ్యారు.

అప్పుడు మననశీలుడు, ఉదారబుద్ధి యగు సూర్యభగవానుడు తన హృదయంలో ప్రవేశించిన వీతహవ్యమునీంద్రుని చూచారు. ఆతని కోరిక ఏమిటో క్షణంలో తెలుసుకొన్నారు. ఆ మునీంద్రుడు తన పూర్వ – పర దేహములన్నీ మననం చేయుచూ... వింధ్య పర్వత ప్రాంతంలో మట్టిలో కూరుకుపోయి ఉన్న వీతహవ్యదేహంలో ప్రవేశించి, దానిని చేష్టాసహితం చేసి, ఆ దేహపతనానంతరం విదేహముక్తిని ఆశ్రయించాలని ఉద్దేశిస్తున్నాడని గమనించారు. ఆకాశమధ్యంలో ఉండే పింగళుడు అనే తన సూర్యగణనాయకుని పిలిచి అర్థమైన రీతిలో ఆజ్ఞాపించారు.

అప్పుడు వాయురూపమగు వీతహవ్యుని సూక్ష్మశరీర సంవిత్తు పూజ్యాతి పూజ్యుడగు సూర్య భగవానునికి సాష్టాంగదండ ప్రణామం ఆచరించింది. సూర్యభగవానునిచే సన్మానపూర్వకంగా

ఆశీర్వదించబడిన వాడై, ఆ వీతహవ్యుడు స్వకార్య నిర్వహణకు సంసిద్ధుడైయ్యారు. తన దేహం ఉన్న చోటికి పయనిస్తున్న పింగళుని హృదయంలో ప్రవేశించారు. పింగళుడు ఆకాశమును వీడి ఆ శరీరము కూరుకుపోయి ఉన్న చోటికి ప్రవేశించారు. సారసపక్షి బురదనుండి కమలమును తీయునట్లు పింగళుడు బురదలోంచి వీతహవ్యుని భౌతిక దేహం బయటకు తీశాడు.

అప్పుడాముని సూక్ష్మశరీరం పింగళుని హృదయంలో నుండి ఆ భౌతిక దేహంలో ప్రవేశించింది. పింగళుడు తన సంకల్పశక్తిచే తిరిగి ప్రాణములను యథాతథంగా ప్రకోపింపజేసి ఆ తరువాత స్వస్థానమునకు తిరిగి వెళ్ళిపోయారు.

వీతహవ్యుడు ఆ శరీరముతో అక్కడి నుండి లేచి సమీపంలో గల సరోవరం ప్రవేశించాడు. స్నానం ఆచరించి కృతజ్ఞతలతో, భక్తితో సూర్యస్తవంచేశారు. మనోభూషితమగు తన మునుపటి శరీరంతో ప్రకాశించాడు. జీవన్ముక్తులందు స్వతఃసిద్ధంగా ఉండే సమత్వము, పరమశాంతి, మైత్రి, ప్రసన్నత్వము, కరుణ మొదలైన గుణములతో శోభించారు.

సర్వ సంగవినిర్ముక్తమైన మనస్సుగల ఆ ముని అక్కడ నది ఒడ్డున ఒక రోజు గడిపాడు.

❖❖❖

6. ఇంద్రియవర్గ నిరాకరణం

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ ముని అక్కడి నుండి బయలుదేరి వింధ్య పర్వత ప్రాంతంలో తనకు ఇతఃపూర్వం బాగా పరిచయమైయున్న ఒక గుహలో ప్రవేశించాడు. అక్కడ గల ఒక ఎత్తైన శిలపై సుఖాసీనులైనాడు.

❖

వీతహవ్యుడు : (తన అంతరంగంలో) అమ్మయ్య! ఈ ప్రపంచం యొక్క సారాసారమేమిటో ఎరిగినాను. ఇతఃపూర్వమే ఇంద్రియములను, చిత్తమును సమాధానపరచాను కదా! ఇక దీర్ఘ చింతనలతో నాకేమి పని ఉన్నది? కల్పనలన్నిటినీ మృదువైన తీగ త్రుంచినట్లు త్రుంచివేస్తున్నాను. ఇక ఈ ప్రపంచమును, పదునాలుగు లోకములను నా దృష్టి నుండి త్యజించివేస్తాను. ఏకమగు చిన్మాత్ర స్వరూపుడనౌతాను.

ద్వైతమును స్వీకరించనప్పుడు నాకు ఈ జాగ్రత్ సుషుప్తివంటిదే అవుతుంది కదా! అయితే, జాగ్రత్‌రహితస్థితిలో ఆత్మను దర్శించుటకై మేలుకొని ఉంటాను. కనుక, నా సుషుప్తి జాగ్రత్‌తో సమానమౌతుంది. తురీయపదమును అవలంబించి, ఈ శరీరం పతనం అయ్యే వరకు ఆ పదమును వీడను. మనస్సుకు పూర్తిగా అతీతుడనై, ఆ మనస్సు యొక్క సాక్షీతత్వమునందు ప్రవేశిస్తాను. అంతటా వ్యాపించి ఏకమైయున్నట్టి వికారరహితమగు పరమాత్మయందు స్థాణువువలె స్థితిపొంది ఉంటాను.

❖

ఈ విధంగా వీతహవ్యుడు పూర్ణ నిశ్చయుడయ్యాడు. ఆ గుహలోనే ఆరు రోజులు ధ్యానతత్పరుడయ్యాడు. తదనంతరం ఒక బాటసారి చెట్టు క్రింద కొద్ది క్షణములు విశ్రమించి లేచు విధంగా, మరల ఆ సమాధి నుండి మేల్కాంచాడు. సిద్ధుడై, చాలాకాలం ఈ భూమిపై సంచరించాడు.

అట్టి సంచార సమయంలో ఏ వస్తువునూ ప్రశంసించేవాడు కాదు. దేనినీ నిందించేవాడు కాదు. సదా సర్వదా హర్ష శోక భయ రహితుడై ఉండేవాడు. నడచుచున్నప్పుడు, కదలుచున్నప్పుడు, కూర్చుని ఉన్నప్పుడు అతని హృదయంలో మనస్సు విషయమై మథనం కొనసాగుతూ ఉండేది.

❖

అంతర్మథనం -

వీతహవ్యుడు : ఓ చపల శ్రేష్ఠా! మనస్సా! ముందు ముందు కూడా నీవు నా వెంటనంటి ఉండదలచుకుంటే... నాకేమీ అభ్యంతరం లేదు. అయితే నీవు నీ చపలత్వం మాత్రం విడిచిపెట్టవలసి ఉంటుంది. సరియే కదా!

ఓ ఆశా పాశములారా! ఓ ఇంద్రియములారా! ఈ ఆత్మ మీది కాదు. మీరు శిథిలమై కాలముచే మ్రింగబడినప్పుడు కూడా ఆత్మ ఉంటుంది కదా? ఇంక అది మీదెట్లా అవుతుంది? ఆత్మకు మీతో సంబంధము లేదని ఎరిగిన మరుక్షణం మీరు నాచే జయింపబడినవారే అగుచున్నారు. మీరు ఈ ప్రపంచంలో ప్రవేశించి ఆశించేవి, ఆశ్రయించేవీ... అన్నీ కూడా అర్థం లేనివి, వ్యర్థమైనవి అవుతున్నాయి.

మీరు ఆత్మకు చెందరు... ఆత్మ మీకు చెందినది కాదు. విఫలస్వరూపులగు మీరు ఆత్మ స్వరూపుడనగు నాపై దండయాత్ర సలపటమా?... ఎట్లా సాధ్యం? "మేమే సత్యం, మేమే ఆత్మ? మేమే లేకపోతే జీవుడి గతి నిర్గతే" అనే ప్రలాపములు నాకు ఆత్మవిస్మరణ సమయంలో మాత్రమే వినబడుచున్నాయి. 'అనాత్మ యందు ఆత్మత్వం' అంటే అదే. 'వస్తువు నందు అవస్తుత్వం' అంటే కూడా అదే. అవిచారణచే జనించేది విచారణచే నశిస్తోంది.

ఓ ఇంద్రియములారా! కరణ భూతములగు మీరు వేరు. మిమ్ములను అభిమానించు స్వభావముగల జీవులు వేరు. ప్రాణప్రేరితమగు క్రియా కారణత్వము వేరు. భోక్తయగు చిదాభాసుడు వేరు. గ్రహించునట్టి మనస్సు వేరు. అద్వైతమగు బ్రహ్మము వేరు ...ఈ ఆరింటిలో దేనికదే తమ తమ స్వభావము కలిగి ఉండగా, ఎవరి పని వారిదే అయి ఉండగా ఒకదానిని మరొకటి ఎట్లా పరిమితం చేస్తుంది?

❖

అడవిలో పెద్ద పెద్ద వృక్షములు లభిస్తున్నాయి. వాటిని ఛేదించటానికి కంసాలిచే తయారు చేయబడిన గొడ్డలి, బాసిక మొదలైన సాధనములు ఇనుముతో తయారవుతున్నాయి. కొట్టిన చెట్టు కొమ్మలను కట్టి నివాసస్థలానికి తేవటానికి వెదురు చర్మపు త్రాళ్ళు ఉపయోగిస్తున్నాయి. ఇంకా ఏవేవో ఎక్కడెక్కడో లభించే సామాగ్రిని ఉపయోగించగా 'గృహం' తయారవుతోంది. ఈ శరీరం విషయం కూడా అట్టిదే!

కార్యకారణ సంఘాతం చేత కళ్ళు చూస్తున్నాయి. చెవులు వింటున్నాయి... నోరు మాట్లాడుతోంది... చేతులు కదులుచున్నాయి... అల్ప దీర్ఘ ఫలప్రదములగు ఆయా ఇంద్రియములు తమతమ జ్ఞానేంద్రియములచే నియమించబడుచున్నాయి.

కాకతాళీయంగా కార్యవ్యవహారమంతా సిద్ధిస్తోంది. ఈ శరీరవ్యవహారమంతా ఇట్లుండగా... దీని ఆగమన నిష్క్రమణములచే ఎవరికి ఏమి లాభం? ఏమి నష్టం?

❖

ఇప్పుడు అవిద్య పూర్తిగా తొలగిపోయింది. ఆత్మవిద్య సుస్పష్టమయింది. సత్తు అనుకున్నది అసత్తుగానూ, అసత్తు అనుకున్నది సత్తుగానూ తెలిసిపోయింది. విఘ్నములన్నీ ఉపశమిస్తున్నాయి.

ఎప్పటికీ ఉండతగినదేదో ...అది అప్రమేయమై, ప్రాప్తాప్రాప్తములచే స్పర్శించబడనిదై ఎప్పటికీ ఉండియే తీరుతోంది.

ఇక, మిగతాదంతా, ఏది ఎట్లుంటోందో... అట్లే ఉండుగాక! నేను సర్వదా ప్రత్యేకమైన స్వరూపం గల వాడినే. ఈ దేహాదులు, తదితర దేహసంబంధములు నాకు సంబంధించినవి కావు.

అంతేకాదు. నాయందు ఏది తేజోరూపమై వెలయుచున్నదో... అదియే అన్ని దేహములందూ అట్లే వెలయుచున్నది. అందుచేత అందరూ, అన్ని జీవులూ, అన్ని లోకాలూ నా వారే! నావే! నేనే!

అయితే, నాయందు నేను కానిదేమి ఉంటుంది?... నేను కానిదంతా లేనిదే! కాబట్టి 'నీవు-ఆతడు' అనునవన్నీ ఒకే సమయంలో 'నేనే' అయి, 'నేనుకానివి' అయిఉంటున్నాయి.

ఇక మౌనమే నా అనుభవం, స్వరూపం, స్వభావం కూడా!

❖

శ్రీవసిష్ఠ మహర్షి : మునిశ్రేష్ఠుడు, మహాతపస్వి అగు ఆ వీతహవ్యుడు ఈ ప్రపంచంలో సంచరిస్తూనే పునరాగమనరహితమగు బ్రహ్మ పదమున స్థితి పొందారు. చింతారహితుడు, అజ్ఞాన వర్జితుడు అయ్యాడు. అప్పుడు కూడా ఆయా పదార్థములనుండి కలిగే అనర్థములు నివారించటానికి ధ్యాన యోగం అవలంబిస్తూ ఉండేవాడు. సదా ఆత్మ సుఖమును చవిచూస్తూ ఉండేవాడు. ఆయా పదార్థములు, స్నేహాదులు తారసపడుచున్నప్పటికీ ఆతనికి వాటిపట్ల 'త్యాజ్య-గ్రాహ్య' దృష్టి ఉండేది కాదు. మనస్సునందు జనించే ఇచ్ఛ, అనిచ్ఛాదులకు ఆతడు అతీతుడై ఉంటూ ఉండేవారు. ఎల్లప్పుడూ కేవలీభావము (A sense of Absoluteness) అవధరించి ఉంటూ ఉండేవారు. "నాకు జన్మ కర్మలు ఉండవు" అను ఎరుకచే సంసారపరిత్యాగము కాగా, అప్పుడు శేషించియున్న బ్రహ్మానందమునందు తేలియాడుతూ ఉండేవాడు.

అట్లు చాలా రోజులు గడచిన తరువాత ఆయన పర్వతములోగల ఒక గుహలో ప్రవేశించారు. మహనీయులు తమ అభ్యాసమును విడువరు కదా! ఒక్కసారి మరల ఈ జగజ్జాలమంతా వీక్షించ టానికి ఆ గుహలో ఆసీనులై పద్మాసనమువైచుకుని... తనలో తాను ఇట్లు ప్రసంగించుకోసాగారు.

❖

వీతహవ్యముని : ఓ రాగమా! నీ విప్పుడు ఆత్మానురాగత్వము పొందుము. ఓ ద్వేషమా! నీవిక నిర్ద్వేషిత్వం పొందుము. మీ ఇద్దరితో ఇప్పటికే చాలాకాలం క్రీడించాను కదా!... ఇక చాలు.

ఓ భోగములారా! మీ అందరికి ఇదే తుది నమస్కారం. తల్లి తండ్రులచే పిల్లవాడు లాలించ బడినట్లు... మీచే కోట్లాది జన్మలుగా లాలించబడ్డాను. ఇక చాలు, మీతో సమాగమం. ఇక ఉపశమించండి.

ఓ ఇంద్రియ విషయములారా! మీ శబ్ద – స్పర్శ – రూప – రస – గంధ స్వరూపములతో పరమ పదమగు ఈ వర్తమాన నిర్వాణ గతిని మరిపించటానికి ప్రయత్నించకండి. మీకో నమస్కారం.

ఓ ప్రియమిత్రమా! దుఃఖమా! నీవు నాకు అనేకసార్లు 'రోదన' కలిగింపజేశావు. అయినా నీవు నాకు ప్రియమిత్రుడవే. ఎందుకంటే, నీచే సంతృప్తుడనైన నేను ఆదరముగా ఆత్మను అన్వేషించాను. ఈ ఆత్మమార్గోపదేశంలోకి నన్ను ప్రేరేపించింది నీవే. నీకు మరల మరల నమస్కరిస్తున్నాను. మేడపైకి వెళ్లువాడు మార్గంలోని మెట్లను వదలునట్లు నేను నిన్ను ఇక్కడే త్యజిస్తున్నాను. నీ కృపచే ఆత్మపదం లభించింది. 'దుఃఖము' అనే పేరుతో పిలువబడుచున్నప్పటికీ, చివరకు సుఖమునే ప్రాప్తింపజేసిన ఓ నేస్తం! నీకు జోహార్లు. కృతజ్ఞతలు.

ఈ ప్రపంచమున అసారమగు జీవితం కలిగియున్న దేహమనే సహచరుడా! - ధ్యానము, యోగసాధన మొదలైనవాటి యందు నీవు నాకు గొప్ప ఉపకరణమువై సహకరించావు. నీ సహాయంతో నాకు ఆత్మ సామీప్యత లభిస్తోంది. నీవు సాధనపరులకు మంచి మిత్రుడుగాను, దుర్వ్యసనపరులగు సత్‌సాధనరహితులకు చెడ్డ మిత్రుడుగానూ అవుతూ ఉంటావు. నీయొక్క, నాయొక్క, వియోగం అనాదియగు నియతియొక్క స్వభావమే అయిఉన్నది కదా! ఒక జీవుడు 'స్వార్థ గతి'ని ఆశ్రయించినా, లేక, 'పరమార్థగతి'ని అభిలషించినా... ఒకనాటికి నీతో వియోగం తప్పునది కాదు. అనేక జన్మలుగా నీతో సంయోగ, వియోగములు అనుభవిస్తూ వచ్చాను. ఆత్మ జ్ఞానవశంచేత నీతో అవినాభావత్వానికి హాని కలుగుచున్నది.

ఆత్మభావం నాకందించి, తద్వారా, నీకు నీవే సమర్పణ చేసుకుంటున్నావు. నీత్యాగం మరింకెవరికి వస్తుంది? నిన్ను మరింకెవరూ నాశనము చేయుట లేదు. నిన్ను నీవే నాశనమొనర్చు కొనుచున్నావు.

ఓ తృష్ణగారూ! - నేను శాంతిని పొందుచుండగా, నీవిక ఒంటరిదానివై శుష్కించుచున్నావా? నీ వలన ఎవరికీ శాంతి ఉంటుంది? అందుచేత నీవు ఉపశాంతి పొందటంలో లోకమునకు శుభకరమే. కనుక సెలవు.

ఓ కామమా! - నీ వినాశనము కొరకై నేను అభ్యాస – వైరాగ్యాదులను ఆశ్రయించాను. నీవు ఉన్నంతకాలం తదితర జీవులకు నేను అశాంతిని, ఖేదమును కలిగించాను కదా! నీవు ప్రకోపించుటచే నేను అనేక ఉపాధులు నష్టపరుచుకున్నాను. ఇప్పుడిక మనిద్దరికీ శాశ్వత వియోగం సంభవించబోతోంది. చాలా సంతోషమైన, పవిత్రమైన క్షణములివి. కనుక ఇక శాంతించు.

ఓ నా సుకృత దేవతలారా! - మీకు నమస్కారం. మీరు నన్ను అనేక నరకములనుండి లేవనెత్తి 'తపస్సు, ధ్యానము' అను స్వర్గలోకమునకు తీసుకొని వచ్చారు. అందుకు కృతజ్ఞతలు. అయితే, నేను సుకృత, దుష్కృతముల పరిధిని అధిగమించి యోగమార్గంలో ఆత్మావలోకనమును సమీపిస్తున్నాను. తద్వారా కృత్యములన్నీ అధిగమించి కృతకృత్యుడనగుచున్నాను. మీకు నా కృతజ్ఞతలు.

ఓ పాపవృక్షమా! - నీవు "దుష్క్రియలు" అనే క్షేత్రంలో పుట్టావు. "ఇంద్రియ పటాటోపములు" అనే వాయువు ఆస్వాదించావు. 'దుష్ట అపకార బుద్ధి' అనే బురదలో పెరిగావు. కోపం – ఆవేశం – ద్వేషం – దురవగాహన – అపరిపక్వదృష్టి – మదం – మాత్సర్యం మొదలైన బురదసారాన్ని స్వీకరించి ఇంతకింత అయ్యావు. నరకయాతనలు, అధమ ఉపాధులు అనే పూలను పూచావు. 'నీచ జన్మలు – అజ్ఞాన దశలు – అల్ప క్రియలు' అనే కాయలుగల నీతో కూడి అనేక జన్మలు గడిపాను. నేనెప్పుడైతే కళ్ళు తెరచి గురువులను, జ్ఞానులను, శాస్త్రములను శరణువేడానో మరుక్షణం నీవు ఎండిపోవటం ప్రారంభించావు. ఇప్పుడు నీవు చచ్చి మోడుబారి ఎండిపోయిన చెట్టుగా అయిపోవటం ముదావహం. ఆత్మను దర్శించిన తరువాత నీలో ఉండే కొంచెం చావకూడా చచ్చిపోయింది. ఇక కూకటి వ్రేళ్ళతోసహా నీవు నేలకూలినట్లే.

ఓ మోహమా? - ఆత్మను దర్శించుచున్న ఈ శుభతరుణంలో నీ నీడకూడా కనిపించటం లేదు. వెలుతురు ఉన్నచోట చీకటి ఉండజాలదు కదా! వెలుతురు లేకపోవటమే చీకటియొక్క నిర్వచనమయినట్లు, అఖండమగు నా ఆత్మయొక్క స్వభావం ఎరుగకపోవటమే నీయొక్క నిర్వచనం. అందుచేత, ఆత్మ సద్విమర్శనామాత్రంచేత నీవు రహితమగుచున్నావు కదా! మంచిది.

తపస్విని వంటి ఓ పర్వత గుహా ! - నీవు వీణానాదము వంటి ప్రతి ధ్వనులతో నన్ను మౌనంగా పలకరించేదానివి. నేను సమాధిలో ప్రవేశించియున్నప్పుడు నన్ను సఖిలాగా సేవించావు. ఆకులు నాపై వ్రాలుచున్నప్పుడు నీ పలకరింపుల చిలకరింపులవలె అనిపించేది. పూర్ణానందస్వరూపమగు ఆత్మయందు విశ్రాంతి కలుగజేయుటద్వారా నాకు మహోపకారం చేశావు. నీ సహకారంతో నాలోని లోభమంతా నశించింది. నాకు స్నేహితునివలె సఖివలె ఇంతకాలం ఉన్నావు. అనేక సంకటములచే ఖిన్నుడనై సమాధి విఘ్నములచే ద్రవీభూతుడనై ఉన్న సమయంలో నిన్ను ఆశ్రయించి, సమీపించాను. అర్ధనారీశ్వరుడగు శివుని ఆశ్రయించి భక్తులు ఉత్తమ ఫలితం పొందినట్లు, నేను నిన్ను ఆశ్రయించి మహదానందమగు ఆత్మావలోకనం పొందాను. నీవు చేసిన సహాయం ఏమని వర్ణించగలను? నీకు శుభమగుగాక!

ఓ దండమా (చేతి కఱ్ఱ)! - నేను అడవులలోనూ, గోతులలోనూ సంచరిచేటప్పుడు నాకు ఆలంబనమయ్యావు. వార్ధక్యంలో పరమ మిత్రుని వంటి నీకు కృతజ్ఞతలు.

ఓ దేహమా! - "అస్థి పంజరము – రక్తము – రోమములు – ప్రేగులు" ఇవే కదా, నీ ముఖ్యతత్త్వమంతా? నీవు వాటిని గ్రహించి ఏ క్షణమైనా నీ ప్రకృతిలో ప్రవేశించవచ్చు. నాకేమీ అభ్యంతరం లేదు. నీ నుండి చమట మొదలైన జలప్రకోపములు, మలము మొదలైన దుర్గంధములు

బయల్వెడలుచుండగా... నిన్ను పవిత్రం చేస్తూవస్తున్న జలము మొదలైన వాటికి ఇవే కృతజ్ఞతలు. భోజన, శయన క్రియలకు సహకరించిన పదార్థ, ఉపకరణ సమూహములకు కూడా నా కృతజ్ఞతలు. నీకు అందించిన ఆహార పదార్థములను తయారు చేయటంలో శ్రమించిన సకల సహజీవులకూ ఇవే నా కృతజ్ఞతలు. నీవిప్పుడు ఉండినా, ఊడినా నాకొక్కటే!

ఓ ప్రాణములారా! - మీరు నా పూర్వకాలిక సహజమిత్రులు కదా! ఇప్పుడు నేను చేస్తున్న మిత్రుల వందన క్రమమునకు మీరు కూడా అర్హులే. మీతోకూడి నేను అనేక విచిత్రయోనులందు విశ్రమించాను. పర్వత కుంజములలోనూ, లోకాంతరములలోనూ విహరించాను. సిద్ధుల క్షేత్రము లలో ప్రవేశించాను. అనేక కార్యవిలాసములలో పాల్గొన్నాను. వివిధమార్గములలో సంచరించాను. వెయ్యేల? ఈ ప్రపంచంలో మీతో కూడి అనుభవించని పదార్థములేమున్నాయి? ప్రియమిత్రులగు ప్రాణములారా? మిమ్ములను ఎంతో కాలం పట్టి ఉంచాను. ఇప్పుడు మీరు మీ ఇష్టం వచ్చినప్పుడు మీ ప్రకృతిలోకి పోయి లీనమగుటకు స్వతంత్రం ఇస్తున్నాను. నేను బ్రహ్మముతో ఐక్యత పొందుచున్నాను కదా!

సమస్తమూ అయి ఉన్న ఓ ప్రాణములారా! ఏది ఎచ్చోట పుట్టినా, చివరికి నశించి స్వస్థానం పొందవలసిందే కదా! ఇప్పుడు ఉన్నతములైనవి మరొకప్పటికి నిమ్నస్థానం చేరుచున్నాయి.

సంయోగముచే ఏర్పడినవన్నీ ఒకనాటికి వియోగంపొంది తీరవలసిందే. ఇక మన వియోగము కొరకు వగచవలసిన పనేమున్నది?

ఓ నేత్రప్రకాశమా! నీ స్వస్థానమగు సూర్యమండలము ప్రవేశించెదవుగాక!

ఓ ఘ్రాణేంద్రియమా! నీవు నీ నిజాశ్రయమగు భూమిని జొచ్చెదవు గాక!

ఓ కర్ణేంద్రియములారా! మీరు మీ ఆకాశబిలమునందు లయమొందెదరుగాక!

ఓ జిహ్వేంద్రియమా! నీయొక్క రసశక్తి జలమయమగు చంద్రమండలమున ప్రవేశించుగాక!

పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, పంచ ప్రాణములు వాటివాటి ప్రకృతియందు లీనమగుగాక!

ఆత్మయే అయిఉన్న నేను సూర్యుడులేని వెలుగువలె, తుపాను తాకిడిలేనట్టి సముద్రజలంలాగా, మేఘరహితమగు ఆకాశము చందమున, తైలంలేని దీపం మాదిరి, కల్పాంతమందలి సృష్టినిబోలి, ప్రశాంతమును పొందుచున్నాను. ఓంకారార్థమాత్ర యొక్క లక్ష్యభూతమైన బ్రహ్మరూపమునందు ఐక్యత సంపాదించుకుంటున్నాను... సర్వకార్యపరంపరా వర్జితుడనగుచున్నాను... సర్వ దృశ్యాతీతుడ నగుచున్నాను.

మనస్సును అధిగమించి ఉచ్చైస్వర్యముతో 'ఓంకారము'ను ఉచ్చరిస్తున్నాను. మనస్సుకు అతీతుడ నగుచున్నాను. బ్రహ్మరంధ్రమున సర్వశాంతిని అనుసరించుచూ బ్రహ్మాచారిత్వమును పొందుచున్నాను. శాంతుడనై, మోహరహితుడనై ఆత్మయందు పూర్ణరీతిగా స్థితిని సంపాదించు కొనుచున్నాను.

❖❖❖

7. నిర్వాణము

శ్రీవసిష్ఠ మహర్షి : ఇట్లు మననవర్జితుడై, సర్వ ఇచ్ఛలు త్యజించినవాడై, ఆ వీతహవ్యమునీంద్రుడు పెద్ద స్వరముతో, ఓంకారం సుదీర్ఘంగా ఉచ్చరించసాగారు. క్రమంగా ఆరవ, ఏడవ భూమికను అధిరోహించారు. స్వహృదయమందే సర్వ సమమగు బ్రహ్మముయొక్క ప్రాప్తిని దర్శించసాగాడు. ఆ వీతహవ్యుడు 'అ' కార, 'ఉ'కార, 'మ'కార, 'అర్ధ' మాత్రలకు సంజ్ఞలైనట్టి "స్థూల – సూక్ష్మ – అవ్యాకృత – తురీయ" పాద భేదములచే ప్రణవమును స్మరిస్తూ ఉన్నారు. "విరాట్ – హిరణ్యగర్భ – అవ్యాకృత" లక్షణములు గల తురీయమును భావన చేయసాగాడు.

మొట్టమొదటగా – "జాగరిక స్థానమున బహిర్‌ప్రజ్ఞ కలదు" అను అధ్యారోపణ చేతనూ, "అంతఃప్రజ్ఞగానీ, బహిర్‌ప్రజ్ఞగానీ లేదు" అను అపవాదముచేతనూ ...ఈ ముల్లోకములనూ, వాటి ఉత్పత్తి స్థానములతోసహా త్యజించివేశాడు.

సంకల్పములచే కల్పాంతమువరకూ కల్పించబడిన ఈ స్థూల – సూక్ష్మ – కారణముల యొక్క బాహ్యాభ్యంతరములన్నీ వీక్షించసాగాడు. ఆయన దర్శించుచున్న శుద్ధతత్త్వమగు ఆత్మ అవ్యయమైనది. ప్రకాశ, అంధకారరహితమైనది. సూర్య – చంద్ర – నక్షత్రములు లేనట్టి నిర్మలాకాశమును పోలి ఉన్నది.

ఆయనిప్పుడు స్వయముగా క్షోభరహితుడై చింతామణి వలె, పూర్ణ చంద్రుని వలె, చలనము ఉడిగిన చక్రము వలె ప్రకాశించుచున్నారు. శాంతి, నిర్మల, పూర్ణ సముద్రము వలె తురీయాత్మ యందు స్థితి కలిగియున్నాడు.

వాయువు గంధమును త్యజించునట్లు ఆతడు ఇంద్రియతన్మాత్రజాలమును త్యజించివేశాడు. క్రమంగా 'దీర్ఘ ప్రణవనాదము' అనే సూత్రమును కూడా త్యజించాడు. ఒక ప్రాజ్ఞుడగు బుద్ధిమంతుడు తననుండి రాగమును త్యజించినట్లు, ఆకాశము చీకటిని త్యజించి వెలుగు సంతరించుకుంటున్నట్లు ఆ మహాముని తనయందలి తమోగుణమునంతటినీ త్యజించివేశాడు.

❖

ఆ తరువాత ఆతని హృదయంలో ఒకానొక ప్రకాశం ఆవిర్భవించింది. అరనిముషకాలంలో ఆయన ఆ ప్రకాశమును కూడా త్యజించివేశాడు.

అప్పుడాతని హృదయంలో తమస్సుగానీ, ప్రకాశముగానీ లేవు. తమఃప్రకాశ రహితమైనట్టి స్థితిని పొందిన ఆతనియందు కల్పనాహేతువైనట్టి కించిత్ మనస్సు స్ఫురించింది. ఆ స్వల్ప ఛాయారూప మనస్సును కూడా ఆతడు అర్ధనిమిషంలో ఛేదించివేశాడు.

అటు తరువాత గాలిలేనిచోట దీపంగా స్ఫుటప్రకాశరూపము పొందాడు. అప్పుడాతని యందు కొద్దినెలల వయసుగల పసిబాలునిలో ఉండేటంతటి పరిజ్ఞానము మాత్రమే శేషించియున్నది. ఆ పరిజ్ఞానమును కూడా మరొక అర్ధనిమిషంలో త్యజించివేశాడు.

దీనినే "చైతన్యము విషయదశను పరిత్యజించటం" అనికూడా అంటారు. ఈ విధంగా... సాక్షిమాత్రంగా శేషించు స్థితిని పొందాడు. ఆ పదమునే శాస్త్రములు "పశ్యంతి" అను శబ్దముచే ఏకీస్థితిగా విశ్లేషించారు. ఆ తరువాత సుషుప్త పదమును అవలంబించి పర్వతమువలె నిశ్చలుడయ్యాడు.

❖

మహాసమర్ధుడగు ఆ ముని అప్పటినుండి జగత్‌రహితమైన సుషుప్తిపూర్వక జాగ్రత్‌ను పొందుచూ అచ్చటనే స్థిరంగా ఉండిపోయాడు. ఆ తరువాత తురీయ పదమును పొందాడు. ఆ తురీయపదంలో విషయానందరహితుడైనప్పటికీ, స్వస్వరూపానంద సహితుడైనాడు. అన్యసత్తారహితుడైనప్పటికీ ఆత్మ సత్తాసహితుడైనాడు. వాక్కు అగోచరమగు స్థితి పొందాడు.

ఆ స్థితిలో ప్రకాశ్యవిషయమే ఉండదు కదా! అది 'చిన్మయము' అని చెపుతారు. ఇది సర్వమునకూ కేవల సాక్షీభూతమైనది. "ఇది కాదు... ఇది కాదు నేతి, నేతి" అనుకుంటూపోగా, చిట్టచివరకు శేషించేది అదే. సమము, విశాలము, పరమపవిత్రము, సర్వజీవులకు అంతర్గతము అదే. ఆయన సర్వ వివర్జితమగు బ్రహ్మరూపుడయ్యాడు.

ఏది శూన్యవాదులకు శూన్యమో, బ్రహ్మవేత్తలకు బ్రహ్మమో, విజ్ఞానవాదులకు విజ్ఞానమో, సాంఖ్యవాదులకు పురుషుడో, యోగవాదులకు ఈశ్వరుడో, శైవులకు శివుడో, వైష్ణవులకు విష్ణువో, ఆత్మవేత్తలకు ఆత్మయో, సౌతాంత్రిక, వైభాషికులకు నైరాత్మ్యమో, మాధ్యమికులకు చిత్ – అచిత్‌ల మధ్యలోగల నిర్విషయస్థితియో, జీవన్ముక్తులకు సర్వ రూపమో – అట్టి సద్రూపము ఆతడే అయి... చెన్నొందుచున్నాడు. షట్‌శాస్త్ర సిద్ధాంతసారమై సర్వహృదయస్థమై, స్వస్వరూపమై, సర్వవ్యాపకమై, సర్వరూపమైనట్టి సద్రూపమే ఇప్పుడాతడు. సర్వధా నిష్క్రియమై, సూర్యుడు మొదలైన స్వప్రకాశక వస్తువులను కూడా ప్రకాశింపజేయునదై, నిజానుభవమైనట్టి సద్రూపమే ఆతడు.

ఉపాధి భేదంచేత అనేక రూపుడు కూడా తానే అయ్యాడు.

మాయా భేదం చేత రాగయుక్తుడై ఉంటున్నది కూడా తానే. సర్వరూపుడు, సర్వమునకు భిన్నమైనవాడు తానే అగుచున్నాడు. "సర్వరూపములు తానై, 'సర్వసాక్షి' అను రూపంగా వేరై".... ఉన్నవాడయ్యాడు.

చూచావా... రామా! ఆ విధంగా ఆ వీతహవ్యమహాముని ముక్తుల దృష్టిలో చూస్తే, మనం చెప్పుకుంటున్నట్లు జన్మ జరావర్జితము, అనాది, ఏకము, విమలము, నిష్కళంకము అయినట్టి ఆత్మ సంస్థితుడే అయ్యాడు.

ఇక బుధుల దృష్టిలో ఈశ్వరుడే ఆతడు. కార్యభేదములచే అనేక రూపులైనదంతా ఆతడే. సర్వకళారహితుడై, సర్వులకు వందనీయుడైనాడు. ఓం నమో వీతహవ్యాయనమః

❖❖❖

8. విశ్రాంతి

శ్రీవసిష్ఠ మహర్షి : ఆ విధంగా సంసారసీమాంతరమును పొంది, సర్వ దుఃఖములూ దాటివేసిన ఆ వీతహవ్యముని పూర్ణమనో నాశనముచే పరబ్రహ్మమున విలీనుడైనాడు. ప్రశాంతిని, పరమ తృప్తిని పొందాడు. సముద్రంలో జలబిందువు ఉన్నట్లు, పరిణామ రహితమగు స్వాత్మ పదమున స్థానం పొందాడు.

శ్రీరాముడు : మహర్షీ! ఆయన శరీర స్థితి ఎట్లున్నది?

శ్రీవసిష్ఠ మహర్షి : చెపుతాను విను. ఆతడు సంపూర్ణముగా ఆత్మానుభవ సమన్వితుడైనాడు కదా! ఇక ఆతనిచే అంతవరకూ ఉపయోగించబడిన భౌతిక దేహం యజమానిలేని ఇల్లులాగా నీరసం పొందింది. చేష్టారహితమై మ్లానత పొందింది. ఆ దేహము నుండి ప్రాణములు బయల్వెడలి ఆకాశంలో లీనమైనాయి. దేహములో గల పంచభూతములన్నీ పంచమహాభూతములందు విలయం చెందాయి. మాంసము, బొమికలతో కూడిన జీర్ణ శరీరశేషము చైతన్య సాగరమున ప్రవేశించింది. రక్త – మాంస – మేధ – మజ్జాది ధాతువులు సప్తధాతువులందు విలీనమయ్యాయి. శరీరమునందలి తత్వములన్నీ వాటివాటి కారణములందు లయించాయి. వీతహవ్యుని స్వస్వరూపము స్వయం ప్రకాశరూపమై పరమవిశ్రాంతిని పొందింది.

❖

ఓ రాఘవా! నీవు కూడా వీతహవ్యమహామునిలాగానే విచారణ చేయి. చక్కగా ప్రదీపితమై ఉన్న ఆత్మతత్త్వమును దర్శించి, అద్దాయనిందు ఆరూఢుడవై విశ్రాంతి పొందుము.

❖

ఇప్పటివరకు ఈ వీతహవ్యుని గాథ ఈ 14 రోజులుగా నీకు చెప్పినదీ, చెప్పుచున్నదీ, చెప్పబడబోయేదీ – ఇదంతా నేను స్వయముగా విచారణ చేసి చూచినది సుమా! త్రికాలదర్శిని, చిరంజీవిని అవటం చేత ఇవన్నీ స్వయంగా సందర్శించి, నీకు చెప్పుచున్నాను. నాకు అనుభవమైనదే నీకు చెప్పటం జరుగుతోంది కాని, ఏవో ఊహ, అపోహలపై ఆధారపడి కాదు. నీవు కూడా ఆయా మహనీయులవలె నిర్మల దృష్టిని అవలంబించి జ్ఞానమును పొందుము. జ్ఞానముచే మాత్రమే ముక్తి లభించగలదు.

జ్ఞానాన్నిర్దుఃఖతామేతి జ్ఞానాదజ్ఞానసంక్షయః ।
జ్ఞానాదేవ పరాసిద్ధిర్నాన్యస్మాద్రామ వస్తుత ॥ (శ్లో 12, సర్గ 88)

అజ్ఞానం నశించాలంటే జ్ఞాన సముపార్జన ఒక్కటే మార్గం. జ్ఞానము చేతనే పరమసిద్ధి లభించగలదు. యథార్థానికి జ్ఞానముకంటే ఉత్తమమైనది ఇంకొకటేదీ ఉండదు.

మునీశ్వరుడగు వీతహవ్యుడు జ్ఞానముచేతనే ఆశలన్నీ తెగత్రెంచివేశాడు. జ్ఞానం చేతనే చిత్తమును చూర్ణం చేయగలిగాడు.

శ్రీరాముడు : స్వామి ! ఇప్పుడు వీతహవ్యునకు, జగత్తుకూ గల సంబంధమెట్టిది?

శ్రీవసిష్ఠ మహర్షి: ఆ వీతహవ్యుని సంవిత్తు, లేక, శుద్ధజ్ఞానతత్త్వము స్వహృదయమైనట్టి బ్రహ్మమునందే ఈ జగత్తును గాంచుచున్నది. అనగా “జగత్తు అనునది నాయొక్క సంకల్ప ప్రయోజనమేగాని మరింకేమీ కాదు” అనునట్టి చ్యుతిలేని ఎరుకను కలిగి ఉంటోంది.

శ్రీరాముడు : ఇప్పుడాతనికి తనకు మాత్రమే సంబంధించిన ఒక ప్రత్యేక జగత్తు ఏమైనా ఏర్పడి ఉన్నదా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఇప్పుడు వీతహవ్యుడు సర్వదా ఏర్పడియున్న నిత్యసత్యమును అనుభవించుచున్నాడు. ఇక్కడ వాస్తవ, నిత్య సత్యమేమిటి!

నేత్రము మొదలైన ఇంద్రియములకు ఇక్కడ తారసపడుచున్నదంతా మనస్సుయొక్క కల్పనయే కదా! ఈ నేను, నీవు, శరీరము, పదార్థములు – అంతా కూడా మనోస్వప్న మాత్రమే. ఈ జగత్తంతా మనో మాత్రమే అయి ఉండగా ఇక దీనియందు స్వకీయమైనదేది? పరకీయమైనదేది? వీతహవ్యునిలో కల్పన అంతా రహితమైపోయింది. పరమార్థమును ఆతడు పొంది ఉన్నాడు. ఇప్పుడు అతని యందు రాగద్వేషముల ఛాయ కూడా లేదు. అభిమానము, కామ్య కర్మలు మొదలైన మాలిన్యంలేదు. వాటివలన కలిగే ఇంద్రియవికారాలు లేవు. స్థూల – సూక్ష్మ – కారణ శరీరాలు కూడా లేవు. తజ్జనితమైన సంగములు లేవు. శోకరహితుడు, వివేకియు అగు ఆతడు స్వస్వరూపభూతమగు నిర్మలాత్మతత్త్వమును సాక్షాత్కరించుకుని మౌనం వహించి ఉన్నాడు. అంతే. ఇక అంతకుమించి చెప్పాలంటే ఆతడు వాక్ అతీతుడని గ్రహించు.

❖❖❖

XII. ఉపశమన ప్రకరణము - సమీక్ష

1. యోగుల దేహ - మనముల వైచిత్ర్యం

శ్రీవసిష్ఠ మహర్షి : రామచంద్రా! ఈ ఉపశమన ప్రకరణంలోనూ, ఇంతకు ముందటి ప్రకరణాలలోనూ మనం చెప్పుకున్న అనేకమంది మహనీయుల అంతిమానుభవమును గమనిస్తున్నావు కదా! నీవు కూడా ఆత్మజ్ఞుడవై, రాగ - ద్వేష - భయ వర్జితుడవై ఈ ప్రపంచమున విహరించు.

మహాధీమంతులగు జ్ఞానులు కొందరు రాజులై రాజ్యభారం నిర్వర్తిస్తున్నారు. మరికొందరు మునులై లోక కళ్యాణార్థం అనేక సంరంభములతో కూడి యజ్ఞ యాగాదులు నిర్వర్తిస్తున్నారు.

ఓ రఘురామా! ఇక్కడ కనబడే సుఖదుఃఖ క్రమములచే ఆత్మ ఎన్నడూ వశీభూతం కాదు. అట్టి సర్వవ్యాపియగు ఆత్మయే నీవై ఉండగా ఇక ఖేదమెందుకు? వ్యర్థంగా దుఃఖములు పొందవలసిన పనేమున్నది? అనేకులగు ఆత్మజ్ఞానులు ఆయాస్థితులందు ఈ ప్రపంచంలో సంచరిస్తున్నారు. కానీ వారు దేనిని చూచీ దుఃఖం పొందటం లేదు. దేనికొరకూ శోకించుట లేదు. నీవు కూడా స్వస్థుడవై ఉండు. సర్వత్యాగివై, సముడవై, సుఖవంతుడవై ఉండు. ఆత్మవంతుడవగు నీకు ఈ జన్మా లేదు. మరొక జన్మా లేదు. సింహాలు నెమళ్ళకు వశం కావటమేమిటి? జీవన్ముక్తులు, సర్వం ఎరిగినవారూ అగు మహాత్ములు ఏది ఎట్లున్నప్పటికీ హర్ష క్రోధాది వికారాలకు వశులు కారు. కాబట్టి ఖండత్వము త్యజించి అఖండత్వము నాశ్రయించు.

శ్రీరాముడు : ఈ సందర్భంలో నాదొక చిన్న సందేహం. మనం ఇప్పటివరకు చాలా మంది జీవన్ముక్తుల గురించి చెప్పుకున్నాం. వారిలో కొంత మందిలో ఆకాశగమనము మొదలైన దివ్యశక్తులు కనిపించటం లేదు. మరికొందరిలో కనిపిస్తున్నాయి. జీవన్ముక్తులయందు అతీంద్రియశక్తులు ఉంటాయా? ఉండవా?

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రఘుకుల తిలకమా! రామచంద్రా! ఆకాశగమనము మొదలైన సిద్ధులు దేనికి సంబంధించినవి? అగ్ని యొక్క ఊర్ధ్వజ్వలనం లాగా అవన్నీ పదార్థములకు సంబంధించిన స్వాభావిక శక్తులే కదా! ఇక్కడ తారసబడే భౌతిక, అతీంద్రియ శక్తుల విచిత్ర వ్యవహారమంతా పదార్థ స్వభావం మాత్రమే! అందుచేత ఆత్మజ్ఞులైనవారికి క్రొత్తవి పొందాలనిగాని, ఉన్నవి తొలగాలని గాని అభినివేశం ఉండదు.

ఒకానొకడు ఆత్మజ్ఞాని కాకపోవచ్చు. ముక్తుడు అవకపోవచ్చు. అయినప్పటికీ మణి, ఔషధము మొదలైన ద్రవ్యశక్తులు కలిగియుండుటచేతనూ, యోగాభ్యాసం మొదలైన ఆయా క్రియాశక్తులచేతనూ "ఆకాశగమనము, మాయమవటం, ప్రత్యక్షం కావటం" మొదలైన సిద్ధులు పొందగలుగుతాడు. అంతమాత్రం చేత ఆతడు ఆత్మజ్ఞుడు అని అనిపించుకోడు.

'ఆత్మజ్ఞుడు' అంటే ఏమిటి?... "స్వయముగా ఆత్మచే ఆత్మను ఎరిగి, ఆ ఆత్మయందు సంతృప్తుడై ఉండువాడు" అని కదా! ఆత్మజ్ఞుడు అవిద్యవైపు పరుగులెందుకు తీస్తాడు? ఈ ప్రపంచంలో పదార్థము లన్నీ అవిద్యామయములే అయిఉన్నాయి. అవిద్యను త్యజించిన ఆత్మజ్ఞాని భౌతిక విషయములగు అతీంద్రియశక్తులలో మునిగి ఉంటాడా! ఊహూ!

శ్రీరాముడు : అతీంద్రియశక్తులు ఎట్టి వారికి లభిస్తాయి? ఆత్మజ్ఞాని వాటిపట్ల ఎట్టి ఉద్దేశం, అభిప్రాయం కలిగి ఉంటాడు?

శ్రీవసిష్ఠ మహర్షి : ఒకడు ఆత్మజ్ఞాని అయిఉండకపోయినప్పటికీ, ద్రవ్య - కాల - క్రియాదులచే శాస్త్రోక్తంగా ప్రయత్నిస్తే 'ఆకాశగమనము' మొదలైన విద్యలు తప్పక లభిస్తాయి.

ఇక ఆత్మజ్ఞాని విషయమంటావా?... ఆతడు సమస్తమునకు అతీతుడై ఇచ్ఛారహితుడై ఉంటాడు. "ఇది కావాలి... పొందితేనే నేను సంపూర్ణుడనైనట్లు" అని సంభ్రమము కలిగియుండడు. ఆతనికి ఆకాశగమనములచే గాని, సిద్ధులచే గాని, తుచ్ఛమగు భోగములచే గానీ, ప్రభవములచే గాని, గౌరవ, ప్రతిష్ఠ, మాన్యాదులచే గాని, జీవన మరణములచే గాని క్రొత్తగా అభిలషించవలసిన ప్రయోజనమేమీ కనబడదు. ఆత్మజ్ఞుడెప్పుడూ నిత్యసంతోషి అయి, శాంతచిత్తుడై, రాగరహితుడై, వాసనావర్జితుడై, నిత్యసంతృప్తుడై ఉంటాడు. ఒకవేళ ఒక ఆత్మ జ్ఞానిలో అతీంద్రియ శక్తులు ఉండటం సంభవించినప్పటికీ వాటిని ఆతడు ప్రారబ్ధవిశేషములు మాత్రంగానే చూస్తాడు. ఆకాశము వలె ఆతడు ఏ భౌతిక వస్తువుచేత పరిమితుడవకుండా మహదాకారము కలిగి, ఆత్మయందే నెలకొని ఉంటాడు. ఆతనికి జీవన్మరణముల పట్ల కూడా సంగము ఉండదు. సంసారస్వభావ యుక్తంగా ఇక్కడ సంభవిస్తూ ఉండే ఆకస్మిక సుఖ దుఃఖములచే ఆతడు తన స్వాభావికమైన తృప్తిని వీడకయే ఉంటాడు. ప్రతికూల-అనుకూల ప్రారబ్ధములు తారసపడుచున్నప్పుడు, వాటిని ఒక వైపు చూస్తూ కూడా... మరొకవైపు "అఖండాకార వృత్తి" అనే పుష్పాలతో ఆత్మను పూజిస్తూనే ఉంటాడు. నదుల నుండి వచ్చే నీరు సముద్రంలో లయమైపోవునట్లు, సర్వ అనుభవములూ అతనిని సమీపించి లయమైపోతాయి గాని, పునర్వృత్తులకు కారణం కాజాలవు.

నైవతస్య కృతేనార్థో నాకృతేనేహకశ్చన ।
నచాస్య సర్వభూతేషు కశ్చితర్థతవ్యపాశ్రయః ॥

"ఇది నేను చేశాను. నాకొచ్చిన ప్రయోజనమేమున్నది? ఇది చేయలేదా? ఎట్లా?" - అనునట్టి ప్రయోజన ప్రత్యవాయువులు (Benefit - Eventualities) ఆతని దృష్టిలో ఉండవు. సర్వభూతములందూ ఆశ్రయించవలసినదంటూ ఆతనికేదీ ఉండదు.

ఓ రామా! ఒకడు ఆత్మజ్ఞానరహితుడైనప్పటికీ సిద్ధులను అపేక్షించి సాధకద్రవ్యాదులతో, మంత్ర నియమాదులతో ప్రయత్నిస్తే ఆతనిని ధనం సంపాదించటంలో నిమగ్నమైనవానితో పోల్చ వచ్చు. ధనికుడైనంత మాత్రంచేత ఒకడు ఆత్మజ్ఞాని అగుచున్నాడా? లేదే! అట్లాగే సిద్ధులు సంపాదించి నంత మాత్రంచేత ఒకనిని ఆత్మజ్ఞానిగా నిర్ధారణ చేయలేం. అందుకే శాస్త్రజ్ఞులు 'సిద్ధులు సంపాదించటం - ఆత్మజ్ఞానం' ...ఈ రెండూ వేరు వేరు విజ్ఞాన శాఖలుగా చూస్తూ ఉంటారు.

"మణి, మంత్రము మొదలైన యుక్తుల చేత ఆకాశగమనాది సిద్ధులు లభిస్తాయి" – అనేది ఆయా శాస్త్రములలో ప్రసిద్ధమైయున్న నియతిక్రమం అయి ఉన్నది. అట్టి నియతి క్రమమును దేవతలుగాని, మరింకెవ్వరైనా గాని మరొక విధంగా చేయజాలరు. దేవతలకు, పక్షులకు, తదితర కొన్ని జీవ జంతుజాలమునకు ఆకాశగమనాది సిద్ధులు వస్తు స్వభావంగా స్వతఃసిద్ధంగానే ఏర్పడుచూ ఉన్నాయి. చంద్రుడు తన శీతలత్వము త్యజిస్తాడా? సూర్యుడు తన కిరణాలలోని ఉష్ణమును వదలి ఉంటాడా? అవన్నీ కూడా వాటి వాటి నియతిని వదలకయే ఉంటాయి కదా! సర్వజ్ఞుడైనా, మహాజ్ఞుడైనా, మరెవ్వరైనా నియతిని అనుసరించే చరిస్తూ ఉంటారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరు లంతటివారు కూడా నియతికి లోబడే లోకములను పరిపాలిస్తూ ఉంటారు.

కనుక రామా! నీవు చెప్పిన ఆకాశగమనాదులన్నీ ద్రవ్య, కాల, క్రియా, మంత్రప్రయోగ అభ్యాసముల స్వాభావిక సిద్ధులని గ్రహించు. అంటే ఏమిటో చెపుతాను ...విను.

విషం ఉన్నదనుకో, అది 'ప్రాణులను చంపుట' అనే పాదార్థికధర్మం కలిగి ఉంటోంది. మద్యము 'మత్తు కలిగించుట' అను ధర్మమును కలిగి ఉంటోంది. తేనె 'పైత్యము మొదలైన రస దోషములను నిగ్రహించుట' అనే ధర్మం కలిగియున్నది. అలాగే ఉమ్మెత్త ఫలములు కొన్ని మానవ శరీర దోషములను నివారిస్తాయి. అవన్నీ ఆయా పదార్థముల ధర్మములు.

అట్లాగే ఆ శరీరంలో కొన్ని గూఢ శక్తులు ప్రకృతిచే పదిలపరచబడిఉన్నాయి. యోగముచే, ద్రవ్య, కాల, క్రియాదుల సహాయంతో ప్రాణములను కేంద్రీకరించుటచే ఆయా సిద్ధులు సాధకునకు లభిస్తాయి. శరీరంలోని కొన్ని కేంద్రస్థానాలలో ప్రాణములను ప్రతిక్షేపించి యోగాభ్యాసం చేయుటచే శరీరం గాలిలో తేలియాడగలదు. దూరశ్రవణము, భవిష్యత్ గ్రహణము, దూరంగా ఉండి ఆశ్రితులకు రోగనివారణం చేయటం మొదలైనవి కూడా అట్టి యోగాభ్యాసకులకు సాధ్యపడగలవు. అయితే...

ఆత్మజ్ఞాని ద్రవ్య, క్రియా, కాల రూపముగల అవిద్యకు పరమైన అభ్యాసం కలిగియుంటాడు. అఖండము. అప్రమేయము, నిత్యము అగు స్వస్వరూపాత్మయే ఆతని సాధనయొక్క సాధ్యము కదా! అందుచేత ఆతడు సిద్ధుల విషయంలో కర్తృత్వాకర్తృత్వములు వహించి ఉండడు. ఎందుకంటే, ఈ ద్రవ్య, దేశ, కాల, క్రియాదులన్నీ కూడా "తత్త్వజ్ఞాన జనితమైనట్టి పరమాత్మ పదము"నకు ఉపయోగ పడేవికావు. అయితే, కొందరికి సమగ్ర సృష్టి చమత్కారమును అనుసరించి ప్రకృతిచే సిద్ధులు ప్రసాదించ బడుతూ పరమాత్మకు సంబంధించినవని గమనించి, తాను ఇచ్ఛారహితుడై ఉంటాడు.

ఇక మరికొందరో... అట్టి సిద్ధుల పట్ల 'పొందాలి' అను రూపముతో కూడిన ఆవేశం కలిగి ఉంటారు. ఎవనికైతే కోర్కెలు ఉంటాయో, ఆతడు మాత్రమే సిద్ధులు సంపాదించటానికి ప్రయత్నపరుడై, ఆవే పరుడై తాపత్రయపడుతూ ఉంటాడు. కోర్కెలే ఆత్మజ్ఞాన సముపార్జనలో విఘ్నకరములు కదా!

ఇక ఆత్మజ్ఞాని ఎల్లప్పుడూ పరిపూర్ణుడై ఉంటాడు. కనుక ఆతనికి ఎట్టి కోర్కెలూ ఉండవు. సర్వ కోర్కెలూ శమించగా, ఆత్మలాభోదయం అయిన తరువాత... ఇక, తద్విరుద్ధమైన అల్పలాభముల పట్ల ఆసక్తిగాని, కోరికగాని ఎవరికుంటుంది? సర్వ సహజీవులను తన ఆత్మ యందు, సర్వ జీవుల యందు తన ఆత్మను సదా సందర్శిస్తూ ఉంటాడు.

జ్ఞాని విషయంలో కావచ్చు, అజ్ఞాని విషయంలో కావచ్చు... ఒక్క మాట మాత్రం నిజం. ఒకడు తనకు ఎట్టి ఇచ్ఛ జనిస్తుందో, అట్లే ప్రయత్నములు చేస్తూ ఉంటాడు. ప్రయత్నం కొనసాగుతుంటే కాలక్రమేణా అద్దానినే పొందుతాడు. ఇప్పుడే మనం వీతహవ్యమహా ముని విదేహముక్తి గురించి చెప్పుకున్నాం కదా! ఆతడు జ్ఞానాభిలాషి అయి, జ్ఞానము కొరకే ప్రయత్నించాడు. జ్ఞానాభ్యాసం కొరకు వింధ్యారణ్యం ప్రవేశించాడు. జ్ఞానమును పొందాడు. మధ్యలో ఎక్కడా విరమించలేదు. కనుక.... పొందవలసినది పొందాడు. అట్లాగే సిద్ధులు (Supernatural powers) కూడా. అవన్నీ ఆయా జీవులు ఇచ్ఛతో దేశ, కాల, క్రియాదియుక్తులచే ప్రయత్నించి సముపార్జించుకునేవే. అవన్నీ ప్రయత్నరూప వృక్ష ఫలములే. అయితే, ఆత్మ సుఖం పొందే మహాత్ముల దృష్టిలో అవన్నీ అల్పకాలిక స్వల్పవిషయములే అయి ఉంటున్నాయి.

మహతాం నిత్యతృప్తానాం తజ్జ్ఞానాం భావితాత్మనామ్ ।
ఈహితం సంప్రతానాం నోపకుర్వన్తి సిద&ధయః ॥ (శ్లో 38, సర్గ 88)

ఓ రామా! నిత్యతృప్తులును, భావితాత్ములును, అభిలషితమగు ఆత్మసుఖమును పొందినవారును అగు ఆత్మజ్ఞాలైన మహాత్ములకు సిద్ధులేమియు ఉపకరింపవు.

శ్రీరాముడు : హే మహర్షీ! మీ సమాధానంతో నేను ఎంతో తృప్తి పొందాను. మనం 'ఉపశమన ప్రకరణం' సమీక్షించుకుంటున్న సందర్భంలో ఇప్పుడే మీరు చెప్పి ఉన్న 'వీతహవ్య అంతర్ మథనం'లో నాకు కలిగిన రెండు సందేహాలు మీ ముందుంచాలని ఉన్నది.

శ్రీవసిష్ఠ మహర్షి : సంతోషం. అడుగు.

శ్రీరాముడు : 1. వీతహవ్యుని దేహం వింధ్య పర్వత ప్రాంతంలోని ఆతని పర్ణశాల సమీపంలో బురదలో చిక్కుకుని 300 సంవత్సరాలు ఉన్నది కదా! అంతకాలం ఆతని దేహం హింసక జీవులచే ఎందుకు భక్షింపబడలేదు?

2. వీతహవ్యుడు దేహభావం విడచి సమాధిలోకి వెళ్ళి, ఆ సమాధి ఉపసంహరించటానికి ముందే మనస్సుతో ఏవేవో అనుభవాలు పొందాడు. శరీరం తిరిగి పొందటానికి ముందే విదేహముక్తి పొందవచ్చు కదా? మరల సూర్యుని ఆరాధించి భౌతిక దేహం ఆశ్రయించటం దేనికి? అట్లాగే దేహంలో ప్రవేశించిన మరుక్షణమే విదేహముక్తి పొందవచ్చు కదా! మరల ఒక గుహలో ప్రవేశించి ఇంద్రియములు, చిత్తము మొదలైన వాటితో సంభాషించి, ఆ తదుపరియే విదేహముక్తిని ఆశ్రయించ వలసిన పనేమున్నది!

శ్రీవసిష్ఠ మహర్షి : అందుకు కారణము లేమిటో చెపుతాను... విను.

యోగాభ్యాసము లేని జీవునియొక్క సంవిత్తు అనేక రాగద్వేషములతో కూడిన మలిన వాసనలు కలిగిఉంటుంది కదా! తత్ఫలితంగా అట్టి జీవుల దేహములు "దుఃఖించుట, ఆవేశకావేషాదులు పొందుట – నీరసించుట" మొదలైన దీనస్థితి పరంపరలన్నీ పొందవలసివస్తోంది. అయితే, ఉత్తమ జ్ఞాన – యోగములచే అవిద్యాంశము నశిస్తోంది. యోగముచే ప్రాణములను ఏకాగ్రపరచిన సాధకుల భౌతిక శరీరం వారి సంకల్పానుసారం వజ్రంవలె అభేద్యమౌతూ ఉంటుంది.

శ్రీరాముడు : ఎట్టి యుక్తిచే యోగి యొక్క శరీరం 'ఛేదన' మొదలైనవి పొందక, వజ్రీభూతమౌతుంది? అట్టి యోగయుక్తి లేక, ప్రాణనిష్ఠ యొక్క రూపమెట్టిది? అది అందరికీ సాధ్యపడుతుందా? లేక, కొందరికి మాత్రమేనా?

శ్రీవసిష్ఠ మహర్షి : ప్రాణశక్తికి – మనస్సుకు – భౌతిక దేహమునకు ఒకానొక విచిత్రమైన సంబంధం ఉన్నది. ఆ సంబంధమును అనుసరించే వీతహవ్యుని దేహంలో ప్రాణములు సంచలన రహితమైనప్పుడు సూక్ష్మత్వం పొందటం, దేహం దీర్ఘకాలం శిథిలం కాకపోవటం, మనస్సు ప్రారబ్ధ కర్మలు అనుభవించి తిరిగి శరీరంలో ప్రవేశించటం, మనస్సు శరీరంలోకి అడుగుపెట్టగానే ప్రాణాలు పునఃసంచలనం ప్రారంభించటం, శరీరం ఉత్తేజమవటం – ఇవన్నీ జరిగాయి. ప్రాణశక్తిని ఎరిగిన యోగులకు ఈ విషయాలు సుపరిచయాలే. ఈ విశేషాలు మనం ఉత్పత్తి ప్రకరణంలో కొన్ని సందర్భాలలో ప్రస్తావించుకోవటం జరిగింది. ఇప్పుడు సందర్భోచితమే కనుక, ఈ శరీర – మనో – ప్రాణాలకు ఏర్పడి ఉన్న పరస్పర సంబంధముల విషయమై కొన్ని విశేషాలు చెపుతాను. అప్పుడు నీ మొదటి సందేహం తొలగగలదు.

❖

చిత్తము జీవునిలో ఉండే ప్రియ, అప్రియముల స్వభావం చిత్రీకరిస్తూ ఉంటోంది. మనస్సు మననస్వభావం జీవుని నడిపిస్తూ ఉంటుంది.

చిత్తము ఎప్పుడెప్పుడు ఏ పదార్థములందు సంలగ్నమై ఉంటుందో, అప్పుడప్పుడు అది ఆయా పదార్థముల రూపమే పొందుతూ ఉంటుంది. ఈ చిత్తము, "ఈతడు నాకు అయిష్టుడు" అని భావోద్వేగం పొంది ఒకనిని చూస్తున్నప్పుడు ఆతడి అనేక కదలికలు అట్టి అయిష్ట వికారములను మనస్సుకు కలిగిస్తాయి. "ఇతడు నాకు స్నేహితుడు, ఇష్టుడు" అని అనుకుంటుంటే అతని అవే కదలికలు, చర్యలు సంతోషమును కలుగజేస్తూ ఉంటాయి. ఈ విషయం అందరికీ అనుభవమయ్యే విషయమే.

ఒక రాగద్వేష రహితుడైన బాటసారి త్రోవలో పొలములను, వృక్షములను చూస్తున్నప్పుడు ఎట్టి మనోవృత్తులకూ లోనుకాడు. అట్లుగాక, ఆయా రాగద్వేష మనోవృత్తులతో సంతప్తమైన చిత్తము గలవాడు ఆ బాట నుండి వెళ్ళుచున్నప్పుడు, "ఈ చెట్లు మావి, ఆ పొలం ఒకప్పుడు మాది, ఈ స్థలం మా ఊరివారిది, ఇక్కడి తోటలు మా బంధువులవే, ఆ తోపులు వేరే వర్గం వారికి చెందినవి" – అను మనోవికారములన్నీ పొందుతాడు. ఇది కూడా అందరికీ ప్రతిరోజూ అనుభూతమయ్యే విషయమే.

అట్లాగే తనకు రుచించే పదార్థములను చూచిన మనస్సు చపలం పొందుతుంది. వెంటనే ఆ చంచల మనస్సు దేహంలో కొన్ని వృత్తులను, భౌతిక సంఘటనలను కలిగిస్తుంది. ఆ దేహం అందుకు ప్రతిస్పందిస్తోంది. ఆ విధంగానే అదేవ్యక్తి తాను ద్వేషించే చూచాడనుకో... ఆతని మనస్సు అరుచి, ఏహ్య వృత్తులు పొందుతుంది. ఆ వృత్తులు ఆతని దేహంలో వికారాదులు

కలిగిస్తూ ఉంటాయి. ఈ విధంగా మనస్సుకు, భౌతిక దేహానికి ఏర్పడే పరస్పర ప్రవృత్తి ప్రభావాలు అందరు ఎరిగినవే.

ఇప్పుడు ఈ చిత్తవృత్తులు తదితరులపై ఎట్టి ప్రభావం కలిగిస్తాయో గమనిద్దాం. ఒక జీవుడు 'దయ, ప్రేమ'వంటి ప్రవృత్తులను మరల మరల ప్రకటించుటచే, ఆతడు కాలక్రమేణా తదితరులపై కూడా ఒకానొక ప్రభావము కలిగి ఉంటాడు. అనగా తదితర జీవులు కూడా ఆతనిని దయ, ప్రేమలకు అర్హుడుగా గాంచుతారు. అట్లాకాకుండా, ఈ జీవుడు ద్వేష – ఆవేశ – క్రోధాదులు మరల మరల ప్రకటించుటచే అట్టి జీవుడు అదే రీతి అయిన ప్రతి స్పందనకు అర్హుడగుచున్నాడు. ఈ విధంగా ఆయా వృత్తులు అదేవిధమైన అసంకల్పిత ప్రతిస్పందనలుగా తదితరులపై ప్రభావిత మవుతూ ఉంటాయి. ఎందుచేత?

ఒక చిత్తము యొక్క అంతర్గత వృత్తులు అదేవిధమైన సంస్కారములతో కూడిన తదితర చిత్తములలో ప్రతిబింబపూర్వక ప్రభావమును కలిగి ఉంటూ ఉంటాయి కాబట్టి!

ఇప్పుడు మనం రాగ – ద్వేష – వైషమ్య రహితుడగు యోగి విషయానికి వద్దాం. సంవిద్విలాసం చేత (Presence of Pure - Self) పూర్ణమానసుడగు యోగి శరీరముపై హింసక జీవుల చిత్తము ప్రసరిస్తున్నదనుకో... అప్పుడు తేలు, కీటకం మొదలైన ఆ హింసక జీవుల చిత్తము నందు యోగి యొక్క సంవిత్తు ప్రతిబింబించగానే అవి 'సమత్వము'అనే అనుభవమును పొందుచున్నాయి. అనగా వాటిలో హింసించు స్వభావము ఉపశమించి, 'సాత్వికము, శాంతము' రూపు దిద్దుకుంటున్నాయి. ఒక యాత్రికుడు మార్గ మధ్యంలోని 'దేవాలయం, యోగుల ఆశ్రమం' మొదలైన పవిత్ర విషయాలను చూస్తున్నప్పుడు తన లోని సాంసారిక ఉద్వేగమును మరచి కించిత్ సాత్వికతతో వినమ్రుడగుచున్నాడు. అట్లాగే హింసించు స్వభావం గల జీవులు ఆ యోగి యొక్క సంవిత్తు ప్రభావం చేత దైవీ గుణముల వైపుగా ప్రభావితమై ఉంటాయి. మహనీయులగు ప్రశాంతపురుషుల ఆశ్రమాలలో (పురాణాలలో వర్ణించిన కణ్వమహర్షి ఆశ్రమం మొదలైనవి) సింహము, పులి, పాము, తేలు మొదలైన స్వాభావిక హింసక జీవులు శాంతి, అహింస, ప్రేమలను వహించటానికి ఇదియే హేతువు. సమదర్శియగు యోగి యొక్క సంసర్గముచే అవన్నీ రాగ ద్వేషములనుండి విడివడుచున్నాయి. అట్టి కారణం చేత వీతహవ్యుని శరీరమును సమీపించిన కీటకాదులు కుట్టటం, హింసించటం, భక్షించటం మొదలైన స్వాభావిక క్రియలందు ప్రవృత్తం కాలేకపోయాయి.

ఆ హింసక జీవులు ఆ స్థానం విడచి దూరం వెళ్ళగానే మరల తమ స్వాభావికమగు హింసించు స్వభావమునందు ప్రవృత్తమౌతూ ఉంటాయి.

గమనిస్తున్నావా, రామచంద్రా! ఉదాహరణకు, ఒకడు తన సహజీవులపట్ల అకృత్రిమమైన – స్వభావసిద్ధమైన ప్రేమ, కరుణ దైనందికంగా అభ్యసిస్తున్నాడనుకో. ఆతని పట్ల సహజీవులు కూడా అదేరకంగా అకృత్రిమమైన, స్వభావసిద్ధమైన ప్రేమతో అసంకల్పితంగా స్పందిస్తూ ఉంటాయి. కోపంగా ఉండే స్వభావం గలవారు, తిరిగి అసంకల్పితంగా కోపగించబడతారు. ఒకని గుణములే

తిరిగి ఆ గుణముల ప్రతిస్పందనకు సహకారికారణములు అగుచూ ఉంటాయి. ఈ రీతిగా ఈ జీవుడు తనకున్నదే తాను పొందుచున్నాడు సుమా!

కారణం?... ఒకే చిత్ శక్తి అన్ని జీవులలోనూ ప్రసరించి ఉన్నది కదా! అందుచేత జీవులన్నీ ఒకదానిచే మరొకటి పరస్పరం స్వస్వభావానుసారం ప్రభావితమవటం సహజమే!

శ్రీరాముడు : జీవమున్నచోటే చిత్ శక్తి అజీవుని మనస్సునందు ప్రతిబింబిస్తుందా? లేక, చిత్ శక్తి (ఆత్మతత్త్వం) 'జీవం, మనస్సు' లేని చోటకూడా ఏర్పడియే ఉంటుందా?

శ్రీవసిష్ఠ మహర్షి : చిత్ శక్తి అంతటా ఆక్రమించియే ఉన్నది. కొయ్య, మట్టి, శిల, లోహం –అన్నిటి యందూ సత్తా సామాన్యరూపమున చిత్ శక్తి ఏర్పడి ఉండనే ఉన్నది. అయితే కాష్ఠ – లోష్ఠ – శిలాదులందు మూగబాలుని వలె మౌనరూపమున ఉంటోంది. సూర్యకాంతి అంతటా ప్రసరించి ఉన్నప్పటికీ సూర్యబింబం జలంలో మాత్రమే ప్రతిబింబిస్తూ ఉంటుంది చూచావా? అట్లాగే ఆ చిత్ శక్తి కేవలం పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, మనో, బుద్ధి యుక్తము అగు సూక్ష్మ శరీరమునందు మాత్రమే మనోచంచలనసహితమై, పరిచ్ఛిన్నమై కన్పట్టుచున్నది.

❖

పై కారణాల చేత 'నిర్వికారస్థితి, బ్రహ్మభావన' పొందిన ఆ వీతహవ్యుని దేహం సర్వత్రా సమరూపమున ఉన్న భూజలాదులందలి సంవిత్తు యొక్క ప్రతిభచే, వికారములు పొందక నిశ్చలమై భూమిలో ఉండిపోయింది.

ఓ రామచంద్రా! ఈ విషయంలో నీకు మరొక యుక్తి కూడా చెపుతాను విను. అసలు దేహం శిథిలం అవటానికి కారణమేమిటి?... అంతఃకరణము యొక్క 'చేష్ట'లేక 'స్పందన' దేహ శైథిల్యమునకు, నాశనమునకు కూడా కారణమగుచున్నది.

దానినే మనం 'శరీరము యొక్క చేష్ట' అను అభిప్రాయంతో చూస్తూ ఉంటాం. అట్టి స్పందన రూపమగు 'దేహనాశనము' అనే వికారం ప్రాణజనితములగు జగద్వ్యవహారములలో మనకు ప్రసిద్ధమై కనబడుతోంది.

ప్రాణశక్తి యొక్క దేహాంతర్గతమగు స్పందమే (చలనమే) దేహచలనము (జీవనము). ప్రాణశక్తి యొక్క దేహాంతర్గతమగు అస్పందమే దేహనిస్తేజము (మరణము).

అయితే, అట్టి ప్రాణముల చలనము ఉపశమింపబడి, దేహంలో ఒక స్థానంలో యోగుల చేత ఉద్దేశపూర్వకంగా కేంద్రీకరించబడినప్పుడు, సంచలన రాహిత్యం చేత ఆ జీవుని ఆ ప్రాణములు శిల వలె దృఢీభూతమై ఉంటాయి. అట్టి కేంద్రీకృత ప్రాణముల ప్రభావం చేతనే వీతహవ్యుని భౌతిక శరీరం ఎట్టి మార్పు పొందకుండా దీర్ఘకాలం ఉండిపోయింది.

బాహ్యమున హస్తపాదాదులతోనూ, అభ్యంతరమున ప్రాణములతోనూ కూడిన ఈ శరీరం ప్రాణవాయువుల స్పందనచేతనే ప్రవర్తిస్తోంది. ప్రాణవాయువుల స్పందనమే 'చిత్తము యొక్క

బీజము' అని కూడా గ్రహించు. ఎవనియందైతే ప్రాణవాయువుల స్పందన యోగాభ్యాసం చేత నిరోధించబడి, సుస్థిరీకరించబడి ఉంటుందో – అట్టివాని దేహమునకు వృద్ధి క్షయాలు ఉండవు. అట్లు ప్రాణముల బాహ్య, అభ్యంతర స్పందనము ఉపశమించినప్పుడు దేహమున ఉన్న చర్మము, మాంసము మొదలైన ధాతువులు తమ స్థితిని ఎన్నడూ వీడకయే ఉంటాయి. అనగా, యోగముచే స్థంభింపబడిన ధాతువులు ప్రాణసంచలనము నిరోధించినప్పుడు మేరువువలె స్థిరత్వం పొందుతాయి. అట్టి ధీరులగు యోగుల శరీరములు కాష్ఠములాగా (కొయ్యలాగా) స్థిరమై, అచంచలత్వం పొందుతాయి. అప్పుడు తదితర ప్రాపంచిక జీవులకు ఆ శరీరం చంచలత్వం లేని మృతదేహపు అవయవములవలె కన్పట్టుచూ ఉంటుంది. కానీ, ఆ యోగి ప్రాణశక్తి యొక్క ప్రత్యుత్సాహం మౌనసంకల్ప రూపంగా దేహము నందు దాగి ఉంటుంది.

ఈ కారణంచేత యోగుల శరీరములు వందల, వేల సంవత్సరములు కూడా నీటిచేత తడవక, భూమియందు శిలలాగా శిధిలముకాక ఉండగలవు.

❖

ఇప్పుడు నీ రెండవ ప్రశ్నకు వద్దాం. "జ్ఞానశ్రేష్ఠుడగు ఆ వీతహవ్యుడు శరీరంలో తిరిగి ప్రవేశించకుండా కైలాసం నుండే విదేహముక్తిని ఆశ్రయించవచ్చు కదా?" –అని ప్రశ్నించావు కదా?

ఆత్మజ్ఞానులు, వీతరాగులు, మహాధీమంతులు, సర్వసంసారగ్రంథులు ఛిన్నమైనట్టివారు అగు మహాత్ములు తమ దేహం విషయంలో సర్వస్వతంత్రులై ఉంటారు. అట్టి యోగులగు తత్వజ్ఞుల మనస్సు కాకతాళీయ న్యాయముచే ప్రారబ్ధంగా ప్రాప్తించి ఉన్న ఆయా విధులందు భావన కలిగి ఉండటం స్వభావసిద్ధంగా ఏర్పడి ఉంటోంది. ఈశ్వరశక్తి గాని, మరింకే శక్తి గాని ఆ యోగి యొక్క వర్తమాన, పూర్వజన్మల ప్రారబ్ధశేషానుభవమునకు అనుకూలంగానే ప్రవర్తిస్తాయి. దానిని మరింకెవరూ మరొక విధంగా తీర్చిదిద్దలేరు. ఇది ఎట్లా అంటే, సర్వమునకు అతీతత్త్వము సముపార్జించుకున్న జ్ఞాని కూడా ఒక ఉపకారికి ప్రత్యుపకారం చెయ్యాలని అనుకోవటం వంటిది.

ఆ వీతహవ్యుని సంవిత్తు కాకతాళీయంగా "నేను నా పూర్వప్రాణ సహిత వీతహవ్యదేహంలో ప్రవేశించి మరికొంత విచారణ చేస్తాను. ఆ తరువాత విదేహముక్తిని ఆశ్రయిస్తాను" అను సంకల్పమును ప్రారబ్ధానుసారంగా ఆశ్రయించింది. అందుచేతనే రుద్రగణంలోని సహచరుని సంప్రదించి సూర్య భగవానుని శరణువేడింది. ఆ సంవిత్తు "నాకు నేనుగా శరీరంలో ప్రవేశిస్తాను" అని అనుకోకపోవటానికి కారణం కూడా ప్రారబ్ధ శేషమే. సంవిత్తు ఇతఃపూర్వపు స్వయంకల్పితమగు ప్రారబ్ధమును అనుసరించే వర్తించటము ఈ చరాచర సృష్టి నియతి యొక్క చమత్కారమేనని అనుకోవాలి. యోగమును పరాకాష్ఠ వరకు ఆశ్రయించి ఉండుట చేతనే ఆతడు శరీర త్యాజ్యం విషయంలో సర్వస్వతంత్రుడైనాడు. వాసన సంపూర్తిగా రహితమై ఆతడు సర్వబంధముల నుండి వినిర్ముక్తుడై "నేను అఖండము, అప్రమేయము, నిత్య ఆత్మనే" అనునట్టి ఆత్మరూపమున ఆవిర్భవించారు. అట్టి స్థితిలో 'సదేహం, విదేహం' –అన్నీ ఆతని సర్వస్వాతంత్ర్య స్వభావమును అనుసరించే ఉంటాయి.

ఆతడు సర్వ శక్తియుతుడగు పరమేశ్వరుడే అయ్యాడు. అందుచేత ఆతడు దేనిని వాంఛించాడో దానినే శీఘ్రంగా పొందటం జరిగింది. విచారణచే చిత్తము నశించగా "మహామైత్రి, మహాకరుణ" – మొదలైన మహత్తర గుణములు ఆతనికి స్వభావసిద్ధం అగుచున్నాయి. ఓం నమో వీతహవ్య పరమేశ్వరాయనమోనమః

❖❖❖

2. చిత్తోపశమనం

శ్రీవసిష్ఠ మహర్షి : చూచావా రామా! మనం ఈ ప్రకరణంలో ముఖ్యంగా గమనించవలసినదేమిటి? చిత్తము ఉపశమిస్తే జీవునకు సర్వ శుభములు కలుగుతాయి. ఎక్కడ చిత్తము నశిస్తే, అక్కడే 'మైత్రి, కరుణ' మొదలైన సద్గుణములన్నీ స్వతఃగా ఉత్పన్నమై ప్రకటితమౌతాయి. అనగా అవి 'స్వాభావ సిద్ధత'ను సంతరించుకుంటూ ఉంటాయి.

శ్రీరాముడు : హే మహర్షీ! ఒకనిలో తీవ్రము, సూక్ష్మము అగు ఆత్మవిచారణచే చిత్తము ఆత్మయందు లయించిందనుకోండి. అప్పుడాజీవుడు నిర్వికారుడు, నిర్విషయుడు అవుతాడు కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : అవును.

శ్రీరాముడు : అప్పుడిక 'మైత్రి, కరుణ' మొదలైన గుణములు ఉత్పన్నమవటానికి చోటు ఉంటుందా? చిత్తమే ఉండనప్పుడు, గుణములెక్కడ ఉంటాయి? మరి అట్టి గుణములు ఉత్పన్నమౌతాయని ఎట్లా చెప్పుచున్నారు?

హే మహావక్తా! మునిశ్రేష్ఠా! ఒకసారి చిత్తము బ్రహ్మమునందు లయమయిన తరువాత ఇక ఆపై మైత్రి కరుణ మొదలైన గుణములు కలిగేది ఎద్దానికి?...

లయించిన చిత్తమునకా? లేక అధిష్ఠానమగు ఆత్మకా? కాక, అధిష్ఠానమగు ఆత్మలోనా? లేదా, బింబరూపమగు చైతన్యమునందా? కాదా, 'చిదాభాసుడు' అనబడే చైతన్య ప్రతిబింబమగు జీవాత్మయందా?...

ఈ విషయం దయచేసి విశదపరచండి. ఎందుకంటే... "మృగతృష్ణలోని జలం గడ్డకట్టి ఉన్నది, మరొక చోట ప్రవాహపతితమై యున్నది" అను వ్యతిరిక్త వాక్యాలులాగా చిత్తమే ఉండనప్పుడు ఇక గుణముల ప్రసక్తి ఎక్కడిది?

శ్రీవసిష్ఠ మహర్షి : పూర్ణము, సుఖ స్వరూపము అగు ఆత్మ సంవిత్తు ఒకానొక సమయంలో ఒక చోట మలిన వాసనాజాలము కలిగి ఉంటోంది. అట్టి మలిన వాసనా జాలము జన్మ సమూహములకు, సుఖదుఃఖ భరిత అధ్యాసలకు కారణమగుచున్నది.

'మలినవాసనలు' – అంటే ఏమిటి?... "నేను ఈ శరీరమును. శరీర పరిమితుడను. ఈ శరీరంలో గల ఇంద్రియములే నా ఉనికి. ఈ ఇంద్రియ విషయములచే నేను బద్ధుడను. ఇంద్రియాలు

లేకుంటే నాకు ఉనికి (సత్) లేదు. ఇంద్రియములు ఉంటే, వాటి విషయములచే నియమితుడ నగుచున్నాను.” ...ఇట్టి దృష్టిని ఆత్మ సంవిత్తు కలిగి ఉంటోంది. అదియే అజ్ఞచిత్తము. అదియే మలినమగు మనస్సు. అదియే సంసారము యొక్క రూపము. ‘జీవుడు’ అనగా అట్టి అజ్ఞాన దృష్టి, మనస్సు గల చిదాత్మయే కదా!

మరల చెప్పుచున్నాను. అజ్ఞాని యగు జీవుని యందు వాసనా జాలముచే ఏదైతే దృఢంగా ప్రతిష్ఠించబడియున్నదో... అద్దానిని మనస్సు అని చెప్పుకుంటున్నాం. అట్టి మనస్సు సమరూపం పొందినప్పుడు అట్టి జీవుని మనం జీవన్ముక్తుడు అని అంటున్నాం. దోషపూరితమగు మనస్సు నశిస్తేనే ఈ జీవుడు బంధభావములనుండి విడివడగలడు.

శ్రీరాముడు : మహాత్మా! నశించే మనస్సేది? నశించని మనస్సేది? అసలు మనస్సు అనేది నశిస్తుందా? మనస్సు నశిస్తే ఆ జీవునకు వ్యవహారసామర్థ్యం ఉంటుందా? మనస్సు నశించిన తరువాత మైత్రి, కరుణ మొదలైనవి ఎట్లా ఏర్పడి ఉంటాయి?

శ్రీవసిష్ఠమహర్షి : ప్రశ్నించువారిలో ఉత్తముడవగు, ఓ రామచంద్రా! ఇప్పుడు నీకు ‘మనో నాశనము’ లేక, ‘చిత్తోపశమనము’ అంటే ఏమిటో విశదపరుస్తాను. అప్పుడు నీ సందేహాలన్నీ పటాపంచలౌతాయి.

❖

ఒకడు ఒక పెద్ద కొండను సమీపించి నోటితో ఊదుతూ ఉంటే... ఆ కొండ రెపరెప లాడుతుందా? ఏ ధీరుడైతే తనకు తారసపడే ఆయా సుఖదుఃఖ దశలు వచ్చిపోతున్నంత మాత్రం చేత తన యొక్క అఖండ – అప్రమేయ, నిత్య, నిర్మల ఆత్మ భావననుండి చ్యుతుడు కాడో – అట్టివాని చిత్తము, లేక మనస్సు నశించినట్లే. ఏ విజ్ఞాన సమన్వితుడినైతే ‘ఈ అల్ప దేహమే నేను. తదన్యంగా మరింకేమీ గాను’ అను రూపంగల దేహాత్మభావన ప్రభావితమై ఉండజాలదో – ఆతనికి చిత్తము లేనట్లే. పునర్జన్మ కారకమగు సాంసారిక భావన ఉన్నప్పుడే దానిని ‘చిత్తం’ అని పిలుస్తాం. ఎప్పుడైతే చిత్తము ఆత్మ స్వభావమును సంతరించుకుంటుందో ఇక అది ఆత్మస్వరూపమే అవుతుంది.

సంసారమున్న చోటే చిత్తము ఉంటుంది. సంసారము రహితమైతే ఇక అది ‘చిత్’యే అవుతుంది. దానిని మనం చిత్తము అనిపిలువం. కనుక ‘చిత్తం లయించింది’ అన్నంత మాత్రంచేత “ఆలోచనలన్నీ అంతమై ఆతడు నిష్క్రియుడు అవుతాడు” – అని అనుకోవద్దు. “సర్వ ఆలోచనలకు ఉత్పత్తి స్థానమైన స్వాత్మస్థానము నందు ప్రతిష్ఠితుడౌతాడు” అని గ్రహించు.

❖

చిత్తము నశించినవాని యందు “ఆపద, సంపద, విపత్తు, మహోత్సవం’ వంటివన్నీ కొండను తాకే పిల్లగాలుల వలె బాహ్యస్థమైపోతాయి. ఈ ప్రపంచ విషయములన్నీ వాటి రాక పోకలతో సహా అప్రభావితమగునప్పుడే ‘చిత్తము రహితమైనది’ అని శాస్త్రములు అంటున్నాయి.

చిత్తము యొక్క రూపమేమిటి? మూఢత్వం కలిగి ఉండటమే. పరమార్థమును వదలి దృశ్యమును మననం చేస్తూ కార్య కారణములకు అధీనమయి ఉండుటయే దృశ్యతాదాత్మ్యం. మూఢత్వం

తొలగితే మేఘాలు తొలగినప్పటి సూర్యుని వలె సత్త్వభావం పూర్ణంగా ఉదయించగలదు. అట్టి సత్త్వభావము నుండి చ్యుతి పొందనప్పుడు చిత్తము రహితమైనట్లే. జీవన్ముక్తుడు సత్త్వభావమును ఆశ్రయించి ఉంటాడు. ఆతనిలో శేషించే దృశ్యవ్యవహారమును 'శుద్ధ చిత్తము' అని కూడా అంటారు.

❖

శుద్ధ చిత్ స్వభావుడు - "శుద్ద చిత్ స్వభావుడు (లేక) శుద్ధసంవిత్ స్వరూపుడు" అగు జీవన్ముక్తుని యందు అత్యంత అకృత్రిమంగా పరిమిత దృష్టులన్నీ తొలగిపోయి ఉంటాయి. అందుచేతనే ఆతనియందు మైత్రి, కరుణ మొదలైనవి స్వభావసిద్ధంగా ప్రకటితమౌతాయని నేను చెప్పటం జరిగింది. వారు స్వభావసిద్ధంగానూ, అకృత్రిమంగానూ ఉత్తమ గుణాలు కలిగి ఉంటారు. అంతేగాని, పునర్జన్మ కారకమగు ఆశ చేతనో, ప్రతిష్ఠకొరకో కాదు. ఎందుకంటే, 'నేను ఆత్మను' అను అనుభవం గల చిత్స్వభావుడు తన స్వరూపమునే సర్వే సర్వత్రా గాంచుచున్నాడు. అమ్మ ఏ ప్రతిఫలం కోరకుండా పుత్రునియందు అవ్యాజమైన ప్రేమ తన స్వభావంగా కలిగి ఉంటుంది కదా!

జీవన్ముక్తుడు సర్వులను తనవలెనే గాంచుచూ ఉంటాడు. అందుచేత ఆతని అప్పటి 'మైత్రి, కరుణ' అసంకల్పితములు, స్వభావసిద్ధములు. అందుచేత, అవి పునర్జన్మ హేతువులు కాజాలవు.

"అసలు చిత్తము అంటే ఏమిటి?" ...ఈ దేహము కంటే విలక్షణమైనట్టి 'సత్త' స్వరూపుడగు దేహి తన స్వరూప సత్తను ఏమరచి ఈ దేహములో ఏర్పడి ఉన్న ఇంద్రియములకు విషయములు అగుచున్న వాటిలో భావనా పూర్వకంగా ప్రవేశించి, వాటి ప్రభావములగు సుఖ-దుఃఖ భావ పరంపరలను అవిశ్రాంతంగా, అవిచ్ఛిన్నంగా పొందటాన్నే శాస్త్రజ్ఞులు 'చిత్తము' అని పిలుస్తున్నారు. తత్త్వశాస్త్రములు (మోక్ష శాస్త్రములు) జీవునకు విషయముల నుండి వెనుకకు మరలి, స్వస్వరూప సత్త యందు అచ్యుతుడై ఏర్పడి ఉండటం ఉద్బోధిస్తున్నాయి. దానినే 'చిత్త నాశనం' అంటున్నాయి.

ప్రతి జీవుని యందు సర్వదా ఏర్పడి ఉన్నది ఏకైక స్వసత్తయే కదా! అందుచేత విషయములచే ఏర్పడిన 'గుణ – కర్మ' భేద విభాగమంతా స్వసత్తయందు ఉద్బోధితుడైనవానికి ఉపశమించిపోతాయి. సత్వము అనే చంద్రకిరణ స్వరూపమగు సంతుష్టి ప్రకటితమగుచుండగా ఆ జీవన్ముక్తునికి సాత్విక గుణములు స్వభావ సిద్ధమైపోతాయి. అంతేగాని అవి ప్రతిఫలాపేక్ష చేతనో, కర్తృత్వాభిమానంతోనో ఏర్పడే గుణ ప్రకటనకాదు. "నా బిడ్డకు స్నానం చేయించాను. తుడిచాను. లాలించాను మరి నాకు ప్రతిఫలం ఏమిటి? ఎవరు ఇస్తారు?" అని తల్లి గొప్పలు చెప్పుకోదు కదా! ఆమె ప్రేమ లాగానే జీవన్ముక్తుని ప్రేమ మొదలైనవి అత్యంత స్వతఃసిద్ధమైనవి అవుతాయి.

అరూపమనోనాశనం - ఇది నిష్కళాత్ములగు విదేహముక్తులకు మాత్రమే కలుగుతుంది. అప్పుడు సర్వగుణములు నిర్మలము, పరమపావనము అగు విదేహముక్తపదము నందు లయించి పోతాయి. అనగా... 'అరూపము' అనబడే చిత్తనాశస్థితి విదేహముక్తులకు మాత్రమే విషయమౌతుంది. అది రూపరహితం, దృశ్యరహితం అయినది. దానిని మనం మాటలలో చెప్పుకోలేము.

అట్టి అరూప చిత్తనాశనపదము గుణము కాదు. అగుణము కాదు. సమృద్ధిగాని, అసమృద్ధి గాని కాదు. చంచలముగాని, ఉదయముగాని, అస్తమయంగాని, హర్షముగాని, శోకముగాని,

తేజ – అంధకారములుగాని, పగలు – రాత్రులుగాని కాదు. "దిక్కులు, ఆకాశము, ఊర్ధ్వ అధో విభాగము, రచన, రాగము, విరాగం, సత్త, అసత్త, సత్తఅసత్తల సంధి రూపం" ...ఈ శబ్దాలన్నీ అరూపచిత్త నాశనము గురించి ప్రవచించలేవు.

అది అంధకార, తేజోరహితమైనది. సూర్య, చంద్ర, నక్షత్ర వర్జితమైనది. శరత్ కాల ఆకాశం లాగా అది నిర్మల పదమై అలరుచున్నది. ఆకాశము వాయువునకు స్థానమగుచున్నట్లు... బుద్ధిని, సర్వసంసారాడంబరాన్ని అధిగమించిన మహాత్ములకు ఆ 'అరూపసత్త'యే స్థానభూతమై ఒప్పుచున్నది. అజ్ఞానరజ శూన్యమైనట్టి, ఆకాశంవలె విశాలమైనట్టి, చిత్తలేశమైనా లేనట్టి అరూపసత్త యందు విదేహముక్తులు ఏర్పడి ఉంటున్నారు. ఈ జగత్తులలో కనిపించే సమష్టిబుద్ధి, సమష్టి సంచలనము మొదలైనవి విదేహముక్తుల వినోద విహారమే సుమా!

❖❖❖

3. శరీర తదాప్యం - నివారణ

శ్రీరాముడు : హే మహాత్మా! మహర్షీ! అనేక సంరంభములచే అలరారుచున్న ఈ జగత్తు ఎదురుగా ఉండి జీవుడు నిర్విశేషమగు బ్రహ్మమును సంతరించుకోకుండా అడ్డగించుచున్నది కదా! అనేక దుఃఖములతో కూడి ఎదురుగా నిలచి ఎంతో భ్రమింపజేస్తున్న 'సంసారము' అనబడే ఈ వృక్షమునకు అసలు బీజమేది? ఆ బీజం ఎక్కడినుండి వచ్చింది? దానికి ఉత్పత్తి స్థానమేది? ఆ స్థానమునకు ఎక్కడి నుండి, ఎట్లా ఉత్పత్తి ఏర్పడింది?

మా బోధ యొక్క అభివృద్ధి కొరకై అసలు ఈ సంసారమంతా ఎక్కడి నుండి వచ్చిపడుతోందో... ఆ మూలము గురించి విశదీకరించండి.

శ్రీవసిష్ఠ మహర్షి : "ఈ దేహమే సంసారమునకు అసలైన బీజం" అని చెప్పబడుతోంది. నీకు బయటగా కనబడే ఈ దేహము యొక్క అసలైన రూపం జీవుని యొక్క అంతరంగంలో ఏర్పడి ఉన్నది. శుభ, అశుభ భావనలే దీని అంకురం. కాండమునుండి కొమ్మలు, ఆకులు, కాయలు, పూలు వృద్ధిచెందుతాయి చూచావా? "సంసారము" అనబడే అంతఃకరణము యొక్క దోషవిభాగము నుండి కార్య, కారణములు, ఆశలు, సుఖ దుఃఖములు, ఉపాధులు అనునవన్నీ ఉత్పన్నమగుచున్నాయి.

సంసారమునకు స్థానం అంతఃకరణమే. శరీరం అనగా "నేను ఈ శరీరమును" అను అంతఃకరణము యొక్క వ్యవహారమేనని విజ్ఞులు గమనిస్తున్నారు. మనస్సే పదార్థముల అభివృద్ధి, వినాశములకు స్థానమని సుతీక్ష్ణమైన అవగాహన గలవారు తప్పక గ్రహిస్తున్నారు. ఆశించేది, ఆ ఆశల వెంట పరుగులు తీసేది, వాటివలన కలిగే సుఖదుఃఖములను నిర్వచించేదీ, వాటిని త్యజించేదీ అంతా మనస్సే. భూత – వర్తమాన – భవిష్యత్ దేహములను, ఆ దేహములచే పొందే దృశ్య పరంపరలనూ, అన్నిటినీ మోస్తున్నది మనస్సే. జాగ్రత్ నుండి స్వప్నంలోకి వెళ్ళిన మనస్సు ఊహానగరమును సృష్టించుకొని, అందులోకి ప్రవేశించి అనేక అనుభవములను పొందుతోంది.

మనస్సు 'సంకల్పించుట' అను ప్రక్రియను తన యొక్క మూలముగా కలిగి ఉన్నది. కుమ్మరి యొక్క ఆలోచనలను అనుసరించి మట్టితో అనేక ఆకారములు గల కుండలన్నీ తయారగుచున్నట్లు, మనస్సుచే దృశ్యత్వము, ఆ దృశ్యమునకు విషయములగు ఈ జగదనుభవములు తయారగుచున్నాయి.

వృత్తి అను రూపముగల మనస్సుకు రెండు మూలాస్థానములు ఉన్నాయి–

1. దృఢవాసనలు (Dense Tendencies), 2. ప్రాణస్పందము.

ప్రాణములు చలించి నాడులను స్పృశించటానికి సిద్ధమగుచున్నాయి. మరుక్షణం చిద్వికారమగు మనస్సు లేక చిత్తము కూడా శీఘ్రంగా ప్రకటితమౌతోంది.

నాడీ మార్గ రంధ్రముల గుండా ప్రాణములు చలించకపోతే అప్పుడు ద్రష్టకు ఇంద్రియములు బాహ్యానుభవమే ఉండేది కాదు. కనుక ప్రాణస్పందమే చిత్తము ద్వారా 'జగత్తు' అను పేరిట ప్రసిద్ధి కెక్కుచున్నది. ప్రాణ స్పందము ద్రష్ట యొక్క ప్రభావమే అయి ఉన్నది.

అంతటికీ కారణం? ఆత్మయే తన స్వరూపముగాగల ద్రష్టయే. కనుక ద్రష్టయే ప్రాణస్వరూపుడై తన చిత్తము ద్వారా ఈ జగత్తును గాంచుచున్నాడు.

జగత్ ప్రళయం - ప్రాణ స్పందము యొక్క ఉపశమనము జరిగినప్పుడు చైతన్యము యొక్క నిష్క్రియరూపమగు ప్రశాంత స్థితి ఏర్పడి ఉంటోంది. దానిని వేదజ్ఞులు 'జగత్ప్రళయం'గా వర్ణించి చెప్పుచున్నారు.

జగత్ సృష్టి - నిష్క్రియమగు చైతన్యము ఒకప్పుడు ప్రాణ స్పందమును ఆశ్రయిస్తోంది. అప్పుడు నిశ్చలంగా ఉన్న బంతి నెట్టబడుటచే చలనము పొందుచున్నట్లుగా, చిత్తమున వృత్తులు విజృంభిస్తున్నాయి. అట్టి వృత్తిజ్ఞానం దేహములందు స్ఫురిస్తోంది. అదియే 'జగత్ సృష్టి' అని వేదజ్ఞులచే పిలువబడుతోంది.

ఈ విధంగా జగత్ సృష్టి, జగత్ ప్రళయమనేవి ఆత్మ స్వరూపుడగు ఈ దేహి, లేక, ప్రాణి యొక్క స్పందనకు సంబంధించినవే గాని, పంచభూత సమ్మేళనములగు ఈ ఎదురుగా కనబడే వస్తుజాలముల ఉత్పత్తి, వినాశనములకు సంబంధించినది కాదని సూక్ష్మదృష్టితో గ్రహించు.

అతి సూక్ష్మమగు గంధము (Smell) సర్వత్రా వ్యాపించి ఉన్న వాయువుచే సంచలనము పొంది నలువైపులా ప్రసరిస్తోంది చూచావా? సర్వత్రా వ్యాపించియున్న సంవిత్తు ప్రాణముల చలనముచే ప్రబోధితమై దేహములందు ప్రతిబింబిస్తోంది.

శ్రీరాముడు : తన స్వరూపమేమిటో ఏమరచిన ఈ జీవుడు చిత్తవృత్తులను ఆశ్రయించి, ఈ జగత్తును పొందుచూ, చమత్కారంగా క్షోభను పొందుచున్నాడు.

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. అందుచేత, చిత్తవృత్తిని నిరోధించటంచేత ఈ జీవునకు పరమ శ్రేయస్సు లభించగలదు. ప్రాణాయామాదుల అభ్యాసంచేత ప్రాణ స్పందనమును నియమించినప్పుడు ఈ జీవునకు క్షోభ తొలగగలదు.

చిత్తవృతి, చిత్తమౌనము - చిత్తవృత్తి ఉదయించిన వెంటనే బాహ్యవిషయములందు అనురాగం జనిస్తోంది. ఇక ఆపై అది దేహములను కల్పించుకొని బాహ్యవిషయ భోగములవైపు ఆసక్తిగా వెడలుచున్నది. అందుకు ఫలితమేమిటి? అది అనంత దుఃఖములను తెచ్చిపెట్టుకుంటోంది. చిత్తమే చిత్తమునకు వృత్తుల రూపమున బంధమౌతోంది.

అట్టి చిత్తము బాహ్యవిషయములందు 'మౌనము' వహించి అభ్యంతరస్థమైనట్టి ఆత్మజ్ఞానవిషయంలో మేల్కొనినదనుకో... అప్పుడేమౌతుంది? అప్పుడాద్రష్ట, లేక, జీవుడు పొందతగిన విమల పదమును పొందినట్లే.

అందుచేత ఓ సభికులారా! ప్రాణచలనం కారణంగా ఉత్తేజమగుచున్న వాసనల రూపమున ఏర్పడుచున్న అజ్ఞాన చిత్తము వృద్ధికాకుండా చూచుకోవటం ఎట్లాగో కొంచెం యోచించండి. అప్పుడు మాత్రమే ఈ జన్మాది వికారములనుండి (నేను జన్మిస్తున్నాను మొ॥న భ్రమల నుండి) ముక్తులు కాగలుగుతారు. ఎందుకంటే, మలిన సంవిత్తు యొక్క వృద్ధిచే ఈ జీవులకు అనేక ఉపాధిపరంపరలు జనించి, నశిస్తున్నాయి. అజ్ఞాన చిత్తము యొక్క అనర్థజాలములచే ఈ ప్రపంచమంతా వ్యాప్తమై ఉంటోంది.

ఈ తీరునంతా గ్రహించిన యోగులు ప్రాణాయామముచేతనూ, ధ్యానము చేతనూ, శాస్త్రములచే అందింపబడుచున్న తదితర సాధనములచేతనూ, సద్గురువులచే ప్రసాదింపబడిన ఆయా విధి, విధానములతో కూడిన యుక్తుల చేతనూ, సర్వే-సర్వత్రా స్వస్వరూపాత్మ విన్యాసంగా సందర్శించుట చేతనూ, ఈ చిత్తమును విషయములనుండి ఉపశమింపజేయుటకు యత్నములు చేస్తున్నారు.

చిత్తనిరోధం కొరకు ప్రాణ ప్రసరణముల ప్రాణాయామపరాయణులు నిరోధం అభ్యసిస్తూ ఉంటారు. ప్రాణనిరోధం, చిత్తశాంతిని కలిగించగలదు. అది స్వస్థతకు, సమత్వమునకు, సుఖ స్వస్వరూపానుభవమునకు సహకరిస్తోంది.

❖❖❖

4. అభావన ద్వారా అమనస్కం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! నీవు అడిగిన చిత్తబీజము విషయమై సమాధానంగా జ్ఞానులచే ప్రవచించబడిన మరికొన్ని విషయాలు ప్రస్తావిస్తాను. నేనిప్పుడు చెప్పే విశేషాలు జీవునకు స్వయంగా అనుభూతం కాగల విషయాలే!

❖

ఈ జీవుడు అనేక జన్మల అభ్యాసవశంచేత ఈ దేహమును 'ఇది నేను... ఇది నాది' అను సంస్కారముతో గాంచుచున్నాడు. అట్లా దర్శించేటప్పుడు – "ఈ దేహమునకు ముందు ఏమైయున్నది? ఈ దేహానంతరం ఉన్న విశేషమేమిటి? ఈ దేహముకంటే విలక్షణమై నాకు సంబంధించి ఏర్పడి ఉన్నదేది" అను పరిశీలనాత్మక దృష్టిని కోల్పోవుచున్నాడు. అనగా...

ఆతడు పూర్వా పరములను వదలి, వర్తమానము నందు ఈ దేహముచే అనుభవమయ్యే విషయములందు మాత్రమే పరిశీలన భావనలను కలిగి ఉంటున్నాడు. అట్టి పరిమిత, సంకుచిత దృష్టినే 'వాసన' అని అంటారు. కొన్ని పరిమిత భావనలను స్వీకరించి అభ్యాసవశంగా ఈ దేహాదులు జీవుడు పొందుచున్నాడు. అంటే, ఆతడు ఎట్టి పరిమిత భావనలను ఆశ్రయిస్తున్నాడో, అట్టి ఆకృతినే పొంది, ఆ పరిమిత భావనలందు తనను తాను ఏర్పరచుకొనుచున్నాడు. అట్లు ఏర్పరచుకొను అభ్యాసమే సంసారమునకు బీజము. అట్టి పరిమిత ఆకృతి ఆశ్రయించి ఉన్నప్పుడు ఆయా వాసనలకు వశీభూతుడై పూర్వాపరములను ఏమరుచుచున్నాడు. తన పరిమిత భావములకు కనబడుదానిని 'ఇదియే సద్వస్తువు' అని తలచుచూ, వివశుడై ఆ సమయంలో తనయొక్క వాస్తవ స్వరూపమును గాంచటం (లేక మననం చేయటం) మానివేస్తున్నాడు. ఇదియే "స్వస్వరూపం నుండి చ్యుతి పొందటం" అని అంటారు. కడుపు నిండా కల్లు త్రాగినవానికి ఈ ఎదురుగా ఉండే పదార్థాలన్నీ మరొకవిధంగా ఆ మత్తులో కనిపిస్తాయి చూచావా? వాసనలందు సంస్థాపితమైన జీవునకు ఈ జగత్తంతా అభినివేశ మయంగా కనిపిస్తోంది. విషం మ్రింగినవాడు ఆ విషమునకు వశీభూతుడై పిచ్చికేకలు వేస్తున్నట్లు, అంతఃకరణంలో ఏర్పడిన వాసనలచే అజ్ఞానయుతుడైన జీవుడు సకల మానసిక వ్యధలచే బాధింప బడుచున్నాడు. విషయములే విషములుగా ప్రాప్తిస్తున్నాయి.

ఎద్దానితో అయితే... ఈ జీవునకు అనాత్మయందు – ఆత్మబుద్ధి; అవస్తువగు దేహాదులందు – వస్తుబుద్ధి ...అనే మిథ్యా జ్ఞానం కలుగుతోందో దానినే 'చిత్తము' అని పిలుస్తున్నాం. అనగా దృఢమైన అభ్యాసం కారణంగా ఈ పదార్థములతో అభేదవాసన పుట్టుకొస్తోంది. అందులోంచే అతి చపలమైన చిత్తము బహిర్గతమౌతోంది. ఆ చిత్తము జీవునకు జన్మ – జరా – మృత్యువులతో కూడిన ఈ ఉపాధి, ఆకార వికారములను సంతరింపజేస్తోంది.

ఎప్పుడైతే జీవుడు 'త్యజించటం – గ్రహించటం' అనే బుద్ధిని అవలంబించక, వాసనారహితుడై ఉంటాడో – అప్పుడిక ఆతని యందు చిత్తమనేదే జనించదు. ఆతడు "భావించకపోవటం, అభావన" అభ్యసిస్తాడనుకో... అప్పుడు ఆతనిలో పదార్థములకు సంబంధించిన మననం సన్నగిల్లుతుంది. ఇక లేశమైనా మననం శేషించనప్పుడు 'అమనస్కం' ఉదయిస్తుంది. ఆకాశంలో కమలం ఉదయించ నట్లు అమనస్కస్థితిలో చైతన్యమునందు చిత్తమే ఉదయించదు.

రాగవశం చేత వస్తువును చూచి "ఇది వాస్తవము" అని అనుకుంటూ ఉండటమే చిత్తము. నాఉద్దేశంలో చిత్తమునకు మరింకే రూపమూ లేదు.

ఏతావన్మాత్రకం మన్యే రూపం చిత్తస్య రాఘవ ।
యద్భావనం వస్తునోఽ స్తర్వస్తుత్వేన రసేన చ ॥ (శ్లో 40, సర్గ 91)

"వాస్తవము, శాశ్వతము అగు దృష్టితో చూస్తే ఇక్కడి పదార్థాలేవీ భావావేశముచే సమర్థించుటకు యోగ్యమే కాదు" – అను భావన (లేక) అవగాహనకు వచ్చిన జీవుని స్వరూపం నిర్మలాకాశంలాగా స్వచ్ఛమై ఉంటుంది. ఇక అందు చిత్తోదయం ఎట్లా అవుతుంది?

కాబట్టి రామా! నీవు 'బాహ్యవస్తువిస్మరణ' రూపమగు 'నిరోధయోగము' ను అవలంబించు. అప్పుడు సర్వ దృశ్యమార్జవం (Washing off) లేక దృశ్యరహితత్వం ఏర్పడగలదు. ఈ దేహము పొందినందుకుగాను అంతకు మించిన ప్రయోజనం మరింకేదీ ఉండదు. అభావసంపాదకమైనట్టి అచిత్తత్వమే ఆత్మవస్తు దర్శనం కూడా.

❖

అంతఃకరణముచే సర్వమూ త్యజించబడగా అప్పుడు శేషించి ఉండే శీతలాశయవర్తియగు వాసనారహిత చిత్తము ఒకవేళ ఈ ప్రపంచంలో వర్తించవలసిన వచ్చినప్పటికీ దానికి సంసార దోషం అంటదు. ఉడకబెట్టిన చిక్కుడు విత్తనంలాగా అది ఆకారం కలిగియున్నప్పటికీ అచిత్తత్వముతో సరిసమానమే అవుతుంది. వాసనావశంచేతనే విషయములు ధ్యానింపబడుచున్నాయి.

దృశ్యమునందు ఏమాత్రం ఆలాపన, అనురాగములు లేనివాని చిత్తం అచిత్తత్వ దశ పొందినట్లే. అదియే ఉపశమనము. అదియే సత్వము.

ఘన వాసనలు మరల మరల జనన మరణములకు కారణములు అగుచున్నాయి. వాసనా రహితుడగు జీవన్ముక్తుడు ఈ ప్రపంచ కార్యములు నిర్వర్తిస్తూ ఉన్నప్పటికీ, సదా సత్వమునందే సుస్థిరుడై ఉంటాడు. ఈ ప్రపంచంలో రాగరహితులైనట్టి, పునర్జన్మాంకురము లేనట్టి జీవన్ముక్తులు ఎందరో యథావిధిగా సంచరిస్తూ ఉన్నారు. వారు జ్ఞాన సంపన్నులై, సత్యరూపులై ఈ దేహానంతరం చిదాకాశ స్వరూపం సంతరించుకొనుటకు అర్హులై ఉంటున్నారు. వారంతా చిత్తరహితులని, అమనస్కులని మనం తప్పక గ్రహించవచ్చు.

❖❖❖


5. తెలియబడేదంతా ఉన్నది తెలుసుకుంటున్నవానియందే!

శ్రీవసిష్ఠ మహర్షి : బీజం మొలకెత్తాలంటే నేల, నీరు రెండూ కావాలిగా!

ద్వే బీజే రామ చిత్తస్య ప్రాణస్పన్దనవాసనే ।
ఏకస్మింశ్చ తయోః క్షీణే క్షిప్రం ద్వే అపి నశ్యతః ॥ (శ్లో 48, సర్గ 91)

చిత్తబీజమునకు కూడా రూపం దిద్దుకోవాలంటే –ప్రాణ స్పందనము, వాసన – అనే రెండు ఉండాలి. ఈ రెండిటిలో ఒకటి శమిస్తే రెండవది తనంతట తానే శమిస్తుంది.

నువ్వులలో నూనె దాగి ఉన్నట్లు, వాసనలలోనే భావిపునర్జన్మ పరంపరలన్నీ దాగి ఉన్నాయి. బీజం–వృక్షంలాగా వాసనలవల్ల జన్మలు, జన్మల వల్ల ఇంకొన్ని వాసనలు ఏర్పడుచున్నాయి. ప్రాణం, వాసనలను సమన్వయపరుస్తూ చిత్తం తనకు తానే ఇంద్రియ సుఖదుఃఖానుభవాలు కల్పించుకుంటోంది.



చిత్తంలోంచి "ప్రాణములు, విషయానందం" ఉత్పన్నమౌతున్నాయి. వాటి నుండి మరల చిత్తము మరింత ప్రోద్బలమౌతోంది. అట్లాగే ప్రాణముచే వాసనాస్పందనము, వాసనాస్పందనముచే ప్రాణములు పరస్పరం ప్రవృద్ధం చేసుకుంటున్నాయి. వాసనలు ప్రాణస్పందనమును ఉద్బోధించటాన్ని 'సంవిత్ ప్రక్షోభము' అనే పేరుతో పిలుస్తూ ఉంటారు.

ప్రాణములు హృదయగుణములగు రాగద్వేషాదులను ప్రేరేపించుతూ ఉండటం తమ ధర్మంగా కలిగి ఉంటున్నాయి. సంవిత్తు రాగసహితమైనప్పుడు 'చిత్తము' అనే బాలకుడు పుట్టుకొస్తున్నాడు.

ఈ విధంగా ప్రాణ స్పందనము, వాసనలు – ఈ రెండూ కూడా చిత్త రూపమునకు కారణములై ఉంటున్నాయి.

శ్రీరాముడు : మహాప్రభో! చిత్తమే కదా, సర్వ వ్యాపకములకూ మూలం! మరి నిరోధించబడటమెట్లా?

శ్రీవసిష్ఠ మహర్షి : ప్రాణ స్పందన, వాసనలలో ఒక్కదానిని నీవు నిరోధించగలిగితే రెండవది తనకు తానే పట్టుబడుతుంది.

చిత్తము 'మననము' అనే స్వభావం కలిగి ఉంటోంది. చిత్తమనే వృక్షమునకు కాచిన ఫలమే ఈ శరీరం కూడా. సర్వక్రియలూ చిత్తము చేతనే సంకల్పించబడుచున్నాయి. అది తనయందు తృష్ణ రాగము అనే దోషములను అంతరాంతరంలో పొందుపరచుకుని ఉన్నది. అదే అజ్ఞాన కార్యములకు సాధనములవంటివైన ఇంద్రియములకుకూడా మూలం. అట్టి చిత్తం నశిస్తే క్షణంలో వాసనలూ పోతాయి. ప్రాణ స్పందనా నిరోధించబడుతుంది.

సర్వదిక్కులను మలినపరుచుచున్నది ఈ చిత్తమే. అది సర్వప్రాణుల స్వస్వరూపమగు చిత్ రూపమును ఆవరించుకొని ఉంటోంది. అది ఎట్లా జనించింది? అజ్ఞానకారణం చేతనే! అది వ్యాప్తమై ఉండి, ఈ దేహమునందే నెలకొని ఉంటోంది. అత్యల్పవృత్తులచేకూడా సంక్షుభితమౌతోంది. అన్ని వైపులా కదులుతూ పిచ్చిగంతులు వేయటంలో దానికదే సాటి. ఎంత కాలం గడచిపోతున్నా... ఎన్ని ఉపాధులు మంటగలిసిపోతున్నా... అది తన అంతఃకరణసాక్షి, విషయరహిత స్థానము, ఉపాధిరహితము అగు బ్రహ్మప్రకాశమును గాంచదే?

అట్టి నిత్య సంచలనరూపమగు ఈ చిత్తం ప్రాణ స్పందనిరోధంచే క్షణంలో లయమొందగలదు.

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ విషయములు - ప్రాణస్పందన, వాసనలు... రెండిటికీ కూడా శబ్దస్పర్శాది విషయములు బీజమగుచున్నాయి. శబ్దస్పర్శాది విషయములు పొందవలెనని ఇచ్ఛ, అభినివేశము, పట్టుదల – జీవునియందు ఏర్పడగానే "నాయనా! బయలుదేరు! మేం అందుకు సాయపడతాం" అంటూ ఆ జంట (ప్రాణస్పందము–వాసనలు) ముందుకొస్తున్నది.

శ్రీరాముడు : స్వామి! "ఇచ్ఛ, ప్రాణస్పందన, వాసనలు, చిత్తము, శబ్దస్పర్శాది విషయములు" – వీటిని మీరు ఉదహరిస్తూ... దీనికి అది బీజమని, దానికి ఇది బీజమని చెప్పుకొస్తున్నారు. ఏది బీజం? ఏది వృక్షం? ఏది ముందు? ఏది వెనుక? మీరు చెప్పే విషయాలలో అది నేను గుర్తించలేక పోతున్నాను.

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. ఈ సంవాదం అట్లా ఉన్నమాట నిజమే. అయితే విత్తు ముందా? చెట్టు ముందా? చెట్టులోంచి విత్తు వస్తోంది? విత్తులోంచి చెట్టు వస్తోందా? అక్కడ తేల్చిచెప్పగలదేమీ ఉండదు కదా! అయితే...

ఉపాయమేమిటో నేను సుస్పష్టపరచుచున్నాను కదా! ఇక సమాధానం ఉండని ప్రశ్నలతో గాభరాబడవలసిన పనేమున్నది?... శబ్దస్పర్శాది విషయములనుండి విరమించుటచే వాసనలు సన్నగిల్లుతాయి. ప్రాణస్పందం నిరోధించబడుతుంది.

అట్లాగే... ప్రాణనిరోధాభ్యాసంచే వాసనలు సన్నగిల్లుతాయి. శబ్దస్పర్శాది విషయముల ప్రకోపం శమిస్తుంది. క్రమంగా వాసనలు ఉపశమిస్తాయి. అప్పుడు చిత్తం అచిత్తమౌతుంది.

మరొక విషయం. "ఆత్మ, సంవితు, ద్రష్ట, శరీరి" అను పేర్లతో జీవుని స్వస్వరూపము పిలువబడుచున్నది అట్టి చైతన్యమే అన్నిటికీ స్థానమై ఉంటున్నది.

నువ్వులు లేకుండా నూనె లభిస్తుందా? సంవిత్తు (The Knower) యే లేకపోతే వృత్తి జ్ఞానం ఎవరికి? శబ్దాది విషయములకు అనుభవరూపమగు సంవేద్యము (Object being known) ఎట్లా ఏర్పడుతుంది?

పైగా... ఈ బాహ్య – అభ్యంతర విషయములన్నీ సంవిత్తుకంటే వేరైనవి అనుకుంటున్నావా?... కానేకాదు. సంవిత్తు స్వప్నమున స్ఫురించుచూ ఆ స్వప్నంలో పదార్థములను, ప్రదేశములను, స్వమరణమును కూడా గాంచుచున్నది చూచావా? (ఒక్కొక్కడు తాను చనిపోయినట్లు కూడా కల గంటాడు కదా!) అదే సంవిత్తు జాగ్రత్‌లో కూడా ప్రవేశించి అట్టి స్వసంకల్పవశం చేతనే పదార్థముల అనుభవమును గాంచుచున్నది. అంతే కాదు...

ఏ సంవిత్తైతే వివేకోదయం చేత స్వసంకల్పము ద్వారా పదార్థానుభవములన్నీ త్యజించి తనను తానే ఎరుగుచున్నదో... ఆ ఎరుక కూడా స్వప్న, జాగ్రత్‌లవలెనే స్వప్నతుల్యమేనని సూక్ష్మబుద్ధితో గ్రహించు. ఎందుకంటే అద్వితీయానుభవం దృష్ట్యా 'ఇది నేను, ఇది స్వరూపం' అనునవి మాత్రం ఎక్కడుంటాయి? కనుక కేవలానుభవస్థితిలో,

స్వప్న సంవిత్తు ఉండదు... జాగ్రత్ సంవిత్తు ఉండదు... సంవిత్ యొక్క సంవిత్తు ఉండదు... స్వసంకల్ప భ్రమచే పసిబాలుడికి గాలిలో భూతాలు కనిపిస్తున్నట్లు, సంవిత్తు యొక్క స్వవ్యసన, సంకల్ప భ్రమచే ఈ జగత్తు ఆ సంవిత్తుకు కనిపిస్తోంది. కనుక జగత్తు యొక్క అసలైన బీజం, స్థానం దీనిని ఎరుగుచున్నవానియందే ఉన్నదని గ్రహించు.

తెలియబడుచున్నదంతా తెలుసుకుంటున్నవానినుండే బయలుదేరి, ఆతనియందే ఏర్పడి ఉండి, మరొకప్పటికి ఆతనియందే ఉపశమిస్తోంది. సంసారము యొక్క, జగత్తు యొక్క "ఆదిబీజం" తెలుసుకుంటున్నవాడే.

❖❖❖

6. దృశ్య అదర్శనం

శ్రీవసిష్ఠ మహర్షి : మసక చీకట్లో అంతదూరంగా నిలచియున్న ఒక పెద్ద శిలా స్థంభము భ్రమ కారణంగా ఒక పురుషుని రూపంగా అనుభవమౌతుంది చూచావా? అట్లాగే జీవునికి ఈ దృశ్యం ప్రాప్తిస్తోంది. అట్టి దృశ్యసందర్శనంలో పాల్గొనే వివిధ విశేషాలు ఈ విధంగా ఉంటాయి.

1. సంవిత్తు = The Knower or That Which is Knowing (Knower prior to knowing)
2. విషయసంవిత్తు = The Knower while engaged in material world.

(అట్లాగే స్వప్నసంవిత్తు, జాగ్రత్ సంవిత్తు, సుషుప్త సంవిత్తు కూడా)

3. సంవేద్యము = That Which is being Known
4. సంవేదనము = Knowing
5. ఆత్మ సంవిత్తు = Knower Which is engaged in knowing the Knower's Self. (one's own self)

సూర్యకిరణములు కిటికీలోంచి ప్రసరిస్తున్నప్పుడు అందు దండాకారంగా పరిభ్రమిస్తున్నట్లు త్రసరేణువులు అగుపిస్తాయి. నావలో పయనించేవానికి అచంచలమగు పర్వతములు, వృక్షములు వెనక్కు వెళ్ళిపోతున్నట్లు కనబడతాయి. చీకట్లో చూచిన త్రాడు పాములాగా భ్రమింపజేస్తుంది. కంటి దోషం చేత ఆకాశంలో రెండు చంద్రబింబాలు అగుపిస్తాయి. ఈ భ్రమలన్ని సరి అయిన దృష్టితో చూస్తే నశిస్తాయి.

అదేవిధంగా సంవిత్తే తెలియబడుచున్నదానివలె విషయరూపమున, దృశ్యరూపమున భాసిస్తోంది. అట్లా కనిపిస్తున్నదంతా సమ్యక్ దృష్టిచే నశించిపోతాయి. అనగా, దృశ్యము – దృశ్యవిషయములు అనబడే సంవేద్యమునకు సంబంధించిన మిథ్యా జ్ఞానమంతా సమ్యక్ జ్ఞానముచే నశించగలదు. సంవేద్యమంతా సంవిత్తుకు వేరైనది కాదు – అని మరొకసారి ప్రకటిస్తున్నాను.

❖

ఓ రామచంద్రా! ఈ కనబడే మూడు లోకములూ శుద్ధ సంవిత్ మాత్రమే అయి ఉన్నది. అంతకు వేరుగా సంవేద్యము (తెలియబడేది) అంటూ ఎక్కడా ఏదీ లేదు.

సమ్యక్‌జ్ఞానం - తెలియబడేవాని రూపమే తెలియబడుచున్న దానియందు స్ఫురిస్తోందనీ, ఆతనికి వేరుగా తెలియబడేదంటూ లేదను నిశ్చయం కలిగి ఉండటం.

అందుచేత రామా! నీవు సంసారమును జయించివేయాలనుకుంటే "ఇతఃపూర్వం గాంచినవి, ఇప్పుడు గాంచుచున్నవి, ఇకముందు గాంచాలని అనుకుంటున్నవి" – వాటినన్నిటినీ నీ చిత్తము నుండి తొలగించివేయాలి. అనగా, "ఇవన్నీ మిథ్యారూపమైనవే కదా!" అను ఎరుకను దృఢపరుచుకోవాలి. అట్లు తొలగించుకోనంతకాలం జీవునకు ఈ జన్మ, కర్మలతోటి సంబంధం ఎప్పటికీ తొలగదు.

శుద్ధవిభాగచిత్తము సహాయంతో మలిన విభాగచిత్తమును తొలగించుటయే మోక్షం.

దృశ్యము సత్యమని భావన చేయటమే అవిశ్రాంతమగు జననమరణ వ్యసనమునకు లేక సంసారమునకు నాంది, బీజమూనూ.

చిదేకరసం - విషయముల అదర్శనమును 'చిదేకరసం' అని కూడా అంటారు. అట్టి అదర్శనమునకు సంబంధించిన ప్రయత్నం జడరహితమగు ఆత్మస్వభావంగా పరిణతి చెందుతోంది. కనుక... నీవు 'విషయములను దర్శించుట' అనునది త్యజించివేయుము. విషయ రహిత, స్వయం ప్రబుద్ధమగు ఆత్మయే నీవై ఉన్నావు. కనక పూర్ణానంద స్వరూపుడవై నిశ్చింతగా ఉండుము.

ఓ సభికులారా! ఓ సర్వజనులారా! ఈ మన ప్రియ రామచంద్రునిలాగానే మీలో ప్రతి ఒక్కరూ శుద్ధాత్మ స్వరూపులేగాని, జడమగు ఈ దేహం కాదు. లేక, మరొక వెలుగుచే ప్రకాశింపబడే మనోబుద్ధి అహంకారాదులు కాదు. మీచే దర్శించబడేదంతా మీయొక్క స్వస్వరూప విలాసమే! (ప్రకరణయే! క్రీడయే! ఉల్లాసమే! కుతూహలమే!) ఈ విషయం ప్రపంచమునకు ఘంటాపదంగా ప్రకటించిన ఎందరో మహనీయుల చరిత్రలు మనం చెప్పుకున్నాం. ఇంకా నిర్వాణ ప్రకరణం చిట్టచివరివరకు వారి చరిత్రలు చెప్పుకోబోతున్నాం.

చిత్తమునకు కూడా అతీతులైనట్టి ఓ పరిశుద్ధాత్మ స్వరూపులారా! సర్వజనులారా! మీరంతా అంతటి మహత్తర స్వరూపులై ఉండగా, "అబ్బే! నేనొక సామాన్య జీవుడినండి! స్వల్పుడను. ఆ భగవంతుడు ఎక్కడో చొరరాని చోట ఉన్నాడు. నావంటి స్వల్పునకు అది చాలా కష్టం. ఇక ఎప్పటికో ఏదో చేసి ఆ చోటికి వెళ్ళాలి..." మొదలైన రూపంగల అల్ప, మూర్ఖ భావాలలో కునుకులు తీస్తూ రోజులు గడపవలసిన పనేమున్నది? ఒద్దు. ఇక నిదుర లేవండి. జాడ్యం వదలండి.

"మీ వాస్తవ స్వరూపతత్త్వమేమిటో గ్రహించండి" అని వేడుకుంటున్నాను.

కాబట్టి రామా! నీవు ఈ దృశ్యమును అంతరంగమునందు త్యజించినవాడవై పూర్ణ "బ్రహ్మానంద" రూపముగా శేషించి ఉండుము. అట్లు పరిగ్రహించుచు, ఆపై యథావిధిగా ఈ భూప్రదేశంపై విహరించుచూ దీనిని పవిత్రము చేయి.

❖❖❖

7. అజడం - జడం

శ్రీరాముడు : ప్రభూ! మా స్వస్వరూపము యొక్క పూర్ణత్వమును చేయి ఎత్తి చూపుచున్న సద్గురు ప్రవచనములకు సాష్టాంగదండ ప్రణామములు సమర్పిస్తున్నాను. మన ఈ ప్రస్తుత విచారణ యొక్క నిస్సంశయము కొరకై ఒక చిన్న ప్రశ్న మీ ముందుంచుచున్నాను.

జడత్వం త్యజించినప్పుడు శుద్ధ జ్ఞానస్వరూపం శేషిస్తుంది కదా! అట్లాగే, శుద్ధ జ్ఞానమును ఏమరచినప్పుడు జడప్రాయములగు ఈ దేహాదులు, వాటి అనుభవములు సంక్రమిస్తున్నాయి.

కనుక ఒక జీవుడు ఈ జడశరీరమును ఇట్లే కలిగియుండగా 'శుద్ధ సంవేద్యము'గా, లేక చైతన్య స్వరూపంగా శేషించటం ఎట్లా కుదురుతుంది? శరీరం ఉన్నంతవరకు జడత్వం ఉంటుంది కనుక శరీరం ఉన్నంతకాలం శుద్ధాత్మతత్త్వానుభవం కష్టసాధ్యమేమోనని అనిపిస్తోంది. ఎందుకంటే

జడము – అజడము ఒకేసారి, ఒకే చోట ఏర్పడజాలవుకదా! వెలుగు – చీకటి ఒకేసారి ఒకే చోట ఏర్పడి ఉండజాలవు కదా!

శ్రీవసిష్ఠ మహర్షి : సంవిత్తు, విషయ సంవిత్తుగా, ఆత్మ సంవిత్తుగా రెండు రూపములను దాల్చుచున్నది.

బాహ్యపదార్థములను సత్యమని నమ్మటమే 'విషయ – సంవిత్తు' అనబడుతోంది. అయితే, జీవన్ముక్తునికి మాత్రం ఈ భూత–భవిష్యత్–వర్తమానములందు ఎచ్చటా 'ఇది సత్యమే' అను రూపంలో ఉండే సత్యత్వబుద్ధి ఉండదు. అనగా, అతడు తన అంతరంగ ప్రదేశంలో విషయసంవేదరహితుడై కాష్ఠశిలాదుల వలె (కొయ్య – రాయిలాగా) ఉంటాడు. స్వయంప్రకాశకుడై జడత్వరహితుడై ఉంటాడు. తాను సర్వ విషయములకు అర్థము(Meaning)ను ప్రసాదిస్తూ, సర్వ అర్థములకు అతీతమైన స్థానము నందు సంస్థితుడై ఉంటాడు.

'పదార్థములు అసత్యము' అని ఎరుగుటయే 'శుద్ధసంవిత్తు' అని అంటున్నాం కదా! విషయ సంవిత్తుకు అతీతుడై, శుద్ధ సంవిత్తుని ఆశ్రయించినప్పటికీ, సర్వకార్యములు నిర్వర్తిస్తున్నప్పటికీ ఆతడు ఏ విషయములచే పరిమితుడు గాని, విషయములకు ప్రమేయుడు గాని కాదు. విషయము లందు అసత్య బుద్ధి కలిగి ఉండి ఎవని చిత్తము ఈ విషయములందు లేశమైనా తగుల్కొనదో... ఆతడు 'విషయరహితుడు – అజుడు – జీవన్ముక్తుడు' కూడా అవుతాడు.

బుద్ధిమంతుడగు ఉత్తమజ్ఞాని తన చిత్తమును మొదలంట్ల వాసనారహితం చేసుకునేందుకే సర్వప్రయత్నములు చేస్తాడు. క్రమంగా ఆత్మయందు సర్వ పదార్థ భావనలూ మొదలంటా తొలగించి వేస్తాడు. పసిబాలుడు 'అన్నీ నావే' అన్న భావనలో ఉంటున్నట్లు అతడు 'అంతయునాదే, అన్నీ నేనే' అన్న పరమజ్ఞానభావన కలిగి యుంటాడు. అదే సమయంలో 'అనాది, అసంగము' తో కూడిన అవగాహన సంపాదించుకుని ఉంటాడు. విజ్ఞానదృష్టిచే అంతా తెలిసి, ఏమీ చెప్పజాలక మూగవాని వలె తదితర జీవులతో కలిసి ఉంటాడు. ప్రజ్ఞాస్వరూపుడు, శుద్ధ జ్ఞాని, బుద్ధిమంతుడు అయిన ఆ మహాత్ముడు జడత్వరహితము, వ్యాపకము, స్వచ్ఛము – అగు స్థానంలో తనను తాను ప్రతిక్షేపించు కుంటాడు. కనుక విషయములను పొందుతాడేమోగాని, వాటి యందు తగుల్కొనడు. దేహము ఉండీ దేహము లేనివాడై ఉంటాడు. సుఖ–దుఃఖములను గాంచవచ్చునేమోగాని, తన అపరిమిత త్వమును వీడడు. ఆకాశములో అనంతత్వము ఏర్పడి ఉంటుంది చూచావా! సర్వవాసనలూ త్యజించిన వానికి స్వభావసిద్ధమగు అనంతానందము ఏర్పడియే ఉంటుంది. చిత్తరహితులగు అనేకమంది యోగులు ఆ పరమానంద స్వరూపమునందే సంస్థితి కలిగి ఉంటున్నారు. అద్దానియందే ప్రవృత్తులై, తన్మయులై ఉంటున్నారు. వారి సర్వ సంవేదములు (All their Perceptions) బ్రహ్మాకారము, బ్రహ్మ ప్రకాశముల మధ్య విలీనమైపోతున్నాయి. ఓ రామచంద్రా! ఎవ్వడైతే తాను నడుస్తున్నప్పుడు, కూర్చుని ఉన్నప్పుడు, చూస్తున్నప్పుడు, ఈ దృశ్యసంవేదమునకు సంబంధించిన వృత్తి జ్ఞానం త్యజించివేస్తాడో... అట్టివాడు ఈ శరీరం ఉన్నప్పుడు, దీనిని ఉపయోగిస్తున్నప్పుడు, ఇది లేనప్పుడు కూడా సుఖవంతుడై, అజడుడై, పరమానంద స్వరూపుడై ఉంటాడయ్యా!

అపారగుణ సాగరా! రఘురామా! నీవు కూడా అట్టి దృష్టినే అభ్యాసంచే అవలంబించు. కొంచెం శ్రమతో కూడియున్నప్పటికీ ప్రాణాయామాది సాధనలచే ఈ సంసార దుఃఖ సాగరమును దాటివేయి. ఒక చిన్న బీజంనుండి ఆవిర్భవించి మఱ్ఱివృక్షం విశాల ఆకాశాన్ని ఆక్రమించి ఉంటోంది చూచావా! 'స్వసంకల్పము' అనే చిన్న చోటు నుండి ఆవిర్భవించిన ఈ విషయ ప్రపంచము స్వతఃగా మిథ్యయే అయి ఉండి కూడా సువిశాలమగు ఆత్మాకాశాన్ని ఆక్రమించి ఉంటోంది. సంవిత్తు 'మరల మరల సంకల్పించుట' అను గుణమును ఆశ్రయించి, అందుకు ఫలితంగా జన్మ సమూహముల బీజమును తనకు తాను సృష్టించుకుంటోంది.

జనయిత్వాత్మన్ ఆత్మానమ్, మోహయిత్వా పునఃపునః ।
స్వయం మోక్షం నయత్యన్తః సంవిత్స్వం విద్ధి రాఘవ ॥

ఓ రాఘవా! సంవిత్తును మరింకొకరెవరూ జనింపజేయుట లేదు. అది తనను తానే జనింపజేసుకుంటోంది. మోహింపజేసుకుంటోంది. మరొకప్పుడు హృదయస్థమగు ఆత్మతత్త్వమును గాంచుటచే స్వయంగా తనకు తానే ముక్తిని ప్రసాదించుకొనుచున్నది. అది ఎప్పుడు ఎట్లా భావిస్తే, ఆ క్షణంలో అట్లే అగుచున్నది. అది ఎంతకాలం రాగాదులు కలిగి ఉంటుందో – అంతకాలం తన చిద్రూపమును పొందక, వస్తుతత్వమునందే నిమగ్నమై ఉంటోంది.

ఈ మనకు కనిపించే దేవ, మానవ, అసుర, యక్ష, రాక్షస, కిన్నర, కింపురుష – జీవుల రూపములన్నీ కల్పిత రూపములేగాని, వాస్తవరూపములుగావు. ఆత్మయే అనాదిసిద్ధమై ఉన్న మాయతో కూడుకున్నదై ఈ విధంగా జగన్నాటకమంతా ఆడుచున్నది. పట్టుపురుగు తనలోంచి ఉత్పన్నమయ్యే పట్టుదారంచే కట్టుబడి చిక్కిఉంటుంది చూచావా? సంవిత్తు తననుండి బయల్వెడలిన విషయముల పట్ల గల ఉత్సుకతచే బంధింపబడి, దుఃఖించుచు... మరల చిరకాలమునకు స్వయముగా కేవలత్వము స్వీకరిస్తోంది. 'జగత్తులు' అనే సముద్రమునకు సంవిత్తే జలరూపమై 'కుతూహలం' అను స్వభావంతో అంతటా వ్యాపించి ఉంటోంది. ఈ దిక్కుల రూపంలోను, ఆ పర్వతముల రూపంలోనూ స్ఫురించేది అదే. ఈ ఆకాశం, భూమి, వాయువు, నదులు, దేహములు – ఇవన్నీ సంవిత్ సముద్రములోని అనేక ఆకారములతో కూడిన తరంగములవంటివి మాత్రమే!

❖❖❖

8. వేరు వేరు ఉపాయాలు

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామచంద్రా! ఈ ప్రపంచమంతా సంవిన్మాత్రమే! ఇక్కడ రెండవ వేరైన కల్పనయే లేదు. కల్పన చేయుచున్నవాడే కల్పితమైన సర్వముగా ఆవిర్భవిస్తున్నాడని గ్రహించు. అదియే బ్రహ్మజ్ఞానం. అట్టి సత్య జ్ఞానముచే సంవిత్తు అద్వైత బ్రహ్మరూపము పొందుతోంది. అనగా తనయొక్క సర్వ న్యూనాధికములనూ త్యజించి స్వాత్మయందు స్థిరత్వం పొందుతోంది. ఇంక అది దేనియందు తగుల్కొనక సర్వస్థితులందూ స్వస్వరూపముయొక్క సమ్యక్జ్ఞానం కలిగి ఉంటుంది.

శ్రీరాముడు : సంవిత్తు నుండి 'సన్మాత్రము' అనే బీజం ఎలా వెల్లివిరిసి ఏర్పడి ఉంటోందో వివరించ ప్రార్ధన!

శ్రీవసిష్ఠ మహర్షి : సంవిత్తు, లేక, బ్రహ్మము నుండే ప్రతిబింబ సంవిత్తు జలంలోంచి తరంగంలాగా ఆవిర్భవిస్తోంది. సూర్యుని నుండి కిరణంలాగా ప్రకటితమయ్యే అట్టి సంవిత్తు రెండు రూపములు కలిగి ఉంటోంది.

1. పలువిధ ఆకారములుగల సంవిత్తు విభాగం – జలంలోని అనేక తరంగాలులాగా!
2. ఏకమగు సన్మాత్ర విభాగం – అనేక తరంగములలోని ఏకైక జలంలాగా!

ఈ నీవు, నేను, కొండలు, కుండ, వస్త్రం – ఇవన్నీ 'సత్త' యొక్క వివిధ రూపములు మాత్రమే. నీవిక ఈ సర్వవిధ విభాగములూ త్యజించి సర్వదా సర్వుల స్వరూపం అయినట్టి ఏకమాత్రసత్తను ఆశ్రయించు. అదియే ఈ చరాచర సర్వజగత్తుకు అధిష్ఠానమైయున్నది. సర్వ విశేషములు త్యజించబడగా... అప్పుడు సర్వత్రా వ్యాపించి ఉన్నట్టి నిర్లిప్తమగు ఆ 'సన్మాత్ర సత్త' యొక్క ఏకమగు మహద్రూపం అనుభవం కాగలదు. అదియే బ్రహ్మపదము సుమా!

శ్రీరాముడు : అరూపమగు ఆత్మయందు రూపసహితమగు ఈ జగత్తు ఎలా ఏర్పడి ఉంటోంది?

శ్రీవసిష్ఠ మహర్షి : కుండకు ఆకారం ఉన్నది. దాని మూల పదార్థమగు మట్టికి ఆకారం ఉన్నదా? లేదే! వస్త్రం యొక్క స్వభావము గాని, స్వరూపముగాని దూదిలో కనబడుతోందా? లేదు. అయితే, వస్త్రమంతా తయారయినది దూదితోనే కదా! సన్మాత్రము ప్రకటితమగుచున్నప్పటికీ, అద్దానియందు 'నేను – నీవు' అనునవేవీ లేవు.

శ్రీరాముడు : మరి 'కాలము' మాట ఏమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : కాలసత్త కూడా వస్తుసత్తలాగానే ప్రమేయస్వభావముచే కల్పనా పూర్వకమై ఏర్పడి ఉంటోంది. ఆత్మసత్త అప్రమేయమై అవిభక్త రూపమున ఏర్పడి ఉంటూనే వస్తుప్రమేయముచే కాలబద్ధముగా, విభక్తరూపమున కన్పట్టుచున్నది. విభాగము లేనిచోట విభాగము భ్రమచే అనుభవ మగుచున్నదని గ్రహించు.

కనుక రామా! "ఈ దృశ్యమంతా ఏకైక సత్తాయే" అను భావన చేయి. "సర్వ దృశ్యవస్తువులందూ ఏర్పడి ఉన్నది ఆ ఏకైక సత్తయే" అను దృష్టిని బలపరచుకో. అట్టి భావనచే సర్వదిశలను, ఆ దిశ లందుగల సర్వ పదార్థములనూ పరిపూర్ణమొనర్చుము. నీయొక్క సత్తయే నీయందును, నీచేగాంచబడే దృశ్యమునందును వెలుగొందుచున్నదయ్యా! సూర్యుని నుండి అనంత కిరణములు బయలుదేరి అసంఖ్యాక వస్తువులను ప్రకాశింపజేయుచున్నట్లు ఏకైక సత్త ఈ సర్వ శరీరములను, చిత్తములను, తదితర అసంఖ్యాకవస్తు సమన్వితమగు జగత్తును ఎరుకచే ప్రకాశింపజేయుచున్నది.

"ధర్మము – ధర్మిష్టి, సత్ – అద్దాని విషయములు" లయమొందినప్పుడు, అప్పటికి ఇంకా శేషించియుండేది ఆ ఏకైక సత్తయే. అద్దానియందు ఉపాధులు మొదలైనవి ఉండకపోయినప్పటికీ భూత, భవిష్యత్తులలో ఏర్పడే సర్వ జీవులు అదే!

❖

నిర్వికారమగు అట్టి ఆత్మపదమున స్థిరపడినవాడు అరుచికరమగు ఈ సంసారమునకు తిరిగిరాడు. అదియే 'మోక్షసాధన' అని, 'పురుషోత్తమ ప్రాప్తి' అని చెప్పబడుతోంది.

అట్టి పదమే సర్వకారణములకు కారణమైయున్నది. ఇక దానికి మరో కారణమైనదేదీ ఉండదు. కారణములకు కారణం, సారమునకు సారమగు ఆ శుద్ధ పరబ్రహ్మమే ఈ జీవుని స్వరూపమై ఉండగా... ఈతడు అజ్ఞానదృష్టిచే భేదకల్పనను ఆశ్రయించి "నేను నిస్సారుడను, నిస్సహాయుడను, అల్పమేధస్కుడను"... అని వాపోవుచున్నాడు. దానికంతటికీ కారణం స్వస్వరూపాన్ని ఏమరచి దృశ్యవిషయములందు తాదాత్మ్యమొందటమే సుమా! ఈ జీవుడు జ్ఞానాన్ని పెంపొందించుకో నంతకాలం, అప్రమేయమగు తన బ్రాహ్మీస్వరూపమును ఎరిగి ప్రశాంతుడవనంతకాలం ఈ జన్మ – కర్మల ప్రహసనం తప్పేది కాదు. "నేను భేదాభేదములకు అతీతుడను. ఆద్యంతములు లేనట్టి నేను ఈ జన్మ – జీవన – మృత్యువుల వంటి అల్ప సంఘటనలచే ఎట్లా పరిమితుడనౌతాను?" – అని ఈ జీవుడు గ్రహించుగాక! అట్టి సదవగాహనకు ఉపకరించటానికే ఆత్మజ్ఞులైనవారిచే ఈ యోగావాసిష్ఠాది శాస్త్ర ప్రవచనములు జీవునకు అందించబడుచున్నాయి.

తత్త్వమెరిగిన తరువాత రామా, ఇక నీకు బంధమేమిటి? మోక్షమేమిటి? మేఘములు ఆకాశంలో ప్రయాణిస్తున్నంత మాత్రం చేత ఆకాశముయొక్క అనంతత్వానికి వచ్చే లోటేమిటి? కించిత్ అజ్ఞానం వచ్చి ఒకానొక సమయంలో ఆవరించి యున్నంతమాత్రం చేత ఈ జీవుని అనంతత్వానికి వచ్చే లోటేమీ ఉండదు – అని సర్వజనులు గ్రహించండి. నిశ్చింతులై ఉండండి.

ఒడ్డున ఉన్న చెట్లు తటాకంలో ప్రతిబింబిస్తున్నట్లు నిర్లిప్తము, అసంగము అగు ఆత్మ యందు ఈ జగత్తు ప్రతిబింబిస్తోంది. ఈ పదార్థములన్నీ తమ యందు ప్రత్యక్ చైతన్యము అంతస్థమై ఉండుట చేతనే ప్రీతివంతమౌతున్నాయి. నాలుకకు రుచులు వ్యక్తమగుచున్నట్లు ఆ ఆత్మసముద్రము నందే సర్వానందములు వ్యక్తమగుచున్నాయి. ఈ విషయములో ఇవి స్వయంగా స్వాదురహితం (Tastless) అయినప్పటికీ, అవి ఆత్మ సంయోగముచేతనే స్వాదుత్వం పొందుచున్నాయి. ప్రియమైన వాటన్నిటి కంటే ప్రియాతిప్రియమైనది ఆత్మవస్తువే.

ఆనందమయమగు ఆ పరమాత్మ నుండే సమస్త బ్రహ్మాండ సమూహములన్నీ ఉత్పన్నము లగుచున్నాయి. అవన్నీ వానియందే స్థితికలిగి ఉంటున్నాయి. ఆ పరమాత్మ తత్త్వము... గురుతరమైన వాటన్నిటికంటే గురుతరమైనది.

సూక్ష్మతరమైన వాటన్నిటి కంటే సూక్ష్మాతిసూక్ష్మమైనది. స్థూలములైన వాటన్నిటి కంటే అత్యంత స్థూలమైనది. సమీపమైనవాటన్నిటి కంటే సమీపమైనది. జ్యేష్ఠతరములైన వాటన్నిటి కంటే జ్యేష్ఠతరమైనది.

ఆ పరమాత్మ స్థానం సర్వప్రయత్నములకు ఆత్యంతికమైనది. అక్కడ సర్వ శ్రమలు రహిత మౌతాయి. కనుక అన్నిటికంటే సులభమైనది అదే! అదియే తేజమును తేజము. అంధకారములన్నిటి కంటే అంధకారం అదే! దిక్కులన్నిటికీ దిక్కు అది. అది లోకములకు సంబంధించినది కాదు. కాని

లోకంలోని సర్వ విషయాలు అదే! భావా భావముల, దృశ్యా దృశ్యముల, చైతన్య అహంకారముల రూపంగా ప్రకాశించేదంతా అదే.

ఓ శుద్ధాంతర్గత స్వరూపుడా! రామచంద్రా! ఏఏ ఉపాయములచే నీవు పరమ పవిత్రమగు ఆ ఆత్మపదమునందు స్థితి పొంది ఉండగలవో, సర్వ ప్రయత్నములచేతనూ అవి ఆచరించు.

శ్రీరాముడు : అందుకు వేరు వేరు ఉపాయములు ఉన్నాయి కదా?

శ్రీవసిష్ఠ మహర్షి : అవును. యోగ, జ్ఞానాది వేరు వేరు ఉపాయాలు ఉన్నాయి. అయితే ఓ సర్వ జనులారా! వేరు వేరు ఉపాయములు ఉన్నంత మాత్రంచేత "వారు వేరు.. మేము వేరు" – అను భ్రమలను ఆహ్వానించి, తత్ఫలితంగా ఆత్మ వస్తువును పోగొట్టుకొనకుండెదరు గాక! "ఆ ఆత్మ పదము అతి పవిత్రము, భేదాభేదరహితము, పరమ పదము" – అని గ్రహించి, అటుపై మీకు అనుకూలములైన మార్గములలో మీమీ ప్రయత్నములు కొనసాగించండి. అంతేగాని తదితరులు ఎందుకు ఎంతవరకు తప్పుచేస్తున్నారో లెక్కలు కట్టుకుంటూ మీ పురోభివృద్ధిని ఆటంక పరచుకోకండి. జన్మజరా వర్జితమగు ఆత్మ పదమును వదలి తుచ్ఛ తృణములకై ప్రాకులాడి మహత్తరమైన "మానవ ఉపాధి" అనే అవకాశాన్ని వ్యర్థం చేసుకోవాలనుకునేవారికి ఇక నేను చెప్పేదేమున్నది?

ఓ సర్వ సదేహ మిత్రులారా! ఈ సర్వమూ ఆత్మచే ఆక్రమించబడియున్నది. అద్దాని సాక్షాత్కారము కొరకు ప్రయత్నించి ఈ చిత్తమును ఉపశమింపజేయండి.

ఎప్పుడైతే మీరు మీ యొక్క సర్వవ్యాపక, విషయాతీతస్వరూపమును ఎరుగుతారో అప్పుడు సర్వ పునరావృత్తులు శమించి ఈ సంసార భయము నుండి విముక్తులు కాగలరు.

❖❖❖

9. మూడు అభ్యాసాలు ఒకేసారి!

శ్రీరాముడు : మహనీయుడగు ఓ వసిష్ఠమహర్షీ! మీ యొక్క ప్రవచనం అమోఘం. ఒక చిన్న ప్రశ్న– "ఈ సంసారమునకు బీజమేమిటి?" అను విషయంలో మీరు అనేక విషయాలు ప్రస్తావించారు. ఒక దానికి మరొకటి ఎట్లు బీజమగుచున్నదో కూడా వర్ణించి చెప్పారు. 1. దృశ్యప్రపంచము 2. శరీరము 3. చిత్తము 4. వాసనలు 5. ప్రతిబింబ చైతన్యము 6. బింబ చైతన్యము... మొదలైనవన్నీ సంసార ప్రాప్తికి బీజమగుచున్న వైనమంతా వివరించారు. అయితే, వీటిలో అసలైన దుఃఖబీజమేది? సాధన దృష్ట్యా వీటిలో దేనిని ఎక్కువగా దృష్టిలో పెట్టుకొని, ప్రవృత్తింపజేయుటచే, లేదా, నివృత్తింప జేయుటచే.... జీవుడు త్వరగా దుఃఖమును జయించి, సంసారమును నివృత్తింపజేసి ఆత్మ పదమును అధిరోహించగలడో – అద్దాని గురించి చెప్పండి.

శ్రీవసిష్ఠమహర్షి :

ఏతేషాం దుఃఖ బీజానాం ప్రోక్తం యద్యన్మయోత్తరమ్ ।
తస్య తస్య ప్రయోగేణ శ్రీఘ్రమాసాద్యతే పదమ్ ॥

రామయ్యా! ఏదేది ఎట్లు సంసారమునకు బీజమగుచున్నదో – అద్దాని విషయమై మనం వివరణ – సమాధానాల రూపంలో ఇప్పటిదాకా చెప్పుకున్నాం. ఈ జీవుడు యత్నపూర్వకం లాగా దేని స్థానమేమిటో గ్రహించి, వాటిని సద్వినియోగపరచుకొని క్రమంగా అనేక భేదములతోకూడిన సంసారము నుండి భేదరహితమగు సత్తా సామాన్య స్థితి జేరుకోవాలి. సాధన ఏదైనా, "శ్రద్ధతో, పట్టుదలతో ప్రయత్నం చేస్తున్నామా? లేదా?" – అనేది ముఖ్యం. పురుషప్రయత్నముచే వాసనలను త్యజించి 'సత్తా సామాన్యము' (Sense of equality) యొక్క పరాకాష్ఠ అయినట్టి చిత్ రూపంతో ఐక్యత పొంది, అక్కడ క్షణమైనా నిశ్చలస్థితి కలిగియున్నావనుకో... తక్షణమే నీవా ఉత్తమ పదము పొందినట్లే. భేదములన్నీ ప్రయత్నం చేసి జయించు. ఇక ఆపై బోధరూపమగు ఆత్మానుభవం కొద్ది ప్రయత్నంతోనే ప్రాప్తించగలదు. 'ఏకము'ను వదలి 'అనేకము'ను అంటిబెట్టుకొని ఎంతకాలం ఏ సాధనల ద్వారా ప్రయత్నిస్తూ పోయినా, ఆ తత్‌పదము దుర్లభంగానే ఉండిపోతుంది.

మనం ఇతఃపూర్వమే రెండు విభాగాలు గురించి చెప్పుకున్నాం– సంవిత్ (తెలుసుకుంటున్నది); సంవేద్యము (తెలియబడుచున్నది).

"తెలుసుకుంటున్నది" అయినట్టి సంవిత్ తత్వమునందు ధ్యాననిష్ఠతో ప్రయత్నశీలుడవై ఉంటే, ఆ ప్రయత్నము ఆత్మ పదమునకు చేరవేయగలదు.

తెలియబడుచున్నదాని కన్నా ముందే, దానికి ఆవల 'తెలుసుకుంటున్నది' ఉండి ఉన్నది కదా! అందుచేత 'తెలియబడేది' సాధనగా తీసుకొని ఎంతకాలం ఎంతగా ప్రయత్నించినా – చివరికి సంవిత్తును, ఆశ్రయించకుండా ఆత్మ పదమును అధిరోహించలేవని గ్రహించు.

లేదా, ఒక పని చేయి. "నేను ఏది చింతన చేస్తున్నానో, ఎక్కడ నడుస్తున్నానో, ఎక్కడ ఉన్నానో, ఎక్కడ ఆయా క్రియలు నిర్వర్తిస్తున్నానో – అచటచట సంవిత్తే ఏర్పడి, ఆక్రమించుకొని ఉన్నది. అనగా సంవేద్యము సంవిత్తును ఆక్రమించుకుని ఉండజాలదు. సంవిత్తే సంవేద్యమును ప్రవర్తింప జేస్తోంది" అని ఆరూఢపరచుకొని, అప్పుడిక నీ సాధన కొనసాగించు. వాసనలను త్యజించడానికి యత్నములుచేయి. అప్పుడు నీ శారీరక, మానసిక దుఃఖములన్నీ తప్పక నశిస్తాయి.

సంవిత్‌ను ఆశ్రయించటం... శోధిత 'తత్' అంటారు.

సంవేద్యమును ఆశ్రయించటం... శోధిత త్వమ్ అంటారు.

ఉత్తమ పురుష ప్రయత్న ప్రాశస్త్యం గురించి నీకు ముముక్షు ప్రకరణాదిగా చెప్పుకుంటూనే వస్తున్నాను. కనుక ప్రయత్నించటం, అది కొనసాగించటం, ఆత్మ పదమును అధిరోహించటం – అనేదే నీ మార్గం.

❖

అయితే అన్ని ప్రయత్నాలకన్నా కష్టమైనదేది?... వాసనలను త్యజించటం. ఒక పెద్ద కొండను మొదలంట లేపి గాలిలోకి విసరటం సుసాధ్యపడవచ్చునేమో గాని, వాసనాత్యాగం అంత తేలిక కాదు.

మనస్సు లయం కానంతవరకూ వాసనలు ఉండనే ఉంటాయి. వాసనలు క్షయించనంతవరకూ

చిత్తము శమించదు. తత్త్వజ్ఞానం కలుగనంతవరకు వాసనలు శమించవు. చిత్తము శమించనంతవరకూ వాసనలు ఉంటూనే ఉంటాయి.

1. మనోనాశనం 2. వాసనాక్షయం 3. తత్త్వజ్ఞానం ఈ మూడూ పరస్పర కారణం కలిగి ఉన్నాయి. అందుచేతనే అందులో ఏ ఒక్కటి మాత్రమే సాధించాలన్నా జీవునకు కష్టసాధ్యమే అవుతోంది. అందుచేత రాఘవా! వివేక యుక్తమగు ఉత్తమ ప్రయత్నంచేసి భోగములతో ఏర్పడే ఇచ్ఛను జయించాలి. వాసనా క్షయం, మనో నాశనం, తత్త్వజ్ఞానం – అనే మూడిటిని ఒక్కసారే చక్కగా ఆశ్రయించాలి. పరమ శివుడు త్రిపురాసురిడిని ఒక్కసారే మూడు పురములలో మట్టుబెట్టినట్లు ఈ మూడిటిని జీవుడు సాధించుకోవాలి.

ఈ మూడిటినీ ఒకేసారి మరల మరల అభ్యసించకపోతే ఆ బ్రహ్మపదం ఎన్ని సంవత్సరములు గడచిపోతున్నా లభించదు. చిరకాలం అట్లా అభ్యసిస్తే ఆ ప్రయత్నం తప్పక ఫలప్రదమౌతుంది.

❖

అట్లా కాకుండా, ఆ మూడిటిలో ఒక్కొక్కదానినే తీసుకొని వాసనాక్షయం అయిన తరువాత మనస్సు సంగతి చూస్తాను... అప్పుడు మనస్సును కూడా నశింపజేసి ఆ తరువాత తత్త్వజ్ఞానం సంపాదిస్తాను... అనుకుని ప్రయత్నాలకు ఉపక్రమించావా – దోషభూయిష్టములతో కూడిన మంత్ర సాధనాకార్యక్రమంలాగా, పథ్యమును వదలి ఔషధం సేవించటంలాగా నిష్ప్రయోజనమౌతాయని హెచ్చరిస్తున్నాను. ముగ్గురు శత్రువులు మీద పడుచున్నప్పుడు అందులో ఒక్కొక్క శత్రువుతో మాత్రమే యుద్ధంచేసి శత్రునిర్మూలనం చెయ్యాలంటే ఎట్లా కుదురుతుంది? ముగ్గురితో ఒక్కసారే యుద్ధంచేయటానికి సంసిద్ధుడవు కావాలి కదా! అట్లాగే... వాసనాక్షయం, మనోనాశనం, తత్త్వజ్ఞాన సముపార్జన – అనే మూడిటిలో ఒక్కొక్కదానిని విడివిడిగా ఆశ్రయిస్తే పరమాత్మను పొందలేమని నా అభిప్రాయం. బుద్ధిమంతుడైనవాడు ఆ మూడిటినీ ఒక్కసారే అభ్యసిస్తే తప్పకుండా సంసార సాగరమును విచ్ఛిన్నం చేయగలడు. ఇది సుసాధ్యమే! ఇందులో సందేహం లేదు. నీవావిధంగా ఆచరించి నిస్సంగభావం పెంపొందించుకుని బ్రహ్మపదమున సంస్థితుడవయ్యెదవుగాక! అప్పుడు హృదయ గ్రంథులన్నీ తమంతట తామే తొలగుతాయి.

❖❖❖

10. యుక్తి - ఉపాయం

శ్రీవసిష్ఠ మహర్షి : ఓ రామయ్యా! ఈ జీవుని యొక్క ఇప్పటి సంసార స్థితి ఎక్కడి నుండి వచ్చిపడింది? అనేక జన్మలలో అభ్యసించినదే ఇట్లు ప్రయోజనరూపంలో సంప్రాప్తమౌతోంది. ఇది చిరకాలాభ్యాసం లేనిదే తొలగేది కాదు. అందుచేత ఆతడు నడుస్తున్నప్పుడు, కదులుచున్నప్పుడు, తిరుగుచున్నప్పుడు, తినుచున్నప్పుడు, వినుచున్నప్పుడు, తాకుచున్నప్పుడు, వాసన చూస్తున్నప్పుడు, నిద్రిస్తున్నప్పుడు, మేల్కొని ఉన్నప్పుడు – అన్ని సందర్భములలోనూ పరమ శ్రేయమగు మోక్షసాధనకొరకు వాసనాక్షయం,

మనోనాశనం, తత్వజ్ఞానం అనే మూడిటినీ సదా అభ్యసిస్తూనే ఉండాలి. దృశ్యముపట్ల ఏర్పడే ఆకర్షణ, వికర్షణలను తగ్గించుకుంటూ మరొక వైపునుండి "ప్రాణాయామం" వంటి యోగాభ్యాసాలను ఆశ్రయించునుగాక! వాసనాత్యాగ, ప్రాణనిరోధముల సహాయంతో చిత్తము అచిత్తత్వం పొందుతుంది.

ప్రాణాయామాభ్యాసం చేతను, యోగాభ్యాసకుశలురైన గురువులు మనకు ప్రసాదిస్తున్న తదితరయుక్తులచేతను, హిత – మిత – పవిత్ర భోజనముచేతను, యమ నియమాదుల రూపంలో గల విధి, విధానముల చేతను, ఆసనజయముచేతను ప్రాణచలనం నిరుద్ధం కాగలదు.

నిర్వివాదము, సన్మాత్రము అగు ఆత్మయే సర్వ వస్తువుల ఆద్యంతములందూ ఏర్పడి ఉన్నది – అను యథార్థదర్శనం అభ్యసించుచూ వస్తే అప్పుడు వాసనలు ప్రవర్తించటం సన్నగిల్లగలదు. బహిర్ముఖములగుచున్న జనుల దృష్టులతో సాంగత్యం కొనసాగించకపోవటం చేతనూ, సాంసారిక మనోరథములు వదులుకుంటూ రావటం చేతనూ 'ఆత్మదర్శనజ్ఞానం కలుగుతుంది. దాని చేతనే వాసనాక్షయం కూడా కలుగుతుంది. ఈ శరీరం, దీని తీరు, ఇది పుట్టి, పెరిగి, నశించే విధం – పరికిస్తూ ఉండటంచేత కూడా వాసనలు సంక్షయిస్తూ ఉంటాయి. వాసనల విభవము సన్నగిల్లు చుండగా, ఇక చిత్తము ప్రవర్తించటం మానివేస్తుంది. గాలి వీచటం ఆగితే ఆకాశంలోని ధూళి కూడా శమిస్తుంది! ప్రాణ స్పందనమే చిత్త స్పందనమైయున్నదని అనుకున్నాం కదా!

❖

ధూళి గుట్టల నుండి ధూళి లేస్తున్నట్లు ఈ ప్రాణ సంచలనం కారణంగా ప్రపంచమున అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి. అందుకనే ఏకాంతంలో కూర్చుని ప్రాణస్పందననిరోధం కొరకై పలుమార్లు మిక్కిలి ప్రయత్నం చేయాలి. ఇష్టపూర్వకంగా అట్టి ప్రయత్నములు చిరకాలం చేస్తూ ఉండగా, ఆత్మ పదము తప్పక పొందుతావు. అంకుశం లేకపోతే దుష్ట ఏనుగు మాట వింటుందా? ఆధ్యాత్మ శాస్త్రములచే ఉదహరించబడుచున్న ఆయా ఉత్తమ ప్రయత్నములు చేయకపోతే చిత్తమును జయించటం అంత తేలికైన విషయం కాదు. ఏ ఉత్తమ ప్రయత్నాన్ని ఆశ్రయించకుండా మీనమేషాలు లెక్కకట్టుకుంటూ కాలం వెళ్ళబుచ్చుకుంటుంటే అట్టి జీవుని బ్రహ్మరుద్రాదులు కూడా కాపాడలేరు. కనుక ఓ జనులారా! లేవండి. లేచి నడుంకట్టండి. నడుంకట్టి సత్ప్రయత్నశీలురవండి. అల్పమార్గాలు ఆశ్రయించి. అల్పప్రయోజనములవైపు తరలి వెళ్ళాలనుకోవటం ఉచితమా? కానే కాదు.

1. అధ్యాత్మ విద్యాప్రాప్తి; 2. సాధు, మహాత్ములతో సాంగత్యం; 3. వాసనా త్యాగం; 4.ప్రాణ స్పంద నిరోధం... ఇవే చిత్తమును జయించటానికి ప్రబలమైన ఉపాయాలు.

ఓ సభికులారా! ఈ చిత్తమునకు మించిన శత్రువు భూనభోంతరాళాలలో మరింకేదీ లేదు. దీనిని సరి అయిన రీతిలో నియమించారా... ఇంతకు మించిన మిత్రుడు మరొకడెవ్వడూ ఉండడు.

గాలికి ఎగిరిన దుమ్ము జలధారలచే అణిగిపోవునట్లు చక్కటి యుక్తులచే చిత్తము శీఘ్రంగా జయింపబడగలదు.

శ్రీరాముడు : మహాత్మా! హఠయోగంచే ఈ శరీరమును పరిశ్రమింపజేసి, ఎంతో శ్రమకు ఓర్చి కొందరు చిత్తమును ఉపశమింపజేయటానికి ప్రయత్నిస్తున్నారు కదా! వారు దేహము శుష్కింపజేసి,

కష్టతరమగు హస్తపాదాదుల నియమములచే మనోవాక్ ఇంద్రియములను స్వాధీనపరచుకొని, శోషింపజేసి చిత్తమును తమ వశం చేసుకోవాలని ఉద్దేశిస్తున్నారు. అట్టి ఉద్దేశము ఉచితమేనా? మేము కూడా చిత్తశత్రువును జయించటానికి అట్టి హఠయోగం ఆశ్రయించవలెనని మీ అభిప్రాయమా?

శ్రీవసిష్ఠ మహర్షి : సద్గురువులగు మార్గదర్శకులచే ఎన్నో సులభమైన ఉపాయాలు ప్రవచించబడ్డాయి. ధ్యానం, ప్రాణాయామం, నామస్మరణ, కర్మ ఫలసమర్పణ, పూజ, దానాదులు – ఎన్నో సున్నితమైన సరళమైన ఉపాయాలు ఉన్నాయి. అట్టి సుఖకరము, సులభ సాధ్యము అగు ఉపాయాలను వదలి, భగవద్దత్తమగు ఈ ఉపాధిని శుష్కింపజేస్తూ మంత్రతంత్రాదులచే హఠంగా చిత్తమును వశపరచుకోవాలనుకోవటం మా ఉద్దేశంలో ఏమంత ఉచితం కాదు.

ఎవ్వనికైనా, దీపాన్ని వదలి మసితో (కాటుకతో) చీకటిని తుడిచి వేయాలనుకోవటం, పిడికిలి గుద్దులతో మదపుటేనుగును నిలిపి ఉంచాలనుకోవటం తేలికైన పనేనా? చిత్తమును, చిత్తమునకు ఉపకరణమగు ఈ దేహమును స్వస్థపరచి క్రమంగా మనస్సును సుస్థిరీకరించటానికి 'యుక్తి'ని ఆశ్రయించాలి. సర్వ శక్తి సమన్వితమగు చిత్తము ముందు ఏ శక్తి ఎట్లు ఉపయోగిస్తుంది? యుక్తిని వదలి మొండిగా, మూర్ఖంగా హఠం మొదలైన భయమును గొలిపే బలవత్పూర్వక యత్నములు చేయు వారిని ఆత్మ శాస్త్రజ్ఞులు 'శఠులు, మొండివారు' అని పిలుస్తున్నారు. అట్టివారు ఒక భయమునుండి మరొక భయమునకూ, ఒక క్లేశము నుండి మరొక క్లేశమునకూ పయనిస్తున్నారని గ్రహించు. వారికి ధైర్యం, విశ్రాంతులు లభించటంలేదు. తాము భయపడుచు, తదితరులను భయపెట్టుచూ, మూర్ఖము, బుద్ధిహీనము అగు లేళ్ళు పరుగులు తీస్తున్నట్లు హఠం కొనసాగిస్తున్నారు. అల్పము, భేదాశ్రయము అగు వారి బుద్ధి ఎక్కడా విశ్వాసం సంపాదించలేక భీతినే పొందుతోంది. జ్ఞానబలిమి లేక వారి చిత్తము అనేక చింతలందు వ్యాప్తమై ఉంటోంది. నదీ జలంలో తృణములు (గడ్డిపరకలు) లాగా వారి మనస్సు రాగద్వేషాదులందు కొట్టుమిట్టాడటమే జరుగుతోంది.

అందుచేత, హఠంచే "నేను వేరు, ఈ తదితర జనులు వేరు. ఆ పరమాత్మ వేరు. క్రూరమైనట్టి ఏమైనా నియమములచేత గాని నేను దైవమును గాంచలేను" – అని అనుకోవటం వేదవేదాంతాల అంతర్లీన గానం పెడచెవిని పెట్టటమేనని మా అభిప్రాయం. ఓ మిత్రులారా! మీరు ఆవేశకావేషాలతో హఠం ఆశ్రయిస్తే తుచ్ఛ విషయములే ఎదురౌతాయి గాని, సర్వసమదృష్టి పూర్వకమగు ఆత్మానుభవం కాకపోవచ్చునని హెచ్చరిక చేస్తున్నాను.

❖

మరికొందరు ఆత్మ విషయ విచారణను ఆశ్రయించక, కేవలం, యజ్ఞ, తప, తీర్థాదులకే తమ యత్నములను పరిమితం చేసుకుంటున్నారు. ఏది ఎందుకు ఉన్నదో గ్రహించలేకపోతున్నారు. తమలో సర్వదా వేంచేసియున్న ఆత్మ భగవానునివైపు తమ దృష్టిని మరల్చుకోవటం లేదు. ఫలితంగా అసలు విషయమేమిటో గ్రహించకుండానే అరణ్యంలో దారితప్పిన జింకలాగా అనేక మానసిక వ్యధలతో చిరకాలం గడిపివేస్తున్నారు. జ్ఞానముచే ఆత్మజ్ఞానము కొరకై సత్ప్రయత్నము లందు

నియమితులవటం మంచిది గాని, గుడ్డిఎద్దు చేలో పడ్డట్లు సంకుచిత దర్శనమునకు బద్ధులు కాకూడదని అట్టివారికి గుర్తుచేస్తున్నాను. "నా బాహ్య అభ్యంతరములందు సర్వదా ఆత్మయే సమస్తంగా ఏర్పడి ఉన్నది. అది సర్వ శుద్ధము, అఖండము, అప్రమేయము" – అను భావమే ఆత్మీభావన. అట్టి ఆత్మీభావనను ఆశ్రయించకుండా, కేవలం కథలకు, వర్ణనలకు, ఆకారాదులకు పరిమితులైతే ఎట్లా? చిత్రపటంలోని పండు ఆకలి తీర్చగలదా? 'త్వమ్' భావనాపరిమితులవటంచేత బహువిధ దుఃఖాల చేతనూ, రాగాది దోషములచేతనూ వారు పలువైపుల నుండి పీడితులగు చున్నారు. తమ చెంతనే తమ స్వరూపమై వెల్లివిరిసియున్న ఆత్మ యొక్క అభేద తత్త్వమును గ్రహించ లేకపోతున్నారు.

శ్రీరాముడు : అట్లా ఎందుకు జరుగుతోంది మహర్షీ? వారికి తరుణోపాయమేమిటి?

శ్రీవసిష్ఠ మహర్షి : వారి ప్రయత్నములు 'వృథా' అని నా ఉద్దేశం కాదు. అయితే దేహాత్మభావన త్యజించ నంతకాలం ఒకప్పుడు స్వర్గమును, మరొకప్పుడు నరకమును పొందవలసిన అగత్యం ఏర్పడుచూనే ఉంటుంది. "అనిత్యము, స్వర్గ – నరక – భవభోగముల నిమిత్తమై పతనోత్పతనములు పొందేది అయినట్టి ఈ దేహం నేను కాదు. నా స్వరూప, స్వభావములు దేహముకంటే విలక్షణమైనవి" – అను ఆత్మజ్ఞానం ఆశ్రయిస్తే అన్ని రుగ్మతలు వాటంతట అవే తొలగుతాయి. అందుచేత దేహాత్మభావన విడచుచూ, జ్ఞాన దృష్టితో వారివారి ప్రయత్నములు నిర్వర్తించెదరుగాక! అట్టివారిపై గల అవ్యాజమైన ప్రేమ చేతనే ఆ పరమేశ్వరుడు మనకు ఈ యోగవాసిష్ఠాది ఆత్మ సమాచారాలు, గ్రంథములు ప్రసాదించుచున్నారు. అందుచేత రామా! తటాక జలంలాగా వృత్తులను పొందుచూ, కొనసాగిస్తూ ఉంటే సరిపోదు. వృత్తిరహితము, సర్వసాక్షి, సర్వ సంకల్ప వికల్పములకు ఆవల ఉన్నది, సంవిత్ అని చెప్పబడుచున్నదియు అగు ఆత్మతత్త్వమును దర్శించాలి. అందుకు సదుద్దేశంతో చేసే ఆయా యజ్ఞ, తప, తీర్థాది, ప్రయత్నములు నిర్మల హృదయ సముపార్జన రూపమున తప్పక సహకరిస్తాయి.

అందుచేత... తెలియబడుదాని నుండి – 'తెలివి' లేక తెలుసుకొనుచున్న దానివైపుగా, సంవేద్యము నుండి – సంవిత్తు వైపుగా, శోధితత్వమ్ (Creation) నుండి–శోధితతత్ (Creator) వైపుగా సాధకులు పురోగమించెదరు గాక!

కాబట్టి రామా! ఆత్మానుభవార్థమై క్రమక్రమంగా సర్వదోష దృష్టులు వదలివేయుము. శుద్ధ సంవిత్తును ఆశ్రయించు. వీతరాగుడవై ఉన్నచోటనే సుస్థితుడవు, స్వస్థుడవు, ఆత్మానుభవ సమన్వితుడవు కమ్ము. ఈ సాంసారిక రుగ్మతలన్నిటికీ రహితస్థానం అదే!

జ్ఞానవానేవ సుఖవాన్! జ్ఞానవానేవ జీవతి! ।
జ్ఞానవానేవ బలవాన్! తస్మాత్ జ్ఞానమయోభవ ॥

ఈ ప్రపంచంలో జ్ఞానవంతుడే సుఖిస్తున్నాడు. జ్ఞానవంతుని జీవితమే సఫలం పొందుతోంది. జ్ఞానవంతుడే బలసమన్వితుడు కూడా! అందుచేత నీవు జ్ఞానమయుడవు కమ్ము.

మహాత్మా, రామచంద్రా! విషయవర్జితం, సర్వోత్తమం, అనాది, కల్పనా రహితం, నిర్వికారం అయినట్టి 'సంవిత్' పదమును నీవు ఆశ్రయిస్తూ ఉండు. కల్పనావర్జితుడవగుము. హృదయాకాశమున

ప్రశాంతుడవై సుస్థితుడవు కమ్ము. బ్రహ్మమును సమాధియందు సంభావించు. మరల వ్యుత్థాన కాలంలో (సమాధి నుండి బయల్వెడలినప్పుడు) శమముతో లోన - బయట నింపివేసి, ఆపై యథోచితములగు క్రియలను నిర్వర్తిస్తూ ఉండు. మనం ఇప్పటివరకూ చెప్పుకున్నట్టి జీవన్ముక్తుని గుణసంపదను సంతరించుకున్నవాడివై అకర్తృత్వ పదమును పొందియుండుము.

❖❖❖

11. జ్ఞానవానేవ బలవాన్

శ్రీవసిష్ఠమహర్షి : ఎవ్వరైనాసరే.... కాస్తయినా విచారణ చేసి తన చిత్తమును కొంచమైనా నిగ్రహించగలిగితేనే తమ జీవితమును కొంతైనా సఫలం చేసుకున్నట్లు. విచారణ అనే కోమలమైన కల్పవృక్షాంకురం హృదయంలో స్ఫురించిందా – అది త్వరలో అభ్యాసయోగం చేత క్రమంగా అనంత శాఖాయుతం కాగలదు. నిండు సరస్సును పక్షులు, చేపలు స్వయంగానే వచ్చి ఆశ్రయిస్తాయి చూచావా? కొంచెం ప్రౌఢవిచారణ గల వైరాగ్యయుతుడగు మానవుని శమము, దమము, దయ, దాక్షిణ్యము, స్నేహము, సాత్వికము – మొదలైన శుద్ధగుణములు స్వయంగా వచ్చి ఆశ్రయిస్తాయి.

ఉత్తమ విచారవంతులు, యథార్థమగు ఆత్మతత్త్వమును గాంచువారు అగు బుద్ధిమంతులు, మహనీయులు ఈ భూమిపై ఎందరో ఉన్నారు. అట్టి జ్ఞానులను బ్రహ్మదేవుని వరకు గల మహదైశ్వర్యములు కూడా ఏమాత్రం ప్రలోభింపజేయలేవు. 'ఆత్మసాక్షాత్కారము' అను సమ్యక్ దర్శనమును సంపాదించుకున్న ఆ మహనీయులను ఇక్కడి ప్రాపంచిక సంఘటనలుగాని, మానసిక వృత్తులుగాని, శారీరక – మానసిక వ్యధలుగానీ సమీపించవు. వారు తమను – తదితరులను కూడా సర్వాతీతమైనట్టి ఏకైక ఆత్మవస్తువుగా దర్శిస్తూ ఉంటారు.

❖

వాయువేగముతో కూడిన ప్రళయకాల మేఘమును వీధిలో ఆడుకుంటున్న చిన్న పిల్లలు తమ పిడికిళ్ళతో పట్టుకోగలరా? ముగ్ధస్త్రీలు ఆకాశంలో ప్రశాంతంగా ప్రకాశిస్తున్న చంద్రబింబమును పట్టుకొని తమ పేటికలో బంధించగలరా? ఐదు-ఆరు దోమలు ఒక చోటికిజేరి మదగజమును నిరోధించగలవా? కొన్ని చిరుకప్పలు ఒకటై కొండచిలువను దిగమ్రింగగలవా? జ్ఞేయమగు ఆత్మ వస్తువును గ్రహించిన వివేకి ఈ ప్రపంచమున సంచరిస్తున్నప్పటికీ, ఇక్కడి పదార్థములు, ఇంద్రియాలకు గోచరించే వస్తుజాలాదులు, సంసార జనుల అభిప్రాయాదులు ఆతనిని ఆకర్షించలేవు. చ్యుతుని చేయలేవు. ఆత్మజ్ఞుని ఆకర్షించగల వస్తువిక్కడేమున్నది? ఆత్మానుభవమునకు మించినదేమున్నది? ఓ రామచంద్రా! దుర్బల విచారణయుక్తుని ఈ విషయ శత్రువులు ఇట్టే నిర్జించివేస్తున్నాయి. ఇక వాయువీచికలచే ఎండుటాకులు ఎగురుచున్నట్లు ఆతడు సంసార ప్రదేశంలో అటూ ఇటూ ఈడ్చుకు పోబడుచున్నాడు. కానీ ప్రౌఢవివేకం గలవానిని ఈ రాగాది వృత్తులు లేశంకూడా బాధించలేవు. పిల్లగాలులు వెళ్ళి మేరుపర్వతాన్ని ఏంచేస్తాయి? అదృఢమైన విచారణ గలవానిని క్రిందు – మీదు

చేయటానికి స్వల్ప సంఘటనలు, కొద్దిపాటి చింతలు చాలు. అవే విషయాలు విచారయుక్తుని ముంగిట వ్రాలినప్పుడు, ఆతని జ్ఞానబలాన్ని చూడగానే రాగము-ద్వేషము మొ॥వి తోక ముడుస్తున్నాయి. అవి ఎటకో పలాయనం చిత్తగించవలసిందే!

ఎవ్వడైతే నిద్రిస్తున్నప్పుడు, మేల్కొని ఉన్నప్పుడు, కూర్చుని ఉన్నప్పుడు, నడుచుచున్నప్పుడూ ఆత్మ విచారయుతుడై ఉంటున్నాడో... ఆతని చిత్తము అల్లరిపోకడలకు దూరంగా ఉండి, ఈ మాయాజాల జగత్తును ప్రశాంతంగా గమనిస్తోంది. అట్లాగాకుండా మాయాజాలంలో ప్రవేశించి రాగాదులచే ప్రహర్షితుడైయ్యేవాడు మృతునితో సమానమేనని జ్ఞానుల అభిప్రాయం. ఓ రామా! నీవు సర్వదా అమృత స్వరూపుడవై ఉండెదవుగాక!

"కిమ్ ఇదంస్యాత్ జగత్? కింస్యాత్ దేహమ్?" – ఇత్యనిశం శనైః ।
విచారయత్ అధ్యాత్మదృశా, స్వయం వా, సజ్జనైః సహ ॥

"ఈ ప్రపంచమేమిటి? ఈ దేహమేమిటి?" అని నిరంతరం మరల మరల అధ్యాత్మదృష్టితో తనకు తానుగానో, లేక సజ్జనులతో కూడియో విచారణ చేస్తూ ఉండాలి. దీపం వెలిగించగానే గదిలో ఉన్న వస్తువులన్నీ స్పష్టంగా కనిపిస్తాయి కదా! 'ప్రమోదము' అనే చీకటిని నశింపజేయగల విచారణచే ఉత్తమ వివేకం ప్రాప్తిస్తుంది. అప్పుడీ జగత్తు ఏమిటో, ఏమై ఉన్నదో, ఏమికాబోతున్నదో... అంతా సుస్పష్టమౌతుంది.

జ్ఞానేన సర్వదుఃఖానాం వినాశ ఉపజాయతే ।
కృతాలోకవిలాసేన తమసామివ భానునా ॥

సూర్యుడు ఉదయించగానే చీకటి పటాపంచలైపోతోంది చూచావా? జ్ఞానంచే సర్వదుఃఖాలు సంక్షయిస్తాయి. చంద్ర ప్రకాశముచే జగత్తంతా ప్రశాంతమయమగుచున్నట్లు, జ్ఞానము ప్రవృత్తమగు చుండగా జ్ఞేయం స్వయంగా, పూర్ణరీతిగా గ్రహించబడుచూ, హృదయాకాశం ఆహ్లాదమయం కాగలదు.

ఓ రాఘవా! శాస్త్రవిచారణచేయి. అట్టి శాస్త్రవిచారణ నీకు బ్రహ్మతత్త్వమును ఎరుగజేయగలదు.

జ్ఞేయము తోటి అభిన్నత్వం ప్రసాదించేదే జ్ఞానం. విచారణచే జనించే పరమోత్తమమగు అవగాహనను విజ్ఞులు 'జ్ఞానం' అని పిలుస్తున్నారు. కల్లుత్రాగినప్పుడల్లా మత్తు వస్తుంది చూచావా? సమ్యక్ జ్ఞానం సంపాదించినప్పుడు స్వయముగా జ్ఞేయుడై ఉంటాడు. 'జ్ఞేయం' అంటే– సమం, నిర్మలం అగు బ్రహ్మమే. సాంసారిక జ్ఞేయం (That which is being Known while in wordly ignorance) జ్ఞానసముపార్జనచే స్వయంగా అవిద్యారహితం అగుచున్నది. జ్ఞానవంతుడు దేని యందునూ సంలగ్నం కాక సంగదోష రహితుడై, జీవన్ముక్తుడై పూర్ణమనోరథుడై సమ్రాడాత్మస్వరూపుడై ఉంటాడు.

❖

రామచంద్రా! జ్ఞాన సమన్వితుడైనవాడు మధురధ్వనులందుగాని, విషయభోగములందుగాని, సుందర వనితాది శబ్దములందుగాని, నృత్య, మధుర గీతాదులందుగాని తన చిత్తం లగ్నంచేయడు.

కర్కశ శబ్దములు తాను పలుకడు. అవి ఆతని చెవిని సోకవు. విషయములందు, వన క్రీడలందు ప్రీతి కలిగి ఉండడు. హంసకు మరుభూమి యందు ఆసక్తి ఉంటుందా? శాకాహారికి మాంస ఖండములను చూచినప్పుడు నోరూరదు కదా! ఆత్మచే పరితృప్తుడైనవానికి ప్రాపంచిక పదార్థములను చూచినంతమాత్రంచేత లోభ, మోహాలు పుట్టవు. ఆతనికి "యమ, సూర్య, చంద్ర, నక్షత్ర, వాయు, రుద్ర" – మొదలైన స్థానములందు గాని, మందర కైలాసాది పర్వత ప్రదేశములందు గాని, లౌకికమైన కళలందు గాని, సువర్ణరత్నమాణిక్యాదు లందుగాని, రంభ ఊర్వశి మొదలైన దేవతా స్త్రీల దేహ సౌందర్యములందు గాని ఆసక్తి ఉండదు. అవి ఎదురుపడినప్పుడు అపేక్షించడు, ద్వేషించడు. తన ఆత్మ దృష్టిని, మౌనధ్యానమును వీడడు. తన శత్రువులను చూచినప్పుడు కూడా అచలుడై, పరిపూర్ణచిత్తుడై, మౌని అయి ఉంటాడు.

వేదవిహితుడగు విప్రునకు మద్యపు వాసనపై ప్రీతి ఉంటుందా? ఉండదు కదా!

ఆత్మ జ్ఞానియగు మహనీయుడు ప్రియాప్రియములందు సమబుద్ధిని కలిగి ఉంటాడు. పుష్పములందు, లతలందు, చందన – అగరు – కర్పూర – కస్తూరి – లవంగాది సుగంధములచే ఆతడు ప్రత్యాకర్షితుడు కాడు. సముద్రపు గుడగుడ శబ్దముల హోరు, ఆకాశంలో జనించే ప్రతిధ్వనులు, సింహగర్జనలు, శత్రువుల భేరీ నినాదములు, డమరుక శబ్దములు, కర్ణకఠోరమగు ధనుష్టంకారాలు ఆత్మజ్ఞానిని కొంచంకూడా భీతిల్లజేయలేవు. ఏనుగుల ఘీంకారాలు, బేతాళ కలహాలు, పిశాచ, రాక్షసాదుల హీహీనాదాలు ఆతనిని చలింపజేయలేవు. పిడుగుల శబ్దములచేగాని, పర్వతముల విస్ఫోటకముచేగాని, బాణ, వజ్రఘాతములచేగాని ఆతని అనుక్షణికమగు స్వస్వరూపానుభవము కలతపడదు. ఱంపపు ఘర్షణలు, తీక్ష్ణఖడ్గ ఛేదనపు మెఱుపులు, తీవ్ర పదజాలములు ఆతని నిశ్చల ఆత్మానుభవం ముందు నిష్ప్రయోజనమే అవుతాయి. వనవాటికయందు గాని, మరుభూమియందు గాని, జన సమూహంలో ఉన్నప్పుడుగాని, అనేకమంది వినమ్రులగు జనుల మధ్య పలుకులు పలుకుచున్నప్పుడు గాని, తిరస్కాం, పురస్కారములు అందించబడుచున్నప్పుడు గాని... ఆతనికి ఆనందము, దుఃఖము – రెండూ ఉండవు.

నిప్పుకణికల వంటి ఇసుక ఎడారులలో అడుగులు వేస్తున్నప్పుడుగాని, మృదువైన పచ్చిక బయళ్ళలో చిరుగాలులు అనుభవిస్తున్నప్పుడు గాని, ఖడ్గ ప్రహారములందు గాని, సుఖ శయ్యలందు గాని, ఎత్తైన పర్వతములపై సంచారం చేస్తున్నప్పుడుగాని, లోతైన బావులందు ఉండవలసి వచ్చినప్పుడు గాని ఆతడు ఒక్క తీరుగానే ఉంటాడు. సంపదలు, ఆపదలు వస్తున్నప్పుడు, పోతున్నప్పుడు ఆతనికి భయము గాని, ఆనందము గాని ఉండదు. తలపై భారము మోస్తున్నవాడు, ఆ భారాన్ని క్రిందకు త్రోసి వస్త్రముచే ముఖం తుడుచుకుంటూ విశ్రాంతి అనుభవిస్తాడు చూచావా? ఆ జ్ఞానసమన్విత హృదయుడు సర్వవేళలా అంతర్ముఖుడై అట్టి విశ్రాంతి, ఆనందములను ఆస్వాదిస్తూ ఉంటాడు. భీతి, వ్యాకులత, గర్వములుగాని, ధైర్య, అధైర్యములు గాని లేనివాడై సముడై, స్వస్థచిత్తుడై అకృత్రిమ మగు పూర్ణ స్వభావము వహించి ఉంటాడు.

❖

ఓ రామచంద్రా! జ్ఞాని యొక్క సర్వ సమత్వమహిమ గురించి మనం ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆతడు అపవిత్రములు, అపథ్యములు, గోమయముచే తడిసి రసహీనమయి ఉన్న ఆహారమును కూడా మృష్టాన్నమువలె ఆరగించగలడు. తనయొక్క 'అసక్తత' అను బలంచేత రుచికర, అరుచికర పదార్థములను ఆస్వాదిస్తున్నప్పుడు సమచిత్తుడై ఉండగలడు. తృణములు – కేశములు – ఎముకలు – రక్తము మొదలైనవి చూస్తున్నప్పుడు కూడా ఆతడు సంతుష్టుడు, కృద్ధుడు కాడు. పురుగులో కూడా ఆతనికి బ్రహ్మదేవుడు కనిపిస్తాడు.

జీవితస్యాపి హర్తారం దాతారంచ ఏకరూపయా ।
దృశా ప్రసాద – మాధుర్య శాలిన్యా పరిపశ్యతి ॥

జీవహర్త, జీవదాత – ఈ ఇద్దరినీ ఆతడు ప్రసన్న మాధుర్యములతో కూడిన ఏకదృష్టితో వీక్షించగలడు. దీర్ఘకాలం ఉండే దేవతల శరీరములందుగాని, అల్పకాలస్థమగు ఈ మానవ శరీరములందు గాని, ఈ రెండిటికీ సంబంధించిన భోగ్య – అభోగ్య, రమణీయ – అరమణీయము లందుగాని ఆతడు సర్వసమత్వం వహించి ఉంటాడు. వాటిచే ఆతనికి సంతోషము గాని, దుఃఖం గాని కలుగవు. ...వేద్యమగు ఆత్మను ఎరిగి ఉండుటచే ఆతని చిత్తము రాగరహితమై ఉంటుంది. ఈ జగత్తు యొక్క స్థితియందు ఆతనికి ఏమాత్రం ఆసక్తి ఉండదు. 'ఇక్కడి విశేషములన్నీ మిథ్యయే కదా?..." అను సునిశ్చయం కలిగి ఉంటాడు. ఇంద్రియములకు విషయస్థితి యొక్క ఆవశ్యకత్వం కలుగజేయక, నిశ్చింత బుద్ధిచే ప్రభవిస్తూ ఉంటాడు.

❖

నాయనా రామా! లేళ్ళు లేచిగుళ్ళను భక్షిస్తాయి చూచావా? తత్త్వజ్ఞుడు కానివానిని... ఆత్మ యందు విశ్రాంతి పొందని వానిని... స్వస్వరూపస్థితి ఎరుగనివానిని ఈ ఇంద్రియములు కబళించి వేస్తున్నాయి. ఇక ఆతడు వాసనాతరంగములచే చుట్టబడి సంసారసముద్రంలో కొట్టుకుపోవుచూ అనేక వేదనలు, రోదనలు ఎదుర్కొంటున్నాడు. ఇంద్రియములనే మొసళ్ళు ఆతనిని గుటుక్కున మ్రింగటానికి సిద్ధపడుచున్నాయి. "అందుకే, మానవుడు విచారణయుతుడు కావాలి" అని ఈ ఉపశమన ప్రకరణ సమీక్షలో మరల మరల గుర్తుచేస్తున్నాను. జల ప్రవాహం పర్వతమును పెకలించ గలదా? విచారయుతుడై, భవ్యపదమున స్థితి కలిగి ఆత్మయందు విశ్రాంతి పొందిన బుద్ధిని సంపాదించుకున్న వానిని ఇక్కడ కనబడే వికల్పములు ఏమీ చేయలేవు. సర్వ సంకల్పములకూ సీమాంతరమగు పరమపదమున విశ్రమించేవారు, ఆత్మ పదప్రాప్తి పొందినవారు ధన్యులు. వారికి రాజాధిరాజత్వం కూడా తృణప్రాయమే అవుతుంది. ఎవరి చిత్తమైతే పూర్ణమై, విస్తృతమై, ఆత్మాకారం పొంది ఉంటుందో – అట్టి వారికి ఈ జగత్తు ఊరికి చివర ఉన్న శిథిల గృహం వంటిది. వారికి క్షణకాలం అనంత కల్పములు కూడా ఒక్కటే అవుతాయి. వారు సర్వదా సమత్వం వహించి ఉంటున్నారు. ఈ ప్రపంచమంతటినీ 'సంవిన్మాత్రము'గా ఎంచుచున్నారు. దీనిని సర్వ సాక్షియగు ఆత్మగానే చూస్తున్నారు. అందుచేత సర్వజగన్మధ్యంలో ఉన్నప్పటికీ ఏదీ పొందటం లేదు. కోల్పోవటం లేదు. జ్ఞానులై విహారం చేస్తున్నారు.

సంవిన్మాత్రపరిస్పన్దే జగతే వస్తుపన్జరే
కింహేయం? కిం ఉపాదేయమ్? ఇహ తత్వవిదాం మతమ్॥

ఈ జగద్వస్తు పంజమరంతా సంవిత్తు యొక్క స్పందనమే కదా! అందుచేత తత్వవేత్తలకు ఇందు గ్రహించతగినదేముంటుంది? త్యజించతగ్గదేమున్నది? ఎరుగబడుచున్నదంతా సంవిన్మాత్రమగు ఎరుగుచున్నదానిలోనే ఉండగా అది వదలటమేమిటి? పట్టుకోవటమేమిటి? కనుక రామా! నీవు సర్వ భ్రమలూ విడచిపెట్టు.

అజ్ఞాన జీవులకు అభిలషితములగుచున్న వర్తమాన – భవిష్యత్ విషయజాతమంతా తత్త్వజ్ఞుని దృష్టిలో శూన్యాకాశమువంటిది మాత్రమే. తాను మాత్రం సర్వదా సంవిత్స్వరూపుడై సర్వదా సర్వత్రా ఏర్పడి ఉంటున్నాడు.

ఆదావన్తేచ యన్నాస్తి, వర్తమానేఽపి తస్య చ
కంచిత్తాలలవం దృష్టా సత్తాసౌ సంవిదో భ్రమః ॥

ఏదైనా ఒక వస్తువు మొదట్లోనూ – చివరలోనూ లేకుండా వర్తమానంలో మాత్రం కొద్దికాలం గోచరిస్తోందనుకో! దానియొక్క ఉనికి సంవిత్తు యొక్క భ్రమ మాత్రమే అయి ఉన్నది. అద్దానికి స్వతఃసిద్ధమైన సత్త లేనట్లే అగుచున్నది. ఈ జగత్తులోని ఆయావిశేషాలు చూస్తున్నప్పుడు ఇట్టి దృఢ నిశ్చయం కలిగి ఉండు. భావాభావములందు కూలుచున్న బుద్ధియొక్క విభాగమును పరిత్యజించు. నిస్సంగుడవు, ప్రకాశస్వరూపుడవు, సంవిన్మాత్రుడవు అయి ఉండు, భావాతీతుడవగుము.

ఓ రామచంద్రా! ఎదురుగా ఉన్న ఈ శరీరం, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలనే ఉపకరణములను ఉపయోగించి కర్మలు చేయి. లేదూ... సమాధి వహించి కర్మలను త్యజించు. సంగదోషరహితుడవై ఉంటే ఆ ఉభయ స్థితులు నిన్ను అంటజాలవు. అసంగబుద్ధిచే మనస్సు ద్వారా ఉపకరణమాత్రములగు ఈ అవయవములతో వ్యవహరించావా... ఇక మనోరథదశలు, సుఖదుఃఖదశలు నిన్ను సమీపించ నైనా లేవు.

గత సంగమనా దృష్ట్యా పశ్యన్నపి, న పశ్యతి
ఏతదన్యస్థ చిత్తత్వాత్ బాలేనాపి అనుభూయతే ॥

సంగములేని మనస్సు కలవాడు కంటితో చూస్తున్నప్పటికీ చూడనివాడే అవుతాడు. ఒక చిన్న దృష్టాంతం చెపుతాను. మనస్సు, భావన ధ్యాస మరెక్కడో ఉన్నాయనుకో. అప్పుడు మనం బాటలో పోతున్న ఒక వ్యక్తినో, వాహనమునో కళ్ళతో చూస్తున్నా... చూడని వారమే అవుతాము కదా! చిన్న పిల్లవాడినుండి పెద్ద వాళ్ళవరకు ఇట్టిది అనుభూతమగుచున్న విషయమే! అన్యవస్తువుపై దృష్టి కలిగియున్నప్పుడు ఎదురుగా ఉన్నది చూడనివారమే అగుచున్నట్లు సంగము లేకుండా ఇంద్రియములతో క్రియలు నిర్వర్తించినా కూడా... నిర్వర్తించని వాడవే అవుతావు.

కాబట్టి అసంగ చేతస్కుడు (One who has no attachment) అగు మనుజుడు చూచినా చూడని వాడే! వినినా... వినని వాడే! తాకుచున్నా... తాకని వాడే! వాసన చూస్తున్నా... చూడని

వాడే! కళ్ళుతెరచినా.. తెరవని వాడే! మూసినా.. మూయని వాడే! ఇంట్లో పిల్లలు ఆడుకుంటూ కేరింతలు పెట్టుచున్నప్పటికీ ఇంటాయన ధ్యాస ఎక్కడో ఉంటే, ఆ శబ్దములు చెవిన పడుచున్నప్పటికీ ఆతడవి వినకయేపోవటం సభికులందరికీ సుపరిచయమైన విషయమే కదా! ఆత్మలో ధ్యాస కలిగి ఆ రీతిగా ఇంద్రియములను ఉపయోగించటం, ఇక ఇంద్రియ విషయములలో ఆత్మను ప్రవేశింపజేయకుండటం అభ్యాసంచే సుసాధ్యమే!

'సంగము' అంటే ఏమిటి? అభిలాష – అభినివేశములే కదా!

సంగఃకారణమ్ అర్థానామ్, సంగః సంసారకారణమ్ ।
సంగః కారణమ్ ఆశానామ్, సంగః కారణమ్ ఆపదామ్ ॥

ఓ రామయ్యా! సంగమే సర్వ పదార్థములకు కారణం. సంసారమునకు కూడా హేతువదే. సమస్త ఆశలకు, ఆపదలకు అదే మూలం. సంగము వదలగలిగితే మోక్షమే లభిస్తుందయ్యా! సంగము త్యజించిన మరుక్షణం "నేను జన్మించువాడను. కర్మిష్ఠుడను. మరణించువాడను" – అను అల్పభావములన్నీ తొలగిపోతాయి. కనుక నీవు సర్వ పదార్థములందూ సంగమును వదలి జీవన్ముక్తుడవు కమ్ము.

శ్రీరాముడు : సర్వ సంశయములనూ నివృత్తింపజేయగల హే సద్గురూ! ఈ రోజు మన సంవాదము ముగించేముందుగా ... 'సంగము' అనగా ఏమిటో సంక్షిప్తంగా వివరించ ప్రార్థన.

శ్రీవసిష్ఠమహర్షి :

భావాభావే పదార్థానామ్ హర్షామర్షవికారతా ।
మలినా వాసనాయైషా సాసంగ ఇతి కథ్యతే ॥

పదార్థముల సంయోగ – వియోగములందు (అవి లభిస్తున్నప్పుడూ – తొలగుచున్నప్పుడూ) హర్ష – శోకములు కలుగుచున్నాయి కదా! ఎందుకు కలుగుచున్నాయి? అంతరంగంలో ఉండే – "ఇది నాకు చెందినది. నేను దీనికి చెందినవాడను. అవి నాకు చెందాలి. ఇవి నాకు తొలగాలి" – ఇటువంటి రూపములతో ఏర్పడే మలిన వాసనలే సుమా! అట్టి మలిన వాసనలే 'సంగము' అని నిర్వచించబడింది. జీవన్ముక్తులు సర్వదా ఎట్టి సంగమూ లేకుండానే ఈ భూమిపై సంచరిస్తున్నారు. వారి శరీరములలో ఉండే సంస్కారం లేక వాసన శుద్ధవాసన అని అంటాం. ఎందుకంటే వారి వాసనకి రెండు ముఖ్యమైన లక్షణాలు ఉంటాయి–

1. అది హర్ష – శోక వివర్జితమై ఉంటుంది. 2. దానియందు పునర్జన్మ హేతువులు ఉండవు.

ప్రారబ్ధక్షయ పర్యతం మాత్రమే ఉండే శుద్ధ వాసన 'అసంగము'తో సమానం అవుతుంది. అట్టి అసంగము లేక శుద్ధవాసనచే నిర్వర్తించబడే కర్మ బంధమును కలిగింపజాలదు.

ఇక సంసారాసక్తులగు మూఢచిత్తుల సంగము గురించి చెపుతాను విను. వారి వాసనలు హర్ష – శోకములతో కూడి ఉంటాయి. వాసనలతో జన్మ – జీవించుటచే మరికొన్ని వాసనలు –

ఆ వాసనల నుండి మరల పునర్జన్మ – ఈ విధంగా ఉంటుంది. వారి తతంగం. పునర్జన్మకు కారణము కాగలవాసనలే 'సంగము' – అని చెప్పబడుతోంది. అట్టి వాసనలతో చేయబడే కర్మలన్నీ చివరికి బంధము కొరకే అగుచున్నాయి. అందుచేత రఘురామా! ఆత్మకు వికారము కలుగజేస్తున్న వాసనా రూపమయినట్టి సంగమును నీవు త్యజించివేయి. సర్వదా స్వస్థుడవైయుండుము.

అప్పుడు కర్మలు చేసినప్పటికీ, జలంలో ఉండే కమలంలాగా, వాటిచే నీవు స్పృశింపబడకయే ఉంటావు. కర్మలు నిర్వర్తిస్తున్నప్పుడు, "నేను ఏ దృష్టితో ఈ ఈ కర్మలు చేస్తున్నాను?" – అని నీకు నీవే ప్రశ్నించుకో! దృష్టిని శుద్ధ పరచుకొనుటచే... "నేను కర్మాతీతుడను. అకర్తను. శుద్ధమగు ఆత్మ స్వరూపుడను. నిస్సంగుడను" అని గ్రహించగలవు. అట్లు గ్రహించిన తరువాత నిర్వర్తింపబడే కర్మలన్నీ అసంగమే అవుతాయి. హర్షామర్ష విషాదములచే వైరూప్యము పొందక, రాగ భయ క్రోధములు లేనివాడవై ఉంటే, నీవు ఇప్పటికిప్పుడే అసంగుడవౌతావు. దుఃఖముచేగ్లాని పొందక, సుఖముచే ప్రసన్నత పొందక, ఆశాపాశవశ్యముకాక, సర్వవిషయములను త్యజించినవాడవై ఉంటేనే అసంగుడవయినట్లు సుమా!

లోకవ్యవహారములలో ఉన్నప్పుడు, సుఖ – దుఃఖాది దశలు పొందవలసివస్తున్నప్పుడు నీవు బ్రహ్మము తోటి ఏకత్వము త్యజించకపోవటమే అసంగమునకు గుర్తు.

ఎప్పుడైతే నీ చిత్తము ఆత్మ సంవేద్యముతో కూడి ఉంటుందో, ఎరుగబడిన బ్రహ్మముగానే సర్వదా శేషించి ఉంటుందో – అప్పుడది సర్వ సంగములను అధిగమించినట్లే. అటుపై, యథా ప్రాప్తములైన క్రియలను ఆచరిస్తున్నప్పటికీ అసంగుడవే. ఇందులో సందేహం లేదు.

అనాయాసంగా, అకృత్రిమంగా చేకూరు అసంగత్వమే జీవన్ముక్తుని 'సుస్థిర స్థితి' అయి ఉన్నది. ఓ దాశరథీ! నీవు అద్దానినే ఆశ్రయించు. స్వస్థుడవై, వీతరాగుడవై, మౌనివై, ఇంద్రియపాశములను నిగ్రహించినవాడవై, ఉత్తమ జ్ఞానివై, ఆర్యుడవై, మాన–మద–మాత్సర్యరహితుడవై ఉండుము. మనం పదే పదే చెప్పుకుంటున్న జీవన్ముక్తుల స్వభావమును సంతరించుకో. సంతాపరహితుడవై ఉండు.

భోగ – విక్షేపాదులకు కారణంకాగల వస్తు సముదాయం నీ చుట్టూ చేరవచ్చుగాక! లేక, ఒక్కొక్కటే తొలుగుతూ ఉండుగాక! వాటితో నీకేమి సంబంధం? నీవు జ్ఞానివై, సమచిత్తుడవై ఉంటే, వాటి ప్రాప్తాప్రాప్తములు నిన్నేమీ చేయలేవు. అదీన స్వభావుడవై నీకు నియమించబడిన ఆయా ధర్మములను వాటి సహజ సంక్రమిత ప్రాప్తములను బట్టి ఎప్పటికప్పుడు నిర్వర్తించు. అన్యమేమీ ఆచరించని వాడవు, యోచించని వాడవు కమ్ము. అయినప్పటికీ సర్వమునకు అకర్తవై ఉండు. ఫలాభిలాష, క్రియాభినివేశము లేకుండానే జ్ఞాని ప్రవాహపతితము, ప్రకృత క్రమమును అనుసరించి తన విధులను నిర్వర్తిస్తున్నాడు. అట్లా నిర్వర్తిస్తూనే స్వాత్మయందు క్రీడించుచున్న అనేక ఉదాహరణలు మనం చెప్పుకున్నాం. ఇంకా చెప్పుకోబోతున్నాం.

పెరుగు చిలకబడినప్పటికీ తన తెలుపుదనం కోల్పోతోందా?... మహామతియగు జ్ఞాని తన యొక్క పూర్వసిద్ధ స్వభావమగు శమ – దమ – శాంత – సహకార – సంతోష – సమదర్శనములను

ఎన్నటికీ వీడడు. ఆతనికి చక్రవర్తి పదవి లభించుగాక! క్రిమికీటక ఉపాధులు లభించుగాక! అకస్మాత్తుగా ఇంద్ర పదవి ప్రాప్తించుగాక! బ్రహ్మదేవుని పదవి వచ్చి తలుపుతట్టుగాక! అందులో ఆతనికి సంతోషించవలసినదిగాని, దుఃఖించవలసినదిగాని ఏదీ కనిపించదు. పున్నమినాటి రాత్రంతా చంద్రుడు ఒకే రీతిగా ప్రకాశిస్తాడు చూచావా? ఆతడు కూడా ఆయా అన్ని స్థితులందూ ఏక రూపంగానే భాసిస్తూ ఉంటాడు. ఓ రామా! హృదయంలోంచి సర్వ క్రోధ, భేదములనూ, తదితర భూతాకారములను బయటకు పారత్రోలివేయుము.

అంతిమ పురుషార్థమైనట్టి 'మోక్షము' అను కార్యమునందు మాత్రమే ప్రతిష్ఠితుడవు, తత్పరుడవు అయి ఉండుము. వాసనలన్నీ క్షయించుగాక!

నీ బుద్ధి శుద్ధమై ఆత్మ పదమును అందింపజేయునదై ఉండుగాక! అవిద్యను, తత్కార్యములను దగ్ధమొనర్చుటలో సమర్థమగు గాక! అట్టి బుద్ధిచే నిరతిశయ పరమానందమున సంస్థితుడవయ్యెదవు గాక!

అప్పుడు జనన మరణాది బంధములచే నీవు పరిమితుడవు కావు. సర్వదా అపరిమితుడవై ఉంటావు. అట్టి ఆత్మ తేజోమూర్తివైన నీవు సర్వులకూ వందనీయుడవౌతావు.

❖❖❖

(14వ రోజు విచారణ పూర్తి అయింది).

❖❖❖

ఉపశమన ప్రకరణం సమాప్తం

బ్రహ్మార్పణమస్తు - లోక కళ్యాణమస్తు

ఓం తత్సత్

❖❖❖

ఓ రామా! మలినము, చంచలము అయిన 'అహంకారము'ను హృదయము నుండి పారద్రోలివేయి. మరుక్షణం అపరిచ్ఛిన్నుడు, సర్వవ్యాపకుడు, సర్వేశుడు, వాసనారహితుడు, శాంత చిత్తుడు అగు ఆ ఆత్మదేవుడు నీ హృదయమున స్వయముగా ప్రభువై విరాజిల్లుతాడు.

'తత్త్వవిచారణ'చే 'ఆత్మ' అను జ్యోతి ప్రాప్తించగా, సమస్తదోషములు తొలగిపోతాయి. అట్టి ఆత్మ స్వరూపుడగు జీవుడు ఈ జననమరణములలో, ఐహిక పారలౌకిక స్థితులలో ఉద్వేగరహితుడై ఉంటున్నాడు. అతడు స్వదేహనగరంలో తాపత్రయరహితుడై విలాసంగా విహరిస్తున్నాడు.

వసిష్ఠ మహర్షి

పుట:176

CONQUER YOURSELF
ISBN 93-83972-14-2 (Set)
9 789383 972142
www.rkmath.org

రామకృష్ణ మఠం
దోమలగూడ, హైదరాబాదు-29
email : publication@rkmath.org

Vasishta Rama Samvadam : Vol 2
ISBN 93-83972-11-1
₹ 1000/- (set)